1

# కథ నేపథ్యం

25 మంది కథకుల ఉత్తమ కథలు వాటి నేపథ్యాలు



తానా ప్రచురణలు

కథ

నేపథ్యం

మొదటి భాగం



## సంపాదకుల పరిచయం

**ఆర్.ఎమ్. ఉమామహేశ్వర రావు** 18 మార్చి 1964లో నెల్లూరు జిల్లా మన్నార్ పోలూరులో జన్మించారు. సీనియర్ జర్నలిస్టు. *బిడ్డలు గల్ల తల్లి, మొగుడూ పెళ్లాల ప్రేమకత, ఒంటేపమాను* మొదలైన పది కథలు రాశారు. జర్నలిస్టుగా *ఈనాడు*లో చేరి, ఆ తర్వాత *ఉదయం*, *వార్త* పత్రికలలో పనిచేశారు. ప్రస్తుతం *ఆంధ్రజ్యోతి దినపత్రిక*, *ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ఛానెల్‌*కు రాయలసీమ ప్రాంత బాధ్యులు. గ్రామీణ జర్నలిజం మీద ప్రత్యేక కేంద్రీకరణతో పనిచేస్తున్నారు. ఉత్తమ గ్రామీణ జర్నలిస్టుగా 2007 సం॥లో ప్రముఖ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ ద్వారా పురస్కారం అందుకున్నారు. నివాసం తిరుపతి.

**డాక్టర్ జంపాల చౌదరి** 14 జులై 1955న పశ్చిమ గోదావరి జిల్లా చాటపర్రులో జన్మించారు. గుంటూరులో ఎం.బి.బి.ఎస్. చదివిన అనంతరం అమెరికా వెళ్ళి మానసిక వైద్యంలో ఉన్నతవిద్యను అభ్యసించి, ప్రస్తుతం చికాగో మెడికల్ స్కూల్‌లో సైకియాట్రీ ప్రొఫెసర్‌గా, లోవెల్ ఫెడరల్ హెల్త్‌కేర్ సెంటర్‌లో మెంటల్ హెల్త్ సర్వీసెస్‌కి చీఫ్‌గా ఉన్నారు. అమెరికాలోని వివిధ తెలుగు సంఘాలలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా తానా సంస్థలో. దాదాపు 12 సంవత్సరాలు తానా పత్రికకు ముఖ్య సంపాదకులుగాను, 1995, 1999, 2009 తానా సావనీర్‌లకు సంపాదకులుగాను ఉన్నారు. తానా పబ్లికేషన్స్ కమిటీ ఛైర్ పర్సన్, తానా పాలకమండలి అధ్యక్షులు. 2004లో అమెరికాలోని తెలుగువారి కోసం తెలుగునాడి అనే మాసపత్రికను ప్రారంభించి ఐదు సంవత్సరాల పాటు ముఖ్య సంపాదకులుగా ఉన్నారు. భార్య అరుణ, పిల్లలు వేమన, నన్నయలతో చికాగో దగ్గర్లోని మండలైన్‌లో నివాసం ఉంటున్నారు.

**వాసిరెడ్డి నవీన్** 23 మే 1954న కృష్ణాజిల్లాలో జన్మించారు. 1980 నుంచి 1990 వరకు జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య నడుపుతున్న సాహిత్య మాసపత్రిక ప్రజాసాహితికి సంపాదకులుగా ఉన్నారు. 1981లో జనసాహితి ద్వారా వెలువడి, తిరిగి 2008లో డిట్రాయిట్ తెలుగు లిటరరీ అసోసియేషన్ ద్వారా పునర్ముద్రింపబడిన ***తెలంగాణ పోరాట కథలు***, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ వారి ***తెలుగుకథ 60-85*** కథా సంకలనాలకు సంపాదకులు. 1990 నుంచి కథాసాహితి వెలువరిస్తున్న **కథ** సంకలనాలకు సహ సంపాదకులు. కొన్ని సంవత్సరాల పాటు వివిధ పత్రికల్లో తెలుగు కథల పై వార్షిక సమీక్షలు, కథాసాహిత్యం పై కొన్ని వ్యాసాలు ప్రచురించారు. నివాసం హైదరాబాదు.

# కథ
# నేపథ్యం

*మొదటి భాగం*



*

*సంపాదకులు*

**ఆర్.యమ్. ఉమామహేశ్వరరావు**

**జంపాల చౌదరి**

**వాసిరెడ్డి నవీన్**

*



**తానా**
ప్రచురణలు



Artist: C. Jagadish

# KATHA - NEPATHYAM

*Collection of short stories with notes on background by authors*

## *Vol. 1*

***Released***
**on 3rd January 2013 at Vijayawada**
**by Navodaya Ramamohana Rao**
*First Publication: January, 2013*

*Publication Number: 003*

***Writers in this collection***
Abburi Chayadevi, Allam Seshagiri Rao, Adepu Lakshmipathi, R.S. Sudarsanam, Kalipatnam Ramarao, Ketu Vishwanatha Reddy, Kolakaluri Enoch, D. Venkatramayya, Naveen, P.Satyavathi, Pulikanti Krishna Reddy, Peddibhotla Subbaramaiah, Balivada Kanta Rao, B.S. Ramulu, Beenadevi, Boya Jangaiah, Madhurantakam Rajaram, Munipalle Raju, Vallampati Venkata Subbaiah, V. Rajaramamohana Rao, VVN Murthy, Seela Veerraju, Sripathi, Sriramana, Singamaneni Narayana

*Editors*
**R.M. Umamaheswararao**
**Jampala Chowdary**
**Vasireddy Naveen**

*Publication*
**TANA (Telugu Association of North America) Publications**
20374 Buckthorn Court, Mundelein, Illinois, 60060, USA

*Local Address*
AG-2, 'A' Block, Mathrusri Apts.,
Hyderguda, Hyderabad - 500 029.
Ph.: 040-2324 4088

*Cover Masks*
**Nakashi Nageshwar of Cherial**

*Copies available at*
**Visalandhra Book House,** Bank Street, Hyderabad and its Branches in A.P., **Navodaya Publishers,** Eluru Road, Vijayawada, **Navodaya Book House,** Kachiguda, Hyderabad, **Telugu Book Shop,** Kachiguda, Hyderabad, **Prabhava,** Pogathota, Nellore.

*e-book:* **www.kinige.com**

*Composed & Designed at* **Akshara Creators,** Mathrusri Apts., Hyderguda, Hyderabad-500029. India Ph.: 040-2324 4088.

*Printed at* **Charita Impressions.** Azamabad Industrial Area, Hyderabad, India. Ph.: 040-2766 78411

**₹195  $ 25**

# తానా ప్రచురణల గురించి...

*తెలుగు భాష, సంస్కృతులను పోషించి, పరిరక్షించుకోవాలన్న ఆశయంతో 1977లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆవిర్భవించింది. గత మూడు దశాబ్దాలుగా ఈ ఆశయసిద్ధికై అమెరికా, ఆంధ్రప్రదేశ్‌లలో అనేక కార్యక్రమాలకు తానా మద్దతు నిస్తోంది. ప్రచురణలో లేని, ప్రచురణ కాని ముఖ్యమైన తెలుగు పుస్తకాలను ఉత్తమ ప్రమాణాలతో ప్రచురించి పాఠకులకు అందు బాటులోకి తేవాలన్న ముఖ్య ఉద్దేశంతో తానా ప్రచురణలు ప్రారంభ మయ్యాయి. శ్రీ కొడవళ్ళ హనుమంతరావు వితరణ, శ్రీ 'నవోదయ' రామ్మోహనరావు, శ్రీ వాసిరెడ్డి నవీన్‌ల సహృదయత, శ్రమదానం, తానా కార్యవర్గం, తానా ఫౌండేషన్, మరెందరో హితాభిలాషుల సహకారంతో ప్రారంభమైన ఈ ప్రయత్నం మరిన్ని మంచి పుస్తకాలను మనకందరికీ అందిస్తుందని మా ఆశ.*

**జంపాల చౌదరి**
అధ్యక్షుడు
తానా ప్రచురణల సంఘం

# కథల పుట్టుక

## జంపాల చౌదరి

చిన్నప్పట్నుంచీ నాకూ కథలంటే ఇష్టం. ఆ రోజుల్లో కథలంటే అనగనగా ఒక రాజు, ఆ రాజుకి ఇద్దరు భార్యలంటూ మొదలయ్యేవి. పెరుగుతున్నకొద్దీ చదువుతున్న, ఇష్ట పడుతున్న కథల తత్వం మారుతూ ఉన్నా, కొన్ని ప్రశ్నలు చిన్నప్పట్నుంచీ మిగిలి పోయాయి.

కథలు ఎలా పుడతాయి? మామూలు కథల పుట్టుకకు, మంచి కథల పుట్టుకకు తేడా ఏమన్నా ఉంటుందా? కొన్ని కథలు, ముఖ్యంగా గాఢంగా ముద్రవేసిన కథలు, ఎక్కడ నుంచి వచ్చాయో, ఎలా వచ్చాయో తెలుసుకోవాలన్న కుతూహలం పాఠకుడిగా, మానసిక శాస్త్ర విద్యార్థిగా తరచు కలుగుతూ ఉంటుంది. రచయితలను కలిసినప్పుడు, చాలా మంది పాఠకుల్లాగే, నేను కూడా వారి కథల గురించి మాట్లాడుతూ, ఆ కథల మూలాల గురించి వారి ముఖతా వినేందుకు ప్రయత్నిస్తూ ఉంటాను.

పదేళ్ళ క్రితం ఒక సాయంకాలం హైదరాబాదు ద్వారకా హోటల్లో రచయిత మిత్రులతో మాట్లాడుతున్నప్పుడు కథకుడు, మిత్రుడు గొరుసు జగదీశ్వరరెడ్డి ఇవే ప్రశ్నలు, ఇదే కుతూహలం ఇంకో రచయిత, మిత్రుడు ఆర్.ఎం. ఉమామహేశ్వరరావుకూ ఉన్నాయని, *ఆంధ్రజ్యోతి* ఆదివారం పత్రికలో చాలామంది రచయితల చేత వారి కథల నేపథ్యాల గురించి వ్రాయించి ప్రచురించారనీ చెప్పారు. ఆ నేపథ్యాలన్నిటినీ సేకరించి, పని గట్టు కుని జిరాక్స్ కాపీలు తీయించి, బైండు చేయించి, ఒక సంక్రాంతి ఉదయం నన్ను వెదుక్కుంటూ వచ్చి ఇచ్చారు జగదీశ్వరరెడ్డి. అరుదైన ఈ ప్రయత్నం పుస్తకరూపంలో పదిమందికీ చేరితే ఔత్సాహిక రచయితలకు ప్రేరణలా ఉంటుందని ఆయన ఆకాంక్ష. ఆ నేపథ్యాలన్నిటినీ చదివిన నాకూ అలానే అనిపించింది. ఇన్నాళ్ళకు ఆ పనిని చేయ గలిగాము.

*ఆంధ్రజ్యోతి*లో ప్రచురించిన కథానేపథ్యాలు మొత్తం ముప్పై నాలుగు. 17 ఆగస్ట్ 1997న మధురాంతకం రాజారాంగారి *సర్కస్ డేరా*తో మొదలుపెట్టి, 21 జూన్ 1998న

మధురాంతకం మహేంద్ర ముసలమ్మ మరణం నేపథ్యంతో అంతమయ్యింది ఆ శీర్షిక. ఈ 34 నేపథ్యాలకూ, ఇంకొందరు ప్రసిద్ధ, వర్ధమాన రచయితల కథల నేపథ్యాలు కూడా చేర్చగలిగితే ఇంకొంత ఉపయుక్తంగానూ, మరింత సమగ్రంగానూ ఉంటుందనిపించింది. కొంతమంది రచయితలని వారి కథల నేపథ్యాల గురించి వ్రాయమని అభ్యర్థించాము. అన్నీ కలుపుకుంటే పుస్తకం 800 పుటలు దాటటంతో, రెండు సంపుటాలుగా వెలువరించాలని నిశ్చయించుకొన్నాము. మొదటి సంపుటంలో లబ్ధప్రతిష్టులైన ముందుతరం కథకుల కథల్నీ, వాటి నేపథ్యాలనూ పరిచయం చేస్తున్నాము.

ఈ సంపుటంలో నాకు చాలాకాలంగా నచ్చిన కథలు ఎన్నో ఉన్నాయి. వస్తుపరంగా, భాషాపరంగా, శిల్పపరంగా ఈ ఉత్తమ కథలు కాలపరీక్షకు కూడా నిలబడ్డాయి. తెలుగు కథలను అభిమానించేవారందరూ చదవవలసిన కథలు ఈ సంకలనంలో ఉన్నాయి. ఈ కథల పూర్వాపరాలను తెలుసుకోవటం పాఠకుల కుతూహలాన్ని కొంతవరకు తీర్చి ఆనందింపజేస్తే, కథలు వ్రాయటంలో ఆసక్తి ఉన్నవారికి విజ్ఞానదాయకంగానూ, ప్రేరణగాను ఉంటుందని మా భావన.

ఇంతకీ కథలు ఎలా పుడతాయి? ఎలా పెరుగుతాయి? ఏ పరిణామక్రమంలో ఏ అండాలు పలుదశలు దాటి అందమైన సీతాకోకచిలుకలుగా మారి రెక్కలు విప్పుకొని మనముందు వాలతాయి? కథలు నిజాలా, కల్పనలా, లేక నిజానిజాల కలగలుపా? నగిషీలతో అలంకరించి మనముందు అందంగా నిలబెట్టిన బొమ్మ పూర్వ స్వరూపమేమిటో అన్న ప్రశ్నలకు జవాబులు ఈ కథల్లో, వాటి నేపథ్యాలలో వెతుక్కోవచ్చు. ఈ నేపథ్యాలు కొత్త ప్రశ్నలకు, చర్చలకు దారి తీయనూవచ్చు.

కథానిక అంటే మరేమీ కాదు, జీవిత శకలాలను పరిచయం చేయడమేనన్నాడు ఒక భాష్యకారుడు. జీవితం తలుపు తెరిచి ఒకసారి తొంగి చూడటమన్నాడు ఇంకో ప్రసిద్ధ రచయిత. కథానికకు నాలుగు భాగాలు తప్పనిసరి అని కొందరు నియమిస్తే, కథానికకు ఎట్టి నియమాలు, నిర్మాణ నిబంధనలు అవసరం లేదని మరికొందరి అభిప్రాయం.

ఈ సంపుటంలో ఉన్న కథల్లోనూ, వాటి నేపథ్యాలలోనూ కొంత సామాన్యత, ఎంతో వైవిధ్యత ఉన్నాయి. ఎవరి ముద్ర వారికి ఉన్నా, ఈ కథల్లో ఎక్కువ భాగం సంప్రదాయ శిల్పంలో చెప్పినవే. దాదాపుగా అందరు రచయితలూ తమ స్వానుభవాలు లేక తాము విన్న, కన్న విషయాల నుంచే ఈ కథలు పుట్టాయి అని చెప్తున్నారు. అయితే ఆ విత్తనాలు కథలుగా మొలకెత్తిన తీరులో ఎంతో వైవిధ్యం ఉంది.

కథకులు పత్రికా విలేకరులు మాత్రమే కారు, తమను ప్రేరేపించిన సంఘటనను వర్ణించి వదిలి వేయటానికి. కథకులు ఛాయచిత్రకారులూ కాదు, కెమెరా కంటికి కనిపించిన మేరకు మాత్రమే వాస్తవాన్ని కళ్ళ ముందు ఉంచటానికి. ఒకోసారి కల్పన కంటే జీవితమే విభ్రాంతికరమైనా, ఫొటోగ్రాఫుల్లాంటి కథనాల్లో సత్యం ఉన్నా తరచూ జీవం లోపిస్తుంది. కథల్లో కొంత నిజమూ, కొంత కల్పనా ఉండాలని రావిశాస్త్రి చెప్పారని బీనాదేవిగారు తమ కథానేపథ్యంలో పేర్కొన్నారు. ఫొటోగ్రాఫుకు ఫిల్టర్లు వాడటమూ, దృష్టికోణాలు

మార్చటమూ, అసలు కెమెరా పక్కన పారేసి, కుంచె పట్టుకొని కేన్వాస్ మీద తాము చెప్పదలుచుకున్న విషయాన్ని రకరకాల రంగుల పొరల మధ్య స్పష్టంగానో, అస్పష్టంగానో ఆవిష్కరించటమూ ఈ నేపథ్యాలలో తరచూ కనిపిస్తాయి.

కథ వ్రాయమని ప్రేరేపించిన విషయాలు చివరికి కథలో ఎలా చోటు చేసుకుంటాయి అనేది విచిత్రంగానే ఉంటుంది. ఒకోసారి మూల విషయానికీ పూర్తయిన కథకూ సంబంధం వెంటనే కనిపించదు. ఆడెపు లక్ష్మీపతిగారు *ముసల్దాని ముల్లె* కథ రాయడానికి ప్రేరణగా చెప్పిన విషయం చివరికి కథలో ఒక్క వాక్యంగా మాత్రమే ఇమిడింది. రచయిత చెప్పకపోతే ఆ కథలోని విస్తృత జీవితచిత్రణలో, ఆ వాక్యానికి ఎట్టి ప్రాముఖ్యతా ఉండేది కాదు.

అల్లం శేషగిరిరావుగారి *చీకటి* కథ రాత్రివేళ బాతుల వేటలో కలసిన ఇద్దరు అపరిచిత వ్యక్తుల కలయిక గురించి. ఆ ఇద్దరు వ్యక్తుల భిన్న సంస్కారాలతో పాటు రాత్రిపూట పక్షులవేట గురించి వివరంగా చిత్రిస్తారు ఆ కథలో. అయితే ఈ కథకు మూలంగా ఆయన చెప్పిన విషయానికి, ఈ పిట్టల వేటకూ పెద్ద సంబంధమేమీ లేదు.

కొన్ని కథల్లో కొంత కల్పన ఉన్నా, రచయితలు ఒక అసాధారణ సంఘటననో, సంఘటనల సముదాయాన్నో వాస్తవికంగా చిత్రీకరించటానికి ప్రయత్నం చేస్తుంటారు. ఇక్కడ రచయితను ప్రేరేపించిన విషయమూ, చిత్రించిన విషయమూ దాదాపు ఒకటిగానే ఉంటాయి (ఉదాహరణకు కేతు విశ్వనాథరెడ్డి *నమ్ముకున్న నేల*, పి.సత్యవతి *పెళ్ళి ప్రయాణం*, శ్రీరమణ *ధనలక్ష్మి*). కాని రచయిత వాస్తవ చిత్రీకరణను పరిమితంగా నియంత్రించటమూ, ఒకోసారి విభిన్న వ్యక్తులనీ, సంఘటనలనీ కలిపి ఒక సమిష్టి చిత్రాన్ని తయారుచేయటమూ కనిపిస్తుంది.

మరికొన్నిచోట్ల, ప్రేరేపించిన విషయాన్ని కొద్దిగా విస్తరించి జీవితం పట్ల, సమాజం పట్ల తమకు ఉన్న దృక్పథాన్ని కథగా నిర్మించటమూ చూస్తాము (ఉదా: కాళీపట్నం రామారావు *జీవధార*).

ఒకోసారి కథ అనేక విషయాల కలగలుపుగా రూపాంతరం చెందుతుంది (మునిపల్లె రాజు *వారాల పిల్లాడు*, వల్లంపాటి వెంకటసుబ్బయ్య *రానున్న శిశిరం*). కొన్ని కథలు దృక్పథాలను, వాదనలను, వైరుధ్యాలను విపులీకరించటానికి వ్రాయబడతాయి (ఉదా: బి.ఎస్.రాములు *మెరుగు*). నిత్యజీవితంలో ఎదురైన సంఘటనలకు ఒక తాత్త్విక ప్రాతిపదికనో, మానసిక విశ్లేషణనో ఆపాదిస్తూ వ్రాసే కథలు మరికొన్ని (ఆర్.ఎస్. సుదర్శనం *అమృతుడు*, నవీన్ *నిప్పురవ్వలు*).

రచయితపై గాఢంగా ముద్రవేసిన ఒక సన్నివేశం పలు దినాలు మేధలో నిద్రాణంగా ఉండి, ఆకారం పోసుకొని, ఎప్పుడో ఒకసారి- తల్లిని నరకయాతన పెట్టి పుడమిపై పడే శిశువులా బయటపడుతుందని అంటారు పెద్దిభొట్ల సుబ్బరామయ్య. అంత సుదీర్ఘమైన సమయం అవసరం లేదు, ఒక వస్తువుపై కథ రాయటాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని స్వల్ప వ్యవధిలో కథ వ్రాయవచ్చని నిరూపిస్తారు బలివాడ కాంతారావు *ముంగిస* కథలో.

రచనాశైలిలో వైవిధ్యాలున్నట్లే, మూల వస్తువును వినియోగించుకోవటంలోనూ, విపులీకరించటంలోనూ రచయితల రీతులు విభిన్నంగా ఉంటాయి. ఉన్నది ఉన్నట్టుగా చెప్పటమా, నగిషీలు చేసి ఆకారం మార్చటమా, ప్రతీకాత్మకంగానో సూచ్యంగానో వ్రాయటమా, గోప్యంగా ఉంచటమా అన్న ప్రశ్నలకు ఈ సంపుటంలో పలురకాల సమాధానాలు దొరుకుతాయి. చెప్పదల్చుకున్న వస్తువును ఆకర్షణీయమైన కథగా తయారుచేసే పరుసవేది విద్యంటూ ఏదీ లేదని అర్థమౌతుంది. ఊహాశక్తి, ఉత్సాహము, ప్రతిభ ఉన్న రచయితలు వస్తువును బహురూపాల్లో కథగా మనముందు ఉంచగలరు. ఉత్ప్రేరక విషయం నిత్యజీవితంలో కనిపించే సామాన్య విషయమైనా, అరుదైన సంఘటనైనా దానికి విశ్వజనీనత ఆపాదించి, విశ్వసనీయంగా నిజాయితీగా పాఠకులకు అందించగలిగితే కథకు శాశ్వతత్వం కలిగే అవకాశం ఉంటుంది.

ఈ కథలూ, నేపథ్యాలూ పాఠకులకు, ఔత్సాహిక, వర్ధమాన రచయితలకు కరదీపికగా ఉపయోగిస్తాయని మా నమ్మకం, ఆకాంక్ష.

*తిరుపతి, 28 డిసెంబర్ 2012*

# కథకీ నేపథ్యానికీ మధ్య...

## ఆర్ ఎం ఉమామహేశ్వరరావు

బిడ్డలుగల్ల తల్లి కథ రాసినపుడు నాకు ఒక సమస్య ఎదురైంది. మా వూళ్ళో, మా బంధువుల ఇంట్లో జరిగిన సంఘటన అది. నేను వూరికి పోయినప్పుడంతా మా అమ్మా, మా అక్కా వూరి సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెబుతుంటారు. అట్లా విని, వచ్చి ఉన్న దున్నట్టుగా కథ రాసేశాను. పూర్తయిన కథని చదువుకున్నపుడు మాత్రం ఒళ్ళు జలద రించింది. 'ఈ కథ మా వూళ్ళో ఎవరైనా చదివితే...!?' నా వీపు విమానం మోత మోగు తుంది. ఎందుకొచ్చిన గొడవ? రాసిన కథని చించెయ్యలేను. అలాగని అచ్చుకీ ఇవ్వలేను.

అప్పుడొక బ్రహ్మాండమైన ఐడియా తట్టింది. చకచకా కథలోని పాత్రల పేర్లన్నీ మార్చేశాను. ఇంక ఈ కథ వాళ్ళదే అనుకోడానికేం లేదు. ఇంకేం, పత్రికకు పంపెయ్యచ్చని అను కున్నాను. పంపే ముందు ఎందుకైనా మంచిదని మళ్ళీ ఒకసారి చదివాను. పేర్లు మారాయిగానీ, వాస్తవం తెలిసిన మా వూరి వాళ్ళు ఎవరైనా ఇది ఎవరి కథో సులువుగా కనిపెట్టేయగలరు. పెద్దగా ఉపయోగం లేదు. ఏం చేయాలింక? వాస్తవ సంఘటనలకి కొన్ని కల్పనలు జోడించాను. పాత్రల స్వభావంలో  మార్పులు చేశాను. ఇప్పుడింక, ఏ పాత్ర ఎవరో కనిపెట్టలేరని నా నమ్మకం.

ఆ కథ *ఆంధ్రప్రభ* వారపత్రికలో అచ్చయింది. 'నీకేం నాయినా.. పండక్కో పబ్బానికో వూళ్ళోకొస్తావు. రోజూ మొహాలు మొహాలు చూసుకునేవాళ్ళం, ఎవురు పడతారు యిదంతా' కథకి  మా అమ్మ స్పందన ఇది. కథలో ఒక సైడు పాత్రగా కనిపించిన మా రాంబావ అయితే నేను ఎక్కడ ఎదురుపడ్డా కొరకొరా చూస్తాడు యిప్పటికీ. ఆయన భార్య తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది నన్ను చాలామంది దగ్గర. భర్తనొదిలి లేచిపోయిన 'రాజమ్మ'ని చూసినపుడంతా నాకు ఏదో తప్పు చేసిన ఫీలింగే కలుగుతుంది. కథలు వాస్తవికంగానే ఉండాలి కదా! మరి వాస్తవం రాస్తే ఈ గొడవేంటి? వాస్తవ సంఘటనలు రాసేటపుడు ఇంకా ఏం జాగ్రత్తలు తీసుకోవాలి? అసలు జరిగింది జరిగినట్టు రాయచ్చా, రాయ కూడదా? మూడో కథకే ముచ్చమటలు పోశాయి నాకు.

అసలీ ప్రశ్నలన్నీ కథలు రాసే అందరికీ వస్తాయా, కొత్తగా రాస్తున్న నాకేనా? ఇట్లా ఆలోచిస్తుండగానే ఆదివారం ఆంధ్రజ్యోతి సంపాదక బాధ్యతల్లో భాగంగా విపరీతంగా కథలు చదివే అవసరం పడింది. ఒక కథ ఎంపిక చేయడానికి కనీసం పాతిక కథలు చదవాల్సి వచ్చేది. నిష్ణాతులైన కథకులు మొదలు కొత్తగా రాస్తున్న ఎందరి కథలో చదువు తున్నపుడు చాలా మందిలో నన్ను నేను చూసుకున్నాను. రాయడం ఏమోగానీ, కథలు చదవడం నేర్చుకున్నాను. ఏ కథలో ఏం లోపించిందో తెలిసిపోయేది. ఇలా ఉంటే బావుండేది కదా అనిపించేది. కథలోని సంఘటనల్లో, సంఘటనల్లోని పాత్రల తీరులో కొన్ని మార్పులు చేస్తే కథ ఇంకా మెరుగ్గా ఉంటుందని అర్థమయ్యేది. అలా అనిపించిన కొన్ని కథల గురించి, ఆ రచయితల్లో కొందరితో మాట్లాడేవాడిని. 'నిజం... సరిగ్గా అట్లాగే జరిగింది,' అనేవాళ్ళు. ఓహో... జరిగింది జరిగినట్టు రాస్తే కథై పోదన్నమాట. వాస్తవానికీ, కథకీ మధ్య ఏవో మార్పులు జరగాలి. జోడింపులుండాలి. మరి, గొప్ప కథలుగా పేరున్న కథల వెనుక వాస్తవాలు తెలుసుకుంటే కథలు రాసే కిటుకు తెలిసిపోతుందేమో! ఇట్లా మొదలైంది, కథానేపథ్యాల కోసం నా వెతుకులాట. ఏడాది పాటు చిన్నా, పెద్దా కథకు లందరి వెంటాపడ్డాను. ఉత్తరాలు రాశాను. ఫోన్లు చేశాను. కొందరు రాశారు. కొందరు రాస్తామన్నారు. కొందరు రాయం అన్నారు. కొందరు తప్పించుకున్నారు.

నేపథ్యానికీ కథకీ మధ్య జరిగిన మార్పులేమిటి? ఎందుకు ఆ మార్పులు అవసరం అయ్యాయి? అవి కథకు ఇచ్చిన బలం ఏమిటి? ప్రసిద్ధ కథలకు నేపథ్యాలుగా ఈ ప్రశ్న లకు సమాధానాలు రాబట్టగలిగితే, కథలు రాద్దామని ఉత్సాహపడే వారికి ఇవి పాఠాలుగా ఉపయోగపడుతాయని ఆశపడ్డాను. మధురాంతకం రాజారాం సర్కస్ డేరాతో కథా నేపథ్యాల ప్రచురణ మొదలైంది. కథా రహస్యం తెలిసిపోతోందనే సంబరం కలిగేది, నేపథ్యం అందుకున్న ప్రతిసారీ. సంబరం అంబరాన్నంటేది కొన్నిసార్లు. నిరాశ మిగిలేది మరికొన్నిసార్లు. అడిగి మరీ రాయించుకున్నాను గనుక అచ్చేయక తప్పలేదు కొన్నింటిని. అడక్కపోయినా రాసి పంపేయడం మొదలుపెట్టారు చాలామంది. మొహమాటానికి పోతే ఇంకేదో అవుతుందనే భయం వేసి, ఇంక ఆపేయడం మంచిదనుకున్నాను.

ముప్పయి నాలుగో నేపథ్యం మహేంద్రది. మధురాంతకం రాజారాంతో మొదలై ఆయన కుమారుడు మహేంద్రతో ఆగిపోయింది కథానేపథ్యం. ఆ ఇద్దరూ ఇప్పుడు లేరు. నా ఆలోచనకు అక్షరరూపం ఇచ్చి వెళ్ళిపోయారు. ఈ నేపథ్యాలు పుస్తకరూపంలో వస్తున్న ఈ సందర్భంలో వారిని తలుచుకోకుండా ఉండలేను.

*తిరుపతి, 17 డిసెంబర్ 2012*

## కృతజ్ఞతలు

ఎప్పుడో ఆంధ్రజ్యోతిలో అచ్చయిన కథానేపథ్యాలన్నీ సేకరించి అందించిన గొరుసు జగదీశ్వరరెడ్డికి...

ఈ సంపుటి కోసం అడిగిన వెంటనే తమ కథల నేపథ్యాలను రాసిచ్చిన కాళీపట్నం రామారావు, శ్రీపతి, కేతు విశ్వనాథరెడ్డి, శ్రీరమణ, కొలకలూరి ఇనాక్, అంపశయ్య నవీన్, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, వి. రాజరామమోహనరావు, వివినమూర్తి గార్లకు...

తప్పులు సరిచూడ్డంలో సహకరించిన
నవోదయ రామమోహనరావు, ఆంధ్రభారతి శేషతల్పశాయి గార్లకు...

అడిగిన వెంటనే కథల వివరాలను అందించిన కథానిలయానికి...

ముఖచిత్రానికి మాస్కల చిత్రాలు అందించిన నాగేశ్వర్‌కి...

ఈ పుస్తకాన్ని అందంగా డిజైన్ చేసిన అక్షర సీతకి...

అచ్చు వేసిన చరిత ప్రెస్ పరుచూరి సుబ్బయ్యకి...

# కథలూ నేపథ్యాలూ




| | | | | |
|---|---|---|---|---|
| 1. | సతి | ... | అబ్బూరి ఛాయాదేవి | 15, 22 |
| 2. | చీకటి | ... | అల్లం శేషగిరిరావు | 25, 46 |
| 3. | ముసల్దాని ముల్లె | ... | ఆడెపు లక్ష్మీపతి | 49, 71 |
| 4. | అమృతుడు | ... | ఆర్.యస్. సుదర్శనం | 75, 85 |
| 5. | జీవధార | ... | కాళీపట్నం రామారావు | 80, 102 |
| 6. | నమ్ముకున్న నేల | ... | కేతు విశ్వనాథరెడ్డి | 107, 116 |
| 7. | కాలేరా | ... | కొలకలూరి ఇనాక్ | 119, 129 |
| 8. | డైనింగ్ టేబుల్ | ... | డి. వెంకట్రామయ్య | 133, 138 |
| 9. | నిప్పురవ్వలు | ... | నవీన్ | 141, 151 |
| 10. | పెళ్లి ప్రయాణం | ... | పి. సత్యవతి | 155, 177 |
| 11. | గూడు కోసం గువ్వలు | ... | పులికంటి కృష్ణారెడ్డి | 181, 191 |
| 12. | ఏస్ రన్నర్ | ... | పెద్దిభొట్ల సుబ్బరామయ్య | 195, 201 |
| 13. | ముంగిస కథ | ... | బలివాడ కాంతారావు | 203, 211 |
| 14. | మెరుగు | ... | బి.యస్. రాములు | 213, 223 |
| 15. | డబ్బు | ... | బీనాదేవి | 227, 236 |
| 16. | చీమలు | ... | బోయ జంగయ్య | 239, 245 |
| 17. | సర్కస్ డేరా | ... | మధురాంతకం రాజారాం | 249, 261 |
| 18. | వారాల పిల్లాడు | ... | మునిపల్లె రాజు | 265, 279 |
| 19. | రానున్న శిశిరం | ... | వల్లంపాటి వెంకటసుబ్బయ్య | 283, 298 |
| 20. | కలిసి బతకటం | ... | వి. రాజారామమోహన రావు | 303, 308 |
| 21. | స్పర్శ | ... | వివినమూర్తి | 311, 329 |
| 22. | అస్థిపంజరం | ... | శీలా వీర్రాజు | 333, 347 |
| 23. | మంచుపల్లకి | ... | శ్రీపతి | 351, 361 |
| 24. | ధనలక్ష్మి | ... | శ్రీరమణ | 365, 375 |
| 25. | అడుసు | ... | సింగమనేని నారాయణ | 377, 387 |

*రంగుల్ని సమర్థంగా ఉపయోగించలేని వ్యక్తి చిత్రకారుడు, స్వరాలను సమర్థంగా ఉపయోగించలేని వ్యక్తి సంగీత విద్వాంసుడు కాలేరు. అలాగే భాషను సృజనాత్మక నైపుణ్యంతో ఉపయోగించలేని వ్యక్తి మంచి రచయిత కాలేడు. కళాకారుడికి తన మాధ్యమం మీద చక్కని నియంత్రణ ఉండాలి. మానవుని ఆలోచనకు వాహిక భాష. భాషా సామర్థ్యం పెరిగినకొద్దీ మానవుని ఆలోచనా సామర్థ్యం పెరుగుతుంది. రచయిత భావాలకు మాధ్యమం భాష. అతడు భాష ద్వారానే తన కథావస్తువు మీద పాఠకుడిలో నమ్మకాన్ని కలిగిస్తాడు.*

**- వల్లంపాటి వెంకటసుబ్బయ్య**

1

# సతి

## అబ్బూరి ఛాయాదేవి



**అబ్బూరి ఛాయాదేవి** *13 అక్టోబర్ 1933 న తూర్పుగోదావరి జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'అనుబంధం' 1952లో నిజాం కాలేజి మ్యాగజైన్‌లో అచ్చయింది. మూడు కథాసంపుటాలు వెలువరించారు. 'మృత్యుంజయ', 'వ్యాసచిత్రాలు' వీరి ఇతర గ్రంథాలు. 1993లో తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, 2005లో 'తన మార్గం' కథల సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డులు అందుకున్నారు. కొన్ని కథలు వివిధ భాషల్లోకి అనువదింపబడ్డాయి.*

**చిరునామా**

*రూమ్ నెం. 103, సి.ఆర్. ఫౌండేషన్*
*కొండపూర్, హైదరాబాద్-500 084.*
*Ph.: 81793 77817*

"కథ పేరు మారిస్తే బావుంటుందేమో," అన్నాడు తిరుమలరావు భార్య కొత్తగా రాసిన కథ చదివి.

పెళ్లికి ముందు సత్యవతి రాసిన కథలు అతను చదవలేదు. పెళ్లిచూపులకి వెళ్లినప్పుడు సత్యవతి అన్నగారు, 'మా చెల్లెలు కథలు బాగా రాస్తుందండీ,' అన్నప్పుడు 'ఓహో' అని చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. అతనికి చిన్నప్పటి నుంచీ కాకమ్మ కబుర్లు, కల్లబొల్లి కథలూ అంటే ఇష్టం లేదు. చుట్టుపక్కల ఏదైనా సంఘటన జరిగితే మాత్రం దాని పూర్వాపరాలు తెలుసుకోవాలని కుతూహలం కనబరచేవాడు. వాటినిబట్టి మనుషుల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేవాడు. రకరకాల మనస్తత్వాల గురించీ, మనుషుల భిన్న ప్రవృత్తుల గురించీ మరింత లోతుగా తెలుసుకోవడానికి పుస్తకాలు చదివేవాడు. ఈ ప్రవృత్తి అతని పోలీసు ఉద్యోగానికి బాగా పనికొచ్చింది.

సత్యవతి కథలు రాస్తుందని విన్నాక, 'పోనీలే, తన కాలక్షేపం తనకుంటుంది నన్ను వేధించకుండా,' అనుకున్నాడు.

పెళ్లయ్యాక, తన కథలు పాతవి చదవమని సత్యవతి ఎప్పుడూ అడగలేదు భర్తని. ఎప్పుడూ తీరికలేని 'డ్యూటీ' అతనిది. ఉన్న కాస్త తీరిక సమయమూ ఇద్దరూ

కలిసి ఆనందంగా గడపడానికే సరిపోయేది కాదు. ఎప్పుడు పిలుపొస్తుందో తెలియదు. ఏ క్షణాన అయినా యూనిఫామ్ తగిలించుకోవడానికి సిద్ధంగా ఉండాల్సి వచ్చేది. ఇద్దరూ కలిసి ఉన్నప్పుడు తన కథల గురించి ప్రస్తావించకుండా, అతని ఉద్యోగం కబుర్లు అడిగి తెలుసుకుంటూ ఉండేది. తన కథలకన్న ఎంతో ఆసక్తికరంగా అనిపించేవి అతను చెప్పిన కొన్ని కేసుల వివరాలు.

అతను చెప్పిన ఒక కేసు వివరాల ఆధారంగా కొంత కల్పన జోడించి ఒక కథ రాసింది సత్యవతి. అది మాత్రం చదవమని భర్తను కోరింది. ఎలా ఉందో చెప్పమంది.

"నీ కథల సంగతి నేనేం చెప్పగలను? నువ్వు పేరుపడ్డ రచయిత్రివే కదా! నేను చూడ్డం ఎందుకు?" అని తప్పించుకోబోయాడు. సత్యవతి వదల్లేదు, బతిమాలింది.

అతను కొత్త పెళ్లాం మీద మోజుకొద్దీనో, కుతూహలం కొద్దీనో ఒప్పుకున్నాడు. కథ చదివి, బావుందని మెచ్చుకుంటూనే మధ్యమధ్య కొన్ని సంభాషణలు సరిదిద్ది, "కథ పేరు మారిస్తే బావుంటుందేమో," అన్నాడు.

"ఇంతకన్న వేరే పేరు ఏం నప్పుతుంది? ఆ మనిషిలో ఉన్న బలహీనతని కనిపెట్టి దాని మీద దెబ్బకొట్టాడు ప్రత్యర్థి. అదేకదా ముఖ్యాంశం. అందుకే 'బలహీనత' అని పెట్టాను," అని సమర్థించుకుంది సత్యవతి.

"ఆ పాయింట్ ఒప్పుకుంటాను. కానీ చాలా బలహీనంగా పేలవంగా అనిపిస్తోందా శీర్షిక... ఆలోచించు," అన్నాడు తిరుమలరావు చేయి తిరిగిన విమర్శకుడిలా.

"అయితే మీరు ఏదైనా చెప్పండి ప్లీజ్," అంది సత్యవతి.

"వీక్ పాయింట్ అని పెట్టు. ఆకర్షణీయంగా ఉంటుంది," అన్నాడు.

"తెలుగు కథకి ఇంగ్లీషు పేరేం బావుంటుందండీ? తెలుగులో మాటలే లేవన్నట్లు!" అంది.

"తెలుగు మాట లేకనేనా ప్లీజ్ అన్నావ్!" అన్నాడతను వేళాకోళంగా.

సత్యవతి మారు వాదించలేకపోయింది. "కానీ ఒక రిక్వెస్ట్," అంది గోముగా.

ఏమిటన్నట్లు చూశాడు.

"ఈ కథకి ఆధారం మీరు చెప్పిన కేసే. కథకి శీర్షిక కూడా మీరే పెట్టారు. సరదాగా మనిద్దరి పేర్లతో పంపిద్దాం కథని," అంది.

"ఓ, నో! నేను కథ రాశానంటే నా సంగతి తెలిసినవాళ్లంతా నవ్వుతారు," అన్నాడతను.

"ఏమీ నవ్వరు. భార్యాభర్తలు కలిసి రాస్తే ఎంత గొప్పగా ఉంటుంది! అది మన అన్యోన్య తని సూచిస్తుంది. అంతేగాని అందులో సిగ్గు పడాల్సిందేముంది? మీ పేరు కూడా జోడిస్తే నాకెంత గర్వకారణమో తెలుసా? వివాహానికి అంతకన్న సార్థక్యం ఏముంటుంది?" అంటూ ఎంత ఊరించినా తిరుమలరావు ససేమిరా అన్నాడు.

గత్యంతరం లేక, తన పేరుమీదే పంపించింది, ఆ కథని ఒక ప్రముఖ మాసపత్రిక ప్రత్యేక సంచిక కోసం. పత్రికవాళ్లు ఆ కథని మరింత ప్రత్యేకంగా ప్రచురించారు. కథాశీర్షికని మరీ పెద్దపెద్ద అక్షరాల్లో వేసి, రెండు పేజీల బొమ్మ వేశారు కథకి అనుగుణంగా. తరువాత పాఠకుల నుంచి కూడా బోలెడు లేఖలొచ్చాయి కథని ప్రశంసిస్తూ. తిరుమలరావుకి సంభ్రమం కలిగింది.

ఈసారి కథకి ఏదైనా మంచి కథావస్తువు తీసుకోవాలని సత్యవతి ఆలోచిస్తుంటే, తిరుమల రావు ఒక సూచన చేశాడు- మందుల అమ్మకాల విషయమై- అంటే డాక్టర్లకీ, మెడికల్ రిప్రజెం

టెటివ్స్‌కీ, మందుల షాపుల వాళ్లకి, పోలీసులకీ ఉండే అవినీతికర సంబంధం గురించి రాయమని సూచించాడు.

"నాకు వాటి గురించి అంత వివరంగా తెలియదు కదండీ. మరీ అంత తెలియని వాటి గురించి రాస్తే కథ వాస్తవికంగా అనిపించదు కదండీ," అంటూ ఇబ్బందిగా పెట్టింది మొహం.

"నువ్వు కథ స్థూలంగా రాయి. తక్కిన వివరాలు నేను చెబుతాను- రాసుకుందుగాని," అన్నాడు.

ముందు మొహమాటపడినా, కథ రాయడానికి పూనుకుంది సత్యవతి. అతను చెప్పిన వివరాలూ, సూక్ష్మాంశాలూ రాసుకుని, మొత్తం మీద కథ పూర్తిచేసింది. ఈసారి కూడా కథకి పేరు అతనే సూచించాడు. అదీ ఇంగ్లీషులోనే కుదిరింది.

ఈసారి సత్యవతి గట్టిగా పట్టుబట్టింది. అతని పేరు కూడా ఉండాలని. వద్దువద్దని పైకి అన్నా మనసులో కొంత మెత్తబడకపోలేదు తిరుమలరావు. క్రిందటిసారి కథకు పాఠకుల వద్ద నుంచి వచ్చిన ప్రశంసల్లో తనకీ కొంత భాగం లేకపోలేదనిపించింది. ఉద్యోగరీత్యా తన పేరుండటం మంచిదికాదేమోనని కొంత తటపటాయించాడు.

మధ్యేమార్గంగా, 'ఇద్దరం కలిసి కలం పేరు పెట్టుకుందామ'ని సలహా ఇచ్చాడు.

తన పేరు ఉండదని కించిత్తు బాధ కలిగినా, భర్త ఒప్పుకున్నాడన్న విజయగర్వంతో అతని సలహా బావుందనిపించింది. ఇద్దరూ కలిసి రకరకాల కలం పేర్లు ఆలోచించారు. పిల్లలకి పేరు పెట్టడానికి చేసినంత యోచన చేశారు. చివరికి సత్యవతి మాటే నెగ్గింది.

'సతి' అని పెట్టుకుందామంది. తన పేరులో మొదటి అక్షరం, అతని పేరులో మొదటి అక్షరం కలిపితే అవుతుంది, 'సతి.'

సత్యవతి ఎలాగూ పేరున్న రచయిత్రే కాబట్టి సంపాదకులు ఆ కథని వెంటనే ప్రచురించారు. ఈసారి కలం పేరుకి బ్రహ్మాండమైన ప్రాచుర్యం ఇచ్చారు. అసలు రచయిత పేరు ప్రస్తుతానికి చెప్పబోవడం లేదంటూ పాఠకుల్ని 'సస్పెన్స్'లో పెట్టారు. పాఠకులు కథ అద్భుతంగా ఉందని పొగిడారు. అందరికీ 'ఈ సతి ఎవరు?' అన్న కుతూహలమే! రచయితా, రచయిత్రా? ఇంత గొప్పగా రాసే రచయిత కలం పేరు పెట్టుకోవాల్సిన అవసరం ఏమిటి? ఇంత గొప్పగా రాసిన కొత్త రచయిత ఎవరు? రచయిత కాకపోతే ఇంత గొప్పగా రాయగలరా? రచయిత్రికి అంత అనుభవం ఎక్కడుంటుంది? అంత పదునుగా సంభాషణలు రాయడం సాధ్యమా రచయిత్రికి? కానీ, కొన్ని కొన్ని వాక్యాలూ, వర్ణనలూ చూస్తుంటే రచయిత్రే అలా రాయగలుగుతుంది అనిపిస్తోంది. అంత సున్నితమైన అనుభూతుల్ని రచయిత్రే- ఆ కథావస్తువులు రచయిత్రులు తీసుకునేటటువంటివి కాదని కొందరూ, ఇంతకీ రాసింది ఎవరూ అనే మీమాంస. 'రచయిత(త్రి)కి మా అభినందనలు తెలపండి,' అంటూ సంపాదకుడికి చాలా ఉత్తరాలొచ్చాయి.

ఆ విజయోత్సాహంలో సత్యవతీ, తిరుమలరావూ కలిసి 'సతి' పేరుతో ఆ సంవత్సరం అయిదారు కథలు రాసి వివిధ పత్రికలకు పంపారు. 'సతి' రచనలు విశిష్టంగా ఉంటాయన్న పేరు పడిపోయింది. మరుసటి సంవత్సరం మరో అయిదారు కథలు రాశారు. పాఠకులకు ఇంకా తెలియనివ్వలేదు సంపాదకులు 'సతి' ఎవరో. పాఠకుల కుతూహలానికి కళ్లెం వేసి ఉంచారు.

పోలీస్ సర్కిల్స్‌లో సాహిత్యాభిరుచి ఉన్నవాళ్లు కథల గురించి చర్చించుకుంటూంటే తిరుమలరావు మొదట్లో ముసిముసి నవ్వులు నవ్వుకునేవాడు. క్రమంగా అతను కూడా చర్చల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు.

''కొంపదీసి మీరే రాయలేదుకదా, అంతగా సమర్థిస్తున్నారు!'' అనేశారు కూడా ఒకళ్లిద్దరు.

'సతి' రాసిన నవల ఒకటి సీరియల్‌గా మొదలయేసరికి ఆ పత్రిక అమ్మకాలు విపరీతంగా పెరిగిపోయాయి. సంపాదకుడే ఆశ్చర్యపోయేటట్లు ఆ సీరియల్ పూర్తికాకుండానే ఒక ప్రచురణకర్త 'సతి' నవలనీ, మరొకరు 'సతి' కథాసంకలనాన్ని అచ్చువేస్తామని ముందుకొచ్చారు. చిరునామా కోసం సంపాదకుల్ని సంప్రదించారు.

సీరియల్ నవలారచయిత గురించి అసలు రహస్యం చెబుతామంటూ మూడు సంచికల్లో ఊరించి, చివరికి పేర్లు వెల్లడించారు పత్రికలో. పుస్తకాలుగా ప్రచురిస్తామనేసరికి తిరుమలరావు మెత్తబడ్డాడు. పేర్లు వెల్లడించగానే మరో పత్రిక ఉగాది సంచికలో 'సతి' కథతో బాటు సత్యవతి, తిరుమలరావుల ఫోటోలు కూడా వేశారు ప్రశంసాపూరితమైన పరిచయ వాక్యాలతో.

ఇంత జరిగినా కొందరి పాఠకుల్లో మీమాంస తగ్గలేదు. కథనంలో ఎవరి వంతు ఎంత అని చర్చించుకుంటున్నారు. ఆ చర్చలకు కూడా మంగళం పాడుతూ ఒకటి రెండు పత్రికలు 'ముఖాముఖీ'లు ఏర్పాటుచేయడంతో, భార్యాభర్తలిద్దరూ కలిసి ఏ విధంగా కథారచన చేస్తూ ఉంటారో కొంత గంభీరంగానూ, కొంత చమత్కారంగానూ వివరించాక పాఠకులకు కొంత తృప్తి కలిగింది.

పుస్తకాలు అచ్చయాయి. మంచి సమీక్షలొచ్చాయి. ఇక సన్మానాల వాళ్లు ముందుకొచ్చారు. సత్యవతీ, తిరుమలరావూ వేదిక మీదికి బహిరంగంగా రాక తప్పలేదు. ఇద్దరూ మాట్లాడారు వేదిక మీంచి. ప్రేక్షకులు ఎవర్ని ఎక్కువ ప్రశంసించి ఎవరికి ఎక్కువ చప్పట్లు కొట్టారో చెప్పడం కష్టంకానీ, అప్పటి నుంచీ తిరుమలరావుకి సాహితీరంగంలో స్నేహితులూ, ఆరాధకులూ ఎక్కువయ్యారు.

సత్యవతి గర్భవతి అయింది. కూర్చుని కథలూ, నవలలూ రాయలేకపోతోంది. కొడుకు పుట్టాడు. మాతృమూర్తి అయ్యాక అసలే తీరిక లేక బొత్తిగా రాయడం తగ్గించేసింది.

తిరుమలరావుకి ఉద్యోగంలోనూ, కథారచనలోనూ అనుభవం పెరగడంతో రాయాలనే తపన ఎక్కువైంది. ఇప్పుడు కథంతా అతనే రాస్తున్నాడు. అతని దస్తూరి మాత్రం బ్రహ్మరాతలా ఉంటుంది. అందుకని సత్యవతిని తిరిగి రాయమనేవాడు. రాసేటప్పుడు సత్యవతి అక్కడక్కడ మార్పులూ చేర్పులూ చేసేది.

సత్యవతి మళ్లీ గర్భవతి అయింది. ఈసారి ఆడపిల్ల. తెగ మురిసిపోయింది. ఆడపిల్లలంటే ఇష్టం సత్యవతికి. ఆ పిల్లే ఇక లోకం అయిపోయింది. కొడుకు అల్లరిని అదుపులో పెట్టడం ఒకవైపూ, కూతురితో ముచ్చట్లు మరోవైపూ. వంటపని సరేసరి. నౌకర్లున్నా అన్నీ తనే చేస్తేగాని తిరుమలరావుకి నచ్చదు.

కథలు కాపీ చెయ్యడానికి కూడా పగలు తీరిక దొరకడం లేదు. రాత్రిళ్లు నిద్ర ఆపుకుని, పిల్లలు పడుకున్నాక భర్త రాసిన కథల్ని ఫెయిర్‌కాపీ చేసి పెడుతోంది. కథల్లో మార్పులూ చేర్పులూ చెయ్యడానికిగానీ, కథావస్తువుల గురించీ, ఇతివృత్తాల గురించీ, శీర్షికల గురించీ చర్చించడానికి గానీ, ఆలోచించడానికిగానీ తీరికా, ఓపికా ఉండటం లేదు.

'సతి' రచన మళ్లీ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసే పాఠకులూ, 'సతి' రాసిన కథని అన్నిటికన్నా ముందు చదివే పాఠకులూ ఎక్కువయ్యారు. కొంతమంది అభిమానులు ఇంటికి కూడా రావడం మొదలుపెట్టారు. తిరుమలరావు ఇంట్లో లేనప్పుడొస్తే ముక్తసరిగా మాట్లాడి పంపించేసేది. అతను ఉండగా వస్తే, వాళ్లతో కాసేపు కూర్చుని లోపలికి వచ్చేసి తన పనులు చూసుకునేది.

తిరుమలరావు తండ్రి పోయాక, తల్లి కొడుకు దగ్గర ఉండటానికి వచ్చేసింది. ఆవిడకి బి.పి. ఎక్కువ. పిల్లల్తోబాటు ఆవిడ ఆలనాపాలనా కూడా చూసుకోవలసి వస్తోంది సత్యవతికి. కథారచయితల మీటింగులకీ, సన్మానసభలకీ వెళ్లడం కూడా తగ్గించేసింది. ఇద్దరి తరపునా తిరుమలరావే వెళ్లొస్తున్నాడు వీలైనప్పుడల్లా. 'సత్యవతిగారు రాలేదేమని' ఎవరైనా అడిగితే-

"ఆఁ... పిల్లల్తో తీరికెక్కడండీ!" అని నవ్వేసేవాడు.

ఆవిడ రావడం తగ్గించడంతో ఆవిడ రాయడం గురించి చర్చించుకోవడం మొదలు పెట్టారు కొందరు. ఆయన కన్న అసలు ఆవిడే బాగా రాస్తుందనీ, ఆవిణ్ణి రాయనీయకుండా ఈమధ్య ఆయనే రాస్తున్నాడనీ, కేవలం మర్యాదకోసం మాత్రమే సభల్లోనూ, ఇంటర్వ్యూల్లోనూ పక్కన కూర్చోపెట్టుకుంటున్నాడనీ గుసగుసలాడుకునేవారు సత్యవతి అభిమానులు. 'తిరుమల రావే బాగా రాస్తాడు,' అని అతని అభిమానులనుకునేవారు.

ఎప్పుడైనా పత్రికలు ప్రత్యేక సంచికలు ప్రచురించినప్పుడు కథతోనో ఇంటర్వ్యూతోనో ఇద్దరి ఫోటోలు వేసేవారు.

సత్యవతికి మొహమాటంగా ఉంటోంది- తను రాయకుండా తన పేరు పెట్టడం. ఎలా గయినా తీరిక చేసుకుని అప్పుడప్పుడు రాయాలని నిశ్చయించుకుంది. తను ఎదుర్కొంటున్న సమస్యల ఆధారంగా ఒక కథ రాయాలనిపించింది. తిరుమలరావుతో చర్చించబోయింది.

"ఆఁ, మరీ సిల్లీగా ఉంటుంది," అని కొట్టి పారేశాడు.

పెళ్లికాకముందు తనకున్న అనుభవంతో తను పరిశీలించిన విషయాల్ని ఆధారంగా చేసుకుని చిన్నచిన్న కథలెన్నో రాసింది. ఇప్పుడు అటువంటివి రాయడం తమకొచ్చిన పేరుకి తగవన్నట్లు మాట్లాడాడు తిరుమలరావు. సత్యవతి మనస్సు చివుక్కుమంది. పెళ్లయ్యాక మొదటి సారిగా తన స్వేచ్ఛ పోయినట్లనిపించింది.

ఇదివరకు తల్లిదండ్రుల మనస్సుకి ఇబ్బంది కలిగించకుండా, తన మనస్సుని కొంత అదుపులో పెట్టుకుని రాసేది కథలు. పాఠకులు మెచ్చుకుంటారో లేదో అనే సంకోచం మెదిలేది మదిలో. ఎప్పుడూ ఒక పరిధిలో ఉంటూనే కథారచన చేస్తున్నట్లనిపించేది. అయినా ఏదో తృప్తి కలిగేది కథలు రాసి పేరు తెచ్చుకుంటున్నందుకు.

ఇప్పుడు మొదటికే మోసం వచ్చినట్లనిపిస్తోంది. అసలు తీరిక దొరకడం లేదు. దొరికినా భర్త పెట్టే ఆంక్షలు ఎక్కువయ్యాయి. కథాశీర్షికతో మొదలై కథావస్తువు, ఇతివృత్తం వరకూ అతని పెత్తనం ఎక్కువైంది అనిపిస్తోంది సత్యవతికి. కథ కాపీ చేస్తున్నప్పుడు కూడా మార్పులూ చేర్పులూ చెయ్యబోతే ఒప్పుకోవడం లేదు. 'నీకు తెలియదు, నువ్వూరుకో,' అంటున్నాడు ప్రతిదానికీ. ఇదంతా తను తెచ్చిపెట్టుకున్నదేనని బాధపడింది. 'ఇదేమిటీ ఆయనకి వ్యతిరేకంగా ఆలోచిస్తు న్నాను,' అని కూడా బాధపడింది. మనసులో సంఘర్షణ మొదలైంది. తన స్వేచ్ఛనే కాకుండా తన వ్యక్తిత్వాన్ని కూడా చెయ్యి జార్చుకున్నట్లు మనసు గిలగిల్లాడుతోంది.

సత్యవతి అత్తగారు పోయారు. తిరుమలరావుని ప్రమోషన్ మీద రాజధానికి బదిలీ చేసింది ప్రభుత్వం. సంవత్సరం మధ్యలో మారిస్తే పిల్లల చదువు పాడవుతుందని సత్యవతి ఉన్నచోటే ఉండిపోయింది. తిరుమలరావు నెలకో రెండు నెలలకో ఓసారి వచ్చి వెడుతున్నాడు.

ఇప్పుడు సత్యవతికి బోలెడంత తీరిక. అయినా రాయడానికి స్వేచ్ఛలేదు. మనసు గిజగిజ లాడుతోంది. ఏమీ తోచక, పత్రికలన్నీ తెప్పించుకుని చదువుతోంది. హఠాత్తుగా తమ కలంపేరు చూసింది ఒక వారపత్రికలో. తెల్లబోయింది. ఆ కథ రాస్తున్నట్లు చెప్పలేదు తిరుమలరావు. కాపీ చెయ్యమని ఇవ్వలేదు. ఆ విషయమై ఉత్తరం రాయలేదు, ఫోన్ కూడా చేయలేదు.

ఇప్పుడతనికి అందరు సంపాదకులతోనూ సన్నిహిత పరిచయం ఏర్పడింది. అంచేత ఏ దస్తూరితో పంపినా వేసుకుంటున్నారు కాబోలు అనుకుంది.

తరవాత ఒకళ్లిద్దరు స్నేహితులు ఫోన్ చేసి కథ అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. సత్యవతి మనస్ఫూర్తిగా సంతోషించలేకపోయింది. భర్తకి ఘాటుగా ఉత్తరం రాద్దామనుకుంది. మళ్లీ మనసు మార్చుకుంది. ముందు అతనే తనంతట తను కథ విషయమై ఉత్తరం రాస్తాడేమో చూసి, రాయకపోతే, ఈసారి ఇక్కడికి వచ్చినప్పుడు నిలదీసి అడగొచ్చునులే అని తమాయించుకుంది. ఉత్తరం కోసం ఎదురుచూసింది. కనీసం ఫోన్ చేసినప్పుడైనా ఆ ప్రసక్తి వస్తే అడగొచ్చునులే అని సరిపెట్టుకుంది.

తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లయింది. రాజధానిలో మతకలహాలు చెలరేగాయి. నిరవధికంగా కర్ఫ్యూ విధించారు. తిరుమలరావుకి స్పెషల్ డ్యూటీ వేశారు పాతబస్తీలో శాంతి భద్రతలు నెలకొనేలా చూడటం కోసం.

ఆనాడు అర్ధరాత్రి సమయంలో కంట్రోల్‌రూమ్‌కి రహస్య సమాచారం అందింది. కొందరు గూండాలు వేరే ఊరు నుంచి వచ్చి బస్తీలో చేరారనీ, కొత్తగా గొడవలు సృష్టించబోతున్నారనీను. తిరుమలరావు ఇద్దరు కానిస్టేబుల్స్‌ని తీసుకుని, తక్కిన సీనియర్ ఆఫీసర్స్‌కి సమాచారం అందించి, జీప్‌లో బయలుదేరి వెళ్లాడు. వాళ్లు చెప్పిన సందు చేరుకున్నారు. సందు మొదట్లో గస్తీ తిరిగే కానిస్టేబుల్ ఎవడూ లేడు. జీప్ సందులోకి ప్రవేశిస్తుండగానే బాంబు పేలింది. తప్పించుకునే సావకాశం లేకపోయింది. జీప్ బంతిలా ఎగిరింది. డ్రైవరూ, ఒక కానిస్టేబులూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు దారుణంగా. తిరుమలరావుకీ మరో కానిస్టేబుల్‌కీ తీవ్రగాయాలు తగిలి స్పృహ కోల్పోయారు. భయానికి చుట్టుపక్కల ఇళ్లల్లో జనం తలుపులు తెరవలేదు. ఒక్క మనిషి కూడా బయటికి తొంగి చూడలేదు. సీనియర్ ఆఫీసర్లు వచ్చేసరికి తిరుమలరావు కొన ఊపిరితో ఉన్నాడు. హాస్పిటల్‌కి తరలిస్తుంటే దారిలోనే మరణించాడు.

కబురు విన్న సత్యవతి గుండెలు బ్రద్దలవుతున్నా ఏడుపు బిగపెట్టుకుంది పిల్లలు బెంబేలు పడతారని. క్షణాల మీద ఆ వార్త పాకి, చుట్టుపక్కలవాళ్లూ, స్నేహితులూ వచ్చేశారు పరామర్శించడానికి. అప్పుడిక ఆపుకోలేకపోయింది దుఃఖాన్ని. ఇంత చిన్నవయసులో ఈ ఘోరం జరగడం అన్యాయం అన్నారంతా.

"నన్ను కూడా చంపెయ్యమనండి. ఆయన్నొక్కర్నే ఎందుకు చంపేశారు? ఆయన లేకుండా నేనెలా బతకను? నన్నూ చంపెయ్యమనండి, చంపెయ్యమనండి," అంటూ తల బాదుకుంటూ ఏడ్చింది. సత్యవతిని ఓదారుస్తూ ఒళ్లోకి తీసుకుంది పక్కింటావిడ. ఎవరి మట్టుకు వారు తమకు తోచిన విధంగా సాంత్వన వచనాలు పలికారు. కులమతవిద్వేషాల్ని రెచ్చగొట్టే వాళ్లని తిట్టిపోశారు.

తిరుమలరావు భౌతికకాయాన్ని రాజధాని నుంచి భార్యాపిల్లలూ ఉన్న ఊరికి తీసుకొచ్చారు. అతని తోటి ఉద్యోగులూ, బంధుమిత్రులూ, పత్రికా ప్రతినిధులూ, సాహిత్యకారులూ అనేకమంది వచ్చారు శవ దర్శనానికి.

దినపత్రికలన్నింటిలోనూ 'సతి' అకాల దుర్మరణం గురించిన వార్తతోబాటు, ప్రముఖుల సంతాప సందేశాలు కూడా ప్రచురించటం జరిగింది. రాత్రి రేడియోలో ప్రాంతీయ వార్తల్లో తిరుమలరావు మరణవార్త వివరిస్తూ, ఆయన 'సతి' పేరుతో గొప్ప కథలు రాశారని చెప్పి ఘనంగా నివాళులర్పించారు.

ప్రముఖ రచయిత 'సతి' మరణించారన్న వార్త తెలుగు సాహితీప్రియులందరినీ విచార గ్రస్తుల్ని చేసింది. పదవరోజున టౌన్ హాల్లో 'సతి' సంతాపసభ ఏర్పాటయింది. సాహితీమిత్రులూ, పత్రికా రచయితలూ, ఇతర బంధుమిత్రులూ- అంతా హాజరయారు సభకి. సత్యవతిని రమ్మని పిలవలేదు, బొత్తిగా పదవరోజున బయటికి ఎలా వస్తుందని. ఆవిడ కూడా దుఃఖం నుంచి ఇంకా కోలుకోలేదు. పిలిచినా వచ్చేది కాదు.

'సతి'కి సంబంధించిన కార్యక్రమానికి తిరుమలరావుగాని, సత్యవతిగాని ఇద్దరిలో ఒకరైనా రాకపోవడం ఇదే.

వేదిక మీద కూర్చున్న కొందరు ప్రముఖులు తిరుమలరావుతో తమకున్న పరిచయాన్నీ, సాన్నిహిత్యాన్నీ తెలియజేస్తూ, అతని ధైర్యసాహసాల్నీ, కర్తవ్యనిష్ఠనీ, నిజాయితీనీ, మానవత్వాన్నీ, హాస్యప్రియత్వాన్నీ ప్రస్తుతించారు. మరికొందరు 'సతి' చేసిన సాహిత్యసేవ గురించీ, కథన చాతుర్యం గురించీ, శైలీ శిల్పాలలో నైపుణ్యం గురించీ, కథావస్తువులను ఎంచుకోడంలోనూ వాటిని విశిష్టంగా రూపుదిద్ది ప్రదర్శించడంలోనూ కనపరచిన ప్రతిభ గురించీ, తన రచనల ద్వారా చాటిన మానవత్వపు విలువల గురించీ ప్రస్తుతించారు.

'సతి' హఠాన్మరణం వల్ల తెలుగు సాహితీలోకానికి ఎంత తీరని లోటు కలిగిందోనన్నది అందరూ ఉద్ఘాటించిన విషయం. మళ్లీ అటువంటి రచయిత ఉద్భవించడం సాధ్యమవుతుందా అనే సంశయాన్ని వెలిబుచ్చాడు ఒక ప్రఖ్యాత సాహితీ విమర్శకుడు. వేదిక మీద కూర్చున్న వక్తలలో రచయిత్రులు కూడా ఉన్నారు. వాళ్లు కూడా తిరుమలరావుతో తమకు కలిగిన పరిచయాన్నీ, ఆయన రచనల వల్ల కలిగిన స్ఫూర్తినీ వివరిస్తూ గద్గద స్వరంతో తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

అందరూ అంతగా పట్టించుకోని విషయం ఒక్కటే- 'సతి'లో అర్ధభాగం ఇంకా బ్రతికే ఉన్నదన్న సత్యం. అందరూ ముక్తకంఠంతో 'సతి' మరణించిన మాట మీదే వ్యాఖ్యానిస్తున్నారు గాని, 'సతి'లో 'స' ఇంకా బ్రతికే ఉందన్న స్పృహ లేదు ఎవరికీ- తిరుమలరావు పోయినందుకు ప్రగాఢ దుఃఖం వల్ల కావచ్చు, సత్యవతి ఇంకా బ్రతికే ఉన్నది కనుక 'సతి' పేరున రచనలు కొనసాగగలవన్న ఆశాభావాన్ని ఎవ్వరూ... వక్తలలో రచయిత్రులు కూడా ప్రస్తావించలేదు. అక్కడ జరిగిన 'సాహితీ సతి' ఎవరి దృష్టికీ రాలేదు.

'సతి' పేరుతోగాని, సత్యవతి పేరుతోగాని మళ్లీ కథ రాలేదు ఇంతవరకూ.

*వనిత, ఫిబ్రవరి 1993*

# పురుషాహంకారం నీడని నిరసించిన
# సతి

***మరణవార్తల్లోగాని, సంతాప సభలోగాని జంట రచయిత్రి అయిన అర్ధాంగి ప్రసక్తి జనం తీసుకురాకపోవడానికి నేనూహించిన కారణం సమాజంలోని పురుషాధిక్య ప్రభావం ఒకటి కాగా, ఆ దంపతుల్లో భర్త పురుషాహంకారంతో భార్యని తన వెనక నీడలోనే ఉంచడం రెండవది.***

సరిగ్గా ఏడేళ్ళ క్రితం మిత్రులు బి. నరసింగరావుగారు (రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి) హఠాత్తుగా మరణించారు. 'రాచకొండ విశ్వనాథశాస్త్రిగారూ, అబ్బూరి వరద రాజేశ్వరరావుగారూ ఒక మేధావి అయిన మిత్రుణ్ణి కోల్పోయారు', 'తెలుగు సాహితీలోకం ఒక ప్రముఖ కథారచయితని కోల్పోయింది,' 'బీనాదేవి పేరుతో కథలూ నవలలూ రాసే జంట కథారచయితల్లో ఒకరైన భాగవతుల నరిసింగరావుగారు పోయారు', 'బీనాదేవి ఇక లేరు,' అంటూ వార్తాపత్రికల్లో శీర్షికలూ, వ్యాసాలు వెలువడ్డాయి. త్వరలోనే నగరంలో ఒక సంతాపసభ ఏర్పాటైంది నగర గ్రంథాలయం హాల్లో. సాహితీమిత్రులూ అభిమానులూ ఎందరో అక్కడ చేరి, 'బీనాదేవిగారి స్మృతి'కి ఘనంగా నివాళులర్పించారు. వారిలో అనేకమంది ప్రసిద్ధ రచయితలూ, రచయిత్రులూ ఉన్నారు. వారిలో ఒక్కరు కూడా 'బీనాదేవి' అనే జంట రచయితల్లో రెండవ వ్యక్తి బతికే ఉన్నారనీ, అర్ధభాగం (బెటర్ హాఫ్) సజీవంగా ఉందనీ గుర్తు చేసుకోలేదు. బతికి ఉన్న రెండవ వ్యక్తి-రచయిత్రి భాగవతుల బాలాత్రిపుర సుందరీదేవి. ఆమె ఆ సంతాపసభకి రాలేదు. ఎలాగూ రాదనుకొని అసలు పిలిచారో లేదో ఎవరైనా!

ఆ సంతాపసభలో ఆవిడ ప్రసక్తి బొత్తిగా రాకపోవడం నన్ను కలవరపరిచింది. ఇది అన్యాయం అనిపించింది. ఒక స్త్రీవాదిగా నా మది ఘోషించింది. ఆ విషయం నా మనసులో నిలిచిపోయింది.

1993 ప్రారంభంలో వనిత పత్రికవాళ్ళు, నన్ను ఏదైనా కథ రాయమని కోరినప్పుడు, 'బీనా దేవి'గారి మరణవార్త గురించీ, ఆ సంతాపసభలో జరిగిన విషయం గురించీ కథ రాయాలనిపించింది.

నరసింగరావుగారూ, వారి సతీమణీ కూడా రావిశాస్త్రిగారి ద్వారా మా కుటుంబ మిత్రులైనప్పటికీ, వారి సంసారం గురించి పైపై వివరాలే తప్ప, ఆంతరంగిక విషయాలేవీ నాకు తెలియవు. అయినా, ఒక విశేషం నా మనసు మీద ముద్ర వేసుకొంది. రావిశాస్త్రిగారు హైదరాబాద్‌కి వచ్చి మా ఇంటికి వచ్చినప్పుడల్లా, నరసింగరావుగారు కూడా వస్తూండేవారు. శాస్త్రిగారితోనూ, వరదగారితోనూ కలిసి కాలక్షేపం చేయడానికి నరసింగరావుగారు ఒక్కరే రావడం జరిగేది సాధారణంగా. ఒకసారి ఆయన్ని అడిగాను, 'ఆవిణ్ణి కూడా తీసుకురాకపోయారా?' అని. ఆయన వెంటనే నవ్వుతూ, 'ఆవిడకి మనవల్తో తీరికెక్కడ ఉంటుందండీ!' అన్నారు తేలిగ్గా, కొట్టి పారేస్తున్నట్లు. చాలారోజులకి సుందరమ్మగారు మా ఇంటికొచ్చినప్పుడు ఆవిడతో నరసింగరావుగారన్న మాటలు చెప్పాను.

"ఏం? మనవలు నాకేగాని ఆయనకి కారా?! నన్ను తన కూడా రమ్మని తీసుకొస్తే ఎందుకు రాను?" అన్నారావిడ ఠకీమని!

నేను రాయాలనుకొన్న కథకి ఈ సంభాషణ పునాది అయింది. మరణవార్తల్లోగాని, సంతాప సభలోగాని జంట రచయిత్రి అయిన అర్ధాంగి ప్రసక్తి జనం తీసుకురాకపోవడానికి నేనూహించిన కారణం సమాజంలోని పురుషాధిక్య ప్రభావం ఒకటి కాగా, ఆ దంపతుల్లో భర్త పురుషాహంకారంతో భార్యని తన వెనక నీడలోనే ఉంచడం రెండవది.

ఈ రెండింటి ఆధారంగా కథని కల్పించాను. కథ పేరు సతి. భార్యాభర్తలిద్దరూ కలిసి కథలు రాయడం ప్రారంభిస్తూ, ఇద్దరూ కలిసి సతి అనే కలంపేరు పెట్టుకొంటారు- ఇద్దరి పేర్లలోని మొదటి అక్షరాలు కలిపి. ఆమె పేరు సత్యవతి, ఆయన పేరు తిరుమలరావు. సత్యవతి పెళ్ళికి ముందు నుంచీ కథలు రాస్తుండేది. పెళ్ళిచూపుల కొచ్చినప్పుడు సత్యవతి కథలు రాస్తుందని విని, 'పోనీలే, తన కాలక్షేపం తనకుంటుంది నన్ను వేధించకుండా,' అనుకొంటాడు తిరుమలరావు. అతను పోలీసుశాఖలో ఉద్యోగి.

పెళ్ళయ్యాక, అతని ఉద్యోగం కబుర్లు అప్పుడప్పుడు అడిగి తెలుసుకొంటూ ఉండేది. అతను చెప్పిన ఒక కేసు వివరాల ఆధారంగా ఒక కథ రాసి భర్తకి చూపించి, చదవమని బతిమాలింది. అతను మొహమాటపడుతూనే చదివి, ఏవో తనకు తోచిన చిన్న మార్పులు చేసి, కథ పేరు మారిస్తే బాగుంటుందని సూచించాడు. ఆ పేరు కూడా అతన్నే చెప్పమంది సత్యవతి. శీర్షిక కూడా సూచించాడు కదా అని, ఇద్దరి పేర్ల మీద కథ పంపిద్దామంది. అతను ఒప్పుకోలేదు.

ఇంకోసారి ఏదైనా కథావస్తువుని సూచించమని సత్యవతి అడిగితే, చెప్పాడతను. దాని చుట్టూ ఇతివృత్తం కల్పించేటంత అనుభవం, లోకజ్ఞానం తనకి లేవనిపించింది. ఆమె సంకోచిస్తుంటే, 'స్థూలంగా నువ్వు కథ రాస్తే, వివరాలు నేను చెబుతాను, రాసుకుందుగాని,' అన్నాడతను. జంట ప్రయత్నం మీద కథ తయారైంది. ఈసారి సత్యవతి పట్టుబట్టింది- రచయితలుగా ఇద్దరి పేర్లూ ఉండాలని. ఉద్యోగరీత్యా వీలుకాదని అతను ఒప్పుకోలేదు. చివరికి, ఇద్దరూ కలిసి కలం పేరు పెట్టుకోవాలని నిశ్చయించుకొన్నారు. ఇద్దరూ కలిసి తరువాత కథలు, సీరియల్సు రాసేవారు. పేరు ప్రఖ్యాతులు పెరిగాయి.

తిరుమలరావుకి ఉద్యోగంలోనూ, కథారచనలోనూ అనుభవం పెరగడంతో, రాయాలనే తపన ఎక్కువైంది. సత్యవతికి పిల్లలు పుట్టటం మొదలవడంతో ఇంటి చాకిరీ ఎక్కువైంది. పైగా

అత్తగారి సేవ, ఇతర బాధ్యతలు పెరిగాయి. కథారచనకి ఖాళీ ఉండేది కాదు. భర్త రాసిన కథలు ఫెయిర్ కాపీ చేస్తూ వాటిల్లో మార్పులూ చేర్పులూ చేసేది మొదట్లో. క్రమంగా దానిక్కూడా తీరుబడి దొరికేది కాదు. క్రమంగా, సాహితీలోకంలోనూ, పత్రికారంగంలోనూ, పోలీసు సర్కిల్స్ లోనూ అతని ప్రాచుర్యం ఎక్కువైంది. సభలకీ, సత్కారాలకీ అతనొక్కడే వెళ్ళేవాడు సాధారణంగా- ముఖ్యంగా పై ఊళ్ళలో జరిగినప్పుడు. చివరికి, తను రాస్తున్న కథ సంగతి కూడా చెప్పకుండా పత్రికకి పంపించడం మొదలుపెట్టాడు. ఆ సంగతి తెలిసి సత్యవతి చాలా బాధపడుతుంది. అవమానకరంగా అనిపిస్తుంది. భర్తని నిలదీసి అడగాలనుకొంటుంది. ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చి బదిలీ అయి అతను రాజధాని నగరంలో ఉంటున్నాడు కొంతకాలం నుంచి. ఈసారి అతను తమ ఊరికి వచ్చినప్పుడు ఆ విషయమై అటో ఇటో తేల్చుకోవాలనుకొంటుంది.

కానీ, అనుకోకుండా అతనొక దుర్ఘటనలో మరణిస్తాడు. రాజధానిలో చెలరేగిన మత కలహాల్లో కొందరు గుండాలను ఒకచోట పట్టుకోవడానికి జీపులో వెళ్ళినప్పుడు వాళ్ళు వేసిన బాంబుకి జీపు పేలిపోతుంది. తిరుమలరావు ఘోర మరణం అందరికీ దిగ్భ్రాంతిని కలిగించింది. అతని మరణవార్తకి మరింత ప్రాముఖ్యం వచ్చింది, అతను ప్రముఖ రచయిత కూడా కావడం వల్ల.

సంతాపసభలో పురప్రముఖులందరూ ప్రఖ్యాత కథారచయిత 'సతి' మరణానికి ప్రగాఢ శోకాన్ని ప్రకటించారు. 'సతి'లో 'స' ఇంకా బతికే ఉందన్న స్పృహ లేదు ఎవరికీ. సత్యవతి బతికే ఉన్నది కనుక 'సతి' పేరుతో రచనలు కొనసాగగలవన్న ఆశాభావాన్ని ఎవరూ వ్యక్తం చెయ్యలేదు. ఆనాడు, 'అక్కడ జరిగిన సాహితీ సతి,' ఎవరి దృష్టికీ రాలేదు. 'సతి' పేరుతోగాని, సత్యవతి పేరుతోగాని మళ్ళీ కథ రాలేదు ఇంతవరకు,' అని ముగించాను కథని.

ఈ కథ వనిత ఫిబ్రవరి 1993 సంచికలో వచ్చింది. తరువాత ఈ కథ చదివి బీనాదేవిగారు, మిత్రులూ సంతోషించారు.


యాదృచ్ఛికం కావచ్చు- నరసింగరావుగారు పోయిన మూడేళ్ళ తరువాత 1993 నుంచే సుందరమ్మగారు బీనాదేవి పేరుతో మళ్ళీ తమ రచనా ప్రక్రియని కొనసాగించారు. అది చూసి సంతోషించిన వాళ్ళలో నేను మొదటిదాన్ని.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 19 అక్టోబర్ 1997*

2

# చీకటి

## అల్లం శేషగిరిరావు



**అల్లం శేషగిరిరావు** *9 డిసెంబర్ 1934న ఒరిస్సాలోని గంజాం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'మృగయా వినోదం అను పులి ఛాన్స్' 1967లో ఆంధ్రజ్యోతిలో అచ్చయింది. రెండు కథాసంకలనాలు- 'మంచి ముత్యాలు', 'అరణ్యఘోష' ప్రచురించారు. మంచి ముత్యాలు కథా సంపుటానికి 1981లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి అవార్డు లభించింది. వఱడు కథ బాసూ భటర్జీ దర్శకత్వంలో టెలిఫిల్మ్‌గా రూపొందింది. రైల్వేలో పదవీ విరమణ చేసి, విశాఖపట్నంలో నివాసం ఉంటూ 3 జనవరి 2000 నాడు మరణించారు.*

చీకటి...
డక్ షూటింగ్...

బాతుల వేటకి కెప్టెన్ వర్మ బయలుదేరాడు. రిటైరైన వర్మ విడోవర్. ఊరవతల పెద్ద బంగళా ఉంది. అందులో పూర్వం దొరలుండేవారు. వయస్సు మళ్ళినా దిట్టంగా ఉన్నాడు. ఒక్క కొడుకూ విదేశాల్లో చదువు కొంటున్నాడు. ఇద్దరు పని మనుషులు.

"నాకు మహావృక్షాలంటే మహా ఇష్టం. అవి ముసలి చెట్లయి వుంటే మరీ ఇష్టం. అవి చాలా తరాల నుంచి వాటి మీద గూళ్ళు కట్టుకున్న ఎన్నో జాతుల పక్షుల్ని, ఈ బంగళాలో కాపురమున్న విభిన్న సంస్కృతుల మనుషుల్ని చూసుంటాయి. నేను ఈజీ ఛైర్‌లో వరండా మీద కూర్చుని పైపు కాల్చుకుంటూ వాటన్నిటినీ ఆ ముసలి చెట్లలో చూడగలను.

"నాకు ఇన్‌ట్యూట్యూటివ్ నాలెడ్జ్ ఉంది. పూలమొక్క లంటారా? నో... ఫెమినైన్," అని అప్పుడప్పుడు విజిటర్స్‌కి బంగళా ఆవరణలో ఉన్న పెద్దపెద్ద చెట్లని చూపిస్తూ చెబుతుంటాడు.

పైపు- పోయెట్రీ- విస్కీ- సోడా అతనికి ఇష్టం. విక్టర్ హ్యూగో అభిమాని. అతనికున్న వ్యసనం ఒక్కటే! వేట- ముఖ్యంగా డక్ షూటింగ్. 'గ్రీనర్స్' డబుల్ బేరల్

షాట్‌గన్ భుజానికి తగిలించుకొని హంటింగ్ సూట్‌లో బంగళా మెట్లు దిగాడు. గదిలో నౌకరు లైటు ఆర్పేశాడు. చుట్టూ చీకటి- ఎటు చూసినా చీకటి. తొలిసంధ్య ముందు విస్తరించుకునే చిక్కని చీకటి. దూరంగా కొండల్లో నుంచి వచ్చిన గాలుల్లో ఊపిరి పోసుకుంటున్న చీకటి.

ఆవరణలో ముసలి మఱ్ఱిచెట్టు మీద రాబందుల రెక్కల చప్పుడు.

'అగ్లీ- బట్ గ్రేస్‌ఫుల్ బర్డ్- విశాలమైన రెక్కలు. గూని నడకలో హుందాతనం,' పొయెటిక్‌గా నెమరు వేసుకుంటూ సన్నగా ఈలలు వేశాడు. భౌ! భౌ!- యజమాని ఈలకి రిట్రీవర్ డాగ్ పరుగెత్తు కుంటూ వచ్చి కాళ్ళ దగ్గర మూలుగుతూ, కాళ్ళ చుట్టూ తిరుగుతోంది. "కమాన్- కమాన్ లెటజ్ గో," అని దాన్ని నిమిరాడు. ఉండుండి చలికి ఒళ్ళు దులపరించుకుంటోంది.

యజమాని, కుక్క వేటకి బయలుదేరారు. యజమాని తుపాకీతో వేటాడిన బాతుల్ని ఈదుకుంటూ నీట్లో నుంచి ఒడ్డుకి తెస్తుంది- హంటింగ్ డాగ్. దాని పేరు సీజర్.

చీకట్లో ఇద్దరూ నడుస్తున్నారు. పొలాల్నీ తాటితోపుల్నీ దాటుకుంటూ కాలవగట్టు ఎక్కారు. కాలువగట్టు మీద రెండు నీడలు నడుస్తున్నట్లున్నాయి. గట్టు దిగి మొగలి పెండెల్లో నుంచి 'తంపర' వైపు నడుస్తున్నారు. తంపర, తామర తీగలతోనూ, నాచుతోనూ, తుంగ గుబుర్లతోనూ, బురదతోనూ సుదీర్ఘంగా వ్యాపించిన సరస్సులా ఉంటుంది. బురద గుమ్ములు ఎక్కువ. నీటి లోతు మెడ దాటదు. అక్కడ నావల్ని గెడలతో తోస్తూ చేపలవేట చేస్తారు. నీటిపిట్టల జాతితో తంపర కార్తీకమాసంలో కిలకిలలాడుతుంటుంది. బాతులు మందలు మందలుగా విదేశాల నుంచి వలస వచ్చి దిగుతుంటాయి.

వర్మ, చలిలో హంటింగ్ సూట్‌లో వెచ్చగా వణుకుతున్నాడు. సీజర్ చలికి తుమ్ము తున్నప్పుడల్లా చీకట్లో తన మిలిటరీ చూపుల్తో మందలిస్తున్నాడు. చీకట్లో సహితం యజమాని కదలికల్నీ, చూపుల్నీ తీక్షణంగానూ, నిశితంగానూ పసిగట్టే అనుభవం గల వేటకుక్క సీజర్.

ఇద్దరూ నడుస్తున్నారు. పొలాల్లో నక్కల మంద ఊళలు వేస్తోంది. ఎండ్రపీతల్ని పంట పొలాల్లో నక్కలు వేటాడుతున్నాయి. తంపర దగ్గరౌతోంది. చలిలో మంచు కూడా కలిసింది. ఉండుండి మొగలి డొంకల్లో నుంచి గాలి తెరలు రివ్వున వీస్తున్నాయి.

నిశ్శబ్దం...

"క్రాంక్- క్రాంక్," ఆకాశం మీద రెండు అరుపులు. వర్మ ఆగి ఆకాశంవైపు చూశాడు. కుక్క కూడా ఆకాశం వైపు చూసి మూలిగింది. ఆ అర్థం దాని యజమానికి మాత్రమే తెలుసు. నక్షత్రాలు పరుచుకున్న నల్లటి ఆకాశం మీద చాలా ఎత్తున పాలపుంతని దాటుకుంటూ బాతుల మంద ఎగురుకుంటూ పోతోంది. "క్రాంక్," మళ్ళీ మరో బాతు బొంగురు అరుపు. చుక్కల వెలుగులో నల్లటి బాతుల మంద. వాటి రెక్కల చప్పుడు స్పష్టాస్పష్టంగా రంయ్‌మని గాలితెర వీస్తూ పోయినట్లు వినబడుతోంది. తంపర్లో దిగుతాయి.

చీకట్లో మాటులోకి చేరుకోవాలి- గబగబా మళ్ళీ నడక ప్రారంభించారు.

*

చీకటి...

పిట్టల వేటకి బయలుదేరాడు నక్కలోడు.

వాడి పేరు డిబిరిగాడు. చేతిలో నాటు తుపాకీ. భుజానికి తగిలించిన పాత మురికి కాకీ సంచి. పిట్టల వలతో చీకట్లో తంపరవైపు నడుస్తున్నాడు. ఎడమ చంకలో యజమానితో వేటకి

బయలుదేరిన పెంపుడు కొంగ కూడా ఉంది. పెద్ద జాతి కొంగ- నత్తగొట్టు. దాన్ని చంకలో అదిమి పట్టుకొనున్నాడు.

డిబిరిగాడి నివాసం పోలీసుస్టేషన్ దగ్గర మైదానంలో మఱ్ఱిచెట్టు. దానికి కట్టిన తారు గుడ్డ కిందే రాత్రి పడుకుంటాడు. ఒక్క డిబిరిగాడే కాదు, సంచార జాతోళ్ళు అంతా అలానే ఉంటారు. రోజూ సాయంకాలం పోలీసు స్టేషన్‌లో హాజరు వేయించుకోవాలి. రాత్రి ఎప్పుడు పిలిచినా హాజరు కావాలి. చెట్ల కింద పడుకుంటారు. పగటిపూట పూసలూ, పిన్నులూ, ఎఱ్ఱ పూసలదండలూ, చర్మాలూ రోడ్డు పక్కన అమ్ముకుంటుంటారు. చీకటి పడిన తర్వాత ఇంత ఉడకబెట్టుకు తిని పోలీసుల్ని బ్రతిమిలాడుకొని వేటకి బయలుదేరుతారు. వేటాడిన చెవుల పిల్లుల్నీ, నక్కల్నీ, వలలో పడిన పావురాల్నీ, కొంగల్నీ, కౌజుపిట్టల్నీ ఉదయాన్ని ఊర్లో అమ్ముతారు. వాళ్ళే చర్మం ఒలిచి, వెంట్రుకలు దూసి అమ్ముతారు. పోలీసులకి కూడా పిట్ట మాంసం చేసి ఇస్తుంటారు. అయినా ఊర్లో ఎక్కడ దొంగతనం జరిగినా వాళ్ళను అనుమానం మీద పోలీసు స్టేషన్‌కి లాక్కెళ్తుంటారు. నక్క మాంసాన్నీ, పిల్లుల్నీ కాల్చుకు తింటూ వాటి చర్మాల్ని అమ్ము కుంటారు. అందుకే వాళ్ళని- 'నక్కలోళ్ళ'ని పిలుస్తారు. 'నత్తగొట్టోళ్ళు' అనీ, 'పూసలోళ్ళ'నీ కూడా పిలుస్తారు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పేరున పిలుస్తారు.

డిబిరిగాడి దగ్గర పెంపుడు కొంగ ఎప్పుడూ పక్కనే ఉంటుంది. ఊర్లో ఫుట్‌పాత్ మీద పూసలు అమ్ముతున్నప్పుడు కూడా వాడి పక్కనే మేసుకొంటూ ఉంటుంది. నత్తగుల్లల్నీ, చిన్న చేపల్నీ దానికి మేపుతుంటాడు. అది ఎగిరిపోదు. బాగా మచ్చికయిపోయింది. ఆకలిగా ఉంటే నేల మీద ముక్కుతో పొడుస్తూ డిబిరిగాడి వైపు గుడ్డిగా చూస్తూంటుంది. నడుస్తున్నప్పుడు ఎప్పుడూ చంకలోనే దాన్ని పట్టుకొని తిప్పుతుంటాడు.

డిబిరిగాడు నడుచుకుంటూ ఊరవతలికి వచ్చాడు. దూరంగా పోలీసుస్టేషన్‌లో లైటు మసగ్గా కనిపిస్తోంది. ఊర్లో అప్పుడప్పుడు కుక్కల అరుపులు. డిబిరిగాడికి గోచీ తప్ప ఒంటి మీద మరేమీ లేదు. వయసు అరవై దాటి ఉండొచ్చు. సిగ ముడి, కణితి మీద కాల్చిన మచ్చ, చెవి రింగుల బరువుకి సాగి వేలాడుతున్న చెవి తమ్మెలు, చేతి మీద పులి పచ్చబొట్టు, సరైన తిండి లేక ముడుచుకొనిపోయిన కండలు, జ్ఞానం తెలిసినప్పటి నుంచీ పోలీసుస్టేషన్లో తిన్న లాఠీదెబ్బలతో కదుంకట్టి గట్టి పడిపోయున్నాయి. వాడి శరీరం ఎండావానలకి, చలిగాలులకి, ఆరుబయట జీవితానికి బాగా అలవాటుపడిపోయింది. వాడొక్కడే కాదు, ఆ సంచార జాతులన్నీ యిలానే జీవిస్తుంటాయి. ఈరోజు యీ ఊరు, మరోరోజు మరో ఊరు. తల్లి ఒక ఊరిలోను, తాత పాముకాటుకి మరో ఊరిలోను, తండ్రి దిక్కుమాలిన చావు మరో దగ్గర- అలా వారి చావులూ బ్రతుకులూ దిక్కుమాలినవే! అడివిలో సంచరించే జంతువుల్లా జనారణ్యంలో సంచరిస్తూ ఎక్కడో, ఎప్పుడో అనామకులుగా రాలిపోతారు. అనుభవిస్తున్నది దరిద్రమని వాళ్ళకి తెలియదు. వాళ్ళ శరీరంలాగే వాళ్ళ జీవితాలు కూడా దరిద్రానికి అలవాటు పడిపోయాయి.

చీకట్లో నల్లటి తాటి తోపుల్లో నుంచి ఊరవతల శ్మశానం దాటుతున్నాడు. అక్కడ దేవు లాడుతున్న నక్క డిబిరిగాడి అలికిడి విని పొదల్లో నుంచి పారిపోయింది. చీకట్లో చలిగాలి డిబిరి గాడి మోటు శరీరాన్ని గరుకుగా తాకుతోంది. చంకలో కొంగ గింజుకుంటుంటే, "ఛూ- నీయమ్మ," అని ఒక చరుపు చరిచాడు. చీకట్లో అది కేరుమని అరిచింది.

పొద్దెక్కడానికి ఇంకా చాలా టైముంది. డిబిరిగాడు తంపరవైపు నడుస్తున్నాడు. చీకట్లో వల పన్నాలి. సంచీలో నుంచి నాటుసారా సీసా తీసి డగ్‌డగ్‌మని గుటకలేస్తూ సగం తాగి

మూత బిగించాడు. ఒళ్ళు వేడెక్కింది. బీడీ వెలిగించాడు. అడ్డ దారిన చెరువు గట్టు మీద ఏపుగా ఎదిగిన నల్లటి చెట్ల మధ్య నుంచి బరువెక్కిన చిక్కటి నీడలా గబగబా నడుచుకుంటూ వెళు తున్నాడు. తంపర గాలి రివ్వున వీస్తోంది. గాలిలో తామరాకుల వాసనకి డిబిరిగాడి చేతిలోని కొంగ కూడా చీకట్లో నుంచి గుడ్డిగా తంపరవైపు చూస్తూ మెడ నిక్కించి రెక్కలు సర్దుకుంటోంది.

డిబిరిగాడు తంపర దగ్గరౌతున్న కొద్దీ మరింత వేగంగా నడుస్తున్నాడు.

*

నీలాకాశం చీకటితో స్నానం చేసినట్లు స్వచ్ఛంగా ఉంది.

చుక్కలు అక్కడక్కడ చలిలో వణుకుతున్నాయి.

తంపర ఒడ్డున మొగలి డొంకల మధ్యలో, ముందే ఏర్పరిచిన అరప మీద కెప్టెన్ వర్మ, సీజర్ కూర్చున్నారు. తూటాలు నిండిన జోడుగుళ్ళ తుపాకీ పక్కన ఉంది. మొగలి పొదల్లో నుంచి అరప మీద కూర్చున్న వర్మకి విశాలంగా పరుచుకున్న తంపర చీకట్లో మసగ్గా కనిపిస్తోంది. ఆవలి వైపు సరుగుడు తోటల్లో నుంచి గాలులు వీస్తున్నాయి. తంపర మీద నిశ్శబ్దం ఆవరించుకొనుంది. వర్మ ఆకాశంవైపు, నీటివైపు కళ్ళు పొడుచుకు చూస్తున్నాడు. చీకటి మరింత చిక్కగా పేరుకొంటోంది. సీజర్ చలికి వర్మకి మరింత దగ్గరగా తోసుకుంటూ వెచ్చగా ముడుచుకొంటోంది.

దూరంగా నీటిలో తుంగ గడ్డి గుబుర్లలో ఏదో కదులుతున్నట్లు అనిపించింది. వర్మ పరికించి చూస్తున్నాడు. నల్లటి గుబుర్ల మధ్యలో ఏదో దీపం కదులుతున్నట్లుంది. గడ్డిలో వెలుగు ఉండుండి కనిపిస్తూ మళ్ళీ కనుమరుగౌతోంది.

అలా చూస్తున్న వర్మకి రివ్వున శబ్దం వినిపించింది. చెట్లలో నుంచి వీస్తున్న గాలిలా లేదు. ఆకాశం మీద నుంచి దిగుతున్న మెత్తని గాలిలా ఉంది. బాతుల మంద తంపర్లో దిగబో తోంది. చుక్కల కాంతిలో బాతుల మంద మరింత స్పష్టంగా కనిపిస్తోంది. 'క్యాంక్'- మందలోని బాతు సన్నగా అరిచింది. ఆ అరుపుకి సమాధానంగా వర్మ కూర్చున్న అరపకి కాస్త దూరంలో తంపర్లో నుంచి బాతులు, 'క్యాక్, క్యాంక్... బాక్'మని అరుస్తున్నాయి. వాటి అరుపులతో అంత వరకు ఆవరించుకున్న నిశ్శబ్దం చిట్లిపోతోంది. బాతుల మంద బాగా కిందికి దిగి నీటి మీద వాలడానికి చక్కర్లు కొడుతున్నాయి. అలా రెండు మూడు రౌండ్లు కొట్టి నీటిలో దిగడానికి రంయ్ మంటూ వర్మ కూర్చున్న అరప దాటుతుండగా... అరప మీద నుంచి చీకట్లో రెండు మెరుపులు ధన్... ధన్... రైట్ అండ్ లెఫ్ట్ బేరల్సులో నుంచి తుపాకీ నిప్పులు కక్కింది. ఆ శబ్దం క్షణంసేపు నీటి మీద ప్రతిధ్వనించి నీరసిస్తూ దూరమైపోతూ గాలి హోరులో కలిసిపోయింది. ధప్- ధప్- ధప్-మని మంటిముద్దల్లా చచ్చిన బాతులు, మందలో నుంచి తెగి నీట్లో పడ్డాయి. గింగురులు తిరుగుతూ రెక్కలు కొట్టుకుంటూ దెబ్బతిన్న బాతులు నీటిలో పడి చీకట్లో ఎగరలేక కొట్టుకుంటు న్నాయి. కార్డయిట్ పొగలేని వాసన గాలిలో తేలుతోంది. ఒడ్డున కప్పలు టపటపమని నీట్లో గెంతేసి ఈదుకుంటూ దాక్కుంటున్నాయి.

సీజర్ మెరుపు వేగంతో తుపాకీ పేలీ పేలగానే అరప దూకి చీకట్లో దూసుకుంటూ నీట్లో దిగింది. మోర పైకెత్తి వాసన పసిగడుతూ యీదుకుంటూ పడిన బాతుల్ని పట్టుకుని ఒడ్డుకి తెచ్చే ప్రయత్నంలో ఉంది. చీకట్లో నాచు తీగల్లో కుక్క చిక్కుకుంటుందేమోనని వర్మ అరప మీది నుంచి ఈలలు వేసి పిలిచేస్తున్నాడు. కుక్క కోసం ఆందోళనగా వుంది. నీట్లో కుక్క ఈదు కుంటూ డైవ్ చేస్తున్న చప్పుడు. అలా పావుగంట గడిచింది. చచ్చిన బాతుల్ని నోట కరుచుకుంటూ ఒడ్డు ఎక్కింది. చిన్న పరుగుతో అరప దగ్గరికి వచ్చి వాటిని పడేసి యజమానిని రమ్మన్నట్లు

ముద్దుగా మొరిగింది. ఆయాసపడిపోతూ తడిసిన ఒంటిని విదిలించుకుంటూ తుమ్ముతోంది. వర్మ అరప దిగి కుక్కని ఆప్యాయంగా నిమురుతూ అది తెచ్చిన బాతుల్ని పట్టుకున్నాడు. మూడు చచ్చిన బాతులు, మిగతావి నీటిలో బుడగేసి తప్పించుకున్నాయి.

బాతుల్ని సంచీలో పెట్టి భుజానికి తగిలించుకున్నాడు. తుపాకీలో ఖాళీ తూటాలు తీసి కొత్తవి పెట్టి రిలాక్సింగ్‌గా అగ్గిపుల్ల గీసి సిగరెట్టు వెలిగించాడు. ఆ తమకంలో వెనక నుంచి వస్తున్న పరద పిట్టల మందని గమనించలేదు. కుక్క రెస్ట్‌లెస్‌గా ఆకాశంవైపు చూస్తూ పరుగెత్తింది. వర్మ వెనక్కి తిరిగి తుపాకీ సర్దుకునే లోపల మొత్తం పరదల మంద రివ్వున వెనక్కి తిరిగి గాలిలా దూసుకుంటూ బెదురుగా అరుస్తూ పారిపోయింది. వర్మ తుపాకీ దించి కనీసం మూడు బాతులు పడినందుకు సంతోషంగా సిగరెట్టు కాల్చుకుంటూ కుక్కని వెంటేసుకుని తంపర గట్టుమీద నడుస్తున్నాడు. ఇంకా బాగా చీకటిగానే ఉంది. బాతులు దిగే సమయం మించిపోలేదు. ఇంకా ఛాన్సు ఉంది.

నీటిమీద పొగమంచు మెల్లమెల్లగా లేస్తోంది. దూరాన కొండల మీది నుంచి దిగిన మంచు కూడా గాలితో కలిసి ముసురుకొస్తోంది. చూస్తుండగానే అంతా తెల్లటి మంచుమయం. చీకటితో తడిసిన మంచు నడుస్తున్న వర్మని మెత్తగా రాసుకొంటూ చుట్టేస్తోంది. చలిలో ఒణుకుతున్నాడు.

దూరంగా తంపరగట్టు మీద మంచులోంచి ఏదో వెలుగు కనిపిస్తోంది. మంచులో తడుస్తూ వెలుగువైపు నడుస్తున్నాడు. అది చలిమంట. డిబిరిగాడు చలి కాగుతున్నాడు.

వర్మని దూరంలోనే చూసి లేచి నిలబడ్డాడు. మంట వెలుగులో డిబిరిగాడి ఆకారం పొగ మంచులో ఊగుతున్న నల్లటి నీడలా చీకట్లో కనిపిస్తోంది.

"దండాలు దొరా. ఇసక మంచు. ఒళ్ళు కొంచెం ఏడెక్కనీ. కూకో," అని గోచీ గట్టిగా బిగించుకొని కూర్చున్నాడు.

అపరిచితుడు, అందులోనూ అనాగరికుడు. తనని అలా పలకరించడం ఇష్టంలేక పోయినా బాగా చలిగా ఉంది. ఉదయాన్నే మరోసారి డక్ షూటింగ్ అవకాశం కూడా వుంది. అయిష్టంగా కూర్చున్నాడు.

డిబిరిగాడు వర్మని పెద్దగా పట్టనట్లు వాడి మానాన వాడు చలి కాచుకుంటున్నాడు. చేతులు మంటల మీద పెట్టి రాసుకుంటున్నాడు. ఉండుండి మోకాలి మీద అరిచేత్తో కొట్టుకొని రుద్దుకొంటున్నాడు. పక్కనే ఉన్న లాంతరు ఒత్తి బాగా దించేశాడు. కిరసనాయిలు ఎంతుందో ఊపి చూశాడు. అలా చాలాసేపు వాళ్ళిద్దరూ మాట్లాడుకోలేదు.

వర్మకి డిబిరిగాడు చాలా విచిత్రంగా కనిపించాడు. పొట్టీ కాదు, అంత పొడవూ కాదు. ముదురుతున్న వయస్సుతో శరీరం చిక్కినా, ఒడిలిపోలేదు. చీపి కళ్ళు మాత్రం అడవి జంతువు కళ్ళలా తీక్షణంగానూ, పరిశీలనగానూ కదులుతున్నాయి. ముఖంలో ఫ్లూయిడ్ ఎక్స్‌ప్రెషన్. మంట వెలుగులో అప్పుడప్పుడు వాడి జిడ్డు తేరిన చెక్కిళ్ళు ఎగిరిపడుతున్నాయి.

తుంగ గడ్డి గుబుర్లు, గాలి వీచినపుడల్లా బుడగలు కక్కుతూన్న జుంయ్‌మనే ధ్వని. వర్మ ఏమీ తోచక డిబిరిగాడిని మాటల్లోకి దించాడు.

"నీది ఏ ఊరు?"

"ఊఁ?" అని తంపర మీదికి పరధ్యానంగా చూశాడు. దూరంగా ఏదో గచ్చకాయలు గుటక వేస్తున్నట్టు పెద్ద పక్షి చప్పుడు చేసింది.

"గూడబాతు. చేపల్ని గాగలో గొగళిస్తోంది," అన్నాడు డిబిరిగాడు. ఠపఠపమని పెద్ద రెక్కలతో నీళ్ళ మీద కొట్టుకొంటూ ఎగిరిపోయి దూరంగా జమ్ము దుబ్బుల్లో వాలింది.

''పెలికన్!'' అన్నాడు వర్మ.

''ఊఁ...'' అని వర్మ అంతకు ముందు వేసిన ప్రశ్నకి సమాధానంగా, ''నక్కలోణ్ణి,'' అన్నాడు.

''ఏ ఊరు?''

''అన్ని ఊళ్ళూ తిరుగుతుంటాం. ఎక్కడుంటే అదే మా ఊరు. ఈ భూమంతా మాదే,'' అని ముడుకుల మీద చలికి చరుచుకుంటూ వర్మవైపు చూడకుండానే పకపక నవ్వి తుంచేసినట్టు ఆపేశాడు- నిశ్శబ్దం.

ఆ నవ్వు ఆనందంగానూ లేదు- వెకిలిగానూ లేదు- అదోలా అనిర్వచనీయంగా ఇన్‌కొహెరెంట్‌గా వుంది.

''ఇక్కడ ఈ రాత్రప్పుడు ఏం చేస్తున్నావు?''

''ఏటకి వచ్చాను. లాంతరు నెత్తి నెట్టుకొని నీటిలో బురదలో, తుంగల్లో, నాచులో చాలా సేపు తిరిగాను.''

''లాంతరా!'' ఆశ్చర్యంగా అడిగాడు వర్మ. డిబిరిగాడు కూడా వర్మవైపు ఆశ్చర్యంగా చూశాడు.

''దీపం ఎలుతుర్లో ఏట దొరా! లాంతరు లైటుకి పిట్టలు ఎగిరొచ్చి వాల్తాయి. మచ్చల పిట్టలు. రెక్కలమీద, వీపు మీద చుక్కలుంటాయి. ఆ జాతి పిట్టలు ఇక్కడివి కావు. చలికి ఎక్కడి నుంచో ఎగురుకొస్తాయట. ఈ ఏడు ఇక్కడ దిగుతున్నాయి. నిన్ననే చూశాను. ఈరోజు లాంతరు తెచ్చాను. చీకట్లో నేను కనిపించను. నీట్లోనే ఉంటాను. నా బుర్ర మీద లాంతరు మాత్రం కనిపిస్తుంది. లాంతరు దగ్గర వాలగానే కింది నుంచి నీట్లో నుంచి గబుక్కున లాగేయాలి. పక్క పిట్ట కూడా పోల్చుకోకూడదు. ఈ ఏటకి మంచి చేతివాటం కావాలి- ఈ ఏటను చిన్నప్పుడు మా బాబు దగ్గర నేర్చుకున్నాను- కాళ్ళని, రెక్కల్ని, పీకని ఒకేసారి చప్పుడు కాకుండా పట్టుకుని నీళ్ళ కిందికి లాగేసి బుట్టలో దూర్చేయాలి.''

''పిట్టలు దొరికాయా?''

''రెండు మూడు దీపం ఎలుతుర్లో చెక్కర్లు కొట్టాయి. నా చెంపకి కూడా వాటి రెక్కలు రాసుకెళ్ళాయి. చారల పిట్టలు దొరుకుతాయని సంతోషపడిపోయాను. కాని...''

''కానీ?''

''కానీ... నువ్వు దూరంగా జోడు నల్లీల తుపాకి పేల్చావు. ఆ శబ్దానికి అవి పారిపోయాయి. మరి దిగవు!'' అని అర్థంకాని నవ్వు మళ్ళీ నవ్వాడు. కళ్ళలో మాత్రం నీ ఏటతో నా ఏటకి దెబ్బకొట్టేశావనే నిస్పృహ వర్మకి కనిపించినట్టయింది. చీకట్లో అరప మీద నుంచి తుంగ గుబుర్లో కనిపించిన వెలుగు డిబిరిగాడి లాంతరని ఇపుడర్థమయింది. కొంచెం గిల్టీగా మనస్సు చివుక్కుమంది. తల దించుకొని పక్కనున్న ఎండుటాకుల్ని అప్రయత్నంగా ఆరిపోతున్న మంటల్లోకి వేస్తున్నాడు. మళ్ళీ నిశ్శబ్దం. మంటల్లో ఆకులు చిట్లుతున్నాయి. 'నువ్వు వేట చేస్తున్న సంగతి తెలీదు... అయామ్ సారీ,' అని చెబుదామనుకుని తల పైకెత్తాడు.

డిబిరిగాడు సంచీలో నుంచి నాటుసారా సీసా తీసి గడగడ తాగేస్తుంటే వాడి గొంతు ముడి కిందికీ పైకీ కొట్టుకోడం ఎగిసిన ఆకుల మంట వెలుగులో కనిపిస్తోంది. సీసా దించి తుపుక్కున ఉమ్మి చేత్తో మూతిని రాసుకున్నాడు. ముఖం మీద కండరాలు ఎరుపెక్కి వణుకుతున్నాయి. కణతల కింద నరం చూస్తుండగనే ఉబ్బెక్కింది.

గట్టిగా ఒగిర్చాడు. ఊపిరి భారంగా పీలుస్తున్నాడు. ఆకాశం వైపు చూస్తున్నాడు. శుక్రుడు ఉదయించాడు. మరో చంద్రుడిలా, నక్షత్రం కాంతి చిమ్ముతోంది. శుక్రుడులోనించి ఉండుండి రంగులు మారుతున్నాయి. ఆకాశం కొత్త కాంతిని సంతరించుకొంటోంది.

డిబిరిగాడు తదేక ధ్యానంతో ఆ నక్షత్రాన్ని చూస్తున్నాడు. ముఖం విచిత్రానుభూతితో కాంతివంతమౌతోంది. ఈమాటు పెదాల మీద నవ్వు అస్పష్టంగా లేదు. సారా నిషాలో మత్తెక్కిన ఎర్రటి కన్నుల్లో కామం పొంగులు కక్కుతోంది.

ఒక్కసారి వేట సంగతి మర్చిపోయినట్లు మాట తుంచేసి గతంలోకి గంతేసినట్లు, “దొరా... అటు సూడు... ఆ చుక్క... రంగులు మారుస్తోంది. రంకు చుక్క!” అని కట్ట తెంచుకున్న ఉద్వేగంతో ఆ చీకట్లో కంగున అరిచాడు- ఎగూపిరి- ఆనందం- అవధులు దాటుతున్న మదపిచ్చి నవ్వు. “ఆ చుక్కని చూస్తే ఆడదానికీ, అడివిలో పులికీ దూలెక్కిపోద్ది. కత్తిలాంటి కసి దీని యమ్మ...”

“లస్కి లపక్... లస్కి లపక్! ఆహ్వా! ఆహ్వా!” అని గెంతుతున్నాడు. “ఝూ... ఝుంయ్... లపీకరిఝూ... లపికరి... లపికరి,” ఎగురుతున్నాడు.

“లఫాకిలపధన్... లఫాకిలపధన్...డ్రు... డ్రు... చడిక్...చడిక్!” అని ఆంబోతులా బుసలు కొడుతున్నాడు. మంట వెలుగులో చెవి రింగులు ఉండుండి తళుక్కుమంటున్నాయి. అదేదో భాషలో అరుచుకుంటూ, గొణుక్కుంటూ పిక్కల్నీ తొడల్నీ చరుచుకుంటూ కసికసిగా నవ్వుకుంటూ భూమ్మీద పడి ముడుచుకొని మంట చుట్టూ దొర్లుతున్నాడు. వాడి వింత చేష్టలకి వింత అరుపులకి వంత పాడుతున్నట్లు సీజర్ కూడా అరుపు లంకించుకుంది. కుక్క అరుపుకి డిబిరిగాడు లేచి నించున్నాడు. తడిసిన గుఱ్ఱంలా ఒళ్ళు విదిలించుకుని, అడుగులు తడబడుతూ, మెల్లగా తూలుకుంటూ నాటుసారా కంపు కొడుతూ దగ్గరగా వచ్చి వర్మ రెండు జబ్బలూ పట్టుకొని సరదాగా ఊపాడు. మందు ఎక్కువైపోయిందనుకున్నాడు మనస్సులో వర్మ.

“రెండు సీసాకాయిల్ని ఎత్తీగలను. కొంచెం వేడెక్కింది, అంతే,” అని వర్మ మనస్సులోని ఉద్దేశాన్ని క్షణంలో పసిగట్టినట్లు అన్నాడు.

“ఆ చుక్కని చూస్తుంటే గుర్తుకొచ్చింది... లంజి కూతురు... ఏం ఫిటింగు దొరా...” అని వర్మ వైపు బూతుగా చూసి కన్నుకొట్టాడు.

“నీ పెళ్ళామా?”

“ఊహు... నేను... ఉంచుకున్నాను. ఛత్- ఛత్- కాదు, అదే నన్ను ఉంచుకుంది. మా జాతిది కాదు. అది పెద్ద జాతిదంట. సంచారి తెగదే. మొగుడొదిలేసింది. సోది చెప్పుకుంటూ ఊర్లంట తిరుగుతుండేది. నా పక్క చెట్టు కిందే ఒండుకునేది. మాకు మెల్లగా ఇలాకా కుదిరింది. తగులుకున్నాం. అప్పటినుంచీ సచ్చిందాకా ఇద్దరం కలిసే ఊర్లు తిరిగాం. పగలంతా సోది చెప్పి గుంట నాకొడుకులికి, ‘పెట్ట మందు’ అమ్మి చాలా బియ్యం, డబ్బులు తెచ్చేది. నేను ఏట చేసి పిట్టల్ని, ఉడత చర్మాల్ని అమ్మి ఇంతో కొంతో తెచ్చేవోణ్ణి. రాత్రి కాగానే పూటుగా తాగి పిట్టమాంసం తిని చెట్టుకింద కౌగలించుకు పడుకుండేవోళ్ళం. తింగరి లంజ- ఒకొక్కసారి కస్సుబుస్సుమనేది. ఒకరోజు అడిగాను కదా నువ్వు అమ్ముతున్న ‘పెట్టమందు’ ఏంటీ అని. చెప్పాను కదు సారూ- తింగరిది- పొగరుమోద్ది. అబద్ధమాడదు. నిజం చెప్పదు. ఆ గుండని ఏ ఆడదాని మీద జల్లితే అది ఫిటింగులో పడిపోద్దట దొరా. అదేదో నాకు నమ్మకం కుదరలేదు. ఒకరోజు దానికి తెలీకుండానే దాని బుట్టలోంచి గుండ తీసి దానిమీదే జల్లినా. అంతే దొరా. మంచి ఎన్నెల కాస్తోంది.

అర్ధరాత్రి. ఎండాకాలం. తాగేసి పడుకున్నాం. ఆ మగతలో ఏదో నీడ కదిలినట్లయింది. ఇంకేటి, అది నా పక్కన లేదు. ఎదురుగా నిల్చోనుంది. ఒంటి మీద గుడ్డలేదు. ఎన్నెట్లో దాని సంకా, సన్నూ పిటపిట లాడిపోతున్నాయి. అది కూడా తాగేసుందేమో! అది ఊపిరి తీస్తుంటే దాని బొడ్డూ, తొడలూ ఎగురుతున్నాయి. ఉండలేకపోయాను దొరా! నాకు ఎర్రెత్తిపోయింది. నేను కూడా గుడ్డలు ఊడదీసి ఇసిరి పారేసి అమాంతంగా దాని మీద పడి పట్టుకోబోయాను...

'లంజకొడకా!' అంటూ- అసలే తింగరి లంజ- తన్నరాని చోట తన్నేసింది. 'అమ్మో' అని నొప్పితో కిరకిర లాడుతూ తొడల మద్దిన పట్టుకొని గింజుకుపోతూ దాని చుట్టూ గెంతాను. 'నక్క లంజికొడకా, నా మందు నాకే పెడ్తావురా పిచ్చి లంజికొడకా... ఆ మందుకి నాకు దూలెక్కిందను కుంటున్నావా? కాకుల్ని చంపి, దాని పీకా కాళ్ళు కోసేసి ఈకలు దూసేసి పావురాలు బొచ్చు అంటించేసి, పావురాలని అమ్మేస్తుంటే జనం కొనీయడం లేదురా? అలాగే నా మందూనూ. నక్కల నా కొడకా; నువ్వెంత మాయ లంజకొడుకువో- మొగుడొదిలేసిన్దాన్ని మరి నేనెంత కేటు లంజనో; పోల్చుకోలేకపోయావురా! నా మందుకి నాకే దురదెక్కి గుడ్డలిప్పేసా ననుకుంటు న్నావ్. కాదురా, నా కొడకా- అటు చూడు- ఆ చుక్కని చూడు. అది మారుస్తున్న రంగులు చూడు,' అంటూ మీది నుంచి కింది దాకా దాని ఒళ్ళంతా వెన్నెల్లో ఆ చుక్క మెరుపులో చూపిస్తూ ముందు కొచ్చింది. నాకు కసెక్కిపోయింది. అమాంతంగా దాని జుత్తు పట్టుకొని దాని కళ్ళల్లోకి చూశాను. ఎరుపెక్కిన కళ్ళు ఆ చుక్క వెలుగులో మరింత ఎర్రగా పొంగిపోతున్నాయి. కైపెక్కిన గాడిదలా దాన్ని ఒక్క తన్ను తన్నాను. 'అమ్మ లంజకొడకా,' అని నక్కలా మీద పడి భుజం కొరి కేసింది. దాన్ని జుత్తు పట్టుకొని భూమ్మీద గొరగొర ఈడ్చుకుంటూ తన్నుకుంటూ చెట్టు దగ్గరకి ఈడ్చు కొచ్చాను. అలా చాలాసేపు తన్నుకున్నాం. కొట్టుకున్నాం. కొరుక్కున్నాం. కుమ్ములాడుకున్నాం. తరువాత దొరా! అప్పుడందుకొంది మజా! ఫిటింగులో దిగిపోయాం. ఫిటింగ్... లంజికి ఫిటింగులో కూడా తింగరితనమే. మామూలు ఫిటింగ్ కాదు దొరా. ఓహ్! దానిది గొప్ప పొగరు మోతు ఫిటింగ్!- లంజ మీదికి ఎక్కిపోయి ఛపక్ ఛపక్మని పెట్టని పుంజెక్కి కుమ్మేసినట్లు కుమ్మేసింది. గస్కీ మీద గస్కీ... గస్కీ... గొప్ప ఫిటింగ్ దొరా! అదీ, ఆ చుక్కలోని మజా,'' అని చీకట్లో చెయ్యి జాపుతూ సుదూరంగా ఆకాశంలో తళుక్కుమంటున్న శుక్ర నక్షత్రాన్ని చూపించాడు. డిబిరిగాడు అలా చెబుతున్నంతసేపూ ఒంటి మీద తెలివిలేనట్లుగా పూనకంలో ఉన్నట్లు చెప్పుకుపోయాడు.

''సంవత్సరం తిరక్కుండానే ఎర్రి నక్క కరిచేసింది. నక్కలాగా అరిచి అరిచి చెట్టు కింద సచ్చిపోయింది,'' అని చీకట్లోకి చూస్తూ చెబుతున్నప్పుడు ఏదో బాధని గుటకేస్తూ చెబుతున్నట్లని పించింది.

నిశ్శబ్దం. ''దాని జాతోళ్ళుగాని, మా జాతోళ్ళుగాని రాలేదు దొరా- నేనే దాని శవాన్ని భుజాని కెత్తుకెళ్ళాను. దాని నోట్లోంచి సొంగలు కారుతున్నాయి. ఊరవతల చెరువుగట్టు కింద గొయ్యి తవ్వి దాన్ని నా చేతుల్తోనే కప్పెట్టేశాను... లంజి కూతురు...!

''ఆ రాత్రి చెట్టుకింద దాని బుట్ట ఎదికాను. సవరాలు, ఫిట్టింగ్ మందు పొట్లాలు, పాత చీరలు అవే మిగిలిపోయాయి. అది నన్నొదిలీసి ఎలిపోయింది...'' అని అప్రయత్నంగా అది చేతి మీద పొడిచిన పులి పచ్చబొట్టుని చేత్తో రాసుకుంటూ చీకట్లోకి చూస్తూ చెబుతున్నాడు. ''అలా కునుకు పట్టేసింది. నిద్దట్లో పక్కని చెయ్యేసా- ఎపుడూ బరువుగా తగిలేది. ఇపుడు నేదు. ఆ జాగా ఖాళీ చేసి వెళిపోయింది. చెరువు గట్టు దగ్గర దూరంగా పెద్ద నక్క అరిచింది. అరుపు.

గతుక్కుమనిపోయాను... కంగారెత్తిపోయాను. నా ఆడదాని పీనుగుని, ఇన్నాళ్ళు నా పక్కన తొంగున్నదాన్ని గోతిలో నుంచి నక్కలు లాగేస్తున్నాయేమో... పీక్కుతింటున్నాయేమో!!

"తుపాకీ పట్టుకొని తుప్పల్నీ, డొంకల్ని దాటుకుంటూ, ఆ చీకట్లో పరుగెత్తుకుంటూ చెరువుగట్టు దగ్గరికి పరుగెత్తాను. దాని గోతి దగ్గర నక్కలు చీకట్లో కాట్లాడుకుంటున్నాయి. నా అలికిడి ఇని పారిపోయాయి.

"అప్పటికే గొయ్యి సగం తవ్వేశాయి. గోతిలోంచి దాని చెయ్యి నిటారుగా బయటకు తన్నుకొచ్చింది. చీకట్లో నన్ను పిలుస్తున్నట్లు అనిపించింది సారూ! దాని గోతి దగ్గరే గుండేసి కొట్టేసుకుని సచ్చిపోవాలనిపించింది...

"గొయ్యి చేతుల్తోనే తవ్వి మరింత పెద్దది చేసి, దాంట్లో దాని చెయ్యిని, శవాన్ని లోతుగా కుక్కాను. దాని ముఖం ఉబ్బిపోయింది. కుక్కుతున్నప్పుడు దాని ముక్కంట నోటంట నీళ్ళు బొళబొళమని తన్నుకొచ్చాయి... పసరు కంపు. అలా నా ఆడదాన్ని మళ్ళీ కప్పెట్టేశాను.

"తెల్లవార్లూ తుపాకీ పట్టుకొని గోతి కాడ కాపలా కాశాను.

"అప్పుడప్పుడు తుప్పల మధ్య నక్కల కళ్ళు మెరుస్తుండేవి.

"తెలతెలవారుతుందనగా దూరంగా దుమ్ములగొండు అరిచింది."

ఆ విషాదచరిత్ర వింటూ చుట్టూ చీకటి కూడా చచ్చుబడిపోయినట్లు అనిపించింది వర్మకి.

నిశ్శబ్దం...

డిబిరిగాడిది, వాడి జీవితంలానే భాష కూడా వేరు. సంచార జాతి. అన్ని ఏసలూ కలగా పులగం. అరవం, ఉరుదూ ముక్కలు, అక్కడక్కడ ఇంగ్లీష్ చమక్కులు వాడి జీవిత దర్పణంలా ప్రతిబింబిస్తున్నాయి. ఆ నిశ్శబ్దంలో డిబిరిగాడి మాటల్ని తనకి అర్థమయ్యే భాషలో అనువదించుకుని మనస్సుతో అర్థం చేసుకుంటున్నాడు వర్మ. భాషా సంకెళ్ళని తెంచుకొని రెండు మనస్సులు మాట్లాడుకొంటున్నాయి. కెప్టెన్ వర్మకి కళ్ళు చెమరుస్తున్నాయి. చీకట్లో నాచు మీద కొక్కొక్కొ అని ముసలి కొంగ దగ్గింది. డిబిరిగాడు చెవులు రిక్కించి విన్నాడు. "దీనియమ్మ వస్తానుండు దొరా!" అని నేల మీద నుంచి నీట్లోకి దిగుతున్న మొసలిలా గట్టు మీద నుంచి తూలుకుంటూ బురదలో జారుకుంటూ తుంపర్లో దిగిపోయి ఈదుకుంటూ చీకట్లో మాయమయ్యాడు.

మంచు బాగా కురుస్తోంది. నక్షత్రాలు మంచు పొగల్లో నుంచి ఒక్కొక్కటీ మసక బారి వెలవెలబోతూ నీరసించి రంగు మారుతున్న ఆకాశంలోకి ఇంకిపోతున్నాయి. దూరంగా వేగుచుక్క మాత్రం ఊగుతోంది.

నీళ్ళలో అలజడి.

కెప్టెన్ వర్మ ఒడ్డున మంటకి మరింత దగ్గరగా వచ్చాడు. డిబిరిగాడి సంచీ పక్కనే వాడి తుపాకీ కూడా ఉంది. నీడలో దాన్ని వర్మ ఇంతకుముందు గమనించలేదు. వేటగాడు వర్మ తుపాకీ చూడగానే ఉత్సాహంతో దాన్ని తీసి పరిశీలనగా చూశాడు. పాతబడిన నాటు తుపాకీ, అందులోనూ దట్టింపు తుపాకీ. వాడకంలో ఉండటంవల్ల బాగా పాతదైనా జంగు పట్టక పని చేస్తోంది. ఖాళీ తుపాకినీ సరదాగా భుజానికి ఆనించాడు. బాలెన్స్ సరిగా లేదు. సర్దుకుంటూ మంట వెలుగులో బేరల్ మీది నుంచి చీకటిలోకి గురి చూస్తూ విశాలమైన తంపర మీద గురి సారిస్తూ మెల్లగా తిప్పుతున్నాడు.

నీట్లో అలజడి. తుపాకి గురిలో నల్లటి నీడ నీట్లో నుంచి లేచింది. డిబిరిగాడు బురదలోంచి నాచును తొక్కుకుంటూ గట్టెక్కుతున్నాడు. వాడి భుజం మీద తడిసిన వల. చంకలో నత్తగొట్టు. చలిలో వణికిపోకుండా ఉన్నా గబగబా అంగలేసుకుంటూ వేడికి మంట దగ్గరికి

వచ్చి కూర్చున్నాడు. వలని పక్కన పెట్టి నత్తగొట్టుని దగ్గరే ఎత్తి పడేశాడు. అది పడిన దగ్గరే కదలకుండా మంట వేడిలోకి చెవిటి చూపులు చూస్తోంది. డిబిరిగాడు ఒంటి మీద కారుతున్న బురద నీటితో మంటలోకి దూరిపోతున్నట్లు కూర్చున్నాడు.

తుపాకీ చేత్తో పుచ్చుకునే జేబులోంచి సిగరెట్టు తీసి, 'ఇంద కాల్చు,'మని ఇచ్చాడు వర్మ. డిబిరిగాడు మంట మీది నుంచి పక్కకి వంగి కాలుతున్న కట్టెపుల్లతో సిగరెట్టు కాల్చుకున్నాడు. మంట వేడికి ముఖం చిట్లించుకుని పొగకి దగ్గుతున్నాడు.

''సారూ, అది మర్డరీ తుపాకీ...'' అని సిగరెట్టుని బీడీలా కాల్చుతూ అన్నాడు.

వర్మకి షాక్ కొట్టినట్లు అయింది. ఉలిక్కిపడి డిబిరిగాడికి అందించేశాడు.

''రెండు రోజుల్నుంచీ చూస్తున్నాను. ఇది బాగా బెదురెక్కిపోయింది. అరుపులో బెదురు. దీనియమ్మ దీనికేటొచ్చిందో అరవకుండా ఉండినా బాగుణ్ణు. గొంతులో సైతాన్ పట్టినట్లు దగ్గుతుంది. దీని అరుపు ఆలకించగానే ఆమడ దూరాన్నుంచే నత్తగొట్లు బెంబేలెత్తిపోయి దిగకుండా పారిపోతున్నాయి!''

దేన్ని గురించి ఈ విషయం మాట్లాడుతున్నాడో వర్మకి అర్థంకాక డిబిరిగాడి వైపు చూశాడు.

''ఇందాక దగ్గిందే, ముసలి దగ్గు. ఈ కొంగ లంజిదే. బెదురు కూత. ఈ అరుపు వింటే వచ్చిన పిట్ట కూడా రాదని వలనీ, దాన్నీ తెచ్చేశాను.

''ఈ నత్తగొట్టుని పెంచుతున్నావా?''

''నత్తగొట్లని పట్టడానికి పగలే వలెయ్యాలి. రాత్రిళ్ళు నత్తగొట్లు చెట్ల మీదుంటాయి. పగలు తంపర్లలోనూ, చెరువుల్లోనూ, ఒడ్లంటా, పొలాల్లోనూ దిగుతాయి. అక్కడే వలేసి, దీన్ని వల మీద పెట్టి ఉంచుతాం. దీన్ని చూసి అక్కడ కూడా మేతుందని అవి కూడా వచ్చి వల్లో చిక్కడిపోతాయి. గాని దీనియమ్మ దీని అరుపు మారిపోయింది. బెదురు... బెదురు...'' అని దభాలున దాన్ని ఒక్క బాదుబాదాడు. అది నోరు జాపి 'కేర్'మని బాధగా కసిగా అరిచింది. దాని నాలిక ఎఱ్ఱటి పేలికలా వెలుగులో మెరిసి మూసుకుపోయింది. ముక్కుతో భూమ్మీద పొడుస్తోంది.

''నత్తగొట్లు రాత్రిళ్ళురావు కదా; మరి రాత్రి వలేశావు?''

చేత్తో వారిస్తున్నట్లు మాటల్ని ఆపాడు. ముడుకులు మీద కొట్టుకున్నాడు.

''రాత్రంతా నా పక్కనే ఎందుకని వలేసి పెట్టాను. ఒక్కొక్కసారి దీని అరుపుకి తెల్లారిపోయిందనుకుని చుక్క వెలుగులో కొంగలు, నత్తగొట్లు, అరుపు వైపు ఎగురుకుంటూ దిగిపోతాయి. గానీ సాధారణంగా రావు.

''గాని, సారూ, తుంగ గుబుర్లలో గూళ్ళు కట్టుకున్న కొండ కోళ్ళు, దాసరి కోళ్ళు అనుమానంగా బయటికొచ్చి అరుపు వైపు ఈదుకుంటూ చీకట్లో కానుకోలేక వలలో చిక్కడిపోతాయి. పరదలు కూడా ఈ అరుపుకి అప్పుడప్పుడు దిగిపోతాయి. గాని దొరా ఇందాక మంచి పరదల మందని నువ్వు బెదరగొట్టేశావు... నువ్వు... పరదల్ని...''

''నేనా...?''

''నువ్వు అరప దిగి అగ్గిపుల్ల గీసి సిగరెట్టు ఎలిగించలేదూ?''

''అవును, వెలిగించాను.''

''అగ్గిపుల్ల ఎలుగులో నీ తుపాకీ గొట్టాలు జిగేల్‌మని మెరిశాయి. ఇంత దూరంలో నాకే కనిపించింది. బాగా నున్నగా మెరుగెక్కున్నాయేమో జిగ్‌మన్నాయి. చీకట్లో ఆ మెరుపుకి దిగబోతున్న పరదల మంద బెదిరిపోయి అరుసుకుంటూ గిర్రున వెనక్కి తిరిగి పారిపోయింది.''

డిబిరిగాడికి వేటలో గల నిశిత పరిశీలనాశక్తికి ఆశ్చర్యపడిపోయాడు వర్మ.

"ఈ నత్తగొట్టుకి రెక్కలు కత్తిరించేశావా?"

డిబిరిగాడు అదోమాదిరిగా వర్మవైపు చూస్తూ ఎడమచేత్తో చటుక్కున నత్తగొట్టుని పట్టుకొని దాని రెక్కల్ని సాగదీసి మంట మీద ఎత్తి పట్టుకున్నాడు. వేడికి అది కాళ్ళు కొట్టుకుని గింజుకుంది. అలా దాని పెద్ద రెక్కల్ని చూపించి మళ్ళీ నేలమీద దబ్బున పడేశాడు. అది కోడిలా రెక్కలు రెండుసార్లు కొట్టుకుని పడిన చోటనే నిటారుగా నిల్చుని మంటల్లో కాలుతున్న చితుకుల చిట పటల్ని వింటోంది.

"మరి అది ఎగిరిపోదా?"

"దానికి చూపులేదు, కళ్ళు కనిపించవు."

"గుడ్డిదా? దాని కళ్ళు పొడిచేశావేంటి?" ఆదుర్దాగా అడిగాడు వర్మ.

"లేదు. కనబడకుండా దాని కంటిరెప్పల్ని దారంతో కుట్టేశాను. అది ఎలుతురు చూడలేదు. పిట్టని మచ్చిక చేసుకోవాలంటే ముందు దానికి చూపు లేకుండా చేసేయాల."

డిబిరిగాడు చెబుతున్నది ఆశ్చర్యంగా వింటున్నాడు వర్మ.

"ఏ జాతి పిట్టల్ని పట్టుకోవాలనుకుంటే ఆ జాతి పిట్టనే మచ్చిక చేసుకోవాలి. ముందుగా దానికి చూపు లేకుండా చేసేయాలి. వలేసి దాని మీద పెట్టాల. దాన్ని చూసి ఆ జాతి పిట్టలన్నీ భయం లేకుండా దాని దగ్గర దిగిపోయి వలలో తగులుకొని చిక్కడిపోతాయి. మచ్చిక చేసిన పెంపుడు పిట్ట వెలుతురు చూడకూడదు. చూస్తే ఎగిరిపోయి దాని జాతి మందలో కలిసిపోద్ది. చూపులేని పిట్టతో చూపున్న పిట్టల్ని వలేసి పట్టుకోవడం. అదే ఈ వేటలో తమాషా."

అంతవరకు ఆసక్తికరంగానూ, ఆశ్చర్యంగానూ వింటున్న వర్మ ఇప్పుడు డిబిరిగాడు చెప్పిన దాన్ని లోతుగా ఆలోచిస్తున్నాడు. హంటింగ్ టాక్టిక్స్‌తో పాటు వాడు చెప్పిన దాంట్లో గల ఫిఫ్త్ కాలమ్ స్ట్రాటజీని, పొలిటికల్ ఇండాక్ట్రినేషన్నీ తన మిలిటరీ మేధస్సుతో విశ్లేషించుకుంటున్నాడు కెప్టెన్ వర్మ.

డిబిరిగాడు మంట సెగకి వంటి మీద ఎండిపోయిన బురదని బకురుకుంటూ దులుపు కుంటున్నాడు. తంపర్లో దూరంగా బార్... బార్...మని వెదురుగొట్టంలో నుంచి అరుస్తున్నట్లు గూడబాతు అరుస్తోంది.

"సారూ! నా తుపాకీ ఇందాక గురి చూస్తున్నావు- ఎలాగుంది బర్మార్? బాగానే కొడ్తాది కాని కుందా మాత్రం గాడిద తన్ను తన్నీస్తుంది. అటు పేలడం ఇటు కుందా జెబ్బకి గుద్దెయ్యడం, గుద్ది గుద్ది నా జెబ్బ కదుంకట్టిపోయింది!" అని వాడి కాలర్‌బోను క్రింద వేలుపెట్టి నొక్కి చూపించాడు- అక్కడ కండ కదుంకట్టి ఎండిపోయిన నల్లటి మాంసం ముద్ద అంటించినట్లు బైటకి తోసుకొనొచ్చుంది.

డిబిరిగాడు నిలబడి, తుపాకి గుర్రం ఎత్తి గొట్టంలో నుంచి కాలిన మందుగుండు నుసి నిప్పిల్ నుంచి పోడానికి గట్టిగా నోటితో ఊదుతున్నాడు.

"అది మర్డర్ తుపాకీ అన్నావుకదా ఇందాక!... మర్డర్ చేశావా?"

డిబిరిగాడు భళ్ళున నవ్వబోయి ఆపుకున్నాడు. గారబట్టిన పళ్లతో గిగిలిస్తున్నట్టు గుసగుస మని నవ్వాడు.

"నేను కాదు, నా తండ్రి... నా బాబు. ఈ తుపాకీతో ఒకే దెబ్బకి ఒకణ్ణి కూనీ చేశాడు," అని ఆ తుపాకీని రెండు చేతుల్తో పట్టుకొని మొదటిసారిగా ఆ తుపాకీని చూసినట్లు తనివితీరా చూశాడు. ఒక్కసారి ముఖం మీద నుంచి నీడ దాటినట్లు ముఖకవళికలు మారిపోయాయి.

పెదాలు ఆవేశంగా కదులుతున్నాయి. దవడలు గట్టిపడి బిగుసుకుంటున్నాయి. భారంగా మంట దగ్గర చతికిలపడ్డాడు. మంటల వెలుగులో నిప్పుకణికల్లా ప్రతిఫలిస్తున్న వాడి కళ్ళ చూపులు విశాలంగా పరుచుకున్న చీకటిలో నుంచి చొచ్చుకుపోతూ గతాన్ని చూస్తున్నాయి.

డిబిరిగాడు గతాన్ని చెపుతున్నాడు-

"సాలాకాలం క్రిందట... అప్పుడు తెల్లదొరలుండేవోళ్ళు... నేను చిన్నోడ్ని. ఇప్పుడైనా నా వయసెంతో నాకు తెలీదు. ఎన్నేళ్ళంటే సెప్పలేను. మాకు పుట్టుకలు గుర్తుండవు. సావులు మాత్రమే గుర్తుంటాయి. నా తండ్రి సావు, నా ఆడదాని సావు ఇప్పటికీ గుర్తే... అదేదో ఊరు... పోలీసుఠాణా పక్కన మైదానంలో మా జాతోల్లందరూ చెట్ల కింద తారుగుడ్డలు కట్టుకొని వుండే వాళ్ళం. నేను, నా బాబు వండుకునే వాళ్ళం. మా అమ్మ అమ్మోరు పడి ఎప్పుడో సచ్చిపోయిందంట. నాకసలు గుర్తేలేదు. ఏటొడ్డున పడేసిన మా అమ్మ శవాన్ని రాబందులు పీక్కుతిన్నాయట... మా బాబు చాలా విచారంగా చెప్పేటోడు.

"ఒకరోజు ఏటికెళ్ళిన మా బాబు చీకటిపడ్డా ఇంటికి రాలేదు. పిట్టల్ని పట్టడానికి వల తీసికెళ్ళాడు. తుపాకీ తీసుకెళ్ళలేదు. అడవి పందులకి పటాసుకాయలు పెట్టి పొలాల్లో రాత్రి కాసుక్కూర్చున్నాడేమో అనుకున్నాను. ఆ మరుసటిరోజు సూర్యుడు నెత్తి మీద కొచ్చినా రాలేదు. నేను బెంబేలెత్తిపోయాను. ఇంతలో పక్కనున్న మావోడు వచ్చి, "ఏట్రా డిబిరిగా! ఏం చేస్తున్నావ్?... నీ బాబుని నిన్నటి నుంచి పోలీస్‌స్టేషన్‌లో కుళ్ళబొడిచేస్తున్నారు!" అన్నాడు.

"ఎందుకూ?" అన్నాను.

"దొంగతనం చేశాడట. మాకూ పిలిపించి కొట్టి వదిలేశారు. నీ బాబు మీద ఇంకా అనుమానం తీరలేదు. మొన్న ఈ ఊరు షావుకారి ఇంట్లో దొంగతనం జరిగిందట. బంగారం పోయిందట. ఎక్కడ దాచావని గొడ్డును బాదినట్టు బాదుతున్నారు..."

క్షణంసేపు ఆగి కళ్ళు మూసుకున్నాడు. నుదుటిమీద చిటికెలు వేసుకున్నాడు. తేరుకొని చెవి సందుల్లోంచి బీడి తీసి ముట్టించాడు. గట్టిగా దమ్ములాగి తిరిగి చెప్పడం మొదలెట్టాడు.

"మాకు పోలీసోళ్ళతో దెబ్బలు తినడం చిన్నప్పటి నుంచీ మామూలే! ఎక్కడ దొంగతనం జరిగినా మమ్మల్నే పట్టుకొని తంతారు. మా జాతోళ్ళం దొంగతనం చెయ్యం. దొంగతనాలు చేసే జాతులు కూడా ఉన్నాయట! వాళ్లతోపాటే మమ్మల్నీ దొంగల కింద జమకట్టేసి కొట్లో తోసేసి మక్కలు ఇరగతంతారు. మేము మాత్రం దొంగతనం చేయం. ఏట చేస్తాం. ఉంటే తింటాం. లేకపోతే ఆకలితో పస్తుంటాం. చచ్చినా అడుక్కోం... గానీ సారూ నా జీవితంలో గతిలేక ఒకే ఒక్కసారి అడుక్కున్నాను. ఊ... ఆ సంగతి తర్వాత చెబుతానులే సారూ," అంటూ గెడ్డాన్ని చేత్తో బక్కురుకుంటూ తల పైకెత్తి శూన్యంలోంచి ఆకాశం మీదికి వెర్రిగా చూశాడు.

మంచు పలచబడుతోంది. చీకటిలో చిక్కదనం తగ్గుతోంది.

"నేను కంగారెత్తిపోయి పోలీస్‌స్టేషన్‌కి పరుగెత్తాను. అక్కడ దొరకాళ్ళ మీద పడి మా బాబుని ఒదిలేమన్నాను. ఇలా అన్నానో లేదో ఆ పక్కనే వున్న పోలీసు బాబు, 'ఈడు ఆడి కొడుకే సార్. ఇప్పుడు ఆడు చెప్పేస్తాడు- ఛల్ నా కొడకా,' అని పిల్లిపిల్లను చెవి పట్టుకొని ఎత్తికెళ్ళినట్లు నా జుత్తు పట్టుకొని ఎత్తి గొరగొరా ఈడ్చుకుంటూ కొట్లో తోసేశారు దొరా... దొరా!!..."

"దొరా!" అని గావుకేక పెట్టాడు. చుట్టూ ఆవరించుకున్న నిశ్శబ్దంలో చీకటి అద్దం భళ్ళున పగిలినట్లైంది. వర్మ ఆ కేకకి నిశ్చేష్టుడైపోయి వింటున్నాడు. బాధతో అరిచిన అడవి మృగంలా వుంది ఆ కేక. డిబిరిగాడు ఒళ్ళో వున్న తుపాకీ మీద తలపెట్టి కళ్ళు మూసుకున్నాడు.

అలా మూసుకున్న కళ్ళకి గతంలోని ఒక భయంకర దృశ్యం కన్పించింది. అలా కళ్ళు మూసుకునే చెబుతున్నాడు...

"దొరా! నా తండ్రిని రెండు చేతులూ చాచి కట్టేసి దూలానికి వేలాడదీసేశారు. గోచీ తప్ప వంటి మీద గుడ్డ లేదు. కాళ్ళు కట్టేసున్నాయి. కొట్లో చీకటి చీకటిగా వుంది. లాంతరు వెలుగులో చూసేసరికి నా కళ్ళు తిరిగిపోయాయి. దబ్... దబ్... ఫట్... దబాదబ్... లాఠీ దెబ్బలు. వంటి నిండా దెబ్బలు. అక్కడక్కడ చర్మం చిట్లి రక్తం ముద్ద కట్టేసింది. గావుకేకలు- కాళ్ళు తన్నుకోలేక గింజుకుంటున్నాడు. దెబ్బలు ఆగడం లేదు.

"చెప్పరా! బంగారం ఎక్కడ దాచావో!"

"బాబూ... నాకు తెలీదు..." నోటిలో మాట నోట్లోనే వుంది. మళ్ళీ దెబ్బలు, కేకలు, బొబ్బలు- నోట్లో నుంచి రక్తం చొంగలా కారుతోంది.

"ఆపు- ఇప్పుడు చెపుతాడు వాడు ఎక్కడ దాచాడో- చూసుకో. ఇదిగోరా నీ కొడుకు. నీ ఎదుటే ఈడ్ని కొట్టి సంపేస్తాం... ఏంట్రా చెప్పవా?" ధన్‌మని నా బుర్ర గోడకేసి కొట్టేశారు. నేను పడిపోయాను. గుండెల మీద, కడుపులోనూ బూట్లతో కుమ్మేస్తున్నారు. లాఠీలతో కుళ్ళ బొడి చేస్తున్నారు.

"బాబోయ్ అన్నాను. అమ్మోయ్ అన్నాను. ఒక్కొక్క అరుపుకి ఒక్కొక్క దెబ్బ. క్రితం రాత్రి తిన్నది కక్కేసుకున్నాను. ఉచ్చేసుకున్నాను. జుత్తులో నుంచి కారిన నెత్తురు పెదాలకి ఉప్పగా తగుల్తోంది.

"నా అరుపులకి మా బాబు గెద్దకి రెక్కలు ఇరిసేసి దాని ఎదురుగానే దాని పిల్లని చుట్టు ముట్టేసి సంపేస్తున్న బావురు పిల్లుల్ని చూసి అరుస్తున్నట్లు కోపంగా పీండ్రించుకుంటూ దూలానికి గింజుకుపోతున్నాడు.

"దొరా, అసలు ఎందుకు కొడుతున్నారో నాకు తెలీదు! నేనేం చేశాను? అంతా నాకు అయోమయంగా అనిపించింది. అంతా చీకట్లు కమ్ముతున్నాయి. నా వొంటి మీద దెబ్బలు విని పిస్తున్నాయి. కాని బాధ తెలియడంలేదు. మగత కమ్మేస్తోంది. ఆ మగతలో చివరిసారిగా విన్న మాటలు.

'ఆపండి... ఆడ్ని ఒదిలెయ్యండి... నేను నిజం చెబుతాను,' అని కిరకిరలాడిపోతున్న మా బాబు గొంతు.

"నవ్వులు...

"నాకు స్పృహ తప్పిపోయింది.

"తెలివి వచ్చేటప్పటికి పోలీసుకొట్లో మా మూలుగులు. కంపు, రొచ్చు, పక్కనే అన్నం, నీళ్ళు. మా బాబు నీళ్ళతో నా ముఖం కడిగాడు. ఏడ్చి ఏడ్చి తడారిపోయినట్లు ఆడి కళ్ళు గాజు కళ్ళలా వున్నాయి.

"తినండి నా కొడకల్లారా! తిని, ఎల్లి ఒంటికి కాపడం పెట్టుకొని పడుకోండి. రాత్రి పారిపో గలరు, జాగ్రత్త! రాత్రంతా మావోడు నీ డేరా దగ్గర కాపలా ఉంటాడు. తెల్లారగానే నేనే వస్తాను. బంగారం ఎక్కడ దాచావో... పాతిపెట్టావో చూపుదువుగాని- అని నన్ను పట్టుకొని ఈడ్చుకెళ్ళి బాదిన పోలీసుబాబు దమాయించి చెప్పాడు. దెబ్బలతో ఒళ్ళు పచ్చి పుండులా వుందేమో అన్నం తినాలన్నా తినలేకపోయాను. అన్నం ముద్దల్ని చేత్తో పట్టుకోలేకపోతున్నాం. వేళ్ళు వాచిపో యున్నాయి. సలుపులు. కడుపులో ఆకలి మాడ్చేస్తుందేమో తినలేక తినలేక ఇంత తిని నీళ్ళు తాగాం.

‘‘మరేం ఫర్వాలేదు. ఈళ్ళెక్కడికి పారిపోరు. ఈ కొట్లోనే ఉంచితే మొండి నా కొడుకులు మొండికేసి అసలు చెప్పడం మానేసి నాకు తెలీదు అని మళ్ళీ మొదటికొస్తారు. మనం వదిలేసినట్లు నమ్మకం కలిగించాలి. అప్పుడు పూర్తి నిజం చెప్పేస్తారు... కొంచెం నిఘా ఉంచు రాత్రంతా- అని పక్కగదిలో ఇంకో పోలీసుతో గుసగుసలాడడం కొట్టో నుంచి బయటికి వస్తున్న నాకు వినిపించింది.

‘‘ఒరే, మేమెంత పోలీసోళ్ళమైనా, మా డ్యూటీలో ఎంత కొట్టినా మేమూ మనుషులమేరా! మాకూ కనికరం ఉంటుంది. టీ తాగుతారేట్రా?

‘‘ఒద్దన్నట్లు తలూపి, నేనూ మా బాబు కొట్లో నుంచి బయటకొచ్చాం. ఒళ్ళు తూలిపోతోంది. అప్పటికే చీకటిపడింది. చెట్టుకింద కొచ్చాం. నేనే లాంతరు ఎలిగించాను. మా తండ్రి పెదాల్లో నుంచి కారుతున్న నెత్తురుని చేత్తో ఒత్తుకుంటున్నాడు. కాపడానికి వేడినీళ్ళు పెట్టనా అన్నాను. ఒద్దన్నాడు.

‘‘ఎండాకాలం చల్లగాలి వీస్తోంది.

‘‘బాబా, నువ్వు దొంగతనం చేశావా?- అని అడిగాను. దానికి సమాధానంగా నా జుత్తుని నిమురుతూ ‘నువ్వు పడుకో’ అన్నాడు. నాకు నిద్ర పట్టేసింది. ఒకటి రెండుసార్లు తెలివి వచ్చి చూసేసరికి నా బాబు నా పక్కనే కూర్చుని నా ముఖంలోకి చూస్తున్నాడు. తెల్లవారుజాము మగత నిద్రలో నా కాళ్ళు పడుతున్నట్లు కూడా అనిపించింది. ఆడు రాత్రంతా పడుకోలేదు.

‘‘తెల్లారి నేను లేచేసరికి ఆడు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. రాత్రంతా నిద్రలేమితోనూ అంతకు ముందు తిన్న దెబ్బలతోనూ బాగా అలసిపోయినట్లున్నాడు. ముఖం కమిలిపోయి నిప్పుల్లో కాలీకాలని కర్రపెండలం దుంప రంగులో ఉబ్బిపోయింది. ఏంరా, టీ తాగావా?- అని రెండు గ్లాసులతో టీ తెచ్చాడు, మాకు తెలీకుండా కాపలా కాస్తున్న పోలీసు. మా బాబు వాడివైపు ఎగాదిగా చూసి రెండు గ్లాసులూ అందుకున్నాడు. ఇద్దరం టీ తాగాం.

‘‘సూర్యుడు ఉదయించాడు. డేరాలోకి చొచ్చుకు వస్తున్న సూర్యకాంతిని వాచిపోయిన చీపి కళ్ళతో మా బాబు చూస్తున్నాడు. వాడి చూపుకి అడ్డంగా నీడలా, నన్ను ఈడ్చుకెళ్ళిన పోలీసు వచ్చాడు.

‘‘ఏంట్రా? వెళ్దామా?- ఇంకా టీ కావాలా?- అన్నాడు పోలీసు. ఆడ్ని కూడా మా బాబు కింద నుంచి మీదకి చూశాడు. లేచి నుంచున్నాడు. ఒళ్ళు బద్ధకంగా విదిలించుకున్నాడు. పోలీసుని చూసిన మా బాబు ఎప్పుడూ లేనిది మెత్తగా నవ్వాడు. పెదాలు నవ్వుతున్నాయి. కళ్ళు మాత్రం క్రూరంగా చూస్తున్నాయి. అంతే- మెరుపు వేగంతో పక్కనున్న తుపాకీ అందుకున్నాడు.

‘‘ధూమ్... నాటు తుపాకీ గుళ్ళను కక్కింది- పోలీసు ఆమడదూరాన డేరా నుంచి ఎగిరి పడ్డాడు.

‘‘రాత్రి ఒకటికి రెండు బార్‌లు మందుపోసి గుళ్ళు దట్టించి ఉంచిన తుపాకీ సూర్యోదయాన వాడి గుండెల్ని చీల్చేస్తూ గర్జించింది. ఆ శబ్దానికి చెట్ల మీద కాకులు అర్చుకుంటూ మందమందలుగా ఎగురుతున్నాయి.

‘‘పోలీసు శవం నెత్తుటి మడుగులో పడి వుంది. ఖలీజా బయటకు వచ్చేసుంది. చుట్టు పక్కల వారంతా గుమికూడి తోసుకుంటూ ఆ శవాన్ని చూస్తున్నారు. నాటు తుపాకీమందు వాసన గాలిలో తేలుతోంది. మా తండ్రి దగ్గరికి ఎవరూ రాలేకపోతున్నారు. చేతిలో ఇంకా పొగలు కక్కుతున్న తుపాకీ వుంది. అలా తుపాకీతో మరి వెనక్కి తిరిగి చూడకుండా అందరు చూస్తుండగా

నడుచుకొంటూ పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్ళాడు- దొరా! నిన్న నేను దొంగతనం చేసానని ఒప్పించాడే అది పచ్చి అబద్ధం. నేను దొంగతనం చేయలేదు. ఇప్పుడు నేను ఖూనీ చేశాను. ఇది పచ్చి నిజం. నేను చంపాను. అందుకే చంపిన తుపాకీతోనే లొంగిపోతున్నాను. ఇదుగో తుపాకీ- ఇంకా వేడిగానే వుంది. పొగలు కక్కుతోంది- అని పోలీస్ ఇన్‌స్పెక్టర్ బాబు ముందు మా బాబు లొంగిపోయాడు.

"మా బాబుని మూసేశారు. ఎక్కడో జైలుకి తీసుకెళ్ళిపోయారు. నేను ఒంటరివాడ్ని అయి పోయాను," అంటూ నిట్టూరుస్తూ కథ ముగించినట్లు లేచి నించున్నాడు డిబిరిగాడు. తుపాకీ గొట్టంలోంచి మరొక్కసారి గాలి ఊదాడు. సంచీలోంచి వెతికి చిన్న డబ్బీ తీసి అందులో నుంచి తుపాకీమందు గొట్టంలో పోసి కాయితాలు కూరి దట్టిస్తున్నాడు... అలా దట్టిస్తూనే మళ్ళీ మొదలు పెట్టాడు.

"నాకు మర్డర్ కేసులో సాచ్చిగా ఏశారు. కేసు పైసలా అయ్యేదాకా ఆ ఊరు కదలొద్దు అని కట్టడి చేశారు. రోజూ పోలీస్‌స్టేషన్‌లో హాజరీ ఏయించుకోవాల. కొత్తలో పిచ్చిగా అటూ ఇటూ తిరిగాను. మావోళ్ళు ఇంత అంబలి పోసేవాళ్ళు. సంచారజాతోళ్ళం కదా, వాళ్ళు కూడా ఊరు విడిచిపెట్టి వెళ్ళి పోయారు. నేను బతకాలి కదా! నాకు అప్పటికి తుపాకీ ఏట తెలియదు... వలేసి పిట్టల్ని పట్టి ఊరులో అమ్ముకునేవాడ్ని."

మరో డబ్బా తీసి అందులోని సీసపు రవ్వల్ని తుపాకీ గొట్టంలోకి పోసి కాయితం మడిచి ఇనుప రాడ్డుతో సర్దుతున్నాడు. దట్టించలేదు... "సారూ! రవ్వలు నింపిన తర్వాత దట్టించకూడదు. మందు మీద కూరుతూ సర్దాలి. తుపాకీ పేలగానే రవ్వలు జల్లిడిలా విడిపోవాల... ఎక్కువ పిట్టలు పడతాయి," అంటూ నాటు తుపాకీలోని టెక్నిక్‌ని కెప్టెన్ వర్మతో చెపుతున్నాడు. తుపాకీల సంగతి తెలిసిన వర్మ ఆ నాటుతుపాకీ బాలిస్టిక్స్ గురించి ఆసక్తికరంగా వినడంలేదు. ఆ నాటు మనిషి జీవితంలోకి అన్వేషిస్తున్నాడు.

"నాలుగైదుసార్లు కోర్టుకు తిప్పారు. అబద్దమాడకూడదని పోలీసులు బెదిరించేవోరు. కోర్టులో ఏదో ప్రమాణకం కూడా చేయించీవోరు. నేను ఎందుకు అబద్దమాడుతాను సారూ! నేను కళ్ళారా మా బాబు పోలీసును చంపడం చూశాను. మా బాబే చంపేశాడని చెప్పాను.

"బోనులోంచి మా బాబు- ఒకే దెబ్బతో పైసలా చేసేశాను- అని ఉడుం బుస కొట్టినట్టు బుస కొట్టీవోడు. మా బాబుని కలిసేవోడ్ని. సింహంలాంటి వోడు బక్కచిక్కిపోయాడు. గానీ డీలా పడిపోలేదు. నువ్వు నాకోసం బెంగెట్టేసుకోకు. తిరిగొచ్చేస్తాను. బాగా ఏటచెయ్యి... బాగా తిను. వంటి నిండా కండలు పెరగాలి. బలంగా వుండాలి. దెబ్బలు తిని తట్టుకోడానికి బలం కావాలి. మనవి దెబ్బలు తింటూ బ్రతికే బ్రతుకులు... అని కల్సిన ప్రతిసారీ చెపుతుండేవోడు. ఆ మాటలు చెపుతున్నప్పుడు మాటలు తడబడేవి. పెదాలు వణికేవి. కళ్ళు కరకరమని చూస్తుండేవి."

సంచీలోంచి కేపు తీసి నిప్పిల్‌కి అమర్చి గుర్రం ఎత్తి జబ్బకి ఆనిస్తూ చీకట్లోకి గురి చూస్తూ...

"ఆ తర్వాత ఆడిని ఏదో పెద్ద జైలులోకి మార్చేసారట," తుపాకీ దించేసి పక్కన పెట్టి మంట దగ్గరగా వచ్చి కాళ్ళతో ఎగతోసి కూర్చున్నాడు. పక్కనున్న మరిన్ని ఎండుటాకుల్ని దానిమీద పడేశాడు. నిప్పుల మీద అవి కరకరమంటూ భగ్గున మండుతున్నాయి.

"చాలారోజులు ఆడి సంగతే తెలీరాలేదు. చాలాచాలా రోజులు గడిచి పోయాయి. ఆరోజు నేను రోడ్డు పక్కన ఉడుం మాంసం వంతులేసి అమ్ముతున్నాను. ఒక కానిస్టేబుల్ బాబు వచ్చి- ఓరీ ఇక్కడున్నా వ్రట్రా. నీ చెట్టు దగ్గర చూశాను. రేపు ప్రొద్దుట నీ బాబుకి సెంట్రల్ జైలులో ఉరి తీస్తారట- కావాలంటె వెళ్ళి చూసుకో- అని చెప్పి ఎలిపోయాడు.

''ఉరి... ఉరి... ఉరికంబం- నా బాబు... ఒళ్ళంతా గజగజలాడిపోయింది సారూ!'' అంటున్నప్పుడు వాడి శరీరం, మంట వేడిలో కమిలిపోయి, కాలిపోయే ముందు పొగలో మెలికలు తిరిగి పోతున్న ఆకులా ముడుచుకుపోతోంది.

''పెద్ద జైలు చాలా దూరం అన్నారు. బస్సులో ఎళ్ళాలట. ఆరోజుల్లో బస్సులు కూడా ఎక్కువలేవు. బస్సెక్కడానికి నా దగ్గర డబ్బులు లేవు. ఉడుం మాంసం అమ్మిన బేడ డబ్బులు ఉన్నాయి. ఏం చేతును!... దిక్కుతోచడం లేదు- సారూ! అడుక్కున్నాను. నేను చెప్పాను కదా, నా జీవితంలో అడుక్కొన్నది ఒకే ఒక్కసారని... కనిపించిన అందర్నీ అడుక్కున్నాను. కాళ్ళు పట్టు కున్నాను. 'ఎందు'కన్నారు. నా బాబుకి ఉరితీస్తారు- నా బాబు కూనీ చేశాడన్నాను. 'మర్డర్ చేసి నోడికి ఉరి తీసేయక మెడలో దండ వేస్తారా?' అన్నారు. ఈడి బాబు కూనీ చేశాడట- ఈడు ఖూనీకోరోడి కొడుకు. అసలు వీళ్ళ జాతోళ్ళు దొంగతనాలు, కూనీలు చేసే జాతోళ్ళట! ఈడూ ఖూనీలు చేసేవోడులాగే వున్నాడు. ఉరితీసిన ఈడి బాబుని చూడ్డానికి డబ్బులు కావాలట?- ఎగతాళి చేశారు. చీదరించుకున్నారు. విసుక్కుంటూ తప్పుకుపోయారు. ఒకళ్ళిద్దరు జాలిపడి కానీ పరక ఎత్తెత్తి నా చేతిలో పడేసిపోయారు. మొత్తం పావలా మించలేదు. ఆ డబ్బుతో వెనక్కి చూడకుండా బస్సు దగ్గరికి పరుగెత్తాను. అది కూడా ఎల్లిపోయింది.''

*

నడి నెత్తిన సూర్యుడు చుర్రుమంటున్నాడు. డిబిరిగాడికి ఆకలి. వికారంగా వుంది. జోరుగా నడిస్తే మరుసటిరోజు పెద్ద జైలు దగ్గరికి వెళ్ళచ్చునన్నారు. పరుగులాంటి నడక లంకించుకున్నాడు. ఊరు దాటిపోయాడు. పరుగెత్తుతున్నాడు. నడుస్తున్నాడు. చీకటి పడిపోయింది. ఆ రాత్రంతా పరుగెత్తుకుంటూ, నడుచుకుంటూ చుక్కలని చూస్తూ టైమ్ లెక్కెట్టుకుంటున్నాడు. రానురాను ఆకాశం మబ్బు పట్టింది. టైం తెలియడంలేదు. వర్షం- వర్షంలోనే పరుగు, నడక, ఆయాసం, ఆకలి, బెంగ, భయం. అలా వర్షంలో తడుస్తూనే పరుగెత్తుకుంటూ రెండు మూడు చిన్న పల్లెలు దాటాడు. వర్షం తగ్గిపోయింది. ఒక గుడిసె దగ్గర ఆగి ఒగరుస్తూ మంచినీరు అడిగాడు. దోసిట్లో కుక్కలా కతుకుతూ తాగాడు- పట్టణం ఎంత దూరం- అన్నాడు. ఇదే దారి, ఇంకా దూరం- అన్నారు. మళ్ళీ నడక, పరుగు, నడక, పరుగు. తెలతెల వారుతోంది. కోళ్ళు కూస్తున్నాయి. తెల్లారి పోయింది. వెలుగు బాగా వచ్చేసింది. పరుగు ఆపేశాడు. దొంగ అని పట్టుకుంటారేమోనని భయ మేసింది. గబగబా నడుచుకుంటూ పట్టణంలోకి వచ్చేశాడు. వాకబు చేసుకుంటూ జైలు దగ్గరకు వచ్చాడు.

బాగా పొద్దెక్కిపోయింది. వళ్ళు తూలిపోతోంది.

డిబిరిగాడు జైలు గేటు దగ్గర నుంచున్నాడు. మర్రిచెట్టు మీద గబ్బిలాలు అరుస్తున్నాయి. గేటు తలుపులోంచి జైలు వార్డెన్లు అటు ఇటు తొందర తొందరగా వస్తూ పోతున్నారు. కొందరు తెల్లబట్టలోళ్ళు, ఒక తెల్లదొర గేటులోంచి బైటకు వచ్చి వెళ్ళిపోయారు. వాళ్ళకి జైలు పోలీసులు సెల్యూట్ చేశారు. వాళ్ళ చేతిలో ఏవో కాయితాలు కూడా ఉన్నాయి.

''బాబూ...'' అంటూ బెంగగా ఒక వార్డెన్‌ని పలకరించాడు.

''ఏం కావాలిరా, గుంట నాకొడకా, పొద్దునే?'' అని విసుక్కున్నాడు.

''నా బాబుకి ఈరోజు ఉరిసిచ్చని కబురెట్టారు.''

వార్డెన్ వాడి కళ్ళలోకి చూసి పరధ్యానంగా తలదించుకున్నాడు. మరిద్దరు వార్డెన్లు వచ్చారు. ''ఇంత ఆలస్యమైందేంటి? తెల్లవారుజామునే ఉరి తీసేశారు.''

*

"ఉరి తీసేసారా? సచ్చిపోయాడా- సచ్చిపోడూ?- ఉరి తీసినోడు సవ్వకుండా బతికుంటాడా సారూ! అలా అప్పుడు ఎందుకు అడిగానో నాకు తెలీదు. బుర్రలో ఎర్రెక్కిపోయినట్లయింది."

*

డిబిరిగాడిని గేటు తలుపులోంచి చేయి పట్టుకు దాటించి లోనికి తీసుకెళ్ళారు. వాడు నడుస్తున్నాడే గాని ఒంటి మీద తెలివిలేదు. అరుగుమీద కూర్చోబెట్టారు. డిబిరిగాడికి నెత్తురులోంచి మెల్లమెల్లగా మంచు పాకురుకుంటూ తెరతెరలుగా నసాళానికి గుద్దుతున్నట్లు అనిపించింది. మెడ మీద తలకాయ పట్టు తప్పినట్లు గజగజా వణికిపోతోంది. ఎవరో టీ తెచ్చి తాగించారు. కొంచెం సర్దుకున్నాడు. చుట్టూ కొంచెంసేపు వెర్రివాడిలా అర్థంకాని చూపులు చూశాడు.

వార్డెన్ విస్తరాకులో రెండు జొన్నరొట్టెలు ఎదురుగా పెట్టి- తిను- అని ఒక బీడి కూడా అందించాడు. ఆ రొట్టెల వైపు డిబిరిగాడు ఆశగానూ చూడలేదు. ఆకలిగాను చూడలేదు. అర్థం లేనట్టు చూస్తుండగానే...

"నీ బాబు నీకివ్వమని చెప్పాడు."

"మా బాబా? నాకివ్వమన్నాడా?"

కుదిపి వేసినట్లు లేచి కూర్చున్నాడు.

"ఉరి తీసేముందు నీ ఆఖరి కోరిక ఏమన్నా వుంటే చెప్పుకోమన్నారు జైలరు- నా కొడుకు రాలేదా? అన్నాడు- కబురుపెట్టాం. ఇంకా రాలేదు. ఏమైనా తింటావా?" అని అడిగాం.

"జొన్న రొట్టెలు-" అన్నాడు. జొన్నరొట్టెలు తెప్పించాం.

"టైం అయిపోతోంది. ఆకులో రొట్టెల్ని చూస్తూ- బాబూ, నా కొడుకు ఇంకా రాలేదూ? రాలేదుగానీ వస్తాడు. రాత్రంతా తిండిలేక కడుపు నకనకలాడిపోతూ పరుగెత్తుకుంటూ వస్తాడు. ఆకలితో కరకరలాడి పోతుంటాడు. అసలే ఆడు ఆకలిగొట్టోడు. ఆకలితో వుంటాడు. ఈ రొట్టెల్ని వాడికియ్యండి బాబూ కడుపు నిండా తింటాడు. ఆకలితో వుంటాడు బాబూ. ఒక బీడీ ఇప్పించండి బాబూ- అని బీడీని గబగబా రెండు దమ్ముల్లో ఊదేశాడు. బాబూ, మరొక బీడీ! ఇది నా కొడుక్కి నేనిచ్చానని ఇవ్వండి బాబు. ఆడికి బీడీలంటే మాయిష్టం. ఇక నాకు ఏ కోరికా లేదు- అంటూ ఉరికంబం ఎక్కిపోయాడు. చివరిసారిగా నీ కోసం ద్వారంవైపు చూశాడు. ముసుగు తొడిగేశాం. టైం అయిపోయింది. ఉరి తీసేశాం."

"నా బాబు ఏడ్చేడా? ఉరికొయ్య మీద గింజుకున్నాడా?" అని వార్డెన్ చేతులు పట్టుకొని వలవలా ఏడ్చాను.

*

అలా డిబిరిగాడు చెబుతున్న వాడి దీనగాథకి మరింత హైలెట్ చేస్తున్నట్లు నక్కలు ఆకాశం వైపు మోరలెత్తి ఏడుస్తున్నాయి.

"ఆడు చావుకి జడిసి ఏడవలేదు సారూ. ఆడికి సావంటే భయంలేదు. నా మీద భ్రమతో, నేను ఆకలితో చచ్చిపోతాననే బెంగతో, వంటరిగాడ్ని అయిపోతాననే బాధతో ఏడుస్తూ ఉరికొయ్య మీద గింజుకొని వుంటాడు..." అని చెబుతున్నప్పుడు డిబిరిగాడి శరీరంలోంచి వాడి ఆత్మ వేరైపోయి కంటి ముందే చీకట్లో విలవిలా తన్నుకున్నట్లయింది. వర్మ డిబిరిగాడి భుజం మీద చేయి వేసి ఓదార్పుగా తడుతూ సిగరెట్టు తీసి వాడి నోటికి అందించి వెలిగించాడు.

"ఆ సాయంకాలం మా బాబు శవాన్ని, జైలు తోటివోళ్ళు పక్కనే శ్మశానంలో పాతి పెట్టేశారు. నేను కూడా వాళ్ళతో మరింత లోతుగా గొయ్యి తవ్వి మా బాబు శవాన్ని ఎండాకాలం ఆవిర్లు చిమ్ముతున్న గోతిలో కప్పెట్టేశాను. అందరూ వెళ్ళిపోయారు. చీకటి పడింది. ఆడు నాకోసం ఉంచిన రొట్టెల్ని ఆడి గోతికాడే కూర్చుని తిన్నాను. ఆడిచ్చిన బీడీ కాల్చుకుంటూ చీకట్లో కూర్చున్నాను. తెలతెలవారుతుండనగా లేచి మా ఊరు బయలుదేరాను."

డిబిరిగాడు యాంత్రికంగా పొగ వదులుతూ తూర్పున వెలుగుదేరుతున్న ఆకాశం వైపు చూస్తున్నాడు. చల్లగాలులు వీచటం మొదలెట్టాయి. తంపర మీద ముసురుకున్న మంచు కరిగిపోతూ గాలిలో తేలుతూ శూన్యంలోకి కలిసిపోతోంది. ఆకాశం గచ్చకాయరంగుతో జిడ్డు తేరుతోంది.

"నేను పెద్దయ్యాక మా బాబు తుపాకీ నాకు ఇచ్చేస్తారని పోలీస్‌స్టేషన్‌లో చెప్పారు. వలేసి ఏట చేసుకుంటూ ఎన్నెన్నో ఊర్లు తిరిగాను. తిరిగి తిరిగి గుర్తుకొచ్చి మళ్ళీ ఆ ఊరొచ్చాను. అప్పటికి నాకు మీసాలు, గడ్డాలు వచ్చాయి. తెల్లదొరల రోజుల్లో మా సంచారోళ్ళకి ఏట చేసుకు బతకడానికి నైసెన్స్‌లు ఇచ్చీవోరు. ఏటేటో కాగితాల మీద నా నిసానీలు, పొటిగిరాపీ తీసుకుని మా అయ్య తుపాకి నాకు ఇచ్చేసారు," అని సిగరెట్టు కాలుస్తూ లేచి నుంచున్నాడు.

అప్పటికే తంపర మీద వెలుగు పర్చుకుంటోంది. ఆ వెలుగులో మెల్లమెల్లగా తుంగ గుబుర్లు, రెల్లు దుబ్బులు, నాచు తీగలు ఒక్కొక్కటీ ఫోకస్‌లోకి వస్తున్నాయి.

డిబిరిగాడు తంపర వైపు కలయజూస్తున్నాడు. నీటిపిట్టలు అరుస్తున్నాయి. సరుగుడు తోటలో జీడిమామిడి చెట్టు మీంచి కోయిల కూస్తోంది. తెర తెరలుగా గాలి వీస్తోంది. ఏదో వాసన పసిగట్టుతున్నట్టు పదేపదే ముక్కుపుటాలు ఎగరేస్తూ గాలిలో వాసన చూస్తున్నాడు డిబిరిగాడు. బాతులు రెక్కలు కొట్టుకుంటూ నీటిలో ఒకదాన్నొకటి తరుముకుంటూ అరుస్తూ గోల చేస్తున్నాయి.

"సారూ! వర్షం వస్తాది. పెంటి బాతులు పెట్టల్ని తొక్కడానికి అరుచుకుంటూ ఎలా గోల చేస్తున్నాయో విను. వర్షం వస్తాది దొరా, వర్షం వాసన చూడు!" అని మళ్ళీ ముక్కుపుటాల్ని ఎగరేస్తున్నాడు.

గాలితెర రంయ్‌మని వీచింది. తుంగ గుబుర్లలోంచి నాచు మీద ఒరుసుకొస్తున్న ఆ గాలిలో ముదర పసరవాసనతో పాటు చినుకులకి తడిసిన మట్టివాసన వర్మ ముక్కుకి ఘాటుగా తగుల్తోంది. వర్మ ఆశ్చర్యకరంగాను, ఆసక్తికరంగాను ఆకాశంవైపు చూశాడు. స్వచ్ఛమైన వినీలాకాశం సుదూరంగా నల్లటి మబ్బు మరక.

తూర్పున ఆకాశం మీద వెలుగు, పసుపుదేరుతూ కరిగించిన బంగారపు రంగు మైనపు పూతలా చిక్కబడుతోంది. పచ్చటి వెలుగు గాలిలో కలిసి నీటిమీద తేలుతూ, తామరాకుల మీద రాసుకుంటూ ఆకుపచ్చటి గడ్డి గుబుర్లలో నుంచి వెలుగు పాకురుకుంటూ దాటుతుండగానే మళ్ళీ ఆకాశం రంగు మార్చింది. నారింజ రంగు పారదర్శక పల్చటి కాంతి చిక్కటి పచ్చదనంతో పెనవేసుకొంటోంది. ఆవర్ణ కాంతుల పరిష్వంగంలో నుంచి సూర్యోదయమయింది. నిండు సూర్యుడు మెల్లగా నులివెచ్చగా ఆకాశం మీదికి తోసుకొస్తున్నాడు. తంపర మీద పక్షి సంతతి సూర్యోదయంతో కిలకిలలాడుతున్నాయి. వర్మ, డిబిరిగాడు చూస్తున్నారు.

"బార్... బక్... గొగ్గొగ్గొ..." మని తుంగ దుబ్బుల్లో నుంచి గూడకొంగ రెక్కలు కొట్టుకుంటూ లేచింది.

డిబిరిగాడు చటాలున తుపాకీ ఎత్తి దాని గమనంతో పాటే గురి సారిస్తున్నాడు. మెడ సాగదీసుకుంటూ, వెనక్కాళ్ళు చాచి గాలిలో రెక్కలు కొట్టుకుంటూ అపుడే లేచిన సూర్యుడికి

అడ్డంగా నల్లగా దాటబోతోంది. తుపాకీ గురి వెంటాడుతోంది. 'ఢూమ్' డిబిరిగాడి తుపాకి పేలింది. దెబ్బకి ఠప్‌మని దూదిపింజె పిట్లిపోయినట్లు గుప్పెడు వెంట్రుకలు గాలిలో మెరుస్తూ తేలుతున్నాయి. గాలిలోనే చచ్చిన గూడకొంగ నిండుగా లేస్తున్న ఎర్రటి సూర్యబింబం నేపథ్యంలో విరిగిపడిన చీకటిపెళ్ళలా బరువుగా దబ్బున నీటిలో పడిపోయింది.

పిట్ట నీటిలో పడీ పడడంతో అంతవరకు వర్మ పక్కనే నిల్చున్న సీజర్ ఒళ్ళు విదిలించుకొంటూ గట్టు దిగి పట్టుకు రావడానికి ఒడ్డంబట పరుగు లంకించుకుంది. దూరంగా నీటి మధ్యలో చచ్చిన గూడకొంగ తేలుతోంది.

డిబిరిగాడు గట్టిగా అరిచాడు, ''సారూ! సారూ! దాన్ని పట్టుకోండి. అక్కడ బురదగుమ్ములు, ఊబులు ఉన్నాయి... అందులో దిగబడి సచ్చిపోద్ది... పరుగెట్టి పట్టుకోండి... పిట్ట ఎలాగూ దక్కదు. ఇది కూడా కూరుకుపోతాది.''

''సీజర్, సీజర్; స్టాప్, స్టాప్ ఐసే! కమాన్, కమ్ హియర్! నో, నో!'' అని అరుస్తూ వర్మ కుక్కని పట్టుకోవడానికి పరుగెత్తాడు. అలా ఒడ్డు వెంట పరుగెత్తి పరుగెత్తి ఇక నీట్లో దిగబోతున్న కుక్కని చటాలున తోక పట్టుకు బయటకు లాగాడు. అది విదిలించుకుని జాపోస్తోంది. పెనుగులాడుతోంది. దాని మెడ మీది జూలును గట్టిగా పట్టుకుని అదుపు చేస్తూ మొరాయిస్తున్న దాన్ని ఎలాగైతేనేం సముదాయిస్తూ నడిపించుకు తీసుకువచ్చాడు.

రానురాను గాలి ఎక్కువౌతోంది. వెలుగు మసకబారింది. ఆకాశంవైపు చూశాడు. సూర్యుడి మీద మబ్బుతెర పాకుతోంది. ఆకాశం మబ్బు పట్టింది. సరుగుడు చెట్లలో నుంచి ఆకాశం మీద నల్లటి మేఘాలు కమ్ముకొస్తున్నాయి. గాలిలో తేమ వాసన. తంపర్లో తామరాకులు రెపరెప కొట్టుకుంటున్నాయి. ఈ వర్షపు రాకను ఎప్పుడో పసిగట్టిన డిబిరిగాడి ప్రకృతి వాతావరణ పరిజ్ఞానానికి మనస్సులో అభినందించుకుంటూ కుక్కని నడిపించుకుంటూ గట్టెక్కాడు.

అక్కడ దృశ్యాన్ని చూసి వర్మ గుండె ఝల్లుమంది. షాక్ అయిపోయాడు. తెగి వేలాడుతున్న మెడతో రక్తంలో రెక్కలు కొట్టుకుంటూ గింజుకుంటున్న నత్తగొట్టు. చాకుకి అంటిన రక్తాన్ని సంచీకి తుడుస్తున్న డిబిరిగాడు.

''వాట్! చంపేశావా?''

''ఇది మరి ఏటకు పనికిరాదు దొరా... గొంతుకలో బెదురు అరుపు... సఫా చేసేశాను!''

''ఇన్నాళ్ళు పెంచి ఇప్పుడు చంపేస్తావా?'' అసహ్యించుకున్నాడు వర్మ.

''కోడిని పెంచి కోసుకొని తినవా సారూ?'' కత్తిని సంచిలో పెడుతూ ఎదురు ప్రశ్న వేశాడు డిబిరిగాడు. వర్మ సమాధానం చెప్పలేకపోయాడు. తను వేసిన ప్రశ్న తనకే రీబౌన్స్ అయిన బంతిలా ముఖానికి గుద్దింది.

''చంపడం పాపం... పెంచి... కత్తితో పీక కోసీడం... పాపం! ఇన్‌హ్యూమన్'' నీళ్ళు నములుతూ, నసుగుతూ, గొణుక్కుంటూ... డిబిరిగాడి ప్రశ్నకి సమాధానం లేక, చెప్పలేక చీదరించుకుంటున్నాడు వర్మ.

నత్తగొట్టు రెక్కలు కొట్టుకోవడం ఆగిపోయింది. ప్రాణం పోయింది.

''పాపమా, సారూ? నీ సంచిలో బాతుల్ని నువ్వు తుపాకీతో సంపేనేదా?... నేను కత్తితో పీక్కోసి సంపేశాను. అంతే! అదీ సంపడమే. ఇదీ సంపడమే! అలా అయితే నీదీ పాపమే. నీకొక న్యాయం, నాకొక న్యాయమున్నా? ఇదేటి సారూ... నువ్వు కులాసాకీ, జల్సాకీ, గొప్పకీ ఏట సేస్తావు. నేను పొట్టకోసం ఏట సేస్తాను. ఏట లేకపోతే మేం బ్రతకలేం. ఆకలితో సవ్వాల. ఏది పాపం

సారూ?'' అని నవ్వుకుంటూ భుజానికి సంచీ తగిలించుకున్నాడు. ఆ నవ్వు వర్మ గుండెల్ని కెలికే స్తోంది.

ఆకాశం మేఘావృతమౌతోంది. మెరుస్తోంది. దూరంగా చెట్లలోంచి దాటుకొస్తున్న చినుకుల చప్పుడు.

''ఈరోజు ఏట లేదు. నీ తుపాకీ శబ్దానికి పిట్టలు దిగలేదు. కొట్టిన పిట్ట ఊబుల్లో పడిపో యింది. వర్షం కూడా వచ్చేస్తుంది. మరి ఏట ఉండదు. ఈరోజు దీనినే తిని పొట్ట నింపుకోవాల. లేకపోతే పస్తుండాల... ఆకలి... మరి ఈ పాపం ఎవరిది సారూ?'' అని పొట్ట మీద కొట్టుకుంటూ, ''పాపం... పుణ్యం...'' అని పగలబడి నవ్వుతున్నాడు.

వర్మ గుండె అవమానంతో, సిగ్గుతో బీటలు వారుతోంది. అవును ఎవరిది పాపం? డిబిరి గాడు జీవిత సత్యాన్ని పొరలు పొరలుగా ఒలిచి చెబుతున్న వేదాంతిలా అనిపించాడు. నిశ్చేష్టుడై అలా నవ్వుతున్న డిబిరిగాడి వైపు చూస్తూ ఉండిపోయాడు.

టపటపమని రెండు పెద్దపెద్ద చినుకులు వర్మ ముఖం మీద తట్టి లేపినట్లు పడ్డాయి. డిబిరిగాడి నవ్వు సడన్‌గా ఆగిపోయింది.

''సారూ వర్షం వచ్చేసింది. బయలుదేరు, తడిసిపోతావు!'' అని క్షణంసేపు ఆగాడు. నవ్వాడు. ఆ నవ్వు మునుపటి నవ్వులా లేదు. ఆప్యాయంగా ఉంది.

''సారూ మనిద్దరం ఏటగాళ్ళం. చీకట్లో కలుసుకున్నాం. నా కథ నీకు చెప్పాను. ఇద్దరం సొంగాతులయ్యాం. నేస్తం సారూ!... దిల్ మిలాయించిపోయింది. దిల్ మిలాయించు సారూ,'' అంటూ వర్మను కౌగలించుకున్నాడు.

వాళ్ళిద్దరినీ వర్షం తెర కప్పేసింది. ఇద్దరి వేటగాళ్ళ గుండె చప్పుళ్ళు ఒకదానితో ఒకటి ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆకాశం మీద మెరుపు- తంపర నీటిలో జిగ్‌మని మెరిసింది.

''సారూ! పద సారూ!'' అని తుపాకీ తీసుకొని వర్షంలో తడుస్తూ సలాం చేస్తున్నట్లు వంగి, ''వస్తాను సారూ, బయలుదేరు!'' అని వెళ్ళబోతూ వెనక్కి తిరిగి తుపాకీ దించి సంచీలోంచి ఒక బీడీ తీసి, ''వర్షం... కులాసాగా ఉంటాది... కాల్చు సారూ!'' అని తుపాకి తీసుకొని మరి వెనక్కి తిరిగి చూడకుండా గట్టు దిగి వర్షంలో తుప్పల్లోంచి, పొలాల్లోంచి పరుగెత్తుకుంటూ వెళ్ళిపో తున్నాడు. చచ్చిన నత్తగొట్టు చేతిలో తలక్రిందులుగా వేలాడుతోంది.

అలా కనుమరుగయ్యే వరకు డిబిరిగాడ్ని చూస్తూ వర్షంలో నిలబడిపోయాడు వర్మ.

వర్షానికి సీజర్ కుంయ్ కుంయ్‌మని అరిచింది.

వర్మ తేరుకుని కుక్కతో వర్షంలో తడుచుకుంటూ గబగబా ఇంటి ముఖం పట్టాడు.

*

బైట వర్షం మరింత ఉధృతమవుతోంది.

కెప్టెన్ వర్మ తడిసిన బట్టలు మార్చుకుని గాలికి తలుపులు, కిటికీలు మూసుకుని కుర్చీలో కూర్చున్నాడు.

కరెంటు పోయింది. టేబుల్ మీద కొవ్వొత్తి వెలుగుతోంది.

డిబిరిగాడి విషాద జీవితచిత్రం మనసులో టి.వి. స్క్రీన్ మీద ఘోస్ట్ ఇమేజ్‌లా కదలాడు తోంది.

కొడుకు ఆకలి తీర్చడానికి ఉరికంబం ఎక్కబోయే తండ్రి ఆరాటం, ఆకలి తీర్చుకోడానికి పెంచిన పిట్టని గొంతుక కోసిన డిబిరిగాడి కరుకుతనం.

"... మరి ఈ పాపం ఎవరిది సారూ??" బుల్లెట్ షాట్ లాంటి శేషప్రశ్నతో క్లోజప్‌లో ఫ్రీజ్ అవుతున్న డిబిరిగాడి ఘోస్ట్ ఇమేజీ...

గాలికి భళ్ళున కిటికీ తెర్చుకుని కొట్టుకుంటోంది. కొవ్వొత్తి గిలగిల తన్నుకుని ఆరిపోయింది... బయట వర్షపు హోరు.

చీకటి...

కెప్టెన్ వర్మ చేతిలో కాలుస్తున్న డిబిరిగాడి బీడీ తప్ప అంతా చీకటి.

దూరంగా కొండల్లో ఉరుముతోంది.

చీకటి...

*రచన మాసపత్రిక, డిసెంబర్ 1995*

ఉరికంబం కళ్లు చెమర్చిన కథ

## చీకటి

***బ్రిటిష్ పరిపాలనలో కొందరు కలెక్టర్లకి ఏజెన్సీ సెషన్స్ జడ్జి పవర్సు కూడా ఉండేవట. కోర్టులో కలెక్టర్లు ఇంగ్లీషులో వేసే ప్రశ్నలకి, వాటికి గిరిజనులు తమ భాషలో చెప్పే సమాధానాలకీ, సంజాయిషీలకీ ఒకరిది మరొకరికి అర్థమయ్యేటట్టు వారివారి భాషల్లో మౌఖికంగా (గిరిజన భాషలకి లిపి లేదు) అనువదించి చెప్పే దుబాసి ఆ గిరిజన గుమాస్తా.***

1956- నేను గంజాం కలక్టరేట్‌లో కొత్తగా జాయినైన రోజులలో అప్పటికే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి సుమారు తొమ్మిది సంవత్సరాలు కావస్తోంది. యూరోపియన్ కలెక్టర్లు ఇంచుమించు వెళ్ళిపోయినట్లే. రెవెన్యూ డిపార్టుమెంట్‌లో ముఖ్యంగా కలెక్టరు ఆఫీసులో, బ్రిటిష్ హయాంలో పనిచేసిన మనవాళ్ళు ఉండేవారు. కొత్తగా సర్వీసులో చేరిన మా కుర్రకారుకి దొరల హయాంలోగల వారి అనుభవాల్ని, గొప్పగాను, చిత్రవిచిత్రంగాను చెబుతుండేవారు.

బ్రిటిష్ టైంలో పనిచేసిన ఒక ఆయన ఉండేవాడు. పెద్దాయన. నేను ఉద్యోగంలో చేరిన సంవత్సరంలోగానే రిటైరైపోయాడు. నల్లగా, సన్నగా, పొడవుగా రివటలా ఉండేవాడు. ఎప్పుడూ ఉతికి, నీటుగా ఇస్త్రీ చేసిన ముతక లాల్చీ, పంచెతో ఆఫీసుకి వచ్చేవాడు. అతను గిరిజనుడు. చాలా సౌమ్యుడు. పేరు గుర్తు రావటం లేదు. ఇంగ్లీషు, ఒరియా, తెలుగు మాట్లాడేవాడు. అతనికి నాలుగైదు గిరిజన భాషలు వచ్చు. గుమాస్తాగా పనిచేసినా ఆయన సేవల్ని బ్రిటిషు కలెక్టర్లు దుబాసీ (ఇంటర్‌ప్రిటర్)గా వినియోగించుకొనేవారు.

కలెక్టర్లతోపాటు ఏజెన్సీ ప్రాంతాలకి కేంపులు వెళుతూ, అక్కడ ఎంక్వైరీల్లోను, గిరిజనుల అభ్యర్థనలని ఆంగ్లంలో కలెక్టర్లకి చెప్పేవాడు. ఆయన ఏజెన్సీ కేంపు అనుభవాల్ని, స్వతహాగా గిరిజనుడు కావడం వల్ల గిరిజనుల జీవన విధానాల్నీ,

అరణ్య జీవితాల్నీ చెబుతుండేవాడు. వీటితోపాటు గిరిజనులలోగల సూపర్‌స్టిషన్స్‌ని, ఆచార వ్యవహారాల్ని, అతని కాలంలో లేకపోయినా ఎప్పుడో అంతరించిపోయిన తాతతండ్రుల దగ్గర విన్న 'మురయా' శాక్రిఫైసెస్ (నరబలులు) గురించి ఆసక్తికరంగా చెబుతుండేవాడు.

బ్రిటిష్ పరిపాలనలో కొందరు కలెక్టర్లకి ఏజెన్సీ సెషన్స్ జడ్జి పవర్సు కూడా ఉండేవట. కోర్టులో కలెక్టర్లు ఇంగ్లీషులో వేసే ప్రశ్నలకి, వాటికి గిరిజనులు తమ భాషలో చెప్పే సమాధానాలకీ, సంజాయిషీలకీ ఒకరిది మరొకరికి అర్థమయ్యేటట్టు వారివారి భాషల్లో మౌఖికంగా (గిరిజన భాషలకి లిపి లేదు) అనువదించి చెప్పే దుబాసి ఆ గిరిజన గుమాస్తా.

ఇదే కాకుండా గిరిజనుడికి ఉరిశిక్ష పడితే ఉరిశిక్ష అమలుపరిచే ముందు జడ్జిమెంటు (ఇంగ్లీషు)లోని ముఖ్యాంశాన్ని, ముద్దాయికి గిరిజన భాషలో తెలియజెప్పటం ('నువ్వు ఘరానా నేరం చేశావు గనుక ప్రభుత్వం నీకు మరణదండన విధించింది... లాంటివి...) అతను ఉద్యోగ రీత్యా చేయవలసిన కర్తవ్యం, అందువల్ల బరంపురం సెంట్రల్ జైలులో అమలుపరచే ప్రతి గిరిజనుడి ఉరిశిక్షకి ఇతను హాజరయేవాడు.

ఉరిశిక్ష! దాన్ని అమలుపరిచే విధానం! ఉరికంబం ఎక్కబోయే ముందు దోషి పడే మానసిక సంక్షోభం మొదలైనవి తెలుసుకోవాలనే ఆసక్తితో ఆయన్ని ఈ విషయం మీద పదేపదే ప్రశ్నలు వేసేవాణ్ణి. వాటికి అతను, 'బాబూ! (వయసులో అతని కంటే చాలా చిన్నవాడినే కాకుండా, గుమాస్తాలకి ఆరోజుల్లో 'బాబూ' అని పిలిచే అలవాటు) అందరూ ఒక్కలాగుండరు. ఒక్కొక్కరు ఒక్కొక్కలా ప్రవర్తిస్తారు. కొందరు ఏడుస్తారు, కొందరు పిచ్చిపిచ్చి చూపులు చూస్తూ వెర్రివెర్రిగా నవ్వుతారు. కొందరు పూర్తి మౌనం పాటిస్తారు. పెళ్ళాం పిల్లల్ని చూడాలని చివరిక్షణం దాకా ఎదురుచూసేవారు కొందరు. దేవుడ్ని ప్రార్థించేవారు కొంతమంది, కొందరు అక్కడున్న వాళ్ళందరినీ బండ బూతులు తిడతారు. మొరాయిస్తారు. కొందరు మూర్ఛపోతారు. కొందరయితే నిర్భయంగా ఉరికంబం ఎక్కుతారు- మనిషికీ మనిషికీ తేడా ఉంటుంది,'' అని తన చిత్రవిచిత్రానుభవాల్ని చెప్పుకొచ్చేవాడు. వాటిలో అతను చెప్పిన ఈ క్రింది సంఘటన నా మనస్సులో గాఢంగా ముద్ర వేసింది.

ఉరి అమలు జరిపే ముందు ఒక గిరిజనుడిని నీ చివరి కోరిక ఏమిటని అడిగారు. క్షణంసేపు కళ్ళు మూసుకొని, ''నా కొడుకు వచ్చాడా?'' అని అడిగాడు.

''ఇంకా రాలేదు. కబురుపెట్టాం,'' అన్నారు జైలు అధికారులు.

''ఊ! సరే. తినడానికి పూరీకూర ఇప్పించండి బాబూ,'' అన్నాడు. పూరీలు, కూరా తెప్పించారు. కొడుకు కోసం ఎదురుచూస్తూనే సగం తిన్నాడు.

''బాబూ! నా కొడుకు ఇంకా రాలేదా? వస్తాడు బాబూ. నా శవాన్ని తీసుకెళ్ళడానికి తప్పకుండా వస్తాడు. తిండి తినకుండా ఎంత బెంగెట్టుకొన్నాడో! పొద్దున్నే తిండి తినకుండా ఆకల్తో వస్తాడు. చాలా ఆకల్తో ఉంటాడు. అసలే ఆకలిగొట్టోడు. ఈ మిగతా పూరీలు నేను ఇచ్చానని నా కొడుక్కి ఇవ్వండి బాబూ తింటాడు,'' అని చెప్పి ఉరికంబం ఎక్కిపోయాడు. ఉరి తీసేశారు.

ఎప్పుడో జరిగిపోయిన ఈ సంఘటన ఆయన చెబుతున్నపుడు అతని కళ్ళు చెమర్చాయి. ఉరిశిక్ష అమలుపరిచేటప్పుడు అక్కడున్న జైలరూ (బ్రిటిష్ దొర) వార్డెన్లూ, ఇతర సిబ్బందీ కూడా కంటతడి పెట్టుకొన్నారట!

ఇది విన్న నాకు, కొడుకు కోసం ఉరికంబం మీద తండ్రి పడిన ఆవేదన, ఆ పుత్రప్రేమ గుండెని కలచివేశాయి. అప్పుడే కాదు గుర్తు వచ్చినప్పుడల్లా చాలా బాధపడేవాడిని.

నేను ఈ సంఘటన విన్నప్పుడు నాకు సాహిత్యంపట్ల ఆసక్తిగాని, ముమ్ముందు రచయిత నవుతాననిగాని ఊహించలేదు. ఆ తర్వాత నేను రైల్వేలో చేరటం, పురాణం వారితో సాన్నిహిత్యం, ఆయన ఆంధ్రజ్యోతి వారపత్రిక ద్వారా నన్ను రచయితగా పరిచయం చేయడం జరిగాయి.

ఈ పై చెప్పిన సంఘటనని కథారూపంలో మలచాలని చాన్నాళ్ళ నుంచి అనుకొంటూ వచ్చాను. *చీకటి* కథ రాస్తున్నప్పుడు ఇది గుర్తుకొచ్చింది. ఈ సంఘటన ఆ కథలో బాగా అమురు తుందనుకొన్నాను. కథకి ఈ సన్నివేశం మరింత బలం చేకూరుస్తుందని భావించాను. అదే- అదే *చీకటి* కథలో ఉరికంబం ఎక్కిన డిబిరిగాడి తండ్రి ద్వారా రూపుదాల్చింది.

నేను గిరిజన మిత్రుడి ద్వారా విన్న ఈ యదార్థ సంఘటనే నా *చీకటి* కథలోని ఆ సన్నివేశానికి నేపథ్యం. మిగతా కథంతా కల్పితమే- ఫిక్షన్.

*చీకటి* కథ రచన మాసపత్రికలో (డిసెంబరు 1995) ప్రచురించబడింది.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 25 జనవరి 1998*

3




***ఆడెపు లక్ష్మీపతి** 2 మార్చి 1955న కరీంనగర్ జిల్లాలో పుట్టారు. వీరి మొదటి కథ 'ఆదర్శం' జూన్ 26, 1972 ప్రగతి వారపత్రికలో అచ్చయ్యింది. దాదాపు పాతిక కథలు రాశారు. 1997లో 'నాలుగు దృశ్యాలు' కథాసంపుటి ప్రచురించారు. కొన్ని కథలు ఇంగ్లీషులోకి అనువాదమయ్యాయి.*

**చిరునామా**

*2-3-64/10/ఎ/63, జైస్వాల్ గార్డెన్స్,*
*అంబర్‌పేట,*
*హైదరాబాద్-500 013.*
*Ph.: 9701227207*


# ముసల్దాని ముల్లె

## ఆడెపు లక్ష్మీపతి

"వో నాయినా... మన సందుగ, ముల్లెలు అన్నీ ఎక్కిచ్చినవా...?"

"ఆఁ అన్నచ్చినయ్... సందుగ అవ్వ దగ్గరుండాలె సూడు... నువ్వున్న కాణ్నె మీద పెట్టు."

"అయ్యా, జరంత పక్కకు జరుగు నన్ను గట్ల పోనీయి- రాయే పోరీ దబదబ..."

"ఏందవ్వా- గుమ్ముటం తీర్గ తొవ్వల నిలబడ్డవ్. లోపట్కి పోయెటోళ్లను పోనీయవూ?"

"ఇగో... మంచిగ మాట్లాడూ... ఇంకెటు బోవాలె? ఆడ మొగోళ్లున్నరు కనబడ్తలేదా...?"

"వారీ... విశ్వనాతమూ... చెల్లె శెయ్యి పట్టుకో... ఛత్రి బద్రం సుమా..."

"అయ్యయ్యో... ఏం కలీగం... మీ యిండ్లు పాడుగాను... బుట్ట సూసుకుంటనే తొక్కు కుంట నడుత్తాండ్రు... పలారాలు, సద్దిబువ్వ మైలపడిపోవట్టె..."

"గంత నీటుకమైతె ఎట్లనమ్మో... బస్సు టాపు మీన ఎయ్యకపోయినవ్... లేకుంటె బతుకమ్మ శిబ్బి నెత్తుకున్నట్టు నీ నెత్తిమీద పెట్టుకోనుంచుకో... ముట్టుడు కాకుంట ఉంటది నీ బోనం కుండ..."

"మారాజువు మంచిగనె మాట్లాడుతవ్... మీ సామాన్లన్నీ మీదనే యేశినవా...? జర సూసుకుంట నడువుండ్రంటె ఏందేందో మాట్లాడబట్టివి..."

"ఈడ మనుషులు నిలబడెందుకె జాగ లేదంటె నువ్వేందో బుట్ట అనొర్రుతానవ్ గా పక్కకు సీటు కిందికి దొబ్బు నీ సద్దిమూటను."

"దొరా... మీ సీటు మీద గీ సంటోన్ని కూకుండ బెట్టుకుంటవా..."

"ఎహెఁ... ఈడ మాకె ఇర్కుటంగున్నది. బస్సు కదిలినంక సూద్దామాగు..."

"ఏందయ్యా... నీ సుట్టకంపు రుమాలు... నువ్వా... వో పటేలా... నిన్నే... గా కట్టె కింద పండబెట్టు... మా కండ్లు పొగొడ్తవా ఏంది..."

"అయ్యా బాంచను... కాళ్లు జరంత గటు జరుపు. గొంగడి కిందేసుకుని కూకుంట."

"అరే... హుస్సేన్. పీఛె కా సీట్ ఖాళీ హైక్యా..."

"జీఁ నహీఁ... మై ఖుద్ ఖడాహుఁ..."

"అగ్గొ... మంచిగనె ఉన్నది యవ్వారం... ఈ సీటు నేనాపిన. సంచి పెట్టిన. లేలే..."

"టికెట్. టికెట్... ఓ బీడీ తాగే సారూ... బీడి ముక్క ఆవల పారేశి జల్దిన పైసల్దియ్. ఏడికి బోవాలె...?"

"యేములాడకు... మూడు ఫుల్..."

"వంద రూపాయలనోటా...? శిన్ననోటే యిచ్చినవ్. అయిదువందల రూపాయల నోటు ఇయ్యకపోయినావ్... ఆఁ... ఎవ్వలెవ్వలు జెప్పు. ఈ పిలగాడు ఎవ్వల కొడుకు...?"

"మా సంటోడే... నా కొడుకు..."

"పిలగాన్కి గూడ టికెట్టు తగుల్తది. హాఫ్ టికెట్..."

"గింత శిన్న సంటోనికి టికెట్టేందయ్యా... నాలుగేండ్లు నిండలేదింకా..."

"సంక కెత్తుకోని పాల్జీకుతాండు అన్నా ఊకోను... ముంగట చెకింగయితది. నువ్వా నేను ఇద్దరం లోపట్కి అయితం. ఇగ తీస్కో టికెట్లు... మూడు ఫుల్ ఒక హాఫ్. మిగిలిన పైసలు దిగేటప్పుడు తీస్కో... ఆఁ... టికెట్లు ఇంకా..."

"నాంపెల్లికి రెండు..."

"ఇగపట్టు... మంచిగ చేతులో పట్టుకో... గాలికెగిరిపోతయి... లోపట్కి పో... ఓఁ యెనుకున్న పెద్ద మనుసులూ... వో పచ్చంగి పిలగా... అన్నా... వో కద్దరు కమీజూ... లోపలికి నడువుండ్రి... వో దుబాయి బనీనూ... నీకే... అర్రె లోపట్కి పొండ్రివయ్యా అంటే మీక్కాదా... అటు దొబ్బుకపో... ఊఁ... గట్ల... ఆఁ... మీది సార్ ఎక్కడికి...?"

*

"... మక్కకంకులు... లేత మక్కకుంకులు... లేత కంకులు... గరంగరం కంకి... రూపాయి కొక్కటి..."

"...వోఁ మనిషీ... ఇగ గా సారాకొట్టులోనే కూకుంటవా... నీ బొంద పెట్ట. నీ తాగుడు పాడుగానూ... వో గౌండ్లోల్లన్నా... ఇగ సాలు పొయ్యకు..."

"...ఎహెఁ.. ఆడిదానా... ఏం వదుర్తానవ్. ఇంక పొద్దుగూకలె... బస్సు కదుల్తలేదు..."

"...బస్సులు నిండిపోయినై... ముంగటి బస్సు కదుల్తాంది... పోరగండ్లు సలికి వొనుకు తాండ్రు. ఇంక అక్కణ్నె సత్తవా... ఊళ్లల్ల, వాడలల్ల కల్లు దుకాండ్లు, సారాకొట్టులు... మా సంపాద నంత మీరే జుర్రుకోబడితిరి. ఇక్కడ గీ సలిల, వానల వాగొడ్డున గూడ మమ్ముల పీక్కుతినుడేనా... ఈడ సార దుకాండ్లు పెట్టకపోతేనేం... మీ ఇండ్లల్ల పీనుగులెల్ల..."

"...మేం బలిమీటికి పోత్తానమా... ఉద్దెర ఇత్తానమా... నీ బంగారం మంచిదిగాక మమ్ముల తిడతావేందమ్మో... ఏయ్ ఇక పోవయ్యా... నీ పెండ్లం వొర్రుతాంది..."

“...వో అన్నలారా... ఎక్కడున్నరో... మీరు మెరుపోలె రాబడితిరి., పోబడితిరి... మా గోసలు గిట్లనె ఉండె...”

“...సాబాసుపల్లి... సంకెపల్లి... నాంపల్లి... శాంతీనగర్... వేములవాడ... అగ్రహారం... సిరిసిల్ల... జప్పన ఎక్కుండ్రి- ఆల్శం జెయ్యక... ఇగ బస్సు కదుల్తది... వో అన్న ఏడికి...? ఎంత మంది?... సర్వీసు ఎక్కుండ్రి... ఊహూ... ఒక్క నిముషం గూడ ఆగుడులేదు. మీరు ఎక్కుడే ఆల్శం... సర్కారు బస్సు కన్న ముంగటపోతది... చార్జీ తక్కువ...”

*

“హలాల్ జేసిన కోడిపెట్టోలె వొర్రుతాండు ఆ కిలీండరుగాడు... ఇంక ఎంతమందిని ఎక్కిస్తడో... అరగంటాయె... ఇక ఉర్కుతది అంటాండు కాని గట్లనె ఉంటాంది.”

“మన బస్సుల మాత్రం తక్కువమందున్నారా... ఇంకా ఎక్కనెబట్టిరి... ఈ జనం... ఇంకో రొండు బస్సులచ్చినా సరిపోవు...”

“కండట్టరు సారూ... ఇగ రైట్ జెప్పరాదు... ఆవల మొగులు మూసుకత్తాంది మళ్లా.”

“హన్నా... నువ్వెక్కి కూకోంగనె బుయ్యిమని ఉర్కాల్నా...? ముంగట మందున్నరు. ఇంకయిదు నిముసాలాగాలె...”

“గీ ముసురు కగ్గితలుగ... ఎంత కట్టమచ్చె... కోతకచ్చిన పొలాలు, పొట్టమీదున్న నారు మునిగిపోయె... అంతటా బురద ఇసుక మేటయేసిపాయె... ఇగ ఈ యేడు ఏం తింటం? బువ్వ దొర్కుతదా...?”

“అగో... గా గుట్టకింది ఊళ్లు సూడు. ఇండ్లు ఇండ్ల తీర్గలెవ్వు. సచ్చిన గొడ్లు వరదలల్ల కొట్టుకపోతానై. ఏటి వొడ్డున చేండ్లు, పొలాలు అగుపడ్తలేవు. అబ్బ... ఈదరగాలి పాడుగానూ. యమ కొరుకుతాంది... తాడిచెట్లు యియ్యరమయ్యర ఊగుతానయ్. కరంటు తంబాలు నేలమీది కొరుగుతానయ్...”

“ఇగో నిన్నె... వాల్లేందో మంచి ముచ్చట మాట్లాడుతాంటె నువ్వేందో కునికిపాట్లు పడుతవు... రాజవ్వ ఇల్లు చెర్వు కిందనె ఉన్నది. ఎట్లున్నదో కూడూ, కొంపా... ఈ ముసురు ఎన్నొద్దులుంటదో గా సదూకున్నసారు నడుగు...”

“వాయుగుండం తీరం దాటిపోయి, బంగ్లాదేశ్ వేపు మళ్లింది. క్రమంగా తెరిపినిస్తుంది. ఈరోజు చెదురుముదురుగా జల్లు లేదా ఓ మోస్తరు వర్షాలు కురవవచ్చు,” అని వాతావరణ సూచన రేడియోలో...”

“రైట్... రైట్... డోరేసుకొండయ్యా... గట్టిగ... తాకతులేనట్టు...”

“గేర్లపడింది... మళ్లాపిండు డ్రైవరు...”

“ఏమైంది... ఖాదర్‌భయ్యా... రైట్...”

“ఎవతో ముసల్ది... పగ్లీబుడ్డి... అడ్డమచ్చింది... బస్సెక్కుతదట...”

“అయ్యా బాంచన్... పండు ముసల్దాన్ని... నన్ను జరంత ఎక్కనీయి. గీ మూటలు గటు తొయ్యి బిడ్డ...”

“ఇప్పటిదాంక ఏం జేశినవ్... బస్సు కదిలె మోపుకు ఉరికత్తానవ్... ముంగటి బస్సుల ఎక్కకపోయినవ్...”

“గండ్లనె ఎక్కిన బాంచను. ఎక్కి కూకున్నంక, బస్సు కదిలెటప్పుడు జెప్పిండు ఆ కిలీండరు దెశమంతుడు... బస్సు యేములాడకేనట... యేములాడల దిగిపో- అక్కణ్ణించి సిరిసిల్లకు మస్తు బస్సులుంటయట... నాకు దెల్వదట... వాని మొకం కగ్గితలుగ... ముందుగాల సిరిసిల్ల దాంక పోతదని జెప్పిండు...”

“సరె... సరె... జల్దిన లోపల్కి పా... గా ముల్లెలు... ఎన్నో... తాను దూరకంత లేదు మెడకో డోలు అన్నట్టుంది... ముల్లెలు సీటు కిందికి దొబ్బి... ఎవ్వల కాళ్ల కాడనన్న కూకోపో...”

“అగో సూడు... ఇంకిద్దరు ఎక్కింండ్రు... కళ్లద్దాల సారు... వెనుక పెద్ద సూటుకేసాయన... ఆ సూటుకేసు ఏడబెత్తడో... ఏడ నిల్సుంటడో...”

“సాయికుమార్ సార్... హల్లో... ఇట్ల రండి... ఇక్కడ కూర్చుందురుగానీ...”

“ఎవ్వరు... వోహ్... వేణుగోపాల్ నువ్వా... సంతోషం. ... ఎడారిలో ఒయాసిస్సులాగా. అబ్బ... ఏం ప్రయాణమో ఏమో చాలా అవస్తలు పడ్డాను. మూడు గంటల నుండి కూర్చునే విరామం దొరకలేదంటె నమ్ము... జనం అప్పుడే నిండిపోయి కదుల్తోందా బస్సు... సంత గోల... కాందిశీకుల శిబిరంలోలాగా వుంది బస్సులో పరిస్థితి... నేనిక్కడ కూర్చుంటాను... ఇంకో సీటున్నదా... కొంచెం అడ్జస్టు అవుదాం... ఈయన సుందర్రాజుగారు... కరీంనగర్‌లో పరిచయమయారు. థర్మల్ పవర్‌స్టేషనులో ఇంజనీరుట... సిరిసిల్లకు వస్తున్నారు... ఈ రూటు కొత్తట...”

“నేను ఇవతలి వొడ్డెక్కినంక చూసిన. మీరు షాబాషపల్లి వాగులోంచి ఏరు దాటించేవాడి సహాయంతో నడుచుకుంట వస్తున్నారు. సరిగ్గ గుర్తుపట్టలేకపోయిన. లేకుంటె మీరొచ్చెదాంక వొడ్డు మీద ఆగెటోడిని. ప్రసాద్... పాపను కాళ్లమీదికి తీస్కోని... ఆ సార్‌ను కూర్చోనీయి. స్మాల్ అడ్జస్టుమెంటు. ప్రసాద్ నా కొలీగ్. హార్డు వర్కర్... జీనియస్. గ్రూప్‌వన్ మెయిన్ పేపరు పాసయాడు. పింకి అపర్ణ కూతురు. కాలేజీలో ఆమె నా జూనియర్... అదుగో ఆమె ముందు వరుసలో కూర్చున్నది...”

*

“...ఒకని గిరాకీ మరోడు గుంజుకోవద్దు. మనం మనం లొల్లి పెట్టుకోవద్దు. ఇగసాలు. ఆకరి బస్సు ఇంకోటత్తదేమో... అదొక్కటె సూద్దాం. పొదుగూకినంక ఏట్లెకు దిగొద్దు...”

“ఊళ్లె ఎండుపుల్ల దొర్కుతలేదు. ఇయాల్టి కట్టానికి ఈ ముప్పయి రూపాల్ సాలు...”

“అగో ఆకరి బస్సు కొదురుపాక వొడ్డుకచ్చింది... నువ్వు జెప్పన అటుపో. మైసన్నకు జెప్పు. ఒకనిదొకడు గిరాకీ గుంజుకోవద్దని... ఇగ గట్టి వాన కొట్టెటట్టు లేదు. నీళ్లు బాగ గుంజినయ్. మన వొడ్డు దాటిచ్చె కూలీ ఈరోజుతో ఆకరు. రేపు జనం మన అవుసరం అడుగరు. వాళ్లే ఏరు దాటుతరు...”

“...రాయమల్లి బాలింత... వాడు సమ్మయ్య ఇంక ఈడనె ఉన్నాడా... ఎన్ని ట్రిప్పులు కొట్టిండో... వాని కాలుకు నెత్తురు కార్తాందా... నీర్నాగుంబాము గిట్లకరిసిందా... ఆఁ... ఇంగిలీకం ముల్లు కుట్టిందా... ఏందీ... ఇప్పుడు మంచిగనె ఉన్నడు గద...”

“...మనిషికి మూడు రూపాల కంటె తక్కువ ఒప్పుకోవద్దని జెప్పిన. లగేజి వుంటె ఇంకో రొండు రూపాల్?.. కక్కుర్తి గాడిదికొడుకులు... వాడు యలమంద రూపాయికె ఉర్కిండు. వాగుల అటురికి ఇటురుకి నెరిపడ్డడు. అయితేంది యాభయి రూపాలయదాకా సంపాయించిండు...”

“... రోడ్డు డ్యాం మరమ్మతు ఎల్లుండి మొదలయితదా... అయితె మానె... ఆ కూలీ మనకు కాకపోతె ఇంకెటుపోతది... ఎహె... ఊకె జగడం పెట్టుకోకుండ్రి... ఒకనికి అయిదెక్కువ మరోనికి అయిత్తక్కువ... ఏందీ... గడ్డా సొప్పా... అని ఉన్న గొడ్ల గురించి సోచాయించకు. జప్పన షావుకారి దగ్గర్కిపా... ఎచ్చాలు కొనుక్కోవాలె...”

*

“ఈ కూలీలు, వాగు దాటించె తెనుగోళ్ల పని బాగుంది... ఈ వంతెన ప్రతి యేడూ కూలిపోవాలనీ, తుఫాన్లు- వరదలు ముమ్మరంగా సంభవించాలనీ దేవుడ్ని వేడుకొంటారు

కాబోలు... ఆహా... బస్సు కదిలినాక ఫ్రెష్ గాలి వీస్తోంది. ఏం రొచ్చువాసన, ఏం నీచుకంపు... ఈ ప్రాంతంలో రోడ్ల స్థితిగతులు, బస్సుల పనితీరు ఇంత అధ్వాన్నంగా ఉందేమిటి? మామూలు సందర్భాల్లోనైనా బస్సులు సజావుగా ఉంటాయా... లేక క్రిక్కిరిసిన రద్దీతో చేపలమార్కెట్టులా ఇలాగే ఉంటాయా...?''

''కష్టజీవుల గురించి అంత సినికల్‌గా మాట్లాడకండి సార్... స్థిరమైన ఆదాయం లేని గ్రామీణ పేదవర్గాల బతుకులు ప్రకృతి వైపరీత్యాల మూలంగా చాలా అస్తవ్యస్తమవుతాయి. సీజనల్ వృత్తిగా దేన్నయినా వాళ్లు చేపడతారు, పొట్ట పోసుకోవడానికి. ఏరు దాటడం మన అవసరం. దాటించినందుకు వాళ్ల శ్రమకు మూల్యం అడగడంలో తప్పేమిటి? ఇక మీరన్న ప్రాంతాల అసమాభివృద్ధి. కొన్ని ప్రాంతాల కంటె మరికొన్ని ప్రాంతాలు, ఒక రాష్ట్రం కంటె మరో రాష్ట్రం బాగా వెనుకబడి వుండవచ్చు... అసలు మన దేశమే వెనుకబడ్డ అభివృద్ధి చెందుతున్న దేశం... అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే మనం శాస్త్రసాంకేతికంగా, సాంస్కృతికంగా కనీసం యాభయి ఏళ్లు వెనకబడిపోయాం... సో... ఇప్పుడు మీరు దేన్ని చూసి వాపోతున్నారో ఆ స్థితి జనరల్‌గా భారతదేశ ఆర్థిక, సామాజిక పరిస్థితి...''

''మీ భాష బాగున్నది... సాయికుమార్‌గారిది ఇంకా బాగుంది. ఈ ప్రాంతపు మాండలికం యాస లేకుండా స్పష్టంగా వుంది. మీలాంటి విద్యావంతుల, సాహితీవేత్తల, మేధావుల పరిచయం కలిగి కంపినీ దొరికినందుకు చాలా సంతోషం...''

''మా సాయికుమార్ మాస్టారు పేరున్న రచయిత... శుద్ధ గ్రాంథికం, వ్యావహారికం, అన్నీ ప్రాంతాల మాండలికాలు అవలీలగా రాస్తారు... అనర్గళంగా మాట్లాడతారు. సాహితీ సదస్సుల్లోకి ప్రత్యేకించి మేస్టారి ఉపన్యాసాల కోసమే వెళ్లేవాడిని... ఆయన రచనలు చదవండి... తెలుస్తుంది...''

''ఆ... ఆఁ... సార్ గురించి విన్నాను. పేపర్లలో చూశాను. కాని ఆయన రచనలు చదివే భాగ్యం కలగలేదు... మీ తెలంగాణ కథల్లో, రచనల్లో ఎక్కువ మాండలికం వాడతారు... ఎరికేనా, మాయిల్యమే, జెప్పన, యిగ్గుడు, గుంజుడు, నూకుడు, మందలిచ్చుడు- లాంటి పదాలు మాబోటి కోస్తాంధ్రా వాళ్లకు అర్థమయి చావవు. ఈ పదప్రయోగాలున్న రచనలు చదవాలంటే ఏదో పరభాషా పుస్తకం చదువుతున్నంత ఇబ్బంది ఫీలవుతాను. ఈమధ్య సినిమాల్లో, టీవీ సీరియళ్లలో ఈ మాండలికాన్ని విరివిగా వాడుతున్నారు. గమ్మత్తయిన కొన్ని పదాల అర్థాలు నా భార్య నన్నడుగు తుంది.... నాకే తెలీదు నేనేం జెప్పను...''

''తెలుగుగడ్డ మీది చాలామంది ప్రముఖ రచయితలు, సాహితీకారులు ఆయా ప్రాంతాల లోని మాండలికాలను తమ రచనల్లో విరివిగా వాడారు. గిడుగు, గురజాడ, రావిశాస్త్రి, ఇంకొందరు రాయలసీమ రచయితలు; ఒకానొక రకమైన ప్రిజుడిస్ మూలంగానో ఏమో- నేటి పండితులు కొందరు తెలంగాణ యాస వినడానికింపుగా ఉండదంటారు. ఈ ధోరణి కావాలని ఒక ప్రాంతీయ భాషా సంస్కృతిని కించపరచడమన్నట్టె... కొందరి దృష్టిలో ఈ యాస కేవలం వినోదం కోసమే- విని, మాట్లాడుకుని, అనుకరించి నవ్వుకోవడం కోసమే... ఈమధ్య సినిమాల్లో, టీవీల్లో- మీరన్నట్టు ఈ మాండలికాన్నీ కృతకంగా వాడి మరీ వికృతం చేస్తున్నారు. మీరు ఓపెన్ మైండెడ్‌గా గమనిస్తే ఈ మాండలికంలోనూ, మిగతా మాండలికాల్లో లాగానే చక్కటి నుడికారం, జాతీయ పద బంధాలు, సజీవత కనుక్కోగలుగుతారు...''

''మీరు బాగా చెప్పారు. నేను ఊరికెనే నా అభిప్రాయం వెలిబుచ్చాను. నాకేమీ ప్రిజుడిస్ లేదుసుమా... ఇకముందు వీలు చూసుకుని మీ కథలు తప్పక చదువుతా.''

''సాయికుమార్ సార్... ఏమిటి విశేషం... మీ టూర్లు ఎక్కువగా హైదరాబాదు, లేదా మద్రాసు వేపు ఉంటాయికదా! ఈ తుఫాను హోరులో ఇటువేపు... సిరిసిల్ల వేపు... బయలుదేరా రేమిటి? అర్జంటుపని అయి వుంటది...''

''ఔనోయి వేణూ, ఇప్పుడు రిలీఫ్‌గా ఉందయ్యా... థాంక్స్... అనుకోని ప్రయాణం అర్జంటు గా తగిలింది... సిరిసిల్లకు సాబాసుపల్లి మీది రోడ్డు డ్యాం రాత్రి వరదకు కొట్టుకుపోయిందని కరీంనగర్ బస్టాండులోనే తెల్సుకున్న. బోయినపల్లి మీది కెళ్లి వేములవాడ వైపుగా వద్దామనుకున్న. కానీ, ఆ రోడ్డూ- ఏదో బస్సు బురదకాలువలోనో పొలాల్లోనో కూరుకుపోయినందువల్ల ఆ రూట్ జామ్ అయిందట, బస్సులు నడస్తలెవ్వట. ఇక ఏం చెయ్యాలో అర్థంకాలేదు. గంటాగినాక కంట్రోలర్ నడిగితే చెప్పాడు... వాగు మీద వరద తగ్గిందనీ, పడికట్టు రాళ్లు తేలినాయనీ, నది దాటించే తెనుగోళ్ల సాయంతో ప్రయాణీకులు ఆ వొడ్డుకూ ఈ వొడ్డుకూ నడుస్తున్నారనీ... అలా మెరుగయిన పరిస్థితుల దృష్ట్యా తమ డిపో బస్సులు కొదురుపాక వొడ్డు వరకు నడుస్తాయనీ, సాబాసుపల్లి వొడ్డు నుంచి సిరిసిల్ల లేదా కామారెడ్డి డిపో బస్సులు నడుస్తాయనీ డిపో మేనేజర్ చెప్పాడు. ఎటువంటి ఒడిదుడుకులయినా ఎదుర్కొని గమ్యం చేరుకోవడం ముఖ్యం అనుకొని రడీగా ఉన్న బస్సెక్కేశాను...''

''ఇలాంటి పరిస్థితి మీకెప్పుడూ ఎదురై వుండదు. పొంగి పొరలె వాగు దాటడం...''

''ఔను. ఇదో విచిత్రమైన అనుభవం. నన్ను వాగు దాటించినవాడు నల్లగా, మొరటుగా హెర్క్యులస్‌లాగా ఉన్నాడు. నా బ్యాగు, బూట్లు వాడు నెత్తిమీద పెట్టుకుని, నిలువెత్తు కంటె ఎక్కువ పొడవున్న కర్రతో లోతు చూస్తూ నాకు మరో చెయ్యి ఊతంగా ఇచ్చి సంకోచం లేకుండా తనను అనుసరించమన్నాడు. జలజలమంటూ సుళ్లు తిరుగుతూ, నురగలు కక్కుతూ చల్లగా మురికిగా ప్రవహిస్తున్న వాగులోకి దిగి నడవాలంటె ముందు జంకినమాట వాస్తవం. ఏటి మధ్య లోకి వచ్చి నంక గజ్జలదాకా నీళ్లు వచ్చినై. చల్లగా కొరుకుతూ వేగంగా పారె వరద... ఈదరగాలి... వళ్లు తూలిపోతున్నట్టుగా జలదరింపు... కాళ్ల కింది మెత్తటి ఇసుక నున్నగా జారిపోతోంటే చక్కిలి గింత... గమ్మత్తయిన అనుభూతి... 'స్వీట్ ఆర్ ది యూజెస్ ఆఫ్ అడ్వర్సిటీ' అనిపించింది. ది సీనరీ, ది అబ్‌స్ట్రాక్టు వ్యూ ఆఫ్ ద డిస్టెంట్ ఆబ్‌జెక్ట్స్ అగెనిస్టు ద బ్యాక్‌డ్రాప్ ఆఫ్ ద మర్కీ స్కై... ఆర్ రియల్లీ ఇన్‌స్పైరెటివ్... సకాలంలో గమ్యం చేరుకుని, పని పూర్తిచేసుకున్నాక రాత్రికి మూడ్ బాగుంటె, ఈ అనుభవం మీద పోయమ్ లేదా స్కెచ్ రాస్తాను. ది ట్రావెయిల్స్ ఆఫ్ ది పీపుల్, ఎస్పెషల్లీ ఆఫ్ ద పూర్ మాసెస్ హూస్ లైవ్‌లీహుడ్ హాజ్ బీన్ డ్రాస్టికల్లీ రెంచెడ్ బై ది రాత్ ఆఫ్ ది స్టార్మీ నైట్... మీద ఆనక కథ రాస్తాను...''

''నెలరోజుల క్రితం మీ ఫోటో దినపత్రికల్లో చూశాను సార్... కత్తిరించి పెట్టుకున్నాను... అదేదో సందర్భం గుర్తురావడం లేదు...''

''యూనివర్సిటీ వారి ఆర్థిక సహకారంతో నా పుస్తకాలు రెండు అచ్చు వేయించాను. 'పుడమితల్లి' అనే కవితాసంకలనం, 'ఎత్తిన పిడికిలి' అనే కథానిక సంకలనం. పుస్తకాల ఆవిష్కరణ సభ రాజధానిలో పెద్ద ఎత్తున జరిగింది... ఆ సందర్భంలోనివే పత్రికల్లో ప్రచురితమైన ఫోటోలు...''

''ఓహోఁ... అదా సంగతి. కంగ్రాట్యులేషన్ సార్... వారం కిందట బుక్‌ట్రస్టులో 'కొత్త పుస్తకాల' వరుసలో వాటిని చూశాను. రెండు పుస్తకాలు కొన్నాను. మా లైబ్రరీలో ఉంచేందుకు మా ప్రిన్స్‌పాల్‌గార్ని వప్పించాను. కథలు- సూపర్. అంతర్జాతీయంగా గుర్తింపు రావాల్సిన కథలవి. పొయిట్రీ గొప్పగా వుంది. కానీ కొన్ని కవితలు అర్థంగాలేదు సార్...''

''మరోమారు చదువు... ఫ్రీవర్సే కదా...''

''ఊహూఁ... లాభంలేదు... బుర్రకెక్కలేదు. ఉండండి... ఒక కవితలో కొన్ని వాక్యాలు డైరీలో రాసుకున్నాను... చిరిగిన ప్రపంచపటం మూడో ముక్కలో బురదబాటల మీది స్త్రీలు కనుబొమలు దిద్దుకోరు. ఊరుమ్మడి నూతిగట్టు మీద ఖాళీచెంబుల్లాగా కూర్చుంటారు వారు ఓపికతో- కృష్ణవేణి జడ పాయపాయలో ఆశను తురుముకుని- నీటి అద్దంలోకి లోతుగా చూస్తారు- తమ కళ్లల్లోని తడి కోసం... ఈ వాక్యాలు వివరించండి.'''

“కథలోనైతే శైలి, శిల్పం, నిర్మాణం, ముగింపు ఉంటాయి. ఇవి పాఠకునికి సూటిగా అర్థమయేలా ఉంటాయి, వస్తువు, వర్ణన. కాని కవిత్వంలోకొచ్చేసరికి కొంచెం మేధోపరమైన కసరత్తు అవసరమవుతుంది. కవిత్వంలోని భాష సహజవాసనకు, అనుభూతికి, ఆలోచనకు తాకేలా వుండాలి. ఇది సాధించేందుకు కవి భావచిత్రాలు, ప్రతీకలు, ఉపమానాలు విరివిగా వాడతాడు. భారత్ మూడో ప్రపంచదేశం... ఇక్కడి స్త్రీలు పాశ్చాత్యవనితల్లాగా ఫ్యాషనబుల్‌గా ఉండరు. హక్కుల కోసం పోరాడరు. వంటపాత్రల వలె ఓపికగా పడి వుంటారు ధరిత్రివలె. తరతరాల చరిత్రలో మార్పురాని భారత స్త్రీ స్థితిగతుల గూర్చిన భావన అది...”

“థాంక్స్... అర్థమయింది. మీ దృష్టిలో రచయితల వర్గీకరణ...?”

“రచయితలైనా, కళాకారులైనా నా దృష్టిలో రెండు రకాలు. ఒక రకం ప్రభుత్వ పక్షం. మరోరకం ప్రజల పక్షం. ప్రజల పక్షాన ఉన్న కళాకారులే, రచయితలే కవిత వాస్తవికతను ప్రతి ఫలిస్తారు.”

“పాశ్చాత్య రచయితలకు, మన రచయితలకు పోలికలు-భేదాలు ఏమిటి...?”

“నా అభిప్రాయం ప్రకారం వెస్ట్‌లో రొమాంటిసిజం, అస్తిత్వవాదం, అధివాస్తవికతా వాదం ప్రబల ధోరణులు. జాక్ లండన్, స్విఫ్ట్, ట్వెయిన్ లాంటివాళ్లు తప్ప అక్కడ ఎక్కువమంది ఎలైటిస్ట్ సాహిత్యమే సృష్టించారు. మన దగ్గర పీడిత ప్రజానీకానికి సంబంధించిన సామాజిక స్పృహ ఉన్న రచనలే ఉత్తమ తరగతికి చెందిన సాహిత్యంగా గుర్తించబడుతున్నాయి.”

“సంకెపల్లి... సాబాసుపల్లె... దిగెటోళ్లు జల్దిన రాండ్రి...”

“బస్సు పూరాగ ఆగనీయి... ట్రంకుపెట్టె ఇగో... వాన బాగనె పడుతాంది...”

“ఇక ఎవలు లేరా... రైట్... డోరు గట్టిగముయ్యి... ఎట్లనయ్య... మాంసం కూర తింట లేవా... అద్గదీ... రైట్...”

“ఉత్తగనె బుర్రుబుర్రుమనిపిత్తాండు. కదిలిత్త లేడు బస్సు...”

“యాడిదాకా సిరిసిల్లకా... జల్దిన సైకిళ్లు మీదేసి ఎక్కుండ్రి... ఏమేం సాపలు వున్నాయ్...”

“గీ బుట్టలు, తోపెలలు పట్టుకో... కొమురా ఎక్కురా... నేను సైకిళ్లు అందిస్త.”

“జెల్లలు, కొర్రమట్టలు, పాపెర్లు...”

“ఎన్ని కీలోలయితయి... గంత గనమెక్కడర... ఇచ్చె రేటు జెప్పు... అన్నీ తీస్కుంటం...”

“మంచోడె వున్నడు డైవరుసాబు... బస్సు ఆపుకుని నిమ్మళంగ సాపల బేరం జేత్తాండు.”

“వో ఖాదర్ భయ్యా... ఏమైంది ఏం జెత్తానవ్...”

“జనం యేగిర్తపడితే నీకేందయ్యా ఆంజనేలూ... పచ్చాపలు... మంచిగున్నయ్ వాగుల పట్టిండ్రట బేస్తోళ్లు... సస్తల మాట్లాడిన... చెరో కిలో తీస్కుందాం...”

“సరే... మంచిపని జేశినవ్. నీ నీసుముచ్చు బుద్ధి పోనిచ్చుకోలేదు. గా తోపెలలు గూడ మీదనె ఎయ్యిమన్జెప్పు. ఈడ జాగలేదు, లొల్లి...”

“అబ్బ ఇంకెంతమందిని ఎక్కిస్తవయ్యా... ఇండ్ల వూపిరి తిరుగుతలేదు. అబ్బ కాలుష్యం... బురద... వాననీళ్లు... ఇప్పుడు చాపలకంపు...”

“నల్గురు దిగిండ్రు... ముగ్గురం పట్టమా... ఏం జెయ్యాలె బాపనయ్య పంతులూ! ఎవ్వల పొట్టతిప్పలు వాళ్లయి. మీరు గుళ్లో పూజలు చేయించుకుంట, మంత్రాలు సదువుకుంట సంపాయిస్తరు. మాదిగట్ల కాదు కద... మా జీవనం గిట్ల... పోశెట్టీ తోపెలలు ఎగిరిపోకుంట గట్టిగ కట్టినవా... కండక్టర్ రైట్...”

“అంకుల్... కిటికీ తెరవరా... బయట వడగళ్లు పడతాను... ఐస్... ప్లీజ్...”

"వద్దు... నీ గాయం తడి అవుతుంది. ఇన్‌ఫెక్షన్ అయే ప్రమాదముంది... అయినా ఇప్పుడు వడగళ్లు... నువ్వనె మంచుముక్కలు ఈ వర్షంలో రావు... అవి సమ్మర్‌లో వచ్చే వర్షంలో పడతాయి. అదెలా అని అడగకు. అదో థర్మోడైనమిక్ థియరీ. ముందు ముందు నీ హైయ్యర్‌క్లాసుల్లో మీ సైన్స్ టీచరు నడిగి తెలుసుకో..."

"అమ్మాయి తలకు గాయమెలా అయింది...?"

"స్కూలు బిల్డింగు కూలింది. అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు."

"ఈ భారీ వర్షం మూలంగా ఎంత ప్రమాదం జరిగింది... అబ్బ..."

"తప్పు వర్షాలది కాదు. బిల్డింగు కట్టించిన కంట్రాక్టరుది నేరం. డబ్బు సంపాదించే ధ్యేయంతో గబగబ బిల్డింగు కట్టించి అదేదో విద్యానికేతన్ అనే బోర్డు పెట్టి స్కూలు వోపెన్ చేసిన యాజమాన్యానిది తప్పు... నాసిరకం కట్టడాలు... అవినీతి..."

"సరె... ఆ బిల్డింగు నాసిరకపు కట్టడం అందాము... మరి ఈ వాగు మీది వంతెన?"

"ఇదీ అదే సార్... ఇది కొట్టుకుపోవడం నా ఎరుకలో నాలుగోసారి. దీని ప్లాను స్ట్రక్చర్, మెటీరియల్‌లో ఎన్నో లోపాలుండాలి. లోపాలేమిటో ఇంజనీర్లకు తెల్సి వుండాలి. కాని... మళ్లీ మళ్లీ కట్టాలి... తమ జేబులు నింపుకోవాలి... వాళ్ల ఆలోచన అది..."

"మీరనే నాసిరకపు కట్టడాలులో స్టాండర్డు డిజైనులు ఇవి కంట్రాక్టర్ల ఉద్దేశపూర్వక తప్పిదాలు కావు సార్... అధికార్లు టెండర్లు జారీ చేస్తారు. లోయస్టు కొటేషన్‌కు కంట్రాక్టు అవార్డు చేయబడుతుంది. తక్కువ ఖర్చుతో పనినిర్వహణలో ఉన్నది లోపమంతా. ఉదాహరణకు నేను పనిచేస్తున్న థర్మల్‌స్టేషనులో వర్కులు చెపుతాను. మెకానికల్ రిపేరు వర్కులు, సివిల్ వర్కులు తక్కువ కొటేషన్‌కు ఇస్తారు సంబంధిత ఇంజనీర్లు. వ్యయం గురించి తప్పుడు అంచనా వేస్తారు నిపుణులు. ప్రభుత్వానికి, కంపెనీకి ఏదో ఉపకారం చేస్తున్న భ్రమలో ఉంటారు వీళ్లు. ఫలితం- ఏడాది తిరగకుండానే మెషీన్లు, వాల్వులు మళ్లా రిపేరుకు వస్తాయి..."

"యూ ఆర్ రైట్... తప్పు నిపుణులదయినా, అధికార్లదయినా, కంట్రాక్టర్లదయినా ఫలితం అదే... వీళ్లందరూ ఒకే హారంలోని పూసలు. అవినీతి, బంధుప్రీతి అన్ని రంగాల్లో వేళ్లూనుకుని ఉన్నది. ఈ కరప్షన్ ప్రక్షాళన అయితేనే దేశం బాగుపడ్తుంది..."

"మీ వాదన చిత్రంగా ఉంది... దేశం బాగుపడ్డం లేదంటారా?"

"ఎందుకు లేదు... బోల్డంత అభివృద్ధి చెందుతోంది. వ్యవసాయోత్పత్తుల పెరుగుదల నాలుగు పాయింట్ అయిదు శాతం. దేశవాళీ పారిశ్రామికోత్పత్తుల పెరుగుదల ఎనిమిది పాయింట్ నాలుగు శాతం- గత సంవత్సరం కంటె ఈ సంవత్సరం ఎంతో మెరుగు అని ప్రభుత్వ ప్రకటన. కానీ అల్లుడి నోట్లో శని అన్నట్టు ఆరు పాయింటు ఆరు ఉండే ద్రవ్యోల్బణం ఇప్పుడు పదమూడు పాయింటు ఆరు శాతానికి పెరిగింది. జాతీయాదాయం మూడు లక్షల నలభై ఆరువేల తొమ్మిది వందల తొంభై నాల్గు కోట్ల రూపాయలు. తలసరి ఆదాయం నాల్గువేల రెండు వందల యాభై రెండు రూపాయలు. జనసంఖ్య తెలుసా? ఎనభైనాల్గు కోట్లు. ఇక విదేశీ అప్పు- అరవై మూడు బిలియన్ డాలర్లు- మన రూపాయల లెక్కల్లోకి వస్తే రెండు లక్షల అయిదువేల కోట్ల రూపాయలు. మన స్థూల జాతీయోత్పత్తిలో యాభై ఏడు శాతం! మరో ప్రగతి... నిరుద్యోగుల సంఖ్య ఎంతో తెలుసా... రెండు కోట్ల ఎనభై లక్షలు. ఇవి మచ్చుకు కొన్ని గణాంక వివరాలు... ఇదీ మన ఆర్థిక పరిస్థితి..."

"ముసల్దాన... పెద్దపెద్ద ముల్లెలేసుకుని ఎటు బయలెల్లినవ్... ముసలోడు యెంబడి లేడేంది...?"

"ఇంకెక్కడి ముసలోడు బిడ్డ... పోయినేడు మట్టిల కల్సిపోయిండు. నన్నెప్పుడు తీస్క పోతడో దేవుడు.. ఏం పానమో... మొండి పానం... కాటికి కాళ్లు సాపుకున్నా రెక్కలకట్టం తప్పుత లేదు... మళ్లెప్పుడో... కొడుకును, బిడ్డను సూద్దామని సిరిసిల్ల పోతాన. మనుమలు, మనుమరాండ్లు కళ్లల్ల మెదుల్తాంౘ్రు..."

"నిజంగా మొండిపానమె ముసల్దానిది. అమ్మో దీని ధైర్యం పాడుగాను. గన్ని ముల్లెలు మోసుకుంట వాగులకెల్లి ఒక్కతే దాటి వచ్చింది..."

"ఏం జెయ్యాలె బిడ్డ... నా దగ్గర ఎక్కువ పైసల్ లెవ్వు. అయినా ఓ పొలగాడు ఉత్తగ దాటిత్తనన్నడు. అయితే గిరాకీ తగ్గేదాంక ఆగుమన్నడు. పొద్దు మూసుకత్తాంది. ఆగెటట్టు లేదు. అయినా నాకేం బయ్యం బిడ్డ! గిసొంటి వరదలు, వానలు ఎన్నో సూసిన. గీ వాగు ఎన్నో మాట్ల మా ముసలాయన తోటి దాటిన. ఇయ్యాల ఎందుకో కండ్లు తిరిగినై... గట్టు మీన కాలు పెడ్తాంటె జారిపడ్డ... తెనుగోళ్ల పొల్లగాని కడుపు సల్లగుండ... జబ్బపట్టి మీదికి గుంజిండు..."

"శివుని ఆజ్ఞ లేనిదే చీమయినా కుట్టదు. ప్రాణం పొమ్మంటె పోదు. రమ్మంటె రాదు. నీ ఆయువు గట్టిది ముసల్దానా. జారిపడ్డా, వరదల్లో కొట్టుకుపోయినా మరెక్కడ్నో తేలి బొంత పురుగులా గడ్డ మీది కెక్కుదువు..."

"బాపనయ్య పంతులూ... ఏదన్నా యగ్నం, యాగం చేసెటందుకు బయలెల్లింౘ్రా?"

"ఏం అట్ల అడుగుతున్నవ్?... ఎట్ల గుర్తుపట్టినవ్ జాలరీ...?"

"ఏంలేదు పంతులూ... బాపనయ్య, మేకపిల్ల కత యాదికొచ్చింది. మీ చేతుల్లో గడ్డిమూట వుంది కదా... ఏదన్నా మేకపిల్లనుగానీ గొర్రెపొటేలునుగానీ పట్టుకపోతాంౘ్రా అని... నా చిన్నప్పుడు హన్మకొండల ఓ యాగం జూసిన... అబ్బ ఏం జనం... ఎగబడ్డరు యాటమాంసం ప్రసాదం కొరకు..."

"ఛ... ఛ... మూర్ఖ శిఖామణీ... నేను మేకపిల్లనో, కుందేలు పిల్లనో తీస్కపోవడం లేదు. నువ్వనుకున్నట్టుగా ఇది గడ్డిమూట కాదు. ఇవి దర్భలు. ఏటి వొడ్డున ఏపుగా పెరిగి వున్నాయ్. మా దగ్గర ఇవి లభ్యంకావు. కాపువాని చేత కోయించి చేతుల్లో మోసుకుపోయెటట్టుగ మూట కట్టించిన. యజ్ఞాలు, యాగాలు మా వృత్తి కదా... ఈ దర్భలను హోమగుండాల్లో, పిండప్రదానాల్లో, గ్రహశాంతుల వంటి వివిధ క్రతువుల్లో ఉపయోగిస్తాం."

"ఊకె మడుగులల్ల, చెర్లల్ల, నీసుకంపుల బొర్లెటోళ్లం. మాకేమెరుక! ఏమీ తప్పు పట్టుకోకు పంతులూ. పల్లెటూరోళ్లం. మావోనికి ఎట్ల మాట్లాడాల్నో దెల్వది... గీ ముసుర్ల యాడికి పోయొస్తున్నరు...?"

"రాంనగర్ మందిర్ కమిటీ వాళ్లు గణేశ విగ్రహ సంస్థాపన కొరకు పిలిచారు. ఆగమ శాస్త్రోక్తంగా మందిర నిర్మాణం, ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠాపనలు నిర్వహించి వస్తున్నాను. కారు పంపిస్తామన్నరు. నేనే వద్దన్నాను. ఎలగందుల, కొదురుపాకల్లో నాకు కొన్ని పనులు- వనమూలికల సేకరణ వుండింది... ముగించుకుని వస్తున్నాను."

"పంతులుగారూ... శణార్తి... పంచాంగం ప్రకారం ఈ యేడు కాలం మంచిగుంటదని చెప్పబడె. మరి గీ వానలు, వరదలు ఏంది? మా యాపారం మందమయింది. మావోళ్లు సంగాలు, మగ్గాలు యిడిసిపెట్టి భీమండి, బొంబాయి, సోలాపూరు పోతాంౘ్రు."

"అప్పుడప్పుడు ఈ వైపరీత్యాలు తప్పవు. ఇవి తాత్కాలికములే. ముందు ముందు మెరుగయితది కాలం. కష్టాలు కలగకపోతె లోకంలో దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన ఎట్ల వస్తది...? దైవలీల... ఈశ్వరేచ్ఛ... మానవులకు ఎదురీత తప్పదు. 'యదృచ్ఛాలాభ సంతుష్టో ద్వంద్వాతీతో 'విత్సర' సమః సిద్ధావసిద్ధేచ కృత్వాపిన నిబద్యతే' అన్న గీతాకారుని వాక్యం మననం చేసుకోవాలి."

“అయ్యగారూ... దండాల్... మా వూరు శీర్లంచ తొవ్వ మర్సిపోయినట్టున్నారు! ఎన్నడో రతం పున్నమప్పుడు మావూరి కచ్చింండ్రు. శానా దినాల నుండి మా అత్త, మా బావ మిమ్ముల గలువాలనుకుంటున్నరు. నన్ను ఏర్పాటుజేసిండ్లా? బుచ్చయ్య కోడల్ను...”

“అహ... ఏర్పాటు చేయకేంది... మీ మామకెట్లున్నది? వచ్చె నెల వస్తా శీర్లంచ. సాంబిరెడ్డి గారింట్లో పూజ వున్నది. జరూరు పనుంటె మీ మామను ఓసారి సిరిసిల్లకే రమ్మను.”

“అయ్యో ఏం జెప్పేది... మా మామకు పచ్చవాతమచ్చి లేత్తలేడు. మా అత్త ఊకే శూలనొప్పి అంటాంది. పాడిబర్రె సచ్చిపోయింది. మా మనిషి రంథి తోటె పిచ్చోడయినట్టయిండు. ఊళ్లె అందరు అంటాండ్రు- ఇల్లు గట్టుడు సరిగ్గ లేదని. మీ అసొంటోళ్లకు ఇల్లు చూపెట్టి దర్వాజలు, నుయ్యి దిక్కులు మార్వాలంటాండ్రు...”

“పాత పెంకుటిల్లు తీసేసి బెంగుళూరు గూనతోటి ఇల్లు కడతనని మీ మామ ఏనాడో అంటూండె. అయితే ఇల్లు కట్టిండన్నమాట. ఎప్పుడు కట్టిండు. ముందు దర్వాజ ఎట్లున్నది?”

“దసరా పండుగ ఎల్లినంక వారంరోజులకే ముగ్గు పోశినం. మూన్నెళ్లల్ల అయిపోయింది. ఇల్లు గట్టుడు, ముంగటి దర్వాజ పడమరకున్నది.”

“అదే తప్పు చేసింండ్రు మీరు. వాస్తుశాస్త్రం ప్రకారం- ఆశ్వయుజ, కార్తీకమాసాల్లో దక్షిణం వైపుకూ, పడమర వైపుకూ, ముఖమున్న ఇండ్లు కట్టరాదు. ఇంటికి మూడు గుమ్మాలుండకూడదు. తూర్పున నుయ్యిగాని, పశువులకొట్టంగాని ఉండరాదు. శాస్త్రం శాస్త్రమె. తప్పితే ఇసొంటి పీడలు దాపురిస్తాయి. వారం పదిరోజుల్లో నే వస్తనని మీ అత్తకు చెప్పు. నీ పెనిమిటికి ధైర్యం జెప్పు. నేను స్వయంగ పరిశీలించి కట్టడంలో మార్పులు సూచిస్తాను.

“మంచిది అయ్యగారూ... దండాల్...”

“బిడ్డా... పచ్చవాతమంటానవ్... మీ మామ కల్లుసారాగానీ తాగుతడా?”

“కాయకట్టం చేసుకునేటోళ్లు తాగకుంట ఉంటరా... ముసల్దానా... నీ యెర్రిగానీ...”

“వద్దు బిడ్డో... సారా విషం... సారా తాగే మీ మామ గట్లయినట్టున్నడు. నీ మొగునికి చెప్పు- పొరపాటు. కూడ కల్లు, సార జోలికి పోవద్దని. నా పెద్దకొడుకు గీ సార తాగి తాగి... అయ్యో ఏం జెప్పాలె... కాలేయం చిల్లులుపడి, పసరు కక్కుకుంట సచ్చిపోయిండు. అయ్యో... నా లింగవ్వా... బంగారమసొంటి బిడ్డా... ఏ లోకానున్నవో...”

“పాపం ముసల్ది ఏడుత్తాంది- కొడుకు యాదికచ్చి... ఔరా కొమురా... మల్లేషుగాడు తాగి తాగి అడ్డం పడ్డడు, మళ్లా లేవకుంట. ఇల్లు అమ్ముకున్నడు... జాగలమ్ముకున్నడు. ఛే దగ్గన్న ట్టుంది... ఊకె దగ్గుతడు. సార అమ్మద్దని అన్నలు బెదిరిస్తనే ఉన్నరు. తాగెటోళ్లు తాగుతాండ్రు- అమ్మెటోళ్లు అమ్ముతాండ్రు. ఎంతో లొల్లి అయితాంది. సర్కారు దిగచ్చి సార బందు పెడ్తానని వొప్పుకున్నది. నిజంగా సర్కారు మాట నిల్పుకుంటదంటవా...?”

“ఏమో... సూడాలె... నిజంగ బందయితె ఎందరో గరీబోళ్ల బత్కులు బాగుపడ్తయి...”

“ముసలవ్వా... ఓ పెద్దవ్వా... జర గీ మొండిమనిషికి జెప్పు... ఊకే తాగద్దని జెప్పితే వినడు. బస్సు ఎక్కేకాడ నాల్గు పొట్లాలు కొట్టిండు. పనిజెయ్యడు. వసపిట్టోలె ఒర్రుతడు. నన్ను రోజు కొట్టి సంపుతడు, పైసలియ్యమని...”

“ఒద్దు బిడ్డ... సంసారం పాడు జేసుకోకు, పిల్లాజెల్లా ఉన్నారు. సారా నీ పానం తీత్తది. నేను ఎందరి బతుకులో జూసిన. తాగుడుకు అలవాటయినోడు ఎవ్వలూ బాగుపడలే...”

“ఏహె... మీ సోది పాడుగాను. అదురుష్టం బాగుండాలె కాలం కల్సిరావాలె. తల్లిపాల బలముండాలె... నాకేమయింది సూడు, దిట్టంగ వున్న. ఇగ పని అంటరా... ఈడ ఎంత కట్టపడ్డా

ఏం సంపాయించలేం. ప్యాసుపోర్టు తీయించిన. బేరన్‌కు లేదా మస్కట్టుకు పోత. సుతారి పనోళ్లకు మస్తు జీతాలట అరబ్బు దేశాల్లో. ఏయ్... ఆడిదానా... నువ్వాకే వొర్రకే... నేనేదో పూటుగా తాగి బొర్లుతున్నట్టు కాకిగోల జెత్తానవ్..."

"అయ్యో కొడుక... నేను మళ్లా జెప్తాన యిను. నా చిన్నకొడుకు నీ తీర్గనే అనుకొని మస్కటు బోయిండు. రెండేళ్ల తర్వాత ఉత్త చేతులతోటె తిరిగచ్చిండు. దలార్లను నమ్ముకొని మోసపోయిండు. ఆడ వాన్ని జైలుఖానల యేశింద్రట. ఎండిపోయిన రొట్టెబిల్లలిచ్చింద్రట. రగతం కారేటట్టు వారుగట్టెల్తో కొట్టింద్రట. ఏమయితేనేం... రాయేషుల సామి దయవల్ల మల్ల నా కళ్ల ముంగటికి తిరిగచ్చిండు. బండి కొట్టుకుంటీడనె వుంటాండు. బేరెన్, మస్కట్టు అని కలలు కనకు. పెళ్లాం పిల్లల్ని దిక్కులేనోళ్లను జెయ్యకు..."

"ముసల్ది మంచిగనె జెబుతున్నది. గల్ఫుదేశాల మోజులో పడి ఎందరో మోసపోయింద్రు. కొందరు బొంబాయి దాకా పోయినట్టు మతులబచ్చింది. కాని తర్వాత ఐపూజాడ లేకుండ పోయింద్రు. ఇశ్రాయిలుగాని పెళ్లాం... చూసి చూసి ఎవనితోనో లేసిపోయింది, ఇద్దరు పిల్లల్ను అత్తమామల మీద యిడిసిపెట్టి.'"

"సంపాదన అంతా తాగుడుకు పోతుంటె దరిద్రం చుట్టుముడుతుంది. దాన్నుంచి బయట పడేందుకు వేరే తోవలు ఏమిటా అని చూస్తారు కూలిజనం. దళారీలు, బ్రోకర్లు ఈ బలహీనతను ఆసరా చేసుకొని అరబ్బు దేశాల్లో లేబరుకు మంచి గిరాకీ వుందని వీళ్లను నమ్మించి డబ్బు గుంజుతారు. బొంబాయి దాటించేసి వాళ్ల ఖర్మానికి వాళ్లను వదిలేస్తారు... ఇదో దోపిడీ వలయం..."

"సారా నిజంగానే విషంతో సమానం. ఇప్పుడు పొట్లాల్లో లభిస్తున్నది స్వచ్ఛమైన ఆల్కహాలు కాదు. కల్తీసరుకు. మిథేల్ కలుపుతారు. క్లోరల్ హైడ్రేటు, నవాసారంలాంటివి కూడా మిశ్రమం చేస్తారు. ఇది అలవాటయితే మాదకద్రవ్యాలకు ఎలా బందీ అవుతారో అలా బానిసయిపోతాడు. ఆరోగ్యం క్షీణిస్తుంది. నాడీమండలం దెబ్బతింటుంది. చివరికి లివర్, మూత్రపిండాలు ఫెయిల్ అయి మనిషి నిర్జీవుడవుతాడు..."

"మరి గివన్నీ తెల్సి కూడా సర్కారు సారా బందు పెట్టనని మొండికేసిందెందుకో?"

"మనుషుల ప్రాణాలు, సమాజం ఆర్యోగం గూర్చి సర్కార్లకు పట్టింపు లేదు. కంట్రాక్టర్ల, దళారీల రాజ్యం యిది. యేటా ఎనిమిది వందలకోట్ల రూపాయల ఆదాయం వస్తుంది ప్రభుత్వానికి- ఈ సారా అమ్మకాల ద్వారా."

"నాంపల్లి దిగెటోళ్లు ముంగటికి రాంౖడి... డోరు దగ్గరికి..."

"అంకుల్... అమ్మ దగ్గరికి వెళతాను."

"పొగవాసన బాగనిపించడం లేదా?... సిగరెట్ అవతల పడేశానులే. కూర్చో."

"ఊహుఁ... ఆకలేస్తోంది. అమ్మదగ్గరికెళతాను. బ్యాగులో ఆపిల్‌పండ్లున్నాయి... అంకుల్... అంకుల్... ఫిషర్‌మెన్ తమ చేపలబుట్టలను మమ్మీ చేతిలోని బ్యాగుకు తాకిస్తున్నాడు. బేడ్ స్మెల్ ఆపిల్స్ కంటుకుంటున్నది. బుట్టలను దూరంగా ఉంచమని చెప్పండి ప్లీజ్..."

"ఆ బుట్టల్లో వున్నవి చేపలు... మంచినీటి తాజా చేపలు. మేరీన్ ఫుడ్ ఈజ్ గుడ్ ఫర్ హెల్త్. జాపనీస్, తదితర అభివృద్ధి చెందిన దేశాల ప్రజలు మెరీన్ ఫుడ్ విరివిగా తింటారు. మనదేశంలో బెంగాలీలు, కేరలైట్లు చేపలంటె చెవి కోసుకుంటారు. ఫిష్ ఈజ్ వెరీ రిచ్ ఇన్ ప్రొటీన్స్ అండ్ మినరల్స్. అయొడిన్ పుష్కలంగా ఉంటుంది. గుండెజబ్బున్న వాళ్లకు చేపలు బాగా తినమని డాక్టర్లు ఈమధ్య ప్రిస్క్రైబ్ చేస్తున్నారు. ఫిష్‌ని ఒకప్పుడు బ్రెయిన్ ఫుడ్ అనే వాళ్లు. డోన్ట్ యూ ఈట్ ఫిష్...? బేబీ..."

“ఫిష్ స్విమ్ ఫాస్ట్. ఆక్వేరియంలో రంగు రంగుల చేపలు ఎంత అందంగా ఉంటాయో... ఐ లైక్ దెమ్ వెరీమచ్. కానీ తినడం... రోత... నాకు డోకు వస్తుంది. అంకుల్ మీరేమేమో చెప్తున్నారు. వేణు అంకుల్... మీరయినా చెప్పండి... చేపలబుట్టలను దూరంగా ఉంచమని...”

“కండక్టర్... ఈ పొల్యూషన్ ఏమిటయ్యా... చేపల బుట్టలను బస్సు టాపుమీద వేయించా ల్సింది. వాటిని డ్రైవరు దగ్గరనన్నా పెట్టుకోమని చెప్పు కనీసం...”

“అబ్బబ్బ... ఇవ్వాళ నా డ్యూటీ నరకంగున్నది. మంది యమ తక్లీబిస్తాండ్లు... ఎక్కిస్తే ఓ బాద... ఎక్కనియ్యకపోతె మరో బాద... బెస్తోళ్ల తమ్మీ... గా సార్‌చెప్పేది యిన్నవ్ కద... రెండు బుట్టలు క్యాబినులో ఇరికియ్యి. మరోటి ఏదన్నా సీటు కిందికి నూకు. ఖాదర్‌భాయీ నీ చేపలను జరంత నీ సీటెనుక పెట్టుకో...”

“ఠీక్ హై... తంబీ... ఇదర్ లావ్...”

“మరీ నత్తనడక బస్సుది. ఇంకా స్లో చేస్తాడేమిటి?”

“ముందు స్టేజి వున్నట్టున్నది...?”

“నాంపల్లిలో దిగేటోళ్లు డోరు దగ్గరికి జల్దిన రాండ్రి...”

“అగో... డ్రైవరుసారు... ఇస్టేజి దాటింది... ఆపవేందయ్యా బస్సు... అయ్యో...”

“కండక్టర్... బస్సాపియ్యవయ్యా...”

“బలె... బలె... ఇలాగె నాన్-స్టాపింగ్‌గా వెళ్లాలి... ఇంకా స్పీడు...”

“ఎదుకమ్మా... అంత తొందర...?”

“త్వరగా డాడీని కలవాలి... డాక్టరు బాబాయి దగ్గర బ్యాండేజి వేయించుకోవాలి... సో... ఫాస్ట్... శతాబ్ది ఎక్స్‌ప్రెస్సులా...”

“శతాబ్ది ఎక్స్‌ప్రెస్సు స్పీడు ఎంత? వోన్లీ వన్ హండ్రెడ్ అండ్ ట్వంటీ కె.ఎమ్.పి.హెచ్. మనం అల్పసంతోషులం. అదే గొప్ప స్పీడు అయిపోయింది. జర్మనీవాళ్ల అట్లాంటిక్ రైలు స్పీడు ఎంతో తెలుసా? మూడువందల ఇరవై కె.ఎమ్.పి.హెచ్. జాపనీస్ ఇంకా ఎక్కువ స్పీడు. అయిదువందల కె.ఎమ్.పి.హెచ్. కోసం ప్రయత్నిస్తున్నారు.

“నిజంగానా... థ్యాంక్యూ అంకుల్... కొత్త జి.కె. విషయం తెలియజేశారు...”

“ముసల్దానా... పక్కకు జరుగు... సుట్ట తాగుతానవా... కంపు వాసన...”

“లేదు బిడ్డ... నా దగ్గరకాదు. ఎవ్వలో బీడీ, లేదా సిగిరెట్టు తాగుతాండ్రు...?”

“మరి చేతిలోది ఏమిటి...?”

“పుగాక్కాడ. పండ్లు గుంజతానయ్. జరంత తుంపుకొని దౌడకేత్త...”

“నాంపల్లి... దిగేటోళ్లు దిగిండ్రా...?”

“ఇష్టేజి ఎక్కన్నో పోయింది. గింత దూరాన ఆపుతవా...? ఏందయ్యా ఇది?”

“హక్కడ పబ్లిక్ మస్తుగున్నర్. ఇంక హెంతమందిని చడాయించుడు? లొందల దగ్గర టక్కుటక్కుమంటాది బండి. ఇస్పరింగులు ఇరుగుతాయ్. టైర్లు బరుస్టు అయితయ్. బస్సు సిరిసిల్ల దాంక పోతదని నాకు యకీన్ అయితలేదు... డోరు దబాయిచిండ్లా...?”

“గా సారు సికిలెట్టు, గా అన్న బీడి తాగబట్టిరి. గీ అయ్యగారు తాపకోసారి నశం పీల్వబట్టె. కిటికీలన్ని బందు పెట్టిండ్లు. ఇగ వాసన ఎటుబోవాలె?”

“అయ్యగార్కి చేపల వాసన పడ్తలేదు. గందుకేనేమో ఊకె నశ్యం గుంజుతాండు, ముక్కు మూసుకుంటాండు. ముసలవ్వా గీ ఒక్క బుట్టనీ కాళ్లకాడ పెట్టుకో అవ్వా...”

“గీడ పెట్టు బిడ్డ. ఒద్దన్ననా? తినెటోళ్లం మనకేం వాసన? మా ఊరి కొచ్చెర్వులో ఏం చేపలు! మత్తడి దుంకినప్పుడు... ముసుర్లల్ల కొంగు చాపితే తక్కెళ్లకొద్ది చేపలు...”

“సార్... మీ ముసల్ది... శ్రీశ్రీగారి ‘భిక్షువర్షీయసి’లాగా వున్నది కదా...?”

''ఔను. వంగిన నడుము, చివికిన దేహం, ముగ్గుబుట్టవంటి తల, గాజు కళ్లు... ఆ రింకిల్స్- అవే ముఖంలోని ముడుతలు... కాలం చెక్కిన కత్తిగాట్ల తీరువున్నాయ్.''

''కుమార్ సార్... మీ పొయిట్రీ చర్చకు అంతరాయం కల్గించినందుకు డోన్ట్ థింక్ అదర్ వైజ్... నాదో చిన్న సందేహం- తీరుస్తారని ఆశిస్తాను. నాన్ ఫిక్షన్ రచనల్లో అప్పుడప్పుడు కొన్ని లిటరరీ టరమ్స్ లాంటివి నాకు తారసపడతాయి. వాటి మీనింగ్స్ డిక్షనరీల్లో కూడా దొరకవు. ఉదాహరణకు: అహబ్స్ ఫాంటసీస్, క్విక్సోటిక్ ప్రాజెక్ట్స్, డాన్ జువాన్... లాంటివి...''

''ఇవి సాహిత్యానికి సంబంధించినవి కావు. ప్రముఖ రచయితల నవలల ద్వారా, కావ్యాల ద్వారా ప్రాచుర్యం పొంది మామూలు భాషలోకి ఫిగరేటివ్‌గా తీసుకోబడ్డ పదప్రయోగాలు ఇవి. అహబ్ హెర్మన్ మెల్‌విల్లీ ప్రఖ్యాత నవల- 'మాబీ డిక్'లో కథానాయకుడు. సమాజంతోటి తన సంబంధాలను తర్కించుకోకుండా ఎవరి సలహానూ ఖాతరు చెయ్యకుండా ఒంటరిగానె తన లక్ష్యం నెరవేర్చుకోవాలన్న అహంభావం, అతిశయం మూర్తీభవించిన వ్యక్తివాది ఈ అహబ్. సిబ్బందినీ, అనుచరవర్గాన్నీ సమకూర్చుకుని పెద్ద ఓడలో తిమింగిలాల వేటకై అట్లాంటిక్ మహా సముద్రంలోకి బయలుదేరతాడు కెప్టెన్ అహబ్. తన జీవితాశయం- తన్ను కొన్నేళ్ల క్రితం గాయ పర్చి, కుంటివాణ్ణి చేసిన ఓ మహా జలచరం- తెల్ల తిమింగిలాన్ని మట్టుబెట్టాలన్న ప్రతీకారేచ్ఛతో ముందు కురికి ఓడలోని అందరితో సహా బలి అవుతాడు. అతణ్నించి అలా- సామాజిక నాడి లేకుండా, మనస్తాత్వికంగా జంతు ప్రవృత్తినీ, ఆటవిక నైజాన్నీ ప్రదర్శిస్తూ తనకు తెలీకుండానే చుట్టూ ఉన్న మానవజాతికి హాని కలిగించే విపరీత వైఖరిని 'అహబ్స్ ఫాంటసీ' అంటారు. సెర్వెంటిస్ నవలలో డాన్ క్విక్సోట్ ప్రధాన పాత్ర. అతన్నుండి డాన్ క్విక్సోటిక్ ఎఫర్ట్స్, క్విక్సోటిక్ ప్రాజెక్ట్ వచ్చాయి. ఇక డాన్‌జువాన్ అంటె- రొమాంటిక్ హీరోయిజానికి ప్రతీక. స్పానిష్ పురాణాల్లో స్వేచ్ఛాజీవి. మొజార్ట్ రూపకాల ద్వారా ఈ పేరు ప్రసిద్ధి పొందింది.''

''సార్... మీరు ఇంగ్లీషులో రచనలు ఎందుకు చేయరు...? మీ పాండిత్యం అమోఘం. తెలుగు ఒక్క ప్రదేశానికే పరిమితం. ఇంగ్లీషులో రాస్తే జాతీయంగా, అంతర్జాతీయంగా గుర్తించబడే అవకాశముంది కదా!''

''నాకు మాతృభాష మీదనే మమకారం. ఇంగ్లీషులో మామూలుగా వ్యాసాలు, విమర్శలు రాయగలను కాని సృజనాత్మక సాహిత్యం రాయడానికి ఈ పాండిత్యం సరిపోదు. ఇప్పుడు పాండిత్యం కోసం శ్రమిస్తే లక్ష్యం దెబ్బతింటుంది. అయినా భాషదేమున్నది- భావం ముఖ్యం కానీ... నోబెల్ లారియేట్లందరూ ఇంగ్లీషులో రాసినవాళ్లు కారు. తమ తమ దేశీయభాషల్లో రాశారు. అవి ఇంగ్లీషులోకి అనువాదం చేయబడి ప్రపంచ పాఠకలోకానికి అందించబడ్డాయి.''

''ఔనౌను. ఇటీవల ఒకానొక దినపత్రిక 'లిటరేచర్ కాలమ్'లో నోబెల్ ప్రైజ్ పొందిన రచయిత్రి నదీన్ గార్డిమర్ గురించి చదివాను. ఆమె రచనల్లో మాజికల్ రియలిజం ముఖ్య లక్షణమంటాడు సమీక్షకుడు. మిస్టికల్ రియలిజం కాస్త వివరిస్తారా...?''

''ఈ పద్ధతి విదేశీ సాహిత్యకారులు బాగా వాడుతున్నారు. ఇసాబెల్ ఆలెండీ, కార్లోఫ్యూయిస్, జార్జ్ లూయీ బోర్గెస్, గార్షియా మార్క్వెజ్ తదితర నోబెల్ బహుమతి గ్రహీతలు ఈ శిల్పాన్ని ఎక్కువగా అవలంబించారు. తెలుగులో చెప్పుకోవాలంటే దీన్ని మార్మిక వాస్తవికతావాదం అనాలి. వాస్తవికతను హత్తుకుపోయేలా మరోవిధంగా చెప్పేందుకు అభూత ఘటనలు, అతీంద్రియ మెటఫర్‌లు రచయిత వాడతాడు. ఇదీ అల్లెగరికల్ టెక్నిక్ వంటిదే...''

''మీరు ఏ ధోరణిని ఎక్కువగా అభిమానిస్తారు...?''

''ప్రత్యేకంగా ఒక ధోరణి పట్ల అభిమానమంటూ లేదు. నాకు థీమ్‌ను బట్టి టెక్నిక్ మారు తుంది. అయితే ఈమధ్య నేను ఎక్స్‌పెరిమెంటల్ స్టోరీస్ ఎంచుకుంటున్నాను. వాటిని చైతన్య స్రవంతి పద్ధతిలో రాస్తున్నాను. ఈ టెక్నిక్‌కు ఆద్యులు జెమ్స్‌జాయిస్, వర్జీనియా వుల్ఫ్‌లు...

“దీని విశిష్టత ఏమిటి?”

“ఇందులో ముగింపుకు ప్రాధాన్యత ఉండదు. అంతరంగంలోని భావనల వర్ణన దీని విశిష్టత.”

“మీరు రోజుకెన్ని రచనలు చేస్తారు? రోజుకో కథ, వారానికో నవల రాస్తారా?”

“నేను అంత సిద్ధహస్తుణ్ణి కాను. ఒక కథ రఫ్ స్కెచ్ రాస్తాను. దాన్ని మళ్లీ సవరించి రాస్తాను. ఆ తర్వాత ఫెయిర్ చేస్తాను. ఇలా కథకు వారం పడుతుంది. ఇప్పటివరకూ అయిదు నవలలు మాత్రమే రాశాను. నవలకు దాదాపు మూడు నెలలు పడుతుంది.”

“నో సార్. మీరు బాగా సృష్టించాలి. శరపరంపరగ రాయాలి. జాన్ ఓహరా తెలుసా? ఇర్వింగ్ వాలెస్ ఓసారి అతని గురించి చెప్పాడు. అతడు రాత్రి పొద్దుపోయేదాకా పార్టీలో గడిపి, నాలుగైదు డ్రింకులు తీసుకుని, సుష్టుగా మెక్కి, ఇంటికి వెళ్లి పక్కమీద వాలే ముందు ఒక కథ- మంచి కథను రాసి ముగిస్తాడు. గ్రాహంగ్రీన్ బాగా తిరుగుతాడు. తిరుగుతూనే నెలకొక నవల పూర్తి చేస్తాడు. మీరు వాళ్లను అనుసరించండి... బాగా రాయండి... నోబెల్ ప్రైజ్ కోసం పోటీ పడండి...”

“మీ సలహాకు కృతజ్ఞతలు... కృషి చేస్తారు.”

“హన్నన్నా... పానమెల్లిపాయె. నడుమిరిగి పోయెటట్టు ఎత్తెత్తాంది బస్సు...”

“దెబ్బ గిన తాకిందా... సుజావ్వా... అయ్యో పిల్ల మూతికి దెబ్బ తాకి నెత్తురు గూడ కార పట్టె... జర మెల్లంగ పోనీ రాదయ్య డైవరుసాబూ...”

“ఇస్కీ మాకీ... సైడియ్యమని ఇషార ఇస్తనె వున్న. సువ్వర్‌గాడు సూడలేదు. ఇయ్యాల నశీబు మంచిగున్నది... జరయితే పల్టీగొట్టు బండి...”

“మళ్లీ మిమ్ములను ఎప్పుడు కల్సుకోవచ్చు సార్...”

“వారం పదిరోజులు జరూరు పని మీద తిరిగే పని వున్నది. ఆ తర్వాత ఇంటిపట్టునే వుంటాను. అప్పుడు రావోయి మా యింటికి...”

“నాడి నిర్వాహకుడు జగన్ మీ గురించి చాలాసార్లు జ్ఞాపకం చేశాడు. పత్రికకు మంచి రచనలు కరువైపోయినాయంటాడు. మీరు మొదట్లో రాసిన తరహా కథలు- అవే గని కార్మికుల జీవితాలు, క్వారీ కూలీల దయనీయ స్థితిగతులు, గ్రామీణ పేదల ఇక్కట్లు ప్రతిబింబించే రచనలు, కవితలు మీ నుండి రావడం లేదంటాడు...”

“ఆ పత్రిక ఆగిపోయిందనుకుంటాను!”

“ఆ పత్రికను పోషించుకోవాలని మీరు ఒకప్పుడు ఊరూ, వాడా తిరిగి చందా కట్టించే కార్యక్రమం చేపట్టారు. ఆ ఆదరణ ఇప్పుడు లేదు. మీరేమో దూరమైపోయారు. ఇప్పుడు దాదాపు మూతపడే దుస్థితి దాపురించింది పత్రికకు...”

“ఈ పోటీ ప్రపంచంలో చిన్న తరహా పత్రికలు నిలదొక్కుకోవడం కష్టమే మరి. జగన్‌ను కలువక చాలాకాలమయింది, నిజమే. నాకీమధ్య తీరిక దొరకడం లేదు. పిహెచ్.డి. చేస్తున్నాను. విషయసేకరణకు చాలా శ్రమించాల్సి వచ్చింది. ఏమయితేనేమి పూర్తయిపోయింది. మరో విషయం- నా అభిప్రాయం స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఎప్పుడూ మాండలికంలో రాయడం, ఒక తరహా రచనలు చేయడం వల్ల రచయిత సృజనాత్మకత వికసించదు. కొత్త పుంతలు తొక్కడం నా ఆశయం. ప్రస్తుత సాహితీలోకంలో ప్రబలంగా ఉన్న ధోరణి నుండి మడి గట్టుకుని దూరంగా కూర్చోలేను...”

“మీరు పిహెచ్.డి. చేస్తున్నందుకు సంతోషం- అభినందనలు. అంశం ఏమిటి?”

“తెలుగు నవల- కాల్పనికత, వాస్తవికత’ అనే అంశం మీద.”

“వచ్చే నెల మొదటివారంలో కలుస్తా సార్. జగన్, నేనూ, స్ఫూర్తి ముగ్గురం కరీంనగర్‌కు మీ యింటికి వస్తాము. కాలరీ ఏరియాలో అంబేడ్కర్ హాలులో ‘నాడి’, ‘స్ఫూర్తి’ సంయుక్తంగా ఒక గోష్ఠి నిర్వహించబోతున్నారు. ‘రాజ్యాంగం- ప్రజాస్వామ్య సమస్యలు’ అనే అంశం మీద చర్చ. మిమ్మల్ని స్వయంగా ఆహ్వానించాలనుకుంటున్నాడు జగన్.”

“రండి. కానీ నేను గోష్ఠికి రాలేకపోవచ్చు. థీసీస్ పేపరుకు తుది మెరుగులు దిద్దే పనిలో నిమగ్నమయివుంటాను.”

“లేదు, మీరు తప్పకుండా రావాలి. ఆ దినం కొత్తతరం కవుల పాటల సంకలనం ఆవిష్క రించాల్సి వుంది. మీరు ఆ పత్రికల, సంస్థల సంస్థాపకుల్లో ముఖ్యులు. మీరు రాకపోతె ఎలా సార్...”

“చూడు వేణూ... నాకు కొన్ని లక్ష్యాలు వున్నాయి. అవి సాధించేంతవరకు నేను పక్క చూపులు చూడదల్చుకోలేదు. ఆ గోష్ఠికి చాలామంది వస్తారు- మేధావులు, రాజకీయ పార్టీల రచయితలు, పౌరహక్కుల సంఘం వాళ్లు. ఈ రోజుల్లో నిఘా ఎక్కువుంటున్నది. ఎక్స్‌పోజ్ కావడం నాకిష్టం లేదు.”

“ఆఁ... శాంతినగర్... దిగేటోళ్లు లేవుండ్రి.”

“ముసలవ్వా... ముల్లె పక్కకు జరుపు. కాలు తాకితే నేనేమి జెయ్యాలె? పెట్టె అందుకోవే... విశ్వనాతమూ... చత్రి... శెల్లెను లేపు... ప్యాముంగటికి... కండక్టర్ సార్. ఇగో టిక్కెట్టు నాకు ఇంక పైసల్ రావాలె...”

“ఇగ్గో చిల్లరున్నదా... అఠాణా.”

“రూపాయత్తది గద... గిదేంది?”

““బరాబర్ ఇచ్చిన. ఎప్పటియో జమానా కిందటి రేట్లనుకుంటున్నావేమో నువ్వు... పోయిన్నెల నుండి ఛార్జీలు పెరిగినయ్...”

“గింత మాయిల్యమె పెరిగినయా... గిట్లయితే ఎట్ల ఇగ?”

“గల్ఫ్ యుద్ధం ఫలితం ఇది. సర్‌ఛార్జీ. మిగతా వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయ్. చమురు ధర బారెల్‌కు ఒక డాలరు పెరిగితే మన దేశం అదనంగా వందకోట్ల రూపాయలు చెల్లించుకోవాలి.”

“గా తురక రాజ్యాల కొట్లాట ఎప్పుడో కలాసయిందంట గద?”

“యుద్ధం ముగిసినా మనదేశంలో ఒకసారి పెంచిన ధరలు మళ్లా తగ్గడమంటూ వుండదు. ప్రపంచం ఏదో మారుమూలలో మనకు ప్రత్యక్షంగా సంబంధంలేని ఏ యుద్ధం జరిగినా దాని ప్రభావం మనమీద ఉంటుంది. ఇక మన రాజకీయ నాయకుల విషయానికి వస్తే- బడ్జెటులో ధరలు పెంచము అని ఎన్ని హామీలు ఇచ్చినా- తర్వాత ఆర్డినెన్సుల రూపంలో కొత్త పన్నులు వేస్తారు. అన్ని పార్టీలవాళ్లూ అంతే...”

“మళ్లా ఇస్టేజి దాటిచ్చిపోతాండు డ్రైవరు!”

“పోనీ... ఇంకా ముంగటికి... శాంతినగర్ దవాఖాన దగ్గర మంది వున్నరు...”

“డ్రైవరు సాబూ... ఆపుకో... దవాఖాన దగ్గర ముసలాయన, పాపం ఓ పిల్ల తల్లి వున్నరు. వానల తడుత్తాండ్రు...”

“హన్నా బెస్తోళ్లను ఎక్కిచ్చుడె తప్పయింది. ఏందయ్యా మాలావు ఆపు ఆపు అంటానవ్... ముంగట ఆపుతనని డ్రైవరు సైగ జేస్తాండు కదా...”

“దిగేటోళ్ల కోసం బస్సు ఎక్కడన్నా ఆగుతది. మరి ఎక్కెటోళ్ల సంగతి ఏంది? మనం ఎచ్చంగ బస్సుల కూకోంగనె అయిపోయిందా! మీలో ఎవలకన్నా గట్ల వానల తడుసుకుంట నిలబడె అవస్త వస్తె దారిన పొయ్యే ఏ బస్సు ఆపకపోతే ఎంత అన్యాయమనిపిస్తది...?”

‘‘యెనకచ్చె బస్సు ఎక్కించుకుంటది లేవయ్యా... ఇండ్ల జాగెక్కడున్నది డ్రైవరు ఇట్టం... నువ్వాకో...’’

‘‘యెనక బస్సులో ఉన్నోళ్లూ అసోంటేళ్లే అయితే? పాపం చెట్టు కింద నిల్చున్నోల్లు బస్సె న్నడు ఎక్కాలె... పోవాల్సిన జాగకు ఎప్పుడు బోవాలె... కొంచమన్నా జాలి... యింగిత ముండాలె... డ్రైవరు సాబు... ఆపు బస్సు...’’

‘‘ఫిషర్‌మాన్ లాజిక్ బాగున్నది. రియల్లీ ఎ గుడ్ సామారిటాన్. మొత్తానికి డ్రైవరును ఒప్పించాడు.’’

‘‘ఆ... ఆగనియ్యి... ఇగో సందుగ... చత్రి... దిగుండ్రి... జర ఆగవమ్మా... వాళ్లు దిగినంక... ఇగ ఎక్కుతావా...?’’

‘‘నాయినా సంటిదాన్ని అందుకో... ఆఁ... ఎక్కిన... ఏం వాన... ఏమ్ముసురు!’’

‘‘తువ్వాల కప్పు సంటిదానికి...’’

‘‘గీ ఇగంల ఎటు బోతానవమ్మా?’’

‘‘ఏం జెప్పాలె పెద్దవ్వా... దీనికి బైలు, కక్కుడు. శాంతినగర్ దవాకాండ్ల ఏదో మందు లిచ్చిండ్రు. తగ్గలె. పిల్ల ఇంకింక బేహోషు అయితాంది. ఏములాడకన్నా జల్దిన తీస్కపొమ్మన్నడు డాకుటరు. గంటసేపాయె గీ మర్రి కింద నిలబడి. వాన యిసిరిసిరి కొడుతాంది. రెండు బస్సులు పోయినై. ఆపలే ఏమన్యాయం! లోకం మీద మన్ను జల్ల... దయలేని లోకం...’’

‘‘తిట్టవమ్మా... తిట్టు... పెద్దమనుషులింటరు...’’

‘‘ఊకోవయ్యా... పెద్ద పరోపకారివి దిగి వచ్చినవ్... నీకేం పనిలేదు. గంత దయున్నోడివి... సాపలను మాత్రం ఎందుకు సంపుతానవ్?’’

‘‘దర్మవ్యాధుని కత సదువు ధనీ...’’

‘‘కండక్టర్ సాబ్... యె దేహాతీ లోగ్ ఆప్కో బడే పరేషాన్ కర్రహె హోంగే...’’

‘‘హాఁ... యారోఁ... బేకార్ డ్యూటీ... దీనియమ్మ... అసలు బస్సు ఎయ్యాద్దయా అంటె మా డిపో మేనేజరు యినిపిచ్చుకోలేదు. అబ్బ ఏం జనం... సమజ్జేసుకోరు... ఓ పద్ధతి లేకుంట ఎక్కుతరు. దిగేటప్పుడు నిమ్మలంగ సొంత బస్సయినట్టు దిగుతరు. చిల్లర ఇయ్యరు. చినిగిన నోట్లిస్తరు. నేను అదే నోటు ఇంకోనికిస్తే- చెల్లదో లేదో యేరే నోటియ్యమంటరు. నేను శిక్కా గొడ్తన అనుకుంటరో ఏమో... ఇంకొందరేమో... మీరు జూస్తాండ్లు కద... గింత ఛార్జీ అయితదా అనడగుతరు. నేను మింగుతాన్నా... గిట్ల పరేషాన్. ఛఛ...’’

‘‘మొదట్లో- నా చిన్నతనంలో, నా ఎరుకల సిరిసిల్ల నుంచి కన్నగురంకు రూపాయి పావలా ఛార్జీ వుండె. మరిప్పుడేమో... ఎనిమిది రూపాలాయె... గట్లనే ఉజ్జోగస్తుల జీతాలు పెరుగుతానయ్. కూలీల రేట్లు పెరిగినయ్. మార్కెట్టులో పంటల ధరలు- వడ్లు, మిర్చి, పొగాకు, పత్తి ఒక్కటేంది అన్నిటి ధరలూ పెరిగినయ్. ఏ కూరగాయ జూసినా సవశేరుకు రొండు రూపాలకు తక్కువ లేదు.’’

‘‘గదే సమజుగాకుంట ఉన్నది ధనీ! వడ్ల ధర, జొండ్ల ధర... సర్కారు అన్నీ పెంచుతాంది. కాని మా గతి. కర్సులన్నీ పొంగ మా చేతులల్ల ఏమ్మిగుల్తలేదు. మీకేంది- రంది లేని బతుకు! శేనేత సంగాలున్నయ్- రిబేట్లు, లోన్లు గుంజుతనే ఉంటరు లచ్చలకు లచ్చలు...’’

‘‘అది ఒకప్పటి ముచ్చట. ఇప్పుడు కాలం గట్లలేదు. కొత్త ఏడి వచ్చిండు. చెకింగు అంటాండు. ఏవో రూల్సు అంటాడు. మగ్గాలు మూతపడ్డయి. పాత బిల్లులు శాంక్షన్ అయితలేవు. గుట్టల కొద్దీ మాల్ పోగువడ్డది. అవి మెల్లగ జారగొట్టి బతుకుదెరువు కోసం ఊరిడిసి పెట్టి ఎటన్న పోదామనుకుంటున్నాం...’’

''ఇక్కడ కొన్ని కొత్త పదాలు వింటున్నాను. ధనీ అంటే ఏమిటి కుమార్‌గారు?''

''ధనీ అంటే మగ్గాల యజమాని అని అర్థం. ఆప్కోకూ, ఖాదీభండార్‌లకూ చేనేత గుడ్డలు సప్లయి చేస్తారు. నేతగాళ్లకు ధోవతీ కింత, చీరకు యింత అని కూలీలిచ్చి మిగిలిన సొమ్ము సొంతం చేసుకుంటారు.''

''ఈ ప్రాంతంలో టైల్సు ఫ్యాక్టరీలు, రైసుమిల్లులు, సైజింగ్ మిల్లులు ఉన్నాయంటె ఇక్కడి పారిశ్రామికవేత్తలు బాగానే వున్నారన్నమాట. రైతులు సాదాసీదాగా అగుపడ్తున్నా మోతుబరులే అనుకోవాల్సి వుంటుంది.''

''ఇక్కడ దేశాయిలు వున్నారు. ఆ సరసనే బక్కరైతులూ ఉన్నారు. చేనేత సంఘాల యజమానులు, సైజింగు మిల్లు వోనర్లున్నారు. ఆ పక్కనే బీడీ కార్మికులున్నారు. యజమానుల కాళ్లకాడ పన్జేస్తూ గంజి తాగి కాలం వెళ్లబుచ్చే నేత కార్మికులున్నారు. సుభిక్షంలో దుర్భిక్షం అంటే ఇదే. దిస్ ఈజ్ ఎ పార్ట్ అండ్ పార్శిల్ ఆఫ్ అవర్ ఎకనామిక్ సిస్టమ్. లెక్కల్లో తలసరి ఆదాయం పెరుగుతుంది. కాని దారిద్ర్యరేఖకు దిగువన వున్న నలభై శాతం ప్రజలకు అందే ఫలం స్వల్పం. పాయసం గిన్నె నిండా ఉంది. కాని వాళ్ల స్పూన్లు చాలా చిన్నవి. దేశ జనాభాలో పదహారు శాతం ఉన్న సంపన్నవర్గాలు జాతీయ సంపత్తిలోంచి యాభయిశాతం అనుభవిస్తుండగా, నలభై శాతం ఉన్న బడుగు వర్గాలకు పదిహేను శాతం కూడా లభ్యం కావడం లేదు...''

''దారిద్ర్యరేఖ నిర్వచనం ఏమిటో ఈ పత్రికల వాళ్లకే తెలుసు. వెనుకటిరోజుల్లో పారిశ్రామిక ప్రగతి లేనప్పుడు వేరే సంగతి. ఇప్పుడు అంతమంది దరిద్రులున్నారంటె నేనొప్పుకోను. కష్టపడేవారు సంపాయించుకుంటూనే ఉంటారు. రికామీగా తిరిగే సోమరిపోతుల సంగతి మన మేం చెప్ప గలము. కొందరికి అడుక్కు తినడంలోనే ఆనందం వుంటుంది. మా రామగుండం ప్రాంతంలో చూడండి- దళితుల పార్టీ, పీడితవర్గ కార్మిక పార్టీ, అందులోంచి చీలిన మరో పార్టీ, ఇవన్నీ బొగ్గుగని కార్మికుల్ని రెచ్చగొట్టి అస్తమానమూ సమ్మెలు, ఆందోళనలు చేయిస్తాయి. ఈ అరాచక ముఠాల పని ఎప్పుడు బందులు, అశాంతి సృష్టించడమే. బుద్ధిగా పన్జేసుకునే కార్మికులు ఫర్టిలైజరు కంపెనీలో, పవరు ప్లాంటులో, సిమెంటు కర్మాగారంలో మంచిగా బాగుపడుతున్నారు. పోయిన్నెల షేర్ల సీజనులో మా బ్యాంకుల్లో ఒక్కరోజులో పదికోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయి. వ్యవసాయం చేసుకునే పల్లెటూరి జనం కూడా లక్షలకొద్దీ రూపాయలు మదింపు చేశారు. మీరనే దారిద్ర్యం ఉత్తమాట. పత్రికలవాళ్లు, పుస్తకాలు ఏవో రాస్తాయి.''

''ఒక ప్రాంతంలో పరిస్థితి మెరుగ్గా ఉన్నంతమాత్రాన జనరలైజ్ చేయకండి సార్. పావర్టీ లైను దిగువనున్న జనాభా శాతం అంకెలు ప్రభుత్వం ఒప్పుకుంటున్నవే. ఇక నిర్వచనం అంటారా, ఆర్థికశాస్త్ర నిపుణులు, ప్రభుత్వ తరపు మేధావులు విభిన్న అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. ప్రత్యక్షంగా కనపడుతున్న స్థితిగతులను బట్టి ఒకటి చెప్పవచ్చు. నలుగురు లేక అయిదుగురు మంది సభ్యులున్న ఒక కుటుంబానికి సాలీన రూ. 6,400 ఆదాయంగా వుంటే అది పేద కుటుంబం. రూ. 3,500 ఉంటే అది నిరుపేద కుటుంబం. ఇలాంటివి కొన్ని లక్షల కుటుంబాలున్నాయి దేశంలో...''

''దేశ పరిస్థితి అంత అధ్వాన్నంగా లేదు. కాయకష్టం చేసుకునేటోడు, రిక్షా తొక్కేవాడు, హమాలీలు- వీళ్లందరికీ గిట్టుబాటు కూలీలు దొరుకుతున్నాయి. బడుగువర్గాలు, నిమ్నవర్గాలు దొరికిందేదో సుష్టుగా తింటున్నాయి. గవర్నమెంటు కల్పించిన గృహాలు, విద్యా, వైద్య సదుపాయాలు, రిజర్వేషన్లు తదితర సౌకర్యాలు పొందుతున్నారు. మంచి బట్ట కడుతున్నారు. పిల్లలను స్కూళ్లకు పంపిస్తున్నారు. మీరు పత్రికల్లో చదువుతున్నట్టుగా గ్రంథాల్లో రాసినట్టుగా దారిద్ర్యం, దోపిడీలు వాస్తవంగా లేవు. ఏమంటారు సాయికుమార్ సార్...?''

''అఫ్‌కోర్స్... గణాంక వివరాలు సరియైనవని చెప్పడానికి వీల్లేదు. కొలమాన పద్ధతులు అధునాతనంగా లేవు. మనం చదువుతున్నది అర్ధసత్యాలే. దేశంలో అభివృద్ధి రేటు గణనీయంగా ఉందని ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు కితాబు ఇచ్చాయి. అయితే పంపిణీ వ్యవస్థలో లోపాలున్నవి. అవి బాగుపడితే అసమానతలు చాలావరకు తొలగిపోతాయి. మీరన్న ట్టుగా- ఒకప్పటి దళితులు, సోకాల్డ్ బడుగువర్గాల పరిస్థితి ఎంతగానో మెరుగుపడింది. ఇప్పుడు, పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కొత్త పథకాలు, యోజనాలు ప్రవేశపెడుతున్నది...''

''ఓకే. మీ పాయింట్ అర్థమయింది. ప్రభుత్వం వివిధ పథకాలు చేపడుతున్నది. ఇందిరా ఆవాస్ యోజన, ఏ ఆర్ డిపి, జవహర్ రోజ్‌గార్ యోజన, రాజీవ్ వికాస్ గ్రామ్, ట్రైసమ్ లాంటివి. కాని వాటి లక్ష్యాలు నెరవేరడం లేదు. అవి టార్గెట్ గ్రూపుకు పెద్దగా ఉపయోగపడడం లేదు. ఎలాగంటే... ఊఁ... ఒక గ్రామం నుండి శాంపిల్‌గా ఈ ముసలమ్మను తీసుకుందాం. ఆమె బతుకుతెరువులో ఏమన్నా మార్పు వచ్చిందేమో... పిచ్చాపాటీగా కబుర్లాడి కనుక్కుందాం. మీరు గమనించండి...''

''యెములాడ కమాను... ఎవ్వల్లేరు... ఖాదర్‌భాయ్... సక్కగ పోనీ...''

''ఏం... ముసలవ్వా... బాగున్నవా... ఈ తుఫాన్ల ఎటో ప్రయాణం చేస్తున్నవ్?''

''దొరా... బాంచన్... నన్నేనా... ఏం జెప్పాలె... ముసల్దాన్ని... నడుం లేవనిత్తలేదు. ఐనా రెక్కాడితేగాని డొక్కాడని బతుకు ఎప్పుడు తీస్కపోతడో యెములాడ రాజన్న. మాది కొండపురం బాంచను. కన్నగురం పాయొత్తాన...''

''ఏమమ్మినవ్? వడ్లా జొన్నలా? ఎన్నెకురాల పొలం వున్నది?''

''పొలం మాకెక్కడిది బాంచను. నాలుగెకురాల శెల్క వున్నది. శెల్కల ఓ యేడు పండుతది. మరో యేడు పండదు. జొండ్లు మాకు తింటానికే సాలయి. ఇగ అమ్మేదెక్కడ? అంగట్ల నాలుగు నులక సుట్టలు, అయిదు శాంతాళ్లు అమ్ముకత్తాన...''

''ఒక్కదానివే పోయొస్తానవ్? కొడుకులు, బిడ్డలు ఎంతమంది...?''

''లేకేంది. ఉన్నరు. ముగ్గురు కొడుకులు, ఒక బిడ్డ. నడిపోడు తాగితాగి కాలం సేసిండు. ముసలయ్య ఆ రందితోటె కన్నుమూసిండు. ఏం జెప్పాలె బిడ్డ మాదో గోస...''

''కష్టాలు లేనోళ్లు ఎవరు ఈ లోకంలో? చెప్పు...''

''పెద్దకొడుకు బొరెయిన్ పోయచ్చిండు. ఉన్నయి ఊడగొట్టుకచ్చిండు. ఇప్పుడు పెంట జారగొడ్తాండు. ఆనికి ఎగుసాయం పని తప్ప అల్లుడు పనిరాదు. కోడలు, మనుమరాలు ఆసరా అయితరు. నేను తాళ్లు పేన్త. శిన్న కొడుకుది సీతమ్మ శెర. ఎక్కన్నో బస్సు కాలబెట్టింద్రని, కూనీ సేసింద్రని పోరగండ్ల కోసం పోలీసులు ఊరిమీద పడి ముగ్గురు పోరగండ్లను పట్టుకుపోయింద్రు. వాళ్ల పత్తా లేదు. మావోని కోసం కూడ అత్తాంద్రని తెల్సి ఈడుంటె బత్కవు కొడుకో అని అల్లుని దగ్గరకు తోలిచ్చిన. అల్లుడు రైసుమిల్లు పన్జేతడు. ఈడు లారీల మీన గట్టాలెక్కిత్తాండట...''

''సర్కారు వాండ్లు ఇండ్లు జాగాలిస్తాంద్రు. స్కీములు, కుటీర పరిశ్రమలకు లోన్లు ఇస్తున్నరు కద. మరి అవి మీకందుతలేవా?''

''ఇస్కీమ్లు మాకు దెల్వది. మా వూరికి మొన్నమొన్ననే కరంటచ్చింది. వానాకాలం గోస. తొవ్వలు మోరీలు ఊకె తెగుతయ్. రెండేళ్ల కిందట గరీబోల్లకు ఇండ్లు అని కట్టిచ్చింద్రు. షావుకారు దగ్గర అప్పుజేసి పెట్టి ఇల్లచ్చిందని సంబరపడ్డం. ఐతే ఏమయింది? ఒక్క వానపెట్టుకే కూలిపో యింది. బేంకోళ్లు దుడ్డెకొక్కులు ఇచ్చిండ్లు. గనవి పోయినేడు కరువుల మేత సరిగ లేక సచ్చిపోయినయ్.''

“మీకు చుట్టాలు, పక్కాలు ఉన్నరా ఊళ్లో... వాళ్లేం చేస్తరు?”

“మా కులపోళ్లయి ముప్పయి యిండ్ల దాకా ఉంటయి ఊరవతల. ఏంజేత్తారంటె గదే పొలం పనులు. రైతుకూలీలు. చెర్వులకు సడుగులకు మట్టి మోసుడు. బాయిలకు పూడిక తీసుడు. యేసంగిల జరంత రికామ్ దొరికితే గిట్ల తాళ్లు పేనుడు. ఇత్తార్లు కుట్టుడు... ఊళ్లె పోరగండ్లు శానమంది లేరిప్పుడు. పట్నాలకు పోయింఢ్రు కూలీపని కోసం...”

“మైగ్రేషన్ ఆఫ్ ద రూరల్ పూర్ టు ద టవున్స్... ఏ డిస్టార్టెడ్ ఫ్యామిలీ... సరె... సరె... నులక సుట్టలకు, తాళ్లకు ఎంత సంపాయిస్తవ్...?”

‘ఎంత బాంచను? ఊకె అల్లుతవా? అవ్వి ఎంత కట్టం. ఎంత బండసాకిరీ? జంగళ్ల ఈత వనంల తిరుగాలె... గౌండ్లోళ్లను, కామందులను బతిమిలాడాలె. ఈత కమ్మ కోసుకోవాలె. అప్పుడప్పుడు కొనుక్కత్తం. కమ్మను ఎండబెట్టి, శీరాలె. పేనేటప్పుడు జబ్బులు పడిపోతాయి. తొడలు, అరిశేతులు మంట పుచ్చుకుంటయ్. ఎన్నో పనులు సూసుకుంట ఈటెనుక పడితే నాలుగైదు సుట్టలయితై. శాంతాళ్లకు ఇంకెక్కువ కట్టం. కోడలు మోదుగాకు కోసుకొత్తది. రెండు మోపెళ్లు ఇత్తార్లు అయితే ఊళ్లనే కోమటి కిత్తం. యాభై కట్టకు పది రూపాలిత్తడు. ఇగ తాళ్లంటవా... మా కట్టం ఎవలకెరుక... గిట్టించి... గిట్టించి బేరమాడుతరు జనం. సుట్టకు ఐదు రూపాలత్తె గొప్ప. శాంతాడుకు పది రూపాల్. పలుపుకు ఐదు. నాగటి అంఢ్రెకు పదిహేను సొప్పున అమ్ముతం. ఇయ్యాల ఏం దినమో ముప్పయి ఐదు రూపాలె దొర్కినయ్...?”

“మరి పైసలు పట్టుకుని ఎటు బోతున్నవ్...?”

“సిరిసిల్లకు బాంచను... కొడుకు, అల్లుని ఇండ్లు ఒక్క దగ్గరే ఉన్నయ్, చెర్వు కింద. మనుమలు, మనుమరాండ్లు కండ్లల మెదుల్తాంఢ్రు. గీ వానలకు వరదలచ్చినయట ఊళ్లె. పానం గుటగుటమంటాది... ఎట్లున్నరో ఆళ్లు...”

“కుమార్‌గారూ, సిరిసిల్లలో వరద బీభత్సం వార్త నిజమేనా? చెరువు అంత పెద్దదా...?”

“ఏమంత పెద్దది కాదు. కాని మెరుపు వరదల మూలంగా పట్టణంలో చాలా ప్రాంతం జలమయం కావడం అప్పుడప్పుడు జరుగుతుంటుంది. ఏమిటి మీ భయం?”

“అబ్బ చీకటి పడుతోంది. పట్టణంలో బహుశా కరంటు ఉండదు. అది కల్లోల ప్రాంతమట కద. మావాడి అడ్రసు వెతుక్కోలేక చావాలి చీకట్లో. మావాడు ఎక్కడో శివానగర్‌లో ఉంటాడట. నాకు ఈ వూరు కొత్త. మా అబ్బాయి శ్రీను మొండి వెధవ. చక్కగా ఇంటర్‌లో జాయిన్ అవమంటే-నామాట, నా పెద్దబ్బాయి మాట వినకుండా స్నేహితులతో, వాళ్లతో గంగలోనయినా దూకుతాడట. ఇక్కడి పాలిటెక్నిక్‌లో చేరాడు.”

“మీరు గాభరా పడకండి... మీవాడు క్షేమంగా వుంటాడు. అతని యిల్లు కనుక్కునేందుకు నేను సహాయపడతాను...”

“పొద్దున్నే పేపరు చూపించి నా భార్య ఒకటే గగ్గోలు. సిరిసిల్లలో చెరువు తెగిందనీ, విపరీతమైన ఆస్తి నష్టం... కొంచెం ప్రాణనష్టం కూడా జరిగిందని వార్త సారాంశం. అసలు శివానగర్ ఎక్కడ? మా శ్రీను, నల్గురైదుగురు స్నేహితులతో రూము అద్దెకు తీసుకుని వుంటున్నాడు.”

“శివానగర్ గడ్డ మీదనే వుంది. అక్కడి యిండ్లు పక్కా యిండ్లు. మా ప్రసాద్ అటే వెంకం పేట వైపు వస్తాడు. వాడి మిత్రుడి యిల్లు అటువేపే... కుమార్ సార్ మీరు ఈ చీకట్లో ఎటు పోతారు. ఈ రాత్రి మా యింట్లో ఉండండి. లేదా అందరం కల్సి అడ్వకేటుగారింట్లో బస చేద్దాం.”

“సారీ... నాకు అర్జెంటు పని వుంది. పని ముగించుకుని రాత్రే హైదరాబాద్ వెళ్లిపోవాలి.”

“ఎలా వెళ్తారు? తంగళ్లపల్లి రూటులోనూ బ్రిడ్జి నెర్రెలు బాసిందట. రాకపోకలు బంద్.”

'కుమార్‌గార్ని అదరగొట్టకురా. నేను తీసుకెళ్తాను. కామారెడ్డి మీదుగా వెళ్దాం సార్. నేనూ హైదరాబాద్‌కే వస్తున్నాను. నా స్నేహితుడు మహాదేవ్ కూడా... ఇంటెన్సివ్ స్టడీ సర్కిల్‌లో రేపట్నుంచే క్లాసులు ప్రారంభమవుతున్నాయి..."

"ఓహో... అందరి ప్రోగ్రాములూ ఫిక్స్ అయినాయన్నమాట... కుమార్ సార్, మీ జరూరు పని ఏమిటో తెల్సుకోవచ్చా...?"

"ఇటు... దగ్గరికి జరుగు చెప్తా... నేను వెంటనే మండలాఫీసర్ని కలవాలి. అతడు నా కజిన్. మున్సిఫ్ జడ్జికి మంచి ఫ్రెండు. జడ్జిగారు క్లబ్బుకు వెళ్లకముందే కల్సుకోవాలి. ఆయనకు విసి దగ్గరిచుట్టం. యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టు ఖాళీ అయింది. అది జారిపోకుండా..."

"అర్థమైంది. ఇది మీకు మంచి టర్నింగ్ పాయింటు. విష్ యూ ఆల్ సక్సెస్."

"యేములవాడ... దిగుండ్రి..."

"అరే జనమే లేరు. వాన బాగానే పడుతాంది. మెల్లంగ దిగుండ్రి, జార్తది. కరంటు లేదు. పొద్దుగూకక ముందే చీకటి ముసురుకత్తాంది."

""అబ్బో... వాగు ఏం పొంగుతాంది... రాజన్న మహిమ..."

"గుడికి పోవాలాంటె ఎట్ల? గట్లనే... దిమ్మెలన్ని మునిగిపోయి వంతెన అదుర్తాంది... అగో... మొక్కులున్నోళ్లు, శివసత్తులు... చీలమండలు నీళ్లల్లో మునుగంగ గుడిదిక్కు పోతానే వున్నరు..."

"... కరెంటు ఎప్పుడు పోయిందో... నిన్నట్నుంచి చిమ్మచీకటి ఊరంతా... కనిపిస్తలేదా మేము పెట్రోమాక్సు లైట్లు పెట్టుకున్నం... పవర్‌లైన్లు గ్రిడ్ దగ్గరే కూలిపోయినయంట. ఎప్పుడు బాగయితయో తెల్వది..."

'రైట్... రైట్... ముసల్దానా సీట్లు ఖాళీగున్నయి. గా ముంగటి సీటు మీద కూకో... ముల్లెల్నూ సీటు మీన్నే పెట్టు..."

"ఇగ కూకుంట బాంచను. గీడ... అయ్యో దొర్సానీ... దూరమే కూకుంట అగ్గో... నా ముల్లేది... దేవుడో నా ముల్లె..."

"ఏ మొర్రుతానవ్ పిచ్చి ముసల్దానా... ఏ సీటు కింద పెట్టినవో, ఎవ్వల కాళ్లకాడ పెట్టినవో మంచిగ సూసుకో... జర లైటెయ్యి... డ్రైవరు సార్..."

"వోరి దేవుడో... రాజన్నో... కొడుకో... నా ముల్లె చిన్నమూట. ఎవడు మాయం జేసిండో... వాని దినాలుగాను... వానికి గత్తర రాను... కాలుదియ్యి బిడ్డ... జర కిందంత సూడనీ... ఊహు... కనపడ్తలేదు... అయ్యయ్యో నా రెక్కల కట్టం... నా నెత్తురు కార్చి సంపాయించినయి..."

"అబ్బ... లొల్లి... ముసల్ది ఊరువాడ ఏకం జేత్తాంది. ఇంకేం ముల్లెలే... మూడున్నయి గద సరిగ్గ సూసుకో..."

"మూడున్నయి బాంచను... ఇయిగాక ఇంకో శిన్నముల్లె... మాయమయింది నాకష్టం... నా సొమ్ము..."

"ఇంకో శిన్న ముల్లెనా... మీదేసుకుని సత్తననుకున్నవా...? పోతేపోనీ... గమ్మునూర్కో..."

"ఏం పోయింది పెద్దవ్వా... ఏమున్నది అండ్ల? ఎక్కడన్న ఎక్కంగ దిగంగ మారిపోయి నాయా...? యాదికి తెచ్చుకో..."

"నా మూట కొడుకో... కన్నగురంల నాల్గు ముల్లెలు. వాగు దాటినంక నాల్గుముల్లెలు... మళ్లీ గా బస్సు దిగి... గీ బస్సెక్కేటప్పుడు..."

"వాగొడ్డున మర్సిపోయినవా... లేక బస్సులో..."

“ఔను గావచ్చు బిడ్డ... వాగొడ్డున పచ్చబస్సు... గదే... సర్వీసు ఎక్కి అది సిరిసిల్లకు పోదనంగనే జప్పజప్ప దిగి గీ బస్సుల ఎక్కిన... అండ్లనే పోయినట్టుంది. ఎవడు పుణ్యం కట్టు కున్నడో... వాని కాళ్జేతులు పడిపోను...”

“పచ్చబస్సు... ఎర్రబస్సు... ముసల్ది గోల్‌మాల్‌గ మాట్లాడుతాంది. కుద్ పరేషాన్ అయి, దునియాను పరేషాన్జేత్తుంది. అన్ని బస్సులెల్లిపోయినయ్... ఓ బెస్తోళ్ల సారూ... నువ్వేదో జెప్పి ముసల్దానికి ఆశ జూపెట్టకు...”

“ఎవ్వల్దయినా సామానే... నీ సూటుకేసో, చేసంచో, జబ్బ సంచో పోతె మీరూరుకుంటరా? ఆ సర్వీసు ఈ బస్సెనుకనే వస్తుండె... కమాన్ దాటి ఇటు రావాలె... అగో వస్తాంది... రెండు నిమిషాలాపుదాం...”

“ఈ ఫిషర్ మాన్ మనల్ని ఈవేళ సిరిసిల్లకు పోనిచ్చేటట్టు లేడు. డ్రైవర్! ఆపకు!...”

“అబ్బబ్బ... పిశాచాల రొద... మాకు సంధ్య వార్చుకునే సమయం మించిపోతోంది. బస్సు పోనియ్యి నాయినా...”

“పొద్దుట్నుంచి ప్రయాణించి వళ్లు హూనమయింది. మీ డిపార్టుమెంటుది ఇదేం ప్రజా సేవ? ఇదేమన్నా సిటీబస్సా?... డోన్ట్ స్టాప్ ద బస్...?”

“మన సమయం విలువైందని మనం వర్రీ అవుతూంటె ఈ బాలసంత ముసల్దాని గోల ఏమిటి? వోహ్ క్లబ్బుకు టయమయిందంటె ఒక్కరోజు వేస్టు నాకు...”

“బంగారు నగల మూట పోయిందా ఎవందన్నా? మరేందయా ఆపుడు? ఇస్పీడుగ పోనీ. ఆవల పొద్గూకుతాంది... ఊళ్లో మాకెన్ని పనులు...?”

“ఎదురుంగ గొడ్లమంద రోడ్డు దాటుతాంది...”

“గొడ్లమందను సూసి ఆపుతాండా... గొడ్లకాసే ఎర్రటిపిల్లను సూడ్డానికి ఆపిండా...”

“ఒక్క నిమిషమాల్యమైతే ఏం మునుగుతది? మళ్లా ఇస్పీడు పెంచుతే అయిపాయె. అయిదు నిముసాలల్ల బస్సు సిరిసిల్ల చేరుకుంటది... డ్రైవర్ సాబ్... ఎట్లనో అట్ల బస్సు స్లో అయింది కద... జరంత ఆపు. వచ్చే సర్వీసును ఆపుమని ఇషారజెయ్యి. ఎవ్వల్దయినా బాధే అనుకోవాలె... ముల్లె దొర్కుతే ముసల్దాని అదురుట్టం... దానికి కొండంత సంతోషం... అగో గదే ఎదురుంగచ్చే బస్సు...”

“మీకు సాపలోడు మంచిగ దొరికిండు... మా గండానికే ఇండ్ల ఉన్నాడు...”

“ముసలవ్వా... ఇట్లరా... ఎసొంటి మూట- ఏ రంగు?”

“వంకాయరంగు బట్ట... గుమ్మడికాయంత ఉంటది ముల్లె...”

“...వోయ్... జర రోకాయించు బండి. యెనుక సీటోళ్లకు అడ్గు బుడ్డీ ముల్లె మర్సిపోయి దంట...”

“...ఇగో... గిదేనా... ఎవల్దీ ధనరాశి... మావోళ్లు మాదిగాదంటె మాది కాదంటాండ్లు గీ చిరుగ్గుడ్డల మూటను... గిదేనేమో అడుగు...”

“వో బుడ్డీ... గీ బైంగన్ రంగు ముల్లె... ఇండ్ల వజ్రాలు, ముత్యాలు గిట్ల కట్టుంచినవా...”

“ఆఁ గదే బాంచన్... మీ కడుపు సల్లగుండ... ఇటియ్యి...”

“ఎంత పాయిరంగా అందుకుని అలుముకుంటాంది ముల్లెను. అండ్ల రూపాల్ గిట్ల ఉన్నయేమో...”

“దాని కొడుకు గల్ఫుకు పొయ్యి వట్టిగెందుకు వచ్చిండు? ముసల్దానియి అన్ని అబద్ధాలె. వాడు బంగారం బాగనే తెచ్చిండేమో... ఏర్పడకుండ పాత బట్టలల్ల కట్టి, బిడ్డ దగ్గర్కి తీసుక పోతాంది...”

“అబ్బో... కొన్ని పల్లెటూరోల్లు ఏర్పడరుగని... పట్నపోళ్ల కంటె భాగ్యమంతులు.”

“పెద్దవ్వా... ముల్లె యిప్పి సూసుకో... అన్నీ ఉన్నయో లేదో...”

“పిసుక్కుంట సూత్తాంది. కాని యిప్పుత లేదు. సరుకు బాగానే వున్నదేమో...”

“బుడ్డీ... దొంగలు వుషారుగుంటరు. లోపలి సరుకు మాయంజేసి రాళ్లురప్పలు పెడ్తరు. ఓసారి మా సడ్డకుని సూటుకేసు పట్నంల ఎవడో చోరీ చేసిండు. అయితే మల్లీ దొర్కింది. హిప్పి సూస్కుంటె లోపట ఏమిలేదు. ఓ యిటిక మాత్రం ఉన్నది. గందుకనే చెప్తాన్నా. సూసుకో... మళ్లా అయ్యో అని లొల్లిపెడితే బస్సులకెల్లి అవతల్కి నూకేస్త...”

“డ్రైవర్ సాబ్ గమ్మత్తుగ మాట్లాడుతాండు...”

“అగో... యిప్పుతాంది మూట... అపురూపంగ... పైలంగా...”

“ఏందే ముసల్దానా... ఏమున్నయ్... ఏంటియయ్యి...?”

“అవ్వేందో నల్లగున్నయ్...”

“ఆకారంబట్టి అవి అరటిపండ్లనుకోవాలె బాగ మాగినయ్...”

“అయ్యి పేలాలు... బురద అంటిందా... కాదు బెల్లం కలిపిన పేలాల ముద్దలు- గవ్వి కారప్పూస... మురుకులు...”

“అయ్యో... ముసల్దాన... గివ్వేనా? ఉండవల్సినయి?”

“గివ్వె బిడ్డ... ఇవ్వి లేకపోతే... పోంగనె సుట్టు అలుముకుని, ‘అమ్మా ఏం పట్టుకచ్చినవే మా కోసం,’ అనే మనుమలకు, మనుమరాండ్లుకు ఎట్ల ముకం సూపెట్టాలె?”

“ఛూ... ఛ్... ముసలిముండ... ఇగిలిత్తాంది... బోసినోరు పెట్టుకోని... ఏదో ఖజాన పోయినట్టు గుండెలు బాదుకున్నది...”

“కుమార్ సార్... ముసల్దాని ముఖం చూడండి. వాట్ ఎ బ్రైట్‌నెస్...”

“డ్రైవర్ సాబ్! జర ఇస్పీడు పెంచు. జప్పన ఇంటికెల్లాలె... పొద్దూకక ముందే చీకట్లు ముసురుతానయి... నల్లగ...”

“మన ముకాల తీర్గ...”

“అరె... గీ సాపలోడు బాగా మాట్లాడుతాండు ఏందో... మర్యాదగ మాట్లాడు లేకపోతే...”

*ఆహ్వానం, నవంబర్ 1993*

నేపథ్యం

## తెలంగాణ జీవనశైలికి నిలువుటద్దం

# ముసల్దాని ముల్లె

***మరీ సంక్లిష్టమైపోయిన ఆధునిక సమాజంలో డబ్బుకు ప్రాధాన్యత మునుపెన్నడూ లేనంత తీవ్రంగా పెరిగింది. ప్రతిదాన్నీ- అనుబంధం, ఆత్మీయతల్ని సైతం- శాసించేది డబ్బు అయిపోయింది. అందుకే మనిషి డబ్బు కోసం అనుక్షణం వెంపర్లాడుతున్నాడు, ఉరుకులాడుతున్నాడు.***

ఒక కథ రాయడానికి రచయితను ప్రేరేపించిన ఒకటి లేదా అనేక మూల ప్రభావాలుండ వచ్చునని నేననుకొంటాను. స్వంత జీవితంలోని ఒక అనుభవ శకలం లేదా ఇతరుల జీవితంలో తనను ఆకట్టుకొన్న ఒక ఘట్టం లేదా తన కళ్ళ ఎదుట జరిగిన ఒక సంఘటన లేదా తనను కదిలించిన ఒక వార్తాశీర్షిక లేదా ఏదైనా పుస్తకం అధ్యయనం చేస్తున్న సందర్భంలో ఫ్లాష్‌లాగా మస్తిష్కంలో మెరిసిన ఒక ఆలోచన- సాధారణంగా ఇలాంటిదేదో ఒకదాని ద్వారా ప్రేరణ పొందిన రచయిత కథ రాయడానికి పూనుకొంటాడు. ఒక్కొక్కసారి పై ప్రభావాల్లో కొన్ని సంయుక్తంగా పనిచేసి మూల కథకు కొత్త వస్తువిస్తృతి అందించి శిల్ప సమగ్రతకు దోహదం చేయవచ్చు.

కథ వెనుక కథ గురించి చెబుతూ నేను మరో కథ అల్లదల్చుకోలేదు. నా ముసల్దాని ముల్లె కథ వెనక కంటతడి పెట్టించిన సంఘటన, బరువైన అనుభవం లాంటివేమీ లేవు. వివిధ సందర్భాలలో నా కెదురైన చెదురుమదురు అనుభవాలు, నా బుర్రలో మెదిలిన ఆలోచనలు నన్నాకథ రాయమని పురికొల్పాయి.

*

చాలా ఏళ్ళ క్రితం The World of the Short Story- A 20th Century Collectionలో అర్జెంటైనా రచయిత Julio Cortazar (1914-84) కథ *The Southern Thruway* చదివాను. పారిస్ నగరానికి వెళ్ళే రహదారిపైన ఒక సాయంకాలం పూట సంభవించిన ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుబడి వారంరోజుల పాటు రోడ్డు మీదే

కాలం వెళ్ళబుచ్చిన మోటారిస్టుల సంకటస్థితిని డాక్యుమెంటరీ కథనంలో వర్ణించడం దాని ఇతివృత్తం. డాక్యుమెంటరీ కథనమని ఎందుకంటున్నానంటే సర్వసాక్షి దృష్టికోణం లోంచి నడిచిన ఆ కథలో intrusive narrator ఒక రిపోర్టర్‌లా, ఒక కెమెరామాన్‌లా వ్యవహరిస్తూ మోటారిస్టుల సమూహంలో అన్ని మూలలకూ వెళ్ళి అన్ని పాత్రల్ని గురించిన అన్ని విషయాలూ చెబుతాడు. సంభాషణల రూపంలోగానీ ఒక పాత్ర దృష్టికోణంలోంచి గానీ కథ 'చూపెట్టడు.' డాఫిన్‌లోని పడుచుపిల్ల, ప్యూజో 404లోని యువ ఇంజనీరు, 2CVలోని మత సన్యాసినులు, ID సిట్రాన్‌లోని వృద్ధ దంపతులు... ఇలా కార్ల పేర్లతోటే వ్యవహరింపబడే పెక్కు పాత్రల్ని- వృత్తుల్నీ, ప్రవృత్తుల్నీ- పాఠకుల కళ్ళ ముందర నిలబెట్టి, ట్రాఫిక్‌జామ్‌ని మానవ నాగరికత ఇరుక్కుపోయిన bottleneckకి వ్యంగ్యపూరితమైన మెటఫర్‌గా చూపెట్టి, మానవ నైజ సామస్త్యాన్ని 16 పేజీల కథలోకి సూక్ష్మీకరించడం నిజంగా ఒక అద్భుత ప్రయోగం! ఆ కథ నన్ను చాలారోజులు వెన్నాడింది. తెలుగులో ఆ తరహా కథ ఒకటి వస్తే బాగుండునన్న ఆలోచన నాలో పలుమార్లు మెదిలింది.

*

మరీ సంక్లిష్టమైపోయిన ఆధునిక సమాజంలో డబ్బుకు ప్రాధాన్యత మునుపెన్నడూ లేనంత తీవ్రంగా పెరిగింది. ప్రతిదాన్నీ- అనుబంధం, ఆత్మీయతల్ని సైతం- శాసించేది డబ్బు అయిపోయింది. అందుకే మనిషి డబ్బు కోసం అనుక్షణం వెంపర్లాడుతున్నాడు, ఉరుకులాడుతున్నాడు. ఎదుటివాడిని ఉత్తగా పలకరించి, కుశలప్రశ్న వేసే ముందు కూడా, 'ఈ పనివల్ల నాకేమన్నా ప్రయోజన మొరుగుతున్నదా లేదా,' అని లోలోపల ఆర్థిక లాభనష్టాలను బేరీజు వేసుకొంటున్నాడు. మిగతావాళ్ళ కన్నా ముందు పరుగెత్తి తనక్కావల్సిందాన్ని త్వరగా చేజిక్కించుకోవాలనే పోటీతత్త్వంలో ఉన్నాడు. వేరేవాళ్ళకు ఏ గతి పడితే నాకేమి, నా పని నేను సాధించుకోవాలి అనే స్వార్థపు ఆలోచనతో ఉన్నాడు. ఈ లక్షణాలు ధనిక, మధ్యతరగతి మనుషుల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అయితే పేదవర్గాలకు చెందిన మనుషుల లక్షణాలు ఇందుకు భిన్నమైనవి. ఈ వర్గాల్లో డబ్బు అంత కీలకమైన పాత్ర వహించదేమోననిపిస్తుంది. వీళ్ళు ఆపద వచ్చినా, సంపద వచ్చినా సమిష్టిగా పంచుకొంటారు. కష్టకాలంలో ఒకరికొకరు అండగా ఉంటారు. వర్గసమాజంలో, సహజంగానే గరీబోడికి గరీబోడే తోడుగా ఉంటాడన్న సత్యానికి నిదర్శనంగా నిర్దిష్ట సమయాల్లో శ్రామిక ప్రజలు నిలబడతారు.

తుఫాను ప్రభావంతో ఆంధ్రదేశమంతటా భారీ వర్షాలు కురుస్తున్న రోజుల్లో ఒకసారి నాకు అర్జంటుగా సిరిసిల్ల వెళ్ళాల్సిన పనిపడింది. చెరువులకు గండ్లు పడి, వంతెనలు కూలిపోయి రవాణావ్యవస్థ అస్తవ్యస్తమైపోయింది. వర్షం వెలిసిన ఒక అనుకూల సమయాన ఇంట్లోంచి బయలుదేరి నానా తంటాలు పడి సాబాసుపల్లి వాగు వొడ్డు చేరుకొన్నాను. వాగు ప్రవాహ వేగం ధాటికి రోడ్డు డ్యాం కొట్టుకుపోయింది. ఇవతలి ఒడ్డు వరకు బస్సులొచ్చి కరీంనగర్ వెళుతున్నాయి. అవతలి ఒడ్డు నుండి సిరిసిల్ల డిపో బస్సులు నడుస్తున్నాయి. అవతలి బస్సు అందుకోవాలంటే నేను వాగు దాటాలి.

తుఫాను, భారీవర్షాలు గీసిన అధివాస్తవిక దృశ్యం ఎంత బీభత్సంగా ఉంటుందో జీవితంలో మొదటిసారిగా అప్పుడే కళ్ళారా చూశాను నేను. తెగిన రోడ్లు, కూలిన వంతెనలు, విరిగిపడ్డ చెట్లు, నేలమట్టమైన ఇండ్లు, బురద మేటవేసిన పంటపొలాలు, ప్రవాహాల్లో కొట్టుకుపోతున్న కళేబరాలు- ఇవన్నీ చూస్తున్న మనుషుల ముఖాల్లో భయాందోళనలు...

ఏది ఏమైనా నాగరిక సమాజంలో మనుషుల జరూరు పనులు, అర్జంటు ప్రయాణాలు ఆగవు కదా? వివిధ తరగతులకు చెందిన ప్రజలు తమతమ గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవాలన్న ఆరాటంలో వాగు ఆ ఒడ్డునా, ఈ ఒడ్డునా గుంపులుగా నిల్చున్నారు. తెనుగువాళ్ళు, ఇతర కూలీజనం ప్రయాణీకుల్ని వాగు దాటిస్తూ ప్రయాణీకుల స్థోమతల్ని బట్టీ, వాళ్ళవాళ్ళ లగేజీలను బట్టీ కూలి వసూలు చేస్తున్నారు. అంతటా రణగొణ ధ్వని. తినుబండారాలు అమ్మేవాళ్ళ కేకలు, గౌండ్ల వాళ్ళ పిలుపులు, అధికార్ల అవినీతినీ, ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల్నీ దుయ్యబడుతున్న ప్రయాణీకుల సంభాషణలు, స్థానిక సమస్యల్ని విశ్లేషిస్తున్న విద్యావంతుల మాటలు... స్థూలంగా చెప్పాలంటే అక్కడి సంకీర్ణ వాతావరణం వెనుకబడ్డ తెలంగాణ సంస్కృతీ జనజీవిత సామస్త్యానికి నిలువుటద్దంలా అగుపడింది నాకు.

వాగులో మొలలోతు నీళ్ళు వేగంగా పారుతున్నాయ్. పొద్దుగూకే సమయం ఆసన్నమైంది. నేను నది దాటించే వాళ్ళల్లో ఒకడిని సమీపించాను. వాడు ఉత్సాహంగా ఎదురువచ్చి నా సూటు కేసు అందుకోబోయాడు. అంతలో, రెండు పెద్ద పెద్ద మూటలతో ఒక ముసలమ్మ వచ్చి వాడిని దీనంగా అభ్యర్థించింది. తాను సిరిసిల్ల చేరుకొని అక్కడి నుండి మరో ఊరికి వెళ్ళాలనీ, ఆ ఊరికి చీకటిపడితే బస్సులు నడవవనీ, తనను త్వరగా ఏరు దాటించి పుణ్యం కట్టుకొమ్మనీ ఆమె వేడికోలు సారాంశం. వాడు టక్కున నన్ను కాదని ఆమెను వాగు దాటించేందుకు సంసిద్ధుడయ్యాడు.

నా అర్జెంటు అవసరం నా వెన్నులో చరిచి హెచ్చరించింది. వాడడిగిన అయిదు రూపాయల కూలికి మరొక్క రూపాయ కలుపుతాననీ, నన్ను ముందుగా వాగు దాటించమనీ అన్నాను. తెనుగువాడు పెద్దగా ఆసక్తి కనబరచలేదు. 'ఈ ముసల్దాన్ని దాటించి వస్తా. పావుగంట ఆగండి. జల్దిన పోవాలనుకుంటే- అదుగో, వేరేవాళ్ళ సహాయం తీసుకోండి,' అంటూ తన సహచరుడొకనికి నన్ను చూపెట్టి, నా ప్రతిస్పందన కొరకు కాచుకోకుండా ముసలమ్మ జబ్బ పుచ్చుకొని నీళ్ళలోకి దిగాడు. అయితే నన్నాశ్చర్యపరిచింది వాడి తిక్కగుణమూ, నిర్లక్ష్య వైఖరీ కావు.

ముసలమ్మ సందిగ్ధంగా ఆగి, వాడివైపు చూస్తూ అడిగింది, "ఎన్ని పైసల్ తీసుకుంటవు కొడుకా..."

"నీ ముల్లెలకు రూపాయి, నీకు ఒక్క రూపాయి. మొత్తం రెండు రూపాయలు."

ముసలమ్మ చీరకొంగు ముడి విప్పి డబ్బులు లెక్కపెట్టుకుంది. "బస్సుఛార్జీలకు పోను ఒక్క రూపాయె మిగులుతున్నది కొడుకా..."

"ఆ ఒక్క రూపాయి నువ్వే దాచుకో. దానితో నీ మనుమలకు మనుమరాండ్లకు ఏమైనా తినుబండారాలు కొనుక్కుపో. నువు నాకు పైసా ఇవ్వకుంటేమాయె. వాగు దాటిస్తా రా," అంటూ ముసలమ్మ ముల్లెల్ని తన నెత్తి మీద పెట్టుకొని తెనుగువాడు ముందుకు అడుగేశాడు.

వాడి ఔదార్యమూ, సాటి పేదల పట్ల సానుభూతీ, సహానుభూతీ నన్నాకట్టుకొన్నాయి. ఆ సంఘటన ఆధారంగా ఒక కథ రాయాలని గట్టిగా నిర్ణయించుకొన్నాను.

★ ★ ★

వాగు దాటి బస్సులో కూర్చున్నాక, ఈ సంఘటనను కథగా మలచడానికి ఏ టెక్నిక్ ఉపయోగించాలా అని పరిపరివిధాలా ఆలోచించాను. పరుగెడుతున్న బస్సుతో పాటు నా ఆలోచనలూ వేగం పుంజుకొన్నాయి. *The Southern Thruway* కథ చప్పున స్ఫురణకొచ్చింది నాకు. ఆ కథలో వర్ణించబడిన ట్రాఫిక్‌జామ్‌కూ, నేను ప్రత్యక్షంగా చూసిన వాగు మీది తెగిపోయిన

రోడ్డు డ్యామ్‌కూ ఏదో పోలిక ఉన్నట్టనిపించింది. ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుబడ్డ మోటారిస్టుల చుట్టూ అల్లిన ఆ కథ ఇతివృత్తంలో మానవనైజ సామస్త్యాన్ని దృశ్యీకరించడం జరిగింది. ఇక్కడ- రవాణా మార్గం తెగిపోయిన సాబాసుపల్లి వాగు దగ్గర మూగిన జనసందోహంలో జనరల్‌గా తెలుగుజాతి-ప్రత్యేకించి తెలంగాణ ప్రాంత సంస్కృతీ మనస్తత్వాల వర్ణ పటం కనబడింది. పెక్కు పాత్రల్ని ఒకే ఫ్రేములో ప్రవేశపెట్టగలిగే కథావస్తువు నాకు లభ్యమైందని తోచింది.

ఇంటికి తిరిగొచ్చాక ఏకబిగిన రాస్తూపోయి, రెండు రోజుల్లో ముసల్దాని ముల్లె పూర్తి చేశాను. వివిధ వర్గాలకు చెందిన ప్రయాణీకుల్ని మోసుకెళ్తున్న ఆర్టీసీ బస్సుని ఒక miniature world గా తీసుకొని, తెలంగాణలోని వర్తమాన రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల్ని, ప్రయాణీకుల (పాత్రల) సంభాషణల ద్వారా చిత్రించాను. సాటి పేదల పట్ల పేదవాని సహానుభూతి ఇరుసుగా పూర్తి నాటకీయ శిల్పంతో కథనం సాగించి, మేధావులు వల్లించే ఆదర్శాల్లోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తూ ముగింపునిచ్చాను. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి తర్వాత తెలుగు రచయితలు నాటకీయ శిల్పం గురించి మర్చిపోయారు. అందుకే, ప్రత్యేకించి నేను ఎంచుకొన్న వస్తువుకు నప్పినట్టుగా ఉంటుందని, ఈ శిల్పం ప్రయోగించాను. ముసల్దాని ముల్లె ఆహ్వానం మాసపత్రికలో ప్రచురితమయ్యాక ఒకరిద్దరు రచయితలు తమ కథల్లో నాటకీయ శిల్పాన్ని వాడారు.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 26 అక్టోబర్ 1997*

4

# అమృతుడు

## ఆర్.యస్. సుదర్శనం



*ఆర్.యస్. సుదర్శనం 13 డిసెంబర్ 1927న చిత్తూరు జిల్లాలో జన్మించారు. విమర్శకులుగా ప్రసిద్ధులైన వీరు ఐదు నవలలు రాశారు. వీటిలో 'సంసార వృక్షం' నవలకు 1977లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి అవార్డు వచ్చింది. 'కాలం తెచ్చిన మార్పు', 'మధుర మీనాక్షి' కథా సంపుటాలు, ఒక కవితా సంపుటి, ఆరు విమర్శనా గ్రంథాలను వెలువరించారు. వివిధ కళాశాలల్లో ఆంగ్లోపన్యాసకులుగాను, ప్రిన్సిపాల్‌గాను పనిచేసి, విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా రిటైరయ్యారు. 14 డిసెంబర్ 2001న మదనపల్లెలో మరణించారు.*

సన్నజాజుల పందిరి కళకళలాడింది. ఆ పువ్వులు వాడినా చిక్కని పరిమళం మాత్రం సిగ నంటి పెట్టుకునే ఉంటుంది... జీవితంలో అధ్యాయం మారుతుంది; కోరికలు తీరటంతో ఆసక్తి చప్పబడుతుంది; ఎన్నిసార్లు పెట్టుకున్నా సన్నజాజుల మీది ఆపేక్ష మాత్రం తగ్గదేమో!... అనుకొన్నది ప్రసూన. ఆమెకు ఆ పువ్వులు దండలు గ్రుచ్చి జడలో ధరించటం ఒక్కటే పేలవం కాకుండా, క్రొత్తదనం చెరగకుండా నిలిచిన సరదా!

అంతకు నాలుగైదేళ్ల పూర్వం ఆమె భావనా లోకంలో గృహిణి జీవితం అంటే: హోదాగల ఉద్యోగంతో, అనుకూలుడైన, నచ్చిన భర్త; కోరిన నగలు, చీరలు; సొంత కారు; కావలసిన తీరిక- ఆ కోరికలన్నీ తీరి, కల నిజమై నిలిచింది; అందరూ 'అదృష్టవంతురాలి'వన్నారు!

అప్పుడు ఊహించనిదీ, తర్వాత తర్వాత లోటుగా తెలిసి వస్తూ ఉండేదీ ఒక్క విషయమున్న మాట నిజమే: అది తనకింకా మాతృత్వం రాకపోవటం. కాని ఆ విషయంలో కూడా భయపడనవసరం లేదని డాక్టర్లు, జ్యోతిష్కులు అంటున్నారు. పోతే, మిగిలిందేమిటి? అసంతృప్తి! ఎందుకు? కారణం తెలీదు! 'ఏమీ తోచదు' అని ఆమె ఎప్పుడైనా అంటే, 'నీకు తీరిక ఎక్కువైపోయింది ప్రసూనా!' అంటాడు భర్త. 'ఇంకా తల్లివి కాకపోవటమే కారణం.

ఆ పుణ్యకాలం ఎప్పుడు వస్తుందో!' అంటుంది అత్తగారు. 'అమ్మాయ్, వేదాంతమూ, మతమూ వీటిమీద కాస్త ఆసక్తి కలిగించుకోరాదూ, జీవితంలో అర్థం కనిపిస్తుంది!' అంటాడు తండ్రి. 'మహిళా సంఘ కార్యక్రమాల్లో మీరు శ్రద్ధ తీసుకోవాలండీ' అంటుంది కలెక్టరుగారి భార్య, సంఘాధ్యక్షురాలు. కాని ఏ ఒక్క వివరణా, సలహా ఆమెకు నచ్చలేదు;

సమస్య తీరటం లేదు. ఎంత తరచినా, అసంతృప్తి స్వరూపం ఒక్కటే. పూర్వం తనకే విషయమైనా సరే ఆసక్తి అంటూ ఉండేది; ఎదురుచూచే ఉత్సాహం ఉండేది; ఇప్పుడు అవి రెండూ లేవు! చివరకు తను మాతృత్వాన్ని కూడా పెద్దగా ఎదురుచూడటం లేదు!

కారు వచ్చి ఆగింది. భర్త వరండా మెట్లెక్కి వచ్చాడు.

"నువ్వు క్లబ్బుకి వెళ్లలేదేం ఇవాళ?" అన్నాడు.

ఒళ్లో వున్న ఇంగ్లీషు నవల పైకెత్తి చూపింది ప్రసూన. "ఇది చదివెయ్యాలని కూర్చున్నాను."

"మరి చదవకుండా జాజిపందిర్ని చూస్తూ పువ్వులు లెక్కపెడుతున్నావే!"

భర్త చమత్కారానికి ప్రసూన నవ్వింది. "లేదు, కొంత భాగం గడిచేటప్పటికి కథ పరుగెత్తటం మాని యీడుస్తూ కుంటటం ప్రారంభించింది. విసుగొచ్చింది."

"జీవితంలాగే? "

ప్రసూన విషయం మార్చింది. "మీరెందుకని ఇంత తొందరగా వచ్చేశారు క్లబ్బు నుంచీ?"

"టెలిగ్రాం వచ్చింది- వేణు వస్తున్నాడు- ఈ ట్రెయినుకే! నీతో చెప్పి, తర్వాత స్టేషన్‌కు వెళ్దామని-"

"ఈ మధ్య ఉత్తరం వ్రాసినట్లు లేదే!"

"లేదు- వాడెప్పుడూ ఇలాగే చేస్తాడు. పరీక్ష పదిహేను రోజులు ఉందికదూ! సరిగ్గా పరీక్ష ముందు రోజుల్లోనే రిక్రియేషన్ కావాలంటాడు వాడు!"

"భోజనం ఆలస్యమవుతుందేమో. మీకు కాఫీ కావాలా ? "

"తప్పకుండా!"

వంట మనిషితో చెప్పటానికి లోపలికి వెళ్లింది ప్రసూన.

*

ఉన్నట్టుండి వచ్చింది వర్షం. వేణు ఒక్కడే షికారు వెళ్లాడు. బాగా తడిసిపోయి ఉంటాడు అనుకుంది ప్రసూన. వేణు ఏకాంతాన్ని కోరుతాడు; అన్నగారిలా కాదు. ఆయనకేమో ఎప్పుడూ స్నేహితులూ, కబుర్లూ ఉండాలి; లేకపోతే తోచదు. వేణు మొదటి రెండు సాయంత్రాలూ వదినతో చదరంగం ఆడుతూ గడిపాడు. ఇవాళ ఆమెతో ముందుగా చెప్పనే లేదు 'షికారుకెళ్తున్నా'నని. చదరంగం ముందు పెట్టుకొని ప్రసూన నిరీక్షిస్తుంటే, దుస్తులు వేసుకొని తయారై వేణు వరండాలో నుంచే, 'అలా వెళ్లొస్తాను వదినా!' అనేసి గబగబా వెళ్లిపోయాడు. ఎన్నో విషయాల్ని గురించి లోతుగా ఆలోచించిన ధోరణి వ్యక్తమవుతూ ఉంటుందే ఏం మాట్లాడినా, మరి ఈ చిన్న విషయం, అవతలి వాళ్లపట్ల తన ప్రవర్తనను గూర్చి, ఎందుకని తట్టకుండా పోయిందో! అతని మీద ప్రసూనకు కోపం వచ్చింది.

అత్తగారికి, ముగ్గురు కొడుకుల్లోనూ, చివరివాడని కాబోలు, వేణు మీదే ఎక్కువ మమకారం. అతనికి ఏమేమి ఇష్టమో, అతనే విషయాన్ని గురించి, ఏ అభిప్రాయం, ఎప్పుడు వెలిబుచ్చాడో అన్నీ సమగ్రంగా చెబుతూ ఉంటుంది ఆమె. ఆమె వచ్చిన ప్రతి పర్యాయం ఇంచుమించు వేణు కూడా ఇంట్లో వచ్చి ఉన్నట్లే ఉండేది! అలా పరిచయమైన వ్యక్తిని గూర్చిన కల్పన,

మనస్సులో ఏర్పడిన ఊహాచిత్రం ఎంతవరకూ నిజం? అని పరీక్షిస్తోంది ప్రసూన. అత్తగారు చెప్పిన వంటలు, ఆ ధోరణిలోనే అన్ని సదుపాయాలు వేణుకోసం అమర్చి గమనిస్తోంది. ఏదో ఒక నవ్వు, ఒక చూపు, ఒక మాట తళుక్కున మెరసి అప్పుడప్పుడు ఒక ప్రత్యేకతని చూస్తున్న మాట నిజమే కాని, మనిషిలో కలుపుగోలుతనం మాత్రం లేదు. ఏదైనా అడిగితే ఒక్క ముక్కలో సమాధానం. లేకపోతే అదీ లేదు. ఇదంతా కలిసి చివరకు ఒక విధమైన స్వాతిశయమే అనిపిస్తూ ఉందామెకు. సిగ్గు పడుతున్నాడేమో అంటే అదేమీలేదు! నిశ్చలంగా కళ్లలోకి చూచి మాట్లాడుతాడు; ఏమాట చెప్పినా అందులో సంకోచం ఏమీ ఉండదు! ఒక తల్లి బిడ్డలే అయినా, ఆమె భర్తలో కనిపించే స్నేహభావం, ఉత్సాహం, చైతన్యం వేణులో ప్రతిబింబించటం లేదు మరి!

కాని వేణు వర్షంలో తడిసి వస్తాడని ఒక వైపు ఆదుర్దాగా ఉంది ప్రసూనకు- గొడుగు పంపించటానికి నౌఖరు వర్షం ముందే ఇంటికి వెళ్లిపోయాడు. వేణు ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరమని అత్తగారెప్పుడూ చెబుతూ ఉంటుంది. బాగా తడిసిపోయి ఇల్లు చేరాడు వేణు! ప్రసూన హాల్లో సోఫాలో కూర్చుని పుస్తకం చదువుతూ, వేణు రావటం చూచీచూడనట్లు ఊరుకుంది. వరాండాలో నుంచే ప్రక్కనున్న తన గదిలోకి వెళ్లిపోయాడు. కొంతసేపటికి బట్టలు మార్చుకుని హాల్లోకి వచ్చాడు. ప్రసూన మాత్రం పుస్తకం మీద నుంచి దృష్టి మరల్చలేదు. ఎదుటవున్న సోఫాలో కూర్చుని, అన్నాడు వేణు:

"బాగా తడిసిపొయ్యాను వదినా!"

ప్రత్యుత్తరంగా ఒక్కక్షణం తలయెత్తి చూచింది ప్రసూన. తడవటం మూలాన కాబోలు అతని ముఖంలో స్నిగ్ధత్వం, ఆ కళ్లలో ఏదో క్రొత్త కాంతి తోచాయి. వేణులో ప్రత్యేకత, సౌందర్యం వున్నట్టు అంగీకరించక తప్పదు, అనుకొన్నది ప్రసూన.

"అన్నయ్య ఇంకా రాలేదా?"

"లేదు!"

"అనుకోకుండా వచ్చింది వర్షం... కుండపోతగా కురిసింది. సచేల స్నానం!"

"అనుకోకుండా వెళ్లావు, వర్షమూ అలానే వచ్చిఉంటుంది నిన్ను పరామర్శించటానికి!"

వేణు నవ్వాడు. "నువ్వు క్లబ్బుకు వెళ్తావనుకున్నాను వదినా!" అన్నాడు.

"నిన్న, మొన్న?"

"నిన్న, మొన్న కొత్తవాణ్ణి, అతిథిని! ఇవాళకూడా నా కోసం నువ్వింట్లో కూర్చోవటం దేనికి? లేడీస్ క్లబ్బుకి వెళ్తావని, షికారు బయల్దేరాను!"

"అది నిజం కాదు- నువ్వెప్పుడూ అబద్ధం చెప్పవని మీ అమ్మగారు నొక్కి చెబుతూ ఉంటారు మరి!" అని పుస్తకం వైపు దృష్టి తిప్పింది ప్రసూన. కొన్ని క్షణాలు, తన్ను తాను పరీక్షించుకొంటున్నట్లు మౌనంగా వున్న వేణు చివరకు అన్నాడు:

"అబద్ధం కాదు, సగం సత్యం చెప్పాను!"

"ఏమిటి?" అన్నదామె. ఆ సంగతంతా అప్పుడే మరచిపోయినట్లు.

"నువ్వు క్లబ్బుకు వెళ్తావనుకోటం ఒక కారణమూ, నాకు ఏకాంతంగా ఉండాలన్న కోరిక రెండో కారణమూ. ఈ రెండూ కలిసే నేను షికారు వెళ్లటం జరిగింది. అందువల్ల సగం సత్యం చెప్పానంటున్నాను."

"తత్త్వశాస్త్రం చదువుకున్నావు కాదూ మరి," అన్నది ప్రసూన విసుగు చూపిస్తున్నట్లు.

కారు వచ్చింది. ప్రసూన భర్త లోపలికి వచ్చాడు.

*

వేణుకు జ్వరం వచ్చింది. ఫెడరల్ సర్వీస్ కమీషన్ ఉద్యోగాల పరీక్ష పదిరోజులే ఉంది. తమ్ముడు పరీక్షకు వెళ్లటానికి వీల్లేకుండా పోతుందేమోనని ప్రసూన భర్త ఆందోళన చెందాడు. డాక్టరు 'మలేరియా' అన్నాడు. క్వినైన్, ఇంజక్షన్‌లు ఇచ్చాడు.

ఆ రోజుల్లో ప్రసూనకు వేణు ఇంకో విధంగా కనిపించాడు. ఆమె ఊహించిన 'స్వాతిశయం' అతనిలో అదృశ్యమైపోవటమేకాదు, కొన్నిసార్లు వేణులో వ్యక్తమైన పసితనపు అమాయకత్వం ఆమెకు నవ్వు కూడా తెప్పించింది. ఆమె వేణును గూర్చి తన అభిప్రాయం మార్చుకొన్నది. ఏ విషయం మాట్లాడినా అతని సమక్షంలో ఆమె సొంత భావాలకు ఒక కొత్త విలువ వస్తోంది! ఒకానొకప్పుడు పుస్తకాలు చదివి తోడి విద్యార్థినులతో ఎన్నో సంగతులు ఉత్సాహంతో చర్చించే ఆమె పాత అనుభూతి తిరిగి వచ్చినట్లుంది:

"జీవితం ఎందుకు పేలవమై పోతుంది?"

"తీరిన కోరికలవల్ల."

"అయితే ఏం చెయ్యాలి? "

"కొత్త కోరికలు కోరుకోవాలి! "

వేణు సూచించిన జవాబు చాలా విడ్డూరంగా తోచింది ప్రసూనకు.

"బాగుంది. అవి ఆసక్తికి బదులు ఆవేదనని కలిగిస్తాయి కదా! కోరికల్ని జయించి, శాంతిని సాధించమనేకదా తత్త్వబోధ! కొత్త కోరికల్ని పెంచుకుంటే ఏమవుతుంది?"

"భౌతికంగా సాధ్యమయ్యే కోరికలు ప్రయత్నం మీద వాటి మార్గం అవి చూచుకొని ఏమైనా సరే గమ్యం చేరుకొంటాయి... భౌతికంగా సాధ్యంకానివి, లేక మనలోని బుద్ధివల్ల, నిగ్రహశక్తివల్ల కట్టుబడేవి చివరకు- అంటే ఎంతకాలంలో, ఏ విధంగా అనేది వ్యక్తిని బట్టి ఉంటుందని- చివరకు- సత్యరూపంతో శాంతిని, ఆనందాన్ని ప్రసాదించగలుగుతాయి! అంతేగాని, కోరికల్ని చంపటం, అణచటం, విస్మరించటం, ఇదంతా భాషవల్ల, ఊహవల్ల కలిగే పొరబాటు! దానికి కారణం భయం. భయమూ, నిగ్రహమూ ఒకటి కాదు. భయంవల్ల లభించేది మృతి; నిగ్రహంవల్ల సాధ్యమయ్యేది ఆనందం... కాబట్టి కోరికల అశాంతిని పూర్తిగా అనుభవించటమే జీవితంలో ఆసక్తికి మూలం అంటాను... అందుకే క్రొత్త కోరికలు పెంపొందాలి అన్నాను..."

"నువ్వు చెప్పేది నాకేం అర్థం కావటంలేదు వేణూ! పుస్తకాల్లో చదివినదానికి నీ సొంత వ్యాఖ్యానం కాబోలు ఇదంతా! " అన్నది ప్రసూన.

*

ఒకనాడు వేణు పెళ్లి ప్రస్తావన వచ్చింది:

"ఉద్యోగం ఎలానూ వస్తుందికాని, నువ్వెలాంటి అమ్మాయిని కోరుతావో, ఎంత కట్నం, ఏవేవిటి కావాలో ఇప్పుడే కాస్త చెప్పిపెట్టితే ఎందుకైనా మంచిది వేణూ!" అన్నది ప్రసూన.

"ఎలాంటి అమ్మాయైనా సరే!" అన్నాడు.

"అచ్చంగా వేదాంతిలా మాట్లాడుతున్నావే! కోరికలు కోరటం మంచిదని నువ్వే అంటావు మళ్లీ... కోరుకోవటానికి సిగ్గెందుకూ? అమ్మాయి ఎలా ఉండాలో చెప్పు, ఊహించి!"

"నీవలె ఉండాలి వదినా!"

"ముఖస్తుతి అక్కరలేదు, చెప్పు!"

"నాకింకేం తోచటంలేదు. ఇప్పుడెందుకా గొడవ? దయచేసి ఊరుకో వదినా," అన్నాడు.

ప్రసూన వెళ్లిపోయింది. తర్వాత రెండు రోజులు ఆమె వేణుతో ఎక్కువగా మాట్లాడలేదు; వ్యక్తిగతమైన ప్రశ్నలు వేయటం అసలు మానివేసింది.

వేణు వెళ్లిన తర్వాత ప్రసూనకు జీవితంలోని అర్థరాహిత్యం మళ్లీ తీరని సమస్యగా గుర్తుకు వచ్చింది. మరిది రావటంతో, ఆ సందడిలో కొన్నాళ్లు ఆ విషయం అప్రయత్నంగా మరచిపోయిం దామె. భర్తకు తత్త్వజిజ్ఞాస పట్టదు; ఏ విషయాన్ని గూర్చి కాని లోతుగా ఆలోచించటం, తర్కిం చటం హాస్యాస్పదంగా కనిపిస్తుంది ఆయనకు... కనిపించేది లోకం, జరిగేది జీవితం, అంతకు మించిన ఊహలు, నమ్మకాలు అనవసరం ఆయన దృష్టిలో... వేణు భావకుడు, తాత్త్వికుడు. ప్రతి విషయాన్ని గూర్చి ఏదో పరీక్షచేస్తాడు; అన్వయంకోసం వెదుకుతాడు... నిజానికి సోదరులు ముగ్గురూ ముగ్గురే! అనుకొన్నది ప్రసూన. సైన్సు, గణితం తీసుకొని పరీక్షలు ప్యాసై, ప్రావిన్షల్ సర్వీస్‌లో డిప్యూటీ కలెక్టరుగా సెలెక్టయ్యాడు ప్రసూన భర్త. పెద్ద మరిది మద్రాసులో తండ్రి దగ్గరే లాయరుగా ఉన్నాడు. ఇక వేణు: వేదాంతం, చరిత్ర, సాహిత్యం ఎన్నుకొని ఫెడరల్ సర్వీసెస్ పరీక్షకు వెళ్తున్నాడు. రేపో మాపో పోస్టల్‌లోనో, రైల్వేలోనో పెద్ద ఉద్యోగి అవుతాడు.

అన్నదమ్ములు వాదిస్తూ ఉంటే వినాలి! జగత్తు రహస్యం, వాస్తవిక ప్రపంచాన్నీ హేతు వాదాన్నీ మించి తెలుసుకోవటానికి వీల్లేదంటాడు అన్న. హేతువాదాన్ని అధిగమిస్తే కాని ఆ విషయం తేలదంటాడు వేణు. 'ఏ విధంగా?' అంటే మాత్రం దానికి సమాధానం, వివరణ సాధ్యం కాదనీ, అన్నగారిని అంగీకరింపచెయ్యటం తనచేత కాదనీ అంటాడు వేణు. ఒక కోరికను కోరటం, దాన్ని నిగ్రహించటం ఈ విరుద్ధ ప్రవృత్తుల మధ్య కలిగే హృదయానుభూతిలో అందుకు ఏదో మార్గం ఉందని తనకు తోస్తోందనీ, దాని స్వరూపం తనింకా అవగతం చేసుకోలేదనీ అన్నాడు, జ్వరం వచ్చినప్పుడు ఒకసారి ప్రసూనతో వేణు. ఆ మాట భార్య ద్వారా విని, 'ఉద్యోగం వచ్చి పెళ్ళయితే, ఈ పిచ్చి వేదాంతం వదుల్తుందిలే,' అన్నాడు వేణు అన్న. మొత్తానికి వేణు విచిత్రవ్యక్తి అనుకొన్నది ప్రసూన.

పరీక్షలు పూర్తికాగానే సరాసరి తిరిగి రమ్మనీ, తర్వాత మద్రాసు వెళ్లవచ్చుననీ చెప్పారు దంపతులిద్దరూ. కాని ఢిల్లీ వెళ్లి వేణు ఉత్తరం వ్రాశాడు; పరీక్షలు కాగానే మద్రాసు వెళ్లి రెండు రోజులుండి, తర్వాత ఒక స్నేహితునితో కలిసి దక్షిణ దేశం తిరిగిరావాలని సంకల్పించాడట! దక్షిణదేశ యాత్ర తర్వాత అన్న దగ్గరకు వస్తాడట!

తర్వాత ఉత్తరాలు లేవు! అతను పుదుచ్చేరి అరవిందాశ్రమంలో కొన్నాళ్లూ, రమణా శ్రమంలో కొన్నాళ్లూ ఉన్నట్టూ, దక్షిణాదిలో ముఖ్యమైన స్థలాలన్నీ దర్శించినట్టూ మద్రాసు నుంచి కబురు మాత్రం తెలిసింది. రెండునెలల తర్వాత కాని వేణు మద్రాసు చేరుకోలేదు. అప్పుడే ప్రసూన భర్తను బదిలీ చేసి బళ్లారి వేశారు. ప్రసూన పుట్టింటికి వెళ్లింది. ఆమె బళ్లారికి తిరిగి వచ్చిన తర్వాత భర్త వేణుని రమ్మని ఉత్తరం వ్రాశాడు. ఈ మధ్యకాలంలో వేణు మద్రాసులో ఒక కాలేజీలో లెక్చెరరుగా చేరాడట. అందువల్ల సెలవుల్లోకాని రావటానికి వీలుండదని బదులు వచ్చింది! ఫెడరల్ సర్వీసెస్ ఫలితాలకైనా వేచి వుండకుండా ఇంతలో ఈ ఉద్యోగమేమిటని, భార్యాభర్తలిద్దరూ ఆశ్చర్యపడ్డారు. దానికి ప్రత్యుత్తరమిచ్చాడు వేణు- ' ...ఫలితం ఏమౌతుందో, ఊరుకోవటం దేనికని లెక్చెరరు ఉద్యోగం చేస్తున్నాను... ఈసారి సెలవుల్లో వచ్చినపుడు నాకు పెళ్లి సంబంధం చూడమని వదినెతో చెప్పాలి... క్రిందటి మాటు, నాకు ఉద్యోగం రాగానే అమ్మాయిని వెదికిపెట్టుతానన్నది వదినె!' అయితే వేణు సరియైన ధోరణిలోనే ఉన్నాడన్నమాట!

పుదుచ్చేరి, అరుణాచలం ఇవి ప్రసూనను, ఆమె భర్తను కలవరపెట్టాయి... వేణు వ్రాసిన ఉత్తరం ఆ సందేహనివృత్తి చేసింది!... తెలిసినవాళ్లలో తగిన అమ్మాయి ఎవరా అని ప్రసూన

ఆలోచించటం ప్రారంభించింది... 'నీవలె ఉండాలి వదినా!' అని వేణు అన్న మాట జ్ఞాపకం వచ్చి, ఆమెకు మరిది మీద ఏదో క్రొత్త అభిమానం కలిగింది.

*

డిసెంబరులో తల్లిని తీసుకుని వేణు బళ్లారి వచ్చాడు. ఢిల్లీ ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు వచ్చిందట. పది రోజుల్లో వెళ్లాలి.

"ఏదో పరీక్షో, ప్రయాణమో ముందు పెట్టుకొనిగాని, ఊరికే రాగూడదేమిటి?" అన్నది ప్రసూన.

"జ్వరం వస్తుందేమోనని భయం!" అన్నాడు వేణు.

ప్రసూన నవ్వింది. "అందుకే కాబోలు ఈసారి అత్తయ్యను వెంట దీసుకొచ్చావ్!"

"అమ్మ హంపీ చూడాలట... మీరింకా వెళ్లలేదుగా, అందరం కలిసి వెళ్లొద్దాం," అన్నాడు వేణు.

తీరా ప్రయాణమయ్యేటప్పటికి ప్రసూన భర్తకు ఆఫీసు పనులేవో అడ్డువచ్చాయి. మిగిలిన ముగ్గురూ డ్రైవరుతో కారు తీసుకుని బయల్దేరారు.

విరూపాక్ష దేవాలయంలో తిరుగుతూ ఉండగా వేణు అన్నాడు- " మొట్టమొదటిసారిగా ఈ ప్రదేశంలో అడుగు పెట్టుతున్నా, ఎందుకనో ఈ కట్టడాలూ, శిల్పాలూ, పరిసరాలూ నాకు చిరపరిచితాలన్న అనుభూతి కలుగుతోంది వదినా!"

"బహుశా ఫోటోల్లో ఈ కట్టడాలు చూచి ఉంటావు! చరిత్ర చదివి ఊహించుకొని వుంటావు! అదంతా జ్ఞాపకం వస్తోంది కాబోలు," అన్నది ప్రసూన.

"అలా కాదు. రోజూ మనం నడిచే వీధి, తరచు వెళ్లే దేవాలయం, పాల్గొనే పూజలు, హరికథలు, ఉత్సవాలు- ఇవి కొన్ని సంవత్సరాల తర్వాత మళ్లీ ఆ చోటికే తిరిగివస్తే మనకెంత గాఢంగా జ్ఞాపకం వస్తాయో, అలాగే ఈ హంపీ బజారు, ఈ దేవాలయాలు ఇంత శూన్యంగా, నిర్జనంగా కనిపిస్తూ ఉన్నా, మనుష్యులతో, ఉత్సవాలతో సందడిగా కళకళలాడుతూ ఉన్నట్టు ఏదో భ్రమ కలుగుతోంది నాకు... నిజం చెప్పాలంటే పూర్వ జన్మలో నేనిక్కడ రాయల సైన్యంలో ఒక సరదారునైనట్లు గట్టిగా నమ్ముతున్నాను!"

"బాగుంది... అయితే విజయనగర ప్రజల జీవితాన్ని వర్ణిస్తూ ఒక చక్కని నవల తయారు చేయవచ్చునే! ఊహాశక్తి అంత గాఢంగా ఉంటే... అత్తయ్యా, మీ అబ్బాయి ఏదో పూర్వజన్మలో ఇక్కడ రాయలవారి సర్దారుగా ఉండేవాడట!"

"సరదారేమిటి, సైన్యాధ్యక్షుడే అయిఉంటాడు! అమ్మాయ్, పూర్వజన్మ స్మృతి అంటే అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు... నా చిన్నతనంలో ఒకసారి మా ఇంటికి ఒక యోగి వచ్చాడు..." వేణు ఏం చెప్పినా అది అందరూ అక్షరాలా నమ్మాలి! దాన్నెవరైనా శంకించటం ఆమె సహించలేదు; పూర్వజన్మ స్మృతుల్ని గూర్చి ఏదో కథలు చెప్పింది ప్రసూన అత్తగారు.

ప్రసూన వింటూ నడుస్తోంది. వేణు కొంచెం ముందున్నాడు. హంపీ బజారు దాటి కోదండ రామ దేవాలయం దరికి నడుస్తుంటే, చప్పున నిలిచిపోయాడు. ఎడమ వైపున తుంగభద్రను చూపి అన్నాడు, "ఇక్కడి నుంచి నదీ, ఈ పరిసరాలూ, ఈ దృశ్యం నాకు మరీ గాఢమైన స్మృతిగా ఉంది... ఇక్కడ నిల్చొని ఎన్నోసార్లు ఎవరితోనో మాట్లాడినట్లు నా ఊహ!"

ప్రసూన నవ్వుతూ అన్నది, "తర్వాత మాట్లాడవచ్చు; విఠల దేవాలయం ఇంకా చాలా దూరం వుందట... తిరిగి వచ్చేటప్పుడు మాట్లాడరాదూ!"

విఠల దేవాలయం చూచిన తర్వాత హోస్పేట తిరిగి వచ్చారు ఆ రోజు.

మరుసటిరోజు హజార రామస్వామి దేవాలయంలో, రామాయణగాథ చెక్కబడిన కుడ్య శిల్పాన్ని చూస్తూ ఉంటే, వేణు ఒక చిత్తరువు ముందు నిల్చుని కదలకపోవటం గమనించి, కౌతూహలంతో దగ్గరకు వెళ్లింది ప్రసూన... సీత పర్ణకుటీరం ముందు నిలబడి, బంగారు లేడి వైపు చూపిస్తూ 'అది తనకు కావా'లంటూ ఉంది శ్రీరామునితో. తర్వాతి చిత్రం- రాముడు ఆ లేడిమీద బాణం వేయటం!

"ఆ లేడి ఎంత బాగుంది!" అన్నది ప్రసూన.

వేణు మాట్లాడలేదు. రెండుమూడు చిత్రాలు దాటివెళ్లిన ప్రసూన వేణుతో- "ఆ లేడి మీద వ్యామోహమే కలగకపోతే సీతకు అంత అనర్థం వాటిల్లేది కాదుకదా!" అన్నది.

వేణు ఆమె దగ్గరకు నడిచాడు: " అలా కాదు వదినా! సీత కారణజన్మురాలు... సీతారాములిద్దరూ కూడా రావణసంహారం కోసమే జన్మించారు. అందువల్ల కాలాన్నిబట్టి కనిపించే హేతువులూ, మంచిచెడ్డలూ ఇంకో రకంగా ఉంటాయి!"

"ఏమిటో వేణూ! ఇక్కడ కూడా వేదాంతమేనా?"

గజశాల, దసరాదిబ్బ దర్శించటానికి వెళ్తున్నారు. వేణు అన్నాడు- "సర్దారు వృత్తాంతం చెప్పనా? "

"సర్దారేమిటి?"

"మరిచిపొయ్యావా వదినా! నా పూర్వజన్మ కథ!"

"ఆఁ, అవును, చెప్పు; పూర్తిగా జ్ఞాపకం వచ్చిందేమిటి?" అన్నది ప్రసూన చిరునవ్వుతో.

"ఆ సర్దారు ఒక యువతిని- పుష్పలావికను- ప్రేమించాడు... మొదటిసారి విరూపాక్ష దేవాలయంలో, తర్వాత హంపీ బజారులో, తుంగభద్ర ఒడ్డున ఆమెను కలుసుకున్నాడు... ఆ ప్రేమబంధం నాగపాశంలాంటిది... దానిలో అతను పూర్తిగా కట్టుబడిపోయాడు... ఒకనాటి వర్షపు రాత్రి ప్రేయసి మీది వ్యామోహం నిగ్రహించుకోలేక, రోగశయ్యమీద మరణావస్థలో ఉన్న తల్లిని వదలి వెళ్లాడు... వెళ్లాడు కాని అతని హృదయంలో పూర్వార్ధానికీ, ఉత్తరార్ధానికీ సంఘర్షణ... తెల్లవారేసరికి తల్లి మరణించింది... పశ్చాత్తాపం- తర్వాత రాయలవారి జైత్రయాత్ర... సర్దారు యుద్ధభూమికి వెళ్లి తిరిగి వచ్చేటప్పటకి ఏడాది దాటింది... పుష్పలావిక జాడలేదు... హంపీ బజారులో రెండేళ్ల క్రితం కనిపించాడొక విదేశీవర్తకుడు; ఆమె దగ్గర పువ్వులు కొనేవాడు; అతణ్ణి పెళ్లి చేసుకొని వెళ్లిపోయిందని విన్నాడు... జీవితం శూన్యమనిపించింది... "

"తర్వాత ఏమైంది?"

"తెలీదు."

"కథ రొమాంటిక్‌గా ఉంది. కాని ముగింపు నే చెప్పనా?... చాలా వాస్తవిక దృష్టితో... ఇంకో అమ్మాయిని పెళ్లి చేసుకొని పదిమంది పిల్లల తండ్రి అయ్యాడు... సైనాధ్యక్షుడయ్యాడు!"

ప్రసూన చెప్పిన ముగింపు మాత్రం చెవినిబడ్డ వేణు తల్లి, "ఏమిటా కథ ? నన్నూ విననీయండి!" అన్నది.

"మీ అబ్బాయి పూర్వజన్మ కథ, అత్తయ్యా!" అంటూ ప్రసూన వేణు చెప్పిన కథ ఆమెకు చెప్పింది.

"అందుకే కాబోలు, నేనెప్పుడూ తనతోటే ఉండాలని ఇష్టపడతాడు వేణు ! నన్ను కూడా తనతో ఢిల్లీ తీసుకు వెళ్తానంటున్నాడీ మాటు!" అన్నది నవ్వుతూ తల్లి.

“అయితే మీరూ ఢిల్లీ వెళ్తారన్నమాట! చెప్పనేలేదే!” అన్నది ప్రసూన ఆశ్చర్యంగా.

“నువ్వూ రావే అమ్మాయ్! కాశీ, ప్రయాగ చూచివద్దాం... నువ్వు పుణ్యతీర్థాలు సేవిస్తే మనవడు తప్పకుండా పుట్టుతాడు,” అన్నదామె.

భూగర్భ దేవాలయం దగ్గరకు వచ్చారు. అందులో చూచేదేమీ లేదన్నారు వెంట వచ్చిన వాళ్ళు... వేణు తను వెళ్లి చూడాలన్నాడు. ప్రసూన 'నేనూ వస్తా' నన్నది. రాయల ఆలోచనా మందిరానికీ, భూగర్భ దేవాలయానికీ సొరంగమార్గం ఉండేదట పూర్వం... వేణు తల్లి రోడ్డుమీదే ఉండిపోయింది... వేణు ముందూ, ప్రసూన అతని వెనుకా మెట్లు దిగి ముందు ఆవరణ దాటి లోపలికి వెళ్లారు గర్భగుడిదాకా... అందులో నీళ్లు నిలిచి లోతుగా ఉన్నట్లు కనిపించింది. తర్వాత అంధకారం... వేణు గర్భగుడి కుడివైపుకు మళ్లాడు. ప్రసూన అతని వెనుకనే ఉంది. 'అమ్మో, పాము!' అని అరవబోయిన ప్రసూన గొంతు సగంలో ఆగిపోయి, చప్పున వేణుని గట్టిగా చుట్టు కొని, ముఖం అతని వీపున దాచుకున్నది... వేణు పామును చూచి కదలకుండా నిలిచిపోయాడు... రెండు మూడు గజాల దూరంలో పడగ ఎత్తి నిలుచున్న త్రాచు, పడగ దించి సరసరా వెళ్లిపో యింది!

“వదినా, వెళ్లిపోయింది పాము!” అన్నాడు వేణు.

ప్రసూన తేరుకోవటానికి కొన్ని క్షణాలు పట్టింది. ఆమె దేహం వణుకుతోంది... ముఖాన చెమట... వేణు చెయ్యి పట్టుకుని మెట్లదాకా నడిచింది.

“అబ్బ! ఎంత గండం తప్పింది వేణూ! ఈ పాడు దేవాలయంలో ఏముందని వచ్చాం ఇక్కడికి!” అన్నదామె.

వేణు మాట్లాడలేదు.

“అత్తయ్యా, త్రాచుపాము! నా ప్రాణాలు నిలువునా ఎగిరిపోయ్యాయి... వేణుకు ఎంత ధైర్యం! నిశ్చలంగా నిలుచున్నాడు,” అని చెప్పింది అత్తగారితో ప్రసూన.

ఆ సంఘటన ఆమె మనస్సుమీద చెరగని ముద్రవేసింది. తను అంతగా భయపడి పోవటం, వేణు నదురూబెదురూ లేకుండా నిల్చోవటం రెండూ ఆశ్చర్యాన్ని కలిగించాయి. తలచుకొన్నకొద్దీ తన ప్రవర్తన తనకే సిగ్గు తెప్పిస్తోంది. వేణు ఏమనుకొన్నాడో మరి! తను వేణూను అలా పట్టుకొని కళ్లు మూసుకోవటమేమిటి పసిపిల్లలా!... అప్పటి నుంచి వేణు కొంచెం ముభావం గా వున్నట్టు కూడా అనుమానించింది ప్రసూన.

బళ్లారికి తిరిగి వస్తూంటే, కారులో వేణు మౌనం భారంగా తోచి, ప్రసూన అన్నది-

“త్రాచుపామును చూస్తే మనిషికి ఎందుకో అంత వెఱ్ఱి భయం?”

“విషజంతువు కదూ! కరిస్తే ఇంకేమన్నా ఉందా!” అన్నది వేణు తల్లి.

“విషజంతువు లెన్నిలేవు! త్రాచును చూస్తే అంత విపరీత భయం ఎందుకో అర్థంకాదు!” అన్నది ప్రసూన తన్ను తాను నిరసించుకొంటున్నట్లు.

“దానికి కారణం త్రాచుపాములో ఉన్న విశిష్టత! సౌందర్యము, శక్తి, చైతన్యము, మృత్యువు - ఇవన్నీ త్రాచుపాములో మూర్తీభావం పొందుతాయి వదినా! మన మనస్సులో మృత్యు భావనకు సౌందర్యం, చైతన్యం లేదు! అలాగే సౌందర్యభావనకు మృత్యుసంబంధంలేదు... కాని ఈ భిన్న ప్రవృత్తుల సంఘర్షణ- కాదు, సమీకరణ- ఒక్క తృటిలో మన అనుభూతికి తెస్తుంది త్రాచుపాము. ఆ అనుభూతి అసామాన్యమైనది. అందుకే అది వెఱ్ఱి భయం! యోగవిద్యలో మన వాళ్లు కుండలినీ శక్తికి సర్పరూపాన్ని నిర్దేశించటానికి కూడా ఇదే కారణమనుకుంటాను!”

వేణువి అన్నీ విచిత్రమైన వ్యాఖ్యానాలు అనుకొన్నది ప్రసూన. కాని పాము ఎదుట అతని ప్రవర్తన చూచిన తర్వాత, అతని మాటల్ని నిర్లక్ష్యం చేసి ఏదో అనలేకపోయింది ఆమె. హంపీలో వేణు చెప్పిన కథను గూర్చి మళ్లీ ఆలోచించింది. సరదాకు చెప్పిన కథ అని ఇదివరకు అనుకున్నా, అందులో కూడా వేణు ఏదో అర్థాన్ని వుద్దేశించే ఉంటాడనిపించింది ఆమెకు... ఇల్లు చేరుకున్న తర్వాత, హంపీ విశేషాల్ని భర్తతో చెబుతూంటే మాత్రం, వేణు మాటలన్నీ పిచ్చి వేదాంత ధోరణిగా తోచాయి ఆమెకు.. కథంతా విని భర్త నవ్వాడు; " తొందరగా వేణుకు పెళ్లి చెయ్యటం ముఖ్యమని తెలుస్తూంది కాదా!... కాలేజీలో ఏ అమ్మాయినో ప్రేమించి నిరాశ చెంది ఉంటాడు," అన్నాడు

*

"వేణూ, నువ్వెరినైనా ప్రేమించావా?" అని సూటిగా ప్రశ్నించింది ప్రసూన, తర్వాత.

'ఎందుకు?' అన్నట్టు ఒక్కక్షణం చూచి, "ఆఁ... పుష్పలావికను!" అని సమాధానమిచ్చాడు వేణు.

"తమాషా కాదు... నిజంగానే చెప్పు!"

"నిజంగానే వదినా!... ఆనాడు నాకు ఊహాపథంలో మెదిలిన కథకూ, నామనస్సుకూ అవినాభావ సంబంధం ఉన్నట్లు తిరిగి వచ్చిన తర్వాత గ్రహించాను... సీత బంగారులేడి తనకు కావాలంటుంది; దాన్ని బాణంవేసి చంపితే తప్ప అది దొరకదు; చంపటంతో మరి దాని స్వరూపమే మారిపోతుంది... సౌందర్యాన్ని పొందటం దాన్ని పోగొట్టుకోవటమే!... సీత లేడిని చూచి ఆనందించిన క్షణమొక్కటే అమృతక్షణం! 'అది ఎంత అందంగా ఉందన్న' తృప్తి, 'అది తనది కాదే' అన్న అసంతృప్తి- ఈ రెండూ సమంగా నిల్చిన క్షణం! కాని తర్వాతి క్షణంలో 'అది తనది కాదే' అన్న భావం జయిస్తుంది. సీత శ్రీరామునికి తన కోరికను చెబుతుంది; ఇక కార్యకారణ సంబంధంతో కాలం అలా కదలిపోతుంది; దానితో సౌందర్యమూ చేజారిపోతుంది!... కాలాన్ని, కార్యకారణ సంబంధాన్ని అధిగమించే సత్యం, రెండు విరుద్ధ ప్రవృత్తుల సమీకరణ!... పుష్పలావిక- సౌందర్యం; తల్లి- ధర్మం; వాన వచ్చిన రాత్రి పుష్పలావిక కోసం సర్దారు తహతహలాడిన క్షణం సౌందర్యం, ధర్మం సమీకరణ చెందిన అమృతక్షణం!"

"అయితే సౌందర్యం మీది కోరికను నిగ్రహించుకొని, సౌందర్యాన్ని పొందకపోవటమే కర్తవ్యం అంటావా?"

"అదికూడా కాదు! ఆ అనుభూతితో, నిగ్రహించుకోవటంలోని అసంతృప్తీ ఉండదు; అలా అని కోరిక ఉద్ధృతమూ తగ్గదు... అది భాషకూ, మామూలు ఊహకూ అతీతమైన సత్యం. పొందకుండా పొందటం, పొందీ పొందకపోవటం అనాలి; అంటే అది అర్థరహితంగానే తోస్తుంది! కాని మాటలో, ఊహలో కాదు, ప్రత్యక్షానుభూతిగా మాత్రం అది సత్యం! సాధారణమైన జీవితానుభూతి- కోరటం, పొందటం, కోరటం - ఇలా ఉంటుంది, ఎగుడు దిగుడుగా నిరంతర ప్రయాణం చేసే తరంగంలా. అది అలా కదిలిపోతూ ఉండటమే జీవనసరళి, కాలప్రవాహం! కాని మనిషిలోని ఏదో విశిష్టత అతణ్ణి ఊరుకోనివ్వదు... కోరటంలో నిలిచి బాధపడుతాడు, లేక పొందటంలో పడిపోయి అంతా పేలవం అనుకుంటాడు... విముక్తిమార్గం తరంగంతో కదలిపోతూ ఉండటం ఒకటి; లేకపోతే తరంగాన్ని అధిగమించే ద్వంద్వాతీతమైన అనుభూతి ఇంకో మార్గం... నేను చెప్పిన విరుద్ధ ప్రవృత్తుల సమీకరణ ద్వంద్వాతీతమైన అనుభూతి!"

ప్రసూన ఆలోచిస్తూ కూర్చున్నది. ఆమె కేమీ బోధపడలేదు... వేణు వేదాంతం సంగతి ఎలా ఉన్నా, అసలు వేణును వ్యక్తిగా ఎలా అర్థం చేసుకోవాలో ఆమెకు అంతుపట్టటంలేదు...

వేణు మాటల అర్థాన్ని ఆమె తరచటంలేదు; కాని సౌందర్యాన్ని గూర్చి, జీవితాన్ని గూర్చి ఇలా గాఢంగా, మధురంగా, గంభీరంగా మాట్లాడే వేణూను ఒక అమ్మాయి ఎలా ప్రేమించాలో, ఆ అమ్మాయి ప్రకృతి ఎలా ఉండాలో ఆలోచిస్తోంది.

''వేణూ! నీకు తగిన భార్యను వెదకటం చాలా కష్టమైన కార్యమే!... అయినా ప్రయత్ని స్తున్నాను. చాలా అందంగా ఉండాలి కదూ!... నీతో తత్త్వజిజ్ఞాస చేసేటట్టు కూడా ఉండాలి కాబోలు!''

''నీవలె ఉండాలి వదినా!''

''నేనెందుకు పనికి వస్తాను బాబూ!'' అని ప్రసూన లేచి వెళ్లింది కలవరపాటుతో.

*

హంపీ వెళ్లి వచ్చిన బడలికతో అస్వస్థురాలైన వేణు తల్లి ఢిల్లీ ప్రయాణం మానుకోవలసి వచ్చింది. వేణు ఒక్కడే ఢిల్లీ వెళ్లాడు.

ఇంటర్వ్యూ తృప్తికరంగా ఉందనీ, తను కాశీ, హరిద్వారం చూచి పదిరోజుల్లో తిరిగి వస్తాననీ వేణు అన్నగారికి ఉత్తరం వ్రాశాడు.

పది రోజులు పదిహేనై, ఒక నెల గడిచింది. మళ్లీ ఉత్తరం రాలేదు. మద్రాసుకు వ్రాశాడేమో అనుకున్నారు; కాని వాళ్లకూ వేణు వార్త ఏమీ తెలీదు. వేణుతో ఢిల్లీ వెళ్లిన స్నేహితుడు వేణు పేర మద్రాసు వ్రాసిన రెండు ఉత్తరాలు మాత్రం చేరాయి. వేణు సెలెక్ట్ అయినట్లు ఫెడరల్ సర్వీస్ కమీషన్‌వారు తెలియజేశారు కూడా! వేణు ఏమైనట్లు ? వేణుకు వచ్చిన ఉత్తరాలు చదివి, వేణు స్నేహితుణ్ణి కనుక్కున్నాడు. కాశీకి తనూ వెళ్లాననీ, తర్వాత హరిద్వార్‌కు వేణు ఒక్కడే వెళ్లాడనీ మాత్రమే అతను చెప్పగలిగాడు. ప్రసూన భర్త హరిద్వార్ వెళ్లి తిరిగి వచ్చాడు... వేణు జాడలేదు! పత్రికల్లో ప్రకటించారు; రిపోర్టిచ్చారు. వేణును గూర్చి ఏ విధమైన వార్తా లేదు!

భర్త నిరాశతో తిరిగివచ్చిన రోజు ప్రసూన దు:ఖం ఆపుకోలేక పోయింది... ''నదిలో పడి పొయ్యాడో, ఏమయ్యాడో నా తండ్రి!'' అని వేణు తల్లి విలపించింది... కాని ప్రసూనకు ఆ అభిప్రాయం లేదు. ''లేదు ! వేణు హిమాలయ పరిసరాల్లోనే ఎక్కడో ఉన్నాడు... వేణు తప్పకుండా తిరిగి వస్తాడు!'' అన్నది ప్రసూన.

విచిత్రమైన వ్యక్తి వేణు! అతని మూర్తి, అతని మాటలు, అభిమానం నిత్యస్మృతులు ప్రసూనకు. అతని జాడ ఎప్పుడో తెలిసి తీరుతుందన్న ఆశ ప్రసూనకు జీవితం మీద కొత్త ఆసక్తిని పెంపొందించింది.

ఇరవై ఏళ్లు గడిచాయి వేణు అదృశ్యుడై! సన్నజాజుల పందిరి కళకళలాడుతూ ఉంది. ''అలా వెళ్లొస్తానమ్మా'' అని గబగబా వెళ్లిపోతున్నాడు వేణు! పందొమ్మిదేళ్ల కొడుకు మాటకు ఉలిక్కిపడి, 'వేణు అమృతుడు' అనుకొన్నది ప్రసూన.

*భారతి, సెప్టెంబర్ 1959*

## నేపథ్యం

## విరుద్ధ ప్రవృత్తుల హృదయానుభూతి

# అమృతుడు

***త్రాచుపాములో సౌందర్యమూ, శక్తి, చైతన్యము- మృత్యువు- పరస్పరం విరుద్ధమైన ప్రవృత్తుల సంఘర్షణా, అవి సమీకరణం చెందడం, ఒక తృటిలో అవన్నీ అనుభూతికి రావడం దాని విశిష్టత అనీ, కుండలినీశక్తికి మనవాళ్ళు సర్పరూపాన్ని అందుకే నిర్దేశించారని వివరిస్తాడు వేణు.***

అమృతుడు కథ 1958లో భారతి పత్రికలో ప్రకటితమై తర్వాత 1963లో కాలం తెచ్చిన మార్పు కథా సంకలనంలో ముద్రితమైంది. మొదట ఈ కథలోని నాలుగు ముఖ్యాంశాల్ని ప్రస్తావించి, కథకు ప్రేరణయైన నేపథ్యాన్ని వివరిస్తాను. ఇందులోని ముఖ్యాంశాలు- 1. హంపీ క్షేత్రం- రాయలనాటి జీవితం. 2. వదినె-మరదుల విశిష్ట బాంధవ్యం. 3. జన్మపరంపర రహస్యం, పూర్వజన్మ వాసనలు- కర్మ సిద్ధాంతం. 4. కోరిక, సాఫల్యం, బంధవిముక్తి- జీవిత రహస్యాల అన్వేషణ.

కథలో ప్రధానమైన భాగం హంపీ క్షేత్ర దర్శనం. వేణు, అతని అన్న భార్య ప్రసూన, వేణు తల్లిగారితో కలిసి హంపీ చూడడానికి వెళతారు. అక్కడ హంపీ బజారు, విరూపాక్ష దేవాలయం, కోదండరామ దేవాలయం, హజారా రామస్వామి ఆలయం, చివరకు భూగర్భ దేవాలయం సందర్శిస్తారు. వేణు తనకు గాఢమైన స్మృతులు కలుగుతున్నట్లు, రాయలవారి కాలంలో తాను సర్దారై ఒక పుష్పలావికను ప్రేమించినట్లు చెబుతూ ఉంటే, వదినె కొంత హాస్య దృష్టితో ప్రోత్సహిస్తుంది. ఆ సర్దారు ఒక వర్షపు రాత్రి రోగశయ్య మీద ఉన్న తల్లిని నిర్లక్ష్యం చేసి, పుష్కలావిక కోసం వెళ్తాడు. అతనిలో తల్లికి-ప్రేయసికి మధ్య సంఘర్షణ, వ్యామోహం గెలిచింది. తల్లి మరణించింది ఆ రాత్రే. తర్వాత సర్దారు రాయలవారితో జైత్రయాత్రకు వెళ్ళిపోగా, పుష్పలావిక విదేశీయుణ్ణి పెళ్ళాడి హంపీ నుంచి నిష్క్రమించింది. ఆ కథ

చెప్పిన తరువాత వేణు, ప్రసూన ఒక భూగర్భ దేవాలయాన్ని చూడటానికి వెళ్తారు. అక్కడ నీళ్ళు నిలిచి లోతుగా ఉండడం, అంధకారం- ఇంతలో ఒక త్రాచుపాము రాగా, వేణు స్థిరంగా నిల్చుంటాడు. ప్రసూన భయంతో వేణుని గట్టిగా చుట్టుకొని, ముఖం అతని వీపున దాచుకొంటుంది. అందరూ బళ్ళారి తిరిగి వస్తారు. వేణు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఇంటర్వ్యూ కోసం ఢిల్లీ వెళ్తాడు. తర్వాత అటు నుంచి కాశీ, హరిద్వార్ వెళ్ళి తిరిగిరాడు! అతని జాడ తెలీదు ఎన్నాళ్ళైనా. ఏ నదిలోనో పడిపోయాడేమోనని తల్లి ఊహ. లేదు, హిమాలయాల్లో తపస్సు చేస్తూ ఏనాటికైనా వస్తాడని వదినె నమ్మకం. తర్వాత ఆమెకు జన్మించిన కొడుక్కి 'వేణు' అని నామకరణం చేస్తుంది. ఇరవై ఏళ్ళ కొడుకు వేణు, 'అలా వెళ్ళొస్తానమ్మా,' అని వెడుతూ ఉంటే ఆనాటి వేణు జ్ఞాపకం వస్తాడు, సన్నజాజుల పందిరి కింద కూర్చున్న ప్రసూనకు.

ఇందులో వేణు అన్న ఇంటికి రెండుసార్లు వస్తాడు. ఢిల్లీలో వ్రాత పరీక్షలు వ్రాసేందుకు ముందుగా ఒకసారి. అదే వదినా మరదుల ప్రథమ పరిచయం. వేణుకి జ్వరం వస్తుంది. ప్రసూన అతనికి పెళ్ళి సంబంధం చూస్తానంటుంది. 'అమ్మాయి ఎలా ఉండాలి' అని అడిగితే, 'నీ వలె ఉండాలి వదినా!' అంటాడు వేణు. తర్వాత రెండోసారి వచ్చినప్పుడు తల్లితో వస్తాడు. అప్పుడే హంపీ వెళ్ళడం, ఢిల్లీకి తానూ వస్తానన్న తల్లి అస్వస్థత కారణంగా వెళ్ళకపోవడం, వేణు అదృశ్యుడు కావడం జరుగుతవి. వదినె-మరదుల విశిష్ట బాంధవ్యానికీ, హంపి కథలో సరదారు-పుష్పలావికల సంబంధానికి గల సాదృశ్యం, తల్లి సన్నిధానంతో, వేణు వ్యాఖ్యలతో, చివర త్రాచుపాముని దర్శించడం, పాముపట్ల స్థైర్యంతో వేణు ప్రవర్తించడం, వ్యాఖ్యానించడం అతని పూర్వజన్మకీ, ప్రస్తుత జన్మకీ గల లంకెను ఎత్తి చూపుతాయి. తర్వాత ప్రసూనకు కొడుకై 'వేణు' పుట్టడం, అది అతని మూడోజన్మగా పరిగణించడానికి వీలు కల్పిస్తుంది.

వదినె తల్లి వంటిది. పరస్పరం ఆకర్షణ ఉన్నా ఆమెను వాంఛించడం సరికాదు. తీవ్రమైన కోరిక విషయంలో ఏం చెయ్యాలో తాత్త్వికుడైన వేణు చెబుతాడు. 'ఒక కోరికను కోరడం, దాన్ని నిగ్రహించడం ఈ విరుద్ధ ప్రవృత్తుల మధ్య కలిగే హృదయానుభూతిలో' అతీత చైతన్యసిద్ధీ, జగత్తు స్వరూపాన్ని దర్శించడం జరుగుతాయని వేణు అభిప్రాయం. హంపీ రామాలయంలో, చిత్రంలో మాయలేడిని కావాలంటున్న సీతను చూసి ప్రసూన, "ఆ లేడి మీద వ్యామోహమే కలగకపోతే సీతకు అనర్థం వాటిల్లేది కాదు కదా!" అంటుంది. వేణు, "అలా కాదు వదినా! సీత కారణజన్మురాలు. సీతారాములిద్దరూ రావణ సంహారం కోసం జన్మించారు. అందువల్ల కాలం యొక్క పర్యవసానాన్ని బట్టి కనిపించే హేతువులూ, మంచిచెడ్డలూ ఇంకోరకంగా ఉంటాయి," అంటాడు. త్రాచుపాములో సౌందర్యమూ, శక్తి, చైతన్యము- మృత్యువు- పరస్పరం విరుద్ధమైన ప్రవృత్తుల సంఘర్షణా, అవి సమీకరణం చెందడం, ఒక తృటిలో అవన్నీ అనుభూతికి రావడం దాని విశిష్టత అనీ, కుండలినీశక్తికి మనవాళ్ళు సర్పరూపాన్ని అందుకే నిర్దేశించారని వివరిస్తాడు వేణు. భూగర్భ దేవాలయాన్ని దర్శించడం, త్రాచుపాముని చూడడం, ఒక రకంగా వేణు ప్రసూనలు వాళ్ళ అంతరంగాల లోతుల్నీ, అందులో నిక్షిప్తమైన పూర్వజన్మ వాసనల్నీ గుర్తించడమే అవుతుంది కథలో.

వేణు జీవిత రహస్యాన్ని గూర్చి వ్యాఖ్యానిస్తూ ఉంటాడు. "సీత బంగారులేడి తనకు కావాలంటుంది. దాన్ని బాణం వేసి చంపితే తప్ప అది దొరకదు. చంపటంతో దాని స్వరూపమే

మారిపోతుంది. సౌందర్యాన్ని పొందడం దాన్ని పోగొట్టుకోవడమే! లేడిని చూచి ఆనందించిన క్షణమొక్కటే అమృతక్షణం. 'ఎంత అందంగా ఉంద' న్న తృప్తీ, 'తనది కాదే'। అన్న అసంతృప్తీ, రెండూ సమంగా నిల్చిన క్షణం. తర్వాతి క్షణంలో 'తనది కాదే' అన్న భావం జయిస్తుంది. కార్య కారణ సంబంధంతో కాలం కదిలిపోతుంది... పుష్పలావిక- సౌందర్యం, తల్లి- ధర్మం, వాన వచ్చిన రాత్రి పుష్పలావిక కోసం సర్దారు తహతహలాడిన క్షణం. సౌందర్యం- ధర్మం సమీకరణ చెందిన అమృతక్షణం!"

వేణు మొదటి రెండు జన్మల్లో సౌందర్యాన్నీ ధర్మాన్నీ సమీకరించేందుకు చేసిన తపస్సు, అతను మూడవ జన్మలో ప్రసూన గర్భస్థ శిశువై, ఆమెను తల్లిగా పొందడంలో పర్యవసించిందని కథ చెప్పే సందేశం.

ఇన్ని అంశాలు కథలో ఎలా వచ్చి చేరాయో చెప్పడానికి ప్రయత్నిస్తాను. నాకు చిన్నతనం నుంచీ చారిత్రకనవలలంటే ఇష్టం. తర్వాత స్కూలు ఫైనల్ క్లాసుకి వచ్చేటప్పటికి హంపీ క్షేత్రం, కొడాలి సుబ్బారావు వ్రాసిన కావ్యం పదేపదే చదివాను. చాలా పద్యాలు కంఠతా వచ్చాయి (1942).

హంపీ చూడాలన్న కోరిక 1949లో ఫలించింది. ఇద్దరు మిత్రులతో కలిసి అక్కడి దేవా లయాలూ, ప్రదేశాలూ దర్శించి ఒక గాఢమైన అనుభూతి, ఆ ప్రదేశం మనుష్యులతో కళకళ లాడుతున్న భ్రమ పొందాను. ఇది హంపీ విషయం. 1956లో ఇంగ్లీష్ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్ లో నాలుగు నెలలు, దేశం నలుమూలల నుంచీ వచ్చిన ఇంగ్లీషు అధ్యాపకులం కలిసి ఉన్నాము. వారిలో ఒక బెంగాలీ భద్రమహిళ, నాకంటే పదేళ్ళు పెద్దది. నాపై ఛలోక్తులు విసురుతూ స్నేహంగా ఉండేది. తన మరిదిని గురించీ, పిల్లల్ని గురించీ ముచ్చటించేది. ఆమె వ్యక్తిత్వం నన్నెంతో ఆకర్షించింది. ఇది కథలో వదినె-మరదుల బాంధవ్యానికి మూలాధారం. పోతే జన్మ పరంపర తాలూకు రహస్యం! మొదట జె.బి. ప్రీస్ట్లీ వ్రాసిన *I was here before* అనే నాటిక, దానికి ప్రేరణ అయిన ఆస్పెన్స్కీ, నీట్షేల Recurrence (పునరావృత్తి) సిద్ధాంతమూ, హిందూ బౌద్ధమతాల కర్మ సిద్ధాంతమూ అధ్యయనం చెయ్యడం ద్వారా నా మనస్సులో వేరూ నింది. విరుద్ధ ప్రవృత్తుల సమీకరణను గూర్చి డి.హెచ్. లారెన్స్ చాలా చెప్పాడు. మేథ- హృదయం రెండూ ఒకదాని మీద ఒకటి పెత్తనం చెయ్యడం కాదు. ఒకదానితో ఒకటి సమీకరించడం తత్త్వదర్శనానికి మూలం అంటాడు లారెన్స్. దీన్నే విశ్వనాథ సత్యనారాయణ ఏకవీర నవలలో అందంగా చిత్రించాడు. ఏకవీర వీరభూపతిని ప్రేమించినా, కుట్టాన్‌తో వివాహం అవుతుంది. కూచిపూడి భామాకలాప నాట్యప్రదర్శన తిలకిస్తూ ఉండగా, ఆమెలో నివృతమైన ప్రేమ-ధర్మం సంఘర్షణ సమీకరణం చెందుతుంది. కారణం హఠాత్తుగా వీరభూపతి ఆమెకు కనిపించడం, తూలిన ఆమెను కౌగలించుకోవడం, ఆ క్షణంలో కుండలినీశక్తి ఉత్థానమై ఏకవీర తత్త్వాన్ని దర్శిస్తుంది. ఆ నవల సమీక్షలో (సాహిత్యంలో దృక్పథాలు- విశ్వనాథ సత్యనారాయణ) నేను ఈ విషయం వివరించాను. ఆస్పెన్స్కీ, లారెన్స్‌ల అధ్యయనం (1956) ఈ కథలో ప్రతిఫలించింది.

కథాశిల్పం రీత్యా పుష్పలావిక, ప్రసూన పేరుతో ప్రస్తుత జన్మలో సన్నజాజుల మీద మక్కువ కలిగి ఉంటుంది. 'ఆ పువ్వులు వాడినా చిక్కని పరిమళం మాత్రం సిగ నంటిపెట్టుకొనే

ఉంటుంది,' అని కథా ప్రారంభం. ఆమెకు జీవితం మీద ఆసక్తి సన్నగిల్లిన వేళ వేణు ఇంటికి రావడం, అతనితో చర్చలూ, హంపీ యాత్ర సంభవిస్తాయి. ఇలా చరిత్ర, ప్రేమానుబంధం, తాత్త్వికత, జన్మపరంపర, నాలుగింటినీ మేళవించిన ఈ కథను, సంవత్సరాంతంలో *ఆంధ్రపత్రిక ఉగాది సంచిక*లో సమీక్షిస్తూ శ్రీ సాళ్వ కృష్ణమూర్తి, ఆ ఏడాది ఉత్తమ కథగా పేర్కొన్నారు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 15 మార్చి 1998*

5



**కాళీపట్నం రామారావు** *9 నవంబర్ 1924న శ్రీకాకుళం జిల్లాలో జన్మించిన వీరి మొదటి రచన 'ప్లాట్‌ఫారమ్' 1943లో చిత్రగుప్త పత్రికలో అచ్చయింది. ఎనిమిది కథాసంపుటాలు వెలువరించారు. విశాఖపట్నంలో ఉపాధ్యాయులుగా చేసి 1979లో ఉద్యోగ విరమణానంతరం 'కథానిలయం' స్థాపించి, దాని నిర్వహణలో నిమగ్నమై ఉన్నారు. 'యజ్ఞంతో తొమ్మిది' కథా సంపుటానికి 1995లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించింది. కొన్ని కథలు జాతీయ, అంతర్జాతీయ భాషలలోకి అనువదింపబడ్డాయి. వీరి యజ్ఞం కథపై వ్యాససంకలనం వెలువడింది.*

**చిరునామా**

*కథానిలయం, సూర్యనగర్,*
*విశాఖ ఎ కాలనీ, శ్రీకాకుళం-532 001*
*Ph.: 94405 78506*

# జీవధార

## కాళీపట్నం రామారావు

ఎండ ఫెళ్లున పేల్చేస్తోంది. పందిగుట్ట మీద పాకల్లో అలికిడి దాదాపు లేదనే చెప్పాలి. ఆ లోడంతా మునిసిపల్ కొళాయి దగ్గర మూగింది. హోరుమని వీచే సముద్రపు గాలి- దాని మీద ఆడవాళ్ల రొదగాని, ఎండ గాని తెలియడం లేదు.

రోజూ పగలు పదిగంటల తరువాత ఓ గంటా గంటన్నరసేపు ఆ కొళాయి తెరుస్తారు. ఆ కొంచెంసేపట్లోనే ఆ పాకల వాళ్లందరూ నీళ్లు పట్టుకోవాలి. మొదటి పావుగంటా, 'అవునే కోడూరోళ్ల కోడలా! నువు ముందొచ్చినావ్. నువు పట్టీసుకోయే,' అనేటంత మంచిగా వుంటారు.

కొంతసేపు పోయాక, 'పాపమ్మా! అది ముందొచ్చినాదా, నాను ముందొచ్చినానా?' అంటూ రీజన్లొస్తాయి. ధార సన్నమయేకొద్దీ, 'మరైతే కానీ! ఏం? నిన్న మీ సెల్లెలు మాకన్న యొనకొచ్చి మాకన్నా ముందర పట్టీసుకోలేదా?' అంటూ బిందెలూ కుండలూ తోసుకోడానికొస్తుంది.

చివర చివర తిట్లు, శాపనార్థాలు, ప్రమాణాలు, ప్రతిజ్ఞలతో హోరెత్తిపోతుంది.

ఒకో అప్పుడు లారీలొస్తాయి. పోలీసులు దిగుతారు. జెయిళ్లూ, బెయిళ్లూ గడచి, కథ కోర్టుల్దాకా పోతుంది.

ఆవేళ అప్పుడే కొళాయి తెరిచేరు. ఆ కొళాయి, వాడల్లా విడిచి, వాడను ఒరుసుకుంటూ ఎత్తునపోయే రోడ్డు మీదుంది. రోడ్డుకి అటుపక్క దిబ్బ, యిటు దిగువన గుట్టవార గోతిలో పాకలు. దాదాపు యాభై అరవై పాకలకు అది ఒక్కటే కొళాయి.

ఆ పబ్లిక్ కొళాయి కట్టేస్తే ఆ రోడ్డున యింకొక్కటే కొళాయుంది. అది రోడ్డుకి రెండో వేపున అక్కడికి ఫర్లాంగుదూరంలో యం.పి. రావుగారి బంగళాలో వుంది.

పచ్చగా పెరిగే తోట, దాని మధ్య కళ్లకు చల్లగా కనిపించే బంగళా. దానికి వెనకా, పక్కలా, ఏ వంక చూసినా అరమైలు వరకూ, ఆ దిబ్బ మీద యింకో యిల్లు లేదు. తోటలో బంగళాకి పడమటి పక్కగా తోటలో పనసచెట్టు నీడనుంది కొళాయి. లైను తెరుచున్నంతసేపూ రావుగారి కొళాయి పడుతూనే వుంటుంది. టాంకులోకి నీళ్లు పంపు చేయాలంటే కుండీలోకి పడతారు. లేనప్పుడు నీళ్లు అలాగ పోతూనే ఉంటాయి. తోటలో చెట్లన్నిటికీ లోతుగా పాదులుంటాయి.

"నరసింహులూ నీళ్లొచ్చాయి కుండీ నింపు," లోపల్నించి ఎవరో అరిచారు.

ముసలి మాలీ ఒకడు పెరట్లోంచి కొళాయి దగ్గరకొచ్చేడు. దానికి రెండు మూతులు. కుండీవంక కొళాయి విప్పి బయటిది కట్టేసేడు.

"ఇప్పుడే కసింత టీ తాగొస్తానమ్మా!" గేటుకో, వీధి తలుపుకో చెప్పుకుంటూ వెళ్లిపోయాడతను.

రోడ్డు మీది పబ్లిక్ కొళాయి- గొట్టం నిండుగా- ఝూకొట్టి కురిసే జీవధార, వడి క్రమంగా తగ్గుతోంది. బోర్లించిన కుండలూ, బిందెలూ దబదబ తిరగబడుతున్నాయి. క్యూలో ఆడవాళ్లు ధారలో ఒక్క చినుక్కూడా పైన పడకుండా పట్టేసుకుంటున్నారు.

"ఔనే అమ్మాజీ సంవుద్రాలు వదిల్నాడే?" అంది ఓ ఆడపిల్ల.

అలవికాని బిందె చేత పట్టుకొని వస్తున్న అమ్మాజీకి పదిహేడేళ్లుంటాయి. పదిహేను పధ్నాలుగేళ్ల పిల్లలా రెండు జడలతో టికరగా కనిపిస్తుంది.

ఎదురుగా- కడవలు, బిందెలు! బోర్లించిన యాభై అరవై కడవలు కనిపించగానే ఆ పిల్ల గుండెలు దడదడలాడేయి. అప్పటి దిగుల్లో ఆ పిల్లకు సత్యవతి ఎత్తిపొడుపు చర్మానికైనా తాకలేదు.

"ఇయ్యేళ్ల కూడా మొన్నట్లాగ నీళ్లసుక్కలు లేకుండా సేసినావో నీ తోలు ఒలిసేడం ఎలాగా తప్పదు సరిగదా, నిన్నింక ఎప్పటికీ ఇంటికాడ వుణ్ణీయ్యను," అంది తల్లి. ఆ మాటలు జ్ఞాపకానికొస్తే అమ్మాజీకి గుండె దడ పెరిగిపోతోంది.

అమ్మాజీ తల్లి రోజల్లా బయటే వుంటుంది. ఆవిడికి ఆడపిల్లల మెస్సులో పని. తండ్రి ఇళ్లు కట్టేచోట వడ్రంగి. వాళ్లిద్దరూ ఉదయం వెళ్తే రాత్రి తిరిగి వస్తారు.

ఇంటి దగ్గర అమ్మాజీ కాక ఆమె పెద్ద మేనత్తా, అమ్మాజీ యీడుదే ఆ పెద్ద మేనత్త కూతురూ వుంటారు. ఈ ముగ్గురూ ఉమ్మడిని రెండు తట్టల కేరేజీలు మోస్తూ ఇల్లు నడుపుతారు.

కేరేజీలు మోసేవాళ్లు ఉదయం తొమ్మిది గంటలకు బయల్దేరుతారు. ఇంటిపనీ, కేరేజీ మోత, వంతులవారీ సాగుతుంది. వారానికి ఓ రెండు రోజులు అమ్మాజీ, ఇంకో రెండు రోజులు వాళ్ల మేనత్తా, మరింకో రెండు రోజులు ఆ మేనత్త కూతురూ- ఇంటి దగ్గర ఇంటిపనీ, చిన్నపిల్లల సంరక్షణ చూస్తారు. ఒకళ్లు ఇంటి దగ్గరుంటే తక్కిన యిద్దరూ కేరేజీలకి పోతారు.

ఆరోజు వంతు గురించి మేనత్త కూతురుకీ, అమ్మాజీకీ పేచీ వచ్చింది. ఆ పేచీ తీరుస్తూనే, ఉదయం ఆ విధంగా వాళ్లమ్మ హెచ్చరించింది.

నీళ్లు దొరకలేదంటే అన్నంత పనీ జరగకపోవచ్చు. కానీ, తిట్లూ శాపనార్థాలకి తోడుగా మేనత్త కూతురు పాటుకు మాటలు మొయ్యడం కష్టం. అమ్మాజీకి ఈ బెంగతో మతిపోయినంత అయ్యింది.

''బాప్పా! బాప్పా!'' అప్పుడే కుండ నెత్తికెత్తుకొని వస్తున్న ఓ నలభైయేళ్ల పర్వతాకారానికి బిందె చూపుతూ, పేద మొహం పెట్టింది అమ్మాజీ- లోపల లాభంలేదు అనుకుంటూనే వుంది.

''ఓల్నారాజో! యే ఊరు సుట్టరికఁవే కోళ్లా? యే కొడుకు తెచ్చినాడు,'' అంది ఆ మనిషి.

ఏక వరసని మూడు కుండల నీళ్లు పట్టుకుందేమో- ఆమెకు ఒళ్లూపయీ తెలియడం లేదు. ఆమె సరసానికి చుట్టూ ఉన్నవాళ్లు కొందరు నవ్వేరు. దాంతో ఆమె కూడా నవ్వుకుంటూ వెళ్లిపోయింది.

అమ్మాజీకి మొహం ఎక్కడ దాచుకోవాలో తెలియలేదు. అలాగే కళ్లనీళ్లు కుక్కుకుంటూ, తలపక్కకి తిప్పేసి నించుంది.

మాయదారి కుర్రాడు! ఆ సఁవుద్రాలు ఎప్పుడొచ్చినా సరిగ్గా పనివేళే వస్తాడు. 'ఒక్క సిటం! 'ఒక్క సిటం!' అంటూ గంటల తరబడి మాటల్లో పెడతాడు. అతను పదిసార్లు కలిస్తే కనీసం నాలుగైదుసార్లయినా ఆమెకు చీవాట్లు తప్పవు. ఈసారి గట్టిగా చెప్పేయాలి. కాని ఆమె చెప్పలేదు. ఆ సంగతి ఆ పిల్ల మనసుకి బాగా తెలుసు.

''ఏటి! ఆయన్నీ నిండితేగాని మనకు నీళ్లు దొరకవేటి?'' అంది అమ్మాజీకన్నా వెనక వచ్చిన ఇంకో మనిషి.

ఆ మనిషి కోక కట్టిన పద్ధతీ, ఆమె కొప్పు ముడిచిన తీరూ చూస్తే ఆ పిల్ల కొత్తగా నాటు నుండి దిగివచ్చిన మనిషిలా వుంది. ఆ వాడకు కొత్తగా వచ్చినట్టుంది. అమ్మాజీ ఇంతకు ముందెన్నడూ ఆమెను చూళ్లేదు.

''ఇంకొక్క గంట పోయినాక రా! అప్పుడందరికన్నా నీకే ముందు దొరుకుతాయి నీళ్లు,'' అంది ఇందాక అమ్మాజీని పలకరించిన సత్యవతి.

తవిటమ్మ ఆలస్యంగారావడానికి ఆమె అశ్రద్ధ కాదట కారణం. చంటిపిల్ల ఎంతసేపూ నిద్రపోలేదు. తియ్యడానికి వెనకా ముందూ ఎవరూ లేరు. దానికి పాలు కుడిపి పడుకోబెట్టేసరికి ఆవేళ అయ్యిందట.

అలాంటి జాలికథలు వినివిని అక్కడి వాళ్ల గుండెలు బండలయ్యాయి. కొన్నాళ్లు పోయాక వినిపించుకోవడం మానేశారు. మంద మందంగా మోగుతూ కడవలు నింపే జీవధారకు ఎవరు ముందు కుండ ఒడ్డితె వాళ్లకే నీళ్లు. వెనకబడ్డవాళ్ల పని వెనకే. దానికి వాళ్ల పూచీలేదు.

''ఏం పిల్లా! అల్లాయాల్నాగ బంగళాకెల్దువేఁటి?'' అంది సత్యవతి.

ఆ పిల్ల ఎత్తే అంత. అందుకే ఆలస్యంగా వచ్చిన వాళ్లనందర్నీ పేరుపేరున పలకరిస్తోంది.

అప్పుడే బంగళా గురించి ఆలోచిస్తున్న అమ్మాజీకి అది అపశకునంగా తోచింది. ఆ మనిషితో ఎక్కడికేనా వెళ్లటమంటే భయం. ఆ పిల్లది మహచెడ్డ చొరవ. అంత చొరవ ఒక్కొక్కప్పుడు బాగా పనికొస్తుంది, ఒకప్పుడు బెడిసికొడ్తుంది. అమ్మాజీ ఆలోచిస్తుంటే...

''ఆళ్లు మీకు నెలవా?'' అంది తవిటమ్మ.

సత్యవతి- అమ్మాజీకి తెలుసునంది.

''మాయమ్మ! మాయమ్మ! మీదే పున్నెం. గంజోర్చుకోనానికేనా డోకెడు నీల్లేవు! నన్నూ తీసుకెళ్లండి,'' అంది తవిటమ్మ.

అమ్మాజీ మాటాడకుండ బిందె భుజాన పెట్టుకొని బయల్దేరింది. సత్యవతీ, తవిటమ్మా కబుర్లు చెప్పుకుంటూ ఆమె వెంట నడుస్తున్నారు.

తవిటమ్మది ఎక్కడో నరసన్నపేట దగ్గర ఓ పల్లెటూరట. ఆమె పెనివిటి ఆర్నెల్ల క్రిందట యీ వూరొచ్చేడు. పూర్వం వాళ్ల వూళ్లో కూలి చేసుకొనేవాడు. ఇప్పుడిక్కడ రిక్షా లాగుతున్నాడు.

వాళ్లకు రెండేళ్ల కొడుకూ, మూణ్ణెల్ల కూతురూ వున్నారు. కొడుకిక్కడ లేడు. కొత్త కాబట్టి చేసుకోలేదనీ, అమ్మమ్మ మనవణ్ణి దగ్గరుంచుకుంది.

"ఎన్నాళ్లయి యిక్కడ దిగినారూ?" అంది సత్యవతి.

"ఏదీ- రెండు వారాలౌతాది."

"మావిక్కడ పదేళ్లమట్టి వున్నావు. నానిక్కడ కొచ్చేసరికి ఈ బంగళా లేదు. కొత్తక్కడ తన్నారు."

"ఆళు ఎవుళ్లూ?" అంది తవిటమ్మ.

పట్నాల్లో కులాల సంగతి గబుక్కున తెలీదు. అంతా హోదాల భోగట్టాయే. ఆయనకి వూళ్లో ఏదో పెద్ద పనేట. ఆయనకి సొంతానికి ఓ కారూ, ఆయన కుటుంబానికి ఒక్కారూ మొత్తం రెండు కార్లున్నాయి అని చెప్పి-

"అవునే అమ్మాజీ! ఆయనకేటి పనీ?" అంది ముందు నడుస్తున్న అమ్మాజీతో.

రావుగారు ఏదో యింగ్లీషు కంపెనీలో పెద్ద మేనేజరుట. అమ్మాజీక్కూడా అతని గురించి వివరాలు తెలీవు. ఆ యిల్లు కట్టినపుడు వాళ్ల అయ్య అక్కడ వడ్రంగిగా పనిచేశాడు. ఆ నెలవ్వల్లే ఓసారి కూతుర్ని తీసుకెళ్లి- ఎప్పుడేనా వస్తే బిందెడు నీళ్లివ్వండని అడిగాడు.

"మీరు షరాబులా?" అడిగింది తవిటమ్మ.

"కాదు పరికీలం," అంది అమ్మాజీ.

షరాబులు కానివాళ్లు బాడితపని ఎలా చెయ్యగలరో తవిటమ్మకి బోధపళ్లేదు.

పరధ్యానంగా కబుర్లు చెప్పుకుంటూ గేటు దగ్గరకొచ్చిన ఆడపిల్లలు ముగ్గురూ ఒక్కసారి తుళ్లిపడ్డారు.

నిలువెత్తు 'జాతికుక్కలు' యీ స్తంభం దగ్గరొకటీ, ఆ స్తంభం దగ్గరొకటీ గొలుసులు తెగిపడేంత దూకుడుగా అలంగం తిరుగుతూ, భయంకరంగా అరుస్తున్నాయి. వాటి మొహాల్లోకి చూడగానే, 'ఓలమ్మో,' అంటూ తవిటమ్మ అదిరిపోయి, చెదిరిపోయి పరుగుచ్చుకుంది.

అంత చిరాకులోనూ అమ్మాజీకి పట్టరాని నవ్వొచ్చింది. సత్యవతైతే బిందె క్రింద పడేసి పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుతోంది.

తవిటమ్మకు పట్టరాని కోపం వచ్చింది. ఎప్పుడూ ఎవరిమీదా అంత కోపం రాలేదు. బాగా ఎర్రబారిన మొహంలో తళతళలాడే పెద్దపెద్ద కళ్లతో ఆమె ఆ యిద్దరి వంక ఎర్రగా మండిపడుతూ చూసింది. ముందుగా అమ్మాజీ నవ్వాపుకుంది. ఆ తరువాత సత్యవతి తమాయించుకుంది.

"రా పిల్లా! రా! అవేటీ సెయ్యవులే కట్టేసున్నాయి," అంది అమ్మాజీ.

లోపల్నించెవరో కేకేశారు. ఆ కేకకి కుక్కలు అరవడం మానీసేయి.

దడదడలాడే గుండెలపై ఎవరూ చూడకుండా ఉమ్ముకుని పైటచెంగుతో ఒళ్లంతా కప్పుకుంటూ తవిటమ్మ ముందుకు కదిలింది.

పెద్దపుల్లాటి కుక్కలు రెండూ ఏమీ ఎరగని పిల్లికూనల్లా, వాటికి వేసిన బల్లల మీనకెక్కి, అతి శాంతంగా పడుకున్నాయి.

''ఇంతే పిల్లా! ఈ ఊళ్లో, పెద్దింటోళ్ల- ఎవరక్కడి కెళ్లినా, ఆళ్ల కన్నా ముందు ఆళ్ల బేపులే పలకరిస్తాయి. అది మా టౌనోళ్ల మర్యాద,'' అంటూ నవ్వుతోంది సత్యవతి.

కొంచెంసేపు పోయాక-

''ఎవరది?'' అంటూ వీధి తలుపు తెరుచుకొని ఇరవై మూడేళ్ల కుర్రాడు బైటికొచ్చాడు.

బయటికొచ్చిన అబ్బాయిగారు, బాబుగారి కొడుకుల్లో ఆఖరువాడని అమ్మాజీకి జ్ఞాపకం.

అందమైన చారల షరాయి తొడుక్కుని ఆయనగారు, టెర్లిన్ షర్ట్ వేసుకున్నాడు. చేతిలో పెద్ద న్యూస్‌పేపర్- చదువుతూ చదువుతూ వచ్చినట్టుంది- చూపుడువేలు మధ్యనుంది. పచ్చగా, కోలగా నల్లఫ్రేము కళ్లద్దాలతో అతని మొహం బహు నాజూగ్గా వుంది. కళ్లు చురుగ్గా వున్నాయి.

తామెవరో చెప్పుకునే లోగానే-

''ఎవర్రా శేషూ?''

అంటూ ముద్దుముద్దుగా మాట్లాడే ఓ పదహారేళ్ల ఆడపిల్ల కూడా వచ్చింది. ఆ అమ్మాయి యివతలకి వస్తూనే, 'ఓ,' అంది తెలిసిందన్నట్లు తలూపుతూ.

ఆ అమ్మాయిగారిని చూస్తే, ఆమె శేషుబాబుకి చెల్లెలో, అప్పగారి కూతురో అయ్యుండాలి అనిపిస్తుంది.

ఏడుమల్లెల ఎత్తు రాకుమారిలా ఆ పిల్ల అతి సన్నంగా, మెత్తని బంగారంతో చేసిన బొమ్మలా వుంది. పలచని నున్నని పొట్ట బయలయ్యేటట్టు లేత గులాబీరంగు సన్నని వోణి వేసుకుంది. అందమైన ఎదిగీ ఎదగని గుబ్బల సొగసు యేర్పడేటట్లు లాకెట్టొకటి మెళ్లో వేలాడు తోంది.

ఆ అమ్మాయి రాగానే-

''ఎవరో నీళ్ల కోసం కాబోలు, నీళ్లు లేవు. వెళ్లండి వెళ్లండి,'' అన్నాడు శేషుబాబు చిరు నవ్వులు నవ్వుతూ.

ఆ అమ్మాయి చెంపలమీద జుట్టు మీదిమీదికి తీసుకుంటూ,

''నీళ్ల కోసఁవేనా?'' అంది కనుబొమలెత్తి, తలని సుతారంగా కదిలిస్తూ.

సత్యవతి, తవిటమ్మా అవునన్నట్లు తలలూపేరు.

''నీళ్లు లేవు. వెళ్లండి వెళ్లండి,'' అంది గంభీరంగా.

విన్నవాళ్లు మొహాలు ముడుచుకోగానే ఆ అబ్బాయికేసి తిరిగి కిసుక్కున నవ్వింది.

కళ్లద్దాలు ఉండడం వల్ల మోర పైకెత్తి చూస్తున్నాడు శేషుబాబు. అతని చూపులు అమ్మాజీ మీద వున్నాయి. ఆ తెల్లపిల్ల యింగ్లీషులో ఏదో అంది.

''షటప్,'' అంటూ శేషుబాబు ఠక్కున తల తిప్పేడు. తెల్లపిల్ల గొలగొలగా నవ్వుతూ ఏదో అంటోంది. శేషుబాబు వచ్చే నవ్వు ఆపుకోలేక లోనికి పారిపోయాడు. ఆ పిల్ల అరుస్తూ అతని వెంటపడింది.

ఇంకొంచెంసేపట్లో ఓ ఆడపిల్లా, మగపిల్లాడూ పరుగెత్తుకొచ్చేరు. తలమీద తలగా ఇద్దరూ బయట నిల్చున్న పిల్లల్ని పరిశీలనగా చూసేరు. అమ్మాజీని చూడగానే చేటలంతేసి మొహాలు చేసుకొని లోపలికి పరిగెత్తేరు.

లోపల ఒకటే కేరింతలు, ఒకటే నవ్వులు. తలుపు దభాలున మూతపడింది. తరువాత, కిటికీ అవతల శేషుబాబు నవ్వు మొహంతో వచ్చి సోఫాలో కూర్చున్నాడు. లేచి నిలబడి ఏదో మాటాడుతున్నాడు. చేతులు అటూ ఇటూ వూపుతున్నాడు. చతికిలబడి పేపరు మొహానికి అడ్డేసు కున్నాడు.

వాళ్లెందుకంతలా నవ్వుతున్నారో అమ్మాజీకీ సత్యవతికీ ఎంతాలోచించినా బోధపడలేదు.

వాళ్లిద్దరూ తవిటమ్మ కట్టుకోక వంక పరిశీలనగా చూశారు. తమ గుడ్డల వంకా పైటల వంకా చూసీ చూడనట్టు చూసుకున్నారు. నవ్వు తెప్పించేదేదీ కనిపించలేదు.

ఇంతలో కిటికీ దగ్గర మళ్లీ గొడవ. శేషుబాబు దాన్ని తెరువబోతాడు. లోపల్నించి ఎవరో మూసేస్తారు. అమ్మాజీ, ఆమె తోటిపిల్లలూ గమనించడం చూసి శేషుబాబు బలవంతాన కిటికీ మూసి తలుపు గడియపెట్టేడు.

తరువాత కొంతసేపు ఇంకేమీ వినిపించలేదు.

"ఆళ్లు దేనికలాగ ఇరగబడిపోతున్నారు?"

తవిటమ్మ భయపడుతోందో, ఆశ్చర్యపోతోందో, ఆమె మొహం చూస్తే తెలియడంలేదు.

"నాకు తెల్దు. నీకు తెలుసే," అంది సత్యవతి.

'మూడుపూట్లా ముద్ద కాళ్లకాడకొచ్చి, చెయ్యడానికేపనీ లేప్పోతే, మరి కాలం గడవడం వెలాగ? అదే కారణం,' అనబోయింది అమ్మాజీ.

కాని అంతలో మనసు మార్చుకుంది. "నాకు మాత్రం ఏం ఎరిక! ఆల్ల మనసుల్లోకి దూరగల్నేటి!" అంది చాలా చిరాగ్గా.

అందిగానీ అమ్మాజీకి కారణం తెలిసినట్టే వుంది.

రావుగారు అక్కడ బంగళా కట్టుకుని దాదాపు పదేళ్లు కావస్తోంది. అప్పటికి ఆయన హోదా యింతలా పెరగలేదు.

అక్కడ జాగా కొనుక్కున్నాక, ఓ సాయంత్రం యింతకు ముందుండే పాత బొక్కి కారును, ఆ గతుకుల రోడ్డు మీద నిలబెట్టి కాలినడకను పాకల్లోకి వచ్చాడు.

"ఏంవర్రా! ఇక్కడెవరికీ నీళ్లూ నిప్పులూ అక్కర్లేదా?" అన్నాడు ఎదురుగా కనబడ్డ ఓ మనిషితో.

"బాబ్బాబు! మమ్మల్నెవరు చూస్తారు?" అన్నాడు ఆ మనిషి.

"పిలు. అందర్నీ పిలు," అన్నారు రావుగారు.

అక్కడున్న ఓ నులకమంచం వాల్చుకుని, బ్రీఫ్‌కేస్‌లోంచి ఒక తెల్లకాగితం తీసి టకటక రాయడం ఆరంభించారు.

మహా నగరానికీ, పందిగుట్టకీ మధ్య పాతిక ముప్పై ఎకరాల పెద్ద మట్టిదిబ్బ వుంది. దిబ్బకు మూడుపక్కలా నగరం తాకింది. నీటి సదుపాయం లేకపోవడంవల్ల నాల్గోపక్క ఇళ్లు లేవలేదు. గుట్టను తాకుతూ దిబ్బ అంచంబడీ ఓ పాత రోడ్డుంది. ఆ రోడ్డుమీదే వరసగా పది ప్లాట్లు కొన్నారు రావుగారు.

పందిగుట్ట అంచున, ఫర్లాంగు ఫర్లాంగు ఎడంలో పేదవాళ్ల వాడలు మూడు లేచాయి. ఆ మూడు వాడలవాళ్లూ దిబ్బకి ఈ చివరకో, ఆ చివరకో పోయి నీళ్లు తెచ్చుకుంటారు. నీళ్లకే దిక్కు లేనప్పుడు, దీపాలు ఉంటాయా? రావుగారు పకడ్బందీగా మహజరు రాసేరు.

మూడు వాడల జనం నుంచీ సంతకాలూ, నిశానీలూ తీసుకోమన్నారు. 'ఆ మహారాజు పూనుకోబట్టే నీళ్లొచ్చాయి, యెలక్ట్రీ దీపాలొచ్చాయి,' అనుకున్నారు జనం.

ఏ కొళాయి ఎక్కడ వేయించాలో, ఏ దీపం ఎక్కడ పెట్టించాలో, ఉద్యోగులతో పాటు అతనూ స్వయంగా వచ్చి ఆ ఏర్పాట్లు చేయించారు. ఇది జరిగిన తరువాత ఆరునెల్లకే ఆయన ఇంటిపని ఆరంభించారు.

ఆ ఇంటిపని జరిగినంత కాలం అణా బేడా ఎక్కువకో తక్కువకో పాకల్లో కూలీలందరూ అక్కడే పనిచేశారు. చేసిన పని నమ్మకంగా చేశారు. మున్సిపాలిటీ అడ్వాన్సుగా శాంక్షన్ చేసిన కొళాయి నీళ్లతోనే, వాళ్లు ముందుగా యిచ్చిన దీపాల వెల్తుర్లోనే, ఆ బంగళా అంతా మూణ్ణెల్లలో పూర్తయింది.

ఈ పదేళ్లలోనే, ఆ దిబ్బ మీద ప్లాట్లకి గజం రెండూ-ఐదూ-పదీ-పదిహేనూ... వరకూ రేటు పెరిగింది. దిబ్బకు మూడువైపుల నుంచి పట్నం పాకుతూ మీదికొస్తోంది. ఈవైపు మాత్రం రావుగారు యింకా అమ్మడంలేదు. నిండా ఇరవై అయితేగాని ఆయన అమ్మడంటారు.

రావుగారి బంగళా తయారీదశలో ఉండగా, ఆ పాకల్లో వాళ్లందర్నీ ఆయన, 'అప్పారావ్! గోవిందూ! నరసమ్మా!' అంటూ పేర్లు పెట్టి పిలిచే పరిచయంతో ఉండేవారు. ఇప్పుడా పరిచయాలన్నీ మాసిపోయాయి. వాళ్లలో కొందరు ఆ వాడ వదిలి వెళ్లిపోయారు కూడా.

ఆమధ్య ఓ పున్నమి సాయంత్రం, ఆయనా ఆయన భార్య వెన్నెల షికారుకి బయల్దేరారు. అలాటప్పుడు అమ్మాజీ తండ్రి, పని నుండి తిరిగి వస్తూ వాళ్లకెదురయ్యాడు. 'పెద్దవాడు పోల్చ లేడులే,' అనకుంటూ తలవంచుకొని పోతున్నాడు. తీరా ఆయనే పలకరించాడు- అందులోనూ పేరుపెట్టి. తండ్రి ఊ పొంగిపోయాడు. ఆ రాత్రల్లా వాళ్ల కబుర్లే. ఆ మర్నాడే అమ్మాజీని తీసుకెళ్లి వాళ్లకు పరిచయం చేశాడు.

అప్పుడే ఇప్పటి శేషుబాబును మొదటిసారిగా చూసింది అమ్మాజీ.

"ఈ అబ్బాయి గుర్తున్నాడా?" అన్నారు రావుగారు. అమ్మాజీ తండ్రి పోల్చలేదు.

"మా ఆఖరివాడు. గుర్తులేడూ? ఇల్లు కట్టేటప్పుడు నాతో వస్తూ వుండేవాడూ- ఒకసారీ వీడూ ఈ పిల్లా రంపం పెట్టి ఆడుతుంటే వేలు తెగింది. ఏదిరా, నీ వేలు చూపించూ," అన్నారు రావుగారు.

ఆ అబ్బాయి ఎడంచేతి చూపుడువేలు మీద ఇప్పటికీ ఆ గంటుంది.

తరువాత శేషుబాబు చేతే పలహారాలు తెప్పించి, "ఈ అమ్మాయి ఎప్పుడొచ్చినా బిందెడు నీళ్లు పట్టుకోనివ్వండి," అన్నాడు శేషుబాబుతో.

అన్నారుగాని ఎప్పుడొచ్చినా ఆయనా కనిపించేవాడు కాదు, ఆ అబ్బాయీ కనిపించేవాడు కాదు. ఒకసారి ఒట్టి కుండతో తిరిగిపోతూ ఉంటే, ఆ అబ్బాయి ఎదురయ్యాడు. పిలిచి లోపలికి తీసుకెళ్లి నీళ్లు పట్టుకోమన్నాడు.

ఇది జరిగింది లగాయితూ- ఆ అమ్మాయిలు, 'ఓఁ... నువ్వా,' అంటూ దీర్ఘాలు తీస్తూ ముసిముసి నవ్వులు ఆరంభించారు. ఒకసారి పోనీ పట్టుకోమనీ, ఓసారి యిప్పుడు కాదు తరువాత రమ్మనీ, ఒకళ్లు పట్టుకోమనీ ఇంకొకళ్లు వద్దనీ, ఇలా ఆటలు పట్టించేవారు. పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణం పోకట- మరీ తప్పనప్పుడే వాళ్ల యింటికెళ్లేది.

ఆమధ్య ఓసారి, 'ఓ... నువ్వా...' అన్నాక, 'శేషుబాబు యింట్లో లేడు,' అంది ఆ నాపసాని. అప్పుడే కడిగేద్దామనుకుంది అమ్మాజీ. కానీ పేదవాళ్ల కోపం పెదవికి చేటు. అందుచేత ఓర్చుకుంది.

ఈవేళ యీ గొడవంతా చూస్తే, ఆమె అనుమానాలు రూఢి అయేయి. అయితే ఏం చేయ గలదు? ఏం చెయ్యడమా? అనే ఆలోచిస్తోంది ఆ పిల్ల.

"పోనీ యింకో కాడికి పోదువేటే?" అంది సత్యవతి. అమ్మాజీ ఆమె మాట వినిపించు కోలేదు.

"ఎక్కడి కెళ్తావు?" అంది తవిటమ్మ.

ఎక్కడికెళ్లాలన్నా అరమైలుకు తక్కువ వుండదు. వెళ్లిందగ్గరైనా నీళ్లు దొరుకుతాయన్న భరోసా లేదు.

సత్యవతి వెనక్కి తిరిగి వీధికొళాయి వంక చూసింది. ధార సన్నమయినట్టుంది- ఆడ వాళ్లు కలియబడి ఊరికే తోసేసుకుంటున్నారు.

''అక్కడా కుమ్ములాడుకుంటున్నారు,'' అంది సత్యవతి.

సముద్రపుగాలి చల్లగా వీస్తున్నా ఎండ మాత్రం నెత్తి మండిస్తూనే వుంది. రోడ్డుకి అవతలి అంచున కసిన్ని గడ్డిమొక్కలూ, గరికదుబ్బులూ కనిపించాయి. సత్యవతి అటుగా నడిచింది. కొంచెంసేప్పోయాక తవిటమ్మా, అమ్మాజీ కూడా వెళ్లారు.

అక్కడికి తోట మూడువంకలా బాగా కనబడుతోంది. మొక్కలన్నీ వేసి పదేళ్లే అయినా, తోట ఏపుగా, దట్టంగా పెరిగింది. అంత ఎండాకాలమైనా, చెట్లు వసివాడకుండా నల్లగా కారుకొని వున్నాయి.

''తోటమాలి ఎవడో మంచోడే, ఎక్కడా గడ్డిపరకన్నది నేదు. ఎండాకాలమయినా ఎంత పచ్చగా వున్నాయో మొక్కలూ సెట్లూ!'' అంది తవిటమ్మ.

''ఆటికేటి? తక్కువ నీళ్లోస్తారేటి? అల్లా టాంకు సూసినావా?'' అంది సత్యవతి.

పెద్దింటోళ్ల పైపులైతే మునిసిపాల్టీ వాళ్లు కట్టరట. లైను తెరచినంతసేపూ వాళ్లకి నీళ్లొస్తాయి. ఇంజన్ సహాయంతో వాళ్లు టాంకులు నింపుకుంటారు. మనుషులు మూడుపూట్లా స్నానాలు చేస్తారు. నాలుగైదుసార్లు మొహాలు కడుగుతారు. నాలుగు కప్పులు కడగాలన్నా అరగంట ధార వదుల్తారు. మరునాడు టాంకంతా ఖాళీచేసి మొక్కలకి నీళ్లు పెడతారు.

''ఏట్నాబం (మనుషుల్ని కాదని మొక్కలికి పోసినా) ఇంత పెద్ద తోటుందా- ఒక్క పళ్ల సెట్టు నేదు,'' అంది తవిటమ్మ.

తూరుపున ఒకటీ, పడవట్న ఒకటీ, రెండు పనస మొక్కలు తప్పిస్తే నిజంగానే ఆ తోటలో పళ్లచెట్లు లేవు. అవైనా అమ్మాజీ తండ్రి వేయించేట్ట. ముదిరితే అవి మంచి నీడపట్లే కాదు- ఎండాకాలం వాటి మీంచి గాలి వీస్తేనే చల్లటి సువాసన వస్తుంది.

అవి తప్పిస్తే తోటనిండా నరమామిళ్లూ, పోకలూ, వెదురుపొదలూ క్రోటన్లే వున్నాయి. వరండా అంచునున్న గోలేల్లో బ్రహ్మజెముడూ, కలబందలాంటి రక్కసి జాతులు ఉండడం తవిటమ్మకు ఆశ్చర్యం కలిగించింది.

''పోనీ నాలుగు పూలమొక్కలున్నా అందంగుణ్ను. అవేనా లేవు,'' అంది సత్యవతి.

''మా ఊళ్లల్లో తోటలు యిలాగుండవు. తోటలు ఒక్కాడా, యిళ్లొక్కాడా వుంటాయి. ఈ మాత్తరం తోట సొంతానికుందంటే ఒక కుటామం సునాయాసంగా బతికేస్తాది. కర్రా కలపా, ఆకూ అలవా, కాలం వచ్చిందంటే కాయా పండు ప్రతీదీ అక్కడ సొమ్మే. అయితే తోట పెంచడం అక్కడ మా సెడ్డ కర్సు. ఇద్దరు మనుషులు పెందిలా పొద్దోయీ ఒళ్లిరుసుకుంటేగాని యీమాత్రం తోట నడపనేరు,'' అంది తవిటమ్మ.

ఇక్కడ మునిసిపాలిటీ వాళ్లు సప్లయ్ చేసే నీళ్లతో రబ్బరుగొట్టాలు పెట్టి తోటలు పెంచడం చవకే కాదు, ఒళ్లు కూడా కందనక్కర్లేదు- అనుకుంది తవిటమ్మ.

ఇంటి దగ్గర పిల్ల లేచేవేళ అయిందని గుర్తుకు రాగానే తవిటమ్మ మనసులో గుబులు ఆరంభమయ్యింది.

''ఏవమ్మా! పోనీ యింకోక ఆడికి ఎల్తేనో?'' తవిటమ్మ.

"ఎక్కడకెళ్లినా ఇంతే! ఔనో! అమ్మాజీ! నువు పిలుస్తావా, నన్ను పిలవమన్నావా?" అంది సత్యవతి.

కొతసేపు, 'నువ్ పిలువు,' అంటే, 'నువ్ పిలుస్తేనే బాగుంటుంది,' అని వాదులాడుకున్నారు.

"అయితే నేనే పిలుస్తాను. ఏటి బయ్యఁవా?" అని సత్యవతి ముందుకెళ్లబోయింది.

అప్పుడే తుఫాను గాలికి తెరుచుకున్నట్టు 'ఠక్'న తెరుచుకుంది వీధి తలుపు.

"ఏఁవ్రా నీళ్లు లేవంటే? మీక్కాదా? పొమ్మంటే వదలరేం?" అంటూ ఓ నడికాలం మనిషి బయటకొచ్చింది.

"చెప్పే!" అంది సత్యవతి.

"ఆ పిల్లేఁవిటి చెపుతుంది- ఎవరొచ్చినా నీళ్లు యిచ్చేది లేదు. వెళ్లండి," అంది ఆ యింటావిడ.

కిటికీ ఎప్పుడు తెరుచుకుందో, అక్కడ ఆడపిల్లలు కిచకిచ నవ్వుతున్నారు. అయినా సత్యవతి తమాయించుకున్నాది.

"మనిషికొక్క బిందేనమ్మా," అంది బతిమాలుతున్నట్లు.

"ఏవిఁటీ గొడవ- యింట్లో పిల్లలు చదువుకోకుండా- వెళ్లండి," అంది ఆ యిల్లాలు.

సత్యవతి, తవిటమ్మను చూపి ఆమె చంటిపిల్ల తల్లంది. తమవీ పెద్ద కుటుంబాలు- ఎక్కడా నీళ్లు దొరకడంలేదు- ఇక్కడో బిందె యిస్తే యింకో చోటికి పోతామంది.

సత్యవతి అడిగే తీరో, ఆ వెనుక అమ్మాజీ, తవిటమ్మ ప్రాధేయపడుతూ చూసే చూపులో ఇంటావిడను కొంత కొంత మెత్తబరుస్తున్నాయి. ఇంక ఒప్పేసుకుంటుంది- ఒప్పేసుకుంటుంది- అనుకునే వేళకు లోపల్నించి ఓ ముసలమ్మ బయటకొచ్చింది.

"నీకు తెలీదమ్మాయీ, ఇవాళ దయతలచి యిస్తే రేపు మళ్లా మనింటి మీదికే వచ్చి పడతారు. ఒకళకిస్తే వందమందికివ్వాలె. అంత్య నిష్ఠూరం కన్న ఆది నిష్ఠూరమే మేలు- వెళ్లమను," అంది ఆవిడతో.

ఇంటావిడ ఎటూ చెప్పలేని స్థితిలో వుండగా-

"ఏఁవ్రా! మర్యాదగా ఎల్తారా కుక్కల్ని ఉసికొల్పనా?" అంది ముసలావిడ.

కుక్కలకి ఆమె గొంతే అర్థమయ్యిందో, ఆమె చూపులే తెలిశాయో- తలెత్తి ఆమె వంకా, గేటవతల సగందారిలో నిల్చున్న సత్యవతి వంకా మార్చిమార్చి చూస్తున్నాయి. సత్యవతిలో భయానికి బదులు రోషం పుట్టింది. అమ్మాజీ వంక చూసేక ఆ పిల్ల ఆవేశంతో ముందుకొచ్చింది.

"ఇప్పమ్మా ఇప్పు, రోడ్డు మీదున్నోళ్లని కుక్కల్సేత ఎలాక్కరిపిస్తావో కరిపించు," అంది ముందుకొస్తూ.

"ఏఁవ్రా పిల్లలూ ఇలా రండి," అంది ముసలమ్మ. లోపలున్న మనవళ్లనూ, మనవరాళ్లనూ ఉద్దేశిస్తూ. పిల్లలు గుమ్మం దగ్గరకొచ్చారుగాని కుక్కల దగ్గరకు పోలేదు.

"ఏఁటమ్మా, ఏటీ గొడవౌతోందీ, ఏఁటి సంగతీ?" అంటూ ముసలి తోటమాలి గేటు దగ్గర కనిపించాడు. అతను పెద్దబాబుగారిచ్చిన పాత సిల్కుచొక్కాకి సన్నంగానూ, చిన్నబాబు వదిలేసిన కాకీనిక్కరుకి బిగుతుగానూ ఉన్నాడు.

ఇటు రోడ్డు మీద ఆడపిల్లలూ, అటు ముసలమ్మా జరిగిన సంగతంతా తమ మాటల్లో తోటమాలికి చెప్తున్నారు.

వాడికి అమ్మగారి మాటలేగాని ఆ పిల్లలు చెప్పిన మాటలు చెవికెక్కనట్టు లేదు.

"ఎల్లండి, ఎల్లండి. అమ్మగారికి కోపం తెప్పించకండి. మీకు ముగ్గురికిస్తే సరిపోతాదేటి? ఆళ్లందర్నీ సూడండి!" అన్నాడు వెనక దూరంగా వస్తున్న ఒత్తి బిందెల్ని చూపిస్తూ.

వీధి కొళాయి కట్టేసినట్టున్నారు. ఖాళీబిందెలతో ఆడవాళ్లు యిటు కొందరూ, అటు కొందరూ వేటకు బయల్దేరారు.

తోటమాలి అమ్మగారి వైఖరిని వెనకేసుకు రావడంతో ఉడుకెత్తిన సత్యవతి- ఎలాగా నీళ్లు లేవు, రంధైనా పెడతాను అనుకుంది మనసులో. వెంటనే వెనక్కి తిరిగి-

"ఓలి రాండర్రా! యిక్కడీళ్లు కుక్కల్ని ఉసిగొలుపుతారట," అంటూ పేద్ద పొలికేక పెట్టింది.

నడుస్తున్న ఆడవాళ్లు నిలబడిపోయి వీళ్లకేసి చూస్తున్నారు.

"ఏఁవిటమ్మాయ్ ఆగడం. ఇంటి మీదికి దండు తీసుకొస్తావా?" అంది ముసలమ్మ.

"ఇంక మీమీద నిబ్బగ ఉసిగొలపల్సిందే!" అన్నాడు మాలి.

"అయితే ఇప్పు," అంది సత్యవతి ధీమాగా.

ఆమె కేక విన్న ఆడవాళ్లు, 'ఇక్కడ నీళ్లిస్తారు,' అన్నట్లు అర్థం చేసుకున్నారేమో పోటీలు పోటీలుగా పరుగులెడుతున్నారు.

"ఇప్పడం- ఇప్పడం- కొని తేవాలిటే?" అంటూ గద్దించి, "ఐతే సూడు," అంటూ కుక్కల కేసి కదిగాడు.

సత్యవతికి గుండె దడ పట్టుకుంది. అయినా- "ఇప్పు నీకు చేతనైతే," అంది అరుస్తూ.

"సరేలే సూడు," అంటూ ఈసారి నిజంగానే కుక్కల దగ్గరకెళ్లాడు మాలి.

కుక్కలు సంగతంతా అర్థం చేసుకున్నవాటిలా చప్పున లేచి భౌ, భౌమంటూ అలంగం తిరిగేస్తున్నాయి.

పరిస్థితి త్వరత్వరగా మారుతుండడం చూసి లోపలున్న శేషుబాబు తొందర తొందరగా బైటికొచ్చాడు.

బెల్టు మీద చెయ్యి వేసిన మాలీ చేయి తీసి దూరంగా విసిరేశాడు. మొహం మీద కోపం, చిరాకూ బయటివాళ్లకు కనిపించనీయకుండా అటు తిరిగి, "ఉండు," అన్నాడు గట్టిగా.

"ఒరేయ్! ఓరె ముసిలాడా! నువ్ మొగోడివైతే కుక్కలసేత కరిపిస్తావు. నీ ఇంట్లో కొచ్చినాఁవనా! వాకిటకొచ్చినాఁవనాఁ దేనిక్కరిపించినావో నువ్వు సెప్పవుగాని," అంటూ అటు తోటమాలినీ, ఇటు ముసలమ్మనీ కూడా దబాయిస్తోంది సత్యవతి.

ఇంతలో పదిపన్నెండు బిందెలూ, కడవలూ, తపేళాల్తో ఏడెనిమండుగురు ఆడవాళ్లు పిల్లలూ గేటు దగ్గర మూగేరు.

వాళ్లతో సత్యవతీ, అమ్మాజీ ఆ ఇంటివాళ్ల ఆగడం గురించీ, వాళ్ల కుక్కల దౌర్జన్యం గురించీ చెప్పుతున్నారు.

ముసలమ్మా, ఆమె కోడలు కూడా గేటు దగ్గరకొచ్చి తమ కేసు ఏమిటో వాళ్ల మాటల్లో చెప్పుతున్నారు. చెప్పి-

"అవునమ్మాయ్ వాళ్లు జొరావరీ చేసి యింట్లో కొచ్చేస్తుంటే ఉసికొల్పుతామన్నాము. తప్పా?" అంది ముసలమ్మ.

"ఓలమ్మ! ఓలమ్మ! ఎంత అబద్దఁవో," అంది సత్యవతి.

ఉండుండి నీళ్లపోతల అప్పాయమ్మ సభవరి ధోరణిలో మధ్యకొచ్చింది.

"ఆగండి! ఆగండి!" అంటూ అరచేత్తో వాళ్లనూ, వీళ్లనూ వారించింది.

"ఏటమ్మా! ఏటి సంగతంతా?" అంది ముసలమ్మతో. ఆ గొంతూ, ఆమె వయసూ, వేషం చూడగానే ముసలమ్మకు ధైర్యం కలిగింది. తను కూడా గొంతు తగ్గించి వీలైనంత మంచిగా చెపుతోంది.

"నువ్ చెప్పమ్మాయ్. వాళ్లు నీళ్లకొచ్చేరు. ఇదేం వీధికొళాయి కాదుకదా? మేం మా డబ్బెట్టి యేయించుకున్నది. ఏటా మేం మునిసిపాలిటీకి పన్ను కూడా కడుతున్నామాయె. అలాటప్పుడు ముందు మా పిల్లలొచ్చి చెప్పేరు. వీళ్లు ఆళ్ల మాటలు చెవిని పెట్టలే. ఆ తరువాత నేనొచ్చి చెప్పేను. మా మాలీ వస్తే, 'నువ్ మగాడివైతే కుక్క నుసిగొట్టు,' అంటుంది ఆ పిల్ల. వేలెడు లేదు మళ్లీ," అంటూ సత్యవతిని వేలు పెట్టి చూపించింది.

"ఏం మా యింటిమీద కొచ్చి ఆగం చేస్తే మేం ఊరుకుంటామా? యింతకీ మా అబ్బాయ్ ఉండాల్సింది. ఉంటే తెలిసొచ్చేది," అంది ముసలమ్మ.

"ఏం మీ అబ్బాయిగారుంటే ఏటి సేస్తారమ్మా. పట్టి కట్టించేసి ఖయిదులో ఎట్టిస్తారు. అంతేనా? ఆ పని నువ్వు సేయించు. ఇలాగ మీ యింటిమీన పడి నీళ్లివ్వవంటే తన్ననాని కొచ్చినావని- ఈళకాడ సెప్పినట్టే దొంగ కేసు యెట్టించు," అంది సత్యవతి.

"దొంగ కేసెందుకయ్యింది. ఇప్పుడు మీరంతా ఇక్కడున్నారంటే ఎందుకున్నట్టు, దొమ్మీ కేసెట్టాలంటె ఇది సాల్దా?" అన్నాడు మాలి.

"నువ్వూరుకో అబ్బాయి," అంటూ మాలిని ఆపి సత్యవతితో- "అట్టా కాదమ్మాయ్ నీకు నీళ్లు కావలిస్తే అడగవలసింది ఇక్కడ కాదు. పోయి మునిసిపాలిటీ వాళ్లని అడుగు," అంది ముసలమ్మ.

"ఆళ్లు మా గోడు ఇనిపించుకునే మాటైతే ఆ గేటుకాడా నీ గేటుకాడా ఈ పఁరాకులన్నీ ఎందుకమ్మా," అంది మందలో మనిషి.

"ఎక్కడలేని నీళ్లూ నీలాటోళ్ల మొక్కలకే సాలవ్. ఆళ్లు మాత్రం ఎక్కణ్నించి తెస్తారు?" అంది సత్యవతి.

"నీకా కన్నెఁర దేనికమ్మాయ్. నువ్వూ మొక్కలు కావ్పోతే యవసాయాలే పెంచు. మేవేం కాదన్నాఁవా," అంది ముసలమ్మ.

"ఆగండి, ఆగండి," అంది మళ్లా అప్పాయమ్మ. ఆమె మాటలతో రెండు పక్షాలూ మళ్లా ఆగిపోయేరు.

"అయితే యింతకీ ఏటంటావమ్మా?" అంది అప్పాయమ్మ.

ముసలమ్మకు ఆ మనిషి గొంతు వినగా పక్షాలు మారిపోయినట్టు అనిపించింది.

"ఏవిటనడం?" అంది ఎదురుప్రశ్నగా.

"కాదు, నీళ్లు యిస్తానంటావా యివ్వనంటావా?"

అప్పాయమ్మ గొంతు మార్చింది.

ముసలమ్మ మళ్లా సందేహంలో పడ్డది- యింతలో- "మీరంత పొగరుగా మాటాడితే యివ్వం. మంచిగా అడిగితే ఆలోచిస్తాం," అంది వెనక నించి మనవరాలు.

"పొగరా! పొగరా?" అంటూ అప్పాయమ్మ ఆమెకేసి తిరిగింది.

"అమ్మా! మాకాడ ఏటుందని మీ దగ్గర పొగరు సూపిస్తాఁవు?" అంది ఆశ్చర్యపోతున్నట్టు. అని, "ఒక అందం వుందని యిరగబాటా, ఒక సందం వుందని యిరగబాటా, లేప్పోతే మళ్లూ

మాన్నేలూ డబ్బూ మీకన్నా మాకు ఎక్కువుందని యిరగబాటా, ఏటి సూసుకొని మీ ముందు యిరగబడిపోతాం?'' అంది అప్పాయమ్మ.

''యియన్నీ కొంత కాప్పోతే కొంతున్నా పోనీ, యిరగబడితే అసిపోతాది. మీ ముందు మాకు యిరగబాటా, ఆ గుంటలకేటో తెలియక అలా వోగుతారు,'' అంటూ ముగించింది అప్పాయమ్మ.

'అలాగన్నావు బాగుంది,'' అనుకుంది ముసలమ్మ.

''మనిషి ఒక్కొక్క బిందె పట్టుకుపోండి. మళ్లా యీ ఛాయలకెప్పుడూ రాకండి,'' అంది ఖరాకండిగా నొక్కి చెపుతూ.

ఆమె అలా అనడమేమిటి- అప్పాయమ్మ సొంత యిల్లులా గేటు తెరిచేసింది.

''రండఱ్రా రండి,'' అంది, తలతో అందరికీ దారి చూపుతూ. అందరూ కదిల్నా అమ్మాజీ సత్యవతీ కదల్లేదు. అదిచూసి అప్పాయమ్మ రహస్యంగా కన్ను గిలిపింది.

''రండఱ్రా గుంటల్లారా మీరూ రండి. గంగ! బతకటానికి ముందు గంగ కావాల. ఆ తరువాత పంతాలూ పట్టింపులూ- ముందు నీళ్లు పట్టండి,'' అంది అప్పాయమ్మ.

ఆ ముష్టినీళ్లు పట్టటమా మానడమా? ఇక్కడైనా ఇంకోచోటైనా తగువుకు ముందయినా దాని తరవాతైనా ఒకళ్లను అడుక్కోవడం, వాళ్ల బిచ్చాలు అందుకోవడం యీ జన్మకు తప్పదు. సత్యవతి ముందుకు కదిలింది. ఆమె వెనక తవిటమ్మా, అమ్మాజీ కదిలేరు.

*

''ఏం పిల్లా మరో బిందికి ఎల్తన్నాం. తోడొస్తావా?'' అంది బిందె వాకిట్లో పెట్టి చూరులోకి దూరుతూ సత్యవతి.

ఆ పిల్ల ఆ యింటికి రావడం అదే తొలిసారి. చిన్న ఒంటిగది పెట్టు. తవిటమ్మ గుమ్మంలో కూచుని బిడ్డని నెమ్మదిగా కాళ్లతో కుదుపుతూ పాలు పెడుతోంది. సత్యవతిని చూసి పైట సర్దుకుంటూ-

''కూకో అమ్మడూ, అల్లా పీటేసుకొని ఒక్క సిటం కూకో,'' అంది తవిటమ్మ.

ఆ యింటి ముందో పెద్ద బండరాయుంది. దానిమీద పడ్డ ఎండ సూటిగా ఆ గుమ్మంలో కొస్తుంది. ఎండా, ఎండ పొడా కలిపి అక్కడ వూపిరాణ్ణివ్వవు- సత్యవతి ఒట్టి నేలనే కూచుంది. పైటచెంగు జార్చి ఉస్సురుమంటూ విసురుకుంటోంది.

''రోడ్డు మీద అంత సక్కగా గాలేస్తాదా, ఇక్కడ దాకలో యేసి కందులేపినట్టే!'' అంది సత్యవతి.

''మరి కిక్కడంతే,'' అంది తవిటమ్మ. ఆమె నుదుటిమీంచీ, భుజాల మీంచీ, తల్లోంచీ ఒళ్లల్లా చెమటలు ధారలు కడుతున్నాయి.

''ఇసినికఱ్ఱ లేదా?'' అంటూ సత్యవతి దిక్కులు చూసింది.

''నేదు. ఒచ్చినకాణ్ణుండీ పోరతన్నాను. కాని ఆ మనిషికి రోజూ మతిమరుపే,'' అంది తవిటమ్మ.

''యీ యెండలో యెంత లేదన్నా యింకో రెండు మూడు కడవలేనా మొయ్యాల. ఇంకా యెన్ని గుమ్మాలెక్కాలో, ఎందరిసేత 'సీ' అనిపించుకోవాలో? యెన్ని తగువులో?'' అంది సత్యవతి.

''యేటా యిదే వొరసా, నేప్పోతే యియ్యేడేనా?'' అంది తవిటమ్మ.

‘‘నాను పుట్టినప్పణ్ణుండీ యెరుగుదును. అసలు యీ వూరు శనే యింత!’’ అంది సత్యవతి.

ఉండుండి పసిబిడ్డ పాలొదిలి యేడవడం ఆరంభించింది. తవిటమ్మ, ‘లేదు లేదం,’టూ బిడ్డను ముడుకుల మీద కూచోబెట్టుకొని, నాలికతో ‘లొళ్ల’ పాడుతూ, కాళ్లతో బిడ్డను కుదుపుతోంది. పసిబిడ్డ నిలవడం లేదు. పిడికిళ్లు బిగించి, మొహమల్లా చెండుకుంటూ కప్పెగిరిపోయేటట్టు కేకలేస్తోంది.

‘‘ఓలమ్మో ఎంత కోపఁవే?’’ అంది తవిటమ్మ.

‘‘ఏటంటాదీ? పాలు సాలవా?’’

సత్యవతి పిల్ల మొలనున్న దిష్టి పూసలవంకా, మెళ్లో వేళ్లాడే రక్షబిళ్ల వంకా చూస్తోంది.

‘‘సరిగా సాలవు. అదికాదు అసలేడుపు. దానికి సాయం యీ సెఁవటొకటి. ధారలు కట్టి కారుతోందా- ఉప్పగా నోట్లోకొస్తే పిల్ల లొప్పుకోరు.’’

నోరులేని పిల్లల ఊహలు అందరికీ తెలీవు. తల్లులకెలా తెలుస్తాయో, తల్లి కాని సత్యవతి గ్రహించలేదు.

తవిటమ్మ పైటచెంగుతో మొహం, మెడా, భుజాలూ, గుండెలూ సుబ్బరంగా తుడుచుకొని, ఏడిచే పిల్ల నోటికి స్తన్యం అందిచ్చింది. బిడ్డ శాంతించి పాలందుకుంది. అది చూసి సత్యవతి ఆశ్చర్యపోయింది.

‘‘మా వొదినకి నోరులేని పిల్లలని జాలేనా ఉండదు. ఇలాగ దేనికేనా ఏడిస్తే తిడతాది, కొడతాది, సొంటిపిక్కలిచ్చేస్తాది. అంతేగాని దాని కష్టఁవేటని ఆలోచించదు. ఒకపాలి మాయమ్మ దెబ్బలాడితే, ‘నన్ను కరిస్తే నాను కొట్టనా’ అంటాది. తల్లులైనా తల్లిపోడిమి అందరికీ రాదా?’’ అంది సత్యవతి.

‘కొందరంతే,’ అనబోయి, మర్యాద కూరుకుంది తవిటమ్మ.

మరో పావుగంట గడిచేసరికి బిడ్డ మాగన్ను పడింది. పొత్తిలంగా ఎత్తుకొని ఉయ్యాల్లో వేసి, తలుపు గొళ్లెం పెట్టి బయల్దేరింది తవిటమ్మ. సత్యవతి ఆమె ప్రతి చేష్టనూ ఆశ్చర్యంగా చూస్తోంది. రోడ్డు మీద అమ్మాజీ వాళ్లకోసం ఎదురుచూస్తోంది.

కసురుకున్నా విసుక్కున్నా- కుక్కల్నీ, పోలీసుల్నీ చూపి భయపెట్టినా, లేనివాళ్లు, కలవారి నిబ్బంది పెట్టక వల్లకాదు. ఇద్దరు ముగ్గురై, ముగ్గురు పదిమందిలో చేరి అవతలి పేటలోని ఓ రెండతస్థుల భవనపు సింహద్వారం వద్ద చేరేరు ఆడవాళ్లు. కథ మళ్లా మొదలు- వాళ్లు గేటు తియ్యరు, వీళ్లు గేటు వదల్రు- ఇలా కడవరకూ...

*స్వాతి మాసపత్రిక, జూన్ 1971*

## నేపథ్యం

బడుగు జీవుల కన్నీటి కథ

# జీవధార

***సకల ప్రాణులకూ జీవావసరాలు మూడు. ప్రాధాన్యక్రమంలో అవి- గాలి, నీరు, ఆహారం. మనిషికి పై మూడింటితో పాటు జ్ఞానం కూడా జీవావసరమే. ప్రాధాన్యక్రమంలో బహుశ అదే మొదటిదనిపిస్తుంది- నాకైతే. ప్రాధాన్యక్రమం ఎలా ఉన్నా- నీరూ, దాని పంపిణీకీ సంబంధించిన కథావస్తువు మంచిదే అవుతుందనుకున్నాను.***

ఈ రచనకు కారకుడు హైదరాబాద్ నవీన్.

అప్పుడెప్పుడో 'తెలుగునాడి' కోసం రచన అడుగుతూ జీవధార కథ వేసుకుంటాం, దాని నేపథ్యం రాసివ్వండి చాలు- అన్నాడాయన.

అతని ఉద్దేశ్యం అర్థమయ్యింది నాకు.

ఈ తరహా రచన నాకు కొత్త. అయినా సరేనన్నాను. మాటిచ్చాను కాని నిలబెట్టుకోలేకపోయాను.

ఇద్దరమూ క్షణం తీరికలు లేని మనుషులమే. ఆమధ్య ఇద్దరికీ నిర్బంధ విశ్రాంతి దాపురించింది.

యోగక్షేమాల కోసం నేను ఫోను చేస్తే-

అన్నట్టు నాకిచ్చిన మాట సంగతి ఏం చేశారూ? అన్నాడాయన.

నేనేదో అనబోతే-

అవన్నీ అనవసరం. మాట ఇచ్చేరు. కాబట్టి మాటకు నిలబడవలసిందే- అన్నాడు నిర్మొహమాటంగా.

అదికాదు... అంటూ వుంటే-

నేనేం చేసుకుంటానన్నది కాదు ప్రశ్న. నాకోసం రాస్తానన్నారు, కాబట్టి రాసివ్వాలి.

నిజమే కదా అడిగేవాడి కెప్పుడూ చేసేవాడు లోకువే.

*

వృత్తి చేత నేను అయ్యవారిని. అదే సెకండరీగ్రేడ్ సర్వీసంతా విశాఖపట్నంలో ఒకే స్కూల్లో.

అది 1971వ సంవత్సరం. పిల్లలకి ఒంటిపూట బళ్ళని జ్ఞాపకం.

అయ్యవార్లంటే- పిల్లలకు పాఠాలు చెప్పడం, పరీక్షల పేపర్లూ మార్కుల లిస్టులూ ప్రమోషన్ లిస్టులూ- ఇలాటివాటితోనే సరిపోదు. ఎలక్షన్ డ్యూటీలూ రకరకాల సర్వేలు వగైరా వగైరాలు కూడా ఉంటాయి.

ఇలా సమయం సందర్భాలూ మొదలైనవి గుర్తు చేసుకుంటూ పోతే, అప్పట్లో నేను ఎన్యూమరేషన్ డ్యూటీ మీద ఉండి ఉంటాను. ఆ డ్యూటీ సిరిపురం ఏరియా మీద అయ్యుండాలి.

గవర్నరు బంగళా నుండి సిరిపురం కూడలిలో దత్తు బంగళా వరకూ రోడ్‌కి పడమటి పక్క ఇళ్ళల్లో జనాభా లెక్కలు రాయడం అయిపోయింది. దత్తు బంగళా నుండి ఇప్పటి పెట్రోలు బంకు జంక్షన్ దాకా పడమటి వైపు ఆంధ్రా యూనివర్సిటీ సిరిపురం క్వార్టర్స్. ఆ క్వార్టర్సు పని కూడా ముగిసింది. పెట్రోలు బంక్ నుండి మళ్ళా వెనక్కి గవర్నరు బంగళా దాకా ఉండే రోడ్‌కి- ఎడంపక్క సెంచరీ క్లబ్ ఏరియా నా పరిధిలోది కాదు. పై మూడు రోడ్ల మధ్యా ఉండే ప్రదేశం మాత్రం నా పరిధిలోదే.

అయితే అప్పుడా ప్రాంతమంతా నిర్మానుష్యం. ఇప్పుడు పెద్దపెద్ద భవనాలతో, వాటిలో రకరకాల ఆఫీసులూ షాపులతో, నిండుగా వున్న త్రిభుజాకార స్థలం అంతా- అప్పట్లో చిన్నవీ పెద్దవీగా అసంఖ్యాకమైన దిబ్బలతో నిండి ఉండేది. అలాంటి వేస్టు లాండ్‌లో ఉన్నదల్లా ఒకే ఒక పాత బంగళా.

ఆ పాత బంగళా- గవర్నరు బంగళాకూ దత్తు బంగళాకూ మధ్యలో రోడ్డుని ఆనుకొని ఉన్న కొంత సమతల ప్రదేశం మధ్యగా ఉండేది.

నే వెళ్ళేసరికి- ఆ బంగళా 'అయ్యగారు' అందుబాటులో లేరు. స్నానం చేస్తున్నారో భోజనం చేస్తున్నారో తెలీదుట. అలా చెప్పిన తోటమాలి వరండాలో ఓ కుర్చీ చూపించి అందులో కూర్చోమన్నాడు.

మాలీ తన పని తాను చేసుకుపోతుంటే- నేనతని పని చూస్తూ కూర్చున్నాను.

అతను చేస్తున్నదేమిటీ?

బంగళాకు దక్షిణం వైపు ఓ నీటి కుళాయి ఉంది. దాని మూతికి ఓ పొడుగాటి రబ్బరు ట్యూబు బిగించి రెండవ కొన నుండి ధారగా వస్తున్న నీళ్ళతో చుట్టూ ఉన్న మొక్కలకూ వరండా పిట్టగోడల మీద ఉన్న మొక్కల గోలేలకూ నీరు పెడుతున్నాడు.

చుట్టూ ఉన్న మొక్కలేమిటీ- రకరకాల క్రోటన్లు. గోలేల్లో ఉన్నవి కాక్టస్ జాతి మొక్కలు- బంగళాల్లో మాత్రమే కనిపించేవి.

ఓ పావుగంటలో వాటినీ వీటినీ తడపడం అయిపోయింది.

అప్పుడా నీటిగొట్టాన్ని కాస్త దూరంలో ఉన్న వెదురుపొద దగ్గరికి ఈడ్చుకుపోయేడు. ఆ పొద చుట్టూ పెద్ద పాదుంది. అంత పెద్ద పళ్ళెం నిండడానికి కొంత సమయం పడుతుంది కదా! అందుకని చేతిలోని నీటిగొట్టాన్ని బాగా దగ్గరకు లాక్కొని చివర ఓ పెద్ద చుట్టచుట్టి పొద మధ్యకు విసిరేశాడు. ఆ తర్వాత చేతులు దులుపుకొని వేరే పని మీద వెళ్ళిపోయాడు- మాలి.

ఇంతలో యింటి యజమాని బయటికొచ్చాడు. నేను అడగవలసినవి అడిగి రాసుకోవలసినవి రాసుకొని సైకిలెక్కేశాను.

దారి పొడుగునా, ఇంటికి వచ్చాక కూడా, ఆ బంగళా, అక్కడి త్రాగునీటి వినియోగం- ఆ దృశ్యాలు నన్ను వదల్లేదు.

నీటికోసం 'ఘర్షణలు' వీధివీధినా వందలూ వేలూ ఆ వేళప్పుడు. అవన్నీ కళ్ళ ముందు కదులాడుతున్నాయి.

ఆ నేపథ్యంలో- అదే నీటి వినియోగం, ఆ బంగళాలోనూ, అలాంటివే మరెన్నో బంగళా లలోనూ- ఆ విధంగా చూస్తుండగానే నేను ఉద్విగ్నుణ్ణైపోయాను.

అలాంటి ఉద్విగ్న స్థితిలో- కొందరైతే ఒకటి రెండు రోజుల్లోనో, కొన్ని గంటల్లోనో ఓ మంచి కథ రాయగలుగుతారు. నాకలాంటి సామర్థ్యం ఆనాటికే కాదు- ఈనాటికీ అలవడ లేదు.

అందుకే నాలుగు వారాలు తీసుకున్నాను. జీవధార కథ రాయడానికి.

*

నేను పుట్టు కథకుణ్ణి కాను.

కథ గురించీ కథారచన గురించీ తెలుసుకోడానికి నాకు చాలాకాలం పట్టింది.

ఎందరెందరో ద్రోణాచార్యుల నుండి ఏకలవ్య శిష్యరికంగా వాటి గురించి తెలుసుకో గలిగాను- అదీ కొంత కొంతవరకే.

కొద్దిమందిని విని తెలుసుకున్నాను. చాలామంది నుండి చదివి తెలుసుకున్నాను.

ఏదో ఓ సందర్భంలో ఓ గురువుగారి మాటలు మాత్రం బాగా గుర్తుండిపోయాయి.

కొన్ని పేర్లు చెప్పి- వీళ్ళందరూ తెలిసిన వాళ్ళ గురించీ లేదా ఎక్కడో జరిగింది జరిగి నట్టూ రాస్తారు. అది చాలా తప్పు (తప్పుడు మార్గం). నేనలా రాయను- అంటూ తమ మార్గం గురించి సంక్షిప్తంగా వివరించారు ఆయన.

జీవధారకు ముందు రాసిన పది పన్నెండు కథలకీ ఆ మాటలే మార్గదర్శకాలైనాయి నాకు.

అయితే-

నాకున్న పరిమితుల వల్ల కాబోలు, ఆ మార్గాన నా ప్రయాణాలు నల్లేరు మీద నడకలు కాలేదు. దాన్ని సుగమం చేసుకోడం ఎలాగో యీ కథకు వచ్చిందాకా యీ కాస్తైనా తెలియ లేదు.

*

బంగళా నుండి ఇంటికి పోతూ ఉంటే అకస్మాత్తుగా ఉద్విగ్నుణ్ణయినట్లు చెప్పేను కదా!

అంటే- ప్రేరణ సఫలమై కథకి అంకురార్పణ జరిగిందన్న మాట.

ఆ వెంటనే మనోలోకం తలుపులు తెరుచుకున్నాయి.

ఆ వెంబడే కొళాయి నీళ్ళకు సంబంధించినవి ఎన్నెన్నో దృశ్యాలు, ఎప్పటెప్పటివో దృశ్యాలు.

మా యిరుగు పొరుగు గృహిణులు నీటి అగచాట్ల గురించి చెప్పుకునేటప్పుడు- ఆ గొంతుల్లో వినిపించే ముఖాల్లో కనిపించే వ్యథ-

వీథుల్లో దారినపోతూ చూసిన కుమ్ములాటలు, అడపాదడపా పత్రికల్లో కానవచ్చిన ఆ కుమ్ములాటల పర్యవసానాలు-

తమతమ వీథుల్లో జరిగిన అఘాయిత్యాల గురించి టీచర్సు రూములో విన్న కొన్ని కథనాలు, కొన్ని సంఘటనలపై సాగిన వాదోపవాదాలు; విజయనగరం నీటి సరఫరాని ఉద హరిస్తూ విశాఖ సరఫరాని విమర్శిస్తూ, కొన్నికొన్ని వ్యాఖ్యలు-

ఆయీ చర్చల్లో మురికివాడలకూ మధ్యతరగతుల డాబా వీథులకూ, డాబా వీథులకూ కొత్తగా వెలుస్తున్న మేడల కాలనీలకూ; వీథుల్లో పబ్లిక్ కొళాయిలకూ ఇళ్ళల్లో ప్రైవేట్ కొళాయి లకూ; నీరందడంలో తేడాలు-

ఇలాంటివన్నీ కలగాపులగంగా కళ్ళ ముందు కదులాడసాగాయి.

ఆ గందరగోళం మధ్య నుండే ఏదో ఓ ఎరుక దృశ్యమానమవుతున్నట్టనిపించింది.

వెంటనే మనఃస్థితి ఉద్విగ్నత నుండి ఉద్వేగానికి మారుతున్న దశ. ఆ దశలోనే ఇంట్లోకి అడుగుపెట్టుంటాను.

సైకిలుకు బ్రేక్ పడడంతో పాటు నా ఆలోచనలకూ బ్రేక్ పడి ఉంటుంది.

*

లోగడ ఉద్వేగస్థితిలోనే రాతకు కూర్చునేవాడిని. అందువల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి అప్పట్లో నాకు తెలియదు. నా అనుభవంలో ఆ ప్రమాదాలు రకరకాలు.

సాఫీగా సాగవలసిన రచన ఒక్కోప్పుడు దారి విడిచి పెడదారులు పట్టేది. అలా కథ ఒక దశకు చేరేక, దిక్కు తెలియని బాటసారిలా అయోమయంలో పడిపోయేవాణ్ణి.

వెనక్కి రాలేక, ముందుకుపోలేక రాయదలచినదొకటి రాసిందొకటిగా ముగుస్తుందని పించడంతో మొత్తం రచనను పక్కన పడేయవలసొచ్చేది.

పేర్లే కాదు పాత్రల్నీ సన్నివేశాలనూ సంఘటనలనూ మారుస్తూ మార్చిందాంట్లో మరి కొన్ని మార్పులు చేస్తూ కథను కోరుకున్న విధంగా పూర్తి చేయడానికి కాలమూ కాగితాలూ విప రీతంగా ఖర్చయ్యేవి.

ఇవీ యిలాంటివీ ప్రమాదాల్లో పడకండా ఉండడానికి మనసును సంబాళించుకొని అది స్థిమితపడే వరకూ ఆగాలి. అలా ఆగాను.

ఆ తర్వాత కూడా తొందరపడలేదు.

ఈ కథ కోసం నన్ను ప్రభావితం చేసిన దృశ్యం నుండీ- తదుపరి నా ఉద్విగ్న స్థితిలో నా మనోనేత్రాల ముందుకొచ్చిన సమస్త దృశ్యాల వరకూ-

అన్నిటా ఆయా సంఘటనలూ వాటిల్లో వ్యక్తులూ, వారివారి ఆవేశాలూ ఆగ్రహాలూ అమానుష ప్రవర్తనలూ, న్యాయాన్యాయాల గురించి వాదనలూ, ఒకే వ్యక్తిలో వివిధ సందర్భా లలో వ్యక్తమయ్యే విరుద్ధ భావనలూ- ఇలాంటి వాటినన్నిటినీ తీసుకుని, మానవ మాత్రుడిగా నాకు సాధ్యమైనంత నిష్పక్షపాతంగా పరిశీలనాత్మక వివేచనతో వాటన్నిటి గురించీ ఒక అవ గాహనకు రాగలదాకా ఆలోచించాను.

అలా ఆలోచించడంతో-

భారత రాజ్యాంగం ద్వారా మనదేశంలో నెలకొన్న వ్యవస్థా, ఆ వ్యవస్థ కాలగతిలో చెందుతున్న పరిణామాలూ, వాటి పర్యవసానంగా మన అసమ సమాజపు వివిధ వర్గాల లేదా వేర్వేరు తరగతుల ప్రజల జీవనగతుల్లో ఆలోచనల్లో ఏర్పడుతున్న మార్పులూ-

ఇలాంటి వాటిని కూడా మరచిపోలేదు.

ఇలా అవగాహన పరిధి ఎంత విస్తృతమైపోయినా అందుండి నీటి వినియోగానికి సంబంధించినంత మేరకే కథకు వస్తువుగా చేసుకున్నాను.

సకల ప్రాణులకూ జీవావసరాలు మూడు. ప్రాధాన్యక్రమంలో అవి- గాలి, నీరు, ఆహారం. మనిషికి పై మూడింటితో పాటు జ్ఞానం కూడా జీవావసరమే. ప్రాధాన్యక్రమంలో బహుశ అదే మొదటిదనిపిస్తుంది- నాకైతే.

ప్రాధాన్యక్రమం ఎలా ఉన్నా- నీరూ, దాని పంపిణీకీ సంబంధించిన కథావస్తువు మంచిదే అవుతుందనుకున్నాను.

అలా అనుకున్నాక జీవధార కథారచనకు కూర్చున్నాను.

*

స్వాతి మాసపత్రిక ఆరంభించిన కొత్తల్లో వేమూరి బలరాంగారూ నేనూ విశాఖలో ప్రొ॥ వేణుగోపాలరావుగారి ఇంట్లో తారసపడ్డాము.

బలరాంగారు జీవధార కథను అడిగి తీసుకున్నారు.

*'జీవధార' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

*22 అక్టోబర్ 2010*

# 6

# నమ్ముకున్న నేల

## కేతు విశ్వనాథ రెడ్డి



**కేతు విశ్వనాథరెడ్డి** 10 జులై 1939న కడప జిల్లాలో జన్మించారు. వీరి మొదటికథ 'అనాదివాళ్ళు' 13 సెప్టెంబర్ 1963లో సవ్యసాచి పత్రికలో అచ్చయింది. 6 కథా సంపుటాలు, 4 నవలలు అచ్చయ్యాయి. కొడవటిగంటి కుటుంబరావు రచనలను 14 సంపుటాలుగా సమీకరించి, సంపాదకత్వం వహించారు. 1996లో 'కేతు విశ్వనాథరెడ్డి కథలు' సంపుటానికి కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించింది. బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేశారు. చదువు కథలు, తెలుగుకథ సంకలనాలకు సంపాదకులు.

**చిరునామా**

ఫ్లాట్ నెం. 11, సిద్ధార్థ అపార్ట్‌మెంట్స్,
సిద్ధార్థనగర్, హైదరాబాద్-500 038.
Ph.: 9866713647

ఎర్రగుంట్లలో 'రాయలసీమ' దిగగానే యెదురుగ్గా సి.పి.ఐ. సిమెంటు ఫ్యాక్టరీ. చిలమకూరులో బస్సు దిగగానే రోడ్డు మీద, రోడ్డు కటూయిటూ కోర మాండల్ వాళ్లు కడుతున్న మరొక కొత్త సిమెంట్ ఫ్యాక్టరీ హడావిడి.

జీపుల మొగం కార్ల మొగం పెద్దగా చూడని చిలమకూరు రోడ్డు మీద యిప్పుడు జీపులూ, కార్లూ అదేపనిగా అటూయిటూ తిరుగుతున్నాయి. ఫ్యాక్టరీ కట్టే చోటుకు రాళ్లు తీసుకుపోతూ గతుకుల రోడ్డు మీద లారీలు, లారీల్లో ఆ రాళ్లలాగే ఆడా మగా.

రోడ్డు పక్కల కొత్త అంగళ్లు. చార్మినారు, సిజర్సు తప్ప మొన్నమొన్నటి దాకా మరే రకం సిగరెట్టు దొరకని అంగళ్లలో రెడ్‌విల్స్ దాకా రకాలు కనబడుతున్నాయి. బ్రాందీ షాపులే యింకా వచ్చినట్టు లేదు. కూరగాయలు, సరుకులు, తినుబండారాలు, టీలు, కాఫీలు, గుడ్డలు, సబ్బులూ పేస్టూ కలగాపులగంగా ఒకే అంగట్లో, వేరువేరు అంగళ్లలో.

బస్సుల కోసం వచ్చినవాళ్లతో, రికామీ మనుషులతో, ఫ్యాక్టరీ కూలీజనంతో సంబంధమున్న వాళ్లతో రోడ్డు సందడిగా వుంది. ఇన్నేళ్ల వ్యవసాయమూ, వాన మీద ఆధారపడిన వాణిజ్య పంటలూ, రాళ్లగనుల వ్యాపారమూ

తేలేని కొత్త మార్పులు యిప్పుడు కనబడుతున్నాయి. గ్రామీణ బ్యాంకి యీ మార్పుల మధ్య, రెండు భాషల జనం యీ మార్పుల మధ్య.

రోడ్డు మీద మావూరి వాళ్లెవరూ కనబడలేదు. రోడ్డు దిగి మా వూరి కాలిదారి- చేలగుండా వెళ్లే కాలిదారి- పట్టినా.

చుట్టూ చేలు. నూర్ల యెకరాల చేలు. యెవరెవరి చేతుల్లోనో మారుతూ వస్తున్న 'పుడమితల్లి.' అమ్మకాల్లో, కుటుంబ పంపకాల్లో చీలికలూ ముక్కలూ అవుతూ 'నేలతల్లి'. గట్ల మధ్య 'భూదేవత.'

సేద్యాలు అయి కూడా చాలామటుకు విత్తనం పడకుండా... దాదాపు చేలన్నీ బీళ్లే. బీళ్లన్నీ ఆకాశాన్ని కరువున పడి చూస్తూ... 'బీళ్లు దున్నేరు.' వానలేదు, పంటలేదు.

పొలంలో జొన్నేగిలి లేదు. కొర్రేగిలి లేదు. కుసుమేగిలి లేదు. సెనక్కాయేగిలి లేదు. యేయేగిలీ యేం లాభం? అక్కడో, యిక్కడో బెత్తెడెత్తు కూడా పెరక్కుండానే పసివాళ్ల చావులాగ మాడి బుగ్గి అయిన సెనక్కాయ. యీపాటికి యే రెండు మూడు వానలో అదును తప్పకుండా పడి వుంటే గట్లు కూడా కనపడకుండా పైరుపచ్చలతో కళకళలాడాల్సిన పొలాలు. గట్లు మాత్రం కనబడుతున్నాయి. వాళ్ల బతుకుల్లోని భవిష్యత్తులా!

మళ్లా కరువే. కరువు బతుకుల్లో భాగమైన కరువు. యెన్నో కరువో గుర్తులేదు. గుర్తులు సమస్యల్ని తీరుస్తాయా?

కాళ్ల కింద కొంపా, గోడూ కాలిన ఒక వీధిలా భూమి. పైన ఆకాశం బూడిద కుప్పలాగా. ఆకాశంలో ఒకటీ అరా మబ్బులేవో కనపడుతున్నాయి. తగిన వానల్లేక గాలికీ, యెండలకీ పగిలిన పత్తికాయల్లో కనపడే గొగ్గిపత్తిలాగా ఆ మబ్బులు. ఆకాశంలో ఒక్క కాకి లేదు. కాలిదారిలో ఒక్క మనిషి యెదురుపడలేదు. పైరగాలి రావలసిన కాలంలో, గాలి కాలంలోలాగా గాలి.

ఈ యేడాది కరువు యింత దారుణంగా వుంటుందనుకోలేదు. న్యూసుపేపర్లలో చదివిన వార్తలూ, యెవరెవరో చేసిన ప్రకటనలూ, వాగ్దానాలూ జ్ఞాపకానికి వచ్చినాయి. తెలివి తెలిసినప్పటి నుంచీ ప్రకటనల్లో, వాగ్దానాల్లో మార్పు మాత్రం చూళ్లేదు.

ఇంత ఘోరకలిలో హైదరాబాద్‌నుంచి నేనేం పాముకోను యింత దూరం యిక్కడికి వచ్చినట్టు? అంగడి సుబ్బారాయుడు వుత్తరం రాస్తానే యింత దూరం పరుగెత్తుకొని రావాలా? ఆశ... అవసరం...

పిత్రార్జితంగా మిగిలిన రెండెకరాల తోటనూ, నాలుగేండ్ల కిందట మా దాయాది వీరన్నకు అమ్మడంతో, నాకింకా వదలని మావూరి బంధం; భూమితో ఆఖరి బంధం. ఈ రెండు మూడు రోజుల్లో పని కుదిరితే ఈ నేలతో నాకు తెగతెంపులు.

నాలుగేండ్ల కిందట వీరన్న తన తోటపక్క వుండే నా రెండెకరాల భూమినీ తానే తీసు కుంటానన్నాడు. ఆ వంతుల బావి కింద వున్న నా తోటను మరొకరికి అమ్మి, వీరన్న గుండెల మీద కుంపటి పెట్టే దానికంటే వీరన్నకే అమ్మడం మంచిదనిపించింది. వీరన్న తన వెలిపొలం నాలుగు ఎకరాలు అమ్మే వేళకు అప్పుల వాళ్లు చుట్టుకున్నారు. మిగిలింది రెండు వేలు. ఆ రెండు వేలూ సంచకారంగా నా చేతిలో పెట్టి క్రయపత్రం రాయించుకున్నాడు. తన రెండేండ్ల నిమ్మచెట్లు కాపు కొస్తానే మిగతా ఎనిమిదివేలూ తీరుస్తానన్నాడు. అంతదాకా గుత్త యిచ్చేటట్టు ఖరారయింది. అప్పటినుంచీ గుత్తాలేదు, భూమీ రిజిష్టరు చేయించుకోలేదు. నాకేమో డబ్బు అవసరం. మా మూడో అమ్మాయి ప్రసూన పెళ్లి నిశ్చయమయింది. వీరన్నకు రాస్తే జవాబు

లేదు. మామూలు సమయంలో పోదాంలే అనుకుంటున్నాను. యింతలో అంగడి సుబ్బారాయుడు నుంచి వుత్తరం; వీరన్న వ్యవసాయం యెత్తిపెట్టినాడంట. తోట అమ్మినాడంట. చెడిపోయినాడంట. నా రెండకరాలు సుబ్బారాయుడు కొంటాడంట.

వుత్తరంలో వివరాలు లేవు. అంతా బీరకాయపీచులాగా వుంది. వీరన్న నిమ్మచెట్లేమైంది తెలియదు. అమ్మింది యెందుకయింది తెలియదు. దెబ్బతిన్న సంసారమే అయినా యింత యిదిగా వుంటుందనుకోలేదు.

వుత్తరం చూసి నా భార్య తొందరపెట్టింది. అసలే ఆడకూతురు. యిది చిక్కు వ్యవహారమని ఒకవైపు యిబ్బందిగా వుంది. గుత్తబాకీ చెల్లేసుకున్నా వీరన్న సంచకారం నా దగ్గర వెయ్యికి పైగా వుంటుంది. అసలు వీరన్న భూమి వదులుకుంటాడా? సంచకారం వెనక్కు తీసుకుంటాడా? వెనక్కు తీసుకోమని నా నోటితో నేనెట్లా అడగడం? మరి నా అవసరం? అయితే ఈ కరువురోజుల్లో నా అవసరం తీరేదెట్లా? అంగడి సుబ్బారాయుడి యెత్తులేమో?

మనసంతా చీకాగ్గా వుంది. వూరు దగ్గర పడింది. చిన్నప్పుడు వానాకాలంలో, పైర్ల కాలంలో తిరిగిన పొలాలూ, కుంటా, కొండా జ్ఞాపకం వస్తున్నాయి. మమకారాలు ఒకంతట వదలవు. కరువుల ప్రాంతంలో భూముల ధరలు పెద్దగా పెరిగి చావవని తెలిసీ, యెన్నేళ్లు భూమి అమ్మకుండా వాయిదా వేసినాను? యేదో జీతం డబ్బులతో బతకడం బట్టి యిది నాకు సాధ్యమయిందేమో! చదువే లేకపోతే, వుద్యోగమే లేకపోతే యిట్లాంటి చోట నేనేమై వుండేవాణ్ణి? ఆలోచించడానికి భయం వేసింది.

వూరు గవినిలో వున్న వేపచెట్టు కింద, చెట్టు చుట్టూ కట్టిన అరుగు మీద యెప్పుడూ కనిపించే పుల్లయ్య కనబడలేదు. ఆ ముసిలోడు జీతాలోళ్ల మీద విసుర్లు విసురుతాడు. వూపిరి పీల్చుకున్నాను. ఆ అరుగు మీద మామూలుగా వుండే మా వూరి సగం సంఘ జీవితం కనపడలేదు. నా చిన్నతనంలో అక్కడే మోకులూ, పగ్గాలు పేనేవాళ్లు బయట నుంచి వచ్చిన సరుకుల బండ్ల మీద ఆడవాళ్లూ, పిల్లలూ యెగబడేవాళ్లు- చేటలు చేటలు గింజలు వెంట తెచ్చుకొని. పిల్లలు బొంగరాలు ఆడేవాళ్లు. పుట్టచెండు ఆడేవాళ్లు. రాత్రుళ్లు పొద్దుపోయిందాకా పిల్లలం కథలు చెప్పించుకునేవాళ్లం. చెప్పుకునేవాళ్లం. కథలు చెప్పే యెరికలయ్య అబ్బ చచ్చిపోయినాడంట. మిగతా నా సావాసగాళ్లు అంతా భూమిని నమ్ముకున్నవాళ్లు. ఎట్లా ఎట్లా ఉన్నారో? నాలుగేండ్లయింది చూచి. కొందరైనా ఈ సమయంలో అరుగుమీద కనబడేవాళ్లు. యిప్పుడు యిద్దరు కుర్రవాళ్లు మట్కా చార్టు చూస్తున్నారు. వాళ్లెవరి పిల్లలో నాకు జ్ఞాపకం రాలేదు. వాళ్లు నన్ను గుర్తించలేదు. రెండేండ్లకో, మూడేండ్లకో చుట్టపుచూపుగా వచ్చే నన్ను యెవరు గుర్తిస్తారు? వూరు విడిచి యిరవై యేండ్లు పైబడింది.

వూరి మధ్య దేవళం దగ్గర మామూలుగా కనపడే మిగతా సగం మా వూరి సంఘ జీవితం కనబడలేదు. అక్కడే ఒకప్పుడు వేమన్నలూ, సాధువులూ, సన్యాసులూ, తత్వాలవాళ్లూ, దొమ్మరాట, తోలుబొమ్మలాటల వాళ్లూ దిగేవాళ్లు. పౌరాణిక నాటకాలు నేర్చుకునేవాళ్లు. కొన్నేళ్లు బడి దేవళంలోనే. దేవళం ముందర యాటపోతులు తెగేవి. వాన కోసం కప్పల పెళ్ళిళ్లు ప్రారంభం అక్కడే. విరాటపర్వం చదవటం అక్కడే. భజనలు అక్కడే. శ్రీరామనవమి పానకాల పంపకం అక్కడే. మొలకల పున్నమి మొదలు కావడం అక్కడే. గిలకల కొట్లాటలు అక్కడే. వూళ్లోకి వచ్చే కొత్తవాళ్లు, వాళ్ల పలకరింపులు అక్కడే. అక్కడే రెడ్డీ, రెవెన్యూవాళ్లు దిగేవాళ్లు. అక్కడే నా చిన్నతనంలో కాశీనాథుని ఆంధ్రపత్రిక వొకరు చదువుతా వుంటే నలుగురూ చేరి వినడం

చూసినాను. వాళ్ల చర్చలు విన్నాను. యస్సెల్సీ చదువుకొనే రోజుల్లో కాంగ్రెస్ రాజకీయాలూ, కమ్యూనిస్టు రాజకీయాలూ విన్నాను. సొతంత్రం వచ్చినరోజు జెండా నాటడానికి కట్టిన రాళ్ల దిమ్మెమీద పెట్టేందుకు తొలిచిన బండ మాత్రం ప్రక్కన పడి వుంది- పాడుబడిపోతున్న దేవళంలాగే.

పైరుకాలంలో యెవరెవరి చేలల్లో పంట యెట్లా పండిందీ చర్చలు సాగేది అక్కడే. చేలల్లో పడిన పశువుల పంచాయితీలు అక్కడే. దొంగలకు శిక్షలు అక్కడే. వూరు మంచీ, వూరు చెడ్డా అక్కడే. మా నాయన మంగతై ఆడి ముప్పయి యెకరాలూ, యిల్లూ పోగొట్టింది ఈ దేవళంలోనే.

ఆ దేవళంలో కూర్చొని వున్న కుర్రవాడెవరో, "ఈ పొద్దు పేపరు తెచ్చినారా?" అన్నాడు.

"యెవరి పేపరు?" అన్నాను.

యిబ్బందిగా, "ఈ వూళ్లో పేపరు తెచ్చుకొనేదెవరు? మీరేమన్నా కొనుక్కొని వచ్చినారేమో," అన్నాడు.

"నిన్నటి తెలుగు పేపరుంది," అన్నాను.

"అదే యీండి," అని తీసుకున్నాడు.

యిది వార్తల దాహమో, చదువుకున్నవాడి చదువాకలో అర్థంకాలేదు. వీధిలో సంచలనం లేదు.

యిప్పుడు వూరు వూరంతా వలసపోయినట్లుంది. పిల్లలు తప్ప యింటి ముందర అరుగుల మీద కూడా పెద్దవాళ్లు కనపడలేదు. వూరు యింతగా మారిపోవాలా? యే వుత్సాహమూ లేక యిళ్లలో ముడుచుకొని కూర్చొని వుంటారేమో! వానల్లేని యిట్లాంటి రోజుల్లో మూఢనమ్మకాల ద్వారా కనపడే సంఘజీవితం కూడా కనపడడం లేదు.

వీరన్న యింట్లో లేడు. వీరన్న భార్య రామలక్షుమ్మ జొన్నబియ్యం విసురుకుంటోంది. నన్ను చూసి బిత్తరపోయింది. గబగబా లోపలికెళ్లి కాళ్లకు కడుక్కోను నీళ్లిచ్చింది. జగతి మీద నులకమంచం వాల్చి, దానిమీద ఒక చిరుగుల పరుపు పరచి కూర్చోమంది. కూర్చున్నాను.

రామలక్షుమ్మ కుశల ప్రశ్నలు వేసింది. యింట్లో పరిస్థితులు చూస్తూ జవాబులు గొణిగినాను.

"ఇప్పుడే వచ్చా (వస్తా) బావా!" అంటూ రామలక్షుమ్మ బయటికి వెళ్లింది. యిల్లు రైతిల్లు లాగా లేదు. యే స్కూలు టీచరుకో అద్దెకిచ్చిన యిల్లులాగా వుంది. గాటిపాట యెద్దులు లేవు. యారముట్లు లేవు. యెనుములు లేవు. అటకమీది పొట్టూ లేదు. చొప్పా లేదు. ఒకటి రెండు కోళ్లు మాత్రం తిరుగుతున్నాయి. అంగడి సుబ్బారాయుడు రాసింది నిజమేనని తేలుతుంది. వీరన్న వ్యవసాయం యెత్తి పెట్టినట్లే.

రామలక్షుమ్మ కొంగు చాటున యేదో దాచుకుని వచ్చింది. "కాఫీ తెచ్చా (తెస్తా) నుండు బావా," అని గాట్లో వేసిన పుల్లలు తీసుకొని లోపలికెళ్లింది. అరగంట తర్వాత కాఫీ తెచ్చి యిచ్చింది. బెల్లం కాఫీ. పొగ వాసన. ఆమె పడిన అవస్థ అర్థమైంది.

"వీరన్న వూళ్లో లేడా?" అని అడిగినాను.

రామలక్షుమ్మ కాసేపు మాట్లాడలేదు. చెప్పక తప్పలేదన్నట్లు మాటలు మింగుతూ చెప్పింది.

"పొద్దుటూర్నించి వచ్చినాక సిమెంటు ఫ్యాక్టరీకి పోతాండాడు. మనూర్లో చానామంది పోతండారు యీ నడుమ; సెపితే తీరదులే బావా!"

ఆమె కంఠంలో జీరబడింది. మరో ప్రశ్న వేయలేదు. కానీ ప్రొద్దుటూరి నుంచి రావడ మేమిటో నాకర్థంకాలేదు. వీరన్న వచ్చినాక తీరిగ్గా అడగవచ్చులే అనుకున్నాను.

'నీళ్లు కాంచుతా బావా! పొంతలో నీళ్లు అయిపోయినాయి. తెచ్చా (తెస్తా) వుండు.''

రామలక్షుమ్మ బిందె తీసుకుని బయటకి వెళ్లబోతోంది.

''నేను అట్లా వూర్లోకి పొయొస్తా. నాకన్నం, గిన్నం వండద్దులే,'' ఆమె వుండమని బలవంతం జేస్తుందని, విన్పించుకోకుండా బయటపడినా.

అప్పటికి యింకా పదిగంటలు కాలేదు. సాయంత్రంగానీ వీరన్న రాడు. యీ పరిస్థితుల్లో యెవరింటికి పోవాలన్నా బీతుగా వుంది. రెండు మూడు రోజులు వూర్లో వుండాల్సి వస్తే, యెట్లా వుండాలో దిక్కు తెలీకుండా వుంది. వీరన్న యింటి పరిస్థితి చూస్తా వుంటే, వాళ్ల మీద పడి తినడం ఘోరం. దాయాదే కావచ్చు. మిగతా దాయాదులున్నారు. మా నాయన బతికి వుండగా వాళ్లతో మాకు మంచి సంబంధాలు లేవు. యీ శతృభావం ముదెబ్బల (ముత్తాల) కాలం నాటి నుంచీ వచ్చింది. ఆ తర్వాత బావుల్లో నీళ్లు తగ్గుతూ వచ్చినప్పుడు నీటి వంతుల కోసం వచ్చింది. తలకాయలు బద్దలు కొట్టుకోవడం దాకా రాలేదు. కానీ బావుల దగ్గర కుక్కల్లా కాట్లాడుకున్నారు. పైర్లు యెండబెట్టుకున్నారు. కాపుకు రాబోతున్న నిమ్మచెట్లను యెండబెట్టుకున్నారు. పెళ్లిళ్ల దగ్గరో, బావుల దగ్గరో కలిసేవారు. శుభకార్యాల బంధుత్వం, సూతకాల రక్తస్పర్శ- అంతే. మళ్లా మామూలే. అయితే నాకున్న చదువు వల్లా, వుద్యోగం వల్లా మా నాయన పోయాక నాతో పడే తగవు యేం లేదు కాబట్టి పలకరింపులున్నాయి. వూరొస్తే భోజనాలకు పిలవడాలున్నాయి. ఈ రెండు రోజులు అంగడి సుబ్బరాయుడింట్లోనే డబ్బిచ్చి భోజనం యేర్పాటు చేయించుకుందామని నిశ్చయించుకున్నాను.

అంగట్లో సుబ్బరాయుడు కూర్చొని వున్నాడు. యిల్లూ అదే, అంగడీ అదే. ఆయిలింజన్ల కోసం ఒక వారగా అరుగు మీద పెట్టిన కిరసనాయిలు డ్రమ్ముతో సహా, అంగట్లో వెయ్యి రూపాయల పెట్టుబడి వుండదు. ఒంటిమీద చొక్కాలేదు. మాసి చిరిగిపోయిన పంచె కట్టు కున్నాడు. గడ్డం మాసి వుంది. మనిషి మాత్రం దరిద్రం ఓడుతున్నాడు. మొలతాడుకు బీగాలు వేలాడుతున్నాయి.డబ్బు సంపాదనలో ఈ దీక్ష మానవ మాత్రులకు సాధ్యమయ్యేది కాదనీ, యోగులకు మాత్రమే సాధ్యమనీ, ఆ మనిషి చూస్తూనే, అతను సరుకులమ్మే పద్ధతిని చూస్తూనే తెలిసిపోతుంది.

నన్ను చూస్తూనే జొన్నలు పోసుకునే జాజిచెక్క పెట్టె మీద అడ్డపలక వేసి కూర్చోమన్నాడు. పిల్లల అయిదుపైసలు పది పైసలు బేరానికి బొంగొ, జీడినో, వూపిరి బుడ్డో, మరొకటో చేతుల్లో పెడుతూ క్షేమసమాచారాలు అడిగి నింపాదిగా అన్నాడు-

''అన్నం సెయ్యిచ్చేదా? వీరన్నింటికి పోవాలా?''

''చేయించు,'' అన్నాను.

లేచి యింట్లో చెప్పి వచ్చినాడు. సుబ్బరాయుడి భార్య పరామర్శ చేసిపోయింది. సుబ్బరాయుడు నెమ్మదిగా అన్నాడు.

''వీరన్న భూమిని నన్నే తీసుకోమన్నాడు.''

''వీరన్న రానీలే మాట్లాడదాం,'' అన్నాను.

ఈ పొడిమాటలు ఒక కొలిక్కి రాకుండానే, అంగట్లోకి మా మరో పెద్దనాయన కొడుకు మునిరెడ్డి వచ్చాడు. నన్ను చూసి నేరుగా యింటికి రాకపోయినందుకు నిష్ఠూరం చేసినాడు.

“యిదుగో యిప్పుడే రాబోతున్నా,” అని బొంకినా. “భోజనానికి పద,” అన్నాడు. “యిప్పుడీడ దింటాడు. రాత్రికి కోడిగోసి పెట్టుదువులే,” అని సుబ్బరాయుడు హాస్యనికన్నట్టు అన్నాడు. “యిప్పుడు కాఫీ అన్నా తాగొస్తువురా,” అంటూ బలవంతంగా లేవదీసినాడు.

మా మునిరెడ్డి అన్న కాఫీ యిచ్చి, రెండు గంటలు గ్రామ పరిస్థితులు, పంచాయితీ రాజకీయాలు, చదువులూ సంధ్యలూ, దేశ రాజకీయాలూ అన్నీ మాట్లాడినాడు. అది పెద్ద సోది. అన్నీ తెలుసుననుకొనేవాడి సోది. ఎంతకూ నా విషయం మాత్రం అడగలేదు. భరించలేక నేనొచ్చిన పని చెప్పినా. ముందు భూమి నమ్ముకోడమెందుకన్నాడు. తర్వాత, ‘జీతమంతా యేం చేస్తాండవు? యెంత మిగిలించినావు? యిన్సూరెన్సెంత?’ వగైరా యక్షప్రశ్నలు వేసినాడు. మా ప్రసూన పెళ్లి నిశ్చయమైన సంగతి చెప్పినా. పిల్లగాడి చదువు, వుద్యోగం, కట్నం అన్నీ అడిగినాడు.

“పాడు కరువులో ధర యాడ పలుకుతుంది? అంగడి సుబ్బరాయుడికి అగ్గువగా యివ్వాల్సి వుంటాదేమో,” అన్నాడు.

“వీరన్న వచ్చినాకనే ఆ బేరం,” అన్నాను.

అప్పుడు వీరన్న కథ చెప్పినాడు.

“వాడు మనోళ్లందరికీ చెడ్డ పేరు దెచ్చినాడు. వూర్లో సాటి కాపోళ్లకు చెడ్డ పేరు. మన వంశం యెట్లాంటిది? దెబ్బతిన్నోడు దాయాదే గదా అని మనింట్లో సేద్యానికుండమన్నా. ఆడు బడాశ మనిషి. ఒప్పుకోలేదు. ఆ పనికిమాలిన కామనూరోళ్ల మాటవిని, ‘బోగం కంపెనీ’లో చేరినాడు. చేరినోడు మర్యాదగా వుండినా సరిపొయ్యేది. ఆ రెండకరాలూ అమ్మి బాకీలన్నీ పూర్తిగా దీర్చకుండా, రెండు వేలు తీసుకొని యింకెక్కడా బాగుండదని చిలకలూరిపేటకు పోయినాడంట. యిద్దరు బోగమోళ్లను దెచ్చుకుంటే వాళ్లు దొడ్డికి పొయ్యొస్తామని అదే పోయినారంట. వీడు అన్నెం చాలా చెడిపోయినాడు. యేమయిందో యేమో తెల్దు. బామర్దులతో చెడిందని అంటా వుంటారు. పోలీసోళ్లు వొకరోజు బాగా కొట్టినారంటా వుండారు. ఈమధ్యనే వూరు చేరి సిమెంటు ఫ్యాక్టరీకి పోతండాడు. కరువులే ఒకటి అనుకుంటే యీ సిమెంట్ ఫ్యాక్టరీ వచ్చి రైతుల కొంప గూల్చింది. రోజుకు సిమెంట్ ఫ్యాక్టరీలో పదైదు రూపాయల కూలీ గిట్టుతుంది. రైతుకు అంత యియ్యమంటే యెక్కణ్ణుంచి తెచ్చి యివ్వాల? యిప్పుడు అయిదు రూపాయలిచ్చినా వచ్చేవాడు లేడు. ఆడోళ్లు కూడా అక్కడికే మరింగింటే. పది రూపాయలు దొరుకుతుంది. యింక భూములన్నీ అమ్ముకోవాల్సిందే. ఈ కూలోళ్లు, మనపక్క పల్లె కూలోళ్లే మన భూములన్నీ కొనే రోజులు దగ్గరపడినాయి...”

కూలోళ్లు యెంత భూములు కొనిందీ మునిరెడ్డి అన్నకు తెలియంది కాదు. అంగడి సుబ్బరాయుడి లాంటి వాళ్లు ముందుకొస్తున్నారంటే వాళ్లు వొక రకంగా వేదాంతులు. యాభై యెకరాల మునిరెడ్డి అన్న గోడు యెట్లా వున్నా వీరన్న కథ వింటానే మనసంతా కెలికినట్లయింది. పదైదేండ్ల కిందట యిరవై యెకరాల రైతు. నాకు తెలిసి ఒక్క చెడ్డ అలవాటు లేదు.

మునిరెడ్డి అన్నకు రాత్రికి మళ్లా వస్తానని చెప్పి సుబ్బరాయుడింటికి బయలుదేరినా. దారిలో మరొక బంధువు కనపడి, “వుద్యోగాలు జేసే మీ పనీ, కూలీనాకొడుకుల పని బాగుందిరా,” అన్నాడు. అంతాచేసి ఆయనా ఇప్పుడు పెద్ద రైతు కాదు. ఒకప్పుడు పెద్ద రైతు. ఆ ఒకప్పటి దర్పం యింకా చావలేదు.

సుబ్బరాయుడింటికి భోజనానికి వెళ్లినా- అన్నానికి కూర్చున్నాను.

‘అన్నం తిని తిని నోరు చెడిపోయి వుంటుంది. సంగటే బాగుంటుందని అన్నం చేయించలా.” సుబ్బరాయుడు లౌక్యం యెట్లున్నా, సంగటి నాకభ్యంతరం లేదు. అయితే ఆ తెల్లవాయి

కారం అలవాటు తప్పిపోయింది. నెయ్యి లేదు. పల్చటి మజ్జిగనీళ్లు. సుబ్బరాయుడు ఈ రకంగా ఒలికితే తప్ప, భూమి పోగొట్టుకొనే వాళ్ల భూమి కొనలేడు. సుబ్బరాయుడి మీద జాలిపడాలో, సుబ్బరాయుడిలో ముందుముందు పెద్దదయ్యే ధనదాహాన్ని చూసి అసహ్యించుకోవాలో తెలియ లేదు.

మధ్యాహ్నం నిద్ర అలవాటు లేదు. దేవళం దగ్గర కాసేపు కూచుందామనిపించింది. అక్కడికి వెళ్లేతలికి, నేను పొద్దున యిచ్చిన దినపత్రికనే యింకొక నలుగురు చేరి అధ్యయనం చేస్తున్నారు. దొరక్క దొరక్క దొరికిన పేపరులాగుంది.

ఒక కుర్రవాడు వచ్చి నా పక్కన కూర్చున్నాడు. గుర్తుపట్టినా. పుల్లమనాయుడు కొడుకు. బి.ఎ. చదువుతున్నానని చెప్పినాడు. ఎవరితోనో మాట్లాడుతున్నట్లు అన్నాడు.

''కడప జిల్లాను కరువు ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటన... యీ కలెక్టర్రో, మంత్రులో ప్రకటిస్తేనే తప్ప, యిది కరువు ప్రాంతం కాకుండా పోతుందా? సిగ్గూశరమూ లేని జాతి. సొతంత్రం వచ్చి యిన్నేండ్లయినా మంచినీళ్ల కరువు తీర్చలేకుండా వుంది. యింక తెలుగుదేశం పార్టీ మీద అభిమానం రమ్మంటే యెందుకు రాదు? యీసారి రైతులంతా తెలుగుదేశానికి వోట్లేస్తే తప్ప, కాంగ్రెస్‌కు బుద్ధి రాదు.''

పొద్దున నా దగ్గర పేపరు అడిగి తీసుకున్న కుర్రాడు అందుకు ఒకే మాట బదులిచ్చాడు.

''కాంగ్రెసు హిందూమతం లాంటిది. చరిత్రలో అది అన్ని మతాలను మింగినట్లే తెలుగు దేశాన్నీ, అట్లాంటి సవాలక్ష పార్టీలను మింగి కూచుంటుంది. జనతా అప్పుడు చూసినాం. యిప్పుడూ అంతే. యిప్పుడు కావలసింది మింగే పార్టీలు కాదు. మింగుడుబోయే పార్టీ కాదు.''

''నీ కమ్యూనిస్టు మాటలూ...''

''నీ... మాటలు...''

తారాస్థాయి నందుకోబోతున్న వాళ్లను యెట్లా వారించాలో తెలియలేదు. ఆ ఆవేశాల వెనుక వాళ్ల అలజడి స్పష్టంగా కనిపిస్తోంది. అలజడే రాజకీయాలు కావని వాళ్లకి తెలిసినట్లు నాకన్పించలేదు. కాంగ్రెసును హిందూమతంతో పోల్చిన కుర్రాడిలో మేధస్సు వుంది. నిజాయితీ వుంది. పుల్లమనాయుడు కొడుకులో అది లేదు. గాలివాటం రాజకీయాలు. నా అభిప్రాయం చెప్దామనుకున్నా. సుబ్బరాయుడి కొడుకు వచ్చి, ''నాయన రమ్మంటుండాడు,'' అని పిల్చాడు.

సుబ్బరాయుడు కాఫీ కషాయం అందించి అన్నాడు-

''దేవళంలో యింతసేపూ వుండావా? ఆడ పొద్దుబోని నాయాండ్లు చేరడం యెక్కువైంది. మరీ యీమధ్య యీ బియ్యేలు అవి బూములమ్మించి సదివి, వుద్యోగాల్లేక తలకాయలు చెడిపోయిన పిల్ల నాయాండ్లే ఆడ మట్కా ఆడడమో, వాణ్ణీ వీణ్ణీ తిడుతూ కూర్చోవడమో.''

సుబ్బరాయుడితో యేం వాదించేది? సుబ్బరాయుడే వాళ్లను కాసేపు తిట్టి, ''మరి యేం జెయ్యాల?'' అన్నాడు.

''వీరన్న రానీ... పోనీ నువ్వు చెప్పు. వీరన్న కిష్టమయితే భూమి తీసుకో,'' అన్నాను.

సుబ్బరాయుడు తను పడుతున్న కష్టాలన్నీ యేకరువూ పెట్టినాడు. నాకు డబ్బు అవసర మనే విషయం మీద సానుభూతి చూపినాడు. వూరి పరిస్థితి చెప్పినాడు. మునిరెడ్డి లాంటి వాడికే నలభై వేలు అప్పు వుందని, యెవరెవరికి యెంతివ్వాలో వివరించినాడు. మనూళ్లో భూమి కొనేవాడెవడూ లేడంటూ, యెవరెవరి సంసారాలు యెట్లా వున్నాయో చెప్పినాడు. కూలోళ్లు దొరకరనీ అన్నాడు. అన్నీ చెప్పి చెప్పి చివరకు అన్నాడు. ''ఆరువేల కంటే ఒక్క నయాపైసా యెక్కువ యివ్వలేను. కావాలంటే మీ మునిరెడ్డి అన్ననే అడుగు.''

పదివేలకు నాలుగేండ్ల కిందట అమ్మిన భూమిని సుబ్బరాయుడు 6 వేలకు అడిగినాడు. యిది సుబ్బరాయుడి దృష్టిలో రూపాయి విలువ యెక్కడమో, తగ్గడమో? అంతకుముందే ఒక్క ముక్క కొబ్బెర యెవరో గోజినందుకు, 'ధరాలన్నీ పెరిగిపోతాంటే నేనేం మొత్తుకొనేదా?' అన్నవాడు, కరువూ, నా అవసరమూ భూమి విలువను తగ్గించినట్లుంది. దిక్కు తోచలేదు.

"వీరన్న రానీ, రాత్రికి మాట్లాడుకుందాం," అన్నాను.

"రానీలే, తొందర యేముంది?" అన్నాడు సుబ్బరాయుడు ధీమాగా.

పొద్దుగూకింది. వీరన్న వచ్చినాడు. కోడిగీడి అంటూ భోజనం ఏర్పాట్లు హడావిడి చేసినాడు. 'మునిరెడ్డి అన్న రమ్మన్నా,''డన్నాను. రామలక్షుమ్మ, 'పేదోళ్లింట్లో తింటారా?' అంటూ నిష్ఠూర మాడింది. యేం చెప్పేది?

వీరన్నతో విషయం కదిపాను. అంతా విని నిశ్చింతగా, "సుబ్బరాయునికే అమ్ము," అన్నాడు. యెక్కడో లోపల దాచిన క్రయపత్రాన్ని తెచ్చి నా చేతికిచ్చినాడు. నాకేం మాట్లాడాలో తోచలేదు. ఆఖరుకు మనసు కూడగట్టుకొని ధైర్యం తెచ్చుకొని అన్నాను.

"ప్రసూన పెళ్లికి నేనేదో తంటాలు పడతా లేదా జరిగేది జరుగుతుంది. భూమి నువ్వే చేసుకో. నీకు వీలున్నప్పుడే డబ్బు యిస్తువు."

"వీలేంది? యెట్లా వుంటుంది వీలు? యింత సదువు సదివినోడివి నీకేమన్నా పిచ్చా? కరువు నమ్ముకోమంటావా? సుబ్బరాయుని నమ్ముకోమంటావా? బావిలో వంతు లేదంటే యేం జెయ్యాల? బాడుగకు యింజనీ పొద్దు ఆడించను, పొమ్మంటే యేం జెయ్యాల? యెద్దుల్లేవు. యారముట్లు లేవు. దేన్ని చూసుకొని భూమి తీసుకోమంటావు? భూమిని నా కమాషి వచ్చినాకే యిరవై యేండ్లు నమ్ముకున్నా మిగిలిందేముంది? యింకా సుబ్బరాయుడికివ్వాల్సిన పదైదు నూర్లు... యింకా గవర్నమెంటు లోన్లు...?

"యింకానా?"

"ఆఁ... యీ బాకీల్తో దిక్కు తోచకే పొద్దుటూరుకు పొయ్యింది. ఏ రైతూ చెయ్యని పని చేసింది. బోగం కంపెనీలో నీళ్లు మోసినా, బోగమోళ్లకూ అన్నం పొట్లాలు మోసినా. వాళ్ల దగ్గరకొచ్చే వాళ్లకు బ్రాందీలు, సారాయి తెచ్చినా. పోలీసోళ్లకు బోగమోళ్లను పంపినా. దొంగ రెయిడింగుల్లో దెబ్బలు తిన్నా... కానీ నేనే సొంత కంపెనీ పెడదామనుకున్నా, మోసపోయినా. నేను అక్కడ పనికిరానని తెల్సిపోయింది. అక్కడ ఉండలేక రోజూ సిగ్గుతో సచ్చినా, తెలిసినవాడు యెవడు కనపడతాడోనని. కడకు వూరు చేరుకున్నా. భూమి లేకపోయినా చేతుల కష్టం వుంది. యిప్పుడు ఫ్యాక్టరీ వుంది, నాలాంటోళ్లకు చానామందికి."

"రెండేండ్లో మూడేండ్లోనే కదా. ఫ్యాక్టరీ కట్టే పని పూర్తి అయితే ఆ తర్వాత నీలాంటోడికి పని ఉంటుందా? అందువల్ల..."

"మళ్లా భూమి చేసుకోమంటావు? భూమీ వద్దు గీమీ వద్దు. అసలు నీకర్థంగాంది యింకొకటి వుంది. భూమి చేసుకుంటాననుకో. సుబ్బరాయుడికి బాకీ గవర్నమెంటుకు బాకీ, నీకూ బాకీ. సుబ్బరాయుడు తన బాకీలోకి మళ్లీ ఆయకం పెట్టుకుంటాడు. సొంతం చేసుకుంటాడు. సుబ్బరాయుడి బాకీ కింద నువ్వియాలనుకునే రెండెకరాలు పోతాది. నీకు నేనివ్వాల్సిన పదివేలు యిరవైవేలవుతాది. అసలు సంగతి సుబ్బరాయుడు ఆరువేల కంటె యెక్కువ పెట్ట నంటున్నాడు. నువ్వేం చెయ్యలేవు యియ్యాల్సిందే. నేను సంచకారమిచ్చిన డబ్బు నాకు దమ్మిడీ రాదు. అది సుబ్బరాయుడే పట్టుకుంటాడు. తనకు నేనివ్వాల్సిన బాకీలోకి. మునిరెడ్డి అన్న కూడా

సుబ్బరాయుడికి లోకువే కాబట్టి అన్నింటికి సై అంటాడు. నువ్వు జేసేదేముంది? నేను చేసేదేముంది? యేమంటావు?

యేమంటాను? ఆ రాత్రే భూమి వ్యవహారం పూర్తి అయింది. మునిరెడ్డి అన్న ఒక మూడు వందలు ఎక్కువకు పైసలు చేసినాడు.

"యిప్పుడు నాలుగు వేలిస్తాను వచ్చే మాసూల్లల్లో రెండు వేలిస్తాను. యిప్పుడే అంతా యిచ్చేవాడిని, మీ మునిరెడ్డి అన్న మరీ యిబ్బందిగా ఉందంటే యిచ్చినా. యింక మూడు నెలల్లో వీరన్నకు నువ్వు యివ్వాల్సిన పదమూడు నూర్లు పట్టుకుంటా. రెండువేల యేడునూర్లు నీకిస్తా," అన్నాడు సుబ్బరాయుడు. సరేనన్నాను.

యీ లెఖ్ఖలు తెగేవి కావు.

భూమితో, మా వూరితో ఆఖరు లింకు తెగిపోయింది.

అర్ధరాత్రి దాటేవరకు ఊరి విషయాలూ, ఫ్యాక్టరీ కబుర్లూ, వీరన్న ఫ్యాక్టరీ కబుర్లే యెక్కువ చెప్పినాడు. ఫ్యాక్టరీ తీసుకునే భూముల ధర విషయంలో పెద్ద మనుషులు రైతులకు చేస్తున్న మోసాల గురించి చెప్పినాడు. ఆమధ్య అరవ కూలోళ్లకు, తెలుగోళ్లకు జరిగిన కొట్లాట గురించీ, సమ్మె గురించీ, యీమధ్య యేర్పడిన యూనియన్ గురించీ, కూలీ పెంచమని సమ్మె గురించీ చెప్పినాడు.

తెలతెలవారుతోంది. ఫ్యాక్టరీ పనికి ప్రయాణమైపోతున్న వారి వెంట నేనూ బయలుదేరినా. నాకింకేం పని యిక్కడ? తిరుపతిలో వుండే పెళ్లికొడుకు వాళ్లకు యిప్పట్లో పెళ్లి పెట్టుకోలేమని చెప్పి హైదరాబాదు పోదామనుకున్నా.

వీరన్న ముందు నడుస్తున్నాడు. అతని వెంట యిరవైమందికి పైగా కరువు కాటకాలకు అప్పుల పాలై భూమిని అమ్ముకున్న రైతు జనం. కరువు భూముల్లో ఫ్యాక్టరీ దిశగా సాగిపోతూ...

పైన సిమెంటూ, ఎముకల పొడి కలిసిన రంగులో ఆకాశం.

ఆ మూల యెక్కడో యెర్రగావు...

*ఆంధ్రజ్యోతి దీపావళి సంచిక, 1982*

నేపథ్యం

## భూమి పై మమకారమే
# నమ్ముకున్న నేల

**'కాల్డార్ నివేదిక'లోని భారతీయ రైతులకు సంబం ధించిన అంశం నన్నెప్పుడూ ఘర్షణకు గురిచేసేది. ఆ అంశం ఏదో కాదు, 'భారతదేశంలోని రైతు అప్పుల్లో పుడతాడు, అప్పుల్లో బతుకుతాడు, అప్పుల్లోనే మరణిస్తాడు,' అని.**

నమ్ముకున్న నేల కథానికను 1982 అక్టోబరులో రాసినట్లు జ్ఞాపకం. రెండు, మూడు చిత్తుప్రతుల తర్వాత శుద్ధప్రతిని *ఆంధ్రజ్యోతి దీపావళి సంచిక*కు పంపించాను. దీపావళి సంచికలో అది అచ్చయ్యింది. పోయిన దీపావళికి అంటే 2012 దీపావళికి ఈ కథానికను రాసి ముప్పై ఏళ్లు గడిచాయి. నమ్ముకున్న నేల రాస్తున్నప్పటి జ్ఞాపకాలు ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. అందులోని నేపథ్యం-పాత్రలు, పాత్రల మధ్య సంబంధాలు, ఘర్షణలు- అన్నీ ఇప్పటి స్మృతుల్లో మెదుల్తానే ఉన్నాయి. వీటిని ప్రస్తావించే ముందు రాయలసీమ గ్రామీణ జీవితానికి సంబంధించిన వాస్తవికతను గురించి కొన్ని మాటలు మాట్లాడుకోవాలి.

నేను పల్లెటూర్లో పుట్టినవాణ్ణి. పల్లెలతో సంబంధం ఉన్నవాణ్ణి. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినవాణ్ణి. వ్యవసాయ కుటుంబాల్లో జరుగుతున్న దుష్పరిణామాల్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ వచ్చినవాణ్ణి. మెట్టనేల సేద్యంలోని కష్టనిష్టూరాలను చూసినవాణ్ణి. రాయలసీమలో ముఖ్యంగా కొన్ని తాలూకాల్లో తరచుగా సంభవిస్తున్న వర్షాభావ పరిస్థితుల్ని, అవసరాన్ని మించిన పెద్ద వానల రొంపి కరువుల్ని, వర్షమే లేని ఒట్టి కరువుల్నీ ప్రత్యక్షంగా చూసినవాణ్ణి. అక్కడి మెట్ట ప్రాంతాల పర్యావరణంలో వస్తున్న సంక్షోభాలను అనుభవంలోకి తెచ్చుకున్నవాణ్ణి. ఒకప్పటి పత్తి, వేరుశనగ, ఫ్యాక్టరీల్లోని జీవితాలనూ, సిమెంటు కర్మాగారాలు ఏర్పడిన తర్వాత వచ్చిన పరిణామాలనూ ఆకళింపు చేసుకున్నవాణ్ణి.

ఈ సందర్భంగా నా చదువు నాకు నేర్పిన విషయాలను కూడా ప్రస్తావించుకోవాలి. బి.ఎ.లో ఆర్థికశాస్త్రాన్ని ప్రధాన విషయంగా తీసుకున్నాను. అప్పటి గ్రామీణార్థిక శాస్త్ర విషయాలు నన్ను తర్వాత్తర్వాత కూడా వెంటాడాయి. ముఖ్యంగా 'కాల్డార్ నివేదిక'లోని భారతీయ రైతులకు సంబంధించిన అంశం నన్నెప్పుడూ ఘర్షణకు గురిచేసేది. ఆ అంశం ఏదో కాదు, 'భారతదేశంలోని రైతు అప్పుల్లో పుడతాడు, అప్పుల్లో బతుకుతాడు, అప్పుల్లోనే మరణిస్తాడు,' అని. సామాజిక భాషాశాస్త్రం, పురాతత్వ విజ్ఞానం, చరిత్ర, భూగోళ విజ్ఞానం లాంటి సామాజిక శాస్త్రాలతో సంబంధం ఉండే ఊర్ల పేర్ల మీద పరిశోధన (1969-74) చేసినప్పటి గ్రామీణ సమాజ అవగాహన కూడా నన్ను గ్రామీణ వాస్తవికత వైపు దృష్టి సారించమని హెచ్చరించినట్లయ్యింది అనుకుంటాను.

వాన కురిస్తే (1971) రచన తర్వాత రాసిన కథానికల్లో ఈ అనుభవం కన్పిస్తుంది. నమ్ముకున్న నేల- ఒక విధంగా మా ఊరి కథ. ఒక విధంగా వాస్తవిక కల్పన.

మా ఊరు కమలాపురం తాలూకా ఎర్రగుంట్ల మండలంలోని రంగసాయిపురం. ఇది ఓ చిన్న పల్లెటూరు. కథలో అప్పుడే మొదలుకానున్న సిమెంటు ఫ్యాక్టరీకి- చిలుకూరు సిమెంటు ఫ్యాక్టరీకి- రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెటూరు. రోడ్డు ద్వారా వెళ్తే రెండున్నర కిలోమీటర్లు, అడ్డంగా మెట్ట చేలల్లోని కాలిబాటగుండా పోతే రెండు కిలోమీటర్ల లోపు. చిలుకూరు సిమెంటు ఫ్యాక్టరీకి ముందే ఎర్రగుంట్లలో మరో సిమెంటు ఫ్యాక్టరీ ఉంది. నమ్ముకున్న నేల చిలుకూరులో కడుతున్న మరొక కొత్త సిమెంటు ఫ్యాక్టరీ హడావిడితో మొదలవుతుంది. ఈ కారణంగా అక్కడ జరుగుతున్న భౌతికమైన మార్పుల ప్రస్తావనతో ప్రారంభం సాగుతుంది. ఈ మార్పులకూ, కథాంశానికీ, కథానిక ముగింపుకూ ఒక అనివార్యమైన సంబంధం ఉంది.

కథానికా కాలం దాదాపు అప్పటి కాలమే. ఒక విధంగా కొనసాగుతున్న కరువుల కాలం. కొత్త రాజకీయాల కాలం. రైతులు- ముఖ్యంగా చిన్న కమతాలున్న రైతులు కొత్తగా నిర్మాణమవుతున్న ఫ్యాక్టరీలో కూలీలుగా మారిపోతున్న కాలం. వ్యక్తుల సంక్షోభాన్నీ, గ్రామీణ సంక్షోభాన్నీ పట్టుకోవడానికీ దోహదం చేసిన కాలం. స్వాతంత్ర్యానికి పూర్వం ఉండిన అంతో ఇంతో ఆదర్శాలు మృగ్యమైన దశ అది. సంఘజీవితం చెల్లాచెదురై కుల రాజకీయాలు సైతం నెమ్మదిగా చొరబడుతున్న దరిద్రపు కాలం. ఈ దశలోని అతలాకుతలమవుతున్న జీవితపు వాస్తవికతను పట్టుకోవడానికి చేసిన ప్రయత్నమే నమ్ముకున్న నేల.

నమ్ముకున్న నేలను ఉత్తమ పురుషలో రాయటానికి ముఖ్య కారణం- ఏదో స్పష్టంగా చెప్పలేను కానీ పాఠకులతో ఆత్మీయంగా కథకుడు తన బాధను, అనుభవాలను పంచుకోవడానికి ఆ కథాకథనం తోడ్పడుతుందని అనుకున్నానేమో! కథకుడి కంఠస్వరం కూడా అందుకు అనుకూలంగా దోహదపడి ఉండవచ్చు.

కథకుడు నేను కాదు. ఒక విధంగా మా ఊరితో పరిచయం ఉన్న నేను, అక్కడి దాయాది అయిన వీరన్న జీవితంతో పరిచయం ఉన్న నేను. ఈ కథలోని 'అంగడి సుబ్బరాయుడు' మరో పాత్ర. మునిరెడ్డి- వీరన్న భార్య రామలక్షుమ్మ- ఇతర చిన్నచిన్న పాత్రలు కల్పిత పాత్రలు మాత్రమే. అయితే అట్లాంటివారిని గ్రామాల్లో మనం చూడవచ్చు. ముఖ్యంగా అంగడి సుబ్బరాయుడు వంటి భూదాహార్తులను, రుణదాతలను రాయలసీమ పల్లెటూళ్లలోనేకాదు, ఆదివాసీ ప్రాంతాల్లో సైతం గుర్తించవచ్చు.

వీరన్న మా దాయాది అని చెప్పాను. కథానికలోని ఆయనది అసలు పేరు కాదు మార్చిన పేరు. ఆయన ఇప్పుడు లేరు. నమ్ముకున్న నేల రాయడానికి, ఆ కథావస్తువును ఎన్నుకోవటానికి

కేంద్రబిందువు వీరన్నే. భూమిని కోల్పోయి పారిశ్రామిక కార్మికుడిగా మారిన ఒకప్పటి వీరారెడ్డి. నమ్ముకున్న నేలను రాయడానికి బహుశా ఐదారునెలల కిందట స్వయంగా నేను వీరన్న ఇంటికి వెళ్లినప్పుడు కథలో వర్ణించిన ఆ ఇంటి పరిసరాలను చూసినప్పుడు తీరని వ్యథకు గురయ్యాను. తాను స్వయంగా చెప్పిన తన కథ నన్ను నిలువునా దహించివేసింది. నమ్ముకున్న వృత్తి కూడు పెట్టలేనప్పుడు మనిషి ఎంతగా పతనమవుతాడో అని తెగ బాధపడ్డాను. నేను ప్రొద్దుటూరులో హైస్కూలు విద్యార్థిగా ఉన్నప్పుడు- 1952-55 మధ్య చేనేత వృత్తిలో వచ్చిన ఆటుపోట్ల సందర్భం లో కొన్ని కుటుంబాలు ముఖ్యంగా స్త్రీలు ఎంతటి పతనావస్థకు గురికాబడ్డారో అప్పటి ఆ వృత్తికి సంబంధించిన బాల్యమిత్రుల ద్వారా విని తల్లడిల్లినవాణ్ణి. ఇప్పుడు రైతన్న వంతు వచ్చింది. పురుషుడు కాబట్టి ఇతరుల శీలాన్ని అమ్మే అంగడిలో, దళారిగా వ్యవహరించడానికి సిద్ధపడ్డాడు. మోసాలకు గురై అక్కడ కూడా పనికిరానని తెలుసుకుని సిగ్గుతో చచ్చి మళ్లీ ఊరికి వచ్చి చేతుల కష్టమ్మీద బతకాలని నిర్ణయించుకున్నవాడు. బాకీలు- గవర్నమెంటుకు బాకీ- సుబ్బరాయుడికి బాకీ- కథకుడికి బాకీ- ఈ మొత్తం వ్యవహారమంతా తెలిసి భూమితో తనకు సంబంధం అక్కర్లే దని తెగేసి చెప్పినవాడు. వ్యవసాయాన్ని ఎత్తిపెట్టి వ్యవసాయ పనిముట్లను అమ్మేసుకుని- ఇంటిని కూలివాడి ఇల్లుగా మార్చుకున్నవాడు వీరన్న. వల్లంపాటి వెంకట సుబ్బయ్య- తన విశ్లేషణలో నమ్ముకున్న నేలలో వీరన్నను కథావస్తు పాత్ర (థీమేటిక్ కారెక్టర్)గా వర్ణించాడు. నిజానికి ఆయన గుర్తించినట్లు నమ్ముకున్న నేలకు కేంద్రబిందువు వీరన్నే.

వీరన్నతో ముడిపడిన చిలుకూరు సిమెంటు ఫ్యాక్టరీ సంధ్బంలో కథానిక మొదలవుతుంది. వీరన్న వెంట 20 మందికి పైగా కరువు కాటకాలకు అప్పులపాలై భూమిని అమ్ముకున్న రైతుజనం కరువు భూముల్లో పారిపోతున్న దృశ్యంతో కథ ముగింపుకొస్తుంది. ముగింపు సందర్భంలో కథకుడికి సిమెంటు ఎముకల పొడి కలిసిన ఆకాశం కన్పిస్తుంది. 'ఆ మూల ఎక్కడో ఎర్రగావు,' అనే వాక్యంతో ముగుస్తుంది. జరుగుతున్న అభివృద్ధి నిజమైందేనా అనే స్పందన కలుగజేయాలనే ఉత్తమ పురుష కథకుడి వాక్యం అనుకుంటాను.

నమ్ముకున్న నేలలో కథకుడు దారిపొడవునా చూసిన మెట్టనేల దృశ్యాలు ఊరి గవినిలో ఉన్న వేపచెట్టు- చుట్టూ కట్టిన అరుగు- ఊరి మధ్య దేవళం- ఈ దృశ్యాలు రంగసాయిపురం పరిసరాలవి. రంగసాయిపురం గ్రామంలోనివి. నమ్ముకున్న నేలలోని పొలాలు, తోటలు అక్కడి వాతావరణంలోనివే. (ఇప్పుడు ఆ దృశ్యాల్లో మరిన్ని మార్పులు కన్పిస్తాయి.) వేపచెట్టు కూలి పోయింది- దేవళం స్థానంలో కొత్త దేవళం వెలిసింది. భూములు చాలాభాగం పోగా- దాదాపు ప్రధానవృత్తిగా, ఫ్యాక్టరీలో అశిక్షిత కార్మికులుగా ఉన్నవాళ్లే.

గ్రామీణ వాస్తవికతను అంటే ఒక ఊరును ఆ ఊరిలోని వ్యక్తిగత సాముదాయక ఘర్షణ లను పట్టుకోవడం అంత సులభమైన పనేమీ కాదు. అక్కడి జీవిత సంఘర్షణను చిత్రించడం మరింత కష్టమైన పని. దాన్ని ఒక కథగా మలచడం అంటే నెత్తి మీద వేలాడుతున్న కత్తిని గుర్తుంచు కోవడం. అనుభవం నుంచి, పరిశీలన నుంచి పలకటం. నిజం పలకటం. నమ్ముకున్న నేలలో ఆ పనిని నేనెంతవరకు చేశానో చెప్పవలసింది పాఠకులు, విమర్శకులు.

*'నమ్ముకున్న నేల' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

*27 నవంబర్ 2012*

7

# కాలేరా

## కొలకలూరి ఇనాక్

"ఏమిటి నీ కులం, మతం?"

"లేవు!"

"లేవా? తెలియవా?"

"లేవు!"

"కులమూ, మతమూ లేకుండా బతికే వీలు లేదు!"

"బతుకుతున్నాం!"

అసిస్టెంటు ప్రొఫెసరుగా ఉద్యోగంలో చేరిన సుమితను పిలిపించి వైస్-ఛాన్సలర్ ప్రశ్నిస్తున్నాడు. ఆమె ఉద్యోగంలో చేరి రెండు నెలలయింది. ఉద్యోగానికి సెలెక్ట్ చేసేటప్పుడు వి.సి. ఆమె అప్లికేషన్ ఫారం చూశాడు. అందులో కులం, మతం కాలమ్స్‌లో డేష్ పెట్టి ఉంది. ఆమె యస్.యస్.సి. చూశాడు. ఏమీ తెలియ లేదు.

"మీ తల్లిదండ్రుల పేర్లు?"

"నిధి, లత. వాళ్ల పేర్లను చూసి, విని మీరు వాళ్ల మతంగానీ, మతాలుగానీ తెలుసు కోలేరు."

"ఇంటి పేర్లు?"

"అక్కరలేదు. అవి వాళ్ల కులంగానీ, కులాలు గానీ తెలిపేటట్లుండవు."

"అసలు వాళ్లకు ఇంటిపేర్లున్నాయా?"



*కొలకలూరి ఇనాక్ 1 జులై 1939లో జన్మించారు. వీరి మొదటి కథ 'లోకం పోకడ' 1954లో అచ్చయ్యింది. 10 కథాసంపుటాలు, 9 నవలలు, 10 నాటకాలు సహా దాదాపు 54 గ్రంథాలు రచించారు. వీరి కథలు, కవితలు ఆంగ్ల, తమిళ, హిందీ భాషల్లోకి అనువాదమయ్యాయి. 'ఊరబావి' కథా సంపుటానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి అవార్డు లభించింది. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం కులపతిగా 2001లో పదవీ విరమణ చేశారు.*


చిరునామా

*4-282, న్యూ సర్వోదయా నగర్, మీర్‌పేట, వైశాలినగర్ పోస్ట్, హైదరాబాద్ - 500 072. Ph.: 94402 43433*

"ఉండవచ్చు, లేకపోవచ్చు. నాకు తెలియదు."

"తెలియదా? లేవా?"

"తెలియదు!"

"నీ ఇంటి పేరు?"

"లేదు!"

"ఎందుకు లేదు?"

"పెళ్లయిందాకా ఒక ఇంటి పేరు, పెళ్లయ్యాక మరో ఇంటి పేరు ఉండే ఏర్పాటు నాకిష్టం లేదు. కులాన్ని గుర్తు చేసే ఇంటి పేరు నాకిష్టం లేదు."

"ఇష్టం వేరు, అవసరం వేరు."

"అవసరం కూడా లేదు."

"గుర్తింపుకు ఇంటి పేరు అవసరమే!"

"అక్కరలేదు. సుమితలతానిధి సరిపోతుంది."

"అటెండరు కాఫీ తెచ్చిపెట్టాడు. వి.సి. "తాగు!" అన్నాడు. ఇప్పుడే పంపడు అని ఆమెకు అర్థమయింది. కాఫీ తాగుతూ కాలు మీద కాలేసుకొని, కుర్చీ వెనక్కు చేరబడింది.

విశ్వవిద్యాలయంలో వైస్-ఛాన్సలర్, పదవీ విరమణ స్థాయి మనిషి. అసిస్టెంటు ప్రొఫెసర్. అప్పుడే ఉద్యోగంలో చేరిన ప్రాణి. వయస్సు తేడా నలభై ఏళ్లదాకా ఉంటుంది. ఉద్యోగం సర్వీసు తేడా కూడా అంతే ఉంటుంది.

సాధారణంగా వాళ్ల ఈ సంభాషణ ఆ స్థానంలో సాధ్యంకాదు. ఆ స్థాయిలో కుదరదు. అంత నిర్భయంగా ఉండదు.

"మీ అమ్మానాన్నల ఇళ్ల పేర్లు నాకు తెలుసు!"

"తెలిసి ఎందుకడిగారు?"

"నువ్వు చెబితే తెలుసుకొందామని!"

"తెలిసి నన్నడక్కూడదు. నేను చెప్పకూడదు. వాళ్ల ఇద్దరి ఇళ్ల పేర్లు మన రాష్ట్రంలోని అన్ని కులాల వాళ్లకూ ఇళ్ల పేర్లుగా ఉండి ఉండవచ్చు. కాబట్టి వాళ్లు ఒకే కులంవాళ్లా, వేరువేరు కులాలవాళ్లా, అసలే కులాలవాళ్లు అనీ తెలుసుకోలేరు."

"నాకు వాళ్లు తెలియదు! వాళ్ల ఇళ్లపేర్లూ తెలియవు. కానీ నిన్ను అడగటంవల్ల, వాళ్లు ఒక మతం వాళ్లు కారనీ, ఒక కులంవాళ్లు కారనీ తెలియటంతో పాటు వాళ్ల ఇళ్ల పేర్లు ఆంధ్ర దేశంలో అన్ని కులాలవాళ్లకూ ఇళ్ల పేర్లుగా ఉన్నాయని తెలిసింది."

"నేను చెప్పలేదే!"

"చెప్పావు! నువ్వు చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకో!"

సుమితను అసిస్టెంటు ప్రొఫెసర్ పోస్టుకు సెలెక్ట్ చేసేటప్పుడు, ఆమె కులం, మతం పరిశీలించవలసిన అవసరం రాలేదు. ఆ పోస్టు యస్.సి., ఎస్.టి., బి.సి. కేటగిరీలకు చెందినది కాదు. ఓ.సి. అంటే అదర్ కాస్ట్స్ అన్నారు ఆఫీసువాళ్లు. ఓపెన్ కాంపిటీషన్ అన్నాడు విసి. భారతీయులెవరైనా ఓ.సి. పోస్టుకు కులమత అవసరం లేకుండా సెలెక్ట్ కావచ్చు. సుమిత అలా సెలెక్ట్ అయింది.

సుమిత దరఖాస్తు విలువను బట్టి వి.సి.కి ఆమె అర్హత పట్ల ఆనందం కలిగింది. ఆమె ఇంటర్వ్యూ చేసిన తీరు ఆ ఆనందాన్ని ఇనుమడింపజేసింది. ఆమె అందచందాలే కాదు, వ్యక్తిత్వ లక్షణాలు చూచాయగా కనిపించి సంతోషం కలిగించింది.

“నేన్నిన్నిప్పుడు ఎందుకు పిలిపించి పలకరిస్తున్నానో తెలుసుకోగలవా?”

“తెలుసుకోలేను. కానీ ఊహించగలను!”

“ఊహించు!”

“నాకేమైనా అదనపు బాధ్యతలు అప్పగించాలని, మీరు దయామయులుగా ఉన్నారు కాబట్టి, చూస్తున్నారు అనుకొంటాను.”

“ఎటువంటివి?”

“రీసెర్చి ప్రాజెక్టు, ఫారిన్ ఎసైన్‌మెంటు, మీకు ఓ.ఎస్.డి. ఉమెన్ స్టూడెంట్స్ కౌన్సిలింగ్ ఇన్‌ఛార్జి, హాస్టల్ డిప్యూటీ వార్డెన్ వంటివి ఏవైనా!”

“నువ్వు ఏమి చేయగలవో, నీ ఆసక్తి ఏమిటో తెలిసింది సంతోషం. వీటి విషయం మనస్సులో ఉంచుకుంటాను. కానీ నీ గురించి నాకు వివరాలు తెలియాలి. నువ్వు, మీ కుటుంబంతో హైద్రాబాదులో ఎక్కడ ఉండేదానివి?”

“బేంక్‌కాలనీలో. అక్కడ అన్ని కులాలవాళ్లు, మతాలవాళ్లు ఉండేవాళ్లు. అది అగ్రహారం కాదు. క్రైస్తవ మిషన్ కాంపౌండు కాదు. చార్మినార్ ముస్లిం లొకాలిటీ కాదు. దర్గా కాదు, మసీదు కాదు, గురుద్వార్ కాదు, చర్చి కాదు, వైష్ణవాలయం కాదు, శైవాలయం కాదు. మేం ఉన్న ప్రాంతం వల్ల మీరు నా గురించి ఏమీ కొత్తగా తెలుసుకోలేరు.”

“మీ ఇంట్లో పూజగది ఎక్కడుంది?”

“ఏం పూజగది? భోజనాల గది ఉంది!” వి.సి. పెద్దగా నవ్వాడు. సుమిత చిన్నగా నవ్వింది.

“మీరు ఏ దేవుణ్ణి పూజిస్తారు?”

“ఏ దేవుణ్నీ పూజించం. ఏ గుడికీ మసీదుకూ చర్చికీ పోం. ఏ దేవుడి బొమ్మా మా ఇంట్లో లేదు.”

“మీ అమ్మానాన్నల పెళ్లి పూజారి, మౌల్వి, ఫాదరీ, ఎవరు చేశారు?”

“ఎవరూ చేయలేదు!”

“మరి?”

“నేనూ, నా తమ్ముడు పుట్టాక రిజిస్ట్రారు వాళ్ల మేరేజీ రిజిష్టరు చేశారు.”

“ఏ యూనివర్సిటీ?” వి.సి. పెద్దగా నవ్వాడు. తోడుగా సుమిత నవ్వింది.

“పెళ్లిళ్ల రిజిస్ట్రారు. రిజిస్ట్రారు ఆఫ్ మేరేజెస్,” మళ్లీ నవ్వింది.

“అనుకొన్నాను. ఈ విధంగా కూడా కులం, మతం తెలియలేదు.”

“చిన్నతనం నుంచీ నా కులం, మతం తెలుసుకోవాలని ప్రయత్నించిన వాళ్లకు ఏమీ చెప్పకూడదని, ఏమీ తెలియనీయకూడదని కొన్ని వందలసార్లు బదులాడి ప్రవర్తించి ఉండటం వల్ల ఎవరు ఏమి తెలుసుకోవటానికి ఏమి అడుగుతున్నారో, అర్థమవుతూ రావటం, అందుకు ఏ సమాధానం ఎలా చెప్పాలో తెలిసిపోవటం వల్ల, ఇపుడు వి.సి. అంతవారు కూడా నా దగ్గర్నుంచి ఏమీ తెలుసుకోలేరు, ఏమీ చెప్పను. ఎందుకు చెప్పవంటే, కులం, మతం లేకుండా నేను జీవించాలని కోరుకుంటున్నాను కాబట్టి.”

“జీవించలేవు!”

“జీవించగలను. ఇంతకాలం జీవించాను.”

“తల్లిదండ్రులు పెంచారు కాబట్టి జీవించావు. నీ కాళ్లమీద నువ్వు నిలబడుతున్నావు ఇప్పుడు. ఇక కులమతాల అవసరాలు వరుసబెట్టి వచ్చి నిన్ను వశం చేసుకొంటాయి!”

"చేసుకోవు. వాటికి వశం కాను."

"కులం వల్ల వచ్చే లాభాలు, ప్రయోజనాలు, సంఘజీవిత రక్షణ నీకు లేకుండా పోతాయి."

"అంతేకాదు, కులంవల్ల వచ్చే హింస, పీడ, వేదన కూపస్తమండూక స్థితి, దౌర్జన్యం కూడా ఉండవు. నా మతం గొప్ప అని అన్ని మతాలవాళ్లు అనుకోవటం అన్యాయంగా లేదూ? ఆ అన్యాయం నాకు వద్దు!"

"ఎవరికీ కాని దానివవుతావు!"

"అందరికీ కావలసినదానిని, ఎవరికీ పరిమితం కానిదానిని, విశాల దేశ వారసురాలిని అవుతాను. మతం, ద్వేషం, హింస కాకుండా ఉండాలంటే మతమే వద్దని ఆశతో జీవించేదాన్ని."

"ఆశలన్నీ ఫలించవు."

"ఆశల వల్ల ఆశయాలు పుష్పిస్తాయి. ఫలిస్తాయి. పరిమళం వెదజల్లుతాయి."

"నువ్వు కలలు కంటున్నావు."

"కలలు కనటం చేతకానివాళ్లు భవిష్యత్తును చూడలేరు. ఫలితాలు సాధించలేరు. అసలు ప్రయత్నించలేదు. సుభిక్ష సుందర స్వేచ్ఛాభారతికి వారసులు కాలేరు."

సుమిత స్థిరచిత్తంతో ఉందని వి.సి.కి స్పష్టమయింది. ఆమె అభిప్రాయాలు రాటుదేలి ఉన్నాయి. వాతావరణం కొంచెం వేడెక్కినట్లు కూడా గుర్తించాడు. విశ్వవిద్యాలయం విద్యార్థులు చెప్పింది నేర్చుకొంటారు. చేయమన్నది చేస్తారు. సొంతంగా ఆలోచించటం, కొన్ని స్థిరాభిప్రాయాలు కలిగి ఉండటం, వాటికి కట్టుబడి బ్రతకటం, ఆలోచనలకు ఆచరణరూపం ఇవ్వగలగటం అరుదే! ఇటువంటి స్కాలర్సు దొరికితే మంచి ఆచార్యులకు పండగే. ఆ పండుగ మూడ్లోకి వచ్చాడు. వి.సి. కూల్‌డ్రింకు తెప్పించాడు.

"నాకు బుర్ర వేడెక్కిందనుకొంటున్నారా సార్," అంది సుమిత.

"నీకు కాదు, నాకు," నవ్వేశాడు. వాతావరణం చల్లబడింది.

"నువ్వు హిందూ స్త్రీవి. నాకు తెలిసిపోయింది," అన్నాడు వి.సి.

సుమిత గలగలా నవ్వేసింది. "బొట్టు పెట్టుకొన్నంత మాత్రాన నేను హిందూ స్త్రీని అయి పోతానా?" ప్రశ్నించింది. స్టిక్కరు పీకేసింది. "ఇప్పుడే మత స్త్రీని అవుతాను. క్రైస్తవ స్త్రీనా? ముస్లిం స్త్రీనా? తీసేస్తే పోయే బొట్టు ఆధారంగా నన్ను హిందూ స్త్రీ అంటే అదెంత బలహీనమయిన పునాదో గుర్తించారా? బొట్టు ముఖానికి అందం. నేను భారతీయ స్త్రీని. బొట్టు ఉంటే హిందువు, లేకుంటే క్రైస్తవ, ముస్లిం అనుకోవటం మీ అంతటి మేధావికి భావ్యం కాదు. నేను బొట్టు పెట్టు కుంటాను. అందువల్ల నన్నొక మతానికి చెందినట్లు భావించరాదు."

"నువ్వు బొట్టు పెట్టుకోవటం నీ యిష్టమైతే నువ్వు హిందువ్వు అనుకోవటం మా యిష్టం."

"మీ యిష్టం వాస్తవం కాకపోవచ్చు కదా!"

"అంటే నువ్వు హిందువు కాదంటావా?"

"కాదన్నానా?"

"అంటే ఔనంటావు?"

"ఔనన్నానా?"

ఇద్దరూ నవ్వేశారు.

"నీకే కులం, మతం లేదంటావు?"

"థాంక్స్. కరెక్టుగా చెప్పారు!"

"పునర్జన్మ ఉందా?"

"నాకు తెలియదు!"

"ఉందనుకొంటున్నావా? లేదా?"

"ఏమీ అనుకోలేదు."

"ఏదైనా మునుముందు అనుకొంటావా?"

"ఇప్పుడేమీ చెప్పలేను."

"మనిషి చనిపోతే ఏమవుతాడు? స్వర్గానికో, నరకానికో పోతాడు కదా?"

"కాదు పంచభూతాలలో కలిసిపోతాడు. ప్రకృతి నుంచి తీసుకొన్న అప్పు చెల్లిస్తాడు. స్వర్గ నరకాలే పెద్ద కల్పన! ఈ భయమే ఆశ, మతాల పుట్టుకకు మూలం!"

"పంచభూతాలు మత విషయాలే కదా!"

"భౌతిక విషయాలు."

"ఈ సృష్టికి ఒక కర్త ఉన్నాడా, అతనే దేవుడా?"

"నాకు తెలియదు."

"దేవుడున్నాడా? లేడా?"

"లేనివాణ్ణి నేను సృష్టించలేను. ఉన్నవాణ్ణి నేను చూపలేను. అందువల్ల నాకు తెలియదు."

"నాకు మతం లేదంటే, దేవుడు లేడనే అర్థంకాని నాకు తెలియదని కాదుకదా! మతం వేరు, దేవుడు వేరు కాదుకదా! రాముడు, కృష్ణుడు, క్రీస్తు అల్లా వేరు, హిందూ, క్రైస్తవ, ఇస్లాం వేరు కాదు కదా!"

"సార్ మీరు అనుభవజ్ఞులు. మీకు నేను ఇప్పుడు సరయిన సమాధానం చెప్పలేనని నాకు తెలుస్తూనే ఉంది. నేర్చుకోవలసింది చాలా ఉంది కూడా. కాని మతాలు మనుష్యుల్ని విడదీయటం, ఘర్షణలు, కలహాలు, హత్యలు, యుద్ధాలు, శత్రుత్వం కల్పించటం ఘోరం కదా! అటువంటి మతం మనిషికి లేకపోతేనే మంచిది."

"ఏ మతమూ నిన్ను చేరదీయదు."

"ఏ మతమూ నాకు వద్దు! ఏ మతం పీడా నాకు వద్దు!"

"ఏ మతరక్షణా నీకుండదు. అన్ని మతాలూ నిన్ను వెలివేస్తాయి."

"మనుషులు అందరూ నన్ను ఆదుకొంటారు!"

"మతం లేని మనుషులుండరు."

"మత ప్రమేయం లేని మనుషులున్నారు."

"నాస్తికులు దుర్మార్గులు."

"దుర్మార్గం ఆస్తిక నాస్తిక సంబంధం లేనిది."

"ఆస్తికులు సన్మార్గులు."

"ఆస్తికులే సన్మార్గులు, నాస్తికులే దుర్మార్గులు కారు."

"నువ్వు నాస్తికురాలివా?"

"ఏ మతమూ లేనిదాన్ని."

"ఏ దేవుడూ లేనిదానివి కావు కదా!"

"ఏ మతమూ లేనిదాన్ని."

''దేవుణ్ణి గూర్చి?''

''నాకు తెలియదు!''

''మతం లేదంటే దేవుడు లేడన్నట్లే.''

''కాదు.''

సుమిత కళ్లల్లో నీళ్లు తిరిగాయి. టేబిల్ మీద ఉన్న గ్లాసు తీసుకొని నీళ్లు తాగింది. కర్చీఫ్‌తో మూతీ కళ్లూ తుడుచుకొంది.

''నీకు పెళ్లి కాలేదు. కరెక్ట్?''

''కరెక్ట్!''

''పెళ్లి చేసుకొంటావా?''

''చేసుకుంటాను.''

''ఏ కులం, ఏ మతం వ్యక్తిని?''

''నాలాంటి వాడిని. ఏ కులం, ఏ మతం లేనివాడిని.''

''దొరుకుతారా?''

''దొరకవచ్చు!''

''దొరక్కపోతే?''

''పెళ్లి చేసుకోను.''

''ష్యూర్?''

''గన్‌షాట్!''

వి.సి. నవ్వాడు. ఆ మీసాల వెనుక ఏదో మోసమున్నట్లు సుమిత పసిగట్టింది. ''నేను మిమ్మల్ని ఏమయినా అడిగేదా? సార్,'' అంది.

''నువ్వు అడుగుదువుగానీ ముందీ మాట చెప్పు! నీకు భర్త కాదగ్గ అన్ని అర్హతలు పుష్కలంగా ఉండి, కులమతాలున్న యువకుణ్ణి...''

''పెళ్లాడలేను.''

''కులమతాలు లేని, ఏ అర్హతలూ లేని యువకుణ్ణి...''

''పెళ్లి చేసుకోను. అర్హతలూ ఉండాలి. ఆదర్శ జీవితమూ ఉండాలి.''

''దొరకడు. దొరకడనుకో!''

''చెప్పాను కదా, చేసుకోను.''

''నన్నేదో అడుగుతానన్నావ్?''

''అడుగుతున్నాను. నన్ను కోడలిగా చేసుకోవాలని ఉంటే మీ కొడుకు ఏం చేస్తున్నాడో చెప్పండి.''

''నాకు పెళ్లి కాలేదు.''

''సారీ!''

వి.సి. పెద్దగా నవ్వాడు. ''ఇందులో నువ్వు సారీ చెప్పవలసింది ఏమీలేదు. నా బంధువులకు ఎవరికన్నా సంబంధం చూస్తున్నానుకొంటున్నావేమో అదేం కాదు.''

''మన్నించాలి! మరి నన్నెందుకు ఇంతగా ప్రశ్నిస్తున్నారు?''

''నువ్వు అరుదైన వ్యక్తివి. అదే కారణం!''

''థాంక్స్ సర్!''

"నా మతం ఏమనుకొంటున్నారు మీరు?"

"హిందువు!"

"కులం?"

"చాలామంది చాలా కులాలు మీకు అంటగడుతున్నారు."

"ఒక్క కులం అని కచ్చితంగా చెప్పలేకుండా ఉన్నారు. అవునా?"

"అవును."

"అన్ని కులాలు ఒక్క మనిషికి ఉండవు కాబట్టి ఏ కులమూ కానట్టే, ఏ కులమూ లేనట్టేనా?"

"తెలియనట్లు!"

"నీకు అన్ని అర్హతలు, యోగ్యతలు ఉన్న భర్తే దొరికాడనుకో, పుట్టిన పిల్లలకు ఏ కులం, ఏ మతం చెబుతావు?"

"చెప్పను!"

"వాళ్లు ఒక కులం, మతం కోరుకొంటే?"

"వాటి అనర్థాలు వివరిస్తాను. కోరవద్దని చెబుతాను."

"అయినా వాళ్లొక కులం, మతం స్వీకరిస్తే?"

"మా పెంపకంలో లోపం గుర్తిస్తాం!"

"గుర్తించి?"

"వాళ్ల స్వేచ్ఛను అంగీకరిస్తాం!"

"కాదు, వాళ్ల స్వేచ్ఛకు సాఫల్యం."

"మీ తల్లిదండ్రులకు కులమతాలు లేవు. మీకు లేవు. మీ పిల్లలకు అవి ఉంటే మీ పరాజయమే!"

"మా పిల్లలకు కులమతాలు ఉండవు."

"ఏమిటి గ్యారంటీ?"

"మా మీద, మా పెంపకం మీద విశ్వాసం!"

"నలుగురితో కలిసి, నలుగురూ నడిచే బాటలో నలుగురులాగా, మంచో చెడో కుల మతాలు అంగీకరించి జీవించటం సుఖం కదా!"

"నాకు కులమతాలు లేకపోవటం వల్ల, నా గురించి నేను స్పష్టంగా వి.సి. అంతటి విజ్ఞుల ఎదుట ఇంతసేపు చెప్పుకోలిగే ప్రయోజనం కలిగింది. కూర్చునే అదృష్టం లభించింది. వి.సి.ని అంచనా వేసే అవకాశం కలిగింది. వి.సి. కూడా నాలాగే కులమతాలకు అతీతంగా జీవించాలని ఆశించే అద్భుతమూర్తి అనీ అర్థమయింది. నేను అందరిలాంటిదాన్ని అయితే మీ దగ్గర ఇలా కూర్చునే అదృష్టం కలిగేది కాదు."

"కులమతాలు రక్షణ కదా మనిషికి?"

"కులం హెచ్చుతగ్గులకు, మతం విద్వేషాలకు మూలం కాకుంటే బాగానే ఉండేది. అవి మనుష్యుల్ని వేరు చేయటానికి, కొట్టుకు చావటానికి ప్రధాన కారణాలు కాకుండాఉంటే బాగానే ఉండేది. ఆముష్మికంగా ఏం మేలు జరుగుతుందో తెలియదు కాని, ఐహికంగా కష్టాలకు, పరా జయాలకు ప్రాణప్రతిష్ట చేస్తున్నాయి. మనిషికీ మనిషికీ మధ్య ఉండవలసిన సహజీవన సూత్రానికి మనిషెత్తు అగ్నిగుండంగా మారాయి. కులమతాలు మనుష్యుల్ని, సమాజాన్ని విడదీసి, అంతరాలు

ఏర్పరచి, ఒకరికొకరు కాకుండా చేసి, ఓర్వలేని స్థితిని, చంపుకునే పరిస్థితిని కల్పించి, అభివృద్ధి జరక్కుండా చేసి, సుఖశాంతుల్ని భగ్నం చేసి ప్రపంచాన్ని ప్రమాదంలో ముంచుతున్నాయి. మతాల పీడతోనే ప్రపంచదేశాలు భగ్గుమంటుంటే, అదనంగా కులాలు భారతీయ సమాజ చైతన్యాన్ని బూడిద కావిస్తున్నాయి. ప్రపంచ నాగరికతకు మార్గనిర్దేశం భారతదేశం చేసిందన్న నాటి గర్వం పొందే భారతీయులు నేడు అధోగతికి, ఆకలికి, పేదతనానికి, బానిసతనానికి, దైన్యానికి, పతనానికి బలికావటం కులం వల్ల కాదా సార్! చచ్చిన తరువాతి స్వర్గం కోసం బతికి ఉన్న మనుష్యుల్ని చంపుకునేవి ఏం మతాలు? మనుష్యుల్ని హెచ్చుతగ్గుల దొంతరల్లోకి కుదించి వ్యక్తివికాసం, వ్యవస్థ విజయం నియంత్రించేవి, నిర్దయగా శపించేవి, కఠినంగా శాసించేవి ఏం కులాలు? ఇవి ఉండటం కంటే లేకపోవటమే దేశశ్రేయస్సుకు, ప్రజాభ్యుదయానికి, సుస్థిర జీవనానికి, సుఖమయ సమాజానికి మంచిది. ఇన్ని విషయాలు అందరికీ తెలిసి కూడా నలుగురులాగా బ్రతికిపోతారు. అదే బాగుందనుకొంటారు. వాటికి అతీతంగా జీవిస్తే ఎంత ఆనందమో గుర్తించా రంటే సంఘం బాగుపడుతుంది. మనిషి విజయుడౌతాడు.''

ఆమె ముఖం చూసి, తల పంకించి నీళ్లగ్లాసు అందించాడు వి.సి.

వి.సి.ని మెచ్చుకోలుగా చూసి సంతోషంగా నీళ్లు తాగి, ''థాంక్స్,'' అంది. నాలుగు ఫేన్లు వేగంగా తిరుగుతున్నాయి. ఎ.సి. బాగా పనిచేస్తూ ఉంది. అయినా సుమిత చెమట తుడుచు కోసాగింది.

వి.సి. ఏమీ మాట్లాడకుండా, ఫైల్సు చూసుకోవటం మొదలుపెట్టాడు. తాను కూర్చునే ఉండాలో, వెళ్లిపోవాలో తెలియక తికమకపడుతూ ఉంది. పొమ్మనలేదు. పొగబెట్టలేదు. ఉండ మనలేదు. పని పురమాయించలేదు. 'నేను పోవచ్చునా?' అని అడుగుదామనుకొన్నప్పుడు, 'కూర్చో' అన్నాడు. సుమిత కదలకుండా కూర్చుంది. చెమట తుడుచుకొంటూనే ఉంది.

''మీ అమ్మానాన్నలకు కులమతాలు లేనంతమాత్రాన నీకూ లేకుండాపోవాలని రూలేం లేదు.''

''ఆ చెట్టుకు మరో కాయ కాస్తుందా సార్?''

''మీ అమ్మానాన్నలు అలా జీవించడానికి వాళ్ల కారణాలు వాళ్లకున్నాయి. నువ్విలా జీవించ టానికి బదులుగా, నువ్వు స్వేచ్ఛాజీవివి. నువ్వు నీ పిల్లలకు స్వేచ్ఛనిస్తానన్నావు. నీ స్వేచ్ఛతో నువ్వు మీ తల్లిదండ్రుల కంటే భిన్నంగా జీవించవచ్చు కదా!''

''నేను వాళ్ల బిడ్డని. వాళ్ల ప్రతిబింబాన్ని. నా రక్తంలో, నా రూపంలో, నా వ్యక్తిత్వంలో వాళ్లే ఉన్నారు. వాళ్లు లేకుండా నేను లేను. వాళ్లే నేను, వాళ్ల వారసత్వమే నేను. వాళ్లకంటే నేను భిన్నం కాదు. నాకంటే నా పిల్లలు భిన్నం కాదు. వాళ్ల మార్గమే జీవన విధానమే నావి.''

''ఇవి బానిసత్వం, గుడ్డి అనుకరణ, అంధవిశ్వాసం మూలంగా ఏర్పడ్డ భావాలు కావా?''

''కావు.''

''తల్లిదండ్రులకు బానిసవు కావా?''

''కాను.''

''కులమతాలకు అతీతంగా జీవించాలనుకొనే నీకు నీ సొంత అభిప్రాయాలున్నాయా? మీ అమ్మానాన్నలవి కాకుండా నీ సొంత ఆలోచనలు ఏమీ లేవా?''

''వేరువేరు కులాలకు, మతాలకు చెందిన యువతీయువకులు పెళ్లి చేసుకొంటే, సమాజ శ్రేయస్సు దృష్టిలో మంచిదే కదా! సమాజశ్రేయస్సంటే తెలివైన పిల్లలు సమాజానికి లభించటం కూడా కదా?'' అడిగింది సుమిత.

"మంచిదే!"

"రెండు కులాలకు, రెండు మతాలకు చెందిన వాళ్ల సంతానానికి ఏ కులం, ఏ మతం ఉండాలి?"

"తండ్రివి!"

"అటువంటి సందర్భంలో కులాంతర, మతాంతర వివాహాల ప్రయోజనం ఏముంది? ఏమీలేదు. ప్రయోజనం ఉండాలంటే ఈ నూత్న భారతీయులు కులమతాలు లేనివాళ్లుగా పెరగాలి!"

"ఇదొక కొత్త జాతి. కులమతాలు లేని జాతి ఏర్పడుతుంది. కులమతాలున్న జాతుల్లాగా!"

"ఈ జాతి తేజస్సంపన్నంగా ఉంటుందని మేధావులు, ఆలోచనాపరులు చెబుతున్నారు కదా!"

"చెబుతున్నారు!"

"ఈ తేజస్సంపన్న జాతి మిగతా జాతుల కన్నా విశిష్టంగా ఉండటం వల్ల, అందరూ వీళ్ల లాగా వైశిష్ట్యం పొందటానికి, తమ దృక్పథం జీవన విధానం మార్చుకోవచ్చు కదా!"

"మార్చుకోవచ్చు!"

"ఒకనాటికి ఈ జాతి సువిశాల భారతదేశమంతటా వ్యాపించవచ్చు. దేశం సుసంపన్నం కావచ్చు. సుభిక్షం కావచ్చు. విజ్ఞానం వెల్లివిరియవచ్చు. అజ్ఞానం, అవిద్య, ఆత్మన్యూనత అంత రించవచ్చు. విశిష్టజాతిగా భారతీయత వెలుగొందవచ్చు. విశ్వపౌరుడుగా భారతీయుడు విఖ్యాతి నార్జించవచ్చు. విశేష శ్రమశక్తిగా విజ్ఞానిగా విశ్వమార్గదర్శిగా భారతీయుడు రూపొందవచ్చు."

"అది కమ్మని కల!"

"అది ఎప్పటికయినా వాస్తవం! కల శ్రమిస్తే వాస్తవం!"

"అందాకా నీలాంటివాళ్లు దుఃఖ సముద్రాలు, ఒంటరి ఎడారులు, వేదనారణ్యాలు, ప్రమాదాగ్నులు, పరాభవ దౌష్ట్యాలు దాటిపోవలసి ఉంటుంది."

"ఆ ఇబ్బందులు ఒకనాటి కులమతాతీత జీవనులకు నిజమే. ఇప్పుడు ఆ ఇబ్బందులు లేకపోగా గుర్తింపు, దానివల్ల లాభం, ప్రయోజనం, ప్రమోదం లభిస్తున్నాయి. మీరిచ్చిన నా ఉద్యోగం అందుకు నిదర్శనం."

"నిజమే, కులమతాలకు దూరంగా జీవించే అదృష్టం పూర్వంలేదు. ఇప్పుడది మీకు కలగవచ్చు. నీకు అన్నివిధాలా తగిన భర్త లభించి నువ్వు, నీ భర్త సుఖంగా, మీవంటి పిల్లలతో కలకాలం వర్ధిల్లే అదృష్టం, అవకాశం, సత్సందర్భం, సమన్వయ జీవనం, ఆదర్శ సౌందర్యం సమకూరాలని కోరుతున్నాను. ఆశిస్తున్నాను, ఆశీర్వదిస్తున్నాను."

"థాంక్స్ సర్!"

"ఆరోజుల్లో నాకు ధైర్యసాహసాలున్న నావంటి దృక్పథం గల యోగ్యురాలు దొరకలేదు."

"అందువల్ల మీరు పెళ్లి చేసుకోలేదా?"

వి.సి. ఆవేదనగా దుఃఖిస్తాడనుకొంది సుమిత. ఆ సంతోషంలో విషాదం కోసం పరకా యించి చూసింది. విషాదం లేదు.

"మీవంటి పెద్దల ఆశీర్వాదం వల్ల మావంటి వారికి మంచి, తగిన, అన్ని అర్హతలున్న యోగ్యులైన వాళ్లు జతగూడి సంసారాలు ఏర్పడతాయని నాకు అనతికాలంలోనే పెళ్లి అవు తుందని నమ్ముతున్నాను సార్!"

"శుభం."

''కులమతాలు ఉండని భవిష్యత్సమాజం రూపుదాల్చటానికి వర్తమాన సమాజం సర్వం సమకూరుస్తుందని నమ్ముతున్నాను. మనిషి మతాన్ని, మనదేశంలో కులాన్ని కూడా అధిగమించిన నాడు విశ్వం, జనం మరణానంతరం కోరుకొనే అద్భుత స్వర్గం అవనికి దిగిరావటం స్పష్టంగా చూడగలుగుతుంది.''

''స్వర్గం మతభావన!''

''కాదు స్వేచ్ఛాభావన! సుఖభావన, సౌందర్యభావన, సమన్వయ భావన.''

''శుభం.''

వి.సి. లేచి నిలబడ్డాడు. సుమిత టక్కున లేచింది.

అతను ముందు నడిచి వాకిలి తీసి నిలబడ్డాడు. ఆమె నమస్కరించి వెలుపలికి వచ్చింది.

వెలుపల ఏ.సి. లేక వేడిగా ఉంది. సుమిత చుట్టూ చూస్తూ నడుస్తూ ఉంది.

లోపల చల్లటి కుర్చీలో వి.సి. కూర్చుని చుట్టూ పరికిస్తున్నాడు.

*ప్రజాసాహితి, మే 2008*

నేపథ్యం

## కులమతాల ప్రసక్తి లేని జీవితాన్ని కోరుకునే
# కాలేరా

***రచయితగా కులమతాలను కాదని, స్వేచ్ఛా మానవుల్ని కోరుకొనే నేను***
***మనిషిగా ఏ స్థితిలో ఉన్నాను? పూజలు, పునస్కారాలు చేయను.***
***గుళ్లూ గోపురాల చుట్టూ తిరగను. దేవుణ్ణి భక్తితో ఆరాధించను.***
***మనిషిని ప్రేమతో అభిమానిస్తాను.***
***కులం, మతం, ధనం, వయస్సు సంబంధంలేని పెళ్లి చేసుకున్నాను.***

నాకు కులం, మతం ఇష్టం కావు. కులం కొందరికి వరం. కొందరికి శాపం.

నాకు కులం శాపం.

మతం మనుషుల్ని వేరుచేయటం నాకు బాధ కలిగిస్తుంది.

మనుషులందరితో కలిసి ఉండటం కోసం మతం వద్దనుకోవటం నాకు బాల్యంలోని ఆశ. క్రమంగా రూపం దిద్దుకొంది.

నాకు ఒక కులం ఉంది. మతం ఉంది. వాటిని వద్దనుకోవటమూ ఉంది.

కాని కొందరు నన్నొక కులంతో చూస్తారు. మతంతో ముడిపెడతారు.

నేనేం చేయగలను?

నేను కులం రొంపిలోకి దిగను. నన్ను అన్ని కులాలవాళ్లు అందులోకి లాగుతుంటారు.

నేను ప్రతిఘటిస్తూనే ఉంటాను.

నాకు మత మాంద్యం ఇష్టం ఉండదు. నేను ఆలోచించి వదులుకొన్న సంకెళ్లు బాల్యంలోని అనుభూతి సందర్భాలతో ముడిపడి ఉన్నాయి.

నేను వద్దనుకొనే కులం, మతం నన్ను వెంటాడుతూనే ఉన్నాయి.

నేను మతం మార్చుకోగలను కానీ కులం మార్చుకోలేను.

కులం వల్ల పీడింపబడుతున్న వాళ్ల మీద నాకు ఆత్మీయత ఉంది.

మతం వల్ల హింసితులవుతున్న వాళ్ల గూర్చి దిగులు, వ్యథ ఉన్నాయి.

ఇవి నా సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. అందువల్ల కులమతాల పట్ల ప్రేమ చూపుతున్నవాణ్ణి కాను.

మనిషి పట్ల దుఃఖం పొందుతున్నవాణ్ణి.

రచయితగా కులమతాలను కాదని, స్వేచ్ఛా మానవుల్ని కోరుకొనే నేను మనిషిగా ఏ స్థితిలో ఉన్నాను?

పూజలు, పునస్కారాలు చేయను.

గుళ్లూ గోపురాల చుట్టూ తిరగను.

దేవుణ్ణి భక్తితో ఆరాధించను.

మనిషిని ప్రేమతో అభిమానిస్తాను.

కులం, మతం, ధనం, వయస్సు సంబంధంలేని పెళ్లి చేసుకున్నాను.

నా భార్య కులం రాయాలా, నా కులం రాయాలా అని ఏ కులమూ రాయలేదు, నా పెద్ద కూతురు స్కూలు రికార్డులో.

నా పిల్లలు కులమత ప్రసక్తిలేని జీవితం జీవించాలని నేను భావించాను. అలా పెంచాను.

ఇప్పటికీ నా పెద్దకూతురు కులం సర్టిఫికెట్టు లేదు.

కులం సర్టిఫికెట్టు లేకుండా వాళ్లు ఉద్యోగులు కాగలగడం నా అభీష్టం.

నా పెద్దకూతురిది కూడా నా పెళ్లి వంటి పెళ్లే!

ఆమె గడుగ్గాయి. కాలేరా కథలోని సుమిత వంటిది.

ఆమె తన నలభై ఏళ్లలో 'కులం' సందర్భంలో ఎదుర్కొన్న సమస్యలు ఇట్టే సునాయాసంగా అధిగమించింది.

ఈ కథ నిజానికి ఆమె కథే!

కాని నేను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్‌గా ఉన్నప్పుడు ఒక అమ్మాయి- నా పెద్దకూతుర్ని గుర్తుకు తెచ్చింది.

ఈ గడుగ్గాయి కూడా చురుకైంది, తెలివైంది, మాటకారి. నా కూతురు కంటే ఇరవై ఏళ్లు చిన్నది. మనుమరాలు వంటిది.

ఉద్యోగం కావాలని వచ్చింది.

అర్హతలు చెప్పింది. లెక్చరరు కావటానికి అన్ని అర్హతలున్నాయి.

ఆ అమ్మాయి యస్.సి.నో, యస్.టి.నో, బి.సి.నో అయితే ఉద్యోగం వచ్చే అవకాశం ఉంది.

అందుకోసం కులమడిగాను.

గడుగ్గాయి గలగలా నవ్వింది.

"మీరు కూడా నన్ను కులమడుగుతున్నారా?" అంది.

ఆ 'కూడా'ని చాలా వత్తింది. ఈ అమ్మాయికి నా గురించి చాలా తెలుసు అని నాకు అనిపించింది.

ఆమెను కులం అడిగింది ఇనాక్ కాదు. ఇనాక్ అడగడు. వి.సి. అడిగాడు. సహాయం చేసే అవకాశం చూడటానికే అడిగాడు. ఇనాక్ వేరు, వి.సి. వేరు అని ఆమె అనుకోవటం లేదు. మనిషిని, పదవిని కలిపేసింది. వృత్తిని, ప్రవృత్తిని మిళితం చేసింది.

అప్పట్నుంచి ఆమెతో చాలాసేపు సంభాషణ కొనసాగింది.

నేను ఎంతసేపు మాట్లాడినా తన కులం నాకు తెలియకుండా చేసే ప్రయత్నం గట్టిగా చేసింది.

ఆమె చేసే ఆ ప్రయత్నం వల్ల కూడా నాకు చాలా ఇష్టమయింది ఆ యువతి.

నీ కులం నాకు తెలుసు, నీ మతం తెలుసు అని చెప్పాను.

'వాక్యానికి వాక్యానికి మధ్య హృదయముంటుంది. మాటకీ మాటకీ నడుమ మనస్సు ఉంటుంది. మనస్సూ హృదయం మనిషిని పట్టి ఇస్తాయి. నువ్వు పట్టుబడ్డావు.'

'నాకు తెలివి లేదన్నమాట,' అంది. 'చాలా తెలివి ఉంది,' అన్నాను.

'ఎలాగో తెలియదే' అంది. 'నువ్వు కులం, మతం చెప్పకుండానే చెప్పావు. చెప్పాలనే సంకల్పంతో చెప్పినట్లు కాకుండా చెప్పావో, చెప్పకూడదనే నిశ్చయంతో ఉండి కూడా నీకు తెలియ కుండానే చెప్పేశావో, కానీ చెప్పావు,' అన్నాను.

దిక్కులు చూస్తూ కూర్చుంది.

'ఎందుకు కులం, మతం దాచుకోవాలనుకొన్నావు.'

'మీకిష్టం కావు కాబట్టి.'

'నిజమే?'

'మీరు పుట్టిం దగ్గర్నుంచి ఇప్పటిదాకా మీ కులం వల్ల, మతం వల్ల అవమానాలు పొందుతూ వచ్చారు. కాబట్టి, మీ కులం అంటే మీకు కోపం ఉంటుందని భావించాను. నా కులం, మతం మీకు తెలియనీయకుండా నా అర్హతల వల్ల నాకు రాదగ్గ ఉద్యోగం పొందాలని వచ్చాను. అందువల్ల నాకు కులం, మతం లేవన్నాను. లేవన్నాను కానీ లేకపోలేదు. లేకపోతే బాగుణ్ణు అని మాత్రం నాకు అనిపిస్తూ ఉంది,' అంది.

'నాకు శత్రువులు లేరు,' అన్నాను.

'తెలుసు,' అది.

'నేను వి.సి.కి శత్రువును అని ఎవరైనా అనుకొంటే అది వాళ్ల అదృష్టం.'

'నిజమే.'

'నేను ఏ కులాన్ని, మతాన్ని, కులస్థుల్ని, మతస్థుల్ని ద్వేషించను. మనిషిని ద్వేషించను. ప్రేమిస్తాను. హింసించను, సహాయం చేస్తాను. ఏమీ మేలు చేయలేకపోతే ఊరుకొంటాను. కీడు చేయను. నిన్ను ఫలానా కులం, మతం అనుకొని, అందువల్ల హాని చేయను.'

'అయితే మేలు చేయండి.'

'నాకా అదృష్టం ఉండాలి కదా!'

'మీకదృష్టమా?' బిత్తరపోయి అడిగింది.

'మేలు చేసే అవకాశం దొరకటం అదృష్టమే కదా,' అన్నాను.

అటూ ఇటూ తత్తరబిత్తరగా చూసింది. కళ్లు గిరగిరా తిప్పింది. ఇప్పుడంది అసలు గడుగ్గాయి మాట.

'నాకు ఉద్యోగం ఇస్తే, మీకు మా కులం మీద, మతం మీద కోపం లేదని ఋజువు అవుతుంది. ఇవ్వకపోతే, మీరూ అందరిలాంటి సత్పురుషులే అవుతారు,' అంది.

ఆ అమ్మాయి నాకు ఇప్పుడు నచ్చింది. నన్నెంతగా ఇరకాటంలో పెట్టిందో మీకర్థమయి ఉంటుంది. అందువల్ల కూడా బాగా ఇష్టం కలిగింది.

నన్ను హింసించిన వాళ్లను కూడా నేను ప్రేమిస్తానని ఆ అమ్మాయికి అప్పుడే అర్థమయి పోయి ఉంటుంది.

నా జీవితం నేపథ్యం, నా పెద్దకూతురు కులం పేరు లేని సర్టిఫికెట్లతో జీవించటం, ఈ కాలేరా కథకు మూలం.

కానీ, ఇందుకు ప్రేరణ ఆ అమ్మాయి.

గుండెల నిండా ఉండే చాలా విషయాలు రచనారూపం పొందటానికి ఏదో సందర్భం కలిసి రావలసి ఉంటుంది.

ఆ సందర్భం, ఈ అమ్మాయి.

కాలేరా అంటే ఏం కాలేరా అని ప్రశ్న. కులం, మతం ప్రమేయం లేని మనుషులు జీవులు కాలేరా అని ప్రశ్న. విస్తృతి.

కారు, లేరు, రారు అంటే దిగులు.

అవుతారు అంటే ఆనందం.

ఇలా జీవించినందుకు, ఇటువంటి కథ రాసినందుకు 'అవుతారు' అనే ఆనందకర వాక్యం మీరు వినిపిస్తే, మీకు ధన్యవాదాలు.

*'కాలేరా' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

*7 నవంబర్ 2012*

8



*డి. వెంకట్రామయ్య 20 ఆగస్ట్ 1941న కృష్ణా జిల్లాలో జన్మించారు. 1968 నుంచి కథలు రాస్తున్నారు. 80 కథలు రాశారు. 2 కథాసంపుటాలు వెలువరించారు. హిందీ నుంచి 3 నవలలు, 30 కథలు అనువాదం చేశారు. వివిధ రేడియో నాటికలు రాసి, ఆకాశవాణిలో వినిపించారు. 1970ల నాటి న్యూ వేవ్ రచయితలకు మార్గదర్శకులు. మూడు దశాబ్దాల పాటు రేడియో జర్నలిస్టుగా వార్తలు చదవటంతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.*

**చిరునామా**
*304, ధనుంజయ రెసిడెన్సీ,*
*ఈనాడు కాలని, కుకట్‌పల్లి,*
*హైదరాబాద్-500 072*
*Ph.: 040-2306 7067*

# డైనింగ్ టేబుల్

## డి. వెంకట్రామయ్య

ఎండ నిప్పులు చెరుగుతోంది.

నిప్పు తొక్కిన కోతుల్లా- కార్లు, బస్సులు, రిక్షాలు, సైకిళ్లూ రొద చేస్తూ రోడ్డు మీద ఉరుకులూ పరుగులూ పెడుతున్నాయి. ఎండకి కార్లో కూర్చున్నవాళ్లూ ఉడుకుతున్నారు. బస్సుల్లో, రిక్షాల్లో, స్కూటర్ల మీద, సైకిళ్ల మీద ఉన్నవాళ్లూ ఉడుకుతున్నారు. ఉస్సురుస్సురంటున్నారు. చెమటలు గక్కుతున్నారు. గొడుగుల్లో, చెప్పుల్లో నడిచేవాళ్లు పరుగులాటి నడక నడుస్తున్నారు.

రోడ్డుపక్క ఐస్‌ఫ్రూట్‌లమ్మే కుర్రాడూ, సోడాలమ్మేవాడూ ఎండ యింకో రెండు గంటలు యిలాగే మండితే బావుండుననుకున్నారు. ఎయిర్ కండిషన్డు హోటళ్లవాళ్లూ కూల్‌డ్రింక్ షాపుల వాళ్లు కూడా ఆ మాటే అనుకున్నారు.

పేవ్‌మెంటు మీద చెప్పులు కుట్టే ముసలాడు- 'పెపంచకంలో పాపం పెరిగిపోనాది; పోగాల మొచ్చినాది; నేకపోతే ఈ ఎండేటి,' అనుకున్నాడు.

ఎయిర్ కండిషన్డు కారులో, షూటింగ్‌కెళ్తున్న సినీతార చలవ కళ్లద్దాల్లోంచి బయటికి చూస్తూ, 'ఎండ బాగా వున్నట్టుందే,' అనుకుంది.

రోజూ మంటల మధ్య నడిచేవాళ్లకీ, రోజూ నిప్పులు మింగేవాళ్లకీ ఎండంటే భయమేముంటుంది?

అలాంటి వాళ్లు నలుగురు- నిప్పులు చెరుగుతున్న ఆ ఎండలో, నిప్పులు పరిచిన ఆ రోడ్డు మీద ఒక పెద్ద డైనింగ్ టేబిల్ మోసుకుపోతున్నారు.

తలమీద గుడ్డలు చుట్టగా చుట్టి, టేబిల్ తలకిందుచేసి, నలుగురూ నాలుగు మూలలు ఎత్తుకున్నారు. చేతులూపుకుంటూ, టేబిల్ బరువు జాగ్రత్తగా బాలెన్స్ చేస్తూ చకచకా నడుస్తున్నారు. ఆ నడక లయ తప్పినా, నలుగురిలో ఎవరు బెసిగినా టేబిల్ పడిపోయే ప్రమాదముంది. కాని వాళ్లకలాంటివి మొయ్యడం అలవాటే.

టేబిల్ వెడల్పు తక్కువగా, పొడుగెక్కువగా వుంది. నాలుగు మూలలా ఏటవాలుగా వున్న టేబిల్ కోళ్లు ఎండలో ధగధగా మెరుస్తున్నాయి. ఆ టేబిల్ మీద కనీసం ఎనిమిదిమంది తేలిగ్గా భోంచెయ్యొచ్చు.

ముందువేపు కుడికొమ్మున కాసిన వీరయ్యకి అలుపొచ్చింది. తెగ రొప్పుతున్నాడు. చెప్పుల్లేని కాళ్లు ఎండకి ఉడుకుతున్న తారురోడ్డుకి అంటుకుపోతున్నాయి. తెగిపోయిన చెప్పులు కుట్టించుకుందామంటే పొద్దున పావలా అడిగారు. పదిహేను పైసలిస్తానన్నాడు. ఎవరూ కుట్ట మన్నారు. చేసేది లేక చెప్పులింట్లో పారేసొచ్చాడు.

"ఏందిరా ఈరయ్యా తింగిరి నడక నడుత్తున్నావ్! బల్ల పడకొడతావా ఏంటి కొంపదీసి," అన్నాడు వెనకపక్క ఎడమ మూలనున్న పానకాలు.

"బల్ల కిందడితే యింకేమన్నా వుందా? బల్లకి గోరంత గీతడిందా సావుకారు సంపేత్తాడు," అని హెచ్చరించాడు వీరయ్యకి ఎడంపక్కనున్న సుబ్బడు.

వీరయ్య ఏమీ మాట్టాడలేదు. ఈ ఎండ అతనికేమీ లెక్కలోనిది కాదు. ఎండలో బరువులు మొయ్యడమూ అతనికి కొత్తకాదు. కాని మండుతున్న ఎండకితోడు నెత్తినున్న బరువుకి తోడు కడుపులో ఆకలి మండుతోంది! నిన్న పొద్దుననగా తిన్న కూడు. నిన్న కూలేమీ దొరకలేదు. రాత్రి మిగిలిన గిద్దెడు నూకల్తోనూ కాసిన జావ పిల్లలకే సరిపోలేదు. తనూ పెళ్లామూ పస్తే. పొద్దు పొడవగానే లేచి బయల్దేరి తిరగ్గా తిరగ్గా యిప్పటికి కూలి దొరికింది.

"ఏందెహె పెళ్లినడకలు నడుత్తున్నారు! ఇట్టా అయితే, అయినట్టే. యింకా అరమైలు దూరముంది, నడవండి నడవండి!" అని కసిరాడు వెనకవేపు కుడికొమ్ము కాసిన గంగరాజు.

ముందున్న యిద్దరూ నడక వేగం పెంచితేగాని, వెనకవాళ్లు వేగం పెంచలేరు. గంగరాజు కసిరింది ముందున్నవాళ్లనే. "నన్నేం చెయ్యమంటావురా, ఇయ్యాల ఈరిగాడు పెళ్లినడకలు నడుత్తున్నాడు. ఆడు అడుగెయ్యంది నేనేం సెయ్యను," అని గునిశాడు సుబ్బడు.

అక్కడికీ వీరయ్య ఏమీ మాట్లాడలేదు. మాట్లాడే వోపిక లేదు. తల్లోంచి కారుతున్న చెమట తుడుచుకుకంటూ, రొప్పుతూ ఉమ్మోసి ఓపిక కూడగట్టుకుని నడక పెంచాడు. దాంతో మిగతా ముగ్గురు కూడా వేగం పెంచారు.

"అద్గదీ అట్టుండాలి. ఇప్పుడు ఏడందుకుంది ఈరయ్యమావకి," అని సరసమాడాడు పానకాలు.

"సరేగానొరే ఈ టేబిల్ కరీదెంతుంటందంటా? వంద రూపాయలుంటందా?" అనడిగాడు గంగరాజు.

"ఓరి ఎర్రిమొకమా, వంద రూపాయలకి ఒక కోడు రాదు. ఈ కర్రెంటనుకున్నా- రోజు వుడ్డు- అయిదొందలకి పైస తక్కువ వుండదు; బొరువు సూడరాదూ; కర్రలాగుందా, ఇనుము నాగుంది సూడు," అన్నాడు సుబ్బడు, తన తెలివితేటల్ని ప్రదర్శిస్తూ.

"ఓర్నాయనో, అయిదొందలే! ఒరే నాకు తెలవకడుగుతానూ, కూడుదినే బల్లకి యింత కరుసెందుకురా!" మళ్లా ఓ ధర్మసందేహమొచ్చింది గంగరాజుకి.

ఈసారి పానకాలందుకున్నాడు- "ఈ టేబులు సేయించినందెవుడనుకున్నావ్... నరిసిమ్మం. నరసిమ్మమంటే ఎవుడనుకున్నావ్. ఆడికి నాలుగు పేక్టరీలుండయ్. ఈ సిటీ మొత్తమ్మీద ఆణ్ణి మించిన సావుకారు లేడు."

"ఎంత సావకారైతే మటుకి, ఆడు తినేదీ అన్నమేగా! ఎండీ బంగారం తినడుగా!" అన్నాడు గంగరాజు.

"ఓరి పిచ్చెదవా, అసుమంటోళ్లు ఏం తింటారో నీకేం తెలుసురా! ఆళ్లింట్లో ఒక పూట తినే తిండి కరీదెడితే నీకూ, నాకూ నెలరోజులు గడుత్తుంది. ఎండి తిన్నా, బంగారం తిన్నా ఆళ్లే తినాల; మనమేటి తింటాం; మట్టి!" అన్నాడు సుబ్బడు.

పానకాలు వేదాంతం మొదలెట్టాడు.

"అది పిచ్చిమాటరా సుబ్బడూ! ఆళ్లు తినేదాళ్లు తింటారు. మనం తినేది మనం తింటాం. ఆళ్లు ఎండీ, బంగారం మింగితే, మనం గంజినీళ్లు తాగుతాం. బెమ్మదేవుడు ఆళ్ల మొకానట్టా రాత్తే, మన మొకానిట్టా రాశాడు. ఆ రాత మారవటం ఎవడి తరమూ కాదు."

వీరయ్యకి ఈ గొడవలేం నచ్చలేదు. పానకాలు వేదాంతమసలు నచ్చలేదు. కడుపు మండు తోంది. ఎదురువాదం మొదలెడదామనుకున్నాడు, కానీ ఓపికలేక ఊరుకుండిపొయ్యాడు. పస్తు లుండటం తనకీ కొత్తమీ కాదు. కానీ ఇవ్వాళెందుకో మరీ నీరసంగా వుంది. 'ఒంటో సత్తువ తగ్గి పోయింది,' అనుకున్నాడు తనలో తాను. మరి కాస్త దూరం నడిచాక, "ఎక్కడ్రా ఈ నరసిమ్మం యిల్లు? గంట నుంచీ నడుతున్నాం, ఎక్కడా అయిపులేదే," అన్నాడు చిరాగ్గా.

"బయల్దేరి పావుగంట కాలేదు అప్పుడే గంటలాగుందేరా నీకు? ఏంటివ్వాళ మరీ జావకారి పోతన్నావ్!" అన్నాడు పానకాలు హేళనగా.

వీరయ్య మారు మాట్టాడలేదు. వెనకడుగువేస్తే ఇలాగే తోటివాళ్లు హేళన చేస్తారని పళ్ల బిగువున, శక్తంతా కూడగట్టుకుని నడుస్తున్నాడు. 'నిజంగా సుబ్బడన్నట్టు ఈ బల్ల ఇనుములాగే వుంది, ఇంత బరువుందేంటి,' అనుకున్నాడు. ఈ బల్ల ఖరీదు అయిదొందలుంటదంట అన్నాడు సుబ్బడు. నాయనో! కూడు తినే బల్ల అంత కరీదా!

మొన్నొకనాడు అన్నాలు తినేవేళ- కోళ్లూడిపోయిన పీటచెక్క కోసమూ, చిరిగిన చాపముక్క కోసమూ, పిల్లలు నలుగురూ పోట్లాడుకుంటే తనకి తిక్కరేగి వాళ్లందర్నీ పట్టుకొని చావగొట్టాడు. కాఫీ హోటల్లో బల్లమీద కాఫీ టిఫినూ తీసుకోడమేగాని- యిట్టాంటి బల్లమీద తనెప్పుడూ భోంచేసి ఎరగడు. 'కుర్చీల్లో కూకుని చాకులూ, గరిటిల్తో తింటారంట- ఎట్టా తింటారో ఏంటో! కోడీ కోడీ కత్తుల్తో, ముళ్ల గరిటిల్తో పీక్కు తినేత్తారంట, ఎట్టా తింటారో!'

"తప్పుకోయెహె కుంటినాయాలా!" వీరయ్య ఉలిక్కిపడ్డాడు. సుబ్బడు ముందు నడుస్తున్న కుంటి ముసలాణ్ణి గద్దించాడు. బక్కగా తోలు కప్పిన బొమికల గూడులా వున్న ఆ ముసలాడు తడబడుతూ పక్కకి తప్పుకున్నాడు.

"ఆ ముసలాడి మీద అంత కోపమెందుకురా పాపం!" అన్నాడు గంగరాజు.

"లేకపోతే ఏంటెహె, అడుక్కునే ఎదవ! బేగి నడవనూ నడవడు; తప్పుకోనూ తప్పుకోడు; ఇందాకట్నించీ అడ్డమొత్తన్నాడు."

వీరయ్యకి అడుక్కునే ముసిలాడి మీద జాలేసింది. సుబ్బడి మీద కోపమొచ్చింది. కానీ ఏమీ అనలేకపోయాడు.

సెంటరొచ్చింది. నాలుగువేపుల్నించీ బస్సులూ, కార్లూ, రిక్షాలూ, సైకిళ్లూ వస్తున్నాయి. పోలీసు చెయ్యడ్డం పెట్టి ఆపేశాడు, ట్రాఫిక్ క్లియరయ్యే వరకూ రోడ్డు దాటటానికి వీల్లేకపోయింది. అక్కడే నిలబడిపోయారు. నిలబడితే మరీ బరువెక్కువైనట్టుంది. పక్కకెళ్లి కాస్సేపు దింపితే బావుండుననుకున్నాడు వీరయ్య. కాని ఆ మాట పైకనలేకపోయాడు.

సెంటర్ దాటి కొంతదూరం నడిచి, కుడిపక్క వీధిలోకి మళ్లాక అప్పుడొచ్చింది నరసింహం యిల్లు. 'హమ్మయ్య!' అనుకుని నిట్టూర్చాడు వీరయ్య! పానకాలు చెప్పినట్టు- నరసింహం ఆ సిటీలోకల్లా ధనవంతుడు కాకపోయినా, బాగా ధనవంతుడే. గేటుకీ యింటికీ వందగజాల దూర ముంది. పెద్ద మేడ. పోర్టికోలో ఆగి మెల్లగా, జాగ్రత్తగా టేబుల్ దింపారు. తలమీద వెయ్యిటన్నుల బరువు తొలగించినట్టయింది వీరయ్యకి.

'హమ్మయ్య!' అని నిట్టూర్చి తల మీద చుట్టిన తుండుగుడ్డ తీసి మొహం తుడుచు కున్నాడు.

లోపల్నించి నౌకరొచ్చి, "టేబుల్ లోపలికి తెమ్మంటన్నారయ్యగారు," అన్నాడు ఆజ్ఞాపిస్తున్న ట్టుగా.

వీరయ్యకి కోపమొచ్చింది. 'లోపలికి తేవాల్సిన పని మాకులేదు; మీరే పెట్టుకోండి,' అందా మనుకున్నాడు. కాని అప్పటికే మిగతా ముగ్గురూ తలొక పక్కనా పట్టుకుని టేబుల్ మెల్లగా లేపారు. "అట్టా నిలువు గుడ్డేసుకుని సూత్తావేంటి, రాయెహె," అని సుబ్బడు కసరటంతో తనూ వెళ్లి ఒక మూల పట్టుకున్నాడు.

టేబుల్ ఏటవాలుగా పట్టుకుని అతి జాగ్రత్తగా గుమ్మాలకి తగలకుండా ఒక పెద్ద హాలు, నాలుగు గదులూ దాటించి, భోజనాల గదిలోకి చేర్చారు. ఆ యిల్లూ ఆ రంగులూ ఆ సోఫాలూ ఆ సామాను చూస్తే వీరయ్యకి కళ్లు తిరిగిపోయాయి. టేబిల్ చుట్టూ అందమైనవి, సరికొత్తవి ఎనిమిది కుర్చీలు కూడా అమర్చారు. ఇప్పటికిప్పుడు ఈ కుర్చీలో కూకుని, ఈ బల్లమీద మాంచి తిండెట్టుకుని, కడుపునిండా తింటే ఎంత బాగుంటది- అనుకున్నాడు వీరయ్య.

డ్రాయింగ్‌రూమ్‌లో సోఫాలో జారగిలబడి, చుట్ట తాగుతూ కూర్చున్న నరసింహం- సిల్కు లాల్చీ జేబులోంచి నాలుగు రూపాయి కాగితాలు తీసి సుబ్బడి చేతికిచ్చాడు. సుబ్బడు తెల్లబోయి, "ఇదేంటి దొరా నాల్రూపాయలా!" అన్నాడు.

"అవున్రా! నలుగురికీ నాలుగు. చాలదా ఏం?" అని ఉరిమాడు నరసింహం. సుబ్బడేమీ బదులు చెప్పలేకపోయాడు.

"కనీసం మనిషికి రూపాయన్నర యివ్వాలి. ఎండలో రెండు మైళ్లు మోసుకొచ్చాం," అన్నాడు వీరయ్య.

"చస్తే యివ్వను. నాల్రూపాయలే ఎక్కువ. నోర్మూసుకుని పొండవతలకి," అన్నాడు నరసింహం.

ఆకలితో కడుపు మండుతున్న వీరయ్యకి కోపంతో యింకా మండింది. ఒకడుగు ముందుకేసి, "అవున్లెండి! మీరెందుకిత్తారు. యివ్వరు... మాలాటోళ్ల నోళ్లు కొట్టకపోతే యింతింత మేడలెట్టా కడతారు, ఇసుమంటి బల్లల మీద కూకుని పూటకి యాభై రూపాయల తిండెక్కడ తింటారు," అన్నాడు.

నరసింహం గభాల్న సోఫాలోంచి లేచివచ్చి చాచికొట్టాడు. ఉంగరాల చేతిదెబ్బకి వీరయ్య అదిరిపోయాడు. కళ్లు బైర్లు కమ్మాయి. పానకాలు గబగబా ముందుకొచ్చి వీరయ్యను పడకుండా పట్టుకున్నాడు. నరసింహం కోపంతో ఊగిపోతూ- "తిండికి లేని వెధవలకి ఇంత పొగరా! ఎవడితో

మాట్లాడుతున్నాననుకున్నావు రాస్కెల్! ఇంకా ఇక్కడున్నావంటే డొక్క చీలుస్తాను ఫో! బయటికి,'' అని గర్జించాడు. మిగతా ముగ్గురు మరేం మాట్లాడలేక వీరయ్యను తీసుకొని మెల్లగా బయట కొచ్చేశాడు.

గేటు దాటి బయటికొచ్చాక, రోడ్డుప్రక్కనున్న పంపు దగ్గరకెళ్లి నీళ్లు దోసట్లో తీసుకొని పుక్కిలించి వూశాడు వీరయ్య. వూసిన నీళ్లు ఎర్రగా వున్నాయి. పన్నేదో కదిలి రక్తమొస్తోంది. మరో రెండుసార్లు పుక్కిలించి నీళ్లు తాగాడు.

''ఇంత ఎదవపని చేశావేరా ఈరయ్యా! ఆ నరసిమ్మం ఎక్కడ? మనమెక్కడ? అంతటోడ్ని పట్టుకుని అట్టా మాట్టాడితే వూర్కుంటాడామరి, కొట్టక?'' అన్నాడు సుబ్బడు.

వీరయ్య ఏమీ మాట్లాడలేదు. సుబ్బడు జేబులోంచి రూపాయి తీసి, ''యిదిగో నీ రూపాయ్,'' అని వీరయ్యకివ్వబోయాడు. వీరయ్య పుచ్చుకోలేదు. ఆ రూపాయి పుచ్చుకోబుద్ధి కాలేదు. ''నాకొద్దు,'' అన్నాడు. ఎవరితోను మాట్టాడబుద్ధి కాలేదు. మిగతావాళ్లు పిలుస్తున్నా వినిపించుకోకుండా గబగబా ముందుకి సాగిపోయాడు.

ఓపికున్నంత మటుకూ అలా నడుస్తూనే వున్నాడు. తల బరువుగా వుంది. కడుపులో మంట. నోరు మంట. కాళ్లు లాగుతున్నాయి. 'ఇవాళ కూడా పస్తే. జేబులో డబ్బుల్లేకుండా యింటి కెట్టా ఎల్లను?' అనుకున్నాడు. ఇంట్లో పెళ్లాం బిడ్డలు తాను తేబోయే డబ్బుకోసం ఎదురు చూస్తుం టారు. తను డబ్బు తెస్తేనే పొయ్యిలో పిల్లి లేస్తుంది.

దారిలో రోడ్డుపక్క ఒక చెట్టుకింద దుమ్ములో చతికిలబడ్డాడు. ఆకలి- అలసట- బాధ. తుండుగుడ్డ పరుచుకుని పడుకున్నాడు. బరువుగా కళ్లు మూసుకున్నాడు.

ఒక పెద్ద డైనింగుటేబిల్ చుట్టూ ఎనిమిది కుర్చీల్లో రాక్షసుల్లా ఉన్న ఎనిమిదిమంది నరసింహాలు కూర్చుని, తననీ, తన పెళ్లాంబిడ్డల్నీ బల్లమీద పడుకోబెట్టి, కత్తుల్తో, ముళ్ల గరిటెల్తో పీక్కు తింటున్నట్టు కలొచ్చింది వీరయ్యకి. ఉలిక్కిపడి లేచాడు.

రోడ్డు మీద కార్లూ, బస్సులూ, రిక్షాలూ, సైకిళ్లూ తెగ తిరుగుతున్నాయి. ఎండ తగ్గినా వేడి యింకా తగ్గలేదు. వడగాలి సాగింది.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, సంక్రాంతి ప్రత్యేక సంచిక, 1972*

## నేపథ్యం

కలవారి కూరల్లో కూలీల చెమట ఉప్పు

# డైనింగ్ టేబుల్

***నా కథానేపథ్యం గురించి రాయాల్సిన ఈ వ్యాసంలో నేను దారి మళ్ళడం కాని, పాఠకుల దారి మళ్ళించడం కాని నా ఉద్దేశం కాదు. ఏ కథకి నేపథ్యమైనా, ఏ రచనకి నేపథ్యమైనా సామాజిక వాస్తవాలతో సహజమైన విషయాలతో కూడుకున్నదై ఉండాలీ అని కాస్త నొక్కి చెప్పడమే నా అభిమతం.***

కథకే కాదు, ఏ రకమైన రచనకైనా జీవితమే నేపథ్యంగా ఉండాలనీ, వర్తమాన సామాజిక, ఆర్థిక, రాజకీయవ్యవస్థలో సామాన్యుడి జీవితమే ఏ రచనకైనా ప్రధాన ఇతివృత్తంగా ఉండాలనీ, ఆ విధమైన రచనలే సజీవంగా ఉంటాయనీ, సహజంగా ఉంటాయనీ నేను నమ్ముతాను. అటువంటి రచనలు చెయ్యడానికే నేనెప్పుడూ ప్రయత్నిస్తాను.

నేను కథ రాసినా, నవల రాసినా, రేడియో నాటకం రాసినా, మరే విధమైన రచన చేసినా- అందులో సహజత్వం ఉందా లేదా అన్న విషయానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తాను. నా కథల్లో బాగోగుల హెచ్చుతగ్గులుండవచ్చు. నేనెంచుకొన్న ఇతివృత్తాల విషయంలో అభిప్రాయభేదాలుండవచ్చు. ఎంచుకొన్న ఇతివృత్తాన్ని కథగా మలచడంలో నా శక్తి సామర్థ్యాల లోపం ఉండవచ్చుగాని, నే వ్రాసిన ఏ కథ గురించీ కూడా- 'ఈ కథ అసహజంగా ఉంది. ఇలా ఎక్కడా జరగదు' అన్న విమర్శని మాత్రం నేనెప్పుడూ ఎదుర్కోలేదు.

ఇతివృత్తం ఒక్కటే సహజంగా ఉన్నంత మాత్రాన సరిపోదు. కథలోని ప్రతి సంఘటన, ప్రతి సన్నివేశం, ప్రతి సంభాషణ కూడా సహజంగా ఉండాలి. కథ చెప్పే పద్ధతిని బట్టీ, కథకుడి ఇష్టాయిష్టాలనుబట్టీ, అతగాడి సత్తానుబట్టీ, కథలో అలంకారా లుండవచ్చు, చమత్కారాలుండవచ్చు. అవసరాన్ని బట్టి అక్కడక్కడా అతిశ యోక్తులు కూడా ఉండొచ్చుగాని, అబద్ధాలుండకూడదు, అవాస్తవాలుండకూడదు, అసహజమైన విషయాలు అసలే ఉండకూడదు.

కథ సహజంగా, సజీవంగా ఉండాలంటే రచయిత స్వయంగా అనుభవించిన, స్వయంగా చూసిన విషయాలు మాత్రమే రాయనక్కర్లేదు. ఇతరులు చెప్పగా విన్నవీ, తాను చదివినవీ, తనకున్న జీవితానుభవాన్ని బట్టి తనకవగతమైన విషయాలు కూడా రాయొచ్చు. ఒక వేశ్య కథ రాయాలంటే రచయితకి వేశ్యా సంపర్కం ఉండనక్కర్లేదు. రిక్షా తొక్కేవాడి అగచాట్లు గురించి రాయాలంటే రచయిత స్వయంగా రిక్షా తొక్కనక్కర్లేదు. ముష్టివాళ్ళ గురించి రాయాలంటే స్వయంగా రచయిత ముష్టెత్తనక్కర్లేదు. కావలసిందల్లా చిత్తశుద్ధి, ఏ విషయం గురించి రాస్తున్నామో దానికి సంబంధించిన సదవగాహన, ఈ వ్యవస్థలోను, సమాజంలోను అన్యాయం చేస్తున్నదెవరు, ఆ అన్యాయానికి గురౌతున్నదెవరు అన్న వివేచన, రచయితగా మన బాధ్యత ఏమిటి, మనం ఎవరి కొమ్ము కాయాలి అన్న విచక్షణ. ఈమధ్య కొందరు దళిత సోదరులు, 'దళితుల గురించి దళిత రచయితలు మాత్రమే సహజంగా, బలంగా రాయగలరు. దళితులు కానివాళ్ళ కన్నీళ్ళు అంత ఉప్పగా ఉండవు,' అన్న ధోరణిలో వాదిస్తున్నారు. ఇదేవిధంగా స్త్రీల కష్టనష్టాల గురించీ, వాళ్ళకి జరుగుతున్న అన్యాయాల గురించీ ఆడవాళ్ళే బాగా రాయగలరు అన్న అభిప్రాయం కూడా కొంతమంది రచయిత్రుల్లో ఉంది. ఈ అభిప్రాయాలను నేనే మాత్రమూ అంగీకరించను. 'దళిత వాదం', 'స్త్రీవాదం' అన్న మాటలు సాహిత్యంలో ప్రవేశించడానికి ఎన్నో దశాబ్దాల ముందు నుంచే దళితుల సమస్యల గురించీ, స్త్రీల సమస్యల గురించీ ఎంతో సహజంగా, సజీవంగా, బలంగా రాసిన రాస్తున్న వాళ్ళు ఎందరో ఉన్నారు. వారిలో చాలామంది దళితులూ కారు, మహిళలూ కారు. అయితే ఒకటి మాత్రం నిజం. దళితుల సమస్యలు దళితుడైన వాడికర్థమైనంత త్వరగా పూర్తిగా దళితుడు కాని రచయితకి అర్థంకావు. అలాగే ఆడవాళ్ళ సమస్యలు వాళ్ళకి అవగతమైనంత తేలిగ్గా, సమగ్రంగా, స్పష్టంగా మగాడికర్థం కావు.

కథలో దారిమళ్ళడం, కథకి అవసరమైన విషయాల గురించి రాయటమూ రచయిత అసమర్థతకి నిదర్శనాలు. నా కథానేపథ్యం గురించి రాయాల్సిన ఈ వ్యాసంలో నేను దారి మళ్ళడం కాని, పాఠకుల దారి మళ్ళించడం కాని నా ఉద్దేశం కాదు. ఏ కథకి నేపథ్యమైనా, ఏ రచనకి నేపథ్యమైనా సామాజిక వాస్తవాలతో సహజమైన విషయాలతో కూడుకున్నదై ఉండాలీ అని కాస్త నొక్కి చెప్పడమే నా అభిమతం. నా అభిప్రాయాల మాట అలా ఉంచి, అసలు కథకొస్తాను.

సరిగ్గా ఇరవయ్యారేళ్ళ క్రితం- అప్పటికి నేను కథల్రాయటం ప్రారంభించి రెండు మూడేళ్ళయి ఉంటుంది. *డైనింగ్ టేబిల్* అన్న పేరుతో నేనో కథ రాశాను. 1972 జనవరిలో ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక సంక్రాంతి ప్రత్యేక సంచికలో అచ్చయిన ఈ కథ అప్పట్లో నాకు చాలా మంచి పేరు తెచ్చింది. ఆ తర్వాత చాలాకాలం పాటు మంచి కథకుడిగా నా పేరు నిల బెట్టింది. నా పాత కథలన్నీ చదివిన కొందరు సాహితీమిత్రులు ఇప్పటికీ అప్పుడప్పుడు ఆ కథల గురించి మెరిసేకళ్ళతో మాట్లాడుతూ ఉంటారు. అటువంటి కథల్రాసి, గత పది పన్నెండేళ్ళుగా దాదాపు ఏమీ రాయకుండా కలం ముడుచుకొని కూర్చున్నందుకు మరి కొంతమంది మిత్రులు నా పట్ల జాలి చూపుతూ ఉంటారు. బాగా చనువున్న ఇంకొందరు మిత్రులు ఎందుకు రాయటం లేదని కోప్పడుతూ ఉంటారు. నేనీమధ్య కథలెందుకు రాయటం లేదో, ఆమధ్య మరో పత్రికలో రాశాను. అది వేరే కథ.

ఇంతకీ, *డైనింగ్ టేబిల్* అన్న పేరుతో నేను రాసిన కథ ఆంధ్రజ్యోతి వీక్లీలో *కూడు తినే బల్ల* అన్న పేరుతో అచ్చయింది. అప్పట్లో ఆ పత్రిక ఎడిటర్‌గా ఉన్న పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు (అప్పటికింకా ఎడిటర్‌గా నార్ల వెంకటేశ్వరరావుగారి పేరే ఉండేది కాని, వాస్తవానికి వీక్లీ అంతా పురాణం వారే చూసేవారు.) ఎందుకోగాని ఆ కథ పేరు అలా మార్చారు. కథలోని కొన్ని పాత్రల సంభాషణలో *కూడు తినే బల్ల* అనే మాట వస్తుంది. *డైనింగ్ టేబిల్* అన్న పేరు మరీ చప్పగా ఉంది. *కూడు తినే బల్ల* అన్న మాట కొంత పచ్చిగా ఉన్నా అందులో కొంత కొత్తదనం ఉందనుకొన్నారేమో నాకు తెలీదు. అందుకు నేనేమీ బాధపళ్ళేదుగాని, ఆ తర్వాత ఆ కథ అచ్చయిన సంకలనాలన్నిటిలోను *డైనింగ్ టేబిల్* అన్న పేరే ఉంచాను. (హిందీ, కన్నడ భాషల్లో కూడా ఆ కథ అనువాదా లొచ్చాయి.) ఆ పేరుతోనే ఆ కథ ప్రచారంలోకి వచ్చింది.

ఒక చిన్ననగరంలో- లేదా పెద్ద పట్టణంలో ఎండ మండుతున్న ఒకరోజున నలుగురు కూలీలు కలిసి, చాలా పెద్ద డైనింగ్ టేబిల్ ఒకదాన్ని చాలా దూరం మోసుకెళ్ళి, ఆ టేబిల్ చేయించుకొన్న ధనికుడి ఇంటికి చేరుస్తారు. ఆ నలుగురికీ కలిపి నాలుగు రూపాయల కూలి డబ్బులిస్తాడు ధనికుడు. అదేమిటని అడిగినందుకుగాను ఆ నలుగురిలో ఒకడైన వీరయ్య అనే కూలీని దవడ పగిలేట్టు కొడతాడు. ఎవరూ ఏమీ చెయ్యలేరు. ఆకలితో, అలసటతో, మండుతున్న గుండెతో దారిపక్క ఒక చెట్టు కింద తుండుగుడ్డ పరచుకొని పడుకొన్న వీరయ్యకి- డైనింగ్ టేబిల్ చుట్టూ ఎనిమిది కుర్చీల్లో కూర్చున్న ఎనిమిదిమంది నరసింహాలు (టేబిల్ చేయించుకొన్న వ్యక్తి) తననీ, తన పెళ్ళాం బిడ్డల్నీ కత్తుల్తో ముళ్ళగరిటెల్తో పీక్కు తింటున్నట్టుగా కల వస్తుంది. అదిరిపడి నిద్రలేస్తాడు.

''ఎండ నిప్పులు చెరుగుతోంది. నిప్పు తొక్కిన కోతుల్లా కార్లు, బస్సులు, రిక్షాలు, సైకిళ్ళు రొదచేస్తూ రోడ్డు మీద ఉరుకులూ పరుగులూ పెడ్తున్నాయి...'' అన్న వాక్యాలతో ప్రారంభమైన కథ- ''రోడ్డు మీద కార్లు, బస్సులూ, రిక్షాలూ, సైకిళ్ళూ తెగ తిరుగుతున్నాయి. ఎండ తగ్గినా వేడి ఇంకా తగ్గలేదు. వడగాలి సాగింది,'' అన్న వాక్యాలతో ముగుస్తుంది.

ఆ రోజుల్లో నేను నారాయణగూడలో విఠల్‌వాడి ప్రాంతంలో ఉండేవాణ్ణి. రోజూ ఇంటి దగ్గర్నుంచి పాత ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు వచ్చి, అక్కడ రిక్షా ఎక్కి (ఆ రోజుల్లో ఆటోలు చాలా తక్కువగాను, సైకిల్ రిక్షాలు చాలా ఎక్కువగాను ఉండేవి) రేడియోస్టేషన్‌కి వెళ్ళేవాణ్ణి. అలాగే ఒకరోజున రిక్షాలో వెళ్తుండగా, బషీర్‌బాగ్ చౌరస్తా సమీపంలో- నలుగురు మనుషులు కలిసి ఒక పెద్ద డైనింగ్ టేబుల్ మోసుకెళ్తున్న దృశ్యం నా కంటపడింది. ఆరోజున ఎండలో ఆ నలుగురూ చెమటలు కక్కుతూ, ఆయాసంతో వగరుస్తూ డైనింగ్ టేబుల్ మోసుకెళ్తున్న ఆ దృశ్యం చూశాక నాలో కలిగిన ఆలోచనలే నా కథకి వస్తువుగా మారాయి.

టేబిల్ మోస్తున్న నలుగురిలోనూ వీరయ్య అనే కూలీ ప్రధానపాత్రగా కథ నడుస్తుంది. కథా ప్రారంభం నుంచి, దాదాపు చివరి వరకు ఆ నలుగురూ డైనింగ్ టేబుల్ మోసుకెళ్తున్న దృశ్యమే పాఠకుల కళ్ళ ముందు సాధ్యమైనంత సహజంగా కనబడేట్టు చెయ్యడానికి ప్రయత్నించాను. టేబుల్ మోసుకెళ్తుండగా ఆ నలుగురికీ ఎదురైన అనుభవాలు, వాళ్ళ సంభాషణ, అప్పటికి రెండు రోజుల్నుంచి కూలి దొరక్క పస్తులుంటున్న వీరయ్య మిగతా ముగ్గురితో సమానంగా నడవలేకపోవటం, ఆ రోజయినా పెళ్ళాం, బిడ్డల ఆకలి తీర్చగలనో లేదో అన్న అతని దిగులు, అంత పెద్ద డైనింగ్ టేబుల్ ధర గురించీ, అటువంటి టేబుల్ మీద తినే తిండి గురించీ టేబుల్ మోస్తున్న కూలీల ఊహాగానాలు- ఇవన్నీ టేబుల్ గమ్యస్థానం చేరేలోగా నడిచే కథలో ప్రస్తావన కొస్తాయి.


నేను కథల కంటే నాటకాలు (రేడియో కోసం) ఎక్కువగా రాశాను. నాటకం నా తొలి ప్రేయసి. సంభాషణలు చాలా సహజంగా, ఆ పాత్రలకి అతికినట్టుగా రాయగలనని నాకు కించిత్తు గర్వం కూడా ఉంది. నా *డైనింగ్ టేబుల్* కథలో కథ చాలామటుకు సంభాషణల ద్వారా నడుస్తుంది. ఆ సంభాషణలు సహజంగాను, సందర్భోచితంగాను ఉండటం వల్ల కథకి మంచి బలం వచ్చిందని పాఠకులు, విమర్శకులు మెచ్చుకొన్నారు. నాకు కాస్త వాగాడంబరము, శబ్ద లోలత్వము కూడా (నా రచనల్లో మాత్రమే) ఉన్నాయి. నాకున్న ఈ బలహీనత ఈ కథలో ఎక్కడా బయట పడకుండా చూసుకొన్నాను. కథకి ఏది అవసరమో అదే రాశాను. ఎంత అవసరమో అంతే రాశాను. వర్ణనల విషయంలో కూడా మితిమీరకుండా జాగ్రత్తపడ్డాను. మొత్తమ్మీద ఈ కథలో నేను చెప్పదల్చుకొన్న విషయాన్ని సాధ్యమైనంత క్లుప్తంగా వీలైనంత నిరాడంబరంగా, చాలా సహజంగా, కాస్త బలంగా చెప్పగలిగాననే అనుకొంటున్నాను. అందువల్లనే నే వ్రాసిన మంచి కథల్లో ఒకటిగా *డైనింగ్ టేబుల్* కథకి గుర్తింపు లభించింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 15 ఫిబ్రవరి 1998*

9

# నిప్పురవ్వలు

## నవీన్



*నవీన్ 24 డిసెంబర్ 1941 న వరంగల్ జిల్లాలో జన్మించారు. 'అంపశయ్య' నవలతో ప్రసిద్ధులై అదే ఇంటిపేరుగా మారిన వీరి మొదటి కథ 'చితికిన జీవితం' వరంగల్ ఆర్ట్స్ & సైన్స్ కాలేజి మ్యాగజైన్‌లో 1958లో అచ్చయింది. 80 కథలు ఆరు కథాసంపుటాలుగా వెలువడ్డాయి. 30 నవలలు, ఒక వ్యాస సంపుటి ప్రచురించారు. 'కాలరేఖలు' నవలకి 2004లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించింది. 1996 లో ప్రిన్సిపాల్‌గా పదవీ విమరణ చేశారు.*

చిరునామా

*2-7-71, ఎక్సైజ్ కాలని, సుబేదారి,*
*హన్మకొండ-506 001.*
*Ph.: 99892 91299*

అర్ధరాత్రి దూరంగా ఎక్కడో దేనికోసమో ఎడతెరపి లేకుండా మొరుగుతున్న కుక్కలు. పక్క వరండాలో నుంచి భయంకరంగా విన్పిస్తున్న రెడ్డిగారి గురక. బంగళా బయట గడ్డిమీద పడుకొని దొర్లుతున్నాను. సరోజ వస్తుంది. నన్ను లేపుతుంది. ఆ గదికి తీసుకెళ్తుంది. ఆ గదిలో నన్ను- ఆకలితో అలమటిస్తున్న సరోజ నలిపేస్తుంది. కొరికేస్తుంది. తినేస్తుంది. నాశనం చేస్తుంది.

ఈరోజు ఇంకా రాలేదెందుకో. చుట్టూ చీకటి- ఆకాశంలో మిణుకు మిణుకుమంటున్న నక్షత్రాలు- ఊరంతా సద్దుమణిగింది. ఉన్నట్టుండి యేదో పిట్ట వికృతంగా, భయంకరంగా అరుచుకుంటూ నామీద నుంచే పోయింది. ఆ అరుపు వినడంతోటే ఎందుకో నాలో వణుకు పుట్టింది. ఆ పిట్టను గూర్చి చిన్నప్పుడు ఎవరో చెప్పగా విన్నాను. ఆ పిట్టను దయ్యంపిట్ట అంటారట. ఆ పిట్ట వూరిమీద అరచుకుంటూ పోయిందంటే ఆ ఊరికేదో అరిష్టం మూడిందన్న మాటే. ఆ పిట్ట అరచినప్పుడల్లా దాని నోట్లోంచి రక్తం పడుతుందట! అలా ఎన్ని రక్తపు బొట్లు ఒక ఊరిమీద పడితే ఆ ఊళ్లో అంతమంది జనం చచ్చిపోతారట. ఇవన్నీ జ్ఞాపకం రాగానే నాలో వణుకు అధికమైంది. పక్కనే రెడ్డిగారి గురక ఇంకా భయంకరంగా వినిపించింది. దూరంగా కుక్కలు ఇంకా ఇంకా వికృతంగా మొరుగుతున్నట్లనిపించింది.

ఇంకా సరోజ రాలేదు. ప్రతిరోజూ ఆ మూడు చుక్కలు- వాటిని గొరకొయ్యలు అంటారట- ఆ గొరకొయ్యలు సరిగ్గా నడి ఆకాశంలోకి అంటే తల మీదకి వచ్చేటప్పటికి సరోజ వచ్చేది. ఈరోజు సమయం దాటిపోయింది. మళ్లా ఆ పిట్ట సరిగ్గా నా మీద నుండే అరచుకుంటూ వెళ్లి పోయింది. నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. నా కాళ్లు, చేతులు వణకడం మొదలెట్టాయి. ఈసారి ఆ పిట్ట నోట్లోంచి పడ్డ రక్తం నా మీదనే పడ్డట్టుగా అనిపించింది. ఏదో తడిగా చేతిని తాకినట్లనిపించింది. తుడుచుకోబోయాను. కాని కాళ్లూచేతులూ కదల్లేదు. స్థంభించిపోయాను. దూరంగా ఎవరో మేలుకొని ఆ పిట్టను కొడ్తున్నారు.

మళ్లా నిశ్శబ్దం. కుక్కలు మొరగడం ఆపేశాయి. పక్కకి దొర్లి పడుకున్నట్టున్నాడు, రెడ్డిగారి గురక కాస్త తగ్గింది. కాని సరోజ రాలేదు. ఆమె గది తలుపులు కిర్రుమనలేదు. సరోజ నన్ను ఆ గదికి... ఆ పాడుబడ్డ గదికి తీసుకెళ్లి... ఎందుకో మెరుపులా సరోజంటే ఏదో భయం నాలో ప్రవేశించింది. సరోజ ఆకలితో వున్న పులి- నన్ను తినేస్తుంది. కొండచిలువలా నన్ను మింగేస్తుంది. రెడ్డి... రెడ్డి నా పాలిట యముడు. ఈ ఇంట్లో ప్రాణాల్తో పాతేస్తాడు నన్ను. ఈ ఇల్లే ఒక దెయ్యాల కొంప. జైలు. పద్మవ్యూహం. ఈ ఇంట్లో మనుష్యులు నివసించరు. భూతాలు, ప్రేతాలు, పిశాచాలు నివసిస్తాయి. సరోజ ఒక భూతం, రెడ్డి ఒక బ్రహ్మరాక్షసుడు. నన్ను ఈ ఇంట్లో బంధించారు. నన్ను హింసిస్తూ నాతో ఆడుకుంటున్నారు. వెంటనే ఈ ఇంట్లోంచి పారిపోవాలి... వెంటనే... ఈ క్షణమే. కాళ్లూచేతులూ కదలవు. ఇంకాస్సేపట్లో సరోజ వస్తుంది. నేను లేకపోతే సరోజ తల్లడిల్లి పోతుంది. పాపం సరోజ... కానీ నేను పారిపోవాలి. ఆ పిట్ట ఆ దెయ్యంపిట్ట నామీద రక్తం కక్కి పోయింది. ఇంకా బతుకుతానా? తెల్లవారేలోగా రెడ్డి, సరోజ నన్ను ముక్కముక్కలుగా కోసేసి ఈ ఇంట్లో పాతిపెడతారు. ఈ ఇల్లు... ఈ ఇల్లంటేనే నాకసహ్యం... ఈ ఇంటికి నేను రావడం అంతా కలగా క్షణంలో నా నిమిత్తం లేకుండానే జరిగిపోయింది.

నేను ఎక్కడ ఎవరికి పుట్టానో నాకు తెలియదు. నాకు రెండు మూడేళ్లున్నప్పుడే మా అమ్మ చనిపోయిందట. మా నాన్న గూర్చి నాకేమీ తెలియదు. నాకసలు నాన్నే వాడే లేడని అనేవాళ్లు చాలామంది. మా అమ్మ రామిరెడ్డి దొర ఇంట్లో పని చేస్తుండేదట. అమ్మ చనిపోయాక రామిరెడ్డి ఇంట్లోనే పడి బతికాను. వాళ్లే ఇంత పెట్టేవాళ్లు. నాకు ఐదేళ్లు వచ్చినప్పటి నుండి వాళ్లకి ఆ పనీ ఈ పనీ చేసి పెడ్తుండేవాడిని. అలాగే వాళ్లింట్లో పనివాడిలా స్థిరపడిపోయాను.

రామిరెడ్డి దొరకి దొరసానికి అన్నివిధాలైన పనులు చేసి పెడ్తుండేవాడిని. వాళ్ల పిల్లల్ని ఎత్తుకోవడం, ఆటలకి తీసికెళ్లడం, బడికి తీసికెళ్లడం, తలంటు పోయడం- తర్వాత దొరసానికి వంటలో సహాయపడటం, అంట్లు తోమడం, పొయ్యి అంటించడం, అప్పుడప్పుడు వంట కూడా చెయ్యటం, ఇల్లు తుడవటం, దొరకి స్నానానికి నీళ్లు తోడటం, వళ్లు రాయటం, ధోవతులు, తువ్వాలలు మొదలైనవి ఉతకటం, రాత్రుళ్లు పక్కలు వేయటం, రామిరెడ్డిగారికి నిద్రపట్టకపోతే కాళ్లు పట్టడం... ఇలాంటి పనులన్నీ ఇరవై నాలుగు గంటలూ చేసేవాడిని. నాకు నెలకింత అని జీతం లేదు. వాళ్లే తిండీ బట్ట ఇచ్చేవాళ్లు. అంతకంటే నాకింకే అవసరమూ అప్పట్లో కనిపించలేదు.

నాకా పేరు ఎప్పుడు పడిందో కాని నన్నంతా 'అమాయకుడు' అంటుండేవాళ్లు. 'ఉత్త అమాయకుడు', 'వెర్రిబాగులవాడు', 'నోట్లో నాలుకలేనివాడు' మొదలైన పేర్లన్నీ నాకు పడ్డాయి. వాళ్లంతా అలా అంటున్నారని తెలిసినప్పటి నుండీ నేనింకా అమాయకుడిలా, వెర్రిబాగులవాడిలా కనిపించడానికి ప్రయత్నించేవాడిని. అలా కనిపించడం వల్ల కొన్ని లాభాలు కూడా కనిపించాయి. మా దొరసాని అప్పుడప్పుడు బజారుకెళ్లి ఏదైనా కొనుక్కురమ్మని డబ్బులిస్తే వాటిల్లో కొన్ని మిగిలించడం నేర్చుకున్నాను. క్రమక్రమంగా నాకా డబ్బుల అవసరం తెలిసి వచ్చింది. అలా

మిగిలించుకున్న డబ్బుల్తో ఆ ఊరికి పదిహేను మైళ్ల దూరంలో వున్న పట్నానికి వెళ్లి అదీ ఇదీ కొనుక్కు తినడం, సినిమాలు చూడటం అలవాటైంది. నేను డబ్బులు కాజేస్తున్నానన్న అనుమానం మా దొరసానికి ఎప్పుడూ వచ్చేది కాదు. పైగా పట్నం వెళ్తున్నానంటే ఆమె కూడా కొన్ని డబ్బులిచ్చేది. ఇలా రామిరెడ్డి దొర ఇంట్లో చాలా యేళ్లు గడిచాయి.

అలాంటి నా జీవితంలోకి ఈ రంగారెడ్డి, సరోజలు అకస్మాత్తుగా, పెద్ద తుఫానులా ప్రవేశించారు. రంగారెడ్డి పక్క ఊరి జమీందారు. మా దొర కంటే బాగా ఆస్తి, పలుకుబడి, దర్జా వున్నవాడు. మా దొరకి దూరపు బంధువు కూడా. ఒకసారి ఎందుకో మా ఊరు వచ్చాడు రంగారెడ్డి. మా దొర ఆయన్ను మా ఇంటికి ఆహ్వానించాడు. మా దొరకి రంగారెడ్డంటే కొంత భయం, భక్తి వున్నట్లు గమనించాను. త్వరలోనే రంగారెడ్డికి నామీద కన్ను పడింది.

''వాడు మీ పనిచేసే కుర్రాడా?'' అని అడిగాడు.

''ఔనండి. ఉత్త వెర్రిబాగుల వెధవ. ఏ పని చెప్తే ఆ పని చేస్తాడు. ఇంత పెడితే పడుంటాడు. చాలా నమ్మకస్తుడు,'' అన్నాడు మా దొర.

''నాక్కూడా ఇలాంటివాడు ఒకడు కావాలోయ్! మా ఇంట్లో పనిచేయడానికి నమ్మకస్తుడెవడూ దొరకటం లేదు. ఈరోజుల్లో ప్రతి వెధవకి పొగరు. పదేళ్ల క్రితం నన్ను చూస్తే మా వూళ్లో ప్రతివాడూ ఉచ్చ పోసుకునేవాడు. ఏ పని చెప్పినా చచ్చినట్లు చేసేవాళ్లు. ఇప్పుడు ప్రతి అడ్డగాడిద తిరగబడేవాడే. నా దగ్గర ఎవ్వడూ రెండు మూడు నెలల మించి పనిచేయటం లేదు. మీవాడిని కొంతకాలం నాతో పంపించు. చూస్తాను... వీడైనా కొంతకాలం పనిచేస్తాడేమో,'' అన్నాడు రంగారెడ్డి.

అంతే! రంగారెడ్డితో ఈ ఊరు వచ్చాను. రంగారెడ్డి నాకు నచ్చలేదు. అతన్ని చూడగానే నాకు భయమేసింది. అతని చూపులో, నవ్వులో, మాటలో ఎంతో విషం, కరుకుదనం వున్నాయి. అతని రూపం కూడా అలాగే వుంటుంది. ఎర్రగా కమిలిన ముఖం, బుర్రమీసాలు, ఆరడుగుల విగ్రహం, అంతకు తగ్గ లావు, ఎదుటివాడిని చీల్చివేసేట్టుగా చూసే చిన్నిచిన్ని పిల్లి కళ్లు. కరుకుగా, కఠినంగా, ఖంగుమని మోగే కంచుకంఠం. ఇలాంటి రెడ్డిని చూస్తే పసిపిల్లాళ్లు జడుసుకుంటారు.

ఆ ఊళ్లో చాలాభాగం రెడ్డిగారి బంగళా ఆక్రమించుకొని వుంది. ఎప్పుడో పూర్వపు పద్ధతిలో కట్టబడిన బంగళా అది. గదులు, వసారాలు, చీకటి గుయ్యారంలా వుంటాయి. బంగళాలో కొంత భాగం శిథిలమైపోయింది. సంగపోళ్లు కూలగొట్టారట. రెడ్డి మళ్లా బాగు చేయించలేదు. బావురుమంటూ వుండే అంత ఇంట్లోను వుండేది రెడ్డి ఒక్కడే! రెడ్డి భార్య చనిపోయి చాలా కాలమయిందట. ఆయనకున్న యేకైక కూతురు సరోజ పట్నంలో కాలేజీలో చదువుతోందట.

రెడ్డి నాకు రకరకాల పనులు చెప్పేవాడు. వాకిలి ఊడ్చి, నీళ్లు చల్లడం నుండి మొదలెడితే అర్ధరాత్రి వరకు నాకు తీరిక ఉండేది కాదు. పనులలోకొన్ని హీనమైనవి, కొన్ని గౌరవమైనవి. కొన్ని ఆడవాళ్లు మాత్రమే చేయాల్సినవి. కొన్ని మొగవాళ్లు చెయ్యకూడనివి వున్నాయని నాకు తెలియదు. చెప్పిన పనులు చేసుకుపోవడమే తెలుసు. రెడ్డి నన్ను క్షణం ఊరుకోనివ్వకుండా పనులు పురమాయించేవాడు. నేను ఎప్పుడైనా యే పనీ లేకుండా కూర్చుంటే ఆయనకు చిరాకు వేసేది.

మొద్దులా తిని కూర్చుంటున్నావా? అని బూతులు తిట్టి అప్పటికప్పుడు యేదైనా పని కల్పించి చెప్పేవాడు. నోరు మెదపకుండా చేసేవాడిని. ఎంత పనిచేసినా రెడ్డి తృప్తిపడేవాడు కాదు. ఎక్కడ యేకొంచం ఆలస్యం జరిగినా ఇల్లు ఎగిరిపోయేలా అరిచేవాడు. ఒకటి రెండుసార్లు నిష్కారణంగా తన్నాడు కూడా. ఏమాత్రం అలుసు యిచ్చినా నెత్తిన ఎక్కి కూర్చుంటానని అతని నమ్మకం.

నేనెప్పుడూ ఇల్లు విడిచి బయటకు వెళ్లేవాడిని కాను. ఎప్పుడైనా వెళితే ఆ ఊరివాళ్లంతా నన్నో బలిపశువును చూసినట్లు జాలిగా చూసేవాళ్లు. ఆ ఊళ్లో ఒక పాడుబడిన శివాలయం వుండేది. దాంట్లో రామయ్యతాత అని ఒక వృద్ధుడుండేవాడు. అతనికెందుకో నా పట్ల విపరీతమైన జాలి, ప్రేమ, అభిమానం ఏర్పడ్డాయి. నాలాగే అతనికీ ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరట. ప్రతిరోజూ ఊళ్లోకి వెళ్లి ఎవరైనా యేదైనా పెడితే తిని వచ్చి ఆ శివాలయంలో పడుకునేవాడు. నన్ను చూడ గానే, ''ఏ ఊరు నాయనా? నీకెక్కడా దిక్కూమొక్కూ లేదా? మా ఊరి దొరే దొరికిందా! ఈయన దగ్గర ఎవడైనా సరే ఇంతవరకు పట్టుమని పదిరోజులు కూడా పని చెయ్యలేదు. హింసించి హింసించి ప్రాణాలు తోడేస్తేగాని రెడ్డికి తృప్తి వుండదు,'' అన్నాడు రామయ్య తాత. అప్పుడప్పుడు రామయ్య తాతని చూడటానికి వెళ్తుండేవాడిని.

రంగారెడ్డికి చాలా అలవాట్లున్నాయి. ఇరవై నాలుగు గంటలూ తాగమన్నా తాగుతాడు. తింటాడు. కల్లుబుడ్లు, సారాసీసాలు క్షణాల్లో ఖాళీ అవుతుండేవి. రోజుకు ఒకటి రెండు కోడిపెట్టలు తెగిపోతుండేవి. రాత్రిళ్లు రెడ్డిగారు షికారు కెళ్తుండేవారు (ముండల షికారు). నన్ను కూడా వెంట తీసుకెళ్లేవాడు- ఏ గుడిసెలోనన్నా దూరి నన్ను బయట కాపలా ఉండమనేవాడు. కొన్నిసార్లు తనకి కావలసినవాళ్లని తన ఇంటికి రప్పించుకునేవాడు. రెడ్డి దృష్టి పడిందంటే ఆ ఊళ్లో వున్న యే పేదింటి ఆడదైనా అతనింటికి రావలసిందే. రెడ్డికి కావలసిన ఆడదాన్ని బలవంతంగానైనా సరే తెచ్చిపెట్టడానికి కావల్సిన ఇద్దరు ముగ్గురు వస్తాదులు రెడ్డి చేతి క్రింద రెడీగా వుంటారు.

బాగా తాగిన నిషాలో రెడ్డి పరమ బూతులు మాట్లాడేవాడు. తనకి తానే పగలబడి నవ్వు కునేవాడు. తనకు పదహారేళ్ల పోరన్నా, గుడ్లకొచ్చిన పెట్టన్నా చాలా ఇష్టమనేవాడు. రెడ్డి తెచ్చుకునే ఆడవాళ్లు ఇరవై ఏళ్ల లోపుగా వుండేవాళ్లు. ఇరవై ఏళ్లు దాటిన స్త్రీని రెడ్డి కన్నెత్తి చూడడని ఆ వూళ్లో చెప్పుకునేవాళ్లు. ఇంటికొచ్చిన ఆడవాళ్లని అప్పుడప్పుడు నా ముందరే చీర లాగడం, బుగ్గ గిల్లడం, పాలిండ్ల మీద చేతులెయ్యడం, గట్టిగా కౌగలించడం చేసేవాడు.

'ఆడు సూత్తుండ,'ని వచ్చినామె అంటే...

''వాడు చూస్తే యేందే? కుర్రకుంక... అసలు నీకో సంగతి చెప్పనా... అప్పుడప్పుడు నా పక్కలోకి ఎవ్వత్తె దొరక్కపోతే వాడే గతి,'' అంటూ గొల్లున నవ్వేవాడు. నా రక్తమాంసాలు ఉడికి పొయ్యేవి. అప్పటికి నా వయస్సెంతో నాకు తెలియదు. బహుశా 18, 19 దాటి వుంటాయని నా నమ్మకం. కాని నేనెప్పుడూ పొట్టి నిక్కరూ, బనీను వేసుకోవడం వల్ల 'కుర్రకుంక'లా కన్పించే వాడిని.

ఇంటికొచ్చిన ప్రతి ఆడదానితో, 'నీ వయస్సెంతే?' అని అడుగుతుండేవాడు రెడ్డి. 'పదహారో, పదిహేడో,' అని ఆ వచ్చినామె అంటే, 'సరిగ్గా మా సరోజ వయసన్నమాట,' అని ఎంతో ఆనందంగా, గర్వంగా అనేవాడు. అలా చాలామందితో, 'సరిగ్గా మా సరోజ వయసన్న మాట,' అని పదేపదే రెడ్డి అనడం... అలా అన్నప్పుడల్లా ఏదో తృప్తి, ఏదో కోరిక తీరిన ఆనందం అతనిలో కనిపిస్తుండేవి. రెడ్డి ఇలా అంటాడని ఆ ఊళ్లో చాలామందికి తెలుసు. చాలామంది రెడ్డిలోని ఈ చేష్ట గూర్చి చాలా వింతగా చెప్పుకునేవాళ్లు.

నేను ఈ ఊరు వచ్చిన నెలరోజుల తర్వాత సరోజ పట్నం నుండి వచ్చింది. వేసవి సెలవులకని. సరోజ ముమ్మూర్తులా రంగారెడ్డి లాగుంటుంది. సరోజని చూడగానే రెడ్డిని చూసి నప్పటిలాగే నాకు భయమేసింది. రెడ్డిలాగే చాలా ఎత్తరి. అందుకు తగ్గ పుష్టి. ఎదుటి వ్యక్తిని కొరగా, తిని వేసేట్లు చూసే చూపులు... ఆమె చూపుల్లో, మాటలో, నడకలో చాలా గర్వం... ప్రతిదాని పట్ల నిర్లక్ష్యం, నిరసన కనిపిస్తుండేవి.

సరోజ నన్ను చూడటంతోనే వింతగా ఈలవేసి, "ఓహో కొత్త నౌఖరువా? గుడ్ నాకు నచ్చాడు. ఎక్కడ సంపాదించావు నాన్నా ఈ వింత మృగాన్ని," అంది.

"మన రామిరెడ్డి ఇంట్లో పట్టుకొచ్చాలే... ఉత్త ఎడ్డి గాడిద. నీకు అన్ని పనులు చేసి పెడతాడని తీసుకొచ్చాను," అన్నాడు రెడ్డి.

సరోజ ఇంట్లో అడుగుపెట్టిన క్షణం నుండి తండ్రి కంటే ఎక్కువగా పనులు పురమాయించడం మొదలెట్టింది. నన్ను చాలా ఆశ్చర్యపరచిన విషయం, రెడ్డికి సరోజ మీదున్న విపరీతమైన ప్రేమ. ఉక్కుపిండంలాంటి రెడ్డి సరోజ ముందు కరిగి నీరైపోయేవాడు. ఆమె ఎంత చెప్తే అంత. ఆమె పట్నం నుండి రాగానే రెడ్డి కళ్లల్లో నీళ్లు తిరగాయి. ఆమెను కౌగిలించుకున్నాడు. 'చాలా చిక్కిపోయావమ్మా,' అన్నాడు. 'హాస్టల్లో తిండి సరిగా లేదా? వారం రోజులకొక్కసారైనా చికెన్ వుండని వెధవ తిండి... వెధవ పరీక్షల కోసం రాత్రింబవళ్లూ చదివి ఆరోగ్యం పాడు చేసుకున్నావా?' ఇలాంటి ప్రశ్నలడుగుతూ ఆరోజంతా సరోజను ఎంతో అపురూపంగా చూసుకున్నాడు.

రెడ్డిగారింటికొచ్చే భూస్వాములు, షావుకార్లు ఎవరైనా, "మీ అమ్మాయికి పెళ్లెప్పుడు చేస్తారు దొరా?" అని అడిగితే రెడ్డి మండిపడేవాడు.

"పెళ్లి! పెళ్లి! పదహారేళ్లు నిండకుండానే పెళ్లి... ఇరవై ఏళ్లలోపలే ఇద్దరు ముగ్గురు పిల్లల్ని కని ముసలమ్మయి కూర్చుంటే మీకందరికీ సంతోషం. మా సరోజకి ఇప్పుడిప్పుడే పెళ్లి చేయను. అది బి.ఎ. ప్యాస్ కావాలి. ఎం.ఎ. ప్యాస్ కావాలి. మా సరోజంటే ఏమనుకున్నారో... అది రాణి. ఆడదైనా నా కీర్తి నిలబెడుతుంది. అందరిలా పెళ్లి చేసుకుని పిల్లల్ని కంటుందనుకుంటున్నారేమో! అదెన్నటికీ జరుగదు. సరోజ... నా సరోజ అందరిలా సామాన్య స్త్రీలా పెళ్లి చేసుకొని పిల్లల్ని కనడమా... అలా ఎన్నటికీ జరగదు," అని ఒక ఘాటైన ఉపన్యాసం ఇచ్చేవాడు రెడ్డి. రెడ్డి కంఠంలో ప్రాణం ఉండగా సరోజకి పెళ్లి కాదని ఆ వూళ్లో చాలామంది నమ్మకం.

సరోజ నాకు చెప్పే పనుల్లో కొన్ని నాకు సరదాగా వుండేవి. ఆమె స్నానానికి నీళ్లు పెట్టడం, స్నానం చేశాక టవల్, లంగా, చీరె, బాడీ, జాకెట్టు మొదలైనవి అందించటం, ఆమె తలకి నూనె రాయటం... ఇలాంటి పనులు. సరోజ కూడా నన్ను 'కుర్రకుంక' కిందే జమ కట్టినట్టుంది. అప్పుడప్పుడు నా ముందే చీర విప్పేయడం జాకెట్ మార్చుకోవడం చేస్తుండేది. రాత్రిళ్లు నిద్ర పట్టటం లేదని పక్కమీద దొర్లుతూ నన్ను పిలిచి విసనకర్రతో విసరమనేది. ఆమె పక్కనే ఏవేవో ఇంగ్లీషు పుస్తకాలు. గుడ్డల్లేని మగవాళ్ల, ఆడవాళ్ల బొమ్మలున్న పుస్తకాలు పడి వుండేవి. ఉక్కగా ఉందని నా ముందే జాకెట్ విప్పేస్తుండేది. ఇవన్నీ చూస్తున్నప్పుడు నా నరనరాల్లో రక్తం ఉప్పొంగి ప్రవహించేది. ఎప్పుడూ సరోజని అంటిపెట్టుకొని ఉండకపోతే నాకు తోచేది కాదు.

ఒకరోజు సరోజ జాకెట్ మార్చుకుంటోంది. ఆమె కోసం కాఫీ తీసుకెళ్లిన నేను కళ్లప్పగించి చూస్తూ నిల్చున్నాను. అలా చూడటం నాకుగాని, ఆమెకుగాని కొత్తేమీ కాదు. ఈసారి ఎందుకో అకస్మాత్తుగా సరోజ నాకేసి చూసింది. నా చూపులో ఆమెకు ఏం కనిపించిందోగానీ మండిపోయింది.

"దొంగ రాస్కెల్! ఏమిట్రా చూస్తున్నావ్! నిన్నిక్కడికి ఎవ్వరు రమ్మన్నారు? ఫో బయటకు. అమాయకంగా కనబడ్డాడు. కానీ నాలిముచ్చు వెధవ... కుర్రకుంక అనుకున్నాను... గెటవుట్... గెటవుట్..." అని వెర్రెత్తినట్టుగా అరిచింది. వెంటనే బయటకు వచ్చాను.

ఆ మర్నాడే మరో చిత్రం జరిగింది.

ఇంటి వెనుక బావి వద్ద స్నానం చేస్తున్నాను. నన్ను పిల్చుకుంటూ వచ్చింది సరోజ. ఓ చిన్న తుండుగుడ్డ తప్ప నా శరీరం మీద ఏమీలేదు. నాకేసి తదేకంగా చూడటం మొదలెట్టింది

సరోజ. చిన్ననాటి నుండి బండచాకిరి చేయడం, బాగా తినడం వల్ల నల్లరాయిలా వుండేది నా శరీరం. నా శరీరంలో ఆమెకు ఏం కనిపించిందోగానీ కాస్సేపు స్తంభించిపోయింది.

ఆరోజు నుండి సరోజ నన్ను చాలా దూరంగా వుంచడం మొదలెట్టింది. నేను కనిపిస్తే విపరీతమైన చికాకును, కోపాన్ని చూపేది. నోటికొచ్చినట్టల్లా తిట్టేది. దున్నపోతు, పశువు, అడ్డ గాడిద, మొద్దు ఎద్దు... ఇలాంటి పేర్లతోనే పిల్చేది. నాకు కన్పించవద్దని కసిరేది. కాని నాకొక విషయం తెలిసిపోయింది. ఎంత తిట్టినా ఎంత కసిరినా సరోజను రాసుకు తిరగడం మంచిదని. కావాలని ఒక తుండుగుడ్డ కట్టుకొని ఆమెకు ఎదురుపడేవాడిని. సరోజ రెచ్చిపోయేది. పళ్లు పటపట కొరుకుతూ... ''ఒరే దున్నపోతూ! ఎందుకురా అలా బైరాగిలా తిరుగుతావు?... ఈసారి నాకలా కన్పించావంటే చీల్చి పారేస్తాను,'' అనేది. అయినా నేను అలాగే ఆమె కంటపడేవాడిని. కోపంతో శివమెత్తినట్టుండేది సరోజ.

ఒకసారి రంగారెడ్డితో చెప్పింది.

''ఈ దున్నపోతు మనకొద్దు నాన్నా... వీడిని వెంటనే మళ్లీ రామిరెడ్డి ఇంటికి పంపిం చెయ్యండి,'' అంది. ఆయన నవ్వాడు.

''పిచ్చి సరూ? వాడు దున్నపోతైనా నమ్మకస్తుడే... వాడిలా చెప్పిన పనులన్నీ చేసిపెట్టేవాడు ఈరోజుల్లో మనకెవడూ దొరకడు.''

''ఫో నాన్నా! నేను ఈ మొద్దుతో వేగలేకపోతున్నాను... వాడికి చెప్పింది ఏదీ అర్థంకాదు. నా ప్రాణాలు తినేస్తున్నాడు,'' అంది సరోజ విసుగ్గా.

''వాడికి కొంచెం కొత్తగదా... త్వరలోనే నేర్చుకుటాడులే. అంతేగానీ, వాడిని తీసి పారేశా మంటే వాడిలాంటి వాడిక దొరకడు,'' అన్నాడు రెడ్డి.

ఆ తర్వాత సరోజ ప్రవర్తన ఇంకా వింతగా మారింది. పూర్వంలా ఎప్పుడూ హుషారుగా వుండే సరోజ ఏదో ఆలోచిస్తున్నట్లు పరధ్యానంగా వుండటం గమనించాను. ఒకరోజు రెడ్డి ఇంట్లో లేడు. ఊళ్లోకి షికారు వెళ్లాడు. రాత్రి తొమ్మిది గంటలో, పది గంటలో అయినట్లుంది. సరోజ చాలాకాలానికి నన్ను తన గదికి రమ్మంది. వెళ్లాను. నిద్రపట్టక పక్కమీద దొర్లుతోంది. పక్కలో పుస్తకం పడి వుంది. అదే పుస్తకం. ఆమె ఎప్పుడూ చదివే ఆ నగ్నంగా వున్న బొమ్మల పుస్తకం. ఎందుకో ఆ క్షణంలో సరోజను చూస్తే చాలా భయమేసింది. విడిపోయిన జుట్టు, బాగా చెమటలు కారిపోతున్న శరీరం, ఏదో విపరీతమైన బాధని వ్యక్తం చేస్తూ చెమటతో జిడ్డుగా, వికృతంగా వున్న ముఖం... బాగా నలిగిపోయిన చీర... సరోజను అలా చూడటం అదే మొదటిసారి.

నన్ను దగ్గరగా రమ్మంది. వెళ్లాను ఇంకా దగ్గరకు రమ్మంది. భయం భయంగా వెళ్లాను. ఏ క్షణంలో యేం జరుగుతుందోనని నా గుండెలు విపరీతంగా కొట్టుకున్నాయి. మరుక్షణంలో మెఱుపులా... సరోజ నన్ను తన మీదకి లాక్కొంది. నా ఎముకలు విరిగిపోయేలా ఆమె తన హృదయానికి హత్తుకుంది. రక్తం కారేలా నా చెంపల్ని కొరికింది. ఊపిరి తీసుకోవటానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇంకో క్షణం అలా ఉంటే నా ప్రాణాలు పోతాయేమో ననిపించింది. కాని మరుక్షణంలోనే నన్ను తన మీద నుండి తోసేసింది. మంచం కింద పడి పోయాను.

''దొంగ రాస్కెల్... ఎందుకొచ్చావిక్కడికి. ఫో! ఫో!! గెటవుట్, గెటవుట్!!'' అని అరిచింది. ఆమె కళ్లు చింత నిప్పుల్లా మండిపోతున్నాయి. అంతా ఏదో కలలా జరిగిపోయింది.

ఇది జరిగిన నాటి నుంచి సరోజ నాపట్ల క్రూరంగా ప్రవర్తించసాగింది. కావాలని అతి కష్టమైన పనులు, నిజంగా అవసరంలేనివి చెప్పేది. పెరట్లో ఏనాటి నుంచో వున్న చెత్తాచెదార

మంతా ప్రోగుచేసి కాల్చివేయమంది. అది చాలా పెద్ద పెరడు. ఒక్కరోజులో పెరడంతా శుభ్రం చేయకపోతే ఎముకలు విరగ్గొడతానంది.

'అది సాధ్యం కాదు అమ్మగారం,'టే, 'తిరగబడతావా వెధవ,' అని వాళ్ల నాన్నతో-

'వీడు బొత్తిగా చెప్పిన పని చేయటంలేదు. తిరగబడడం నేర్చుకున్నా,'డని చెప్పింది. వెంటనే రంగారెడ్డి రూళ్లకర్రతో నన్ను బాదటం మొదలెట్టాడు. రూళ్లకర్రతో కీళ్లమీద కొడుతుంటే బాధని భరించలేక నేను, 'అమ్మో!' అని కేకలు వేస్తోంటే సరోజ కిలకిలా నవ్వుతూ, "ఇంకా నాన్న... ఇంకా... నా వంతుది,' అంటూ కొట్టించింది. రంగారెడ్డి తన తనివితీరా, తన కూతురు తనివితీరా కొట్టి వదిలేశాడు. ఆ దెబ్బలతో రెండు రోజులు పక్క మీద నుండి లేవలేకపోయాను. ఆ తెల్లారి నొప్పులతో బాధపడ్తున్న నా దగ్గరకు వచ్చి, 'బాగా తగిలాయిరా? సారీరా... ఎక్కడ తగిలాయిరా?' అంటూ నా శరీరాన్ని నిమురుతూ జాలిపడింది సరోజ. 'పాపిష్టిదాన్ని! నిన్ను కొట్టించాను,' అని కళ్ల నీళ్లు పెట్టుకుంది. కాని ఈ జాలి, ప్రేమ ఎంతో కాలం నిల్చేవి కావు. మళ్లీ వెంటనే ఆ క్రూరత్వం- దెబ్బలు మాని నేను లేచాక రెండు మూడు రోజులకే పెరట్లో దూరంగా వున్న ఏనాటిదో బొంద- దాన్నిండా మట్టిపోసి పూడ్చేసే పని చెప్పింది. అది చేసేవరకు తిండి పెట్టేదిలేదని రెండుమూడు రోజులు ఆకలితో మాడ్చి చంపింది. నేను చూడాలని, నన్ను పిలిచి నా ముందు అతి రుచికరమైన భోజనం చేస్తూ, 'ఆకలి వేస్తోంది కదురా! పాపం! రోజూ దున్నపోతులా తింటున్నావాయె, పని చెప్తే చేతకాదాయె, ఈ దేశంలో నీలాంటి వాళ్లందరికీ రెండు పూటలా తిండి దొరుకుతుందా? మా ఇంట్లో పుణ్యానికి వచ్చింది కదా అని నువ్వు మెక్కుతున్నావు,' అంటూ తనకి తానే పిచ్చిగా నవ్వుకునేది. కాని మళ్లీ రాత్రి ఆకలితో ప్రాణాలు పోతున్న నా దగ్గరకు వచ్చింది.

"పాపం! ఆకలేస్తోందిరా! సారీ! లేలే... అన్నం తిందువుగాని లే!" అని లేపి అన్నం పెట్టింది.

అది జరిగిన నాలుగైదు రోజులకి, ఒక అర్ధరాత్రి బంగళా బయట నిద్రపోతున్న నన్ను సరోజ లేపింది. పక్కనే వరండాలో రెడ్డి గుర్రుపెడుతూ నిద్ర పోతున్నాడు. అడుగులో అడుగు వేసుకుంటూ సరోజ పెరట్లోకి- పెరట్లో దూరంగా వున్న ఒక పాడుబడ్డ గదికి తీసుకెళ్లింది. ఆ గదిని రెడ్డిగారు పూర్వులెవరో వ్యవసాయపు పనిముట్లు పెట్టుకోవటానికి కట్టించారట. ఆ వూళ్లో కొంతకాలం క్రితం చాలామంది దొంగచాటుగా కలుసుకునే ప్రియులు పెరటి గోడలు దుమికి ఆ గదిలో తమ కోర్కెల్ని తీర్చుకునేవాళ్లట. ఇది తెలిసిన రెడ్డిగారు స్వయంగా రెండుమూడు రోజులు కాపలా కాసి ఒక జంటను పట్టుకుని ఆ తెల్లారి ఊరి పెద్దల సమక్షంలో వాళ్లని శిక్షించారట. అప్పటి నుండి ఆ గదిలోకి రహస్య ప్రేమికులు రావడం తగ్గిపోయిందట. ఎందుకో ఎప్పుడో అప్పుడు సరోజ నన్నాగదికి తీసుకెళుతుందని నాకో నమ్మకం ఏర్పడింది. ఈ రాత్రి అదే జరుగుతున్నది. నిశ్శబ్దంగా ఇద్దరమూ ఆ గదిలోకి నడిచాము.

ఆ గదిలో ఆ రాత్రి సరోజ తన నిజస్వరూపం చూపించింది. ఎన్నాళ్ల నుంచో సరోజకు ఆకలవుతోంది. ఆరోజు నాతో ఆమె ఆకలిని తీర్చుకుంది. నన్ను తినేసింది. ఆ క్షణంలో సరోజ ఒక మనిషిలా కనిపించలేదు. కోరికల అగ్నిలో భయంకరంగా మండుతున్న జ్వాల సరోజ. అంతే! ఆరోజు నుండి ప్రతి అర్ధరాత్రి సరోజ, నేను ఆ గదికి వెళ్లడం మామూలైపోయింది. ప్రతి రాత్రీ సరోజ నన్నుచంపేస్తుందేమోనన్నంత వెర్రిగా ప్రవర్తించేది. నా శరీరంతో ఆడుకునేది. నా శరీరాన్ని హింసిస్తూ సంతోషించేది. నన్ను ఊపిరి తీసుకోనివ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తుండేది. ఒక్కమాటలో నన్ను ప్రతిరోజు తినేసేది. కాల్చివేసేది. కొంతకాలం ఇలా సాగితే నేను బతకలేనేమోననే భయం నాలో ఏర్పడింది. ఆ ఇంటి నుండి, సరోజ నుండి పారిపోదామనుకున్నాను. కాని నాక్కూడా

సరోజ పట్ల ఒక వెర్రి వ్యామోహం ఏర్పడింది. సరోజ నన్ను ఎంత ఎక్కువగా హింసించి కోర్కె తీర్చుకుంటే నాకంత తృప్తి కలిగేది. హింస ఇంత హాయిగా ఉండటం ఎంత ఆశ్చర్యం!

దూరంగా కాస్సేపు మొరగటం ఆపేసిన కుక్కలు మళ్లీ మొరగడం లంకించుకోవటంతో ఈ లోకంలోకి వచ్చాను. పక్కనే వరండాలో రెడ్డి ఊరంతా వినిపించేంత గురక పెడుతున్నాడు. సరోజ ఈరోజు ఇంకా రాలేదు. లోపల నిద్రపోయిందేమో... ఈరోజు రాదేమో... సరోజ రాకపోతే బతకగలనా? నేనే వెళ్లి లేపితే! మళ్లీ ఎందుకో గుబులు గుబులుగా భయం నన్ను ఆవరించింది. అకస్మాత్తుగా రెడ్డికి మెలుకువ వస్తే? సరోజ గదివైపు నేను వెళ్లడం చూస్తే నిలువునా పాతేస్తాడు. గొడ్డలితో నరికేస్తాడు. మళ్లీ ఆ దయ్యంపిట్ట అరుచుకుంటూ పోయింది. మళ్లీ నా కాళ్లు చేతులు వణకటం మొదలెట్టాయి. ఇక సందేహం లేదు. తెల్లవారేలోగా నేను చచ్చిపోతాను. గుండెల్ని నులిమి వేస్తున్న భయం. ఇంతలో తలుపు కిర్రుమన్న చప్పుడు. ఉలిక్కిపడ్డాను. సరోజ వస్తోంది. సరోజ వస్తోంది. అడుగులో అడుగు వేసుకుంటూ అతి నిశ్శబ్దంగా గుర్రు పెడ్తున్న తండ్రిని దాటి-రెడ్డి నిద్రని ప్రపంచంలోని యే శక్తీ చెదరగొట్టలేదు. బాగా తాగిన నిషా అది. వేయి ఏనుగులతో తొక్కించినా రెడ్డి నిద్ర లేవడు. సరోజ వస్తోంది... నురుగులు కక్కుతున్న తెల్లచీర, తెల్లజాకెట్, తెల్లగా కదిలి వస్తోంది. తెల్లచీరలంటే సరోజకు చాలా ఇష్టం. ఆ చీకట్లో సరోజ తెల్లగా వస్తోంటే మళ్లీ నాకు భయం వేసింది. దెయ్యాలు కూడా ఇలాగే తెల్ల చీరలు కట్టుకుని వస్తాయట. ఎందుకో ఆ వచ్చేది సరోజ కాదనిపించింది. ఏదో దెయ్యం వస్తోంది. అడుగులో అడుగు వేసుకుంటూ సరోజ నన్ను సమీపించింది. నేను నిద్రపోయినట్లు నటిస్తున్నాను.

"ఒరే లేవరా త్వరగా," అంటోంది. బతిమాలుతున్నట్లుగా, భయంగా, నిశ్శబ్దంగా, ఆవులిస్తూ లేచాను.

"అప్పుడే నిద్రపోయావురా?" అంది.

"ఇప్పుడే నిద్రపడ్తోందమ్మగారు. ఇవ్వాళ ఇంత ఆలస్యం చేశారేం?" అన్నాను.

"ఇవ్వాళెందుకో విపరీతంగా భయమేస్తోందిరా. అసలు రాకూడదనే అనుకున్నాను. కాని ఎంత ప్రయత్నించినా రాకుండా వుండలేకపోయాను," అంది.

ఇద్దరమూ అడుగులో అడుగు వేసుకుంటూ ఆ గదివేపు కదిలాము. ఆ పాడుబడ్డ గది, ఏ క్షణంలో కూలిపోతుందో అన్నట్టుగా కనిపించే ఆ గదిని చూస్తేనే భయం వేస్తోంది. ఇలా అర్ధరాత్రి ఆ గదిలోకి వెళ్లే మొండి ధైర్యాన్ని మాలో ఏ శక్తి కలిగిస్తున్నదో...

గదిలోకి వెళ్లటంతోటే గడ్డి మీద ఒరిగింది సరోజ. నన్ను మీదికి లాక్కొంది. గట్టిగా ముద్దులు పెట్టుకుంది.

"ఎన్నాళ్లురా ఇలా... ఎన్నాళ్లురా... మా నాన్నకి తెలిస్తే నిన్ను, నన్ను నరికేస్తాడు," అంది ఆవేశంగా, భయంగా.

"ఎందుకోగానీ, ఇవ్వాళ నాక్కూడా బాగా భయం వేస్తోంది..."

"ఎందుకురా భయం... ఎందుకురా భయం..." అంటూ ఆమె నా బుగ్గల్ని కసిగా కొరికింది.

"ఇవ్వాళ ఆ పిట్ట అరిచింది. ఆ పిట్ట అరుపు వింటే నాకు చాలా భయమేస్తుంది..."

"ఏ పిట్టరా..."

"అదే... దాన్ని దయ్యంపిట్ట అంటారు. అది అరచినప్పుడు దాని నోట్లోంచి నెత్తురు పడ్తుం దట. అలా ఎన్ని నెత్తురు చుక్కలు పడ్తే అంతమంది చనిపోతారట..."

భయంతో సరోజ వణికిపోతోంది. నన్ను ఇంకా ఇంకా గట్టిగా కౌగలించుకుంది. నా ఎముకలు విరిగిపోతాయేమోననుకున్నాను.

"ఇక చెప్పకురా... ఇక చెప్పకురా," అంది. కాస్సేపు నిశ్శబ్దం. మా ఇద్దరి గుండెల చప్పుడు తప్ప మరేమీ వినిపించడం లేదు.

అకస్మాత్తుగా సరోజ నన్ను కుదిపేస్తూ...

"వెంటనే వెళ్లిపోదాములా... వెంటనే ఎక్కడికైనా వెళ్లిపోదాము. ఈ ఇంట్లో ఇలా ఎంతో కాలం బతకలేమురా..." అంది.

"ఎక్కడికమ్మగారు..." ఏమీ తెలియడం లేదు నాకు, హాయిగా వున్న సరోజ శరీరం తప్ప.

"ఎక్కడికైనా సరే... ఈ ఇల్లు నాకెందుకో దయ్యాలకొంపలా కనిపిస్తోంది. మా నాన్నని... మా నాన్నని చూస్తే నాకెందుకో భయమేస్తోందిరా..." అది సరోజ. సరోజ గొంతు హెచ్చిస్తోంది.

"మీ నాన్నకి మీరంటే ప్రాణం కదమ్మగారు..."

"ఛీ ఛీ! అంత విపరీతమైన ప్రేమ మంచిది కాదు. అదే... ఆయన చూపించే ఆ ప్రేమంటేనే నాకు భయం. ఆ ప్రేమ నాకెందుకో అసహ్యం కలిగిస్తుంది. నాకు ఇరవై ఏళ్లున్నాయి. ఇంకా పసిపిల్లనే ననుకుంటాడు. నా వయసుకు తగ్గట్టుగా నాకు కోరికలుంటాయని ఆ మనిషికి తెలియనే తెలియదు. నేను బి.ఎ.లు, ఎం.ఎ.లు ప్యాసు కావాలని ఆయన వెర్రి కోరిక. నాకు చదవాలని ఏమాత్రం లేదు. ఈ జన్మలో నేను బి.ఎ. ప్యాసు కాలేను. నేను బి.ఎ. ప్యాసు కాందే పెళ్లి చేయడు నాన్న. ఎంతకాలమని కాల్చివేసే కోరికల్ని అణచుకోగలను. లాభం లేదురా... ఈ మనిషితో నేనిక బతకలేను... వెంటనే ఎక్కడికైనా వెళ్లిపోదాము... వెంటనే ఈ రాత్రే... ఏమంటావురా?"

ఆవేశంగా తనను తాను మరచిపోయి మాట్లాడుతోంది సరోజ. క్షణంసేపు నిశ్శబ్దం. 'అలాగే లేచిపోదాం,' అందామనుకున్నాను. అకస్మాత్తుగా బయట అడుగుల చప్పుడు... మా గుండెల్లో పిడుగులు పడ్డాయి. సరోజ నన్ను కరుచుకుపోయింది. మరుక్షణంలో ఖంగుమని మోగిన రెడ్డి కంఠం. మా ఇద్దరి ప్రాణాలు పోయాయి. సరోజ ఊపిరి బిగబట్టి నన్ను అంటుకుపోయింది.

"ఎవర్రా లోపల? ఎవరు? మళ్లీ మొదలైంది గోల... ఈ ఊళ్లోని రంకుముండల కందరికీ నా పెరడు ఆశ్రయమౌతోంది... ఎన్ని గుండెలు... బయటికి రండి! చంపేస్తాను..." రెడ్డి కర్కశంగా అంటున్నాడు.

వెంటనే నా బుర్రలోకి మెరపులాంటి ఆలోచన వచ్చింది. సరోజను ఈ ప్రమాదం నుండి రక్షించవచ్చు. 'మళ్లీ మొదలైంది ఈ గోల,' అనటంలో రెడ్డి ఉద్దేశం గ్రహించాను. ఎవరో ఊళ్లోని రహస్య ప్రేమికులు పూర్వంలాగ ఈ గదిలోకి వచ్చారని రెడ్డి అనుకుంటున్నాడు. నేనే ఊళ్లో నుండి ఒకదాన్ని తెచ్చుకున్నానని, ఈసారికి క్షమించమని కాళ్లు పట్టుకుంటే రెడ్డి వెళ్లిపోతాడనుకున్నాను. బలవంతంగా సరోజను వదిలించుకుని బయటకొచ్చాను. చీకట్లో నన్ను వెంటనే గుర్తుపట్టలేదు రెడ్డి.

"ఎవడ్రా... ఎవడ్రా నువ్వు?" అన్నాడు రెడ్డి.

"నేనండీ మీ పిచ్చిగాడ్ని," అన్నాను. నన్నెప్పుడూ ఆయన పిచ్చిగాడనే పిలుస్తాడు. నాకు వేరే పేరు లేదు.

ఖంగుమని నవ్వాడు రెడ్డి.

"వోరి నువ్వు... నువ్వట్రా... నీక్కూడా ముండ కావల్సి వచ్చిందిరా... బాగా దాహం వేస్తే మెలుకువ వచ్చింది... మంచినీళ్లు తేరా పిచ్చిగా అని అరిస్తే జవాబు లేదు... మొద్దు నిద్రపోయాడేమోననుకున్నాను. ఇంతలో పెరట్లో నుండి మాటలు వినిపిస్తున్నాయి... ఊఁ! అయితే నువ్వే నన్నమాట... ఎవ్వత్తిరా లోపల... నీ దగ్గరకొచ్చేంత తలకు మాసిన ముండెవ్వత్తిరా ఈ ఊళ్లో... చూడ్డానికి కుర్రకుంకలాగున్నావు... అసాధ్యుడివే."

“ఏదో బుద్ధి గడ్డి తింది... ఈ ఒక్కసారికి క్షమించండి... మళ్లా ఇట్లాంటి పని ఎప్పుడూ చేయను. మీ కాళ్లు పట్టుకుంటాను. ఈసారికి వదిలేయండి.”

ఆయన కాళ్లు గట్టిగా పట్టుకున్నాను.

“వదిలేస్తాను లేరా... కాని ఒకసారి నీ ప్రేయసిని నేను కూడా చూడాలి,” విషపు నవ్వు నవ్వాడు రెడ్డి.

“వద్దు... వద్దండి... వద్దండి... మీరు చూడొద్దు. మీరు చూస్తే ఆమె బతకదు. మీరు వెళ్లి పడుకోండి... ఈ ఒక్కసారికి వదిలేయండి. నన్ను కొట్టి చంపండి... కాని ఆమెను మీరు చూడొద్దు,” అంటూ ఏడ్చాను. నా తల అతని పాదాలకేసి బాదుకున్నాను.

“ఓరి... ఓరి... ఎందుకురా యేడుస్తావు... నేను చూస్తే అది బతకదా... అంత రోషం వుందయితే ఇంత దూరం ఎందుకు వస్తుందిరా పిచ్చిగాడిద... ఇంటికొచ్చిన పిల్లని వదిలే అలవాటు నాకు లేదురా... ఒకటే ఛాన్సు... సరోజ వచ్చినప్పటి నుండీ... నీకు తెలుసుగా... మన షికారు కొంచెం తగ్గింది... ఒక ఛాన్సు చూసి వదిలేస్తాలే...”

రెడ్డి మాటలకు అర్థమేమిటో తెలిసేటప్పటికి నా తల తిరిగిపోయింది. అతని కాళ్లు ఇంకా గట్టిగా నా శక్తినంతా ఉపయోగించి పట్టుకున్నాను.

“వద్దు... వద్దండి... వద్దండి,” అంటున్నాను.

“పిచ్చివెధవ... ఎందుకలా అంత గోల చేస్తావు... అది ఎప్పుడూ నీతో వుంటుందనుకుంటున్నావా... ఇవ్వాళ నువ్వు... రేపు మరొకరు... రేపేమిటి ఇప్పుడే నీ ముందే... అది నన్ను ఇష్టపడుతుంది చూడు... ఏమంటేవే పోరీ!” అంటూ రెడ్డి కదిలాడు. నేను అతని కాళ్లు వదలలేదు.

“వదలరా గాడిదా... వదులు... చస్తావు లేకపోతే... వెళ్లి పడుకో ఫో... నేను దాన్ని పంపిస్తాను గాని ఫో... వదిలేయి... నా కాళ్లు వదిలేయి,” అంటున్నాడు రెడ్డి. నేను అలాగే పట్టుకున్నాను.

“చెప్తే వినవు వెధవా,” అంటూ గట్టిగా తన్నాడు. నా పట్టు తప్పిపోయింది. మూతి మీద బాగా దెబ్బ తాకింది. రక్తం కారుతున్నట్టుంది. నేనిక చచ్చిపోతాననిపించింది. రెడ్డి ఆ గదిలోకి వెళ్లాడు. ఏం జరుగుతుందోనని ఊపిరి బిగబట్టి చూస్తున్నాను.

“ఎవ్వతివే పోరి... కొత్త పిట్టవా... పాత పిట్టవా...? ఈ ఊళ్లో నీకు మా పిచ్చిగాడే దొరికాడా? నేను లేను? రా... ఫస్టుక్లాస్ టెర్లిన్ చీర కొనిస్తాను... రా,” అంటున్నాడు రెడ్డి.

“నాన్నా!” అని వికృతంగా అరిచింది సరోజ. పాపం బద్దలయింది.

“సరోజా... సరోజా... నువ్వా...! నువ్వా పిచ్చిగాడితోనా... పిచ్చిగాడితోనా...” గొంతు చించుకున్నాడు రెడ్డి.

రెడ్డి అలా వెర్రిగా అరవటం, ‘పిచ్చిగాడితోనా! పిచ్చిగాడితోనా!’ అనటం నాకెందుకో ఒక పిచ్చి ఆనందాన్ని కలగజేసింది. మరుక్షణంలో సరోజను జడ పట్టుకుని బయటకు లాక్కొచ్చాడు రెడ్డి. శివమెత్తినట్లు, గంగవెర్రులెత్తినట్టు రెడ్డి ఊగిపోతున్నాడు. సరోజను కొడ్తున్నాడు. తంతున్నాడు... ఉమ్మేస్తున్నాడు. అలాగే ఈడ్చుకుపోతున్నాడు. చచ్చిన జంతువును ఈడ్చుకుపోయినట్లు... ఆ కంపలోంచి, ఆ చెత్తాచెదారంలోంచి. సరోజ ఏడ్వడం లేదు. ఒక శవంలాగా పడి వుంది.

వెంటనే నాకు లేచి పారిపోవాలన్న స్పృహ వచ్చింది. మళ్లీ రెడ్డి కంటబడితే నరికేస్తాడు. శక్తినంతా కూడదీసుకుని లేచాను. పెరటిగోడ దుమికి ఆ రాత్రికి రాత్రే ఆ ఊరు విడిచి పారిపోయి వచ్చాను. ఆ రాత్రి సరోజ ఏమైందో నాకు తెలియదు.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 1969*

## నేపథ్యం

### దొరల దౌర్జన్య మనస్తత్వ విశ్లేషణ

# నిప్పురవ్వలు

***తండ్రిలాగే కూతురు కూడా పిచ్చయ్యను చాలా క్రూరంగా చూసేదట. కొన్నిరోజుల తర్వాత అతని పట్ల ఆమె ప్రవర్తన మారిందట. ఒకపక్క అతన్ని నోటికొచ్చినట్టల్లా తిడ్తూనే, అప్పుడప్పుడు కొడ్తూనే అతన్ని ప్రేమగా చూసేదట. అతని ముందే డ్రెస్సు మార్చుకోవటం, స్నానానికి నీళ్లు పెట్టమనడం, పడకగదికి రప్పించుకుని కాళ్లు పట్టమనడం లాంటి పనులు చేస్తుండేది.***

నేను ఈ నిప్పురవ్వలు కథను 1967లో రాశాను. 1969లో దీన్ని ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురించారు.

నేను 1958-62 మధ్యకాలంలో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బి.ఎ. చదువుతున్న రోజుల్లో ఎప్పుడు సెలవులొచ్చి మూడు నెలలు మా ఊర్లోనే గడిపే వాడిని. అప్పుడు నాకు మా వూరి స్కూల్లో టీచర్‌గా పనిచేసే నరసింహారావు అనే అతడు మిత్రుడయ్యాడు. నాలాగే ఆయనకూ సాహిత్యం మీద, సినిమాల మీద చాలా ఆసక్తి ఉండేది. నేనాయన ఇంటికి వెళ్లి గంటలగ్గంటలు ఆయనతో సినిమా లను గురించి కబుర్లు చెప్పుకుంటూ గడిపేవాడిని. నేనే కాకుండా ఈ టీచర్ ఇంటికి వేరేవాళ్లు కూడా చాలామంది వస్తూండేవాళ్లు. అలా వస్తున్న వాళ్లల్లో పిచ్చయ్య అనే ఓ వ్యక్తి మీద నాకు చాలా ఇంటరెస్ట్ కల్గింది.

ఈ పిచ్చయ్య ఇంచుమించు నా వయస్సువాడే. చూడటానికి పొట్టిగా, నల్లగా, మొరటుగా ఉండేవాడు. పెద్దగా యేమీ చదువుకున్నవాడు కాడు. మా ఊరికి ఆయి లింజన్లను బాగు చేసేందుకు అతన్నెవరో మా ఊరికి తీసుకొచ్చాడట. చూడటానికి మొరటుగా ఉన్నా, పిచ్చయ్య కబుర్లు బాగా చెప్పేవాడు. అతడిదివరకున్న ఊర్లో- అదో చిన్న టౌనట- సినిమాలు బాగా చూసేవాడట. సినిమాలను గురించి, సినిమాల్లో నటిస్తున్న నటీనటులను గురించి అతడు నేనిదివరకెప్పుడూ వినని వార్తల్ని చెబు తుండేవాడు. నాకు తెలిసిన కబుర్లు నేను చెప్పేవాడిని. ఈ పిచ్చయ్య కెందుకోగాని

నేను బాగా నచ్చాను. నాతో చాలా క్లోజ్‌గా మొదలడం మొదలెట్టాడు. మేమిద్దరమే కలిసి మా ఊరి చెరువు కట్టమీదున్న ఓ పెద్ద మర్రిచెట్టు క్రింద కూర్చొని చాలాసేపు కబుర్లు చెప్పుకునేవాళ్లం. ఈ పిచ్చయ్య మా ఊరికి రావడానికి ముందు ఒక దొరగారింట్లో పనిచేసిన విషయం, ఆ ఇంట్లో ఆయనకు ఎదురైన ఒక సమస్యను గూర్చి చాలాసార్లు చెప్పాడు.

ఈ పిచ్చయ్య ఓ అనాథ. అతనికి తల్లీతండ్రి లేరు. ఇతని చిన్నప్పుడే వాళ్లు చనిపోయారుట. ఇతని మేనమామే ఇతన్ని పెంచాడట. ఇతనికి యేడెనిమిదేళ్లు రాగానే ఓ దొర ఇంట్లో పనిపిల్లాడిగా కుదిర్చాడు. చాలాకాలం ఆ దొరగారింట్లోనే వాళ్లు యే పని చెబితే ఆ పని చేస్తూ, వాళ్లు పెట్టింది తింటూ బతికాడు. ఆ రోజుల్లో తీరిక దొరికినప్పుడల్లా ఆ ఊర్లో ఆయిలింజన్లు బాగుచేసే ఓ మెకానిక్ దగ్గరకు వెళ్లి ఆయిలింజన్లను బాగు చెయ్యడం నేర్చుకున్నాడు (అప్పటికింకా కరెంటు మోటార్లు రాలేదు). పదహారేళ్ల వయస్సు వచ్చేంతవరకు పిచ్చయ్య జీవితం ఇలా గడిచిపోయింది. సరిగ్గా అప్పుడే పిచ్చయ్య జీవితం ఒక ఆశ్చర్యకరమైన, అతడూహించని మలుపు తీసుకుంది.

పిచ్చయ్య పనిచేస్తున్న దొర ఇంటికి ఓరోజు చుట్టపుచూపుగా ఆయన కంటే పెద్దదొర ఒకాయన వచ్చాడు. పిచ్చయ్యను, ఆ ఇంట్లో పిచ్చయ్య చేస్తున్న పనులను చూశాడు. పిచ్చయ్య పనితీరు ఆ పెద్ద దొరకు బాగా నచ్చింది. ''ఈ పిచ్చిగాన్ని నాతో పంపించు. నాకు వీడు కావాలె,'' అన్నాడా పెద్దదొర. పెద్ద దొరకున్నన్ని భూములుగానీ, హోదాగానీ, పలుకుబడిగానీ చిన్న దొరకు లేవు. అందుకని పెద్ద దొర మాటకు ఎదురుచెప్పే సాహసం చిన్నదొరకు లేదు. అలా పిచ్చయ్య వచ్చి పెద్దదొర పంచన చేరిపోయాడు.

పెద్దదొరకు ఒక్క కూతురు తప్ప ఎవరూ లేరు. ఆయన భార్య చాలాకాలం క్రితమే చనిపోయింది. ఆయనకున్న ఆ ఒక్క కూతురు సిటీలో హాస్టల్లో ఉంటూ కాలేజీలో చదువు కుంటోంది.

ఈ పెద్దదొరకు ఆనాటి దొరలకుండే అలవాట్లన్నీ ఉన్నాయి. ఊరివాళ్లతో చాలా హైలెవెల్లో ఉండి మాట్లాడటం, పేద, నిమ్నవర్గాలవారితో చాలా క్రూరంగా ప్రవర్తించటం, పేదింటి ఆడపిల్లల్ని ఇంటికి రప్పించుకోవటం, బాగా తాగటం, తినటం లాంటి అలవాట్లన్నీ ఇతనికున్నాయి. పిచ్చయ్య ఈ దొరగారి గడీకొచ్చినప్పట్నించి నరకం అనుభవించాడు. ఇదివరకు పిచ్చయ్య పనిచేసిన దొరింట్లో అతన్ని బాగానే చూసుకునేవారు. కానీ ఈ పెద్దదొర మాత్రం వట్టి పుణ్యానికే పిచ్చయ్యను రూళ్లకర్రతో క్రూరంగా కొడ్తుండేవాడట.

పిచ్చయ్య ఈ పెద్దదొర గడీకొచ్చిన కొన్ని రోజుల తర్వాత సిటీలో చదువుకుంటున్న అతని కూతురొచ్చింది. పిచ్చయ్యను చూడగానే, 'ఈ వింత జంతువునెక్కడ్నించి పట్టుకొచ్చినవు బాపూ,' అందిట.

తండ్రిలాగే కూతురు కూడా పిచ్చయ్యను చాలా క్రూరంగా చూసేదట. కొన్నిరోజుల తర్వాత అతని పట్ల ఆమె ప్రవర్తన మారిందట. ఒకపక్క అతన్ని నోటికొచ్చినట్టల్లా తిడ్తూనే, అప్పుడప్పుడు కొడ్తూనే అతన్ని ప్రేమగా చూసేదట. అతని ముందే డ్రెస్సు మార్చుకోవటం, స్నానానికి నీళ్లు పెట్టమనడం, పడకగదికి రప్పించుకుని కాళ్లు పట్టమనడం లాంటి పనులు చేస్తుండేది. ఆ తండ్రీ కూతుళ్ల మధ్య ఉన్న సంబంధం కూడా పిచ్చయ్యను ఆశ్చర్యపరుస్తుండేది. కూతురు మీద ఆ తండ్రికి విపరీతమైన ప్రేమ. ఆ ప్రేమ అసహజమైన ప్రేమలా పిచ్చయ్యకు కనిపించేదట. యౌవనంలో ఉన్న కూతుర్ని చంటిపిల్లలా కౌగలించుకోవటం, చెంపల మీద ముద్దు పెట్టుకోవటం లాంటి పనులు చేస్తుండేవాడట.

క్రమంగా పిచ్చయ్యకు ఆ దొరగారి కూతురొక పెద్ద సమస్యగా మారింది. ఆమె అతడినొక యువకుడిలా కాకుండా చంటిపిల్లాడన్నట్టుగా చూడటం, అతని ముందే బట్టలు మార్చుకోవడం, స్నానానికి నీళ్లు పెట్టమనడం, ఆమె పడుకున్న గదిలోకి పిలిచి కాళ్లు పట్టమనడం లాంటి పనులు చేయడంతో పిచ్చయ్యలోని యౌవనం జాగృతమైంది. ఆమెక్కూడా అతని మీద కోరిక కల్గుతున్న దని అతనికి నెమ్మదిగా అర్థమైంది. ఆ కోరికను కప్పిపుచ్చుకోవడానికి ఆమె అతనిపట్ల కావాలని చాలా క్రూరంగా ప్రవర్తించేది. 'నాకేసి ఎందుకట్ల చూస్తున్నవురా!' అని కొట్టేదట. అలా కొడ్తూ, 'నిన్ను అనవసరంగా కొట్టాన,'ని యేడ్చేదట. ఒకరోజు అకస్మాత్తుగా అతన్ని పెనవేసుకొని తన కోరిక తీర్చమందట. పిచ్చయ్యకు భయమేసింది. అయినా అతనితో ఆమె తన కోరిక తీర్చు కుందట! అలా రెండుమూడు రాత్రులు ఆమె తండ్రి, పెద్దదొర బాగా తాగి గురకపెట్టి నిద్రపోతున్న టైమ్‌లో వాళ్లిద్దరూ కలుసుకునేవారు. ఈ విషయం దొరకు తెలిస్తే తనను చంపేస్తాడన్న భయం పిచ్చయ్యను వేధించసాగింది. ఎలాగైనా ఆ ఇంట్లోంచి దూరంగా పారిపోవాలని అతడు నిర్ణ యించుకున్నాడు.

కొద్దిరోజుల తర్వాత ఆ అమ్మాయి చదువుకోటానికి సిటీకి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఓ అర్ధరాత్రి లేచి పిచ్చయ్య ఆ ఇంట్లోంచి వెళ్లిపోయి ఆ ఊరికి చాలా దూరంగా ఉన్న మరో ఊర్లో ఆయిలింజన్లు రిపేర్ చేసే మెకానిక్‌గా స్థిరపడిపోయాడు. ఆ తర్వాత అతన్ని మా ఊరికి కొందరు రైతులు వాళ్ల ఆయిలింజన్లు బాగు చేయించుకోవడం కోసం తీసుకొచ్చారు. అప్పుడే అతడు నాకు పరిచయమై ఈ కథంతా చెప్పాడు.

పిచ్చయ్య చెప్పిన ఈ కథలోంచి ఓ మంచి కథను రాబట్టవచ్చునని నాకనిపించింది. పిచ్చయ్య చెప్పిన కథకు ఫ్రాయిడ్ మనోవిశ్లేషణా సూత్రాలను అన్వయిస్తే చాలా మంచి మనో విశ్లేషణాత్మక కథ అవుతుందనుకున్నాను.

ఆ తండ్రికి కూతురుకు ఉన్న ఆ అసహజ విపరీత సంబంధాన్ని 'డాటర్ ఫిక్సేషన్' అంటా రని, అతని అంతశ్చేతనలో కూతురి మీదున్న లైంగికవాంఛ (ఇన్‌సెస్ట్)ను కూతురి వయస్సే వున్న వేరే స్త్రీల ద్వారా తీర్చుకుంటున్నాడన్న సూచనను కథలో ఇవ్వాలనుకున్నాను. అలాగే ఆ అమ్మాయికి పిచ్చయ్య మీద కలుగుతున్న లైంగిక వాంఛను కప్పిపుచ్చుకోవడానికే అతని పట్ల అంత క్రూరంగా- కావాలనే ప్రవర్తిస్తున్నదని (పర్సిక్యూషన్ మేనియా) కూడా సూచించాలను కున్నాను. అలాగే ఈ పిచ్చయ్య మనస్తత్వంలో మెసోకిజమ్ (తన మీద జరుగుతున్న హింస ద్వారా లైంగికానందాన్ని పొందటం) లక్షణాలున్నాయని కూడా చెప్పాలనుకున్నాను. అతని అంత శ్చేతనలో కూతురుపట్ల స్థిరపడిన డాటర్ పిక్సేషన్ కారణంగానే అతడు పిచ్చయ్యతో అతని కూతురు కలుసుకుంటున్న గది దగ్గరకు వెళ్లాడని, 'లోపలున్న నువ్వు తెచ్చుకున్న దాన్ని నేనూ ఓ పట్టుపడ్తా,'నని పిచ్చయ్యతో అనేలా చేసిందని కూడా ఈ కథలో సూచించాలనుకున్నాను. వీటన్నిటితో పాటు ఈ కథలో భూస్వామ్య సంస్కృతి ఎలా భ్రష్టుపట్టిపోయి పతనమైపోతున్నదో చెప్పాలనుకున్నాను. వీటన్నిటి సమాహార రూపమే నిప్పురవ్వలు కథ.

ఈ కథను రాశాక దీన్నెవరైనా ప్రచురిస్తారా? అన్న అనుమానం కల్గింది. ఇద్దరు ముగ్గురు మిత్రులు దీన్ని చదివి, 'దీన్నెవరూ ప్రచురించరు,' అని చెప్పేశారు. హైదరాబాద్‌లోని ఆలిండియా రేడియో హిందీ విభాగంలో పనిచేస్తున్న దండమూరి మహీధర్‌గారితో నాకు ఆరోజుల్లోనే పరి చయం కల్గింది. యువ మాసపత్రికకు కథల్ని ఆయనే సెలెక్ట్ చేస్తాడని తెలిసి ఆయనకు నేనీ కథనిచ్చాను. ఆయన చదివిన వెంటనే, 'చాలా గొప్పకథ రాశావు నవీన్! దీన్ని వెంటనే నేను

హిందీలోకి అనువదిస్తున్నాను. కానీ ఇంత గొప్ప కథను నేను యువలో ప్రచురించగలనో లేదో చెప్పలేను,' అంటూ నాకు ఉత్తరం రాశాడు. కొద్దిరోజుల తర్వాత ఆయన కథను తిప్పి పంపిస్తూ, 'యువలో ప్రచురణకు మా ఛీఫ్ ఎడిటర్ అంగీకరించలేదు,' అని ఉత్తరం రాశాడు. (ఈ కథను దండమూడి మహీధర్ *చింగారియా* పేరుతో హిందీలోకి అనువదించి ఓ ప్రముఖ హిందీ పత్రికలో ప్రచురించాడు.)

తర్వాత నేను ఈ కథను *ఆంధ్రజ్యోతి* వారపత్రికకు పంపించాను. అప్పుడా పత్రికకు పురాణం సుబ్రహ్మణ్యశర్మ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. మనం యేదైనా పత్రికకు కథ పంపిస్తే ఆరునెలల దాకా ఆ కథ ప్రచురణకు అంగీకరించబడిందో లేదో తెలీదు. అలాంటిది నేను *ఆంధ్ర జ్యోతి*కి కథ పంపించిన మూడు నెలల తర్వాత ఈ కథ వెలువడిన *ఆంధ్రజ్యోతి* పోస్టులో మా ఇంటికొచ్చింది. (అంతకుముందు ఈ కథ ప్రచురణకు అంగీకరించబడినట్టుగా నాకు సమాచారం లేదు.) ఆ క్షణంలో నేనెంత థ్రిల్లయిపోయానో! నేనెప్పుడూ మరచిపోలేని క్షణమది.

దీనికో కొసమెరుపు కూడా ఉంది. ఈ కథ చదివిన ఒక మిత్రుడు పురాణం సుబ్రహ్మణ్య శర్మగారి దగ్గరకొచ్చి, 'ఇది డి.హెచ్. లారెన్స్ కథకు కాపీ,' అని చెప్పాడట. అతని మాటను నమ్మిన పురాణం నాకు బాగా తెలిసిన ఒక మిత్రునితో, 'మాకు నవీన్ మీద నమ్మకం పోయింది,' అన్నాట్ట. ఈ విషయం నాకు తెలియగానే, పురాణంగార్కి, 'ఈ కథ డి.హెచ్. లారెన్స్ కథకు కాపీ అని మీరు రుజువు చేస్తే నేను కథలు రాయడం మానేస్తాను. కాపీ కాదని నేను రుజువు చేస్తే మీరు *ఆంధ్రజ్యోతి* ఎడిటర్‌గా రాజీనామా చేస్తారా?'' అని ఉత్తరం రాసి రిజిష్టర్డ్ పోస్ట్‌లో పంపించాను. ఇది జరిగిన కొన్ని రోజుల తర్వాత హైదరాబాద్‌లో ఓ సాహిత్యసభలో నన్ను చూసిన పురాణం, 'ఎవరో ఏదో అంటే దాన్నంత సీరియస్‌గా తీసుకోవాలా?' అన్నాడు.

*'నిప్పురవ్వలు' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

*15 డిసెంబర్ 2012*

# 10



*పి. సత్యవతి 2 జులై 1940న గుంటూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ తెలుగు స్వతంత్ర పత్రికలో అచ్చయింది. నాలుగు కథాసంపుటాలు- పి. సత్యవతి కథలు, ఇల్లలకగానే, మంత్ర నగరి, మెలకువ ప్రచురించారు. ఐదు నవలలు రాశారు. అనేక కథల్ని, వ్యాసాల్ని ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువాదం చేశారు. వీరి కథలు ఇతర భాషల్లోకి అనువాదం అయ్యాయి. ఇంగ్లీషు లెక్చరర్‌గా రిటైరయ్యారు.*

**చిరునామా**

*బి-3, గెహనా అపార్ట్‌మెంట్స్,*
*గోగినేనివారి వీధి, మారుతీనగర్,*
*విజయవాడ - 520 004.*
*Ph.: 98481 42742*

## పెళ్ళి ప్రయాణం

### పి. సత్యవతి

ఉన్న పొలాన్నీ, ఉంటున్న ఇంటినీ వదిలి చిన్న మామయ్య హైదరాబాద్ వెళ్ళిపోతున్నాడని తెలిసి అమ్మ ఖేదపడింది. తను పుట్టీ, పెరిగీ, ఊహలు సంతరించుకుని, ఆడిపాడి, చదివీ జీవితంలో అడుగుపెట్టిన ఆ ఊరినీ, ఆ ఇంటినీ, తన తండ్రినీ ఒకసారి చూడాలనే ఉద్దేశంతోనే ఆవిడ చిన్న మామయ్య కూతురు శ్రీలక్ష్మి పెళ్ళికి ప్రయాణమైంది.

ఆ పెళ్ళి ఉన్నంతలో బాగా చేస్తున్నాననీ, బంధువులందర్నీ ప్రత్యేకంగా పిలిచాననీ, అమ్మని తప్పకుండా రమ్మనీ చిన్న మామయ్య మరీ మరీ కోరుతూ ఉత్తరం రాశాడు. అలాంటి అంగరంగ వైభోగంగా జరిగే పెళ్ళిళ్ళన్నా ఒకచోట సమావేశమయ్యేలా అశేష బంధువర్గం అన్నా అమ్మకిష్టం ఉండదు. అయినా, ఆవిడెందుకనో వెంటనే ప్రయాణం అయింది. ఇంటికి వచ్చి చాలారోజులైందని వారంరోజులు సెలవు పెట్టి బెంగుళూరు నుంచి వచ్చిన నన్నూ ప్రయాణం చేసింది.

"మహానగరంలో పుట్టి పెరిగి ఇంకా మహానగరంలో ఉంటున్నావు. మీ అమ్మ ఎక్కడ పుట్టిందో, మీ అమ్మమ్మ ఎలా జీవించిందో చూద్దువుగాని రాకూడదూ?" అని నన్నూ ప్రయాణం చేసింది.

అమ్మ పుట్టిల్లు ఆనందపురం నేనెప్పుడూ వెళ్లలేదని కాదు. పదిహేనేళ్ల కిందట అమ్మమ్మ పోయినప్పుడు అందరం వెళ్లేం. అప్పుడు అక్కడ పదిరోజులు ఉన్నాను కూడా. మూసిన తలుపుల మధ్య ఉండీ, ఉండీ ఆ తలుపులు తెరుచుకుని విశాలమైన మైదానంలో అడుగు పెట్టినట్లుం టుంది ఆ ఊరు వెడితే. నాన్నకసలు అక్కడికి రావడం ఇష్టం ఉండదు. అందుకని అమ్మ పిలవదు. మేం ఇద్దరం తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌కు విజయవాడకి టికెట్స్ రిజర్వ్ చేయించుకున్నాం. ఉండడానికి ఆనందపురం కలకత్తా-మద్రాసు రైల్వేలైను మీద ఉన్నా అక్కడ ప్యాసింజర్లు తప్ప ఆగవు. మరీ వేగంగా వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు తెనాలిలోనూ ఆగవు. అంచేత ఢిల్లీ నుంచి విజయవాడలో దిగి, టాక్సీలో వెళ్లడం మంచిదని నిర్ణయించాం. అమ్మ కూడా అటువైపు వెళ్లి పదేళ్లయింది. ఆవిడ ఉద్యోగం, మా చదువులు, ఆవిడ వ్యాపకాలు ఆవిణ్ణటు వెళ్లడానికి ఇన్నాళ్లూ అనుమతించ లేదు.

అమ్మ స్నేహితురాలు డాక్టర్ త్రిపురసుందరి విజయవాడలో పేరు ప్రఖ్యాతులున్న వైద్యురాలు. ఆవిడ అర్ధరాత్రి వేళ స్వయంగా స్టేషనుకు వచ్చి మమ్మల్ని తన ఇంటికి తీసుకు వెళ్లి తెల్లవారి తన కారులో ఆనందపురం పంపించింది.

మంగళగిరి దాటిన తరువాత కారు తెనాలి రోడ్డు పట్టిన దగ్గర నుంచి అమ్మ మాట్లాడు తూనే ఉంది. ఆవిడ ఎప్పుడూ ఇంత మాట్లాడదు. మితభాషి.

''ఇది తుమ్మపూడి. సంజీవ్‌దేవ్‌గారి ఊరు.''

''ఇది దుగ్గిరాల పసుపు మార్కెట్.''

''ఇది చూశావా, ఆనందపురం రైల్వేస్టేషన్. నాకు ఊహ తెలిసిన దగ్గర్నుంచీ ఇలాగే ఉంది. రైలు దిగాలంటే నిచ్చెన దిగినట్లే. ఈ ప్లాట్‌ఫాం మాత్రం ఎత్తు చెయ్యరు.''

రెండు బస్సులు ఎదురైతే తప్పుకోడానికి కష్టమయ్యే ఆ రోడ్డుకి రెండుపక్కలా కాలువలు, పెరిగిన పొలాలు, చురుగ్గా పైకి వస్తున్న సూర్యుడు. పక్కన కూర్చున్న అమ్మ మొహంలో వెలుగు, పరిమితమైన వేగంలో పోతున్న కారు, ఉల్లాసంగా ఉన్న వాతావరణం. అమ్మని చూస్తే నాకు ఆశ్చర్యంగా అనిపించింది. తిరునాళ్లలో తప్పిపోయి, చాలాకాలానికి దారి కనుక్కుని ఇంటికి వస్తున్న చిన్నపిల్లలా ఉంది ఆవిడ.

''ఆ ఊరు నీదికాదు. అక్కడి పొలాలూ నీవికావు. ఆ ఇంట్లో ఒక సూదిమొన స్థలం కూడా నీకు లేదు. అయినా, ఆ ఊరి మీద, ఆ ఇంటి మీద నీకెందుకంత మమకారం?'' ఇది నాన్న ప్రశ్న.

దానికి అమ్మ జవాబు చెప్పలేదు.

పుట్టినప్పటి నుంచీ గుండెల మీద కుంపటిగానే భావించి తృణమో పణమో ముట్టజెప్పి అల్లుడికి అంటగట్టి పంపించే పుట్టిళ్లని కూడా ఆడవాళ్లు ప్రేమిస్తూనే ఉంటారు. ప్రేమించే గుణం వాళ్ల రక్తంలో ఇంకిపోయింది. అమ్మ విషయంలో తృణమో పణమో ముట్టజెప్పడం కూడా జరగలేదు. అయినా, ఆవిడకి ఆ ఊరంటే ప్రేమ. ఆ ఇల్లంటే ప్రేమ. తండ్రంటే ప్రేమ ఉందో లేదో నాకు తెలియదు. ఆవిడెప్పుడూ చెప్పదు.

అమ్మమ్మగారింటికి గేట్లు రెండుంటాయి. రెండవ గేటు దగ్గర కారు ఆగింది. ఆ గేటు పక్కనుంచే కొబ్బరిచెట్లు, గోడనానుకుని విరబూసిన రాధామనోహరం తీగె - పదిహేనేళ్లనాడు ఎలా ఉన్నాయో అలాగే ఉన్నాయి. కారు ఆగుతూనే లోపల నుంచి మామయ్య పరిగెత్తుకుని వచ్చాడు. ఆ వెంట మరికొందరు వచ్చారు. పదేళ్ల తర్వాత చూసిన అమ్మని వాళ్లు కౌగిలించుకుంటా

రనుకున్నానుగానీ, అది ఆంధ్రదేశంలో సంప్రదాయం కాదని గుర్తొచ్చింది. పదిహేను సంవత్సరాల కింద నేను వచ్చినప్పుడు ఆ ఇంట్లో ఇద్దరు వ్యక్తులతో నాకు సన్నిహిత స్నేహం కుదిరింది. ఒకటి- మా పెద్దమ్మ కూతురు సుధ, రెండు- మా పెద్ద మామయ్య భార్య శారద. ఆ పదిరోజులలో వారిద్దరి సాహచర్యాన్ని నేనెప్పుడూ మర్చిపోను. ఇప్పుడు సుధని గుర్తుపట్టగలనో లేనో- ఉత్తరాల ద్వారా పలకరించుకోవడమేగానీ.

చాలారోజుల తరువాత వచ్చిన అమ్మని వాళ్లంతా ఘనంగా ఆహ్వానించి, మర్యాదలతో ముంచెత్తారు. కాళ్లు కడుక్కోడానికి నీళ్లిచ్చారు. కూర్చోకముందే కాఫీ కప్పులు అందించారు. కార్లో సామాన్లు గదిలో పెట్టించారు. ప్రయాణం సుఖంగా జరిగిందో లేదోనని ఆత్రుతగా ప్రశ్నించారు. జరిగిందని విని సంతోషించారు. తాతయ్య కూడా లోపల నుంచి వచ్చి అమ్మని పలకరించి కూర్చున్నాడు. నేనే వెళ్లి తాతయ్యని పలకరించాను. బాగా పెద్దవాడయ్యాడు. ఆయన అమ్మమ్మ పోయినప్పుడు దృఢంగానే ఉన్నాడు. ఇప్పుడు డెబ్భై దాటిపోయాయి. ఎనభైకి దగ్గర పడ్డట్లున్నాడు. విడిది ఏర్పాట్లు చూడ్డానికి వెళ్లిన కలెక్టర్ పెద్దమ్మ, ఆమె కొడుకు రవి వచ్చేరు. రవి రెండు వారాలయిందట ఇండియా వచ్చి. తాతయ్యని చూడడానికి వచ్చాడట. వాడికి ఈ దుమ్ములో, ఎండలో ఏం జబ్బు చేస్తుందోనని పెద్దమ్మ హడలిపోతోందట. మినరల్ వాటర్‌సీసా చేత్తో పట్టుకుని తిరుగుతోంది. వాడికిదేం పట్టినట్లు లేదు. హ్యాండీక్యామ్ తీసుకుని ఇల్లంతా తిరిగి కనపడ్డ వాళ్ల నల్లా ఇంటర్వ్యూలు చేసేస్తున్నాడు. ముఖం మీద ఒక్క వెంట్రుక కూడా లేకుండా నున్నగా, తెల్లగా, పాలరాతి బొమ్మలా ఉన్న రవి ఆ ఇంట్లో ఒక ప్రత్యేక ఆకర్షణ. అంతలో శ్రీలక్ష్మి వచ్చి అమ్మ కాళ్లకి దండం పెట్టింది. సినిమాలో పెళ్లికూతురిలా కొంచెం ఎక్కువగానే ముస్తాబైంది. నేను చూసినప్పుడు చిన్న పిలకతో చెడ్డీ వేసుకుని మట్టిలో ఆడుతూ ఉండేది. జుత్తుని చాలా అందంగా దువ్వింది. పెదవులకి రంగు కూడా వేసింది. తెనాలి కాలేజీలో డిగ్రీ చదివిందట.

"నేను జయని," అని పరిచయం చేసుకుంటే, నాకొక నమస్కారం పెట్టింది.

"నమస్తే జయాజీ," అంటూ వచ్చాడు రాజు. రాజు నేను చూసినప్పుడు పదేళ్లవాడు. ఇప్పుడు పొడవుగా, బలంగా తయారయ్యాడు. నన్నెలా గుర్తుపట్టాడో!

"అచ్చమైన రైతులా తయారయ్యేవురా రాజూ," అతడిని అభినందించింది అమ్మ. ఇంటికి ఉత్తరం వైపున ఉన్న చాలా ఖాళీస్థలంలో పెద్ద షామియానా వేశారు. అమ్మమ్మ పోయినప్పుడు అక్కడే షామియానా వేశారు. షామియానాలంటే అందుకే అయిష్టం నాకు. ఈ షామియానాకి రంగు కాగితాలూ, మామిడి తోరణాలూ కట్టారు. పిల్లలు టేప్‌రికార్డర్‌లో నుంచి 'శ్రీలక్ష్మి పెళ్లికి చిరునవ్వు కట్నం,' అనే పాట విని ఆనందిస్తున్నారు.

ఒక పెద్ద హాలు. అందులో తూగుటుయ్యాల. అన్నీ కలిసి ఓ ఆరు గదులూ, వంట ఇల్లూ, పచ్చళ్ల గదీ, పూజగది, భోజనాల గది, రెండు పెద్దపెద్ద స్నానాల గదులు, కావల్సినంత పెరడూ- 'ఎంత పెద్ద ఇల్లో' అనిపించేలా ఉంటుంది ఆ ఇల్లు. హాలులో అమ్మమ్మ ఫోటోకి దండ వేసి, చుట్టూ చిన్నచిన్న ఎలక్ట్రిక్ బల్బులు అమర్చారు. దాని పక్కన వరుసగా తాతయ్య తండ్రి, తల్లి ఫోటోలు, వాటన్నింటికీ దండలు. వెంకటేశ్వరస్వామి, అలివేలుమంగ ఫోటో, దానికి దండ. ఆంజనేయస్వామి ఫోటో, దానికి దండ. దండలన్నీ కొత్తవి. పెళ్లి కోసం ఫోటోలని కూడా ముస్తాబు చేశారు. హాలులో కూర్చున్న మమ్మల్ని ఒకరొకరే పలకరించి పోతున్నారు. సుధ మాత్రం కనిపించలేదు.

ఇల్లంతా బంధువులతో నిండిపోయింది. పక్క పల్లెటూరు నుంచి తాతయ్య చెల్లెలు మహాలక్ష్మమ్మగారు కూడా ఒంటెద్దు బండి కట్టించుకుని వచ్చింది. ఎముకల మీద చర్మం కప్పుతున్నట్లు

ఉన్నా ఆవిడ ఓపికగా ఒడ్డాణం, కాసులపేరు మోస్తోంది. ప్రతి చిన్న విషయాన్ని ప్రయోజనాల దృష్ట్యా బేరీజులు వేసే ఈ రోజుల్లో ఇంతమంది బంధువులు ఈ పల్లెటూరుకి రావడం నాకు వింతగానే అనిపించింది. బంధుప్రేమలు ఇంకా ఉన్నాయనడానికి ఇదొక నిదర్శనమేమో!

అంతలోనే వాకిట్లో చిన్న కలకలం రేగింది. ఏమిటని చూస్తే పతివ్రత పిన్ని, బడాబాబూ వస్తున్నారు. పిన్ని వస్తూనే అమ్మని ఒక్క నిమిషం పలకరించి లోపలికిపోయింది హడావిడిగా.

''హలో జయా హౌ ఆర్ యూ? ఎలా ఉంది నీ ఉద్యోగం? పెళ్లి మాటేమైనా తల పెట్టావా?'' అన్నాడు. బడా(యి)బాబు. ఈయన నాకు బాబాయి.

''నేను బావున్నాను. మీరెలా ఉన్నారు? మీకు జనరల్ మేనేజర్ ప్రమోషన్ వచ్చేసిందా?'' అన్నాను.

''బావుండకేం బ్రహ్మాండంగా ఉన్నాను. ఉండకపోతే మీ పిన్ని ఊరుకోదు కదా! జనరల్ మేనేజర్‌దేం ఉంది- అయిపోతాను,'' అన్నాడు.

అంతలో పిన్ని ఓ గాజుగ్లాసులో పండ్ల రసంతో ప్రవేశించింది. అది ఆయనకిచ్చి పొద్దున ఆయన్ని వాకింగ్‌కి తీసుకువెళ్లడం, అక్కడ ఆయన చిన్నపిల్లాడిలా ఈతలాడుతానని మారాం చెయ్యడం, ఈవిడ బతిమాలి కొంపజేర్చడం గురించి చెప్పింది. వాకింగ్ అయి ఇంటికి రాగానే రసం తాగకపోతే ఆయనకి నీరసం వస్తుందని కూడా చెప్పింది. చెప్పి మళ్లీ ఆయన స్నానం ఏర్పాట్ల కోసం వెళ్లింది.

బడా(యి)బాబుతో మాట్లాడడం కొంచెం ఇబ్బందికరంగా ఉంటుంది. తను మేధావిననీ, పెద్ద ఉద్యోగస్తుడిననీ మర్చిపోలేడు. ఎదుటివాళ్లు వట్టి పనికిమాలిన వాళ్లనీ, వాళ్ల మీద దయదలిచి మాట్లాడుతున్నాననీ అనుకుంటాడు. ఈ దయదలచడం అంటే ఒళ్లుమంట నాకు. 'ఓ ఐసీ', 'ఆహా', 'క్వయిట్ ఇంటరెస్టింగ్', 'హౌ ఫన్నీ' లాంటి పదాలు నిమిషానికొకటి వాడుతుంటాడు. పాపం పిన్ని రెండు నిమిషాల్లో ఆయనకి నీళ్లు ఏర్పాటుచేసి వచ్చి ఆయన్ని లాక్కుపోయింది. 'అమ్మయ్య' అనుకుంటూండగా సుధ వచ్చింది. వెనక నుంచి కళ్లు మూసి ఎవరో కనుక్కోమంది. అప్పుడప్పుడే ఓణీలు వేసేది. ఇప్పుడు చాలా పెద్దదానిలా ఉంది. నాకన్నా రెండేళ్లే పెద్ద. నేను అప్పుడు టెన్త్‌క్లాసు. తను సీనియర్ ఇంటర్.

ముఖంలో ఆ మెరుపు, కళ్లలో ఆ చురుకూ లేవు. కళ్ల కింద కొంచెం నలుపు కూడా వచ్చింది. ''ముప్ఫై ఏళ్లకే ముసలమ్మ అయిపోయావేమిటే?'' అంది అమ్మ.

''ఏమిటో పిన్నీ ఉద్యోగం, ఇంటి పనితో ఇలా అయిపోయాను,'' అంది సుధ.

సుధా నేనూ షామియానా కింద వేసిన కుర్చీల్లోకి పోదాం అనుకుంటూ ఉంటే పిన్ని స్నానం చేయించిన బాబాయిని తీసుకొచ్చి గదిలోకి పంపించి మా కెదురుగా కూర్చుంది.

''ఆయనకి స్నానం చెయ్యగానే పది నిమిషాలు ధ్యానం చేసుకునే అలవాటు. అప్పుడంతా నిశ్శబ్దంగా ఉండాలి,'' అంది.

''రమ, కృష్ణుడు బావున్నారా పిన్నీ,'' అన్నాను నేను. రమ గురించి చెప్పడం మొదలు పెట్టింది. రమ చదువు, క్లాసులో దాని ఆధిపత్యం, దానికొచ్చిన ప్రైజులు, దాని తెలివి, కృష్ణుడూ- వాడి తెలివీ, వాడి మార్కులూ, వాడి మాటలూ, వాడి జోకులు.

''ఇద్దరూ ఇద్దరే! మాణిక్యాలు,'' అంది పెద్దమ్మ.

''బాబాయిగారి ధ్యానం అయినట్లుంది. రవి ఎక్కడున్నాడో కొంచెం చూద్దూ. వాడితో అయితే ఆయన కబుర్లు చెబుతారు. కాలక్షేపం అవుతుంది,'' అంది పిన్ని.

“మేం వెతికి పంపిస్తాంలే పిన్నీ,” అని అక్కడి నుంచి తప్పించుకుని వచ్చాం. షామియానా కింద భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. పన్నెండు గంటల కల్లా పెళ్ళివారొచ్చేస్తారట. రాగానే భోజనం చేస్తారట. హైదరాబాద్ నుంచి రెండు బస్సుల్లో వస్తారట. నూటయాభై మందికి పైనే వస్తారట.

“చాలా శ్రమపడి వస్తున్నారు పాపం!” అన్నాను నేను.

“ఏంలేదు. బస్సు ఖర్చులు మనవే. బస్సు ఖర్చులివ్వకపోతే అక్కడికి వచ్చి పెళ్లి చెయ్యమని అడిగారు. అక్కడ పెళ్లి చేస్తే ఇంకెంతమంది జనం వస్తారోనని బస్సు ఖర్చులకి ఒప్పుకున్నాడు మామయ్య.”

“ఇదంతా బేరం చేశారా?”

“ఊఁ! అంతా బేరాలే. వంటవాళ్లని విజయవాడ నుంచి తేవాలని ఒప్పందం. సాయంత్రం వంటలో ఏం చేయించాలన్నది ఒప్పందం. మధ్యాహ్నం ఒంటిగంటకి వచ్చే పెళ్లివారికి రాగానే తిండి పెట్టడం కాదట. కాఫీలిచ్చి సేదతీర్చి, తరువాత భోజనం పెట్టాలట.

“బావుంది.”

పెళ్లి వివరాలు వింటూ ఉండగానే టాక్సీలో నుంచి గుంటూరు బ్యూటీషియన్ దిగింది. శ్రీలక్ష్మికి పెళ్లికూతురు ముస్తాబు చేయడానికి. గోరింటాకు పెట్టడానికి ఆవిణ్ణి టాక్సీలో తీసుకొచ్చారు. ఇద్దరు వీడియోగ్రాఫర్లు కూడా వచ్చారు. “కట్నకానుకలేకాక, ఇప్పటి పెళ్లిళ్లలో ఇవి కూడా అత్యవసరాలయిపోయాయి,” అంది సుధ.

“సరే, నీ సంగతి చెప్పు. పెళ్లి చేసుకుందాం అనుకుంటున్నావా? ఎవరితోనైనా స్నేహం చేశావా? ఇలాగే ఉండిపోదామనుకుంటున్నావా?” అన్నాను.

“మా అమ్మ నాకు పదేళ్ల నుంచి సంబంధాలు చూస్తూనే ఉంది. నేనెవరితోనూ స్నేహం చెయ్యలేదు. పెళ్లి చేసుకోకూడదని నేనేం అనుకోలేదు,” అంది.

“మీ అమ్మ చూడ్డం ఏమిటి?”

“సర్లే- మా అమ్మ కూతురిగా నువ్వు ఉంటే నీకు తెలిసేది ఆవిడ సంగతి. కలెక్టర్ పెద్దమ్మ గురించి నీకు తెలిందేం ఉంది,” అంది సుధ.

వాళ్లమ్మకి కలెక్టర్ బిరుదిచ్చింది తనే. ఆవిడ పేరు జానకి. జరీచీర కట్టి, చేతుల నిండా బంగారం గాజులు వేసి, గోల్డ్‌ఫ్రేం కళ్లజోడు పెట్టి, చిన్న సిగ చుట్టి, దాని మీద బంగారపు సంపెంగ పువ్వు పెడుతుంది. బొడ్లో వెండి రాజస్థానీ తాళంచెవుల గుత్తి వేలాడుతూ ఉంటుంది. అందరినీ తన మాట వినేలా చేసే నాయకత్వ లక్షణాలున్నాయి. ఎవరికీ ఆవిడ మాట కాదనే శక్తి ఉండదు వాళ్లింట్లో.

పెళ్లివారొచ్చేరని కబురు రావడంతో చాలామంది హడావిడిగా హారతి పళ్లాలూ, కాళ్లు కడుక్కునేందుకు నీళ్లూ, తాగడానికి నీళ్లూ కాఫీలూ మోసుకుని విడిదిలోకి పరిగెత్తారు.

“ఏం రోడ్లండీ బాబు! వట్టి మట్టిరోడ్లు- నడుములు విరిగిపోయాయి,” అంది పెళ్లికొడుకు తల్లి.

“రోడ్లిప్పుడు బాగుచేశారండీ. సిమెంటు రోడ్డు వేశారు. మేము హైదరాబాద్ నుంచే వచ్చాం మా కార్లో,” అంది పెద్దమ్మ.

ఆవిడకిక మాట్లాడ్డానికేం లేకుండా పోయింది. పెద్దమ్మ మాటల్లో రెండు అర్థాలున్నాయి. ఒకటి- ‘నువ్వు చెప్పిందంతా అబద్ధం’ అనేది, రెండవది- తనకి కారుందనీ, వాళ్లకి లేదనీ. అందుకే ఇలాంటి వ్యవహారాలకి ఆవిణ్ణి నియోగిస్తూ ఉంటారు. అలా హాస్యాల పేరుతో చురకలు అంటించుకుంటూనే మొత్తానికి పెళ్లి చాలా ఆడంబరంగా చేశారు.

సాయంత్రం విందుకు ఊరివారు చాలామంది వచ్చారు. అందులో అమ్మకి తెలిసిన వాళ్లు చాలామంది ఉన్నట్లున్నారు. యాభై దాటిన అమ్మ సన్నగా ఉంటుంది. జుత్తు పొట్టిగా కత్తిరించి పిన్ను పెడుతుంది. నూలుచీరలైనా మడత నలగకుండా కడుతుంది. తెల్లటి ఆవిడ కుడిచేతికి ఒకే ఒక్క గాజు ఉంటుంది. రెండవ చేతికి గడియారం ఉంటుంది. కళ్లకి జోడు ఉంటుంది. మెడలో సన్నని గొలుసు ఉంటుంది. ఆవిడ పరిచయస్థులందరూ చాలా ముసలి వాళ్లలా తలలు నెరిసిపోయి, నడుములు పెరిగిపోయి కనిపించారు. ఒక్కొక్కరు అరవై ఏళ్ల వాళ్లలా ఉన్నారు. వాళ్లందరికీ అమ్మ నన్ను చూపించి తన కూతురని చెప్పింది. వాళ్లంతా తన తోటివాళ్లనీ, కొందరు స్కూల్లో తనతో చదివారనీ, కొందరు ఆడుకోడానికొచ్చేవారనీ చెప్పింది. పల్లెటూర్లో ఉంటే అమ్మ కూడా ఇలాగే ఉండేదేమో అనిపించింది. ఆ సాయంత్రం పెళ్లి విందులో వడ్డించడానికి సుధని పురమాయించింది పెద్దమ్మ. తనే సుధకి చాలా ఖరీదైన చీర కట్టి, మెడలో ఒక నెక్లేసు కూడా పెట్టింది.

*

"నీకేం లేవా ఇలాంటివి," అంది నన్ను. లేవని చెబితే, "మీ అమ్మ నీకు నగలు చేయించ లేదన్నమాట,' అంది. తను సుధకి చాలా చేయించిందట. పెళ్లి కుదిరితే నగల షాపుకి వెళ్లే పని లేదట- సుధ మంచిది! అమ్మ చెప్పినట్లు వింటుంది. దగ్గరుండి ముప్ఫై ఏళ్ల కూతురుకి పెద్దమ్మ అలా ముస్తాబు చెయ్యడం ఎందుకో తరువాత అర్థం అయింది. పెళ్లికొడుకు పిన్ని కొడుకొకడు వచ్చాడట. అతగాడు చాలా చదువుకుని మంచి ఉద్యోగం చేస్తున్నాట్ట. సుధని చూసి మెచ్చితే ఇక్కడే ఖాయం కోసం చేసుకోవచ్చుట సంబంధం. సుధని చూసి అనసూయత్త అక్క కూతురొకతె, మరొక ఇరవై ఏళ్ల అమ్మాయి కూడా వడ్డనకి బయలుదేరారు.

"సరదా ఉంటే నువ్వూ వెళ్లు," అంది పెద్దమ్మ నాతో.

"సరదా అసలు లేదు పెద్దమ్మా," అనేశాను నేను. అనసూయత్త హడావిడిగా పెళ్లివారు కూర్చున్నవైపు తిరుగుతూ, వాళ్లు వద్దన్నకొద్దీ వడ్డించి వస్తోంది. పెళ్లివారివైపు ఆడవాళ్ల దృష్టి అమెరికాలో ఆకుపచ్చ కార్డున్న రవిపైన పడింది. వాళ్లొచ్చి పెద్దమ్మతో పరిచయం సంపాదించారు. అయితే ఆ అబ్బాయికి పెళ్లి కావల్సిన అక్క ఉందనీ, అప్పటిదాకా లైను క్లియర్ కాదని తెలిసి చప్పబడిపోయారు.

నాకు సుధ మీద చాలా కోపం వచ్చింది. డాక్టర్ సుధ, ఎం.ఎ., పిహెచ్.డి. మీద. అమ్మ చెప్పగానే పదివేల రూపాయల పట్టుచీర కట్టేసుకుని బంగారం నెక్లెసు పెట్టేసుకుని, నేతిగిన్నె ఒకటి పుచ్చుకుని అందరి దృష్టిలో పడ్డం కోసం అటూ ఇటూ తిరిగే సుధ మీద.

"నీకు మతిపోయింది సుధా," అన్నాను.

"అమ్మ మాట కాదంటే ఎంత గొడవ చేస్తుందో నీకు తెలీదు," అంది సుధ.

"పెద్దమ్మకి అంత చెడ్డతనం ఆపాదించకు," అన్నాను. మొత్తానికి అనసూయత్త అను కున్నట్లు పెళ్లి అట్టహాసంగా జరిగిపోయిందిగానీ, తిరిగి వెళ్లేటప్పుడు పెళ్లికొడుకు తండ్రి చిన్న తుఫాను సృష్టించాడు. వధూవరులిద్దరికీ ప్రత్యేకంగా టాక్సీ మాట్లాడి పంపమంటాడు. బస్సులో ఎక్కించడం ఏమిటంటాడు.

"అలా అని ముందు మాట్లాడుకోలేదు గదా," అంటాడు చిన్నమామయ్య.

"ఆ మాత్రం ఇంగితం మీకుంటుందనుకున్నాం. మాకేం తెలుసు అది కూడా అడగాలనీ," అంది అతగాడి తల్లి.

"నావల్ల కాదు," అన్నాడు మామయ్య.

"వాళ్లిద్దర్నీ వదిలేసిపోతాం. తరువాత మీ ఇష్టం. కొత్త కోడల్ని బస్సులో తీసుకెళ్లడం మాకు నచ్చదు," అన్నాడు మావగారు.

"ఇప్పుడు టాక్సీలెక్కడ దొరుకుతాయండీ," అన్నారెవరో.

"అదంతా నాకు తెలీదు. ఈ ఊళ్లో ఇంత పరపతి ఉంది మీకు. టాక్సీ కోసం తెనాలి పంపలేరా ఎవర్నైనా," అని సూచించాడు. అప్పటికి రాత్రి రెండు గంటలవుతూంది. అప్పగింతలనీ, ఇంకేదో అనీ అంతసేపయింది.

"ఎలాగయినా టాక్సీ తెప్పించండి. ఇంత ఖర్చుపెట్టాం. ఒక వెయ్యి రూపాయలకి వెరుస్తే ఎలాగూ," అంది అనసూయత్త.

"మా కార్లో వెళ్లండి. తరువాత మేం ఎలాగో వెడతాం," అన్నాడు రవి.

"ఇదుగో చూడు, ఈ దుమ్ము రోడ్ల మీద బస్సుల్లో నేను రాలేను. రైలసలు ఎక్కలేను. నువ్వార్కో మధ్యలో," అని పక్కకి పిలిచి చివాట్లు పెట్టింది పెద్దమ్మ.

రవి డ్రైవర్ని పిలిచి పెట్రోలుకి డబ్బులిచ్చాడు. దారిలో ఎక్కడైనా పోయించుకోమని. పెళ్లి వారింట్లో వాళ్లని దింపి తాళంచెవులు తండ్రి కప్పజెప్పమన్నాడు.

"అమ్మా! నిన్ను జాగ్రత్తగా నేను టాక్సీలో తీసుకువెడతాను సరిగదా! నిన్నెందుకు ఇబ్బంది పెడతాను. శ్రీలక్ష్మి కోసం మనం ఈమాత్రం చెయ్యలేమా," అన్నాడు. పెద్దమ్మ మొహం నల్లగా చేసేసుకుని లోపలికి వెళ్లిపోయింది.

"అబ్బా! మహా జాలి చూపించాడు పాపం," అని మెటికలు విరిచింది అనసూయత్త.

మొత్తానికి శ్రీలక్ష్మి పెద్దమ్మ కార్లో వెళ్లిపోయింది. తన కూతుర్ని రవికి చేసుకోలేదని అనసూయత్తకి కోపం. రవి పెళ్లి విషయంలో రవికీ కొన్ని కోరికలుంటాయని ఆవిడ బుర్రకి తట్టదు. అలా అడగడంలో తప్పులేదనీ, రవి శ్రీలక్ష్మిని చేసుకోవడం, చేసుకోకపోవడం తన ఇష్టం కాదనీ పెద్దమ్మ చిన్నమాటంటే సరిపోయేది. కానీ, ఆవిడలా అనదు. అందువల్ల ఆ ఇద్దరి మధ్యా హాస్యాల పేరుతో సాధింపులు జరుగుతూ ఉంటాయి. 'పెళ్లి' విషయంలో సమాజంలో పాతుకుపోయిన భావజాలం ఇప్పటికీ మారకుండా ఉండిపోయింది. ఈ వేళ్లు పాతుకుపోయిన భావాలలో నగరాలలో కొన్ని మార్పులొచ్చినట్లు కనిపిస్తాయి. అవి కూడా అవసరం కొద్దీ వచ్చినవేనేమో!

"చూశావా! పెద్దమ్మని చూసి నువ్వంత భయపడతావు. రవి తను చెయ్యదలుచుకున్న పని ఎలా చేసి చూపించాడో," అన్నాను సుధతో.

"ఇంటికి వెళ్లి వాడికి బాగా తలంటి పోస్తుంది," అంది సుధ.

"మీ అమ్మని సమాధానపరిచే నేర్పు రవికుంది. నీకు లేదు. నువ్వు అదివరకు నేను చూసిన సుధవి కావు. నీలో సెల్ఫ్‌పిటీ బయల్దేరింది. నువ్వు చాలామంది కన్నా చాలా మంచి స్థితిలో ఉన్నావని గుర్తు పెట్టుకుని ఆత్మవిశ్వాసంతో ఉండాలిగానీ, సానుభూతి ఆశించడం కాదు," అన్నాను కొంచెం ఆవేశంగానే.

"రేపు మాట్లాడుకుందాంలే, నిద్రొస్తూంది," అంది సుధ. తెల్లవారి మేము లేచేసరికి చాలా మంది బంధువులు వెళ్లిపోయారు. పతివ్రత పిన్నీ, బడాబాబూ వాకింగ్‌కి వెళ్లారు. చిన్న మామయ్య కొడుకు సుందరం వాళ్లమ్మ దగ్గర కూర్చుని డబ్బు లెక్కలేవో చెబుతున్నాడు. పెద్ద మామయ్య కొడుకు రాజు షామియానా తీయించేస్తున్నాడు.

"నా పెళ్లికి ఇక్కడ తాటాకు పందిరి వేశారు. నాలుగుబళ్ల తాటాకు- అంతా మా పొలంలోదే. ఇప్పుడు తాటాకుకి కూడా కరవొచ్చింది. ఆ పందిరి ఏడాది ఉండిపోయింది. దాని కింద ఎంత చల్లగా ఉండేదో," అది పెద్దమ్మ షామియానా వంక చూస్తూ.

“ఎన్నాళ్లయింది పెద్దమ్మా నీ పెళ్లయి?”

“బావుందే! ఇవ్వాళా నిన్ననా? నలభై ఏళ్లయింది. ఆంధ్రదేశం కోసం పొట్టి శ్రీరాములుగారు నిరశన వ్రతం చేసినప్పుడే నాకు పెళ్లిచూపులు జరిగాయి. మీ పెదనాన్నగారి మొదటి ఉద్యోగం కర్నూలులోనే.”

“నీ పెళ్లి కూడా ఇంత వైభవంగా చేశారా?”

“బాగానే చేశారు. నాకు పదహారేళ్లొచ్చినయ్యేగానీ ఏమీ తెలీదనుకో. ఇదుగో ఈ ఊరి హైస్కూల్లోనే ఎస్సెల్సీ చదివాను. గొర్రెలాగ తల వంచుకుని స్కూలుకి వెళ్లడం, ఇంటికి రావడం, లాంతరు పెట్టుకుని సాయంత్రం కాసేపు చదవడం, రేడియోలో పాటలు వినడం, ఇంటికి వారపత్రికలొస్తే చదువుకోడం- ఇదీ బతుకు. పెళ్లిచూపులకి ఎవరో వస్తారు, ఫలహారాలు, కాఫీలు తయారుచెయ్యమని మా నాన్న అరగంట ముందు మా అమ్మకి చెప్పడం, అప్పుడీవిడ తడుముకోవడం, మా శేషమ్మత్త మా అమ్మని కూడా కాస్త తల దువ్వుకోమని మంచి చీర కట్టుకోమని, తను పొయ్యి దగ్గర కూర్చోడం- ఇదీ తంతు. ఎన్నో పెళ్లిచూపులు లేవులే. ఆరోజుల్లో ఇంత అన్యాయం ఎక్కడిదీ? ఈ బేరాలూ, ఈ ఒప్పందాలూ అప్పుడు లేవు. కట్నాల రేట్లూ తక్కువే. మంచి కుటుంబం కావాలని చూసేవారు. ఈ పెళ్లివారొచ్చేరు- మా శేషమ్మత్త నాకు వదులుగా జడేసి, జాజిపూలు పెట్టి, మా అమ్మ పట్టుచీర ఒకటి కట్టి కూర్చోబెట్టింది. వారంరోజుల తరువాత తాంబూలాలన్నారు. నేనేమో ఈ పెళ్లి కుదరకపోతే బావుండునని దేవుడి గుడికి వెళ్లి ఓ కొబ్బరికాయ కొట్టి మరీ మొక్కుకుని వచ్చాను. దేవుడు నా మొర ఆలకించనేలేదు. వాళ్లకి నేను చాలా నచ్చానుట. కట్నం కూడా ఎక్కువ అక్కర్లేదుట. వాళ్లే నాకు చాలా నగలు పెడతారట. ఎంత అదృష్టమో అని అంతా పొంగిపోయారు. నేను కుంగిపోయాను. ఎందుకంటే, నాకు పదహారైతే, అతనికి ఇరవై ఆరు, నేను తెల్లని తెలుపైతే, అతను నలుపు. నాకేం నచ్చలేదు. కానీ, ఆ మాట చెబితే ఎవరూ వినరు. ఏడుస్తూ పెళ్లి చేసుకున్నాను. బయటికి ఏడవలేదులే. శేషమ్మత్త కూడా వినిపించుకోలేదు నా మాట. మా నాన్న నన్ను జానకమ్మ తల్లీ, నాన్నా అని పిలిచేవాడు. కానీ, ఈ పెళ్లి నీకిష్టమా లేదా అని అడగలేదు. అయితే, నా అదృష్టం బాగుండి మీ పెదనాన్న చాలా మంచివాడని తెలిసింది. ఆయన నన్ను చాలా బాగా చూసుకునేవారు. నేనెక్కడ అలసిపోతానో, మాసిపోతానో నన్నట్లు చూసేవారు. అంతేకాదు, ఆయనకి మా నాన్నలాగా ఆడవాళ్లంటే చిన్నచూపు లేదు. పెళ్లయిన కొత్తలోనే నలుపు అనేది ‘అనర్హత’ కాదని నాకు తెలిసింది. నేనాయన్ని గౌరవించడం మొదలుపెట్టాను.

“మరి ఆయన మంచివాడు కాకపోతే, నిన్ను సరిగ్గా చూడకపోతే నువ్వేం చేసేదానివి,” అన్నాను వెంటనే.

“ఏమీ చేసేదాన్ని కాదు. మా అమ్మని మా నాన్న ఎలా చూసేవాడు? ఆవిడేం చేసింది! అలాగే ఏడ్చుకుంటూ ఉండేదాన్ని. బహుశా ఆవిడలా నాకూ ఫిట్లు వచ్చేవేమో!”

“అమ్మమ్మకి ఫిట్లు వచ్చేవా?”

“దానికంతా చాలా చెప్పాలిలే. పొద్దున్నే ఎందుకు? పదండి. అలా ఒకసారి మనం కూడా కాలవగట్లు వెంబడి కాసేపు నడిచి మన పొలాలవీ చూసొద్దాం,” అంది పెద్దమ్మ.

“మన పొలాలా, మామయ్యగారి పొలాలా? మనకెక్కడివమ్మా పొలాలు,” అంది సుధ.

“పోనీ మామయ్య పొలాలే అనుకో!”

నాకు నవ్వొచ్చింది. పోనీ అనుకోవడం ఏమిటి? అవి కచ్చితంగా మామయ్య పొలాలే.

“నీకెంత కట్నం ఇచ్చారు పెద్దమ్మా?” అన్నాను.

“ఎంతమ్మా! మూడువేల అయిదువందలు- అందులో వాళ్లు మళ్లీ నన్ను చీరలు కొనుక్కోమని వెయ్యి రూపాయలిచ్చారు. ఆ వెయ్యిలో మా నాన్న ఆరువందలు పెట్టే చీరలు తెచ్చాడు నాకు. ఎందుకంటే, వెండికంచం కొనాల్సి వచ్చిందట. దానికి డబ్బు తక్కువైందట, అందుకని.”

“అప్పుడు మీ నాన్నకెంత పొలం ఉండేది?”

“ఎంత లేకేం జయా, ఇరవై ఎకరాలుండేది. అయిదెకరాల గరువుండేది. శేషమ్మత్త పొలం ఒకెకరముండేది. అయినా, ఈయన నా కట్నం దగ్గర చాలా ఆలోచనలు చేసి పాపం చివరికీ సంబంధం ఖాయం చేసేడు. ఆ కట్నం సొమ్ము మూడువేల అయిదు వందలు, పెళ్లి ఖర్చూ నా పెద్దకూతురు పెట్టినప్పుడు పురిటి ఖర్చూ తప్ప ఈ ఇంటి సొమ్ము ఇంక నేనేం ఎరగను.”

“మా అమ్మకసలు పెళ్లి ఖర్చే లేదు గదా!”

“అవును. మీ అమ్మ చదువుకుంటానని గోల చేస్తే గుంటూర్లో ఉంచి చదివించాడు. అదీ మా పిన్ని ఇంట్లో ఉంచి. హాస్టల్ ఖర్చు లేదు. ఆ రోజుల్లో కాలేజీ ఫీజెంత? చాలా తక్కువ. ఇప్పట్లా ట్యూషన్లు లేవు. అది ఇష్టపడ్డవాణ్ణి చేసుకోడానికి ఈయన వీల్లేదన్నాడు. దానికిష్టం లేకుండా ఈయన దానికో సంబంధం చూశాడు. అదేమో మీ నాన్నని పెళ్లి చేసుకుని వచ్చింది. ఈయన ఇంటికి రావద్దన్నాడు. ఇంతా చేస్తే అది కులాంతరమూ కాదు, మతాంతరమూ కాదు. చుట్టాలబ్బాయే. అతనికి ఆస్తి లేదని. మీ అమ్మ ఈ ఇంటి సొమ్ము అసలెరగదు, ఆ చదువు తప్పితే. ఆఖరికి పెళ్లి చేసుకోడానికి వెడుతూ మెడలో ఉన్న గొలుసు కూడా తీసిచ్చిపోయింది. అది మొదలు మీ అమ్మానాన్నా చాలా కష్టాలు పడ్డారు. వాళ్లు ఇద్దరూ ఉద్యోగాలు సంపాదించుకుని స్థిరపడ్డానికి దాదాపు అయిదారేళ్లు పట్టింది. అప్పటివరకూ మా నాన్న వాళ్లకి రూపాయి సాయం చెయ్యకపోగా, పరాయివాళ్లని వెక్కిరించినట్టు వెక్కిరించేవాడు. అందుకే వాళ్లు అందరికీ దూరంగా ఢిల్లీలో స్థిరపడిపోయి హాయిగా బతికారు. వాళ్లకి ఉద్యోగాల్లో ప్రమోషన్లు, ఉండడానికో ఇల్లు, ఇవ్వన్నీ అమిరాక అప్పుడు అంతా ఢిల్లీ పనులుంటే వెళ్లి వాళ్ల ఇంట్లో దిగడం సాగించారు. అదే మీ నాన్నకి కోపం. అందుకే రాడిక్కడికి. పెళ్లి చేసుకుని వస్తే గుమ్మం తొక్కద్దన్నాడు కదా మావగారు. అదమ్మా ఆడపిల్లలకి జరిగే మర్యాద.”

“మరి విజయ పిన్నికో...”

“విజయ పిన్ని పెళ్లినాటికి ఇంకాస్త పెరిగాయి కట్నాల రేట్లు. వాటితోపాటు పొలాల రేట్లూ, వడ్లబస్తాల రేట్లూ, మినుముల రేట్లూ పెరగలా మరీ! దానికి పదివేలిచ్చాడు. అంతే.”

ఒకపక్క నుంచి కట్నాల పీడింపు లెక్కువగా ఉన్నాయనీ, అదంతా ఇవ్వడానికి ఆడపిల్లల తండ్రులు ఆస్తులు అమ్ముకుంటున్నారని వింటూంటే, ఆస్తి ఉంచుకుని కూడా ఆడపిల్లల కోసం ఖర్చుపెట్టని తండ్రుల గురించి పెద్దమ్మ చెబుతోంది. వీళ్ల గురించి ఎవరూ మాట్లాడరేం? ఇదే అమ్మతో అన్నాను నేను.

“అంటే కట్నాలు ఇవ్వడం మంచిదంటావా నువ్వు,” అంది అమ్మ.

“కట్నం గురించి కాదమ్మా మన దగ్గర శక్తి ఉన్నప్పుడు ఏ వస్తువైనా మనకి నచ్చింది కొనుక్కోవాలనుకుంటాంగదా! చవగ్గా వచ్చింది గదా అని నచ్చనిది కొనుక్కోంగదా! అలాంటప్పుడు కట్నం తప్పనిసరి అనుకున్నప్పుడు, డబ్బున్న తండ్రులు పిల్లకి నచ్చినవాణ్ణి కొంచెం ఎక్కువ ధర పెట్టి కొనిపెట్టవచ్చు గదా!”

''దానివలన ఆడవాళ్ల స్థితి బాగుపడుతుందంటావా? ఈ డబ్బు పెళ్లికొడుకు తీసుకోడు. తన భార్యకూ ఇవ్వడు. తల్లిదండ్రులకే పోతుంది. మళ్లీ ఆ పిల్ల వాళ్ల మీద ఆధారపడాల్సిందే. మగపిల్లవాడి కోసం ఎన్ని కష్టాలైనా పడతారు. ఆడపిల్ల అత్తగారింట్లో ఎలా ఉందో, ఎంత కష్టపడు తోందో గమనించినా పట్టించుకోరు. ఈ పుట్టింటి అండ లేకనే కదా ఇన్ని ఆత్మహత్యలు. నిజానికి ఉత్తర హిందూస్థానంలో ఉన్న కట్నాల పిచ్చి దక్షిణంలో లేదు. కొన్ని కులాల్లో ఎక్కువ కట్నం అంటారు. వాళ్ల దగ్గర బాగా డబ్బుండి ఇస్తారు. ఆస్తి ఉంటే భాగం పెట్టరా? అలాగన్నమాట. కొన్ని కులాల్లో ఎంత డబ్బున్నా ఆడపిల్లకి పెట్టడానికి వెనకా ముందూ ఆలోచించి, ఉన్నదంతా కొడుక్కి కట్టబెట్టి చివరికి అతని మీద ఆధారపడతారు. పెద్దవాళ్లు చేసే పెళ్లిళ్లు తగ్గి, పిల్లలే పెళ్లిళ్ళు చేసుకునే స్థితికి వస్తేగాని కట్నాలు పోవేమో!''

మేం అలా మాట్లాడుతుంటే గాయత్రి మాకు కాఫీ తెచ్చిచ్చి, ''రాజుబావ మిమ్మల్నందర్నీ రమ్మంటున్నాడు. పొలం చూపిస్తాట్ట,'' అంది. సన్నగా సూదిలా ఉండే గాయత్రి కళ్లు చాలా చురుగ్గా ఉంటాయి. ఈ పిల్ల ఎవరో తెలీలేదు.

మేం బయలుదేరే వేళకి శారదత్తయ్య మాకు పెద్ద ఫ్లాస్కుతో కాఫీ ఇచ్చింది. ఆవిడ అనసూయత్తలా అతిగా మాట్లాడదు. చేసే పనిలో ఇష్టం, ప్రేమా ఉంటాయి. ఇలాంటి తల్లి పెంపకం వల్లనేమో రాజుకి మనుష్యుల్ని ప్రేమించడం, స్నేహంగా ఉండడం అలవాటయింది. చిన్న మామయ్య కొడుకు సుందరం ఎవరితోనూ కలవడు. మనసు విప్పి మాట్లాడడు. మేమంతా సుఖంగా ఉన్నామనీ- తన తండ్రీ, తల్లీ, తనూ చాలా కష్టపడిపోతున్నామనీ అనుకుంటాడు. సుందరానికి హైదరాబాద్‌లో ఉద్యోగం రావడానికి బడాబాబే కారణం. అందుకని ఆయన్ని కొంచెం గౌరవిస్తాడు. రవికి కుటుంబ రాజకీయాలు తెలీవు. వాడికి తన చదువూ, సంపాదనా తప్ప చిన్నప్పటి నుంచీ మరో ధ్యాస లేదు. కానీ, అందరితో సరదాగా ఉంటాడు. అడిగితే తప్ప అమెరికా గురించి చెప్పని ఇంకో మంచి గుణం కూడా ఉంది వాడిలో. వాడికీ మనుష్యులంటే ప్రేమ ఉంది. ఆ ప్రేమ ప్రకటించే శక్తి వాడికి డాలర్లిచ్చాయి. ఎవరిమీదా అసూయపడే అవసరం వాడికి లేదు. మొదటి నుంచీ వాడికి ఒకే గమ్యం. దాన్ని చేరుకోడానికి శ్రమిస్తాడు. పక్కనేం జరిగినా పట్టించుకోడు. రాజు కూడా జనాన్ని ప్రేమిస్తాడు. వాడికీ అసూయ లేదు. రవి డాలర్లతో ప్రేమ ప్రకటిస్తే, రాజు మాటతో, సహాయంతో ప్రకటిస్తాడు. మనసు విప్పి మాట్లాడతాడు. రాజు నాకు చాలా నచ్చాడు.

రాజు మమ్మల్ని పోస్టాఫీసు బజారులో నుంచి కాలువగట్టుకు తీసుకువెళ్లాడు. ఆ బజారులో దాదాపు అరడజను కుటుంబాలు ఊరు వదిలి వెళ్లిపోయాయి- పొలాలు అమ్ముకుని, ఇళ్లు పాడు పెట్టుకుని.

''ఎందుకనిరా రాజూ?'' అది పెద్దమ్మ అమాయకంగా.

''ఒకటి చెబుతాను విను అత్తా! పొలం మీద గౌరవం లేనివాడికి పొలం ఉండకూడదు. పొలం అంటే తల్లితో సమానం. మనకి అన్నం పెడుతుంది గదా. అలాంటి తల్లిని ఎవరికో కౌలుకిచ్చి అవసరం వచ్చినప్పుడల్లా ముక్కలు ముక్కలుగా నరికి అమ్మేవాళ్లకి పొలం ఎందుకు చెప్పు? పొలంలో వ్యవసాయం ఇష్టంగా చేసుకునేవాడికి ఉండాలి. అప్పుడు దానిమీద వాడికి ప్రేమ ఉంటుంది.''

''వ్యవసాయం చెయ్యడం అందరికీ చేతకావద్దూ? కొందరికి చేతకాకపోవచ్చు. దానికీ ఊరు విడిచిపోవడానికీ లంకేమిటీ?'' అంది పతివ్రత పిన్ని.

పెద్దమ్మ కన్నా అమ్మ కన్నా పిన్ని చిన్నదే అయినా, వాళ్ల కన్నా కొంచెం అమాయకంగా ఉంటుంది- తెలివిగా ఉండవలసింది పోయి.

“ఈ ఊరు విడిచిపోయిన వాళ్లందరూ బీదవాళ్లేం కాదు. పొలాలున్నవాళ్లే. ఒక ఎకరం పొలం మీద ఆధారపడి బతికి, దాన్ని పదెకరాలు చేసినవాళ్లు ఈ ఊళ్లో ఉన్నారు. కానీ, వీళ్లో! ఆ పదెకరాలనీ కొంచెం కొంచెం అమ్ముకుని చివరికి వెళ్లిపోయారు. వీళ్లకి వీళ్ల శక్తి మీద గౌరవం లేదు. పొలం మీద అంతకన్నా లేదు. ఆఖరికి వాళ్ల భార్యాబిడ్డల మీద కూడా శ్రద్ధ, గౌరవం లేవు.”

“నువ్వు చెప్పేది నాకేం అర్థంకాదు,” అంది పిన్ని.

“వాళ్ల సంగతి వదిలెయ్. నీకర్థమయ్యేలా చెప్పాలంటే నీ పుట్టింటినే ఉదాహరణగా తీసుకో! మీ తాత మీ నాన్నకి ఎంత పొలం అప్పగించి పోయాడు. పాతిక ఎకరాలిచ్చాడు. అవునా?”

“అవును.”

“అందులో పండని పొలం ఉందా అంటే లేదు. ఆడపిల్లలకేమైనా ఇచ్చాడా అంటే లేదు. దానం చేశాడా అంటే లేదు. స్కూళ్లు కట్టించాడా అంటే లేదు. లైబ్రరీ కట్టించాడా అంటే లేదు. మరి ఆయన చేతి మీదుగా పదిహేనెకరాల పొలం అమ్మేశాడు. ఎందుకు?”

“ఎందుకు?”

“ఆయనకి తనతో బతికే భార్య మీద, తన పంచన చేరిన అక్క మీద, కడుపున పుట్టిన బిడ్డల మీద గౌరవంగానీ, శ్రద్ధగానీ లేవు. అంటే నీకు కోపం వస్తుందిగానీ, అది నిజం. బహుశా అది ఫ్యూడల్ మగవాడి మనస్తత్వమేమో మరి. పొలం చేసే వ్యవసాయం దగ్గర్నుంచీ ఇంట్లో వండే కూరల దాకా అతనిదే పెత్తనం. భార్య అనారోగ్యవంతురాలు. పదిమంది బిడ్డల్ని కన్నది. మరి ఆ రోజుల్లో కుటుంబ నియంత్రణ లేదా? ఉంది. పదిమంది బిడ్డల్లో ఎంతమంది బతికారు? అయిదుగురు. ఎప్పుడు చూసినా ఆవిడ అటు కడుపుతో ఉండో ఇటు పసిబిడ్డతల్లిగానో ఉండేదట. జబ్బుతో, కాన్పులతో ఉసూరుమంటూ ఉండేదట. కనీసం స్నానం చెయ్యడానికి కూడా ఓపిక లేకుండా ఉండేదట.

“ఎప్పుడూ మురికి ఓడుతూ జుత్తు ముడి వేసుకుని ఉండేదట. ఈయన తెల్లవారగానే ఇస్త్రీ బట్టలు వేసుకుని, కర్చీఫ్ మడతల్లో పౌడరు వేసుకుని బయలుదేరేవాడు. ఊరి వ్యవహారాలు కావాలి. ఏ వ్యవహారం చేసినా, ఏం చెయ్యబోయినా ఇంట్లో చెప్పే పని లేదు. పొలం అమ్మినా, నగలు తాకట్టు పెట్టినా ఎవరి సలహా అక్కర్లేదు. అసలు ఆయన ఇంట్లో ఎవరితోనైనా మనసు విప్పి మాట్లాడేవాడా? చాలా ముభావంగా ఉండేవాడు. మాట్లాడితే చులకనౌతానని భయం. మీ అమ్మ తలుపు చాటున నిలబడి ఆయనతో రెండు మాటలు మాట్లాడేదట. అంతే. అదుగో అలాంటి కుటుంబాలే ఇవి. వాళ్ల మగపిల్లలకి కాస్త చదువులు వచ్చాయి. అందుకోసమని పిల్లలకి ఉద్యోగాలొచ్చిన ఊళ్లకి వెళ్లిపోయారు. ఆ పిల్లలేమో ఆస్తులు అమ్ముకు రమ్మని వేధిస్తారు. అమ్ముకొచ్చాక, ఇచ్చేదాకా వేపుకు తింటారు. ఇచ్చినాక ఇంకా బతికి ఉన్నందుకు విసుక్కుంటారు. అవీ వీళ్ల బతుకులు.” రాజు ఊపిరి పీల్చుకోడానికి ఆగాడు. నేను విస్మయంతో చూస్తున్నాను, అతని మొహం వంక.

“మా తాతయ్య అదృష్టం బాగుండి ఇంకా కొంత పొలం మిగలడమేగాక, మా నాన్నలకి చదువు అబ్బలేదు. దాంతో ‘విధా! ఖర్మమా!’ అని ఇక్కడ ఉండిపోయారు. కాకపోతే ఏ గుమాస్తా ఉద్యోగాలో చూసుకుని పోయేవాళ్లు.”

“గుమాస్తా ఉద్యోగాలేం? ఈ ఊరివాళ్లకి అంతకన్నా మంచి ఉద్యోగాలు రాలేదా,” అన్నాను తెలుసుకుందామని.

“వచ్చాయిలే. ఊర్కే అంటున్నాను. మీ అమ్మ ఫ్రెండు విక్టోరియా ఆంటీ ఉంది. ఆవిడ కొడుక్కి పోలీస్ సర్వీస్ సెలక్షన్ వచ్చింది మొన్ననే. స్టేషన్ నుంచి వచ్చేదారిలో పెద్ద మేడ కట్టాడు చూడు, ఆయన కొడుకు దుబాయ్‌లో పని చేస్తున్నాడు. ఇంకా చాలామందికి మంచి ఉద్యోగాలే వచ్చాయి. అదికాదు నేను చెప్పేది. ఇప్పుడీ అరడజను కుటుంబాలు వెళ్లిపోతే ఊరికేం నష్టం లేదు. ఆ పొలాలు కొనుక్కున్న వాళ్లు హాయిగా పండించుకుంటున్నారు.”

“వ్యవసాయానికి కూడా చాలా పెట్టుబడి పెట్టాలట. సరిగ్గా పండవుట కొన్నిసార్లు. అదంతా మనం పడలేం, దానికి తగ్గవాళ్లు పడతారు,” అంది పిన్ని మళ్లీ.

“నీ ఉద్దేశం నాకర్థం అయిందిలే అత్తా! అదంతా పూర్వం మీరనుకునే మాటలు! అంతే. ఈ పనికి వీళ్లూ ఆ పనికి వాళ్లూ అని ఎవరి మొహానా ఉండదు.”

“ఇంకేమిటి ఈ ఊరి సంగతులు,” అంది అమ్మ.

“నిజం చెప్పాలంటే ఈ ఊళ్లల్లో పెద్ద గొడవలుండవు. వర్షాలు కురవవనీ, కరువులనీ ఉండవు, ఎప్పుడో తప్ప. పొలాలన్నీ బాగా పండుతాయి. పంట కాలువలున్నాయి. డ్రెయిన్స్ ఉన్నాయి. మంచినీళ్లున్నాయి. గేదెలకి గడ్డిలేక చచ్చిపోవు. ముఠాకక్షలూ, హత్యలూ, కోర్టులూ లేవు. ఎప్పుడో తప్ప నిదానంగా ఉంటుంది బతుకు. చిన్నచిన్న జబ్బులకి ఊళ్లో డాక్టరున్నాడు. ఆయన పనికిరాడనుకుంటే గంటలో గుంటూరు వెళ్లొచ్చు. గుంటూరు నిండా డాక్టర్లే. తెనాలిలోనూ డాక్టర్లే. మీ హైదరాబాద్‌లో కోఠీనో, నాంపల్లో వెళ్లినట్లు షాపింగ్‌లకి తెనాలి వెళ్లొచ్చు. ఇక్కడ దేనికీ లోటు లేదు. ఏటిలో కూడా మంచినీళ్ల ట్యాంక్ కట్టారు. మిషనరీవాళ్లు ఇంగ్లీష్ మీడియం స్కూలు కట్టారు. ఊళ్లో పిల్లలు సిటీబస్సెక్కి తెనాలి కాలేజీకి పోతారు.”

“వెంకట్రామయ్య పెద్దనాన్న బావున్నాడా? మణి ఎలా ఉందో,” అంది పెద్దమ్మ.

“ఆయనకేం అత్తా, వడ్డీ వ్యాపారం కదా! గుంటూర్లో సినిమాహాలు కట్టాడు. మన ఊళ్లో వడ్ల మిల్లుంది. తన ఇల్లంతా బ్రహ్మాండంగా కట్టించుకున్నాడు.”

“మరి శాస్త్రిగారి పిచ్చి పెళ్లాం ఏమయిందో!”

మా పెద్దమ్మ నలభై ఏళ్లనాడు ఊరు వదిలి వెళ్లినా ఇక్కడి కబుర్లు తెలుసుకుంటూనే ఉంటుంది. ఏడాదికొకసారి వచ్చి అందర్నీ చూసి వెడుతూ ఉంటుంది.

‘ఆవిడేం కాలేదు. ఆయన పోయాడు. పోయాక ఈవిడ పిచ్చి తగ్గిపోయింది. ఇప్పుడు హాయిగా ఉంది.”

“అదేం పిచ్చో!”

“మన నాయనమ్మకి... అదే మీ అమ్మకి ఫిట్లు ఎందుకు వచ్చేవో తెలుసా?”

“చెప్పు- నువ్వు మా అందరికన్నా ముందు పుట్టినట్టున్నావు,” అంది అమ్మ అతని నెత్తి మీద ఒక మొట్టికాయ వేసి.

“అదుగో ఆ కాలువ ఒడ్డున పెంకుటిల్లుంది చూశావా? అది వడ్లు దంచే బాలమ్మది. మన ఊళ్లో వడ్లమర రాక ముందు మన ఇంట్లో వడ్లు దంచడానికి వచ్చేది. ఆవిడ వడ్లు దంచడానికి వచ్చినప్పుడల్లా ఈవిడకి ఫిట్లు వచ్చేవి. ఆ పెంకుటిల్లు బాలమ్మకి తాతయ్య కట్టించి ఇచ్చిందే. బాలమ్మ కొడుకు ఎంకటేశులుంటాడు చూడు, చిన్న తాతయ్యగారింట్లో కొన్నాళ్లు కమతానికి ఉన్నాడు. వాడి మూతి అచ్చం తాతయ్యదిలాగే ఉంటుందిట.”

"నోర్మూయ్యరా సన్యాసీ," అంది పిన్ని నవ్వు ఆపుకుంటూ. ఈ కథలన్నీ వాళ్లకి తెలియనివి కావేమో!

నడిచి నడిచి పొలం వచ్చేసింది. ప్రస్తుతం అక్కడేం పనులు జరగడం లేదు. కోతలకి ఇంకా రెండు నెలల సమయం ఉందట. చిన్న మామయ్య అమ్మిన పొలం చూపించాడు. పక్కనే ఉంది. నాట్లు కాకముందే అమ్మేడట. పెద్దమ్మ అందరికీ కాఫీ ఇచ్చింది.

"ఈ గాయత్రి ఎవరు రాజూ," అంది సుధ ఉన్నట్టుండి.

"అదా! అది మంగమ్మగారి మనవరాలు. దానికో పెద్దకథ ఉందిలే. వింటానంటే చెబుతా."

"అడిగాక వినక తప్పదు గదా!"

"మీ అమ్మ మేనత్త శేషమ్మగారి పేరు వినే ఉంటావుగా."

"అయ్యో! ఎందుకు వినలేదూ? శేషమ్మత్తని నేను చూశాను కూడా! హైదరాబాద్ వచ్చింది. అమ్మ తీసుకొచ్చింది ఓసారి."

"ఆవిడ కథ తెలుసా నీకు? చెప్పనా?"

"తెలుసులే. బాల వితంతువు. నగలతో, మామగారిచ్చిన డబ్బుతో మీ ఇంటికి వచ్చింది."

"నే చెబుతా విను. మా మేనత్త సంగతి," అని పెద్దమ్మ అందుకుంది. "ఆవిడ ఆ డబ్బూ నగలూ తెచ్చి మా తాతయ్యకిచ్చి, వాటితో తనకి పొలం కొనిపెట్టమని అడిగింది. కొంటాను కొంటానంటూనే కొనకుండా చచ్చిపోయాడాయన. తన తమ్ముడయిన మా నాన్నని సతాయించగా, సతాయించగా తను అమ్మదలుచుకున్న పొలం ఒక ఎకరం ఆవిడ పేర పెట్టాడు. కానీ, ఆవిడ చనిపోయేవరకూ దాని మీద వచ్చే అయివేజు పూర్తిగా ఆవిడకి ఇవ్వలేదు. జబ్బు మనిషి అయిన మా అమ్మని కూర్చోపెట్టి మాకందరికీ ఎంతో సేవ చేసింది ఆవిడ. మమ్మల్నందర్నీ పెంచింది కూడా ఆవిడే. మేం పురుళ్లు పోసుకుంటే ఆవిడే మాకు దిక్కు. మాకు జబ్బులు చేస్తే కూడా ఆవిడే మాకు చేసేది. పిల్లలు లేని ఆవిడ శక్తినంతా మాకే ధారపోసింది," పెద్దమ్మ కళ్లు చెమర్చాయి. కళ్లజోడు తీసి తుడిచి పెట్టుకుని, "ఈ మంగమ్మగారి కథ కూడా అంతే. అది ఇంకా అన్యాయంగా ఉంటుంది. ఈవిడ మాకు దూరపు బంధువు. ఆవిడకి ఈ ఊళ్లో కాస్త పొలం ఉంది. దాని మీద అయివేజు ఇవ్వక రైతులు ఏడిపిస్తుంటే దానిని మా తాతయ్యకి అప్ప జెప్పింది. ఈయన కూడా ఆవిణ్ణి ఏడిపించాడు. చివరికి కూతుర్ని తీసుకొచ్చి మా ఇంట్లోనే ఒక గదిలో ఉండిపోయింది. ఆ కూతురుకి మా తాతయ్య ఒక దిక్కుమాలిన సంబంధం చూసి పెళ్లి చేయించాడు. అతగాడొట్టి తెలివితక్కువ వాడు. ఆ తెలివితక్కువవాడు మా తాతయ్య దగ్గర పనిచేసేవాడు. అప్పట్లో పంచాయితీవారు ఇంకా మంచినీళ్ల పంపులు వెయ్యలేదు. ఊరిచివర మంచినీళ్ల బావిలో నుంచి కావిడి తెచ్చేవాడు. బండి తోలుకుని పొలం వెళ్లేవాడు. ఈవిడ, మంగమ్మగారు మా ఇంట్లో వంట చేస్తూ, పచ్చళ్లు నూరుతూ, కందులూ, మినుములూ విసురుతూ తాతయ్య ఇచ్చే పదీ పరకా తీసుకుని బతికేది. ఆవిడ కూతురు విస్తళ్లు కుట్టీ, ముత్తయిదువగా పెళ్లిళ్లకు వెళ్లి కాలం గడిపేదిగానీ, వాళ్లెవరూ తాతయ్య మీద కోర్టుకి వెళ్లలేదు. గట్టిగా పోట్లాడి నప్పుడు ఓ వంద రూపాయలిచ్చేవాడు. కార్తీకమాసంలో కాలవ స్నానానికి వెళ్లి కాలుజారి కాలవలో పడి చచ్చిపోయింది మంగమ్మగారు. ఆవిడ పోయిన ఏడాదికే మా తాతయ్య కూడా పోయాడు. పెత్తనం మా నాన్న చేతికొచ్చింది. మంగమ్మ అల్లుడికి మా నాన్న ఎదుట మాట్లాడే ధైర్యం లేదు. కూతురే చాలాసార్లు రొక్కించి అడిగింది.

"దానితో మా నాన్న ఆవిడ చేతిలో ఓ నాలుగువేల రూపాయలు పెట్టి పొలం తనకి అమ్మి నట్లు రాయించేసుకున్నాడు. ఆ నాలుగువేలు ఆవిడ జబ్బు పడ్డప్పుడు ఖర్చయిపోయాయి. ఆవిడకి

చాలా జబ్బు చేసింది. ఆరునెలలకి పైనే గుంటూర్లో ఉండి వైద్యం చేయించుకుంది. తరువాత ఇక మా నాన్న ఇచ్చే కూలీయే ఆధారం. అప్పటిదాకా పిల్లలు లేని ఆవిడకి నలభయ్యో పడిలో గర్భం వచ్చింది. ఈ గాయత్రిని కని ఆవిడ చనిపోయింది. ఆమె పోయిన ఏడాదికే అతనూ పోయాడు. దాన్ని మా అమ్మే పెంచింది ఓ ఏడాది. తరువాత శారద పెంచుతోంది. ఎలాగైనా శారద దారి వేరు.''

''ఎండ చురుక్కుమంటోంది. ఇంక వెడదాం. మీ బాబాయిగారికి భోజనం వేళైంది,'' అంది పతివ్రత పిన్ని.

కొత్తగా డబ్బు సంపాదించి కొత్త పద్ధతిలో కట్టిన కొత్త ఇళ్లు, పాతబడి పెచ్చులూడిపోయిన పెంకుటిళ్లు, రెల్లు కప్పులు వేసిన ఇళ్లు దాటుకుంటూ నడుస్తుంటే ఒక పెద్ద మేడ మీద డిష్ యాంటెనా కూడా కనిపించింది.

'మొత్తానికి ఇది జీవం ఉన్న ఊరు,' అనిపించింది.

''చిన్న మామయ్య చాలా తెలివితక్కువ పని చేస్తున్నాడు రాజా. ఈ గాలీ, ఈ వెల్తురూ, ఇంత ఇల్లూ వదిలిపెట్టి కొడుకు పంచన చేరడం బాగాలేదు,'' అంది పెద్దమ్మ.

''నేనెంతో చెప్పి చూశాను వినలేదు. అసలు శ్రీలక్ష్మి కింత కట్నం ఇచ్చి ఈ సంబంధం చెయ్యడం కూడా నాకిష్టం లేదు. మన వెనుక బజార్లో ఉండే వెంకటరత్నం మాస్టారబ్బాయి రఘు శ్రీలక్ష్మిని చేసుకుంటానని బాబాయిని ఎన్నోసార్లు అడిగాడు. తనకి కూడా రఘు అంటే చాలా ఇష్టం. రఘుకి ఆడంబరాలు గిట్టవసలు. సింపుల్‌గా పెళ్లి చేసుకుంటానన్నాడు. కట్నం అక్కర్లేదన్నాడు. అమ్మిన పొలం శ్రీలక్ష్మి పేర రాసిచ్చి, రఘుకిచ్చి పెళ్లి చెయ్యమని ఎంతో చెప్పాను. వినలేదు. పెళ్లికి ముందు అది చాలా ఏడ్చింది. అనసూయ పిన్ని దాన్ని తిట్టింది.''

''ఎందుకని రఘుకివ్వనంది?''

''వాడు పల్లెటూరి వాడట. ఉద్యోగం లేదట. నీకు తెలుసా జయా? వాడి పొలం అంతా మెట్టపొలం. పసుపు వేస్తాడు. మనకన్నా రెట్టింపు వస్తుంది వాడికి. వాళ్లమ్మ చాలా మంచిది.''

''మీ బాబాయి నచ్చజెప్పలేదా మరి పిన్నికి.''

''ఆయనకీ ఇష్టమే బస్తీ సంబంధం, గొప్పగా పెళ్లి చెయ్యడం. ఇప్పుడు ఇంట్లో సగం అమ్ముతానంటాడు. కొనడానికి మా నాన్న దగ్గర డబ్బు లేదు. ఇల్లుకొనాలంటే పొలం అమ్మాలి. అది నాకిష్టం లేదు. మమ్మల్ని అలాంటి ఇరుకులో పెట్టాడు. ఇదంతా సుందరం చేస్తున్నదే. డబ్బంతా తెచ్చి హైదరాబాద్‌లో ఎపార్ట్‌మెంటు కొనమంటాడు. పెళ్లి కాగానే ఎపార్ట్‌మెంట్‌లో తల్లీతండ్రీ ఎక్కువైపోతారు. అప్పుడుంటాయి వీళ్ల పాట్లు.''

ఇంటికొచ్చేసరికీ అందరికీ గుండెల్లో బరువుగా ఉన్నట్లనిపించింది. బడాబాబుకి శారదత్త భోజనం పెట్టిందని తెలిసి పిన్ని స్థిమితపడింది. అందరికీ హాలులో వరుసగా భోజనాలు వడ్డించారు శారదత్తయ్య, గాయత్రి. అనసూయత్త అలసిపోయానని పడుకుంది.

కొంచెం ఎక్కువగానే తిన్నట్లనిపించింది.

''నువ్వొక్కదానివే ఉంటావు కాబోలు! వండుకుంటావా? హోటల్‌లో తింటావా?'' అంది సుధ.

''మేం పగలు క్యాంటీన్‌లో తింటాం. సాయంత్రం పనిమనిషి వండేస్తుంది. నలుగురం కలిసి ఒక అపార్ట్‌మెంట్ తీసుకున్నాం. బావుంటుంది. రాకూడదూ ఎప్పుడైనా! నిన్ను బాగా తిప్పుతాను టూరిస్ట్ బస్‌లలో.''

పెద్దమ్మా అమ్మా కబుర్లలో పడిపోయారు. వాళ్ల చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుని లోకాన్నే మర్చిపోతున్నారు. ఆ కబుర్లు వింటూ ఉంటే అప్పుడు వాళ్లు నవ్వుతున్న నవ్వు ఇంకా పదేళ్లు ఆరోగ్యంగా బతకడానికి చాలుననిపించింది. నేను సుధని చెయ్యి పట్టుకుని తీసుకొచ్చి ఎవరూ లేనిచోట కూర్చోబెట్టి అడిగాను.

"చెప్పు సుధా, నీ సంగతి."

"నీ సంగతి చెప్పు ముందు," అంది ఎదురు తిరిగి.

"ఏం ఉందీ! నేనీ ఉద్యోగంలో చేరి ఏడాదైంది. చాలామంది స్నేహితులయ్యారు. ఆడవాళ్లూ, మగవాళ్లూ. నేనెవ్వర్నీ నా జీవితంలోకి ఆహ్వానించే దృష్టితో ఇంకా చూడడం లేదు. పెళ్లి మీదకి ఊహలు పోవడం లేదు," అన్నాను.

అప్పుడు చెప్పింది సుధ. తను ఎం.ఎ. చదివేటప్పుడు ఒకతన్ని పెళ్లి చేసుకోవాలనుకుందట. కానీ, పెద్దమ్మ ససేమిరా ఒప్పుకోలేదట. పైగా తను చూసిన సంబంధమే చేసుకోవాలని వాగ్దానం కూడా చేయించుకుందట. ఆవిడ సంబంధాలు చూస్తూనే ఉందట. ఏదీ కుదరడం లేదట.

"ఎందుకని కుదరడం లేదు?"

"జాతకాలంటారు. కట్నాలంటారు. క్వాలిఫికేషన్ ఎక్కువైందంటారు. తక్కువైందంటారు."

"అప్పుడతన్ని ఎందుకు వదిలేశావు? కేవలం అమ్మకోసమేనా?"

"అవును నాకు ధైర్యం చాలలేదు. అతను తెలుగువాడు కాదు. మన కులం కాదు. మా అమ్మకి తెలిసి గొడవ చేసింది. బెదిరించింది. ఇంక అతనికి చెప్పేశాను. ఒక నవ్వు నవ్వి వెళ్లిపోయాడు. ఇప్పుడతనికి పెళ్లయిపోయింది. మద్రాసుకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం."

"పెద్దమ్మ అప్పుడలా చేసిందిగానీ, నువ్వు ఆవిణ్ణి కన్విన్స్ చేస్తే మారి ఉండేది. ఆవిడ నువ్వనుకున్నంత చెడ్డది కాదు. చాలామంది ఆడవాళ్లు బయటికి అలా పులిబొమ్మ మొహానికి వేసుకుని తిరుగుతారు. వాళ్లు అసలు మొహం వేరే ఉంటుంది. కన్నబిడ్డలకు కూడా దాన్ని చూసే ఓర్పు ఉండదు. ఎందుకనంటే మన సమాజంలో నిజాన్ని వెతుక్కునే తీరిక ఎవరికీ లేదు. తమకి తెలిసిన కొంచెమే సర్వస్వం అని ఎవరికి వాళ్లు అనుకుంటారు."

సుధ ఎటో చూస్తూ కూర్చుంది.

"మేము మీకంటే అన్ని విధాలా అధికులం అని విర్రవీగే మగవాళ్లల్లోనే చాలామందికి ఆలోచన లేనప్పుడు, వాళ్లెప్పుడూ అణచి ఉంచడానికి ప్రయత్నించే స్త్రీలలో ఎలా ఉంటుంది? ఆడవాళ్లకి ఆలోచన లేదనీ, గయ్యాళులనీ అనే వాళ్లంటే పరమ చిరాకు నాకు. వాళ్ల ఆలోచన వికసించడానికి, వాళ్లలో ఒక బ్యాలెన్స్‌డ్ ఔట్‌లుక్ రావడానికి ఎవరు దోహదం చేస్తున్నారు? మీ అమ్మని మీకంటే మీ నాన్నే బాగా అర్థం చేసుకున్నారు," అన్నాను.

"ఆయనకి ఆవిడంటే చచ్చే భయం," అది సుధ ఠకీమని.

"అదంతా వట్టిదే. ఆయనకెందుకు భయం? ఆవిడలా ఉండడమే ఆయనకిష్టం. లేకపోతే ఎప్పుడో ఆవిడ నోరు నొక్కేసి ఉండేవాడు. పైగా మీ అమ్మ మీ నాన్నని ఎప్పుడూ గౌరవంగానే చూస్తుంది. ఆయనకి కావల్సినవన్నీ చూడడమేగాదు, పిన్నిలా ఆయన అడుగులకి మడుగులొత్తే దాసిలా ఉండదు. మనిషిలా ఉంటుంది. అది కూడా ఆయనకిష్టం. నీకు తెలుసా? ఎంత సేవ చేసినా పతివ్రత పిన్నంటే బాబాయికెంత లోకువో? చెయ్యకేం చేస్తుందన్నట్టుంటాడు."

“సింపుల్‌గా, నెమ్మదిగా ఎందుకుండవూ,” అన్నాను పెద్దమ్మని ఆవిడొకసారి బెంగళూరు వచ్చి నా అపార్ట్‌మెంట్‌లో పదిహేను రోజులున్నప్పుడు. మా స్నేహితులందరితో ఎంతో హాయిగా గడిపింది. మాకు కావల్సినవన్నీ వండి పెట్టింది. మేం ఆవిణ్ణి మైసూర్, శ్రావణబెళగొళ కూడా తీసుకువెళ్లాం. అప్పటినుంచీ పెద్దమ్మ నాకు స్నేహితురాలైపోయింది.

“నేను గయ్యాళినీకాను, ఏమీ కాను. మీ అమ్మలాంటిదాన్నే. అయితే, నేనిలా ఉండకపోతే మా అత్తగారూ, ఆడబడుచులూ నన్ను ఉత్త గంగిగోవును చేసి గాటకి కట్టేవాళ్లు. అక్కడ వాళ్ల కన్నా నేను చిన్నదాన్ని. మనసు బాధపడితే ఓదార్చడానికి మా అమ్మకి చేతకాదు. ఇక్కడ నుంచి నాకెలాంటి అండదండలూ లేవు. ఇదంతా ఓ పోటీ ప్రపంచం అనుకో. నేను వాళ్ల మీద పెత్తనం చెయ్యకపోతే వాళ్లు నామీద చేస్తారు. మనందరం హాయిగా ఉందాం అంటే, వాళ్లకి నచ్చదు. నా పొజిషన్ నిలబెట్టుకోడానికి నేనలా చెయ్యవలసి వచ్చింది. ఈ వేషం వెయ్యకపోతే నాకు గౌరవం లేదు. ఇది ఒక విధంగా గౌరవం లాక్కోడం అన్నమాట. మీ అమ్మకి ఆ అవసరం లేదు. హాయిగా ఆ ఉద్యోగం ఉంది. ప్రేమించిన భర్త ఉన్నాడు. అర్థం చేసుకునే పిల్లలున్నారు. అది ఏ వేషమూ వెయ్యక్కర్లేదు.”

“ఈ సందర్భంగా నీ పిల్లల గౌరవాన్ని పోగొట్టుకున్నావు గదా,” అంటే, “నేనేం పోగొట్టుకోలేదు. వాళ్లు నన్ను ప్రేమిస్తూనే ఉన్నారు,” అంది.

“చూశావా సుధా, నువ్వు ఈ క్షణం ఎవర్ని పెళ్లి చేసుకున్నా మీ అమ్మ ఏమీ అనదు. అప్పుడు నువ్వు పొరపాటు పడ్డావనుకుని ఆ సంబంధం వద్దంది. అప్పుడయినా నువ్వు ఆవిణ్ణి సమాధానపరచడానికి ప్రయత్నించలేదు. పోనీ నీ అంతట నువ్వు పెళ్లి  చేసుకుని వెళ్లిపోయి ఉంటే తరువాత ఆవిడే సమాధానపడేది. నీకు ధైర్యం చాలలేదు. నీ పిరికితనాన్ని మరొకరి చెడ్డ తనం కింద చిత్రించడం మంచిది కాదు. అదివరకు ఆడవాళ్లు ఆర్థిక స్వాతంత్ర్యం లేక అణిగి పోయారు. ఇప్పుడు చాలామందికి ధైర్యం లేక అణిగిపోతున్నారు.”

“నిన్ను బలవంతంగా ఎవర్నైనా ప్రేమించి, పెళ్లి చేసుకుని పొమ్మని నేను చెప్పడం లేదు. నీకా అవసరం వస్తే ఎవరి కోసం దడవద్దన్నాను.”

“నాకిప్పుడు పెళ్లి మీద ఆసక్తి పోయింది నిజంగా!”

“అయితే, ఈ పట్టుచీరల వేషాలు వెయ్యననీ, నీకిక సంబంధాలు చూడవద్దనీ మీ అమ్మకి చెప్పెయ్. మళ్లీ ఎవరైనా నీకు సన్నిహితంగా వచ్చినప్పుడు, వాళ్లు నీకు నచ్చారనుకుంటే, నీకు పెళ్లి చేసుకోవాలనిపిస్తే అప్పుడు చేసుకో. ఆ స్టేట్‌మెంట్ కోసమే మీ అమ్మ ఎదురుచూస్తోంది. ఆవిడ నీకు పెళ్లి చెయ్యదని నువ్వు అనుకుంటావనే ఇదంతా చేస్తోంది.”

“నిజమేనేమో!” అంది సుధ.

“పెళ్లి కాలేదని కుంగిపోవడాలూ, అయిందని పొంగిపోవడాలూ- ఇవ్వన్నీ వొట్టి భ్రమలు,” అని నవ్వింది.

*

తరువాత ఇద్దరం చాలా విషయాలు మాట్లాడుకుని బాగా నవ్వుకున్నాం. ఈలోగా పతివ్రత పిన్నీ బడాబాబు వచ్చి కూర్చున్నారు మా దగ్గర. పిన్ని సుధ మీద చాలా సానుభూతి కురిపించింది. నామీద కూడా కొంచెం చూపబోయింది గానీ, నేను పడనివ్వలేదు. పిన్నీవాళ్లు రాత్రికి విజయవాడ వెళ్లి అక్కడ నుంచి బొంబాయి వెళ్లిపోతారు. విజయవాడలో బడాబాబు చెల్లెలు ఉంది. అక్కడికి వెళ్లడం పిన్నికి ఇష్టంలేదు. వీలున్నంతవరకూ ఆయన్ని వాళ్లతో కలవనివ్వకుండా చేస్తూ ఉంటుంది.

ఆవిడలా చెయ్యడం ఈయనకీ ఇష్టమే. ఎందుకంటే, వాళ్లతో కలసిమెలసి ఉంటే తడవకీ బొంబాయి వచ్చేస్తారు. సహాయాలడుగుతారు. ఎడంగా ఉండడమే మంచిది. ఇలా తను వాళ్లకి ఎడంగా ఉండడం తన భార్య వల్లనేనని వాళ్లు అనుకోవడం కూడా ఆయనకిష్టమే. ఎందుకంటే, వాళ్ల సానుభూతి తన మీద ఉంటుంది. అయితే, ఇప్పుడు ఆనందపురం వరకూ వచ్చి విజయవాడ స్టేషన్లో రైలెక్కుతూ, సొంత చెల్లెలు ఇంటికి వెళ్లకపోతే బావుండదని ఒక రాత్రి అక్కడ ఉండడానికి కేటాయించింది పిన్ని.

'నాదేం లేదు, నా దేహం, ప్రాణం అన్నీ ఆవిడవే,' అనేస్తాడు బడాబాబు. అందులో రాజకీయం అర్థం కాని పిన్ని నిజమేనని నమ్మి అతనికి మరింత వినయం ప్రకటిస్తుంది. బాబాయిని వాళ్ల బంధువులంతా భార్యావిధేయుడు అంటారు. నిజానికి ఎవరు ఎవరికి విధేయులో వాళ్లకి అర్థంకాదు.

అప్పటికే రవీ, రాజూ కూడా వచ్చి కూర్చున్నారు. రవికి రాజు బాగా నచ్చినట్టున్నాడు. ఇద్దరూ కబుర్లు చాలాసేపట్నించి చెప్పుకుంటున్నారు.

రాజు ఎవరికి నచ్చడు గనుక!

"మనం కూడా రేపు వెళ్లిపోదాం- ఉష పిన్నినీ, జయనీ విజయవాడలో దింపేసి. అందరికీ కలిపి తెనాలి నుంచే ఒక టాక్సీ మాట్లాడుకొచ్చెయ్," అంది పెద్దమ్మ రవితో. ఆవిడకి రవి మీద కోపం ఎప్పుడో పోయింది.

"ఇండియాలో ప్యాసెంజర్ రైలు జర్నీ బావుంటుంది. ప్రొద్దున్నే ఏడున్నరకి ఉందట. మనందరం సరదాగా ఆ రైలెక్కి పోదాం. చిలువూరులో సపోటాకాయలు కొనుక్కోవచ్చు. వడ్లపూడిలో నారింజకాయలు, దుగ్గిరాలలో పసుపుకొమ్ములు," అన్నాడు రవి.

"అవి అక్కడ రైలులో అమ్మరు తండ్రీ," అన్నాను నేను.

"నీకు మతి ఉందా, పోయిందా! ఆ దుమ్ముల్లో, ఆ జనం మధ్య ఎక్కుతావా- నీ ప్రయాణం పది రోజుల్లోకొచ్చింది. ఈలోగా మంచం ఎక్కుతావు," అంది పెద్దమ్మ.

"నీకు నీ చిన్నతనం మళ్లీ ఒకసారి చూసినట్లుంటుంది. రైలెక్కడం మంచి అనుభవం," అని వాదన పెట్టుకున్నాడు. చివరికి అందరూ రవినే సమర్థించారు. ఆ ప్యాసెంజరు రైలు ప్రయాణం గురించి రవికి రాజే చెప్పేనట్లున్నాడు.

"ఈ పెళ్లి వంకతో తమ్ముడు మనందర్నీ ఇలా కలిపాడు. మళ్లీ ఎప్పుడు కలుసుకుంటామో! సుధ పెళ్లికేనా?" అంది పిన్ని.

"నేనిలాంటి పెళ్లి చేసుకోను పిన్నీ. ఇది చూసి నా మొహం మొత్తింది. ఎన్నో పెళ్లిళ్లకి వెళ్లాముగానీ, ఇంత దగ్గరగా చూడలేదు. ఈ తలంబ్రాలు పోసుకోవడం వెనక, వీడియోల వెనక ఇంత ఖర్చూ, ఇంత శ్రమా ఉంటుందని ఆలోచించలేదసలు. నేను దేన్ని గురించి ఆలోచించాను గనుకా," అంది సుధ వెంటనే.

"అయితే, ఇంక మనందరం కలిసేది జయ పెళ్లిలోనేనా," అంది పిన్ని మళ్లీ.

నేను పిన్ని భుజం మీద చెయ్యివేసి, "నీకు మా అమ్మని చూడాలని ఉంటే హాయిగా ఢిల్లీ వచ్చెయ్. పెద్దమ్మని చూడాలని ఉంటే హైదరాబాద్ వెళ్లిపో. నన్ను చూడాలనిపిస్తే బెంగుళూర్ వచ్చెయ్. మధ్యలో పెళ్లి గొడవెందుకు! పోనీ నీకు మమ్మల్ని చూడాలని చాలా అనిపించి నువ్వు రాలేకపోతే మాకొక ఉత్తరం రాసి పడేయ్. మేమే వస్తాం. అవునసలూ, నువ్వెవరికీ ఉత్తరం రాయవెందుకూ?" అన్నాను.

''ఏమిటోనే! రాయడం అలవాటు తప్పిపోయింది. పెన్ను పుచ్చుకుంటే అక్షరాలు పడవు. అందుకే ఎప్పుడైనా పెద్దమ్మకి ఫోన్ చేస్తుంటాను. నాకు మాత్రం ఎవరున్నారు? నాకెప్పుడూ మా అక్కయ్యలు గుర్తొస్తారు. కానీ, ఏం చెయ్యను చెప్పు. ఇంట్లోనే సరిపోతుంది. నేను లేకపోతే ఒక్క క్షణం గడవదు,'' అంటూ కళ్లు తుడుచుకుంది.

పిన్నికి స్నేహితులు లేరు. అక్కచెల్లెళ్లని కలుసుకోడానికి తీరదు. పెళ్లీ పేరంటం వంకనగానీ బయలుదేరడానికి కుదరదు. అందుకే ఇలాంటి సందర్భాలని వదులుకునేవాళ్లు కారేమో పూర్వం. అంతకన్నా ఆత్మీయుల్ని చూడడానికి అవకాశం లేక.

''క్రిందటి సంవత్సరం ట్రీట్‌మెంట్ కోసం వచ్చి పెద్దమ్మ నా దగ్గర చాలారోజులు ఉంది. నీకు ట్రీట్‌మెంట్ అక్కర్లేదనుకో. అయినా, నీ పతిసేవకి ఓ పదిరోజులు సెలవు పెట్టి నా దగ్గరకురా, బావుంటుంది,'' అన్నాను కొంచెం ధైర్యం చేసి.

''అలాగేనమ్మా,'' అంది పిన్ని కళ్లు తుడుచుకుని.

సేవ, ప్రేమ ఇవ్వడమేగానీ పుచ్చుకోవడం ఎరగని చాలామంది స్త్రీలలాంటి పతివ్రత పిన్ని నా ఆహ్వానానికి కరిగిపోయింది. తనని విడిచిపెట్టి బాబాయి హాయిగా ఉండగలడని పిన్నికి తెలిసే ఉంటుంది. కానీ, ఈవిడే ఉండదు. అతన్ని ఒంటరిగా వదలడం ఈవిడకిష్టం లేదు. అందుకోసమని ప్రతి చిన్న విషయానికీ తనపైన ఆధారపడేలా చేసింది. ఆఖరికి 'టై'కి కూడా ముడివేసి ఉంచుతుంది. ఇప్పుడు ఈ పెళ్లికి కూడా తను ఒక్కతే రాకుండా ఆయన్ని బలవంతం చేసి తీసుకొచ్చింది. తను లేనిదే ఆయన బతకలేడని తనని తను నమ్మించుకుంటూ, ఆయన్ని నమ్మించడానికి ప్రయత్నిస్తుంది. బాబాయికి తనమీద గల ప్రేమ పట్ల, ఇంట్లో తన స్థానం పట్ల ఆవిడకింకా నమ్మకం కలగలేదన్న మాట. పెళ్లయినప్పటి నుంచీ ఇప్పటివరకూ ఆ అభద్రతాభావం తోనే బతుకుతూందన్నమాట.

అమ్మ నాన్నని వదిలిపెట్టి నెల, రెండు నెలలు కూడా వెడుతూ ఉంటుంది.

'నేను వెళ్లినప్పుడు నువ్వేం చేశావు,' అని అడగదు. ఆవిడ మీదే మేమంతా ఆధారపడి బతికేలా, అసమర్థుల్లా మమ్మల్ని ఆవిడ తయారుచెయ్యలేదు. అందుకే మేం అందరం తలా ఒకచోట ఉన్నా హాయిగా బతుకుతున్నాం అనుకుంటాను.

*

జీన్స్ ప్యాంట్‌లు, టీ షర్టులు, మిడీలు, క్రాపులు, వీకెండ్ పార్టీలు, బయట తినడాలు, సినిమాలు, స్నేహితులు, చర్చలు, వాదనలు, సిద్ధాంత రాద్ధాంతాల జీవితంలో నుంచి ఆనంద పురం రావడం నాకొక ప్రత్యేక అనుభవంలా ఉంది. ఇదంతా ఇలా ఉంటుందని అమ్మ నాకు పదిహేను సంవత్సరాల నాడే చెప్పినా, ఇప్పటికీ ఇలాగే ఉంటుందని నేను అనుకోలేకపోయాను. కుటుంబం గురించి, వివాహవ్యవస్థ గురించి, అసలు పెళ్లి చేసుకోవాలా- అక్కర్లేదా అనీ, ప్రిమా రిటల్ సెక్స్ గురించీ ఒకవైపు చర్చలు జరుగుతూ ఉంటే, ఇంకొకవైపు ఇంకా అలివిమాలిన పాతివ్రత్యాలు, పతిసేవలు, లక్షలు లక్షలు పోసి మొగుణ్ణి కొనుక్కోడాలు, మర్యాదలు, అలకలు, మహానగరాలలో మహమ్మారిలా వ్యాపించిన పెట్టుబడిదారీ వ్యాపార సంస్కృతి, పల్లెటూళ్లల్లో ఇంకా మిగిలి ఉన్న భూస్వామ్య భావజాలం- అన్నిచోట్లా ఉన్న పితృస్వామ్య సంస్కృతి ప్రభావం- మనుషులంతా ఆలోచించడం మర్చిపోయారా? చలనం లేని బొమ్మలైపోయారా అనిపిస్తుంది ఒక్కొక్కసారి.

''నువ్వెంతసేపటికీ నీ మధ్యతరగతి వర్గం గురించే ఆలోచిస్తున్నావు జయా. పల్లెటూరిలో అట్టడుగు వర్గపు స్త్రీలకి ఇప్పటికీ ఎన్ని సమస్యలున్నాయో చూడు. ఉండడానికో ఇల్లు, తినడానికి

మంచి తిండి, చూడడానికి టెలివిజన్, కట్టడానికి పట్టుచీరలు- ఇన్ని ఉన్న స్త్రీలకి సమస్యలుంటే- నిద్ర లేచిన దగ్గర్నుంచీ పొయ్యి మీదకి, పొయ్యి కిందకీ వెతుక్కోవడంతో మొదలుపెట్టి, రాత్రి పడుకోడానికి వాన వస్తే పొడి జాగా కోసం వెతుక్కోవడంతో ఆఖరయ్యే బతుకుల గురించి ఆలోచించు. వాళ్ల సమస్యలు తీరేవి కావు. వాళ్లమీద రోజూ జరిగే కుటుంబహింస, అంటే మొగుడి చేత తన్నులు తినడం- ఇదంతా ఆలోచించు,'' అన్నాడు రాజు.

''ఇప్పటికీ కూలికొస్తే మగవాడికి ఎక్కువ, ఆడదానికి తక్కువ. కొన్ని పనులకి మగవాళ్లనే పిలుస్తారు. ఆడవాళ్లని పిలవరు. ఇళ్ల దగ్గర పసిపిల్లల్ని చూసే దిక్కు ఉండదు. పనిచేసేచోటికి తెచ్చుకుంటారు. వాళ్లు ఏడిస్తే పాలివ్వడానికి వెడితే మేస్త్రీ ఊరుకోడు. ఇప్పుడు ఈ ఊళ్లో కూలీ కూడా ఎకరానికింత అని కాంట్రాక్టు మొదలైంది. మేస్త్రీలు ఆడవాళ్లే.

''మనిషికింత అనిగాక, ఎకరానికింత అని ఇస్తాం! మేస్త్రీ ఆ డబ్బుని ఎంతమంది కూలీలని తెస్తే అంతమందికి పంచుతుంది. ఈ ఆడవాళ్లు పొలంలో పని ఉన్నప్పుడు కూలి చేస్తారు. అంటే నాట్లు వేస్తారు, కలుపు తీస్తారు, కోత కోస్తారు. కుప్ప వేయడం మళ్లీ మగవాళ్లు చేస్తారు. ఈ పన్లు లేని రోజుల్లో ఇళ్లలో పనిచేస్తారు. పిండి కొడతారు, అంట్లు తోముతారు, అటుకులు దంచుతారు. ఇప్పుడు అటుకులకి మరలొచ్చాయనుకో. ఎంత చేసినా చాలదు. మీ చిన్నప్పుడు మగవాళ్లు ఇంత తాగేవారు కాదేమో. ఇప్పుడు ప్రతివాడికీ అదే. ఎవరో నూటికి పదిమంది తాగని వాళ్లు. ఇప్పుడు అదొక అదనపు ఖర్చు. ఇక కుటుంబ నియంత్రణ అంటావా, అదంతా ఎంత సేపటికీ ఆడదాని వ్యవహారమే అని ప్రభుత్వమూ అనుకుంటుంది. మగవాళ్లూ అనుకుంటారు. ఆడవాళ్లే మాత్రలు మింగాలి. ఆడవాళ్లే ఆపరేషన్లు చేయించుకోవాలి. చేయించుకుంటున్నారు కూడా. ఆడవాళ్లే ఈ ఆపరేషన్లు చేయించుకునీ, మందులు మింగీ అలివిమాలిన పనిచేస్తే వాళ్ల ఆరోగ్యాలు చెడిపోవడం లేదా? వాళ్లలో హార్మోన్ జబ్బులు రావడం లేదా?

''ప్రభుత్వం టెలివిజన్ ఎడ్వర్‌టైజ్‌మెంట్లు కూడా స్త్రీల కోసమే ఎక్కువ ఇస్తుంది. ఆడవాళ్ల మీద జరుగుతున్న ఇంత శ్రమదోపిడీ ఇప్పటికీ అలాగే ఉంది. ఇంకా ఎక్కువైంది,'' రాజు చెప్పుకు పోతున్నాడు.

''పధ్నాలుగు పదిహేనేళ్ల ఆడపిల్లలకి పెళ్లిళ్లు చేసేస్తారు. ఎంత చెప్పినా వినరు. వాళ్లకి పదహారేళ్లొచ్చేసరికి పిల్లలు. ఈడేరిన ఆడపిల్ల ఇంట్లో ఉంటే ఇంకా దానికి భద్రత లేదని వాళ్ల నమ్మకం. ఆ పిల్ల అంత లేత వయసులో ఇంటిపనంతా నెత్తిన వేసుకుని చెయ్యాలి. పిల్లల్ని కనాలి. తన్నులు తిని మొండికి పడి బతకాలి. ఇదంతా ఎప్పుడైనా ఆలోచించావా?''

''అవును రాజూ నాకు తెలుసు,'' అంది పెద్దమ్మ.

''మనం ఆలోచిస్తాం కానీ, మనం ఏ చెయ్యగలం,'' అంది సుధ.

''అల్లాంటి వాళ్లకి సాయం చేసే స్వచ్ఛంద సంస్థలేవైనా ఉంటే వాటికి మనకి చేతనైనంత సాయం చేసి ప్రోత్సహించాలి. మనం చేసే వెధవ దండగ ఖర్చులు మానేసి, సంవత్సరానికోసారి వాళ్లకి ఏదైనా ఇవ్వాలి,'' అన్నాడు రవి.

''మనమేం దండగలు చేస్తున్నాం? ఉన్న డబ్బే చాలడం లేదు,'' అంది పిన్ని.

''వాటి గురించి ఇంకొకసారి మాట్లాడుకుందాం,'' అని నవ్వేడు రాజు.

సాయంత్రం భోజనాల దగ్గర రవీ, రాజూ అందర్నీ సమావేశపరచారు.

చిన్న మామయ్య ఇల్లు అమ్మడం, సుందరంతో వెళ్లి హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్ కొనుక్కోవడం గురించి ప్రస్తావన తెచ్చింది శారదత్తయ్య.

“కొనబోతే కొరివీ, అమ్మబోతే అడవీ అనీ- ఈ ఇల్లు కట్టి దాదాపు యాభై సంవత్సరాలైంది. పల్లెటూళ్లో ఇందులో సగం ఎవరు కొంటారు చెప్పు? కొన్నా ఎంతిస్తారు? బస్తీలో- అందులో హైదరాబాద్‌లో ఇల్లు కొనడానికి ఇది సరిపోతుందా? చాలదు. ఉన్న రెండెకరాలూ కూడా అమ్ము కోవాలి. హైదరాబాద్‌లో అపార్ట్‌మెంటంటే నాలుగు లక్షలుంటుంది. రేపు సుందరానికి పెళ్లౌతుంది. భార్య వస్తుంది. అపార్ట్‌మెంట్‌లో ఇంతమంది ఎక్కడుంటారు? ఎప్పుడైనా శ్రీలక్ష్మి వచ్చి అమ్మ దగ్గర నాలుగు రోజులుండాలంటే ఎక్కడుంటుంది?” అన్నాడు పెద్ద మామయ్య.

“మా అమ్మకి ఇంట్లో బాగాలేదు. ఈ పల్లెటూర్లో పనివాళ్లు దొరకరు. నేనక్కడ పనిమనిషిని పెట్టి చేయిస్తాను,” అన్నాడు సుందరం.

“నీ చేయించడం నాకు తెలుసులే. వీళ్లు తెచ్చే డబ్బంతా నీ ఇంటికి సరిపోతుంది. ఇక ప్రతి పైసకీ వాళ్లని నీ మీద ఆధారపడేలా చేసుకుంటావు,” అన్నాడు పెద్ద మామయ్య మళ్లీ.

“నీ కొడుక్కి ఉద్యోగం రాలేదు కాబట్టి, నువ్విన్ని మాటలు చెబుతున్నావు. వస్తే నువ్వు మాత్రం బస్తీ వెళ్లిపోవా ఏం?” అన్నాడు సుందరం.

“రాజు తలచుకుంటే ఐ.ఎ.ఎస్. పాసైపోతాడు. వాడికి ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేదు. ఇక్కడే ఉండి వ్యవసాయం చేసుకుంటానన్నాడు. వాడికున్న తెలివీ, పరిశీలనా నీకున్నాయా?” అంది పెద్దమ్మ కలుగజేసుకుని.

“మీ అబ్బాయిని అమెరికా ఎందుకు పంపావు? ఇండియాలో ఉంచకపోయావా?” అన్నాడు సుందరం.

“నేను పంపలేదు. వాడే వెళ్లాడు. నేనాపలేదు. వాడిష్టం అని ఊరుకున్నాను. నిన్ను ఇక్కడే ఉండిపొమ్మని నేననడం లేదు. మీ నాన్న సంగతి చెప్పాను,” అన్నది పెద్దమ్మ.

“నువ్వొకసారి బాగా ఆలోచించుకో తమ్ముడూ. నువ్వు పుట్టిన దగ్గర్నుంచీ ఈ వాతావరణా నికి అలవాటుపడ్డావు. పైగా నీ చేతిలో ఉన్న ఆస్తి అమ్ముకుని వెడితే వృద్ధాప్యంలో బాధపడతావు,” అన్నది అమ్మ.

“ఇది మా కుటుంబ వ్యవహారం చిన్నత్తా. మేం ముగ్గురం ఆలోచించుకుంటాం,” అన్నాడు సుందరం.

“కాదని ఎవరంటారు? ఏదో పెద్దవాళ్లం కదా అని మాకు తోచింది చెప్పాం,” అని అక్కడ నుంచి వెళ్లిపోయింది పెద్దమ్మ.

“నేనూ ఆలోచించుకునే వెడతానులే అక్కయ్యా, అంత తొందరపడను. మన రాజుకి కూడా నేనీ భాగం అమ్మడం ఇష్టంలేదు. పరాయివాళ్లని ఇంట్లో చొరపెట్టవద్దంటాడు. అసలు ఇప్పుడు వెళ్లడం ఎందుకో కూడా ఆలోచించాలి,” అన్నాడు మామయ్య మా అమ్మ దగ్గరగా జరిగి కూర్చుని.

సుందరం మొహం మాడ్చుకుని వెళ్లిపోయేడు.

“వాడికి మంచి ఉద్యోగం వచ్చింది. హాయిగా ఇల్లు తీసుకుని ఉంటాడు. మీరిక్కడే ఉండండి. నీకింకా యాభై ఏళ్లయినా లేవు నిండా. ముసలివాడివేం కావు. హాయిగా ఉన్న పొలం చూసుకుంటూ ఉండు మామయ్యా,” అన్నాడు రవి.

“గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్టుందిరా అబ్బాయ్,” అని నవ్వాడు చిన్న మామయ్య.

*

పుట్టి బుద్ధెరిగిన తరువాత ఆనందపురం దాటి ఎక్కడికీ వెళ్లని గాయత్రిని మాతో ప్రయాణం చేసింది అమ్మ.

తెల్లవారుతూనే విజయవాడ వెళ్లే ప్యాసెంజర్ ట్రెయిన్ కోసం అందరం స్టేషన్‌కు బయలుదేరాం. రవి రాజుని విడిచిపెట్టడం లేదు. రాజు మాతో స్టేషన్‌కి బయలుదేరాడు.

"నీ కార్యక్రమం ఏమిటి రాజూ? ఒకసారి రాకూడదూ బెంగుళూరు- సరదాగా," అన్నాను నేను కిందటిసారి వచ్చినప్పుడు సుధ నాకు స్నేహమైంది. ఇప్పుడు రాజు ఎంతో ఆత్మీయుడయ్యాడు.

"మీదంతా అమ్మాయిల అపార్ట్‌మెంట్ కదా! నన్నుండనిస్తారా?" అన్నాడు.

"చూద్దువుగాని మేం నిన్ను ఎంత స్నేహంగా, ప్రేమగా చూసుకుంటామో," అన్నాను.

"కొంపదీసి రాజుని ప్రేమిస్తున్నావా ఏం? మీ ఇద్దరు రాత్రి ఒకటే కబుర్లు డాబా మీద కూర్చుని," అంది సుధ.

"రాజుని చాలా ప్రేమిస్తున్నాను. నాకెంతో నచ్చాడు," అన్నాను.

"అతనూ నిన్ను ప్రేమిస్తున్నాడా? మరి రాజు బెంగుళూరు వచ్చేస్తాడా? నువ్వీ పల్లెటూరు వచ్చి ఉంటావా," అని ఎంతో ఆత్రంగా నా మొహంలోకి చూసింది.

"ఎవరూ ఎక్కడికీ రారు. అతను ఎంతో హాయిగా ఆనందపురంలో వ్యవసాయం చేసుకుంటూ ఉంటాడు. నేను బెంగుళూరులో ఉంటాను, నా కంప్యూటర్ దగ్గర."

"మరి ప్రేమిస్తున్నానన్నావు. పెళ్లి చేసుకోవా?"

"ప్రేమించడం అంటే పెళ్లి చేసుకోవడం అని నేను చెప్పానా నీకు? మీ అమ్మని ప్రేమించవా? నాన్నని ప్రేమించవా? నన్ను ప్రేమించవా? అలాగే నేను రాజుని ప్రేమించాను. ప్రేమ అనే మాటకి ఉండే ఎంతో గొప్ప అర్థాన్ని ఎంత కుంచించి వేశావో చూడు! రాజు మాటలంటే నాకు వినడం ఇష్టం కనుక డాబా మీద కూర్చుని విన్నాను. అర్థం అయిందా! నేను చాలా ప్రాక్టికల్‌గా, నేను ఎలా అయితే సుఖంగా, హాయిగా ఉండగలనో అలా ఉండడానికే ప్రయత్నిస్తానుగానీ, నేల విడిచి సాము చెయ్యను. ఐ యామ్ ది మోస్ట్ అన్‌రొమాంటిక్," అన్నాను.

"అంటే నీదంతా స్వప్రయోజన దృష్టి అన్నమాట."

"అవును, స్వప్రయోజనం ఎందుకుండకూడదు? స్వప్రయోజనం కోసం ఎవరికైనా ద్రోహం చేస్తే తప్పు. నా జీవితం, నా అభిప్రాయాలు, నా అలవాట్లు, నా కెరీర్ నాకు ముఖ్యం. వీటిని త్యాగంచేసే ప్రసక్తిలేదు. వాటిని కాపాడుకుంటూనే, నన్ను అభిమానించి నాతో అభిప్రాయ సామ్యం కల వ్యక్తి నాకు సన్నిహితంగా వచ్చినప్పుడు పెళ్లి గురించి ఆలోచిస్తాను. అంతేగాని, ప్రథమ వీక్షణంలో ప్రేమలు, అలివిమాలిన త్యాగాలు, ఆత్మార్పణల మీద నాకు నమ్మకం లేదు."

వెనక నుంచి రవి చప్పట్లు కొడుతున్నాడు.

రైలొచ్చింది.

దుమ్ములో, మామూలు మనుష్యుల మధ్య ప్రయాణం చెయ్యనన్న పెద్దమ్మ రైలెక్కగానే తన చిన్నతనంలో వాళ్లమ్మతో కలిసి విజయవాడ దాకా చేసిన ప్రయాణాల గురించి చెప్పడం మొదలుపెట్టింది. అప్పుడు విజయవాడ దగ్గర కృష్ణా బరాజ్ లేదట. తరువాత కట్టారట. కట్టిన తరువాత మళ్లీ రైలు ప్రయాణం చెయ్యలేదట. తన చిన్నతనంలో ఆనందపురం నుంచి విజయవాడ వెళ్లడానికి మూడుగంటలైనా పట్టేదట.

*

విజయవాడ నుంచి టాక్సీ తీసుకుని రవీ, పెద్దమ్మా వెళ్లిపోగా, అమ్మా, నేనూ, గాయత్రీ త్రిపురసుందరి భవంతికి పోయాం. అటువంటి భవనాలని బయటినించి చూడడమేగానీ,

ఇంతవరకూ లోపలికి పోలేదు నేను. సర్వశ్రేష్ఠమైన వస్తువులతో ఇల్లంతా అలంకరించింది ఆవిడ. ఆ మాటంటే ఇప్పుడలాంటి ఇళ్లు విజయవాడలో చాలా ఉన్నాయంది. పది పదిహేనేళ్లలో ఒక న్యూ రిచ్ క్లాస్ విజయవాడలో ప్రాముఖ్యం సంపాదించింది. ఇళ్లు కట్టుకోడం, జీవనశైలి ఏ మహానగరవాసులకీ తీసిపోని విధంగా ఉంటుందట వాళ్లకి. విజయవాడలో ప్రబలుతూన్న ఈ సంస్కృతికి నిదర్శనంగా ఎక్స్‌క్లూసివ్ బ్యూటీషాప్‌లు, బ్యూటీ క్లినిక్‌లు, డిపార్ట్‌మెంట్ స్టోర్‌లు, ఐస్‌క్రీం పార్లర్లు, కొత్త కొత్త హోటళ్లు చూశాం. విపరీతంగా కట్టే భవనాలు, ఎపార్ట్‌మెంట్స్ చూశాం. డాక్టర్లని, ఇంజినీర్లని ఉత్పత్తి చెయ్యడం కోసం పోటీలుపడి నడుపుతున్న రెసిడెన్షియల్ కాలేజీలూ చూశాం. జిమ్‌లు, యోగాసెంటర్లు, స్పోకెన్ ఇంగ్లీషు ఇన్‌స్టిట్యూట్‌లూ చూశాం. బజారుకొకటి వెలిసిన కంప్యూటర్ సెంటర్లూ చూశాం. జీన్స్, టీ షర్ట్స్ అమ్మాయిల్నీ చూశాం. రోడ్డుపక్క చెట్టుకింద అన్నం వండుతున్న ఎనిమిదేళ్ల అమ్మాయినీ, ఆ పక్క చీర ఉయ్యాల్లో నిద్రపోతున్న ఆ పిల్ల తమ్ముణ్ణీ, అక్కడ కట్టే భవన సముదాయానికి సిమెంటు మోస్తున్న తల్లినీ చూశాం.

అమ్మా, త్రిపురసుందరీ ఆంటీ కబుర్లు చెప్పుకుంటూ ఉంటే వింటున్నాను. ఈ ఊరు నుంచి లక్షలకి లక్షలు ఖర్చుపెట్టి అమెరికా వెళ్లి చదివే పిల్లల గురించి, ఎల్.కె.జి. క్లాసు ఇక్కడ చదివించడం ఇష్టంలేక ఊటీ పంపే పేరెంట్స్ గురించి, దావణగిరిలోనూ, మణిపాల్‌లోనూ ఎం.డి.లు చదువుతున్నవాళ్ల గురించి- వింటూనే కాఫీ టేబుల్ మీదున్న స్థానిక వార్తాపత్రిక తీశాను.

కిందటిరోజు జరిగిన ఒక కులసంఘం అతి పెద్ద ఊరేగింపు తాలూకు రంగు ఫోటో. మరో పేజీలో మరునాడు జరగబోయే ఇంకో కులసంఘం సభ తాలూకు వివరాలు. స్టౌ పేలి వివాహిత యువతి మరణం. కృష్ణ ఒడ్డున గుర్తు తెలియని యువకుడి శవం. స్త్రీలకి బ్యూటీ టిప్స్, ఫ్యాషన్స్, వంటలు, 'ఒక మొగుడు ఇద్దరు పెళ్లాలు' సినిమా శతదినోత్సవ సభ వివరాలు- విశేషాలు, ఫోటోలు- ఆ సినిమాలో వీలైనంత అశ్లీల సంభాషణలూ, రెండర్థాల పాటలూ రాసిన రచయితకి ఘన సన్మానం. అంత గొప్ప సినిమా తీసిన దర్శకుడికి పొగడ్తలు, ప్రశంసలు. అటు వంటి కళాఖండాన్ని ఇంతవరకూ చూడలేదని ఒక మహిళా కళాశాల లెక్చరర్ ప్రశంస.

మళ్లీ తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం. శేషమ్మ, మంగమ్మ, కలెక్టర్ పెద్దమ్మ, పతివ్రత పిన్ని, గాయత్రి, సుధ గుండె మీద వేసిన ముద్రలతో.

*ఇండియా టుడే వార్షిక సాహిత్య సంచిక, 1995*

మూడు తరాల సంఘర్షణకు ముప్పేట అల్లిక

# పెళ్లి ప్రయాణం

***పొలం అంటే నాకు చాలా ఇష్టం. మా నాన్న కున్న చాలా పొలంలో ఒక్క అంగుళం కూడా మా అక్కచెల్లెళ్ళకెవరికీ రాలేదు. ఆయన మిగిల్చినది మా తమ్ముళ్ళకి వచ్చింది. మార్పు చెందుతూన్న మానవ సంబంధాలు, ఆస్తి సంబంధాలు ఇందులో ముఖ్యంగా స్త్రీలకు జరిగే అవమానాలు, అన్యాయాలు నన్ను ఆలోచింపజేసేవి.***

నా వేళ్ళు పల్లెటూళ్ళో ఉన్నాయి- నా బాల్యం వికసించింది పల్లెలోనే- కార్తీక మాసపుటుదయం పున్నాగపూలు ఏరుకున్నట్టు నా బాల్యస్మృతుల్ని అపురూపంగా ఏరి దాచుకుంటూ ఉంటాను- ఏ సాహితీ ఉద్యమాలూ, ఏ రాజకీయ ఉద్యమాలూ ప్రభావితం చెయ్యని అతి సామాన్య కుటుంబంలో- సంప్రదాయ కుటుంబంలో పుట్టిన నాకు నా భావి జీవితాన్ని ప్రభావితం చేసే గతం ఏమీ లేదు. ఆచారాలలో, సంప్రదాయాలలో, నమ్మకాలలో, సెంటిమెంట్లలో ఉండిన ఆ కుటుంబం నాకు, నేనెట్లా ఉండాలో కాక ఎట్లా ఉండకూడదో నేర్పింది.

రెండు తరాలు, రెండో తరం సంతానం, భర్తను పోగొట్టుకొని పుట్టింటికి చేరిన ఆడబడుచు, ప్రతి ఉదయం కాకి అరుపుతోపాటు వచ్చి వాలే అశేష బంధు జనం- గొడ్డూ గోదా- పాడీపంటా- ఉన్న కుటుంబం అది. దానికి యజమాని నా తండ్రి. ఆయన తండ్రికి వృద్ధాప్యం రావడాన, మంచాన పడటాన- ఈయన ఆ స్థానానికి ప్రమోట్ అయ్యాడన్న మాట. యజమాని అంటే అచ్చమైన యజమాని. ఆ విషయం మాటవరసకి కూడా మర్చిపోని యజమాని. అంచేత అటు భార్యా బిడ్డలకే గాక, స్వంత అక్కచెల్లెళ్ళకీ గాక ఎవరికీ చనువివ్వని, సదా గంభీరత పాటించే వ్యక్తి. తన మనసులో ఏం ఉందో, తానేం చేయబోతున్నాడో ఎవరికీ చెప్పని వ్యక్తి. కుటుంబ సభ్యుల్లో ప్రేమా గౌరవాల కన్నా 'భయం' చెప్పినట్లు వినడం మొదలైన వాటికి మొదటిస్థానం ఇచ్చిన వ్యక్తి.

ఆ రోజుల్లో నాకు తెలిసిన చాలా ఇళ్ళల్లో మేనత్తలుండేవాళ్ళు- వితంతువులైన మేనత్తలు- వీళ్ళల్లో కొందరు అమ్మల్ని ఏడిపించుకు తినే గయ్యాళి మేనత్తలయితే- మరికొందరు అమ్మల్నీ, నాన్నల్నీ, మనల్నీ కూర్చోపెట్టి సర్వోపచారాలు చేసి కాలం గడుపుకొనే మేనత్తలు. కాస్తో కూస్తో ఆస్తి (భర్త తాలూకుది) తెచ్చి తండ్రి చేతిలోనో, అన్నదమ్ముల చేతిలోనో పోసినవారు- అలా అప్పజెప్పి పదీ పాతిక అడిగి తీసుకొనేవారు. తమాషా ఏమిటంటే ఆరోజుల్లో నాకు ఆడవాళ్ళల్లో రెండే రకాల వాళ్ళు కనిపించేవారు. చాలా మంచివాళ్ళు, గయ్యాళివాళ్ళు. అటో ఇటో తేల్చుకోవడం మిగిలింది నాలాంటివాళ్ళకి. కుటుంబ నియంత్రణ ఇంతగా పాటించని దినాల్లో బహు సంతానం కని బలహీనమైపోయి ఎప్పుడూ ఏదో ఒక జబ్బుతో తీసుకునేవాళ్లు, జబ్బుల్ని దాచుకొనేవాళ్ళు, చిట్కావైద్యాలు చేసుకొని ప్రాణాల మీదికి తెచ్చుకొనేవాళ్ళు గ్రామాల్లో కొల్లలు. ప్రతి పది ఇళ్ళకీ ఒక హిస్టీరియా పేషెంటు ఉండేది. ఒక్కో ఇంట్లో పిచ్చివాళ్ళు కూడా ఉండేవాళ్ళు. నాకు తెలిసిన ఒకావిడకి పిచ్చి అనేవాళ్ళు. ఆవిడ అస్తమానం తన చీరె తడిసిపోయిందని, దాన్ని పిండుతూ కూర్చునేది. ఇంక స్త్రీలకి ప్రత్యేకమైన వ్యాధుల గురించి లేడీ డాక్టర్స్ దగ్గరకు వెళ్ళడం కూడా అరుదే. భర్తలు సుఖవ్యాధులు అంటించినా అవి సుఖవ్యాధులని తెలీదు. వాటికి చికిత్స అసలే లేదు. అన్ని వైద్యాలకీ ఆర్.ఎం.పి.గారి దయే. ఆయన వల్ల కాకపోతే టాక్సీ తెప్పించి అట్టహాసంగా గుంటూరో తెనాలో పెద్ద డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళేవాడు.

వంశానుగతంగా వచ్చిన పొలం- ఆస్తికి యజమాని, ఆ కుటుంబ యజమాని- తండ్రి- ఇంటి ఖర్చు- అప్పు- ఆదాయం అన్నీ ఆయనకి తప్ప ఇంకెవరికీ తెలీవు. ఏది కావాలన్నా ఆయన్ని అడిగి తెప్పించుకోవడమే. బట్టలు కూడా ఇంట్లో అందరికీ ఆయనే తేవాలి. ఉగాది పండగ ప్రొద్దున్నే స్నానం చేసి ప్రసాదం తింటేగానీ కాఫీ త్రాగొద్దంటే సరేననడం, పుస్తకాలన్నీ వినాయకుడి ముందు పెట్టి పూజలో కూర్చోమంటే కూర్చోడం, రథసప్తమికి నెత్తిమీద జిల్లేడాకులు పెట్టుకొని స్నానం చెయ్యమంటే చేసెయ్యడం- ఇలా గుడ్డిగా అమ్మా, అత్తయ్యా చెప్పింది వింటున్నా, ఎక్కడో ఒక మూల 'ఇదంతా ఎందుకు?' అనే ప్రశ్న కదిలేది. పధ్నాలుగో ఏట ఎస్సెల్సీ చదివేటప్పుడు ఆ ప్రశ్న బయటికి వచ్చింది. ఇలాంటి ప్రశ్నలు పుట్టుకురావడానికి మా ఊరు లైబ్రరీ కారణం అనుకొంటాను. స్కూల్ నుంచి రాగానే లైబ్రరీకి పరిగెత్తితే పాపం ఏమీ అనలేరు మా నాన్న. ఆయన కొన్నింటిలో ఉదారంగా ఉండేవారు. ఆడపిల్లల చదువుల విషయంలో కూడా. ఇంటికి పేపరు తెప్పించడం, వారపత్రికలు తెప్పించడం... ఇలాంటి విషయాల్లోనన్నమాట. ఎస్సెల్సీ మరీ పధ్నాలుగేళ్ళకి పాసు అవడం నాకొక వరంగా పరిణమించింది. 'ఇంత చిన్నపిల్లకి పెళ్ళేమిట'ని నేను కోరిందే తడవుగా నన్నో కాలేజీలో చేర్పించడం, గ్రామం నుంచి మహానగరానికి ప్రయాణం- కోఠీ ఉమెన్స్ కాలేజీకి. క్లాసు పుస్తకాలకన్నా మిగతా పుస్తకాల మీద ఆసక్తి మొదటి నుంచీ ఎక్కువే. ఉమెన్స్ కాలేజి లైబ్రరీకి లైఫ్, టైమ్, జాగ్రఫిక్ మాగజిన్ దగ్గర్నుంచి తెలుగు స్వతంత్ర దాకా వచ్చేవి. అమ్మాయిలంతా పూలతోటల్లో, మహావృక్షాల కొమ్మల మీద, క్యాంటీన్‌లో ఉంటే, నేనూ జయలక్ష్మి అనే నా స్నేహితురాలూ లైబ్రరీకి పరిగెత్తేవాళ్ళం. ఎలా ఉండకూడదో ఒక వైపు నుంచీ, ఎలా ఉండాలో మరొకవైపు నుంచీ శిక్షణ ప్రారంభం అయింది- సెలవులకి ఇంటికి వచ్చినప్పుడు. ప్రతీ పనికీ 'ఎందుకు?' అని ప్రశ్నించడం అలవాటైంది. మనుషుల్ని పరిశీలించడమూ అలవాటైంది. నా తండ్రి, నా తల్లి, నా మేనత్త- అందరూ నాకర్థం అవడం మొదలుపెట్టారు. ముఖ్యంగా స్త్రీలు- ఆ రోజుల్లో అంటే ముప్ఫై సంవత్సరాల క్రిందట నేను మొదటిసారిగా అసహ్యించుకొంది 'పెళ్ళి చూపులు' అనే తతంగాన్ని. ఇప్పటికీ నేను దాన్ని నాగరికతకి తలవంపులు తెచ్చే పనిగా పరి

గణిస్తాను. మా స్నేహితురాళ్ళకి, బంధువుల పిల్లలకి పెళ్ళిచూపులు జరిగేవి. అవి చూసినకొద్దీ నాకు కడుపులో దేవినట్లుండేది. నన్ను ఎక్కువ కలత పెట్టిన మరొక విషయం- ఆడపిల్లల్ని పెళ్ళి కాగానే 'డిస్‌వోన్' చేసేసుకోడం. కొంత కట్నంతో వాళ్ళ పీడ విరగడ చేసేసుకోడం. పెళ్ళి చెయ్యడం అంటే వదిలించుకోడం అన్న మాట. ఇది నేను పుట్టి పెరిగిన కులంలో మరీ ఎక్కువగా ఉండేది. కొన్ని కులాల్లో కొంచెం శ్రద్ధగా ఆడపిల్లల్ని పెంచడం వారికి కొంచెం ఎక్కువ కట్నంతో బాగా సెటిల్ చెయ్యడం చూసేదాన్ని. 'కాస్త ఎక్కువ డబ్బు పెట్టి మంచి మొగుణ్ణి కొనివ్వచ్చు కదా. ఈ బేరాలేమిటి? అంతా మిగిల్చి కొడుకులకి కట్టబెట్టాలనా?' అనుకొనేదాన్ని. అసలు కట్నం ఇవ్వాలా అక్కర్లేదా- ఆడపిల్లలకి కూడా ఆస్తులు పంచాలా అన్న విషయం ఆ తరువాత అవగాహన కొచ్చింది. ఆడపిల్లకి ఆస్తి ఇవ్వకుండా ఎగకొట్టడానికి ఎన్ని మార్గాలున్నాయో అన్నీ వెతుకుతారని కూడా తరువాత తెలిసింది. కుటుంబంలో ప్రతీ స్త్రీ ఏదో ఒక విధంగా దోపిడీకి గురవుతుందని కూడా నాకర్థం అయింది. మగపిల్లలు పుట్టడం కోసం పదిమంది సంతానాన్ని కనడం, అందులో కొందరు పోతూ ఉండడం, ప్రతీసారీ జబ్బుపడడం, అది ఖర్మ అని సరిపెట్టుకోవడం- ఇంట్లో నగలూ డబ్బూ వెండీ అన్నీ మగవాళ్ళ ఆధీనంలో ఉండడం, అవసరమైనప్పుడు మాత్రమే అవి స్త్రీలకి ఇవ్వడం- వాటిని తాకట్టు పెట్టినా స్త్రీలని అడగనక్కర్లేకపోవడం- పెళ్ళిళ్ళు కుదిర్చినా, ఆడపిల్లల ఇష్టాయిష్టాలు అడక్కపోవడం- ఇలా ఎన్నో విషయాలు నా దృష్టికి రావడం మొదలు పెట్టాయి. తమ బ్రతుకంతా పతిసేవకే నన్నట్టు అడుగులకి మడుగులొత్తే స్త్రీలు, బాగా అలంక రించుకొని, ఖరీదైన దుస్తులలో ఉండి, అందరి మీదా అధికారం చలాయిస్తూ- తమ మాటకెవరైనా ఎదురుచెప్తే అరచి పోట్లాడి అఘాయిత్యం చేసే స్త్రీలు, మాటమాటకీ కళ్ళు తుడుచుకొనే స్త్రీలు- దెప్పుతూ- సాధిస్తూ ఉండేవారు- గట్టిగా నవ్వనివాళ్ళు- సూటిగా ఎదుటివాళ్ళ మొహంలోకి చూసి మాట్లాడని వాళ్ళు- ఇలా ఎంతోమంది నాతోటి స్త్రీలు నా దృష్టిలో కొచ్చారు. వీళ్ళంతా నా వాళ్ళే. వాళ్ళందరినీ ఒక అభద్రతాభావం అస్తమానం వెంటాడుతూ ఉంటుందనీ, తమ ఉనికిని కాపాడు కోవడానికి చేసే ప్రయత్నమే ఈ పాతివ్రత్యం, గయ్యాళితనం రెండూనని అర్థం అయింది. ఈ కపటంలో తమని తాము మర్చిపోయిన పరాయితనంలో వాళ్ళు జీవితంలో రాజీపడిపోతున్న విధం నన్ను చాలా కష్టపెట్టింది.

పట్నాలకి వలసలు పోవడం నన్ను బాధపెట్టిన మరొక విషయం. పల్లెల్లో వస్తూన్న మార్పులు- పట్నపు వాసనలు గమనించాను. పొలం అంటే నాకు చాలా ఇష్టం. మా నాన్న కున్న చాలా పొలంలో ఒక్క అంగుళం కూడా మా అక్కచెల్లెళ్ళకెవరికీ రాలేదు. ఆయన మిగిల్చినది మా తమ్ముళ్ళకి వచ్చింది. మార్పు చెందుతూన్న మానవ సంబంధాలు, ఆస్తి సంబంధాలు ఇందులో ముఖ్యంగా స్త్రీలకు జరిగే అవమానాలు, అన్యాయాలు నన్ను ఆలోచింపజేసేవి.

ఇలా నాకు తెలిసిన మూడు తరాల స్త్రీలను గురించి పెళ్ళి ప్రయాణం కథలో నేను పేర్కొన్నాను. మొదటితరం స్త్రీ అయిన అమ్మమ్మకి తన స్థానాన్ని పదిలం చేసుకోవాలన్న ఆరాటం- భయం కూడా లేని అజ్ఞానం- జీవితాన్ని ఎలా బాగుచేసుకోవాలన్న ఆలోచన లేని అజ్ఞానం- నోరు విప్పి చెప్పుకోలేని అశక్తత- అది తన ఖర్మ అన్న నిర్లిప్తత- రెండవ తరంలో ముగ్గురు స్త్రీలు- ఒకరు కొంత యుక్తిగా (అదీ అభద్రతలోనే) నోటి సహాయంతో కుటుంబసభ్యులపైన అదుపు సంపాదిస్తే, మరొకరు పూర్తిగా లొంగిపోయి సేవలతో తాను వారికి 'ఇన్‌డిస్పెన్సబుల్' అనే భావాన్ని కలుగజేయడం, ఇంకొకరు వివాహం, ఉద్యోగం, పిల్లల పెంపకం విషయంలో కొంత స్వతంత్ర భావాలతో వ్యవహరించగలగడం- మూడవ తరంలో స్త్రీలకి విద్యా ఉద్యోగావకాశాలు పుష్కలంగా

లభించిన నేపథ్యంలో అవి రెండూ ఉన్నప్పటికీ తన జీవితాన్ని తనకిష్టమైన రీతిలో మలుచుకోలేక పోయిన డాక్టర్ సుధ, పిహెచ్.డి. పల్లెలో పుట్టి పెరిగినా, పట్టణ నాగరికతా వ్యామోహంతో, తల్లి దండ్రుల చేత చాలా డబ్బు ఖర్చు పెట్టించి, అన్ని హంగులతో ఆడంబరంగా వివాహం చేసుకొని, చివరికి వారి ఉనికికే ప్రమాదం తెచ్చిన పెళ్ళికూతురు. చదువూ, ఉద్యోగం, స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఆలోచించగల జయా...


అలాగే యువకులలో తమ చదువూ సంపాదనకే ప్రాముఖ్యం ఇచ్చుకొంటూ పెరిగి అమెరికా వలస వెళ్ళిన యువకుడు, తన సుఖం కోసం తల్లిదండ్రుల ఆస్తులు అమ్మించి పట్నం రప్పించుకోజూసే సుందరం, పొలాన్ని తల్లిలా కొలిచి కష్టమో సుఖమో, అక్కడే తేల్చుకోదల్చుకొన్న రాజు కనిపిస్తారు. వీరంతా నిత్యం నాకు తారసపడే వ్యక్తులే. పిల్లల చదువుల కోసం ఆస్తులు అమ్ముకొని, వారికి ఉద్యోగాలొచ్చాక పట్నాలకి తరలిపోయిన చాలా కుటుంబాలు, వారి ఒకటీ రెండూ ఎకరాలు కొనీ కొనీ ఊడలు వేసిన మర్రిచెట్టులా ఎదిగిన పెద్ద భూస్వాములు, ఈ పెద్ద భూస్వాములకి పట్టణాలలో వలె వన్నెచిన్నెల బంగళాలు, కార్లు, ఇంటి నిండా ఆధునిక సదుపాయాలతో పాటు పాడీ పంటా కూడా ఉంటాయి. ప్రక్క పట్నాలలో సినిమాహాళ్ళూ, బిల్డింగ్ కాంప్లెక్సులూ ఉంటాయి. గ్రామ, మండల, జిల్లాస్థాయి నుంచీ రాష్ట్ర రాజకీయాల వరకు సంబంధాన్ని కలిగి ఉంటారు. గ్రామ ప్రజల జీవితాలని నిర్దేశించే స్థాయిలో ఉంటారు. ఊరు మారింది. పట్టణంలా ముస్తాబు అవుతోంది. కొన్నింటిలో డిష్ యాంటెన్నాలు, దుబాయి మేడలు, కాన్వెంటు స్కూళ్ళు... కానీ ఊళ్ళో ఎం.బి.బి.యస్. చదివిన డాక్టరు ఉండడు. మళ్ళీ ఆర్.ఎం.పి.గారే శరణ్యం. ఈయన బస్తీలో వెలసిన పాలీ క్లినిక్‌లకి పల్లెజీవుల్ని చేరవేస్తుంటాడు. కమీషన్లు ముడుతూంటాయి. కడుపులో నెప్పులన్నీ ఎపెండిసైటిస్‌లుగా, పురిటి నెప్పులు మరికాసేపు సాగితే సిజేరియన్లుగా, బహిష్టు విషయంలో ఏ కాస్త అవకతవకలున్నా హిస్టరెక్టమీలుగా వర్ధిల్లుతూంటాయి. బస్తీల్లో ఆస్పత్రులన్నీ గ్రామ జీపులతో కళకళలాడుతుంటాయి... ఇదీ పెళ్ళి ప్రయాణం కథకి నేపథ్యం. ఈ కథలో మూడు దశాబ్దాల జీవితం ఉంది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 29 మార్చి 1998*

11

# గూడు కోసం గువ్వలు

## పులికంటి కృష్ణారెడ్డి



*పులికంటి కృష్ణారెడ్డి 30 జులై 1931లో చిత్తూరు జిల్లాలో జన్మించారు. దాదాపు 200 కథలు రాశారు. 'గూడు కోసం గువ్వలు', 'కోటిగాడు స్వతంత్రుడు', 'పులికంటి కథావాహిని' మొదలైన ఐదు కథాసంపుటాలు వెలువరించారు. కొన్ని నవలలు రాశారు. కవి, గాయకుడు, నటుడు, సాహితీ విమర్శకుడు. జానపద సాహిత్యంలోను కృషి చేశారు. 'నాలుగు కాళ్ల మంటపం' పేరుతో ఓ కాలమ్ నిర్వహించారు. 19 నవంబర్ 2007న తిరుపతిలో మరణించారు.*

"ఒకటీ... రెండూ... మూడు..."
ఒకదాని తర్వాత ఒకటి అన్నీ మిలమిలా మెరిసే తెల్లని పది నయాపైసల కాసులు కుడిచేతి నుండి ఎడమ చేతిలోకి జారిపడుతూంటే, తూర్పు దిక్కున సూర్య భగవానుడు పైకెక్కేకొద్దీ విచ్చి వికసించే అరవిందంలా వెలిగిపోతూ ఉంది బోయిన గురప్పతాత ముఖం!

"నాలుగూ... ఐదూ... ఆరూ... ముప్పై!"

లెక్కపెట్టడం ఆగింది. పిడికిలి మూతబడింది. పిడికెడు నిండా ముప్పై పది నయాపైసల కాసులు, మున్నూరు నయాపైసలు!... మూడు రూపాయలు!, 'మూడు రూపాయలు!' అని మరొక్కసారి సంతృప్తిగా తనలో తాను గొణుక్కొన్నాడు గురప్ప తాత. ఎక్కడెక్కడో, ఎవరెవరి జేబుల్లోనో ఒదిగి పిల్లలు పొదిగే కాసులు తన చేతిలో రాలడానికి కారణం... తన రామచిలక! ఇంకిపోయిన బతుకు తోటలో ఇగిరించిన మొలక!

తాత చూపు పంజరం మీదికి మళ్ళింది. మనిషి సంస్కారానికి చిహ్నం- కృతజ్ఞతాభావం తాత మొగాన తొణికిసలాడుతూ ఉంటే పంజరం తలుపు తెరిచాడు. పంజరంలో ధ్యానముద్రలో ఉన్న చిలక ఎగిరివచ్చి తాత

ముంజేతి మీద వాలింది. ప్రతిఫలంగా బోసి నోటి ముద్దును మోసుకొని లోనికెళ్ళింది. అంటే ఆనాటి వ్యాపారం ముగిసిందన్న మాట!...

సర్కసు డేరా చుట్టూ వేసిన చారలచారల పరదాగుడ్డ మాదిరి ప్రహరీగోడ! ఆ గోడ లోపల పెద్ద మేడ! ఆ మేడ లోపల గర్భగుడి! ఆ గుళ్ళో గోవిందరాజస్వామి! ఆయన ఏడాది కొక్కసారి లేస్తారు. ఆయన లేవడానికి వారంరోజులు ముందుగానే గుడి ముందర ఉన్న తేరు పేరంటానికి బయలుదేరే ముత్తైదువలా పసుపు రాసుకొని, కుంకుమబెట్టి, కమ్మలు, మాటీలు తగిలించుకొని వన్నెలుచిన్నెలు వారుకొంటుంది.

ఆ ఒక్కరోజు తప్ప మిగతా దినాల్లో ఆ రథం దీనజనాశ్రిత కల్పవల్లి! ఆ నీడలో పక్కన బీడులో, గూడులేని గువ్వలు, తోడులేని అవ్వలు చేరుతుంటారు. తాడులేని బొంగరాలు గోలీలు ఆడుతుంటారు. ఆ పక్కనే చిన్నచిన్న అంగళ్ళు ఉన్నాయి. అక్కడే గురప్పతాత అంగడి కూడా.

బలపరాతి విగ్రహంలాంటి రూపు... ఎప్పుడూ ఏదో వెదుకులాడే చూపు... అనుభవంతో పండిన శిరోభాగాన్ని నుదిటిని వేరుచేస్తూ దట్టంగా మూడు విభూతి పట్టెలు... వాటి మధ్య పెద్ద కుంకుమబొట్టూ... మెడలో రుద్రాక్షమాలలు... బూడిద గుమ్మడికాయంత తలగుడ్డ... చెంపల నిండుకు చేరడేసి కన్నులు గాదు- గుబురు మీసాలు- గురప్పతాతను చూస్తే ఏదో గురుతరమైన భావం కలిగి మంత్రముగ్ధులై ఎదుట నిలబడిపోవలసిందే!

ముందు నాలుగు మూరల తుండుగుడ్డ పరుచుకొంటాడు. ఆ గుడ్డపైన ఓ యాభై కవర్లు వరుసగా పేరుస్తాడు. బ్రహ్మ మన అదృష్టాలను పుట్టించినపుడే నొసట రాస్తాడని మన నమ్మకం! కానీ గురప్పతాత జీవితానుభవాన్ని క్రోడీకరించి కరక్కాయ సిరాతో కార్డు ముక్కల మీద మానవుల జాతకాలు రాసి ఆ కవర్లలో ఉంచాడు. ఒక్కొక్క జాతకం విలువ పది నయాపైసలు! పక్కనే పంజరం ఉంటుంది. ఆ గుడ్డ మీదనే ఒకమూల, చెదపురుగులతో స్నేహం చేసి, శీతాతప బాధలను సహిస్తూ అట్ట మీద వెంకటేశ్వరుడు వాడిన పూల వెనుక సాక్షీభూతంగా నిలబడి ఉన్నాడు. ఆయన ముందు ఓ బుడిగ హుండి ఉంది.

"అదో బాబుగారొచ్చారు చూడు! మనసులోని మాట, మనసున్న చోటు! పలకవే చిలకా!" అంటూ గురప్ప పంజరం తలుపు తీస్తాడు. ఎగిరి గంతేసి బాబుగారి భుజం మీద వాలుతుంది చిలక. "శాస్త్రం చెప్పమంటే భుజం మీద సవారి చేస్తావేమే?... ఓహో! కానిక కావాల్నా?" అంటూ చాకచక్యంగా తన ఫీజు సంగతి హెచ్చరిస్తాడు గురప్ప తాత. 'కార్... కార్' మంటుంది చిలక. ఆ వచ్చిన పెద్దమనిషి చిత్తయిపోయి, కిమ్మనకుండా పల్లెవాటు ముడి విప్పుతాడు. ఏది ఇచ్చినా తీసుకోకుండా ఓ పది నయాపైసల కాసును ముక్కుతో తీసుకొని తన నిజాయితీ చాటుకొంటుంది చిలక. ఆ మీదట బుడిగ హుండీలో కాసును జారవిడిచి తుండు గుడ్డ మీద యాభై కవర్లలో ఏదో ఒకదానిని పట్టి బయటకు లాగి అంతటితో తన పని తీరిపోయినట్లుగా, మరలా పంజరం చేరుకొంటుంది. ఆ కవరును గురప్పతాత అందుకొంటాడు. ఏభైయో పడిలో పడిన అతని కండ్లు గాలి భయానికి లోపలికి తోసిపెట్టిన దీగూడులోని దివ్వెల్లా వెలిగిపోతూంటే వాటిని మరింత పెద్దవి చేసి ఆ జాతకాన్ని ఒకస్థాయిలో చదువుతాడు. అనుకొన్న పని అవడం, సంవత్సరం తరువాత భేషైన యోగం- లాంటి అద్భుత విషయాలతో కూడుకొని ఉంటాయి. ఆ జాతకాలు, జాతకుడు చాలా తెలివిగా ఈ విషయాలను స్వవిషయాలతో చాలా చక్కగా సమన్వయించుకోవడం, సంతోషంగా వెళ్ళిపోవడం యాంత్రికంగా జరుగుతూ ఉంటుంది. భావిజీవితాన్ని గురించి కలలు

గనే మనస్తత్వం గల వ్యక్తులకు మనలో కొదవలేదు. కాబట్టే గురప్పతాత లాంటి వ్యక్తులు గుట్టుగా కాలం నెట్టుకొస్తున్నారు.

అతనికి ఉత్తరంగా నాలుగ్గాళ్ళ మంటపం దగ్గర గడియారంలోని పెద్దముల్లు ఇరవై నాలుగుసార్లు తిరుగుతుంది. భూమి తన చుట్టూ తాను ఒక్కసారి తిరుగుతుంది. ఈ పరిభ్రమణలో రాత్రింబవళ్ళు ఏర్పడుతున్నాయంటారు శాస్త్రజ్ఞులు. లోకమంతా ఈ భ్రమణానికి లోనవుతూంటే, గురప్ప తాత కూడా లయ తప్పకుండా తాళం వేస్తున్నాడు. గోవిందరాజస్వామి తేరుమరుగులో పగలు, దేవస్థానం ఆఫీసు ఎదురుగా ఉన్న 'మహంత్ మఠం' అరుగు మీద రాత్రి గడిచి పోతున్నాయి. ఆరోజు- చీకటితెరలు లోకం మీద విరుచుకపడడానికి చిందులు తొక్కుతున్నాయి. గురప్పతాత అంగడి మూటగట్టాడు. పంజరం చంకనబెట్టి తుండుగుడ్డ విదిలించి భుజాన వేసుకొని, "లేరా! రాముడూ పోదాం," అన్నాడు. ఆ మాట చెవిని పడడంతో పెద్ద బాలశిక్ష ముందర వేసుకొని కునికిపాట్లు పడుతున్న రాముడు ఒక్క పరుగులో వచ్చి తాత చేయి పట్టుకొన్నాడు. తాత బయలుదేరాడు!...

కన్నులు ఎర్రకలువలు, చూపులు వాడితూపులు. మెలిదిగిన కండలు నునుపు దేరిన బండలు, కోరమీసాలు వాడి కోడి కత్తులు. ఉల్లిపొరను మరిపించే మల్లు జుబ్బా! వీటన్నిటినీ కొట్టొచ్చినట్లు కనిపించే రక్తసిక్తమైనట్లున్న లుంగీకట్టు... ఏమిటీ వేషం! ఎవ్వరీ తాత జీవిత రంగస్థలంపై ఎదురుగా నిలబడిన ప్రతి నాయకుడు?... ఎవ్వరో మేతకై గూడు విడిచిన గువ్వల కోసం ఉరులొడ్డిన బోయ!

గురప్పతాత మనసాకాశంలో మబ్బెక్కింది. కొన్ని క్షణాలకు పూర్వమే అతనిలో కలిగిన సంతోషం, సంతృప్తి ఆ మబ్బుల మాటున మాయమైపోయాయి. అతడు మెల్లగా పంచ కొన కొంగులో కట్టుకొన్న మూట ముడి విప్పాడు. ఫలితంగా ప్రతినాయకుడి చేతిలో పై మబ్బు చినుకుల్లా, పలపలా పది పది నయాపైసల కాసులు రాలాయి. అవి కాసులు కావు. ఆ ముసలి వాడి కన్నీటి రాసులు. ఒక్కసారి చేతిలోని డబ్బును, మరొక్కసారి తాత మొగాన్ని నిర్లక్ష్యంగా చూశాడు ప్రతినాయకుడు.

"ఊఁ! మిగతా!!" బాబు సొత్తును అడిగే దబాయింపు... ఇచ్చి పెట్టిన సొత్తును పుచ్చుకొనే ధీమా కనబడుతూ ఉంది అడగడంలో. అవి ములుకుల్లా ముసలివాడి గుండెను గుచ్చాయి. ఆ బాధలో అసలే ముడతలు పడిన అతని మొగం మరింత ముడుచుకొనిపోయింది. కొంగులో కట్టుకొన్న రూకల్ని, కొట్టొచ్చినట్లు మాట్లాడే వాడిని దీనంగా చూశాడు తాత! కష్టార్జితాన్ని వదులు కోలేని చూపులు, ఆలస్యాన్ని సహించలేని తీక్షణ వీక్షణాలు ఒక్కక్షణం పోరాడుకొన్నాయి. ఆ పోరాటంలో 'తేఁ!' అన్న సింహగర్జనలాంటి బాంబుపడింది. తాత అదిరిపడ్డాడు. మరలా ఓ అయిదు తెల్లని పది నయాపైసల కాసులు తాత కన్నీటి ముత్యాలతో పోటీపడ్తూ వాడి చేతిలో రాలాయి.

కుడి మీసాన్ని ఎడమచేతి మునివేళ్ళు మెలేస్తుంటే, అరచేతిలోని కాసులను తూకం వేసినట్లు అలా ఎగరేసి, ఒక్క ఓరగంటి చూపును నిర్లక్ష్యంగా విసిరిపారేసి, గొంతులో నుండి దూకిన నవ్వు వంతపాడగా వచ్చినవాడు వచ్చినట్లుగానే వెళ్ళిపోయాడు! ఏమిటో వాడి వైఖరి?... వానికంటే యముడే నయం. ప్రతి దినము ఇలా వేధించుక తినకుండా ఒక్కసారిగా ప్రాణాలు తీసుకొనిపోతాడు.

సగం డబ్బు పోయేసరికి సగం బలం కూడా గుంజుకొనిపోయినట్లయింది. 'ఏమిటీ అన్యాయం?... ఎందుకీ ఎడతెగని బంధం?' అని ఆలోచిస్తూ ఒక్కక్షణం నిలబడ్డాడు గురప్పతాత.

భూభ్రమణం ఆగలేదు. చీకటి విచ్చుకత్తులు విసరడం మానలేదు. అవి అటూ ఇటూ అన్న విచక్షణ లేకుండా ప్రసరించి తాత హృదయంలో గూడ చోటు చేసుకొన్నాయి. అతని గుండెల్లో ఆరాటం అలజడి. 'నువ్వుండవయ్యా! కాసేపు నిద్రపోవాలి. రేపుపొద్దున వింటాలే నీ గోల!' అని ఏడు కొండల మీది వెంకట రమణుడు తాత చంకన మూటలో చల్లగా నిద్రపోతున్నాడు. 'నోరులేని దానిని, నేనేం చేయగలను?' అని చిలక పలకకుండా కూర్చుంది. రాముడు మాత్రం, 'పోదాం! పద తాతా!' అని చేయిపట్టి లాగాడు. తాత ఆలోచనా స్రవంతికి అడ్డు తగిలింది.

ఆ 'మానవుడు' వెళ్ళినవైపు నుండి తన దృష్టిని పంజరంవైపు మరల్చాడు. పంజరంలో చిలక నిశ్చలంగా కూర్చొని ఉంది. అది నోరులేని గువ్వ!...

దాదాపు పన్నెండు సంవత్సరాల కిందట తిరుమలకొండ అడవిలో తానూ, తన భార్య పదమూడేండ్ల కూతురు ఒక చిగరచెట్టు కింద కూర్చొని అన్నం తింటున్నారు. ఆ చిగరచెట్టు దరిదాపుల్లోనే ఓ నేరేడు చెట్టు. ఆ చెట్టునిండా కలమాగి నీలాలుపారే నేరేడుపండ్లు. ఆ పండ్లు తింటూ ఉంది చిలక! ఎక్కడ పొంచి ఉండిందో ఓ డేగ రివ్వుమని దూరి చిలకను తన్నుకపోవ డానికి ప్రయత్నించింది. ఆ దెబ్బకు ఆ చెట్టుకొమ్మలోని రెండుమూడు పండ్లు, ఓ నాలుగైదు ఆకులు కింద రాలాయి. చిలక గడగడలాడుతూ తన సమీపంలో పడింది. దానిని తీసుకొని ఆప్యాయంగా నిమురుతూ ఒళ్ళంతా కళ్ళుజేసి చూశాడు. ఎక్కడో కాస్త గోరు గీసుకుపోయింది. ఆ గాయానికి గచ్చాకు పుచ్చాకు పూసి నయం చేశాడు. ఆ చిన్న సహాయాన్ని మరవలేని చిలక జీవితాన్నే అంకితం చేసింది. కట్టుకొన్న భార్య, కన్నకూతురు తన్ను ఏకాకిని చేసి వెళ్ళిపోయారు. తెచ్చుకొన్న అల్లుడు చిత్రహింస పెడుతున్నాడు. కానీ నోరులేని గువ్వ మాత్రం...

తాత చిన్నప్పుడేదో సర్కసు చూశాడు. అక్కడ పులి, మేక కలిసి తిరిగాయి. కలలో కనిపించితే ప్రాణాలు వదిలే ఏనుగు సింహంతో కలిసి ఆడుకొనింది. అవి కాసుకు పడని జంతువులైనా, కలిసి ఉండడానికి అలవాటుపడ్డాయేమో ఈ సర్కసువాళ్ళ భయంతో! అని ఆనాడు ఆలోచించి తన్ను తాను సమాధానపరచు కొన్నాడు. తన ఆలోచన తనకే ఎబ్బెట్టుగా తోచిందీనాడు!

'అన్ని తెలువులు గల మనుషుల కంటె, నోరులేని జంతువులు మేలేమో!' అన్నది గురప్పతాత జీవితానుభవాల తోరణం మధ్య కట్టిన ఓ సుందర మందార పుష్పంలాంటి చక్కని ఆలోచన!

"పద తాతా! పోదాం!"- మళ్ళీ రాముడు ముందుకు లాగాడు. విద్యుత్కాంతులు చీకటికి చిచ్చుపెట్టాయి. నాలుగు చక్రాల సైకిలురిక్షా మీది కృష్ణయ్య అంగడి కూడ ఇంటి ముఖం పట్టింది. తాత కాలు భారంగా పైకిలేచి అంతకంటె భారంగా ముందుకు పడింది. జీవితంలో విసిగి వేసారిన ఓ ముసలిరూపం ముందుకు కదిలితే ఆలోచనలు వెనక్కు!...

చిత్తూరు జిల్లాలోని ఓ మారుమూల పల్లె గురప్ప తాత జన్మస్థానం. దానిని పారకపల్లె అంటారు. ఆ పల్లె చుట్టూ పెట్టని కోటల్లా ఉన్న బోడి గుట్టల్లో పారకపుల్లలు విరివిగా దొరుకు తాయి కాబట్టి ఆ పేరు సార్థకమయిందేమో? పేరు చెప్పితేనే బండల గుండెలు పగిలి, భూమి గడగడలాడే వంశం తాతది. దిగుడు బావులు తవ్వడం, చెరువుకట్టలు వేయడం, మిట్టాగట్టా చదునుచేసి భూమిని సాగుయోగ్యంగా చేయడం- అతనికి వంశానుగతంగా వస్తున్న పనులు. ఆ పనులలో రైతుకు కుడి భుజంగా నిలబడి ఆ పల్లెలో హాయిగా బతుకుతున్న ఓ చిన్న కుటుంబం తాతది.

పదిహేను సంవత్సరాల కిందట తిరుపతిలో పెద్ద అలజడి రేగింది. పెద్దపెద్ద ఇంజనీర్లు తలబద్దలు కొట్టుకొన్నారు. 'ఇది కాని పనిలే!' అని సామాన్య జనం నోరు చప్పరించారు. ఇంతకూ

ఏమిటా అలజడి అంటే- 'తిరఁవల కొండకు రోడ్డేస్తారంట!' మానసికంగా భగవంతుని చేరుకోలేని మానవుడు దైవదర్శనార్థం శరీరాన్ని కష్టపెట్టి ఏడుకొండలు దాటడమెందుకని చేస్తున్న ప్రయత్నాన్ని తలకొక్క తీరుగా విమర్శించారు. అయినా, తాటాకుల చప్పుళ్ళకు కుందేళ్ళు బెదరలేదు. 'కూలీలు కావాలి,' అన్న పిలుపు దేశం నలుమూలలా ప్రాకింది. గురప్ప చెవినిగూడ పడింది. గురప్ప ఆలోచించాడు. 'నిదర మొగంతో లేచి పొద్దు గూట్లో పడేదాక రెక్కలు ముక్కలు చేసుకొంటే, పొట్టుగింజలైతే ఓ కుంచడు, గట్టి గింజలైతే ఓ అర్ధకుంచడు ఇస్తారు. దానికి గూడ రైతు ఇంటి ముందర చేతులు కట్టుకొని నిలబడాలి. రోడ్డు పనిచేస్తే దినానికి రూపాయి పావలా కూలి దొరుకు తుంది. హాయిగా బతకచ్చు,' అని అనుకొన్నాడు. భార్యతో ఆ మాటే అన్నాడు.

"ఎందుకే అంతదూరం పొయ్యేది. తూరుపుగా దిగబడిపోతే బతుకు తూర్పార పట్టినట్లయి పోతిందంట! ఇక బతికినన్నాళ్ళు బతకబొయ్యేదేముండాది? పుట్టి పెరిగిన ఊళ్ళో రాలిపోయే దాంతో సమానంలేదు లేయే!" అని ఆమె ఎదురు తిరిగింది.

గురప్ప భార్య మాటను పెడచెవిని పెట్టాడు. 'కూలి బతుక్కు ఏ ఊరయితే ఏముం డాదిలే?' అని పెండ్లాన్ని పదేండ్ల కూతుర్ని వెంటబెట్టుకొని తిరుమల కొండకు బయలు దేరాడు- ఆశల చిగుళ్ళు చేతులై చేయిపట్టి ముందుకు నడిపిస్తుంటే!

గురప్ప భార్యతోసహా సరాసరి పనిలో చేరిపోయాడు. అడవి ఈత ఆకుతో ఓ చిన్న గుడిసె వేసుకొన్నాడు. బొమ్మరింటి కాపురాన్ని ఆరంభించాడు. కొత్త ఒక వింతగదా! ఆ కొత్తలో కష్టాలు గూడ కొత్తకొత్త రూపాలనే మలుచుకొంటాయి. ఆ మలుపుల్ని ఏదోగా భావించి మనిషి సర్దుకోవడానికి ప్రయత్నిస్తాడు. అందుకేనేమో గురప్పకు బతుకు కాలప్రవాహంలో ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోతున్నట్లనిపించింది.

ఒకనాడు మధ్యాహ్నం గంట గణగణ మోగింది. కూలీలంతా పారలు, గడ్డ పలుగులు ఎక్కడి వక్కడ పారేసి భోజనానికి బయలుదేరారు. తాము సాధారణంగా కూర్చొనే చెట్లకింద కూర్చొని కడి తింటున్నారు. గురప్ప కూడా భార్యతో వచ్చి చిగరచెట్టు కింద కూర్చున్నాడు. కూతురు రంగవల్లి నెత్తి మీద బుట్టలో సంకటి తెస్తూ కంటపడింది. ఈలోపల గురప్ప పెళ్ళాంతో మాటల్లో పడ్డాడు.

"పిల్లదానికి ఒళ్ళు బలిసిపోతా ఉండాదే! నాలుగు రూకలు మిగిలించుకోని తొందర్లో ఎవుడి చేతిలోనైనా పెట్టేయాల్సిందే!"

"నువ్వూ నేనూ అనుకుంటే... దేవుడు కన్ను తెరవాల గదా?"

"నువ్వెన్నయినా చెప్పే!... ఆడదానికి అసలు దూరం ఆలోచించే బుద్ధే లేదు."

"ఆఁ, అలాగా!" అన్న చిరుకోపం కన్నుల్లో తరగలా బయటపడి గురప్పను ముంచెయ్యా లేదు, కానీ కనీసం తాకలేదు.

"లేకపోతే ఈ బతుకెంత బాగుండాదో సూడే. సందేళకు రెండున్నర రూపాయి సేతిలో గల్లుమని రాలతా ఉండాది. మన పల్లెలో మాదిరి గాడిద కష్టం గూడ లేదు. సద్దేళకు లోపల పనిలో వంగాల్సిన పనేలేదు. పొద్దు నడిమిట్ట కొచ్చిందంటే గెంట కొట్టేస్తారు. తిండి తిని అట్ట పడి లేసేదానికి సందు దొరకతా ఉండాది. పొద్దు గూట్లో మునగక మునుపే పని చాలించేస్తారు. ఏదో నాలుగు రూకలు కూడబెట్టుకొంటే నాకేఁవే!... నా రంగమ్మ తల్లికి పూలరంగణ్ణి తేనా!"

గురప్ప ప్రస్తుత జీవిత ప్రశంస, భవిష్యత్ జీవిత ఆశంస విని విని అతని భార్య ఏదో బదులు చెప్పబోతుంటే కూతురు రంగవల్లి తెచ్చి దించిన సంకటి తట్ట మాటల కడ్డు తగిలింది. ఆకలిగొన్న పేగులు కూతురు వడ్డిస్తే ఆవురావురుమంటూ తింటున్నాయి.

అంతలో, 'అమ్మా!' అన్న ఆర్తనాదాన్ని దబ్‌మన్న శబ్దం అనుసరించింది. ఆ శబ్దం గురప్పను కలవరపెట్టింది. నాలుగు దిక్కులు కలయజూశాడు. తిరుమల కొండకు పోయే కాలి బాట మీద ఒక యువకుడు పడిపోయాడు. చేతిలో అన్నం చేతిలో ఉండగానే గురప్ప పరుగెత్తాడు, చేతిలో సంకటి కూతురు చేతిలో పెట్టి. గురప్ప ఆ యువకుణ్ణి పసిపిల్లవాడిలా జరువుకొన్నాడు. చిగరచెట్టు కింద అవలీలగా మోసుకొని వచ్చాడు. పై గుడ్డ కిందపరిచి పడుకోబెట్టి ముంతలోని మంచి నీళ్ళు గుక్కెడు తాగిపించి, కాసిన్ని మొగం మీద చిలకరించాడు. ఆ ఉపశమనంతో ఓ సన్నని మూలుగూ, కదలిక లేని శరీరంలో కాస్త చలనమూ కలిగాయి. గురప్ప సంతోషంతో పొంగి పోయాడు.

అంతలో గంట కొట్టడం చెవిని పడింది. అది పనికి పిలుపు. తప్పదు గనుక అతన్ని కూతురు చేతుల కప్పగించి పనిలోకి వెళ్ళాడు భార్యతో కలిసి. అయితే ఆ అప్పగింత శాశ్వతంగా నిలిచిపోతుందని వాళ్ళకి మాత్రం ఏం తెలుసు?

అలా ఆ కుటుంబంతో కలిసిన వ్యక్తి పేరు రంగడు. స్వగ్రామం పొరకపల్లె పక్కన పోడుజేను. వాడీ ప్రపంచంలోకి ఎప్పుడు, ఏ విధంగా అడుగుపెట్టాడో వాడికే తెలియదు. చిన్నప్పటి నుండి సోమరిగానే పెరిగాడు. వయస్సుతోపాటు సోమరితనం కూడ సోగలు పెంచుకొనింది. అంతో ఇంతో వేళకు నాలుగు మెతుకులు విదిలిస్తూ ఉండిన లోకం, 'తాటిచెట్టంత ఉండావే!... ఏదో ఒక పనీపాట చేసుకొని బతకరాదా?' అని దెప్పిదెప్పి పొడిచింది. దాంతో నిరాహారదీక్ష సాగించి కష్టాలను దేవునితో మొరబెట్టుకొందామని తిరుమలకొండకు బయలుదేరాడు.

రంగడు గురప్ప ఆదరణలో కోలుకొన్నాడు. పెట్టింది తిని, చెప్పిన పని చేస్తూ, మంచి పేరు సంపాదించుకొన్నాడు. దాంతో రంగడు రంగవల్లి పేరు బలాలుకుదిరి ఒకనాడు ఏడుకొండల వాని సాన్నిధ్యంలో రంగవల్లి మెడలో ఆ మూడుముళ్ళు వేసి ఆ ఇంటికి అల్లుడై కూర్చున్నాడు.

ఇప్పుడు నాలుగు చేతులకు బదులు ఎనిమిది చేతులు కలిసి కష్టపడుతున్నాయి. రాతికి రాయి చేరినట్లు నాలుగు డబ్బులు కూడుతున్నాయి. సాధారణంగా మనిషి ఉత్తచేతులతో మూరెయ్యలేడు. ఏదో కాస్త మిగులుబాటు అయిందంటే దాని అభివృద్ధి కోసరం తీవ్రంగా ఆలోచిస్తాడు. అలాంటి ఆలోచనే పట్టుకొంది గురప్పను. తన అందాల రామచిలుకకు అద్దాల పంజరమే కాకుండా, తన ముద్దులకూతురికి ఓ అద్దాలమేడ కొనాలని కలలుగంటూ కూర్చున్నాడు. అతని కలలకు దోహదం చేస్తూ అప్పుడు ఒక సంఘటన జరిగింది.

ఆ ప్రాంతంలోనే అక్కగారి ఆలయమంటూ ఒక ఆలయం ఉండేది. ఆ ఆలయం రోడ్డుతో బాటు సుమారు నూరు అడుగులు కిందకి దిగవలసి వచ్చింది. ఆ ఆలయాన్నయితే అంతకంటే అందంగా కట్టించారు కానీ, ఆలయంలోని అక్కగారిని మాత్రం తరలించడం పెద్ద సమస్య అయి కూర్చుంది. విగ్రహాన్ని తాకి బయటికి తెస్తే నెత్తురు కక్కి చస్తారని ఓ వదంతి పుట్టింది. అందువల్ల 'బతికుంటే బలుసాకు తిని బతకచ్చు,' అని అందరూ తప్పుకొన్నారు కానీ గురప్ప మాత్రం గుండె ధైర్యం చేసి ఒప్పుకొన్నాడు. దేవుడి మీద భారం మోపి శిలావిగ్రహాన్ని పెకలించి తెచ్చి కొత్తగా కట్టిన గుడిలో పెట్టాడు. అందరూ ముక్కుమీద వేలేసుకొన్నారు. అధికారులు 'సెభాష్' అని వీపు తట్టి రెండు వేల రూపాయలు పారితోషికం ఇచ్చారు. అంతవరకు బాగానే జరిగింది కానీ, ఆ రాత్రి అతని భార్య కలవరించి, పలవరించి రెండు దోసిళ్ళ రక్తం కక్కింది. కూలీల పూరిగుడిసెలన్నీ గుప్‌మన్నాయి. ఆ సంఘటనకు తలకొక విధంగా రంగులు పులిమి కడకు దేవుని సొత్తు ఉక్కళంగా తీసుకొన్నాడు కాబట్టి ఈ దుష్ఫలితమని తేల్చేశారు. ఆ నిర్ణయాన్ని విని గురప్ప కంపించిపోయాడు. రాత్రికి రాత్రే బయలుదేరి తిరుమల చేరి దేవుని ముందు సాగిల

పడి, తప్పు క్షమించమని లెంపలేసుకొని రెండువేల రూపాయలు హుండీలో కుమ్మరించి భార్యను బ్రతికించమని వేడుకొన్నాడు.

గురప్ప భార్య చేయి జారిపోయింది...

భార్య పోవడంతో గురప్ప బాగా దిగులుపడిపోయాడు. గుడిసె దాటి అడుగు బయట పెట్టడు. ఒక్కదినం పనికిపోతే మరొక్కదినం పోడు. సాధారణంగా కూలి జీవుల ఆసరాతో మోసులు తొరిగే తాగుడు, జూదంలాంటి వ్యసనాలు రంగణ్ణి తమ పాలనలోకి తెచ్చుకొన్నాయి. ఒక్కొక్క దినం ఇంటికే రాడు. పాపం! రంగవల్లి మగని కోసం ఏడుస్తూ, ఎదురుచూస్తూ రాత్రుళ్ళు నిద్ర కాస్తుంటే ఆ ముసలివాని కడుపు తరుక్కుపోయేది. అతడు మాత్రం ఏం చేస్తాడు?... నాలుగు ఓదార్పు మాటలు కూడ కరువైపోయాయి, తన బ్రతుకులో! అప్పుడే రంగవల్లి ఒక మగబిడ్డను ప్రసవించింది. ప్రసవమైతే సుఖంగానే జరిగింది కాని, ఎక్కడి నుండి వచ్చిందో మాయదారి జ్వరం, ముంచుకొచ్చింది. పత్యంబెట్టే దిక్కులేక, మందూ మాకూ ఇప్పించే ఓర్పు లేక, గురప్ప ఆ కూతుర్ని కూడా ధారపోసుకొన్నాడు. ఇక మిగిలిందల్లా పురిట్లో కూన, పంజరంలో చిలక, ప్రాణాలు తోడుక తినడానికి అల్లుడు రంగడు.

ఇక్కింటి పక్కింటి అమ్మలక్కల సహాయంతో చాలని కొదవకు ఆవుపాలు పోసి నానా అవస్థలు పడ్డాడు, ఆ పసిగందుతో పదేండ్లుగ! వానిని ఒక మనిషిగా తయారుచేయాలని అతని ప్రయత్నం. ఆ విధంగా చేస్తానని కూతురికి మాట కూడా ఇచ్చాడు. శరీరంలో శక్తి నశించినా, కష్టపడే ఓపిక లేకపోయినా, ఏనాడో వీధిబడిలో చదువుకొన్న చదువుతో, చిలుక సహాయంతో తన మాట నిలబెట్టుకోవడానికి బతుకుబాటలో తన తంటాలు తాను పడుతున్నాడు. కానీ రంగడు చుట్టమై వచ్చి దెయ్యమై పట్టుకొన్నాడు. 'నా బిడ్డను నాకిచ్చెయ్!' అంటూ ప్రతిదినం దెబ్బలాటకు వస్తాడు. వాడి చేతిలో బిడ్డ ఏమైపోతాడో అన్న బాధ! అందుకే కష్టార్జితాన్ని అమాంబాపతుగా సగం ఆ తాగుబోతు వెధవ చేతుల్లో పోసి ఏ దినానికి ఆ దినం పీడ వదిలించుకొంటున్నాడు. అయితే మాత్రం.... ఎంతకాలమీ ముసుగులో గుద్దులాట!

నిర్మలంగా ఉన్న సంధ్యాకాశం ఎప్పుడు మబ్బెక్కిందో పలపల చినుకులు రాలుతున్నాయి. గురప్పతాత ఆలోచనలు ఆ చినుకుల్లో కరిగి, భవిష్యత్తుపై మళ్ళీ తడిసిపోతామన్న భయం ఆవరిస్తే గబగబ నడిచి మఠం తిన్నె చేరుకొన్నాడు. దేవస్థానం ఆఫీసు ఎదురుగా కూర్చుని అన్నం అమ్ముకొనే పూటకూళ్ళమ్మ వానకు జడిసి ఆవేళ మఠం తిన్నె మీదనే మకాం పెట్టింది. మామూలు మేరకు గురప్పతాత, రాముడు చెరికాస్త ఎంగిలిపడ్డారు. వాన జోరు హెచ్చింది. వాన కంటే గాలి ఉధృతంగా వీస్తూ ఉంది. తిన్నె మీద జల్లు కొడుతుంటే గురప్పతాత రాముణ్ణి పక్కలో పడుకో బెట్టుకొని బాగా దుప్పటి కప్పాడు.

దేవస్థానం ఆఫీసులో బిళ్ళ జవాను ఎంచి తొమ్మిది గంటలు కొట్టాడు. పూటకూళ్ళమ్మ గంపె నెత్తిన బోర్లించుకొని వెళ్ళిపోయింది. గురప్పలాంటి జీవులు కొంతమంది ఆ తిన్నెమీద గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. బతుకును తాత చేతిలో పెట్టిన రాముడు ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నాడు. 'బావాజీ' చేతిలోని చిలుంగొట్టం మిణుగురు పురుగులా వెలిగివెలిగి మలుగుతూ ఉంది. గోవిందరాజస్వామి దేవాలయ గోపురం విద్యుత్కాంతిలో ధవళ శిఖరంలా వెలుగుతూ ఆణిముత్యాల్లా పడే వానచినుకులతో అభిషేకం చేసుకొంటూ ఉంది. ఎక్కడో ఒక కుక్క భీకరంగా మొరిగింది. గురప్ప తాత బుర్ర ఆలోచనలతో మరుగుతూ ఎప్పుడో లోకాన్ని మరిచిపోయింది.

"పిల్లోడికి పదేళ్ళకు పైబడింది. నువ్వా పండు ముసిలివైనావు. ఎప్పుడు తొడిమ రాలి పోతుందో తెల్దు. ఆ మిందట వాడి గతేం కావాల? కిష్టయ్య దగ్గర 'పెదబాలశిచ్చ' సదివిస్తే సరి పోతిందా?"

ఓ కరుడుగట్టిన దీనాకృతి తట్టిలేపి, గుచ్చి గుచ్చి అడుగుతున్నట్లు కల. ఏదో సమాధానం చెప్పాలనుకొంటే గొంతు పెగల్లేదు. నీటి బయట చేపలాగా గుండె విలవిల్లాడుతూ ఉంది. అంతలోనే ఆ కరుడుగట్టిన దీనాకృతి కరిగిపోతున్నట్లనిపించింది. 'అమ్మా!' అని అరుస్తూ ఎగిరిపడి లేచాడు. వాన వెలిసిన తరువాత ప్రశాంత వాతావరణం, నిర్మలాకాశం మినహా మరేమీ లేదు. కల చెదిరిపోయింది. తూర్పున పట మెరిగింది. అస్తవ్యస్తంగా పడి నిద్రపోతున్న రాముడు ఇంకా నిద్ర లేవలేదు. వారంరోజుల కిందట తొడిగిన చొక్కా నిక్కరు తోళ్ళయ్యాయి. తల బుట్టి బుట్టిగా పెరిగి బాగా మాసి కాకిగూడులా తయారయింది. నిగ్గులుదేరే నిమ్మ పండు లాంటి రంగు నల్లని అల్లనేరేడు పండుతో పోటీపడుతూ ఉంది. మొగమంతా దోమలు కరిచి చిడుములు చిడుములుగా కందిపోయింది. గురప్పతాత గుండెల్లో బాధ కన్నీళ్ళుగా మారి మరలా ఎదమీదనే పడి ఇంకి పోతున్నాయి.

ఆ దినమంతా గురప్పకు మనసు మనసులో లేదు. ఎంత ఆలోచించినా జీవితమార్గం సుగమంగా కనిపించలేదు. పనికిరాని ఆలోచనలు. ముడిపడని కోరికలు!... మనస్సు ఊసరవెల్లిలా ముందుకు వెనక్కు ఊగిసలాడుతుందే గాని ముందుకు సాగలేదు. కాలం అతని కోసం ఆగలేదు. ఆవేళ బేరం కూడ అంతంత మాత్రంగానే ఉంది.

గంట అయిదయింది. మిడిసిపడుతూ ఉండిన సూర్యుడు మబ్బుల మాటున మినకరిస్తున్నాడు. వాతావరణం కాస్త చల్లబడింది. వర్షం వెలిసిన తరువాత ఈసుళ్ళు మాదిరి జనం గుంపులు గుంపులుగా వీధిని పడ్డారు. రకరకాల బోడిగుండ్లు కొండ దిగి, దిగువ తిరుపతిలో తిరిగి గోవిందరాజస్వామి తేరు దగ్గర రెప్పపాటు నిలిచి, మోర పైకెత్తి పారజూచి, 'బలే పెద్దదే!' అని పొగిడి చేతులు జోడించి ముందుకు పోతున్నారు. ఏదో పెట్టి మరచినట్లు కారులు, లారీలు రొద చేసుకొంటూ శరవేగంతో ముందుకు దూసుకుపోతున్నాయి. 'కాసింత నిదానంగా పోతే ఈళ్ళబ్బ గంటు పోతుందేమో!' అని చీదరించుకొంటూ జనం చీలిపోతున్నారు. తేరు దగ్గర పాల అంగడి వద్ద గొల్లగోవిందు పాలు పిదుకుతూ ఆవును అదిలించిన దెబ్బకు అందరూ హడలిపోయారు. జెర్రిపోతంత జడ కటిస్థలిపై నటిస్తుంటే, ఇంతింత కళ్ళతో, హారతి పళ్ళెంతో మంద గమనంతో అందగత్తెలు గోవిందరాజ స్వామిని సేవించడానికి వెళ్ళుతున్నారు. ఎదురుగా వస్తున్న పద్మావతీ కళాశాల బస్సును ఢీకొంటుందనిపించి, దైవవశాత్తు తప్పిపోయిందిలే అనుకొంటుంటే పోలీస్ వ్యాన్ చెవులు చిల్లులుపడేలా హారన్ మోగిస్తూ స్టేషన్‌వైపు దూసుకొనిపోయింది. చావుదప్పి కన్నులు లొట్టబోయినట్లయిన పద్మావతీ కళాశాల బస్సు గురప్పతాతను తొక్కుదామని పైకిబోయి, పోనీలే అని దయతలచి వదిలినట్టు ముందు కురికింది. రాముడు బిత్తరపడి 'కెవ్వు'మని అరిచాడు. చిన్నచిన్న గుంటల్లో వానకు నిలిచిన బురదనీరు ఎగిరి గురప్పతాతను పలకరించింది. అది జూచి బస్సులోని పడుచుదనం పరిహాసమాడింది!

శరవేగంతో వెళ్ళిన పోలీసువ్యాను వెంటబడిన ఒక గుంపు పోలీసుస్టేషను చుట్టూ గుమిగూడారు. అందరి ముఖాల్లో బాధ వ్యక్త మవుతూ ఉంది. ఎగ్గొట్టుకొచ్చే ఏడుపును నోట్లో గుడ్డ దురికి, ఊపిరి బిగబట్టి ఆపుకొంటూ ఆశ ముందుకు లాగుతూంటే నిరాశ వెనక్కు ఈడుస్తూంటే మధ్య ఉక్కిరిబిక్కిరవుతూ ఒక ఆలూ మొగుడూ స్టేషన్‌వైపు నడుస్తున్నారు.

"ఏంది కిష్టయ్యా ఇదంతా?"

ప్రక్కన్నే నాలుగు చక్రాల సైకిలురిక్షా మీద 'ఫ్యాన్సీషాప్' యజమాని కృష్ణయ్య అంగడి ముందు నిలబడి దినపత్రికలోని అక్షరక్షరాన్ని పట్టిచూసి వీధి రాజకీయాలు మాట్లాడడంలో మొనగాడు. రాముడితో పెద్ద బాలశిక్ష చదివిస్తూ ఉంటాడు- అంగడి వద్ద బేరం లేనప్పుడు.

అందువల్ల కృష్ణయ్య మీద గురప్పతాతకు కాస్త గురి! అందుకే బజారులో అనుకోని అలజడికి కారణం అడిగాడు.

“అదో ఆడబోతా ఉండారు చూడు, ఒక అలు మొగుడూ! వాళ్ల కొడుకు పన్నెండేండ్ల పిల్లకాయ. ఒక కసుగందు గొంతు పిసికి దాని మెడలో సొత్తులు దొంగిలించినాడంట. అందు కోసరం వాణ్ణేదో ఇస్కూలుకు పంపిస్తా ఉండారు. ఈ పొద్దే వాణ్ణి తీసుకొనిపోతా ఉండారు. కాబట్టి ఇరుగూ పొరుగూ చుట్టపక్కాలు చూడొచ్చినారు!”

కృష్ణయ్య మాటలు గురప్పకు వింతగా వినిపించినాయి.

“ఎంది కిష్టయ్యా! నీ మాటలు బలే అరుసోద్దెంగా ఉండాయే. నగలు దొంగిలిస్తే జైల్లో తోస్తారుగాని యాడైనా ఇస్కూలుకు పంపిస్తారా?”

“మైనరు దీరలేదు గదయ్యా? అందుచేత జైలుకు పంపించరు. జడ్జి ఆడ్రు పకారం ఇస్కూలుకే పంపిస్తారు.”

“అయితే ఆ ఇస్కూల్లో పిల్లోణ్ణి ఏంచేస్తారు కిష్టయ్యా?”

“ఏం చేస్తారు? చదువు సందె చెప్పిస్తారు. ‘ఇక మిందటయినా బాగా బతకరా పిల్లోడా!’ అని పంపించేస్తారు.”

“ఈ ఆడ్రు ఎవురేస్తారు కిష్టయ్యా?”

“చెప్తిగదయ్యా జడ్జని!”

“జడ్జి యాడుంటాడు కిష్టయ్యా!”

“కోర్టులో ఉంటాడు.”

“కోర్టు యాడుంది కిష్టయ్యా?”

“నీ చిలక నడుగయ్యా చెప్తుంది!... పోనీ నీకెందుకయ్యా ఈ సోదంతా?”

“తెలుసుకుంటే తప్పేముండాది చెప్పు కిష్టయ్యా!”

“అదేనయ్యా! ఆ సింగిరిగుంట కింద ఉండాయి చూడు!... బిల్డింగ్లు!”

“ఆఁ! ఆఁ!!”

“అదే కోర్టంటే!”

గురప్పతాత మానసాకాశంలో ముసురుకొంటున్న చీకట్లలో మెరుపులా ఒక ఆలోచన! అంతే! అంగడి మూటగట్టాడు. రాముడు తోడుగా గూటికి బయలుదేరాడు. ఆ రాత్రి మఠం తిన్నె మీద పడుకున్నాడేగాని అతనికి నిద్రపట్టలేదు. రాముడి భవిష్యత్తు, కృష్ణయ్య మాటలు చేపల్లా మెదడు సరసులో ఈదుతున్నాయి. ‘దొంగతనం... జడ్జి ఆడ్రు... ఇస్కూలు!’ వరసగా ఒకదాని వెంట ఒకటి చుట్టుతూ ప్రదక్షిణం చేస్తున్నాయి. అతని చూపులు ఒక్కసారి ఊరి మీద విరుచుకుపడ్డాయి.

అదే రైల్వేస్టేషన్. అక్కడే ప్రయాణంతో అలసిపోయి ఒళ్లు తెలియకుండా పడి నిద్రపోయే యాత్రికులు!... వారి మెడల్లో కన్నులు మిరుమిట్లు గొలుపుతూ ‘ధగధగ’ మెరిసే బంగారు నగలు! ఆ పక్కన్నే కనుచూపు మేరలో పోలీస్‌స్టేషన్!... గురప్పతాత ఆశగా అటువైపు చూశాడు. సంతృప్తిగా నిట్టూర్చి రాముణ్ణి లేపాడు.

నడిరేయి. సినిమా వదిలిన తరువాత హాలులా ఉంది ఊరు. రాముడికి నిద్రమత్తు వదల లేదు. తూలుతూ నడుస్తుంటే, చేయిపట్టి లాక్కొని గురప్పతాత స్టేషన్‌వైపు చరచరా నడిచాడు. మంచిని ఊహించిన మనస్సుకు ముందు వెనుకలు ఆలోచించవలసిన అవసరమే లేకపోయింది!...

*

మిట్ట మధ్యాహ్నం. ఎండ తీసి కాస్తూ ఉంది. సింగిరిగుంటలో మురికినీటి కంపు తెంపులు తెంపులుగా వస్తూ ఉంది. కోర్టు ఆవరణలో సుంకిరేసి చెట్లనీడలో జనం మందలు మందలుగా కూర్చొని ఉన్నారు. పొలాల దగ్గర కట్టిన దిష్టిబొమ్మల్లాగా ఒక్కొక్క గుంపు దగ్గర ఒక్కొక్క వకీలు శివతాండవ మాడుతున్నాడు. బోనులో చిట్టెలుకలా రాముడు కోర్టు బోనులో నిలబడి మినక రిస్తున్నాడు. ఎవరి కంటాపడకుండా గురప్పతాత ఒకమూల ఒదిగి కూర్చొని గుడ్లప్పగించి చూస్తు న్నాడు. రాముణ్ణి శతవిధాల ప్రశ్నించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బదులు రాబట్టలేక విసిగిపోయాడు.

"ఏసిన పుల్లట్టా దాటలేదు కన్నోరు!"

గురప్పతాత మనస్సులోని మాట అనుకోకుండా బైటపడింది. ఎవరైనా విన్నారేమోనని ఉలిక్కిపడ్డాడు. భయం భయంగా చుట్టుపక్కల చూసి ఎవ్వరూ లేకపోయేసరికి గుండె దిటవు చేసుకొన్నాడు.

"ఇక అడగవలసిందేమీ లేదంటూ,' పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన స్థానంలో కూర్చున్నాడు. అందరి దృష్టి న్యాయాధిపతి వైపు మళ్ళింది. కలంపుల్ల నొసటి కానించి కన్నులు మూసుకొని ఒక్కక్షణం ఆలోచించాడు జడ్జి!

"ముద్దాయి పసిపిల్లవాడు. ఈ దొంగతనం ఉద్దేశపూర్వకంగా చేయబడినట్లు మాకు తోచడంలేదు. ముద్దాయి తరపున బాధ్యత వహించువారెవ్వరూ లేనందున ముద్దాయి శ్రేయస్సు దృష్ట్యా 'బోస్టల్ స్కూలు'కు పంపిస్తున్నాం!"

తీర్పు చెప్పి జడ్జి లేచి వెళ్ళిపోయాడు. పొంచి ఉండిన పోలీసులు రాముణ్ణి లాక్కొని పోలీసువ్యానులో పడేశారు. గురప్పతాత కోరిక నెరవేరింది!... కానీ, తన మనవడు! తన చేతుల మీదుగా పెరిగి, తన గుండెల మీద నిద్రించిన బాలుడు! తన్ను శాశ్వతంగా వదిలిపోతున్నాడు. గురప్ప కండ్లు నిండుకొన్నాయి. తుంచి పారేయలేని బాంధవ్యం మనసును పట్టి లాగుతుంటే ఒక్క ఊపులో వచ్చి రాముని కంటబడ్డాడు తాత! రాముడు, 'తాతా!' అని అరుస్తూ పైకి లేచాడు. పోలీసువ్యాను ఒక్క కుదుపులో కదిలింది. ఆ కదలికకు తట్టుకోలేని రాముడు అడ్డంగా వలలా అల్లిన కమ్మీల మీద బోర్లాపడ్డాడు. తలకు మంచి దెబ్బ తగిలింది. తాత కడుపు రగిలింది. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. చేతులు చాపి 'బాబూ!' అంటూ ముందుకురకబోయాడు. పరిస్థితుల మాట అటుంచి, తన కాళ్ళే తన మాట వినలేదు. కాలికి రాయి తగిలి బోర్లాపడ్డాడు. తాత తేరుకొని మెల్లగా పైకి లేచేసరికి పోలీసువ్యాను లేపిన దుమ్ము అప్పుడప్పుడే అణిగిపోతూ ఉంది. చంకన పంజరం బారెడు కవతల పడింది. కదలలేక కదిలి పంజరం చేతికి తీసుకొన్నాడు.

పంజరం ఖాళీ!... విసరకపోయి పడడంతో పంజరం తలుపు తెరుచుకొనింది. చిలక హైస్కూలు ఆవరణలోని మానిమల్లె చెట్టెక్కి కూనిరాగాలు తీస్తూ ఉంది. ఒకసారి పంజరంవైపు, మరొకసారి చిలకవైపు దీనంగా చూశాడు తాత. 'ఋణం తీరిపోతే ఎవరికెవరు,' అన్న భావన బోసినోటి పెదాలపైన చిరునవ్వుగా వెలిగి మలిగింది. ఏమనుకొనిందో ఏమో చిలక! రెపరెప రెక్కలల్లార్చుకొంటూ వచ్చి తాత ముంజేతి మీద వాలింది. తాత ఉప్పొంగిపోయాడు. ఉప్పెనలా పొంగిన ఉత్సాహం ముద్దులైతే చిలకకు ఊపిరాడలేదు.

నోరులేని గువ్వయినా తన కర్తవ్యం తనకు తెలుసు అన్నట్లుగా గువ్వ గూడు చేరింది.

*ఆంధ్రపత్రిక, 12 మార్చి 1962*

## నేపథ్యం

కష్టజీవుల కథ

# గూడు కోసం గువ్వలు

***ఒక అసాధారణమైన సంఘటన ఆలోచనకు ప్రేరణ. ఆ ప్రేరణే ఒక రచయిత మనస్సులో బీజరూపం. తన మనస్సులో బీజరూపంలో పడిన ఆలోచనకు ఒక ఆకారం ఇవ్వడానికి రచయిత నిరంతరం మథనపడ్తూనే ఉంటాడు. ఆ మథనంలో నుండి ఒక అందమైన కళాస్వరూపాన్ని మలుచుకొన్నదే కథ.***

కథలు ఆకాశం నుండి అమాంతంగా ఊడిపడవు!

రచయితలు దేవలోకంనుండి సరాసరి దిగి వచ్చినవాళ్ళు కాదు!!

మనుషులలోనే రచయితలున్నారు. ఆ మనుషుల జీవితాలలోనే కథలూ ముడిపడి ఉన్నాయి. ప్రతి జీవితం ఒక నవల అయితే ఆ జీవితం ఎదుర్కొనే ఒక్కొక్క సంఘటన ఒక్కొక్క కథ!

మనిషి జీవితం ఎప్పుడూ ఒక సరళరేఖలా సవ్యంగా ముందుకు సాగిపోదు. అలా సాగితే అది జీవితం అనిపించుకోదు. అయితే ప్రతి మనిషి జీవితం సవ్యంగా ముందుకు సాగిపోవాలనే ప్రయత్నిస్తూ ఉంటాడు. అయినా ఎన్నో అడ్డంకులు. ఆ గమనంలో ఎన్నో వంకలూ వాగులూ... కొండలూ కోనలూ... లోయలూ అగాథాలూ... నదీనదాలూ అడ్డుపడుతూనే ఉంటాయి. వాటిని అధిగమించి ముందుకు పోవాలని మనిషి విశ్వప్రయత్నం చేస్తూనే ఉంటాడు. ఓర్పు, నేర్పులతో అధిగమిస్తే గమ్యం చేరుకొంటాడు. లేకుంటే అక్కడే కుప్పకూలిపోతాడు.

ఈ ప్రయత్నమే ఒక సంఘటన. ఈ సంఘటనే కథకు ఆలంబన!

ఏ సంఘటన అయినా సామాన్యుడి కంటికి కేవలం ఒక సంఘటనగానే కనిపిస్తుంది. ముఖ్యంగా కర్మ సిద్ధాంతం బాగా ఒంటబట్టించుకొన్న ఈ కర్మభూమిలో. అందువల్ల వాడు దానిని గురించి అంతగా పట్టించుకోడు.

అయితే ఆ సామాన్యుడి సంఘటనతోనే స్ఫూర్తి పొంది స్పందించగలిగినవాడే రచయిత!

ఒక్కొక్క మనిషి జీవితం ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఆ జీవితంలో ఎదురయ్యే సంఘటనలు కూడా రకరకాలుగా ఉంటాయి. కొన్ని ఆనందాన్ని కలిగిస్తే మరికొన్ని కలత పెట్టి మనసును పిండుతాయి. ఎదుటి వ్యక్తి సుఖము, సంతోషము మనస్సును సంతోషింపజేస్తాయి కానీ ఆలోచింప చేయవు. కానీ కష్టాలు, కన్నీళ్ళు, బాధలు, వ్యధలతో కూడుకొన్న సంఘటనలే అద్భుత సాహిత్యాన్ని సృష్టించాయి, సృష్టిస్తున్నాయి.

ఒక అసాధారణమైన సంఘటన ఆలోచనకు ప్రేరణ. ఆ ప్రేరణే ఒక రచయిత మనస్సులో బీజరూపం. తన మనస్సులో బీజరూపంలో పడిన ఆలోచనకు ఒక ఆకారం ఇవ్వడానికి రచయిత నిరంతరం మథనపడ్తూనే ఉంటాడు. ఆ మథనంలో నుండి ఒక అందమైన కళాస్వరూపాన్ని మలుచుకొన్నదే కథ. అపురూపమైన కళాస్వరూపంగా మలచడం రచయిత ఆలోచనా విధానం దృక్పథాలపై ఆధారపడి ఉంటుంది.

రచయిత ఆలోచనా విధానం దృక్పథం అతని చిత్తశుద్ధి సంస్కారాలపై ఆధారపడి ఉంటుంది. సంస్కారవంతుడైన రచయిత మలిచే కథాస్వరూపంలో సార్వజనీనత ఉంటుంది. సార్వజనీనమైన కథలో సామాజిక ప్రయోజనం ఉంటుంది.

ఆ కథా నేపథ్యం చెప్పడమంటే-

పురిటినొప్పుల అనుభూతిని నెమరు వేసుకోవడమే!

సంతానవతి అయిన ప్రతి స్త్రీకి పురిటి నొప్పుల అనుభవం ఉంటుంది. అయితే మొదటి కాన్పు అనుభవం ఒక అనుభూతిగా మిగిలిపోతుంది. ఒక రచయితకు కూడా ఇంతేనేమో? అని నా అభిప్రాయం. ఈ విషయంలో ఏకీభావం కుదరకపోవచ్చు. అయితే నా అభిప్రాయం నా అనుభవం నుండి పుట్టింది కదా? అందుకే నా మొదటి కథ *గూడు కోసం గువ్వలు* కథానేపథ్యం రాయడానికి ఎన్నుకొన్నాను.

అప్పుడు నేను వేపగుంట రైల్వేస్టేషన్‌లో అసిస్టెంట్ స్టేషన్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాను. అటువంటి చిన్నచిన్న స్టేషన్లలో టిక్కెట్లు అమ్మడం కూడా చిన్న మాస్టర్ చేయాల్సిన పనే. మదరాసు నుంచి రేణిగుంటకు వెళ్ళే పాసింజర్ బండికి టిక్కెట్లు ఇస్తున్నాను. ఆ బుక్కింగ్ ఆఫీసు ముందున్న చిన్న వెయిటింగ్ హాలులో కూర్చున్న వ్యక్తి నా దృష్టిని ఆకర్షించాడు. బాగా వయసు మళ్ళింది. ఎముకల గూడుకు చర్మాన్ని తొడిగినట్లుంది. ఒడిలో ఆరేడేండ్లు పైబడిన పిల్లవాడు. వాడి తలను గోముగా నిమురుతూ, 'తెల్సి తెల్సి బిడ్డను ఒక తాగుబోతు చేతుల్లో పెడ్తి. ఆ యదవకు ఆయమ్మి మొకాన అంత కూడేసే సెగితి లేకపాయ్‌నా కొట్టికొట్టి చంపతా ఉంటే కడుపు పట్టిన బిడ్డ ఇల్లు పట్టకుండా పోతిందా? అని ఇంటికి తెచ్చుకుంటి. తీర్తమాడ్తానే దానికి తీరిపాయ. ఈడునా యదాన పడె. కనుక్కున్న నా కొడుకేమో పట్టించుకోకుండా ఉండాడు. ఏం చేసేది? ఏదైనా ఒక దొంగతనం చేసి ఈడి నెత్తిన పెట్టేస్తే అదేం ఇస్కూలుండాదంట. దానికి పంపించి చదివిస్తారంట. ఆ పనైనా చేస్తే బాగుండు,'' అని అంటున్నాడు.

నా శరీరం గగుర్పొడిచింది. ఆ గగుర్పాటులో నాలోని కథా రచయిత మేల్కొన్నాడు.

అవును కదా పాపం! వయసు ఉడిగింది. ఏదో ఒక పనిచేసి మనవణ్ణి సాకి సంతరించే శక్తి లేదు. అలాగని వాడిని గాలికి వదిలేయలేడు. ఆ పిల్లవాడు చేయని దొంగతనాన్ని వాడికి అంటగట్టడం బుద్ధిపూర్వకమైన చర్యకాదు. వాడి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తాను చేయ గలిగిన పని అదొక్కటే అని అతడికి తోచింది. అది అతడి తప్పు కాదు. అంటే- మనిషి చెడ్డ చేయడానికే కాదు ఒక మంచి చేయడానికి కూడా ఎంతటి ఘాతుకానికైనా తెగించగలడన్న మాట!

ఆ తర్వాత నా ఆలోచనల్లో కూరుకొని ఆ కుర్రవాడు నన్ను నీడలా వెన్నాడుతూనే ఉన్నాడు. బహుశా అర్థాంతరంగా ఆగిపోయి నా జీవితానికి ఒక శాపంగా పరిణమించిన చదువు

నన్ను తపింపచేస్తూ ఉందేమో? ఆ లోపం ఆ కుర్రవాడికి జరగకూడదన్న తపన. అందుకే, ఆ సంఘటన్నే ఆత్మగా తీసుకొని కథ రాయడానికి సంకల్పించుకొన్నాను.

అప్పటికి నేను చదివిన అయిదారు కథల్లో ఒక కథ రాయడానికి ఎత్తుగడ ముగింపు ముఖ్యమని మాత్రం గ్రహించగలిగాను. అందుకే ఈ కథను ఎలా ప్రారంభించాలి? అన్న మథన.

తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయం ఉంది. ఆ ఆలయానికి ముందు ఆయన ఏడాదికొకసారి ఎక్కి కూర్చొని తిరువీధులు ఊరేగే తేరు ఉంది. ఆ తేరునీడలో కూర్చుని ఒక ముసలాయన చిలకశాస్త్రం చెప్పుకొంటూ ఉంటాడు. ఆ దారి మీద వస్తూ పోతూ నేను అతన్ని ఎన్నోసార్లు చూశాను. కానీ ఈ సంఘటన మనసులో పడిన తర్వాత అతన్ని ప్రత్యేకించి గమనిస్తూ వచ్చాను. అతడు అచ్చం మా ఊళ్ళో గురప్ప తాతలా ఉంటాడు.

దిగుడు బావులు తవ్వడం... చెరువు కట్టలు వేయడం... మిట్టాగట్టు చదును చేసి భూమిని సాగుయోగ్యంగా చేయడంలో రైతుకు కుడిభుజంగా నిలబడి ఆ పల్లెలో హాయిగా బతుకుతున్న ఒక చిన్న కుటుంబం తాతది. అతన్ని కథానాయకుడుగా చేసి తిరుపతికి రప్పించే ప్రయత్నం చేశాను. దానికొక కారణం కావాలి కదా? అప్పుడు తిరుమల కొండకు బాట వేస్తున్నారు. కూలీల అవసరం ఎంతైనా ఉంది. ఆ వార్త నలుమూలలా ప్రాకింది. గురప్ప చెవిని కూడా పడింది.

'నిద్దర మొకంతో లేచి పొద్దు గూట్లో పడేదాకా రెక్కలు ఇర్సుకుంటే పొట్టుగింజ లైతే ఒక కుంచడు... అదే గెట్టి గింజలైతే అర్ధకుంచడు ఇస్తారు. దానిగ్గూడా రైతు ఇంటి ముందర చేతులు కట్టుకోని నిలబడుకోవాల. అదే కొండరోడ్డు పనికి పోతే దినానికి రూపాయి పావలా కూలి టంచనుగా చేతిలో పడ్తింది. హాయిగా బతకొచ్చు,' అన్న ఆలోచన గురప్పలో రేకెత్తించడం కూడా కల్పనే. అయితే ఆ కల్పన కూడా వాస్తవమే. దూరపుకొండలు నునుపు అన్న భ్రమలో పడి ఎందరో పల్లెజీవులు పట్టణాల వైపు ఇప్పటికీ వలసపోతూనే ఉన్నారు కదా?

భార్య కూతురుతో కలిసి తిరుమల కొండ మీద రోడ్డు పనిచేయడంలో కుదురుకుంటాడు గురప్ప.

ఈ కథలో ఇక కావలసిన పాత్ర అల్లుడు. కథలో కల్పన అవసరం. అయితే ఆ కల్పన కూడా యదార్థ జీవితమంత బలంగా ఉండాలి. ఆ ప్రయత్నం చేశాను. ఒక దినం మధ్యాహ్నం తిరుమలకు కాలిబాట మీద నడిచిపోతూ ఒక యువకుడు సొమ్మసిల్లి పడిపోతాడు. చిగర చెట్టు కింద కూర్చొని కడి తింటున్న గురప్ప కంట పడుతుంది. వాణ్ణి చేరదీస్తాడు. వాడొక అనాథగా మిగిలినప్పుడే గురప్ప చెప్పుచేతల్లో ఉండగలడు. ఆ పని చేశాను. వాడు పెట్టింది తిని చెప్పిన పని చేస్తూ ఇంటికి అల్లుడై కూర్చుంటాడు.

వేపగుంట రైల్వేస్టేషన్లో ముసలాయన మళ్ళీ మనసులో జొరబడతాడు.

'ఇందాక బాగానే వుండాది. అల్లుణ్ణి తాగుబోతును చేస్తేనే కదా కత నడ్చేదానికి?'' అని హెచ్చరించాడు. సరే అన్నాను.

ఈలోగా కూతురు గర్భవతి అయింది. నెలలు నిండాయి. మగబిడ్డను కనింది. ఏదో మాయదారి జ్వరం ముంచుకొచ్చింది. ఆ అడవిలో సరైన పత్యం పెట్టే దిక్కు లేక మందో మాకో ఇప్పించే వసతి లేక కూతురు చనిపోతుంది.

గురప్ప తాత ఒక్క మనవడితో ఏకాకిగా మిగలాలంటే భార్య కూడా పోవాలి. ఈ తెగ మనుషుల్లో మూఢనమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. ఒక మూఢనమ్మకం ముసుగులో ఆమె ప్రాణాలు వదిలే పని చేశారు. అందరినీ ధార పోసుకొన్న గురప్ప తాత మనవడితో బతకాలి. అయితే ఏది మార్గం?

అప్పుడు గోవిందరాజస్వామి తేరు నీడలో చిలకశాస్త్రం చెప్పుకొని బతికే ముసలాయన మనసులో మెదిలాడు. అంటే గురప్ప తాతను 'చిలక శాస్త్రజ్ఞుణ్ణి'గా చేయాలి. అప్పుడు ఒక చిలక

తోడు కావాల కదా? ఒక సహజమైన సంఘటనతో గురప్పకు ఒక చిలక తోడు దొరికే అవకాశం కల్పించాను.

కథ చిలక శాస్త్రంతో ప్రారంభమవుతుంది.

తేరు నీడలో ప్రక్కన బీడులో గూడు లేని గువ్వలు తోడులేని అవ్వలు చేరుతుంటారు. తాడు లేని బంగరాలు గోలీలు ఆడుతుంటారు. ఆ ప్రక్కనే చిన్నచిన్న అంగళ్ళూ ఉంటాయి. అక్కడే గురప్ప తాత అంగడి కూడా!

ప్రతిరోజూ తాత అంగడి మూసే సమయానికి అల్లుడు ప్రత్యక్షమవుతాడు. తన కష్టార్జితాన్ని సగానికి సగం దౌర్జన్యంగా గుంజుకొని పోతుంటాడు. వాడి ప్రవర్తన ములుకై గుండెల్ని కెలికితే గురప్ప గతంలోకి వెళ్ళిపోతాడు. కథ వెనక్కి వెళ్ళి మళ్ళీ ముందుకు నడుస్తుంది.

ఇప్పుడు పిల్లవాణ్ణి బోస్టల్ స్కూలుకు పంపే సంఘటన జరగాల.

అదే కదా కథకు ప్రాణం!

ఒకరోజు ఆ బాట మీద దూసుకుపోతున్న పోలీస్‌వ్యాన్ దొంగతనం చేసిన ఒక మైనర్ తీరని పిల్లవాణ్ణి తీసుకొనిపోతున్నట్లు గురప్ప ప్రక్క అంగడి క్రిష్ణయ్య ద్వారా వింటాడు. తాత ఆ రాత్రి అంత పనికి తెగిస్తాడు.

పిల్లవాణ్ణి పోలీసులు కోర్టులో హాజరు పరుస్తారు.

"ముద్దాయి పసి పిల్లవాడు. ఈ దొంగతనం ఉద్దేశపూర్వకంగా చేసినట్లు మాకు తోచడం లేదు. ముద్దాయి తరఫున బాధ్యత వహించు వారెవ్వరూ లేనందున ముద్దాయి శ్రేయస్సు దృష్ట్యా బోస్టల్ స్కూల్‌కు పంపుతున్నాము," అని కోర్టు తీర్పు.

తాత కోరిక నెరవేరింది. అయితే తన చేతుల మీద పెరిగిన బాలుడు తన్ను శాశ్వతంగా వదిలిపోతున్నాడు. ఆ ఎడబాటు భరించలేక తాత పోలీస్‌వ్యాన్ వెంట పడతాడు. కాలు తగిలి బోర్లబొక్కల పడతాడు. చంకలో పంజరం బారడవతల పడుతుంది. తలుపు తెరుచుకొనింది. చిలక ఎగిరిపోయి బాట ప్రక్కన మాని మల్లెచెట్టు మీద కూర్చొని కూనిరాగాలు తీస్తూ ఉంది. తాత మెల్లగా పైకి లేచాడు. పంజరాన్ని చేతికి తీసుకొన్నాడు. ఒకసారి ఖాళీ పంజరం వైపు ఒకసారి చిలక వైపు, దీనంగా చూశాడు. చిలక రివ్వున వచ్చి ముంజేతి మీద వాలింది. ఎంతైనా అది నోరులేని గువ్వ కదా? తాత బోసినోటి ముద్దులను మోసుకొని గూటిలోనికి వెళ్ళడంతో కథ ముగుస్తుంది.

ఈ కథ యునెస్కోవాళ్ళు ప్రచురించిన చదువు కథల్లో చోటు చేసుకొనింది. *పంజరద పక్షి* అన్న పేరుతో కన్నడంలోకి అనువదింపబడింది.


రచయిత కంటి ముందు కనిపించే భౌతిక ప్రపంచం నుండి అనుభవ ప్రపంచాన్ని ఆకళింపు చేసుకొని తనలో ఇముడ్చుకోవాలి. ఆ అనుభవ ప్రపంచంలో అరుదైన సంఘటనలకు తగిన పాత్రలను, ఆహార్యాన్ని, పరిసరాలను, సంభాషణలను భౌతిక ప్రపంచం నుంచి గ్రహించాలి. కథ అల్లాలి. దీన్ని సాధించిన రచయితకు సృజనాత్మకత నల్లేరు మీద నడకే అని నా అనుభవం నాకు నేర్పిన పాఠం!

*8 ఫిబ్రవరి 1998*

12

# ఏస్ రన్నర్

## పెద్దిభొట్ల సుబ్బరామయ్య



*పెద్దిభొట్ల సుబ్బరామయ్య 15 డిసెంబర్ 1938న గుంటూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'చక్రనేమి' 1959లో ఆంధ్రపత్రికలో అచ్చయింది. దాదాపు 150 కథలు, కొన్ని నవలలు రచించారు. 11 కథాసంపుటాలు వెలువడ్డాయి. 'పెద్దిభొట్ల సుబ్బరామయ్య' కథాసంపుటానికి 2012లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించింది. 2012లోనే 'అజో-విభొ' ప్రతిభా పురస్కారం లభించింది. తెలుగు అధ్యాపకులుగా 1996లో పదవీ విరమణ చేశారు.*

**చిరునామా**
14-11-18, అచ్యుతరామయ్య వీధి,
హనుమాన్‌పేట, విజయవాడ-520 003
Ph.: 98495 509124

ఎవరో కుర్రవాడు రన్నింగ్ రేస్ చేస్తున్నవాడిలా పేవ్‌మెంటు మీద బాణంలాగా 'రివ్వు'న పరుగెత్తి పోతున్నాడు వేగంగా.

రామచంద్రమూర్తి ఒక్క క్షణం ఆగి వెనుదిరిగి చూస్తూ నిలబడ్డాడు. అంతలోనే ఆ కుర్రవాడు కనుచూపు మేర దాటిపోయాడు.

రామచంద్రమూర్తికి నవ్వు వచ్చింది.

వేగంగా పరుగెత్తుతున్న వారెవరిని చూచినా అతడు అలాగే నిలబడిపోతాడు. బొమ్మలా చేష్టలు దక్కి నిలబడిపోయి తర్వాత నవ్వుకుంటాడు.

అతడు మళ్ళీ నడవడం ప్రారంభించాడు.

రోడ్ల పక్కన పేవ్‌మెంట్ మీద స్తంభాలకు రకరకాల సినిమా పోస్టర్లు అతికించబడి వున్నాయి. అన్నీ అందమైన అమ్మాయిల బొమ్మలు. హీరో, హీరోయిన్లు గాఢంగా కౌగలించుకొని వున్న దృశ్యాలు. ఒకళ్ళ మీద ఒకరు పడి దొర్లుతున్న దృశ్యాలు.

అతడు మరొక ఫర్లాంగు దూరం నడిస్తేకాని బస్సు స్టాపు చేరుకోలేడు. ఎంత పెందలాడి యింట్లో నుంచి బయలుదేరితేనో తప్ప బస్సు అంది ఆఫీసుకు చేరుకోవడం కష్టం...అప్పటికీ సీతమ్మ ఎంతో పెందలకడనే... బాగా చీకటి ఉండగానే నిద్రలేచి పనులు ప్రారంభిస్తుంది. అవి సర్దుకొని యివి సర్దుకుని వంటకు ఉపక్ర

మించి ఎంత ఉరుకులు పరుగులు పెడుతూ చెమటలు కక్కుతూ పని చేసినా తొమ్మిదిగంటల లోపున వంట తయారు కాదు. నాలుగు మెతుకులు నోట వేసుకుని తాను తయారయ్యేసరికి తొమ్మిదిన్నర అవుతుంది. ఎంత వేగంగా నడిచినా బస్ స్టాప్‌కు చేరుకునేసరికి మరొక పావుగంట... ఆ తర్వాత బస్సు కోసం పడిగాపులు వుండాలి. ఎంతకూ తనెక్కవలసిన బస్సు రాదు. వచ్చిన బస్సులు ఆగకుండానే రివ్వున దూసుకు పోతుంటాయి. ఆ వేళప్పుడు అన్ని బస్సులు నల్లుల్లాగా, బల్లుల్లాగా, కిటకిటలాడుతున్న ప్రయాణీకులతో కిక్కిరిసి వుంటాయి. పోనీ ఓపిక చేసుకుని నడిచి పోదామా అంటే ఆఫీసు దగ్గరా దాపూ కాదు. అయిదు కిలోమీటర్ల దూరంలో ఊరికి అవతలివైపున ఉందది.

'పోనీ ఆఫీసుకు దగ్గరలో ఏదైనా చూసుకోరాదూ?' అన్నారు చాలామంది.

కాని అక్కడి అద్దెలు తాను భరించలేడు. అక్కడ అద్దెలు చుక్కలంటుతూ వుంటాయి. తన కొచ్చే జీతంలో యిక్కడికే ఎటూ చాలక బాధపడుతున్నాడు. ఆఫీసులో కొందరు జల్సా రాయళ్లు ఉన్నారు. ఖరీదైన బట్టలు ధరించి, ఖరీదైన సిగరెట్లు కాలుస్తూ, అందాల రాముళ్ళలాగా ఘుమఘుమలాడిపోతుంటారు. కొత్త కరెన్సీ నోటుల్లా పెళపెళ లాడుతుంటారు. కాని వారి దారి వేరు. వారి సీట్లు అటువంటివి. కల్పవృక్షాలు...కామధేనువులూ...

తన సీటు అటువంటిది కాదు. చాకిరీకి మాత్రం ఏమీ తక్కువ ఉండదు. టన్నుల కొద్దీ పేరుకుపోతుంటాయి. ఎంత చేసినా తరగని పని - ఫలితం మాత్రం నెల తిరిగేసరికి వచ్చే ఆ జీతపు రాళ్లే. అందులో బోలెడన్ని కట్లూ, కత్తిరింపులు చేతిలో పడే మొత్తం ఆనందం కలిగించదు సరికదా ఆందోళన కలిగిస్తుంది.

అతడు కోటు వేసుకుంటాడు. పాతకాలపు పాత కోటు. 'మీకేమండి కోటు తొడుక్కుంటారు దర్జాగా' అంటారు కొందరు.

వారికి తెలియదు. తన కోటు, లోపలి చొక్కాలోని ఎన్ని చిరుగులను బయటికి కనబడ కుండా కప్పుతున్నదో!

ఎండ చిటచిట లాడుతున్నది. పెళపెళ లాడుతున్నది. సూర్యుడు చిర్రుబుర్రు లాడు తున్నాడు. ఎండలో చురుకు అంతకంతకూ పెరుగుతున్నది.

రామచంద్రమూర్తి నుదుట పట్టిన చెమటను అరచేత్తో తుడుచుకుంటూ వీధి చివరకు కళ్లు చిలికించి చూశాడు. ఏదో బస్సు వస్తున్నది. దాని మీదవున్న నంబరు సరిగా కనిపించడంలేదు. అన్నట్లు ఈ మధ్య చూపు కొంచెం మందగించి నట్టున్నది. చత్వారం వస్తున్నదేమో!

చత్వారం వొచ్చే వయస్సే మరి. ఎస్సెల్సీ రిజిష్టరులో వున్న తన పుట్టిన తేది నిజమే అయితే, తన కిప్పుడు నలభై ఎనిమిది వెళ్లి రెండు నెలలయింది. ఇంకా ఏడేళ్లు సర్వీసున్నది.

బస్సు దగ్గరికి వచ్చాకకానీ నంబరు సరిగా కనిపించలేదు. అది తన బస్సు కాదు. పైగా బస్టాపు దగ్గరికి వచ్చాక స్పీడు పెంచి మరీ వేగంగా పోనిచ్చాడు డ్రైవర్. ఆ బస్సు ఎక్కవలసిన వారు కొంత దూరం దాని వెంట పరుగెత్తి ఇక ఆగదనీ నిర్ధారణ చేసుకుని ఉసూరుమంటూ తిరిగి వచ్చి మామూలుగా నిలబడ్డారు.

రామచంద్రమూర్తి ఆలోచిస్తూ నిలబడ్డాడు. తాను ఆఫీసుకు నడిచిపోతే ఎంతసేపటిలో పోగలడు? అని ఆలోచించాడు. బాగా వేగంగా నడవగలిగితే గంట, లేకపోతే యాభయి నిము షాలు పట్టవచ్చు. పరుగెత్తి పోతే? ఇప్పుడు తాను పరుగెత్తగలడా? ఒకప్పుడు పరుగెత్తాడు. రివ్వున గాలిలాగా, బాగా లాగి వొదలిన బాణం లాగా పరుగెత్తాడు. చుట్టూ చేరినవారు కరతాళ ధ్వనులు చేసి అభినందించారు. తమ జిల్లా పేరు నిలబెట్టాడని విపరీతంగా మెచ్చుకున్నారు. ఫోటోలు తీశారు. దండలు వేశారు.

తానప్పుడు రోజూ పరుగెత్తేవాడు. చీకటి ఉండగానే లేచి పరుగు ప్రారంభించేవాడు. ఎక్కడా ఆగకుండా వేగంగా పరుగెత్తేవాడు. మైళ్ళకొద్దీ దూరం అతని సన్నని కాళ్ళ క్రింద తరిగిపోయేది. ఆ కాళ్ళు ఇనుపకడ్డీలలా పొడవుగా ఉండేవి. ఆ కండరాలకు అలుపు తెలిసేది కాదు. ఇప్పుడు ఇంతకాలం తరువాత పరుగెత్తగలడా? జీవితంలో ఇంత అలసిపోయి ఇప్పుడు కేవలం పది బారల దూరం కూడా పరుగెత్తడం అనుమానమే.

పక్కనే నిలబడివున్న వ్యక్తిని "ఏమండీ! టైమెంత అయింది?" అని అడిగాడతడు.

అతడు కొంచెం విసుగుతో చేతిగడియారం వంక చూసి, "నైన్‌ఫిఫ్టీ," అని సమాధానం చెప్పాడు.

నైన్ ఫిఫ్టీ. బాప్‌రే. తాను పది గంటలకల్లా సీటులో ఉండాలి. లేకపోతే ఆ కొత్త ఆఫీసరు అగ్గిరాముడై పోతాడు. ఆయన అసలే ఫైర్ బ్రాండ్. పరమ చిరాకు మనిషి. ఎప్పుడూ అయినదానికి కానిదానికి ధుమధుమ లాడుతుంటాడు. వయసుకు చిన్నవాడే. అంత తొందరగా ఎలా ప్రమోషన్లు సంపాయించాడో ఎవరికీ తెలియదు. చాలా డబ్బు ఖర్చు పెట్టాడని అంటారు. ఆయనకు తెలిసి నవి రెండే విషయాలు. ఒకటి తాను పెట్టుబడి పెట్టిన మొత్తానికి నూరురెట్లు పోగు చేసుకోవడం. రెండు క్రింది వారందరిమీదా అనవసరంగా మండిపడుతూ అయినదానికి కానిదానికి సాధిస్తూ ఆఫీసులో అద్భుతమైన క్రమశిక్షణ అమలు పరిచే గొప్ప ఆఫీసరుగా పేరు ప్రతిష్ఠలు పోగు చేసు కోవడం. ఈ రెండూ ఆయన అద్భుతంగానే చేస్తున్నాడని చెప్పుకోవాలి. తన పెట్టుబడి కోసం తాపత్రయపడడం ఒక ఎత్తు. సబార్డినేట్సును నానా హింసలు పెట్టడం ఒక ఎత్తు. అసలా మనిషి ముఖం చూస్తేనే అదొక రకంగా ఉంటుంది. మనిషి లావుగా ఉంటాడు. మెడ అంతా కొవ్వు పట్టి ఉంటుంది. ఎవరి వంకనైనా చూడదలుచుకుంటే మెడ ఒక్కటి తిప్పి చూడలేడు. మొత్తం శరీరమే గిర్రున తిరగవలసి వుంటుంది. కుర్చీకి నిండుగా సరిపడా వుంటాడు. జుట్టు కొంచెం తెల్లబడుతూ వుంటుంది. కళ్లు ఎర్రగా చింతనిప్పుల్లా వుంటాయి. కంఠ స్వరం సరేసరి మహా భయంకరంగా చిన్న పిల్లలు జడుసుకునేట్లు ఉంటుంది.

అదిసరే ఇప్పుడు పది దాటుతున్నది కదా? ఈ బస్సు ఎప్పుడు వచ్చేట్టు? తానెలా ఎక్కేట్టు? ఎన్ని గంటలకు ఆఫీసుకు చేరుకునేట్టు? ఆఫీసరుకు ఏమి సంజాయిషి ఇచ్చుకునేట్టు?

అదుగో బస్సు. ఇంతకాలానికి దాని దర్శనమైంది. లోపల ఇటుకలు పేర్చినట్టు ప్రయా ణీకులు కిటకిటాలడుతున్నారు. అయినా దిగవలసిన వారిద్దరు ముగ్గురు ఉండడంవల్ల అదృష్టం పండి ఆగింది. రామచంద్రమూర్తి కమ్మీ పట్టుకుని వదల్లేదు. దిగేవారు దిగగానే లోపలికి దూసుకు పోయాడు. బస్సెక్కడం అనే విద్యలో ఈ మాత్రపు ప్రాథమిక అనుభవమైనా లేకపోతే- ఆ సూట్ వాలాలాగా పేవ్‌మెంట్ మీదనే గంటల తరబడి నిలబడిపోక తప్పదు. సోదరా! దూసుకుపోయే వాడిదే రాజ్యం... లేకపోతే నీ సంగతి అంతే... నిలబడు. నిలబడు... గంటల తరబడి నిలబడు... నీ చుట్టూ కొందరు దూసుకుపోతుంటారు... వాళ్ళే పైకి పోతుంటారు... నీ గతి యిక నిర్గతే... 'టికెట్...టికెట్' అంటూ ఇద్దరు ప్రయాణీకుల చంకల క్రింద నుంచి దూసుకు వచ్చాడు కండక్టరు అతి లాఘవంగా.

టికెట్ తీసుకుని నిలబడ్డాడు రామచంద్రమూర్తి.

వచ్చే ఫస్టు తారీఖున జీతం అందుకోగానే ముందు కళ్ళ డాక్టరు దగ్గరికి పోవాలి. బొత్తిగా చూపానడంలేదు! చదవడమైతే మరీ కష్టంగా వుంది. నాలుగు వాక్యాలు చదివితే చాలు నీళ్ళొ స్తున్నాయి. తల నొప్పి పుడుతుంది.

రామచంద్రమూర్తి అలాగే నిలబడ్డాడు... అతని కళ్ళ ముందు యెప్పటిదో దృశ్యం కనిపిం చింది. తనకప్పుడు పధ్నాలుగు, పదిహేనేళ్లు ఉంటాయి. తన వూరికి నాలుగు మైళ్ళ దూరంలో వున్న చిన్న పట్నంలో స్కూలు చదువు. పొద్దున్నే లేచి చద్దన్నం తిని పుస్తకాల సంచీ భుజానికి

తగిలించుకుని నడక ప్రారంభించేవాడు. సాయంకాలం తిరిగి వచ్చేటప్పుడు మరీ హుషారుగా వుండేది. నాలుగు మైళ్ళు పరుగెత్తుకుంటూ తిరిగి వచ్చేవాడు. తోటివారిద్దరు సాయంకాలం అయ్యే సరికి నీరసపడి తోటకూర కాడల్లా వ్రేలాడిపోతుండేవారు. తాను వారిని వొదిలి రివ్వురివ్వున పరుగెత్తుకుపోయేవాడు. ఆ విధంగా రన్నింగ్ అలవాటైంది. స్కూల్లో పోటీలలో తానే ప్రథముడు. దాంతో ఇంకా అభిరుచి పెరిగింది. ఎక్కడికి వెళ్ళినా పరుగెత్తుతూ వెళ్ళడమే. నడవటం అరుదై పోయింది. కాళ్లు సన్నబడ్డాయి...కాళ్ళలో బలం సత్తువ పెరిగాయి. ఒళ్లు తేలికగా హాయిగా వుండేది. ఉదయమే లేచి మైళ్ళకొద్దీ పరుగెత్తి వస్తే ప్రాణానికి హాయిగా వుండేది.

బస్సు ఆగింది - రామచంద్రమూర్తి ఇద్దరు వ్యక్తులను నిర్దాక్షిణ్యంగా పక్కకు తోసి మళ్ళీ జనారణ్యాన్ని ఛేదించుకుని క్రిందికి దిగాడు. క్షణంలో బస్సు వెళ్ళిపోయింది. టైమ్ కనుక్కున్నాడు. గుండె గతుక్కుమన్నది. నుదుట పట్టిన చెమటను రుమాలుతో తుడుచుకుంటూ వేగంగా ఆఫీసుదారి పట్టాడు. మళ్ళీ నడక... మరో అర ఫర్లాంగు దూరం.

ఎండ నియంత పరిపాలనలా భయంకరంగా వుంది ఘోరంగా వుంది... భరించరానిదిగా వుంది.

ఆ రోజు...

అంతర్ జిల్లా ఎథ్లెటిక్స్ ముగింపు రోజు... రన్నింగ్ ఫైనల్స్... ట్రాక్ అంతా శుభ్రంగా వుంది. అభ్యర్థులు మొత్తం పద్దెనిమిది మంది-అందరూ పక్కనే పచ్చికలో ఎగురుతూ, గెంతుతూ సన్నద్ధం అవుతున్నారు. బహుమతి ప్రదానం చేయవలసిన కలెక్టరుగారు యితర ప్రముఖులతో కుర్చీలో కూర్చుని వున్నారు.

ఈ ఈవెంట్ కోసం తాను రోజూ ఉదయం సాయంకాలం ఆ గ్రౌండ్‌లోనే గంటల తరబడి పరుగెత్తాడు. ఈ సమయం కోసమే ఎదురుచూస్తున్నాడు. లౌడ్ స్పీకర్‌లలో మాటలు విని పిస్తున్నాయి. పేర్లు వినిపిస్తున్నాయి.

పద్దెనిమిదిమంది ట్రాక్ మొదట్లోకి వచ్చి నిలబడ్డారు. నేల మీదికి వంగారు. చేతులు నేలమీద ఆనించి సవ్వడి వినబడగానే ముందుకు రేసు గుర్రాల్లా దూసుకుపోయేందుకు సిద్ధంగా ఎక్కుపెట్టిన బాణాలవలె ఉన్నారు. కొద్ది క్షణాలు నిశ్శబ్దం...

మెత్తని ప్రేలుడు వినిపించగానే తాను ముందుకి పరుగు ప్రారంభించాడు. కళ్ళ ముందు ట్రాక్ తప్ప మనుషులు కనిపించలేదు. ప్రక్కనున్న పచ్చని పచ్చిక కనిపించలేదు. పైనున్న నీలా కాశం కనిపించలేదు.

గుండెకు తగిలిన పలుచని దారం తెగిన తర్వాత కొద్ది గజాల దూరం పరుగెత్తిపోయి పచ్చికలో కూలబడిపోయాడు. అంతలో తన చుట్టూ జనం మూగారు. తన చేతులు పట్టుకున్నారు. తనను కౌగలించుకున్నారు. చివరకు ఆయాసంతో వగర్చుతున్న తనను పైకెత్తి గాలిలోకి ఎగర వేశారు.

కలెక్టరు తనకు ట్రోఫీ బహుకరిస్తున్నప్పుడు కరతాళధ్వనులతో ఆ ప్రదేశం అంతా మారు మ్రోగిపోయింది. 'ది ఫాస్టెస్ట్ రన్నర్ ఆఫ్ ది స్టేట్' అని సావనీర్‌లో ఫోటో క్రింద వ్రాశారు.

రామచంద్రమూర్తి ఆఫీసు మెట్లెక్కుతున్నాడు. ఆయాసంతో వగరుస్తున్నాడు. నుదుట, మెడమీద పడుతున్న చెమటను తుడుచుకుంటున్నాడు. ఆ ట్రోఫీ యింకా తనదగ్గరే వుంది. దాన్నీ, ఇతర చిన్న చిన్న కప్పులూ వగైరా బహుమతులు దాచేందుకు తన దగ్గర అద్దాల బీరువాలు లేవు. కొన్ని అసలైన వెండికప్పులు తనకు డబ్బు అవసరం వచ్చినప్పుడు వాటికి కాళ్ళొచ్చినట్టు వెండి దుకాణాల్లోకి వెళ్ళి చేరిపోయాయి. మరి రెండుమూడు కప్పులు లోపల ఎక్కడో ఉండాలి. ఆనాటి ట్రోఫీ మాత్రం పెద్దది ఇప్పుడూ ఇంట్లో కిటికీలో మూలగా ఉంటుంది. దుమ్ముకొట్టుకు

పోయి ఉంటుంది. ఎన్నో సర్టిఫికెట్‌లు స్కూలు రోజుల నుంచీ తనకు వచ్చినవి పురుగులు కొట్టి పాడైపోయాయి. ముట్టుకుంటే పొడి పొడి అయ్యేట్టున్నాయి.

స్ప్రింగుడోరు తెరుచుకుని లోపల అడుగుపెట్టేసరికి అయ్యగారు పేపరు చదువు తున్నారు. శబ్దం విని కుర్చీ మొత్తం పక్కకు తిప్పి గడియారం వంక చూసి మొహాన గంటు పెట్టుకుని పేపరు బల్లమీదపడేసి, "ఊఁ" అన్నాడు. ముందు భయంకరంగా... ఆ తర్వాత రామ చంద్రమూర్తి రిజిష్టరు అందుకోబోతూ వుంటే, "కాస్సేపాగండి... ఎలాగూ పన్నెండు అవుతుంది. ఈ పూటకు లీవు పెట్టేద్దురుగాని..." అన్నాడు.

తర్వాత మళ్ళీ అంతలోనే, "లీవు వుందా! అంతా వాడేసుకున్నారా?" అని అడిగాడు.

రామచంద్రమూర్తి రిజిష్టరు మీద వున్న చేతిని వెనక్కు తీసుకుని, "ఉందనే అనుకుంటా నండి..." అన్నాడు.

"గుడ్... అది సరేనండి... మీరెన్నింటికి బయలుదేరుతారు ఇంటి నుంచి?"

"తొమ్మిదింటికి సార్!"

"గుడ్... తొమ్మిందిటికి బయలుదేరి పదకొండు గంటలకు ఆఫీసుకొస్తారు. అంటే ఇక్కడికి రావడానికి రెండు గంటలు పడుతుంది... అంతేనా?"

"కాదండి... బస్సులతో బాగా ఇబ్బందిగా ఉందండి... బస్సులు ఆపరు. ఎక్కించుకోరు..."

"గూడ్... కాబట్టి మనకు బస్సు సరిపడదని అర్థం... అంతేనా?"

రామచంద్రమూర్తి తలవంచుకున్నాడు.

"గూడ్... బస్సుమీద వస్తే లాభం లేదని తెలిశాక మీరు వేరే వసతి చూసుకోవాలి... అంటే మరో రవాణా సౌకర్యం... మరో మీన్స్ ఆఫ్ కన్వేయన్స్... పోని ఒక స్కూటరు కొనుక్కోగూడదూ?"

రామచంద్రమూర్తి నవ్వేందుకు ప్రయత్నించాడు. "డబ్బు కావాలి కదండి." అన్నాడు.

"గూడ్... డబ్బు లేదు కాబట్టి కారు, స్కూటరు వగైరాలు వీల్లేదు... ఆగవు ఎక్కించుకోవు కాబట్టి బస్సు వీల్లేదు... మరి కొంచెం ముందుగా... ఎనిమిదింటికే యింటి దగ్గర బయలుదేరితే..."

"అప్పటికి యింట్లో వంటకాదండి."

"ఓహో... అదొకటా? కాబట్టి అదీ వీలులేదు. సరే... ముందు లీవ్‌లెటరు రాయండి. ఈ లోపల నేను ఉపాయం ఆలోచిస్తాను."

రామచంద్రమూర్తి కాగితం అందుకుని ఆ పూటకు లీవ్ వ్రాసి యిచ్చాడు. అది రాస్తున్నంత సేపు ఆఫీసరు అతనివంక తమాషాగా అలవోకగా హేళనగా చూస్తూ కూర్చున్నాడు.

ఆ తర్వాత దాన్ని అందుకుని అవతలపెట్టి, "ఆ? ఉపాయం తట్టింది... అది బెస్టు..." అన్నాడు.

రామచంద్రమూర్తి తలెత్తి అతని మొహంలోకి చూశాడు. అతడు నవ్వుతున్నాడు.

"చెప్పండి సార్..." అన్నాడతను.

"అవును... యిది బెస్టు... మీరు తొమ్మిదింటికే ఇంటి దగ్గర బయలుదేరవచ్చు. పదింటి కల్లా ఆఫీసు చేరుకోవచ్చు. పైగా వొంటికి ఎంతో మంచిది. ఆరోగ్యం బాగుంటుంది. ఎంతో మంచి ఎక్సర్‌సైజ్."

"చెప్పండి సార్!"

"తొమ్మిదింటికి ఇంట్లో నుంచి బయటికి రండి... వెంటనే పరుగు ప్రారంభించండి. స్పీడు గా పరుగెత్తండి ఎక్కడా ఆగకండి... అరగంటలో ఆఫీసులో ఉంటారు. ఏమంటారు?"

ఈ మాటలని అతడు నవ్వడం ప్రారంభించాడు. తన మాటలకు తానే బల్లమీద పడి పడి నవ్వాడు. నవ్వి నవ్వి ముఖం ఎర్రబడింది. కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి.

రామచంద్రమూర్తి మొహం జేవురించింది. వ్రేళ్ళు వొణికాయి... కోపంతో మనిషి నిలువెల్లా ఊగిపోయాడు.

కొంచెంగా కంపిస్తున్న కంఠంతో ప్రారంభించాడు. "మీ ధోరణి ఏమీ బాగాలేదండి... పరమ వెకిలిగా వుంది. మీ హోదాకు తగినట్టు లేదు. నేను మీకంటే వయసులోనూ అనుభవంలోనూ పెద్దవాణ్ణి, మీరు అలా మాట్లాడకూడదు. అలా మాట్లాడకూడదని తెలుసుకునేపాటి సంస్కారం మీ చదువైనా మీకు యివ్వలేదు. అయామ్ సారీ... రియల్లీ సారీ... ఈ వయసులో మీలాటి మనిషిని కలుసుకోవడం, మీకింద పనిచేయడం నా దౌర్భాగ్యమనుకుంటాను. వ్యంగ్యం హాస్యం ఇవేననీ, ఇలాగే ఉంటాయనీ మీరనుకుంటే అది తప్పు. ఎక్కడో ఎప్పుడో మీ జోక్ మిమ్మల్ని దెబ్బతీస్తుంది. మీ సెన్సాఫ్ హ్యూమర్ ఎప్పుడో మిమ్మల్ని దెబ్బ తీస్తుంది."

ఈ మాటలని వెనుదిరిగి వెళుతూ ఆగి అతనివంక చూస్తూ మళ్ళీ, "అన్నట్టు మీకు తెలియదేమో. పరుగెత్తమని నాకు సలహా యిచ్చారు. ఐ వజ్ ఎ ఫేమస్ రన్నర్ వన్స్. మీకు తెలియకపోతే నన్ను గురించి మరెవరినైనా స్పోర్ట్స్ తెలిసిన వారిని వాకబు చేయండి... చెబుతారు... వస్తాను," అని స్ప్రింగు డోరు మూసి యివతలికి వచ్చాడు.

ఆ సాయంకాలం ఆఫీసునుంచి బయటపడి రామచంద్రమూర్తి నుదురు చేత్తో రుద్దుకున్నాడు.

వాతావరణం చల్లబడింది. చల్లనిగాలి వీస్తున్నది. అతడు బస్సు కోసం ఆగలేదు. వేగంగా నడవడం ప్రారంభించాడు.

ఈ ప్రాంతంలో పెద్ద ఆవరణ వుంది. ప్రభుత్వ స్థలం. అక్కడ రోజూ కొందరు యువకులు రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తూ ఉంటారు.

అక్కడే నిలబడిపోయాడు కొద్ది నిముషాలు...

తర్వాత మళ్ళీ నడక ప్రారంభించాడు. అతడిప్పుడు బొత్తిగా జన సంచారంలేని వీధుల వెంట నడుస్తున్నాడు. అతనికి పరుగెత్తాలని సరదా పుట్టింది. ప్యాంట్ కొంచెం పైకి మడిచాడు. కోటు చేతులు పైకి మడిచాడు.

'రన్... రన్...' అనుకున్నాడు. వేగంగా పరుగెత్తాడు.

అలా తమ వీధికి చేరుకునే వరకూ పరుగెత్తుతూనే వున్నాడు. మధ్యలో సెంటర్లలోనూ జనం ఎదురైతేనూ తప్ప ఆగలేదు.

ఆయాసంతో వగర్చుతూ యింటికి వచ్చిపడ్డాడు. మంచంమీద కూలబడిపోయాడు. సీతమ్మ ఆదుర్దాగా, "ఏమిటండి... అంతగా ఆయాసపడిపోతున్నారేమిటి?" అంటూ వచ్చింది.

ఆయాసంలోనే, "ఏమీ లేదు... మంచినీళ్ళు... వద్దు... కాఫీ," అన్నాడు ఆమె లోపలికి వెళ్ళింది. అతడు కాళ్లు చాపి మంచంలో వెల్లకిలా పడుకున్నాడు.

అయిదు నిమిషాల తర్వాత ఆమె వచ్చి చూసి అదిరిపడింది. భర్త వాలకం ఆమెకు అర్థం కాలేదు. భయంతో పరుగెత్తుకువెళ్ళి దగ్గర్లోనే ఉన్న డాక్టరును పిలుచుకొచ్చింది. ఆయన పరీక్షచేసి "కంగారేమీ లేదు... చిన్న పెరాలొసిస్ స్ట్రోక్... అదే పక్షవాతం...కుడికాలూ చెయ్యీ పడిపోయాయి. విశ్రాంతిగా పడుకోనివ్వండి... నేను మళ్ళీ వచ్చి చూస్తాను. ప్రాణభయం ఏమీలేదు. తొందరలో కాలూ చెయ్యీ మామూలుగానే వస్తాయి," అని చెప్పి వెళ్ళిపోయాడు.

రామచంద్రమూర్తి కళ్ళలో నీళ్ళు ఉబికివచ్చి బుగ్గల మీదుగా కిందికి జారుతున్నాయి. అతని కళ్ళలో ఒకటే దృశ్యం... ఆనాటి దృశ్యం... ఎత్తయిన ట్రోఫీ... గుండెల్లో ధ్వనులు...

"రన్... రన్ రామూ... రన్..."

"ది ఫాస్టెస్ట్ రన్నర్ ఆఫ్ ది స్టేట్."

"రన్... రన్... రన్... మై డియర్ బాయ్... రన్..."

*ప్రభవ మాసపత్రిక, డిసెంబర్ 1978*

జీవితపు పరుగుపందెం

# ఏస్ రన్నర్

***గర్భస్థ శిశువు ఆ రెండు వందల డెబ్బయి రోజుల బందిఖానా తర్వాత ఎలా ఆ చీకటి గుహలో నుంచి తల్లికి నరకయాతన చూపిస్తూ దూసుకుని వచ్చి పుడమి మీద పడుతుందో అలాగే ఆ వింత మాట కూడా కథా రూపం ధరించి బైటపడుతుంది.***

ఎప్పుడైనా, ఎక్కడైనా ఒక విధంగా అరుదనిపించే ఒక దృశ్యం, లేక అరుదైనదని పించే ఒక మాట, లేక ఒక అనుభవం... ఇవన్నీ కథావస్తువులే. ఆ దృశ్యం చూసి నప్పుడు లేక ఆ మాట విన్నప్పుడూ మనకేమీ వింత అనిపించకపోవచ్చు. కాని ఆ వింత మాట, ఆ వింత దృశ్యం లేక ఆ అరుదైన అనుభవం మన మనోక్షేత్రంలో నిలిచి ఎక్కడో గుప్తంగా ఉండిపోతుంది. అది అలా మనోకుహరంలో నిక్షిప్తమై ఉండి నెమ్మది నెమ్మదిగా మనకు తెలియకుండానే జీవం పోసుకుంటూ ఉంటుంది. చాలామంది మామూలు మనుషులు చాలా దృశ్యాలను చూసేందుకూ మామూలు మాటలు వినేందుకు ఇష్టపడరు. తిరస్కరిస్తారు కూడా. 'మనకెందుకులే' అని పట్టించుకోరు. భావుకుడి మనసులో పడిన ఆ బీజం మాత్రం చచ్చిపోదు. సరికదా, ఒక స్త్రీ గర్భాశయంలో తల్లికి తెలియకుండానే జీవం పోసుకుని పెరుగుతూ అవయవపుష్టి పొందే శిశువులాగా ఒక రూపం ధరిస్తుంది. ఎప్పుడో అది నిర్దిష్ట రూపం పొంది బయటికి దూకే సమయం వచ్చినపుడు బయటికి వచ్చి తీరుతుంది.

ఒక మాటు ఎక్కడో నీళ్ళకరువు తాండవించే రాళ్ళసీమ మారుమూల గ్రామం నుంచి వచ్చిన ఒక అమాయక బాలుడు అన్నమాట. కృష్ణాతీరం- వరద కృష్ణమ్మ పొంగులు వారుతూ పరవళ్లు తొక్కుతున్నది. ఆ దృశ్యం చూస్తూ ఒడ్డున నిలబడిన ఆ అబ్బాయి అన్నమాట 'ఇన్ని నీళ్ళు ఒక్కచోట నేనెప్పుడూ చూడలేదు,' అనే మాట నా మనసులో అలజడి రేపింది. చాలా ఏళ్ళు ఆ అరుదైన మాట నా మనసులో లోపలి పొరలలో నిక్షిప్తమై ఉండిపోయింది. చాలా ఏళ్ల తర్వాత అతడు అకస్మాత్తుగా చనిపోయాడని విన్నప్పుడు పైకి తన్నుకు వచ్చింది. గర్భస్థ శిశువు ఆ రెండు వందల

డెబ్బయి రోజుల బందిఖానా తర్వాత ఎలా ఆ చీకటి గుహలో నుంచి తల్లికి నరకయాతన చూపిస్తూ దూసుకుని వచ్చి పుడమి మీద పడుతుందో అలాగే ఆ వింత మాట కూడా కథా రూపం ధరించి బైటపడుతుంది. అలా వెలువడినదే నీళ్లు కథ. అలాగే ఎప్పటిదో చిన్నప్పటి స్నేహితుడి వింత ప్రశ్న.. 'ఇంగువ అంటే ఏమిటిరా? అదేదైనా కెమికలా, లేకపోతే చెట్టు నుండి వస్తుందా?' అన్న ప్రశ్న... అది చాలా సంవత్సరాల తర్వాత ఆ మిత్రుడు పోయాడని విన్నప్పుడు ఇంగువ కథగా వెలువడింది.

అటువంటిదే మరొక అరుదైన అనుభవం ఏస్ రన్నర్ కథ అయింది. కాకపోతే, చుట్టూ అవసరమైన కొద్దిపాటి కల్పనతో రూపం దిద్దుకుంది.

ఒకప్పుడు రాజధానీ నగరంలో పెద్ద పదవిలో ఉన్న ఒక చిన్ననాటి స్నేహితుడిని చూద్దామని వెళ్ళాను. కేవలం సరదాగా చూద్దామనే వెళ్ళాను. అతడు చాలా ఆర్భాటంగా ఉన్నాడు. కాస్త ఆలస్యంగానైనా నన్ను గుర్తుపట్టాడు. 'కూర్చోమ'ని కాఫీ తెప్పించి మర్యాద చేశాడు. కాని అంత లోనే తన క్రింద పనిచేసే ఒక గుమాస్తా అమ్మాయిని పిలిపించాడు. ఆ అమ్మాయి ఆనాడు ఆఫీసుకు గంట ఆలస్యంగా వచ్చిందని ఆమెతో నా ముందు చాలా అమర్యాదగా, అనాగరికంగా, ఒక రకంగా చెప్పాలంటే క్రూరంగా మాట్లాడాడు. ఆ అమ్మాయి ఏదో సమాధానం చెప్పింది కాని ఇతను వినిపించుకోకుండా ఇంకా రెచ్చిపోయాడు ఆ అమ్మాయి చిన్నబుచ్చుకుంది. బహుశా కళ్ళనీళ్ళు పెట్టుకుందని కూడా అనిపించింది నాకు. నేను చాలా బాధపడ్డాను. కూర్చున్నంతసేపు చాలా ఇబ్బందిగా ఫీలయ్యాను. నా ముందు గొప్ప కోసం అతడు అలా ఆమెను క్షోభపెట్టడం ఘోరమనిపించింది. సుమతీ శతకకారుడు 'అధికార రోగపూరిత బధిరాంధక శవము' అని ఎంత అద్భుతంగా చెప్పాడో అనిపించింది.

ఈ వృత్తాంతం దానంతట అది కథ కాదు. చాలా మామూలు విషయమే.


అది మనసులో నిక్షిప్తమై ఉండిపోయింది. లోలోపల నాకు తెలియకుండానే రూపం పోసుకుంది. ఇటువంటి విషయాన్ని బయటికి అవసరమైనంత ఘాటుగా చెప్పాలనిపించింది. అందువల్ల ఆ అమ్మాయిని మామూలు తక్కువ మధ్యతరగతి మగ గుమస్తాగా మార్చాను. ఆ అధికార మదోన్మత్తుడి మాటల ధోరణి మార్చాను. ఆఫీసుకు ఆలస్యంగా రావడానికి కారణం కల్పించాను. అన్నిటికీ మంచి ఆ గుమాస్తాను ఒక స్ప్రింటర్‌గా చిత్రించాను. ఇక చివరకు గుండెను ఆర్ద్రం చేసే ముగింపు ఇచ్చాను.

నాకు చాలా ఇష్టమైన పాతిక ముప్పై కథలలో ఇదీ ఒకటి.

*కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

*18 డిసెంబర్ 2012*

13



*బలివాడ కాంతారావు 3 జులై 1927న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. దాదాపు 400 కథలు, 32 నవలలు, 5 నాటికలు రచించారు. 8 కథాసంపుటాలు అచ్చయ్యాయి. 1972లో 'పుణ్యభూమి' నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి అవార్డు, 1986లో 'వంశధార' నవలకు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, 1998లో 'బలివాడ కాంతారావు కథలు'కు కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించాయి. పదవీ విరమణ అనంతరం విశాఖపట్నంలో ఉంటూ 6 మే 2000 సంవత్సరంలో మరణించారు.*

# ముంగిస కథ

## బలివాడ కాంతారావు

వంశధార నది ఒడ్డునే మడపాం గ్రామంలో డాక్టరు అప్పారావుగారి ఇల్లు. నదికి తూర్పున ఎత్తైన ఒడ్డు. ఆ ఒడ్డు మీదనే అతని ఇల్లు. రెండు వాసల్లో ఒకటి మిద్దెటిల్లు. రెండోది అటక మీద గడ్డి నేత ఇల్లు, ప్రతి సంవత్సరం వరదల్లో ఒడ్డు కూలిపోతూందని సర్కారువారు కొండరాళ్ళు వాలుగా పేరుపు పేర్చారు. అది పేర్చాక రెండు వరదలు వచ్చినా ఒడ్డు చెక్కుచెదరలేదు.

ఈ ఏటి ఒడ్డున వేసవిలో, నీలగిరిలా ఉంటుంది. చలికాలంలో చలి ఊళ్ళో కంటె హెచ్చే. అంగట నిల్చొని దక్షిణానికి పారే ఏరును చూస్తుంటే ఒళ్ళు పులకరించే ప్రకృతి దృశ్యాలు అగుపిస్తాయి. దూరాన చరిత్ర ప్రసిద్ధికెక్కిన సాలిహుండా కొండ, ఎత్తయిన సరుగుడు చెట్లు, అరటి తోటలు. మబ్బులకు మనోహరమైన రంగులను ప్రసాదించే సూర్యాస్తమయం. ఫిబ్రవరి నెలలో చీకటిరాత్రి పడమటి ఆకాశంలో మెరిసిపోతున్న శుక్రగ్రహం పరుగు, మెల్లగా దిగువ జారుతున్న ఏటి గలగలల్లో చూస్తుంటే నాట్యానికి లయ కలిసినంత అందంగా ఉంటుంది.

ఈ ఏటి ఒడ్డున ఈ ఇంట్లో ఉన్న సుఖంతోపాటు కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. వర్షాకాలంలో

బొబ్బలు పెట్టుకుంటూ చెట్లనూ, శవాలనూ తోసుకు వచ్చిన వరద వెల్లువ పాములను కూడా జీవంతో తెచ్చేది. ఆ రాళ్ళ సందుల్లో దాగున్న పాములు ఒకోసారి రాత్రివేళ ఇంట్లోనే ఉండేవి. ఒకనాడైతే ఒక పాము పై నుంచి పడుకునే మంచం మీదనే పడింది. ఆయుర్వేద వైద్యవృత్తితో పాటు వ్యవసాయం కూడా చేస్తున్న అప్పారావు పంటలకాలంలో ముఖ్యంగా ఇంకో ఉపద్రవాన్ని కూడా ఎదుర్కోవలసి వచ్చేది. ఎంతో పదిలంగా, భద్రంగా దాచిన ధాన్యాలను ప్రతి సంవత్సరం నూటికి ఒక పదో వంతైనా ఎలకలకూ, పందికొక్కులకూ ధారపొయ్యవలసిందే! ఈ రాళ్ళ సందుల్లో దాగున్న ఎలకలూ, పందికొక్కులూ రాత్రులు వీర విహారం చేస్తూండేవి. పగలు కూడా అటకను పాలించి, వాటి మీద ఉంచిన తినుబండారాలు, మిరపకాయల బస్తాలు వగైరా పిప్పి చేసేసేవి.

ఈ ఉపద్రవం నించి బయటపడ్డానికి ఆయన బోను పెట్టాడు. పడిన ఎలుకలను చంపడానికి మనసీయలేదు. దూరాన వదిలేస్తే మళ్ళీ ఆ మూషికరాజాలు, రాత్రింబవళ్ళు పరుగెత్తి మళ్ళీ తమ గుంపులో చేరేవి. 'ఎలుకల' మందు ఒక్కసారే పెట్టాడు. చచ్చిన ఎలుకలు ముక్కి కంపు కొట్టేవి. ఇంట్లో ఉండలేకపోయేవారు. తరువాత అటక మీద నించి తెల్లని పురుగులు ఎలుకల నించి కింద భోంచేసేటప్పుడు రాలేవి. దానితో అతనికి భయం వేసింది. పెంచిన పిల్లి ఒకటి ఈ పందికొక్కుల సమూహానికి జడిసిపోయినట్లుంది. ఇంట్లో పడుకోదు. యజమానురాలు పడుకున్న మిద్దె ఇంట్లో పక్కనే పడుకుంటుంది.

డాక్టరుగారికి ఇద్దరు పిల్లలు. కొడుకు వెయ్యి మైళ్ళ దూరంలో మిలిటరీ ఆఫీసరుగా ఉంటున్నాడు. కూతురు అత్తవారింట్లో ఎనిమిది మైళ్ళ దూరంలో ఉంటూంది. వీళ్ళకి ఎప్పుడు మనసు పుట్టినా ఇంటికి తాళం వేసి ఇద్దరూ ఉత్తరానికి కొన్ని వందల గజాలు నడిస్తే మర్రిచెట్టు ఉంది. ఆ నీడలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటుంటే ఏ బస్సయినా ఎదురుగా ఉన్న రోడ్డు మీద ఆగితే ఎక్కి కూతురు దగ్గరకు వెళ్ళి ఒకరోజు ఉండటం కద్దు.

డాక్టరు ఎందరి బాధలనో కుదర్చగలిగాడుగాని ఈ ఎలుకల, పాముల బాధ నుంచి విముక్తి పొందలేకపోయాడు.

ఒకనాడు ఉదయమే ఒక ఎరకలవాడు వచ్చాడు. పేదవాళ్ళను ఒక కంట చూసే డాక్టరు బాబుకు ఒక ముంగిస పిల్లను తెచ్చాడు. వాంతులతో సరిసరైపోయిన పెళ్ళాన్ని బాగుచేశాడని ఈ అరణం.

"ఇది నాకెందుకూ?" అన్నాడు డాక్టరు.

"బాబూ! మీకు పాములు, ఎలుకల బాధ. ఇది ఇప్పుడు బల్లిపిల్లలా ఉంది. ఆరు నెలల్లో పెరిగి పెద్దదయిపోతాది. అప్పుడు దీని మేలు మీకు తెలుస్తాది."

"పెంపుడు జంతువా ఉండటానికి?"

"మన తరిఫీదు బట్టి ఉంటాది బాబూ! పదిహేను రోజులు ఒక గూడులో తాడుతో కట్టి పెట్టండి. ఏ పిల్లీ, కుక్కా నొక్కేకుండా సూడండి. పాలన్నం తింటాది. సేపపిల్లలు తింటాది. ఏదైనా తీపివస్తువు తింటాది. అప్పుడు మెడలో మూడు మువ్వలు కట్టెయ్యండి దొరా!"

"మువ్వలు కడ్తే ఎలుకల్ని, పాముల్ని ఎలా పడుతుంది? పిల్లికి గంటలు కట్టిన చందం కదరా."

‘‘అదికాదు దొరా! మువ్వలు మోగితే ఆ ముంగిస జాతి దీనిని దగ్గిరకు చేరనివ్వవు. వెలేస్తాయి. దానికింకో గతిలేక మనిల్లు వదల్దు.’’

ముంగిస పిల్లను పట్టుకోడానికి డాక్టరుకు భయం వేసింది. ఆ ఎరకలవాడే మెడకు తాడు కట్టాడు. అది ఉంచడానికి వాడున్నప్పుడే ఒక డొక్కు చూశాడు. పాలన్నం ఇచ్చినా ముంగిస పిల్ల తినలేదు. కర్‌కర్ అని అరుస్తూంది.

‘‘అది అలా అరుస్తూంది- అదెక్కడ బతుకుతుందిరా?’’ అన్నాడు డాక్టరు.

‘‘తల్లి నొదిలి ఉండటం కదా? రెండు రోజులు తల్లి కోసరం ఏడుస్తుంది బాబూ!’’

‘‘ఎక్కడ దొరికిందిరా ఇది?’’

‘‘అదిగో, బాబూ- ఆ రోడ్డు దిగువ మఱ్ఱిచెట్టు మీద.’’

‘‘పదరా,’’ అంటూ డాక్టరు లేచాడు. అక్కడకు ఇద్దరూ వెళ్ళేసరికి రెండు పెద్ద ముంగిసలు చెట్టు చుట్టూ మీదకున్న తొఱ్ఱలోనికి అదేపనిగా అరుస్తూ పరుగెత్తుతున్నాయి.

‘‘పాపం, పిల్లను వెదుక్కుంటున్నాయి. నాకెందుకురా ఆ పాపం? తెచ్చి వదిలేద్దాం.’’

‘‘వద్దు, దొరా! ఆటికి మళ్ళీ పిల్లలు పుడతాయి. కోపగించుకోకుంటే ఉన్న మాటంటాను- మీకు మరి పుట్టరు కదా! ఆ పిల్లే పెరిగి మీకెంతో ఉపకారం చేస్తుంది. అది పెంపకానికి ఎల్లింది దొరా! దాని తల్లీ, తండ్రీ మీరే ఇప్పుడు.’’

డాక్టరు ఒక్కడే తిరిగి వచ్చాడు. అప్పుడే డాక్టరు భార్య అమ్మాయమ్మ దాని గోలను కొంత పంచదార పోసిన రొట్టెముక్క నిచ్చి తగ్గించింది. రెండు మూడురోజులకొకసారి ఆ ఎరకల ఎంకన్న వచ్చి చూసి పెంచడం విషయంలో సలహాలిచ్చి పోయేవాడు.

అమ్మాయమ్మకు వంటా పెంటా అయ్యాక ఈ ముంగిసతోనే కాలం గడిచిపోయేది. అలా చూస్తుండగానే అది కాలిబొటనవేలంత అయిపోయింది. పదిహేను రోజుల్లో దానికి డొక్కులో పెట్టే అవసరం లేకపోయింది. తాడు మెడకు కట్టి అది ఎటు తీసుకువెళ్తే అటు తిప్పేది. చుంచు మూతి, మూతి చివర లేతెరుపు, ఊదారంగు శరీరం, కొండ చీపురుకట్టలా తోక, చిన్న కళ్ళూ, చెవులూ... గెంతుతూ నడుస్తూంటే మువ్వలు గలగలలాడుతున్నాయి. దానికి పేరు కూడా అమ్మాయమ్మ పెట్టింది.

‘‘బయ్యన్న... బయ్యన్న...’’

నెలరోజులకల్లా ఏ తాడు అక్కర్లేపోయింది. పేరు పెట్టి పిలిస్తే పరుగెత్తుకు వస్తూంది. రోజుకు రోజా తిండితో పెరిగిపోతూంది. మూడు నెలలకు చుంచెలకలా ఎదిగిపోయింది. ఇప్పుడు దాని నివాసం ఇల్లు కాదు. పెరట్లో ఉన్న కఱ్ఱడొక్కు కాదు. ఏటి ఒడ్డున రాళ్ళ పేరుపులో ఒక బిలం. ఉదయం కాఫీ వేళకి బిలం నించి బయటకు వచ్చి అటక మీదకెక్కి గోడల మీద నుంచి పాకుతూ ఘల్లుఘల్లుమంటూ మెల్లగా దిగువకు దిగుతుంది. అమ్మాయమ్మ ఆ మువ్వల మోత వినగానే, ‘బయ్యన్నా రారా...’ అని పిలుస్తుంది. దానికోసం ఒక పాత చేట గోడ దగ్గిరే పరిచి ఉంటుంది. దాని మీద కూర్చొని ఒకసారి ముందు కాళ్ళు రెండూ ఎత్తుతుంది. ఇడ్లీ పంచదార వెయ్యకుండా ఎదర పెడితే అలుగుతుంది. పంచదార వెయ్యగానే అంత ముక్క అయిదు నిముషాల్లో మింగేస్తుంది. మళ్ళీ తిరుగు ప్రయాణం. అటు ధాన్యపుగాదెలు, ఇటు అటక, ఇంటి చుట్టూ ఒకసారి సాయుధ భటునిలా తిరిగి మళ్ళీ బిలంలోనికి వెళ్ళిపోతుంది.

ఈ బయ్యన్న ఇప్పుడు ఇంట్లో ఒక ముద్దు పిల్లాడు. కడుపునిండా పెట్టకపోతే వాడు ఎంతో మారాం చేస్తాడు. అమ్మాయమ్మ కాళ్ళావేళ్ళా పడతాడు. ఏ పని చెయ్యనివ్వడు. అదేపనిగా అరుస్తాడు. ఆమె మీదికే చెవిలో ఏదో చెబుదామని ఎగబ్రాకిపోతాడు. ఆ చిన్ని కాళ్ళతో అడ్డాలలో పిల్లడు తల్లికి మూతితో, కాళ్ళు చేతులతో గిలిగింతలు పెట్టినట్టు పెడతాడు.

బయ్యన్న వాళ్ళ దృష్టిలో ఇంకా ఆర్నెల్ల పిల్లడే. కాని, వాడు ఇంటి యజమానైపోయాడు. ఇంటి యజమాని సాధించలేక, విసిగి వదిలేసిన పనులన్నీ ఈ ఆరునెలల యువకుడూ సాధించే వాడు. ఇంట్లో ఎలుకలు లేవు. పందికొక్కులింకెటు పారిపోయాయో? ఏ తుప్పలు పట్టేశాయో? పాము పిల్లయినా మచ్చుకు కనబడలేదు. పాము పొరలు వెతుకుదామన్నా ఏటి ఒడ్డున కనబడ లేదు.

ఈ సంవత్సరం వాళ్ళు ఎక్కడ, ఏది, ఎలా విడిచిపెట్టినా అలానే ఉంటూంది. కూర గాయలు బోనెపెట్టి మీద పడేస్తున్నారు. ధాన్యం ఒకోసారి అలా నేలమీదో, బుట్టల్లోనో ఉంచేస్తు న్నారు. ఏటిపై వచ్చే చల్లగాలి హాయిగా పీల్చి, వెన్నెలను తెరచాప చేసుకొని, నావలా కదిలే నీటిని చూస్తూ ఏటి ఒడ్డున నిల్చుంటున్నారిద్దరూ. ఒకసారి వాళ్ళ యౌవనపు రోజులు జ్ఞప్తికి తెచ్చుకుంటున్నారు. ఇదివరలా ఏ పామైనా కాళ్ళకు చుట్టుకుంటుందన్న భయం లేదు.

అలా అంత రాత్రి మీద నిల్చునే ఇంట్లో పాపడిని పిలిచినట్టు, 'బయ్యన్నా, రారా...' అని పిలిస్తే ఒక్కసారి ఘల్లుఘల్లుమని మువ్వల చప్పుడు వినిపిస్తుంది. దగ్గరకు వచ్చి చుట్టూ ఇద్దరికీ నమస్కరిస్తున్నట్టు ప్రదక్షిణం చేసి తలెత్తి ఒక్కసారి అమ్మాయమ్మ పాదంపై కూర్చుంటాడు. ఆమె బయ్యన్నను చేతిలో తీసుకుని భుజం మీద కూర్చోబెట్టుకుంటే ఆ మూతితో ఆమె బుగ్గ నిమురు తాడు. 'వెళ్ళిపో బయ్యన్నా, నీ గూటికి,' అంటే మళ్ళీ ఘల్లుఘల్లుమంటూ వెళ్ళిపోతాడు.

ఒకనాటి తెల్లవారుఝామునే డాక్టరు ఇంటి ముందు గంభీరంగా భైరవయ్య చేతిలో కఱ్ఱతో నిల్చున్నాడు. వాడు వీళ్ళకు దూరపు చుట్టం. వీళ్ళకు వాడికంటే జరుగుబాటు హెచ్చని కన్ను కుట్టుకుంటున్నాడు. ఏదో సాకుతో వీళ్ళ మీద విరుచుకుపడ్డానికి ఉరుకుతూంటాడు. కోపంతో భయంకరుడైపోతాడు. మాంచి పొంకంతో మెలితిరిగిన నల్లని బొద్దు మీసాలపై నిమ్మ కాయలు నిలబెట్టగలనంటాడు. పెరిగిన జుత్తుకు వంకీలు తిప్పి వెనక్కి వదిలాడు.

వాకిట అయిదు చచ్చిన కోడిపిల్లలను విసిరి, "చూడు, మీ బయ్యన్న పని," అని హుంకరించాడు.

"ఏమైంద"న్నాడు డాక్టరు.

"నే చెప్పాలా? రాత్రి బయ్యన్న ఈ కోడిపిల్లల్ని నొక్కేసింది."

"ఎవరు చూశారు?"

"దీనికి సాక్ష్యం కావాలా?"

"నీవు కళ్ళెఱ్ఱజేస్తే పనికిరాదు. అనవసరంగా మా బయ్యన్న మీద నేరం మోపక. అలాంటి పని చెయ్యదు. ఎవరో పిలిచి వేస్తే తింటాడు. అంతే."

"నీకు సాక్ష్యమే కావలిసి వస్తే తెస్తాను."

వాడి పొరుగు నుంచే సాక్ష్యం తెచ్చాడు. గడపలో నున్న కోడిపిల్లల్ని హతమార్చింది మీ బయ్యన్నేనని చెప్పగానే ఇది దొంగసాక్ష్యమని కేకలేశాడు డాక్టరు.

‘‘వీటి ఖరీదు పది రూపాయలు. ఇచ్చేయి.’’

‘‘అనవసరంగా నేనెందుకివ్వాలి? మా బయ్యన్న పీకలు కొరికే వీరుడు కాడు. నేను ఒక్క దమ్మిడీ ఇవ్వనంటే ఇవ్వను.’’

‘‘సరే, పెద్దింటివాడివి. పసిమితో ఎగురుతున్నావు. నాకు నష్టం వచ్చింది. నీకు కాదుకదా! ఈ కోళ్ళు నాకు హక్కయినవి కావనుకుంటాను,’’ అంటూ ఆ కోడిపిల్లలను ఏట్లోకి విసిరేశాడు. ఇట్టే ఎగురుతున్న గెద్దలు అందుకున్నాయి. వాటిలో అవి వెంట తరుముకున్నాయి.

కోపంతో ఇంట్లోకి వచ్చిన డాక్టరుతో భార్య అంది. ‘‘వాడు క్రూరుడండీ! పోనీ, కొంతలో కొంత ఇచ్చి సముదాయించలేకపోయారా?’’

డాక్టరు ఖస్సుమన్నాడు. ‘‘వెధవ, అనవసరంగా మన బయ్యన్న మీద నిందలేస్తే పడతామా? అదే అక్కడకు వెళ్ళుంటే ఘల్లుఘల్లుమని శబ్దం వినపడేది కాదా? ఆ పెట్ట అరిచేది కాదా? వీళ్ళు లేచేవాళ్ళు కారా?’’

భైరవయ్య ఇంటికి పోయి నలుగురూ వింటూండగా, ‘పోయింది పొల్లు. మనం ఔనంటే ఆ పెద్దోడు కాదంటున్నాడు. వాడికది తిన్నన. మనకి కావలసింది జాగ్రత్త. మిగతా కోడిపిల్లల్ని జాగ్రత్తగా చూడు. ఇంట్లో ముయ్యి. మనం వీధిలో పడుకుందాం!’’

పది రోజులు గడిచిపోయాయి. డాక్టరు దగ్గరకు మందుకి వచ్చాడు భైరవయ్య. డాక్టరు పైసా పుచ్చుకోకుండా మందిచ్చాడు. కోడిపిల్లల ఊసే మరిచిపోయారు.

పట్నంలో కూతుర్ని చూడ్డానికి డాక్టరు, భార్య ఉదయమే బయలుదేరారు. ఇల్లుకు తాళాలు వేశారు. పెరటి డొక్కులో పాలన్నం గిన్నెలో పెట్టి, ‘‘బయ్యన్నా, మధ్యాహ్నం తినరా! పట్నం వెళ్ళి సాయంత్రానికి తిరిగి వచ్చేస్తాం. ఇల్లు జాగ్రత్త,’’ అంటూ అమ్మాయమ్మ చెప్పి మరీ వెళ్ళింది.

బయ్యన్న వాళ్ళ వెంట వద్దన్నా పడ్డాడు. ఇద్దరూ మర్రిచెట్టు కింద బస్సుకోసం కూర్చుంటూనే ముంగిస అరుపులు విన్నారు. ఆత్రంగా తిరిగి చూసేసరికి ఒక ముంగిస కాదు- బయ్యన్న కాక మరి రెండు ముంగిసలు. ఆ రెండు ఆ చిన్న చెవులు రిక్కించి కోపంతో అరుస్తున్నాయి. బయ్యన్న దారి కడ్డమయ్యాయి. బయ్యన్న వాటిని చేరాలని ఆత్రపడుతున్నాడు.

‘‘అవిగో అవే, ఆ రెండు బయ్యన్న అమ్మానాన్నా,’’ అన్నాడు డాక్టరు. ఇద్దరూ వింతగా చూస్తున్నారు. ఆ రెండు బయ్యన్న మీద ఉరకడానికి సిద్ధమౌతున్నాయి. బయ్యన్న కులం నుంచి వెలివేసిన మనిషిలా ఉన్నాడు.

‘‘చంపగలవండి. వాటిని తోలండి,’’ అంది భార్య. వాటిని అదిలించి, ‘‘రారా, బయ్యన్నా,’’ అంటే మెల్లగా మూతి వంచుకుని అమ్మాయమ్మ దగ్గరకు వచ్చి పాదం మీద పడుకున్నట్లు వంగిపోయాడు. ఆమె ఎత్తుకోగానే మూతి దగ్గర మూతి పెట్టి మెల్లగా అరుస్తున్నాడు.

‘‘మీ అమ్మానాన్నా నిన్ను రానివ్వలేదని ఏడుస్తున్నావా? మేం ఉన్నాం కదరా... నీ అమ్మను నేను, అరుగో మీ నాన్న... వెళ్ళు ఇంటికి- ఇంట్లో నీవు లేకపోతే శత్రుమూకలు దాడి చేసేస్తాయి. వెళ్ళు, నాయనా... వెళ్ళరా...’’ అమ్మాయమ్మ ఒక ముద్దు పెట్టుకొని అంత దూరం వెనక్కు వచ్చి విడిచిపెట్టింది. రానురాను ఘల్లుఘల్లుమనే శబ్దం దూరమైపోతూంది. ఇంతలో బస్సు వస్తూంది.

డాక్టరు పిలుస్తున్నాడు. తిరిగి రోడ్డు వైపుకు పరుగెత్తింది. తిరిగివచ్చిన బయ్యన్న ఇంటి చుట్టూ అంతా సరిగ్గా ఉన్నాయో లేవో అని ఒకసారి తిరిగి వెళ్ళి బిలంలో కూర్చున్నాడు.

పది గంటలయింది. ఇంకా పాలన్నం తినటానికి సమయం కాలేదు. ఆ సమయం వస్తే గంటలు విన్నట్టు మరీ వెళుతుంది. 'బయ్యన్నా, రారా...' అన్న పిలుపు. ఒకసారి బిలం నుంచి వచ్చి చూశాడు. మళ్ళీ పిలుపు. భైరవయ్య ఒడ్డులో నిల్చున్నాడు. వీధిలో ఎవ్వరూ లేరు.

"రారా, బయ్యన్నా... ఇదిగో చేప... రారా... రారా."

గంటల మోత వినిపించింది. చెంగుచెంగున రాళ్ళన్నీ ఎగబ్రాకింది. భైరవయ్య చేతిలో చేప చూశాడు. కొద్దిగా జరిగాడు భైరవయ్య. ఒక్కసారి, "నీకోసం చేప తెచ్చానురా బయ్యన్నా. రారా..." అన్నాడు.

కొద్దిగా నక్కుతూ... కాస్త ముందుకు వస్తూ, మళ్ళీ మూల దాగుంటూ... మళ్ళీ ఒకసారి చూసి... మళ్ళీ మందారచెట్టు చాటున దాగుంటూ అతని గొంతుక విని చివరకు వాకిటలో చేపను పసికట్టేశాడు బయ్యన్న.

అందుకోడానికి ఘల్లుమని శబ్దం చేస్తూ ఉరికాడు. ఎదురుగా మునకాల కర్ర పట్టుకుని మీసం తిప్పుతూ నిల్చున్న భైరవయ్య, ఒక్కసారి కర్రెత్తి దభీమని బయ్యన్న శరీరం మీద వేశాడు. బయ్యన్న ఒక్కసారి అరిచి, 'వద్దు! వద్దు! నేనేం పాపం ఎరగ'నన్నట్లు ఆ మూతి ఎత్తాడు. 'నీకో నమస్కారం. అనవసరంగా చంపకు,' అన్నట్టు ఆ ముందు కాళ్ళు రెండూ లేచున్నాయి. మళ్ళీ దభీమని ఇంకో దెబ్బ. బయ్యన్న గిలగిలా తన్నుకుంటున్నాడు. మరి రెండు దెబ్బలతో మూగబోయాడు.

భైరవయ్య తోక పట్టుకుని ఎత్తాడు. నోటి వెంబడి రక్తం కారుతూంది. ఆ చిరుపళ్ళు కనిపిస్తున్నాయి. మనుషులను చంపగలిగే విషసర్పాలను కొరికి కొరికి ముక్కముక్కలు చెయ్యగల పళ్ళవి. పామును చూడగానే వీరావేశంతో గెంతి దెబ్బలాడగల కాళ్ళవి. తేలేసి ఉన్నాయి. అంత చిన్న కళ్ళయినా ఎలకల మందలను, పందికొక్కుల మూకలను గడగడలాడించేవి. అలాంటి కళ్ళు మూతబడినాయి. 'బయ్యన్నా, రారా' అంటే ఈ మానవాళి అరుపంతా సౌహార్ద్రం, ప్రేమతో నిండి ఉంటుందనీ, వాళ్ళ కరుణతో తనలాంటి జంతుజాలానికి కడుపు నింపుతారనీ ఆశతో ఆ పిలుపు వింటుండిన చెవులు శాశ్వతంగా చెముడయ్యాయి.

భైరవయ్య వీరావేశంతో ఆ తోక పట్టుకుని బలం అంతా ఉపయోగించి పారుతున్న ఏటిలోనికి బయ్యన్న శవాన్ని విసిరేశాడు. కింద రక్తం పడిన జాగాలో మన్నంతా ఎత్తి ఏటిలో పారేశాడు. ఏమీ తెలియనట్లు ఏటికిపోయి కాళ్ళు చేతులు కడుక్కున్నాడు.

బయ్యన్న శవం ఏట్లో కొట్టుకుపోయింది. కుళ్ళిపోలేదు. ఒక ఒడ్డుకు చేరింది. ఒక ఆకలిగొన్న గద్దకు ఆహారమైంది.

సాయంత్రం ప్రొద్దు గుంకకుండానే ఉదయం పశువులను తోలుకు వెళ్ళిన పసివాడు తిరిగి వచ్చాడు. పట్నం నుంచి డాక్టరూ, అమ్మాయమ్మా తిరిగి వచ్చారు. బయ్యన్నకు తీపి వస్తువులు ఇష్టమని, ఎండుచేపలు మరీ ఇష్టమని అమ్మాయమ్మ అవే కొనుక్కుని వచ్చింది.

ఇంటికి రాగానే ముందు బయ్యన్న తిన్నాడో లేదోనని పెరటిదొక్కులో చూసింది. పాలన్నం అలాగే ఉంది.

“చూడండి, మన బయ్యనకు ఎంత దర్జాయో! చెప్పి మరీ వెళ్ళినా- తినలేదు.”

“నీవు దగ్గిర ఉండి తినిపిస్తేగాని తినడే!”

సంచిలోని ఒక ఎండుచేపను తీసుకుని, అమ్మాయమ్మ ఏటి ఒడ్డుకు వచ్చింది.

“బయ్యన్నా, రారా... నీకిష్టమైనది తెచ్చాను రా... రారా... నాయనా... రారా...” పిలిచింది. మళ్ళీ మళ్ళీ పిలిచింది. చీకటిపడ్డ వరకూ పెరట్లో, అంగట, ఇంట్లో ప్రతిచోటా పిల్చింది.

“ఎక్కడ తప్పిపోయాడో, ఇంటికి తెచ్చి దిగబెట్టకుండా మధ్యను వదిలి వచ్చేశాను. ఆ పాడు బస్సు అంతసేపు రానిది, అప్పుడే వచ్చేయాలా? తోవలో ఏ కుక్క నొక్కేసిందో, ఏ పిల్లి దట్టేసుకుందో, ఆ రెండు ముంగిసలు వచ్చి దాని మీద పడ్డాయేమో?”

అంత చీకట్లో కూడా మొగుడితో కలిసి మర్రిచెట్టు వరకు కేకలు వేసుకుంటూ వెళ్ళింది. పిల్చింది. తిరిగివస్తూ ఎన్నో విధాలా పిలిచింది.

ఇంటికి వచ్చినా వంట లేదు. నోట్లో మంచినీరైనా పొయ్యలేదు. రాత్రి అంతా జాగారం చేసింది. మధ్యన లేచివచ్చి ఏటి ఒడ్డున, “నాయనా, బయ్యన్నా నీకు తీపితీపి మిఠాయి తెచ్చానురా! నీకిష్టమైన చేపలు తెచ్చానురా! రారా... నాయనా... రారా...” అని పిలిచింది.

తెల్లవారినా ఆ ఘల్లుఘల్లు శబ్దం వినబడలేదు. ఉదయమే తలకు స్నానం చేసి దేవుని గదిలో గంటసేపు కూర్చొని, ‘నా బయ్యన్నను నాకియ్య’మని మొక్కింది. నలుగురిచేత వెతికించింది. వాడు దొరికితే పూజలు, పునస్కారాలు చేస్తానంది.

రెండు రాత్రిళ్ళు గడిచిపోయాయి. బయ్యన్న జాడ తెలియలేదు. మూడో రాత్రి అటకపైన చప్పుడయింది. ఆత్రంగా లేచింది. అది ఘల్లుఘల్లుమన్న శబ్దం కాదు. వటుక్కు వటుక్కుమని శబ్దం వినిపిస్తోంది. లైటేసి చూస్తే అదివరలా బాహాటంగా ఒదిలేసిన ధాన్యాన్ని ఎలకలు పచనం చేస్తున్నాయి. వాటిని తోలాలన్న మనసైనా పుట్టలేదు.

ఇప్పటికీ చేపలు కొంటే ఇది బయ్యన్నకని ఒకటి ఉంచుతుంది. ఒక కాగితంపై ఆ బయ్యన్న బొమ్మ గీసి కత్తిరించి, మెడకు మూడు మువ్వలు కట్టి ఆ డొక్కులో ఉంచుతుంది. గాలికి కదిలితే ఆత్రంగా వెళ్ళి చూస్తుంది. పాలు కలిపిన అన్నం ఆ డొక్కులో పెడుతుంది. ఏ పిల్లులో పాలు కలిపిన అన్నం తింటే- అది బయ్యన్నే తిందేమోనని భ్రమపడుతుంది.

బయ్యన్న ఎక్కడో బతికి ఉన్నాడని, ఎవరో ఇనప గొలుసుతో కట్టేశారని, ఆ గొలుసు పటుకు పటుకుమని నమిలి, తెంపుకుని తనను చూడటానికి ఎప్పటికైనా వస్తాడని అమ్మాయమ్మ విశ్వాసం.

ఒకనాడు ఉదయం, పొద్దు కాస్త మీదికి లేచింది. భైరవయ్య ఇంట్లో నుంచి కోడిపిల్లలను వదిలాడు. పెట్టతో పిల్లలు ముందుకు కదిలి ఏటి ఒడ్డుకు వెళ్ళాయి. డాక్టరు ఇంటి ఎదర వీధి అది. చింతచెట్టు కింద ఏటి ఒడ్డులో రాలిన గింజలను కోళ్ళ పిల్లల సమూహం ఏరుకుంటున్నాయి. బయ్యన్న బాధ తప్పించుకున్నందుకు భైరవయ్య మురిసిపోతూ ఇంక కోళ్ళను ఆ రాత్రి నుంచి అరుగుల మీద విడిచిపెట్టినా భయం లేదనుకున్నాడు. అంత శ్రమపడి పిల్లలు వేసిన ఆ కోడిపిల్లల రంగులు వేపు చూసి మురిసిపోతున్నాడు. ఇందులో నిత్యం గుడ్లు పెట్టే పిల్లలు, కోళ్ళ పందానికి పనికివచ్చే పుంజులను బాగా తయారుచెయ్యగలనని ధీమాగా అనుకున్నాడు.

అలా అతను చూస్తుండగానే తన కళ్ళనే నమ్మనట్టు ఒక ముంగిస- బయ్యన్న కంటే మరీ పెద్దది, భీకరమైంది, లేత నలుపు రంగుది- కోడిపిల్లలపై ఉరుకుతూ ఒకదాన్ని పట్టుకుంది. భైరవయ్య పరుగెత్తి వెంట తరిమాడు. రాళ్ళలో ఏ బిలంలోనికి పోయిందో ఎంత వెదికినా దొరకలేదు. తిరిగి మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ కోళ్ళను యింటివైపు తోలుకుని పెళ్ళాంతో కోళ్ళను ముయ్యమని చెప్పాడు.

భైరవయ్య మంచం ఎక్కాడు. తను కఱ్ఱతో కొడుతుండగా, నేరం ఎరుగని అమాయకమైన బయ్యన్న ఎత్తిన మూతి, జోడించిన చేతులు అదో మానవుడుగా, 'నాదేం తప్పులేదు. నన్ను చంపకు... చంపకు...' అని, నిండా ప్రాణంపై ఆశతో గగ్గోలు పెట్టుతున్నట్లు తోచి, ఆ దృశ్యాన్ని మనస్సు నుంచి చెరుపుకోలేక నడుం జార్చేసుకున్నాడు.

*ఆంధ్రప్రభ వారపత్రిక, 12 నవంబర్ 1969*

## నేపథ్యం

మానవ సంబంధాల చిత్రణ

# ముంగిస కథ

***కథ మొలకెత్తడానికి బీజం ప్రధానం. ఈ కథలో నేనేం చెప్పదలచానో తేల్చుకోకపోతే కథను మొలకెత్తించి వృక్షంగా అల్లుకొనేటట్లు చెయ్యలేను. ఈ కథలో నేను అనుబంధాల గురించి చెప్పాలని నిర్ధారించుకొన్నాను. ఈ అనుబంధాలు ఎలా పెరుగుతాయి? ఒకరి అవసరం ఇంకొకరికి ఉండటం వలన. కుక్కలు, పిల్లులు, ఆవులు, గేదెలు ఎందుకు పెంచుతాం? వాటిని పెంచిన వారికి వాటివలన లాభం, ఉపకారం ఉండబట్టే కదా.***

**నా** ముంగిస కథ 12.11.1969 ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికలో ప్రచురింపబడినది. నేషనల్ బుక్‌ట్రస్టు, ఢిల్లీవారు వేసిన తెలుగు కథాసంకలనం *కథాభారతి*లో చోటు చేసుకొన్నది. భారతీయ భాషలన్నింటిలో అనువదింపబడినది. విశాలాంధ్ర ప్రచురణాలయం వారు వేసిన *బలివాడ కాంతారావు కథలు* (1994)లో ఇదొక కథ. భారతీయ జ్ఞానపీఠ్ ఢిల్లీవారు రిషీకేష్ కాపత్తర్ అన్న పేరుతో వేసిన నా కథల సంపుటిలో నకుర్ కథ అన్న పేరుతో ఈ కథ చేర్చబడినది. రెండు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యభాగంలో చోటు చేసుకొన్నది. ఇంగ్లీషు అనువాదం ఇంకా ప్రచురణ కావలసి ఉన్నది.

ఇంతగా ప్రాచుర్యం పొందిన ఈ కథ నేపథ్యం చెప్పదల్చుకొన్నాను. 1969 జనవరి నెలలో నాకు విశాఖపట్నం నుంచి నౌకాదళ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీకి బదిలీ అయ్యింది. ఒకసారి శ్రీకాకుళం జిల్లాలో వంశధార నది ఒడ్డున ఉన్న మా గ్రామం మడపాంలో నలుగుర్ని కలుసుకొందా మని వెళ్ళాను. మా ఇంటి పొరుగునే మా మేనమామ డాక్టరు కరకవలస అప్పారావు ఇల్లు. ఉదయం వాళ్ళ ఇంటికి వెళ్తే చిన్న గజ్జల సవ్వడి వినిపించింది. చూస్తే చిన్న ముంగిస పిల్ల. మెడకు గలగల్లాడే మువ్వల పట్టి. మా మేనత్త అమ్మాయమ్మ, 'బయ్యన్నా, నీకోసమే తినరా,' అని ఇడ్లీ ముక్క ఒక మూలపెడితే తింటోంది. దానివేపు అలా దీక్షగా చూస్తుంటే, 'ఏం బాబు! అలా చూస్తున్నారు. కొంపతీసి దీని మీద ఒక కథగాని రాసేస్తారా?' అంది. అంత వరకూ నాకు ఆ ఆలోచన రానేలేదు. 'ఈ ముంగిస పిల్ల మీద రాయడానికి ఏం

ఉంటుంది లెండి?' అనగానే నా రచనా పటిమకు ఒక సవాలుగా తోచింది. 'రాస్తానండి. రేపు పదిగంటలకు మీ బయ్యన్న మీద రాసిన కథ వినిపిస్తాను,' అన్నాను.

ఈ కథ నేను పూర్తిచేసి వినిపించడానికి నాకు దొరికిన సమయం సరిగ్గా ఇరవై ఐదు గంటలే. ఆ వేళంతా ఈ కథ గురించి ఆలోచిస్తూనే ఉన్నాను. మరుసటిరోజు ఉదయమే మా ఇంటి ప్రక్కనే ఉన్న వంశధార నదిలో స్వచ్ఛమైన పారే జలాలలో స్నానం చేసి, మా పెరటి లోగిలిలో ఖాళీగా ఉన్న ఒక గదిలో కుర్చీ వేసుకొని కథను పదిగంటలకు ముందే పూర్తిచేశాను.

సరిగ్గా పదిగంటలప్పుడు, 'మీ బయ్యన్న కథ వింటారా అత్తయ్యా,' అని వెళ్తే, ఆమె ఆశ్చర్యపోయి ఇంటిపని, వంటపని వదిలేసి, ఇరుగుపొరుగు ఆడవాళ్ళందర్నీ పోగు చేసి, 'మా బయ్యన్న మీద రాసిన కథను వినండి,' అని సంతోషంతో ఉరకలు వేసింది. నేను కథను పూర్తిగా చదివాక ఆమె చీరకొంగుతో కళ్ళు తుడుచుకొంటూ, 'నా బయ్యన్నకు ఇలాగ జరగకూడదు,' అంది. ఆ దృశ్యం చూశాక ఇది మంచికథ అయ్యే సూచన కనిపించింది.

ఈ కథ రాసేప్పటి నా ఆలోచనా సరళిని వివరించవలసి ఉన్నది.

1) కథ జరిగిన స్థలం కనిపిస్తూనే ఉన్నది. వంశధార నది ఒడ్డున ఇల్లు. అందులో పాత్రలు అప్పారావు, అమ్మాయమ్మ, ముంగిసపిల్ల. ఈ విషయం ఆలోచించే అవసరం పడలేదు.

2) కథ మొలకెత్తడానికి బీజం ప్రధానం. ఈ కథలో నేనేం చెప్పదలచానో తేల్చుకోకపోతే కథను మొలకెత్తించి వృక్షంగా అల్లుకొనేటట్లు చెయ్యలేను. ఈ కథలో నేను అనుబంధాల గురించి చెప్పాలని నిర్ధారించుకొన్నాను. ఈ అనుబంధాలు ఎలా పెరుగుతాయి? ఒకరి అవసరం ఇంకొకరికి ఉండటం వలన. కుక్కలు, పిల్లులు, ఆవులు, గేదెలు ఎందుకు పెంచుతాం? వాటిని పెంచిన వారికి వాటివలన లాభం, ఉపకారం ఉండబట్టే కదా. ఈ ముంగిసపిల్ల చూడముచ్చటవుతున్నా, ఎదిగితే దీనివలన వీరికి వచ్చే లాభం ఏమిటి? ఏ లాభం లేక అది యెలికలా ఇంట్లో వాళ్ళనే కరిస్తే? ముంగిసపిల్ల ఎదిగి పెద్దదై ఆ ఇంట్లో ఉన్న యెలికలు, పాముల బాధను పోగొట్టినట్లు చూపించాను. దానితో అన్నివిధాలా ఆదుకొన్న ఒక ఎదిగిన కొడుకులా బయ్యన్న ఈ ఒంటరి జంటకు కళ్ళ ఎదుట తిరుగుతున్నాడు. ముఖ్యంగా అమ్మాయమ్మకు ఈ ముంగిసతో అనుబంధం బాగా అతుక్కుపోయింది. ఒక కొడుకును ఆప్యాయతతో చూసుకొంటున్న తల్లిగా గోచరిస్తుంది.

3) పాములను, యెలకలను పారదోలిన ఈ ముంగిసలో ఏదో ఒక గొప్ప సుగుణం చూపించాలి. మనుషులను నమ్ముతుంది. మనుషుల కేక ప్రేమమయం అనుకొని, అనుమానించ కుండా ఆ కేక వినగానే ఏటి ఒడ్డున రాళ్ళసందులో ఉన్న తన బిలం నుంచి వస్తుంది. తన కోడి పిల్లలను ఈ ముంగిసే తినేస్తోందన్న అనుమానం, తన భాగహరియైన డాక్టర్ తనకన్నా ఆర్థికంగా ఉన్నతంగా ఉన్నాడన్న అసూయ. ఈ దంపతులు లేనప్పుడు భైరవయ్య ముంగిసను చేప ఇస్తాను అని పిలిచి మరీ చంపుతాడు. భైరవయ్య పాత్ర, ముంగిసను చంపిన దృశ్యం ఈ కథలో చెప్పదల్చు కొన్న విషయాన్ని స్పష్టం చెయ్యడానికి సృష్టించినవి.


4) కనికరించని దుర్మార్గుడ్ని అక్కడకు అలా విడిచిపెట్టేస్తే కథలో సామాజిక ప్రయోజనం దెబ్బతింటుంది. చెడ్డవాళ్ళు చేసే అఘాయిత్యాలు సమర్థించినట్లవుతుంది. కథలో ఈ ముంగిసను చంపిన భైరవయ్య కోడిపిల్లలు చస్తూనే ఉంటాయ్. అసలు మొదట్నుంచి కోడిపిల్లలను మరిగి నది ఇంకో ముంగిస. బయ్యన్న కాదు. అది తెలుసుకొన్న భైరవయ్య మంచమెక్కాడు. తన కర్రతో కొడుతుండగా నేరం చేయని అమాయకమైన బయ్యన్న ఎత్తైన మూతి, జోడించిన ముందు కాళ్ళు, అదో మానవునిగా, 'నాదేం తప్పు లేదు. నన్ను చంపకు, చంపకు...' అని నిండు ప్రాణంపై ఆశతో గగ్గోలు పెడుతున్నట్లు తోచి, ఆ దృశ్యాన్ని మనసు నుంచి చెరుపుకోలేక నడుం జారేసు కొన్నాడు.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 28 డిసెంబర్ 1997*

14

# మెరుగు

## బి.యస్. రాములు



*బి.యస్. రాములు 23 ఆగస్ట్ 1949లో కరీంనగర్ జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'జగిత్యాల కథ' 1968లో బాలమిత్రలో అచ్చయింది. దాదాపు 80 కథలు, కొన్ని నవలలతోపాటు, వివిధ సాహిత్య, సామాజిక, తాత్విక అంశాలపై రచనలు చేశారు. 7 కథాసంపుటాలు, నవలలతోపాటు మొత్తం 74 గ్రంథాలు ప్రచురించారు. వీరికి తెలుగు విశ్వ విద్యాలయ పురస్కారంతో పాటు వివిధ సాహిత్య పురస్కారాలు లభించాయి. విశాల సాహిత్య అకాడెమి స్థాపించి, పుస్తకాలు ప్రచురిస్తున్నారు.*

**చిరునామా**
*201, సులేఖ గోల్డెన్ టవర్స్,*
*2-2-186/53, ఆర్.కె. నగర్, బాగ్*
*అంబర్‌పేట్, హైదరాబాద్-500 013*
*Ph.: 93910 36987*

"నీ ప్రశ్న స్పష్టంగానే ఉంది. జవాబే నా దగ్గర స్పష్టంగా లేదు. నీ జీవితాన్ని నువ్వు నిర్ణయించుకోవడమే సబబు. అందుకని జవాబు తెల్సినా చెప్పడం భావ్యం కాదు. నా ఎరుకలో యిలాంటి కొన్ని చూశాను. వాటిని నీ ముందుంచుతాను. అన్నీ ఆలోచించి నీ నిర్ణయాలు నీవు తీసుకోవడమే మంచిది. ఓడిపోతే ఎవరిమీదా నెట్టి వేయకుండా దాన్ని అధిగమించి తిరిగి జీవితాన్ని గెల్చుకోవడం అనేది అది నీ నిర్ణయమే అని నీకు ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడే సాధ్యం. 'మెరుగు' (తొలిచినుకు) పడగానే విత్తనాలేస్తే వర్షాల్లేక ఎండిపోవచ్చు.

ప్రతిసారీ నీవు చలం గురించిన చర్చ చేయడం మానుకోవాలి. చలం కన్నా సమాజం ఎంతో ముందుకు సాగిపోయింది. ప్రద్దానికీ చలం అని పట్టుకు కూర్చుంటే అది నీ సొంత నిర్ణయం, సొంత అనుభవం ఎలా అవుతుంది. అది ఒకరకంగా యితరులపై ఆధారపడే బానిస మనస్తత్వం అవుతుంది.

లక్ష్మీ! వసంతమేఘాలు వసంతంలో మేఘ ఘర్జనలు చూపులకు అందంగానే వుంటాయి. ఎంత ఎండ కొడ్తే అంతగా వెండి అంచుల్తో కాంతులీనుతూ నలుపు తెలుపుల మిశ్రమాల్తో ఆహ్లాదకరంగానే ఉంటాయి. కాని

వసంతకాలంలో వర్షం కురిస్తే ప్రమాదం. వడగళ్ళు- గాలి దుమారంలో పంటలు కోతలకొచ్చిన వన్నీ రాలిపోతాయి. వసంతంలో వానల్ని చెడగొట్టు వానలంటారు.

లక్ష్మీ! నీ హృదయంలో వసంతమేఘం నిండా ఆవరించుకొని ఉంది. ఆకురాల్చిన శిశిరం లో నేనున్నాను. నేను చెప్పేది ఒకటైతే నీకు అర్థం అయ్యేది మరొకటి కావచ్చు. మనిద్దరం వేర్వేరు పరిస్థితుల్లో ఉండడమే కారణం. నాకు వసంతాల మీద ఆసక్తి పోయింది. నాకు వర్ష రుతువే అన్ని రుతువులకు తల్లి అనిపిస్తుంది.

నాది పాతతరం. నీది కొత్తతరం. నీకూ నాకూ మధ్య మరికొన్ని తరాల అంతరం ఉంది. నీవు ఆడపిల్లవు. నేను మగవాడిగా పెరిగినవాన్ని. అందువల్ల కూడా నీ నా ఆలోచనల తీరులో ఎంతో తేడా ఉంటుంది. ఛ. నీవు ఆడపిల్లవు అన్నమాట నిన్ను కించపరచడానికి అన్నట్టు ముడు చుకుపోయావేం. అంటే ఆడపిల్లవు అనే మాటకు నీవు కూడా పాతకాలపు అర్థాన్నే స్వీకరిస్తున్నావన్న మాట. ఆ లెక్కన ఆడవాళ్ళ పట్ల నీ దృక్పథంలో కొత్తదనం ఏమీ లేదు. కాకపోతే నేనా ఆడపిల్లల్లో చేరే ఆడపిల్లను కాను అని అనుకుంటున్నావు.

మొత్తం ఆడపిల్లలు వేరు నేనువేరు అని నీవు ఎందుకనుకుంటున్నావు. తద్వారా మొత్తం ఆడవాళ్ళల్లోంచి నీవు ఒంటరిదానిలా విడివడిపోవడం లేదా... కనుక నీ పోరాటం నీకు సంబం ధించిన ఒంటరి పోరాటం. సమాజం నీవెంట వస్తుందనే విశ్వాసం అటుంచి మొత్తం ఆడపిల్లలు నాలానే ఆలోచిస్తారు చూడు అనే విశ్వాసమైనా నీలో లేదు. ఈ విశ్వాసం లేని నీ తెగువ ద్వారా నీవు ఓడిపోవడమే నీకు సంతోషం అని కోరుకున్నట్టవడం లేదా... నీకన్నా రంగవ్వ ఎంతో నయం...

*

నీవేసిన ప్రశ్న కొత్తది కాదు. అది సిద్ధాంత చట్రాల్లో యిమడదు. అందుకని అన్ని సిద్ధాం తాలూ దాన్ని వదిలేస్తున్నాయి. అందుకే ఎందరో ఆ సమస్యని ఎదుర్కొన్నా ప్రతిసారీ కొత్తగా యిదివరకెన్నడూ ఎదుర్కోని సమస్యలా సమాజం ఆశ్చర్యం నటిస్తున్నది. అంటే ఆ చరిత్రను, సంస్కృతిని సమాజం రికార్డు చేయదల్చుకోలేదు. అందుకు నా జీవితమే సాక్ష్యం. రంగవ్వ జీవితమే సాక్ష్యం....

....నేను టీచర్‌గా అపాయింటయి ధర్మపురి రూట్లో ఓ పల్లెలోని స్కూల్లో చేరిన కాలంలో అంతా దొరలదే రాజ్యం. నేను పేరుకే టీచర్నిగానీ ఆచరణలో ఆ వూరి రాజేశ్వరావు దొరగారికి సర్కార్ జీతం తీసుకుంటూ ఉచితంగా పనిచేసే సదువుకున్న పాలేర్ని. కొంచెం అందంగా చెప్పా లంటే దొరగారికి పర్సనల్ అసిస్టెంటుని. దొర వెంట తిరగడం. దొర సూటుకేసులు మోయడం... దొర చెప్పిందానికి తల ఊపడం... దొర అడిగినపుడు రెండు రకాల తీర్పులు చెప్పి ఏది చేసినా రైటే అని దొరకు అన్పించే విధంగా జాగ్రత్తగా, మసులుకోవడం.... దొర వెంట ఊర్లు తిరగడం నా పని. నాక్కూడా తెలియకుండా చేసుకునే పనులున్నపుడే దొర నన్ను వదిలేసేవాడు. ఆ తీరిక సమయాల్లోనే నేను స్కూలు నడిపేవాణ్ణి. ఈదుల్లో (ఈతవనంలో) తాగుకుంటూ లోకాభి రామా యణం సాగించేవాన్ని. అందుకే ఆ వూర్లో ఎవరికీ చదువులు అబ్బలేదు. దొరకు కావాల్సింది కూడా అదే.

రాజేశ్వరరావు దొర చాలా మంచివాడు. ఏమాటకామాటే చెప్పుకోవాలి. తాను ఏది తింటాడో నాకదే పెట్టించేవాడు. కరీంనగర్‌కు పని మీద పోయినపుడు లాడ్జిలో యిద్దరం ఒకే గదిలో గడిపేవారం. జగిత్యాలకు వచ్చినపుడు కూడా ఎక్కడా నా గౌరవం కించపరిచేవాడు కాదు.

ఓసారి అడవిపంది షికారులో పడితే రెండు కిలోల కూర కట్టించి, 'యింటికి తీసుకుపో సారూ,' అన్నాడు. దాన్ని మూడు రోజులు తిన్నాము.

వేసవిలో దొర పొద్దున్నే 'ఈత' నీరా తెప్పించేవాడు. దొరకు అర్ధరాత్రి సైతం ఒక తోడు ఉండాలి. నీరా తాగుతూ షికారు మాంసం తొక్కు నంజుకు తినేవాళ్ళం. నీకు తెలియదను కుంటాను. ఆ కాలంలో దొరల ఇళ్ళల్లో అడవిపంది కూర, మేక మాంసం, జింక మాంసంతో తొక్కులు (పచ్చళ్ళు) పెట్టేవాళ్ళు. ఆ తొక్కులు ఆర్నెల్లదాకా కమ్మగా యిప్పుడే వండిన ఫ్రై మాంసం లా ఉండేవి... ఆ తొక్కుల రుచేవేరు.

దొరకు ఇంట్లో మూడు పడక గదులుండేవి. ఒకటి దొర్సానితో ఉండే పడక గది. రెండోది ఏకాంత విశ్రాంతి గది. ఇంకోటి వరండాను ఆనుకొని ఉంటుంది. అది అధికారులో, బంధు మిత్రులో వచ్చినపుడు వారితో మాట్లాడుతూ వారితోనే పడుకుని మర్యాద చేసినట్టుగా ఉండే పడకగది. ఆ పడకగది అప్పుడప్పుడు అధికారులకు బెడ్‌రూంగా మారేది. వాళ్ళతో దొరకు ఎంతో పని ఉంటే తప్ప ఆ మర్యాద జరగదు. ఆ గది కేటాయించాడంటే దొర కల్లూ, కూర, పిల్లా అన్నీ ఏర్పాటు చేస్తున్నాడని అర్థం.

దొరకు యింకో పడకగది ఉండేది. అది గొడ్లకొట్టంలో ఉండే తౌడు ధాన్యంరూం. సాధార ణంగా అది పగలు మాత్రమే బెడ్‌రూంగా ఉపయోగపడేది. ఆ వూళ్ళో రంగవ్వ అనే ఆవిడ మాత్రం దొర ఎప్పుడు పిలిచినా వచ్చేది. దొర్సాని పడకగది తప్ప మిగతా పడకగదులన్నీ ఆమెకు తెలుసు....

ఆమె దొరను కలిసినప్పుడల్లా వాళ్ళిద్దర్ని ఏకాంతంలో వదిలి... నా పనిపై నేను వెళ్ళడం చూసి ఆమెకు నా స్థితి జాలే కలిగిందో.... ప్రేమే కలిగిందో.... తెలియదు. దొరకు మా ఇద్దరి సంబంధం తెల్సోలేదో చెప్పలేను. నేను భయపడుతుంటే మన గురించి దొరకు తెలుసు. ఏం కాదు అని ధైర్యం చెప్పేది రంగవ్వ. అప్పటికి నాకు ఒక కొడుకు. ఆ వూరికి తీసుకవచ్చి కాపురం పెడదామంటే దొర నా భార్యపై ఎక్కడ కన్నేస్తాడో అనే భయంతోనే బతికాను. జగిత్యాల్లో మా యింటికి దొర వచ్చినపుడు కూడా నా భార్య కనపడకుండా జాగ్రత్తలు తీసుకునేవాణ్ణి. రంగవ్వ ఓ విషయం చెప్పాక నా భయం మరింత ఎక్కువైంది.

రంగవ్వలాగే దొరకు అంతకుముందు ఎవరో బుచ్చవ్వ అలవాటట. అయితే బుచ్చవ్వ మొదట బాగా బెట్టు చేసిందట. ఏదో పని ఉందని అత్తమామలకే చెప్పి పగలే పిలిపించు కున్నాడట. మూడు నాలుగుసార్లు అలాగే చేశాడట. ఆ తర్వాత బుచ్చవ్వ దొరతోనేతప్ప మొగనితో సంసారం చేయనంది. అత్తమామలు భర్త తిరిగి దొరకే విన్నవించుకున్నారు. నన్ను చంపినా సరేగానీ దొర ఉంచుకున్న దానిగానే బతుకుతా అని తెగేసి చెప్పింది. ఇద్దరు పిల్లల్ని అత్తగారికే వదిలేసింది. తర్వాత చాలాకాలానికి బావిలో శవమై తేలింది. దొరనే చంపించాడని కొందరన్నారు. నిజానికి దొరకు చంపించాల్సిన అవసరం లేదు. ఆమె భర్తే చంపి బావిలో వేశాడన్నారు. ఆమె చచ్చిపోయిం దన్నారు. ఏదీ యిదమిత్థంగా తెలియదు. దొరవద్ద ఉండే సుఖం అత్తగారింట్లో ఎక్కడుంటుంది. ఒకటే గుడిసెలో అందరు కలిసి పడుకోవాలి. ఆమె దొరతో పోల్చితే తన భర్త సూపుకు ఆనేవాడే కాదు. దొర యింట్లో ఏ పడకగది అయినా ఎంతో విశ్రాంతి. దొర తినేది, తాగేది ఆమెక్కూడా పెట్టేవాడు. దొర పట్టెమంచంలోని సుఖం యింటికాడ కుక్కి నులకమంచంలో ఎలా ఉంటుంది. దొర పిలిచినప్పుడల్లా ఆమెకు పండగ వచ్చినంత సంబరంగా ఉండేది. అట్లాగే తయారయ్యేది. బహుశా ఆమె జీవితంలో దొరతో గడిపిన క్షణాలే అన్నిటికన్నా మధురమైనవేమో. బుచ్చవ్వ భర్త మరో పెళ్ళి చేసుకొని పిల్లల్తో సహా ఆ ఊరు వదిలిపోయాడు. ఊరు వదిలేసి పోయాక నాలుగేళ్ళకు

బుచ్చవ్వ చనిపోవడంతో అతన్ని బహిరంగంగా ఎవరూ తప్పుపట్టలేకపోయారు. ఎవరైనా చేయి వేయబోతే ఆధారం లేని బతుకాయె అని ఆమె ఆత్మహత్య చేసుకుందో....

అప్పటికి దొర ధోవతులే కట్టేవాడు. రంగవ్వ నేను ప్యాంటు షర్టులో అందంగా ఉన్నానని ప్రేమించిందట... రంగవ్వ భర్త రాజయ్యకు రంగవ్వ విషయం తెలుసు. బహుశా నా విషయం కూడా తెలుసు. అయినా రంగవ్వనుగానీ, నన్నుగానీ ఎవర్నీ ఏమీ అనలేకపోయేవాడు. దొర దగ్గర రెండెకరాలు కౌలుకు తీసుకున్న సేద్యగాడు రాజయ్య. ఆమె యింత వండి పెట్టుడే మహా భాగ్యం అన్నట్టుగా ఉండేవాడు. అప్పుడప్పుడు కొన్ని సియ్యెలు, కొంచెం కల్లు మొగుడికోసం దొర యింటి నుండి దొరకు తెలియకుండా మిగిల్చి తీసుకుపోయేది. రాజయ్య అప్పుడప్పుడు రంగవ్వ మీదికి లొల్లి చేసేవాడు. రంగవ్వ నీకు ఏం తక్కువ చేశానని నిలదీసేది. నిజానికి రంగవ్వ వ్యక్తిత్వంలో ఏ లోటూ లేదు.

రంగవ్వది నిండు హృదయం. దొరనైనా, నన్నయినా, రాజయ్యనైనా హృదయపూర్వకంగా ప్రేమించేది. ఎవరైనా అధికారులు వచ్చినపుడు పంపితే వారితోనూ ఎంతో ప్రేమగా ఉండేది. వాళ్ళు ఆమెను మరీ మరీ గుర్తు చేసుకునేవారు. నేను తప్పు చేస్తున్నాను అనే భావన ఆమెలో ఏ కోశానా కనపడేది కాదు. నా బతుకు ఇట్లా కాలిందన్న నిరాశ కూడా ఆమెలో నేనేనాడూ చూడలేదు. అదంతా ఎంతో సహజమైన సంగతిలా, ఉత్సాహంగానే ఉండేది.

బోగంవాళ్ళు అని ఒక కులం ఉండేది. వాళ్ళను ఎప్పుడూ ఎవరో ఒకరు ఇట్లాగే ఉంచుకునేవాళ్ళు. ఉంచుకున్న వాళ్ళ ప్రేమను గెల్చుకొని కొంత భూమి, కొంత బంగారం వారి పిల్లల కోసం సంపాదించుకునేవారు. ఈ ఉంచుకోవడం సంస్కృతి క్రమంగా నామోషీగా మారింది. ఇప్పుడు మన ఏరియాలో బోగం కులమే లేదు. వాళ్ళంతా ఎల్లాపు మున్నూరుకాపు, పద్మశాలి కులాల్లో కలిసిపోయారు. ఉంచుకొన్న దొరలను బతిమాలితే వాళ్ళకు భూముల్తోపాటు పట్వారి దగ్గర గుమాస్తా, పోలీసు పటేలు వంటి చిన్నపనుల్లో పెట్టేవారు. దొరలకు తెలుసు. ఎంతైనా ఆ ఉంచుకున్నామెకు పుట్టిన పిల్లలు తన సంతానమే అని, కాని ఆ పిల్లల్ని నాన్నా అని పిలువనిచ్చేవారు కాదు. దొరా అనే పిలిపించుకునేవారు. బోగంవాళ్ళ పిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలనుకున్నప్పుడు వేరే కులంలో పేదలెవరో ముందుకు వచ్చేవారు. కులానికంతా కల్లు తాగిస్తే బోగంవాళ్ళను వాళ్ళ కులంలో కలుపుకున్నారు. ఇప్పుడీ యాభై ఏండ్లలో ఎవరు బోగం కులంలకెల్లి వచ్చి కలిశారో ఆ కులాల్లో తెలుసుకోలేం. అట్లా ఆ కులంలో కలిసిపోయారు. కొంతకాలం వాళ్ళను కొత్తకాపులు, కొత్త శాలీలు అని పిలిచేవారు. ఆ తర్వాత అందర్లో పాతబడిపోయేవారు.

రంగవ్వ బోగం కులంలో పుట్టలేదు. ఆమె కులంపేరు చెప్పను. చెపితే చాలా సమస్యలు ఎదురవుతాయి. రంగవ్వలాంటి వాళ్ళు అన్ని కులాల్లోనూ ఉండేవారు. రంగవ్వ ఏ కులంలో పుడ్తేనేమి. బోగం కులంలో పుట్టినంత సంస్కారవంతంగా ఉండేది. 'కన్యాశుల్కం' నాటకంలోని మధురవాణి నీకు తెలుసనుకుంటాను. బౌద్ధభిక్షువు, మాజీ వేశ్య ఆమ్రపాలి తెలుసనుకుంటాను. వాళ్ళంతా ఉన్నవాళ్ళ ప్రాపకంలో సంస్కారం అబ్బినవాళ్ళు. ప్రేమ పూజారుల పూజలందుకున్నారు. కాని రంగవ్వకు చదువురాదు. వాళ్ళలా ఏ కళలోనూ ప్రవేశం లేదు. కొన్ని జానపద పాటలు మాత్రం చక్కగ పాడేది.

లక్ష్మీ... నీవు ఆశ్చర్యపడనంటే ఒక మాట చెప్తాను. రంగవ్వకు యిద్దరు పిల్లలు. మరో యిద్దరు పుట్టిపోయారు. ఆమె కనీసం ముగ్గురితో సంసారం చేసేది. భర్తతో.... దొరతో... నాతో.... ఆ తర్వాత దొర ఎవరి దగ్గరికి పంపితే ఆ అధికారులతో కూడా చక్కగా ఉండేది. ఇవన్నీ తెల్సీ...

రంగవ్వ నాకు భార్య అయి ఉంటే ఎంత బాగుండేది.... సమాజం అంగీకరిస్తే నేనామెను రెండో పెళ్ళి చేసుకోవాలని మనస్సు ఎంతగా పరితపించేదో.... అట్లా అని ఆమె గొప్ప అందగత్తె ఏమీ కాదు. నలుపుదేలిన ఛాయతో పెయ్యంతా చైతన్యంలా వెలిగేది. ఆమె వ్యక్తిత్వమే నన్ను బాగా ఆకర్షించింది.

బహుశా రాజయ్యక్కూడా రంగవ్వ యిందుకే నచ్చిందేమో.... అందుకే అతను భార్యలా చెడుతోవలు తొక్కలేదు. లేక ఆ చెడుతోవలు అతనికి రంగవ్వంత సుఖాన్నివ్వక బుద్ధిమంతు డయ్యాడో. దొరకు కూడా నిజం చెప్పాలంటే... దొర్సాని మీదకన్నా రంగవ్వ మీదే ప్రేమ ఎక్కువ. రాజేశ్వరరావు దొరలో రెండు రకాల వ్యక్తిత్వాలుండేవి. ఒకటి దొరగా క్రూరంగా సాగించుకునే వ్యక్తిత్వం. మరోటి మనిషిగా స్పందించే ఉన్నతమైన వ్యక్తిత్వం. రంగవ్వ విషయంలో మనస్సులో ఉన్నతమైన వ్యక్తిగా ప్రవర్తించేవాడు.

రంగవ్వ మీద దొర చూపే ప్రేమకు దొర్సాని రత్నవ్వ కూడా ఎంతో ఈర్ష్యపడేది. ఈర్ష్యతో సూటిపోటీ మాటలనేది. దొర బేఖాతర్ చేశాడు. మళ్ళీ అరిస్తే సగం భూమి దానికే రాసిస్తా... అప్పుడు అది కూడా దొర్సానే అవుతుంది అని బెదిరించేవాడు. కొన్నాళ్ళు రత్నవ్వ తల్లిగారింటికి వెళ్ళిపోయింది. దానివల్ల ఉపయోగం లేకపోయింది. రత్నవ్వ తల్లిగారింటికి వెళ్ళిపోతే రంగవ్వే ఆ యింటి దొర్సాని అయిపోయింది. ఇలా లాభంలేదని రత్నవ్వ మళ్ళీ తానే వచ్చేసింది. ఆమెకు నా మీద ప్రేమ ఉండి నాతో సంబంధం పెట్టుకుందనుకోను. ఒక ఈర్ష్యతో నా దగ్గరికి చేరింది. నేను భయపడితే నన్ను గుంజినావని దొరకు చెప్తే నీ గతి ఏమవుతుందో ఆలోచించుకో అని బెదిరించింది. అట్లా దొర్సాని నన్ను చేరదీసింది. దొరకు దొర్సాని అంటే ఎందుకంత విముఖతో నాకు కొద్దికాలంలోనే తెలిసిపోయింది. నా భార్యలో ఉండే లోపమే దొర్సానిలోనూ ఉంది. నేను చొరవ తీసుకుని వీలువెంట చెప్పుకుంటూ వచ్చాను. ఆ తర్వాత రెండేళ్ళకుగానీ దొర్సాని తనను తాను దొరకనుకూలంగా మార్చుకోలేకపోయింది.

ఉపాయమైతే చెప్పానుగానీ అది రంగవ్వ పాలిట కష్టాలు తెస్తుందని నాకు తెలియలేదు. దొర రంగవ్వ మీద మునుపటంత ఉత్సాహం చూపడం మానేశాడు. మనిషికి జయించేదాకా ఉండే ఉత్సాహం జయించాక ఉండదేమో.... ఆమె ప్రేమను గెల్చుకోవాలి అనుకున్నప్పుడు ఉండే ఉత్సాహం ఆమెను గెల్చుకుని సంసారం చేస్తున్నపుడు ఉండదేమో. ఆ ప్రేమ నిలువాలంటే యింకా ఎంతో హృదయ సంస్కారం అవసరం అనుకుంటాను. నేను నిన్ను జయించాను అన్న భావన ఉన్నంతకాలం ప్రేమించి పెళ్ళి చేసుకున్న వారి మధ్య పెళ్ళీ, సంసారం సజావుగా సాగవేమో. ఏమంటే నేను జయించాను అనుకోవడంలో తన ఆధిక్యతను ప్రేమించుకోవడమే ఉంది కానీ ప్రేయసిని ప్రేమించడం లేదు. ప్రేమ పెళ్ళిళ్ళు విఫలం కావడానికి కారణం బహుశా వాళ్ళు ఎదుటివారిని కాకుండా తన ఆధిక్యతని ప్రేమించడంలో భాగంగా ప్రేమించారని చెప్ప వచ్చు. నిజమైన ప్రేమ నేను దాన్ని ప్రేమించానురా అని డంబాలు కొట్టదు. నువ్వు నీ స్నేహితుల దగ్గర దాన్ని బుట్టలో వేసుకున్నానని డంబాలు కొడ్తే నీవు ప్రేమించింది ఆమెను కాదు - నీ ఆధిపత్యాన్ని ప్రేమిస్తున్నావని అర్థం.

బహుశా అందుకేనేమో రాజేశ్వరరావు దొర 'రంగవ్వ' గురించి ఎక్కడా డంబాలు కొట్టేవాడు కాదు. ఎవరైనా రంగవ్వ గూర్చి చెడుగా మాట్లాడితే ఊరుకునేవాడు కాదు. నాక్కూడా రంగవ్వ నాకు అలవాటు అని ఎక్కడా ఎవరితోనూ డంబాలు చెప్పుకోవాలనిపించలేదు. అలా చెప్పు కోవడం ఆమెను అవమానిస్తున్నట్టే అని మనస్సు పీకేది.... ఆమె గురించి చెప్పడం నీకే మొదటిసారి.

ప్రేమను చెప్పుకోవడంలో నిర్వీర్యమై పోతుందనుకుంటాను. రాజయ్య రంగవ్వను ఎంత ప్రేమిం చాడో.... అందుకే తర్వాతర్వాత అంతగా ఆమెతో కలిసిపోయాడు. ఆమె గురించి ఎక్కడా నీచంగా మాట్లాడేవాడు కాదు. ఎవరన్నా మాట్లాడితే ఊరుకునేవాడు కాదు.

రంగవ్వ నా జీవితం ఎదుగుదలకు ఎంత ఉత్తేజాన్నిచ్చిందో... గీ పల్లెటూర్లల్లో ఉండాల్సి నోనివి కాదు సారూ... నువ్వు ఉత్త అమాయకునివి. నువ్వు బాగా సదువుకొని దొర తమ్మని లెక్క పట్నంలో పంతులువు ఎందుకు కావద్దు అని అడుగుతుండేది. నిజానికి నేను ఆమెకు ఏమీకాను. ఆమెకు ఆర్థికంగా నేను సగపెట్టిందేమీ లేదు. కాని నాపట్ల ఆమెకు ఎంతో ప్రేమ. ఆమెకు నా భార్యంటే కూడా ఎంతో ప్రేమ. మక్కంకులు, జొన్న పిసికిల్లు, అనుపకాయ.... ఇట్లా ఏ సీజన్లో పండేవి ఆ సీజనులో ఇంటికి తీసుకవచ్చి యిచ్చేది, లేదా మొగనితోని పంపేది..... తన కొడుక్కు సదువు చెప్తున్నాననే. అందుకు అర్సుకోవాలనీ....

నిజంగా బడిలో చదువు చెప్పలేకపోతున్నందుకు ఎంతో బాధగా ఉండేది. పేదపిల్లలు ఎదగకుండా అయిపోతున్నారని బాధగా ఉండేది. కానీ దొరను కాదనే ధైర్యం నాకు లేదు. అలా దొరను కాదని ఆ ఊళ్ళో ఉద్యోగం చేయడమూ సాధ్యంకాదు. రంగవ్వ తన బతుకుతో రాజీపడి పోయింది. నేను జగిత్యాల్లో పుట్టి పల్లెటూరి జీవితానికి రాజీపడ్డం కోసం ప్రయత్నిస్తున్నవాడిని. అయినా ఎక్కడో మనస్సు ఎదురుతిరిగేది. రంగవ్వలా పూర్తిగా రాజీపడలేకపోయాను. కొన్నాళ్ళకు ఆ వూరు నుండి బదిలీ చేయించుకున్నాను. నాకుగా నేనే బదిలీ చేయించుకున్నానని దొరకు తెల్సినా ప్రమాదమే... ఇక్కడ నీకేం తక్కువైందని అడుగుతాడు. తనను అవమానించినట్టే ఫీలవు తాడు... తలుసుకుంటే నా ఉద్యోగాన్నే పీకేయించగలడు. అందుకని లాంగ్ స్టాండింగ్‌లో అనుకో కుండా బదిలీ చేశారని దొరను నమ్మించాను.

అయినా దొర సహచర్యం వదలలేదు. ఏదో పనిమీద దొర నన్ను తీసుకెళ్తుండేవాడు... అట్లా రత్నవ్వతో కూడా నా సంబంధం కొనసాగుతూనే ఉండేది. రంగవ్వను కలిస్తే నాలో ఏదో శక్తి ప్రవహిస్తూ ఉండేది... మా సంబంధాల్ని వ్యభిచారం అని ఎవరూ తప్పుపట్టేవారు కాదు. అసలు అదొక సమస్య అని చర్చించేవారే కాదు. ఆ పల్లె అదంతా ఎంతో సహజం అన్నట్టుగానే ప్రవర్తించేది. ఈ విషయం నన్ను బాగా ఆశ్చర్యపరిచేది. ఆ వూళ్ళో యిలాంటి ఎన్ని అక్రమ సంబంధాలో.... అక్రమసంబంధాలు లేనివాళ్ళు ఆ వూళ్ళో ఎవరూ లేరనే చెప్తాను. అందుకే నీకా ఊరు పేరు చెప్పడం లేదు. అప్పటి దృష్టివేరు. అప్పటి సమాజం వేరు. అప్పుడు వీటిని ఎవరూ తప్పుగా భావించుకోలేదు.

వెనుకటి కాలంలో యిన్ని పట్టింపులు ఉండేవి కావు. ఈ సిన్మాలంటూ వచ్చి తాళిబొట్టు, పాతివ్రత్యం మహాగొప్పవి అని నేర్పేదాకా ఎవరూ అంతగా పట్టించుకోలేదు. పూర్వం పల్లెల్లో పురాణాల్ని వీధి నాటకాలుగా వేసేవారు. వాళ్ళు కూడా బోలెడు సెక్సు జోక్సు వేసేవారు. కాకపోతే అవి దేవతల పేరుమీద కొనసాగేవి. ఓసారి భలే విషయం జరిగింది. గుర్తొస్తే యిప్పటికీ నవ్వొ స్తున్నది. సంచార వీధి భాగోతాలోల్లు ఓ రోజు ప్రమీలార్జునీయం వేశారు. ప్రమీల కథను పల్లెటూర్లో అల్లిరాణి కథ అని వ్యవహరిస్తారు. అల్లిరాణి వేషం వేసినామెను, అదే వేషంలో ఎలాగైన తనక్కావా లని రాజేశ్వరరావు దొర పట్టుపట్టాడు. ఎలాగలా పడకగదిలోకి పంపబడింది అల్లిరాణి. బాగా తాగి దొర మస్తు నిషాలో ఉన్నాడు. చీర విప్పి అదీ యిదీ ముట్టుకునేసరికి అల్లిరాణికి కూడా మనసు ఆగలేదట. దొరనే తగుల్కొని ఊర్లో ఉంటే ఏం చేస్తాడో అని భయంతో అదే రాత్రి నాటకాల టీంవాళ్ళు పారిపోయారు. అసలు విషయం ఏమంటే అల్లిరాణి వేషం వేసింది మగవాడు.

నవయువకుడు. అట్లా అల్లిరాణి వృత్తాంతం ఆ ఊళ్ళో ఎన్ని తరాలు నానిందో లెక్కలేదు. మళ్ళీ ఎక్కడా దొర చెవిన పడేది కాదు.

రాజేశ్వరరావు దొర వాళ్ళ వూరికి బస్సు రాకుండా చేశాడు. రోడ్డు పడకుండా చేశాడు. తన యింటికి మాత్రం కరెంటు, టెలిఫోన్ వచ్చేటట్టు చేసుకున్నాడు. బడి కూడా రాకుండా చేశాడు గానీ ఎందుకో పూర్తిగా అడ్డుకోలేకపోయాడు. బహుశా ఆ సార్లు తనకే ఉపయోగపడతారనుకుని ఉంటాడు. అట్లా నలుగురు పంతుళ్ళున్న స్కూలుగా ఎదిగింది. ఆసరికి సంగం పెద్ద లింగారెడ్డి దొర తర్వాత దొరతీరు పటాటోపంలోకి వచ్చాడు. లింగారెడ్డి రంగవ్వ మీద కన్నేసి ఎంతకాలం నుండి చూస్తున్నాడో. దొర పెత్తనం పోవడంతో ధైర్యం పుంజుకున్నాడు. రంగవ్వ మీద ఏదో పంచాయతీ పెట్టబోయాడు. ఆ విషయం తెలిసి రంగవ్వ మంచి చీర కట్టుకొని లింగారెడ్డి మంచెకాడికే పోయింది. లింగారెడ్డి ఆమె అంత తొందరగా లొంగిపోతుందని ఊహించలేదు. తబ్బిబ్బయిపోయాడు. అయితే అతని కుతి తీరిం తర్వాత మా చెడ్డమాట అని వచ్చేసింది. ఏమని అన్నదో తెల్సా లక్ష్మీ... నువ్వు నిజంగా మొగోనివేనా... గింతేనా నీకు చాతనయ్యేది... యింకెంతో చేస్తావనుకుని ఆశపడ్డా... లింగారెడ్డీ... ఒక మాట గుర్తుంచుకో... నేను లంజెను అనుకునేవు... నాకూ మనసుంది. నువ్వు నిజంగా నన్ను యిష్టపడితే నాకేమీ ఉభ్యంతరం లేదు... కాని నన్ను లొంగదీసుకోవడం కోసం నేను లంజెను... అని పంచాయతీ పెట్టినా... ప్రచారం చేసినా, పది మందిలో నీ నోట్లో ఉచ్చపోస్త. నా సాడు నాకిస్త... అని హెచ్చరించింది. లింగారెడ్డికి తాను దొర పోయిన తర్వాత దొరనైనాననుకున్న అధికార మత్తంతా రంగవ్వతోనే దిగిపోయింది... లింగారెడ్డి దాంతో రంగవ్వ ముందు కుక్కినపేనయ్యాడు... రంగవ్వ లింగారెడ్డితో సఖ్యంగానే ఉంది. కానైతే అతని విషయాలన్నీ అన్నలకు చేరవేసేది. లింగారెడ్డి యిలాంటివి మరికొన్ని కేసులు చేశాడు. దొరలా మారిన లింగారెడ్డిని పార్టీ తన్ని ఓ కాలు విరగ్గొట్టి పార్టీ నుండి వదిలించుకుంది.

కానీ లింగారెడ్డి కారణంగా అంటిన పార్టీ సంబంధాన్ని రంగవ్వ వదులుకోలేకపోయింది. ఆమె పార్టీ కోసం ఉద్యమం కోసం ఎన్ని చేసిందో... అయితే దొరను చంపాలనుకున్న ప్లాన్ తెలిసినపుడు రంగవ్వ విలవిలలాడిపోయింది. దొరకు ఆ విషయం చేరవేసింది. దొర దొరక్కుండా పారిపోయాడు. దొర రంగవ్వ పట్ల చూపిన ప్రేమ అలా వృధాపోలేదు. తమ కుటుంబాన్ని కాపాడింది రంగవ్వే అని తెలిసిన రత్నవ్వ ఆకాన్నించి ఆమెను గౌరవించడం ప్రారంభించింది... రంగవ్వ ఆ గౌరవాన్ని ఏనాడు దుర్వినియోగం చేసుకోలేదు. రత్నవ్వ పట్నంలో ఉన్నప్పుడు కూడా ఆ యింట్లో నేనే పట్టపురాణిని అని ఏనాడూ అహంకారానికి పోలేదు. ఇంట్లో పనిమనిషిలాగే ప్రవర్తించేది...

రంగవ్వ కొడుకు శ్రీనివాసు అన్నల్తో కలిశాడు. అతన్ని చూసినపుడల్లా నాకు ఎందుకో దుఃఖం వచ్చేది. నేను సరిగ్గా చదువు చెప్పే అవకాశం వుంటే చక్కగా చదువుకొని తానూ ఓ ఉద్యోగం చేసుకొనేవాడుకదా. కల్లు తాక్కుంటూ గంగుల్తో గప్పాలు కొట్టుకుంటూ బడి ఎగ్గొట్టిన నా కారణం గానే వాడికి చదువు అబ్బలేదు. పాలేరుగా కుదురుకున్నాడు. కొంతకాలానికి పెరడు పాలుకు తీసుకుని కొంత సొంత సేద్యం ప్రారంభించాడు. ఆ భూమి దొరదే. అది తనకు దక్కితే తన కష్టాలు తీరుతాయి. అమ్మ దొరకెందుకు అలవాటవుతుంది. దొర దగ్గర ఉన్న సంపద చూసేగదా అమ్మ దొరకు దాసోహం అనాల్సి వచ్చింది అని బాధపడేవాడు. తన పరిస్థితి విచిత్రమైనది. తనలో ప్రవహిస్తున్నది కూడా దొరల రక్తమే అని ఒకసారి గర్వంగా ఫీలయ్యేవాడు.... అదే కారణంతో ఒకోసారి... ఛా నా రక్తం ఎంతో కలుషితమైపోయింది. నాది ఎంత నికృష్టజన్మ అని బాధపడేవాడు.

రంగవ్వ అతన్ని ఎంతగా ప్రేమించేదో... తల్లికి తనపట్లా తన తండ్రిపట్లా గల ప్రేమను ఏ మాత్రం శంకించలేక శ్రీనివాసు తల్లిని ఎలా అర్థం చేసుకోవాలో తేల్చుకోలేకపోయాడు. కాలమే అతన్ని అనుమానాన్ని పరిష్కరించింది. ఓరోజు దొరలంతా కలిసి మీటింగ్ పెట్టుకున్నారు. గుండాల్తో ఊళ్ళో ఉన్న వాళ్ళను ఎక్కడికక్కడ తన్నించాలనుకున్నారు. రంగవ్వకు ఈ విషయం తెలిసి ఏదో పని చెప్పి అర్జంటుగా మా ఇంటికి తీసుకొచ్చింది. వీనికి ఏదో మందు తగిలింది. కక్క (వాంతి) పోయించాలె. కొద్దిరోజులు ఇక్కన్నే ఉంచుకోస్రి సారు అని బతిమాలింది. రంగవ్వకు మేలు చేయగలిగే అవకాశం వస్తే వదులుకుంటానా... పది పదిహేనురోజులకు తన కోసం తల్లి చేసిన మేలు ఏంటో శ్రీనివాసుకు అర్థమైంది. అప్పట్నించి తల్లి శీలాన్నిగానీ, వ్యక్తిత్వాన్నిగానీ శ్రీనివాస్ శంకించడం మానేశాడు. అతనికి తన తల్లి ఒక విశిష్టమైన వ్యక్తి అని అన్పించసాగింది. అమ్మ మనసు ఇక ఎన్నడూ నొప్పించకూడదని నిర్ణయించుకున్నాడు శ్రీనివాసు.

అదేంటోగానీ అతనా నిర్ణయాన్ని కాపాడుకోవడానికి తన జీవితాన్నే వేరే తీరుగా మార్చు కోవాల్సి వచ్చింది. పార్టీ అతని తల్లిని ఇన్ఫార్మర్ అని ముద్రవేసి అతను తల్లితో సంబంధం తెంచు కోవాలని కోరింది. తనను అంతగా ప్రేమించే తల్లితో సంబంధం తెంచుకోవడం ఎలా... తల్లిని తాను కాదన్ననాడు ఆమె గుండె పగిలి ఎంతగా ఏడుస్తుందో... తన తల్లి ఏనాడూ ఎవరికీ ఏ నష్టం చేయలేదు. ఆమె మన ఉద్యమానికి ఎంతో మేలు చేసింది. అమ్మచేతి వంట తిని నోరారా అమ్మా అని పిలిచిన మీరే ఇన్ఫార్మర్ అని అంటే మా అమ్మ ఎక్కడ పోవాలి.... అని అన్నల ముందు ఏడ్చేశాడు శ్రీనివాసు. వాళ్ళ మనసు కరగకపోవడంతో నేను పార్టీ నుండి తప్పుకొని సింపతైజర్‌గా మిగిలిపోతాను అని శ్రీను అన్నంత పనీ చేశాడు.

రంగవ్వ యిపుడు బతికే వుంది. కొడుకు శ్రీనివాసు ఊళ్ళో నిర్బంధాలు భరించలేక ఊరు వదిలాడు. కొన్నాళ్ళకు రాజయ్యా, రంగవ్వా కూడా కొడుకును వెతుక్కుంటూ ఊరు వదిలారు. ఎన్నో ఊళ్ళు తిరిగారు. ఎక్కడ ఏమీలేదని మళ్ళీ ఇటే వచ్చారు. ఇపుడు జగిత్యాల్లోనే ఉంటున్నారు. శ్రీనివాసు ఒక మెకానిక్ షాపు నడుపుకుంటున్నాడు. రంగవ్వ అతనికి పెళ్ళి చేసింది. అతని పెళ్ళికీ మెకానిక్ షాపు పెట్టుకోవడానికీ కూడా రాజేశ్వరరావు దొర కొంత ఆర్థిక సాయం చేశాడని విన్నాను. ఆ దొర ఇపుడు ఒక పెద్ద కొరియర్ సర్వీసులో మేన్ పార్టనర్. పట్నంలోనే ఉంటాడు. కొరియర్ సర్వీసును అతని కొడుకే చూసుకుంటాడు. ఇప్పటికీ రంగవ్వ అక్కడికి పోతూనే ఉంటుంది. ఆమెను చూసి కొడుకు విసుక్కునేవాడు. రత్నవ్వకు ఆమె నీ చిన్నమ్మరా అని చెప్పా లని ఉబలాటపడేది. నిన్నూ మీ నాన్నను కాపాడిన మహాతల్లిరా అని చెప్పాలనిపించేది. అట్లా ఈసడించుకోకు ఆమె మనసు కష్టపడితే మనకే కష్టం అని అరవాలనిపించేది. ఇప్పుడా కొడుకుకు ఇవేవీ అర్థంకావు. పైసలు పడేస్తే కొండమీది కోతి అయినా దిగి వస్తుందనే ఫక్తు డబ్బు మనిషి రత్నవ్వ కొడుకు చంద్రకాంతరావు. అందుకని రత్నవ్వ నోరు విడిచి ఏమీ చెప్పలేకపోయింది.

లక్ష్మీ! ఇద్దరు ముగ్గురు పెళ్ళాలతో ఒకే మొగుడు సంసారం చేసిన వారే అందరికీ తెలుసు. అది బహిరంగంగా అందరికీ కనిపించే వ్యవహారం. ఆ భర్త కూడా తనకు ముగ్గురు పెళ్ళాలు అని గర్వపడేవాడు... చెప్పుకునేవాడు. కాని రంగవ్వ ఏనాడూ ఎవరితోనూ అలా చెప్పుకోలేదు. గర్వపడనూలేదు. అందుకు చింతించనూ లేదు.... ప్రతి అపజయాన్ని తన విజయంగా మార్చు కుంది రంగవ్వ. ఈమాట కూడా సరికాదేమో. ఎందుకంటే ఆమె జీవితంలో ఇతరులు ప్రవేశించడం అపజయం అని భావించుకోవాలంటే ఆమె పాతివ్రత్య విలువలపట్ల గౌరవభావంతో జీవించిందని అబద్ధం చెప్పినవాన్ని అవుతాను. లక్ష్మీ... పాతివ్రత్య విలువల్ని గౌరవించేవారు జీవితంలో కుంగి

పోతారు. ఆ సందర్భాలను అవమానాలుగా ఫీలవుతారు. ఆమె ఏనాడూ అవమానంగా ఫీల్ కాలేదు. ఆమధ్య నా భార్యకు గర్భసంచి ఆపరేషన్ చేసి తీసేసినపుడు ఎవరు అన్నివిధాలా సహకరించారనుకున్నావు. రంగవ్వే... రంగవ్వ ఇప్పటికీ నా హృదయేశ్వరి. ఈ మాట నీతోనే మొదటి సారిగా ఇన్నాళ్ళకు చెప్తున్నాను. కానీ రంగవ్వ నా ముగ్గురు భర్తల్ని నేను హృదయపూర్వకంగానే ప్రేమిస్తున్నానని ఏనాడు ప్రకటించుకోలేదు. ఆమె మాటలతో చెప్పలేదు. చెప్పుకోనూలేదు.

రంగమ్మ ఒక్కతే కాదు లక్ష్మీ... ఎందరో స్త్రీలు... తమ సంబంధంలోకి వచ్చిన వాళ్ళను హృదయపూర్వకంగానే ప్రేమించేవారు. అయితే వారి చరిత్ర ఎక్కడా రికార్డు కాలేదు. అపుడెపుడో వెనకట ఉండేదట... అయిదుగురు భర్తల్తో ద్రౌపదిలా సంసారం చేసినపుడే ముత్తయిదువు అనేవారట. ఐదోతనం అంటే అయిదుగురు భర్తల్ని ఎవర్నీ నొప్పించకుండా వాళ్ళు పరస్పరం కొట్లాడుకోకుండా చూస్తూ సంసారం చేసే స్త్రీ అని అర్థంట. ఎవరో చెప్పారీ అర్థం. ఆ అర్థంలోని నిజమెంతో తెలియాలంటే మెసపొటేమియా నాగరికతకూ మైసమ్మ పోచమ్మ అనే పేర్లకూ ముడేసే సింధు నాగరికత దాకా తరచి చూడాల్సి ఉంటుంది.

ఉమ్మడి కుటుంబాలు పోయి వ్యక్తి కుటుంబాలు ఏర్పడ్డాక మాత్రమే ఒక స్త్రీ, ఒక పురుషుడు మన పిల్లలు అనే పాతివ్రత్యం ప్రాచుర్యంలోకి వచ్చిందేమో.... అంతకన్నా ముందది కేవలం రాజవంశాలకు పాలకవర్గాలకు సంబంధించిన సంస్కృతే. ఎందుకంటే వారి సొంత పిల్లలే ఆస్తి రాజ్యం అనుభవించాలనే దృష్టి వారికే ఎక్కువ. ప్రజలకు అన్ని ఆస్తులూ లేవు. అంత ఆసక్తీ లేదు. స్వచ్ఛమైన ప్రేమ సంబంధాల్తో అన్ని కులాలవాళ్ళు ఎన్నో సంబంధాలు పెట్టుకొని జీవించారు. దాన్ని ఇప్పటి అర్థంతో వ్యభిచారం అనీ, అక్రమ సంబంధం అనీ అనడం చరిత్రకే అపచారం. అది ఆనాటి సామాజిక దృక్పథం.

పూర్వం ఇంటికి అతిథి వస్తే అన్ని సౌకర్యాలతో పాటు భార్యను కూడా పంపేవారు. ఏమైనా ఆనాటి ఆచార వ్యవహాలను ఈనాటి దృష్టితో చూడ్డం సరికాదు. 'నేను', 'నాది' అనే అహంకారం, స్వార్థం ఉండకూడదని, ఏదీ నాది అనే భావనకు చేరుకోవడం కోసం రాజులు మరింత బాగా పరిపాలిస్తారనే ఆశతో యివి పుట్టాయేమో... అందుకే అందరు వ్రతం యాగం చేసి భార్యను దానం చేస్తే సత్యభామ తన భర్త కృష్ణున్నే ఎవరికో దానం చేస్తుంది. నిజానికా దానం స్త్రీకి చేయాల్సింది. ఏమంటే సోమయాజి అన్పించుకున్న ప్రతివాళ్ళూ భార్యల్ని పురుషులకి ఇలానే ఇచ్చేసే వారట. మన సంక్రాతి కనుము పండుగ తెలుసుగదా... అదే కోవలోనిది. అందరి రవికెలు అక్కడ కుప్పబోస్తే ఎవరికి ఏ రవిక దొరికితే వారితో ఆ రోజు హాయిగా ఒక ఆటలాగా గడిపేవారు. అదే కనుము పండుగ.

అవన్నీ వింటుంటే పరిస్థితి యిపుడే ఎంతో మెరుగ్గా ఉంది. లేదా స్త్రీ మీద ఆస్తిహక్కు భావన ఎప్పటికన్నా యిపుడే ఎక్కువగా పెరిగిపోయింది. అయినా లక్ష్మీ... ఇపుడు నీకు ఉద్యోగం ఉంది. జెండర్ ఎన్నుకునే స్వేచ్ఛ ఉంది. రంగవ్వకు జెండర్‌ను ఎన్నిక చేసుకునే స్వేచ్ఛ ఉండిందా... రంగవ్వకన్నా రత్నవ్వకన్నా నా భార్యకన్నా నీ జీవితం ఎంతో మెరుగు కదా...

భర్త సంపాదన మీదే ఆధారపడే మధ్యతరగతి స్త్రీ ఆవిర్భావం నుండే పాతివ్రత్యం ఏకపత్నీ వ్రతం అనేవి గొప్ప విలువలుగా సంతరించుకున్నాయేమో... దీని పర్యవసానాలు చూస్తున్నావుగా... వరకట్నాలు... కట్నపు చావులు... శరీరాన్ని హృదయాన్ని పంచి ఇచ్చిన స్త్రీపై కిరోసిన్ పోసి కట్నం కోసం నిప్పంటించడం ఎంత క్రూరం లక్ష్మీ... మధ్యతరగతి స్త్రీ తన జీవిత భద్రత పేర తన చావును బానిసత్వాన్ని కోరుకుంటోంది.

లక్ష్మీ... నా అనుభవాలు కొన్ని నీ ముందుంచాను. నీవు మరెవరికీ వీటిని వెల్లడి చేయవద్దని కోరుతున్నాను. ఏమంటే నీకు చెప్పిన వాళ్ళంతా ఇంకా బతికే ఉన్నారు. రంగవ్వను కలుస్తావా ఈ ఊళ్ళోనే ఉంది... రత్నవ్వను కలుస్తావా... పట్నంలో వాళ్ళింటికి తీసుకెళ్తాను... వాళ్ళను చదువు. ఆ పల్లెల్ని చదువు. ఆ పల్లెల్ని చదివి నీ స్త్రీవాదం చరిత్రను వెలికితీయి. విదేశీ సిద్ధాంతాల వైపు ఎందుకు... ఎంచక్కా ఏం కష్టం లేకుండా లైబ్రరీలో కూర్చుని అన్నీ తెల్సాయని భ్రమపడవచ్చు ననా! భయపెట్టవచ్చుననా!

లక్ష్మీ... నీ ప్రశ్న స్పష్టంగానే ఉంది. జవాబే నా దగ్గర స్పష్టంగాలేదు. నీ జీవితాన్ని నీవు నిర్ణయించుకోవడమే సబబు. ఇప్పటి నీ జీవితం మునుపటి వాళ్ళకన్నా ఎంతో మెరుగ్గా ఉంది. కోరికకూ తృప్తికీ అసంతృప్తికీ మధ్యగల సంబంధం నీకు అర్థమైతే నీ ప్రశ్న ఒక చర్చనీయాంశమే కాదు. నీ కోరికే నిన్ను నడిపిస్తుంది. నీ కోరిక నశించిపుడు నీవు నశించవు. నీలోని సెక్సు లైంగిక స్వేచ్ఛ, కోరికలూ అదృశ్యమవుతాయి. అణిచిపెడ్తే కోరిక నశించదు. మరింత పెరుగుతుంది. పొందినపుడే కోరిక నశిస్తుంది.

నాకన్నా నువ్వెంతో మెరుగు. నాకు కోరిక కలిగే నాటికే పెళ్ళయిపోయింది. నా కోరిక తీరే నాటికే జీవితం అయిపోయింది. నీవు రెండూ నిండు యవ్వనంలో పరిష్కరించుకునే మెరుగైన జీవితంలో ఉన్నావు... నీవు చెప్పింది రంగవ్వ కూతురు కొడుకు గురించే. అతడు రంగవ్వ మనుమడు... నీవు చెప్పిన సి.కె.రావు రత్నవ్వ కొడుకు చంద్రకాంతారావే... అదీ సంగతి... ఏం చెప్పకుండా అలా నవ్వుతూ వెళ్ళిపోతావేం... అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ ఉండు...''

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 16-5-1997, 23-5-1997*

నేపథ్యం

## అవ్యక్త భారతీయ సమాజ చిత్రణ చేసిన కథలు

# మెరుగు - తెల్లబట్ట

***దళిత మగ దేవదాసు పాలేరుగా ఉంటూ తాగి 'ఓ పార్వతీ' అని కలవరిస్తే భూస్వామి, అగ్రకులస్తుడు నా కూతుర్ని పలవరిస్తావా అని కొట్టి చంపి బావిలో పడేస్తాడు. అదే దేవదాసు స్త్రీ పాత్ర అయితే ఆమెకు కనీసం అలా తాగే అవకాశమూ ఉండదు. ఆమె తన బాధను వ్యక్తీకరించే అవకాశం ఈ సమాజం ఇవ్వడం లేదు.***

వ్యక్తీకరించే శక్తి, అవకాశం, అవసరం, సమాజం స్పందించే తీరు ననుసరించి ప్రేమభావాలు వ్యక్తమవుతాయి, అవ్యక్తమవుతాయి, అదృశ్యమవుతాయి, స్థాయీ భేదాలు పొందుతాయి.

సమాజంలోని ఆధిపత్యవర్గాలకు, కులాలకు, పురుషులకు ప్రేమభావాలు వ్యక్తీకరించే అవకాశాలు హెచ్చు. ఇతర వర్గాలకు, కులాలకు, స్త్రీలకు ఈ అవకాశాలు నిరాకరింపబడుతూ నిరాదరించబడుతున్నాయి.

స్త్రీలు చొరవ తీసుకొని ప్రేమభావాలు వ్యక్తీకరిస్తే అలుసుకు గురవుతున్నారు. ప్రేమను వ్యక్తం చేసినందుకు శూర్పణఖ ముక్కుచెవులు ఖండించబడ్డాయి. పీడిత కుల ప్రేమభావాల స్థితి ఇందుకు భిన్నంగా ఏమీలేదు. విప్లవం పట్ల ప్రేమభావాల్ని వ్యక్తంచేసే వారిని చిత్రహింసల పాలు చేస్తున్నారు. ఎన్‌కౌంటర్‌ల పేరిట హతమారుస్తున్నారు.

కొందరు ప్రేమభావాలను వ్యక్తీకరించలేనపుడు తమను తాము అర్పించుకోవడం ద్వారా ప్రేమను వ్యక్తం చేస్తారు. స్త్రీ శీలాన్ని అర్పిస్తే సమాజం హర్షించడం లేదు. మిగతా త్యాగాల్ని హర్షిస్తున్నది. సమాజం కోసం ఏదో చేయాలి అనే సామాజిక ప్రేమను వ్యక్తీకరించడం కోసం కొందరు సమాజానికి తమను తాము అర్పించుకొంటారు. వ్యక్తీకరించే శక్తి, అవకాశం లేని సామాజిక ప్రేమను ఇంకెలా వ్యక్తం చేయాలో తెలియక ఎందరో దేశం కోసం, ప్రజల కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధపడుతుంటారు. కుటుంబాన్ని, ఉద్యోగాన్ని వదిలేసి నేను పూర్తికాలపు కార్యకర్తగా ఇల్లు వదిలేయడం... మెరుగు, తెల్లబట్ట కథల్లోని విప్లవ పాత్రలు ఈ కోవలోనివి. నాకు

చిన్నప్పుడు ప్రేమించడం, ఆరాధించడం, ఆచరించడమే కాని ప్రేమను వ్యక్తం చేయడం పెద్దగా రాలేదు. ఆ ప్రేమ మేరా నామ్ జోకర్ సినిమాలోని విద్యార్థి దశ ప్రేమ. కథలు, నవలలు చదివి, సినిమాలు చూసి ప్రేమను వ్యక్తం చేయడం ఎలాగో కొంత తెలుసుకొన్నాను. కాని ప్రేమను వ్యక్తీకరించే అవకాశం ఉండేది కాదు. తద్వారా అది మూగప్రేమ. నా ప్రేమలో చాలాభాగం అవ్యక్త ప్రేమ. రంగవ్వ, సారవ్వ పాత్రల్లోని మూగప్రేమతో ఈ సంబంధం ఇలా జీవిత సంబంధం.

ప్రేమించడానికి పెద్దగా కారణాలు కూడా ఉండేవి కావు. ఒక చల్లని మాట, ఒక చక్కని చూపు, ఒక చక్కని ఆదరణ చూసి వారిని ప్రేమించబుద్ధయ్యేది. సామాజిక ప్రేమను ఆర్ఎస్ఎస్ కార్యర్తగా పనిచేయడం ద్వారా వ్యక్తపరచుకొన్నాను. మొదటిదశలో సామాజిక ప్రేమ ఇది. సారవ్వ భర్త ఈ దశలో ఉద్యమాల పట్ల ఆకర్షితుడయ్యాడు.

దేవదాసులాంటి వాళ్ళు భావకవులు. తమ విషాదప్రేమను వ్యక్తం చేసేవాళ్ళు. నాకూ అలా వ్యక్తం చేయాలనిపించేది. అవకాశం ఉండేది కాదు. అనుభవాలు కలుగుతున్న కొద్దీ అవకాశాల వెనక సామాజిక చలనసూత్రాలున్నాయని స్పష్టమవుతూ వచ్చాయి. అలాగే పీడిత వర్గం, పీడిత కులాల వాళ్ళు- ప్రేమించడం, విషాదాన్ని దేవదాసులా భావకవుల్లా వ్యక్తీకరించడం సాధ్యపడుతుందా అనే ప్రశ్న కలిగింది. జీవితానుభవాల నుంచే ఆ ప్రశ్న పుట్టింది.

పెళ్ళికి భిన్నంగా కొనసాగే లైంగిక సంబంధాల గురించి చిన్నప్పటి నుంచి చాలా వినేవాడిని. స్త్రీలు అలా చెప్పుకోవడం నేనెపుడూ వినలేదు. సంసారాలు సాగుతుండగానే ఈ అక్రమ సంబంధాలు యధావిధిగా కొనసాగడం ఎన్నో చూశాను. 'చలం' ఈ పల్లెటూరి పామరజనం జోలికి పోలేదు.

దళిత దృక్పథం, స్త్రీవాద దృక్పథం కొత్త వెలుగులు ప్రసరింపజేశాక, నా చిరకాల అనుభవాలకు, చూసిన జీవిత కోణాలకు కొత్త శక్తి వచ్చింది. దేవదాసు కథ పీడిత కులంలో పీడితవర్గంలో పుట్టినవారికి సాధ్యపడదు అని స్పష్టం కాజొచ్చింది. దీన్ని హుస్నాబాద్ కథావర్క్‌షాపులో వివరించాను.

దళిత మగ దేవదాసు పాలేరుగా ఉంటూ తాగి 'ఓ పార్వతీ' అని కలవరిస్తే భూస్వామి, అగ్రకులస్తుడు నా కూతుర్ని పలవరిస్తావా అని కొట్టి చంపి బావిలో పడేస్తాడు. అదే దేవదాసు స్త్రీ పాత్ర అయితే ఆమెకు కనీసం అలా తాగే అవకాశమూ ఉండదు. ఆమె తన బాధను వ్యక్తీకరించే అవకాశం ఈ సమాజం ఇవ్వడం లేదు.

ఎస్సీ, బీసీ స్త్రీలు ప్రేమించి ప్రేమించబడి విషాదాన్ని వ్యక్తం చేయలేకపోయిన వాళ్ళెందరో తెలుసు. ఈ వర్గ కుల పురుషాధిపత్య భూస్వామ్య గ్రామీణ సమాజం వారి గురించి వ్యక్తీకరించే అవకాశాన్ని నిరాకరిస్తూ వస్తున్నది. వారి విషాదాలకు, కన్నీళ్ళకు సాహిత్యంలో స్థానం లేకుండా పోవడం నన్ను కలిచివేసింది.

దళిత దేవదాసులను, దళిత స్త్రీ దేవదాసులను జీవితానుభవాల నుంచి వెలికితీసి వ్యక్తీకరించడం అవసరం అనుకొన్నాను. తెల్లబట్ట కథలోని సారవ్వ, మెరుగు కథలోని రంగవ్వ దళిత స్త్రీ దేవదాసుకు రెండు వ్యక్తీకరణలు.

మెరుగు కథను మీ ఆత్మకథా అని చాలామంది అడిగారు. ఆ పాత్రలు ఫలానా వారి గురించేనా అని వారి జీవితాల్లో ఎదురైనవారిని పేర్కొన్నారు. అవి కల్పిత పాత్రలు కావు. ఆనాటి సామాజికస్థితిలోని ప్రతీకాత్మక పాత్రలవి.

మెరుగు, తెల్లబట్ట జంట కథలు. సారవ్వ భగ్నప్రేమ దళిత స్త్రీ దేవదాసు కథైతే అగ్రవర్ణ స్త్రీ దేవదాసు కథ మాలతిది. సారవ్వది విషాదాంతమైన ప్రేమ. అదే ప్రేమను సుఖాంతంగా మలుచుకొన్న ప్రేమ రంగవ్వది. మాలతి కూడా రంగవ్వలా జీవించబోయినా అవకాశాలు కోల్పోయిన స్త్రీ. సారవ్వలోని విషాద ప్రేమలో నా ఆత్మకథ కొంత ఉంది. సారవ్వ సామాజిక ప్రేమ నా సామాజిక ప్రేమ తరతమ భేదాల్తో పోల్చుకోవచ్చు. ఇవన్నీ ఇక్కడి జీవితంలోని పాత్రలే. విప్లవ కాలంలో ఇక్కడి మానవ సంబంధాలు, పరిణామాలు వీటి కథా వస్తువు.

'ఆమ్రపాలి'లోని ఆమ్రపాలి, 'మృచ్ఛకటికం'లోని వసంతసేన, శకారుని పాత్రలు స్థల కాల కులాలు మారి అభివృద్ధి చెందించి చిత్రించడం ద్వారా మధురవాణి, గిరీశం పాత్రలుగా రూపాంతరం చెందాయి. కన్యాశుల్కం కూడా వైవాహికేతర లైంగిక సంబంధాల కేంద్రంగా సాగిన కథే. ఆమ్రపాలి, వసంతసేన, మధురవాణియే మరో నిర్దిష్ట స్థల కాల కుల జీవితంలో రంగవ్వగా పరిణమించింది. సాహిత్యం చదివి ఉండకపోతే మెరుగు, తెల్లబట్ట కథలు, పాత్రలు ఇలా చిత్రించగలిగి ఉండే వాడిని కాదు.

సాహిత్యంలో స్వభావ నమూనా పాత్రలు నిరంతరం పునర్జన్మనిస్తుంటాయి. స్థల కాల సమాజ చరిత్ర నిర్దిష్టతల కారణంగా అవి వేర్వేరుగా కనబడుతూ పాతవీ, కొత్తవీ రెండూ వాటి సాహిత్యస్థాయి ననుసరించి సాహిత్యంలో నిలబడిపోతుంటాయి. ఈ విషయమై అధ్యయనం జరిగితే కథకులకు ఎంతో ఉపయోగం. 'పాపులర్ రచనలు' అని ఇటీవల పేరు వచ్చింది కాని, పాపులర్ అయి చదవడం మంచి రచనలకే ఎక్కువ అవసరం. పాపులర్ రచనగా ఉండే సీరియస్ సాహిత్యం వేగవంతం కావడం ఎంతో అవసరం. ప్రేమ్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని మెరుగు, తెల్లబట్ట కథలు రాశాను. సవాసేరు గోధుమలు అనే ఆరుపేజీల కథలో నలభైయేళ్ళ సమాజ పరిణామాల్ని చెప్పాడు ప్రేమ్‌చంద్. చందమామ, బాలమిత్ర కథల్లా సాదాసీదాగా కథ చెప్తూ వెళ్ళాలనుకోవడం వెనుక ప్రేమ్‌చంద్ ప్రేరణ, ఆసియా కథన పద్ధతి ఉంది. మెరుగు, తెల్లబట్ట కథల్ని చందమామ కథల్లా చెప్పడానికి మరో కారణం కూడా ఉంది. నవల రాసే ఓపిక లేదు. రాస్తే పత్రికలకు వేసే ఓపిక లేదు. వేస్తే చదవాల్సిన పాఠకులకు చదివే ఓపిక లేదు. ఒక పేజీ కథ రాసుకొని దాన్ని సిన్మాగా తీస్తున్నప్పుడు సంక్షిప్తంగా రాయడం అవసరం. నవలంత జీవితాన్ని కథలో పెట్టడానికిది మరో కారణం.

మెరుగు కథలో 1957-64 మధ్య అప్పాయింటై పల్లెల్లో పంతుళ్ళుగా వెళ్ళి అక్కడ ఏం చేశారు? నేడు విప్లవించాల్సిన క్రమాలకు, నిరక్షరాస్యతకు ఆనాటివాళ్ళు ఎలా కారణం? ఉపాధ్యాయులు చదువు చెప్పారా, కల్లు తాగుతూ, దొరల సూటుకేసులు మోస్తూ తిరిగారా! అనేవి కథలో పట్టిన మేరకు చెప్పడం జరిగింది. ఆ జీవితం నాదికాదు. నాకన్నా పదేళ్ళ ముందు తరం టీచర్లది. నేను 1977లో టీచర్ల నుంచి నక్సలైట్లుగా మారిన తరానికి చెందిన కాలం వాడిని.

రంగవ్వ పాత్ర మధ్యతరగతి ఉద్యోగిని జీవితంలో పునర్జన్మించిన క్రమానికి 'లక్ష్మి' ప్రతీక. స్త్రీవాదుల అవగాహనపై, పనితీరుపై గల అసంతృప్తి వల్ల వారినే సంబోధిస్తూ కథ ప్రారంభించాను. కథలోని వసంత మేఘ గర్జనపై చేసిన విసుర్లు గుడ్డి అనుకరణను గుర్తు చేయడానికే.

పౌరహక్కుల సంఘ ఉద్యమ నిర్మాత ఒకరు విప్లవ ప్రజల ఆర్థిక, సాంఘిక స్థితిగతులపై పిహెచ్‌డి చేశాడు. ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువ ఉండడంతో వైవాహికేతర లైంగిక సంబధాల పాత్ర స్పష్టపడి తల పట్టుకొన్నాడు. అలానే ఇటీవలి దళిత ఉద్యమాలకు ప్రధాన ప్రేరణలైన రెండు ఘటనల్లో నిందితుల్ని బాధిత కులాల స్త్రీలు పరామర్శించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలో

తెలియక అవ్యక్తం చేయబడ్డాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని రంగవ్వ పాత్ర స్థలకాల పరిమితుల మేరకు చిత్రించాను. అలానే అవ్యక్తం చేయబడ్డ అగ్ర కులస్త్రీలతో దళిత పురుషులకు గల సంబంధాలను తెల్లబట్ట కథ ద్వారా చెప్పాను.

రంగవ్వ, మాలతి, సారవ్వల పట్ల కరుణ, రసానుభూతి కలిగేట్టుగా చిత్రించాలనుకొన్నాను. సారవ్వ చనిపోయినట్టు చిత్రించిన రాతప్రతి చదివిన స్త్రీలు ఇంత జీవితంచెప్పీ నిరాశను మిగిల్చే దైతే మీరు కథ ఎందుకు రాసినట్టు? అలాంటి సారవ్వలకు తిరిగి జీవించే ధైర్యాన్ని, అవకాశాన్ని ఇచ్చినపుడే కథ అర్థవంతం అవుతుందని తమ ఆకాంక్షను వ్యక్తంచేశారు. కథ ఎఫెక్టు కోసం జీవితాల్ని చంపడం భావ్యంకాదన్న వారితో ఏకీభవించి కొద్ది వాక్యాల్లో ఆమె జీవితాన్ని బతికించాను.

ఈ రెండు కథల్లో ఆసియా దేశాల కథన నిర్మాణ పద్ధతిని అనుసరించినా పాశ్చాత్య కథన రీతులను సమన్వయించడంలో భాగంగా శిల్ప ప్రయత్నం కొంత చేయడం జరిగింది. ఇప్పటిదాకా తెలుగు సాహిత్యంలోకి రాని భారతీయ సమాజాన్ని, జీవితాల్ని, కోణాల్ని చిత్రించడం మెరుగు, తెల్లబట్ట కథల లక్ష్యం. జీవితానుభవాలే అందుకు పునాది.

ఇద్దరు భార్యలతో సుఖంగా సాగిన సంసారాలు, కుటుంబవ్యవస్థ జీవితాలు ఎన్నో చూస్తుంటాము. ఇద్దరు భర్తలతో సుఖంగా సంసారం చేస్తూ కుటుంబవ్యవస్థ జీవితాలున్న వారి వ్యక్తీకరణను సాహిత్యాదరణతో తీసుకురావడం స్త్రీవాదులు చేయాల్సిన పని. మెరుగు, తెల్లబట్ట కథలు అందుకోసం చేసిన ఒక ప్రయత్నం. పల్లెలోంచి ఎదిగే దళిత స్త్రీవాదులు దీన్ని స్పష్టంగా అంచనా వేస్తారు. సహృదయులు ప్రస్తుతానికైతే బాగా ఆదరించారు.

సారవ్వ భర్త సమాజాన్ని ప్రేమించడం నేరం కాదు. దాన్ని వ్యక్తీకరించడం, ఆచరించడం వల్ల కలిగిన పరిణామాలు అతను ఎదుర్కొన్న తీరు అతన్ని అసహ్యించుకొనేట్టు చేశాయి. కాని పాలకవర్గాల నిర్బంధాల్ని అసహ్యించుకొనేట్టు చేసి సారవ్వ భర్త పట్ల కూడా కాస్త కరుణ కలిగే విధంగా రాయగలిగి ఉంటే మరింత బాగుండేది. మెరుగు, తెల్లబట్ట కథల్లో రంగవ్వ, సారవ్వలకు న్యాయం చేయబోయి, వారి భర్తల కోణాల్ని, స్థితిని వదిలేసినట్టయిందనిపిస్తోంది. ఈ అవ్యక్తం చేయబడ్డ వీరి ప్రేమభావాలను కూడా వ్యక్తం చేసే ప్రయత్నం చేస్తాను. అవ్యక్త స్త్రీలను వ్యక్తం చేయబోయి అవ్యక్త పురుషులను అవ్యక్తంగానే మిగల్చడానికి 'కథ' ప్రక్రియకున్న పరిమితి కారణం అనుకొంటాను.

(ఈ కథల్లోని సంఘటనలకు, పాత్రలకు ప్రేరణ అయిన సంఘటనల్నీ, పాత్రల్ని నిర్దిష్టంగా పేర్కొంటే అదే ఓ నవల అవుతుంది కనుక ఆ ప్రయత్నం చేయడంలేదు.)

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 16 నవంబర్ 1997*

ఈ నేపథ్యంలో మెరుగు కథతో పాటు తెల్లబట్ట కథను కూడా రచయిత ఉదహరించినా స్థలాభావం చేత తెల్లబట్ట కథను ప్రచురించలేకపోతున్నాం.

*-సం.*

15

# డబ్బు

## బీనాదేవి

కట్టుకున్న గళ్లలుంగీ మోకాళ్ల దాకా ఎత్తి బిగించి, పద్మాసనం వేసి, ముచ్చటిస్తూ వర్తమానాన్నీ, భవిష్యత్తునీ ఒక్కలాగే బూతులు తిడుతూ అతను లెక్చరు సాగిస్తున్నాడు నేనా రైలు పెట్టెక్కేసరికే. అతని చుట్టూ అతని పార్టీ యెనిమిది తొమ్మిదిమందున్నారు. జిడ్డు మరకలున్న తన టెర్లిన్ చొక్కా గుండీ పీకకు తగిలేవరకూ వెనక్కి లాగి ఒక చేత్తో రెండో చెయ్యి రాసుకుంటూ, పది మందున్నా ఒక్కర్నే ఉద్దేశించి మాట్లాడ్డం అతని అలవాటు. అతని కళ్ల కింద సొంగు, అతనికి నిషా వస్తువులు నిషేధం లేదంటుంది. అతని జుట్టు మూడుగజాలుంది. అతని గెడ్డం మూ(డ్రోజులుది. అతను మూడు కాలాల గురించీ త్రికాల జ్ఞానిలా ఒక్కలాగ మాట్లాడగలడు. పోయిన యుద్ధంలో మిలటరీ కెళ్లి పాడైపోయిన వాళ్లాగో, లేకపోతే నాలుగు సార్లు జైలుకెళ్లి బాగుపడ్డ వాళ్లాగో వున్నాడు. 'అన్నా' అని పలకరిస్తే, 'ఏం బామ్మరిదీ,' అని పలికే రకంలా, చూస్తేనే నమ్మకూడదన్నట్టున్నాడు. అతనికి 45 సంవత్సరాలు వుండొచ్చు.

ఈలోగా ఒక కుర్రాడు- అతని పార్టీవాడే- రైలు పెట్టెక్కి అతనికి రెండు బీడీకట్టలిచ్చేడు.



*బీనాదేవి... భాగవతుల నరసింగరావు, బాలత్రిపుర సుందరమ్మ కలిసి బీనాదేవిగా రచనలు చేశారు. నరసింగరావు 25 ఆగస్ట్ 1924న, త్రిపుర సుందరమ్మ 11 ఫిబ్రవరి 1935న విశాఖపట్నం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'రాధమ్మ పెళ్లి ఆగిపోయింది' 1965 ఫిబ్రవరి జ్యోతి మాసపత్రికలో అచ్చయింది. 68 కథలు, 4 నవలలు, అనేక వ్యాసాలు, కబుర్లు రచించారు. 6 కథాసంపుటాలతో పాటు సమగ్ర రచనల సంపుటం వెలువడ్డాయి. 'పుణ్యభూమీ కళ్లుతెరు' నవలకు 1972లో ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమి అవార్డు లభించింది. 5 సెప్టెంబర్ 1990న నరసింగరావు మరణానంతరం త్రిపుర సుందరమ్మ రచనా వ్యాసంగం కొనసాగిస్తున్నారు.*

**చిరునామా**

102, శ్రీనిలయ ఎస్టేట్స్, బాటా ఎదురుగా, అమీర్‌పేట, హైదరాబాద్.

Ph.: 99590 22881

అతనా కుర్రాడివేపు శపిస్తున్నట్టు చూసి, "నీలాంటి దాన్నేన్రా అవతలీదికెళ్లి అగ్గిపెట్టె తెమ్మంటే ఆర్నెల్ల కడుపుతో సహా తిరిగొచ్చిందట! లేకపోతే యింతసేపట్రా లంజికొడుకా! ఒక బీడికట్ట తెమ్మంటే?" అని ఆప్యాయంగా ప్రశ్నించేడు.

కుర్రాడు, "ఒకటి కాదు గురూ! రెండూ," అన్నాడు నవ్వుతూ.

"అన్ని తెలివితేట్లుండబట్టేన్రా లారీక్లీనరయ్యేవు. ఎక్కడ సస్తే సచ్చేవ్‌గాని 'టీ'లేవీ?"

"తెస్తున్నాడు గురూ," అని ఆ కుర్రాడంటూ వుంటే ఒక 'టీ' కుర్రాడు ప్రవేశించి వాళ్ల పార్టీ అందరికీ 'టీ'లు అందించేడు.

అతను టీ చవిచూసి, చప్పరించి, మిగతా టీ అంతా గడగడా తాగేసి కిటికీలోంచి తుప్పని ఉమ్మి, "సీస్సీ! ఇంతకంటే కిరసనాయలు నయం. ఏటీ 'టీ' తాగితే సిన్నప్పుడు తాగిన ఆవఁదం కూడా బైటికొచ్చేసేట్లుంది," అంటూ గ్లాసు పక్కవాడి కందించాడు.

అతని మాటలకి అంతా నవ్వేరు. దాంతో అన్యాయం కేసు గెల్చిన ప్లీడర్లా అతను రెచ్చిపోయేడు.

"ఒరే అబ్బాయ్! ఈ టీలో టీయాకు లేస్తాడా, ఎంగిలాకు లేస్తాడ్రా మీ ప్రొప్రైటరు," అని టీ కుర్రాడ్ని, "అంతా సెకెండేండు బతుకులు. ఎక్కడ సూడు, సవకబారు వస్తువులూ, నాసిరకం మనుసులేను.

"నా సిన్నప్పుడు సూడు; గాందీగార్లాటోడు ఒక స్టేటిమెంటిచ్చేడంటే అటు లండన్నించిటు లంకల్రేవ్వరకూ ఎవుడికి అరదంగాక గడగడ్లాడిపోయీవోరు, తెలీజెప్పమని మళ్లీ ఆ బాబుకాడికే ఎల్లీవోరు. మళ్లీ అలాటోడే నెహురూ. ఎనక జెనమలో పూజ తక్కువై మన్లో పుట్టేడుగాని లేకపోతే అమెరికాలో పుట్టాల్సినోడు. ఆ బాబు యిదేశాలెల్తే ఏటి సేసీవోరో ఎరికా? ఎత్తుకొని నెత్తి కెక్కించుకునేవోరు. కాళ్లు కడిగి నీళ్లు జల్లుకునేవోరు. ఇంకాడాళ్ల సంగత్సరేసరి. రోడ్ల కెగబడి పోయీవోరుట. ఆ బాబు సిన్నతనంలో ఓ పాలి రష్యా ఎల్తే ఏటైందో తెల్సా? మాకు రాజులేడు, రాజులాగున్నావు మాకు రాజున్సేసుకుంటావఁని అక్కడోళ్లు బతిమిలాడ్నా, ఆ బాబొచ్చీసేట్ట. మడిసంటే అతగాడు మడిసి. బంగారం కడ్డీ; ఇనపగుండు.

"అంతెందుకు, నా సిన్నప్పుడు పంచాయితీ పెసిడెంటు పంతుల్లేడూ? చూస్తే పది జనమల పాపాలు పోయీటట్టుండేవోడు. ఇప్పుడూ వున్నారు, పెసిడెంట్లు మనకి! ఏం నాబం? పొట్టకొస్తే మాంసం ముక్కల్తప్ప అచ్చరం ముక్కుండదు. నోరిప్పితే సరేసరి. పుప్పిపల్లూ, కొండనాలుకా తప్ప మాట పెగల్దు," అంటూ అతనక్కడితో ఆగి, పక్కనున్న బీడీ కట్టలోంచి ఎంచొక బీడీ తీసి, దాని రెండోవేపు నోట్లో పెట్టుకొని, శివుడు శంఖం వూదినట్లు వూది, మళ్లీ సన్నవేపు నోట్లో పెట్టుకుని, అంటించి, గట్టిగా దమ్ము లాగాడు. కాని పొగ సమంగా రాలేదు. వెంటనే బీడీ కిటికిలోంచి విసిరేసి, "యిన్ని కన్నాలున్న బీడీ ఎపుడు కాల్చాన్రా బాబూ! బీడీకి కన్నాలు, బేంకు యినప్పెట్టిక్కన్నాలు. బడ్జట్టుకి కన్నాలు, ఎగిరే ఇమానం యింజన్లో కన్నాలు. అంతా కన్నాల బతుకులైపోనాయంటే నమ్ము.

"నా సిన్నప్పుడు అణా యిచ్చి బీడీకట్టిమ్మంటే అర్ధణా తిరిగిచ్చీసీవోరు. కట్టసించి బీడీ యెలిగిస్తే సారామీదికే పోయీదికాదు మనస్సు. అర్ధణా యిచ్చి కాఫీ తాగితే యిలా యెలా గుండేదనుకుంటావేటి? కాక్‌టెయిలుండే, కాక్‌టెయిల్లాగుండేదంటే నమ్ము. ఇంతకీ ఈతకల్లు, ఎమోనియా సారా తాగే మీకేటి తెలుస్తాదిలే కాక్‌టెయిల్రుసి!

"నా సిన్నప్పుడు అణా యిచ్చి ఈ సొరకాయలు కొని యిలా పొయ్యి మీదెట్టేసరికి ఎన్నైపోయీవి. ఇప్పుడో! రూపాయిన్నరిచ్చి ఈ సొరకాయలు కొని పొయ్యెక్కిస్తే పొయ్యారిపోద్ది.

మొన్నేటైందో ఎరికా? మా యాడది మాంసం వండి అన్నానిక్కూకొని, తినకుండా లెగిసిపోనాది. 'ఏటే పిల్లా మాంసం ఒగ్గేసినావ్,' అన్నానో లేదో, తాసుపాంలాగ తోకమీద నెగిసి, 'ఇది మేక మాంసవాఁ? మోటారు టైరుముక్కా? మా గొప్ప మాంసం తెచ్చేవుగాని వల్లకుండు,' అని కళ్ళెర్ర జేసింది. మళ్లీ దానికి మాంసవంటే ఎంతిష్టమో తెల్సా? ఎప్పుడోపాలి నన్నే తినేస్తాదేమో ననిపిస్తాది.

''ఇప్పుడంతా డబ్బు గురూ! డబ్బు! ఇలువైన సరుకెవురికీ వొద్దు. ఇక మనిసి యిలువ అసలే వొద్దు.

''డబ్బు సూపితే చాలు. ఈదిలో కోతాడుద్ది. ఇంట్లో ఆడది కోతిలాగాడుద్ది. డబ్బుంటే సాలు, కార్లు కొనొచ్చు, మేళ్లు కట్టొచ్చు. దేఁవుఁడెదురు తిరక్కపోతే ఏ సెయిర్మేనో, ఎమ్మెల్యో కూడా అయిపోవచ్చు.

''నీకు డబ్బుంటే, నీ కొడుక్కి బంగారబ్బొమ్మలాంటి కోడలు బంగారం సంచుల్తో వస్తాది. నీ కూతుర్ని గొప్పోడెవడో కట్నం నేకుండా పెళ్లి సేయిస్సుకుంటాడు. నీ కొడుకు తరుడుఫారం ఎందుకు దాట్నేదనడగరు. నీ కూతురు ముందటేడు అచ్చమ్మాస్పర్తిర్లో ఎందుకు జేరిందనడగరు. నీ బామ్మర్ది కర్రి మంత్రసాని ముండ నెందుకు పీక పిసికి సంపేశాడనడుగరు. నీ వొంశం వద్దు, నీ గుణం అసలే వద్దు. నీ సదువేటనడగరు, నీ డబ్బు కావాలి పెపంచానికి. ఆకిరికి దొంగ నల్ల మందు హోల్సేలు యాపారం నీదేనని కూడా పట్టించుకోరు.

''ఇంతెందుకు, ఈదిలోకెళ్లు. ఎల్లి, రూపాయల సంచీ గలగల్లాడించు. నీ పక్కనెంతమంది సేరుతారో సూసుకో.

''నీక్కారమ్ముతా ననొకడొస్తాడు. నీ కిల్లు అమ్ముతానని మరోడొస్తాడు. నీకు వొళ్లు అమ్ము తానని పదిమంది వొస్తారు. మళ్లీ ఆళ్లు సూడ్డానికెలా గుంటారో తెల్సా? రావణాసురిడి కింద ఏడుస్తున్న సీతమ్మోర్లలా గుంటారు.

''యింతెందుకు, పదిమందిలో పోలీసోణ్ని పబ్లీగ్గా సెప్పట్టుక్కట్టి పది రూపాయల్నోటు ఆడి సేతిలో పెట్టు. నువ్వూ, ఆడూ ఏదో లెంపకాయలాట లాడుకుంటున్నట్టు నవ్వేసి ఎల్లిపోతాడు.

''తిరపతెల్లు. కాని రైలు దిగక. దిగకుండానే ఎంకటేస్స గుడేపు తిరిగి డబ్బు సూపీ, ఏడు కొండలూ ఒక్క బిగిని గంతేసి నీ వొళ్లో వాల్తాడా స్వామి.

''ఈరోజుల్లో పాకీవోడు మొదలుకొని పరబ్రహ్మం వరకు, డాట్రుబాబు మొదలు డాఫర్నాయాల వొరకూ అందరికీ ఒకటే కావాలి. ఏటనుకున్నావ్? డబ్బు!''

''నీకు డబ్బు నేకపోతే నువ్వు గాంధీగార్లాటోడివైనా నీ మొకంమీద ఉమ్మమన్నా ఉమ్మరు. గాంధీగారైనా- మొదట్లో అమాయకం రోజులు గాబట్టి బతగ్గలిగేడుగాని ఈ మాయదార్రోజులొచ్చేక బతకనిచ్చినారా! కాలిసి సంపేసినారుగాని- ఆ బాబుకే యింత డబ్బుండి లంచవిఁచ్చి పదిమంది పోలీసోళ్లని సుట్టూ ఎట్టుకుంటే సచ్చిపోయివోడా? ఆ బాబుని సంపేసీవోరా?

''ఈ డబ్బు దగ్గర మనిసిని మనిసి నమ్మడు. పెళ్లాన్ని మొగుడు నమ్మడు. పిల్లని తల్లి నమ్మదు. దేశాన్ని దేశం పొట్టనెట్టేసుకుంటాది. నా మాటబద్దమైతే ఈ పాలెల్లి మీ యాడదాన్ని దానమ్మగోరిచ్చిన ఆరెకరాలమ్మేసి నీకు సెకండేండు టాక్సీ కొనిపెట్టమను. అది ఈ రేత్తిరే నీ సాపగుడ్డ ఈదరుగు మీద పారిబోతే నన్ను నంజకొడుకని పిలు. నేను పలుకుతాను. ప్రోనోట్లేకుండా పదొందలు అప్పియ్యమని నీ తమ్ముణ్ని ఈ ఏలే అడుగు. ఆ సాక్కుకి (షాక్) ఆడు సచ్చన్నా పోతాడు, నేకపోతే నిన్ను సంపేనన్నా సంపేస్తాడు.

''రెండు పిట్టలు కలిసుంటాయి, రెండు పుల్లు కలుసుంటాయి. కానిద్దరు మనుషులు కలుసుండరు, డబ్బు సంవందం ఏంవీఁ నేకపోతే.

''డబ్బు దగ్గర న్యాయం నేకపోతే మసైపోతావు. నువ్వు లారీ నడుపుతే రిటన్లో లోడేం లేదని నీ ప్రొప్రైట్రుతో అబద్దం సెప్పకు. నువ్వు పంచదారమ్ముతే కాయితానికి కాణీ పుచ్చుకోకు. బియ్యం అమ్ముతే రాళ్లు కలపకు. పాలమ్ముతే నీళ్లు కలపకు. యాపారం చేస్తే దొంగలెక్క ర్రాయకు. అలాసేసి వచ్చే ఏడు నీ ఎడ్రసు నీకు తెలుస్తే నాకొచ్చి సెప్పు. నీకిల్లుండదు, నీ భూమి సావుకారుది. నీ పెళ్లాం నీకొల్లదు. నీ కుక్కే నిన్ను కరుస్తాది. నీ వప్పుల్తీర్చనేక గోతిలో గెంతి నరకానికి పోతావ్! పోతే పోతావు డబ్బులేనెదవ్వి. నా ఏడుపల్లా నుయ్యి మాకు పనికి రాదనే,'' అని ఆగేడు.

చుట్టూ వున్నవాళ్లు ఆలోచనల్లో పడ్డవాళ్లలా మాట్లాడకుండా వూరుకున్నారు. కాని వాళ్లలో ఒకడు, ''అయితే డబ్బుకోసం ఏ పీకన్నా కోసిమంటావన్నమాట,'' అన్నాడు.

''ఆ తప్పుడు మాట నా కంటగట్టబోకండొరె. నాకు పరమసయ్యం. అసల్నాకు డబ్బంటే యిష్టవఁని ఏ నంజికొడుకు నీతో సెప్పింది? కట్టుకున్నా కొగ్గకూడదని మాయాడదాన్తో వుంటున్నాగా న్నేకపోతే ఏనాడో సన్నాసినైపోయుండేవోణ్ణి. నానసలు బుసిలాంటి మడిసిని.

''ఇంతకీ కళ్లారా మా డాట్రుబాబు కత సూసేక్కూడా డబ్బుకి లొంగిపోమంటార్రా బావుల్లారా,'' అని మూడు నిలువుల నిట్టూర్పు భూమిలోకి గుచ్చి ఆగేడు.

''ఎవుడ్రా డాట్రు? ఏమా కత,'' అని పంచతంత్రంలో రాజు కొడుకుల్లా చుట్టూ వున్నవాళ్లు అడిగేరు.

''అయితే సెప్తా నినుకోండి,'' అని బీడీకట్టలోంచి ఒక బీడీ ఎంచి, ముట్టించి, బీడీ కంపనీ వాడి తల్లీ, పెళ్లాల శీలం శంకించకుండా కథ ఆరంభించేడు. ''నేను మీ ఊర్రాక ముందు ఎక్కడుండేవోడ్నో తెల్సా?....లో. అక్కడో పెద్దాస్పత్తిర్లో పన్జేసేవోడ్ని. పెద్దాస్పత్తిరంటే జనరలాస్పత్తిరనుకునేరు. జనరలాస్పత్తిరి కెల్లే పేషెంటుకి తోడెల్లినోడు ముందు సస్తాడు. ఆ ఎనక పేషెంటు సస్తాడు. అదికాదు మా యాస్పత్తిరి. మాది పంకజం నర్సింగ్‌హోమ్.' ఆ వూరి కొండ పక్కని సంద్రాని కెదురుగా వుండేది.

''ఆయాస్పత్తిరికి తొలీసుట్టు నౌకరీకెల్లి రిచ్చా దిగి, దాని కాంపౌండు గోడ సూసేసరికి గుండె సల్లబడిపోనాది. తొల్సుట్టు సెంట్రల్ జైలు గోడ సూసినప్పుడలాగే అనిపించిందొరే. లోన కెల్లబోతే గేటుకాడ గురకావోడు గెంటేబోనాడు. ఆకిరికి నా కాయితాల్సూసి ఒగ్గేసినాడనుకో.

''గేటు దాటి లోనకెల్లబొయ్యా సరికి కళ్లు ఝుమ్మన్నాయనుకో. అదేదో పెద్ద హోటేల్లాగో, సినీమా కంపెనీలాగో వుందిగానీ ఆస్పత్తిర్లాగ నేదు. గేటు దాటగానే ఎకరాలెకరాల పూలతోట; సొరగం నుండి రతనాలు రాలిపోయినట్టు ఆటి పువ్వులు.

''ఎన్నెల రేత్తిరి పువ్వల మొక్కల పక్కన సిమ్మెంటు బెంచీ మీద కూచుంటే జొత్కానా నీల్లు సల్లగా తుంపర్లా బడుతూ ఉంటే నా సాఁవిఁరంగా... సస్తే యీ ఆస్పత్తిరిలోనే సావాలని పిస్తాది.

''ఇంకాస్పత్తిరెలా గుంటాదనుకుంటావేటి? దాని కోవారంగు గోడలు సూస్తే కొరుక్కు తినెయ్యాలనుంటుంది. దాని నేల్లో నీ ఎదవమొకం సూసుకు గెడ్డం గీసుకోవచ్చు. ఆస్పత్తిరి ఆరంతస్తులు. ఆపరేసనలన్నీ ఆరో అంతస్తులో. మిగతా అంతస్తుల్లో అన్నీ స్పెషల్ వోర్డులు. కిందంతస్తులో ఆఫీసు, కన్సల్టీషను రూము, కంపౌండర్ల గదీనీ.

''పేషెంట్ల కిచ్చీ గదునెలా గుంటావేటి? దేనికీ బైటకెల్లక్కర్లేదు. ప్రతీ గదికీ బాత్రూమూ, లెట్రినుల్లుంటాయి. ఆయాస్పత్తిరిలో ఒక హోటేలు, ఒక మందుల్సాపు, ఒక మామూలు సాపు, ఒక పుస్తకాల్సాపు, ఒక బీడీకొట్టు అన్నీ వున్నాయి. ఒక బయస్కోపూ, బట్టల్సాపూ లేవన్నమాట గాని, నేకపోతే అదో సిన్నూరేననుకో. ఆ యాస్పత్తిరి యింటిపన్ను యిరవై వేలు, కరెంటు కరుసు మూడువేలు.

''ఇంకాస్పత్తిరి కొచ్చేవాళ్లెలాటి వోళ్లనుకుంటావేటి?

''పీకల వరకూ లంచాల్తినీ పెద్దుద్యోగులు, నీ యమ్మ సస్తూంటే నీ పెళ్లాం పుస్తె అమ్మిం చేసి నీకు పదిరూపాయల మందు యిరవై కమ్ముతారే అదిగో అలాటోళ్లు. యీయేల కడితే రేపు కొట్టుకుపొయ్యే బ్రిడ్జిలు కట్టే కంట్రాక్టర్లు, రేత్తిరికి రేత్తిరి షిప్పుల్లోంచి బ్రాందీ, నల్లమందూ దింపి బంగారమ్మేళ్లు కడతారే ఆళ్లు; అంతా అలాంటోళ్లే ఆ యాస్పత్తిరి కొచ్చేది.

''పల్లెటూరి నాయుడి నాలుగో పెళ్లాం తన సైజు కుర్రాడితో పట్నవాసంలో వుండడానికి లేని జబ్బు సెప్పి మా యాస్పత్తిరిలోనే వుండేది. కలకటేరు పెళ్లాం కానుపు మాకాడే, ఎప్పటికీ సవఁర్తాడని సూపరెంటు కూతురు ఆపరీసనూ మాకాడే.

''అంతేకాని నీలాటాల్లాలాటి బీదెదవలు రారక్కడికి. అలాటోడెవడైనా మతిసెడి వచ్చేడో, గేటుకాడ గూరకావోడు, గేటుకాడే పీక పిసికి సంపేస్తాడు.

''ఇక మా బాబంటావా? ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడ్డు. అచ్చ సినీమా హీరోలాగుంటాడు. పెదాల మీద సిన్న పావులా అంత సిరునవ్వుతో ఎవురొచ్చినా సరే మూడు మాటల్తో ముగించి పంపేసేవోడు. ఈ బాబు ఆస్పత్తిరిలో ఆడే మాటలన్నీ ఇంగ్లీసూ తెలుగు కలుపుకుంటే రోజుకి అరవయ్యుంటాయి. ఆ బాబెప్పుడూ నవ్వడొరే. (ఎప్పుడూ నవ్వని మొగాడ్నీ; ఎప్పుడూ ఏడని ఆడదాన్నీ నమ్మకూడదంటారు.)

''ఆ బాబుకింద ఆడోళ్లతో సహా ఆరుగురసిస్టెంట్లు, మూడు పుంజీల మంతర్సాన్లు. యిక నర్సులూ, వార్డుబోయిలు సంగతి సెప్పక్కర్లేనేలేదు,'' అంటూ అతను మరో బీడీ అంటించడానికాగేడు.

''యింతకీ నీకేటుద్దోగం ఆ యాస్పత్తిరిలో,'' అని అడ్డు తగిలేడు ఒకడు.

''షాపుర్... పేరుకే డ్రైవర్నుగాని డాట్రుబాబుకి చెక్రెట్రీలాటోడ్ననుకో. నాతో సెప్పందీ ఆ బాబేపనీ సేసీవోడు కాదు. పొద్దుటేల ఇంటికాడ్నుంచి ఆ బాబు నాస్పత్తిరికి కారులో తీసుకొస్తూ వుంటే ఆ ఏల ఏ ఆపరేసను సేస్తాడో, అదెంత కష్టవోఁ, ఆ ముందట్రోజు పేషెంటు ఎందుకు సచ్చిపోయాడో, అన్నీ సెప్పేవోడు. అసల్నాకు డాట్రు పన్నేర్పుతానని బతిమిలాడీవోడు. అప్పుడ్నే రుసుకున్నా బాగుండేది. ఇప్పుడీ నారీ డ్రైవరుద్యోగం తప్పిపోయీది.

''ఆ బాబెంత మంచోడనుకుంటావేటి? రెక్కల్లేవుగాని దేవుఁళ్లాటోడు. ఆ బాబు సెయ్యేసీ సరికి వొల్లు సల్లబడిపోవాల నూటారు జొరవున్నోడికి. ఆ బాబు సూప్పడేసరికి ఎవరన్నా సరే-ఆకరికి మన లారీ కంపెనీ పొప్పరైటరు ముండ దురగమ్మలాటిదైనా సరే కనీవొలిసిందే.

''ఇంకా బాబు వొయిద్దెమంటావా? ఇవరించడం నా తరం కాదు. పేషెంటుకి ఆకలేస్తే మందు, ఆకలెయ్యకపోతే మందు, నవ్వొస్తే యిండీషను, ఏడుపొస్తే యిండీషను. పిల్లలు పుట్టడాని కాపరీసను, పుట్టుక పోడాని కాపరీసను. ఆ బాబు కాడ వొయిద్దెం లేని జబ్బు లేదుపో!

''ఇక మడిసంటావా? సూస్తే యముడు కూడా యెనబోతు దిగిపోతాడు. సచ్చీ ఎదవ కూడా సావడం మానేస్తాడు. ఎంతటోడి కన్నా ఆ బాబుని సూస్తే హడల్!

“ఆస్పత్తిరి గేటుకాడ, కేడిలాక్ కారెనక సీట్లోంచి దర్జాగా దిగి, గేటుకాడ గూరకావోడి సలావందుకోకుండా ఆస్పత్తిరిలో నడిసెల్లిపోయీ పెద్దపుల్ని నువ్వెప్పుడైనా సూసేవా? అదుగో, అలా సూసివోరతన్నంతా. ఆస్పత్తిరి కొస్తూ వుంటే, ముందు రేత్తిరి మూడు పురుళ్లు పోసిన మంతర్సాని ముండ కూడా హుషారుగుండేది అతనొచ్చేసరికి.”

“ఆ బాబుకి పెళ్లయిందా?” ఎవరో అడిగేరు.

“నువ్వల్లకుండొరే. నేకపోతే కీల్లిరిసీసి కిటికీలోంచి సిరీగల్ను. సుట్టపీకంతున్నావ్, నీకెంత తొందర్రా నంజికొడకా? కత సెప్పడం రాస్సరిగదా, యినడం కూడా రాదు మనెదవలకి.

“పెళ్లయిందిరా బాబూ, అయింది. మా అమ్మగోరెలా గుంటారనడగవేం? బంగారబ్బొమ్మ, రతనాల రాసి. ముట్టుకుంటె మాసిపోద్దేమోనన్నట్టు పింగాణీబొమ్మలాగుండీది. ఆ యమ్మ దాహం పుచ్చుకుంటే గొంతులో నీల్లు కనిపించాలన్నమాట.

“ఆ యమ్మ కూకున్నసోట తవ్వితే రతనాల గనుండవొలసిందే.

“ఆయమ్మ సెయ్యి పడితే గొడ్డుటావు గూడా సూలు కట్టెయ్యాలి.

“ఆ యమ్మ సూపడితే నువ్వు కూడా యీమానం డైవరువైపోతావన్నమాట. ఆ యమ్మ రాములోరి కాలంలో పుట్టుంటే, సీతూసికి రావణాసురుడెల్లకపోయీవోడు.

“అంతందం నా జనమలో సూళ్లేదురా బాబూ! నేను ఆ యమ్మని సూసిన కళ్లతో మీ దయిద్దరం మొకాలు సూసి, ఆ యమ్మని కూకుండబెట్టి కేడల్కారు నడిపిన్నేను, బ్రేకుల్లేని దురగమ్మలారీ నడుపుకోవాల్సొచ్చిందంటే అంతా నా కరమరా బాబూ! సారా అమ్ముకున్నోళ్లో సోడాలమ్ముకున్నట్టున్నాదంటే నమ్ము నా బతుకు.

“నా నారికాడ నౌకరీక్కుదురుకుండీసరికే ఆరికి మూడేళ్లబ్బాయి. ఆ తరువాత యింకెవరూ లేరు. యింకుండకుండా ఆయమ్మకి ఆపరేసను సేసేరట ఏదో జబ్బు సేస్తే.

“యింకబ్బా యెలాగుండేవోడంటావేటి? మన నరసిమ్ములు బడ్డీ కొట్టుకాడ బాలకిష్టుడి బొమ్మ లేదూ? అదుగో అలాగుండేవోడు, గిరిజాల్తో! బంతులంత బుగ్గలమద్దిల; ముప్పావించీ మూతి; యిదుగో యింత ముక్కు; పాల తెలుపు; నవ్వితే ముత్తేల వోన పడ్డట్టుండేది. యిదిగో ఈ సేతుల్తోనే పెంచేను.

“కుర్రోడు ఎంత సురుకంటావేటి! ఆరేళ్లొచ్చీ సరికల్లా నా ఒళ్లో కూకుని కార్నడిపీసీవోడు. సదువుతున్న దొర్ల బళ్లో పస్టు పెయిజులన్నీ ఆ బాబువే.

“ఆ డాట్రుబాబుకి నానంటే ఎంత దయా! ఎంతభిమానం! ఏం పండుగొచ్చినా... ఆకిరికి పీర్లపండుగొచ్చినా సరే, ‘యిందరా ఎంకటేశా! ఈ పది రూపాయలూ పట్టుకెళ్లి పిల్లలకేదన్నా కొనిపెట్టరా...’ అనిచ్చేవోడు. నాకు పిల్లల్లేరనీ, మా యాడదాన్నేత మూడుముళ్లూ ఏసిన్నేనుగాస్సరి కదా, మూడు కళ్లున్న యీశ్వరుడు కూడా కనిపించలేడనీ, ఆ బాబుకెన్నిసార్లు సెప్పినా గేపక ముండేది కాదు.

“పొద్దున్నెనిమిది గంటల కాస్పత్తిరి కెల్తే మళ్లీ రేత్తిరెనిమిది గంటలకే తిరిగి రావడం. యీలోన చేతుల్నిండా పనే. నూర్రూపాయల్నోటూ, నూరిన కత్తులూ పట్టుకుందుకే పుట్టేడా బాబు. రేత్తిరింటికొచ్చి తాన్నవాఁడి అమ్మగారి కెదురుగా కూకుంటే సాలు ఆ బాబు మొహం లారీలైట్లా గెలిగిపోయీది. ఆయమ్మంటే అతని కంత పేమ.”

“తాగీవోడా మీ డాట్రు?” ఎవరో అడ్డు తగిలేరు.

''ఎవఁడ్రా నువ్వు? రాములోరి పుట్టినోజుకి, రహీం సాయిబు తద్దినానికి ఏఁట్రా సంవందం? ఆ బాబు తాగితే నీకేం? తాక్కపోతే నీకేంరా? ఔన్రా, తాగివోఁడ్రా! తాగీవోడు. నీలా బెల్లం సారా మట్టుక్కాదు. ఆ బాబు తాగీ బుడ్లు సూస్తేనే, పువ్వులు గుచ్చి టేబులు మీద ఎట్టుకోవాలనిపిస్తాది. అంత బావుంటాయి. యింకాటి కరీదు యింటే గుండె పగిలి సస్తావ్. వల్లకుండు. కద సెప్పని.

''యింత మంచోడైనా ఆ బాబు కొకటే లోపం. సెందురికి మచ్చున్నట్టు. బీదోళ్లంటే గిట్టదు. దరమం అసలెరుగడు. అతన్తో పొలిసి సూస్తే మన దురగమ్మ నాలుగు సేతులున్న దరమదేవతే ననుకో. ఆ బాబెదుటే ముష్టోడు పడి సస్తూంటే అరొన్సు మందియ్యడు. అణా దరమమియ్యడు.

''ఆ బాబు జనమలో ఏదో రహిస్సెం వుండుంటాదనీ, ఎప్పుడో బీదోళ్ల సేత కండుజెల్ల తినేసుంటాడనీ అనుమానమేసీది. ఆకిరికి ఎలాగైతేనేఁ పట్టేసే నా రహిస్సెం.

''ఆ బాబు, మా యమ్మగోరూ మేనత్త మేనమాం పిల్లలట. సిన్నప్పుడు ఒక టేబిలు కాడ తిని, ఒగ్గదిలో పడుకుండేవోరట. సిన్నప్పట్నుండీ ఒకళ్ల నొకళ్లు పెళ్లి సేసుకుందారనుకుండీవోరట. ఆళ్ల పెళ్లి మొదట్లో ఆళ్ల పెద్దోళ్లకి యిష్టమేనట.

''కాని మా బాబు పరీచ్చై ప్రేక్టీసు పెట్టేసరికి అతనాస్తంతా అరించిపోయిందట. అతని తండ్రి తనాస్తంతా పందెపు గుఱ్ఱాలతోకలకీ, పట్నపుసానుల కోకలకీ ముడెట్టేసి సచ్చిపోనాట్ట. ప్రాక్టీసు పెట్టబొయ్యోసరికి పకీరైపోనాట్ట. మా బాబు, అతగోడి మేనమాంకి ముప్పై లచ్చలా స్తుందిట. 'నాలా ముప్పై లచ్చలాస్తి నేకపోతే పోనాదిగానీ, మూడుకాన్లు కరీదు సెయ్యావ్. నీకెలా గిచ్చేది పిల్లనీ,' అనేసేట్ట మా బాబుతో. అప్పుడు మా బాబు, 'మూడేళ్లు టయమియ్యి, మూళ్లచ్చలు పట్టుకొస్తే పిల్లనియ్యి, నేకపోతే నీ కూతుర్ని నీకిష్టమొచ్చినోడికిచ్చి పెళ్లి సేసియ్యి. నేనొచ్చి అచ్చింత లేస్తా,' అని బతిమిలాడి మూడేళ్లు టయం పొంది కత్తిపట్టి ప్రేక్టీసు పెట్టేట్ట.

''మొదట మూణ్ణెల్లూ మూణ్నాల పరక రాకపోయినా, తర్వాతందుకుందా బాబు రాశి. ఆ మూడేళ్లూ ఆ బాబు నిద్దరే పోనేదుట. అసలన్నవేఁ బోంచెయ్యలేదట. లచ్చ మీద లచ్చ లారి జించి పారేసేట్ట. మూడేళ్లూ అయ్యోసరికి, 'ఇదిగో, మాఁవాఁ! మూళ్లచ్చల మీద మరో అరలచ్చ మిగల్చేప్పేను యిప్పుడేటంటావ్?' అని మా యమ్మగోర్ని పెళ్లాడేసేట్ట.

''కాని, ఆ మూడేళ్లలో పట్టుకున్న దనదాహం, మరిడమ్మకు పట్టుకున్న రకత దాహంలా, మన దురగమ్మ కూతుర్ని పట్టుకున్న తురక దెయ్యంలా మరొగ్గలేదా బాబుని. లచ్చిందేవికి తన బతుకు బలిచ్చీసినాడనుకో.

''ఇలాగుండగా మూడేళ్ళొద్దిప్పటికి. ఆఏల దసరా దసింవిఁ. ఆ బాబు ప్రేక్టిసెట్టిం దాపొద్దే. రేత్తిరి కింట్లో పెద్ద పారిటీ ఏర్పాటుసేసినాడు. ఆ మద్దేన్నం రెండయ్యో వరకు పన్జేసి కారెక్కి, 'మరి మద్దేన్నం రావద్దు పోనీరా ఎంకటేశా,' అన్నాడు. నేను కారు లాగించా. కారంటే కారా, రెక్కల్లేవు గాని గాల్లో ఎగిరిపోద్దనుకో. అసల్దానింజను యిమానపింజనట- నాకు గేటు దాటించ బొయ్యో సరికి అడ్డంగా రోడ్డు మీద లారీ వస్తే గేటు దాటి కారాపేసేను. గూరకావోడు గేటేసేడు. నాను గేరు మారసబోతూ వుంటే పరిగెత్తుకొచ్చేడొరే ఓ జాలరోడు. మనిషెలాగున్నాడనుకున్నావేటి? గట్టునబడి మొన్నటి పొద్దు సచ్చిపోయిన నల్ల సేపలాగున్నాడు. ఆడు నిలబడుంటేనే బతికున్నా డనుకుంటాంగాని పడుకోబెడితే సచ్చిపోయేడనుకుంటాం.

''ఆడి వొంటికి గోసీ తప్ప ఏట్నేదు.

''కంటిని సీకటి తప్ప మరేట్నేదు.

''బాబూ! డాట్రుబాబూ! రచ్చించు, రచ్చించు. పిల్లోడు సంద్రంలో పడిపోనాడు. అల్లదిగో మావోళ్లు మోసుకొస్తున్నారు. బాబ్బాబు! యింటికెళ్లిపోకు, రచ్చించు,'' అని కారు కడ్డంపడ్డాడు.

''ఈడి నెత్తిని బేడకాసెడితే, అణాపరక్కి ఎవుడూ కొండు, యిప్పుడింటి కెళ్లకుండా యీడి కొడుకుని రచ్చిస్తే ఈ డేటిస్తాడు? ఏటివ్వగల్డు? యిశ్వాసం ఎవుడిక్కావాలి? పావలాపరకిచ్చి కల్లురొట్టి కొనిపారేస్తే యీదికుక్క సూపుద్ది యీడికంటే ఎక్కువిశ్వాసం, అని మాబాబనుకున్నట్టు న్నాడు. అసలా బాబేటనుకున్నా నాకు తెలిసిపోద్దిలే.

''ఆ బాబు ఆ జాలరోడొంకోపాలీ, నావంకోపాలీ సూసి 'దరమాసుపత్తిరికి తీసికెళ్లం,'డని ఆడ్తో అని, 'పోనీరా,' అన్నాడు నాతో. నాను పోనిచ్చినాను.

''మా వెల్లబోయీసరికి, ఆనందు కలకటేరు కొడుకు పుట్టిన్రోజు పారిటీ కెళ్లేడు. 'రండి, రండి' అంటూ మా యమ్మగోరెదురొచ్చినారు. మా బాబు కారు దిగి, 'వణ్ణం దిని బేగిరారా ఎంకటేశా! ఊళ్లో కెల్దారి,' అని నన్ను పంపించీసేడు.

''అరగంటలో వణ్ణందిని నానొచ్చీసినాను. అప్పటికే సూటేసుకొని తయారైపోనాడా బాబు. కారెక్కి 'జెనరలాస్పత్తిరికి పోనీరా,' అన్నాడు. మాం ఆసుపత్తిర్లో కెల్లబొయ్యీసరికి మా కారుజూసి ఓ డాట్రు పరిగెత్తుకొచ్చినాడు. యిలా ఎలా పరిగెత్తేడనుకున్నావేటి? అల్లప్పుడు మన సిటీసర్వీసు సివంచలంగోడి బస్సు స్టూడెంటు కుర్రోళ్లు తగలబెట్టేసి, సివంచలంగోడిని కాలిశీడానికి ఆడెంట బడితే ఆడు పరిగెత్తినాడే- అప్పుడ్నేను నాయరు కొట్టో టీ తాగుతున్నాన్లే- అదుగో ఆ సివంచలం గోడ్లా పరుగెత్తుకొచ్చినాడా డాట్రు. ఆ బాబూ, మా బాబూ ఏదో యింగ్లీషులో మాటాడుకొని పరి గెత్తినారు. ముందాళ్లూ, ఎనక నేనూ ఏకబిగిని మూడంతస్తులెక్కేసినాం. తోవలో అగపడ్డ పెతీ డాట్రూ మా యెనకబడ్డాడు.

''మూడో అంతస్తు జేరేక ముందున్న డాట్రు ఒగ్గది తలుపు తీసినాడు. మా బాబు గదిలో కెల్లబోయి గదిలో నేల లేనట్టు నిలబడిపోనాడు నానెళ్లి సూద్దును కదా!

''గది మద్దిల బల్లమీద మా అబ్బాయి బాబు సచ్చిపడున్నాడు. నీరు మింగేసేడేమో, కడుపు బంతిలాగైపోనాది. బాబోరే; నేన్జెప్తా నినుకో. నన్ను కన్నతండ్రి నా సేతుల్లోనే పేనాలొగ్గేసి నాడు. నన్ను కన్నతల్లిని యిదుగో, ఈ సేతుల్తోనే బూడిద సేసీసేను. అప్పుడు కూడా నాకంత కష్టం కలగలేదంటే నమ్మండొరే.

''వచ్చేవా నాన్నా' అన్నట్టు అబ్బాయి బాబు కళ్లు మాకేసే సూస్తున్నట్టున్నాయి. కాని చిత్తర వేఁటంటే మా డాట్రుబాబు ఒక్క మాట మాటాడితే నిన్ను సంపుకు తిన్నంతొట్టు. ఒక్క కన్నీటిసుక్క రాలుస్తే నాను బారికాడికి పుట్టినట్టే.

''అబ్బో! గొప్పోళ్లు కష్టం సుకం ఒక్కనాగే అన్బుగించీస్తారు. మన బీదెదవలే- ఎవడన్నా మన గుడిసెలకాడికొచ్చి బీడీ కాల్చుకోడానికి అగ్గిపుల్ల గీస్తే కొంపలంటించీసినట్టు గోల సేసేస్తాం. మన పిల్లోడికి రెండిరోసినాలైతే సచ్చిపోయినట్లే ఏడిసేస్తాం. కాని గొప్పోళ్లలా కాదులే.

''సుట్టూ వున్న వాళ్లంతా కుసింత తెలుగులో, ఎక్కువింగ్లీషులో మా బాబుతో ఏటేటో జెప్పేరు. నాకరదవయిందేటంటే- మా అబ్బాయిబాబు ఆస్పత్తిరికొచ్చిన ఎంటనే పేనం ఒగ్గేసి నాడనీ, పావుగంట ముందొస్తే సచ్చిపోయీవోడు కాదని మాత్తరం అరదవైంది.

''ఆకిరికెలాగైతేం నాలుగ్గదులు దాటి యీదివొరండాలో కొచ్చినాం. ఆ గుంపెనకాల నానున్నాను ముందు మా బాబున్నాడు.

“వొరండా మలుపు దిరగ్గానే మాబాబు దెయ్యాన్ని సూసినట్టాగిపోనాడు. ఏటైందో ఏటోనని నాను ముందుకెళ్లి సూద్దును కదా! మా కెదురుగ్గా ఎవుడొచ్చినా ఉంటావేటి? సచ్చిన నల్లసేప శవంజాలరోడుఁ ‘పిల్లాడెలాగున్నాడు బాబూ,’ అంటూ ముందరకొచ్చినాడు.

“అడ్ని సూసేసరికి మా బాబు కాళ్లాడక, పక్కనే బెంచీమీద కూలబడిపోనాడు. మోకాళ్ల మీద సేతులెట్టుకొని, సేతుల్లో మొకమెట్టుకొని ఉండచుట్టుకుపోనాడు. కానప్పుడు మాత్తరం మా బాబు కన్నీటిసుక్కలు ఆ బాబు జోళ్లమీద పడ్డాయొరే!

“కాని ఆ బాబు దగ్గర కెవరూ ఎల్లనేలేదు. కాస్సేపేడిసేస్తేగాని దుఃఖం కడుపు కోసేస్తాదని మావంతా వల్లకుండిపోనాం.

“అయిదు నిమిషాలయ్యేక ఒక ముసిల్డాక్టరు మా బాబుకాడ కెల్లి బుజమ్మీద సెయ్యేసి నెగమన్నాడు. కాని మా బాబు నెగనేదు. ఆ ముసిలాడు కుదిపినాడు. కుదిపీసరికి కింకేటుంది? మా బాబు నేలమీది కొరిగిపోనాడు. అంతా క్లోజైపోనాది.

“ఆ బాబ్బతికున్నన్నాళ్లు బీదోళ్లకే సాయం సెయ్యనేదు. ఆళ్లని సచ్చిన పురుగుల్లా సూసేవోడు. ఆళ్లు కూడా తననలాగే సూస్తారనుకునీవోడు కావోఁలు. ఆ జాలారెడవ తన పిల్లోడి పట్ల యింతబిమానం సూపిస్తాడనుకొనుండడు.

“బిడ్డ సచ్చిన సాక్కు (షాక్) నిలబడినాడుగాని బీదోడు సూసిన సత్తేనికి నిలబడ్నేపోనాడు. ఆ సాక్కు సచ్చిపోయి ఆసుపత్తిరొరండాలో దిక్కుమాల్ని సెవంలా పడిపోనాడు,” అని అతను ఆగి బీడి ఆఖరి దమ్ములాగి, కిటికీలోంచి విసిరేసి, తన కథ ఎఫెక్టు కోసం అందర్నీ కలియజేసేడు.

“మీ యమ్మగోరేటైనారు,” ఎవరో అడిగేరు.

“ఏటౌద్ది, కనుకున్నాడు పోనాడు, కట్టుకున్నోడు పోనాడు. ఆశ లగ్గిలో పడిపోనాయి.

“ఇంతకీ కంట్రాక్టరు కనకయ్య సస్తే మెకానిక్కు ముత్తుస్సోవింగోడున్నాడనుకోడానికి మన దురగమ్మలాటిదిగాదొరే మా యమ్మ.

“ఆయమ్మ కత మరోపాల్సెబుతాగాని, దిగు దిగు టేసనొచ్చీసినాది,” అంటూ అతను రైలు దిగిపోయేడు.

*జ్యోతి దీపావళి, 10 నవంబర్ 1971*

## నేపథ్యం

డబ్బు కోసం గడ్డి తినే వాళ్ల కథ

# డబ్బు

***మన చిన్ననాటి అనుభవాలు, చుట్టూ ఉన్న మనుషులు, పెరిగిన వాతావరణం మన మనసులో చెరగవు. అలాగే ఉండిపోతాయి. కథలు బాగా చెప్పగలిగినవాడే బాగా రాయగలడు. కథ ఎప్పుడూ జీవితం నుండి రావాలి అనేవారు శాస్త్రిగారు. కొంత నిజానికి, కొంత కల్పన జోడించాలన్నది కూడా ఆయనే.***

కథకి నేపథ్యం చెప్పే ముందు, నా చిన్నతనం నేపథ్యం కొంత చెప్పాలి.

మా చిన్నతనంలో రాత్రిపూట వాకిట్లో అరుగుల మీద పడుకొని, రోజూ మా తాత చేత కథలు చెప్పించుకొనేవాళ్ళం. ఆయన మాకు కొన్ని వేల కథలు చెప్పుంటారు. మాకు భయం పోగొట్టడానికి అప్పుడప్పుడు దెయ్యం కథలు కూడా చెప్పేవారు. అందులో సగం కల్పన అని పెద్దయ్యాక తెలిసింది. కాకి కథ సరిగ్గా గంట చెప్పేవారు. ముందు చెట్టుని వర్ణించేవారు. పెద్ద చెట్టు, దాన్నిండా కొంగలు, కాకులు, పిచ్చికలు, గెద్దలు, చిలకలు, మైనాలు, రకరకాల పక్షులు గూళ్ళు కట్టుకొని ఉండేవి. అవి మీలాగా దెబ్బలాడుకోలేవు. కబుర్లు చెప్పుకొంటూ సరదాగా ఉండేవి. ఆ తరువాత చెరువు వర్ణన. సముద్రమంత చెరువు. చెరువు నిండా ఆకుపచ్చటి తివాసీ పరిచినట్టు తామరాకులు. ఆ తివాసీ మీద అక్కడక్కడ జల్లినట్టు తామర పువ్వులు. చెరువులో చేపలు, కప్పలు, పాములు, జలగలు, గుడికి వెళ్ళిన వాళ్ళంతా ఆ చెరువులోనే మెట్ల మీద నిల్చుని కాళ్ళు కడుక్కొంటారు కదా. అప్పుడప్పుడు ఒకరిద్దరి కాళ్ళు జలగలు పట్టుకొనేవి. మేమంతా భయంతో మా తాత చెయ్యి గట్టిగా పట్టుకొనేవాళ్ళం. జలగ ఎంత లాగినా మనల్ని వదలదు. అలా మన రక్తం పీలుస్తూనే ఉంటుంది. చుట్టకాల్చి దాని మీద ఉమ్మితే వదుల్తుం దంటారు. ఇదీ ఆయన కథ చెప్పే తీరు. ఇంకా చెట్టు కింద పాముపుట్టనీ, రాజు కూతుర్నీ, ఆమె చెలికత్తెల్నీ మరో అరగంట

వర్ణించేవారు. బహుశా చిన్నతనంలో కథలు అంత డీటైల్డుగా వినటం వల్ల తరువాత కథలు రాయడం ప్రారంభించినప్పుడు వర్ణనలు అలవాటయ్యాయేమో!

అలాంటి కథల వాతావరణంలో పెరిగేం. మన చిన్ననాటి అనుభవాలు, చుట్టూ ఉన్న మనుషులు, పెరిగిన వాతావరణం మన మనసులో చెరగవు. అలాగే ఉండిపోతాయి. కథలు బాగా చెప్పగలిగినవాడే బాగా రాయగలడు. కథ ఎప్పుడూ జీవితం నుండి రావాలి అనేవారు శాస్త్రిగారు. కొంత నిజానికి, కొంత కల్పన జోడించాలన్నది కూడా ఆయనే. కొత్త బిచ్చగాడు పొద్దెరగడని, కథలు రాయడం ప్రారంభించిన కొత్తలో, కథకి వస్తువు కోసం మా చిన్నతనంలో జరిగినవన్నీ నెమరు వేసుకొనేవాళ్ళం. అయితే జరిగిన ప్రతి సంఘటన కథ అవదు. అప్పుడు నరసింగరావుకి చిన్నతనం. నాది మరీ చిన్నతనం. అప్పటికింకా మనం బ్రిటీషువారి పాలనలోనే ఉన్నాం. పల్లెటూర్లలో ఏ సదుపాయం ఉండేది కాదు. వైద్య సదుపాయం అంతంత మాత్రమే. మాది పల్లెటూరు. అప్పుడసలు ఎం.బి.బి.యస్. డాక్టర్లు అరుదు. అందరూ బి.ఎ. చదివేవారు. అదే పెద్ద గొప్ప. మా ఊర్లో పేరుకి ఒక గవర్నమెంట్ ఆస్పత్రి ఉండేది. ప్రైవేట్ డాక్టర్ ఒకడే ఉండేవాడు. అతను ఎం.బి.బి.యస్. కాదు. జి.సి.ఐ.ఎమ్. అని ఒక డిగ్రీ ఉండేది. అదే ఎక్కువ మంది చదివేవారు. ఆరోజుల్లో టైఫాయిడ్ వస్తే వీధిలో అరుగు మీద పడేసి ఏడుస్తూ కూర్చునేవారు (ఇంట్లో చచ్చిపోతే నక్షత్రం మంచిది కాకపోతే ఇల్లు వదిలెయ్యాలి). వాడికి ఆయుర్దాయం ఉండి బతికితే ఇంట్లోకి తెచ్చేవారు. లేకపోతే అట్నుంచి అటే. ఆ ప్రైవేట్ డాక్టర్‌కి ఆర్జించవలసిన అవసరం లేనంత ఆస్తి ఉంది. కూర్చుని తింటే పది తరాలకి సరిపోతుంది. అయితే అతనికి పిల్లల్లేరు. అయినా అతను డబ్బు బల్ల మీద పెట్టకపోతే పేషెంట్‌ని పలకరించేవాడు కాదు. 'వచ్చే జన్మక్కూడా పిల్లలు పుట్టరు ఇతనికి,' అని అందరూ తిట్టేవారు.

ఊరు మొత్తానికి ఒకటో, రెండో కార్లుండేవి. ఇతను రెండోవాడు. ఇంటికీ, ఆస్పత్రికీ దూరం అరమైలు.

రోడ్డు మీద అప్పుడొకటీ, అప్పుడొకటీ సైకిలు తప్ప మరే ట్రాఫిక్ ఉండేది కాదు. అందరూ నడకే. ఆ డాక్టరుగారి కారు ఇంటి గేటు దాటగానే ఆస్పత్రి వరకు రోడ్డు ఖాళీ అయిపోయేది. ఎక్కడివాళ్ళక్కడ చెట్టు చాటుకో, అరుగుల మీదకో పారిపోయేవారు. అతను కారుని తిన్నగా కాకుండా పాములా జిగ్‌జాగ్‌లా నడిపేవాడు. నరసింగరావు, అతని ఫ్రెండ్స్ అరుగుల మీద కూర్చుని, 'తప్పుకోండి, తప్పుకోండి. యమధర్మరాజు ఏజెంట్ వస్తున్నాడు,' అని జోకులు వేసేవారు (ఓసారి అతని కారు కింద పడి కుక్కపిల్ల చచ్చిపోయిందట).

ఇంతకీ అసలు కథ- ఆ ఆస్పత్రి పక్కనే అతని తమ్ముడుగారిల్లు. ఆ ఇంటి కెదురుగా గుడి. గుడి నానుకొనే చెరువు. గుడికి వచ్చేవాళ్ళందరూ ఆ చెరువులో కాళ్ళు కడుక్కొనేవారు. మా తాత వర్ణించినట్టే ఆ చెరువునిండా ఆకుపచ్చ తివాసీ పరిచినట్టు తామరాకులు. అక్కడక్కడ తామర పువ్వులు. ఆ డాక్టర్‌గారి తమ్ముడికి ఆరేళ్ళ కొడుకు. ఒకనాడు పొద్దున్నే తల్లి పనిలో ఉండగా ఆ కుర్రాడు రోడ్డు మీద ఆడుకొంటున్నాడు. వాడికెందుకో తామరపువ్వు కొయ్యాలని పించింది. చెరువు దగ్గరికి వెళ్ళి మెట్ల మీద నిల్చుని కొయ్యబోయాడు. అందలేదు. మరికొంచెం ముందుకి వంగేడు. కాలు జారి నీళ్ళలో పడిపోయాడు. చెరువు గట్టు మీద చద్దిమూటలు విప్పి తింటున్న కూలివాళ్ళు చూశారు. గబుక్కున నీళ్ళలోకి దూకి ఆ కుర్రాడ్ని బైటికి తీశారు. కాని అప్పటికే వాడు బాగా నీళ్ళు తాగేశాడు. వాళ్ళు వెంటనే ఆ కుర్రాడ్ని భుజాన వేసుకొని పక్కనున్న ఆస్పత్రికి తీసుకెళ్ళేరు. కుర్రాడ్ని వరండాలో బెంచీ మీద పడుకోబెట్టి డాక్టరు దగ్గరకు వెళ్ళి అడిగారు,

వెంటనే వచ్చి చూడమని. ఆ డాక్టర్ వాళ్ళని పై నుండి కిందికీ, కింద నుండి పైకీ చూశాడు. పైన తలకి ఒక చిరిగిన తువ్వాలు, కింద ఒక చిరిగిన తువ్వాలు తప్ప ఏం కనిపించలేదు. డబ్బు టేబిలు మీద పెడితే చూస్తానన్నాడు. ఇంకా కూలికి వెళ్ళలేదు, సాయంత్రం వచ్చి డబ్బు ఇస్తాం, ముందు ఈ కుర్రాడ్ని బతికించు. సాయంత్రం డబ్బు తెచ్చేవరకు మా ఆడదాన్ని ఇక్కడే ఉంచుతాం. పాపం! ఏ అమ్మ కన్నబిడ్డో బతికించమని బతిమాలేరు. ససేమిరా వీల్లేదన్నాడు. చేసేదిలేక కొంచెం దూరంలో ఉన్న గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకెళ్ళేరు. అది ఇంకా తెరవలేదు. ఆ కాంపౌండులోనే చెట్టు కింద కూర్చున్నారు. మరో పది నిమిషాలకి ఆ కుర్రాడికి ఏ డాక్టరు అవసరం లేకపోయింది.

ఎవరి పిల్లాడో తెలీదు. మళ్ళీ చెరువుగట్టుకే వెళ్ళి అక్కడ ఆ కుర్రాడ్ని పెట్టుకొని కూర్చున్నారు. ఆ తరువాత తల్లి వెతుక్కొంటూ రావటంతో తమ్ముడి కొడుకేనని తెలిసింది. వెంటనే చూస్తే బతికేవాడనీ, నిక్షేపంలాంటి పిల్లాడ్ని వెధవ డబ్బు కోసం పొట్టన పెట్టుకొన్నాడనీ, అందుకే భగవంతుడు అతనికి పిల్లల్ని ఇవ్వలేదనీ ఊరంతా తిట్టేరు.

ఈ సంఘటన ఎన్నో ఏళ్ళ క్రితం జరిగినా కథలో పాయింటుంది. అప్పుడు అలా డబ్బు కోసం గడ్డి తినేవాళ్ళు ఊరికొకరుంటే, ఇప్పుడు అందరూ గడ్డి తింటున్నారు. అంచేత డబ్బు కథలు చాలా రాయాలనుకొన్నాం. కథావస్తువు వచ్చేసింది. అయితే ఎలా చెప్పాలి? కథ సీరియస్‌ది కాబట్టి కొంచెం లైట్‌గా చెప్పకపోతే చదవరు. అంచేత లారీ డ్రైవర్‌ని పెట్టడం జరిగింది. అయితే కథకి బలం ఉండడం కోసం, ఆ కుర్రాడు ఆ డాక్టరు కొడుకని మార్చేం. అయితే ఇంకా బలం చాలలేదు. క్లైమాక్స్ రక్తి కట్టలేదు. అంత డబ్బు ఉన్న ఆ డాక్టర్‌కి లేని మానవత్వం ఆ కూలివాళ్ళకి ఉండడం అతనికొక షాక్. ఆ షాక్‌కి తట్టుకోలేక అతను కూడా చచ్చిపోతాడు. అదీ క్లైమాక్స్. ఇవన్నీ కథ కోసం చేసిన మార్పులు. జీవితంలో జరిగిన సంఘటనకైనా కొంత పట్టు ఉండాలి. లేకపోతే అది కథ అవదు. కామెంటరీ అవుతుంది. కథ చదివిన వాడి మనసుకి తగలాలి. దాని గురించి ఆలోచింపజెయ్యాలి. అప్పుడే మంచి కథ అవుతుంది. ప్రతి కథనీ జీవితంలో నుండే తీసుకొన్నాం. కాకపోతే మన స్వంత అనుభవాలే అయితే బాగా రాయగలం. ఒకరు చెప్పినవి అయితే అంత బాగా రాయలేం. ఏదైనా సరే ముందుగా మనం ఫీలవ్వాలి. ఫీలింగ్ లేకపోతే చప్పగా ఉంటుంది.

*ఐ రైట్ వాట్ ఐ ఫీల్!*

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 21 సెప్టెంబర్ 1997*

16

# చీమలు

## బోయ జంగయ్య



*బోయ జంగయ్య 1 అక్టోబర్ 1942లో జన్మించారు. వీరి మొదటి కథ 'మనస్సు' 1970 తరుణి మాసపత్రికలో అచ్చు యింది. దాదాపు 120 కథలతో 15 కథాసంపుటాలు, 4 నవలలు, 3 కవితా సంపుటాలు, 4 జీవిత చరిత్రలు ప్రచురించారు. రెవెన్యూశాఖలో ఉన్న తాధికారిగా పదవీవిరమణ చేశారు. కొన్ని కథలు ఇతర భాషలలోకి అనువాదమయ్యాయి. అనేక సాహితీ పురస్కారాలతో పాటు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 2003లో గౌరవ డాక్టరేట్ పొందారు.*

**చిరునామా**
*201, ఐకాన్ ఆర్కేడ్, ప్లాట్ నెం. 100,
అభ్యుదయనగర్, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070.
Ph.: 94406 73414*

ఊరుకు ఫర్లాంగు దూరములో ఓ చెరువు

ఆ చెరువు ఆ ఊరికి కన్నతల్లి లాంటిది. తల్లి తన బిడ్డకు రెండు రొమ్ములు కుడిపి పెంచినట్టు, చెరువు పూర్తిగా నిండితే రెండుకార్లు ఆ ఊరి పొలాల్ని పారించి పండిస్తుంది. వర్షాల్లేక కుంటలు ఇంకిపోయి చెరువులు దగ్గరికయినయి. అందువల్ల ఉన్న నీటిని జాగ్రత్తగా పారించుకోవలసి ఉంటుంది, కట్టెమ్మటి ఉన్నోళ్ల పొలాలు, పోనుపోను పేదోళ్ల పొలాలు. భూస్వాములకు తప్ప ఎవరికీ పదెకరాలు లేవు. ఈ కారు ఆఖరు వరకు పారటం కష్టం.

పెద్ద భూస్వామి సీతయ్య దగ్గరికెళ్లి-

"దొరా! పేదోల్ల మీద ఓ కన్నుంచాలె," అన్నారు పేదజనం.

'పారినంత వరకు పారించటంతప్ప మరో మార్గం లేద,'న్నాడు సీతయ్య.

రోజు తప్పించి రోజైనా సరే అందరి పొలాలకి నీరందాలని మిగతావాళ్ల వాదన.

అందరు అలుగు దగ్గరున్న మర్రిచెట్టు కింద మైసమ్మ గుడి పక్కన నిలుచుని చెర్లో నీళ్లను, చెర్వుకింది పొలాలను చూస్తున్నారు.

“ఈ వున్న నీళ్లను అందరి పొలాలకు పంట చేతికొచ్చేవరకు పారించటం కష్టం,” అన్నాడు భూస్వామి సీతయ్య. అందరికంటే అన్నీ ఉన్నవాడు, వయసులో అరవై దాటినవాడు, అప్పులు ఇస్తుంటాడు. అందుకని ఆయనను అందరు దొర అంటారు. అంతేకాదు, ఆయన పుట్టుకతోకూడ వెలమదొర.

“అట్లెట్లా దొరవారు,” అన్నాడు షావుకారు రంగయ్య తన పొలం పారకుండా పోద్దేమోనని.

“ఎట్టేంది, స్టాకు లేకున్నా పందార ఇస్తవా నీవు,” సీతయ్య. రంగయ్య జీవంలేని నవ్వు నవ్వి ఊరుకున్నాడు.

“వున్న ఎకరం పారకపోతే యిగ ఎండిల్లే,” అన్నాడు వడ్డెరి పెంటయ్య.

“నాకు ఇరవై గుంటలు. అది ఎండిపోతే మా పని ఉత్తదే,” సంకలోని సంచిని సర్దు కుంటూ అన్నాడు మంగలి మల్లయ్య.

“ఇప్పుడు వొక్క ఆనపడితేనా,” అంటూ పెదవులను అదిమి వదిలాడు నీరుడుకాడు శివయ్య. (నీరుడుకాడు చెరువు నీటిని పొలాలకు పారించే వ్యక్తి.)

“సూడండి, మొత్తం సెరువు కింద ఆరొందల ఎకరాలు. కట్ట దగ్గర ఉన్న భూస్వాముల మూడొందల ఎకరాలు పారితే మా ఎక్కువ. ఇగ మిగిలినవాళ్లు ఆశ వదులుకోవాల్సిందే,” శివయ్య చిట్టా విప్పుతూ అందరివైపు చూశాడు. అంతేకాదు, నేను సెప్పేది నిజం అన్నట్టు కదిలాడు.

“అంటె ఆల్లకే కడుపుంది, ఆల్లె అన్నం తింటరు,” మొద్దు గౌండ్ల సిద్ధగోని పాపయ్య.

“అట్లనికాదు, ఉన్న నీళ్లు మొత్తం పొలమైతే పారదు,” ఈసారి శివయ్య గొంతు తగ్గి చూపులు తడబడ్డాయి.

“అంటె,” బంటోల్ల పిట్టెల రాములు.

“దినం తప్పించి దినం పెట్టినా మీది పొలం పారి కింది పొలం సగం కూడా పారదు,” నేను ఉన్నది ఉన్నట్టు చెపుతున్నా అన్నట్టు చూశాడు శివయ్య.

“అట్టెందుకు మీది పొలం వదిలిపెట్టి కింది పొలమే పారిస్తే,” కురుమ బీరప్ప సలహా.

“బీరప్ప అంత అలకగ మాట్లాడకు. కింది పొలంవాళ్లు కిరాయికి దున్నిచ్చి మొలక చల్లి నోళ్లే. ఒకందుకు వాళ్లు ఓర్చుకోవాల్సిందేగాని, మీది పొలం వాళ్లందరు గొడ్డు, గోద వున్నోళ్లు. ఆ పొలం పారితే గింజలు వదిలిపెట్టు. గడ్డన్న దక్కాలి గద, లేకపోతే ఆ నోరులేని పసులు బతికేది ఎట్లా,” అని మట్టారెడ్డి అనగానే-

“అవునవును మేము పసులకంటే ఈనమాయె,”చింతకింది అయిలయ్య అందుకున్నాడు.

“మనం మనం తగదా పడేదెందుకు. అందరం కల్సి ఎమ్మార్వోకి దరఖాస్తు పెడదాం. వాళ్లు ఎట్లా సెపితే అట్లనె,” సీతయ్య.

“సర్కారోళ్లు పేదల నోళ్లు కొట్టి పెద్దోళ్లకు పెట్టెటోళ్లాయె. ఆల్లేమి సెపుతరు. మన ఊరు సంగతి మనమే తేల్చుకోవాలె,” బీరప్ప.

“అదిగో సర్‌పంచి కూడా వస్తున్నాడు. ఆయన ఏమంటాడో విందాం,” సీతయ్య తరువాత మంచి ఆస్థిపరుడు రెడ్డే. అంతేకాదు, ఆయన రాజకీయాల్లో కూడా తిరుగుతు వుంటాడు.

“సర్‌పంచి మాట మీరింటారా, ఆయన మావోలే పూటకు లేనోడాయె,” అయిలయ్య.

మోకాలి వరకు ముతక ధోతి, అంగట్లో కొన్న తెల్ల అంగి, సగం నెరసిన జుట్టు, బుజం మీద ఎరుపు, తెలుపు గీతల కండువా, చదువు చాయల్లేని అమాయకపు చూపులు.

“ఉన్నా లేకున్నా మీరంతా ఎన్నుకున్న సర్‌పంచ్ గదూ!” మట్టారెడ్డి.

ఆ ఊరి సర్పంచి స్థానం ఎస్.టి.ది. అతను ఉండే విధానం, మాటతీరుని బట్టి ఎరుకల సాయన్న అంటారుగానీ సర్పంచ్‌గారని ఎవరు పిలవరు. కులవృత్తి తప్ప ఆయన మరోపని గూడ చేయలేడు. ఈ మధ్యనే సంతకం చేయ నేర్చుకున్నాడు. సర్పంచ్ అందరి మధ్యకొచ్చి సీతయ్యకు, మట్టారెడ్డికి నమస్కరించి నిల్చున్నాడు. సాయన్న పక్కన నిల్చుని ఏమి చెపుతాడో వినాలని చూస్తున్నాడు. సీతయ్యను, మాట్టారెడ్డిని, చెరువును, చెరువు కింది పొలాలను, అక్కడ నిల్చున్న పెద్ద-చిన్న రైతులను చూస్తూ ఉన్నాడు సర్పంచిగారు.

"సర్పంచ్ చెపితే మాకు సమ్మతమే," అన్నాడు మట్టారెడ్డి. సర్పంచిగ సాయన్న పేరును సూచించింది తానె కనుక తన మనిషి అన్న నమ్మకం.

"అంతేగద," అన్నాడు సీతయ్య. తన పొలం తరువాతే మట్టారెడ్డిది. ఆయన తన పొలం పారే పతకం ఎలాగో చేస్తాడన్న నమ్మకం.

"ఇక యినందెవరు మేమేనా," అన్నాడు అయిలయ్య, బీరయ్య, పాపయ్య ఒక్కసారె!

"నేను సెప్పేది ఏమున్నది. అందరం ఎట్లా అనుకుంటే అట్లనే," అన్నాడు సర్పంచ్.

"ఊరు సర్పంచివి. నీవు ఏది సెప్పినా దానికి విలువ ఉంటుంది," మట్టారెడ్డి.

"అందునా నీకా చెర్వుకింద పొలం లేదు తన మన అనుకోవడానికి. కాబట్టి నీవు ఏ మాట చెప్పినా సెల్లుతుంది," సీతయ్య.

"నా వొక్కని మాట ఎందుకు? నలుగురు ఎట్లా అంటే అట్లనే," సర్పంచి.

"గందుకే నీకు తోచింది, నలుగురికి నచ్చేది చెప్పు," శివయ్య.

అందరివైపు మరోసారి చూసి, ఎందుకో చివరి పొలం వైపు చూశాడు. ముదురుపచ్చగా తలలూపుతున్నవి. సరిగా నీరందని చివరి పొలాలు కొసలు మాడి బెల్లం రంగులో ఉన్నవి. మొత్తం చెరువు కింద పొలాన్నంతా చూస్తున్నాడు.

"ఈ ఉన్న కొన్ని నీళ్లు అంతటి సాయన్న సంగతి కూడ ఆలోచించు," సీతయ్య.

'ఏదో ఒకటిచెప్పు," మట్టారెడ్డి.

"ఎలచ్చన్ల ఎక్కువ ఓట్లు వస్తే గెలిచినట్లు, ఎక్కువమంది ఏదంటె అదె," అన్నాడు. అప్పుడు ఆయన ఎవరివైపు చూడలేదు.

ఆ మాట వినగానే సీతయ్య ముఖం చిన్నబోయింది. మట్టారెడ్డికి నోట మాట రాలేదు.

చెర్లో నీళ్లన్ని మీది పొలం పోకుండా కాలవ గుండా పోయి కింది పొలం పారుతున్నట్టు, పై పొలాలు ఎండిపోతున్నట్టు అనిపించగానే వెంటనే మాట మారుస్తూ-

"ఇదంతా ఎందుకు? సర్కారోళ్లు ఎట్ల చెపితే అట్లనే. పాపం సాయన్నను ఎందుకు ఇరకాటంలో పెట్టాలె."

సర్పంచ్‌ను చెప్పమని, ఆయన సెప్పింది వినకుండా మాట మారుస్తున్నందుకు, "ఊరు ఊరికి ఓ పంచాయితీ బోర్డు ఉన్నంక సర్కారు దగ్గరకెందుకు? యిక్కన్నే తెంపుకోవాలె," అన్నాడు అయిలయ్య.

"అంతేమరి," బీరప్ప గొంగడిని ఎగేస్తు, గొడ్డలిని నేలకు పొడుస్తూ అన్నాడు.

"ఆ సంగతి వదిలేయి. ఇప్పుడు కింది పొలం వదిలేసినంక రేపోమాపో ఆనొచ్చి చెరువు నిండితే ఎండిన పొలం మళ్లీ సేతికొస్తద?" అని సర్పంచ్‌గారు అనగానే అంతే అన్నట్టు కింది పొలాల వాళ్లు తలలూపారు.

పై పొలాలవాళ్లు మౌనంగా అక్కడి నుండి కదిలారు.

*

ప్రభుత్వం సారా వద్దన్నా గడీలల్లో సారా కాగుతూనే వుంది. మట్టారెడ్డి పటేలు గడిలో అందరూ కూడి కాపుసారా తాగుతూ కూర్చున్నారు. సేవకపు రాములు సారాయి పంచుతూ చిట్టుల్వలను, కారపు శనిగలను ఆకులలో అందిస్తున్నాడు.

మట్టారెడ్డి తల నిండా ఆలోచనలే! సీతయ్య మట్టారెడ్డి మనస్సులో మంటను రాజేస్తు న్నాడు.

''సాయిలును నమ్మితే లాభంలేదు. ఏదో ఒకటి అనేసినంక దాన్నే నలుగురు సయి అన్నంక తొలగటానికి వీలుండదు.''

దూరంగా దర్వాజ దగ్గర గోడ నీడన కూర్చున్న శివయ్యను దగ్గర్కి రమ్మని సైగ చేస్తూ తాను బంకుల్ల నుండి బయటి దర్వాజవైపు నడిచాడు. మిగతావాళ్లు సారాను మింగుతూ మాటలు మరిమరి గుర్తు చేసుకుంటూ-

''కూలోని దగ్గరికి కూలికి పోకూడదట. పాలోని దగ్గర్కి పనికి పోకూడదట. ఆఖరి పాలాలు పారినా మనకే మొరుగుతుంది,'' అంటా నవ్వుకుంటున్నారు. సీతయ్య, మట్టారెడ్డి మాట్లాడు కున్నారు.

సాయన్న కోసం కబురు పంపి, ఆయన ఊళ్లో లేడు, పట్నం వెళ్లాడని, రెండు మూడు రోజుల దాకా రాడని తెలుసుకున్నారు.

కూలి చేసుకునే అందరికి ఆ రాత్రి కూలి దొరికింది.

గొడ్డల్లు నూరుకొని ఊరుచుట్టు నాలుగువైపులా నడిచారు.

మరునాడు సర్పంచ్ భార్య ఎంకమ్మ, సీతయ్య దొర ఇంటి ముందు నెత్తినోరు కొట్టుకుంటూ నిల్చుంది. దొర ఊళ్లో లేడని, తిరపతికి పోయిండని సేవకపు రాములు చెప్పాడు. మట్టారెడ్డి ఇంటి ముందు రొమ్ము బాదుకొని మొత్తుకుంది. ఆయన ఏదో పార్టీ సభని పట్నంలో ఉన్నాడన్నారు. దిక్కు తోచని స్థితిలో ఊరంతా తిరుగుతూ ఏడుస్తూ ఉంది.

సాయిలుకున్న సర్పంచ్‌గిరి వద్దని చెపుతూ వాడవాడ తిరిగింది. మనిషి మనిషికి చెప్పింది.

ఆమె స్థితిని చూసి సాటి ఆడవాళ్లు అంగలార్చుతూ ఆరోజు చెట్లు నరకడానికి వెళ్లిన తమ తమ మొగలను ఎనక ముందు ఎరగని ఎర్రోల్లని, తమ చేతులు తామే నరుక్కునే మూర్ఖ లని తిట్టిపోశారు. ఆరోజు తెల్లవార్లు గొడ్డళ్ల చప్పుడు, చెట్లు కూలుతున్న శబ్దం గుర్తొచ్చి, 'అన్యాయం అంటే అన్యాయం,' అన్నారు.

అడవిలో అర్ధనగ్నంగా తిరుగుతున్న సాయిలు నర్కి వేయబడ్డ ఈతచెట్లను చూస్తున్నాడు. చేతిలో కొడవలి. చెదలు పట్టిన ఈత మట్టలను చూస్తూ మూగగా ఏడ్చాడు.

'మళ్లీ ఓ చెట్టు పుట్టి మట్ట పెరగడానికి ఎన్నేండ్లు కావాలి? అప్పటివరకు తాను ఏం చేసి బతకాలి? మరో పని ఏదీ రాదు. మడిమాన్యాలు ఏమీలేవు. తాత, తండ్రి ఇదే పని చేస్తూ వచ్చారు. తాను ఇదే పని. ఈతచెట్లె తమ ధనం, ధాన్యం. ఈత చెట్లే బతుకు! తన బతుకులో ఎందుకు నిప్పులు పోసింర్రో సాయిలుకు అర్థంకాలేదు. సర్పంచ్ కావటమే నేరమయిపోయి నట్టుంది. ఇంతకుముందు సీతయ్య దొర సర్పంచ్ చేస్తే సర్పంచ్ దొరన్నారు. సర్కారు గాలికి తనను సర్పంచ్ చేసి అతి కష్టంగా సాయన్న అన్నారే కానీ సర్పంచ్ సాయిలు అని గూడ ఎవరు పిలవరైరి. పిలవకుంటే పిలవకపోయిరి, తన నోట్లో ఎందుకు మన్ను బోసినట్టు.'

''కాపుసారా మత్తులో ఈతచెట్లన్నీ నరికేసింండ్రు కానీ ఈ ఊరోళ్లకు కల్లు కరువౌద్దని మరి సింర్రు,'' అని తెల్లారి ఓ పండు ముదుసలి గుర్తుచేసేసరికి అందరు నోరు తెరిచారు.

''తట్టలు- తడికెలు, గంపలు- గుమ్ములు ఏంబెట్టి అల్లుతరు? పరాయి ఊరే గతి. అయినా ఏం పోయే కాలమిది? కూలికి యసనం తాగటం అంటే ఇదేనేమో,'' అంటూ ఆడ వాళ్లు నోళ్ల మీద చేతులేసుకున్నరు. అంతేకాదు, తాగిన నోరు ఆముదాలు బుక్కినదట అంటూ మగవాళ్లకు చురకలు వేశారు. చేసిన పనికి లెంపలేసుకున్నరు. పటేలోని పన్నాగానికి పళ్లు కొరికారు. దొరోని మోసానికి బుసలు కొట్టారు. సాయిలు, సాయిలు భార్య ఎంకమ్మ మాత్రం ఊరొదిలి పోయారు.

నాలుగు రోజుల తరువాత-

ఓ గుంపు ఆవేశంలో రకరకాలుగా మాట్లాడుతూ వచ్చారు.

క్రితంలో వాళ్లు-

'అయ్యా నీ బాంచలం!'

'తండ్రీ నీ కాల్మొక్కుతం.'

'మహాతండ్రీ నీ గులాపోల్లం.'

'కల్లాలు చల్లగుండాలె, తమ రాసులు పెరగాలె, సొటెడు గింజలు సెప్పుండ్రి,' అంటూ కాళ్లావేళ్లా పడే అర్ధనగ్నపు మగవాళ్లు గుంపుగ మట్టారెడ్డి గడి ముందు నిల్చున్నారు. వాళ్ల, వాళ్ల చేతుల్లో వాళ్ల పనిముట్లున్నాయి. వాళ్ల వెంట వున్న వాళ్ల కుక్కలు తమతమ యజమానుల ఆందోళనను పసిగట్టి గడివైపు చూసి మొరుగుతున్నాయి. గడి లోపల అరచే కుక్క చప్పుడు ఊరంతా వినిపిస్తుంది. ఆ చప్పుడు మన ఊరకుక్క చప్పుడున్నట్లు లేదు.

అడవి జంతువు గాండ్రించినట్టుంది.

''పటేలు బయటికి రావాలి...'' ఒకడు.

''ఈతచెట్లను ఎందుకు నరికేసిన్రో చెప్పాలి...'' ఇంకొకడు.

''భూమాత ఇచ్చిన చెట్టును గీసుకొని కల్లో, నీళ్లో అమ్ముకొని బతికేటోళ్లం. ఇగ ఇప్పుడెట్ల బతకాలె,'' అంటూ గీత పనివాళ్ల ఆందోళన.

అన్నీ వింటూ అనుకోని ఈ సంఘటనకు ఖంగు తిన్న మట్టారెడ్డి ఎటూ తోయక దొడ్డి దర్వాజ గుండా తన మనిషిని సీతయ్య ఇంటికి పంపించాడు.

కొంతసేపటి తర్వాత అతను తిరిగొచ్చి వణుకుతున్న గొంతుతో-

''అక్కడి పరిస్తితి ఇంకా గందరగోళంగా ఉంది. అక్కడంత ఆడోళ్ల గుంపు.''

'అమ్మా బుక్కెడు సలి బువ్వ.'

'తల్లీ ఓ పాత చీరె.'

'ఈ సాపలో ఏ సాప కావాలో సూడుండ్రి తల్లీ,' అంటూ అందరి వాకిళ్లలో, అల్లుకు వచ్చిన ఈతసాపలను పరిచి, వాళ్లిచ్చింది తీసుకొనెటోళ్లు- ఈయాళ్ల వారి మాటలే మారిపోయి నాయి.

''అదే మేం బతకొద్దా. దొరలు, పటేండ్లే బతకుతర,'' ఒకరు.

''ఆల్లకు ఎకరాల కొద్దీ పొలాలు, సెలుకలున్నయి,'' మరొకరు.

''మాకేముంది, రెక్కాడితే డొక్కాడే,'' ఈతాకుతో చాపను అల్లుతున్న ఓ స్త్రీ.

''ఈతాకు మా బువ్వ, ఈతాకు మా బట్ట,'' మరో స్త్రీ.

ఆమె చేతిలో ఈతాకులు, అంతకుముందు అల్లిన చాపచుట్ట చేతికి వేలాడుతుంది.

వాళ్ల మధ్యన నడుం కట్టుకొని వాళ్లు అనే మాటలను బలపరుస్తూ, అనవల్సిన మాటలు అందిస్తూ నిల్చుంది ఎంకమ్మ. దొరసానులు జరుగుతున్నదేదో అర్తంకాక చూస్తూ నిలుచున్నారు.

ఏదో జరగనున్నదని గ్రహించిన సీతయ్య గరిసెలోకి దిగి సెవులను వాకిలివైపు మళ్లించాడు. ఈతలూ, ఓ రకం చెట్లా కొట్టేయిస్తున్నాం అనుకున్నాం కానీ చెట్టెనుక మనుషులున్నరన్న విషయం ఆలోచించలేదు. అని తల పట్టుకున్నాడు సీతయ్య- అని అక్కడి పరిస్థితిని పూస గుచ్చినట్టు చెప్పాడు.

''ఈళ్లంతా ఎక్కడోళ్లు, ఎందుకొచ్చింగ్రు?'' గొంతు చిన్నగా చేసి అడిగాడు మట్టారెడ్డి.

''ఇనొస్తలేదా పటేలా? ఈత చెట్లు కొట్టినందుకే.''

''కల్లుగీత పని పోయిందని గౌండ్లోళ్లు, ఈతాకు లేటైందని పిచ్చకుంట్లోళ్లు, తడకలు తట్టలల్లుకునే ఎరకలోల్లను అందర్నీ సాయన్న లేపుకొచ్చిండంట.''

''అమ్మా! ఒక్క చెట్టు ఎనక మూడు కులాలున్నాయన్న మాట,'' భయం భయంగా అని-

''అచ్చా... ఆ మొరిగే కుక్కలు.''

''ఆల్లయే.''

''అట్టనా మన టైగర్ని వొదులు,'' మీసాల్ని దువ్వుతూ అన్నాడు. సరే అన్నట్టు తల ఊపి కుక్క మెడకున్న గొలుసును తీశాడు ఆయన మనిషి.

టైగర్ ఒక్క ఉదుటున పరుగెత్తి గడి దర్వాజ దగ్గర నిలుచొని బయటి వాసనను పసిగడుతూ ముందలి కాళ్లతో తలుపును గీరసాగింది.

''ఊఁ కానీయ్, అన్నిటిని కొరికేయ్. వాళ్లందర్నీ తరిమేయ్,'' అంటూ సైగ చేశాడు మట్టారెడ్డి.

ఆయనతో ఉన్న మనిషి వెళ్లి గడి తలుపులు కాస్త తీశాడు. టైగర్ వెళ్లి వాకిట్లో ఉన్న కుక్కల మీద పడ్డది.

అనుకోని సంఘటనకు అందరూ బొమ్మల్లా నిలుచుండిపోయారు. ఆ తరువాత కొందరు తమ చేతుల్లోని కొడవళ్లను విసిరారు.

తెలివైన కుక్క తప్పించుకుంది.

ఆ తరువాత ఓ బక్కకుక్కను కసిగా చీల్చి పడేసింది.

మట్టారెడ్డి మరో మీసం దువ్వాడు.

ఇంకో కుక్కను మెడపట్టి నేలకు కొట్టింది టైగర్.

బక్క కుక్క కుయిక్కుమంటూ ప్రాణం వదిలింది.

తలుపు సందులో నుండి చూస్తున్న మట్టారెడ్డి పడిపడి నవ్వసాగాడు.

అది చూస్తున్న మనుషుల కళ్లు ఎరుపెక్కినయి.

ఒక్కసారె నోట్లో వేళ్లుంచి ఈలలు వేశారు.

మిగిలిన కుక్కలు తోకలను పైకిలేపి, ముందలి కాళ్లతో వాకిలిని సెగలదీశాయి.

మరొకసారి ఈలలు వేశారు.

అంతే-

బక్క కుక్కలన్నీ టైగర్ మీద పడ్డాయి.

భాషకందని శబ్దం చేస్తూ, అందనిచోటును అందుకున్నాయి.

క్షణంలో టైగర్ ఊరకుక్క నోళ్లల్ల రక్తం ఒడుస్తున్న మాంసం ముద్దలుగ మారిపోయింది.

మట్టారెడ్డి నోరు తెరిచి చూస్తుండిపోయాడు.

*రచన మాసపత్రిక, మే 1995*

నేపథ్యం

## చిలువను ముట్టడించిన
# చీమలు

***రామరాజ్యం ఎలాంటిదో నాకు తెలియదు కాని రామాయణమంతా సీతమ్మ బాధలు, రాముని వెతుకులాట అని తెలుసు. తీర దొర్కిన తరువాత నిప్పుల్లో సీత, వియోగంలో రాముడు. వాలి నంటె సుగ్రీవుని దోస్తాన్ల చెట్టుచాటు నుండి చంపాడట. మరి శంబుకున్ని ఎదురుగానే ఎందుకు చంపాడో తెలియదు. ఏదో కుట్ర అయ్యుంటుంది***

పొద్దంత పొలం పనుల్లో అలసిన అమ్మానాన్నకు వళ్ళెరుగని నిద్ర.

ఇక తాతయ్య లేడు నాయనమ్మ లేరు కనుక కథలు చెప్పేవారు లేరు. అందుకని చిన్నప్పుడు నాకు కథలు వినే అవకాశమే లేదు.

స్కూల్లో చదివేటప్పుడు సినిమాలూ చూడలేదు.

మరేం చూశాను?

ఇంట్లో అమ్మానాన్నల బాధలు చూశాను. ఇరుగుపొరుగు వెతలు చూశాను. చుట్టుపక్కల వాళ్ళ కష్టాలను చూశాను. వాళ్ళు దగ్గరివాళ్ళు కనుక దగ్గరి నుండి చూశాను.

మరి ఇంకేమి చూశాను?

ఊరి జనం పాట్లు చూశాను. ఉత్త పుణ్యానికే వాగుల్లోని ఇసుక నెత్తుక పోవటం చూశాను. గుట్టల్ని తరలించడం చూశాను. చెర్లో చేపలు మాయం కావటం చూశాను.

ఇంకా ఇంకా ఏం చూశాను?

పట్టణ వాసుల పరేషాను చూశాను. నడిరోడ్డు మీద నరుక్కోవటం చూశాను. బాంబులు విసురుకోవటం చూశాను. రైళ్ళను పడగొట్టడం చూశాను. బస్సులకు నిప్పు పెట్టడం చూశాను. పిల్లలను కిడ్నాప్ చేయడం చూశాను. తల్లులను రేప్ చేయడం చూశాను. చూస్తూచూస్తూనే ఈ జనం సోదంతా విన్నాను. ఈ జరుగుతున్న దారుణాల గూర్చి అందర్కీ చెప్పాలనిపించింది. అలా చెపుతున్నవే నా కథలు.

ఇంకా ఏమేమి విన్నాను.

గ్రామరాజ్యం నిర్మించాలన్నారు గాంధీగారు.

రామరాజ్యం రావాలన్నారు గాంధీజీగారే.

రామరాజ్యం ఎలాంటిదో నాకు తెలియదు కాని రామాయణమంతా సీతమ్మ బాధలు, రాముని వెతుకులాట అని తెలుసు. తీర దొర్కిన తరువాత నిప్పుల్లో సీత, వియోగంలో రాముడు. వాలి నంటె సుగ్రీవుని దోస్తాన్ల చెట్టుచాటు నుండి చంపాడట. మరి శంబుకున్ని ఎదురుగానే ఎందుకు చంపాడో తెలియదు. ఏదో కుట్ర అయ్యుంటుంది. రామరాజ్యం అంటే ఇప్పటి మన గ్రామరాజ్యంలాంటిదేమో. గ్రామరాజ్యం అంటే గ్రామీణుల చేత గ్రామాలను ఏలుకోవటమే కదా. క్రితంలో జరిగింది అదే కాదు? పటేలు పట్వారి అనే ఊరివాళ్లే కదా! ఓహో ప్రజాస్వామ్య పద్ధతిలోనా అంటే గ్రామ పంచాయితీ వ్యవస్థలాగనా? లాగ ఏమిటి సాక్షాత్తు గ్రామ పంచాయతీ వ్యవస్థ ఉంటే- మన ఊళ్ళోను నడుస్తూ ఉంటే అలా నడుస్తున్న గ్రామాల్లో ఓ గ్రామం కథే ఈ కథ.

ఆ గ్రామానికో గ్రామ పంచాయతీ.

దానికో పదిమంది సభ్యులు, ఓ సర్‌పంచ్.

అది ఎస్టీలకు రిజర్వుడు సీటు. అందుకని ఆ ఊరి ఎరుకల సాయన్న సర్‌పంచ్ అయ్యాడు. సర్‌పంచ్ అయినా ఆయన తిండీ, బట్టా మారలేదు. సర్‌పంచ్ జీతబత్తెం లేదు. కాబట్టి అతని బతుకులో ఏ మార్పు రాలేదు. మండలానికి వెళ్ళినా జిల్లాకి వెళ్ళినా బాట ఖర్చులు ఆయనయే. రాబడులు-ఖర్చులు వదిలేసి సర్‌పంచ్ మాట నలుగురు వినాలి కదా? మరి ఆ ఊరివాళ్ళు విన్నారా? వింటారని మీరు అనుకుంటున్నారా?

అవును అసలు కథే మీకు చెప్పలేదు కదా? కథేమిటంటే-

'చెరువు' సమస్య. అంటే చెరువునీటి సమస్య. ఇంకా చెప్పాలంటే చెరువు నీరు పారిగడి సమస్య. వర్షాలు సరిగా లేక చెరువు పూర్తిగా నిండలేదు. ఉన్న నీరు ఊరందరి పొలం పారేటట్టు లేదు. అందువల్ల మొదట ఉన్న తమ పొలం పారాలంటారు దొరలు. గ్రామ పంచాయతీ వ్యవస్థలో ఈ దొరలు ఎవరు? దొరలంటే భూమి ఉన్నవాళ్ళు. దొరలంటే డబ్బున్నవాళ్ళు. పట్టణాల్లో పెద్దపెద్ద వ్యాపారాలున్న వాళ్ళు కూడా వాళ్ళవాళ్ళ ఊళ్ళలో దొరలే. వీళ్ళు ఎగువ సభలో లార్డ్స్ లాంటివాళ్ళు. వీళ్ళు దేశమంతా ఉన్నారు కాబట్టి వీళ్ళు జాతీయ దొరలు. చాణక్యుని రాజనీతి లాగ దొరల నీతి ఒకటుంటుంది. అదే దొరతనపు నీతి. అది ఎలాంటిదో చెప్పబోయే కథలో చూస్తారు. వీళ్ల కూలిచ్చి విషం తినిపిస్తారు. వీళ్ళు సర్‌పంచ్‌లను మారుస్తారు. హోల్‌సేల్‌గా జిల్లా పరిషత్తు అధ్యక్షులను మార్చుతారు. వీళ్ళు వీటో పవర్ ఉన్న ప్రత్యేక సంతతి వాళ్ళు. ఇక కథలోకి వద్దాం. బీదాబిక్కీ వాళ్ళ పొలాలు చివర్న ఉన్నాయి. కాబట్టి చివరి పొలాలు పారాలి అంటారు పేదలందరు. పేదలంటే ప్రతీ దేశంలో ఉంటారు. ఉన్నారు. కాని మనదేశ పేదలు వేరు. మనదేశంలో ఆర్థికలేమితో పాటు కులహీనతా ఉంటుంది. ముందు కులస్థాయి తరువాతనే ఆర్థికస్థాయి. అందుకేనేమో మనదేశంలో కమ్యూనిజం నిలబడలేకపోతూంది. అప్పుడప్పుడు ఆర్థికస్థాయి మారొచ్చునేమో కాని కులం మారదు. ఇలాంటి పేదవాళ్ళు మన దేశంలో మాత్రమే ఉన్నారు. వీళ్ళే మన దేశీయ పేదలు. ఒంటి నిండా గుడ్డలుండక పోవటం ఓ గుర్తు. పట్టణాల్లో ఫుట్‌పాత్‌లు, మురికికాలువల పక్కన రేకుల పాకలు పల్లెలో పూరి గుడిసెలు వీళ్ళ చిరునామా. ఈ పేదోళ్ల వాలకం చూసి మా పొలం పారితే మీకింత కూలి దొరుకుతుంది. మా పశువులకు గడ్డి దొరుకు

తుంది. మీకు పశువులు లేవు. గడ్డి అక్కరలేదు. మీ పొలంలో పండే వాటికన్నా మేము పెట్టే కూలిగింజలే గిట్టుబాటుగా ఉంటాయి అన్నారు దొరలు.

కాదన్నారు పేదలు.

తాలూకా ఆఫీసుకు వెడదాం అన్నారు పటేలు.

ఎందుకు గ్రామపంచాయితీ ఉంది కదా అన్నాడు దొర.

సరే సర్‌పంచ్‌నే అడుగుదాం అన్నాడు పటేలు.

అయితే అతను చెప్పినట్టు అందరు వినాలే అన్నాడు దొర.

మా సంగతి వదలండి మీరు వింటారా అన్నారు పేదలు.

సర్‌పంచ్ మాట ఎవరు దాటరాదు అన్నారు దొర, పటేలు.

సరే అంటే సరే అనుకున్నారు అందరు.

సమస్య అంతా చెప్పి తీర్పు చెప్పమన్నారు సర్‌పంచ్‌ను.

ఒకవైపు తనలాంటి పేదవాళ్ళు. మరొకవైపు ఉన్నవాళ్ళు తనను సర్‌పంచ్‌గా గెలిపించిన వాళ్ళు. ఎటు చెప్పాలి? ఏం చెప్పాలి? ఒకటే ఆలోచన. తాను చెపితే వింటారా?

వింటామంటున్నారు కదా ఎందుకు వినరు.

అయితే చెపుతాను అంటూ చెరువును చూశాడు. చెరువు కింది పొలాన్ని చూశాడు. కట్ట కింద నిలుచున్న పేదలను చూశాడు. కట్ట మీద నిలుచున్న పెద్దలను చూశాడు.

అందరూ సర్‌పంచ్ ఏం చెప్పుతాడో వినాలని ఆయన వైపు చూస్తూ నిలుచున్నారు.

దొరలకు చుట్టూ ఉన్న చెట్ల ఆకులు కదిలినట్లు కనిపించడంలేదు. వాళ్ళ వంటికి గాలి తగిలినట్టు లేదు. అందువల్లా ఎదల మీద వెనుక వెన్ను భాగాల్లో తడితడి గుర్తులు.

సర్‌పంచ్ నోరు విప్పాడు.

అప్పుడు విగ్రహం మాట్లాడినట్లుంది కాని మనిషి మాట్లాడినట్లు లేదు. ఆ మాటల్లో కోపం లేదు, ద్వేషం లేదు.

''ఎక్కువ ఓట్లు వచ్చిన మనిషి గెలిచినట్లు ఎక్కువమంది ఏదంటే అదే,'' అంటూ దొరలవైపు చూడకుండా చెరువు కింద పొలాన్ని చూస్తున్నాడు. ఆ చూపు నిశ్చలంగా ఉంది. నిన్ను సర్‌పంచ్‌ను చేసింది ఎవర్రా? అన్నట్లు చూశాడు పటేలు. అప్పుడు ఆయన కనుగుడ్లు బయటికి వస్తున్నట్లు కనిపించినాయి.

నిన్ను సర్‌పంచ్‌ని చేసింది నేనురా అన్నట్టు చూశాడు దొర. ఆ చూపులు మామూలు చూపులు కావు.

సర్‌పంచ్ ఏది చెపితే అది అన్నారుగా, అన్నట్టు సాయన్నను చూస్తూ సాయన్న ధైర్యాన్ని, తెలివిని మెచ్చుకుంటున్నారు లోలోపల మిగతావాళ్ళు. ఏదో పెద్దవాన పడి చెరువు నిండినట్టు అనిపించింది వాళ్ళకు. అంతేకాదు, వాళ్ళ గుండెల్లో కూడా ఏదో కొత్త ధైర్యం నిండుతున్నట్టు అనిపించింది.

మొత్తం మీద అందరూ అక్కడ నుండి కదిలారు.

ఆ తరువాత ఎవరు ఏం చేయాలో అది చేశారు.

కూలినాలి జనానికి కల్లుసారా తాగించి చేతికి గొడ్డలిచ్చి పంపించారు దొరలు.

తెల్లవారేసరికి ఆ ఊరి పొలిమేర మేరకు ఈత వనమంత నేల కూలింది.

అనుకున్నది అనుకున్నట్టే సాధించారు దొరలు.

తట్టలు-బుట్టలు, తడకలు అల్లుకుని బతికే సాయిలు బతుకులో నిప్పులు పోశారు. ఇప్పటివరకు చెప్పింది జరుగుతున్న కథ!

ఇక చెప్పబోయేది జరగనున్న సమరం. మొదటిది పూర్తిగా జీవితంలో నుండి వచ్చిందైతే రెండవది బుర్రలో నుండి వచ్చింది. ఇది డా॥ అంబేద్కర్ పిలుపుకు బోధించు, సమీకరించు, పోరాడుకు కార్యరూపం. ఈతచెట్టు వల్ల బతికేది ఒక ఎరుకలి వాళ్ళే కాదు. ఈత చెట్టు నుండి కల్లు గీస్తారు. గీత పనివాళ్ళకు ఈ చెట్లు లేకుండా పోయాయి. ఆ చెట్టు ఆకులతో చాపలు, పొరకలను అల్లి బతికే అతి పేదవాళ్ళు పిచ్చకుంట్లవాళ్ళు. ఇలా ఒక చెట్టు వెనక ఉన్న మూడు కులాలను ఉసికొల్పాలి. ఎరుకలి కులం వాడైన కథానాయకుడు అప్పటికే సర్పంచ్ కనుక అతనికి హక్కులు అంటే ఏమిటో కొంత తెలిసింది. అధికారం అంటే ఏమిటో మరికొంత చూశాడు. రాజకీయాలలో తిరుగు తున్నాడు కాబట్టి జనాన్ని ఎలా కూడగట్టాలో తెలుసుకున్నాడు. అంతా వనాన్ని కాదు తన బతుకునే నర్కేస్తే బెంబేలు పడిపోలేదు. ఊళ్ళు తిరిగాడు. కల్లు గీసేవాళ్ళను కూడగట్టాడు. కూడిన జనం ఊర్కుంటారా? నష్టాన్ని భరిస్తారా? తిర్గబడ్డారు. తమ అక్కసును కక్కేశారు. అన్యాయాన్ని ప్రశ్నించారు. గడి ముందు కెళ్లి నిలుచున్నారు. వీళ్ళెమ్మడి వాళ్ళవాళ్ళ వేటకుక్కలు ఎలాగో ఉంటాయి. అడవిలోను, ఊళ్ళోను వాళ్ల వెంటే తిరుగుతూ ఉంటాయి. వాటి చూపులో రోషం, శ్వాసలో కసి, అప్పుడు దొర తన పులిలాంటి తన పెంపుడు కుక్కను జనం మీదికి వదిలాడు. అది పెద్దగా అరుస్తూ వచ్చి అక్కడున్న బక్కకుక్కల మీద పడింది. తమ యజమానులు ఈలలు వేయగానే బక్కకుక్కలు బలిసిన కుక్క మీద పడ్డాయి. బలిసిన, బాగా బలిసిన జాతికుక్క ముక్కలుముక్కలుగా మాంసపు ముద్దలైపోయింది. వాకిలంతా నెత్తుటి మరకలు.

దొర నోరు తెరిచి చూస్తూ నిలుచున్నాడంతే.

ఇది నా చీమలు కథ ముందు-వెనుక.

కథ మొదటి భాగం నేను చుట్టూర చూస్తున్న జీవితంలోనిదైతే రెండవ భాగం జీవితం పెంచిన ఆలోచనలది.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 10 మే 1998*

17

# సర్కస్ డేరా

## మధురాంతకం రాజారాం



*మధురాంతకం రాజారాం 5 అక్టోబర్ 1930న చిత్తూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'విరోచిత వర్తకం' 30 మే 1951న ఆంధ్రపత్రికలో అచ్చయింది. దాదాపు 350 కథలు, రేడియో కథలు, కొన్ని గేయాలు రచించారు. 15 కథాసంపుటాలు ప్రచురించారు. 'తాను వెలిగించిన దీపాలు' కథల సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి అవార్డు, 'మధురాంతకం రాజారాం కథలు' సంపుటానికి 1993 లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించాయి. 'అజో-విభో' ప్రతిభా పురస్కారం లభించింది. ఉపాధ్యాయుడుగా పదవీ విరమణ చేసి, 31 మార్చి 1999న తిరుపతిలో మరణించారు.*

ఏ పుట్టలో పాములుంటాయో, ఏ పుట్టలో ఈసిళ్లుంటాయో యిర్లవాడికి తెలిసినట్టు మరొకరికి తెలియదు. భుజాన మోపెడు ఈతపుల్లతోనూ, చేత నీళ్లదుత్తతోనూ యిర్లవాడొకడు మీకు పల్లెపట్టుల్లో ఎదురైతే, అతగాడక్కడెక్కడో పుట్టమూసి ఈసిళ్లు పట్టబోతున్నాడన్న మాట! కీటక సంహార కాండలో నాందీవాచకంగా అతడు పుట్టలో ముఖ్య రంధ్రాన్ని మాత్రం మినహాయించి, మిగిలిన వాటిని మూసేస్తాడు. ఆ తరువాత చిక్కగా నీళ్లు చిలకరిస్తాడు. రంధ్రానికి చేరువగా ఒక దీగుడు అమర్చి అందులో దివ్వె వెలిగిస్తాడు. ఎండుమట్టి పైన చల్లటి నీళ్లు పడ్డంతో నీటి ఆవిరి పైకెగిరి, పుట్ట లోపలి కీటకాలకు వాన కురుస్తున్నట్టో, లేక కురిసి వెలిసినట్టో భ్రమ కలుగుతుంది. బారులు బారులుగా అవి పైకొస్తాయి. వచ్చీ రాగానే మృత్యుదేవత క్రూర దంష్ట్రలాంటి దీపశిఖ వాటిని ఆహ్వానిస్తుంది. అవి మొదట రెక్కలు రాల్చుకుంటాయి. తరువాత యిర్లవాడికి మరునాటి ఎరగా మారిపోతూ కుప్పగా కూలిపోతాయి.

పూర్తిగా గాకపోయినా, కొంతవరకూ ఈ 'పుట్టమూత'తో పోలికలున్న సంఘటన ఒకటి పట్టణంలో జరిగింది.

ఏడుగంటల కల్లా భోజనాలు ముగించి, జంబుచాపలు పరచుకోవడం తరువాయిగా దీపాలు ఆర్పేసి, వెచ్చగా వక్కాకు నములుతూ అరుగులపైన కూర్చున్న పల్లెటూళ్ల వాళ్లకు ఆకాశంలో ఓ కాంతిపుంజం కనిపించింది. అది అచ్చంగా కాంతిపుంజం కూడా కాదు. భువి నుండి దివికి ఏటవాలుగా ప్రసరిస్తున్న వెలుగుబాట. 'ఎన్నడూ లేంది, ఏనాడూ వినంది, ఏమిటీ విడ్డూరం,' అని ఒకవైపున జానపదులు వెరగుపడిపోతున్నారు. మరొకవైపున ఆ వెలుగు విను వీధిలో నాలుగైదుసార్లు వలయాలు తిరిగి, అంతటితో తన పని తీరిపోయినట్టు అంతర్థానమై పోయింది.

మెరుపూ, ఉరుమూ ఒకేసారి ఉద్భవించినప్పటికీ శబ్దవేగం కన్నా కాంతివేగం ఎక్కువ గనుక మెరుపు ముందుగా కనిపిస్తుందని చెబుతుంది, విజ్ఞానశాస్త్రం. ఇక్కడ గూడా సరిగ్గా అలాగే జరిగింది. రాత్రి ఎనిమిది గంటలు, ఆ ప్రాంతంలో వెలుగు కనిపించింది. పట్టణం నుంచి దశదిశ లకూ విస్తరిల్లుతున్న రహదారుల వెంబడి బయల్దేరిన బస్సులతోబాటు ఆ వార్త మరునాటి వుదయానికల్లా పల్లెసీమల్లోకి పాకి వచ్చేసింది.

ఏమా వార్త? ఎందుకా వెలుగు?

'సర్కసొచ్చిందట బాబూ! సర్కసొచ్చింది.' ఏ నోట విన్నా యిదే మాట వినిపించింది.

ఆ వచ్చిన సర్కసు ఎలా వచ్చింది?

'భట సంఘంబులతో, రథావళులతో, భద్రేభయూథంబుతో పటువేగాన్విత ఘోటక వ్రజముతో'- ఒక్కమాటలో చెప్పాలంటే కటుసంరంభముతో పెళ్లికి తరలిన శిశుపాలుడిగా వచ్చింది. కానైతే ఒక చిన్న తేడా! శిశుపాలుడు విదర్భ తనయను చేకొనడానికి వచ్చాడు. సర్కసు జేబులు దోచుకోడానికి వచ్చింది.

ఆ మాయదారి సర్కసువాడి 'బిస' ఎలాంటిదోగానీ వాడు వెలిగించిన దీపం తాలూకు కాంతి గగనమండలానికే ప్రసరించింది. అక్కడ ఊరుకుందా? ఊఁహు, వలయాలు తిరిగింది. పట్టణానికి మూడామడల దూరములో వున్నవాడు, 'అబ్బ, ఏమిటీ చోద్యం,' అని ఓవైపున విస్తు పోతూనే వున్నాడు. ఇంతలో పదామడల దూరంలో వున్న పెద్దమనిషి ఒకతను అతడితో కలిసి 'ఓరి నీ ఆశ్చర్యం చట్టుబండలుగానూ! ఆ వెల్తురు మా వూరికే కనిపించిందయ్యా,' అన్నాడు. ఇంకేముంది! ఆఁ ఆఁ అంటూ మూడామడల్లో నివసిస్తున్న మానవ సామాన్యుడు ఆశ్చర్యాతిరేకం తో నోరు తెరిచేశాడు.

అంటే ఏమన్నమాట? ఆ దీపకాంతి ప్రసరించినంత మేరకూ సర్కసువాడు తన వలను విసరగలిగాడన్నమాట, తన కబంధహస్తాలను చాచగలిగాడన్నమాట.

అంతటితో ఏమయింది? పెద్దపెద్ద బొమ్మ లంటించుకున్న మేదర తడికలతోనూ, మెగా ఫోనుతోనూ, సినిమాపాటల గ్రామఫోను సంగీతంతోనూ ఓ మోటారువాను శరవేగంతో పరతెంచి వచ్చి పల్లెపల్లెకూ గుప్పెడు కరపత్రాలు పంచింది. ఒక్కొక్కటీ మూరెడు పొడుగు కరపత్రం! పదహారు ఏనుగులు, యిరవైయేడు గుర్రాలు, ఏడు ఒంటెలు, నాలుగు పులులు, రెండు సింహాలు, ఒక భల్లూకం అని జాబితాను పేర్కొని, అంతటితో జంతువర్గను ముగించడానికి సంకోచిస్తూ, భగవత్సృష్టిలోని వైవిధ్యాన్ని నొక్కి చెప్పడానికి కాబోలు 'నాలుగు వందలమంది మనుషులు' అని ఉదహరించడం జరిగింది. తరువాత ప్రదర్శనంలోని వివిధాంశాలను ఏకరువు పెట్టి చిట్టచివర 'ఆలసించిన ఆశాభంగం, నేడే చూడండి,' అన్న హెచ్చరికతో కరపత్రం పూర్తయిది.

ఆ సర్కసు వాడెవడోగానీ, వాడు శబ్దతత్వాన్ని గూడా క్షుణ్ణంగా ఆకళించుకున్న ధీమంతుడి

లా వున్నాడు! 'నేడే చూడండి' అంటూ అతడు దేశం పైకి విసిరిన పదాల జంట, అదొక పంచాక్షరీ మంత్రంలా యింటింటా నినదించింది. కుటుంబసమేతంగా ఆఫీసరుగారూ నేడే చూడాలి, ఇంటిల్లిపాది వెంటరాగా హెడ్‌గుమాస్తాగారూ నేడే చూడాలి, బంధుమిత్రులు యావన్మందితో ముప్ఫైమైళ్లలో వున్న పెంటపాడు మునసబుగారూ నేడే చూడాలి. ఒకరేమిటి, తలారి రాముడు, దేవళం పూజారి ఆచారి, బడిపంతులు పాపారావు, దాసరి ఓబిలేసు, దోసెలంగడి తులసమ్మ- అందరూ నేడే చూడాలి. మంత్రశక్తికి లోనై మతి పోగొట్టుకున్న సర్పకులం జనమేజయుడి యాగ శాలకు యిలా పరతెంచి వుండాలి. 'నేడే చూడాలి' అన్న మానవుడి ఈప్సితాన్ని తొలగదోసుకుని అప్పటికే చింతపండు బస్తాల్లా తయారై వున్న బస్సులు వడివడిగా పారిపోయాయి. బాట ప్రక్కన చేతులు చాచి రెక్కమాన్లకు మల్లే నిలబడి వున్న గ్రామీణప్రజలకు 'రైట్, రైట్' అన్న కండక్టరు కేకలు మాత్రం వినిపించాయి. కానీ యింత మాత్రానికే నిరుత్సాహపడిపోయేది గాదు ప్రజానీకం! వాళ్లు మూలనున్న బండ్లను పైకి దీశారు. ఇరుసులకు కందెనవేసి, ఎడ్లను పూన్చారు. ఆడ వాళ్లు పులుసన్నంతో, పెరుగన్నంతో తబిళ్లు నింపారు. పెళ్లికి వెళ్తున్నట్టు తిరణాలకు సాగుతున్నట్లు బండ్లు నగరం వైపు కదిలాయి.

చేసిన పాపం చెబితే పోతుందంటారు, ఇలా సర్కసుకు వెళ్లి పట్టణంలో దిగబడిపోయిన అసంఖ్యాక ప్రజాసమూహంలో నేనూ ఒక్కణ్ణి!

రాత్రి తొమ్మిది గంటల వేళ. ఇదివరకే ఓసారి సర్కసుకు వెళ్లి ఆ జనాల రద్దీలో నలిగి నానా అవస్థలు పడిన ఒకానొక పెద్దమనిషి (సుప్రసిద్ధ చారిత్రక ప్రదేశాల్లోని 'గైడ్' హోదాతోనే అనుకోండి) టికెట్లు తీయడం చాలా కష్టమని చెప్పినందువల్ల కాస్త త్వరగా బయలుదేరవలసి వచ్చింది. తిరుణాళ్లూ, పరసలూ, పెళ్లి సంబంధాలు మొదలైనవాటికి పిలవకపోయినా వచ్చి పరామర్శించి పోయే అతిథి వానదేవుడు. ఆయన ఏడు ఏడున్నరకల్లా వచ్చి రెండు దుక్కుల వర్షం కుమ్మరించిపోయాడు. పగటిపూట దుమ్ము లేచిన రోడ్డు వాన తాకిడికి బురదైపోయింది. బురద రోడ్డుపైన కనుచూపాని నంతవరకూ మనుషులు విసవిస నడిచిపోతున్నారు. సాయంత్రం వరకూ కాసిన ఎండ, ఆ తరువాత కురిసిన వాన, ఇప్పుడిలా తండోపతండాలుగా సాగిపోతున్న మానవులు- ఈ మూడు దృశ్యాలనూ సమన్వయించుకున్నట్లయితే ఎవరికైనా ఒక సృష్టి రహస్యం తేటతెల్లం గాకపోదు. తమను తామే పాలించుకోడానికనీ, పరిసరాల్ని పరిశుభ్రంగా వుంచుకోడాని కనీ దానికనీ దీనికనీ మానవుడు ఏవో వ్యవస్థలు నిర్మించుకుంటున్నాడు గానీ, అడవిపక్షులకు ఆహార మివ్వగలిగిన భగవంతుడు ఈ పనులు కాస్తా చేసిపెట్టలేకపోడు. ఎండ కాసింది. రోడ్లపైన దుమ్ము లేచింది. వాన కురిసింది. బురదయింది. సర్కసు ప్రేక్షకులు నడుస్తున్నారు. ఇక రోడ్డురోలరుతో అగత్యమెక్కడిది?

సెలయేళ్లు వాగుల్లో పడి, వాగులు వంకల్లో కలిసి, వంకలు నదుల్లోకి ప్రవహించి, ఆ నదులు సముద్రంతో సంగమిస్తున్నాయి. గమ్యస్థానం సమీపమౌతున్నకొద్దీ నా మనసులో సముద్రం మెదిలింది. అక్కడ నీరు, ఇక్కడ మనుషులు. అక్కడ అర్థమూ, పర్థమూ లేని అలల హోరు, ఇక్కడ శ్రావ్యమూ, సహ్యమూ కాని మాటల మ్రోత.

ఆ డేరా చాలా పెద్దది. డేరా చుట్టూ సాధు జంతువుల పాకలకు, క్రూరజంతువుల బోన్లకు, మానవుల గుడారాలకు ఓపినంత జాగా ఆక్రమించుకోబడింది. చుట్టూరా పది పన్నెండడుగుల ఎత్తున్న డబ్బారేకుల ప్రాకారం. ప్రాకారానికీవల ఒకటి ఒకటిన్నర ఫర్లాంగు పొడుగునా యిసుక వేస్తే క్రింద రాలని జనస్తోమం. ఈ అన్నింటికీ వెనుక సోడా కిళ్లీల కొట్లు, టీ, కాఫీ బంకులు,

గారెలు బూరెలు అమ్మే అంగళ్లు. రోడ్డు నుంచీ చీలి జనంలో కలిసి తడితడిగా వున్న పచ్చిక పైన బురద మెత్తుకున్న పాదాలతో మెల్లగా త్రోవ చేసుకుని ముందుకు నడవసాగాను. చల్లచల్లగా వీస్తున్న చలిగాలి స్పర్శకు ముఖం జిల్లుమంటోంది. కర్త, కర్మ, క్రియలతో వివరించి చెప్పడానికి వీలిచ్చే అలజడి కాదది! మూగసినిమాల కాలంలో క్లయిమాక్సు ఘట్టం వచ్చినప్పుడు కథకుడు, 'అదిగో వచ్చాడు, కత్తి తీసుకున్నాడు, కదిలాడు ముందుకు విరోధి. దూకాడు పైకి,'' అంటూ పాడిపాడిగా మాటలు ఉచ్చరించేవాడు. ఇక్కడా అంతకంటే గత్యంతరం లేదు. సిగరెట్టు పొగ బీడీ కంపు. షోకిల్లా మనిషి సెంటు గమగమ. పల్లెటూరి ముత్తయిదువ కొప్పులు ముడుచుకున్న మొగిలిరేకుల సుగంధలహరి. కళ్లకు మిరుమిట్లు గొలిపే దీపాలు. చలికి ముడుచుకపోతున్న ముఖాలు. నవ్వులు, కేరింతలు, ఛీత్కారాలు, వికటాట్టహాసాలు. అది కళ్లకు కనిపించిన దృశ్యమే! కానీ ఒకసారి పడుకుని నిద్రపోయి లేచిన తర్వాత అది 'కలా, నిజమా' అన్న విభ్రాంతికి ఆస్కార మిచ్చే దృశ్యం!

ఇంతలో ఒక ముఖ్య విషయం జ్ఞప్తికి వచ్చింది. మొదటి ఆటగూడా విడిచిపెట్టినట్టున్నారు. నాకిప్పుడు టికెట్టు కావాలి. ఏది లేకపోతే డేరా లోపలికి ప్రవేశం సాధ్యం కాదో, ఆ టికెట్టు కావాలి. ఎక్కడ దొరుకుతుందా టికెట్టు? ఎవరినో అడిగాను. 'ఆ చివర' అంటూ ఆయన చేయి వూపాడు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత, 'అబ్బే ఇక్కడ కాదండీ! ఆ చివర' అన్నారు, వెళ్లినంత దూరం తిరిగి వచ్చి, ఇంకా ముందుకు వెళ్లాను. నిజమే! అక్కడ టికెట్లు యిస్తున్నారు. టికెట్లిస్తున్న కిటికీలకూ, నాకూ మధ్య దూరం యిరవై గజాలకు తక్కువుండదు. ఈ యిరవై గజాల మేరలో సింహబలులూ, వృకోదరులూ, గామాలు, కోడి రామ్మూర్తులూ అంగుళం సందు లేకుండా నిలబడి పోయి, 'బలం వుంటేనే బ్రతుకు' అన్న పరమ సత్యాన్ని చూపరులకు తెలివిడి చేస్తున్నారు... నేనిప్పుడేం చేయాలి?

చేతులు కట్టుకొని ఒడ్డున నిలబడితే తరంగహస్తాలతో ముత్యాలు మోసి తెచ్చి, కడలి మనకు పాదపూజ చేయదు. ముత్యాలు పొందగోరితే సముద్రంలో దూకవలసిందే! తప్పదు. కానీ తిమింగలాలు ఎదురైతే? గ్రుక్క తిరక్కపోతే? ముత్తెపుచిప్ప చేతికి దొరికిన తర్వాత పైకి రావడానికి ఓపరికం లేకపోతే? అవును. అపాయమే మరి! చనిపోవడానికి ముందుగా ఒక సాహసకార్యంచేయగలిగితే చాలునన్న మహదాశయం కాదు నాది! మంచికో చెడ్డకో ఈ లోకంలో పుట్టడమంటూ జరిగిన తర్వాత, బ్రతుకుపైన తీపి కలిగి వుండడం నేరం కాబోదు. అయితే నాకు టికెట్టు దొరకదు. కానీ నాకు టికెట్టు కావాలి! ఏం చేయాలి? నేనిప్పుడేం చేయాలి?

సరిగ్గా ఈ సందిగ్ధావస్థలో నాకు ఆపద్భాంధవుడిలా కనిపించాడు నాగులు!

అప్పుడు నాగులు డబ్బారేకు పైన ఒంటికాలితో నిలబడి, ప్రాకారానికి వూతగా నాటి వున్న కొయ్యను ఎడమచేతితో పట్టుకుని తల బాగా క్రిందికి వంచి కుడిచేతిని కిటికీలో దూర్చి టికెట్లు తీయడానికి ఉద్యుక్తుడౌతున్నాడు!

''ఇదిగో నాగులూ! నాకూ ఒక టికెట్టు,'' అని అరిచాను.

నాగులుకు నా మాటలు వినిపించి వుండవు. అతడు వినిపించుకోగల పరిస్థితిలో గూడా లేడు. పట్టుదప్పితే అతడు తలక్రిందులై కూలిపోతాడు. అడ్డంగా మనుషులున్నారు గనుక ప్రమాదానికి అవకాశం లేని మాట నిజమే! కానీ అంత ఎత్తు నుంచీ పైనబడితే ఆ మానవులతణ్ణి రెక్కకు రెక్కగా, ఈకకు ఈకగా జేయరని ఏం నమ్మకం!

అయినా యింకొకసారి ప్రయత్నించి చూచాను. ఈసారి నాగులు తల పైకి లేపి, ''ఉండ వయ్యా నువ్వు మరీనూ!'' అని విసుక్కున్నాడు.

టికెట్టు కొనుక్కోలేని అశక్తుణ్ణి, నేను ప్రాధేయపడనూ పడవచ్చు. శూన్యంలో శీర్షాసనం లాంటి ఆ దురవస్థలో నాగులు విసుక్కోనూవచ్చు. కానీ విశేషమేమిటంటే ఈ సంఘటనలో అసందర్భమేం గోచరించిందోగానీ నా ప్రక్కన నిల్చున్న పెద్దమనిషి ముఖం ఓరగా తిప్పుకుని చల్లగా నవ్వేశాడు.

దెబ్బతిన్నట్టు నేనతడి వైపు తిరిగాను.

"ఆహాఁ... మరేమీ అనుకోకండి సార్! మీరతణ్ణి అడగడం ఎలా వుందంటే..." అంటూ రాగం తీసి, 'నే రంగమెళ్లిపోతానే నారాయణమ్మా' అన్నాడు నాయుడుబావ. అందుకు నారాయణమ్మ ఏమంది? 'నువు పోతే పోయేవుగాని నాయుడుబావా, నాకు పోగులు జత తెచ్చి పెట్టు,' అంది అని అతడు తన ఉపఖ్యానాన్ని ముగించాడు.

నాకు తల కొట్టేసినట్టయింది. ఎదుటివాడి స్థితిగతులను గమనించకుండా ఎవడికి వాడు వాడి దృక్పథాన్ని అనుసరించే ఆలోచించి, అందుకు తగ్గట్టుగా ప్రవర్తించడం వల్ల నలుగురిలో అవహేళనకు లోనుగావలసి వస్తుంది. ఈరోజు ఉదయం ఎవరి ముఖం చూచి లేచానోగానీ నేనిలాటి హేళనకు గురి కావడానికి ఇది మొదటిసారిగాదు, రెండోసారి. ఇందులో మరొక చిత్రం వుంది. రెండుసార్లూ నేనా నాగులు వల్లనే అవహేళన పాలయ్యాను.

అవసరాన్ని బట్టి ఉదయం ఏడుగంటల నుంచీ రోడ్డులో చింతచెట్టు క్రింద పడిగాపులు పడిన తర్వాత మధ్యాహ్నం మూడు గంటలకు ఓ బస్సులో తావు దొరికింది. ఆ బస్సు బండ రోకలిలా పెనుమూరి కనుమ ప్రాకి, కర్ణుడి రథంలా కలువకుంట ఏటిలోకూరుకుపోయి, 'ఊహు, యింక లేదు, ఆగిపోయానన్న మాటే,' అని మైలుకు ఒకటి రెండుసార్లు మొండికేసి, ఆఖరుకు ఎలాగోలాగ ఒల్లీ ఒల్లని కాపురానికి వచ్చిన కొత్తకోడలిలా అయిదు, అయిదున్నరకు బస్‌స్టాండు చేరుకుంది. పల్లెటూరి నుంచి పట్నానికి వచ్చి బంధువుల యింట్లో ఒకటి రెండు రోజులు మకాం వేయదలచుకున్న మానవుడు రిక్తహస్తాలతో బస్సెక్కడం అవివేకమన్న విషయం పట్ల నాకు గాఢమైన నమ్మకం వుంది. కపిత్థజంబూ ఫలాల్ని సమర్పించుకుంటే ఉమాసుతుడు శోక వినాశ కారకుడైనట్టే, చెరకుముక్కలు, వేరుశెనగకాయలు, తాటిముంజల్లాంటి చిరుతిండ్లతో పట్టణంలో బంధువుల యింట కాలు మోపితే ఆ అతిథికి తీయటి మర్యాదలూ, హాయిగొలిపే మన్ననలూ నిస్సంశయంగా లభ్యమౌతాయి. బస్సుస్టాండు చేరువకు రాగానే నేను కూలీ కోసం నలువైపులా కలయజూచాను. ఇంతలో ఎక్కడున్నాడో ఏమిటో నాగులు బస్సు యింకా పరుగెడుతూ వుండగానే ఫుట్‌బోర్డు పైన దూకి, "లగేజ్ సార్, లగేజ్," అని కేక వేశాడు.

బస్ టాపు మీద రెండు మూటలున్నాయని చెప్పాను. నాగులు నిచ్చెన పట్టుకుని పైకెక్క సాగాడు.

బస్‌స్టాండులో దిగినప్పుడల్లా నాకు మొట్టమొదట కనిపించే వ్యక్తి నాగులు. ప్రతిరోజూ నాలాంటివాళ్లను లెక్కలేనంత మందిని చూస్తుంటాడు గనుక అతడికి నేనెవరినో తెలిసి వుండదు కానీ నాకు నాగుల్ని గురించి బాగా తెలుసు. ఈ శరీరం పరకార్యార్థమేనన్న ఆర్యోక్తిని అక్షరాలా నమ్మినవాడిలా అతడు మారు మాటాడకుండా లగేజిని తలపై కెత్తుకుంటాడు. అతడితో గొడవ ప్రారంభమయ్యేదల్లా మోత యింటికి చేరిన తర్వాత!

సమయానికి బంధువు ఇంట్లో లేడు. గృహిణి ఎదురుగా వచ్చి ప్రఫుల్ల వదనంతో స్వాగత మిచ్చింది. నేను జేబులో చేయి వేశాను. చిల్లర డబ్బులు లేవు. ఓ పదిరూపాయల కాగితం పైకి వచ్చింది.

"నోటుందిగానీ చిల్లర లేదే!" అన్నాను.

"వెన్న చేతిలో వుంటే నెయ్యికేం కొదవ సార్! కాసేపట్లో తీసుకరానూ!" అంటూ నాగులు నేనింకా అంగీకార అనంగీకారాల మధ్య వూగిసలాడుతుండగానే నా చేతిలో నుంచీ నోటు తీసుకుని రివ్వున బయటికి వెళ్లిపోయాడు.

"కూచోండన్నయ్యా! కాఫీ తెస్తాను," అంటూ గృహిణి లోపలికి వెళ్లింది.

అయిదు నిమిషాలకల్లా కాఫీ రానే వచ్చింది. ఒక్కొక్కటీ ఒక్కొక్క జాములా మళ్లీ అయిదు నిమిషాలు గడిచిపోయాయి. నాగులు మాత్రం పత్తాలేడు!

ఒకటిగాదు, రెండుగాదు, పది రూపాయల నోటు!

ఖాళీగ్లాసు తీసుకుపోవడానికి వచ్చిన యింటి యిల్లాలు, "అదేమిటన్నయ్యా! అలా దిగులుపడి కూర్చున్నారు?" అని ప్రశ్నించింది.

"అదికాదమ్మా! పదిరూపాయల నోటు..." అంటూ వివరించాను.

"అయ్యోరామ! ఇదేం వెర్రిబాగులతనమమ్మా! గాలిలో దీపం పెట్టి దేవుడా నీ మహిమ అని కూర్చుంటారా? వెళ్లండి, వెళ్లండి. క్షణం తామసిస్తే డబ్బు మనదిగాదు," అంటూ ఆమె నన్ను వీధిలోకి తరిమింది.

అక్కడికి బజారు కూతవేటు దూరంలో వుంది. 'ఫలానా కుర్రాణ్ణి చూచారా,' అంటూ ప్రతి అంగడిలోనూ వాకబు చేశాను. నా ప్రశ్నకు జవాబు చెప్పడం కన్నా నేనెందుకతణ్ణి అన్వేషిస్తున్నానన్న విషయం వాళ్లకు కావలసి వచ్చింది. చివరకు నడిబజారులో నలుగురూ ప్రోగై అసలు కథేమిటని నన్ను నిలబెట్టి అడిగేశారు. జరిగిన సంగతి తూచా తప్పకుండా వివరించుకున్నాను.

నాగులు పైన నగరవాసులకు కూడా ఏమంత నమ్మకం లేదన్న విషయం నాకప్పుడు వ్యక్తమైంది.

"ఓహో వాడా; వాడు నాగులు! ఎంతకైనా తగును!"

"బస్‌స్టాండు కుర్రాడి చేతికి డబ్బివ్వడమే! అంతకన్నా ఏట్లో పారేయడం నయం కాదూ!"

"అయినా యివి మనిషిని మనిషి నమ్మగలిగే రోజులటండీ!"

వాళ్ల అభిప్రాయాలు నాకూ, నా పది రూపాయల నోటుకూ మధ్య ఓ అగాధాన్ని సృష్టించి వేశాయి.

కానీ అంతలో ఒక అద్భుతం జరిగింది. ఏ అంగడిలో నుంచి బయటపడ్డాడోగానీ, వున్నట్టుండి నాగులు నా ఎదుట ప్రత్యక్షమై గుప్పెడు చిల్లర నా దోసిట్లో పోసేశాడు.

అంతవరకూ నేను నాగుల్ని నమ్మడం చాలా పొరబాటన్న అభిప్రాయాన్ని ఏకగ్రీవంగా వెలిబుచ్చిన వాళ్లందరూ క్షణంలో ఊసరవెల్లికి మల్లే రంగులు మార్చేసుకున్నారు.

"ఈ మాత్రానికింత రాద్ధాంతమా?"

"పది రూపాయలనోటును చూస్తారుగాని మనిషిని చూడరే!"

వీళ్లకు నాగులు ఋజు ప్రవర్తన పైన్నే గాదు, నా పెద్దమనిషితనం మీద గూడా నమ్మకం లేదనిపించింది. మాటల తూపులకు తట్టుకోలేక దూరంగా వచ్చేశాను.

నాలుగైదు గంటల క్రితం జరిగిన ఆ గాథను పునశ్చరణ చేసుకుంటూ నేను విగ్రహంలా నిల్చున్నాను. చుట్టూరా సాగుతున్న అలజడిలో హఠాత్తుగా స్థాయి హెచ్చింది.

"పడిపోయింది, పడిపోయింది," అని ఒక్కుమ్మడిగా పది పదిహేను మంది అరిచేశారు.

పడిపోనున్నది నాగులు పట్టుకొన్న కొయ్య. అది వూతగా వుండడంపోయి, దాన్ని నాగులే కదలకుండా ఈవలికీడ్చి పట్టుకోవలసి వచ్చింది. కొయ్య వాలిపోతే నాగులు భూపతనంగాక

తప్పదు. అతడిపైన డబ్బారేకులు, రేకుల పైన మనుషులు. అమాంతంగా కళ్లు మూసి తెరిచేలోగా నుగ్గునూచం అయిపోవడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాడా ఈ నాగులు!

వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పింది. చట్నీ అయిపోవలసిన నాగులు మరు నిమిషంలో గుంపులో జొరబడి కేకలు పెట్టసాగాడు. "కుర్చీ టికెట్టు! రెండు రూపాయలు సార్, రెండు రూపాయలు!"

ఒక రూపాయ టికెట్టు రెండు రూపాయలే! ఓరి వీడి అసాధ్యం కూలా! కన్ను అలా వుండ గానే కనుపాపను దోచేయడమంటే యిదేనేమో!"

నేనింకా ఆశ్చర్యం నుంచీ కోలుకోనేలేదు. బహుశా ఒకటి రెండు నిమిషాలు గడిచి వుంటాయి. ఆపాటికే నాగులు పాటలో శ్రుతి మారిపోయింది.

"ఐదు టికెట్లు అమ్ముడుబోయాయి సార్! ఇంక అయిదు మాత్రమే వున్నాయి. ఒకటి ముప్పావలా సార్! ఒకటిముప్పావలా!"

అయితే ఈ నాగులు మానవుడిలోని తొందరపాటుకూ ఓర్పుకూ పోటీ పెడుతున్నాడన్న మాట. నా మట్టుకు నేను మరికొంతసేపు నాలోని ఓర్పునే సమర్థించదలచుకున్నాను.

"ఎవరిక్కావాలండీ? మీకండి? మీకు? ఒకటిముప్పావలా సార్..." ఎవడినంటే వాడిని తాకి 'అవుట్' చేయనుంకిస్తున్న చెడుగుడు ఆటగాడిలా నాగులు గుంపులో చెడ తిరిగేశాడు. ఈ రేటుగూడా ఏమంత ఆశాజనకంగా కనిపించలేదేమో, వెంటనే ప్లేటు మార్చేశాడు. "ఆఖరు బేరం సార్! ఇంక మూడు టికెట్లు మాత్రమే వున్నాయి. ఒకటిన్నర రూపాయ సార్, ఒకటిన్నర రూపాయ్!"

వెర్రి వెయ్యిరకాలు. అందులో వేలంవెర్రిది అగ్రతాంబూలం. మానవుల్లోని ఆత్రగొట్టు తనాన్ని, పోటీపడే మనస్తత్వాన్నీ ఆధారంగా వుంచుకుని ఆసామికి డబ్బు దోచిపెట్టే వ్యాపార తంత్రాల్లో మొదట వేలంపాట పేరు చెప్పి ఆ తరువాత మరొకదాని పేరు చెప్పాలి. వేలంపాటలో మొదట బేడ పలికిన వస్తువు మనం చూస్తూ చూస్తూ వుండగానే తన విలువను మాడదాకా పెంచుకుంటుంది. మశకంలాంటి మూల్యం వామనుడి విశ్వరూపంలా నిమిష నిమిషానికీ విజృం భించి ఏనుగంతగా పరిణమించడం చాలా ఆశ్చర్యకరమైన విషయం. గణితశాస్త్ర పరిభాషలో ఇది అనులోమ నిష్పత్తి- మరి నాగులు వ్యాపారతతంగమంతా యిందుకు విరుద్ధంగా వుంది. అతనికున్న అవకాశం అయిదు నిమిషాలు. లేదంటే పది నిమిషాలు. ఈ వ్యవధిలో నిమిష నిమిషానికీ అతడి చేతిలోని వస్తువు ధర క్షీణించిపోతుంది. కాలగతికీ మూల్యానికీ యిక్కడున్నది విలోమ నిష్పత్తి! అవునుమరి, ఒక్క వ్యాపారంలోనే ఏమిటి, ఈ వ్యాపారాలూ విద్యలూ, భోగాలూ భాగ్యాలూ, నాటకాలూ బూటకాలు- దేనికైతే అవసరమౌతున్నాయో ఆ బ్రతుకే రెండు విధాలుగా ప్రస్తరిల్లిపోతున్నది. ఒకటి, ప్రవాహగతి ననుసరించి అశ్రమంగా అదొక వినోదంలాగా పడవ నడపడం. రెండు, చేతుల బలంతో, అంతకంతకూ తిరిగిపోతున్న శరీర దారుఢ్యంతో ఏటికెదురీదడం!

"ఒకటిం పావలా!" అన్నాడు నాగులు.

నాగులుకు అదనంగా నాలుగణాలు ముట్టజెప్పుకోడం నాకు నష్టమనిపించలేదు. కత్తివాదరలాంటి ఆ డబ్బారేకు పైన అరగంటసేపు నిల్చున్నందుకే అతడికి అర్ధరూపాయి యిచ్చు కోవచ్చు.

ఒకటింపావలా యిచ్చి టికెట్టు కొనుక్కుని నేను నేరుగా డేరా లోపలికి వెళ్లిపోయాను.

డేరా కప్పులో క్రింది నుంచి పైదాకా వ్యాపించి వున్న సందుల్లో నుంచి ఆకాశం కనిపిస్తున్నది. డేరాలో విద్యుద్దీపాలకు మల్లే అక్కడ తారకలు మెరుస్తున్నాయి. ఆ మెరుస్తున్న తారకలతో వినీలాకాశాంతాల వరకూ వ్యాపించి వున్న పెద్ద డేరాలా తోచింది. ఈ డేరా ఎదుట మానవుడు పిపీలికంతో సరిపోల్చదగినవాడే కావచ్చు. కానీ ఆ డేరా ఎదుట ఈ డేరా? అది సముద్రమైతే యిది జలకణం గూడా కాదు. అయితే గియితే ఆ జలకణంలో సహస్రాంశం.

ప్రదర్శన ప్రారంభాన్ని సూచిస్తూ గంట మోగింది. నాగరికురాలైన తర్వాత గానకళాధిదేవత కైసేసికొన్న విదేశీ ఆభరణాల లాంటి వివిధ జంత్రసామగ్రి బాండు వాయిద్యం పేరిట గొల్లున మ్రోగింది. సంగీతాన్ని కర్ణపేయంగా వుందనీ, అపాతమధురంగా వుందనీ ప్రస్తుతించడం సాంప్రదాయం. ఆ సాంప్రదాయపు చాదస్తపు పప్పులక్కడ వుడకవు. ఒకే రకమైన కాకీ ట్రౌజర్లు, చొక్కాలు, తలపైన నీలిరంగు టోపీలు ధరించి వేదికపై శిల్పమూర్తులకు మల్లే కొలువైన వాయిద్యగాళ్లు తళతళ మెరుస్తున్న చిత్రవిచిత్ర సాధనాలపై సారించిన సంగీతం కళకళలాడుతూ కన్నుల పండువగా ఒప్పారింది.

చుట్టపుచూపుగా వచ్చిన సాటిరాజు ఎదుట మర్యాద కోసం జరిగే చతురంగ బలప్రదర్శనంలా ఏనుగులు, ఒంటెలు, గుర్రాలు మెల్లమెల్లగా ఠీవి వలయించుకుంటూ వచ్చి రంగస్థలానికి ప్రదక్షిణం తిరిగి మళ్లీ లోపలికి వెళ్లిపోయాయి. అంతలో చిట్టచివరి ఏనుగుగున్నకు మానవరూపం సిద్ధించిందని భ్రమించడానికి వీలుగా ఓ మహాకాయుడు రంగంపైన ప్రత్యక్షమయ్యాడు. అతడు అంగసౌభాగ్యంలో సమస్తలోకాన్నీ సవాలు చేస్తున్నట్టు భుజాస్ఫాలనం చేశాడు. ఐదుగురు మనుషులు ఒక్కసారిగా చేతులు కలిపినా పైకి లేవని యినుపగడను సునాయాసంగా గాలిలో గిరగిరా త్రిప్పాడు. అతడు రొమ్ముకు పలక ఆనించి, పలక పైన ఏనుగు నెక్కించిన దృశ్యం, ఆ ఏనుగలా నిల్చున్నంతసేపూ ప్రేక్షకుల గుండెల పైన పనిచేసింది.

ప్రేక్షకుల మనోవీధిలో ఆ మహాకాయుడి ముద్ర యింకా చెరిగిపోనేలేదు. అంతలో ఓ యిరువదేళ్ల యువతి పరుగే నడకగా వచ్చి నృత్యానికి సిద్ధమౌతున్న రాజనర్తకిలా సభాసదులకు నమస్కరించింది. రచనల్లో శారీరక సౌందర్యాన్ని పెద్దగా చేసి చెప్పడం ఈనాటి ఔచిత్యంగాదు. కానీ అందుకని కూర్చుని కథో, కావ్యమో వ్రాయదలుచుకున్నప్పుడు పనిగట్టుకుని ఔచిత్యాన్ని పోషించడం జరుగుతుంది. ఆలోచనకు తెరపి యివ్వకుండా అనుభూతే మానసాకాశమంతా క్రమ్ముకున్నప్పుడు నియమాలు నిలవవు. ఆ స్థితిలో ఎవరికైనా మైమరపు కలుగుతుంది. ఆ మైమరపు నుంచి బయటపడడం వారివారి చిత్త సంస్కారాన్ని అనుసరించి ఒకచోట త్వరగానూ, మరొకచోట ఆలస్యంగానూ జరుగుతుంది. నేను డేరా అంతటా కలయజూచేసరికి కొందరప్పుడప్పుడే కోలుకుని అల్లల్లాడుతున్న కనురెప్పలతో ఆ అందాలరాశికి నివాళి యిస్తున్నారు. మిగిలినవారింకా అనిమేష నయనాలతో ఆమెను తిలకిస్తూనే వున్నారు. ఈ సర్కసులో వున్న అనేక ఆకర్షణల్లో, ఈమె సౌందర్యం గూడా ఒకటన్న విషయం నాకప్పుడు విశదమైంది. ఆమె పేరేమిటో నాకు తెలియదు. బహుశా అది పొంగుతున్న పాలలా విహ్వలించిపోయే అపూర్వ సౌందర్యానికి పర్యాయపదమై వుంటుంది.

ఆమె ఓ జాజిపలకను ఆనుకుని ప్రేక్షకులకు అభిముఖంగా నిల్చుంది. కళ్లకు గంతలు గట్టుకొన్న యువకుడొకడు పళ్లెం నిండుకూ కత్తులుంచుకుని ఆమె ఎదుట నిల్చున్నాడు. వట్టి సౌందర్యాన్ని చూడ్డంతో తనివితీరని ప్రేక్షకులకు మరింత తృప్తి కలిగించడం కోసం అతడామె పైకి కత్తులు విసరసాగాడు. విఫలమైన కాముకుడి కోరికలా ఆమె సౌందర్యాన్ని చుంబించకుండా

కత్తి ప్రతిసారీ ఆమె బెత్తడు దూరంలో గ్రుచ్చుకుంటున్న మాట నిజమే. కానీ మృత్యువుకూ మనుగడకూ వున్న దూరం యింత తక్కువైతే అది యిద్దై తెర క్రిందకి వ్రాలడానికి ఎంతసేపు పడ్తుంది? అయ్యో, విధాత ఆమెకింత సౌందర్యాన్ని ఎందుకు ప్రసాదించాడు? మిడిగ్రుడ్లతో, బొక్కి దవడలతో, రాక్షసిబొగ్గు లాంటి శరీరచ్ఛాయతో చూస్తే డోకు తప్పనంతటి జుగుప్సాకరంగా ఈమెనెందుకు సృష్టించలేదు? అందం ఏ ప్రాణికి రక్షణ యివ్వగలిగింది గనుక? అందంగా వుండడం వల్లనే చిలుకల కోసం, పావురాళ్ల కోసం వలలు విసురుతున్నారు. దుప్పుల్ని ఎందుకు వేటాడుతున్నారు, వాటి కొమ్ములు అందంగా వుండటం వల్ల! పులుల్ని ఎందుకు కాల్చి చంపుతున్నారు, అందంగా వున్న వాటి చర్మాల కోసం!

క్షణంలో దృశ్యం మారింది. నాలుగైదు నిమిషాల కొకటిగా ఓ అరగంటసేపటి వరకూ దృశ్యాలలా మారుతూనే వుండిపోయాయి. నూనెగుడ్డలు మంటలు చిమ్ముతున్న వర్తులాకారపు యినుపకమ్ముల్లో నుంచి ఓ జవ్వని లేడిపిల్లలా చెంగు చెంగున దూకింది. రొమ్ము పైన బండ రాయి సమ్మెటవ్రేట్లతో పగిలిపోయిన తర్వాత ఓ యువకుడు దుమ్ము దులుపుకుని పైకి లేచాడు. ఒక ఎలుగుబంటి మోటర్‌సైకిలు త్రొక్కింది. పూర్వకాలపు రాజాస్థానాల్లోని విదూషకుడికి తోడల్లుడు లాంటి బఫూను నేలపైన పడకుండా నాలుగైదు కత్తులను రెండుమూడు నిమిషాల పాటు గాలిలో ఎగురవేశాడు. అగస్త్యుడు సముద్రాన్ని ఆపోశనం పట్టేశాడన్న పురాణగాథ మనమనుకుంటున్నంత అభూతకల్పన కాదని నిరూపించడానికన్నట్టుగా ఒక బక్కపల్చటి మనిషి పదిహేను చేపలతో రెండు బకెట్ల నీళ్లను ఏకధాటిగా త్రాగి, ఆ త్రాగిన నీటిని అయిదు నిమిషాల తర్వాత చేపలతో సహా పైకి చిమ్మేశాడు!

ఇన్ని సాహసకృత్యాలు జరిగిన తర్వాత ఒంటిచక్రాల సైకిళ్లు కొన్ని జంటలు జంటలుగా రంగంపైకి వచ్చేశాయి. వెన్న పెట్టిన వాళ్లను వడిసెలతో కొట్టడం లౌకిక మర్యాదల్లో ఒకటని చాటి చెప్పడానికి కాబోలు, ఒంటిచక్రపు తేరును అనుకరించనూ అనుకరించి, కుంటిసారథి వున్నా వూడినా ఒకటేనన్నట్టుగా బ్రేకుల తంటా వదిలించుకోనూ వదిలించుకుని, అందుకు సూర్య భగవానుడి కింత కృతజ్ఞత కనపరచకపోవడం అటుండగా, ఆ సైకిళ్లెక్కిన సుందరీమణులు తమ ముఖలావణ్యాన్ని చంద్రబింబం నుంచి పుణికి పుచ్చుకున్నారు. ఎంతగా నిగ్రహించుకోబోయినా అలవాటు ననుసరించి వుండి వుండి క్రమ్ముకుంటున్న నిదుర తెరల్లో స్తబ్ధులై వున్న సామాజికుల్లో కలకలం బయలుదేరింది. ఒకటికి పది చంద్రబింబాలు ఒక్కసారిగా ద్యోతకమైతే, మనుషుల ముఖాలు కలువపువ్వుల పాటి చేయవటండీ మరి!

ఆ సైకిళ్లను ఒక సరళరేఖలో సూటిగా త్రొక్కడమే కష్టసాధ్యంగా వుండగా, వాళ్లు నాలుగు బారల వలయంలో అల్లీబిల్లీ తిరిగారు. ఆ తరువాత చిత్ర కవిత్వానికి మల్లే లేనిపోని అడ్డు తిరుగుళ్లన్నీ పోయారు. చిత్ర కవిత్వం చదువుకోడానికైతే అదొక హొయలుతో ఆహ్లాదకరంగానే వుంటుంది. కానీ భావం మాత్రం ఒకంతట బోధపడదు. ఆ రాత్రివేళ, విద్యుద్దీపాల కాంతిలో వాళ్లు తమ తమ సైకిళ్లతో నిరచించిన నాగబంధాలకూ, గోమూత్రికాబంధాలకూ అర్థమేమైనా వుంటే అది యిది: "సోదరులారా! మీరు మా అందచందాల్ని మాత్రమే చేస్తారు. ఈ అందచందాల వెనుక మమ్మల్ని కత్తుల ఎదుట నిలబెట్టి, ఒంటిచక్రాల సైకిళ్లెక్కించి, మంటల మధ్య పరుగులు తీయించే కడుపు కక్కుర్తిని మీరు చూడరు. కుందేలు కనపడగానే నాలుక చాచి, చొంగలు కార్చుకుంటూ వెంటాడే జాగిలంలా, మాటిమాటికీ మాపై విరుచుకపడిపోవడానికి వుడికించే కాముకత్వం బారి నుంచి తప్పుకుంటూ, నా అన్నవాళ్లకు దూరంగా, పదిరోజుల కొక మకాముగా మేమెందుకిలా దుర్భర ప్రవాసక్లేశం అనుభవిస్తున్నామన్న సంగతి, తొమ్మిది గంటలప్పుడు యిళ్లల్లో

భోజనం చేసి హాయిగా తాంబూలం నములుతూ భార్యాబిడ్డలతో సహా వచ్చి సర్కసు డేరాలో కూచున్న మీకు అర్థం గాకపోవడంలో ఆశ్చర్యం లేదు. మీకు మాలాటి తోబుట్టువులుండకపోరు. మీకు మాలాటి కూతుళ్లుండకపోరు. వాళ్లు గడప దాటకుండా కాపురాలు దిద్దుకోవడమే మీ కిష్టం. కానీ మేమిన్ని కాదు మరిన్ని సాహసకార్యాలు చేసి, ఇంతకాదు మరింత నగ్నంగా మా అందచందాల్ని ప్రదర్శించడం మీకానందం! అవును మరి, శరీరాలు మీవి కానప్పుడు, మేము కాశిదాకా ప్రాకినా మీకు నష్టమయ్యేదేమీ లేదు. ఎవరికో నష్టం కలుగుతోందని చింతించడం మానవస్వభావం కాదు. ఇది సర్కసు డేరాకు మాత్రమే పరిమితమయిన న్యాయంగాదు. లోకపు తీరే యింత!''

ప్రదర్శనం చకచకా సాగిపోతోంది. గాలరీలో రణగొణధ్వని తప్పితే మిగిలిన డేరా అంతా నిశ్శబ్దంగా వుంది. దగ్గర్లో ఏదో కుర్చీ కదలిక వినిపించి అటువైపు తిరిగాను. అప్పుడే లోపలికి వచ్చాడేమో, కుర్చీలో కూర్చుంటూ నాగులు నాకేసి చూసి చిరునవ్వు ఒలకబోశాడు.

''అదేమిటోయ్, యిప్పుడొస్తున్నావు! ఇందాకా ఏం చేస్తున్నట్టు?'' అన్నాను.

''టికెట్లన్నీ అమ్ముడుబోయాక టీ త్రాగటానికని బంకులో కెళ్లి కూచున్నాను. ఇంటికి వెళ్లిపోదామనుకుంటుండగా ఎవరో ఒకతను తలనొప్పిగా వుందని బయటికి వచ్చేశాడు. అతడి దగ్గర నాలుగణాలకు ఔట్‌పాసు కొనుక్కున్నాను,'' అన్నాడు నాగులు.

సరిగ్గా ఆ సమయానికి తెల్లటిగౌనులో మల్లెపువ్వుల ప్రోగులాంటి ఓ మందయాన భూమికి అయిదారు గజాల ఎత్తున్న యినుపతీగ పైన వడివడిగా నడచిపోతుంది.

ఇంతసేపటికి లభ్యమైన పలుకుదోడును సద్వినియోగం చేసుకోదలచి, ''చూచావా నాగులూ! ఆమె ఏం చక్కా నడుస్తోందో?'' అన్నాను.

నాగులు మౌనంగా నా భుజంపైన చేయి వేశాడు. ''ఏమిటీ?'' అన్నాను.

''నా పాదం చూచారా?'' అన్నాడు.

గాయానికి కట్టిన గుడ్డ కూడా ఎరుపెక్కిపోయి, అతడి పాదం పాదమంతా నెత్తురుగడ్డలా గోచరిస్తోంది.

''అదేమిటి నాగులూ! బాగా కోసుకపోయిందేమిటి?'' అని కంగారుగా ప్రశ్నించాను.

''టికెట్లమ్మే తొందరలో చూసుకోలేదు గానండీ, ఆ తర్వాత చూశానుగదా, కుడికాలంతా అరంగుళం మేరకు తెగిపోయింది. జనంలో నేనెక్కడెక్కడైతే తిరిగానో, అక్కడల్లా నెత్తురు చుక్కలు చుక్కలుగా కారిపోయింది.''

డబ్బారేకు అంచుపైన అరగంటసేపు అసిధారావ్రతం సలుప గలిగిన నాగులు ఎదుట, తీగపైని నడకను గురించి ప్రస్తుతించబోయినందుకు నాకు నేనే కించపడ్డాను.

మళ్లీ పది పదిహేను నిమిషాలు పరధ్యానంలో గడిచిపోయాయి. రంగస్థలం పైన కండపుష్టికీ, ఎముక బలానికీ నమూనాల్లాంటి అశ్వాలు పరుగెడుతున్నాయి. వేగంగా పరుగెత్తడం లో గుర్రాలు వాటికవే సాటి అన్న విషయం అందరికీ తెలిసిందే! చిత్రమేమిటంటే అవి అంత వేగంతో పరుగెడుతుండగా ఓ యువకుడు ఒకదానిపై నుంచి మరొకదానిపైకి లంఘిస్తున్నాడు.

''చూడు చూడు! అబ్బ, ఏం చలాకీతనం నాగులూ! కొంచెం ఆదమరిస్తే పళ్లు రాలిపోవూ, ముఖం చదరమైపోదూ!'' అన్నాను.

''ఇహిహీ,'' అంటూ నాగులు నా ముఖం మీదికి ఓ వెకిలి నవ్వు పారేశాడు.

''ఏమిటి నాగులూ! యిది గూడా నీకు ఆశ్చర్యంగా లేదా?'' అన్నాను.

"పందెం వేద్దామటండీ? ఇరవై అయిదుమైళ్లు స్పీడులో వెళ్లే బస్సును చూపించండి. ఎగిరి ఫుట్‌బోర్డు పైన దూకకపోతే నా పేరు నాగులు కాదు. అయితే ఒకటి, ఈ గాయం మాని పోవాలి," అన్నాడు నాగులు.

ఓరి వీడిల్లు బంగారంగానూ, వీడు మాట మిగులనిచ్చే ఘటంలా లేడు!

ఇంతలో ప్రేక్షకులు ఎంతోసేపటి నుంచీ ఎదురుచూస్తున్న ఘట్టం, సర్కసువారు పంచిపెట్టిన కరపత్రాల భాషలో ఆకాశడోలలో సాహసక్రీడ ప్రారంభమైంది.

త్రాటినిచ్చెన మూలంగా యువతీ యువకులు కొందరు డేరా కడ్డంగా కట్టిన వలపైకెక్కి, అక్కడి నుంచి పైకప్పుకు వ్రేలాడుతున్న ఊయలల పైకి చేరుకున్నారు. కాసేపు విలాసంగా సాగిన తర్వాత ఆ క్రీడ చూస్తూచూస్తూ వుండగానే సాహసఖేలగా మారిపోయింది. ఉట్టిలో కుండల్లా ఒకరి పాదాలు మరొకరు పట్టుకుని యిద్దరు ముగ్గురు ఒకటిగా ఊగారు. క్రిందనున్న వ్యక్తి వున్నట్టుండి మరొక వూయలను పట్టుకోగా మీదనున్న మనిషి హఠాత్తుగా క్రిందకి వెళ్లిపోయాడు. క్షణం విరామం లేకుండా అక్కడున్న ఆరేడు ఊయలలూ చివ్వుచివ్వున ఊగిపోయాయి. ఈ క్షణాన ఈ వూయల్లో వున్న వ్యక్తి మరుక్షణాన ఏ వుయ్యాలలో వుండగలడన్న విషయం ఊహ కందటం లేదు. గాజుతొట్టిలో క్రిందికీ మీదికీ తిరుగుతున్న చేపలకు మల్లే వాళ్లు గాలిలో ఈత కొడుతున్నట్టే భావింపవలసి వచ్చింది.

ఈ సాహసకృత్యానికి న్యూనత నాపాదించడం తరం కాదనుకున్నాడేమో, నాగులు ఊయలల వైపు నిర్లిప్తంగా చూస్తున్నాడు.

"ఏం నాగులూ! ఎలా వుంది?" అని ప్రశ్నించాను.

"అక్కడ ఆ వల ఒకటి వున్నంతవరకూ అంతా బాగానే వుంటుంది," అన్నాడు నాగులు.

రసహీనుడితో కవితాగోష్ఠి చేయబోయి వెల్లకిలా పడినవాడిలా నేను ముఖం ముడుచు కున్నాను.

"కోప్పడకండి సార్!" నా దగ్గరికి కుర్చీ జరుపుకుంటూ అన్నాడు నాగులు. "వీళ్లని తీసి పారేయాలని కాదు. నాకు పదేళ్లు వచ్చీ రాకముందే మా నాన్న చనిపోయాడు. ఎలా చనిపోయాడో చెప్పమంటారా? పదిమట్ల బావిలో పై మెట్టు మీద నిలబడి మట్టి మోస్తున్నాడు. క్రింది నుంచి తట్ట తీసుకుని ముందుకు తిరిగాడేమో, కాలు జారింది. కళ్లు మూసి తెరిచేలోగా బావిలో నీళ్లు ఎరుపు తిరిగిపోయాయి. మనిషి మనిషిగా చేతికి దొరకలేదు. గోనెసంచిలో మూటగట్టి పైకి చేదుకోవలసి వచ్చింది." ఒకటి రెండు క్షణాలు మౌనంగా వుండి అతడు తనకు తానే స్వగతం లా చెప్పుకుపోసాగాడు. "అలాగని అదాయనకు కొత్తపనిగాదు. ఆయన బ్రతుకంతా బావుల్లో మట్టి మోయడంతోనే గడిచిపోయింది. కానీ భగవంతుడు ఆయనకు చావు గూడా అక్కడే రాసి పెట్టాడని ఎవరనుకున్నారు?"

ఉన్నట్టుండి ఏదో రహస్యం జ్ఞప్తికి వచ్చినవాడిలా తల పైకెత్తి అన్నాడు నాగులు: "బావిలో కాలుజారితే మనిషి చావక మరేమౌతాడండీ? అక్కడ యిలాటి వలలేదుగదా?"

ఇక నాగులు ఎదుట నాకు మౌనవ్రతమే శరణ్యమనిపించింది!

నా మాట మిగిలించాడు కాదన్న వుక్రోషాన్ని ఆవలికి నెట్టి నిజమాలోచిస్తే నాగులు వాదంలో వాస్తవం లేకపోలేదు. కూటికోసం కోటి విద్యలయితే, ఆ కోటివిద్యల్లో కత్తి మీద సాము లాంటివెన్ని? మిత్తికోరల్ని సానపెట్టడం లాంటివెన్ని? నాలుగు దూలాల్ని ఒక్కటిగా చేర్చి కట్టి దానికి పడవ అని పేరుపెట్టి సముద్రంలో ఓపినంత దూరం తిరిగి చేపలు పట్టి తెచ్చు కొంటేగాని పొట్ట గడవని బెస్తవాడి బ్రతుకు కత్తిమీద సాముగాక మరేమిటి? పాతాళలోకం లాంటి భూగర్భంలో

కదలడానికీ, మెదలడానికీ సావకాశం లేని చీకటి గొందుల్లో పార చేతబట్టి పనిచేసే వాడి బ్రతుకు మిత్తికోరలకు సానపెట్టటంగాక మరేమౌతుంది? నిర్మాణంలో వున్న అయిదంతస్థుల మేడ పైకి కర్రనిచ్చెన ద్వారా యిటుకరాళ్లు మోసుకెడ్తున్న ఆడమనిషి సురక్షితంగా క్రిందికి దిగి రాగలదని ఎవరు చెప్పగలరు? చెంబును పైకి తీయడానికి పదిగజాల లోతున్న బావిలో మునుగుతున్న గజ ఈతగాడు మళ్లీ సజీవంగా పైకి తేలగలడన్న పూచీ యేముంది?

'తీసుకో, తీసుకో' అని కుర్రవాణ్ణి వూరించి, వాడు దగ్గరికి వచ్చేలోపుగానే మనం దాచి పెట్టుకునే తినుబండారంలా అంతలో మృత్యువు చేత చిక్కి బిక్కరించబోయి, యింతలో దూరంగా వెళ్లి వెక్కిరించడమేనా మానవ జీవితం?

ఆలోచన కంతరాయంగా లౌడ్‌స్పీకరులో వ్యాఖ్యాత కంఠం గంభీరంగా వినిపించింది. "మృగరాజుకూ మానవుడికీ దోస్తీ! మేకతో బెబ్బులి సావాసం! మీకు గగుర్పాటు కలిగించే సన్నివేశం! అదిగో, అతడే మృగరాజు! ఇదిగో, ఇతడే ఆ మృగరాజును సాధువుగా తీర్చిదిద్దిన సాహసికుడు. చూడండి, చూచి ఆనందించండి..."

ఏటవాలుగా వున్న రాతి బండపైన ఓ గండశిల దొర్లుతున్నట్లుగా సింహం దిక్కులు మార్మోగేటట్లు గర్జించింది. ఆ గర్జన తాకిడికి తల్లి ఒడిలో నిద్రపోతున్న పసిపాప వులికిపడి లేచి కెవ్వున ఏడవడం వినిపించింది. పరాధీన స్థితిలో వున్నప్పటికీ రాజఠీవికి వెలితి దోపని గాంభీర్యంతో, వేసిన ప్రతి అడుగులోనూ దర్పం ద్యోతకమౌతుండగా, చూసిన ప్రతి చూపులోనూ ఔద్ధత్యం తొణికిసలాడుతుండగా ఆ సింహం కాసేపు వేదికపైన తచ్చాడి అంతటితో తన పని తీరిపోయినట్లు బోను లోపలికి వెళ్లిపోయింది.

ఆ తరువాత లోకంలోని దుష్టశక్తులన్నింటికీ ప్రతిబింబంలాంటి మువ్వన్నె మెకం, మూర్తీభవించిన తామసగుణంలా ఒకవైపు నుంచి వేదిక పైన ప్రవేశించింది. మరొకవైపు నుంచి మేకపిల్ల ఒకటి నిర్భీతిగా పులిని సమీపించింది.

ఊపిరి బిగబట్టుకున్న ప్రేక్షకులు మోరలు పైకెత్తి ఆ విచిత్ర దృశ్యాన్ని చూడసాగారు.

నేల పైన కూర్చుని తోకాడిస్తూ పులి ఆవులిస్తున్నట్టు నోరు తెరిచింది.

ఆ తెరిచిన నోటిలో మేకపిల్ల తన తలను మెడదాకా దూర్చింది.

దవడల్ని ఒక అరంగుళం మేరకు కదిలిస్తే చాలు- పులి కోరలకు వెచ్చటి మేక నెత్తురుతో అభిషేకం జరుగుతుంది.

కానీ- పులి అలాటిపని చేయలేదు.

"తరిబీదు సంగతి అలా వుండనీ నాగులూ! పులీ, మేకా అంత అన్యోన్యంగా వుండడం ఆశ్చర్యకరం," అన్నాను.

నాగులు మౌనంగా ఆ దృశ్యంకేసి చూస్తున్నాడు.

నేనంతటితోనయినా ఊరుకోవలసింది!

"ఇంతకంటే లోకంలో విచిత్రమేముంది నాగులూ! అయినా ఆ మేకపిల్ల పులిని అంత గాఢంగా ఎలా నమ్మగలిగిందబ్బా!" అంటూ ఆశ్చర్యం ప్రకటించాను.

"ఎలాగయినా అవి జంతువులు గదండీ!" అన్నాడు నాగులు.

'ఏమిటీ, ఏమిటీ?' అనబోయి, మునిపంటితో పెదవి కొరుక్కుని అంతటితో నోరు మూసుకున్నాను. ఆ క్షణాన నా ముఖాన ఎలాంటి మార్పు సంభవించిందో చెప్పలేను. బహుశా, కొరడా పెట్టి చెంప మీద వాత తీసినట్టు, అది పాలిపోయి వుంటుంది!

*ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, 1958*

సర్కస్ వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ రాసిన

# సర్కస్ డేరా

***సహజత్వం ఉట్టిపడేట్లుగా సన్నివేశం కళ్ళెదుట రూపుకట్టాలంటే కొంత వాతావరణ వర్ణన అవసరం. సర్కస్ వచ్చింది అంటే చాలదు. ఎలా వచ్చిందో చెప్పాలి. వచ్చి ప్రజల్ని ఎలా ఆకర్షించిందో చెప్పాలి. వర్ణనలతోను, పోలికలతోను, వక్రోక్తులతోను అనేక విధాలుగా అందుకోసం ప్రయత్నించడం జరిగింది.***

చెప్పవలసిన విషయం ఒకటి స్ఫురించి, అందుకోసం పాత్రలు, సన్నివేశాలు కల్పించుకొని కథ అల్లుకోవడం ఒక పద్ధతి. కథాంశం ఒకటి స్ఫురించి, క్రమక్రమంగా అది కథగా పరిణతి చెందిన తర్వాత, దాని ద్వారా చెప్పదల్చుకొన్న విషయమేమిటో తేల్చుకొని, ఆపైన కథారచనకు పూనుకోవడం ఒక పద్ధతి.

సర్కస్ డేరా కథ ఈ రెండింటిలో ఏ పద్ధతికి చెందిందో ఆలోచించాలి.

1955 ప్రాంతంలో 'ది గ్రేట్ ఇండియన్ కమలా లైన్ సర్కస్' (పేరు సరిగ్గా గుర్తులేదు) అనేదొకటి చిత్తూరికి వచ్చి దిగేసింది. బహుశా అంత పెద్ద సర్కస్ దక్షిణాదికి రావడం అదే మొదటిసారి. ఆ ప్రదర్శన చూస్తుండగా మనసులో కథలాంటిదేదో రూపుదిద్దుకొన్నట్టయింది. పొగమంచు వెనుక సూర్యబింబంలా కథ ద్వారా చెప్పదల్చుకొన్న విషయం కూడా స్పష్టాస్పష్టంగా గోచరించింది. అవగాహన ఒక పట్టాన కుదురుతుందా? పలుసార్లు మననం చేసుకోవలసి వచ్చింది.

కథలోని ముఖ్య పాత్రలు రెండే. 'నేను,' అంటూ ఉత్తమ పురుషలో కథనం చేసే వ్యక్తి (కథలో పేరెక్కడా కనిపించదు కనుక అతణ్ణి రఘుపతి అనుకుందాం), రెండోవాడు కాయకష్టంపైన జీవించే పద్దెనిమిదేళ్ళ పడుచువాడు- నాగులు.

కథకుడు ఉత్తమ పురుషలోనే కథ చెప్పడంలో ఒక సౌలభ్యముంది. అప్పుడతడు గమనించేవాడుగా, పరిశీలకుడుగా, వ్యాఖ్యాతగా కూడా వ్యవహరించవచ్చు.

కథ ద్వారా రఘుపతిని గురించి తెలిసి వచ్చే వివరాలు- అతడు పల్లెటూరివాడు, సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు, ఎంతో కొంత చదువుకొన్నవాడు. పురాణజ్ఞానం కద్దు. పల్లె నుంచి పట్నానికి వచ్చాడు.

సహజత్వం ఉట్టిపడేట్లుగా సన్నివేశం కళ్ళెదుట రూపుకట్టాలంటే కొంత వాతావరణ వర్ణన అవసరం. సర్కస్ వచ్చింది అంటే చాలదు. ఎలా వచ్చిందో చెప్పాలి. వచ్చి ప్రజల్ని ఎలా ఆకర్షించిందో చెప్పాలి. వర్ణనలతోను, పోలికలతోను, వక్రోక్తులతోను అనేక విధాలుగా అందుకోసం ప్రయత్నించడం జరిగింది.

కూలీలతో, కార్మికులతో, సుశిక్షితులైన క్రీడాకారులతో, వ్యాన్లతో, లారీలతో, పులులు, సింహాలు, ఏనుగులులాంటి జంతువులతో సర్కస్ సంరంభంగా వచ్చింది కదా! అదెలా ఉందంటే- 'భట సంఘంబులతో, రథావళులతో, భద్రేభయూథంబుతో, పటువేగాన్విత ఘోటక వ్రజముతో' శిశుపాలుడు రుక్మిణిని పెళ్ళాడడం కోసం విదర్భకు తరలి వచ్చినట్టుంది.

పట్నంలోని సర్కస్ ఉనికిని తెలియజేయడం కోసం దాని నిర్వాహకులు ఓ పెద్ద కరెంటు దీపం ద్వారా పొడుగాటి కాంతిపుంజాన్ని ఆకాశవీధుల్లోకి పంపి, అయిదు నిమిషాలపాటు దాన్నక్కడ వలయాలు త్రిప్పించారు. ఆ కాంతి దాదాపు పాతికమైళ్ళ దాకా కాన వచ్చింది. జనం తండోప తండాలుగా, బస్సులపైన, ఎడ్లబండ్లపైన, చివరికి పాదచారులుగా కూడా సర్కస్ దర్శనార్థం పట్నానికి చేరుకోసాగారు.

దేశీయ వాతావరణంలో ఈ సన్నివేశంతో కొంతవరకు సరిపోల్చదగ్గ విశేష సంఘటన ఒకటి రఘుపతికి స్ఫురించింది. అదేమిటంటే...

-ఏ పుట్టలో పాములుంటాయో, ఏ పుట్టలో ఈసిళ్ళుంటాయో ఇర్లవాడికి తెలిసినట్టు మరొకరికి తెలియదు. భుజాన మోపెడు ఈతపుల్లలతోను, చేత నీళ్ళ దుత్తతోను ఇర్లవాడొకడు మీకు పల్లెపట్టులో ఎదురైతే, అతగాడక్కడెక్కడో పుట్ట మూసి ఈసిళ్ళు పట్టబోతున్నాడన్నమాట! కీటక సంహారకాండలో నాందీవాచకంగా అతడు పుట్టలో ముఖ్య రంధ్రాన్ని మాత్రం మినహాయించి, మిగిలినవాటిని మూసేస్తాడు. ఆ తరువాత పుట్టమీద చిక్కగా నీళ్ళు చిలకరిస్తాడు. ముఖ్య రంధ్రానికి చేరువగా ఒక దిగుడు అమర్చి అందులో దివ్వె వెలిగిస్తాడు. ఎండు మట్టిపైన చల్లటి నీళ్ళు పడ్డంతో, నీటి ఆవిరి పైకెగిరి పుట్టలోపలి కీటకాలకు వాన కురుస్తున్నట్టో, లేక కురిసి వెలిసినట్టో భ్రమ కలుగుతుంది. బారులు బారులుగా అవి పైకొస్తాయి. వచ్చీరాగానే మృత్యు దేవత కూరదంష్ట్రలాంటి దీపశిఖ వాటిని ఆహ్వానిస్తుంది. అవి మొదట రెక్కలు రాల్చుకుంటాయి. ఆ తరువాత ఇర్లవాడికి మరునాటి ఆహారంగా మారిపోతూ కుప్పగా కూలిపోతాయి.

'చేసిన పాపం చెబితే పోతుందంటారు, అలా సర్కస్‌కు వెళ్ళి పట్నంలో దిగబడిపోయిన అసంఖ్యాక ప్రజాసమూహంలో నేనూ ఒకణ్ణి,' అంటూ రఘుపతి కథారంగంలో ప్రవేశిస్తాడు.

ఇప్పుడిక ఆ రంగస్థలి ఎలా ఉందో చెప్పాలి కదా!

-ఆ డేరా చాలా పెద్దది. డేరా చుట్టూ సాధుజంతువుల పాకలకు, క్రూర జంతువుల బోన్లకు, మానవుల గుడారాలకు ఓపినంత జాగా ఆక్రమించుకోబడింది. చుట్టూరా ఏడెనిమిది అడుగుల ఎత్తున్న డబ్బారేకుల ప్రాకారం, ప్రాకారానికి లోపల ఇసుక వేస్తే కింద రాలని జనస్తోమం. అన్నింటికీ వెనుక సోడా, కిళ్ళీల కొట్లు, టీ కాఫీ బంకులు, గారెలు, బూరెలు అమ్మే అంగళ్ళు. చల్లచల్లగా వీస్తున్న చలిగాలి స్పర్శకు ముఖం జివ్వుమంటోంది. కర్త, కర్మ, క్రియలతో పూర్తి వాక్యాలతో వివరించి చెప్పడానికి వీలిచ్చే అలజడి కాదది! సిగరెట్ల పొగ, బీడి కంపు, షోకిల్లా మనుషుల సెంటు గమగమలు, పల్లెటూరు ముత్తయిదువ ముడుచుకున్న మొగలిరేకుల సుగంధలహరి, కళ్ళకు మిరుమిట్లు గొలిపే దీపాలు, చలికి ముడుచుకుపోతున్న ముఖాలు, నవ్వులు, కేరింతలు,

ఛీత్కారాలు, వికటాట్టహాసాలు. అది కళ్ళకు కనిపించిన దృశ్యమే. కానీ ఒకసారి పడుకొని నిద్ర లేచిన తరువాత 'కలా, నిజమా' అన్న విభ్రాంతికి ఆస్కారమిచ్చే దృశ్యం.

రఘుపతికి ముఖ్యమైన విషయం ఒకటి జ్ఞప్తికి వచ్చింది. తనకప్పుడో టిక్కెట్టు కావాలి. ఏది లేకపోతే డేరా లోపలికి ప్రవేశం సాధ్యం కాదో ఆ టికెట్టు కావాలి. ఎలా దొరుకుతుందది? కౌంటరు దగ్గర, 'బలం ఉంటేనే బ్రతుకు' అన్న విషయంపైన ప్రత్యక్ష ప్రదర్శనం ఒకటి ఏర్పాటై నట్టుంది. ఆ వ్యూహంలో చొరబడే సాహసం ఎలాగూ లేదు. బ్రతుకు పైన తీపి కలిగి ఉండడమే అందుకు కారణం. అయితే తనకు టికెట్టు దొరకదు. కానీ టికెట్టు కావాలి. అందుకేదీ ఉపాయం?

సరిగ్గా ఈ సందిగ్ధావస్థలో అతడికి ఆపద్బాంధవుడిలా కనిపించాడు నాగులు. ఆరోజు నాగులతడికి కనిపించడం అది రెండోసారి. మొదటిసారి సాయంకాలం అయిదున్నర గంటలప్పుడు బస్టాండులో లగేజీ మోసుకొచ్చే కూలీగా తారసిల్లాడు. రెండోసారి సర్కస్ డేరా దగ్గర డబ్బారేకు పైన ఒంటికాలితో నిలబడి, ప్రాకారానికి ఊతగా నాటి ఉన్న కొయ్యను ఎడమ చేతితో పట్టుకొని, తల బాగా కిందికి వంచి కుడిచేతితో కిటికీలో నుంచి టికెట్లు తీస్తూ కనిపించాడు. కొన్న టికెట్లన్నీ బ్లాక్‌లో అమ్మేసిన తరువాత ఇంత నాస్తాతో, ఇన్ని టీ నీళ్ళతో ఆత్మారాముడు శాంతించాక, తలనొప్పి వల్ల ఇంటికి వెళ్ళిపోతున్న ఓ ప్రేక్షకుడి దగ్గర నుంచి అర్ధరూపాయ కిమ్మత్తుతో ఔట్ పాసు కొనుక్కొని, షో మధ్యలో ఎప్పుడో డేరాలో ప్రవేశించి, రఘుపతి పక్కనే కూర్చోబోతున్నాడు.

కలుసుకున్న ప్రతిసారి నాగులు ద్వారా రఘుపతి ఒక పాఠం నేర్చుకోవలసిన పరిస్థితి దాపురించింది.

1) బస్టాండ్ నుంచి బంధువుల ఇంటికి లగేజీ మోసి తెచ్చిన నాగులు కివ్వడానికి రఘుపతి దగ్గర చిల్లర డబ్బులుండవు. జేబులో నుంచి అతడు పైకి తీసిన పది రూపాయల నోటును లాక్కుంటూ, 'ఇదిగో ఇప్పుడే చిల్లర తెచ్చి ఇస్తా'నంటూ నాగులు అంగళ్ళవైపు దూసుకుపోతాడు. పది నిమిషాలు గడిచినా తిరిగిరాడు. 'ఇంకెక్కడి పది రూపాయలులెండి! కృష్ణార్పణమనుకోండి!' అంటూ ఆ ఇంటి గృహిణి ఎద్దేవా చేస్తుంది. వీధిలోకి వెళ్తే విషయం తెలుసుకున్న విజ్ఞులు, 'బస్టాండు కుఱ్రాడి చేతికి డబ్బులిస్తారా? అంతకన్నా ఏట్లో పారేయడం నయం కదూ!' అంటూ ఎగతాళి చేస్తారు. రఘుపతి కూడా తన బుద్ధిహీనతకు తాను చింతిస్తుండగా, నాగులు ఏవైపు నుంచో పరుగుపరుగున వచ్చి గుప్పెడు చిల్లరను అతడి చేతిలో పోస్తాడు. రఘుపతి ముఖం చిన్నబోతుంది. మనిషికి తోటి మనిషి పట్ల విశ్వాసం అంతరించడమంటే మానవతారాజ్యంలో దివాలా తీయడమే కదా!

2) సముద్రంలో దూకి ఊపిరి బిగబట్టి జలచరాల నుంచి తప్పించుకొని ముత్యాలు చేజిక్కించు కొన్నాక పైకి తేలిన ఈతగాడిలా, పది టికెట్లు కొనుక్కొన్న నాగులు డబ్బారేకుల పై నుంచి కిందికి దూకాడు. (అప్పట్లో మొదటి తరగతి టిక్కెట్టు ఖరీదు రూపాయే.) రూపాయి టికెట్‌ను రెండు రూపాయలకు బేరం పెట్టాడు. పదిపదిహేను నిమిషాల్లో అయిదు టికెట్లు అమ్ముడుపోయాయి. కౌంటరు దగ్గర రద్దీ తగ్గుముఖం పట్టింది. 'ఒకటిమ్మ్మప్పావలా,' అంటూ నాగులు ధర తగ్గించాడు. మళ్ళీ అయిదు నిమిషాలు గడిచేసరికి అతడి చేతిలోని టికెట్ల విలువ మరింతగా పడిపోయింది. రఘుపతి కొక ముఖ్యమైన విషయం ఆకళింపుకు వచ్చేసింది. వేలం పాటలో కాలం పెరిగే కొద్దీ రేటు కూడా పెరుగుతుంది. మరైతే నాగులు విషయంలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. కాలం గడిచిన కొద్దీ అతడి చేతిలోని వస్తువు ధర పడిపోతోంది. ఒక్క వ్యాపారంలోనే ఏమిటి, విద్యలూ విజ్ఞానాలు, భోగభాగ్యాలు, ఆహార విహారాలూ, వినోద విలాసాలూ- ఇవన్నీ దేనికైతే అవసరమై ఉన్నాయో ఆ జీవితమే రెండు రకాలుగా చీలిపోతోంది.

ఒకటి- ప్రవాహగతి ననుసరించి సునాయాసంగా, లీలావినోదంగా పడవ నడవడం, రెండు- చేతుల బలంతో అంతకంతకు తరిగిపోతున్న శరీర దారుఢ్యంతో ఏటికెదురీదడం!

'ఒకటింపావలా!' అంటున్నాడు నాగులు. ఆ మాత్రం డబ్బు పెట్టి టికెట్టు కొనుక్కుని టెంటులోకి ప్రవేశించాడు రఘుపతి.

3) ఒక మహాకాయుడు రొమ్ముపైన పలక నానించుకొని, దానిపైకి ఏనుగు నెక్కించు కొన్నాడు. జాజిపలక నానుకున్నట్టుగా నిల్చున్న ఓ అందగత్తె చుట్టూ కళ్ళకు గంతలు కట్టుకున్న ఓ వ్యక్తి వచ్చి కత్తులు విసిరాడు. నూనెగుడ్డలు మంటలు విరజిమ్ముతున్న వర్తులాకారపు ఇనుప కమ్మిల్లో నుంచి ఓ యువతి లేడిపిల్లలా ఈవలికి దూరింది. ఈలోగా నాగులు కూడా వచ్చి రఘుపతి పక్కన కూర్చున్నాడు.

భూమి అయిదారడుగుల ఎత్తున్న కమ్మీపైన ఓ అమ్మాయి సైకిలు తొక్కింది. గుర్రాలు వాయువేగంతో పరుగిడుతుండగా ఓ యువకుడు ఒకదానిపై నుంచి మరొకదానిపైకి లంఘించాడు. ఆకాశడోలలో ఉట్టిలో కుండల్లా ఒకరి కాలు ఒకరు పట్టుకొని వ్రేలాడుతూ ఊగసాగారు. ఈ సాహసకృత్యాలేవీ నాగులుకు ఆశ్చర్యం కలిగించినట్టు లేవు. ఇందాకా డబ్బారేకు మీద నిల్చున్నప్పుడు అరంగుళం మేరకు తెగిపోయిన కాలు చూపించి, 'కమ్మీపైన సైకిలు తొక్కడం ఇంతకన్నా కష్టమా?' అన్నాడు. 'ముప్పైమైళ్ళ స్పీడుతో వెళ్ళే బస్సు చూపించండి, ఎగిరి ఫుట్‌బోర్డు పైన దూకకపోతే నా పేరు నాగులే కాదు,' అని సవాలు చేశాడు. బ్రతుకంతా బావుల త్రవ్వకంతోనే గడిపిన తన తండ్రి కాలుజారి నదిమట్ల బావిలో పడి కళ్ళు మూయడం ఏ సర్కస్ ఫీటుకు తీసిపోతుందని ప్రశ్నించాడు.

నిజమంతే కాబోలు ననుకున్నాడు రఘుపతి. కూటికోసం కోటి విద్యలైతే, ఆ విద్యల్లో కత్తిమీద సాములాంటివెన్ని? మిత్తికోరల్ని సానపెట్టడం లాంటి వెన్ని? నాలుగు దూలాల్ని ఒకటిగా చేర్చి కట్టి, దానికి పడవ అని పేరుపెట్టి సముద్రంలో సంచరించే బెస్తవాడి బ్రతుకు కత్తి మీద సాముగాక మరేమిటి? పాతాళలోకం లాంటి భూగర్భంలో, ఇరుకైన చీకటి గొందుల్లో పార చేతబట్టి పనిచేసేవాడి బ్రతుకు మిత్తికోరలకు సానపట్టడం కాక మరేమవుతుంది? నిర్మాణంలో ఉన్న అయిదంతస్తుల మేడపైకి కర్ర నిచ్చెన ద్వారా ఇటుకరాళ్ళు మోసుకెళ్తున్న ఆడమనిషి, సురక్షితంగా కిందికి దిగిరాగలదని ఎవరు చెప్పగలరు? చెంబును పైకి తీయడానికి పది గజాల లోతున్న బావిలో మునుగుతున్న గజ ఈతగాడు మళ్ళీ సజీవంగా పైకి తేలగలడన్న పూచీ ఏముంది?

పులి నోట్లో మేకపిల్ల తలపెట్టడం చివరి విశేషం.

దవడల్ని ఒక అరంగుళం మేరకు కుంచిస్తే చాలు, పులి కోరలకు వెచ్చటి నెత్తురుతో అభిషేకం జరిగేదే!

కాని పులి అలాంటి పని చేయలేదు.

'ఇంతకంటే లోకంలో విచిత్రముంటుందా నాగులూ,' రఘుపతి ఆశ్చర్యం ప్రకటించాడు.

'ఎలాగైనా అవి జంతువులు కదండీ!' అన్నాడు నాగులు.

కొరడా పెట్టి చెంపమీద వాత తీసినట్టు రఘుపతి ముఖం పాలిపోయింది.

*


ఈ కథలోని సర్కస్ వాస్తవం. బస్టాండ్‌లో 'నాగులు'తో కలిగిన అనుభవం వాస్తవం. సర్కస్ డేరా దగ్గర టికెట్లు కొనుక్కుంటూ కనిపించినవాడు నాగులు కాదు, ఎవరో మరొకరు. మూడోదఫా నాగులు సర్కస్ డేరాలోకి వచ్చినట్టుగా రాయడం కూడా వాస్తవం కాదు. ఇదంతా కథన సౌలభ్యం కోసం కావించుకొన్న కల్పన.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 17 ఆగస్ట్ 1997*

18

# వారాల పిల్లాడు

## మునిపల్లె రాజు



*మునిపల్లె రాజు 16 మార్చి 1925న గుంటూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 1935-40లలో చిత్రగుప్త పత్రికలో అచ్చయింది. దాదాపు 80 కథలు, కొన్ని నవలలు, కవిత్వం రాశారు. 6 కథాసంపుటాలు ప్రచురించారు. వీరి 'పూజారి' నవలను 'పూజాఫలం' సినిమాగా తీశారు. 1995లో తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం, 'అస్తిత్వనదం ఆవలి తీరాన' కథల సంపుటానికి 2006లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించాయి. మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్‌లో పదవీ విరమణ చేశారు.*


**చిరునామా**

ఎ-30/1ఎ, సైనిక్‌పురి,
సికింద్రాబాద్-500 094
Ph.: 93463 23922


నాయనమ్మ ఒకరోజున నిద్రబోయి, తిరిగి ఎవరు పిలిచినా లేవలేదు. అమ్మా, నాన్నా వెళ్లి నాయనమ్మ భుజాలు పట్టుకొని ఊపి లేవమన్నారు. ఇంతలో నాన్నగారు ఆమె ముక్కు దగ్గర వేలుపెట్టి తీసి, అమ్మ వంక చూశాడు. అమ్మ నారాయణను వెళ్లిపొమ్మంది. నారాయణ గది నుండి వచ్చాడేగాని, ఏదో ఆశ్చర్యం వున్నదని తలుపు సందుగుండా చూస్తూ నుంచున్నాడు. జ్వరం వచ్చినవాళ్లను, చెయ్యి పట్టుకు చూస్తారుగాని, ఎక్కడైనా ముక్కు దగ్గర వేలు పెట్టి తీసి, నాన్న- అమ్మ వంక చూసినట్లు ఎవరైనా చూస్తారా? నారాయణకు అర్థంకాలేదు. తలుపు సందులోంచి తిరిగి పరికించి చూశాడు. అమ్మా నాన్నా, నాయనమ్మను మంచం మీది నుంచి దింపి కింద పడుకోబెట్టారు. అన్యాయం! అన్యాయం!! జ్వరం వచ్చిన వాళ్లను ఇంత అన్యాయం చేస్తారా ఎవరైనా? తనకెన్ని సార్లు రాలేదు? వచ్చినప్పుడల్లా మెత్తటి పరుపూ, తెల్ల దుప్పటి, నాన్నగారి ముఖమల్ దిండూ- అమర్చేవాళ్లే!!

ఆ సాయంత్రానికి కక్కయ్యలూ, అత్తయ్యలూ నారాయణ ఎరగని కొందరూ ఎవరెవరో వచ్చారు. పెళ్లిలో తన్ను ఒళ్లో కూర్చోబెట్టుకుని, పల్లకిలో తల వంచుకొని ఊరంతా ఊరేగిన చిన్నత్తయ్య ఏడుస్తూ వచ్చింది. ఆమెతోపాటు పెద్దత్తయ్య కొడుకులూ, కూతుళ్లూ బావురు

మన్నారు. అయ్యో, ఎందుకర్రా అట్లా ఏడుస్తారు? నారాయణకు అర్థంకాలేదు. కాక తనుగూడా ఏడవడం మొదలుపెట్టాడు. నాన్న వచ్చి బిస్కట్లు, చాక్‌లేట్లూ పెట్టాడు. జవాను- రామలింగం నారాయణను మేడ మీదికి తీసుకెళ్లాడు. తను తప్పించుకొని, పిట్టగోడ కంతల్లో కళ్లూ, ముక్కూ ఇరికించి చూశాడు. వాళ్లందరూ ఏడుస్తుండగా తను మాత్రం వాళ్లతోపాటు గొంతు కలిపితేనే తప్పు వచ్చిందా? అదుగదుగో! నాయనమ్మను చిన్న వాహనం మీద పుట్టలమ్మ గుడి మీదుగా మోసు కొని తీసికెళ్తున్నారు- నాన్నా చుట్టాలుగా వచ్చినవాళ్లూ కలిసి. పైన ఆ గుడ్డ దేనికి? నెత్తి మీద బట్ట గూడా ఎప్పుడూ సరి తీసుకోని నాయనమ్మను వీళ్లంతా ఏదో అన్యాయం చేస్తున్నారు!!! అయ్యోయ్యో!

*

ఆ రాత్రి నారాయణ ఎంగిలి చెయ్యలేదు.

"నాకు నాయనమ్మ కావాలి," అన్నాడు.

"నాయనమ్మ కాశీయాత్ర పోయింది. ఎట్లా వస్తుంది ఇప్పుడే రమ్మంటే?" అన్నది అమ్మ.

"అయితే నేనూ పోతా."

"ఛా! వీల్లేదు. మనం వెళ్లగూడదు."

"అయితే నాకు కథలెవరు చెబుతారు?"

"నేను."

"త్థూ! నువ్వు చెపితే ఏం బాగుండవ్- త్థూ! నేను వినను."

"నాన్నగారూ..."

"కొడతారు- బెమ్మరాక్షసి రాజు కూతుర్ని ఏడు మల్లెమొగ్గలు ఎట్లా చేసిందీ చెప్పమంటే మొన్న కొట్టలా?"

## 2

సగం పాడుబడ్డ గ్రామదేవత మందిరమంతా కలియజుట్టాడు నారాయణ. వెంకాయమ్మ గారిల్లు గూడా వెతికాడు. మామయ్యగారి దేవుడి గదిలో చూశాడు. ఉహూఁ! నాయనమ్మ రుద్రాక్షలు, విభూతిపండూ అట్లాగే ఉన్నాయి. ఆమె పాత నీరుకావి ధోవతులు, కాషాయి ధోవతులు దణ్ణెం మీద వేళ్లాడుతూనే వున్నాయ్. కాని ముసలమ్మే మాయమైంది.

ఎవరినడిగినా నిజం చెప్పటంలేదు. అమ్మ కాశీ అన్నది. అత్తయ్య దేవుడిలోకి అంది. మామయ్య ఊరికి అంటున్నాడు. రామలింగం లేదు అన్నాడు. ఎవర్ని నమ్మటం?

*

అదృష్టవశాత్తు ఆరోజున వారాల పిల్లాడు వచ్చాడు. ఆ అబ్బాయి పేరు నరశింహ్వాం. చిన్న పిలకా, విభూతి, అప్పుడే ఉతుక్కొన్న చొక్కా, చేతిలో పుస్తకం. నరశింహ్వాం తనకన్నా చాలా పెద్దవాడు.

నారాయణ నరశింహ్వాన్ని పట్టుకొన్నాడు.

"మా నాయనమ్మ కనిపించిందా?"

"ఎట్లా కనిపిస్తుంది? చచ్చిపోయినవాళ్లు బూడిదైపోతారుగాని."

"ఎక్కడ?"

"స్మశానంలో."

నారాయణకు ఈ మాటల్లో గట్టి నమ్మకం తోచింది. ఆరోజు నుంచి, వారాల పిల్లాడి పుస్తకంలో పిచ్చిగీతలు గీయటంగానీ, దాన్ని పెట్టెల మధ్య దాచిపెట్టటంగానీ చెయ్యకూడదన్న నిశ్చయానికి వచ్చాడు. కొంతసేపటివరకూ మౌనం వహించి-

"నన్ను తీసికెళ్తావా?" అని అడిగాడు.

"ఎక్కడికీ?"

"అక్కడికే! స్మశానంలోకి. నాయనమ్మ బూడిదైపోయిన చోటికి."

"మీ అమ్మగారికి తెలిస్తే- అమ్మో!"

"ఇప్పుడు కాదులే... సాయంత్రం."

"ఊఁ!"

*

వారాలపిల్లాడితో అట్లా పరిచయమైంది. మామూలు పరిచయం కాదు, సన్నిహితమైనది. ఏ విషమూ, కుట్రా, ద్వేషమూ జొరబడని నారాయణ చిన్ని గుండెలోని కిటికీలు- పిరికిగా, నెమ్మదిగా వారానికోమాటు వచ్చి తమ ఇంట్లో భోంచేసి పోయే సంస్కృత పాఠశాల కుర్రవాడి మీది సానుభూతితో సంపూర్తిగా తెరుచుకొన్నాయ్.

"మిగతా రోజుల్లో ఎక్కడ తింటావ్?" అని అడిగాడు అమాయకంగా.

"రోజూ ఒకళ్ల ఇంట్లో."

"వాళ్లు పెట్టకపోతే?"

వారాలపిల్లాడు కొంచెం తటస్థించి-

"పస్తు పడుకొంటాను," అన్నాడు.

"పస్తంటే?"

"ఊరికెనే. అంటే... ఆకలితో."

నారాయణ ఆశ్చర్యంగా చూశాడు నరశింహ్వం వంక!

"పడుకొని నిద్రబొయ్యేది?"

"పాఠశాల అరుగుల మీద."

"వానొస్తే ఎట్లా? చీకట్లో గూడా? భయం వెయ్యదూ?"

"వానొస్తే లోపల పడుకుంటా! భయం వేస్తే పంతులు గారింట్లో."

"కొట్టడూ!"

"వఠ్ఠి పుణ్యానికే కొడతారా? చదువుకొంటా గదా పాఠాలన్నీ."

నారాయణకిక ప్రశ్నలు తోచలేదు. అతనికంతా ఆశ్చర్యంగా ఉంది. రోజుకొకచోట తినటం, ఇంకోచోట పడుకోటం, భయం లేక పోవటం- విచిత్రంగాదా? నాయనమ్మ చచ్చిపోయిన తర్వాత మళ్లీ వారాలపిల్లాడు కాశీమజిలీల కథలు చెప్పినట్లుగా ఉంది. నారాయణ లేత మనస్సు మీద చేతితో తనకు తానే ఈ విచిత్ర చిత్రాన్ని అతికించుకున్నాడు. తూర్పున సూర్యుడితోపాటు లేచి, చంద్రుడితో ఆడుకొని మేడమీద వంటమనిషి తెచ్చిన నెయ్యితో అమ్మ పెట్టిన గోరుముద్దలు తిని నిద్రబోయే నారాయణ- ఆకలీ, కొరతా, అలసటా ఎరగని కుటుంబంలో పుట్టిన నారాయణ!!

నారాయణ హఠాత్తుగా వారాలపిల్లాడిని వదిలిపెట్టి, ఇంట్లోకి పరిగెత్తాడు.

"అమ్మా... అమ్మా! నేను గూడా వారాలు చేసుకుంటాను..." అని గంభీరంగా తన నిశ్చయాన్ని తెలియజేశాడు తల్లికి.

"ఛీ! ఛీ!! మనకేం ఖర్మరా?" అన్నది అమ్మ.

*

కాని నారాయణ చిన్న హృదయఫలకం మీద ఆ చిత్రం ఎవ్వరూ చెరిపి వెయ్యలేదు. బహుశః నాయనమ్మ ఉంటే ఏమయ్యేదో? పుట్టలమ్మ గుడిలో శిలవలె, ఇంటి వెనక రావిచెట్టు

వలె ఆ చిత్రం నిలిచిపోయింది. నారాయణకు లోకమూ, సమాజమూ ఏమి తెలుసు? నాన్న కంపెనీ నుండి తెచ్చే నోట్లలోని మహత్యం అతని కెవరు చెప్పారు?

ఈ నోట్లు లేని నిర్భాగ్యులు ఈ కర్మభూమిలో ఈ వేదభూమిలో, బుద్ధుడూ, వర్ధమానుడూ పుట్టి మెట్టిన ఖండంలో పడే పాట్లు అతనికెవరు చెప్పారు? అతను తెలుసుకొన్నదల్లా ఒక్కటే!

'వారాలపిల్లాడి జీవితం గమ్మత్తయినది. ఎప్పటికైనా తను అట్లాంటి జీవితం గడపాలి.'

## 3

నారాయణ అందరిపిల్లల్తోనూ కలిసి ఆడుకోవటం ఎప్పుడూ నేర్చుకోలేదు. అతని స్నేహితులు ఇద్దరు ముగ్గురు మాత్రమే. వేణు, వెంకు, అవధాన్లు. వీళ్లతో కలిసి పాచి నీటితో, పురాతన గోడల్తో శిథిల రూపంలో ఉన్న లోతు కోనేరు వైపు రోజూ వెళ్లేవాడు. నాయనమ్మ కథల్తో బుద్ధి వికసించి, నిశితంగా, విమర్శగా, విశదంగా, ఆలోచనలతో అతని మనోక్షేత్రం పెద్దదవుతూం డగా నాయనమ్మ బూడిదైపోయింది. నాన్నగారికి ఓపికా, శాంతమూ లేవు. అమ్మ చెబితే కథల్లో సయ్యీ సారమూ ఉండవు. ఇంటికొచ్చే చుట్టాలు, అమ్మానాన్నగారితో మాట్లాడే వాళ్లే గాని తనతో కూచొనేవాళ్లే లేరు. వేణు, వెంకు ఆటలకేగాని ఇక దేనికీ పనికిరారు. అవధాన్లుకు సిగ్గు. రామ లింగం- జవానుకు తీరికలేని పని. వారాలపిల్లాడు వారానికోసారే కన్పిస్తాడు.

నారాయణకు అంతా కొరతగా, అస్పష్టంగా కన్పించింది. అతని ఎనిమిదేళ్ల వేదాంతానికి, వయసుకూ, బుద్ధికీ, మనసుకూ, నాగరికతకూ మించిన అసంతృప్తి ఇది. వికసించి నేడో రేపో వసంతశోభలో తనూ పాల్గొనబోతోన్న గులాబిమొగ్గను తుంచివేసినట్లుగా, నాయనమ్మ చావు నారాయణ జీవితాన్ని సెంటిమెంటల్ లోతుల్లో దించి పోయింది. అందువల్ల నారాయణ చాలా మారిపోయాడు. నీలపుటాకాశం వలె విప్పారి అంచుల్లేకుండా ఉన్న ఎనిమిదేళ్ల మనస్సు, ఇప్పుడు అర్థానికి అతీతమైన రంగుల్తో, కోర్కెలతో, భావాలతో కప్పుకు పోయింది. అక్కడక్కడ వెలితి ఉన్నది. ఆ వెలుతుర్లో, తళుక్కున ఏదో మెఱుపు అప్పుడప్పుడు మెరుస్తుంది.

ఒకరోజున కోనేటి మెట్ల మీద కూచొని, పాచినీటిలో నీడ చూసుకో ప్రయత్నిస్తూ అవధానితో అన్నాడు.

"చచ్చిపోయినవాళ్లు బూడిదైపోతారు."

"ఎందుకవుతారు ఊరికెనే? బతికున్న వాళ్లు కాల్చేస్తే అవుతారు."

"తంతే సరి వెధవల్ని."

"ఎందుకు?"

"మరి వాళ్లను కాల్చటం దేనికి? గాడిదెలు!" అవధానికి కూడా ఈ ప్రశ్న అర్థంకాలేదు.

కొంచెంసేపటికి నారాయణ మళ్లీ మాట్లాడాడు.

"మనిద్దరం వారాలు చేసుకొని చదువుకుందాం వస్తావా?"

"రాను..."

"ఎందుకని?"

"వారాలు నాకెందుకు? బీదవాళ్లకు గాని."

"తంతా నిన్ను!"

"మళ్లీ తంతా నిన్నే!"

నారాయణ లేచి అవధాన్లను రొండు వేశాడు.

"వారాలు చేసుకోవూ?" అని ఇంకోటి వేశాడు.

నాన్నగారు ఆ రాత్రి కంపెనీ నుండి తిరిగి వచ్చిన తర్వాత అవధాన్లకు తను వేసిన అట్లన్నీ తిరగబడ్డయ్ తన మీదనే.

“రేపట్నించీ మళ్లీ బళ్లోకి పో... వెధవాయ్!” అని నాన్నగారన్నారు.

*

నారాయణ బడికి మొదటిసారి వెళ్లాడు. గారాబం చేసి పెంచిన నాయనమ్మ లేని ఫలితాల్లో ఇదొకటి. అందరి కన్నా ముందే అక్షరాలూ, గుణింతమూ, మాటలూ నేర్చుకొన్నాడు. కాని ఉత్సాహమేమీ లేని చదువు.

సిగ్గు, దురభిమానము, ఆలోచన ఎక్కువైన నారాయణకు తొమ్మిదో ఏడు వచ్చింది. ఆ సంవత్సరమే అతనికి వడుగు కూడా చేశారు.

*

ఈమధ్య నాన్నగారేమీ బాగుండలేదు. చాలా ఆలస్యంగా ఇంటికి చేరేవాళ్లు రాత్రిళ్లు. ఆ తర్వాత గూడా చాలా రాత్రి వరకూ అమ్మా నాన్నా దిగులుగా ఏదో మెల్లిగా మాట్లాడుకునేవాళ్లు.

“రామమూర్తి చాలా ద్రోహం చేశాడు. అంతా తప్పుడులెక్కలు చూపి ఇరవైవేలు కాజేశాడు. మున్సిపాల్టీ అంతా రెండో పార్టీ చేతుల్లోకి పోయింది. ఎటు చూసినా నష్టాలుగానే ఉన్నయ్.”

“మీరు ధైర్యంగా ఉండండి. శ్రీమన్నారాయణుడి దయవల్ల అన్నీ చక్కబడుతై. అట్లా గుండె చెడగొట్టుకుంటే ఎట్లా చెప్పండి?”

ఈ సంభాషణ జరిగిన మర్నాడే నాన్నగారి శవాన్ని కార్లో వేసుకు వచ్చారు. అప్పటికి అమ్మ ఊళ్లోకి వచ్చిన బెంగాలీ భక్తురాలి చేత హరనాథుడి భజన చేయిస్తున్నది. నారాయణను బళ్లో నుంచి పిలుచుకు వచ్చారు. అమ్మ గుండెలు బాదుకున్నది. నారాయణ పలకా, పుస్తకాలూ ఆవల పారేసి ఏడ్చాడు. మళ్లీ చుట్టపక్కాలు తయారు.

*

అయితే, ఈమాటు ఇంకొక సంగతి. తనను ఎవరూ వెళ్లమనలేదు. నాన్నగారికి పాడెగట్టి తన్ను గూడా రమ్మన్నారు స్మశానానికి. అక్కడ తననే నిప్పుతో నాన్నగారిని బూడిద చెయ్యమన్నారు. కోపం వచ్చింది నారాయణకు. జాలితో కన్నీళ్లు వచ్చినై. హృదయం మూగదైపోయింది. కాళ్లు వణికినై. కాని తప్పలేదు. చాలాసేపున్న తర్వాత ఇంటికి తిరిగి వచ్చాడు అందరితోపాటు.

అందరూ తలా ఒక మాట అనుకొన్నారు తనకు వినబడనట్లే!

“ఏదో తిన్నాడు.”

“వి...షం...”

“అప్పులు... ముంచేసినై.”

“అందర్నీ నమ్మాడు... మెడకు తెచ్చుకున్నాడు.”

పదిరోజుల్లో అమ్మ రూపు మారిపోయింది. చుట్టాలంతా వెళ్లి పోయారు. ఒకరోజు ఒక పెద్దమనిషి వచ్చి, “ఆయనగారి ఇన్సూరెన్సేమీ రాలేదు. ఆత్మహత్య కింద తేల్చారు,” అన్నాడు తలుపు చాటున ఉన్న అమ్మతో.

“అయ్యో! మా ఆశలన్నీ దాని మీద ఉన్నవి అన్నగారూ!” అని అమ్మ వాపోయింది.

“కంపెనీ అంతా రామమూర్తి తీసుకుంటున్నాడు. అన్నీ పత్రాలు సృష్టించుకున్నాడు వెధవ. బ్యాంకీవాళ్లు ఇల్లు వేలానికి తెస్తున్నారు,” అని చెప్పి ఆ పెద్దమనిషి మాయమైపోయాడు. ఆయన అమ్మ పెత్తల్లి కొడుకు.

*

అమ్మ వాళ్లకూ వీళ్లకూ కబుర్లు చేసింది. నారాయణ కక్కయ్యలు ముఖం తప్పించేశారు. నాన్న చుట్టూ తిరిగి ప్లీడరుపని సాగించిన సుబ్బారావు, కాళిదాసు పంతులూ, నరశింగరావు గూడా రాలేదు. నాన్న దగ్గర చేబదుళ్లు తీసుకొన్న కోనంగి గూడా (సబురిజిస్ట్రారు ఆఫీసు ముందు కూర్చొని తప్పుడుపత్రాలు వ్రాసే చెట్టు కింద ప్లీడరు కోనంగి). నాన్న డబ్బుతో ఛైర్మన్ అయిన సీతారామశాస్త్రి అసలే రాలేదు. నారాయణకు ఈ సంగతులేమీ తెలియవు. అమ్మ ఇతర్లతో అని కళ్లనీళ్లు పెట్టుకొంటుంటే విన్న విశేషాలు ఇవన్నీ.

అమ్మ తమ్ముడు- మామయ్య మాత్రం వచ్చాడు.

"ఇక వీడి చదువు సంగతి చూడాలిగాని పోయిన ఆయన తిరిగి రాడుగదా!" అని మామయ్య.

ఆరోజు అమ్మ తనతో అన్నది. "మనం కొత్త యింటికి పోవాలి."

"ఈ యిల్లో?" అన్నాడు నారాయణ.

"అప్పులవాళ్లకు పోయింది."

కొత్త యిల్లు చిన్నది. పూరిది. కోమట్ల యింటి పక్కనే వుంది. అయితే కోనేటికి చాలా దగ్గర.

"నువ్వికవారాలు చేసుకు తినాలి. నా సొమ్ములన్నీ అమ్మేసి మిగిలిన అప్పులన్నీ తీర్చేశాను," అని అమ్మ నారాయణను బుజ్జగిస్తూ అన్నది.

"ఎట్లా చేసుకోవటం?"

"మామయ్య కుదిరిస్తాడు. మామయ్య గూడా లేనివాడు గదా నాయనా!"

నారాయణకు సంతోషం వచ్చింది. ఎక్కడెక్కడో తినొచ్చు, ఎక్కడెక్కడో పడుకోటానికి మాత్రం వీల్లేదు. అమ్మను మామయ్యవాళ్లు తీసుకు వెళ్లింతర్వాత తన యిష్టం వచ్చినచోట పడుకోవచ్చుగా!

కాని, అంతలోనే తన ఆశలూ అనుమానాలన్నీ పొరబాట్లు అయినవి!

అమ్మ ఏడ్చి మళ్లీ యిట్లా అన్నది. "పూలమ్మిన వూళ్లో కట్టెలమ్మలేమురా నాయనా! నిన్ను మామయ్య పొన్నూరు తీసుకెళ్తాడు. అక్కడి నుంచి రైల్లో బెజవాడ వెళ్లి అక్కడ చదువుకోవాలి. నీ జీతంలో కొంత మామయ్య కట్టేస్తారు. మిగతాది చందాలు వేయిస్తానని అంటున్నాడు. వారాలు గూడా కుదురుతై. చక్కగా చదువుకో నా బుజ్జీ! చదివి పెద్దవాడివై నీ తల్లి కష్టాలు తీరుస్తావుగా మా కన్నతండ్రీ!"

అమ్మ కన్నీళ్లాగలేదు. ఏడ్చి ఏడ్చి నేలకేసి తల బాదుకొన్నది. నారాయణ అంతా చూశాడు. కాని హృదయం, నోరు మూగవైపోయినై యిదివరకే. కళ్లలో చెమ్మ వచ్చింది.

"యివ్వాళే వెళ్లనా?" అని మాత్రం తల్లిని ప్రశ్నించాడు.

"కాదు... వచ్చే ఆదివారంనాడు ప్రయాణం."

## 5

నాన్నగారు బతికి వస్తే యీ సమస్యలన్నీ తీరిపోతాయని నారాయణకు అమ్మ వల్లనే, ఆమె శోకంలో, ఏడ్పుల్లో తెలిసింది.

ఆ సాయంత్రం అవధాన్లనే తిరిగి సలహా అడిగాడు నారాయణ!! ఎట్లా అయినా పెద్దవాడు!!!

"అవునోయ్! చచ్చినవాళ్లను గూడా తిరిగి బతికించొచ్చు. లక్ష్మణులవారిని హనుమంతులవారు సంజీవి తెచ్చి బతికించలేదా?"

''సంజీవి ఎక్కడ దొరుకుతుందంటావ్?''

''దొరుకుతుందో లేదో చెప్పలేను. మా తాతయ్య అన్నాడు గదా- గరుత్మంతులవారి గూళ్లో నీళ్లకు ఎదురీదే ఒక పుల్ల వుంటుందట, దాన్ని తెచ్చి మీ నాన్నగారి బూడిదకు తాకిస్తే సరి.''

''ఓస్సి! అదెంతపని? పది గరుత్మంతుల గూళ్లు తెస్తాను.''

''యిదుగో యింకోమాట! ఎక్కడైనా కామధేనువు దొరుకుతుందేమో?''

''అదెందుకు?''

''అది నల్లటి ఆవు. దాని పాలు పితికి చల్లినా చాలు. చచ్చిన వాళ్లు వస్తారు.''

*

నారాయణ పాడుగుళ్లలోని పిట్టల గూళ్లన్నీ పడగొట్టి, కోనేటిలో ప్రయోగాలు చేశాడు. అక్కడ కాదని కాలవలో వేశాడు. కాని ఎదురీదిన పుల్ల కన్పించలేదు. తర్వాత చెట్లూ, పుట్టలూ గాలించి చూశాడు. గరుత్మంతులవారి గూడు కనిపించనేలేదు. కామధేనువూ అంతే. అది స్వర్గ లోకంలో వుంటుందిట. ఆ సంగతి, ఆ వెధవ అవధాన్లు చెప్పనే లేదు గదా! నారాయణ యిట్లా నిరాశలో మునిగి వుండగా, ఆదివారమూ మామయ్య కలిసి వచ్చారు.

రేపు ప్రయాణమనగా ఆ రాత్రి అమ్మ భోజన సమయంలో నారాయణ బంతినే కూర్చొన్న మామయ్యకు నెయ్యి వడ్డించి, తనకు వెయ్యకపోవటం గమనించాడు. ఒక క్షణం సందు యిచ్చి- ''నెయ్యి,'' అన్నాడు తల ఎత్తకుండానే.

''అక్కడ నీకు నెయ్యి వేసేవాళ్లుంటారు, వెయ్యని వాళ్లుంటారు. నెయ్యి అలవాటు తగ్గించుకోవాలి,'' అని తల్లి తల అటు తిప్పుకొని కళ్లు తుడుచుకొన్నది.

''మన యింట్లో వారాల అబ్బాయికి నువ్వేసేదానివే కదా మరి?''

''ఆ పిల్లవాడు పెట్టి పుట్టాడు,'' అని అమ్మ గద్గదిక స్వరం నుండి జవాబు వచ్చింది.

మామయ్య కళ్ల నుండి రెండు దుఃఖభాష్పాలు జారి అన్నంలో కలిసినవి. ఆయన కళ్లెత్తి చూసి,

''ఒక గరిటె నెయ్యి... ఫరవాలేదు,'' అన్నాడు.

నారాయణ చెయ్యి అడ్డం పెట్టి, ''వద్దు... వద్దు...'' అని లేచి చెయ్యి కడుక్కున్నాడు.

ఏమయింది యీ యింటికి? ఎవరికీ అన్నపూర్ణను లేదన్న యీ యిల్లు, లక్ష్మి నాలుగు చేతుల్తో హారతులందుకొన్న యీ యిల్లు, బీద విద్యార్థులూ, వారపు పిల్లలు తల దాచుకొని, త్రేన్చిన యీ యిల్లు, నాన్న నీడనే భట్రాజు పొగడ్తలతో చుట్టుముట్టిన బంధువుల సంరంభాలతో ప్రతిధ్వనించిన యీ యిల్లు, ఏమయింది? ఏమయింది???

''నాన్నతోనే లక్ష్మిగూడా పోయింది,'' అన్నది అమ్మ చెయ్యి కడుక్కొంటున్న నారాయణతో.

మామయ్య నడుం వాల్చగానే, నారాయణ చీకట్లోకి పోయి ఏడ్చాడు. ఎందుకో అర్థం కాలేదు. బహుశః అమ్మ మాటలకా? నెయ్యికా? నారాయణ చీకట్లో నడిచి అప్రయత్నంగా తమ పాత యింటి వేపు వెళ్లాడు. రేపే గదా యీ మేడ యింటిని వదిలి వెళ్లేది!

చిన్న నారాయణకు మొదట భయం వేసింది. తన జీవితంలో జీవితమైన జామచెట్టు గూడా చీకట్లో జుట్టు విరియబోసుకొని శోకిస్తున్న విధవలాగా వుంది. ఎన్నిసార్లు నాయనమ్మను ఏడిపించటానికి, ఆ చెట్టెక్కి దూకుతానని దడిపించాడు? జామకాయల్ని కార్తీకమాసంలో కొరికి తినేస్తున్న ఉడతల్ని ఎంత గురిగా రాళ్లతో కొట్టాడు తను? గోడ ప్రక్కనే వున్న సీతాఫలం చెట్టు? ఎవరికీ చెప్పకుండా, ఏ వేళబడితే ఆ వేళ, మగ్గి రాలటానికి తలపోసున్న పళ్లను- ఎన్ని తిన్నాడు? మళ్లీ యిలాంటివి దొరుకుతాయా? తనను పిలుస్తున్నట్లుగా పిట్టగోడ, భయంతో చీకటినే కావి లించుకొని క్రీపర్లూ, మధ్యమధ్య క్రోటన్ తొట్లూ అన్నీ విడిచి వెళుతున్నాడు? ఈ యిల్లును కొన్న శివార్చకుడు- నాన్న వుండగా తనను పలకరించేవాడు. ఇప్పుడు తనను చూడనట్లుగా తప్పిపో

తున్నాడు. ఇక యీ యిల్లంతా వాళ్లదేగా? నాయనమ్మా, అమ్మా వద్దన్నకొద్దీ యింటి వెనక దొడ్లో పాదులు- ముఖ్యంగా పొట్లకాయలు తను యిక కోయనక్కర్లేదుగదా! తన కింద యింట్లో ముచ్చటయిన స్తంభం మీద గీచిన బొమ్మలన్నీ యీ శివార్చకులు యింకా వుంచవచ్చారా? ఎవరూ లేకుండా చూచి తను బావిలోని తన నీడతో యింకా ఆడుకొనేదెట్లా?? అనసూయ, సరస్వతీ, అరుంధతీ, వేణూ, వెంకూ- తను వెళ్లిపోయింతర్వాత గూడా పండగలకని ఆ యింట్లోకి వెళ్తారా? ఏమో! కక్కయ్య దగ్గిర అంత డబ్బు వుందిగదా! ఆయన కొనుక్కొని తనకు యివ్వలేకపోయినాడా- యీ యిల్లు?

ఇంతలోనే ఆ యింట్లో నించి శివార్చకులు లాంతరుతో బయటకు బయలుదేరటం గమనించి నారాయణ తన తపస్సు నుండి మెదిలాడు. అంతా అగమ్యమై, అగోచరమై, అస్పష్టమై నారాయణకు తట్టింది. జవాన్లూ, గుర్రపుబగ్గీ, పరుపులూ, పండగల లడ్లూ, సందడి, చుట్టాల రకరకాల ముఖాలు గల యింటి నుండి, కోమట్ల యింటిపక్క రొండు గదుల పాత పూరింటికి వచ్చేసరికి నారాయణ వయస్సు పెరిగినట్లయింది. చీకటిలాగా, వెనకటి సంగతుల దిగులు పట్టింది. చీకటిలాగానే రేపు వుదయం రైలుబండి గూడా తట్టింది. వెళ్లేటప్పుడు అవధాన్లు నారాయణను కలవనేలేదు. ఏమంటే- మా అమ్మ మీ ఇంటి వేపు వెళ్లవద్దని చెప్పిందంటాడు. గరుత్మంతుడి సంగతి అబద్ధం చెప్పినందుకు వాడిని కోనేటి పసరు నీళ్లల్లో మూడుసార్లు ముంచి వేసినా తప్పులేదు!!

## 6

బెజవాడ నుంచి వెళ్లిపోయే రోజున మామయ్య అన్నాడు, ''ఆరు వారాలు కుదిరినవి. ఏడోది కుదరటానికి మేస్ట్రీటుగారు చాలా తొందర్లో వున్నారు. నాకు సెలవు గూడా అయిపోయింది. ఆయన చాలా మంచివాడు. మన శాఖవాళ్లే. వెళ్లి, నమస్కారం చేసి వారం యిప్పించమని అడుగు. ఏం?''

ప్లాటుఫారం మీద మళ్లీ మామయ్య, ''మీ నాయన వెలిగిన వెలుగుకు యిప్పటికి మీకు కష్టకాలం వచ్చిందిరా.'' ఆయన కళ్లు ఎప్పుడూ తడిగానే వుంటై. ''బాగా చదువుకో. మూడు నెలల జీతమైతే కట్టేశాను. ఆ తరువాత సంగతి చూడాలి. వెనక మీ పురోహితుడు శేషయ్యగారి కుమారుడు ఇక్కడే వున్నాడు. ఆయన చందాలు ఏర్పాటు చేస్తానన్నాడు. వెళ్లి మళ్లీ కనబడు.''

మామయ్య ఎప్పుడూ ముక్తసరిగా మాట్లాడేవాడు. యివ్వాళ రుద్ధమైన కంఠంతో పెనుగులాడుతూ యిన్ని మాటలు మాట్లాడాడు. నాన్న నుండి ఏ లాభమూ ఎన్నడూ ఆశించని మామయ్య యివ్వాళ నారాయణ గార్డియన్ అయినాడు. ఎన్నాళ్లో నాన్నను పొగడ్తలతో, మన్ననలతో, మాటలతో మాయచేసి సొమ్ములూ, వస్తువులూ, పట్టుచీరెలూ కాజేసిన అత్తయ్యలూ, పిన్నమ్మలూ నారాయణ సంగతి ఎందుకు పట్టించుకోటంలేదో, అమ్మ అతనికి వివరంగా చెప్పలేదు.

నారాయణకు పురోహితుడు బాగా తెలుసు. నాయనమ్మ చచ్చిపోతే ఆవు తీసుకున్న దీయనే. తన పుట్టినరోజు పండుగకు నాన్న పిలిపించి మంత్రాలు చదివించి, ఖద్దరు చాపులు పెట్టి పంపించేవాళ్లు.

నాన్న చనిపోయే ముందేగదా ఏదో కాయితం రాసి యీయనకు యిస్తుంటే అమ్మ అది, 'భూదానం' అని చెప్పింది! ఆ పురోహితుల గారింట్లోనే ఇప్పుడు నారాయణ మంగళవారం వారపు భోజనం తిని లేచాడు. పురోహితుల గారింట్లో ఆడవాళ్లందరూ నారాయణను దయగా చూశారు. ముఖ్యంగా ముసలావిడ, అతను అన్నం తిన్నంతసేపూ భూదానం చేసిన నాన్నగారి గురించే చెప్పింది.

*

నారాయణ యిప్పుడు నారాయణగాదు. ఆ నారాయణ ఎక్కడున్నాడు? వేణూ, వెంకూ, అవధాన్లు భయపడే నారాయణ, బంట్రోతు రామలింగం భుజాల మీద ఎక్కి తిరిగిన నారాయణ, నాన్నగారి గుర్రపు బగ్గీలో షికార్లు చేసిన నారాయణ, మేడ మీద నేతి గోరుముద్దల నారాయణ- ఎక్కడున్నాడు? నాన్న మెప్పుకోసం తనకు చొక్కాగుడ్డలు సిల్కువి కుట్టించిన అత్తయ్యల అల్లుడు కాదే యీ నారాయణ! పెద్దత్తయ్య రెండో కూతురు- అనసును చూపించి, 'నీ పెళ్లాంరా నారాయణ!' అని ఒక్క గొంతుతో అన్న చుట్టాల బలగపు టొమాటోపండు గాదు యీ నారాయణ! నిజంగా పెళ్లాంలాగానే, తనను చూడగానే గౌను సర్దుకొని, చిన్న పరికిణి కాళ్ల కడ్డం పడుతుంటే, చిరుగంటల కాలిపట్టాలూ, బొంబాయి గాజులూ మోగించుకుంటూ పరిగెత్తే అనసుకు కాబోయే మొగుడు గూడా కాదు యీ నారాయణ!!

ఈ నారాయణ- ఏడు వారాల్లో ఒక వారం తక్కువై, ఆకలి దిష్టికళ్లకు గురియై బెజవాడ బజార్లన్నీ మంచినీళ్లు తాగి తిరుగుతున్న నారాయణ! ఎక్కడెక్కడో తిని, పూటకూళ్ల రంగమ్మగారి వరండాలో చాలీచాలని దీపం ముందు పాఠాలు చదువుకుంటున్న నారాయణ యీ నారాయణ! చాపమీద చిన్న జంపకానా పరచుకొని నిద్రబోయి పొద్దున్నే వంటిమీది దద్దుర్లు చూచుకొంటున్న నారాయణ యీ నారాయణ!

సబురిజిష్ట్రారుగారింట్లో తూర్పు వంట తిని, పాచిపోయిన అన్నమంతా వాంతి చేసుకుని బిక్కముఖంతో యింటికి వచ్చి అమ్మకు బదులు పూటకూళ్లమ్మను దర్శించిన నారాయణ యీ నారాయణ! ఈ నారాయణకు ఇల్లులేదు. ఈ నారాయణకు వేస్ట్ సిల్కుచొక్కాలు లేవు. ఈ నారాయణకు అజీర్ణమూ లేదు. అత్తయ్య కూతురు అనసూ లేదు. హైస్కూలు పుస్తకాలన్నీ లేవు. ఒక వారమూ లేదు. ఈ నారాయణ బికారి. ఈ నారాయణ వారాల పిల్లాడు!!!

*

వారాల పిల్లాడికి ఆకలి వేసింది. ఆరోజున స్కూలుకు పోలేదు. మేజస్ట్రీటుగారింటి దాకా మూడుసార్లు వెళ్లి తిరిగివచ్చాడు. ఎట్లా? ఆయనకు నమస్కారం చెయ్యమని మామయ్య చెప్పాడు. తన జ్ఞాపకంలో మనుషుల కెవ్వరికీ నమస్కారం చెయ్యలేదు. తనకు తానై, విగ్రహాలు గాబట్టి, దేవుడికి, నాయనమ్మతో పాటు అమ్మతోపాటు నమస్కారాలు చేశాడు. ఏమని అడగడం? ఎట్లా అడగటం? నీకెందుకు వారం? అని నల్లటి మిడిగుడ్ల మేజస్ట్రీటు అడిగితేనో? మరి ఆకలి? మామయ్య పేరు చెబితే? తప్పదు ఆకలి!!

వెళ్లి, బిళ్ల బంట్రోతు చూడకుండా యింట్లోకి పోయి మొదటి గదిలో నించొన్నాడు. ఆయన రాగానే చేతులెత్తి తికమకపడి నీళ్లు నములుతూ కళ్లు దించుకొని నమస్కరించాడు. "వారాల పిల్లాణ్ణి," అనగలిగాడు.

"ఏ శాఖ?" అని గర్జనగా మేజస్ట్రీటుగారి ప్రశ్న. ఆకలికీ, శాఖలకూ యింత సన్నిహితమా?

మామయ్య చెప్పిన శాఖ తిరిగి చెప్పాడు.

సెటిల్మెంటు ఎఱుకలవాళ్లనీ, దొంగ యానాదుల్నీ పోలీసు సాక్ష్యంలో గూడా పని లేకుండానే, నేరస్థులని తీసుకురాబడ్డ వాళ్ల ముఖాలు మాత్రమే చూచి- శిక్షలు విధించటం ముఖ్య కర్తవ్యమైన మేజస్ట్రీటు హరిహరంగారు కళ్లెత్తి, సమాజమంతా ఎత్తి పారేసిన చిన్న ఖైదీ- ధనమూ, యిల్లూ తండ్రినీడా లేని పిల్లఖైదీ- నారాయణ వంక చూసి, "ఆ ముఖాన బొట్టేదీ? అంత విభూతి పెట్టుకొంటే మీ శాఖకు లోటు వస్తుందా?" అని మరోమారు వారి సున్నితమైన గొంతును సరైన స్థాయికి కొని వచ్చారు.

వారాల పిల్లాడికి కళ్ల వెంట నీళ్లు వచ్చినై. "మా యింట్లో యిలాంటి వేషాలు పనికిరావు. వడుగయిందా...? మరి ఆ క్రాపింగు ఏడుపెందుకు? సంధ్యావందనం వచ్చునా?... ఊహుఁ!

ఎందుకు వస్తుంది? తడిగుడ్డ కట్టుకొని, స్నానం చేసి మరీని... బొట్టు పెట్టుకొని తిండికి రా! మా యింట్లో పెందలాడి కాదు. పదకొండు గంటలకు- ఎప్పుడైనా అంతే- ఒక పూట భోజనం. రాత్రికి ఉప్పుడుపిండి. అమావాస్యయితే నువ్వు రానక్కర్లేదు- హుఁ!''

పదకొండు గంటలకు వెళ్లాడు- న్యాయదర్పణకు ప్రభుత్వాధికారిగారింటికి. మేజస్ట్రీటుగారి భార్య వారాల పిల్లవాడి సంగతి మరిచిపోయింది. ''ఈ వారం లేదులే పో! వచ్చే వారం నుంచి రొండు రోజుల ముందుగానే జ్ఞాపకం చెయ్యి పో,'' అన్నది మేజస్ట్రీటుగారి నుండి న్యాయవిచారణ నేర్చుకొన్న ఆయన ధర్మపత్ని.

*

ఉసూరుమంటూ వారాల పిల్లాడు పాతపట్టణం వేపు బయలుదేరాడు. అక్కడ అసిస్టెంటు కరణంగారిని గూడా వారం కోసం చూడమని గదా మామయ్య మాటలు. ఆకలితో పోరాటానికి తయారవుతోన్న నారాయణకు, కొత్త వ్యక్తుల్నీ, వింత ప్రకృతుల్నీ తన దురభిమానం చంపుకొంటూ చూడటం అలవాటయినట్లయింది. ఈ అసిస్టెంటు కరణం తమ్ముడు గూడా స్కూల్లో తన క్లాసే.

ఇంట్లో తన గౌరవమెట్లా వున్నా, అసిస్టెంటు కరణంగారు, బజార్లో కొమ్ము తిరిగిన ఠాణే దారులాగా వల్లెవాటు వుత్తరీయం వేసుకొని, ఆరోజు ప్రైవేటులో వచ్చిన కిల్లీ నములుతూ, సిజర్ సిగరెట్టు చుట్టను కాల్చినట్లు కాలుస్తూ- ''ఓ అబ్బే దానికేముందీ? మీ నాయన గాదుటోయ్ నాకీ వుద్యోగం యిప్పించింది? మా బావమరిది మీ నాన్నగారి కంపెనీలో అక్కౌంటు పనులు కొన్నాళ్లు చేశాడుగా- ఆహా!... ఉహూ! గొప్ప దర్జాలే మీ నాన్న.''

ఇంటికి వెళ్లిన అసిస్టెంటు కరణంగారి అమ్మ- కొమ్ములు దిరిగిన ఠాణేదారూ, ప్రయివేటు యిచ్చిన కిల్లీ, సిగరెట్ల భోగపరాయణుడూ అయిన కొడుకు మీద చీపురుకట్ట తీసుకొని లేచింది. ''రోజుకొక తద్దినం తెచ్చిపెడ్తావా? నీకు చేతనయితే పూట కూలి పెట్టించూ-'' ఆ 'చూ'కు అంత పెద్ద దీర్ఘం వుందని వారాల పిల్లాడు ఆకలితో, అగౌరవంతో నివ్వెరపోయాడు. అంతేనా? అసిస్టెంటు కరణంగారి తమ్ముడు- రేపు తనతోపాటు స్కూలుకు వచ్చి, తోటి పిల్లలకు తను వారాల పిల్లవాడని చెబితే! ఇంతవరకూ ఎవరికీ తెలియకుండా తను సంచరిస్తున్నాడు! ఇకనెట్లా?

*

వచ్చినదారి బట్టేడు నారాయణ. అతను వుండే పూటకూళ్లమ్మ రంగమ్మగారి యింటిపక్క బజార్లోనే కారు డ్రైవరు వీరరాఘవులు ఉన్నాడు. వీరరాఘవులు కొడుకు, కుమారస్వామి- నారాయణను చూసి తమ యింటికి పిలుచుకు వెళ్లాడు. అతను గూడా తన క్లాసే.

''ఏమట్లా వున్నావ్? అన్నం తినలా?''

''ప్చ్...''

''మా యింట్లో తింటావా?''

బోగం వీరరాఘవులు భార్య కొంచెం మడిగానే, బ్రాహ్మల కుర్రవాడికి వడ్డించింది. అమ్మను తలచుకొంటూ నారాయణ అన్నం తిన్నాడు. అంటే కుమారస్వామికి గూడా తన వారాల సంగతి తెలిసిందన్నమాట.

మర్నాడు సబురిజిస్ట్రారుగారింట్లో వారం చెప్పటానికి వెళ్లాడు.

''ఛీ...ఛీ... ఛీ... దూరంగా వుండు,'' అంది తూర్పున బుట్టిన పతివ్రత.

''నువ్వెక్కడి బ్రాహ్మడివంట? నిన్న నీ తిండి బోర్లించుకున్నదెక్కడ? ఆ బోగం డ్రైవరు యింట్లోనా? అరి రామరామ! నీకింకేం వారం? ఏమింకా అట్లా చూస్తావ్. నిన్న మా బంట్రోతు చూడలా?''

*

కాంపౌండరుగారి భార్య- గడపలోనే అడిగింది, ''నీకు విస్తళ్లు కుట్టటం వచ్చునా?''

''రా...దు.''

''మరి ఏమొచ్చు? రాకపోతే ఎలాగో? అదే వస్తుంది. నేర్చుకో. మా ముసలమ్మ నేర్పుతుంది.''

ఇన్ని బాదమాకులూ, చీల్చిన పూచిక పుల్లలూ ముందు వేసుకొని, కళ్లజోడును దారాలతో చెవులకు కట్టుకొని కూర్చొన్న ముసలమ్మ కింద, విస్తళ్లు కుట్టే నైపుణ్యానికి తలపడ్డాడు ఆకలితో వచ్చిన విద్యార్థి నారాయణ! అది అయిన తర్వాత ముసలమ్మగారు మూర్ఛబోయే ఎత్తుకు వచ్చింది కాళ్లనొప్పితో. ''అబ్బాయ్, కాస్త కాళ్లు తొక్కుదూ?'' అని మూలిగింది ఆ ముసలినక్క. చద్దెన్నం తినగానే, కాంపౌండరుగారు, ఆస్పత్రి మందుల్తో తన సొంత ప్రాక్టీసుకు వెళ్తూ- ''ఇదిగో నోయ్! నీ పేరేమిటో... నారాయణేనా? మా పిల్లలిద్దర్నీ పాపయ్యగారి బళ్లో వదిలి నీదారిన బోదువు గాని.'' పాపయ్యగారి బడి యీవైపున, తన హైస్కూలు ఆవైపున! నారాయణకు బడి ఆలస్యమయింది, ఆరోజున. పాపం! ఆయన మాత్రం ఏం చెయ్యగలడు? లోకల్‌ఫండు బోర్డిచ్చే జీతాలు చాలక వేళకు అందక నానా తిప్పలూ పడుతున్నవాడు?

*

''మన వీధి పక్కనే సంస్కృత పాఠశాల వుపాధ్యాయులు గారున్నారు. ఆయనకు వారాలు చేసుకొని వృద్ధికి వస్తున్న పిల్లలంటే చాలా ప్రాణం. అక్కడికి వెళితే నీకు తప్పక ఒక వారం దొరుకుతుంది,'' అని సలహా యిచ్చింది పురోహితుల గారింట్లో ముసలావిడ.

వారాలపిల్లలంటే ప్రాణాలు విడిచేవాళ్లు నారాయణకు యింతలో ఎవరూ ప్రత్యక్షం కాకపోయినా సంస్కృత పాఠశాల వుపాధ్యాయులగారి యిల్లు వెతుక్కుంటూ వెళ్లాడు. ఆయన ఎంతటి ముసలివాడోనని అనుకుంటూ వెళ్లిన నారాయణ ఆకలి ప్రాణానికి గూడా ఆశ్చర్యం కలిగింది.

ఎవరు ఈ వుపాధ్యాయులు? తన చిన్నతనంలో తమ యింట్లో వారాలు చేసుకొన్న నరశింహ్వాం కాదూ?

''నా...రా...య...ణా?!'' అని ఉభయభాషా పండితుడు నరశింహ్వాంగారు మంచం మీద నుంచి దిగ్గున లేచి ఎగిరాడు.

''నారాయణా! నేను జ్ఞాపకం లేదూ? నా పుస్తకాల్లో పిచ్చిగీతలు గీచిన నారాయణవు గాదుటోయ్! రా... రా నాయనా? నిన్ను గురించేనా శేషమ్మగారు చెప్పింది? ఎంతటి కుటుంబం? ఎంత గతికి వచ్చింది?''

వారాల పిల్లవాడు కదలక నించొన్నాడు- రెండు కన్నులూ మూసుకొని. రెప్పల్ని తడుపుతూ జలజలమని వేడిగా కన్నీరు ఆ మూసుకొన్న కండ్లను లెక్కచెయ్యక ప్రవహిస్తోంది చిక్కి, జాలి గొలుపుతూన్న నునుబుగ్గల మీద. నారాయణకు నాయనమ్మా, చిన్నప్పుడు నరశింహ్వాం చూపిన స్మశానమూ తిరిగి స్మృతికి వచ్చి కట్టెదుట నిలిచినై.

నారాయణ ఒక్క పలుకు పలకలేదు. పలుకక ఆకలితోనే వెనుదిరిగాడు. చరచరా అడుగులు వేసుకొంటూ, దురభిమానపు హృదయపు వత్తిడితో బరువెక్కిన అవ్యక్త భావాలతో- గడపదాటి పోసాగాడు. ఉభయభాషా ప్రవీణుడు నరశింహ్వాం బుర్రకు మించిన బరువు అది.

''నారాయణా,'' అని ఆయన కేక వేశాడు. బయట వున్న కొబ్బరిచెట్టు మాత్రం తల వూపింది.

## 7

నారాయణ యీలోపల ఒక్కసారే యింటికి వెళ్లగలిగాడు అమ్మను చూచేందుకు. అమ్మతో గూడా తన ఆకలీ, అవమానమూ చెప్పటానికి అతని దురభిమానం అడ్డం వచ్చింది! ఎప్పుడూ లేనిది, ఎన్నడూ ఎరగనిది యీనాడు ఆకలిని గురించి అమ్మతో ప్రస్తావించటం ఎట్లా? తను ఎందుకు వచ్చాడో ఆ విషయాన్ని రెండురోజుల తీవ్ర వేదన తర్వాత నారాయణ అనగలిగాడు.

''అమ్మా! నువ్వు వచ్చి నాకు వండిపెడితే చక్కగా చదువుకుంటాను.''

''మనకక్కడ యిల్లేది నాయినా? ఆ యింటికి అద్దె, మన తిండికి గింజలూ- నేను మగ పుటక పుట్టలేదు గదా యింత సంపాదించి పడేయటానికి.''

అభిమానంతో మామయ్యగారింటికి గూడా పోని అమ్మ, కోమట్ల యింట్లో చాకిరి చేసి తనకు చొక్కా కుట్టించిందని నారాయణ గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు. తను వెళ్లిన ఈ ఆరునెలల్లోనే ముసలిదైపోయినట్లుగా వున్న అమ్మ జవాబును శాంతంగా విన్నాడు. ఆ రాత్రే మళ్లీ బెజవాడకు ప్రయాణం కట్టాడు.

*

బెజవాడలో బండి దిగి ఒక ప్లాట్‌ఫారం నుండి మరోదానికి మారాడు నారాయణ. ఎందుకో అతనికే తెలియదు. ఈ బండి తప్పిపోతే జీవితమంతా భగ్నమై పోతుందన్నట్లుగా పెట్టెల్తో, పక్కచుట్టల్తో, సంచుల్తో పరుగులెడుతూన్న ప్రయాణీకుల్ని బెంచీ మీద కూర్చొని చూచాడు. ఒంటరిగా దిగిన దిక్కులేని ఆడవాళ్లను అపహరించి, పడుపు గృహాలకై వుత్తరదేశంలో అమ్మే దురహంతకులూ, స్టేషనులో పోలీసులు పెంచుకొంటూన్న జేబులు కత్తిరించే దొంగ కుర్రవాళ్లూ అందరూ ప్రయాణీకులుగానే కన్పించారు నారాయణ కళ్లకు. ఆ ఫలాని షావుకారు ఖమ్మంమెట్టులో కొన్న దొంగ బియ్యానికి యింకా పెద్ద లాభం వచ్చిందన్న సంతోషంతో టిక్కెట్టు కొనకుండానే బోగీలో ఎక్కుతున్నాడని నారాయణకేం తెలుసు?

విసుగుబుట్టి చివరకు యింకో రైలుబండిలో ఎక్కి తనూ కూర్చొన్నాడు కొంతసేపటికి నారాయణ. అందులో తోటి ప్రయాణీకుల సంగతి గూడా నారాయణ పట్టించుకోలేదు. ఇంట్లో భార్యచేత రోజూ చీపురుదెబ్బలూ, ఆవకాయ కారమూ తింటూ గూడా, షడ్డకుడి కొడుక్కు సికింద్రాబాదు నుంచి వచ్చిన పెళ్లిసంబంధాన్ని ముక్కలు చెయ్యటానికై ప్రయాణమైన 'స్టాంప్ వెండర్' (ఆయనకున్న బిరుదుల్లో యిదొకటి) కోణం రోమయ్య (యివి రెండూ వేర్వేరు బిరుదులు) పంతులుగారు మూడవ తరగతి పెట్టెలో ప్రజల సొమ్ముతో పెరిగిన పాపిష్ఠిదేహాన్ని బెంచీ నిండా పరచగా, ఆయన కాళ్లకట్టనే కూర్చొని ఆనాడే పదేళ్లు నిండిన నారాయణ నిద్రబోయాడు. ఆకలి పెట్టిన ఆయాసంతో బలహీనపు నిద్రపోయాడు. బెజవాడను మరిచిపోయిన వారాలపిల్లాడు.

మర్నాడు కళ్లు నులుముకుంటూ లేచి 'హైద్రాబాద్' అని వున్న బోర్డు చూచాడు.

టిక్కెట్టు కలెక్టరు నారాయణ దవడలు ఎందుకు వాయించాడో తెలియలేదు. తనుగాక, యింకో ముస్లిం కుర్రవాణ్ణిగూడా టిక్కెట్టు కలెక్టర్లు పట్టుకున్నారు. కాని వాడిని పెద్ద దెబ్బలు కొట్టలేదు. ఎవరో ఫెజ్ టోపీ పెట్టుకొని, తంబాకూ కిల్లీ గొఱ్ఱె వలె నములుతూన్న ముస్లిం అధికారి వచ్చి టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసిన ఖాదర్ భక్ష్‌ను విడుదల చేశాడు. తననూ 'విడుదల' చేశారు చివరకు- ఎందుకో తనకు తెలుసు. నిన్నటిదో మొన్నటిదో రైల్లో రోమయ్య పంతులు పెట్టిన పులిహోర చద్ది తిని, ఫుట్‌బోర్డు మీదనే కక్కి అప్పటిదాకా మంచినీళ్లతో ఆకలిని చంపిన వాడు శోషపోక యింకేం చేస్తాడు? శోష పోయింతర్వాత టిక్కెట్టు కలెక్టర్లకు యిక తన బొమికలు విరగగొట్టవలసిన అవసరం తప్పింది.

*

నారాయణ హైద్రాబాదు జైల్లో పడటం గూడా అప్రయత్నంగానే జరిగింది. మార్వాడీల సత్రంలో యింత రొట్టె అన్నమూ తిని వుస్మాన్‌గంజి వేపు నడిచి వెళ్లిన వాడికి, మరొక తురక పెద్దమనిషి కనిపించాడు. (అక్కడ అందరూ వుర్దూలోనే మాట్లాడుతున్నారు.) ఒక చిన్నపెట్టె చేతి కిచ్చి, "నాతో రారా," అన్నాడు నైజాం పాలకజాతికి చెందిన పొడుగు కోటు మనిషి. ఆ మనుష్యుడు, రెక్క పట్టుకొని బురఖాలో వున్న స్త్రీనొకతెను నడిపిస్తున్నాడు టాంగాలు నిల్చుండే స్థలం వేపు.

అనేక గల్లీలు తిరిగి తిరిగి, నవాబుల మసీదులకూ, మార్వాడి వడ్డీ వ్యాపారుల వెండి దుకాణాల్లోకీ వెళ్లేందుకు అందంగా చేయబడ్డ విశాలమైన రోడ్లన్నీ వెనకనే విడిచి నారాయణ కూర్చున్న టాంగా చీకటి మురికి యింటి ముందు నిల్చింది. కాని అతనికో ఆశ్చర్యం వేసింది. బురఖా కింద వున్న ఆడమనిషి అంతసేపూ సన్నగా ఏడుస్తూనే వుంది. నారాయణ ఆ యింట్లో చెడ్డచాకిరీ చేస్తూ నాలుగురోజులున్నాడు. ఆరోజు సాయంత్రం అక్కడి నుంచి తప్పించుకు పోదా మని ఆలోచన చేస్తుండగా, పరదా మాటు నుండి, "అబ్బాయ్," అని అన్నిరోజులకొక తెలుగు పిలుపు వినవచ్చింది. బురఖాలో వుండి ఆరోజున ఏడ్చిన మనిషి!

"నువ్వు తెలుగు పిల్లాడివా?"

"ఊఁ? నువ్వో?"

"నేం గూడా. నన్ను లొల్లిబెట్టి యీ తురకోడు తోలుకొచ్చిండు. దొర్లింటిలో పనిప్పిస్తనని మాయజేసిండయ్యా."

"యిద్దరం పారిపోదాం."

ఆ రాత్రి చీకటిపడ్డ తర్వాత చాలాసేపు ఆలోచించారు. ఫెజ్ టోపి యింటికి రాలేదు. కొత్త గొందులు సందులు తిరిగి యిద్దరూ స్టేషన్ వద్దకు చేరారు బ్రహ్మాండమైన ప్రయత్నం చేసి. కరీంనగరు తెలుగు గొల్లపిల్ల నారాయణకు అణా యిచ్చి, బురఖా తీసి దూరంగా పారేసి, "నారాయణగూడలో మామ వుండాడు. నేను బోతా," అని పోయింది. నారాయణ తన తలమీది ఫెజ్‌కాప్ నేలమీద విసిరేస్తుండగా మళ్లీ ఖాదర్ బక్ష్ కన్పించాడు. టిక్కెట్టు లేని ప్రయాణీకులు ఈమాటు స్నేహితులైనారు. ఆ తర్వాత జేబుదొంగలైనారు.

## 8

ఇప్పుడు పోలీసులూ, మేజస్ట్రీటులూ నారాయణను ఏమాత్రమూ భయపెట్టలేక పోతు న్నారు. పోలీసులు తనను బోర్‌స్టల్ స్కూల్లో వేసినప్పట్నించీ తనెట్లాగో తప్పించుకోగలననే ధైర్యం తోనే వెళ్లాడు. మిడిగుడ్ల మేజస్ట్రీటు హరిహరంగారింట్లో వారం అడగటానికి అభిమానపడ్డ నారాయణ.

బోర్‌స్టల్ స్కూల్లోకి తనతోపాటు ఖాదర్ భక్ష్ గూడా వచ్చాడు. ఖాదర్, యీమాటు చిన్న బాకు బొడ్లో దాచినది అప్పుడప్పుడు తోటి పిల్లలకు చూపి వాళ్ల దగ్గరేముంటే అది దోచుకుంటు న్నాడు. ఈ సాధన నారాయణకు గూడా నచ్చింది. తనూ ఒకటి సంపాదించాడు. తనకన్నా బలహీను లందరికీ తనకు తెలియకుండానే సింహస్వప్నమైనాడు.

బోర్‌స్టల్ స్కూలు చదువు మూడునెలలే బట్టింది. ఆ తర్వాత ఒక రాత్రి బండిలో ఖాదరూ, తనూ బొంబాయి మెయిల్లో, బల్లల కింద దాగి మరొక దూర ప్రయాణం సాగించారు.

బొంబాయి మిల్లు పొగలు పీల్చి, ప్రాణాన్ని వేధించే వూపిరాడని సముద్రపు వాతావరణంలో పెరిగి, మూడవ తరగతి హోటళ్లలో, రౌడీ స్నేహితుల యిళ్లల్లో కుళ్లు తిండి తిని ఫోరాన్ రోడ్డు మీది సగం కుష్టురోగపు కులటల వరండాలేని రేకు యిళ్లల్లో నిద్రించి- నారాయణ యువకుడై నాడు.

బొంబాయిలో- బెజవాడలో తను వదిలిన చదువు కొరకైన దిగులు పోయి- పూర్తి విజ్ఞానం సముపార్జించగలిగాడు. బట్టలమిల్లుల్లో కూలీలు సమ్మెలు చేస్తున్నప్పుడు వాళ్ల నడుములు విరగగొట్టి రహస్యంగా ఆకాశం నుంచి రాలిపడ్డ పదిరూపాయల నోట్లు సంపాదించాడు. పోర్చుగీసు డామన్ వెళ్లి ఆకాశంలో చుక్కలూ, ప్రశాంతి లేని రాత్రిళ్లు సముద్రం మీద చిన్న దోనెల్లో విదేశీ సారాసీసాలు దొంగిలించుకు వచ్చి, యింగ్లీషు హోటళ్లలో వులెన్ సూట్ల పెద్దమనుషులకు అందించి చౌకగా డబ్బు సంపాదించాడు. బొంబాయిలో అతన్నెరగని రౌడీలు లేరు (అక్కడ దాదాలంటారు). గోవా వెళ్లి బంగారపు అచ్చులు బొంబాయి మార్వాడీ షావుకార్లకు అందజెయ్యాలంటే ఏమి చెయ్యాలో నారాయణ ఆలోచించనక్కర్లేదు. గోల్‌పేఠా కుళ్లు బజార్లో కలహం రేపాలంటే గుక్క మంచినీళ్ల ప్రాయం. మదన్‌పురా మురికికొంపల్లో, ఖెండీబజార్ స్లమ్స్‌లో, పరేల్ మిల్లుల్లో, దాదర్ వత్తిడిలో బైకుల్లా కంపులో- యిక్కడా అక్కడా ఏమిటి? బొంబాయి గుడ్డల మిల్లుల గుజరాతీ షావుకార్లు సృష్టించిన అన్ని నరకపు పేటల్లోనూ అతనికి స్నేహితులున్నారు. చీకట్లో నించొని, బొంబాయి రోడ్ల మీద షికార్లు పోతున్న భార్యాభర్తల్ని దోచటం, ఆఫ్గన్ పఠాన్లతో కలిసి చిన్న బ్యాంకుల్లోకి జొరబడటం, విదేశాల నుంచి వచ్చే నావికుల దగ్గర తెలివిగా దొంగ పిస్తోళ్లు బేరం చేయటం- ఒకనాటి వారాల పిల్లవాడికి, నాయనమ్మ కోసం కాశీమజిలీ కథల కోసం, సంజీవి పుల్ల కోసం వెతికిన నారాయణకు కూసువిద్య అయిపోయింది. కాని నారాయణ ఒక విషయంలోనే పొరబాటుచేశాడు. తనే తెలివిగలవాడినని, తన దొంగ పిస్తోలు ముందు, స్ప్రింగు పేష్ కత్తి ముందు- లోకానికి మోక్షం యివ్వదలిచాడు. కాని తనకు మోక్షం యివ్వదలచిన పోలీసుల సంగతి బొత్తిగా మరిచిపోయాడు.

## 9

నారాయణ అడపా దడపా నాలుగేళ్లు ప్రభుత్వానికి అనేక జైళ్లలో అతిథిగా వుండి వచ్చాడు. కాని జీవితంలో యీమాటు మార్పులేవీ వచ్చేట్లుగా కన్పించలేదు. కాగాపోగా తన నీడలో యిన్నాళ్లూ తిరిగిన ఖాదర్ భక్ష్ కామాటిపుర నల్లగొందుల్లోని ఒక అమ్మాయి విషయంలో తగాదాలాడి తన డొక్కలో, తన కత్తితోనే పొడిచాడు. ఆనాడు 'అమ్మా' అన్నాడు, తల్లి కష్టాలు నిర్మూలింపదలచి వారాలు చేసుకొన్న నారాయణ. చివరకు ఎట్లా చచ్చాడో ఖాదరే చచ్చాడు.

*

దాదర్లో చిన్న దుకాణదార్లను బెదిరించి తెచ్చుకొన్న దోపిడీలో మిల్లు సమ్మెలను భగ్నం చెయ్యటానికై మిల్లు మేనేజర్లు సృష్టించిన 'దాదా'లకు ఒకసారి భాగాల తగాదా వచ్చి యుద్ధానికి తలపడ్డాడు. మిల్లుల్లో సమ్మెలు లేక యీమధ్య వీళ్లందరకూ- ముఖ్యంగా నారాయణకు ఆదాయం తగ్గిపోయింది. అటు యిద్దరూ యిటు యిద్దరూ గాయపడ్డారు. నారాయణ మీద సాక్ష్యం దొరకలేదుగాని, పరాయి రాష్ట్రం వాడని అతన్ని పోలీసులు బొంబాయిలో తిరిగి అడుగు పెట్టగూడదని వుత్తర్వులిచ్చి తరిమి వేశారు. అట్లా తిరిగి వచ్చాడు స్వదేశానికి నారాయణ.

వచ్చిన రెండు వారాల్లోనే హత్యకేసులో నారాయణ పోలీసులకు చిక్కాడు. నారాయణ జీవితంలో యిదొక మార్పుగానే వచ్చింది.

## 10

నారాయణను విచారించిన సెషన్సు జడ్జీ హరిహరంగారే, తను చేసుకోవలసిన పెద్దత్త కూతురు అనసు మొగుడు పబ్లిక్ ప్రాసిక్యూటర్. కోణం రామయ్య (భార్య చనిపోయింది) పోలీసు పంచనామాల్లో ఒకడు.

కోర్టుకు సంకెళ్లతో పోలీసు కార్లో వెళ్తున్న నారాయణకు ఒక రోజున హఠాత్తుగా- మామయ్య కన్పించాడు. ఆయనతో యింకో ముసలమ్మ గూడా వుంది. మామయ్య నల్లబడ్డాడు. జుట్టు తెల్లబడ్డది.

"నా...రా...య...ణా?" మామయ్య కళ్లనీళ్లతో కోర్టు మెట్ల మీద నిల్చుని వున్నాడు.

"మీ... అ...మ్మ..."

అప్పటిదాకా నవ్వుతున్న నారాయణ దిగాలుపడి చూచాడు.

"అ...మ్మా?!"

పోలీసులు యిక మాట్లాడనివ్వలేదు.

*

నిన్నటిదాకా నిర్దోషినని బోనులో చెప్పిన నారాయణ, ఆరోజు కొత్త వాంగ్మూలం యిస్తానని నిలబడ్డాడు. సెషన్సు జడ్జి ఆశ్చర్యపోయాడు.

"ఒక కండిషను మీద నిజం చెప్తాను," అన్నాడు పోలీసుల్ని సైతం గజగజలాడించిన ఖైదీ.

"ఏమిటది?" అన్నాడు జడ్జి.

"మీ యింట్లో యిక ముందెప్పుడూ వారాల పిల్లలకు తిండి పెట్టవద్దు. వాళ్లు నావలె హంతకులవుతారు."

## 11

నారాయణను రేపు ఉరి తీస్తారనగా మామయ్యా, అమ్మా జైలులో తన సెల్‌లోకి వచ్చారు. ఇంకెవరో వచ్చి భగవద్గీత చదివాడు. నారాయణ జడ్జి నుంచి తెలుసుకొన్న విశేషం అమ్మకు చెప్పాడు. "అమ్మా! నా డబ్బూ, వస్తువులూ నీకు యిస్తారని జడ్జి చెప్పాడు. నేను చచ్చిపోయిం తర్వాత ఒక వారాల పిల్లవాణ్ణి నువ్వు చదివిస్తానంటే నేను సంతోషిస్తా."

## 12

రామ మంటపం మీద తీర్థులవారు మరోమారు పురాణ శ్రవణం ఆపించి అన్నారు, పెద్ద గొంతుతో- "శాయమ్మ తల్లీ! విన్నావా? ఆ చంపిన పిల్లవాడు వెనక మన వూళ్లో వారాలు చేసుకొన్న పిల్లవాడట." శిష్యకోటి మేల్కొని వంత పలికింది, "కలికాలం! కలికాలం!! కలికాలం స్వామీ!!!"

*భారతి, జనవరి 1953*

## నేపథ్యం

చరిత్ర మిగిల్చిన క్షోభ

# వారాల పిల్లాడు

***ఇది విషాదభరిత మానవగాథ. ఇందులో వాస్తవం, చరిత్ర, కల్పనా రహస్యం అన్నీ మిళితమై ఉన్నాయి. ఈ కథా వస్తువే తన కనుగుణమైన శైలీ సంప్రదాయాల్నీ ఎన్నుకొన్నది. పెద్ద శిల్ప రహస్యావిష్కరణ లేకుండానే కథ ఎట్లా రక్తి కడుతుందో అప్పుడు నేను గ్రహించలేదు. కాని ఇప్పుడు నమ్ముతున్నాను.***

"కథ ఏదో ఒక జీవిత రహస్యాన్ని వెలుగుకు తెచ్చేదిగా ఉండాలి."

- *బాలగంగాధర తిలక్*

"నువ్వు ఏకాంతంలో స్తంభించిపోయినప్పుడు, నీ జీవితంలో ప్రాచీన విషాదాలు తెరలు తెంచుకొని దృశ్యాలుగా నీ ముందు నిలిచినప్పుడు, అవి మాకొక గొంతునివ్వమని ప్రార్థించినప్పుడు ఒక కథనైనా వ్రాస్తావు. ఓ కవితనైనా రచిస్తావు తప్పదు."

- *రష్యన్ కవి*

"వర్తమాన కాలంలో తన హృదయాన్ని స్పందించిన విషయానికీ ఒకనాడు బాల్యంలో తన గుండెల్ని పట్టి ఊపిన సంఘటనకూ మధ్య వారధిగా సృజనాత్మక శక్తి గల రచయిత పాత్రల్నీ, ఇతివృత్తాల్నీ సృష్టిస్తాడు."

- *ఫ్రాయిడ్*

"నరుడా! నీ దుఃఖమే నీ గురువు."

- *ఉపాసనీ మహరాజ్*

"కథానిక జీవిత ప్రతిచ్ఛాయ. జీవితం- ఒక అసంపూర్ణ కథానిక, ఒక అధ్యయనం. ఇది సమాప్తం కాదు. ఇందులో మానసిక సంఘర్షణ, అందులో జీవించేవాడు రచయిత."

- అజ్ఞేయ

“కథ ఆకలిలాంటిది. ఆకలి తీర్చుకోవాలనే యత్నం సమాధానం కోసం నిరంతర ప్రయత్నం. ఇందులో ప్రశ్నలూ, అనుమానాలుంటాయ్. మనవైన చింతలూ చింతనలూ వుంటై. వీటి సమాధానం వెతకటానికి, పొందటానికి, ఎడతెగని ప్రయత్నాలు, ప్రయోగాలు, పోరాటాలు చేస్తుంటాం. కథ కూడా ఇలాంటి అన్వేషణల ఫల స్వరూపమే.”

- జైనేంద్ర

“కథా వాతావరణం చిత్రించేటప్పుడు- ఆరు విరోధాలు రచయితకు విరోధాలు కావాలి. దేశ విరోధం, కాలవిరోధం, కళావిరోధం, లోకన్యాయ విరోధం, ఆగమ విరోధం, ప్రతిజ్ఞా విరోధం.”

- *డా॥ పోతుకూచి సాంబశివరావు*

కథానిక స్వరూపం, స్వభావం గురించిన ఇంకెన్నో వందల నిర్వచనాలు డా॥ పోరంకి దక్షిణామూర్తి, శ్రీశ్రీ, విరించి ఇత్యాదులు తెలుగు పాఠకులకు సుగమంగా చెప్పి ఉన్నారు.

*

‘అయినా, ఈ నిర్వచన నిబంధనావళి, నినాదాల క్లేశాలంటే మీకు పడవు గదా. ఇవన్నీ విమర్శకుల సమీక్షకుల పరికరాలు, ఒక్కోసారి ఆయుధాలు గదా. మీరు ఏదో మీ కథ ఒకటి ఎన్నుకొని దాని నేపథ్యం గురించి నాలుగు ముక్కలు రాస్తే సరిపోదా?’ అని విజ్ఞులు ప్రశ్నించ వచ్చు. చాలా నిజాయితీ ఉన్న ప్రశ్నే.

కాని- దాదాపు యాభై ఏళ్ళ క్రితం రాసిన ఈ కథ- వారాల పిల్లాడు (రచనా కాలం 1949. భారతి సాహిత్య పత్రికలో ప్రచురణ- 1953. ఈమధ్య కాలంలో ఆ వ్రాతప్రతి కనబడకుండా పోయి మళ్ళీ అదృష్టవశాత్తు లభించింది). వారాల పిల్లాడు కథను భారతిలో చదివిన శ్రీ మధురాంతకం రాజారాం, శ్రీ నోరి నరసింహశాస్త్రి, శ్రీ అయ్యగారి వీరభద్రరావు, శ్రీ ఉషశ్రీ, శ్రీ పిలకా గణపతిశాస్త్రి వంటి సాహితీమూర్తులు ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ ప్రశంసించినట్టు నాకు ఎరికే. భారతి వంటి పత్రికా పాఠకులు ఆరోజుల్లోనూ, ఈరోజుల్లోనూ వందల సంఖ్య కంటే మించరు కదా.

అయితే, 1992 సంవత్సరాంతంలో నా ప్రథమ కథా సంపుటి- మునిపల్లె రాజు కథలలో (విశాలాంధ్ర ప్రచురణ) మొదటి కథగా ఇది పునర్దర్శన మిచ్చిన తర్వాత ఎంతోమంది జ్ఞాత అజ్ఞాత పాఠకులు ఈ కథను గురించే ప్రత్యేకంగా నన్ను ప్రశ్నించారు. ‘ఇది మీ ఆత్మకథా? లేక మీకు బాగా తెలిసిన వ్యక్తి కథా? ఇవన్నీ నిజంగా జరిగిన సంఘటనలేనా? జీవితంలో ఇంత విషాదం ఉందా? ఇటువంటి కరుణార్ద్రమైన కథను మేమెప్పుడూ చదవలేదు. ముఖారిరాగం విన్నప్పుడో, అహిరి రాగాలాపన విన్నప్పుడో కలిగిన అనుభూతి కాదు. ఇది నాదనామ క్రియరాగంలో గడిచిన కథ. అప్పుడు మీరేదో ట్రాన్స్‌లో ఉండి వ్రాశారా? బొంబాయి నగరంలో మాఫియా గురించి మీకా రోజుల్లోనే తెలుసా? ఇది తెలుగునేలలో పుట్టి దేశసంచారం చేసి తిరిగి తెలుగునేల విషాదంలో మిళితమైపోయిన కథ గదా, ఆ ప్రదేశాలన్నీ మీరు చూశారా?” ఈ ప్రశ్నల్ని కురిపించిన మిత్రులు, అజ్ఞాత పాఠకులు, సాహిత్యంతో మంచి పరిచయమున్నవారు. కొందరు ఖ్యాతిలో ఉన్న కథకులు, కవులు, విమర్శకులు. సర్వశ్రీ ఉప్పల నరసింహం, కవి కుమారుడు సౌభాగ్య, సద్విమర్శకుడు భమిడిపాటి సోమయాజులు, మద్రాసు నుంచి నాయుడు, యువ కథకుడు అచ్యుతరామయ్య లాంటివారు. పేర్లన్నీ జ్ఞాపకం లేవు. నాకు చాలా ఆశ్చర్యజనకమైన వ్యవహారం ఇది. ఈ కథలో శిల్పం గురించిన శ్రద్ధ లేదు కదా, శైలి గురించిన ప్రత్యేక పోకడేమీ లేదు కదా! ఇంతకన్నా మంచి కథలు ఆ సంపుటిలో లేవా? అనే విచికిత్స నాకు కలిగింది. ఈ కథ ఇంతమంది విజ్ఞ పాఠకుల్ని అలరించిన కారణాలు ఏమై ఉంటాయి, అని పై నిర్వచన పట్టిక వేసుకొన్నాను.

ఒక్క డా॥ పోతుకూచివారి నిర్వచనం మినహాయిస్తే మిగతా అన్ని నిర్దేశాలతో కొద్దిగానో నిండుగానో ఈ కథా రచనకు సన్నిహిత సంబంధం ఉన్నదని నాకు తోస్తున్నది. ఇది విషాదభరిత మానవగాథ. ఇందులో వాస్తవం, చరిత్ర, కల్పనా రహస్యం అన్నీ మిళితమై ఉన్నాయి. ఈ కథా వస్తువే తన కనుగుణమైన శైలీ సంప్రదాయాల్నీ ఎన్నుకొన్నది. పెద్ద శిల్ప రహస్యావిష్కరణ లేకుండానే కథ ఎట్లా రక్తి కడుతుందో అప్పుడు నేను గ్రహించలేదు. కాని ఇప్పుడు నమ్ముతున్నాను. నోరి వారన్నట్టు ఏదో ఒక విధమైన సమాధి దశ సాధిస్తేనేగాని రచనకు నిలిచే శక్తి ఉండదు, అని కూడా నాకిప్పుడర్థమవుతున్నది.

*

పురాణం సుబ్రహ్మణ్యశర్మగారినీ, మధురాంతకం వారినీ కన్నీళ్ళు పెట్టించిన ఈ కథా నాయకుడు నారాయణ (నారి) అనే బాలుడు. ధనధాన్యాల సమృద్ధితో తులతూగుతున్న సంస్కార వంతుల కుటుంబంలో అల్లారుముద్దుగా అతని బాల్యం గడిచిపోతుంది. నాయనమ్మ చావు, ఆ తర్వాత తండ్రి మరణం, కరి మింగిన వెలగపండులాగా కరిగి మరుగైపోయిన సంపద. దైన్య మూర్తిగా నిలిచిన తల్లి. కౌమార దశలో వారాలు చేసుకొని (రోజుకొకరింట్లో భోజనం) పొరుగు పట్నంలో చదువుకొంటున్నాడు. అవమానాలు, ఒంటరితనం, తల్లి దురవస్థకు తన అసహా యత్వం- హైదరాబాదు పారిపోయాడు. అక్కడి నుండి మహానగరం బొంబాయి. పరిస్థితులు. తను అస్తిత్వరక్షణకు నేరస్తుడైనాడు. అట్టి భయానక పరిస్థితుల్లోనూ తల్లి జ్ఞాపకాలు. చివరకు ఉరికంబ మెక్కబోయే ముందు అతను పలికిన పలుకులు.

ఈ కథానాయకుడి మూర్తితత్త్వం నా చిన్నతనంలో తెనాలి పట్నంలో మా ఇంటికి వచ్చి, మాతోపాటు అన్నం తిని, చదువుకోసం ఎక్కడెక్కడో గురుశూశ్రుష చేస్తున్న ఇద్దరు వారాల పిల్లల నుండి రూపుదిద్దుకొన్నది. మా అమ్మ వారాల పిల్లల్ని కరుణతో కాపాడేది. తలంట్లు పోసేది. కొత్త గుడ్డలు కుట్టించి పండగ చేయించేది.

మా నాన్నగారు, ఆనాటి ఆర్థికమాంద్య కాలంలో ఏవేవో వ్యాపారాలు చేసి, ఆస్థిని, చివరకు ప్రాణాల్ని పోగొట్టుకొన్నారు. కుటుంబం దుర్దశలో ఉన్నప్పుడు నా గతి కూడా అంతే అవుతుందా అనిపించినప్పుడు అమ్మ తన జీవితమంతా చేసిన అన్నదాన ఫలితంగా మాకేదో ఆధారం దొరికింది, మా మేనమామల సాయంతో. ఈ కథను మా అమ్మకు నివాళిగా ప్రారంభించాను. కాని ఇది వారాల పిల్లాడి కథగా నా చెప్పుచేతల నుండి స్వాతంత్ర్యం పొంది రూపం మార్చుకొన్నది.

ఈ కథను నేను పూనా, బొంబాయిల్లో ఉండగా రచించాను. 1946-49ల మధ్య కాలంలో ఎన్నో బీభత్స చారిత్రక దృశ్యాలను చూచాను. 1946 ఆగస్టు రెండవ వారంలో నేను, కర్ణాటక శివశంకర్, తమిళనాడు వరదరాజన్ వాల్టేరు నుండి కలకత్తా నగర దర్శనానికి వెళ్ళాము. అక్కడ జిన్నా, సుహ్రావర్దీ ప్రారంభించిన 'ప్రత్యక్ష చర్యలో' వేలాది హిందూ అమాయకుల వధను తిలకించాను. పూనాకు బదిలీ అయిన తర్వాత గాంధీజీ హత్య, ఢిల్లీ వెళ్ళి కురుక్షేత్రంలో పంజాబు కాందిశీకుల ఇరవై లక్షల శిబిరాన్ని చూశాను. వారి భయానక అనుభవాల్ని కొన్ని స్వయంగా విన్నాను. ఈ చారిత్రక సత్యాలతో పాటు అప్పటి నిజాం డొమీనియన్స్‌లో రజాకార్ల పైశాచిక చర్యల్నీ చూశాను. ఇవన్నీ సాక్షికంగా ఈ కథకు నేపథ్యాలుగా నిలిచాయి. ఇంకా విస్తృతంగా వివరించాలంటే ఇంకొక పెద్ద కథ అవుతుంది. నా ఆత్మకథ కాకపోయినా, నా తరంలో మానవుడనుభవించిన క్షోభ ఈ కథ.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 5 అక్టోబర్ 1997*

19



*వల్లంపాటి వెంకటసుబ్బయ్య 15 మార్చి 1937లో చిత్తూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'అన్యధా శరణం నాస్తి' 11 ఆగస్ట్ 1958 ఆంధ్ర ప్రభలో అచ్చయింది. 35 కథలు, 3 నవలలు రచించారు. వీరి మరణానంతరం సమగ్ర కథల, నవలల సంపుటాలు వెలువడ్డాయి. సాహిత్య విమర్శనా రంగంలో ప్రసిద్ధులైన వీరు కథాశిల్పం, నవలాశిల్పం, విమర్శనాశిల్పం గ్రంథాలు, కొన్ని ఇతర వ్యాసాలు ప్రచురించారు. కథాశిల్పం వ్యాస సంపుటానికి 1999లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించింది. చరిత్ర, సాహిత్య గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. ఆంగ్లోపన్యాసకులుగా పనిచేసి పదవీవిరమణ అనంతరం మదనపల్లెలో 2 జనవరి 2007న మరణించారు.*

# రానున్న శిశిరం

## వల్లంపాటి వెంకటసుబ్బయ్య

భక్తిరంజని వినాలని రేడియో పెట్టాను... 1977వ సంవత్సరం... గర్‌గర్... ఆగస్టు నెల... పదిహేనవ తేదీ... ఉదయం... నిలయంలో సమయం సరిగ్గా ఆరు గంటలు.

ఈరోజు స్వాతంత్ర్యదినం. సుకన్య పుట్టినరోజు.

స్వాతంత్ర్యం వచ్చి ముప్పై సంవత్సరాలు. సుకన్య పుట్టి పాతిక సంవత్సరాలు... అబ్బో ఎంత కాలం... ఎంత దూరం!

జైల్లో ఉన్న రోజుల్లో ఒక్కొక్క క్షణం శవజాగరణం చేసిన రాత్రిలా గడిచేది.

ఇప్పుడు? సంవత్సరాలు క్షణాలుగా గడిచి పోతున్నాయి...

సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం!

వందేమాతరం... భారతమాత సుజల, సుఫల!

వీధి కుళాయి దగ్గర అమ్మలక్కల పోరాటం అప్పుడే రాజకీయాల స్థాయిని అందుకుంది. మా వీధికది మలయమారుత రాగం. "సుజలాం..."

"ఏమండీ కాఫీ..."

సీత వైపు చూశాను. ఓర్పు రూపెత్తిన సీత! అమాయకత్వం, నిష్కాపట్యం, తేమగల మనసు ముప్పేటగా అల్లుకున్న నా బ్రతుకు జడ సీత!

... తీసుకున్నాను. సీత చేసిన కాఫీ సీత మనస్సులా ఉంది...

వీధంట ఒక గుంపు బిచ్చగాళ్ళు వెళ్తున్నారు. రాత్రి ఊరిబయట- నాగరికులకు దూరంగా, నాగుపాములకు దగ్గరగా బ్రతికి, ఉదయాన్నే క్షేమంగా ఊళ్ళో కొస్తున్నారు. చింపిరి తలలు, పుసి కారుతున్న కళ్ళు, ఎముకల గూళ్ళలా ఉన్నారు- భావిభారత పౌరులు. "సుఫలాం."

"ఈరోజు ఏం చేయమంటారు?" ప్రశ్నించింది సీత.

"ఎందుకు?"

"అమ్మా పట్టెడన్నం ఎట్టు తల్లీ!" చంకలో ఏణ్ణర్థం పిల్లాడితో ఒక భారతమాత నిలబడి ఉంది.

"వందేమాతరం, వందేమాతరం, వందేమాతరం."

సీత ఒక దోశడు బియ్యం వేసి వచ్చి, "చెప్పండి," అన్నది.

"ఏమీ వద్దు."

"ఇవాళ..."

"అందుకే వద్దంటున్నాను."

సీత కళ్లలో ఆశ్చర్యం!...

"శ్రీశైల మల్లికార్జున విభో తవ సుప్రభాతం," రేడియోలో బృందగానం.

క్షణం తటపటాయించి సీత వెళ్ళిపోయింది.

శ్రీశైల మల్లికార్జునుడు నిద్ర లేవటమే లేదు...

కానీ సుకన్య లేచింది... ఇంకా నిద్ర వదలని కళ్ళతో, ఇంకా నిద్రలేవని మల్లికార్జునుడ్ని ఈర్ష్యతో చూస్తూ, మత్తుగా మేడమెట్లు దిగుతోంది.

"అపుడే నిద్ర లేచావా తల్లీ!"

"హౌఁఖు ణాణ్ణా. హిప్పుడే ళేచాఖు," సుకన్య గొంతులో ఆవులింత, నిద్ర తలంబ్రాలు పోసుకున్నాయి.

పేపరు కుర్రాడు విసిరిన పేపరు ముంగిట తేమలో పడింది.

అందుకున్నాను...

"మీ కాలేజీలు ఎప్పుడు తెరుస్తారుట?"

"స్ట్రయికు పూర్తి కావాలిగా."

"అదెప్పుడు పూర్తవుతుంది."

"ఏమో!"

"అసలీ వల్లకాటి స్ట్రయిక్ ఎందుకఘోరిస్తున్నారు?"

"చాలా డిమాండ్స్ ఉన్నాయి నాన్నా."

"అసలు మీరు చదువుకోడానికి వెళ్తున్నారా, లేక..."

"నేను ఇప్పుడు కూడా శ్రద్ధగానే చదువుకుంటున్నాను నాన్నా."

అకస్మాత్తుగా నాకు సుకన్య అమాయకంగా అబద్ధాలాడుతున్న పాపాయిలా కనిపించింది. నా కోపం మంచులా కరిగిపోయి,

"రాత్రి ఎందాకా చదివావమ్మా?" అబద్ధం నా కూతురు ఎలా, ఎంత అందంగా చెప్పగలదో చూద్దామని, సుకన్య ముఖంలోకి పరిశీలనగా చూస్తూ అడిగాను.

"ఒంటిగంట దాకా చదివాను నాన్నా. మీరేమో పది గంటలకే పడుకొన్నారు. చదువుతున్న పుస్తకం పూర్తయే దాకా..."

సుకన్య మాటలు నాకు వినిపించటం లేదు. దాని ముఖంలోకి పరిశీలనగా చూస్తే నా మనస్సు హిరోషిమా అయిపోయింది.

"... పడుకోగూడదనుకొన్నాను. పూర్తయేసరికి ఒంటి గంట దాటిపోయింది."

సుకన్య ముఖం సుకన్య ముఖంలా లేదు... ఆ కళ్ళల్లో- ఇద్దరు ముగ్గురు పిల్లల్ని తొల గించుకున్న తల్లి గాని తల్లి కళ్ళలోని ప్రౌఢత్వం- శాంతిలేని, తృప్తిలేని ప్రౌఢత్వం...

"... ఈసారి నాకు తప్పకుండా క్లాసు వస్తుంది నాన్నా."

"నోర్ముయ్. వెళ్ళు!"

సుకన్య ఆశ్చర్యపోయి వెళ్ళిపోయిందనుకుంటాను. నా మనస్సు నా స్వాధీనంలోకి వచ్చే సరికి, సీత వంటింటి గుమ్మం ముందు నిలబడి ఉంది.

"మరికాస్త కాఫీ తాగుతారా?" చిరునవ్వుతో ప్రశ్నించింది.

సీత చిరునవ్వును తప్పించుకోవటానికి, పత్రిక చదవటం నటించసాగాను.

అద్భుత శృంగార వీరదృశ్య కావ్యం- వయసు- మనసు.

అర్ధనగ్నంగా ఉన్న ఒక అమ్మాయి అసహ్యకరమైన భంగిమలో ఆంధ్ర ప్రేక్షక మహాశయుల కోసం నిలబడి ఉంది. (బ్రహ్మాండం, వారేవా!)... వయస్సు సుమారు పాతిక... వంకీల జుట్టు, కోల ముఖం... సుకన్యలాగే... మొనకాస్త పైకి లేచిన ముక్కు! చూచేకొద్దీ అన్నీ... అన్నీ సుకన్య పోలికలే! అర్ధనగ్నంగా సుకన్య! ఈ అసహ్యకరమైన భంగిమలో సుకన్య! ప్రతి రోడ్డు మలుపులో సుకన్య! ఛీ ఛీ!

భగవాన్ ఈ దేశాన్ని రక్షించు- ముఖ్యంగా స్త్రీల నుండి, రాజకీయ నాయకుల నుండి, వ్యవస్థలు నిలిచినా, కూలినా వారిద్దరి పనే!

పత్రిక విసిరి పారేసి వీధిలోకొచ్చాను.

మేడలు, చెట్లు కూలిపోతున్నాయి. నా చుట్టూరా కూలిపోతున్నాయి. నా మీద కూలి పోతున్నాయి... మేడలు, చెట్లు, వ్యవస్థలు... మళ్ళీ ఇంట్లోకెళ్ళాను...

సుకన్య పెరట్లోకి పోతూ నావైపు అదోరకంగా చూచింది.

ఏకాంతంలో రేగిన ఆలోచనల్లాంటి జుట్టు!

చెదిరిన ఆత్మవిశ్వాసంలాంటి బొట్టు!

ఎంత వింతగా ఉంది సుకన్య?

"ఏమండి స్నానం చేస్తారా?"

"ఆఁ..."

"నీళ్ళు తోడాను. త్వరగా లేవండి."

... స్నానం పూర్తిచేశాను... పెరట్లో తాను నాటిన బాదంచెట్టు మొదట కూర్చుని సుకన్య పళ్ళు తోముకుంటూంది. దాని ముఖం చూడాలంటే నాకు భయమేసింది.

బట్టలు వేసుకొని బయలుదేరాను.

"మరికాస్త కాఫీ తాగుతారా?" సీత చిరునవ్వుతో ప్రశ్నించింది.

"అఖ్ఖర్లేదు."

నా కాఠిన్యానికి నాకే ఆశ్చర్యమేసి, "తాగాలని లేదు," అని సర్దుకుని బయలుదేరాను.

వీధులు దాదాపు నిర్మానుష్యంగా ఉన్నాయి. కొంతమంది కాలేజి విద్యార్థులు కాబోలు ఎన్.సి.సి. యూనిఫారాల్లో సిగరెట్లు తాగుతూ (యూనిఫారంలో ఉన్నప్పుడు సిగరెట్లు తాగవచ్చా?) ముందు నడుస్తున్న అమ్మాయిని గురించి వాగుతూ నడుస్తున్నారు.

"నిలువవే వాలుకనులదానా, వయ్యారీ హంసనడక దానా..." ముందు నడుస్తున్న వాలు కనుల వయారి తిరిగిచూచి, పెదవులు బిగబట్టి నవ్వబోయి, మానేసింది.

యూనిఫారాలన్నీ ఒక్కసారిగా పులకించిపోయాయి.

వీరగంధము తెచ్చి నారము

వీరులెవరో తెల్పుడీ...

ముందు నడుస్తున్న ఖద్దరు వస్త్రధారిణులైన యువతులు పాడుతుంటే, దేశభక్తితో, త్యాగంతో మా హృదయాలెలా చెమర్చాయి!

నిలువవే వాలు కనులదానా...

"నమస్కారం సార్!"

"నమస్కారం."

"ఊరికా?"

"ఆఁ... అలా ఊరికే..."

ఇంద ఇంద తీసుకో... నన్నే సొంతం చేసుకో...

ఎవరా పాడుతోంది? సుకన్యేనా? నడివీధిలో, అంత పెద్దగొంతుకతో, సుకన్యా... సుకన్యా... అలాంటి పాటలు పాడద్దు. నువ్వు నా బిడ్డవి. నువ్వలాంటి పాటలు- నడివీధిలో, ఇంత పెద్ద గొంతుకతో పాడకూడదు. మీ అమ్మ విన్నదంటే గుండె పగిలి చచ్చిపోతుంది... వద్దు...

ఇంద ఇంద తీసుకో...

'అబ్బబ్బబ్బ! ఈ మైకులతో నరకంగా ఉంది.'

నరకం- ఎలా ఉంటుంది నరకం? నా బ్రతుకులా ఉంటుందా?

కొన్నాళ్ళ ముందు ఎవరో కవి (పిచ్చాడు) ప్రేయసిని నరకానికి ఆహ్వానిస్తూ-

'నరకం ఇక ఎంతో కాలం ఉండదుట. రా, పోదాం,' అన్నాడు. ఈసరికి నరకం ఉండదు కాబోలు.

ఎందుకుండదూ, ఉంటుంది. జగమే నరకం- బ్రతుకే నరకం.

ఎర్ర చందనంతో చేసిన తొండంలేని వినాయకుడిలా ఉన్న ఒక శెట్టిగారు అరుగు మీద కూచొని బ్రెడ్డు ముక్కల్ని వీధిలోకి విసిరేస్తున్నారు. వాటికోసం కాకులు గోలగోలగా పోట్లాడుకుంటున్నాయి. కొన్ని తెలివైన కాకులు ముక్క నేలపడక ముందే- రాజకీయ నాయకుడు పదవిని తన్నుకుపోయినట్టు- ఎగరేసుకుపోతున్నాయి.

హరేరామ హరేరామ...

రామరామ హరేహరే

హరేకృష్ణ హరేకృష్ణ

కృష్ణ కృష్ణ హరేహరే

శెట్టిగారు 'రామా కృష్ణా,' అనుకొంటూ దానం చేస్తున్నారు.

రామా-కృష్ణా! రామకృష్ణ! ఆ వెధవ జ్ఞాపకం వస్తున్నాడు.

రామకృష్ణ, నా బిడ్డ. నా రక్తాన్ని పంచుకొని పుట్టినవాడు. తన స్వార్థం కోసం తల్లిని, తండ్రిని, పుట్టిన దేశాన్ని వదిలేశాడు.

రామకృష్ణను నమ్ముకొన్నాను. ఈ బ్రతుకు చాలించేటప్పుడు వాడి చేతి తులసినీళ్ళు తాగుతూ, వాడి పేరు తలుచుకుంటూ చాలించాలనుకొన్నాను. కానీ, వాడు నన్ను వదిలి వెళ్ళి పోయాడు...

శంఖుమార్కు బనీనులనే వాడుడు. సుఖం, సంతోషం కోసం శంఖుమార్కు బనీనులు.

సుఖం, సంతోషం!

ఎవరికున్నాయి? ఎవరికైనా ఉన్నాయా? కొందరి కుండవచ్చు.

చెరసాలలు, ఉరికొయ్యలు ఎవరిని రక్షిస్తున్నాయో- వారికి. నాకు లేవు!

సుకన్యకున్నాయా? ఏమో?

రామకృష్ణకున్నాయా?! నాకెందుకు?

ప్రేక్షక మహాశయులకొక శుభవార్త. జూలీ- అపూర్వ హిందీ చిత్రం.

జూలీ!!!

రాక్షసి! పిశాచి!!

నా రామకృష్ణను గద్దలా తన్నుకుపోయింది.

బాగుంది, ఉపమానం చాలా బాగుంది.

గద్దలా తన్నుకుపోయి ఏం చేస్తోందో? పొడిచి పొడిచి తింటోందా? అయినా నాకెందుకూ? నన్ను మరిచిపోయినవాణ్ణి నేనూ మరిచిపోవాలి. కానీ వీలుకావటం లేదే!

పుచ్చిపోయిన పంటి మీదికి నాలుక పోయినట్టు, నా మనస్సు వాడి మీదికే మళ్ళీ మళ్ళీ పోతోందే.

మనసు గుర్రము రోరి మనిసీ
మనసు కళ్ళెము లాగు మనిసీ!

పొగరుబోతు అధికారి కోపంలా వచ్చిన కారు పక్కనే ఆగింది.

"నమస్కారం... గారూ," అన్నాడు విశ్వనాథరెడ్డి.

"నమస్కారం," అన్నాను.

ఒకనాడు నన్ను ఖద్దరు బిచ్చగాడన్న విశ్వనాథరెడ్డికి ఆనాడు ఒక ఇల్లు, ఒకే ఇల్లాలు ఉండేవారు. తర్వాత అతనికి అన్నిటి సంఖ్యా పెరిగింది.

రాజులెందరు మారినా రాణిని మాత్రం నేనే అన్నదట ఒకానొక రాణి. అలాంటివాడు విశ్వనాథరెడ్డి.

"పోలీస్ గ్రౌండ్స్‌లో మీటింగు ఉంది," అన్నాడు విశ్వనాథరెడ్డి స్టీరింగ్ నుద్దేశించి. ఎదురుగా వస్తున్న సినిమా బండి అరుపులో విశ్వనాథరెడ్డి స్వగతం కలిసిపోయింది.

జూలీ. నేడే చూడండి.

"ఎందాకా వెళ్తున్నారు?"

"ఊరికే అలా..."

"మీటింగ్‌కి రాకూడదూ?"

రెండేళ్ళ క్రితం కూడా ఇలాగే తాను మాట్లాడబోతున్న స్వాతంత్ర్యదినోత్సవ సభకు తన కారులో తీసుకెళ్ళాడు విశ్వనాథరెడ్డి. ఈ ఏడు మళ్ళీ... లేదంటే అతని పార్టీ మాత్రం మారింది.

"రావచ్చు. క్రిందటేడు కూడా రాలేదు."

"ఎందుకూ?"

‘‘స్వాతంత్ర్యమే లేకుండా దానికి ఉత్సవమెందుకనీ...’’

విశ్వనాథరెడ్డి గట్టిగా నవ్వి, ‘‘కరెక్ట్,’’ అన్నాడు.

‘‘ఎక్కండి... డ్రాప్ చేస్తాను.’’

నవ్వొచ్చింది. నువ్వు కూడా డ్రాప్ చేస్తావా? స్వాతంత్ర్యం రాగానే నాతోటివారు నన్ను డ్రాప్‌చేసి పదవులెక్కారు. నేను ఎన్నో ఆశలు పెట్టుకొన్న కొడుకు ఒక్క ఆడదాని కోసం నన్ను డ్రాప్ చేసి పారేశాడు.

కారు కదిలింది.

జూలీ... జూలీ... జూలీ...

ఎటువంటి త్యాగాలకైనా స్వాతంత్ర్యదిన కానుక చీరలు, దోమతెరలు. రాస్కెల్ ఛస్తావురా. ఘా ఆప్టికల్స్! అనాబ్‌షాహీ (మనం కొనలేం). భోజనం తయారు (ఇంత ఉదయాన్నే!) గోల్కొండ బ్రాందీనే... బాబోయ్ కారు పడిపోతుందేమో... అబ్బ!

‘‘దిగండి.’’

‘‘... ... ...’’

‘‘నమస్కారం.’’

‘‘నమస్కారం.’’

... స్వాతంత్ర్య దినోత్సవం, ఇష్టంలేని కొడుకు తండ్రికి పెడుతున్న శ్రాద్ధంలా, నమ్మకం లేని అధికారి చేతిలో ప్రణాళికలా ఉంది...

... పురంబునందలి అనధికారులు శ్వేతమకుట ధారులయ్యును, అధికారులు పాలియెస్టర్ కవచధారులయ్యును ఆసీనులై యుండిరి. మండల భూరాజ స్వగ్రాహక దొరవారు ఈ ‘నౌకరు శాహీ’ రాజ్యమును మధ్యనున్న యున్నతాసనము పై కూర్చుని వీక్షించుచుండిరి. ఇరువంకల కరండవాహికల వలె నిరువురు రక్షకభటులు...

రాజు వెడలె రవితేజములలరగ రాజసభకు నేడు, కుడిఎడమల డాల్ కత్తులు మెరయగ... డాల్ కత్తులు...

‘‘ఏం మామయ్యా ఇక్కడ నిలబడ్డావు?’’

డాల్ కత్తులు పారేసి చూద్దునుకదా- పలకరించింది కోడలు కాలేకపోయిన మేనకోడలు శాంత!

‘‘ఏమిటమ్మా ఇలా వచ్చావు?’’

‘‘అమ్మకు మందు తేవటానికి వెళ్తుంటే మీరు కనిపించారు...’’

పాపం నా చెల్లెలు! నన్ను, నా కొడుకును నమ్మి మోసపోయి, మంచాన పడింది.

‘‘అమ్మకెలా ఉందమ్మా.’’

‘‘ఫరవాలేదు మామయ్యా. బావ ఉత్తరాలు రాస్తున్నాడా?’’

‘‘అంత అదృష్టం లేదమ్మా. ఏ జన్మలో ఏ తండ్రీ బిడ్డల్ని విడదీశానో...’’ శాంత కళ్ళల్లో కన్నీటిపొర!

‘‘మనసు గట్టి చేసుకోవాలి మామయ్యా,’’ శాంత మనసులోని అశాంతంతా ఒక్క మాటలో ధ్వనించింది.

‘‘... ...’’

‘‘ఏమిటి మామయ్యా ఆలోచిస్తున్నావు?’’

“నిన్ను గురించేనమ్మా.”

శాంతకు అర్థమైంది. జవాబు చెప్పకుండా తన మనసులా రెపరెపలాడుతున్న తోరణాల్ని చూస్తోంది.

“వాడు నీకెన్నో ఆశలు చూపించి, చివరకు నిన్ను నట్టేట్లో ముంచి, నీ బ్రతుకు చిదిమేశాడు కదా!”

“కొందరికి అభిమానం కంటే డబ్బు విలువైంది మామయ్యా.”

ఆ వాలిన కనురెప్పల్లోని జాలి, వంగిన పెదవుల్లోని ఓర్పు, కంఠస్వరంలోని దైన్యం- ఆ వెధవకు, ఆ రామకృష్ణకు- ఛీ వాణ్ణి నేను మరిచిపోవాలి.

శాంత నిట్టూర్చింది.

చిన్నారి శాంత బ్రతుకే ఒక నిట్టూర్పయిపోయింది.

“వెళ్ళొస్తాను మామయ్యా.”

స్వాధీనంలో ఉన్న ఆలోచనల్లాంటి జుట్టు, ఆత్మవిశ్వాసంలాంటి చెదరని బొట్టు! సుకన్య... శాంత...

పోలీసుబాండు బయలుదేరింది.

మంత్రదండాన్ని ధరించిన మాంత్రికునిలా బాండుమాస్టరు కొయ్యబొమ్మలా నడుస్తున్నాడు. వెనుక బాండుదళం, ఆ వెనుక రిజర్వు పోలీసులు, మామూలు పోలీసులు (పాపం ఇరవై నెలలు వీళ్ళకు మంచినీళ్ళకు రక్తానికి భేదం తెలియనే లేదు) ఆ తర్వాత ఎన్.సి.సి. దళం (నిలువవే వాలుకనుల దానా...) వారి వెనుక శిఖండులు ఎవరబ్బా వీళ్ళు? అమ్మాయిల దుస్తుల్లో అబ్బాయిలా, అబ్బాయిల దుస్తుల్లో అమ్మాయిలా?... అరె, ఆడపిల్లలే! నవ్వొస్తోంది. ముప్పై కోట్ల మంది పురుషులున్న ఈ దేశంలో, ఆడది తుపాకి పట్టి దేశరక్షణ చేస్తానంటే నవ్వొచ్చేస్తోంది.

ఇది పురుషులు లేని దేశం కాదుగా?

ఔనూ? మనదేశంలో పురుషులున్నారా?

కట్టుబట్టయు, తిండి గతిలేని దేశాన

పుట్టగొడుగులు గాక పురుషులెవరున్నారు?

ఎవడో మహాకవి అన్నాడు.

ఇంత గొప్ప మాట అన్నవాడు మహాకవిగాక మరెవరు?

సాదా కవైతే ప్రేయసిని గూర్చియు మెల్లగన్నును గూర్చియు బద్యములు వ్రాసియుండెడివాడు...

తననననననతననన్నానన తననే...

ఆలోచన ఆపి అటెన్షన్‌లో నిలబడ్డాను...

జయహే జయహే జయహే

జయ జయ జయ జయహే

అయిపోయింది స్వాతంత్ర్య దినం.

స్వాతంత్ర్య దినోత్సవం రానురానూ జీవితమంత నిస్సారంగా మారిపోతోంది.

దీనికి కారణం ఎవరు?

అందరి జవాబూ ఒకటే. నువ్వు- నువ్వు నువ్వే?...

“వెళ్ళొస్తాను మామయ్యా,” శాంతి తిరిగొచ్చింది.

"వెళ్ళిరామ్మా. అమ్మతో సాయంకాలం వస్తానని చెప్పు."

శాంత వెళ్ళిపోయింది. శాంతి వెళ్ళిపోయింది.

నేనూ వెళ్ళిపోతాను.

ఎక్కడికి? అగమ్య గమ్యస్థానానికి...

అగమ్యంగా గమ్యం చేరేసరికి సీత వాకిట్లో నిలబడి ఉంది.

సీతా... సీతా... ఆ సుకన్య నీ కడుపున ఎలా పుట్టింది. 'సాలగ్రామ ఖనిన్ జనించునే కదా జాత్యల్ప పాషాణముల్.' సుకన్య పాషాణం తిని చచ్చిపోగూడదూ? ఛీ! ఛీ! సుకన్య నా బిడ్డ. అది చచ్చిపోతే నేను చూడగలనా?

ఎందుకు చూళ్ళేనూ?

గాంధీగారు చచ్చిపోతే నేను బ్రతగ్గలననుకున్నానా?

గాంధీగారు పోయారు. కాదు చంపేశారు. (పంపేశారు?)

కానీ నేను బ్రతికానే!

వాకిట చిరునవ్వుతో నిలబడి ఉంది సీత.

సీత చచ్చిపోతే నేను బ్రతగ్గలనా? ఛీ! ఎంత భయంకరమైన ఆలోచన!

రామాకృష్ణా... ఛీ మళ్ళీ వాడు మనసులో కొస్తున్నాడు.

"టిఫిన్ తింటారా?" సీత అడిగింది.

"ఆకలిగా లేదు."

అయ్యో! నోరు జారిపోయింది. ఆకలిగా లేకేం?...

"తినండి," అన్నది సీత ప్లేటు చేతికందిస్తూ.

ఉప్మా చాలా బాగుంది. తినేస్తున్నాను.

సీత వంటింట్లో నవ్వుకుంటోంది కాబోలు... కానీ ప్లేటు ఖాళీ అయిపోతోంది.

సుకన్య మేడ దిగుతోంది. కాళ్ళు చేతులు అదురుతున్నాయి. ఎందుకూ? భయమా? నాకెందుకు భయం?... ప్లేటు దిగుతోంది... మేడ మెట్లు చేతిలో... బలహీనమైన మనస్సులా అదురుతోంది... ఎర్రచీర... రక్తం... బంగారం చెప్పులు దిగుతోంది... బాబోయ్ ప్లేటు జారి పోతోంది...

"మార్నింగ్ షోకి వెళ్ళొస్తాను నాన్నా."

"అలాగేనమ్మా వెళ్ళిరా."

ఇంత బలహీనంగా మాట్లాడుతున్నానేమిటి నేను!

"ఏ సినిమాకమ్మా?"

"ఏదో నాన్నా తెలీదు. న్యూ రిలీజ్. స్నేహితులంతా కలిసి వెళుతున్నాము."

స్వాతంత్ర్య దినం కానుక. అద్భుత శృంగార వీర దృశ్య కావ్యం- వయసు-మనసు.

సన్నని నడుమున్న అమ్మాయి, అస్తి నాస్తి విచికిత్సా హేతుశాతోదరి, సుకన్యలాంటి- నొక్కుల జుట్టులాంటి- అమ్మాయిలాంటి- సుకన్యలాంటి సుకన్య- వీధి గడప దాటిపోయింది...

"అమ్మాయిని సినిమాకు పంపారా?" సీత అడిగింది- చిరునవ్వుతో.

మళ్ళీ చిరునవ్వు!

నా అంతరాంతరాలలోని బలహీనతల్ని గుర్తు చేసే చిరునవ్వు!

ఆ చిరునవ్వును తప్పించుకోవాలి.

అబ్బ! మనస్సు చికాకుగా ఉంది. చీకి పొదలా ఉంది.

ఏదైనా కాసేపు చదువుకుంటే బావుణ్ను. ఏం చదివేది? నా దగ్గర ఏం పుస్తకాలున్నాయి.

వాల్మీకి రామాయణం - సుందరకాండ- ''తతో రావణనీతాయా స్సీతా యాశ్శత్రు దర్శనః'' ఎన్నోసార్లు చదివాను. మరి ఓపిక లేదు. భగవద్గీత- గీతా ప్రెస్- గోరక్‌పూర్- ''కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు,'' ఈ విషయాన్ని భగవద్గీతకన్నా నా బ్రతుకే బాగా నచ్చజెప్పింది. ''మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్.'' మహాత్మా నీకు నూరేళ్ళు నిండిపోయాయి. రాం రాం.

సుకన్య ఎప్పుడూ ఏదో చదువుతూ ఉంటుంది. దాని గదిలో ఏదయినా ఒక పుస్తకం దొరకవచ్చు ఇంగ్లీషు వాడన్నట్టు కాలాన్ని చంపటానికి...

... పిచ్చివాడి మనస్సులా ఉంది సుకన్య గది. మూలబడిన కోరికల్లాంటి పాతబట్టలు. దుమ్మును పొడరుగా అద్దుకున్న పుస్తకాల వన్నెల విసనకర్రలు... అబ్బ ఉక్కపోస్తోంది- ఆగస్టు నెలలో కూడా- రేపు రెండు విసనకర్రలు కొనాలి.

అయన్ ఫ్లెమింగ్, హెరాల్డ్ రాబిన్స్, హాడ్లీ ఛేస్, నిక్ కార్టర్- అమ్మో అన్నీ ఇంగ్లీషు పుస్తకాలు.

''బెడ్‌మార్క్- ఏజంట్ ఇన్ ది బెడ్‌రూమ్.''

ఎవడో అన్నట్లు హత్య చెయ్యదలచుకుంటే ఏ చోటైతేనేమని- పరిశోధనకు కూడా చోటు లేదు కాబోలు.

అబ్బ! ఎంత అసహ్యంగా ఉంది అట్ట మీది బొమ్మ!

దాచుకోవాల్సిన అవయవాలు ఇక్కడే ఉన్నాయని సూచించడానికి ధరించిన బ్రాలతో, నలుగురు చాకుల్లాంటి అమ్మాయిలు ఒక చేతిలో సిగరెట్టు, మరొక చేతిలో రివాల్వరు ఉన్న ఒక పురుషుణ్ణి- ఏం చేస్తున్నారు? ఊ... ఏదో చేస్తున్నారు.

బికినీలు ధరించిన అమ్మాయిలు ఎంత బాగున్నారు! ముఖ్యంగా నొక్కుల జుట్టు అమ్మాయి! వయస్సు సుమారు పాతిక. అదే వంకీల జుట్టు. ఆ అమ్మాయి బికినీ లాగి పారేస్తోంది... వద్దు సుకన్య వద్దు! అలాంటి బట్టలు వేసుకోవటమే తప్పు. వాటిని లాగిపారేయటం- అందులోనూ కన్నతండ్రి ఎదుట... అబ్బబ్బ! తల పగిలిపోతోంది.

''సీతా!''

''ఏమండీ.''

''ఇలారా.''

''ఇదిగో వస్తున్నానండీ.''

సీత ఎంత బుద్ధిలేనిది. సుకన్య ఇలా... ఇలా... ఇదైపోతుంటే హద్దుల్లో పెట్టలేకపోయింది.

అన్నట్టు రామకృష్ణ పాడైపోయాడు- ఆ తప్పు నాదేనా?

''సీతా!''

''ఇదిగో వస్తున్నానండీ.''

''నువ్వే రానవసరం లేదు.''

''అలాగేనండీ,'' బిగ్గరగా అంది సీత.

సీత కంఠం ఎంత హాయిగా ఉంది. సీత గొంతులో తంబూర శృతి ఉంది. సీత పాడుతూంటే ఎదకు మంచి గంధం పూసుకున్నట్టుగా ఉంటుంది.

నగుమోము... కనలేని... నా జాలి... తెలిసీ... ఈ... ఈ...

సీత నవ్వంటే ఈరోజు భయంగా ఉంది.

సీతా నీ నగుమోము కనలేని నా జాలి తెలిసి...

"సార్! పోస్ట్."

"సీతా పోస్ట్ వచ్చింది చూడు."

"అలాగేనండి."

సీతకు, 'అలాగేనండి,' అనటం తప్ప మరో మాట రాదేమో.

"సీతా డబ్బుతో చాలా ఇబ్బందిగా ఉంది... మీ నాన్నగారిచ్చిన గొలుసు..."

"అలాగేనండీ."

ఇలా ఎప్పుడూ సీత నా అభిప్రాయాలకు ప్రతిధ్వని!

"ఇదిగోనండీ ఉత్తరం."

చూచావా సీతా సుకన్య ఎలా అయిపోయిందో...

"ఏమిటండి అలా చూస్తున్నారు. ఇదిగోనండీ ఉత్తరం."

"ఎలా?"

చిరునవ్వు నవ్వింది సీత.

నగుమోము కనలేని నా జాలి తెలిసి తెలిసీ నవ్వింది.

వెళ్ళిపోయింది సీత. నేనూ వెళ్ళిపోతాను.

ఎక్కడికి?

ఎక్కడికో- అగమ్య గమ్యస్థానానికి.

వెళ్ళిపోతాను. ఈ నరకం నుండి వెళ్ళిపోతాను.

వెళ్ళిపోతే ఎలా? ఉత్తరం చదవద్దూ?

రాకరాక ఒక ఉత్తరం వచ్చింది. దాన్ని చదివేసి వెళ్ళిపోతాను.

కవరు చించాను.

"డియర్ సుకన్యా!"

అయ్యో! ఇది నా ఉత్తరం కాదే!

కానీ చించేశానే. ఎలా ఇతరుల ఉత్తరాలు చదవటం ఎంత నీచం!

చివరికి అవి బిడ్డలవైనా?

నాకు బిడ్డలెక్కడున్నారు? చచ్చిపోయారు.

ఛీఛీ! ఎంతమాట వాళ్ళు చచ్చిపోలేదు. నన్ను చంపేశారు.

నేను చచ్చిపోయాను. అయ్యోపాపం నేను చచ్చిపోయాను. "పరచికొందు నా మరణశయ్య నిప్పుడె..."

"డియర్ సుకన్యా! నీ ఉత్తరం అందింది. నీవు చెప్పినట్టు... తేది... నువ్వు చెప్పిన హోటల్ వద్దనే ఎదురు చూస్తుంటాను. ఏదో ఒక కారణం చెప్పి వచ్చేయ్... ఎ థౌజెండ్ (ఛీఛీ) శ్రీహరి."

హరి హరీ! నా బిడ్డలు ఎందుకిలాగైపోయారు.

అసలు ఎందుకు చదివానీ ఉత్తరాన్ని...

చదవకుండా ఎలా ఉండగలను?

అదే నా బలహీనత!

బలహీనతను సమర్థించుకోవటం మరొక బలహీనత!

"టెడ్ మార్క్- ఏజెంట్ ఇన్ ది బెడ్ రూమ్."

నొక్కుల జుట్టు సుకన్య అలా బట్టలు లాగి పారెయ్యకు...

"అదేమిటండీ. అలా కళ్ళు మూసుకు నిలబడ్డారు. ఏం చేస్తున్నారిక్కడ?"

మేడ మీదికొచ్చిన సీత ప్రశ్నించింది.

ఏం చేస్తున్నానా? చచ్చిపోతున్నాను. నీ బిడ్డలిద్దరూ గొంతు కోసేస్తుంటే క్రమంగా చచ్చిపోతున్నాను.

"అరె! ఎవరి వద్ద నుంచండీ ఉత్తరం?"

"నా స్నేహితుడి వద్ద నుంచి."

"ఎవరండీ ఆయన?"

"నాకు ప్రాణస్నేహితుడు. జైల్లో ఒకే గదిలో ఉండేవాళ్ళం... పాపం!"

"ఏమిటండీ? ఏం జరిగింది?"

"అతని కూతురు చచ్చిపోయిందట."

"పాపం."

"అతనికిద్దరే పిల్లలు- ఒక కొడుకు, ఒక కూతురు. కొడుకు ఇంతకుముందే చనిపోయాడు. ఇప్పుడు కూతురు పోయింది."

"అయ్యోపాపం. ఎంత అన్యాయమండీ!"

ఔను. ఎంత అన్యాయం. బిడ్డలు తండ్రిని చంపెయ్యటం ఎంత అన్యాయం. చూశావా సీతా- నేను చచ్చిపోయాను.

"పాపం, అంత బాధని ఎలా భరిస్తారో ఆయన," అన్నది సీత.

"ఎవరు?"

"వారేనండీ, మీ స్నేహితుడు."

సుకన్య బికినీ లాగి పారేస్తోంది... దాన్ని చూడు సీతా! మన లోకం వేరు- ఈనాటి లోకం వేరు. వీటి మధ్య పెద్ద అగాధం.

అగాధమైన అగాధం?

ఈనాడు- "పాపం పుణ్యం ప్రపంచమార్గం... అన్నీ శ్లేషార్థాలు."

అన్నీ శ్లేషలే! ఈనాటి జీవితమే ఒక పెద్ద శ్లేష...

"సుకన్య వచ్చే వేళయింది! వడ్డిస్తాను. కలిసి భోంచేద్దురుగాని లేవండి."

"అలాగే," అన్నాను అసమర్థుణ్ణి.

దాంతో కలిసి నేనెందుకు భోంచేయాలి? దానికీ నాకూ ఏమిటి సంబంధం?

రక్త సంబంధం.

అదేనాడో తెగిపోయింది.

అది తెగిపోదూ.

రామకృష్ణ తెంచితే తెగలేదూ?

తెగలేదు.

"అమ్మా," సుకన్య కింది నుంచి పిలిచింది.

"వస్తున్నా," వెళ్ళిపోయింది సీత....

"ఎలా ఉందే సినిమా?"

"చాలా బాగుంది. డాన్సులు, యుద్ధాలు ఫైన్."

నొక్కుల జుట్టు అమ్మాయి... సుకన్యలాంటి నొక్కుల జుట్టు డాన్సు-

ఇంద ఇంద తీసుకో

ఏముందీ తీసుకోవటానికి.

సుఖం లేదు, శాంతి లేదు. శంఖుమార్కు బనీనులు లేవు.

"వడ్డించాను త్వరగా భోజనానికి రండి."

"ఇదిగో వస్తున్నా," ఉత్తరాన్ని టేబిలు మీద పడేసి క్రిందికెళ్ళాను.

అద్దం ముందు నిలబడి ముఖం తుడుచుకుంటోంది.

మెదడులోంచి వేలాడుతున్న పాముల్లా ఉన్న రెండు జడలు.

అలికినా ముగ్గు పెట్టని ముంగిలా ఉన్న బొట్టులేని నుదురు!

ఛీఛీ- దీని ముఖం చూడకూడదు.

'దీని' ముఖం చూడకూడదనుకొంటే ఎదురుగా, 'వాడి' ఫోటో. వాడి ఫోటో నా ఇంట్లో ఎందుకుండాలి.

వాడు నా కొడుకు.

బరువుల్ని చూచి పారిపోయి, బంధాలు తెంచుకున్నవాడు నాకింకా కొడుకెలా అవుతాడు?

అబ్బ తల పగిలిపోతోంది. నా బతుక్కి సుఖం, సంతోషం లేవు.

రేపు రెండు శంఖుమార్కు బనీన్లు కొనాలి- సుఖం కోసం, సంతోషం కోసం. కాని బనీన్లు కూడా కొనలేనివారి సంగతో?

విదేశీవాళీ కార్లలో తిరుగుతున్న నాయకులు... దేశం ఇంత బాగుపడిపోయిందేం- అని ఆశ్చర్యపడిపోతున్నారు.

దేశవాళీ కార్లలో, విదేశీవాళీ వాసనల్తో తిరుగుతున్న ప్రేమమార్కు కవులు విప్లవాలను గురించి అరుస్తున్నారు.

అమ్మాయిలు జుట్లు కత్తిరించుకొంటూ, అబ్బాయిలు జుట్లు పెంచుకొంటూ అందరూ సుఖంగానే ఉన్నారనుకొంటున్నారు.

నాకు మాత్రం సుఖం, సంతోషం లేవు.

"వడ్డించాను. కూర్చోండి," నవ్వుతూ అన్నది సీత.

నీ నగుమోము కనలేని- నా జాలి తెలిసి తెలిసి అలా నవ్వకు.

"ఎందుకూ?"

అప్పుడే భోజనానికి సిద్ధంగా కూర్చొని ఉన్న రాక్షసి నవ్వింది.

"ఎందుకు నాన్నా- తినటానికి," అన్నది సుకన్య కాని సుకన్య.

అయినా దాని ప్రక్కన కూర్చొని నేనెందుకు భోంచేయాలి.

"ఆకలిగా ఉంది. రా నాన్నా," అన్నది రాక్షసి.

"కూర్చోండి," అన్నది సీత పాయసం కప్పు పక్కన పెడుతూ.

"ఇదేమిటి?"

"పాయసం."

"ఎందుకూ?"

"ఇవాళ రెండు పండుగలు కదండీ- స్వాతంత్ర్య దినం, సుకన్య పుట్టినరోజు..."

"ఎవరికీ?"

"మనందరికీ."
"మనమంటే?"
"ఏమిటండీ ఆ మాటలు," సీత కంఠఃలో భయం!
సుకన్య ఆశ్చర్యపోయి చూస్తోంది.
"నేను తినను. నాకక్కర్లేదు."
సీత జవాబు చెప్పలేదు.
సుకన్య అన్నం తినలేదు.
"ఏమిటలా చూస్తావు? నేను తిననంటే తినను."
"నువ్వు తినకపోతే నేనూ తినను," అన్నది సుకన్య, తన నొక్కుల జుట్టు పైకి తోసుకొంటూ.

సుకన్యలాంటి అమ్మాయి- సుకన్యలాంటి నొక్కుల జుట్టు అమ్మాయి- ప్రతి వీధి మలుపులో- ఇంద ఇంద తీసుకో... అని బికినీలు లాగిపారేస్తోంది.

"వద్దు సుకన్య వద్దు. అలాంటి పని చెయ్యద్దు," మనసులో అనుకోబోయి, బిగ్గరగా అనేశాను.

"ఎందుకు చెయ్యనూ. చేస్తాను," అన్నది సుకన్య.

"ఏమిటే ఎన్ని గుండెలు నీకు! చేస్తావా? చెయ్. నీ ఇష్టం వచ్చినట్టు తిరుగు. మానం మర్యాద లేకుండా తిరుగు... తిరుగు..."

అబ్బ తల తిరిగిపోతోంది.

"చాలా ఆకలిగా ఉన్నట్టున్నారు కూర్చోండి," అన్నది సీత భయాన్ని చిరునవ్వుగా మార్పు చేయాలని ప్రయత్నిస్తూ.

సీతా! నేను తినగలనంటావా? పిచ్చిదానా, నీ అజ్ఞానం నీకు దేవుడిచ్చిన వరం. నేను ఈరోజు తింటున్నది అన్నం కాదు విషం! విషం!

ఎంత హాయి! హాయిగా ఈ విషం తిని హాయిగా చచ్చిపోతాను. ఎంత సులభంగా దొరికింది! విషం తినటానికి కూర్చున్నాను...

"పచ్చడి బాగుందా?" సీత ప్రశ్న.
"నా బ్రతుకులా ఉంది."
"అంటే?" సీత గొంతులో భయం.
"చప్పగా."
రాక్షసి గలగలమని నవ్వింది.

... ... ...

"పాయసం ఎలా ఉందండి?"
"లేదు."
"బాగా లేదాండీ?" సీత ఆశ్చర్యపోయింది.
"ఏమిటీ?"
"పాయసం."
"బాగాలేదని ఎవరన్నారు?"
"మీరేగా అన్నారు."
"పాయసం ఎలాగుందని అడిగావా నువ్వు?"

"అడిగాను కదండీ. మీరు బాగాలేదన్నారు," సీత కళ్ళల్లో నవ్వుల తళతళ.

"అలాగా! నా మనసు ఎలా ఉందని అడిగావనుకున్నాను."

సీత కళ్ళలోని తళతళ మాయమైపోయింది. క్రమంగా భయాల నీడలు, తెగిపోయిన ఆశలు, రామకృష్ణలు, గద్దలు ఆ కళ్ళల్లో తెరలు తెరలుగా కదిలారు.

సీత కళ్ళనిండుకూ కన్నీళ్ళు ఉబికి వచ్చాయి.

అందులో అన్ని దృశ్యాలు కరిగిపోయాయి.

అయ్యో అయ్యో! నా సీత ఏడుస్తోంది. సీతని ఏడిపించాక నేనెందుకు బ్రతకాలి.

ఏమనుకోకు సీతా ఈరోజు మనసేం బాగాలేదు.

ఈరోజున నా మనస్సులో చాలా ముళ్ళు గుచ్చుకొన్నాయి. వాటిని పీకేసుకోలేక ఛస్తున్నాను. తీరా ఒక్కటంటే ఒక్కటి పీకానో లేదో- అది నీకు గుచ్చుకొంది. ఏమనుకోకు సీతా!

సీత ముఖం చాటు చేసుకొని పెరట్లో కెళ్ళిపోయింది.

నా మనస్సు రెపరెపలాడిపోయింది... నేనూ వెళ్ళాను.

బాదంచెట్టు నీడలో నిలబడి సీత కళ్ళు తుడుచుకుంటూంది. సీత కళ్ళు లోతులేని నీటిలో నిశ్చలంగా ఉన్న ఎర్రని చేపల్లా ఉన్నాయి.

"రామకృష్ణ జ్ఞాపకం వచ్చాడా?" వెలగని చిరునవ్వుతో ప్రశ్నించింది సీత.

అవును సీతా రామకృష్ణ మాత్రమేకాదు, నా జీవితం మొత్తం జ్ఞాపకం వస్తోంది. కొందరి జీవితాల్లో పరాజయాలు అప్పుడప్పుడూ మాత్రమే వస్తాయి. కానీ నా జీవితం మొదటినుంచీ చివరివరకూ ఒకే పరాజయం.

నా బ్రతుకు అందరి బ్రతుకుతో పెనవేసుకుపోయిందనుకొన్నాను. కానీ అందరి బ్రతుకు లాగే నా బ్రతుకూ తెల్లవారింది.

ఈరోజు నేను పాయసం తాగలేను... ఏమీ అనుకోవద్దు.

"ఏమండీ రామకృష్ణ జ్ఞాపకం వచ్చాడా?" మళ్ళీ అన్నది సీత.

అవును సీతా! బాధ్యత సృష్టించే సమస్యల్ని చూచి భయపడిపోయి, దూరంగా పారిపోయిన రామకృష్ణ జ్ఞాపకం వచ్చాడు. నల్లని జూలీ ద్వారా అంతకన్నా నల్లగా ఉన్న డబ్బు సంపాదించుకొని, మన నిట్టూర్పులు వినిపించనంత దూరంగా పారిపోయిన రామకృష్ణ జ్ఞాపకం వచ్చాడు. వాడి జ్ఞాపకంగా మనకు మిగిలింది వాడి చదువుకోసం మనం చేసిన తీర్చలేని అప్పులు మాత్రమే!

"అవును సీతా!" అన్నాను.

"నిన్నటి నుంచీ నా మనసులోనూ వాడే మెదులుతున్నాడు."

"అలాగా?"

"రాత్రి నిద్ర కూడా పట్టలేదు."

నిద్రకు వెలియై నీవొంటరివై యెంత బాధపడ్డావో!

"నిన్న రామకృష్ణ ఉత్తరం రాశాడు," అన్నది సీత.

నా గుండె క్షణం ఆగినట్టనిపించింది. కళ్ళు చెవులు వెచ్చగా నిట్టూర్చాయి.

"ఎవరికి... నా... నాకా?"

"... కాదు సుకన్యకు. మనకు రాసే ధైర్యం వాడికి లేదు."

"జీవితంలో ఎన్ని దెబ్బలు తిన్నా నీలో అమాయకత్వం పోలేదు."

"అదో మీరలా బాధపడతారనే మీతో చెప్పలేదు."

"ఇప్పుడు కూడా చెప్పకుండా ఉంటే బాగుండేది. పోనీ ఏం రాశాడు?"

"మామూలే..."

"చూడు సీతా అదంతా ఆత్మ వంచన- పరవంచన. విశాలదృష్టి ఉన్న వాడెవడూ వాడు చేసిన పని చెయ్యడు, ఆ మాటకొస్తే నా వరకూ నాకు కులం మీద, మతం మీద నమ్మకం లేదు. కానీ అంతమాత్రాన నేను నాస్తికుణ్ణీ కాను..."

"అవును."

"ఛీఛీ! వాడికంత విశాలదృష్టే ఉంటే వాడి పేరెందుకు మారేది?"

"ఇదిగో నాన్నా అన్నయ్య ఉత్తరం."

ఒక జడ ముందుకు, మరొక జడ వెనక్కు వేసుకొన్న సుకన్య- నా రక్తాన్ని పంచుకొన్న సుకన్య- ఇంద ఇంద తీసుకో సుకన్య- టెడ్ మార్కుల సుకన్య- శ్రీహరి సుకన్య వచ్చింది.

"ఇదిగో నాన్నా అన్నయ్య ఉత్తరం," కవరులోంచి ఉత్తరాన్ని తీసిచ్చింది.

"చదవండి," అన్నది సీత.

.... .... ప్రయత్నించాను.

కళ్ళు చెదిరిపోతున్నాయి. అక్షరాలు కదిలి పోతున్నాయి. మనసులో అక్షరాలు, ఉత్తరాలు కలిసిపోతున్నాయి.

"డియర్ సుకన్యా! నీ ఉత్తరం అందింది. నీవు చెప్పినట్టు 25వ తేదీ నువ్వు చెప్పిన హోటలు వద్దనే ఎదురుచూస్తుంటాను. ఏదో ఒక కారణం చెప్పి వచ్చేయ్..."

"ఛీ! నా ఉత్తరం చింపింది నువ్వేనా?"

సుకన్య చెంప ఛెళ్ళుమంది.

"ఏమండీ- ఏమండీ..." సీత నిలబడలేక బాదం చెట్టు మొదట కూలిపోయింది...

మునిసిపల్ ఆఫీసుకు పిప్పరమెంట్ల కోసం వెళ్ళిన పిల్లలు తిరిగొస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు సంప్రదాయంగా జరిగే అన్నదానానికి బీదాబిక్కీ పరుగులు తీస్తున్నారు.

... సుకన్య నాటిన బాదంచెట్టు ఆకులు రాలుస్తోంది...

"అప్పుడే శిశిరం వచ్చిందా?"

"లేదే."

"మరి ఆకులు రాలిపోతున్నాయే?"

"ఈ చెట్టుకేదో చీడ పట్టింది."

అయ్యో! నా ఆకులు రాలిపోతున్నాయి. నా గుండెలు జారిపోతున్నాయి. కూలబడ్డాను. నా మీద నా ఆకులు రాలుతూనే ఉన్నాయి.

*జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక, 1977*

నేపథ్యం

## విలువల విధ్వంసం

# రానున్న శిశిరం

***జీవితంలో వచ్చిన విలువల పతనాన్ని గురించి అలాంటి స్వాతంత్ర్య సమరయోధుని దృక్పథం నుంచి ఒక కథ రాయాలని చాలాకాలం మధనపడ్డాను. అలాంటి కథలో ప్లాట్ చాలా తక్కువగా ఉండక తప్పదు. ప్లాట్ ఎక్కువగాఉంటే స్వాతంత్ర్య సమరయోధుని ఆలోచనలకు ప్రాధాన్యత ఉండదు.***

నేను 1958లో కథలు రాయడం ప్రారంభించాను. కథలు రాస్తూనే రెండు మూడు నవలలు కూడా రాశాను. తరువాత చదువులో పడి కొంతకాలం ఏమీ రాయలేదు. ఆ తరువాత చారిత్రక శాస్త్ర గ్రంథాల అనువాదంలో చాలాకాలం కూరుకుపోయాను. మరికొంతకాలం తరువాత అప్పుడప్పుడూ రాస్తూ వచ్చిన సమీక్షల్లాంటి వ్యాసాల నుంచి ఎదుగుతూ(?) సాహిత్య విమర్శకుడుగా స్థిరపడిపోయాను. సాహిత్య విమర్శలో కూడా నా అభిమాన విషయం సాహిత్య సిద్ధాంతం (లిటరరీ థియరీ). ప్రక్రియా విమర్శలో కూడా అంతో ఇంతో కృషి చేస్తూ నవలను గురించి, కథను గురించి రెండు పుస్తకాలు రాశాను. ఇప్పుడు సాహిత్య విమర్శా-సిద్ధాంతం గురించి ఒక పుస్తకాన్ని రాయాలన్న ప్రయత్నంలో ఉన్నాను. రాయలసీమ భాషకు, జీవితానికి దర్పణం లాంటి నవలను రాయాలన్నది నాకున్న మరో కోరిక. అది తీరుతుందో లేదో నాకే తెలియదు. ఎంత లోతుగా ఆలోచించినా రాయలసీమ జీవితంలోని సంక్లిష్టత నాకు అందడమే లేదు. ఇదీ సూక్ష్మంగా నా సాహిత్య జీవిత ప్రస్థానం.

నేను చిత్తూరు జిల్లాలో రాయలసీమ చైతన్యం ఉన్న ఒక గ్రామంలో, స్వాతంత్ర్యోద్యమంతో బాగా సంబంధం ఉన్న కుటుంబంలో పుట్టాను. మా ప్రాంతం మొదట కాంగ్రెస్ రాజకీయాలకు, ఆ తరువాత వామపక్ష రాజకీయాలకు నిలయంగా ఉండేది. ఇప్పుడు అవమానకరమైన కుల రాజకీయాలకు నిలయమైపోయింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి నేను ఐదో క్లాసులో కాబోలు ఉన్నాను. ఆరోజు మా ఊరి

నాలుగు వీధుల కూడలిలో సభ జరగడం, అందులో మా నాన్నగారు ఆవేశంగా ఉపన్యసించడం లీలగా గుర్తుంది.

మా నాన్నగారు నాకో 'ఆర్కిటైప్.' నేను రాసిన మొదటి నవల ఇంద్రధనుస్సు (1962)లో విశ్వనాథయ్య వారే. తాను గొడుగు తెరిస్తే చెదిరిన ఎద్దులు బండిని చెరువుకట్ట మీది నుంచి కిందికి లాగేస్తే బండి కిందా, ధాన్యం మూటల కిందా పడి నలిగిపోయి, చనిపోయిన విశ్వనాథయ్య నాన్న వాస్తవిక జీవితంలో మా తాతే. రానున్న *శిశిరం*లో పేరు లేని కథకుడు కూడా మా నాన్నగారే. నాకు తెలియకుండానే అనేక జీవితానుభవాలను వారి దృక్పథం నుంచి చూడడానికి అలవాటు పడిపోయాను. ఇతర స్వాతంత్ర్య సమర యోధుల్లాగే వారు కూడా స్వాతంత్ర్యం తరువాత అన్ని రంగాలలోను వచ్చిన నైతిక పతనాన్ని గురించి తలుచుకొని చాలా తరచుగా బాధపడుతుండేవారు. రాజకీయ రంగంలో విలువల పతనం వస్తే అది అన్ని జీవితరంగాలకూ వ్యాపిస్తుందని చెప్పేవారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వారికి పదవులేవీ లభించలేదు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, ఇతర పార్టీలో చేరకుండా రెండేళ్ళ క్రితం చనిపోయేవరకు జీవితంలో పోరాడుతూనే ఉన్నారు. వారి మిత్రులంతా రాజకీయంగా చాలా పైకి వెళ్ళిపోతే తాను మాత్రం ఒంటరిగా నేల మీదనే మిగిలిపోయారు.

జీవితంలో వచ్చిన విలువల పతనాన్ని గురించి అలాంటి స్వాతంత్ర్య సమరయోధుని దృక్పథం నుంచి ఒక కథ రాయాలని చాలాకాలం మథనపడ్డాను. అలాంటి కథలో ప్లాట్ చాలా తక్కువగా ఉండక తప్పదు. ప్లాట్ ఎక్కువగాఉంటే స్వాతంత్ర్య సమరయోధుని ఆలోచనలకు ప్రాధాన్యత ఉండదు. ఎలా వస్తుందో చూద్దామని ప్రథమ పురుష దృష్టికోణంలో నుంచి ఈ కథను 1975లో రాశాను. అది ఎంతమాత్రం సంతృప్తికరంగా రాలేదు. అందులోని కథకూ, స్వాతంత్ర్య సమరయోధుని ఆలోచనలకూ సమన్వయం కుదరలేదు. అవి రచయిత జోక్యం లాగా కృత్రిమంగా కనిపించాయి. ఆ కథ నాకు ఎంతమాత్రం నచ్చకపోవడం చేత ప్రచురణకు పంపలేదు.

కానీ ఆ వస్తువు నన్ను ఇబ్బందిపెడుతూనే వచ్చింది. అలాంటి కథలో రాజకీయ రంగంలో వచ్చిన పతనాన్ని మాత్రమే చిత్రిస్తే సరిపోదు. ఇతర రంగాలలో వచ్చిన పతనాన్ని కూడా చిత్రించాలి. కానీ ఎలా చిత్రించాలో అర్థం కాలేదు. ఇలా మథనపడుతూ ఉన్న కాలంలో 1977లో ఇంగ్లీష్ టీచింగ్‌లో డిప్లొమా చేయడం కోసం హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్‌కు వెళ్ళాను. అక్కడ సాహిత్యం కోర్సులో జేమ్స్ జాయిస్ రాసిన 'యులిసిస్'లోని మొదటి మూడు ఎపిసోడ్స్ చదవాల్సి వచ్చింది. ఆ భాగాన్ని ప్రొఫెసర్ ప్రధాన్‌గారు బోధించారు. ప్రతి పదాన్నీ వివరిస్తూ, చర్చిస్తూ, అందులోని చైతన్య స్రవంతిలో ఉన్న మానసిక ప్రవాహాన్ని ప్రదర్శిస్తూ, అందులో వచ్చే అనేక రిఫరెన్సుల సామంజస్యాన్ని వివరిస్తూ వారు పాఠం చెప్పారు. అంతవరకు చైతన్య స్రవంతిని గురించి ఉన్న అజ్ఞానమూ, దురభిప్రాయాలు చాలావరకు తొలగిపోయాయి. ఈ కథన శిల్పం నా పెట్టెలో ఉన్న అసంతృప్తి కథకు సరిపోతుందని స్ఫురించింది. అప్పుడు దాదాపు ఏడాదిన్నర కాలంగా పక్కన ఉంచేసిన కథను బయటికి తీసి శ్రద్ధగా రెండు మూడుసార్లు చదివితే అందులోని లోపాలు తేటతెల్లంగా అర్థమయ్యాయి.

ఆ కథను ప్రథమ పురుష దృష్టికోణంలో రాసి ఉండకూడదనిపించింది. అలాగే వాస్తవిక కథన పద్ధతీ, శైలీ కూడా ఆ కథకు ఎంతమాత్రమూ అతకలేదని అర్థమైంది. అందుచేత ఆ కథను ఉత్తమ పురుషలో, కొత్తగా అర్థం చేసుకొన్న చైతన్యస్రవంతిలో, మరింత తీవ్రంగా, ప్రతీకాత్మకంగా ఉన్న శైలిలో రాస్తే బావుంటుందనిపించింది. దాదాపు వెంటనే రచన ప్రారంభించాను. వారం

రోజుల్లో రాయడం పూర్తయింది. రాజకీయ విలువలలో మాత్రమే కాకుండా సమాజంలో వచ్చిన నైతిక పతనాన్ని, కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని చూపడానికి ప్రయత్నించాను. మతం మార్చుకొని పెళ్ళి చేసుకొని విదేశాలకు వెళ్ళిపోయిన కొడుకు, విలాసవంతమైన కోరికలు తీరక పోవడం చేత కాబోలు నైతికంగా పతనమైపోయిన కూతురు తిరగరాసిన కథలో ప్రధానాంశా లయ్యారు. స్వాతంత్ర్య సమరయోధుడే ఈ కథలో కథకుడు (నెరేటర్) కావడం చేత వర్తమానాన్ని గతంతో పోల్చడానికి వీలు కలిగింది. అతడు చదువుకొన్నవాడూ, ఆలోచనాపరుడూ కావడంచేత అతని చైతన్యస్రవంతిలోకి షేక్స్పియర్, త్యాగరాజు, విశ్వనాథ, త్రిపురనేని రామస్వామిచౌదరి, పుట్టపర్తి ప్రవేశించడానికి అవకాశం కలిగింది.

రానున్న *శిశిరం* స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఉదయం ఆరుగంటలకు ప్రారంభ మౌతుంది. (ఆరోజు కథకుని కూతురు సుకన్య పుట్టినరోజు కూడా.) మధ్యాహ్నం భోజనం సమయం తరువాత ముగుస్తుంది. ఈమధ్యలో కథకుడు కూతురిలో వచ్చిన నైతిక పతనాన్ని గ్రహిస్తాడు. పోలీస్‌గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్యదినం రోజు జరిగే పెరేడ్ చూడడానికి బయలు దేరుతాడు. (ఇది చాలామంది స్వాతంత్ర్య సమరయోధులకున్న చాపల్యం.) దారిలో ఈ తరం రాజకీయ నాయకుడిని కలుసు కొంటాడు. అతనికి తెలియకుండానే అతని చైతన్యస్రవంతిలోకి అతని కొడుకు ప్రవేశిస్తాడు. పెరేడ్ చూస్తుండగా తన కొడుకు చేసిన దగాకు బలైపోయిన మేన గోడలు కనిపిస్తుంది. ఆమె ద్వారా తన చెల్లెలి ఆరోగ్యం బాగాలేదని తెలుసుకొంటాడు. ఇంటికి తిరిగొచ్చేసరికి అతని భావాలూ, భావోద్వేగాలూ అతని స్వాధీనంలో నుంచి తప్పిపోయి ఉంటాయి. తన్ను తాను అదుపు చేసుకోవ డానికి భార్య అందివ్వబోయిన సహకారాన్ని కూడా గుర్తించలేదు. కొడుకు వద్ద నుంచి ఉత్తరం వచ్చిందని తెలిసేసరికి అతనిలో ఉదయం నుంచీ రగులుతున్న అగ్ని పర్వతం బద్దలైపోతుంది. అగమ్యంగా పెరట్లోకి వెళ్తాడు. సుకన్య నాటిన బాదం చెట్టు నుంచి ఆకులు రాలుతుంటాయి.

'అప్పుడే శిశిరం వచ్చిందా?' అనుకొంటాడు.

శిశిరం రాకపోయినా ఎందుకు ఆకులు రాలుతున్నాయి?

ఆ చెట్టుకు- సుకన్య నాటిన చెట్టుకు- చీడ పట్టిందని తెలుసుకొంటాడు.

తన మీద తన ఆకులే రాలుతున్నాయన్న ఎరుక అతనిలో కలగడంతో కథ ముగుస్తుంది.

కానీ, శిశిరం ఇంకా రాలేదని, అది వస్తున్న సూచనలు మాత్రమే కనిపిస్తున్నాయని పాఠకుడు గుర్తించడానికి కథ పేరు దోహదం చేసినా, ఈనాటి పాఠకుడు శిశిరం వచ్చేసింది అనుకొన్నా ఆశ్చర్యం లేదు.

ఈ కథలో 'కథ' చాలా తక్కువగా ఉంది. ఉన్న కొద్దిపాటి కథ కూడా గతంలో ఉంది. దాని పరిణామాల చిత్రణే వర్తమానంలో ఉంది. అందుచేత కథకుని చైతన్య స్రవంతిలో రెండూ కలిసి ప్రవహించడానికి వీలు కలిగింది.

చాలాకాలం తరువాత ఈ కథను ఇప్పుడు చదివితే, నాకు సంతృప్తినిచ్చిన అంశం ఒకటి, నన్ను ఆశ్చర్యపరచిన అంశం మరొకటి కనిపించాయి.

మొదటిది ఈ కథలో ప్రతీకలు కుదిరిన విధానం. ఈ కథ ప్రారంభంలో రేడియోలో వందే మాతరం గీతం వినిపిస్తుంది. వీధి కొళాయి వద్ద అమ్మలక్కల పోరాటం 'సుజలాం.' వీధంట వెళ్తున్న బిచ్చగాళ్ళు 'సుఫలాం.' చంకలో ఏణ్ణర్థం కుర్రాడితో అన్నం అడుగుతూ వీధిలో నిలబడి ఉన్న స్త్రీ 'భారతమాత.' ప్రభుత్వాధికారులు చేస్తున్న స్వాతంత్ర్యదినం ఇష్టంలేని కొడుకు తండ్రికి పెడుతున్న శ్రాద్ధం, నమ్మకంలేని అధికారి చేతిలో ప్రణాళిక.

రానున్న శిశిరాన్ని తలుచుకొని ఆకులు రాలుతున్న బాదంచెట్టు కథకుడే! కథకుని కూతురు సుకన్య, మేనకోడలు శాంత ప్రవర్తన పరస్పర విరుద్ధమైన ప్రతీకలు. 'ఏకాంతంలో రేగిన ఆలోచనల్లాంటి జుట్టు, చెదిరిన ఆత్మవిశ్వాసంలాంటి బొట్టు,' -సుకన్య. 'స్వాధీనంలో ఉన్న ఆలోచనల్లాంటి జుట్టు, చెదరని ఆత్మవిశ్వాసం లాంటి బొట్టు,' -శాంత. ఇలా చాలా ప్రతీకలు.

నన్ను ఆశ్చర్యపరిచిన అంశం కథకుని కొడుకు రామకృష్ణ మతం మార్చుకొని, జూలీ అన్న అమ్మాయిని పెళ్ళి చేసుకొని, అతనికి అప్పులు మిగిల్చి విదేశాలకు వెళ్ళిపోవడం. ఈ అంశం కథలోకి నాకు తెలిసే ప్రవేశించిందో, తెలియకుండానే ప్రవేశించిందో ఇప్పుడు స్పష్టంగా చెప్పలేకుండా ఉన్నాను. కానీ ఈ సంఘటనకు మూలమైన అనుభవం మాత్రం నా మనసులో చాలాకాలంగా దాగి ఉంది.

అది గంజి కరువు కాలం. రాయలసీమ జీవితం దైన్యానికి మారుపేరుగా ఉంది. గడ్డిలేని పశువులు కబేళాలకు పోతే, తిండిలేని ప్రజలు అనేక ప్రాంతాలకు వలసపోయారు, పోతున్నారు. రెండు ఊళ్ళలోని ఆస్తులు తిండి పెట్టకపోవడం చేత మా కుటుంబం ఉన్న బంగారాన్ని, వెండిని అమ్ముకొని తింటూ గంజి కేంద్రానికి వెళ్ళకుండా పరువు దక్కించుకుంటోంది.

అప్పుడు (1952) నేను ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్నాను. మా క్లాసులో ఎస్తర్ అన్న క్రైస్తవ అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయినాన్న- పేరు జేమ్స్, అదే ఊళ్ళో సబ్‌రిజిస్ట్రార్‌గా ఉండేవారు. ఒకసారి వారిని మా పాఠశాలకు ఏదో సందర్భంలో పిలిచారు. వారికి నేను ఆహ్వానం చెప్పాను. వారు నన్ను ఎంతగానో మెచ్చుకొని ఒకసారి ఇంటికి రమ్మన్నారు. ఒక వారంరోజుల తరువాత చాలా జంకు జంకుగా వెళ్ళాను.

తినటానికేవో ఇచ్చి, "ఎస్.ఎస్.ఎల్.సి. తరువాత ఏం చేస్తావ్?" అని అడిగారు జేమ్స్‌గారు.

కరువు పరిస్థితులు అలాగే ఉంటే నా చదువు కొనసాగకపోవచ్చని చెప్పాను.

"నిన్ను నేను చదివిస్తాను. నువ్వు నా మాట విని కష్టపడి చదివితే జిల్లా కలెక్టరు వౌతావు," అన్నారు.

మరి రెండుసార్లు వాళ్ళింటికి వెళ్ళాక, 'వారి మాట వినడం,' అంటే ఏమిటో అర్థమైంది. నేను మతం మార్చుకొని క్రైస్తవుణ్ణి కావాలట. వారి కూతుర్ని పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకోవాలట. ఈ రెంటికీ నేను అంగీకరిస్తే నన్ను మదరాసు క్రిస్టియన్ కాలేజీకి పంపి చదివిస్తారట.

ఈ విషయాన్ని హైదర్ వలీ అన్న మిత్రుడితో చెప్పాను. అతడు మా ఊరివాడు. మా కుటుంబాన్ని బాగా ఎరిగినవాడు. అతడు బాగా చీవాట్లు పెట్టాడు.

అంతటితో నాకూ, జేమ్స్‌గారికీ మధ్య సంబంధం తెగిపోయింది. తరువాత కొన్ని నెలలకే వారు తమ ప్రాంతానికి (వారిది గుంటూరు జిల్లా అనుకొంటాను) బదిలీ అయి వెళ్ళిపోయారు.

ఈ సంఘటన నాకు ఎప్పుడో కానీ జ్ఞాపకం వచ్చేది కాదు.

ఈ సంఘటన రామకృష్ణ జూలీని పెళ్ళి చేసుకొని, నిర్దాక్షిణ్యంగా తల్లిదండ్రుల్ని వదిలిపెట్టి విదేశాలకు వెళ్ళిపోవడంగా మార్పు చెంది రానున్న *శిశిరం*లోకి ప్రవేశించింది. 'నేను జేమ్స్‌గారి మాట విని ఉంటే ఏమయ్యేది?' అన్న ఆలోచన నా మనసులో దాగి ఉండడం ఆ సంఘటనలో వచ్చిన మార్పుకూ, అది కథలోకి ప్రవేశించడానికీ కారణం కావచ్చు.

వెనుదిరిగి చూసుకొంటే ఈ సంఘటన కథలోని ప్రధాన ఇతివృత్తంతో అతకలేదనిపిస్తోంది. వాస్తవ సంఘటనకూ, కథలోని సంఘటనకూ మధ్య ఉన్న మార్పులో అసహ్యమూ, కసీ కనిపిస్తు

న్నాయి. అందుకే కాబోలు లారెన్స్ 'one sheds one's sickness in books' అన్నాడు. ఇది ఈ కథలో ఉన్న ప్రధాన లోపంగా అనిపిస్తోంది. ఇందులో రచయిత అనుభవం objectify కాలేదు.

ఈ కథలో శైలి- మరీ సోదెలా లేదు కానీ ఉండవలసినంత పదునుగా, సృజనాత్మకంగా లేదు. కవి తరువాత కథారచయితే భాషను సృజనాత్మకంగా ఉపయోగించవలసిన బాధ్యత ఉన్నవాడు. తన మీడియంను- సృజనాత్మకంగా ఉపయోగించలేని వాడు గొప్ప కళాకారుడు కాలేడు.

ఈ కథను రాయడం పూర్తవగానే ఇద్దరు మిత్రులకు చదివి వినిపించాను. వారిలో మొదటి మిత్రుడు కథనాన్ని మెచ్చుకొంటూనే కథ అంత నిరాశావాదంతో ముగియడం తనకు ఎంత మాత్రమూ నచ్చలేదన్నాడు. మరొక మిత్రుడు ఈ కథలో ఆశావాదం కృత్రిమంగా ఉంటుందన్నాడు. అతడు కథావస్తువే నిరాశావాదమన్నాడు.


రానున్న *శిశిరం* గొప్ప కథ అవునో కాదో తేల్చి చెప్పవలసింది మంచి పాఠకులు, విమర్శ కులు. కానీ ఒక విషయం మాత్రం సత్యం. అందులోని వస్తువు నాకు ఆత్మీకమైంది. అందుచేతనే కాబోలు అది కథగా రూపొందడానికి అంత అల్లరి పెట్టింది.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 1 ఫిబ్రవరి 1998*

# 20

## కలిసి బతకటం

### వి. రాజారామమోహన రావు



***వి. రాజారామమోహన రావు** 3 జనవరి 1946న పశ్చిమ గోదావరి జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'ఒక్క క్షణం' 17 డిసెంబర్ 1966 నాటి కృష్ణా పత్రికలో అచ్చయింది. 250 కథలు, 17 నవలలు రాశారు. వరద, తెల్లటి చీకటి, మలుపు కథాసంపుటాలు వెలువడ్డాయి. కొన్ని కథలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. 1970ల నాటి న్యూవేవ్ రచయితల్లో ముఖ్యులు. రేడియో, టీవీలకు రచనలు చేశారు. రైల్వేలో పదవీ విరమణ చేశారు.*

**చిరునామా**

*3-1-73/1/ఎ, రామ్‌శంకర్ నగర్,*
*రామాంతపూర్, హైదరాబాద్-500013.*
*Ph.: 93947 38805*

అనుకోని రాత్రి వాళ్లిద్దరికీ అది.

చాలారోజుల్నించీ తమని దిగలాగుతున్నట్టు బరువుగా అనిపించిన ఇద్దరి శరీరాలు తేలిక పడ్డాయి. స్వచ్ఛంగా, హాయిగా వున్న అలసటలోంచి కోలుకుంటున్నారు.

మంచం కూడా లేదా గదిలో. నేలమీద కిటికీ దగ్గరగా సుధ పరుచుకున్న పరుపది. ఆ పరుపు మీదే వున్నారు ఇద్దరూ.

సుధ వుంటున్న ఆ యింటికి రావటం అదే మొదటిసారి మోహన్‌కి. గది నాలుగువేపులా చూశాడు.

అక్కడికి వచ్చి కొన్ని గంటలు దాటినా అప్పటి వరకూ సమయం తెలియలేదు ఇద్దరికీ. చాలారోజుల తర్వాత లభించిన ఏకాంతం.

అతి తక్కువ సామాను వున్న ఆ చిన్నగది పెద్ద గదిలా కనిపిస్తోంది. ఆ గదిని ఆనుకుని ఉన్న మరో చిన్న నలుచదరపు చోటు వంటిల్లు. అక్కడ్నించి అదీ కనిపిస్తోంది.

నుదుటి మీద మెడ వంపులో పట్టిన చిరుచెమటకి చల్లటిగాలి తగుల్తోంది.

అంతవరకూ మమేకంగా గడిపిన మరోలోకం లోంచి మోహనే ముందు బైటపడ్డాడు. కొద్దిగా కళ్లు తెరిచి అతనికి దగ్గరగా పడుకున్న సుధ, యింకా ఆ లోకపు పొలిమేరల్లోనే వుంది.

ఇద్దరూ పనిచేస్తున్నది ఒక ఆఫీసులోనే... సుధ ఆదాయం ఎంతో మోహన్‌కి తెలుసు. ఆ ఆదాయంతో సుధ జీవితం చిన్న యింట్లో చిన్నగానే ఉంటుందని తెలుసు. కానీ అంతగా... అత్యవసరాలకి దిగువగా మరీ అంత సర్దుబాటుగా ఉంటుందని అనుకోలేదు. నెలకి పన్నెండు వందల జీతంతో మరే ఆధారమూ లేని నగర జీవితం అలాగే ఉంటుందన్న అనుభవం వుంది మోహన్‌కి.

అయినా, ఆ పరిస్థితి అతనికి చాలా దిగులనిపించింది. ఎన్నోసార్లు, ఎన్నో రకాలుగా బతిమాలి డబ్బు యివ్వబోతే సుధ తీసుకోకపోవటం గుర్తు రావటంతో మరింత బాధగా వుంది.

తన గుండెలకు దగ్గరగా వున్న సుధ జుట్టు మీదికి అప్రయత్నంగా వెళ్లాయి మోహన్ వేళ్లు.

అనునయంగా వున్న ఆ స్పర్శతో తనని పిలుస్తున్నట్టుగా తోచి నెమ్మదిగా తలెత్తి అతని వేపు చూసింది.

నిండుగా వుంది సుధ ముఖం. ఓ చిత్రమైన తడితో మెరుస్తున్నాయి ఆమె చూపులు. 'తృప్తిగా వున్న సుధకి తన దిగులు తెలుస్తుందేమో,' అన్నట్లు స్వల్పంగా వులిక్కిపడ్డాడు మోహన్. కొంచెం తత్తరపాటుతో, "టైమెంతయిందో...?" అన్నాడు.

"ఏమో చూడాలి..." అంది సుధ.

ఒంటి మీద బట్టలు కప్పుకుని, పూర్తిగా ఆ గదిలోకి వచ్చేసినట్టు నెమ్మదిగా లేచి వాచీ అందుకుంది.

"పన్నెండవుతోంది..." అంది వాచీ మోహన్‌కి అందిస్తూ.

అనవసరమే అయినా, అందుకున్న వాచీలోకి చూశాడు మోహన్.

ఆ సమయంలో మోహన్ తెచ్చిన టైము ప్రసక్తి అసంకల్పమే అయినా సుధకి అనుమానం కలిగింది. వాచీ వేపే చూస్తున్న మోహన్‌ని ఆ అనుమానంతోటే... "ఇప్పుడు ఇంటికి వెళ్తావా?" అనడిగింది.

వెంటనే మోహన్ సమాధానం చెప్పలేదు. అంతవరకూ మోహన్‌లో ఏ ఆలోచనా లేదు. కానీ సుధ అడిగాక, "ఏం చెయ్యమంటావు?" అన్నాడు.

అక్కడ... మోహన్ ఇంట్లో అతని అక్క లత ఒంటరిగా వుంటుందని సుధకి తెలుసు. వయసులో మోహన్ కన్నా ఒక్క సంవత్సరమే పెద్దది.

తనవేపే చూస్తున్న మోహన్‌ని చూస్తూ, "ఇంట్లో అక్కయ్య ఒంటరిగా వుంటుందనేగా వెళ్లటం..." అంది సుధ.

"అందుకనే కాదు... తెల్లారేవరకూ వుండి, మీ యింటివాళ్ల కళ్లల్లో పడితే... నీకేమేనా ఇబ్బంది..."

మోహన్ మాట మూర్తి కాకముందే సుధ ఆలోచన అటువేపు మళ్లింది.

సిటీలో తనిప్పటికి మూడు ఇళ్లు మారింది. ఆ మూడు ఇళ్లలోనూ మూడు రకాల హింస అనుభవించింది. ఈ ఇంట్లోకి వచ్చిం దగ్గర నుంచీ మనసు తేటగా వుంది. ఇంటాయన రంగనాథ రావుగారు ఎవరితోటి మాట్లాడే రకం కాదు. ఏం మాట్లాడినా ఎక్కువగా ఆయన భార్య సీతమ్మగారి తోటే.

సీతమ్మగారు కలివిడిగానే మాట్లాడుతుంది. ఆ మాటలు సూటిగా వుంటాయి.

వాళ్లతో ఆ యింటి నీడన జీవితం మరీ వాళ్ల కన్నకూతురిలా కాకపోయినా, మమతున్న అయినవాళ్ల దగ్గర ఉన్నట్టుంది.

తెల్లారి ఆ భార్యాభర్తా తనతో మోహన్‌ని చూస్తే... వాళ్ల ప్రవర్తన ఎలా ఉంటుందో?

గొడవ చేసి రభస చెయ్యకపోవచ్చు. కానీ ఇల్లు ఖాళీ చెయ్యమనొచ్చు. అంటే మళ్లీ ఏ రకం హింసలోకి వెళ్లాలో?

పోనీ మోహన్‌ని వెళ్లనిస్తే...

మోహన్‌ని పంపించాలని లేదు. రోజూ అతనితో ఆఫీసులో, రెస్టారెంట్‌లో, బజార్లలో చాలాసేపు కలిసి గడుపుతుంది. కానీ ఇలా దగ్గరగా, ఒకరికి ఒకరుగా ఇంటి నీడన గడిపే సమయం... యీ నిండు... తను ఒంటరిది అన్న ఆలోచనని ఎంతో దూరంగా వుంచే శారీరకానుభవం... ఏ బరువూ లేనట్టు తేలిగ్గా అనిపించే హాయి... ఈ సమయం నిజమైన జీవితంలా వుంది.

అయినా పంపటం ఎందుకు? ఈపాటికే మోహన్ అలికిడి ఇంటివాళ్లకి తెలియకుండా వుంటుందా? తెలిసే వుంటుంది.

తెలిసినా, తెలియకపోయినా... యిప్పుడు మోహన్ వెళ్లిపోతే... తెల్లారేవరకూ తన పరిస్థితి... అనుభవించిన హాయి కన్నా, ఒంటరి బతుకన్న బాధ ఎక్కువైతే... ఇంక ఎక్కువగా ఆలోచనని సాగనివ్వదలచుకోలేదు.

"ఇప్పుడు వెళ్లద్దు మోహన్... ఉండిపో..." అంది సుధ స్థిరంగా.

సుధ గొంతులో సందిగ్ధం లేదు. కానీ మోహన్‌కే సందేహంగా వుంది. సందేహం ఉండటమా, వెళ్లటమా అని కాదు. అసలు మొత్తం విషయం మీద, సుధకి తను చేస్తున్నదేమిటి? ఆమెతో కలిసి గడిపే సమయంలో ఆనందం యిస్తున్నాడు. కానీ సుధ జీవితపు లోటు విషయంలో ఏం చెయ్యలేకపోతున్నాడు. ఆమె జీవితపు స్థాయిని మెరుగుపరచలేకపోతున్నాడు.

అనుకూలంగా లేని పరిస్థితుల ఇబ్బంది తనకీ, సుధకీ కూడా తెలుసు. కానీ ఎంతకాలం యిలా?

తమిద్దరికీ ఒకరికొకరు కావాలి. ఎప్పుడో ఇలా ఒక రాత్రో, మరో గంటో సంతోషాన్ని కొలుచుకోటం కాకుండా యధేచ్ఛగా కలిసి బతికే జీవితం కావాలి. ఎలా? లతకి రకరకాలుగా చెప్పి, ఎన్ని రకాలుగా సూచనలు చేసి చాలాసార్లు ప్రయత్నించాడు. వయసులో పెద్దగా తేడా లేకపోయినా తనకి అక్క అవటం వల్ల మరీ అంత చొరవగా చెప్పలేకపోతున్నాడు.

లత కాంప్లెక్స్ తనకి తెలుసు. ఆమె జీవితాన్ని ఆమే నిర్ణయించుకోవాలి. ముప్పై ఆరేళ్ల వయసులో సంబంధాలు చూసినా పెళ్లి కుదరటం లేదు. తమ్ముడే తనకి భర్తని చూసి పెట్టాలని. ఇంట్లోనే మగ్గిపోకుండా, ఇల్లు దాటే ఆలోచనకి ఆమె ఆస్కారం ఇవ్వాలి. తనకి తను స్వతంత్రంగా నిలదొక్కుకుని, ఆమె యిష్టాల్ని ఆమె నిలబెట్టుకోవాలి. కానీ లతలో ఆ ఆలోచనే రావటం లేదు. అంతేకాదు, తమ జీవితాల్లో ఏ మార్పు ఆమెకి ఇష్టంలేదు. పెళ్లి అన్న ఆలోచనకే తప్ప ఉద్యోగం, ఆ తర్వాత స్వతంత్ర జీవితం అన్న వాటికి ఆమె సుముఖం కాదు.

కేవలం లత కోసమే సుధని తనింటికి తీసుకెళ్లలేకపోతున్నాడు. సుధా రాలేకపోతోంది.

సుధని తమ ఇంటికి తీసుకెళ్లిన మొదటినాడే, ఆ కొద్దిసేపే ముగ్గురికీ చాలా అసౌకర్యంగా అనిపించింది. ఆ తర్వాత మరోసారి ప్రయత్నం చేశాక సుధే ఆ యింటికి రానంది. మొరటుగానో, మూర్ఖంగానో సుఖించగల తత్వం యిద్దరికీ లేదు. అందుకే ఇద్దరికీ కలిసి మాట్లాడుకోటానికేనా బజార్లు, రెస్టారెంట్లు శరణ్యం అయ్యాయి.

కొద్ది చాటు దొరికితే చాలు ఒకరినొకరు స్పృశించాలని ఆతృత. శరీరాల తాలూకు బరువుని దాటాలన్న తపన.

చాలారోజుల నిగ్రహం తర్వాత ఓరాత్రి హోటల్ రూముకు వెళ్లారు. పైకి ఒకరికొకరు చెప్పు కోకపోయినా ఆ రాత్రి రకరకాల భయం మనసులో మెదిలి చాలాసార్లు యిద్దరి శరీరాల్ని హాయిగా కదలనివ్వకుండా చేసింది.

ఇవాళ కూడా యిలా గడపగలుగుతామని యిద్దరూ అనుకోలేదు. సినిమా చూసి రెస్టారెంట్ లో భోజనం చేశాక మరో పావుగంట గడిచినా ఒకళ్లనొకళ్లు వదలాలనిపించలేదు. మసక వెలుతుర్లో పరస్పర కరస్పర్శే ఎంతో ఉద్విగ్నంగా వుంది. కొత్త శరీరాలేం కాదు... కొత్త అనుభవమేం కాదు. అయినా ఒకటిగా గడపాలన్న కోరిక తీవ్రంగా ఇద్దర్నీ ఇబ్బంది పెడుతోంది.

"పోనీ మా యింటికే వెడదామా?" అని అందుకే అడిగాడు.

ఆలోచించే... అనాలోచితంగానే అందో... "వొద్దు రా మా యింటికి వెడదాం..." అంది సుధ. అలా అనటమేకాదు, వెంటనే తన చేతిని అందుకుని లేచి నిలబడింది.

ఉద్వేగం నిండిన మత్తుతో యిద్దరూ యిల్లు చేరారు. అనుకోనిదైనా... యీ రాత్రి... యిలా గడుస్తోంది. కానీ తెల్లారాక ఇంటివాళ్ల వల్ల సుధకి ఇబ్బంది కలుగుతుందా?

ఏ కదలికా లేని మోహన్ దగ్గరగా సుధే జరిగింది. జరిగి, "మరీ ఆలోచించి బుర్ర పాడు చేసుకోకు. యీ రాత్రికి హాయిగా వుందాం. తర్వాత సంగతి తర్వాత..." అంది.

*

తెల్లారాక తాపీగా, హాయిగా నిద్దర లేచారు యిద్దరూ. కాఫీ తాగాక మోహన్ వెడుతుంటే సాగనంపటానికి గేటుదాకా వెళ్లింది సుధ.

రోజూ ఆపాటికి అటూయిటూ తిరుగుతూ ఇంటావిడ సీతమ్మగారు, సుధ ఓ అరగంట కబుర్లేనా చెప్పుకుంటారు.

ఏం జరిగితే అది జరగనీ అన్న తెగింపు మనసులో వున్నా కొంచెం బెరుగ్గా కూడా వుంది. సుధకి. మోహన్ కూడా వున్నప్పుడు వున్నట్టుగా లేదు మనసు. కలవరం మనసుని మరింతగా ఆవరించక ముందే సీతమ్మగారి ముందు పడటం మంచిదనిపించింది సుధకి.

నెమ్మదిగా వాళ్ల వంటింటి గుమ్మం దగ్గరకి వెళ్లింది.

"రా సుధ... లోపలికి రా..." అంది సీతమ్మగారు తల తిప్పకుండానే.

లోపలికి నడిచింది సుధ.

చేస్తున్న పని ఆపి...సుధ వేపు చూస్తూ... "అతను వెళ్లిపోయాడా?" అనడిగింది.

అవునన్నట్టుగా తలూపింది సుధ.

"నాకూ, మీ బాబయ్యగారికి అతన్ని పరిచయం చేస్తే బావుండేదేమో...?" అంది ఆవిడ.

సుధ పరీక్షగా ఆవిడ ముఖంలోకి చూసింది. ఆవిడ ముఖంలోగానీ, చూపులోగాని, ఏ వ్యంగ్యం కనిపించలేదు. ఎప్పటిలాగే వుంది ఆవిడ.

సుధకి ఆశ్చర్యంగా వుంది. మనసు లోలోపల సంతోషం ఉబుకుతోంది.

పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేకపోయినా, ఇలా వుంటుందని మాత్రం అనుకో లేదు.

'ఇది కాదు. మోహన్ మా ఆఫీసులో... నేనూ, మోహన్..." అంటూ ఉద్విగ్నంగా ఏదో చెప్పబోయి తత్తరపడింది సుధ.

''చెపుదువుగానీ, నెమ్మదిగా చెపుదువుగాని. కంగారేం లేదు...'' అంది సీతమ్మగారు చిరునవ్వుతో.

సుధ మాటలన్నీ ఆగిపోయాయి... 'జీవితానికి ఇలాంటి అవకాశం కూడా వుంటుందా? ఏ వ్యక్తైనా... కొంచెం భిన్నమైన ప్రవర్తనతో మరో మనిషి కలవరాన్ని అంత తేలిగ్గా తుడిచెయ్యగలుగుతారా... మనుషులు హాయిగా బతకటం యింత తేలికా...''

సుధకి తనకేం జరుగుతోందో తనకి తెలియనట్టుగా వుంది. తను మొత్తంగా కరిగిపోతున్నట్టుగా వుంది. సీతమ్మగారి చిరునవ్వు... గొంతు తన ఒంటరి జీవితాన్ని సఖ్యంతో నింపేసినట్టుగా వుంది.

అంతకుముందే... మోహన్‌కి కూడా చెప్పని కొన్ని తన విషయాలు ఆవిడకి చెప్పుకుంది సుధ. ఇప్పుడు మరీ దగ్గరగా మరిన్ని విషయాలు చెప్పుకుంది.

సుధ చెప్పుకున్నవన్నీ శ్రద్ధగా వింది సీతమ్మగారు. విన్నాక, ''సుధా... ఒంటరిగా బ్రతికే ఆడపిల్లని విచ్చలవిడిగా ఉండమనటం నా వుద్దేశం కాదు. నీకు తెలుసుగా మాకు ముగ్గురు ఆడపిల్లలు... వాళ్ల జీవితాల్లోనూ రకరకాల ఒడిదుడుకులు వచ్చాయి. కొన్నింటిని నేనూ ఆయన సరిగ్గానే సర్దుబాటు చేశాం... మరికొన్ని వాళ్లే సర్దుబాటు చేసుకున్నారు.

''నైతికం, అనైతికం సరసన అవసరం అన్నది కూడా యీనాటి స్త్రీ జీవితం. నీకు మోహన్ మీది నమ్మకం వుందని అర్థమవుతూనే వుంది. కాలమే కొన్నింటిని చక్కపరుస్తుంది.కానీ అప్పటిదాకా జీవితం మరింత జటిలం కాకుండా నువ్వు తీసుకోగలిగిన జాగ్రత్తలన్నీ తీసుకో... మా యింట్లో నువ్వు సుఖంగా, ధైర్యంగా, హాయిగా ఉండాలి... ఇబ్బందిగా కాదు...''

సుధ భుజం మీద ఆవిడ చేతి స్పర్శ. ముఖంలో చిరునవ్వు. అరవై ఆరేళ్ల సీతమ్మగారి స్త్రీ సౌందర్యంలో సుధ ఒదిగిపోయింది.

*'సరికొత్త కథ' కథాసంకలనం, 1995*

## నేపథ్యం

చోటు కోసం తపన

# కలిసి బతకటం

***ఏ సమస్యా సమూలంగా తొలిగిపోదు. తోటివారి సరైన అవగాహన వల్ల, ఆరోగ్యవంతమైన సహకారం వల్ల కొంత వెసులుబాటు లభిస్తుంది. శృంగార సమస్యల్ని చర్చించటమే ఆంక్షగా మన నైతికత ఓ 'టాబూ' లా వుంది. మనిషి, మరో మనిషికి చేయూత నివ్వటం, జీవితాన్ని మెరుగుపరచటం కూడా నైతికతేనని నా ఉద్దేశం.***

నాకు తెలిసి గతంలో, అమెరికన్ కథారచయిత పాల్ గేలికో, తెలుగులో వాకాటి పాండురంగారావుగారు కథానేపథ్యాలు రాశారు. ఈమధ్యే తన కథాసంపుటి, ఇతర రచనలకి నాయుని కృష్ణమూర్తి చాలా సమర్థతతో రచనా నేపథ్యం రాశాడు. కృష్ణ మూర్తి రచనా నేపథ్యాన్ని, తన సాహితీ ఆత్మకథలా తీర్చిదిద్దటం ప్రత్యేకంగా నాకు నచ్చింది. రచనల్లో చెప్పలేని ఎన్నో విషయాల్ని నేపథ్యంలో చెప్పే వీలుంది.

ఒక రచనకి ఒక వస్తువో, విషయమో, సంఘటనో నేపథ్యంగా తోచినా, వాటితోపాటు జీవితంలో ముక్కలు ముక్కలుగా ఉండే మరెన్నో అనుభవాలు ఆ నేపథ్యంలో భాగమేనని నా ఉద్దేశం. వీటిని ప్రత్యక్ష, పరోక్ష భాగాలుగా నేను భావి స్తాను. నా వ్యక్తిత్వం ఓ రూపుదాల్చిన కాలం ఏలూరులో గడిచింది. 1956, అప్పటికి నా వయసు పదేళ్లు. ఆడ, మగ తేడా గుర్తుగా తెలుస్తున్న ఆరంభదశ. అప్పటి నుంచీ 1965లో నేను హైదరాబాద్ వచ్చేసింతర్వాత కలిగిన ఎన్నో అనుభవాలు నా ఈ *కలిసి బతకటం* కథకి నేపథ్యం.

ఏలూరులో ప్రతి సంవత్సరం సయ్యద్ బాజీ ఉరుసు జరిగేది. ఆ స్థలం మేం చదువుకున్న మునిసిపల్ హైస్కూల్‌కి దగ్గర. హిందూ ముస్లిం బేధం ఉండేది కాదు. మొక్కుగా మేం పిల్లలందరం బెల్లబ్బూంది తీసికెళ్లి చదివించేవాళ్లం. ఆ ఉరుసు మసీదు ముందు జరిగేది. సన్నటి సందు, విపరీతమైన రద్దీ. ఆడవాళ్ల గుండెల్ని తడమటానికి, వొళ్లు వొళ్లు రాసుకోటానికి చాలామంది యువకులు

వచ్చేవాళ్లు. ఇది తెలిసినా ఆడవాళ్లు రాకుండా ఉండేవారు కాదు. ఆరోజుల్లో అదొక అనుభవంగా భావించేవాళ్లు. ఇదే తంతు కొన్ని జాతర్లలో, అమ్మవారి ఉత్సవాల్లో నేను చూశాను. నేను చూసిన వాటికన్నా, మా ఇళ్లల్లో, ఇరుగుపొరుగు ఇళ్లల్లో మధ్యాన్నం ఆడవాళ్లు చెప్పుకునే కాలక్షేపం కబుర్లలో చాలా శృంగార సంబంధ విషయాలు నా చెవినపడ్డాయి. వీళ్లకి వాళ్లతో సంబంధం, వాళ్లకి వీళ్లతో... చాటుగా ఇలా చేస్తారు... ఇవీ ఆ కబుర్ల సారం. ఆడవాళ్ల గుట్టు, బలహీనత ఆడవాళ్లే బైటపెట్టడం విచిత్రం. ఆ కబుర్లలో ఎన్నో ఛాయలుండేవి. కానీ సహానుభూతి, సక్రమ సర్దుబాటు చాలా చాలా తక్కువ.

1965లో నేను వచ్చిన హైదరాబాద్ ఇప్పటితో పోలిస్తే చాలా చిన్నది. జనాభా కూడా చాలా చాలా తక్కువ. అయినా నివాసపు సమస్యలు తీవ్రంగానే వుండేవి. సామాన్యస్థాయి క్రింద జీవనం సాగించే వాడికి అది మరింత జటిల సమస్య. ఇరుకు గదుల్లో మొత్తం కుటుంబ సభ్యులందరూ ఉండేవాళ్లు. కొత్తగా పెళ్లయిన జంటల కోసం గోనెగుడ్డల్తో తెరలు కట్టటం చూశా. అంతేకాక, చిన్నతనం నుంచి రాత్రిళ్లు చాలాసేపు బైట గడిపే నా తత్త్వం, నేను చేసిన రైల్వే ఉద్యోగం వీథుల్లో, తదితర ప్రాంతాల్లోని సామాన్యుల రాత్రి జీవితం చూడటానికి ఆస్కారమైంది. జీవనసుఖం, శరీర అవసరం కోసం ఇంత చోటు, కొంత చాటు లేకపోవటం ఎందరి జీవితాల్లోనో ఎన్నోరకాల మానసిక వేదనలు, క్రోధాలు కలిగించటం చూశాను. చాలామంది మాట్లాడటానికే చొరవ చూపించని సమస్య అది. రోడ్డు మీదైనా సరే, ఊరవతలైనా సరే- ఓ పది నిముషాలు చీకటిచాటు దొరికితే చాలనిపించే మొండి బడుగు బతుకులు చాలా నా కంట పడ్డాయి. బడుగు జీవితాల్లోని ఈ విషాదం మీద నా కథారచన తొలి రోజుల్లో మనసుకు మరోవేపు, వేగం, మనిషిగా నిరశన లాంటి చాలా కథలు రాశాను. చాలా ఏళ్ల తర్వాత తిరిగి 'చోటు' అన్న ఆ సమస్త ఛాయతో రాసిన కథ *కలిసి బతకటం*.

ఒక స్త్రీ, ఒక పురుషుడి శారీరక కలయిక చట్టరీత్యా నేరం కాదు. మరొకరి ప్రైవసీకి భంగం కలిగించటం నేరం. కానీ మన దగ్గర అనైతికం అన్న ముద్రతోటే దీన్ని తప్పుగా చూడటం, ఎన్నోరకాల ఆంక్షలు ఏర్పట్టం జరిగింది. గతంలోని కట్టుబాటు ఈనాటి బతుకులో బరువుగా మారింది. ఆ బరువు చాలామంది జీవితాల్ని మరింత కష్టతరం చేసింది. అలా నా దృష్టికి వచ్చిన కష్టాల్ని కొన్ని కథలుగా రాశాను.

అనాదిగా వున్న వృత్తి వేశ్యావృత్తి. ఇన్ని వందల ఏళ్లు గడిచినా, దాన్ని ఎవరూ ఆపలేక పోయారు. వాళ్ల మీద ఎన్నోరకాల హింస. దీనినే అనాది హింస కథగా రాస్తూ... ఆ వీధి వ్యభిచారి న్యూనతతో పాటు, తన వృత్తికి తగిన చోటులేని దైన్యంతో, శరీరం దుమ్ములో, రాళ్లల్లో పడే హింస గురించి రాశాను. ఎవరూ ఆపలేని ఈ వృత్తిని చట్టబద్ధం చేస్తే వాళ్లకి కొన్ని హక్కులు దక్కుతాయి. కొన్ని సౌకర్యాలు లభిస్తాయి. ఎంతో కొంత దోపిడీ, దౌర్జన్యం, న్యూనతా తగ్గుతాయి. కానీ ఈ లీగలైజేషన్‌ని వ్యతిరేకిస్తున్న నైతికవాదులు, మేధావులు వున్నారు. వీళ్లల్లో స్త్రీలు పెద్ద సంఖ్యలో వున్నారు. అలా చట్టబద్ధత కలిగిస్తే ఈ వృత్తిని సమర్థించినట్టవుతుందని వీరి వాదన. కొన్ని దేశాల్లో ఇలా చేసిన తర్వాత సెక్సువల్ క్రైమ్ రేట్ పెరిగిందని మరికొందరి అభిప్రాయం. వీటిని లోతుగా పరిశీలించి, ఏదో రకంగా ఆ వర్గంవారికి మేలు జరిగే చర్యలేవీ (ప్రభుత్వపరంగా) ఎన్ని దశాబ్దాలు గడిచినా ఏమాత్రం జరగటంలేదు. ప్రముఖంగా మన రాష్ట్రంలో ఈ వృత్తి ప్రతి ఏటా పెరుగుతూ, వాళ్ల జీవితాలు మరింతగా దిగజారుతూనే వున్నాయి. నిస్సందేహంగా ఇది అమానుష స్థితి. ఈ వర్గంవారిలో కూడా వాళ్ల సంపాదనలో ఎక్కువభాగం ఖర్చయ్యేది నివాసానికి.

పైగా అందరికీ అద్దెకి ఇల్లు దొరికినట్టు వీళ్లకి దొరకదు. ఇన్ని కారణాలుగా నాలో ఈ సమస్య బాగా ఇంకిపోయింది.

కట్టుబాట్లకి వ్యతిరేకంగా ఏమాత్రం స్వతంత్రంగా బతకాలన్నా ఈ రకం నివాసం కోసం అబద్ధాలు ఆడాలి. తప్పుగా, న్యూనతగా తలదించుకోవాలి. దీనికి కారణం తోటివారి ఆదరణ లేకపోవటం. ముఖ్యంగా స్త్రీకి, స్త్రీ అండగా నిలబడే ఔదార్యం, తత్వం గొప్ప ఓదార్పే కాక, చాలా వరకు పరిష్కారమని ఓ ఆశ. ఆ ఆశే *కలిసి బతకటం*. ఈ కథలో సుధ, మోహన్‌లకి ప్లేస్ ప్రాబ్లెం. యువతులే కాదు, మధ్యవయసు ఆడవాళ్లు కూడా తన మనిషిని కలుసుకోవడానికి బస్టాప్‌లలో, రెస్టారెంట్లలో, కొన్ని సందర్భాలలో రోడ్డు మీద ఒంటరిగా నిలబడి, పదిమంది పదిరకాల చూపులు భరిస్తూ నానా బాధపడటం నాకు తెలుసు. ఇన్ని బాధలూ, మనస్తాపం తర్వాత తనవారిని కలుసుకుని మరీ అవసరంగా గడిపి, అసంతృప్తిగా, కంగారుగా, ఏదో గిల్ట్‌తో తిరిగి వెనక్కి రావటం జరుగుతుంది. కలయిక తర్వాత ఎక్కువ శాతం మంది చేసే పని వాళ్ల వాళ్ల ఇళ్లకి వెళ్లటం. వ్యాపారపరమైన శృంగారంలో అయితే, ఇది పెద్ద విషయంగా చూడకపోవచ్చు. కానీ, అమృత తుల్యంగా శరీరాలు మమేకమయిన తర్వాత ఏ రకమయిన మానసిక, శారీరక క్షోభ అయినా దురదృష్టమే. ఈ పరిస్థితి ఒక్క సుధ, మోహన్‌లదే కాదు, వేలు లక్షల సంఖ్యలో ఉన్న జంటలది. ఈ కథలో సుధని అటువంటి క్షోభ నుంచి రక్షించిన వ్యక్తి సీతమ్మగారు. ఆవిడ అవగాహన, స్త్రీత్వం ఉదాత్తమయినవి. నాకు ఈ కథలో వీరిద్దరి కన్నా ఆవిడే ముఖ్యమయినది. కథకి ఆవిడే ముఖ్యం.

ఏ సమస్యా సమూలంగా తొలిగిపోదు. తోటివారి సరైన అవగాహన వల్ల, ఆరోగ్యవంతమైన సహకారం వల్ల కొంత వెసులుబాటు లభిస్తుంది. శృంగార సమస్యల్ని చర్చించటమే ఆంక్షగా మన నైతికత ఓ 'టాబూ' లా వుంది. మనిషి, మరో మనిషికి చేయూతనివ్వటం, జీవితాన్ని మెరుగు పరచటం కూడా నైతికతేనని నా ఉద్దేశం.

ఏటికి ఎదురీదుతున్నట్టు, నేటి సమాజంలో జీవితానికి ఎదురీదుతున్న స్త్రీలు ఎందరో వున్నారు. వారి జీవితాలు మరింత ప్రశాంతంగా, సుఖవంతంగా, నాణ్యవంతంగా మారటానికి రచన నిజాయితీగా తోడ్పడాలన్నది నా కోరిక.


*'కలిసి బతకటం' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

*1 డిసెంబర్ 2012*

21

# స్పర్శ

## వివినమూర్తి



*వివినమూర్తి 21 మే 1948న తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'పరిష్కారం లేని సమస్య' 19 నవంబర్ 1971 ఆంధ్రజ్యోతిలో ప్రకాశవాణి కలం పేరుతో అచ్చయింది. 130 కథలు, 12 నవలలు, కొన్ని సాహితీ వ్యాసాలు, అనువాద రచనలు చేశారు. 7 కథాసంపుటాలు ప్రచురించారు. భారతీయ నౌకా దళంలో పనిచేసి, పదవీ విరమణ చేశారు. కొన్ని కథలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి.*

**చిరునామా**

*27, ఇన్‌చెరా, 6-ఇ మెయిన్, 15 క్రాస్, వెస్ట్ ఆఫ్ కార్డ్ రోడ్, సెకండ్ స్ట్రీట్, సెకండ్ ఫేజ్, బెంగుళూరు-560086*

*Ph.: 094490 57022*

"నీతో జీవితం- ఎంత సెక్యూర్డ్‌గా ఉంటుందో," అన్నాడు సుబ్రావ్ తన ఆలోచనల నుంచి బయట పడుతూ.

వినబడింది. ఆ తరువాత మాట్లాడుతున్నవీ విన బడుతున్నాయి. నా జవాబును ఆశించలేదో- ఎవాయిడ్ చేయాలనో మాట్లాడుకుంటూ పోతున్నాడు. కారు సీటు మీద వెనక్కి తల జారేసి కళ్లు మూసు కున్నాను.

"నువ్వేం చెప్పినా నేను వింటాను. నేను చెప్పితే నువ్వూ వింటావు. అభిప్రాయాలలో తేడా వచ్చిందనుకో- మనం ట్రూ డెమొక్రాట్స్. మాటలతో తేల్చుకుంటాం. ఒక ర్నొకరం ఫోర్స్ చెయ్యం. నువ్వు నన్ను ఎమ్-సీ-పీ- అంటే నేను తేలిగ్గా నవ్వుతాను. నిన్ను నేను ఫెమినిస్టు దయ్యం అంటే నువ్వు పట్టించుకోవు. మనం మాటల్ని పట్టించు కోం- ఈరోజు విషయమే తీసుకో- ఎంత అందంగా హేండిల్ చేశాం. పొసెసివ్‌నెస్ మంచిది కాదు సునీ."

'నో! ఇది పొసెసివ్‌నెస్ కాదు- నీకు తెలుసు,' అని అరవాలనిపించింది. నేను రియాక్టవదలుచుకోలేదు.

"కమాన్ సునీ," అన్నాడు నావైపు తిరిగి.

"ఏంటి బాబూ! నువ్వు నన్నింత ఎత్తేస్తున్నావ్."

"అయ్ రియలీ మీనిట్," అన్నాడు నా గొంతులో మార్పును పట్టించుకోకుండా.

''అఫ్‌కోర్స్- అఫ్‌కోర్స్. ఏనుగు బొమ్మని వేసి పేరు చెప్పనక్కరలేదు.''

సుబ్రావ్ మాట్లాడుతున్నాడు మళ్లీ. నా మూడ్ మార్చటానికి ప్రయత్నం. బహుశా తన మూడ్ సరి చేసుకుంటున్నాడేమో- మరీ దూరం చేసుకుంటున్నాడేమో- సుబ్రావ్‌కి ఎందుకింత బిట్టర్‌నెస్! మనిషికి దూరమై ఆ శూన్యాన్ని భరించటం కష్టం!

ఆలోచనలను వదిలించుకుందామని బయటకు చూడసాగాను.

రాయలసీమ గురించి చాలా విన్నాను. విన్నదాన్ని వెరిఫై చేసుకుందామని ప్రయత్నం. మనసు లగ్నం కావటం లేదు. కుస్తీపడుతున్నాను.

పదకొండు దాటింది. జూన్ నెలయినా చల్లగా ఉంది. బాంబేలో వర్షాలు మొదలయి పోయాయి. బాంబే బ్రతుకుకి తమాషా బ్రేక్స్ వర్షాలు.

మదనపల్లి దగ్గరవుతోంది. చెట్ల గుంపుల నుంచి ఒక్కసారిగా బయటపడింది పట్నం. ఓ జంక్షన్‌లో అపాడు సుబ్రావ్.

కందులపల్లి గురించి కనుక్కోవాలిట. కాఫీ తాగాలిట.

''ఇంతకన్న శుభ్రమయిన హోటల్ దొరకదా నీకు?''

''ఇదేం బాంబే కాదు- జంక్షన్ కాస్త హడావుడిగా ఉందంటే- యిదే యిక్కడ 'ఓబరాయ్' అయుంటుంది,'' అంటూ హోటల్ వేపు దారితీశాడు.

కాష్ కౌంటర్ దగ్గరకు వెళ్లి, ''కందులపల్లికి ఎలా పోవాలి?'' అన్నాడు సుబ్రావ్.

నలభై రెండేళ్లున్నా... బాబ్డ్ హెయిర్, స్లీవ్‌లెస్ జాకెట్, మెయిన్‌టైన్ చేస్తున్న శరీరం... వయసును దాచుతున్నాయి.

అతని చూపుల్లో ఎప్రిసియేషన్ లేదు- సస్పిషన్ ఉంది. మా సుబ్రావ్ నన్ను పట్టుకొచ్చాడను కుంటున్నాడా- కొంపదీసి.

చికాకూ... నవ్వూ... వచ్చాయి.

అతను చూపు సుబ్రావ్ మీదకు మరలించాడు. ఏముంది సుబ్రావ్‌లో...?

బట్టతల. ఉన్నదాన్ని నల్లగా ఉంచగలడు గాని... ఊడిన జుత్తుని ఎక్కడ నుంచి తీసుకు వస్తాడు? మొహం... నున్నగా... బాగుంటుంది. మీసం ఉండదు. నలబై అయిదేళ్లు కనబడనీడు. టై, కోటూ వేసుకోలేదు. వదులు బొమ్మల షర్ట్. లోపల బనీను కూడా లేదు. రాయిలాంటి ఒంటి స్వరూపం... గుండెల మీద జుత్తు... చొక్కాలోంచి తొంగి చూస్తున్నాయి.

నేనతన్ని ప్రేమించాను. ప్రేమిస్తాను. అతనికి... వాడి మీదున్న హక్కుని... ఎలా కాదన గలను?

''ఎవురింటికి పోవల్ల?'' అన్నాడు.

''మోహన్రెడ్డి యింటికి-'' అన్నాడు సుబ్రావ్.

అయామ్ ష్యూర్! అతని కళ్లు పెద్దవయ్యాయి. ''మోహన్రెడ్డి యింటికి పోవల్ల,'' అంటూ బయటకు చూశాడు. మా మారుతీవాన్ దుమ్ము కొట్టుకొని దర్శనం యిస్తోంది. ఈ ఊళ్లో మారుతీ ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్‌ఉందో లేదో? లేకపోతే- సుబ్రావ్ తుడిపించనయినా తుడిపించడు.

''అవునవును మోహన్రెడ్డే-'' అన్నాడు సుబ్రావ్. గొంతులో 'హుషారు' ఉంది.

ఎందుకుండదూ?

బయల్దేరిన దగ్గర నుంచి రెడ్డి స్మరణే. మోహన్రెడ్డీ, తనూ కాకినాడలో యింజనీరింగ్ కాలేజీలో చదివారుట. చాలా సన్నిహితంగా తిరిగేరుట. విడుదలయిన ప్రతి సినిమా ఫస్ట్ షో చూడాల్సినదేనట. చొల్లంగి అమావాస్య తీర్థం, దసరా నవరాత్రులూ, గెద్దనాపల్లి నాటకపోటీలూ, రెడ్డి పెళ్లికి కాకినాడ నుంచి స్నేహితులంతా కలిసి రావటం, పెళ్లికి జనరేటర్ పెట్టి లైట్లు వెలిగిం

చడం, ఓ మనిషికి షాక్ కొట్టడం, గందరగోళం, మదనపల్లె వచ్చి సినిమాలు చూడటం, వేరుసెనగ పచ్చడీ... రాగిరొట్టెల్లో పొట్టేలు మాంసం- ఆ వూళ్లల్లో మర్యాదలు...

సుబ్రావ్‌ది బ్రహ్మాండమైన జ్ఞాపకశక్తి. కథల్లా చెపుతాడు. ప్రయాణం అంతా ఆ కథల్తోనే. అన్ని బాధలూ మరిచిపోయాడు- మావాడు.

"నువ్వు మోహన్రెడ్డిని సూడల్ల," అతను తాపీగా అదోలా అన్నాడు.

"అవునవును," అన్నాడు సుబ్రావ్. తెలిసిపోతోంది. సహనం తెచ్చుకుంటున్నాడు.

"మందే వూరో...?"

"బాంబే," అన్నాడు సుబ్రావ్. మామూలుగా అనలేదు. బాంబే అనేసరికి అవతలి మనిషి అదిరిపోయి లేచి నిలబడి, గౌరవించేస్తాడన్న ధీమా.

అతను అదిరినట్టున్నాడు కాని లేచి నిలబడలేదు.

మరోసారి పరిశీలనగా చూసి, "ముందుగా కాఫీ తాగండి సార్," అంటూ సర్వర్‌ని పిలిచి, మూలగా వున్న ఒక టేబిల్‌ని చూపించి, దాన్ని శుభ్రం చేయమని పురమాయించాడు.

కూర్చున్నాం. "మీల్సా, టిఫినా సార్?" అంటూ సర్వర్ ఆరంభించాడు.

సుబ్రావ్ టైం చూశాడు. నావేపు చూశాడు.

"నీక్కావాలంటే తిను," అన్నాను చిరాగ్గా.

సుబ్రావ్ మీద నా ఫిర్యాదు అదే! స్వంతంగా ఆలోచించడు. చెయ్యడు. కారీ అయి పోతాడు. తిండి తనటానికి రాలేదు గదా- ఎవడో అడిగితే సజెస్ట్ చేస్తే- ఆలోచనలో పడట మెందుకూ?

సుబ్రావ్ లోపాలను పెద్దవి చేసి చూపిస్తోంది వ్యగ్రత.

ఇరవై మూడేళ్ల క్రితం పరిచయం- పదిహేడేళ్ల క్రితం వివాహం- ఎన్నింటిని సహించను నేను! ఎందుకు?

"కాఫీ," అన్నాడు సుబ్రావ్. గొంతులో అయిష్టం ఉంది. ఇంత పెద్దవాళ్లు అంత చిన్న బేరం చేశారనుకుంటారని చేతిని నొక్కుతూ.

"నువ్వు బిగ్ సిటీవాడివి కదూ!"

మా పోట్లాట కొనసాగేదే- సుబ్రావ్ నా భుజం మీద పొడిచాడు. ఏంటన్నాను. చూపించాడు.

మాకు రెండు బల్లల అవతల యిద్దరు కూర్చుని ఉన్నారు. వాళ్ల బల్లకి అన్చి ఉన్నాయి రెండు తుపాకీలు. ఇద్దరూ సామాన్యంగా కనిపిస్తున్నారు. ఒకతను అడ్డ పంచె మీద చొక్కా వేసు కున్నాడు. ఆ తుపాకి అతని దగ్గర లేకపోతే- పొలంలో పనిచేసే ఒక రైతు పనిమీద పట్నం వచ్చి నట్లు కనిపిస్తాడు. భుజం మీదున్న రంగు తువ్వాలుతో మొహం తుడుచుకుంటున్నాడు. రెండవ మనిషికి కాస్త వయసుంటుంది. పాంటూ చొక్కాలో ఉన్నాడు. లావుగా ఉన్నా, క్రూరత్వం మొహం లో ఎక్కడా లేదు.

"తుపాకులు!!" ఆశ్చర్యంగానూ, నెమ్మదిగానూ అన్నాను.

సుబ్రావ్ తన ఆశ్చర్యాన్ని నాకు అందించి చుట్టూ చూస్తున్నాడు. నేనూ చూశాను. మమ్మల్ని చూసి కాస్తో కూస్తో ఆశ్చర్యపోతున్నారుగాని, వాళ్లని ఎవరూ పట్టించుకోవటం లేదు.

"బాంబేలో లేవేంటి?"

ఆఫ్టాల్- యివే మాత్రం- అన్న గొంతుతో అన్నాడు సుబ్రావ్. ఆ గొంతు తెచ్చిపెట్టుకున్నదే- తెలిసిపోతూనే వుంది.

సుబ్రావ్‌కి అధికారం ఉంటే- బాంబేలో లేనివి దేశంలో యింకెక్కడా ఉండగూడదని- నిషేధించే మనిషే!

''ఇవి స్మాల్ టౌన్స్‌లో మామూలేనేమో!''

''నువ్వు మీ కాకినాడలో ఎప్పుడయినా చూశావా?- నేను మాత్రం మా రాజమండ్రిలో ఎప్పుడూ చూడలేదు.''

రాజమండ్రి అంటే- అందులోనూ దానవాయిపేట అంటే సుబ్రావ్‌కి గొప్ప ప్రైడ్! 'నేను ప్రౌడ్ కాదు. నాది ప్రైడ్!' అంటూండేవాడు. కాకినాడ, రాజమండ్రి తగువు నాకూ యిష్టమే!

ఆ క్షణంలో మా తగువు కొనసాగలేదు. భయమా- ఆశ్చర్యమా? నేనే కాదు సుబ్రావ్ కూడా- తుపాకులని సినిమాల్లోనూ, మ్యూజియంలోనూ చూశాం. పోలీసులూ, సైనికులూ పట్టుకుని తిరగడం చూశాం. సెక్యూరిటీ గార్డుల చేతుల్లో చూశాం. సామాన్య ప్రజల చేతుల్లో మాత్రం తుపాకులు చూడలేదు. అందువల్లనేనా మా ఆశ్చర్యం!

నా ఆలోచనలు సాగుతున్నాయి.

''నాకు రాజు గుర్తొస్తున్నాడు సునీ- మా వెంకటరాజు-'' అన్నాడు సుబ్రావ్.

వెంకట్రాజు- సుబ్రావ్ బంధువు, స్నేహితుడు, క్లాస్‌మేట్. అస్సాంలో టీ ఎస్టేట్‌లో పనిచేసేవాడు. ఉగ్రవాదులు కిడ్‌నాప్ చేశారు. వాళ్ల కోరికలకు యజమానులూ, ప్రభుత్వమూ దిగిరాలేదు. శవం తిరిగి వచ్చింది. ఆ వార్తకు సుబ్రావ్ చాలా దెబ్బతిన్నాడు. తుపాకిని- అలాంటి సామాన్యుల చేతిలో చూస్తుంటే ఆ విషయం గుర్తు వచ్చినట్టుంది.

''ఈ దేశం ఎక్కడికి పోతోంది,'' అన్నాడు.

''అమెరికాకి. పదహారేళ్ల పిల్లలు తుపాకుల్తో స్కూల్‌కి వస్తారుట.''

సుబ్రావ్‌కి అమెరికా అంటే ఆరాధన. అక్కడున్న ప్రెస్ అన్నా, ప్రజాస్వామ్యం అన్నా పరవశించిపోతాడు. తనవంటి ప్రతిభావంతునికీ, కార్యతత్పరునికీ ఆదర్శం అమెరికా సమాజమేనట!

''పోన్లే. మన పిల్లలు అలా అవకూడదనే అందరికీ దూరంగా ఉంచుతున్నాం.''

అమెరికా పేరు ఎత్తి సుబ్రావ్‌ని హర్ట్‌చేద్దామనుకోలేదు నేను. శేఖర్ విషయం ఎత్తి నన్ను హర్ట్ చేసే సాహసం ఉందా సుబ్రావ్‌కి!?

మాట తప్పిస్తూ, మొహం తప్పిస్తూ, ''ఈ స్కౌండ్రల్ యింకా కాఫీ తేలేదు,'' అన్నాడు.

విషయాన్ని మారుస్తున్న సుబ్రావ్‌కి నేను అడ్డుపడలేదు.

సంభాషణ మోహన్రెడ్డి మీద సాగుతోంది. పావుగంటయినా కాఫీ రాలేదు. సుబ్రావ్ అంచనా ప్రకారం 'బాంబే కస్టమర్స్' కోసం కాఫీ ప్రత్యేకంగా తయారవుతోంది. అంచనాలకు మించిన ఆలస్యం సుబ్రావ్‌కి కోపం తెప్పించింది. కౌంటర్‌లో మనిషి మీద అరిచాడు. అతను సర్వర్ మీద అరిచాడు. కాఫీ వచ్చింది. పూర్తిచేశాం. జరిగిన ఆలస్యానికి వచ్చి సారీ చెప్పాడు. ఆ తర్వాత కందులపల్లి వివరాలు చెప్పాడు. గంట ప్రయాణంట. వివరాలు చెబుతున్నప్పుడు అతను అదోలా ఉన్నాడు.

హోటల్లోంచి బయటకు వచ్చాం. మా వాన్ పక్కన ఒక పోలీస్ జీప్ ఆగి ఉంది. అందులో ఉన్న పోలీస్ అధికారి కిందికి దిగి మమ్మల్ని సమీపించాడు. సుబ్రావ్ తాళం తీయబోతున్నాడు.

''మిస్టర్ మాతో స్టేషన్‌కి రావాలి,'' అన్నాడు ఇంగ్లీషులో. ఆ గొంతు కరుకుగా ఉంది.

సుబ్రావ్ నిర్ఘాంతపోయాడు. తేరుకుని, ''ఎందుకు?'' అన్నాడు తెలుగులో.

''అవన్నీ స్టేషన్లో,'' అన్నాడు.

''ఎందుకో చెప్పకుండా మేం రాం,'' అన్నాను.

నావేపు తిరిగి సూటిగా చూశాడు. మరో పోలీసు అధికారి అతని భుజం మీద చెయ్యి వేసి, మమ్మల్ని చూసి మర్యాదగా నవ్వాడు.

''నేను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పద్మనాభనాయుడిని. మీరెవరో తెలుసుకోవచ్చా?''

''నేను సుబ్రావ్‌ని. భారత్ పెట్రోలియమ్‌లో ఎగ్జిక్యూటివ్‌ని. ఈమె సునీత. నా భార్య. సోషియాలజీలో ప్రొఫెసర్.''

''థాంక్యూ ఫర్ ద కోపరేషన్. మీరోమారు స్టేషన్‌కి రావాలి. జస్ట్ ఎ ఫార్మాలిటీ.''

ప్రశ్న, జవాబులు ఇంగ్లీషులో జరుగుతున్నాయి. జనం మూగుతున్నారు.

మా వాన్‌లో మాతోబాటు పద్మనాభనాయుడూ, మరో కానిస్టేబుల్ వచ్చారు. పోలీస్‌స్టేషన్‌కి చేరాం.

లోపలికి వెళ్లాక, మమ్మల్ని కూర్చోబెట్టి సి.ఐ. నాయుడు ఆరంభించాడు.

''మేం మిమ్మల్ని సోదా చెయ్యాలి.''

''మీ ఉద్దేశ్యం ఏమిటి?'' అన్నాడు సుబ్రావ్.

''మీ ఊరికి వచ్చినవాళ్లనందరినీ సోదా చేస్తారా?'' అన్నాను.

అతను మృదువుగా నవ్వాడు. ''ఈమధ్య రాయలసీమలో ఆర్‌డిఎక్స్‌ని ఉపయోగించి ఒక ఇంటిని పేల్చేశారు. మీరు పేపర్లో చదివే వుంటారు.''

''మీ పేపర్లు మాకు రావు,'' సుబ్రావ్ గొంతు అసహనంగా ఉంది.

''అవును సార్. లోకల్ ఎడిషన్స్ వచ్చాక ఒక పేట న్యూస్ మరో పేటకి అందటం లేదు. కాఫీ, టీ... ఏమయినా?'' అన్నాడు మా టెన్షన్ తగ్గించడానికి ప్రయత్నిస్తూ.

మేం వద్దంటుంటే కూల్‌డ్రింక్స్‌కి కవురంపాడు.

''రాయలసీమలో కత్తులూ, కర్రలూ పోయాయి. తుపాకులూ, బాంబులూ వచ్చాయి. ఇప్పుడు వాటికి ఆర్‌డిఎక్స్‌లాంటిది తోడయితే జనం ఏమవుతారు? మాకు యిరవైనాలుగ్గంటలు చాలవు,'' అంటున్నాడు.

సుబ్రావ్ శ్రద్ధగా తలూపుతున్నాడు. అతనికి పోలీస్‌వ్యవస్థపై దురభిప్రాయమేం లేదు. ఆ వ్యవస్థ అవసరం పోవాలంటే ప్రతి మనిషీ గాంధీ అవాలిట. ఇన్ని వేల ఏళ్ల మానవ నాగరికతలో కేవలం ఒకే ఒక్క గాంధీ పుట్టాడట. ఏంలాభం- ఆయన తనని తాను కాపాడుకోలేకపోయాడు- అలాంటి గాంధీ మరెన్ని వేల ఏళ్లకి పుడతాడు! అందువల్ల పోలీసులుండక తప్పదు. వాళ్లు మరింత చురుకుగా, ఆధునికంగా ఉండాలి. వాళ్లలో మరింత సేవాభావం పెరగాలి- అంటాడు సుబ్రావ్. చెడ్డ ఎక్కడ లేదు? నేరాలతో సంబంధముండే పోలీసువ్యవస్థలో చెడ్డతనానికి అధిక ప్రచారం జరుగుతుంది గానీ అంతకన్న ఎంతో చెడ్డతనం తతిమ్మా వ్యవస్థలలో ఉంది అంటాడు కూడా.

సుబ్రావ్ హోదాకి పోలీసుల నుంచి మర్యాద బాగానే దొరుకుతుంది. కాని, ఊరుగాని ఊరులో... మావాడు ఎంతటివాడో తెలీనపుడు... ఇంత మర్యాద సుబ్రావ్‌ని సంతోషపరచింది. ఈ తతంగం చికాగ్గా ఉన్నా నన్నూ సంతోషపరిచింది.

''నిజమేనండి- ప్రపంచంలో పోలీసులకే కావాలి శాంతి,'' అంటున్నాడు సుబ్రావ్.

''సో- మీరు మాతో సహకరించాలి.''

''ష్యూర్, ష్యూర్.''

''బాంబే నుంచి కారులో ఎందుకు వస్తున్నారు?''

''రాకూడదా?'' అన్నాను.

''నాకు జవాబులే కావాలి,'' ప్రశ్నలు కాదన్న గొంతుతో అన్నాడు సి.ఐ.

''కారులో దేశాన్ని తిరిగి చూట్టానికి మాకు డబ్బులిస్తారు,'' అన్నాడు.

''తెలుగు బాగా మాట్లాడుతున్నారు. ఏ వూరు?''

''నాది రాజమండ్రి.''

''ఆవిడది- ఈ ప్రాంతమా?''

''కాకినాడ.''

''అయితే, యిక్కడికి ఎందుకు వచ్చారు?''

''మా అబ్బాయిని స్కూలులో చేర్చటానికి. రిషివాలీ స్కూల్లో.''

మా కారు కాగితాలూ, డ్రైవింగ్ లైసెన్సులూ చూశాడు. అతని ఉద్దేశ్యం బోధపడలేదు. మా సమాధానాలతో తృప్తిపడాలి. శేఖర్ అడ్మిషన్ గూర్చి స్కూల్‌కి ఫోన్ చేసి కనుక్కుని ఉంచాడు కూడా! ఒక కానిస్టేబుల్ వచ్చి సి.ఐ.ని పక్కకి తీసుకువెళ్లాడు.

తిరిగివచ్చి, ''మాకు వచ్చిన సమాచారం బహుశా తప్పే అయుంటుంది. ఏమయినా మీ కారునీ, సామాన్లనీ చెక్ చెయ్యాలి,'' అన్నాడు.

''విషయం చెప్పండి ఇన్‌స్పెక్టర్?'' అన్నాను.

''మీ కార్ నెంబర్ బాంబే రిజిస్ట్రేషన్. అక్కడ నుంచి ఆర్‌డిఎక్స్ వస్తుందని ఇన్ఫర్మేషన్ ఉంది. విజిలెంట్‌గా ఉంటున్నాం. రొటీన్ చెకప్,'' అంటూ నవ్వి, ''మేడమ్ మీరు విమానాల్లో తిరుగుతుంటారు. ఏర్‌పోర్ట్‌లో సెక్యూరిటీ చెకప్ ఉంటుంది. మెట్రోపాలిటన్స్‌లో సెక్యూరిటీ చెకింగ్ రొటీనయిపోయింది గదా! వాటికి అబ్జెక్ట్ చేస్తున్నారా?'' అన్నాడు.

''అయితే, ఆంధ్రా కూడా అస్సాంలా, కాశ్మీర్‌లా, పంజాబ్‌లా మారిపోయిందా?'' అన్నాను.

''యింకా లేదు మేడమ్. యిక్కడ ఆర్మీ లేదు.'' మేమే ఉన్నాం, అన్నట్లు నవ్వాడు.

సోదా పూర్తయింది. సూట్‌కేసుల్లో సామాన్లన్నీ తిరిగి పెట్టి, వాటిని వాన్ రియర్‌స్పేస్‌లో పెట్టారు. కూల్‌డ్రింక్స్ వచ్చాయి. తాగాం.

''సారీ సర్, మీరు వెళ్లొచ్చు,'' అన్నాడు.

బయటకు వస్తూంటే తనూ వెనకే వచ్చాడు. ''మీ నెక్స్ట్ హాల్ట్ ఎక్కడ సార్?'' అన్నాడు.

''కందులపల్లి వెళ్లాలి,'' అన్నాడు సుబ్రావ్.

''మీకు కావాలంటే బస్టాండ్‌లో కందులపల్లి మనిషిని పట్టుకొచ్చి అప్పజెపుతాం. మీకు గైడ్ చేస్తారు,'' అన్నాడు సి.ఐ. నాయుడు.

''నాటె బాడ్ అయిడియా,'' అన్నాడు సుబ్రావ్.

షేక్‌హాండ్ యిచ్చి మమ్మల్ని కారు ఎక్కించాడు. మాతో ఒక కానిస్టేబుల్ వచ్చాడు. బస్టాండ్ దగ్గర చాలా ప్రైవేట్ బస్సులున్నాయి. అక్కడ ఆపి, కానిస్టేబుల్ బస్టాండ్‌లోకి వెళ్లాడు.

''బాగా అప్‌సెట్ అయావు,'' అన్నాడు సుబ్రావ్ నావేపు తిరిగి.

''మగాళ్లు అవరా?'' చురుగ్గా అన్నాను. మగవాళ్లు అవరనీ, ఆడాళ్లే అవుతారన్న గొంతులో సుబ్రావ్ మాట్లాడినట్లనిపించింది. అది ఊహో, సత్యమో!

''పోలీసులతో నీకే ఎక్కువ అనుభవముంది గదా!'' అంటూ పేలవంగా నవ్వి, ''వాళ్లు మననే ఎందుకు సెర్చ్ చేశారు?'' అన్నాడు.

''చెప్తున్నారు గదా, మనది బాంబే వాన్ అని,'' అన్నాను.

సుబ్రావ్ మాట్లాడలేదు.

''వాళ్లన్నది నిజమే అయితే, మనకింక యీ సెర్చ్ తతంగం తప్పదు.''

''ఆ హోటల్‌వాడు వీళ్లకి కబురంపాడేమో!''

''ఎందుకూ?'' అన్నాను.

''ఏమో!'' అన్నాడు.

''ఈ ప్రాంతం నుంచి ఎంత తొందరగా బయటపడదామా అనే ఉంది,'' అన్నాను కళ్లు మూసుకుని.

కొంచెం ఆగి, ''చెప్పు,'' అన్నాడు సుబ్రావ్.

''దేశమంతటా సెక్యూరిటీ సమస్యే- వీఐపీల రక్షణ కోసమా బతుకుతోంది దేశం మొత్తం! మనలాంటి ఐపీలకి కూడా ఆ సెగ తగులుతోంది యిప్పుడు! ఇంతవరకూ అంతా సక్రమంగా

ఉన్నట్లు యిప్పుడే ఏదో చెడిపోయినట్లనిపిస్తోంది. అసలు పేదలకి సెక్యూరిటీ సమస్య ఉందా, ఏ సమాజంలోనయినా, ఏ కాలంలోనయినా?'' నా మాటలు నా ఆలోచనలని స్పష్టం చెయ్యలేక పోతున్నాయి. సెక్యూరిటీ ఎవరికి? పెద్దలకే! ఎవరి నుంచి? పేదల నించా, నేరస్తుల నించా, తోటి పెద్దల నించా? పేదలకి సెక్యూరిటీ పెద్దల నించి కావాలి. నేరస్తుల నించి కావాలి. పెద్దల చేతి కోర్టుల నించి, పోలీసుల నించి, డాక్టర్ల నించి, యాక్టర్ల నించి... ప్రతీవాడి నించీ కావాలి.

నేను ఆలోచిస్తూ మాట్లాడుతుంటే నా మూడ్ పాడయిందనుకున్నాడు సుబ్రావ్.

''సునీ, కందులపల్లి ప్రయాణం మానేద్దామా?'' అన్నాడు నా చేతివేళ్ల మీద రాస్తూ.

కళ్లు తెరిచి ఆ మొహంలోకి చూశాను. అతనికి మోహన్రెడ్డిని కలియాలని ఉంది. సుబ్రావ్‌లో యింకా మిగిలి వున్న తడి. లాభనష్టాల లెక్కలు లేని స్నేహాబాంధవ్యం! ఏళ్ల తరబడి కలియని మిత్రుడిని కలవాలనిపించడం! సుబ్రావ్ చేతిని మృదువుగా నొక్కాను.

''చూసే పోదాం,'' అన్నాను.

సుబ్రావ్ మొహం వెలిగింది. ''థాంక్యూ,'' అన్నాడు.

''యింజనీరింగ్ చదివిన రెడ్డి ఉద్యోగానికి పోకుండా, యింకా కందులపల్లిలో కూర్చుం టాడా, ఉన్నా నన్ను గుర్తుపడతాడా, వెనుకటిలా అంత సన్నిహితంగా ఉంటాడా? నాదో పిచ్చి,'' అన్నాడు.

''ఎక్కడున్నా, అడ్రస్సన్నా తెలుస్తుందిలే బాసూ,'' అన్నాను.

''ఆ వచ్చే మనిషిని అడిగేస్తే తెలిసిపోతుంది గదోయ్,'' అన్నాడు అప్పుడే తట్టినట్టు.

''ఫరవాలేదు... నీ బుర్రా పనిచేస్తుందే,'' అన్నాను.

అంతవరకూ జరిగిన సంఘటనలు- మామధ్య ప్రచ్ఛన్న యుద్ధభారాన్ని కొంత సడలిం చాయా?

కానిస్టేబుల్ ఒకతన్ని తీసుకు వచ్చాడు. పాంటూ, షర్టూ, నెరసిన జుత్తూ, కాళ్లకి జోడూ, చేతిలో ఏవో సంచీలూ...

''సార్! ఈయన రెడ్డప్పసారు. కందులపల్లి బళ్లో అయ్యవారు. వీళ్లు కందులపల్లి పోవల్ల. తీసకపొండి,'' అన్నాడు.

''ఏం మాస్టారూ? మోహన్రెడ్డి కందులపల్లిలోనే ఉంటున్నాడా? ఉద్యోగం చేస్తున్నాడా.'' అన్నారు సుబ్రావ్ కారు తలుపు తెరవకుండా.

''అదేంది సార్, ఆయనకి ఉద్యోగం ఎందుకూ? నిన్నటిదాకా పరిషత్ ప్రెసిడెంటు- అటు తెలుగుదేశమూ, యిటు కాంగ్రెస్సూ రెండూ టిక్కెట్లిస్తాయి. బండపల్లి రెడ్లు ఎటు దూకుతారో కనిపెడతండారు మా రెడ్లు,'' అన్నాడు.

''ఎక్కండి,'' అంటూ తలుపు తీశాడు.

పోలీసుకి థాంక్స్ చెప్పి గేరు మార్చాడు సుబ్రావ్.

కారు కదలగానే ఆరంభించాడు రెడ్డెప్ప.

''పోలీసాయన చెప్పినాడు. మీరు రెడ్డి చుట్టాలంట. రెడ్డి పరిషత్ ప్రెసిడెంట్ అయినట్టు తెలీదా సార్?''

''మనం రెడ్డింటికి వెడ్తున్నట్లు పోలీసులకెలా తెలుసు సుబ్రావ్?' అన్నాను ఆశ్చర్యంగా.

''అవును గదా,'' అన్నాడు ఎదురుగా వస్తున్న లారీని తప్పిస్తూ.

''అదేంది సార్, మీలాంటోళ్లు కందులపల్లిలో ఎక్కడికి వెళ్తారో పోలీసోళ్లకి తెలీదా? ఆ మాదిరి ఒంగి ఒంగి దండాలు పెడతా ఉన్నాడంటే- ఈయనకి అంతా తెలిసే ఉంటాది. ఏ వూరు సార్ మంది?'' అన్నాడు రెడ్డప్ప.

''మాది తూర్పు గోదావరి జిల్లా,'' అన్నాను.

''ఆయన మా స్నేహితుడు,'' అన్నాడు సుబ్రావ్.

''అట్లజెప్పండి సార్! మా రెడ్లదే స్నేహమంటే- చుట్టరికం కంటే స్నేహమే సార్, మా రెడ్డోరికి ముఖ్యం. శ్రీకృష్ణ దేవరాయల వారసులండి మా రాయలసీమ రెడ్లు. స్నేహం, దానం, ఆతిథ్యం, ఓహోహో ఏం మనుషులండి- మా రెడ్డోరు. కత్తి పట్టి పగలంతా తలకాయలు తరిగి తరిగి, రాత్రిపూట గంటం పట్టి కవిత్వం రాసే స్థితప్రజ్ఞత రాయల నుంచే మా రెడ్డోరికి వచ్చింది సార్.''

రెడ్డప్ప చెప్పుకుపోతున్నాడు.

రెడ్లు ఆయన దృష్టిలో యింకా ప్రభువులే! వాళ్ల పౌరుషాలు, పంతాలు, పగలు, దర్పాలు ప్రతిదీ ఆయనకి గొప్పే! మగవాళ్ల మధ్య ఎంతటి పగలున్నా ఆడవాళ్లను మాత్రం అగౌరవించరుట! కోస్తాజిల్లాలో పగతో జరిగే మానభంగాలు వంటివి రాయలసీమలో జరగనే జరగవుట. చిన్నపిల్లల్నీ, పైరుపచ్చల్నీ తాకరట. వారి దానగుణం, ఔదార్యం సరేసరి- నభూతో నభవిష్యతిట!

సుబ్రావ్ ప్రశ్నలు రెడ్డప్ప మాష్టారికీ మరీ హుషారిస్తున్నాయి.

రెడ్డమ్మ గుండు అని ఉందిట. ఆయన పేరు అదేనట. ఆ పేరు సామాన్యమట. మోహన్రెడ్డి అపర శ్రీకృష్ణదేవరాయలేనట! నిజంగా ఈ మాస్టరికి రెడ్లమీద అంత వీరాభిమానం ఉందా? ఈయన రెడ్డా? లేక మేము మోహన్రెడ్డి స్నేహితులమవటం వల్ల యింతిలా ఎత్తేస్తున్నాడా యీ మాస్టరు? అన్న పాపపు ఊహ కూడా వచ్చింది.

ముక్కూ మొహం తెలీని మనిషిని గురించి అలా అనుకోవటం నాకే నచ్చలేదు. వాళ్ల కబుర్ల నుంచి బయటపడటానికి బయట దృశ్యాలు చూడసాగాను.

రోడ్డుకి అటూయిటూ భూమంతా ఎత్తుపల్లాలే! గుట్టలు. మధ్యమధ్యలో సాగు భూములు. వరి, చెరకు పంటలకి అలవాటు పడ్డ కళ్లకి అవి ఎక్కడా కనిపించటం లేదు. అక్కడక్కడ చిన్నిచిన్ని గ్రామాలు. వాటిలో చెదురుమదురుగా రాతిగోడల పెంకుటిళ్లు, డాబాలు. ఏదో గడ్డి- బోద అంటారుట- కప్పిన గుడిసెలు. రోడ్డు మీద క్రాసుల దగ్గర చిన్నచిన్న కొట్లు, కొద్దిగా జనాలు. గోడలమీద ఎరువుల మందు నోటీసులు. రోడ్డు మీద లారీలు, బస్సులు, స్కూటర్లూ అప్పుడప్పుడు కనిపిస్తున్నాయి.

ఎప్పుడూ రద్దీగా ఉండే రోడ్లు, అడుగడుగునా గ్రామాలు, కనుచూపు మేరంతా విస్తరించి పరుచుకన్న పచ్చటి వరిచేల తివాసీలూ, కాలువలూ, ఎక్కడపడితే అక్కడ జనాలూ- అలాంటి గోదారి జిల్లాల్లో పుట్టి పెరిగాను. పదిహేడేళ్లుగా బొంబాయికి అలవాటుపడ్డాను. బొంబాయి అంటే జనం, బొంబాయి అంటే ధనం, బొంబాయి అంటే క్రిక్కిరిసినతనం.

అలాంటి నా కంటికి ఈ కొండలూ, గుట్టలూ మధ్యనున్న యీ ప్రాంతం నిస్తేజంగా, నిర్మానుష్యంగా కనిపిస్తోంది. నగరాలలో క్రిక్కిరిసిన గృహ సముదాయాల మధ్య ఆటస్థలమో, పార్కో ఉన్నట్లు- యీ నిర్మానుష్య ప్రాంతంలో చిన్ని పట్టణాలూ, జంక్షన్లూ ఉన్నాయి.

రెడ్డప్ప వాక్ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తూ, ''ఆ పంట ఏంటండి మాస్టారూ- ప్రతిచోటా అదే కనిపిస్తోంది,'' అన్నాను.

'అదేనమ్మా మా రాయలసీమ, దేశానికాస్తాండే సెనిక్కాయలు,'' అంటూ ఆరంభించాడు రెడ్డప్ప. పంట కూడా మూడేళ్ల కోమారు బాగుంటుందిట. ఆ ఏడు మంచి ధర వుండదుట.

''వానలు ఆ దేవుని చేతిలో వుంటాయి. ఆయన యిక్కడే మా కొండల మీదనే వుంటాడు. దేశదేశాల నుండి జనాలు వస్తా వుండారు. వాళ్ల కోరికలన్నీ ఆయన తీరస్తా ఉండాడు. ఆయన నీడనే వుండే మేము నీటిసుక్క లేక సస్తా వుండాము. ఆయనకి నిత్యకళ్యాణమాయె- మాకు

నిత్యక్షవరమాయె- మా దేవుడూ అంతే- మా రెడ్డోరూ అంతేనమ్మా- మావాళ్లు ప్రెసిడెంటులైనారు- ముఖ్యమంత్రులైనారు- వాళ్లు మా సీమకి తెచ్చింది లేదాయె- యిచ్చింది లేదాయె,'' అంటున్నాడు.

వెనక్కి తిరిగి రెడ్డప్ప మాస్టారిని పరిశీలించాను.

స్వచ్ఛమయిన గొంతు, అచ్చమైన రాయలసీమ మనిషి. ఆ గొంతులో వ్యక్తిగత కష్టం లేదు. మొహంలో అలసట వ్యక్తిగత కష్టం నుంచి కాదు. అది సీమ కష్టం. అది భగవంతుడికన్న మనిషిని తప్పుబడుతోంది. ఓ ప్రాంతమంతా ఎడారి అయిపోయే ప్రమాదానికి రాజకీయాలను తప్పుబడుతోంది.

అంతకుముందు వరకూ ఆయన గతచరిత్ర గురించి ఒళ్లు పులకరించిపోవడంలో ఏదో వ్యక్తిగత ప్రయోజనం చూశాను. ఆ పులకరింతా, ఆ వ్యక్తిగత ప్రయోజనభావనా రెండూ నాకు నచ్చలేదు. మనసంతా నిష్ఠూరభావాలు- అలాంటి మనసుని రెడ్డప్ప మాస్టారి యీ మాటలు స్పర్శించి, మెత్తబరిచాయి.

కారు మెయిన్‌రోడ్డుని విడిచి పక్కదారిలోకి ప్రవేశించింది.

రోడ్డు బాగానే వుంది. ఓపక్కగా ఎలక్ట్రిక్ స్తంభాలు. మధ్యలో ఓ కొండని- రెడ్డప్ప మాస్టారు దాన్ని బండ అంటున్నాడు- చుట్టుకుంటూ సాగుతోంది రోడ్డు. ఎదురుగా వస్తున్న ట్రాక్టరు- మోహన్రెడ్డిదేనట. ఆ రోడ్డు- రోజుకి రెండు ట్రిప్పుల బస్సు, మోహన్రెడ్డీ వాళ్ల కుటుంబం తెచ్చిన వేనట. కందులపల్లి దాటాక బండపల్లి ఉందిట. ఆ రెడ్డికీ, వీరికీ పడదుట. మాస్టారు చెపుతున్నాడు.

ఊరు చేరువవుతోంది. ఒక చెరువు కనిపించింది. దాని చుట్టూ పొలాలున్నాయి. ఊరికి మొగదలనే ఓ వేపచెట్టూ, దాని చుట్టూ ఒక తిన్నె, దాని మీద కొద్దిమంది మనుషులూ... చినుగుల నిక్కర్ల పిల్లలూ, రేగుతున్న దుమ్ములోనూ కారువంక చూస్తున్నారు. నలుగురు ఐదుగురు పోలీసులు ఒక అరుగు మీద కనిపించారు.

''ఊళ్లో పోలీసులున్నారేంటి మాస్టారూ?''

''ఏమోనమ్మా, ఊరు విడిచి రెండు వారాలాయె,'' అంటూ ఓ పెద్ద యింటి ముందు కారు ఆపించాడు.

''అదే సార్, రెడ్డోరి హజారం- నిలపండి.''

కారు ఆగగానే, దిగి ఆ యింటివేపు వెళ్లాడు. లోపలికి మాయమైపోయాడు.

ఇంటి చుట్టూ ఎత్తైన గోడ. మధ్యలో ఒక పెద్ద ద్వారం. లోపల యిల్లు ఒకటే ఉందో- చాలా ఉన్నాయో తెలియటం లేదు.

''మీ మోహన్రెడ్డి పెద్ద జంతువే బాసూ,'' అన్నాను.

''మనసులో ఊహలు చెరిపేసుకోటానికి వచ్చామేమో సునీ!'' అన్నాడు అదోలా భుజం మీద తట్టి.

''కారులో గదా వచ్చాం, డోంట్ వర్రీ,'' అన్నాను.

''నన్ను సూసి పేమించాలగానీ నా కారుని సూసి పేమిస్తే ఎట్టా అమ్మాయ్యా...?'' అన్నాడు సుబ్రావ్.

ఇంతట్లో మాస్టారు మరో యిద్దరిని వెంటబెట్టుకుని వచ్చాడు.

''రెడ్డి లేడు సార్, రాత్రికి వస్తారు. రాండి లోపలికొచ్చి రెస్టు తీసుకోండి,'' అన్నాడు.

నా మొహంలోకి చూశాడు సుబ్రావ్. నాకూ ఏమనాలో తోచలేదు.

వచ్చిన యిద్దరూ, ''మీరు అప్పను సూడకుండా ఎల్లిపోతే ఆయన మమ్మల్ని సంపేస్తాడు,'' అంటూ ప్రాధేయపడ్డారు.

రెండవుతోంది.

సుబ్రావ్‌కి, నాకూ మేడ మీద గది యిచ్చారు. సామాన్లు అక్కడికి చేర్చారు. మాస్టారు మా అవసరాలన్నీ చూసి సెలవు తీసుకుంటూ, "రెడ్డోరితో నన్ను గురించి సార్, చెప్పండి సార్-" అన్నాడు.

ఆ ఆకస్మిక ఏకాంతం నన్ను భయపెట్టింది. వెంటనే టవలందుకున్నాను.

ఎటాచ్‌డ్ బాత్రూంలో స్నానం చేస్తున్నాను.

అనుకున్నట్టే సుబ్రావ్ డోర్ మీద నాక్ చేస్తున్నాడు. వినిపించుకోలేదు. ఎన్నింటితో యుద్ధం! మొదటి యుద్ధం- యీ శరీరంతోనేనా!

భావాలను రక్షించుకోవాలంటే- ఎన్ని దాడులు!

కనీసం మనసులోనయినా యీ కోపం నిలవదా?! గుజరాత్, మహారాష్ట్ర గ్రామాల్లో సాంప్ర దాయక దుస్తుల వాడకం యిక్కడకన్నా ఎక్కువా- తక్కువా- అన్న విషయం మీద మనసుని నిలుపుతున్నాను.

స్నానం పూర్తయింది. ఆ తర్వాత వెళ్లాడు సుబ్రావ్. బాత్రూం నించి బయటపడిన సుబ్రావ్- "ఈ దేశం డెవలప్ అవలేదనే వాళ్లు ఫూల్స్," అన్నాడు బొచ్చు తువ్వాలుతో తుడుచుకుంటూ.

"అవును బాసూ- గీజరూ, షవరూ... వెస్ట్రన్ దొడ్డీ... నీకు దేశప్రగతికి సింబల్స్," అన్నాను.

సుబ్రావ్ నా వెటకారానికి జడుసుకున్నాడో, నటించాడో- జవాబివ్వలేదు.

కొంతసేపటికి- మమ్మల్ని భోజనాలకు తీసుకువెళ్లారు. మాకు యిచ్చిన గది మేడ, అసలు యింటికి విడిగా వున్నాయి. బహుశా తర్వాత కట్టినవైయుంటాయి. విశాలంగా, చల్లగా నాపరాతి గచ్చులతో ఉన్నాయి అసలు యింటి గదులు.

భోజనాల గదిలో వడ్డించారు. భోజనాలు పూర్తయ్యాయి.

గదికి చేరేసరికి నిద్ర కమ్ముకొచ్చింది.

లేచేసరికి పడమటివేపుకి కిటికీలోంచి సూర్యాస్తమయం కనిపిస్తోంది. దగ్గరగా వున్న చెట్ల కొమ్మలకూ, ఆకాశంలో వెలిమబ్బులకీ, దూరంగా వున్న కొండలకీ మధ్య చిక్కుకుని ఉన్నాడు సూర్యుడు. మనసంతా ఏదో ఉదాసీనత...!

"శేఖర్‌గాడు యీపాటికి ఏం చేస్తుంటాడో!"

నాలో ప్రశ్న అసంకల్పితంగా బయటకు వచ్చింది.

'నువ్వు అంత పొసెసివ్‌గా ఉండకూడదు! వాడి భవిష్యత్తు సెక్యూర్డ్‌గా ఉండాలంటే- మనమూ కష్టపడాలి. వాడూ కష్టపడాలి,' అదీ సుబ్రావ్ పైకి చెప్పే పాయింట్. 'ఇది పొసెసివ్‌నెస్ విషయం కాదు. ఇది మన మధ్య యుద్ధం. ఒకరితో ఒకరు గెలవలేని మనం చేసుకున్న రాజీ,' అని చెప్పాలి నేను. నేను బాధపడుతూంటే అదని ఓదార్పూ, అతను బాధపడుతూంటే నా ఓదార్పు- అంతా నటన. స్కూల్ వదిలాక 'శేఖర్ మాట యిద్దరం ఎత్తకూడదన్న' నిర్ణయం ఆ నటనలో ఓ భాగం.

ఈసారి సుబ్రావ్ నుంచి ఎలాంటి జవాబూ వినిపించలేదు.

తలతిప్పి చూశాను. నిద్రపోవటం లేదు. పడక్కుర్చీలో ఉన్నాడు. ఏదో పుస్తకం చేతిలో. గదిలో పుస్తకాల షెల్ఫ్ వుంది. అందులోంచి తీసినట్టున్నాడు.

"ఏంటూ పుస్తకం?" అన్నాను లేచి.

"శాంతికపోతం- మా రెడ్డి ఛందస్సులో రాసిన కావ్యం."

"మీ రెడ్డి కవి కూడానా?"

"మా రెడ్డి ఏమనేవాడో తెలుసా- యిక్కడ పద్యం అల్లటం, చదవటం విద్యట. ప్రతి ఊళ్లోనూ కవులేనట! రాయటం రానివాళ్లు కూడా పద్యాలు అల్లగలరుట!"

“అలాగా- యింతకీ మీ రెడ్డి భాష ఎలా ఉంది?” ‘భాష’ని నొక్కాను.

“అవునవునోయ్- మా ఫ్రెండ్ గదా- మనసుకి కూడా పక్షపాతమే- భాషని పట్టించుకోలేదు,” అంటూ పుస్తకం తిరగెయ్యటంలో పడ్డాడు.

“భాష అందాలూ, లోపాలూ తప్ప నీకు మరేమీ పట్టవుగదా- నీ ఫ్రెండంటే నీకు చాలా యిష్టమన్నమాట,” అన్నాను.

ఆ పుస్తకం వాళ్లిద్దరూ కలిసి చదువుకునే రోజుల్లో రెడ్డి రాస్తూ చదివి వినిపించేవాడుట. సుబ్రావ్ ఆ విషయాలు చెపుతున్నాడు. సుబ్రావ్‌కి భాష పవిత్రంగా ఉండాలి. ఆ మాట ఒప్పుకోడు. నిర్దుష్టంగా ఉండాలని వాదిస్తాడు పైకి. అది చాదస్తం నా దృష్టిలో. ఆధునికత పేరుతో అమెరికాని ఆరాధించే సుబ్రావ్ భాషా చాదస్తం అసంబద్ధంగా అనిపిస్తుంది. దానిమీద కబుర్లు, పనికిమాలిన చిర్రుబుర్రులు. వాటిల్లో కూడా మనసు నిలవటం లేదు.

టీ వచ్చింది. రెడ్డి రాత్రికి తప్పక వస్తాడని కబురు వచ్చింది.

“బయటికి వెళ్దామా- ఊరు చూద్దాం,” అన్నాను. సరేనన్నాడు సుబ్రావ్. తయారయాం. ఆరవుతోంది. గాలి చల్లగా ఉంది. మేడ తిగుతూంటే రెడ్డి చుట్టంట, వచ్చి పలకరించాడు.

“పల్లెలో గొడవలవుతా ఉండాయి. పోవద్దు సార్,” అన్నాడు.

“మీకూ, మీ ప్రత్యర్థి రెడ్లకీనా?” అన్నాను.

“ఆళ్లు యిక్కడెందుకుంటారమ్మా,” అన్నాడు.

“మరేం గొడవలు?” అన్నాడు సుబ్రావ్.

“ఏంది చెప్పేది సార్- పల్లెల్లో వాళ్లకి గీర్లు పెరిగాయి. తోక జాడించారు. కత్తిరించాం. పల్లెను తగలబెట్టాం. పారిపొయ్యారు,” అన్నాడు నవ్వుతూ.

నా నరనరమూ భగ్గుమంది.

“ఏం చేశారు వాళ్లు?” అన్నాడు సుబ్రావ్ చప్పున.

“పల్లెను తగలబెట్టారా- ఎంత దౌర్జన్యం- పద వెళ్లి చూసొద్దాం,” అన్నాను. అతను మా యిద్దరి మొహాల్లోకి చూశాడు.

“సార్! మీది బొంబాయి. మా రెడ్డిని సూస్తానికి వచ్చింద్రు. ఆయన వస్తాడు, సూడండి, ఎల్లండి. యిక్కడ పల్లెవోర్లు ఎంత కట్టుదాటిపోయారో, మీకు తెలిసేలేదు. ఆళ్లు దెబ్బతిని వున్నారు. అదును కోసం సూస్తన్నారు. రెడ్డోరి యింటి సుట్టాలని ఎవరకయినా తెలిసిపోతుంది. ఆళ్లు మిమ్మల్ని కొడితే- ఎందుకు పంపారని మా రెడ్డి మమ్మల్ని సంపేస్తాడు.”

సుబ్రావ్ నా మొహంలోకి చూశాడు.

“ఇవి బాంబే స్లమ్స్ కావు. దయచేసి అర్థం చేసుకో,” అన్నాడు యింగ్లీషులో.

షబానాఅజ్మీలాంటి వాళ్లతో కలిసి బాంబే స్లమ్ వాసుల కోసం నిర్వహించిన ధర్నాలు, ఊరేగింపులూ... సుబ్రావ్‌కి ఎందుకు నచ్చుతాయి! అందుకని నాతో నేరుగా పోట్లాడలేదు. అందులో ఆపదల గురించి మాట్లాడేవాడు. ఎంత డిప్లమసీ! అర్థమవుతాడు- అందడు. అతనికి డబ్బు సంపాదనే ముఖ్యం. దానిని ఎంచటమే ముఖ్యం. షేర్లు, రియల్ ఎస్టేట్ బిజినెస్... అదే అతని లోకం! ఎంత అంతరం మా లోకాల మధ్య! మా లక్ష్యాల మధ్య! శేఖర్‌ని అతని బారి నుంచి తప్పించాలని నేనూ, నా బారి నుంచి తప్పించాలని అతనూ... ఎంత పెనుగులాట! అంతిమ విజయం ఎవరిది!

సుబ్రావ్ గొంతులో అదే డిప్లమసీ! అదే ఆపద హెచ్చరిక!

నో! కనీసం దీన్నయినా ఎదుర్కోవాలి. “పద వెళ్దాం,” అన్నాను సూటిగా.

ఎందుకు రమ్మన్నానతన్ని! ఎందుకు వెళ్లలేకపోతున్నాను ఒంటరిగా! ఆడదాన్నవటం వల్లనా? అందరు ఆడవాళ్లకీ నాకూ తేడా ఏమిటి? తను రానంటే?

మననసంతా కోసేస్తున్న ప్రశ్నలు.

"పద! కూల్ అవు," అన్నాడు. రెడ్డి చుట్టం మా యిద్దరినీ పరిశీలనగా చూస్తున్నాడు.

సుబ్రావ్ ఎక్కడికి పదమంటున్నాడో అర్థమయింది.

ఉద్రేకాల మీద ఆచరణకు దిగటం ఒక వయోలక్షణమా? వ్యక్తిస్వభావమా? అనేకమార్లు దిగాను. నా దృష్టిలో నన్ను చులకన చేసుకోవటం యిష్టం లేక దిగాను. ఆంధ్రా యూనివర్సిటీలో ఆనాటి విప్లవోద్రేకాలతో ఊగిపోయాను. అది నా స్వభావమనీ, నా ప్రకృతి అనీ అనుకోటంలో ఉన్న 'శక్తి'ని గుర్తించాను. అంతా అనుకోవటం మీదనే ఉందనీ- అదేమీ 'వయో లక్షణం' కాదనీ యీమధ్య మరీ గట్టిగా అనుకుంటున్నాను.

సుబ్రావ్ నన్నలాగే వదిలి, రెడ్డి చుట్టంతో కిందికి వెళ్లాడు. తిరిగి వచ్చాడు. "పద పల్లెను చూసొద్దాం," అన్నాడు. పాదాలు భూమిలోకి కూరుకుపోయి వుంటే- లాక్కొని వేళ్తున్నట్లు మేడ దిగాను.

'సుబ్రావ్ పెళ్లాం ముచ్చట తీర్చాడన్నమాట!'

మేమూ మరో యిద్దరూ ఊళ్లోకి వెళ్లాం. పోలీసులు రెడ్డి చుట్టానికి సలాం కొట్టారు. అతను వాళ్లతో ఏదో అన్నాడు. వాళ్లు నన్ను వింతగా చూస్తున్నట్లు, నవ్వుతున్నట్లు కనిపిస్తోంది. ఫీలింగ్స్‌ని అణుచుకుంటూ పల్లె పరిస్థితిని చూడసాగాను.

మావేపులాగే ఊరికి చివరగా ఉంది, ఒకే ఒక పెంకుటిల్లు. మిగిలినవన్నీ గుడిసెలు. అన్ని యిళ్లూ కాలిపోయాయి. ఫైర్ యింజన్ల వల్ల కాబోలు- నీటికి తడిసి గోడలు పడిపోయాయి. వారంరోజులయిందిట. గుడిసెల మీద ఏవో పరిచి లోపల ఉంటున్నారు మనుషులు. మానవులు!

మానవులు! మానవులు!

వృద్ధులు- పిల్లలు- ఆడవాళ్లు- అశక్తులే కనిపిస్తున్నారు. యువముఖాలు కనపడటంలేదు- తరిమేయబడ్డారా- తప్పించుకున్నారా?

ఈ ప్రపంచంలో ప్రతి మనిషీ తనకు బ్రతికే హక్కుండాలని ఎలా వాంఛిస్తాడో, అలాగే యితరులకీ ఉండాలని వాంఛిస్తే- యీ ప్రపంచం యిలా ఉంటుందా!

ఇది పూర్తిగా 'అయితే' కానీ ఆ ప్రశ్న. గాలి, ఉత్తి గాలి. వాస్తవమేంటంటే- ప్రస్తుత ప్రపంచం కొన్ని 'ఆచరణల' ఫలస్వరూపం. ఈ ప్రస్తుత ప్రపంచంలో విషాదముంది. ఈ సమాజంలో నాకెదు రయ్యే వాటిని నలుగురి దృష్టికీ తెస్తాను. అదీ ఒక ఆచరణే! ప్రపంచంలో సోమాలియా, ఇథియో పియా, రువాండా, యెమన్ వంటివి ఉన్నాయని ఒక మనిషి, మరో మనిషికి చెప్పటం... ఆచరణే!

ఒక వృద్ధురాలిని పలకరించాను. ఆమె నా వెనుక మనుషులని చూసి చటుక్కున తన గుడిసెలోకి వెళ్లిపోయింది.

మరో నడివయసు స్త్రీని నీ పేరేమిటని అడిగాను. మాట్లాడలేదు.

"చెప్పవే," కళ్లెర్ర జేశాడు రెడ్డి.

ఏదో గొణిగింది. అక్కడ నించి పారిపోయింది.

స్తబ్ధుగా నిలబడ్డాను.

అర్థమవుతోంది- నాతోటి మనుషులని బట్టే గుర్తింపు నాకు! ఇలాంటిచోట్లకి రకరకాల సమూహాలు వస్తాయి. విలేకర్లు, ఫోటోగ్రాఫర్లు, వీడియో మాగజైన్ల వాళ్లు, ఫాక్ట్ ఫైండింగ్ కమిటీల వాళ్లు... ఇదంతా ఓ సమూహం. పోలీసులు, సైనికులూ మరో సమూహం. రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు మరో సమూహం. నేనా క్షణంలో ఏ సమూహానికీ చెందను. నాకు ఒక పరి చయం లేదు. ఉంటే- ఆలస్యమయినా వాళ్లు గుర్తిస్తారు. స్పందిస్తారు. 'నాగరికులు' గా, 'ప్రజా స్వామ్యవాదులు'గా, 'మానవతామూర్తులు'గా, 'కర్తవ్యపరాయణులు'గా, 'రక్షకులు'గా నటించే

వాళ్లతో సైతం వాళ్లు ప్రవర్తించగలరు! నాతో మాత్రం ఆ క్షణంలో వాళ్లకు అది సాధ్యం కాదు.

దౌర్జన్యానికి లోనవుతున్న వాళ్ల పట్ల నా అంతరంగంలోని సంచలనంలో, వేదనలో... ఎటువంటి నటనా లేదు. ఇది ముమ్మాటికీ సత్యం. ఈ వేదనకి మానవ సమాజ గమనంలో పాత్ర ఏమిటి? నేను నమ్మే భావజాలం- నా యీ 'వ్యక్తిగత వేదన' మీద, నా 'కర్తృత్వం' మీద నాకు నమ్మకం కలిగించలేదు. సమాజంలో వ్యక్తిత్వంలో 'సామాజిక సమవేదన' అనే అంశం మీద, ఎలాంటి గౌరవమూ కలిగించలేదు. కేపిటలిస్టు సమాజం యీ వేదనకి ఎన్ని దారులు ఏర్పర్చింది!

నాలోని యీ 'వేదన' శేఖర్‌ని స్పర్శించగూడదనే గదా- సుబ్రావ్ ప్రయత్నం!

కొంతసేపు తిరిగి- లేదు వాళ్లు తిప్పితే తిరిగి- లేదు ఆసక్తి మేరకు తిరిగి- పలకరించబోయి, భంగపడి, కనిపిస్తున్న దృశ్యాలు హృదయాన్ని మూగతనంతో నింపుతూంటే- నలుగుతున్న ఆలోచనలు మెదడును కాలుస్తూ వుంటే- తిరిగి రెడ్డి ఇంటికి చేరాను. గదిలో మంచం మీద వాలాను.

చీకటి- లోపలి నుంచి పైకి- పై నుంచి లోపలికి!

''ఎలాంటి రెడ్డి- ఎలా మారిపోయాడు!'' అన్నాడు సుబ్రావ్. మాట్లాడలేదు. ''ఈ పద్యం విను- పల్లెలో దృశ్యాల మీద, వాళ్ల దుస్థితి మీద ఒకనాడు రెడ్డి రాసిన పద్యం,'' అంటూ చదవ సాగాడు.

ఆ వాడలో దృశ్యాలను గుండె కరిగేలా చెపుతున్నాడు కవి.

''ఆపు!'' అసహనంగా అన్నాను.

''ఏం?'' అన్నాడు ఆశ్చర్యంగా.

జవాబీయలేదు.

''మేం చదువుకునే రోజుల్లోనే రాశాడీ కావ్యం. ప్రపంచంలోని పక్షులన్నీ వచ్చి మానవులు సృష్టించుకున్న అసమానతల గురించి చెప్పుకుంటాయి. మానవుడికి సందేశం యిస్తాయి- అలాంటి రెడ్డి- వాడను తగలబెట్టించాడంటే- ఎందుకిలా మారాడో?'' అన్నాడు.

''అతనెందుకు మారాడన్నది నీ బాధ. వీళ్లెందుకు మారలేరన్నది నా ప్రశ్న!''

''సమాజశాస్త్రజ్ఞురాలివి నువ్వు చెప్పాలి. అయినా ఎందుకు మారలేదూ- బీయస్‌పీ ఇండియాని రూల్ చేయబోతోంది. ప్రెసిడెంటు వాళ్లవాడు అవబోతున్నాడు.''

''అవునవును- దళితుల దుస్థితి మీద ఆదిశంకరుడూ మాట్లాడాడు. రామానుజుడూ పోట్లాడాడు. ఏం మారింది? ఈరోజు ఒక పార్టీకి అధికారం వస్తే- ఒకరు ప్రెసిడెంట్ అయితే- వాళ్ల దుస్థితి మారుతుందా? మారదు.''

అయితే ఎలా మారుతుందని అడగాలి సుబ్రావ్. ఎందుకడుగుతాడు? మారరాదన్న పట్టుదలా లేదు. మారాలన్న కోరికా లేదు. ఆ దుస్థితి వల్ల అతనికి ప్రయోజనమూ లేదు, నష్టమూ లేదు. నాకు కోరిక ఉంది గదా- దాంతోపాటు మార్పు ఫలానిలా మాత్రమొస్తుందన్న అంచనా ఉందిగదా- ఎప్పుడొస్తుందా పెనుతుఫాన్! అందాకా యింతేనా?

మనసంతా ప్రశ్నలు, జవాబులు.

కొంతసేపటికి లేచి పుస్తకాలు చూడసాగాను. అవి డ్రాయింగ్‌రూంలో అలంకారం కోసం కొన్నట్లుగా లేవు. ఆ కలెక్షన్‌లో ఒక అభిరుచి ఉంది. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, శ్రీశ్రీ... అన్నిరకాల వాళ్లూ ఉన్నారు. అవి చదివిన గుర్తులు ఉన్నాయి. ఏవో రాసుకున్న నోట్సులు వున్నాయి- ఆ పుస్తకాల మీద.

'మహాప్రస్థానం,' తీసుకు కూర్చున్నాను.

రెడ్డి చదువుకున్న వాడనిపించటంతో చదువుకున్న వాళ్ల మీద ఏర్పడే సాఫ్ట్‌కార్నర్ ప్రభావం నా మీద పనిచేస్తున్నట్లుంది. ఆలోచనల ఈగలు రెడ్డి చదువు చుట్టూ ముసురుతున్నాయి.

ఎనిమిదింటికి భోజనాలు- తొమ్మిది దాటాక రెడ్డి వచ్చిన కబురూ- ఆ తర్వాత రెడ్డి రమ్మన్నాడన్న కబురూ-

సుబ్రావ్ మొహం నిండా స్నేహప్రకాశం. అంతవరకూ రెడ్డి తన కోసం పరుగులు పెడుతూ రాలేదని మొహం మాడ్చుకు కూర్చున్నాడు. కబురు రాగానే, 'పదపద' అంటూ తొందర చేశాడు. మాకోసం వచ్చిన మనిషితో వెళ్లాం.

అసలు యింటికి కాస్త లోతట్టుగా ఉంది రెడ్డి ఉంటున్న గది.

గది బయట కుర్చీలున్నాయి. అక్కడ కూర్చోబెట్టారు. తతిమ్మా కుర్చీల్లో కొద్దిమంది కూర్చుని ఉన్నారు. నలుగురు మనుషులు అక్కడక్కడ నుంచుని వున్నారు. ఇద్దరి భుజాల నించి తుపాకులు వేలాడుతున్నాయి. ఒకవారగా బకెట్లున్నాయి. వాటిలో ఏవో గుండ్రపాటి వస్తువులు నీటి మీదనే తేలుతున్నాయి. బాంబులు కాబోలు. ఆ వాతావరణం యుద్ధం మధ్యలో విరామాన్ని గుర్తుకు తెస్తోంది.

అక్కడ, ఆ రాత్రివేళ మనుషులూ, ఆ తుపాకులూ...

మనసు పరిపరి విధాల పోతోంది- ఇదంతా ఆత్మరక్షణకా? మరొకరి భక్షణకా?

ఆ వాతావరణం గురించి కొంత ఊహించటం వల్ల పెద్దగా ఆశ్చర్యమూ లేదు, భయమూ కలగలేదు. సుబ్రావ్ మొహం మాత్రం ఎక్సైటింగ్‌గా ఉంది. స్నేహితుడిని చూడబోతున్నందుకా? అతని ఆర్భాటాన్ని చూస్తున్నందుకా?

కొంతసేపటికి యిద్దరు బయటకు వచ్చారు.

''పోండి సార్, రెడ్డి సూస్తాండాడు,'' అన్నాడు ఒకడు.

గది లోపలికి వెళ్లాం.

విశాలంగా ఉంది. ఫర్నిచరు లేదు. ఒక మంచం, ఒక ఫోను, కొంత ఎడంగా రెండు కుర్చీలు, గోడల మీద- నెహ్రూ, గాంధీ, బాబూ రాజేంద్రప్రసాద్, నేతాజీ- ఫోటోలు. ఒకట్రెండు తెలియని మొహాలు ఫోటోల్లో... పూర్వీకులేమో- రెడ్డికి!

మంచం మీద ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. శాలువా కప్పుకుని ఉన్నాడు. సుబ్రావ్ అతన్ని సమీపించి, ''గుర్తున్నానా రెడ్డీ,'' అన్నాడు.

అతను గుర్తుపట్టినట్టు లేదు.

సుబ్రావ్ అతని పక్కనే కూర్చుని, భుజం మీద చెయ్యేశాడు.

''ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి- ఈ సైడు వచ్చినప్పుడల్లా- నమ్మితే నమ్ము, లేకపోతే లేదు. వచ్చి చూద్దామనుకోటమే.''

సుబ్రావ్ మాట్లాడుతున్నాడు. ఈ సుబ్రావ్ ఎందుకో కదిలిస్తున్నాడు. అతనిలో ఒక గాఢమయిన స్నేహభావన ఉంది. తన క్లాస్‌మేట్స్ గురించి... మా పెళ్లి గురించి... ఏవేవో సంగతులు.

సుబ్రావ్ ఉద్వేగాలు నాకు తెలుసు. కానీ, ఈ మనిషి విపరీతంగా కనిపిస్తున్నాడు. అంతకన్న- ఎలాంటి ఉద్వేగాలూ లేకుండా కూర్చున్న రెడ్డి మరింత విపరీతంగా కనిపిస్తున్నాడు.

మధ్యలో నన్ను పరిచయం చేశాడు సుబ్రావ్. నమస్కరించి కూర్చోమన్నాడు. ఒక కుర్చీలో కూర్చున్నాను.

అతను సుబ్రావ్ చేతిని, తన చేతిలోకి తీసుకుని గట్టిగా నిట్టూర్చాడు. తనని తాను కూడదీసుకుంటూ, మెల్లగా అన్నాడు- ''అయ్యగారూ! నేను మీ క్లాస్‌మేట్‌ని కాను. మా అన్న మురళీమోహనరెడ్డి. నేను మదనమోహనరెడ్డి.''

''సారీ సర్,'' అంటూ గబుక్కున లేవబోయాడు సుబ్రావ్.

అతను వదలలేదు. పక్కనే కూర్చోబెట్టుకున్నాడు.

''చాలాకాలమయింది- మీ అన్నని చూసి. పొరబడ్డాను, ఎక్కడున్నాడు మీ అన్న?'' అన్నాడు సుబ్రావ్.

''మీరూ, మా అన్నా క్లోజ్‌ఫ్రెండ్సా?''

''ఏం లాభం? ఇరవై నాలుగేళ్లలో ఒక్కసారి కూడా కలుసుకోలేదు. ఎక్కడ పనిచేస్తున్నాడు మా రెడ్డి?'' అన్నాడు.

''మిమ్మల్ని చూస్తే మా అన్నని చూసినట్టుంది,'' అంటూ ఆగి కొంచెం గద్గదమవుతున్న గొంతుతో- ''అన్నను చంపేసినారు సార్... నాలుగేళ్లయింది,'' అన్నాడు.

సుబ్రావ్ కళ్లలో ఆర్ద్రత- ''ఎంత మంచివాడు... ఎవరు చంపేశారు?'' అన్నాడు. అతను బాగా షాకయాడు.

రెడ్డి అతని భుజం మీద చెయ్యి వేసి నొక్కుతున్నాడు.

సుబ్రావ్‌ని చూస్తే జాలి, అతన్ని చూస్తే జాలి. ఆ నిశ్శబ్దం గడుస్తున్నకొద్దీ నేను బాధపడుతున్నాననీ, వారి మీద జాలిపడుతున్నాననీ, అర్థమయిన కొద్దీ నామీద నాకే జాలి, చిరాకు, అసహ్యం. వాళ్లిద్దరికీ ఆ చనిపోయిన మనిషి ఏదో ఒకటి అవుతాడు. నాకు ఏమీ కాడు. వారిద్దరి దుఃఖంలో సంబద్ధత ఉంది. నా దుఃఖంలో? కాలిన గుడిసెలలో... బంధువులను కోల్పోయినవారి నేత్రాలలో... నాలో రేగిన కసి, కోపం ఏమయ్యాయి? రాక్షసుల మరణాలకు సంబరాలు జరుపుకుని, నరక చతుర్దశులు చేసుకునే సంప్రదాయం మనకుంది- ఆ రెడ్డి మాత్రం నరకాసురుడు కాదా? మంచివాడా? ఎలా అవుతాడు??

క్రమంగా అతను వాళ్ల అన్న చనిపోయిన వైనం చెప్పసాగాడు. నా మనసులో ఆలోచనలు జోడిస్తూ వింటున్నాను. ప్రతిదాని వెనకా ఆర్థిక కారణం కనిపెట్టడానికి యిచ్చగించే మనసుకి ఆ తగాయిదాలలో ఆర్థికకోణం అంతుపట్టడం లేదు.

మధ్యమధ్యలో సుబ్రావ్ రెడ్డి మంచితనం గురించి మాట్లాడుతూ ప్రశ్నలు వేస్తున్నాడు.

బండపల్లి రెడ్లకీ- వాళ్ల కుటుంబానికీ మధ్య తరతరాలుగా గొడవలున్నాయిట. స్వతంత్రానికి ముందు ఒకరి మనుషులను ఒకరు బహిరంగంగాను ఎదుర్కొనేవారుట. క్రమంగా రహస్యంగా దెబ్బతీయడాలు పెరిగాయి. ఎవరికి వారు ఆత్మరక్షణ కోసం మనుషుల్ని పోషించటం, ఆయుధాల ఖర్చు తప్పనిసరయింది. అనేక యితర అంశాలు యీ గొడవలకు తోడయ్యాయి. రాజకీయాలు, ఎన్నికలు, బూత్‌లు పట్టుకోవడాలు, సారా పాటలు, పోలీసులు... కేసులు... మోహన్రెడ్డి కొన్నాళ్లు ఉద్యోగం చేశాడట. అతని తండ్రిని చంపేసాక, ఉద్యోగం విడిచిపెట్టి కుటుంబ బాధ్యతను తీసుకున్నాడుట. అతని తండ్రిని చంపిన వాళ్లని చంపించాడట. మరికొన్నేళ్లు వాళ్లు వేటాడారట. అనేకసార్లు తప్పించుకున్నాడట. చివరికి బాంబులు వేసి అతను ప్రయాణం చేస్తున్న జీప్‌ని పేల్చేసారట.

అతను చెప్పుకుపోతున్నాడు.

హత్య!

ఎంత అసాధారణ విషయం యిక్కడ! ప్రపంచమంతటా హత్య అనాగరికమన్న భావన ఎక్కువవుతోంది. వ్యక్తిగత కారణాలతో హత్య జరగటం అనాగరికమని దాదాపుగా అంగీకరించబడింది. జాతి, మతం వగైరా సమూహనామాలతో జరిగే హత్యల మీద మాత్రం అటువంటి ఏకాభిప్రాయం లేదుగదా!

వాళ్ల మాటలను వింటూ, గొంతులను గమనిస్తున్నాను.

బాధ, ఓదార్పు.

హరిజనవాడ గుర్తొస్తోంది. కాలిన యిళ్లు, బాధాభరిత మానవనేత్రాలు...

ఈ ప్రపంచం దుర్మార్గుల నవ్వుని భరించలేదు. దానిని వికృతహాసంగా ప్రదర్శిస్తుంది కళ. దుర్మార్గుడు గొంతెత్తి ఏడిస్తే-? బహుశా ప్రపంచం కరుగుతుందేమో! దాన్ని చిత్రించగలిగిన కళకు ఉదాత్తత ఏర్పడుతుందేమో!

నాకు మాత్రం ఆ రెడ్డి విషాదం దుస్సహంగా ఉంది. దాన్ని కప్పిపుచ్చుతున్నది నా 'నాగరిక ప్రవర్తన'గా అనిపించి, నామీద నాకే రోతగా ఉంది.

"మా ప్రాంతంలో ఈ ఫాక్షన్ ఫైట్స్ లేకపోతే, మేమూ మీవాళ్లలాగే బాగుపడేవాళ్లం," అంటున్నాడు.

సుబ్రావ్ గంగిరెద్దులా అన్నింటికీ ఒప్పేసుకుంటున్నాడు. రక్తం చూస్తే కళ్లు తిరిగి క్రింద పడే పెద్దమనిషి ఆ హత్యలు జరగాల్సినవేనన్నట్లు తలూపుతున్నాడు.

"మీరన్నదంతా బాగానే వుంది రెడ్డిగారూ- మీ అన్న గురించి యింత బాధపడుతున్నారు గదా- మీరు చంపిన దళితుల మాటేమిటి?" అన్నాను. అడగవలసిన ప్రశ్న అడగవలసిన పద్ధతిలో అడగలేకపోయానన్న బాధ.

సుబ్రావ్ కంగారుగా, "ప్లీజ్ సునీ! ఇది సమయం కాదు- సందర్భం కాదు," అన్నాడు యింగ్లీషులో. అంటూ లేవబోయాడు.

సుబ్రావ్ చేతిని వదలలేదు. నా ప్రశ్నకి ఆశ్చర్యపడలేదు కూడా. నిదానంగా నావేపు చూశాడు. సన్నగా నవ్వాడు. సుబ్రావ్‌ని పక్కన కూర్చోబెట్టుకున్నాడు.

"అమ్మా- మీరిందాక పల్లెలోకి వెళ్లారట- పైపైని చూశారు- లోపల విషయాలు మీకు తెలియవు," అన్నాడు యింగ్లీషులో.

"ఎందుకు తెలీదూ-" అంటున్నాను.

"మీకు తెలిస్తే- ఏం తెలుసునో చెప్పండి."

"పేపర్ తెరిస్తే తెలుస్తుంది- రేడియో వింటే తెలుస్తుంది- టీవీ చూస్తే తెలుస్తుంది- దళితుల మీద దాడులు. మీరు తాగిన చోట కాఫీ తాగారనో- చూసినచోట సినిమా చూశారనో- మొక్కిన దేవుడిని మొక్కారనో- మీ మాట వినలేదనో- మీరు వెయ్యమన్న చోట ఓటు మీద ముద్ర గుద్దలేదనో-! ఇది మీకు తోకజాడించటం- మీ డ్యూటీ దాన్ని కత్తిరించటం-" మనసులో ఉన్నదంతా కక్కేశాను.

"మీరేం చదివారు?"

"సోషియాలజీ ప్రొఫెసర్ని."

"నేను లా చేశాను. ప్రాక్టీసు మానుకు యీ ఊరికి వచ్చాను."

ఏం చెబుతున్నాడో అర్థంకాలేదు.

"సమాజాన్ని కొందరు నడిపిస్తారని నేనూ నమ్మానమ్మా! కొందరిని నేనూ, మా అన్నా ఆరాధించాం- కానీ క్రమంగా తెలిసిందేమంటే- ప్రతి మనిషినీ- వాడు ఎంత హోదాలో ఉన్నా- సమాజమే నడిపిస్తుంది-" అంటున్నాడు.

"అవునవును- మీ చేతికి కిరోసిన్ డబ్బా, అగ్గిపెట్టే యిచ్చి ఆ గుడిసెలను కాల్చమంది- సమాజం," అన్నాను వ్యంగ్యంగా.

"మీరు కరెక్ట్‌గా చెప్పారు," అన్నాడు నిష్కర్షగా.

ఆ సమాధానంలో నిస్సిగ్గుతనం కనిపించి, నన్ను ఆశ్చర్యచకితురాలిని చేసింది.

అతను ఎలాంటి ఆవేశమూ లేకుండా అన్నాడు- "చూడమ్మా! తన చేనుకి, పంటకీ వెయ్యి న్నొక కాపలాలు కాసుకోవాలి రైతు. ప్రకృతి నుంచి, పిట్టలనుంచి, క్రిమికీటకాల నుంచి, జంతువుల

నుంచి, దొంగల నుంచి, రాజ్యం నుంచి, బ్రతుకంతా రైతుకి పోరాటమే! గోష్పాదమంతటి మడి చెక్కకోసం తన ప్రాణాలు ధారపోస్తాడట భారతీయ రైతు. ఆ మాట అన్నది ఎవరో కాదు- మార్క్స్. ఆ స్వభావం మంచిచెడ్డలు నాకు తెలీవు. అది రైతుస్వభావం, గ్రామస్వభావం. ఉందనుకున్నదేదో పోతుందనిపించితే దాని రక్షణకు ఏమయినా చేస్తాడు. ఎంతకయినా తెగిస్తాడు. నేను కాదంటే మరొకడు వాళ్లని నడిపిస్తాడు. వాళ్ల చేతిలోంచి కిరోసిన్ డబ్బా, అగ్గిపెట్టె అందుకుంటాడు,'' అంటున్నాడు.

''చూస్తున్నారు గనక చెత్త సినిమాలు తీస్తున్నారుట- చదువుతున్నారు గనక చెత్త రాస్తున్నారుట- కొంటున్నారు గనక చెత్త తయారుచేస్తున్నారుట- ప్రతివాడూ తన తప్పులను ప్రజల మీదికి నెట్టేస్తాడు. ఇంతకాలంగా జరుగుతున్న కుల, మతకలహాలను- యీ అనాగరిక చర్యలను- మీరు తలుచుకుంటే ఆపలేరా?'' అన్నాను. మా సంభాషణ యింగ్లీషులో సాగుతోంది.

''ఆపలేం-'' అన్నాడు రెడ్డి.

''చాలా దారుణంగా మాట్లాడుతున్నారు,'' అన్నాను.

''అది దారుణంగా వినిపించినా సత్యం! కుల, మత కలహాలు అనాదిగా జరుగుతున్నాయని మీరంటున్నారు. ఒక కులానికీ, ఇంకో కులానికీ మధ్య దాదాపుగా చరిత్రలో ఎక్కడా యుద్ధం జరగలేదు.''

''శైవ, వైష్ణవ యుద్ధాల మాటేమిటి?'' అన్నాను సాలోచనగా.

''అవి రెండు మతాలని యీనాడు ఎవరూ అంగీకరించరు. కులాల మధ్య అంతు లేనంత ఏహ్యత ఉన్నా- కులాలుగా మనం ఎప్పుడూ కొట్లాడుకోలేదు.''

ఆలోచనగా చూశాను.

''రాజుల రాజ్యవిస్తరణ కోసం, పగల కోసం, పౌరుషాల కోసం తమ కులం వాళ్ల మీదే దండెత్తి మాకులాగ చంపుకున్నారుగాని- ఒక కులం మరో కులం మీదకు దండెత్తి చంపలేదు. మతం కూడా అంతే.''

''నిజమేనండీ- ఈ విషయం నాకు ఎప్పుడూ తట్టలేదు,'' అన్నాడు సుబ్రావ్.

నన్ను ఆలోచనలో పడేసిన ఉత్సాహంతో అన్నాడు రెడ్డి.

''మనదేశం కులాలుగా విడిపోయి బ్రతికింది గానీ- కొట్లాడుకోలేదు.''

''సమూహాలను అణచి, చెప్పుచేతల్లో ఉంచుకోటానికే- కులాలను ఏర్పరిచాయి పాలక వర్గాలు,'' అన్నాను.

''అది మీ అభిప్రాయం. నేను చెపుతున్నది వాస్తవాలు- కుల, మత కలహాలు యిప్పుడు ప్రారంభమయాయి. స్వతంత్రానికి ముందు బ్రిటిష్‌వాడి చలవ వల్ల మతకలహాలు మొదలయాయి. యిప్పుడు కులకలహాలు మొదలయాయి. ఇది వాస్తవం. దీని వెనక చైతన్యం వుందా- అణచివేత ఎక్కువయిందా? యివ్వన్నీ అభిప్రాయాలు,'' అన్నాడు.

''అంతా రాజకీయం సార్,'' అన్నాడు సుబ్రావ్.

రెడ్డి అతని మాట పట్టించుకోలేదు. నన్నే చూస్తూ కొనసాగించాడు. అతను ఎటు నడుపుతున్నాడా అని ఆలోచిస్తున్నాను నేను.

''కులం పోవాలని అందరూ అంటారు. దాన్ని మరిచిపోయి కులాంతర వివాహాలు జరిగితే- కులం పోతుందని చాలాకాలంగా అంటున్నారు. కులానికి స్థానం లేని పారిశ్రామిక యుగంలో కులం దానంతట అదే పోతుందని కమ్యూనిస్టు మిత్రులు అన్నారు. మీ పట్నాలలో, నగరాలలో ఆదర్శవాదులూ ఉన్నారు- పారిశ్రామిక సమాజమూ ఉంది- అక్కడ కులం పోయిందా?'' అన్నాడు రెడ్డి అదోలా.

"పోయింది రెడ్డిగారూ- మాది కులాంతర వివాహమే," అన్నాడు సుబ్రావ్.

"నేనూ క్రిస్టియన్‌ని పెళ్లాడాను- ఇలాంటి కొన్ని పెళ్లిళ్ల వల్ల కులం పోతుందని- పోయిందని నాకు అనిపించటంలేదు."

"మీరేం చెప్పదల్చుకున్నారు?" సూటిగా అడిగాను.

"నేనేం చెప్పదల్చుకున్నానంటే- మీకు పల్లెటూళ్లు తెలియవు. వాటి సమస్యలు తెలీవు. ఈరోజున నేను ఎవర్నో నరికితే- రేపు వాళ్లు నన్ను నరుకుతారు. కుల కలహాలూ, కులాంతర కలహాలూ రెండూ తెలుసు నాకు. చంపేవాడెవడైనా చావుకి తెగించినవాడే!" అంటూ ఆగి-

"చూడమ్మా- మా బ్రతుకులు మేం నడిపించుకోవాలని- మా అన్నా, నేనూ- ఎన్ని కలలు కన్నాం- ఏమైంది? మా తాతలూ, వాళ్ల తండ్రులూ గర్వంగా, పౌరుషంగా కుండబద్దలు కొట్టినట్లు మాట్లడగలిగేవారు. కనీసం మాకు ఆ అవకాశం కూడా లేదు. మేం శాంతి గురించి కబుర్లు చెప్పాలి. అహింస గురించి పేపర్ స్టేట్‌మెంట్లివ్వాలి. మేం చేసిన వాటిని కాదనాలి. మిమ్మల్నేమీ మా మీద జాలిపడమనటం లేదు. మాలాంటి వాళ్ల చావు వల్ల యీ సమాజం బ్రహ్మాండంగా మారిపోతే- మంచిదే- చాలా మంచిది! కాని, మారదు. ఇది వాస్తవం. కొత్త రూపాలతో పాత సమస్యలే వస్తాయి. కొత్త వేషాలతో పాత నాయకులే వస్తారు. మీలాంటి పడక కుర్చీ సిద్ధాంతవేత్తలకు పుస్తకాలు తెలుసు. సిద్ధాంతాలు తెలుసు. ఎందులోకి దిగకుండా అన్నింటినీ వ్యాఖ్యానించటం తెలుసు! మీరు ఆస్తులు పెంచుకుంటూ- ఆస్తిహక్కు వద్దనగలరు. మీరు సంసారాలు చేసుకుంటూ- యింకొకరిని చేసుకోవద్దనటం తెలుసు! మీ పిల్లలకి పెద్దపెద్ద చదువులు చెప్పించుకుంటూ- మీ భావమాలిన్యం అంటకుండా పెంచి- మరొకరి పిల్లలని త్యాగాలు చేయమని, తుపాకులు పట్టుకోమని అరవటం తెలుసు! కులమతాలు వద్దని కబుర్లు చెబుతూ మీ యూనివర్సిటీలలో పిల్లగాళ్ల బతుకుల్ని కుల రాజకీయాలతో సర్వనాశం చెయ్యటం తెలుసు. మా పొలిటీషియన్స్- మీలాంటి వాళ్ల లెక్కల ప్రకారం- కుల, మత భావాలను- రాజకీయ లాభం కోసం వాడుకుంటాం- కుల సంఘాలు నడుపుతాం- మతకలహాలతో అమాయాకులను చంపుతాం- మీవంటి ప్రొఫెసర్లు- పెద్ద చదువులవాళ్లు- ఏ లాభాల కోసం- యూనివర్సిటీలను కుల రాజకీయాలతో ముంచేస్తున్నారు?"

అతను ఆవేశంగా అన్న మాటలకు నా దగ్గర సమాధానాలున్నాయి. నువ్వు తప్పు చేస్తున్నావంటే- నువ్వు చేయటం లేదా అంటున్నాడు. నా భావాలూ, చేతలూ వేరుకావు. దుర్మార్గుడికన్నా, వాడి సిద్ధాంతం ప్రమాదకరం. తోటి మనుషులు తమతో సమానులు కారన్న భావజాలపు పునాది మీద ఉన్న భారతీయ సమాజం యిలాంటి బలహీనులనే నాయకులుగా చేసుకుంటుంది.

ఇలాంటివాడితో మాట్లాడి ఏం లాభం? చెవిటివాడి ముందు శంఖనాదమే! మోహరించి వున్న రెండు సైన్యాల మధ్య- కృష్ణుడంతటివాడు- నీతులు చెప్పలేదు. యుద్ధం నడిపాడు. యుద్ధం చెయ్యమన్నాడు. ఏదో పక్షం వహించాడు.

ఆ సైన్యాలు రెండూ పేదలూ, ధనికులూ అవుతాయని నమ్మాను. ఆ యుద్ధం యిలా పరిణమించటం- పరిణామక్రమమా? దానికి అవరోధమా? ఇది యింజనీర్‌దా? మనసుని ఆలోచనలు నలుపుతున్నాయి.

గట్టిగా నిట్టూర్చాను.

"మేడమ్‌కి నా పనులూ నచ్చవు- నా మాటలూ నచ్చవు- ఈ విషయం వదిలేద్దాం- సుబ్బారావుగారూ," అంటూ సన్నగా నవ్వాడు.

వాళ్ల మాటలు మొదలయాయి.

సన్నని మంట. నా హృదయాంతరాలలో నన్ను నేను వేసుకోలేని- నిలదీసుకోలేని ప్రశ్నల మంట.

నేను సెలవు తీసుకుని గదికి వెళ్లాను.

అతని నవ్వు నన్ను తరుముతోంది. మనసంతా ఆలోచనా శూన్యం.

అలా పడుకుని ఉన్నాను.

కొంతసేపటికి సుబ్రావ్ వచ్చాడు- లైటు వేశాడు. నేను కళ్లు మూసుకున్నాను. మొద లెట్టాడు-

"సునీ- నువ్వు నిజంగా వండర్‌ఫుల్- నీకు ఎక్కడ మొదలుపెట్టాలో తెలుసు- ఎక్కడ విడిచిపెట్టాలో తెలుసు-"

రెడ్డిలాంటివాడిని పేల్చేశానుట!

నాతో బ్రతుకు అద్భుతంట! సెక్యూర్డ్‌ట!

"షటప్!" అరుద్దామనుకున్నాను. నిస్సత్తువ!

"నిద్రపోయావా?" అని అడిగాడు దగ్గరకు వచ్చి. నన్ను కదపటానికి సాహసించలేదు.

తెల్లవారుజామున బయలుదేరాం!

మెయిన్ రోడ్ మీదకు వచ్చేసరికి సూర్యుని రాక తెలిపే ప్రకాశం.

కొండలు, గుట్టలు, చల్లని గాలి స్పర్శ. రాత్రంతా నిద్రలేమి.

లోపలి స్వార్థాలూ, భయాలూ... ఆపై పొరలోని నమ్మకాలూ, చేస్తున్న పనులూ ఒకదాన్ని ఒకటి ఢీకొంటూంటే-... ఒకదాన్ని ఒకటి అనుసంధించాలని... ఒక్క రాత్రిలో అవుతుందా? ఒక జీవితం సరిపోతుందా?

తప్పదు- ఎక్కడో ఒకచోట ఆరంభించాలి- ఇక్కడే ఇప్పుడే ఆరంభించాలి.

"ఇన్‌సెక్యూర్డ్ ప్రపంచంలో జీవిస్తూ... సెక్యూరిటీ అనే మృగతృష్ణ వెనకాల, ఎన్నాళ్లీ పరుగు సుబ్రావ్! శేఖర్‌ని మనతోటే ఉంచుకుందాం. కారు వెనక్కి తిప్పు," అన్నాను దృఢంగా.

నామాట అర్థం కానట్టు- "రాయలసీమలో గొడవలకీ మనవాడి స్కూల్‌కీ సంబంధం లేదు. అర్థం చేసుకో," అంటూ ఆరంభించాడు తాపీగా.

"సుబ్రావ్- నటనలు విడిచిపెడదాం- కారు వెనక్కి తిప్పు," అన్నాను.

నాకు తెలుసు-

సుబ్రావ్ కారు వెనక్కి తిప్పడు.

ఇంతవరకూ- మా ఉమ్మడి జీవితంలో పరస్పరం చూస్తూ వచ్చిన ఆ సెక్యూరిటీ కూడా మాయమౌతోంది- అదీ తెలుసు.

భద్రమైనదీ, బలమైనదిగా భావించే ప్రతిదాని పునాది డొల్ల! డొల్ల!! డొల్ల!!!- అని కూడా తెలుసుకున్నాను.

*రచన మాసపత్రిక, మే 1995*

## నేపథ్యం

భద్రత కోసం మనిషి పడే ఆరాటం

# స్పర్శ

***పాలెగాళ్ల వ్యవస్థకీ, జమిందారీ వ్యవస్థకి తేడా ఉంది. మొదటిది చారిత్రకంగా వెనకటిది. రెండవది ఆంగ్లపాలనలో బలపడినది. వ్యవసాయ కులాలలో నాగలి విడిచి కత్తి పట్టవలసిన పరిస్థితులలో ఒకటి పుడితే ఆంగ్లేయుల అజమాయిషీ అవసరాల నుంచి మరొకటి పుట్టింది. తొలి వ్యవస్థలో మనుషుల తాత్వికత వేరు.***

కథ ఎలా పుడుతుంది అని అడిగితే బోలెడంత వ్యాకరణం, రసాయనికత అనర్గళంగా మాట్లాడేయవచ్చు. నువ్వు ఫలానా కథ ఎలా రాశావు అని అడిగితే నోరు వెళ్లబెట్టే వాళ్లలో నేనూ వుంటాను. అలాగని పలికెడు వాడు రామభద్రుండట అన్న నమూనాలో భక్తి, తాదాత్మ్యాలతో కళ్లు మూసేసి కర్మ సిద్ధాంతం చెప్పెయ్యటానికి సిద్ధం అయిపోను. ఎవరైనా ఓ మనిషిని చూస్తే ఏదో ప్రత్యేకత కనిపిస్తే అదేదో పక్కవాళ్ల చెవిలో ఊదెయ్యాలనిపిస్తే కథ రాసేస్తారట కొందరు. వాళ్లమీద మనకి కలిగే కోపమో, చిరాకో, మరోటో మరోటో రంజుగా చిత్రిస్తే అది చదివేవాళ్లను పట్టేస్తుం దిట. అలాగే ఓ సంఘటన చూసి మనలో కలిగే అలజడో, ఆనందమో ఏదయినా సరే రాతలో పెడితే అదీ కథ అవుతుంది. అలాంటి కథలు నేనూ కొన్ని రాశాను. అలాగని దాని నమూనా అర్థం చేసేసుకుని పుంఖాను పుంఖాలుగా రాసెయ్యటం నాకు పట్టుబడలేదు. అలాగని వాటిని తక్కువ జాతి సరుకు అని నేను అనుకోను.

ఈ నా అవగాహనా నేపథ్యం నుంచి చూస్తే-

స్పర్శ నేను రాయటానికి ఇష్టపడే రకం కథ. ఇలాంటి కథలు రాయటానికి నాకు చాలాకాలం పడుతుంది. నేననుకున్నది చెప్పగలిగినట్టు నాకు 70, 80 శాతం తృప్తి కలిగాక నేను అచ్చుకి పంపి సంతోషపడే రకం కథ ఇది.

నాకు గుర్తున్న మేరకు-

అప్పుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారి కోసం మదనపల్లి నెలకి కనీసం ఒకమారైనా వెళ్లివచ్చే రోజులలో ఈ కథకి బీజం పడింది. పాత బస్టాండు పరిసరాలలో ఆయన పనిచేసే కాలేజికి ఎదురుగా ఓ హోటలులో కాఫీకి వెళ్లాం. పక్క బల్ల వద్ద ఏవో జారేసి ఉన్నాయి. కాలికి తగిలిందో ఏదో అయింది. అవి కింద పడ్డాయి. అసంకల్పితంగా వాటిని తీసి సరిగ్గాపెట్టాను. టీ తాగుతూ అటు చూశాకగాని అవి ఏమిటో గమనించలేకపోయాను. రెండు తుపాకులు. వాటి యజమానుల వైపు పరిశీలనగా చూసాను. మావూరిలో పొలానికి వెళుతున్నపుడు చేలగట్ల మీద ఎదురయే పాలికాపులూ, వ్యవసాయదార్లూ వాళ్లు. గుడ్డ బనీను, పంచి, ఒకతనికి సగం పంట్లాం. కాఫీ తాగుతున్నారు. అతి సహజంగా, సాధారణంగా ఉన్నారు. నేను తూర్పుగోదావరి వాడిని. మాది ఏలేరు ఒడ్డు పల్లె. నీటి తగాయిదాలు ఉండేవి. కఱ్ఱలే ఉపయోగపడేవి. నేను పాలిటెక్నిక్ చదువుతున్నపుడు NCC కాంపులో మాచే తుపాకి కాల్పించారు. ఆ తర్వాత సినిమాలలో తప్ప తుపాకులు చూసే అవకాశం కలగలేదు. ఆ సమయంలో నాకు ఆశ్చర్యంతో బాటు ఈ విషయా లన్నీ గుర్తొచ్చాయి. వాటిలో కొన్ని సుబ్బయ్యగారితో కబుర్లు.

మరోసారి అదే హోటల్లో అనుపమ్ ఖేర్ అనే సినిమా నటుడిని చూడటం తటస్థించింది. ఆయన కొడుకు రిషివాలీ పాఠశాలలో చదువుతున్నాడన్నారు సుబ్బయ్యగారు. బొంబాయి మురికి వాడలలో పనిచేస్తున్న షబనా అజ్మీ గురించి ఏదో పత్రికలో చదివాను. నా మిత్రుడొకరు కారులో బొంబాయి నుంచి బయల్దేరి బెంగళూరు వచ్చాడు. అతని అనుభవాలు కొన్ని చెప్పాడు.

ఇవీ నా పరికరాలు. కథ ఇందులో లేదు గదా! కథ రాయాలన్న ప్రేరణ, ఆలోచన లేదు. అనంతపురంలో సింగమనేని, శాంతినారాయణలతో ఫ్యాక్షన్ కథల పోటీ గురించి కబుర్లు. ఎప్పుడో ఆంధ్రప్రభలో అని గుర్తు, గంగుల నరసింహారెడ్డి వాన కురిసింది అన్న కథ బహుమతి పొందింది. అది చదివినపుడు జమదగ్ని కథ మరపురాని ఆవూరు, బుచ్చిబాబు నవల చివరకు మిగిలింది గుర్తు వచ్చాయి. వాటి నుంచి కలిగిన ఆలోచన contrast.. అంటే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లినపుడు దానితో ఒక వ్యక్తికి కలిగేది స్పర్శ. దానిని చూసే చూపు, కలిగే స్పందన ప్రత్యేకమైనవి. మనం పుట్టి పెరిగిన ప్రాంతం పై మనకి ఏదో తెలుసునన్న నమ్మిక ఉంటుంది. అది మన ఆలోచనలమీద, భాషమీద మనకు ఒక విధమైన subjective సాధికారత ఇస్తున్నట్టు భ్రాంతి కలిగిస్తుంది. మరో ప్రాంతానికి వెళ్లినపుడు అది మనదయే క్రమంలో ఒక objective మేధోమథనం ఉంటుంది. ఇది స్పర్శ అనిపించింది.

సెక్యూరిటీ గురించి మనిషి పడే ఆరాటంతో నా కథ ఆరంభమయింది. అది ఎంత డొల్లో నేను చూడగలుగుతున్నాను. చూపగలనా? ఆరంభం, ముగింపు ఉన్నాయి. దాన్ని ఐడియా మీద కథ రాయటం అంటారు వల్లంపాటి. నేను భావన (concept) అంటాను. భద్రత మనిషికి కావాలి. అవసరం. కొన్ని సందర్భాలలో మనం భద్రతను వదులుకుంటే తప్ప నిజమైన భద్రత పొందలేం. సుబ్బారావుకి, సునీతకి, మోహనరెడ్డికి, పందిరికుప్పం దళితులకి, దేశాలకి, జాతులకి అందరికీ కావాలి భద్రత. వ్యక్తి భద్రత, సమాజపు భద్రత అవుతుందా? రకరకాల ప్రశ్నలు.

మనం కొత్త ప్రాంతానికి వెళ్లినపుడు ఏం చూస్తాం- నేల, పరిసరాలు. మావైపు రెండు కిలోమీటర్లు నడిస్తే ఓ ఊరు. కాలవలు. పంటపొలాలు. పచ్చదనం. ఇక్కడ? తేడా తడుతుంది. కాని దేశం అంటే అంతేనా, కాదు అంటుంది వివేచన. మనుషులు, వాళ్ల మధ్య తేడాలు, పోలికలు. అందరిమధ్యా ఒకటే పోలిక. బ్రతకాలి. కలిస్తేనే బ్రతుకు. సమూహంగా, సమాజంగా, వ్యక్తిగా బ్రతకటమంటే ఒకటే అర్థం భద్రత. అనేక పల్లెటూళ్లకు వల్లంపాటి తన మోపెడ్ మీద మోసుకు పోయి నా స్పర్శకి తోడ్పడ్డారు.

కథ నడుస్తోంది. కథ రాసెయ్యటం నాకు చిటికలో పని. కాని ఇలాంటిది నడపటం మాలిమి లేని గుఱ్ఱాన్ని స్వాధీనం చేసుకోటం. ఎటు వెళుతుందో తెలియని దాన్ని నియంత్రించాలి.

అపుడు నాకు ఒక మిత్రుడు గుర్తు వచ్చాడు. ఆంధ్రా పాలిటెక్నిక్ సహాధ్యాయి. పేరు మోహనరెడ్డి. ఊరు రాయలసీమలో ఏదో పల్లె. అతనితో ప్రాణస్నేహం లాంటిది ఉండేది. దాదాపు అప్పటికి 30 ఏళ్లక్రితం మాట. మళ్లీ ఎన్నడూ కలవలేదు. అతని పేరుతో కథలో చేరాడు. నేను రాసిన *కపోత సందేశం* అన్న కావ్యం ఇందులో చేరింది. అంతా ముందే తెలిసిన కథ రాస్తే నాకు కిక్ లాంటిది ఉండదు. మబ్బు విడి వెలుతురు చేరి స్పష్టం అవుతూంటే ఎందరో చూసేసినవే.. అందరికీ తెలిసిపోయినవే.. నాకు కొత్తగా చూసినట్టు... నేనే కనిపెట్టినట్టు... ఒక అనుభూతి.

పాలెగాళ్ల వ్యవస్థకీ, జమిందారీ వ్యవస్థకి తేడా ఉంది. మొదటిది చారిత్రకంగా వెనకటిది. రెండవది ఆంగ్లపాలనలో బలపడినది. వ్యవసాయ కులాలలో నాగలి విడిచి కత్తి పట్టవలసిన పరిస్థితులలో ఒకటి పుడితే ఆంగ్లేయుల అజమాయిషీ అవసరాల నుంచి మరొకటి పుట్టింది. తొలి వ్యవస్థలో మనుషుల తాత్వికత వేరు. ఇన్ని విషయాలు... ఆలోచనలు... సునీత, మోహనరెడ్డి సంభాషణ వెనక నడిచాయి. తెలుసుననుకుంటున్న ప్రతిదీ చెప్పెయ్యటం కథా కాదు, కళా కాదు. సూచనప్రాయంగా ఉండొచ్చు. పాత్ర మానసిక, బౌద్ధిక పరిధులు గమనంలో ఉంచుకోడమే ఔచిత్యం. వాటి మధ్య కథ పూర్తయింది.

రెండు విషయాలు చివరగా చెప్పాలి.

ఒకటి నేను కమ్యూనిస్టు వాతావరణంలో కలం పట్టిన వాడిని. ముగింపుని బట్టి కథని లెక్కగట్టే శిక్షణ నాది. కథ వ్యాకరణం రీత్యా కూడా ఎత్తుగడ, ముగింపు కథ చదివించటానికి, మరిచిపోకుండా చేయటానికి చాలా ప్రధానమైనవి. ముగింపుపై నా శిక్షణ కలిగించిన కొన్ని ఊహలపై నాకు సందేహాలు ఆది నుంచీ ఉండేవి. వాటిని గురించి తేల్చుకోటానికి నాకు పదిహేను ఏళ్లకి పైగా పట్టింది. ఇప్పటికీ నన్ను నడిపించేది మార్క్సిజమే. ప్రపంచ మానవాళి సమస్యలకు అంతిమ పరిష్కారం రాజ్యరహిత కమ్యూనిజమే అని నేను అనుకుంటాను. కాని ఆ పేర్లతో నా వ్యక్తిగత వివేచన మీద, విలువల మీద నియంత్రణను అంగీకరించలేని స్థితికి చేరుకున్నాను. నా కథలు సంధి, పాడుకాలం, స్పర్శ కొన్ని ప్రమాణాలతో చూస్తే పోరాటాన్ని, ఆశను చూపించవు. అవి అలా ముగించటానికి నేను కొంత ఇబ్బందిపడ్డాను. కాని అలా ముగియటమే ఉచితమని నేను ఆలోచించి నిర్ణయించుకున్నాను.

వల్లంపాటి వారు నా కథలో అంతర్లీనంగా ఉన్న కామం గుర్తించి కొంత అసంతృప్తి చెందారు. వ్యక్తుల ప్రవర్తనపై ఆకలిలాగే కామం ప్రభావాన్ని లేదా నియంత్రణని ఉదారంగా చూసేపాటి సహృదయత వారికి ఉంది. కాని బౌద్ధికంగా బలమైన ఆలోచనలు చెయ్యగలవారి నిర్ణయాలపై లేదా drive and inertia లపై కామానికి గల ప్రభావం చూడగల లోతు ఆయనకు లేదు. చూపినా దాన్ని ఉదారంగా చూడలేకపోయారు. వ్యక్తులు ఎంతో కొంత బలవంతులన్నది ఆయన అవగాహన అయితే, లేదా ధృఢంగా ఉండాలన్నది ఆయన ఆకాంక్ష అయితే, నా అవగాహన వేరు. వ్యక్తులు ఎంతోకొంత బలహీనులు. రచయితగా వారిని పాత్రలు చేసుకుని వారి బలహీనతలను నేనే చెయ్యిపట్టుకుని అధిగమింపజేయను. సునీత ఊగిసలాట నాకూ ఇష్టం లేదు గాని దానిని నేను ఆపలేను.

స్పర్శతో మనిషి కదులుతాడుగాని పిడికిళ్లు బిగించడు.

*'స్పర్శ' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

*10 డిసెంబర్ 2012*

22

# అస్థిపంజరం
## శీలా వీర్రాజు



*శీలా వీర్రాజు 22 ఏప్రిల్ 1939న తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'సమాజం' 1958లో అచ్చు యింది. కవిగా ప్రసిద్ధులైన వీరు 74 కథలు, 4 నవలలు, సాహిత్యవ్యాసాలు రచించారు. 10 కథాసంపుటాలు, 7 కవితాసంపుటాలు, ఒక వ్యాస సంపుటి ప్రచురించారు. వీరు చిత్రకారులుగా ప్రసిద్ధులు. రెండు చిత్రకళా గ్రంథాలు ప్రచురించారు. 'మైనా' నవలకు 1969 లో ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమి అవార్డు లభించింది. సమాచార శాఖలో పదవీ విరమణ చేశారు.*


చిరునామా

217, నారాయణాద్రి,
ఎస్.వి.ఆర్.ఎస్. బృందావనం,
సరూర్‌నగర్, హైదరాబాద్-500 035
Ph.: 81068 83099


శర్మ జీపు వేసుకుని రేవు దగ్గరకొచ్చాడు. మధ్య దారిలో యింజను చెడిపోయిందో ఏమో, అనుకున్న సమయానికి లాంచి వొడ్డుకు రాలేదు. ఒడ్డుకు కొద్ది దూరంలో చెట్టు కింద జీపును ఆపి, తాపీగా సీటుకు జారబడి సిగరెట్టు కాలుస్తూ కూచున్నాడు.

శర్మ గవర్నమెంటు డాక్టరుగా పనిచేస్తూ, స్కాలర్‌షిప్ మీద విదేశాలకు వెళ్లి ఒక ఏడాది పాటు వుండి వచ్చాడు. తిరిగి వచ్చిన నాలుగునెలలకే మన్యం ప్రాంతంలో మలేరియా అరికట్టేందుకై అతన్ని వేశారు. ఇద్దరు అసిస్టెంటులు, ఒక జీపు, కొండ మీద చక్కటి బంగళా, డిస్పెన్సరీకి అవసరమైన సామాను, ఇద్దరు నర్సులు, నలుగురు పనివాళ్లు- హోదాకు తగ్గ వుద్యోగం.

ఏకాంతం అనుకోకపోతే అదంతా ఒక అందమైన జీవితం. పట్టణంలోలా రైళ్లూ, కార్లూ, జనం గుంపులూ, క్లబ్బులూ, సినిమాలూ, రకరకాల వినోదాలూ యిక్కడ లేకపోయినా ఎత్తయిన కొండలూ, కొండల మీద మేత మేయడానికి వాలే నల్లటి మబ్బుల గుంపులూ, లోతుగా యిరుగ్గా కొండల మధ్య అగాధాలూ, సన్నగా సూదిగా ఆకాశంలోకి చొచ్చుకుపోయిన కొండ శిఖరాలూ, వాటి మీద కొండనంతటినీ ఆకుపచ్చ చీరతో చుట్టేసినట్టు పచ్చగా పసుపుగా ఎత్తయిన చెట్లూ, విరిగి లోయలోకి

జారిన బండరాళ్లూ, మెలికలు మెలికలు తిరిగి పరుగెడుతూ ఎక్కడికక్కడే ఆఖరైపోయి మళ్లీ ఏ రాళ్లసందుల్లోనో పుట్టి అల్లంత దూరంలో మాయమయ్యే పిల్లకాలువలూ, జీపు పోతుంటే అడ్డంగా చెంగుచెంగున దూకుతూ పారిపోయే లేళ్లూ, జింకలూ, చెవులు నిక్క బొడుచుకుని దొంగచూపులు చూస్తూ దూకుతూపోయే తెల్లని బొద్దు కుందేళ్లూ, కొమ్మకొమ్మనా నిలిచి పిలిచి పలకరించే రకరకాల పక్షులూ- యివన్నీ యీనాటి పట్నవాసాన్నీ, వాటి మనుషుల్నీ మరిపించి జీవితాంతం ఇక్కడే పడుండేలా చేస్తాయి. ప్రకృతిని ప్రేమించేవాడికి ఇదంతా ఒక స్వర్గంలా అనిపిస్తుంది.

శర్మను ఆ ప్రకృతీ, అక్కడి అలవాట్లూ విశేషంగా ఆకర్షించాయి. నల్లని కొండచరియలు, తెల్లగా నల్లగా ఎగిరే మేఘాలు, పచ్చగా పసుపుగా దూరానికి నీలంగా కనిపించే చెట్లు, లావుగా సన్నగా కొండల మీద నుండి బండల పక్క నుండి పాముల్లా మెలికలు తిరుగుతూ కొండ కాలువలు, ఒకేచోట గుంపుగా పదీ పదిహేను పూరిపాకలు అతనికి చాలా సన్నిహితమైపోయాయి. రోజూ శర్మ జీపు వేసుకుని ఆ ప్రాంతాలన్నీ తిరిగి అక్కడివాళ్లకు ఇంజక్షన్లనీ, మందుల్నీ, సలహాలనీ యిస్తుంటాడు.

శర్మ పూర్తిగా మారిపోయాడంటే ఆశ్చర్యపడక్కర్లేదు. ఆ ప్రకృతే అలాంటిది. అక్కడి ప్రకృతీ, అతని చుట్టూ వున్న పరిస్థితులూ అతన్నలా మార్చేశాయి. తనలో వచ్చిన మార్పును తలచు కుంటుంటే ఒక్కొక్కప్పుడు అతనికే ఆశ్చర్యం వేస్తూ వుంటుంది. విదేశాలు తిరిగి వచ్చినవాడేనా తను అని విస్తుపోతుంటాడు.

ఏ వ్యక్తయినా విదేశాలు తిరిగొచ్చాడని చెప్పుకోడానికి పట్నం మంచి పబ్లిసిటీ యిస్తుంది. కార్లూ, నలగని ఉలెన్ సూట్లూ, సన్మానాలూ, పత్రికలూ, పెద్దలతో పరిచయాలూ, పరాయిభాషలో పలకరించి మాట్లాడుకోడానికి మిత్రులూ మనిషి విదేశాలు తిరిగి వచ్చాడని చాటడానికి తోడ్పడ తాయి. కాని యిక్కడ యీ కొండల మధ్య లోయల్లో ఎక్కడో మైలుదూరంలో పదీ పదిహేను మంది వుండే యీ నిర్జన ప్రదేశంలో అతను ఏఏ దేశాలు తిరిగాడో, జీతం ఎంతో తెలుసుకోవలసిన అవసరం ఎవరికీ వుండదు. అక్కడివాళ్లకు కావలసిందల్లా అతను మందు యిస్తున్నాడా? అది గుణం యిస్తున్నదా అని.

నిజానికి ఆ ప్రాంతంలో వాళ్లెవరూ అతని దగ్గర మందు తీసుకోరు. ఇంగ్లీషు మందులూ, సూదిమందులూ వారికి యిష్టంలేదు. ఏ జబ్బొచ్చినా నాలుగాకులు తెచ్చుకుని నాలుగువేళ్లు తవ్వుకుని నములుతారు. మరో వ్యాధి అయితే ఎవరూ అతన్ని లెక్కచేయరు, ఒక్క మలేరియా తప్ప. అదీ అక్కడి కోయజాతివారినీ, అడవిజాతివారినీ ఏమీ చెయ్యలేదు. ఇప్పుడిప్పుడు కొత్తగా జనం పట్నం నుండి ఎగబాకి వ్యాపారం సాగిస్తున్నారు. వాళ్లకు మలేరియా తగులుతోంది. దాన్ని అరికట్టడానికి అతన్ని వేశారు.

కొండోళ్లతో మాట్లాడడమంటే అంత సులభమేం కాదు. ఒకపట్టాన వాళ్లకు అర్థంకాదు. అతను యిచ్చే మందులు తాగడానికి వాళ్లు వొప్పుకోరు. వాళ్లకు నెమ్మదిగా నచ్చజెప్పాలి. వాళ్లతో పాటు కూర్చుని ఆప్యాయంగా మాట్లాడాలి. వాళ్లను నవ్వించాలి. వాళ్లమధ్య కలసి గుడిసెల్లోనూ, నేలమీదా కూచోవాలి. విదేశాలు వెళ్లొచ్చానన్న గర్వం పనికిరాదు. వాళ్లతోపాటు తనూ ఒక్కడై నవ్వుతూ నవ్విస్తూ తిరుగుతూ, వాళ్లు తీసుకెళ్లిన చోటికి పోతూ, వాళ్ల మోటు సరసాల్నీ వేళాకోళాల్నీ భరిస్తూ వుండాలి.

శర్మకు అవన్నీ అలవాటయిపోయాయి. నిజంగా అతను ఆ ప్రకృతితోనూ, అక్కడివాళ్ల తోనూ కలసిపోయాడు.

అక్కడి ప్రకృతినీ, ప్రజల్నీ వివరిస్తూ శర్మ పట్నంలో వున్న మిత్రులిద్దరికీ వుత్తరాలు రాస్తూండే వాడు. రెండేళ్లకి, ఒకరోజు యిద్దరూ కలిసి వస్తున్నామని ఉత్తరం వచ్చింది.

ఒకడు సత్యం.

రెండోవాడు శివం.

ఇద్దరూ ప్రకృతి అందాన్ని సొంతం చేసుకోవాలని, ఆ సౌందర్యం ముందు గుడ్లప్పగించి కూచుని గడగడా మంచినీళ్లు తాగినట్లు అందాన్ని కళ్లతో తాగేసేవాళ్లే! ప్రకృతి అందాన్ని ప్రేమించి నట్టు స్త్రీని కూడా ప్రేమించలేరేమో! స్త్రీలో అందం వుండవచ్చు. అది లేకపోయినా మోహం అందాన్ని సృష్టిస్తుంది. మోహం లేకపోతే స్త్రీలో ఆకర్షణ ఏదీ?

మరి ప్రకృతి అలాకాదు- దాని అందంలో ఆకర్షణ వుంది. రోజులపాటు నిద్రాహారాలు మానిపించి కూర్చోబెట్టే శక్తి వుంది. మానవుణ్ణి మహా సౌందర్యం ముందు అల్పుడ్ని చేసి తన ముందు మోకరిల్లజేసుకునే మహత్తు వుంది. ఇవి అందర్నీ కదపలేకపోయినా సత్యం, శివం లాంటి వారిని మాత్రం వూపి పారేస్తాయి. వాళ్ల ఆలోచనల్ని పునాదుల్తో సహా కదిలించేస్తాయి.

గీతల్లో ఆకారాల్నీ పోలికల్నీ తెప్పించి, కళ్ల ముందు ప్రకృతిని కృత్రిమంగా సృష్టించి, సృష్టికి ప్రతిసృష్టి చెయ్యగల చిత్రకారుడు- సత్యం.

దాని సౌందర్యాన్నీ సోయగాన్నీ వర్ణించి, వినిపించి, మారుమూలలకు కూడా దాని ప్రాముఖ్యతను ఎలుగెత్తి చాటే కవి- శివం.

ఇద్దరూ కలిసి ఫలానానాడు వస్తున్నామని ఉత్తరం రాశారు. మిత్రుల్ని తీసుకెళ్దామని శర్మ జీపు వేసుకుని వచ్చాడు. లాంచి యింకా రాలేదు. జీప్‌లో కూచుని ఆకాశంలో మేఘాలు పీల్చేసిన పల్చని వెలుగుతడినీ, చెట్లగుబురుల్లోనూ, కొండల దిగువ లోయల్లోనూ పేరుకుంటున్న చీకటినీ చూస్తున్నాడు.

లాంచి వస్తోన్న శబ్దం సన్నగా వినిపించింది. లేచి గట్టు మీదికొచ్చి నుంచున్నాడు. లాంచి వస్తోంది. బుడబుడా నీటిని శబ్దం చేసుకుంటూ లాంచి వొడ్డుకొచ్చి ఆగింది. అలలు గట్టు మీద తాపిన రాళ్లనూ, గట్టు వదలి నీళ్లల్లోకి దిగిన చెట్లవేళ్లనూ కదిపి శబ్దం చేసి మాయమయ్యాయి.

సత్యం, శివం లాంచి దిగొచ్చి మిత్రుడ్ని కావలించుకున్నారు. ఆప్యాయంగా పలకరించు కున్నారు. చాలాసేపు అక్కడే నిలుచుని మాట్లాడుకున్నారు.

ఆ తర్వాత ముగ్గురూ వెళ్లి జీపు ఎక్కారు. శర్మ డ్రైవ్ చేస్తున్నాడు. వెనక సీట్లో సత్యం, శివం కూచుని పరిసరాల కేసి చూస్తున్నారు. చీకటిలో వాళ్లకు కనిపించేదేమీ లేదు. అయినా ప్రకృతి చీకటి చీర చుట్టుకుని ఎంత భయంకరంగా, గంభీరంగా వున్నా అది కూడా ఓ సౌందర్య మనే వాళ్ల వాదం.

చూపుల్ని తమలో విలీనం చేసుకుని, ఆశ్చర్యాన్నీ ఆనందాన్నీ కలిగించి భావాలనూ బుద్ధినీ స్తంభింపజేసేదే సౌందర్యం. చీకటి కూడా ఎంత అందంగా వుంటుందని! మన కళ్లకు దాని అందం కనిపించదుకాని కనిపిస్తే అందాన్ని భరించలేక, ఆ చీకట్లో పరుగెత్తి దొర్లి ఏడవాలనిపిస్తుంది. గబ్బిలాలూ, పెద్దపులులూ, పిల్లులూ ఎంత అదృష్టం గలవి! ఆ అదృష్టం మనకు లేదు. చీకటంటే మనకు అసహ్యం, భయం. దాన్ని చీదరించుకుంటాం. అక్కడ్నించి ఏ వెలుగునో వెతుక్కుంటూ పారిపోతాం. వాటికా బాధలేదు. చీకటిలోనే స్వేచ్ఛగా, ఆనందంగా, తృప్తిగా తిరుగుతాయి అందాన్ని అనుభవిస్తూ.

జీపు హెడ్‌లైట్లు చీకట్లను చీల్చుకుని ముందు కొద్దిమేర వెల్తుర్ని సృష్టిస్తున్నాయి. కొండల కింద నుండి, పెద్ద బండరాళ్ల పక్క నుండి, లోయల్లో నుండి, ఎత్తయిన గుట్టల మీద నుండి సన్నని కంకరబాట ఒకటి బండి వెళ్లే వెడల్పులో వుంది. కొద్ది దూరం పోయాక కంకరబాట ఆఖరైపోయి దాన్ని కలుపుతూ మట్టిబాట వుంది. కుదుపుల్తో ఎగిరిపడుతూ ఆ బాటలోంచి పోతోంది జీపు. మధ్యమధ్య చెట్లకొమ్మలూ, రాళ్లూ జీపుని రాసుకుంటున్నాయి. పక్కకు దిగితే

మళ్లీ కనిపించనంతటి అగాధాలు ఒకవైపూ, జీపు టాపు మీదకి వంగి ఏ క్షణంలోనన్నా మీద పడబోయేటట్టు కొద్దిపాటి ఆధారం మీద ఆనుకున్న బండరాళ్లు మరోవైపు వున్నాయి. మెడ తెగగొట్టడానికి తీసుకుపోతున్న మేకపిల్లలా వెళ్లలేక వెళ్లలేక లోపలి ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకుని వెళ్తోంది ప్రాణంలేని ఆ యంత్రం.

నాలుగైదు కుందేలు పిల్లలూ, జింక పిల్లలూ వెలుతుర్ని చూసి ప్రళయం వచ్చిపడ్డట్టు అడ్డంగా విరిగిపడ్డ చెట్లకొమ్మల్నీ, బండరాళ్లనీ చెంగుచెంగున దూకుతూ దాటుతూ చీకట్లో కలిసిపోయాయి. ఒకటి రెండు రాళ్లు దొర్లుకుంటూ వచ్చి జీపు పక్కనే పడి, కింద వున్న కాలవలోకి జారిపోయాయి. ఎవరూ ఏమీ మాట్లాడ్డం లేదు. ఎవరేమన్నా శర్మ నిశ్చలత చెదిరి జీపు ఏమైనా కావచ్చు. సౌందర్యంలో కూడా భయం వుందన్న సంగతి ఆలోచిస్తూ ఊపిరి బిగబట్టి కూర్చున్నారు.

దారిలో గూడెం ఒకటి తగిలింది. బాటపక్క పదీ పదిహేను పూరిపాకలు అక్కడక్కడ అంతంత దూరంలో వున్నాయి. ఇళ్లల్లో దీపాలు లేవు. దగ్గర్లోనే చిన్న మంటను వెలిగించి, దాని చుట్టూ కోయవాళ్లు కొందరు పాడుతూ ఆడుతున్నారు. మోటుగా, బలంగా వున్న ఆడాళ్లూ, మగాళ్లూ ఒకళ్లతో ఒకళ్లు సరసాలు ఆడుతూ తూగుతూ తోసుకుంటూ గెంతుతూ తరుముకుంటున్నారు. ఆడాళ్ల వొంటి మీద బరువెక్కువే వుంది. మెడలోనూ చేతులకూ దండలకూ పూసలూ, వేర్లూ, ఇత్తడివీ రాగివీ గొట్టాలూ జారిపోతూ వేళ్లాడుతున్నాయి. చేతుల్తో నడుములు పెనవేసుకుని మంటచుట్టూ గుండ్రాకారంలో నిలుచుని నిశ్శబ్దాన్ని నవ్వుల్తో, అరుపుల్తో విరుస్తూ చలి కాచు కొంటున్నారు. గుంపులోని పిల్లకాయలు జీపుశబ్దం వినడంతోనే పరుగెత్తుకొచ్చి బాటకు అటూ యిటూ నుంచుని చప్పట్లు చరుస్తున్నారు. పెద్దాళ్లు ఎగాదిగా జీపును చూసి మళ్లీ యథావిధిగా ఆడుతూ పాడుతూ తమ పనిలో తాము మునిగిపోయారు.

"ఎంత బలంగా, మోటుగా ఉన్నారో!" అన్నాడు సత్యం.

"ఎంత ఆనందమైన జీవితం! విచారం లేని బ్రతుకులు సుమీ!" అన్నాడు శివం.

రెండింటికీ ఊ కొట్టాడు శర్మ.

వాళ్ల పాటలూ, వాళ్ల కేరింతలూ ఆ కొండలోయల్లో, ఆ రాళ్లమధ్య, అక్కడి చెట్ల అడుగున, ఆ కాలవ నీళ్లల్లో ప్రతిఫలిస్తున్నాయియి. జీపు వాళ్లకు దూరమైపోయింది. క్రమక్రమంగా అవీ సన్నగిల్లాయి. నిశ్శబ్దంలో అన్ని శబ్దాలూ కరిగిపోయి ప్రకృతిలో నిశ్చలత తొంగి చూస్తోంది.

జీపు లోయలాంటి దాన్ని దాటి చిన్న పచ్చికబయలు ప్రదేశంలోకి వచ్చింది. కోయ వాళ్లు వ్యవసాయం చేసి సారం తగ్గిపోతే వదిలేసిన ప్రదేశం అది. దానికి వందగజాల దూరంలో ఒకవైపు కొండలాంటి ఎత్తుప్రదేశం వుంది. దానిమీద ఒక బంగళా వుంది. లోన హరికేను దీపాలు వెలుగుతున్నాయి. నడవాలో మాత్రం పెట్రోమాక్సు లైటు తెల్లగా వెలుగుతోంది. బార్లా తెరిచిన కిటికీ సందులో నుండి వెలుతురు కొండ కింద కాలవనీళ్లల్లో పడి వెండిలా తళతళలాడుతున్నాయి. నీళ్లు. ఆ యింట్లో నడవాలో, బయట బంగళా పక్క చెట్టు కింద గుబురుల్లో మనుషుల అలికిడి వినిపిస్తోంది. జీపు చుట్టూ తిరిగి బంగళా చేరుకుంది. మిత్రులు ముగ్గురూ జీపు దిగి నడవాలోకి నడిచారు.

భోజనాలయ్యాక ముగ్గురూ బంగళాని ఆనుకున్న పెద్ద రాతిబండ మీద కూచుని సిగరెట్లు కాల్చుకుంటున్నారు.

"ఎలా వుంది యీ చోటు?" అన్నాడు శర్మ.

"నన్ను యిలాంటి చోటగాని పడేస్తే నగర నాగరికుడి పాదస్పర్శే తగలని యీ ప్రదేశాల్నీ, చెట్లనూ, యీ కదిలే కాలవల్నీ, పక్షుల్నీ బొమ్మలు గీసి, స్త్రీ వంటిమీద యితరులకు కనిపించ కుండా దాచిన భాగాల్లా సృష్టిలో దాగిన యీ మారుమూల సౌందర్యాన్ని అందరికీ బాహాటంగా

బట్టబయలు చేసేవాడిని. ఇక్కడ కూర్చుంటే తయారైన లేండ్‌స్కేపుల్ని ఏ లండన్ ఆర్ట్ గేలరీలోనో ప్రదర్శిస్తే ఫస్ట్‌ప్రైజ్ వచ్చి తీరుతుంది. ఇదిగో యిక్కడ ఈ కాలవ వొడ్డున నీళ్లల్లో పాదాలలోతున నిలుచుని కడవెత్తుకుంటూ ఓ స్త్రీ వుంటే యీ ప్రదేశం యింకెంత కళకళలాడుతుందో గదా! రాత్రివేళే యిది యింత అందంగా వుంటే పగలు మరింకెంత అందంగా వుంటుందో! నిజంగా నువ్వు అదృష్టవంతుడవోయ్ శర్మా! ఇలాంటి ప్రకృతి మధ్య నువ్వుంటున్నావంటే నాకెంత అసూయగా వుందో తెలుసా?'' అన్నాడు సత్యం.

చిన్నగా చిరునవ్వు నవ్వాడు శర్మ. ''మరి నీకెలా వుంది?'' అన్నాడు శివంవైపు తిరిగి.

''నేను యింతవరకు యిలాంటి సౌందర్యాన్ని ఎవరో చెప్పగా వినడమేగాని ప్రత్యక్షంగా చూడలేదు. ఈ చెట్ల ఆకులు ఎంత అందంగా శబ్దం చేస్తూ కదులుతున్నాయి! అగాధాల్లా నీలంగా నీళ్లూ, వృక్షాల మధ్య చంద్రహారంలా కొండల మధ్య లోయలో పిల్లకాలువా, స్నానంచేసి తలార బోసినట్టు ఆకాశంలో నల్లని చీకటీ- వీటి మధ్య కూచుని కలం పట్టుకుంటే ఓ మహాకావ్యాన్ని సృష్టించకపొయ్యేవాడినా. ఇక్కడో ప్రణయఘట్టం- ఇద్దరు ప్రియులు కలుసుకోవడమో, విడిపోవడమో, తెగించి నీళ్లల్లోకి దూకి చావడమో ఏదో ఒకటి జరిగితే ఎంత నిండుదనం, ఎంత కళా యీ ప్రదేశానికి వస్తాయి! నువ్వు కేవలం అనుభవించి ఆనందిస్తున్నావేగాని నేనయితే ఇక్కడ కాలంలో కరిగిపోయిన చరిత్రను- ఈ నీళ్లల్లో, యీ రాతిమీద, యీ గడ్డిలో, యీ కొండలపైన, యీ లోయల్లోపల వెన్నెల రాత్రుళ్లు, చీకటిరోజులు రహస్యంగా కలుసుకున్న ప్రియుల్ని లోకానికి చాటి, వాళ్ల ధైర్యానికి అభినందననూ, వాళ్ల ప్రేమకు ఫలితాన్ని బట్టి సానుభూతినో, సంతోషాన్నో యిప్పించేవాడిని. నువ్వు నిజంగా చాలా అదృష్టవంతుడివోయ్ శర్మా! ఒక విధంగా చూస్తే డాక్టర్లు ప్రకృతిని ప్రేమించలేరు. దయాదాక్షిణ్యాలు, పాపం, భయం, సౌందర్యం వాళ్లను ఎక్కువగా కదిలించలేవు. సృష్టిని చంపడం అతనికి కష్టం కాదు. సౌందర్యాన్ని నిర్దయగా, పాపపుణ్యాల ప్రమేయం లేకుండా నాశనం చేస్తాడు. అందమైన స్త్రీ రూపాన్ని చూస్తే అతనికి కనిపించేది బాహ్యరూపం కాదు. లోపల వికారంగా రక్తం, ప్రేవులు, జబ్బులు, పురుగులు, సన్నని ఎముకల పోగుల అస్థిపంజరం! కానీ నువ్వు డాక్టరువే అయినా అందుకు విరుద్ధంగా మారిపోయావు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఇది వాళ్లలోనూ దయా, ప్రేమా, అభిమానం వుందని నిరూపించడంగాబోలు.''

శర్మ మళ్లీ తనలో తాను నవ్వుకున్నాడు. ఆ నవ్వుకు శృతిగా ఎక్కడో ఓ పిట్ట కూసింది. కొండలోయల్లో ఆ నిశ్శబ్దంలో ప్రతిధ్వనించింది.

శర్మ చెప్పాడు-

''నేనిలా మారిపోవడం నాకు కూడా చాలా ఆశ్చర్యంగానే అనిపిస్తూ వుంటుంది. కారు మీద తప్పితే కదిలేవాడిని కాదు. పరివారం వుంటేగాని అవతలకు అడుగు పెట్టేవాడిని కాదు. ఈనాడు ఆ పట్టుదలా, ఆ గర్వమూ ఏమయ్యాయో తెలీదు. రెండేసి మైళ్లు తుప్పల్నీ, గుట్టల్నీ, నీళ్లచారల్నీ దాటుకుని నడిచి వెళ్లడం అంటే నాకిప్పుడు చాలా యిష్టం. జీపు వున్నా మరీ దూరమైతేగాని దానిమీద వెళ్లను. ఇక్కడి వాళ్లతోపాటు నేలమీదో, రాతిమీదో, గడ్డిపైనో కూచుని మాట్లాడుతూ, వాళ్లతో కలిసి తిరుగుతూ వాళ్లు తెచ్చిన పళ్లనీ, దుంపల్నీ తీసుకుని; వాళ్లలా పచ్చివీ, కాల్చినవీ తింటూ ఒకరకంగా వాళ్లల్లో కలిసిపోయాను. నేను వెళ్లేటప్పటికి చిన్నపిల్లలు నా చుట్టూ చేరిపోయి నా కోటునీ, నా సంచినీ పట్టుకుని వేళ్లాడుతూ, భుజాలు రాసుకుంటూ చుట్టూ గెంతుతుంటారు. నిజానికి నన్ను యిక్కడ వెయ్యకపోతే నేనిలా అయ్యేవాడినే కాదు. ఇందాక నువ్వన్నట్టు దయాదాక్షిణ్యాలు లేని రసహీనమైన గుండె నాది. కాని అది కరిగిపోయింది. నా చుట్టూ వున్న ప్రకృతే నన్నిలా మార్చేసింది. సౌందర్యం అనేది కేవలం సినిమాల్లోనూ, తారల మొహాల్లోనూ,

పట్నాల్లో టిప్‌టాప్‌గా తిరిగే పాశ్చాత్య నాగరికతకు సరికొత్త కార్బనుకాపీల్లాంటి స్త్రీలల్లోనూ కాదు వుండడం. పంచభూతాలూ కలిసి తాపీగా విశ్రాంతి తీసుకుంటున్న యిలాంటి నిశ్శబ్ద వాతావరణం లోనే అందం వుంది. పనికిరాని మట్టి తునకా, జారిపోయే నీటిచుక్కా, పొద్దున్న ఎదురొచ్చి ముఖం ఎత్తి పలకరించి దాటిపోయిన పిల్లగాలీ, కొండ శిఖరం మీద గుచ్చుకున్న ఎర్రని సూర్యకిరణం విడివిడిగా గుర్తింపు పొందకపోయినా యివన్నీ కలిస్తే ఎంత అందాన్ని సృష్టిస్తాయి!''

ముగ్గురూ చాలాసేపు ఆ రాతిమీదనే కూచుండిపోయారు. ఎంతసేపయిందో తెలీదు. కబుర్లతో కాలాన్నే మర్చిపోయారు.

దూరంగా ఒక కొండపైన చిన్న వెలుగు లేచి పెద్ద మంటై, ఆ ప్రదేశమంతా ఎర్రగా చీకట్లను దూసుకుంటూ మండిపోతోంది. తెల్లటి పొగలు మెలికలు మెలికలుగా ఆకాశంలోకి వ్యాపిస్తు న్నాయి. ప్రకృతి ప్రశాంతతని భంగపరుస్తూ పక్షులు అరుస్తూ ఎగురుతున్నాయి.

సత్యం, శివంలు ఆశ్చర్యంగా అటు చూస్తున్నారు. ''మరేం లేదు, ఏ ఎలుగ్గొడ్డునో భయ పెట్టడానికి మంటేస్తున్నట్టున్నారు కోయవాళ్లు. అలాంటివి యిక్కడ తరచూ కనిపిస్తూనే వుంటాయి. మీలాటి కొత్తవాళ్లకి అది ఏ కార్చిచ్చో అనిపిస్తుంది,'' అన్నాడు శర్మ.

ముగ్గురూ ఆఖరి మంట చివరి వెలుగు చిక్కటి చీకటిలో యింకిపోయేవరకు కూచుని నిద్రపోదామని లేచారు.

ఉదయం లేచేసరికి ప్రకృతి చక్కగా సింగారించుకుని ఎదుట నిల్చుని వుంది. తలలో ఎర్రగన్నేరులా మద్దిచెట్ల గుబురుల్లో నుండి సూర్యుడు తొంగి చూస్తున్నాడు. కిటికీలోంచి చూస్తే గుట్టలూ, కొండలూ, అగాధాలూ, కాలువలూ అందంగా మృదువుగా పచ్చగా కనిపిస్తున్నాయి. కొండ శిఖరాల్లాంటి వృక్షాల్ని కప్పుతూ ఆకుపచ్చని రంగు చీర పరచుకుని వుంది.

ఎక్కువసేపు నిద్రపోవాలనిపించలేదు వారికి. తొందరగానే లేచి స్నానం, పానం పూర్తి చేసుకున్నారు. కాస్సేపు అలా కొండల మీద తిరిగి వద్దామన్నారు.

శర్మ చిన్న అభ్యంతరం చెప్పాడు- రేపు ముగ్గురం కలిసి జీపుమీద అడివంతా తిరిగొద్దామని.

''పోనీ యివ్వాల్టికి మేం యిద్దరం అలా తిరిగొస్తాంలే,'' అంటూ కాగితాల కట్టల్తో ఫ్లాస్కుల్ని భుజాన వేలాడేసుకుని బయలుదేరారు సత్యం, శివంలు.

వాళ్లు వెళ్తున్నప్పుడు, ''జాగ్రత్త సుమా,'' అని హెచ్చరించాడు శర్మ.

''అలాగే,'' అని చెప్పి బయలుదేరి హుషారుగా కొండల్నీ, గుట్టల్నీ ఎక్కుతూ, దిగుతూ, కాలువల్లో మోకాళ్ల నీటిలో దిగి నడుస్తూ అడవిలో నుండి, లోయల్లో నుండి గెంతుతూ, పరుగెడుతూ అనుకోకుండా రెండు మైళ్ల దూరం నడిచిపోయారు.

చిన్న కోయగూడెం తగిలింది. కొత్త మనుషుల్ని అక్కడివాళ్లు విచిత్రంగా చూస్తూ దగ్గరకు చేరారు. వాళ్లను దాటుకొని మళ్లీ నడక సాగించారు వారిద్దరూ. మధ్యాహ్నమయింది. సూర్యుడు నడినెత్తి మీదకు వచ్చాడు. ఇక నడవలేక గుంపుగా వున్న టేకుచెట్ల మధ్య నీడలో కూచున్నారు. అప్పటికి ఫ్లాస్కులో సగం కాఫీ అయిపోయింది. మిగతాది కూడా ఖాళీ చేసి సిగరెట్లు వెలిగించారు.

దారిలో వస్తూ సత్యం కొండల్నీ, చెట్లనీ, అక్కడి కోయవాళ్లనీ గీచిన స్కెచ్‌లన్నిటినీ ఓమారు తీసి చూసుకున్నాడు. ఓ స్త్రీ కొండమీద కూచుని జుత్తు ముడిపెట్టుకుంటోంది. ముందుకు పొడుచుకొచ్చిన ఆమె వక్షం, కుడివైపు చంకకింద నుంచి అవుపిస్తోంది. ఆ బొమ్మను అక్కడక్కడ దిద్ది శివంకు చూపించాడు. బావుందన్నాడు శివం. తను కూడా చూసిన ఆ ఆడమనిషి అందాన్ని గురించి పావుగంటసేపన్నా పొగిడాడు.

అక్కడకు కొద్దిదూరంలో చిన్న కాలవ వుంది. ఆ కాలవలో ముఖం కాళ్లూచేతులూ కడు క్కుని మళ్లీ కాలవ వొడ్డు వెంబడే బయలుదేరారు. కొద్దిదూరం వెళ్లగానే కాలవలో నీళ్లు

కనిపించలేదు. అర ఫర్లాంగు దూరంలో మళ్లీ నీళ్లు తగిలాయి. జల ఎక్కడికక్కడే వూరుతూ ఆఖరవుతూ వెళ్లేకొలదీ కాలవ యింకా లోయల్లోంచీ, చెట్ల వేరుల కింద నుంచీ, బండరాళ్ల పక్క నుంచీ లాక్కుపోతోంది. ఉత్సాహంతో చాలా దూరం వెళ్లిపోయారు వాళ్లు. అకస్మాత్తుగా వాళ్లకి బంగళా జ్ఞాపకానికొచ్చింది.

చుట్టూ చూశారు. బంగళా కనిపించడం లేదు. వాళ్లు మాత్రం లోయలో నుంచున్నారు. చుట్టూ కొండలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొండశిఖరాలు తల మీదకు వంగి చూస్తున్నాయి. పెద్ద వర్షం వస్తే నీళ్లు ఆ లోయని ముంచి వాళ్లను మళ్లీ కనిపించకుండా చెయ్యొచ్చు. అడవిలోంచి పారిపోయొచ్చిన ఏ చిరుతపులన్నా వాళ్ల మీద అమాంతం విరుచుకుపడొచ్చు. కొండ ఎక్కబోయి కాలుజారి పడితే ఆకారం కూడా తెలీకుండా ఎముకలపోగులా కావచ్చు. రక్షించేవాళ్లెవరూ లేరు. అరిచినా అది వాళ్లకు తప్ప మరొకరికి వినిపించదు. తమ సంగతి యింటికి చేరేసే వాళ్లయినా వుండరు. నికృష్టపు చావు చావాల్సి వస్తుంది.

వాళ్లిద్దరకూ భయం వేసింది.

వెనక్కు తిరిగి వెళ్లిపోదామని బయలుదేరారు.

లోయలో సన్నని యిరుకుబాట వెంట వెళ్లి ఓ పెద్ద బండరాయిని దాటుతూ చటుక్కున ఆగిపోయాడు సత్యం. శివంకు కూడా ఆశ్చర్యం వేసింది.

ఎదురుగా బండ కింద అస్థిపంజరం!

దగ్గర్లో అక్కడక్కడా ఒకటి రెండు గుడ్డ పేలికలూ, చెదిరిపోయిన పూసలూ, గాజుముక్కలూ వున్నాయి. ఎంత కాలం నుంచి అది అక్కడ వుందో తెలియదు. వట్టి ఎండిపోయిన ఎముకలు తప్ప మాంసంగాని, రక్తంగాని లేదు. ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ ఎప్పటి నుండో అలా పడి వున్నట్టుందది.

'అసలు యిదిక్కడికెలా వచ్చింది?' అన్న ప్రశ్నకు యిద్దరకూ జవాబు దొరకలేదు. ఇలాంటి ఏకాంతప్రదేశంలో మనుషుల అలికిడే వుండనిచోట అస్థిపంజరం ఎలా వచ్చింది? ఏ పెద్దపులో, మరో జంతువో లాక్కొచ్చినట్టు ఆధారాలు కూడా లేవు. ఎముకలు ఎక్కడివక్కడే వున్నాయి. ఏ నీళ్లలోనో కొట్టుకొచ్చి వుండాలిగాని మరోవిధంగా అది అక్కడకు వచ్చే మార్గం లేదు.

మెల్లగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ యిద్దరూ దాని పక్కకు చేరారు. సత్యం ఆ అస్థిపంజరాన్ని కాలితో అటూ యిటూ కదిపి దాన్ని స్కెచ్ గీశాడు శివం. ఆ అస్థిపంజరాన్ని చాలాసేపు పరిశీలనగా చూసి, "ఆడదై వుండాలి," అన్నాడు.

సత్యం తల వూపాడు. "అవును, ఆడదే కావచ్చు. ఆధారాలేవీ లేవుగాని కటి ప్రదేశం కాస్త విశాలంగా వుంది. ఈ చెదిరిపోయిన పూసల్ని మగాళ్లు కూడా వేసుకుంటారు. అయితే గాజులు మాత్రం తొడగరు. అందుకే మూడొంతులు యిది ఆడదై వుండాలి," అన్నాడు.

"మరి యిక్కడెందుకుంది?"

"ఏమో?"

చాలాసేపు అక్కడే వుండి దాన్ని గురించే చర్చించుకుంటూ బయలుదేరారు. కొద్ది దూరం వెళ్లాక అలసిపోయి నడవలేక ఒకచోట కూర్చుండిపోయాడు సత్యం, అలసట తీర్చుకుందామని. శివం కాలవలో ముఖం కడుక్కొస్తానని వెళ్లాడు.

సత్యం ఓమారు పుస్తకం తిరగేశాడు. అస్తిపంజరం స్కెచ్ గీశాడు. దాని చుట్టూ మాంసం, శరీరం, జుట్టు, కళ్లు ఒక్కొక్క భాగం గీశాడు. ఇరవైయేళ్ల కోయపిల్ల నగ్నంగా పడుకుంది. బట్ట లేదు. ఇంత అందంలోనూ ఎంత భయం దాక్కుంది! అందాన్ని ఒలిచేస్తే అడుగున కనిపించే దేమిటి? వికృతంగా, భయంకరంగా అస్థిపంజరం!

దామెర్ల రామారావు చిత్రాల్లోని 'అమాయిక'లా వుంది. పాపం! అంత అందమూ ఎలా పనికిరానిదిగా నాశనం అయిపోయిందో! సృష్టే దాన్ని నాశనం చేసింది. ఎండా, వానా, గాలీ కలిసి సౌందర్యాన్ని పీల్చి పిప్పిచేసి వదిలిపెట్టినట్టుగా ఎముకల్నీ, వికృతమైన రూపాన్ని విడిచి పోయాయి. సృష్టిలోనూ పరస్పరం ఒకదాని మీద మరోదానికి ఎంత కసి! ఎంత కోపం! అందాన్ని మరో అందం అంతం చెయ్యాలనే తుదివరకూ ప్రయత్నం!

బలంగా పిక్కలు తేలిన శరీరం, వత్తుగా ఉబికిన వక్షాలు, లైట్ అండ్ షేడ్‌లో చిత్రానికి పరిపూర్ణతనిచ్చే వంపులు తిరిగిన ఆకారం- నిజంగా ఆమెను మోడలుగా పెట్టుకుంటే చిత్రాల్లో ఎంత నిండుదనం వుంటుంది! అలాటి స్త్రీని బొంబాయి జే.జే. స్కూల్లో నిలబెడితే వందలాది ఆర్టిస్టుల చేతులు ఎంత వాస్తవాన్ని అలవరుచుకుంటాయో!

శివం వచ్చాడు. బొమ్మను చూసి ఆశ్చర్యపోయాడు. "ఎంత అందంగా వుంది! నిజంగా యిదే మనిషయితే, చలం దీన్నిచూసి వుంటే, అమాంతం ఎంతమందిలో వున్నా లాక్కుపోడూ. మళ్లీ దీనిమీద రెండొందల పేజీల పుస్తకం రాయడూ. ఇలాటి నిర్జన ప్రదేశంలో కావ్యాన్ని సృష్టించ డానికి యీమె కథానాయిక అయి వుండేది. ఈ ప్రదేశానికంతటికీ ఒక ప్రత్యేకతనీ, ఎవరూ మర్చి పోలేనంతటి విశిష్టతనీ చేకూర్చి వుండేది. ఈ చుట్టూరా వున్న జింకపిల్లలకు, పక్షులకు, కాలవ నీళ్లకు, కొండరాళ్లకు, గడ్డిదుబ్బులకు పని కలిగించేది. వాటిని కదిలించి గిలిగింతలు పెట్టేది. కాని చిత్రం! ఇప్పుడు ఆమె అందాన్నీ, శక్తినీ నాశనం చేసి పారేశాయి కొన్ని శక్తులు. దానిమీద కసికొద్దీ ఎందుకు పనికిరానిదానిలాగ, చూస్తే భయపడి పారిపోయేట్టుగా వికృతపరచి, దాన్ని జయించామన్న గర్వంతో ఆనందంగా దానిచుట్టూ విలయనృత్యం చేస్తున్నాయి గాలీ, ఎండా. ఇంకొద్దిసేపట్లో నేనూ వస్తున్నానన్నట్టు దొంగచూపులు చూస్తోంది కారుమేఘం ఒకటి కొండ శిఖరం మీద నుండి. ఆ మూడింటి వల్లా ప్రకృతి ఎలా సృష్టించడుతుందో అలాగే నాశనమూ అవుతుంది. ఒకే వస్తువు మంచికీ, చెడుకీ ఉపయోగించబడినట్లే ఆ మూడు శక్తులూ ప్రకృతి పుట్టుకకూ, నాశనానికీ ఉపయోగపడతాయి. అంత అందమైన శరీరాన్నీ, రక్తమాంసాల్నీ అవి మూడూ పురుగులు ఏరుకు తిన్నట్టుగా తినేశాయి. ఎముకల పోగు మిగిలింది. దానివల్ల ఉప యోగం ఏమిటి? కొన్నాళ్లకది మట్టిలో కలిసిపోతే అందులో నుంచి చిన్న మొక్క లేచి నుంచుం టుంది. అందులో ఎరుపు వుంది గనుక. అంతే."

"అసలు, ఆమె ఎందుకు చనిపోయింది?"

"ఏమో... ఏమో..." ఇద్దరికీ జవాబు తెలీదు. ఆలోచించుకుంటూ యిల్లు చేరుకున్నారు.

రాత్రి భోంచేశాక అంతా కలిసి కూచున్నప్పుడు శర్మతో తాము చూసిన అస్థిపంజరం గురించి చెప్పారు. "సరే, రేపు జీపులో వెళ్లినప్పుడు అదీ చూద్దాంలే," అన్నాడు శర్మ.

అనుకున్నట్టుగానే ఆ మర్నాడు జీప్‌లో బయలుదేరారు. మళ్లీ రావడం సాయంకాలమే. అవసరమైన పెట్రోలు, తినటానికి ఫలహారాలు వెంటేసుకుని బయలుదేరాడు. ఈసారి కారుని డ్రైవరే నడుపుకొస్తున్నాడు. సత్యం, శివంలు వెనకసీటులోనూ, శర్మ ముందు సీట్లో డ్రైవరు పక్కనా కూచున్నారు.

మధ్యాహ్నం వరకు జీపు మీద తిరగగలిగినంత దూరం తిరిగి భోజనం చేసే సమయానికి సరుగుడు చెట్ల కింద జీపును ఆపి, తెచ్చుకున్న ఫలహారాల్ని ఖాళీ చేశారు. అక్కడికి దగ్గర్లోనే చిన్న వాగు వుంది. నీళ్లు తేవడానికని డ్రైవరు వెళ్లి చల్లగా వున్నాయంటూ స్నానం చేసి వచ్చాడు. రెండింటి వరకూ చెట్ల కింద నీడల్లో కబుర్లు చెప్పుకుంటూ కూచున్నారు. కాస్సేపు పేకాట ఆడు కున్నారు.

ఎండ కొద్దిగా తగ్గిన తర్వాత అస్థిపంజరం చూసొద్దామని బయలుదేరారు. కాలవ వొడ్డు వెంబడే వెళ్తే రెండు మైళ్లన్నా ప్రయాణం చేయాలి. అడ్డదారిన పుంతలు, మెట్టలు దాటుకుంటూ

పోతే మైలు దూరంలోనే తగులుతుంది. ఫరవాలేదులెండని అడ్డదారినే పోనిచ్చాడు డ్రైవరు. అరమైలు వెళ్లేసరికి యింజను ఆగిపోయింది. ముగ్గురూ దిగి తొయ్యడం ప్రారంభించారు. అయినా ఇంజన్ స్టార్ట్ కాలేదు. డ్రైవరు దిగి బాగుచేయడం ప్రారంభించాడు. మిత్రులు ముగ్గురూ జీపునొదిలి అవతల కనిపిస్తోన్న చింతచెట్టు దగ్గరికొచ్చారు.

దాని మొదల్ని చూసి ఆశ్చర్యపోయాడు శివం. దాని చుట్టుకొలత పదిబారలైనా వుంటుంది. సత్యం అంతవరకూ పెన్సిలుకు పనిచెప్పలేదేమో గబగబా నాలుగు లాండ్‌స్కేప్ స్కెచ్‌లు గీసుకున్నాడు. ఈలోగా శివం, దగ్గర్లోని మెట్ట యెక్కి ఫర్లాంగు దూరంలో నిటారుగా నుంచున్న కొండ శిఖరాన్నీ, మీద మేత మేస్తున్న మేఘాల గుంపుల్నీ, అడుగున చుట్టూరా దట్టంగా పెరిగిన పచ్చని మద్దిచెట్లనీ ఫోటో తీసి వచ్చాడు. చింతచెట్టు కిందికొచ్చి కూర్చున్నాడు.

శర్మ సిగరెట్టు వెలిగించి మిగిలిన యిద్దరకూ చెరోటి యిచ్చి వాళ్ల పక్కనే కూచున్నాడు. సిగరెట్టు పొగ మెలికలు తిరుగుతూ వాళ్ల చుట్టురా అల్లుకుని గాలిలో కరిగిపోతోంది. పిల్ల గాలులకు కొమ్మలూ రెమ్మలూ ఊగులాడుతున్నాయి. చెట్టు మొదట్లో అరడుగు ఎత్తున పెరిగిన పచ్చగడ్డి వెల్వెట్ గుడ్డలా గాలికి కదలి మెరుస్తోంది.

శివం కొద్దిగా దగ్గాడు. నిశ్శబ్దం చెదిరింది. గొంతు సవరించుకుని అడిగాడు. ''శర్మా! ఇక్కడ నీకు ఎలాటి చిత్రమైన అనుభవమూ జరగలేదూ?''

సత్యం కూడా తన మనసులో అదే ప్రశ్న వున్నట్టు శర్మ వైపు చూశాడు.

శర్మ తల పంకించాడు. పంకించాడే కాని ఏమీ మాట్లాడలేదు.

మిత్రులిద్దరూ ప్రశ్నలు తగిలించుకున్న ముఖాలతో అతన్నే చూస్తున్నారు. శర్మ సిగరెట్టు ఆఖరి దమ్ము గట్టిగా పీల్చి దాన్ని అవతలకు విసిరేశాడు.

''జరిగింది. జీవితంలో మర్చిపోలేని చిత్రమైన అనుభవం జరిగింది. కాని మీకు చాలా హాస్యాస్పదంగా వుంటుందేమో. నవ్వుకుంటారు కూడాను,'' సాలోచనగా యిద్దరి ముఖాల్లోకి చూశాడు శర్మ.

'ఫర్వాలేదు చెప్పు,' అన్నట్టుగా యిద్దరూ అతనివైపే తిరిగి కూర్చున్నారు.

ఆయన మెల్లగా చెప్పడం ప్రారంభించాడు.

ఒకరోజు- అంటే ఈ ప్రాంతానికి వచ్చిన నెల్లాళ్లకు ఒకరోజు ఒక్కడ్నీ కాలి నడకన బయలుదేరాను, పరిసర ప్రాంతాల్ని చూద్దామని. చెట్లని, గట్లని, పక్షుల్ని చూస్తూ వెళ్తున్నాను. ఒక కొండ ఎక్కి దిగుతుండగా కాలు జారింది. నాలుగడుగులు కిందకు జారి ఓ తుప్పను పట్టుకుని లేచాను. కొండ కింద ఎవరో పకపకా నవ్వుతున్నారు, చాలా గట్టిగా. ఆ చుట్టూ ప్రతిధ్వనించింది.

కిందకు చూశాను.

ఎండిన చితుకుల్ని ఏరుకుంటోన్న కోయపిల్ల పకపకా నవ్వుతోంది, నన్ను చూసి. మరొకామె చితుకుల మోపు బిగించి కడ్తోంది. మారు మాట్లాడకుండా కొండ దిగి వాళ్లవైపన్నా చూడకుండా ముఖం చిట్లించుకుని వెళ్లిపోయాను. ఫర్లాంగు దూరమన్నా వెళ్లక ముందే వర్షం ప్రారంభమైంది. కుండపోతగా వొకటే వర్షం! కొండల మీద నుండి పాముల్లా పరుగెత్తుకొస్తున్నాయి నీళ్లు. అగాధాలూ, కొండ దిగుడులూ సెలయేర్ల ప్రవాహంతో నిండిపోయాయి.

చెట్టు కింద నుంచున్నాను నేను. వర్షం బొట్లుబొట్లుగా ఆకుల మీద నుండి జారిపడుతోంది. బట్టలు తడిసిపోయాయి. చలి వేస్తోంది. శీతగాలికి వేళ్లు వంకర్లు తిరిగిపోతున్నాయి. సిగరెట్టు వెలిగిద్దామనుకున్నాను. అగ్గిపెట్టె తడిసిపోయింది. వెలగడం లేదు. చలికి వణికిపోతూ నుంచున్నాను.

ఇందాకటి కోయవాళ్లు మోపులు ఎత్తుకుని వచ్చారు. వర్షంలో పూర్తిగా తడిసిపోయారు. వచ్చి ఆ చెట్టుకింద మోపుల్ని దించి నుంచున్నారు.

తిన్నగా వాళ్లను చూడలేకపోయాను. పల్చటి గుడ్డముక్క వక్షాల్ని కప్పుతోంది. వర్షానికి తడిసి శరీరానికి అంటుకుపోయింది. గుండ్రని ఉబికిన వక్షాలు పల్చటిగుడ్డ పొరను చీలుస్తు న్నాయి. మనం ఏది సంస్కారమనుకుంటున్నామో ఆ సంస్కారం అక్కడ లేదు. స్వేచ్ఛగా గాలికీ వానకీ వదిలిపెట్టారు వాళ్లు. ఈ కాలపు నాగరికత అనే నీతిలో అనాగరిక జీవితాలు ఎలా ప్రతి ఫలిస్తున్నాయో ఆలోచిస్తే మానవుడి పురోగతి నిజంగా పురోగతి కాదు. అది మళ్లీ పాతదాన్ని చేరుకోవడమే.

అడవిజాతి వాళ్లు అనాగరికులు. వాళ్లకు సిగ్గు అనేది లేదు. గోప్యంగా శరీరభాగాల్ని దాచుకోవడం తెలీదు అంటుంది నాగరిక ప్రపంచం. అదే నిజమయితే, వాస్తవాన్ని ఆలోచిస్తే, యీనాటి నాగరీకుల్ని నిజంగా నాగరీకులనలేం. శరీరం సాధ్యమైనంత ఎక్కువగా కనపడేలా వస్త్రాల్ని ధరించడం యీనాటి నాగరికత. ఒకనాడు ఏది అనాగరికమూ, సంస్కారం కానిదీ అయిందో అదే యీనాడు సంస్కారమనిపించుకుంటోంది.

పడవ బయలుదేరిన చోటికే మళ్లీ వచ్చి చేరుతుంది. అనాగరికత నుండి బయలుదేరిన నాగరితక చుట్టూ తిరిగి చివరకు అనాగరికతలోకే వెళ్తోంది. ఈనాటి సంస్కారిత నాగరికతను ధైర్యంగా, ఆనందంగా కళ్లను యింతింత చేసుకుని చూస్తుంటాం. అదో ఆకర్షణ! అదే ఆకర్షణ అనాగరిక జాతుల్లోనూ, సంస్కారం సభ్యత తెలీని కొండజాతి వారిలోనూ ఎందుకుండదు?

అలానే నుంచుని సంస్కారం కాని చూపుల్తో తడిసిన వాళ్ల భాగాల్ని చూస్తున్నాను. తీక్షణంగా చూసే శక్తి లేదు. మనసు వికలమై దగ్గరగా కుంచించుకుపోయి ఒకమూల ముద్దగా పడిపోయింది. దృష్టి మార్చుకుని పక్కకు తిరిగి ఎటో చూస్తున్నాను. వాళ్లు నవ్వుకుంటున్నారు. గుసగుసలాడుకుంటున్నారు. మాటలు వినిపిస్తున్నాయిగాని స్పష్టంగా లేవు.

వర్షం తగ్గిపోయింది. మబ్బులు మాత్రం యింకా వేలాడుతూనే వున్నాయి. పిల్ల కాలువల్లో నీటి ప్రవాహపు వొరవడి తగ్గింది. మెల్లగా పాకుతూ వెళ్తున్నాయి నీళ్లు.

వర్షం తగ్గడంతోనే వాళ్లు వెళ్లిపోయారు. ఆ వెనుకనే నేనూ బయలుదేరాను. కొండ ఎక్కాను దాటి వెళ్లిపోదామని. వాళ్లు మెల్లగా కొండ కింద సన్నని బాటలోంచి వెళ్తున్నారు. ఒకామె పాడు తోంది. ఆ పాటకు ఒక వరసేం వున్నట్టు లేదు. ఆ మాటలుగాని, భావంగాని తెలీడం లేదు. కాని ఆ పాటలో బరువుంది. కంఠంలో శ్రావ్యత వుంది. అది హృదయాన్ని పగ్గాల్తో పట్టి వేసింది. గాలిలో కలిసి ఎగురుతోంది. రాళ్లల్లో మారుమ్రోగుతోంది.

వాళ్లు చూపు నుండి దాటిపోయే వరకూ అలానే నుంచున్నాను. వాళ్లు వెళ్లి వెళ్లి చెట్ల కొమ్మల్లో, ఆకుల గుబురుల్లో కలిసిపోయారు. వాళ్లు దృష్టి నుండి తప్పుకున్న అయిదు నిమిషాల వరకు యింకా పాట వినిపిస్తూనే వుంది. సాయంకాలం ఆఖరి వెలుతురు చారలు క్రమక్రమంగా చీకటిలోకలిసిపోయినట్టుగా నిశ్శబ్దంలో కరిగిపోయింది పాట.

మెల్లగా కొండదిగి వెళ్లిపోయాను. అప్పటి నుండి రోజూ సాయంకాలం పూట షికారుగా ఆ కొండ మీదకు వచ్చి కూర్చోవడం అలవాటైంది. కొండ కింద బాటలోంచి చితుకుల మోపుల్ని ఎత్తుకొని ఆ యిద్దరూ రోజూ అటే వెళ్లేవారు. అందులో ఒకామె తరచూ పాడుతూనే వుండేది. గట్టిగా, ఆ రాళ్లల్లో ప్రతిధ్వనించి, అలలు అలలుగా తెరలు తెరలుగా ఆ పాట వినిపిస్తూనే వుండేది. అక్కడి వాళ్లతో పరిచయం అయ్యేకొద్దీ, వాళ్ల మాటలు, వాళ్ల ఉచ్చారణ క్రమంగా అర్థమవుతూ వచ్చాయి. ఆమె పాడే పాటలకు కొద్దికొద్దిగా అర్థం తెలుస్తోంది. మామూలుగా ఆ వయసులోని స్త్రీల హృదయాలలో నాటుకునే భావాలూ, కోర్కెలే ఆమె పాటలకు యితివృత్తాలు. అవి వాళ్ల జానపద పాటలు.

రోజూ నా దినచర్యలో ఒక భాగం సాయంకాలం పూట ఆ కొండ దగ్గరకు వెళ్లి కూచోవడం. అలా అర్థ సంవత్సరం గడిచిపోయింది.

వరుసగా ఒకవారం రోజులపాటు వాళ్లు కనిపించలేదు. ఆశ్చర్యం వేసింది. ఆ ప్రకృతీ, చెట్లూ, కొండలూ, రాళ్లూ, నీళ్లూ, పిల్లగాలులూ, సన్ననిబాటా, నేనూ చిన్నబోయినట్టయ్యాయి. ఎనిమిదో రోజు కొండ దిగి గూడెంలోకి బయలుదేరాను. గూడెంలో చాలా హడావిడిగా వుంది. గూడెం వెనక మైదానంలాంటి చోట జనం గుమిగూడి వున్నారు. పిల్లలూ, పెద్దలూ, ఆడాళ్లూ, మగాళ్లూ చేరి డప్పులు కొడుతూ, దొప్పలతో కల్లు తాగుతూ, అరుస్తూ, పాడుతూ, గెంతుతూ, హుషారుగా, సందడిగా కనిపించారు. చీకటిలో స్పష్టంగా ఆకారాలు తెలీడంలేదు. ఒకచోట మాత్రం చిన్న మంట వెలుగుతోంది.

ఆ మంటకు కాస్త దూరంగా చిన్న గుంపు వుంది. వాళ్ల మధ్య ఒక జంట వుంది. కొత్తగా పెళ్లయినట్టు వాళ్ల ఆకారాలు చెప్తున్నాయి. మెళ్లో పూసలు, వొంటి మీద రంగురంగుల గుడ్డ పీలికలు, మొఖం మీద గీతలూ, బొట్లూ కనిపిస్తున్నాయి. వాళ్లిద్దరికీ కలిసి పెళ్లి చేసిన పెద్దలు వాళ్లను వదిలి మస్తుగా తాగి తూలుతున్నారు.

ఆ మంట ముందు నుంచుని వున్న పెళ్లికూతురు నాకూ, నా సాయంకాలపు ప్రకృతికీ, అందాన్నీ ఆనందాన్నీ యిచ్చి రాగంతో ఆకాశాన్నీ, భూమినీ కలిపి అక్కడి రాళ్లనీ, లోయనీ కదిలించే ఆడది- మోపెత్తుకుని వెళ్లే కోయపిల్ల.

వాళ్ల ఆచారాల్ని చూసి నవ్వుకుని వెళ్లిపోయాను.

ఆ తర్వాత మళ్లీ ఎప్పుడూ సాయంకాలంపూట ఆ కొండల్లో ఆమె పాట వినలేదు. ఆమెతో వచ్చే మరో కోయపిల్ల కూడా అలా వెళ్లేది కాదు. చిన్నబోయినట్టు వుండేది ఆ ప్రదేశం. ఒక రకమైన పద్ధతికి అలవాటుపడిపోయాక, ఆ పద్ధతి మారిపోతే మనసు కొంతకాలం వరకూ అదోలా వుంటుంది. నేనూ అలాంటి స్థితిలోనే కొంతకాలం వున్నాను. మళ్లీ మెల్లమెల్లగా నా గొడవల్లో మునిగిపోయి క్రమక్రమంగా మర్చిపోయాను.

నాలుగైదు నెలలు గడిచాయో లేదో ఒకరోజు సాయంకాలం డిస్పెన్సరీలో కూచుని వుత్తరం రాసుకుంటున్నాను. బండి దిగి యిద్దరు మనుషులు ఒక కోయవాడిని లోపలికి తీసుకొచ్చారు. ఒంటినిండా, బట్టలనిండా రక్తంతో చేతులకు, తలకు అప్పటికప్పుడు గుడ్డ పీలికలు చించి కట్టిన కట్లున్నాయి. ఆ కట్టను తప్పించుకుని రక్తం చిమ్ముతోంది.

ఆనందం వచ్చాడు. అడవిలో చెట్లను పాడి, కలపను కోయించి దిగువకు పంపిస్తుంటాడు ఆనందం. అతను వస్తూనే చెప్పాడు- కలప కొట్టిస్తుంటే ఓ పెద్దకొమ్మ విరిగి మీద పడిందని. ప్రమాదం ఎలా జరిగిందీ ఆనందం వివరంగా చెప్పి, ''కాస్త ప్రాణం పోకుండా చూడండి డాక్టరు గారూ, ఏమాత్రం వీడి ప్రాణం గుటుక్కుమన్నా యీ వెధవలు నన్ను ఒక పట్టాన వదలరు,'' అన్నాడు.

నిజానికి అతని పరిస్థితి చాలా ప్రమాదకరంగా వుంది. తలమీద తగిలిన గాయం పెద్దదే. కుడిచెయ్యి పూర్తిగా పిప్పిపిప్పి అయిపోయింది. ఆ పరిస్థితుల్లో, 'ప్రయత్నిస్తాను' అని అనడం కన్న మరే ధైర్యమూ చెప్పలేకపోయాను. ఆనందం కాస్సేపు వుండి, మళ్లీ పొద్దున్న వొచ్చి కలుస్తానని చెప్పి వెళ్లిపోయాడు.

చీకటిపడే వేళకు పాతికమంది కోయవాళ్లు పరుగెత్తుకొచ్చారు. ఒకావిడ ఏడుస్తోంది. గట్టిగా గుండెలు బాదుకుంటూ ఒకటే ఏడుపు. వచ్చినవాళ్లంతా అరుగు చివర చీకట్లో నుంచున్నారు. ఆకారాలు కనిపించడం లేదు. బహుశా ఆ ఏడుస్తున్నామె అతని భార్య అయి వుంటుంది.

వచ్చినవాళ్లు ఓమారు అతన్ని చూసి, చాలాసేపు బయట వరండాలోనే కూచుని వెళ్లి పోయారు. అంతా వెళ్లిపోయాక భోజనం చేసి నిద్రపోయాను. మధ్యలో తెలివి వచ్చింది. బయటి నుండి ఎవరో స్త్రీ సన్నగా ఏడుస్తోన్న శబ్దం వినిపిస్తోంది. ఆ నిశ్శబ్దంలో మందంగా కదులుగోతన్న గాలిలో అలలు అలలుగా ఎగురుతోంది. ఆ ప్రదేశంలోని ప్రతి అణువునూ కదిలించి వేసేట్టుగా

వుంది ఆ శబ్దం. పాపం! తెల్లవార్లూ ఆమె అలా ఏడుస్తూనే వుంది గాబోలు. నేను మాత్రం కొద్ది సేపట్లోనే తిరిగి నిద్రపోయాను. ఆ కొద్దిసేపూ ఆమె ఆవేదన నాలోనూ జాలినీ, సానుభూతినీ లేపి వెళ్లింది. అది మామూలే. కాకుంటే డాక్టర్లు కావడం అనవసరం. మళ్లీ అన్నీ మర్చిపోయి హాయిగా నిద్రపోయాను.

ఉదయం లేచి అరుగు మీదకు వచ్చాను. ఆ ఆడమనిషి యింకా అక్కడే కూచుని వుంది. మోకాళ్లలో తల దూర్చి ఏడుస్తోంది. నన్ను చూడగానే లేచి బిత్తరచూపులు చూస్తూ నుంచుంది. దుఃఖం ఆపుకోలేక ఒక్కసారిగా గొల్లున ఏడ్చేసింది.

ఆశ్చర్యపోయాన్నేను. ఆమెను చూస్తూ కొద్దిసేపు అలానే నిలబడిపోయాను. తన కదలికతో, రాగంతో కొంతకాలం క్రితం ప్రకృతికీ, నాకూ, నా చుట్టూ తిరిగే ఊహలకూ, నా ఆనందానికీ కారణమైన కోయపిల్ల! ఎంతో అందంగా, నిండుగా వుండే ముఖంలో నిరాశారేఖలు తూరుపు చారల్లా నలువైపులకూ పరుగెత్తుతున్నాయి. ఆమె ఏమిటో అడుగుతోంది. సరిగా వినిపించడం లేదు. ఆ కంఠంలో పూర్వపు మాధుర్యం లేదు. ఆమె కళ్లల్లో వెనకటి జ్యోతుల్లేవు. చాలా దీనంగా చూస్తోంది. ఆ చూపుల్లోని ఆవేదన ములకుల్లా గుచ్చుకుంటోంది నన్ను. ఆమెకు ధైర్యం చెప్పి యింటికి పంపించేశాను. ఆమె వెళ్లిపోయిన చాలాసేపటి వరకూ మనసు అటే ఆలోచిస్తూ వుండి పోయింది. ఏమయినా అతను జీవించాలి.

అలానే జీవించాడు. చాలారోజులు కష్టపడి అతి జాగ్రత్తగా వైద్యం చేయగా మళ్లీ మామూలు మనిషై లేవగలిగాడు. అయితే కుడిచేతిని మాత్రం మోచేతి కీలు వరకూ తీసెయ్యాల్సి వచ్చింది. అతన్ని యింటికి పంపించే రోజున ఆమె వచ్చింది, కూడా ఓ అయిదారుగుర్ని వెంట బెట్టుకుని. వాళ్లు వెళ్లిపోతున్నప్పుడు ఆమె ముఖంలో ఎప్పుడూ చూడనంత ఆనందం గట్టుతెగి పొర్లి పొంగింది. సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ కాలవగట్టు వెంబడే వాళ్లు వెళ్లిపోయారు.

వారం రోజుల తర్వాత ఒక్కడ్నే జీపు మీద వస్తున్నాను, ఆ చుట్టుపట్ల నాలుగైదు గూడెంలు తిరిగి. అప్పటికే చాలా ఆలస్యమైపోయిందని కాలవపక్క బాట మీద నుండి జోరుగా పోనిస్తు న్నాను. బాటకు దగ్గర్లో గుట్ట మీద నుండి ఎవరో అరుస్తున్నారు. వెనక్కు తిరిగి చూశాను. ఆవిడే, అదే కోయపిల్ల! జీపు ఆపాను. పనస పండొకటి మోసుకొచ్చి జీపులో పెట్టింది. ఆ తర్వాత నా ఎదురుగా రెండు నిమిషాలు మౌనంగా నుంచుని చెంగు చెంగున దూకుతూ రాళ్లనీ, రప్పల్నీ, తుప్పల్నీ, దుబ్బుల్నీ తప్పించుకుంటూ గుబురుల్లో మాయమయ్యింది.

ఆ తర్వాత రోజున అలా వెళ్లాలనిపించింది. జీపు మీద కాకుండా కాలి నడకనే ఆ రెండు మైళ్లూ నడుస్తూ వెళ్లాను. కాలవ మీదుగా వెళితే కాలక్షేపంగా వుంటుందని బయలుదేరాను. గతరోజు ఆమె కలుసుకున్నచోటు వరకూ వచ్చాను. గుట్ట మీద నుంచుని చూస్తే ఆవల చెట్ల గుబురుల్లో గూడెం కనిపిస్తోంది. చాలాసేపు గుట్టమీదనే కూచున్నాను. ఎవరూ రాలేదు. సాయం సంధ్యలో కాంతులన్నీ కరిగిపోతున్నాయి. ఇంకొద్దిసేపట్లో అక్కడ చీకటి బాహువుల్ని చాస్తుంది.

ఏదో పాట సన్నగా వినిపించింది. ఒట్టి కూనిరాగమే అది. ఒక్కటో రెండో చరణాలు మాత్రమే. రాగం ఆగిపోయింది. కింద కాలవలో నీళ్లు కదిలాయి. కడవను నీళ్లతో నింపుకుని ఎవరో వెళ్లిపోతున్నారు.

ఆ కంఠం ఎవరిదో నాకు తెలుసు. అంత చక్కదనం ఎవరి కంఠంలో రంగరించి పోశారో, ఎవరి కంఠం చివర్లో రాగం చిగురాకులా వణికిపోతూ వుంటుందో, ఎవరి కంఠంలో సన్నని నొక్కు లుంటాయో నాకు తెలుసు.

గబగబా గట్టు దిగి వెళ్లాను. నన్ను చూసి ఆశ్చర్యపోయింది. ఓసారి చిత్రంగా నా నఖశిఖ పర్యంతమూ చూసి కదల బోయింది.

"ఇదిగో మాట," అన్నాను.

ఆగింది. నావైపే ఆశ్చర్యంగా చూస్తూ నుంచుంది.

"ఆ పాట మరికాస్త గట్టిగా పాడవ్?" అన్నాను.

తల వూపి కదిలింది, కాలి అందెలను టిక్కుటిక్కు మనిపించుకుంటూ.

"చూడూ..." పిలిచాను.

చూసింది, అక్కడినుంచే వెనక్కు తిరిగి.

తల ఊపాను రమ్మన్నట్టుగా.

సగం వరకూ వచ్చి ఆగింది.

ఎందుకు పిలిచాను? ఏమో, ఏమీ చెప్పలేను. కాళ్లూచేతులూ వణుకుతున్నాయి. గుండె గబగబా కొట్టుకుంటోంది. ఏమిటి యిలా అయిపోయాను? నాకే ఆశ్చర్యంగా వుంది.

ఆమె వెళ్లిపోతోంది.

గబగబా దగ్గరకు వెళ్లాను. పర్సులోంచి ఓ నోటు తీసి ఆమె చేతికివ్వబోయాను. చిత్రంగా చూసింది.

"చీర కొనుక్కో. ఈసారి సంత కెళ్లినప్పుడు మంచి చీర కొనుక్కో. నువ్వు కట్టుకున్నదేం బావుండలేదు. ఎర్రగా రక్తంలా వుండే రంగుచీరయితే నీకు బాగుంటుంది," అన్నాను.

చెయ్యి వెనక్కు తీసేసుకుంది. గబగబా అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

నాకక్కడ నిలుచోడానికి భయం వేసింది. నామీద నాకే అసహ్యం వేసింది. అక్కడ్నించి వొచ్చేశాను.

మళ్లీ అటువైపు వెళ్లలేదు. సాయంకాలంపూట బంగళా వదిలి బయటికి వెళ్లడం కూడా మానుకున్నాను. నామీద నాకే తక్కువ భావం. మాటిమాటికీ చికాకూ, అసహనం కలుగుతున్నాయి.

ఒకరోజు సాయంకాలం ఒక్కడ్నే గదిలో కిటికీ ముందు కూచుని వర్షాన్ని చూస్తున్నాను. నాలుగు రోజులుగా కుండపోతగా ఒకటే వర్షం. మంచుపొరలు ఆకాశాన్నీ భూమినీ కప్పేసినట్టుగా వున్నాయి. కనుచూపు మేరంతా నిర్జీవంగా వుంది. ఒక్క పక్షి కూడా ఎక్కడా ఎగరడం లేదు.

అకస్మాత్తుగా అన్ని శబ్దాల్నీ తప్పించుకుని సన్నగా ఓ పాట ఎగిరి వచ్చింది. చాలాకాలానికి మళ్లీ ఆ పాట విన్నాను. అచేతనంగా ఆ పాటనే వింటూ కూచుండిపోయాను. అరగంటయింది. ఇంకా పాట పూర్తికాలేదు. ఏమో... ఎన్నిసార్లు ఆ పాటను ఆమె మళ్లీ మళ్లీ పాడుతూ వుందో తెలీదు. గంటయినా ఆ పాట వినిపిస్తూనే వుంది!

కిటికీలోంచి చూశాను. ఎవరూ కనిపించలేదు. మరో అర్ధగంట గడిచింది. అయినా పాట ఆగిపోలేదు. పాడిందే మళ్లీ మళ్లీ పాడుతోంది. వర్షంలో గొడుగేసుకుని పాట వినిపిస్తున్న వైపుగా బయలుదేరాను.

రెండు ఫర్లాంగుల దూరంలో ఓ బండ మీద ఎవరిదో ఆకారం కదిలింది. దగ్గరకు వెళ్లాను. ఆవిడే. కోయపిల్ల! వర్షంలో తడుస్తూ నుంచుంది. దూరం నించే నన్ను చూడగానే పాట ఆపి చప్పట్లు కొడుతూ, పై మీద వల్లెవాటుగా వేసుకున్న గుడ్డపీలికను తీసి గాలిలో ఆడిస్తూ తన వునికి తెలియజేసింది.

దగ్గరకు వెళ్లాను. ఏమిటో చెప్పాలని అనుకుంటున్నట్టుంది. కాని మాటలు పెగలడం లేదు. రెండు చేతుల్నీ దగ్గరగా గుండెల్లోకి ముడుచుకుని పాదాల్ని చూసుకుంటూ నుంచుంది. ఆమె వళ్లంతా వణికిపోతోంది. ఆ పెదాలు మరీనీ. బహుశా వర్షంలో తడుస్తూ వుండడం చేతనేమో.

తలమీద నుండి వర్షపునీరు కారి వక్షాల మీద పడుతోంది. తడిసిన వస్త్రాల్లోంచి శరీరం అక్కడక్కడ బైటపడుతోంది.

ఆ స్థితిలో ఆమెను చూస్తోంటే నా మనసు స్వాధీనం తప్పిపోతోంది. అచేతనంగా పడి వున్న కోర్కెలు అనుభవాల కోసం ఎదురుచూస్తూ ఉవ్వెతున్న పైకి లేచాయి. చుట్టూ చెట్లూ

రాళ్లూ, రాళ్లపక్కన పాకుతున్న నీళ్లు, చెట్ల పలవల్లో జ్ఞానంలేని పక్షులు, పైన చిక్కగా ముసుగు కప్పిన వర్షం. చలితో గజగజా వణికిపోతున్న శరీరాలు!

"ఏవిటి విశేషం?" అన్నాను, మరికాస్త దగ్గరకు వెళ్లి.

నా ముఖంలోకి దీనంగా చూస్తూ, "డబ్బులు కావాలి," అంది.

"లేవు, ఎలా?" అన్నాను. నిజానికి నా దగ్గర లేవు.

నిరాశగా చూసింది. ఎంత బరువుగా కదిలాయని ఆ రెప్పలు!

"ఆడు తెమ్మన్నాడు," అంది మెల్లగా. అలా అంటున్నప్పుడు ఆమె కళ్లల్లో కన్నీరు కదిలింది.

ఏం చెయ్యను? ఎలా వున్నవాడిని అలా వచ్చేశాను. జేబులో కాణీ కూడా లేదు. చిటికిన వేలుకు వుంగరం వుంది. ఎప్పుడో చాలాకాలం క్రితం చేయించినది. దాన్ని తీసిచ్చాను. ఆశగా అందుకుంది. ఒకసారి తన వేలికి తగిలించుకుని గుండెలకు అదుముకుని, చెంగుచెంగున లేడిలా దుముకుతూ పరుగెత్తుకుని పారిపోయింది. స్థబ్ధుడ్నయిపోయాన్నేను. కొంత దూరం వెళ్లి ఆగి వెనక్కి తిరిగింది.

"రావూ?" అడిగాను.

"రేపు," అంది. మళ్లీ లేడిలా దుముకుతూ మాయమైంది.

అంతే, ఆమె మళ్లీ రాలేదు. ఆమె పాట మళ్లీ నేను వినలేదు. ఆమె మోసం చేసిందా? ఏమో చెప్పలేను. కాని, యిక్కడివాళ్లకు మోసం, కృత్రిమం, ఈర్ష్య అనేవి తెలీవు. ఆమెను గురించి గట్టిగా వాకబుచేసే ధైర్యం లేక ఆషామాషీగా తెలుసుకోవాలని చూశానుగాని, అంతగా పట్టించు కున్న వాళ్లే లేకపోయారు. యధాలాపంగా ఒకరిద్దర్ని అడిగితే ఆమె ఏమయిందీ తెలీదన్నారు. అంతకన్న ఎక్కువగా అడగలేక మాట్లాడక వూరుకుండిపోయాను.

ఇప్పటికీ ఆమె ఏమయిందో తెలీదు.

శర్మ చెప్పడం ముగించి సిగరెట్టు తీశాడు. సత్యం, శివంలు చిన్నగా నవ్వుతూ మిత్రుడ్ని చూశారు.

మరో పది నిమిషాలకి డ్రైవరు వచ్చి జీపు బాగయింది రమ్మన్నాడు. పదండంటూ బయలు దేరారు ముగ్గురూ. జీపులో చాలాచోట్లకి వెళ్లారు. ఫోటోలు తీసుకున్నారు. సత్యం స్కెచ్‌లు గీసుకున్నాడు. తిరిగి వచ్చేటప్పుడు అస్థిపంజరం వున్న లోయ దగ్గర ఆగారు. జీపు తిన్నగా లోయ ముఖం వద్ద ఆగింది. ముగ్గురూ దిగి లోయలోకి నడిచారు. అస్థిపంజరాన్ని చూశారు. శర్మ దాన్ని అటూయిటూ తిప్పి పరీక్షగా చూసి, "ఇది ఆడదే," అన్నాడు. "హాస్పిటల్లో పెట్టుకోడానికి బావుం టుంది," అని చెప్పి డ్రైవరు సాయంతో దాన్ని జీపులో పెట్టించాడు.

ముగ్గురూ అక్కడ రాళ్లమీద చాలాసేపు కూచున్నారు. అడవి వింతలు చాలా చెప్పుకొచ్చాడు శర్మ. విదేశంలో వున్నప్పటి భయంకరమైన వేట అనుభవం చెప్పి భయపెట్టాడు.

చీకటి పడకుండానే బంగళా చేరుకుందామని లేచారు. శివం కాలికేదో గట్టిగా తగిలింది. మట్టిని తొలగించాడు. బంగారపు ఉంగరం!

శర్మ, సత్యం, మాట్లాడుకుంటూ ముందు నడుస్తున్నారు. బహుశా ఆ అస్థిపంజరం ఏ నీళ్లలోనో అక్కడికి కొట్టుకొచ్చి వుండాలి అనే నిర్ణయానికి బలాన్ని వెతుక్కుంటూ.

శివం మెల్లగా ఆ వుంగరాన్ని జేబులో దాచుకున్నాడు.

*'సమాధి' కథల సంపుటి, 1959*

## నేపథ్యం

పచ్చని అడివి పాట

# అస్థిపంజరం

***అడవిని చూసినప్పుడు చిత్రకారుడిగా నేను స్పందించిన తీరూ, కలిగిన ఆలోచనలూ, రచయితగా నేను పొందిన అనుభూతీ, కదిలిన భావాలూ- స్థూలంగా సౌందర్యారాధనతో ముడిపడి ఉన్నప్పటికీ, సూక్ష్మంగా చూస్తే కొద్దిగా తేడా కనిపించింది. అది చెప్పడం కోసం ఈ రెండు లక్షణాల్నీ రెండు పాత్రలుగా మలచుకొందామనుకొన్నాను.***

**మా**నవుడ్ని మహా సౌందర్యం ముందు అల్పుడ్ని చేసి తన ముందు మోకరిల్ల జేసుకొనే మహత్తు ఉంది. ఇది అందర్నీ కదపలేకపోయినా సత్యం, శివం లాంటి వారిని మాత్రం ఊపి పారేస్తుంది. వాళ్ళ ఆలోచనల్ని పునాదుల్తో సహా కదిలిం చేస్తుంది.''

-ఇది అడవి సౌందర్యాన్ని గురించి ఒక కథలో నేను రాసిన మాటలు. మొట్ట మొదటి సారిగా సముద్రాన్ని చూసినప్పుడు ఎంతలా ఆశ్చర్యానందాలతో, ఉద్వేగంతో థ్రిల్ అయ్యానో, అల్పాతి అల్పుడిగా నాకు నేను కనిపించానో అడవిని తొలిసారిగా చూసినప్పుడూ అలాగే అయ్యాను.

కాలేజీలో చదువుకొంటున్న రోజుల్లో కొత్తగా పరిచయమైన మిత్రుడు, "మీలాటి వారికి మా ఊరు నచ్చుతుంది. మా ఊరునుంచే అడవి మొదలవుతుంది. చూద్దురుగాని రండి," అంటూ వాళ్ళ ఊరు తీసుకెళ్ళాడు. ఆ ఊరు ఏలేశ్వరం. ఓ రోజంతా అతనూ నేనూ అడవిలో తిరిగాం. మరీ దట్టమైన అడవికాదు. ఇంకా లోప లికిపోతే నడవడానికి కూడా వీలులేనంత చిక్కగా అడవి ఉంటుందట. ఉదయం బయలుదేరినవాళ్ళం గుట్టలూ కొండలూ ఎక్కీ దిగీ, చెట్లూ పుట్టల మధ్య పిచ్చిగా తిరిగి తిరిగి అలసిపోయి కాళ్ళు పీకుతుంటే సాయంకాలానికి ఇల్లు చేరుకొన్నాం.

మొదటిసారి వెళ్ళడం గనుక ఆ చిట్టడివే నాకు కారడవంత అనుభూతిని కలిగించింది.

చిన్నప్పుడు మా నాన్నగారు అడవికి సంబంధించిన కబుర్లు చెప్పేవారు. ఆయన కలప దూలాల వ్యాపారం చేస్తుండేవారు. తను రెండుమూడు సార్లు కూనవరం, భద్రాచలం ప్రాంతాల్లోని అడవుల్లోంచి చెట్లు కొట్టించి, గోదావరిలో తెప్పలు కట్టి వాటి మీద రోజుల తరబడి ప్రయాణం చేసి రాజమండ్రికి తీసుకొచ్చారట. అప్పటి అనుభవాన్ని అప్పుడప్పుడు చెప్పేవారు.

బాల్యంలోని ఆ కోరిక కాలేజీరోజుల నాటికి తీరింది. అడవి నేపథ్యంలో ఓ కథ రాయాలనుకొన్నాను. అప్పటికే మూడు నాలుగు కథలు పత్రికల్లో అచ్చయ్యాయి. రాసి అచ్చు కాకుండా ఉండిపోయినవి అరడజను వరకు ఉన్నాయి. అవి అచ్చయ్యాక కొత్తది రాయొచ్చులే అని తాత్సారం చేస్తున్న సమయంలో బుచ్చిబాబు అడవి నేపథ్యంగా రాసిన *అరకులోయలో కూలిన శిఖరం* కథ చదవడం తటస్థించింది. అడవి అందాలు మరోసారి నా కళ్ళ ముందు తచ్చాడాయి. అప్పుడిక సీరియస్‌గా ఇతివృత్తం కోసం ఆలోచించడం మొదలెట్టాను.

అప్పటికి నేనింకా విద్యార్థిదశలోనే ఉన్నాను. జీవితానుభవాలూ పరిమితమే. కథకు కావలసిన ఇతివృత్తం కోసం ఊహకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సి వచ్చింది.

నాకు చిత్రలేఖనం మీద అభిరుచి ఉంది. కాస్తోకూస్తో అందులో ప్రవేశం ఉంది.

రచనలోనూ అంతే.

అడవిని చూసినప్పుడు చిత్రకారుడిగా నేను స్పందించిన తీరూ, కలిగిన ఆలోచనలూ, రచయితగా నేను పొందిన అనుభూతీ, కదిలిన భావాలూ- స్థూలంగా సౌందర్యారాధనతో ముడిపడి ఉన్నప్పటికీ, సూక్ష్మంగా చూస్తే కొద్దిగా తేడా కనిపించింది. అది చెప్పడం కోసం ఈ రెండు లక్షణాల్నీ రెండు పాత్రలుగా మలచుకొందామనుకొన్నాను. ఒక పాత్ర ఆర్టిస్టు, మరో పాత్ర కవి.

'గీతల్లో ఆకారాల్నీ, పోలికల్నీ తెప్పించి, కళ్ళ ముందున్న ప్రకృతిని కృత్రిమంగా సృష్టించి, సృష్టికి ప్రతిసృష్టి చెయ్యగల చిత్రకారుడు'- సత్యం.

'దాని సౌందర్యాన్నీ, సోయగాన్నీ వర్ణించి, వినిపించి, మారుమూలలకు కూడా దాని ప్రాముఖ్యాన్ని ఎలుగెత్తి చాటే కవి'- శివం.

నిజానికి ఈ రెండు పాత్రలూ ఒకే తరహావి. సౌందర్యారాధనా, భావుకత, రసదృష్టి, సున్నిత హృదయం- ఇవి ఈ ఇద్దరిలోనూ ప్రధాన గుణాలు. తరచు కల్పనాజగత్తులో విహరించే కళా కారులు వీరిద్దరూ. అయితే భౌతిక దృష్టిగల మరో వ్యక్తి కూడా ఉండడం అవసరమనిపించింది. అతని దృష్టిలో అడవి ఎలా ఉంటుందో, అక్కడి ప్రకృతినీ, మనుషుల్నీ అతనెలా చూస్తాడో, ఆ వైవిధ్యాన్ని చూపించే ప్రయత్నంగా ఉద్యోగరీత్యా అక్కడ ఉంటున్న ఒక డాక్టర్ పాత్రని సృష్టించు కొన్నాను. అతను- శర్మ.

ఒకే ప్రకృతి ముగ్గుర్నీ మూడు రకాలుగా స్పందింపజేసింది. చిత్రకారుడైన సత్యం మాటల్లో-

"నన్ను ఇలాంటిచోటగాని పడేస్తే నగర నాగరికుడి పాదస్పర్శే తగలని ఈ ప్రదేశాల్నీ, చెట్లనూ, ఈ కదిలే కాలువల్నీ, పక్షుల్నీ బొమ్మలుగీసి, స్త్రీ వంటి మీద ఇతరులకు కనిపించకుండా దాచిన భాగాల్లా సృష్టిలో దాగిన ఈ మారుమూల సౌందర్యాన్ని అందరికీ బాహాటంగా బట్టబయలు చేసేవాడిని.

శివం కవి గనుక అతని స్పందన మరో విధంగా ఉంది-

"వక్షాల మధ్య చంద్రహారంలా కొండల మధ్య లోయలో పిల్లకాలువా, స్నానంచేసి తలార బోసినట్టు ఆకాశంలో నల్లని చీకటీ- వీటిమధ్య కూచుని కలం పట్టుకొంటే ఓ మహాకావ్యాన్ని సృష్టించకపొయ్యేవాడినా."

వీళ్ళిద్దరిలాగ డాక్టర్ శర్మ భావుకుడు కాడు. భౌతికవాది. అయినా కొన్ని నెలలు ఆ ప్రకృతి మధ్య ఉండేసరికి అతనిలోనూ ఎంతో మార్పు వచ్చింది. అతనంటాడు-

"నేనిలా మారిపోవడం నాకు కూడా చాలా ఆశ్చర్యంగానే అనిపిస్తుంటుంది. కారు మీద తప్పితే కదిలేవాడిని కాదు. పరివారం ఉంటేనేగాని అవతలికి అడుగుపెట్టే వాడిని కాదు. ఈనాడు ఆ పట్టుదలా, ఆ గర్వమూ ఏమయ్యాయో తెలీదు. రెండేసి మైళ్ళు తుప్పల్నీ, గుట్టల్నీ, నీళ్ళచాలుల్నీ దాటుకొని నడిచి వెళ్ళడం అంటే నాకిప్పుడు చాలా ఇష్టం."

ఇలా ఈ ముగ్గురి దృష్టికోణంలోంచీ అక్కడి ప్రకృతినీ, ఆ ప్రకృతిలోని జీవజాలాన్నీ చూపిస్తూనే ఒక గిరిజన స్త్రీ కేంద్రంగా చేసుకొని కథ ఒకటి అల్లుకొన్నాను.

ఈ కథ పేరు *అస్థిపంజరం*. దీన్ని 1959లో రాశాను. ఆ ఏడాదే అచ్చయిన నా తొలి కథల సంపుటి *సమాధి*లో ఒక కథగా దీన్ని చేర్చాను.

శర్మ డాక్టరు. మన్యం ప్రాంతంలో మలేరియా నిర్మూలన కోసం అతన్ని ప్రభుత్వం ప్రత్యేకం గా నియమించింది. అక్కడి ప్రకృతీ, ప్రజలూ అతనికి ఎంతగానో నచ్చి, పట్నం లోని మిత్రులు ఇద్దరికీ రమ్మని ఉత్తరాలు రాశాడు. ఒకతను సత్యం. అతను చిత్రకారుడు. రెండోవాడు శివం. అతను కవి. ఆ ఇద్దరూ కూడబలుక్కొని ఓరోజు బయలుదేరి వచ్చారు. వచ్చిన రోజునే వాళ్ళిద్దరూ అలా తిరిగివద్దామని బయలుదేరి తెలియకుండానే చాలా దూరం వెళ్ళిపోయారు. అక్కడ వాళ్ళకొక మానవ అస్థిపంజరం కనిపించింది. తిరిగివచ్చి ఆ విషయం డాక్టర్ మిత్రుడికి చెప్పారు. ఆ మర్నాడు డాక్టర్ మిత్రుడు వాళ్ళని జీపులో లోతట్టు అడవిలోకి తీసుకెళ్ళి తిప్పి తిరిగి వస్తున్నప్పుడు అస్థి పంజరం ఉన్నచోటికి వచ్చారు. మధ్యదారిలో మిత్రులు అడిగితే డాక్టర్ శర్మ అక్కడి తన అనుభవాల్ని గురించి చెప్పుకొన్నాడు.

సాయంకాలంపూట గూడెంవైపు షికారుకు వెళ్తుంటే అతనికి తరచు ఓ కోయపిల్ల ఎండు చితుకుల మోపుతో- సన్నగా కూనిరాగం తీసుకొంటూ ఎదురవుతుండేది. ఆమె భర్త అడవిలో చెట్లు కొట్టించే ఒక కంట్రాక్టరు దగ్గర కూలిపని చేస్తుండేవాడు. ఒకసారి చెట్టు కొడుతుండగా చెట్టు అతని మీద కూలి ప్రాణాపాయస్థితిలో అతన్ని డాక్టర్ డిస్పెన్సరీకి తీసుకొచ్చారు. డాక్టర్ అతనికి సకాలంలో చికిత్స చేసి ప్రాణాలు కాపాడాడు. అయితే ఆపరేషన్ చేసి అతని చెయ్యి తీసేయవలసి వచ్చింది. ఆ కృతజ్ఞతతో ఎప్పుడైనా డాక్టర్ కనిపిస్తే పనసపండో, మరోటో తెచ్చి ఇచ్చేది ఆ కోయపిల్ల.

ఆమె దైన్యస్థితిని ఆసరా చేసుకొని కాస్త చొరవతో చీర కొనుక్కోమని ఆమెకు ఓ వంద రూపాయల నోటు ఇవ్వబోయాడు డాక్టరు. ఆమె తిరస్కరించి వెళ్ళిపోయింది. అలా ఆనాడు తిరస్కరించి వెళ్ళిపోయిన ఆ కోయపిల్లే ఓ వర్షంరోజు అతని కోసం గంటల తరబడి వర్షంలో తడుస్తూ ఎదురుచూసి, అతను వచ్చినప్పుడు డబ్బులకోసం చెయ్యి చాపింది. సమయానికి జేబులో డబ్బుల్లేక వేలికి ఉన్న బంగారు ఉంగరం తీసిచ్చాడు అతను. దాన్ని తీసుకొని, అతను దగ్గరకు రమ్మని పిలుస్తున్నా వినిపించుకోకుండా, మర్నాడు వస్తానంటూ పరుగెత్తుకొంటూ వెళ్ళిపోయింది. అంతే, మళ్ళీ అతనికి కనిపించలేదు. ఏమయ్యిందో తెలీదు!

ఆశ్చర్యకరమైన విషయమేమంటే మిత్రులు ముగ్గురూ అస్థిపంజరాన్ని చూసి వస్తున్నప్పుడు శివం పాదానికి మట్టిలో ఏదో గట్టిగా తగిలితే తీశాడు. బంగారు ఉంగరం! సత్యం, శర్మలు చూసినట్టు లేదు. ఏ వాగునీటిలోనో ఆ అస్థిపంజరం అక్కడికి కొట్టుకొచ్చి ఉండాలని చర్చించుకొంటున్నారు. శివం ఆ ఉంగరాన్ని జాగ్రత్తగా జేబులో దాచుకొన్నాడు.

-ఇదీ కథ.

ప్రకృతి పట్ల నాకున్న గాఢమైన అనుబంధానికీ, ఆరాధనకూ, తాదాత్మ్యానికీ, ఆకర్షణకూ ఈ కథ ఒక తార్కాణం. తొలిరోజుల్లో రాసిన కథైనా ఇదంటే నాకు చాలా ఇష్టం.

ఒక అద్భుతమైన ప్రకృతి దృశ్యాన్ని పాఠకుడి కళ్ళకు కట్టినట్టు మూడు విభిన్న పాత్రల దృష్టి కోణాల్లోంచి చూపించడానికి ప్రయత్నించాను. ఇలాంటి ప్రకృతి సమ్మోహనాశక్తికి నేనెలా పులకరించిపోయానో అలాగే పాఠకుడ్నీ పులకరింపజేయడానికి ప్రయత్నించాను. ఎక్కడికక్కడ శబ్ద దృశ్యాలు ఇస్తూ పోయాను.

ఉదయం లేచేసరికి ప్రకృతి చక్కగా సింగారించుకొని ఎదుట నిల్చుని ఉంది. తలలో ఎర్రగన్నేరులా మద్దిచెట్ల గుబురులో నుంచి సూర్యుడు తొంగి చూస్తున్నాడు. కిటికీలో నుంచి చూస్తే గుట్టలూ, కొండలూ, అగాధాలూ, కాలువలూ అందంగా, మృదువుగా పచ్చగా కనిపిస్తున్నాయి. కొండశిఖరాల్లాంటి వక్షాల్ని కప్పుతూ ఆకుపచ్చని రంగుచీర పరుచుకొని ఉంది. అలాంటి దృశ్యాల్లో ఇది ఒకటి. ఇటువంటి దృశ్యాలు ఈ కథలో చాలా ఉన్నాయి.


సాధారణంగా రచయిత కథలోంచి బైటికొచ్చేసి పాఠకులకు కనిపించకూడదంటారు. అది లోపమని తెలిసినా ఈ కథలో నేను చాలా సందర్భాల్లో నన్ను నేను నిభాయించుకోలేక పాఠకుడి ఎదుటికి వచ్చేశాను. అడవిపట్ల నాకున్న ఆరాధన అట్లాంటిది.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 7 సెప్టెంబర్ 1997*

23

# మంచుపల్లకి

## శ్రీపతి



*శ్రీపతి 13 జూన్ 1938న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'సహృదయ' నవంబర్ 1956లో ప్రజామత వారపత్రికలో అచ్చయింది. 60 కథలు, కొన్ని వ్యాసాలు రాశారు. 5 కథా సంపుటాలు, ఒక వ్యాససంపుటి ప్రచురించారు. ఉపాధ్యాయుడుగాను, ఆకాశవాణి న్యూస్‌రీడర్‌గాను పని చేశారు. వీరి కొన్ని కథలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి.*


**చిరునామా**

*బి-22, రవీంద్ర నగర్, హబ్సిగూడ,*
*హైదరాబాద్ - 500 007.*
*Ph.: 95507 83944*


సాయంత్రం అయింది. అన్ని దిక్కుల నుండీ చేరుకుంటున్నది చీకటి. బుల్లబ్బాయి అక్కడున్న అయిదుగురు టీచర్ల ముఖాల్లోకి చూసి రెండు చేతులూ ఎత్తి నమస్కరించి అతి దీనంగా అక్కడ నుంచున్నాడు.

బస్ కోసం ఎదురుచూస్తున్నారు టీచర్లు. దగ్గర సంత నించి వచ్చిన వర్తకులు బస్‌స్టాండ్ దగ్గర తమతమ సరంజామాతో, సంచులతో, మూటలతో బస్సు కోసం నిరీక్షిస్తున్నారు. దగ్గర్లో ఉన్న చెరువునీళ్లు పొలాల్లోకి పోయే కాలువ వంతెన గట్టు మీద కూర్చున్నారు మరికొందరు ప్రయాణీకులు.

"బస్సు కోసమా?"

అవునని తలూపాడు బుల్లబ్బాయి.

ఇంకా పదికొండేళ్లు నిండని బాల్యం.

గొంతు పసిగా ఉంది.

అక్కడున్న టీచర్లు తలో ప్రశ్న వేశారు... ఎక్కడికి వెళ్తున్నావు, ఏమిటి పని మొదలయినవి.

బుల్లబ్బాయి తల్లి ఆరోగ్యం బాగాలేక చాలా రోజులు ఆమెను ఊళ్లోనే ఉంచి ఆయుర్వేద వైద్యము, ఎల్.ఎమ్.పి. డాక్టరుతో అల్లోపతి వైద్యము చేయించి ఏ

ఫలితమూ, ఏమాత్రం మెరుగు కనిపించకపోవటంతో దగ్గర్లో ఉన్న పట్టణంలోని ఎమ్.బి.బి.ఎస్. పెద్ద డాక్టరు వద్దకు తీసుకుపోయారు. తండ్రి హాస్పిటల్లోనే ఉంటున్నాడు. తండ్రి కోసం ఉదయం, సాయంత్రం అన్నం కేరియర్ బస్సుకి అందిస్తున్నాడు బుల్లబ్బాయి.

ఇప్పుడు వచ్చే బస్సులో ఖాళీ కేరియర్ వస్తుంది. అది తీసుకుని ఒక్క పరుగున ఫర్లాం గున్నర దూరంలో ఉన్న ఊళ్లోకి పోయి కేరియర్ కడిగి అక్కయ్య సర్దేకా మళ్లీ పరుగు పరుగున బస్సుస్టాండ్‌కి వచ్చి పట్నానికి పోయే నైట్‌హాల్ట్ బస్సుకి అందిస్తాడు.

టీచర్లు అడిగిన ప్రశ్నలకి, వెలిబుచ్చిన సందేహాలకి జవాబులు చెప్పి నేలకి చూపులు వాల్చి నుంచున్నాడు బుల్లబ్బాయి. వాడి మనసులో సమాధానం లేనని ప్రశ్నలు దట్టంగా నిండి ఉన్నాయి. అమ్మ ఇంటికి తిరిగి ఎప్పుడు వస్తుంది? నాన్న ఇంటి పనులు, షాప్ పనులు తిరిగి స్వయంగా ఎప్పుడు చూసుకుంటాడు? తను బడికి రోజూ వెళ్లటం మళ్లీ ఎప్పుడు? అమ్మ వచ్చి ఇంటి పనులన్నీ తనే ఎప్పుడు చూసుకుంటుంది? ఈ బస్సుల కోసం ఉదయం, సాయంత్రం వేచి ఉండటం ఎప్పుడు తప్పుతుంది? సాయంకాలప్పూట అందరి స్నేహితులతో పాటు ఆడుకోవ టానికి అవకాశం ఎప్పుడు చిక్కుతుంది? బడికి రానందుకు టీచర్లు కోప్పడుతున్నారనీ, స్నేహితులు విచారిస్తున్నారనీ అమ్మతో ఎప్పుడు చెప్పుకోవాలి- మొదలయినవన్నీ టీచర్లు అడిగిన ప్రశ్నలతో కదిలినట్టున్నాయి.

చుట్టూరా ఉన్న పంటపొలాలు నిన్న మొన్నటి వరకు బంగారంలాంటి పంటలతో కన్నుల పండువుగా కళకళ్లాడాయి. ఈ సాయంత్రం పంటలు కోసేసిన ఆ పొలాలు, కనుచూపుమేర అంతా నిర్జీవంగా ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు ఆ బంగారు పంటచేలు శ్రావ్యంగా గొంతు విప్పి పాడాయి. ఈనాడు మూగబోయాయి. సూర్యుని చివరి వెలుగు తీయని జ్ఞాపకంలాగ పశ్చిమాకాశానికి ఊదారంగు పూసింది. పొలాలు దాటిన తర్వాత తూర్పున కొబ్బరితోటలు మార్గశిరపు చలిగాలులకు జడిసి ముడుచుకుపోయినట్టుగా కన్పిస్తున్నాయి. ఆకాశం పంచమి వెన్నెలల తెరలని జారుస్తూ మరీ అందంగా ఉంది. అక్కడా అక్కడా నక్షత్రాలు మెరుస్తున్నాయి. చీకటి పసిపాప బోసినవ్వులా ఉంది. ప్రకృతి అందాన్ని, ఆ సాయంత్రం ముత్యాన్ని కడిగినట్టు కడుగుతున్నది.

చెవులను కప్పుతూ తలకు మఫ్లర్ చుట్టుకున్న పొడుగాటి టీచర్ కొంతసేపు అదేపనిగా బుల్లబ్బాయిని చూసి, ''మీ అమ్మగారిని హాస్పిటల్‌లో చేర్చి ఎన్నాళ్లయింది,'' అని అడిగాడు.

'రెండు వారాలయిందండి?'' అన్నాడు బుల్లబ్బాయి.

''మరి నీవు వెళ్లి అమ్మగారిని చూసి వచ్చావా?''

''లేదండి. నేను వెళ్తే ఇక్కడ ఇంట్లో మా అక్కకి తోడు ఎవ్వరూ ఉండరు. నిన్ననే మా పిన్ని వచ్చింది. ఇవేళ వెళ్దామనుకున్నాను. కాని స్లిప్‌టెస్ట్ పరీక్ష ఉండటం వల్ల వెళ్లలేకపోయాను. రేపు వెళ్తానండి,'' అన్నాడు.

బస్సు ఆలస్యానికి విసిగిపోయి రోడ్డు దాటి పొలంగట్టు మీదికిపోయి కూర్చున్నారు ముగ్గురు టీచర్లు. మరో టీచర్ సిగరెట్ వెలిగించుకోవడానికి రోడ్డు ప్రక్క తాటిపాకల టీకొట్టు దగ్గరకు వెళ్లి, అక్కడ సమితి ఉద్యోగుల మీద రేగిన విమర్శలు వింటూ నుంచుండిపోయాడు. బుల్లబ్బాయిని విడవలేక మఫ్లర్ చుట్టుకున్న పొడుగాటి టీచరు, టీచర్‌ని విడిచిపెట్టలేక బుల్లబ్బాయి రోడ్డు ప్రక్కన మాటాడుకుంటూ నుంచున్నారు.

చలి ఎక్కువయినట్టుంది. ఒళ్లంతా ముడుచుకుని నుంచున్నాడు బుల్లబ్బాయి. చేతులు పేంట్ జేబుల్లో పెట్టుకున్నాడు టీచర్. బస్సు ఎంతకీ రావటంలేదు. దక్షిణదిక్కు నుండి ఉత్తర దిక్కుగా పోతున్న తార్రోడ్డు కనుచూపు మేర సరళరేఖలా సాగింది. అక్కడక్కడా ఎడ్లబళ్లు, అప్పు డప్పుడు లారీలు తప్పించి బస్సు జాడలేదు. రోడ్డుకు రెండువేపులా ఉన్న మొగలిపొదలు నిశ్శబ్దం గా ఉన్నాయి. పశ్చిమంగా ఉన్న ఊరును కలుపుతున్న కంకరరోడ్డు తార్రోడ్డుని తాకి ఆగిపోయింది. రోడ్డుకు తూర్పున బిక్కుబిక్కుమంటూ నాలుగు టీ కొట్టులు ఉన్నాయి. అన్నీ తాటాకులతో వేసినవే. ఆ టీకొట్లకు తలుపులూ, కిటికీలు ఏమీలేవు. పై కప్పులు కూడా ఎత్తుగా లేవు. చూరులు నేలకు వాలాయి. లోపల మనుషులు ఎత్తుకుపోవటానికి వీల్లేని ఒక ఎత్తయిన రాతి అరుగు, మట్టి అరుగులున్నాయి. ఆ టీకొట్లకి ప్రక్కనే కిల్లీబడ్డీలున్నాయి. అరటిగెలలూ, చుప్పులూ, చేగోడీలు ఆ బడ్డీలలో వేలాడుతున్నాయి. ఆ టీకొట్లవాళ్లు, బడ్డీల వాళ్లు ఇప్పుడు వచ్చే ఆ రెండు బస్సుల కోసమ చూస్తున్నారు.

“మీ అమ్మగారికి ఇప్పుడు ఎట్లా ఉంది?” అని అడుగుతున్నాడు పొడుగాటి టీచర్ బుల్లబ్బాయిని. ఇంతసేపు చుట్టూ ఉన్న మనుషులను చూస్తున్న అతని మనసు శూన్యంగా ఉండిపోయింది. కొంతసేపు అతడు దుఃఖం దిగమింగుకుంటున్నట్టుగా మౌనంగా ఉండి పోయాడు.

పాలంగట్టు మీద కూర్చొన్న టీచర్లు కేకేసి ఆ పొడుగాటి టీచర్ని రమ్మని పిలుస్తున్నారు. అట్లా విద్యార్థితో నుంచుని అంతసేపు మాట్లాడటం వారికి ఇష్టంలేదు. స్టూడెంట్స్‌తో చనువుగా ఉండటం వలన టీచర్ అంటే భయం పోతుందని వాళ్ల విమర్శ. కాని బుల్లబ్బాయితో మాట్లాడు తున్న ఆ టీచర్ పిల్లలతో కలిసిపోయి వాళ్లతో ఆడుకోవటానికి, పాడుకోవటానికి ఈ ఉద్యోగాన్ని ఎన్నుకున్నాడు. అతడి గది నిండా పిల్లలే. అమాయికంగా, కుతూహలంగా వాళ్ల ముచ్చట్లు, ప్రశ్నలు, వినోదం అతడికి ఎంతో ప్రియం.

“మొన్నటివరకు ఏమీ బాగాలేదు. చచ్చిపో-” అని తర్వాత మాట పలకలేకపోయాడు బుల్లబ్బాయి. “నిన్నటికి కొంచెం నయమయిందట. తెలివొచ్చిందట,” అని మరి చెప్పలేక పోయాడు. తర్వాత చెప్పవలసినదేమిటో తోచలేదు.

అమ్మ ఎంత బాధపడుతున్నదో వాడికి తెలుసు. అమ్మ మంచం పట్టిందంటే డాక్టర్‌ను పిలుచుకురావటం (ఊర్లో చిన్న హాస్పిటల్ ఉంది. అక్కడ మందులుండవు. ఎల్.ఎమ్.పి. డాక్టరు ఉన్నాడు.) మందుల కోసం పట్నం వెళ్లటం వాడి పనే. ఒక్కోసారి బస్సులో వెళ్తాడు. ఒక్కోసారి సైకిల్ మీద వెళ్తాడు. నాన్న పనిమీద ఎక్కడికన్నా వెళ్తే కొట్టు మీద (వాళ్లకు బట్టల కొట్టుంది) కూర్చోవటం వాడికి తప్పదు. వాడే ఆ ఇంట్లో పెద్దవాడూ చిన్నవాడూనూ. బుల్లబ్బాయికి అక్క ఉంది. అయితే ఆ అమ్మాయికి పెళ్లయింది. సుమారు వంద మైళ్ల దూరంలో అత్తవారింట్లో ఉంటుంది. ఆ అమ్మాయిని కన్నవారింటికి పంపించడానికి వాళ్లాయనకి ఇష్టముండదు. వాళ్లత్త గారికి కోడలు కన్నవారింటికి వెళ్లిపోతే కొడుకు దిగులుపడిపోతాడని భయం. ఈసారి తల్లి అనా రోగ్యం గురించి గట్టిగా రాస్తే అక్కయ్యను పంపించారు. భార్యను పంపిస్తూ, నాలుగు దినాల్లో నేనూ వస్తానుగా అన్నాడు వాళ్లాయన. అక్కయ్య వచ్చినప్పటి నుండి ఇంటి పనులతోనే గడిచి పోతున్నది. అమ్మని చూడటానికి ఆ అమ్మాయి కూడా వెళ్లలేకపోయింది. అమ్మ ఆరోగ్యం కోలుకుని త్వరలోనే ఇంటికి వచ్చేస్తుందని ధైర్యంగా ఉంది.

ఊరు చిన్నచిన్న దీపాల వెలుగుతోను, మొక్కల మధ్య మహావృక్షంలా సత్యంబాబు గారి మేడతోను, వెన్నెలా చీకటీ కలిసిన మసకకాంతితోను, ఊరుచుట్టూ ఉన్న పొలాల్లో గడ్డికుప్పల తోనూ, పెద్ద చెరువుగట్టు మీది అమ్మవారి ఆలయంతోను ఓ పెద్ద విశాలమైన కేన్వాస్ మీది చిత్రంలా కనబడుతున్నది. శెట్టిగారి కిరాణాషాప్ నించి పెట్రోమాక్స్ లైట్ కాంతి మిరుమిట్లు కొలుపుతూ ఉంది. ఆ ఊరుకు దక్షిణంగా ఉన్న దేవాలయం దగ్గర్లో విశాలమైన సత్యంబాబు గారి మామిడితోట ఉంది.

ఇంకా బస్సు రాలేదు.

మఫ్లర్ చుట్టుకున్న ఆ పొడుగాటి టీచర్ బుల్లబ్బాయినే చూస్తున్నాడు. వాడి కళ్లు ఇంకా నిర్మలంగా, కడిగిన లేతనీలం కలువరేకుల్లా ఉన్నాయి. కొన్ని దినాలుగా తిండి సరిగ్గా తినక బలహీనంగా ఉన్నట్టున్నాడు. వాడి దీనమైన చూపులు తన గుండెల్లోపలికి పోయి అక్కడ కన్నీళ్లు కురుస్తున్నట్టున్నాయి.

బుల్లబ్బాయి కథ అంతా- గుండెలో, ఆ లోపల విశాల సముద్రంలో, ఇంతవరకు ప్రశాంతంగా ఉన్న ఆ సముద్రంలో సుడిగాలి రేగి, తుఫాన్ గాలులు వీచి, తన తల్లిని చూడాలని ఓ కుమారుడు ప్రయాణిస్తున్న ఓడను దెయ్యం ఊపినట్టుగా ఊపేస్తున్నాయి. ఈ వయస్సులో వీడికి తల్లి లేకపోతే వీడేమయిపోతాడు? ఎవరు పిలిచి వీడిని తమ గుండెలకద్దుకుంటారు? ఎవరి ఒడిలో తన సంతోషాలని వెళ్లబోసుకుంటాడు. ఎవరితో తన ఆటపాటలు చెప్పుకుంటాడు? తల్లి లేదని లోకం వేలెత్తి చూపితే ఏమి వెతుక్కుంటాడు? ఎవరిని అమ్మా అమ్మా అని పిలుచు కుటాడు? తల్లిని చిన్ననాటే పోగొట్టుకున్నాడని లోకం నిందిస్తే ఏం సమాధానం చెప్పుకుంటాడు? అర్ధరాత్రి అమ్మ జ్ఞాపకం వచ్చి పిలిస్తే ఎవరు పలుకుతారు? ఎవ్వరూ పలక్కపోతే వెక్కివెక్కి ఏడిస్తే ఎవరు వచ్చి గుండెల్లోకి తీసుకుని ఓదారుస్తారు? ఎవరు తన చెంగుతో వాడి కన్నీళ్లు తుడుస్తారు? ఈ ప్రశ్నల హోరులో చలించిపోయాడా పొడవాటి టీచర్. హృదయంలోని తేనెలో దెయ్యాలు మురికి పోసి తొక్కుతున్నాయి. కళ్లల్లోంచి జలజలా కన్నీళ్లు రాలాయి. బుల్లబ్బాయికి కనిపించకూడదని ప్రక్కకి తిరిగి కర్చీఫ్‌తో కళ్లు తుడుచుకుని, "వేరు శెనక్కాయలు తీసుకురా," అని బుల్లబ్బాయి చేతిలో రూపాయిబిళ్ల పెట్టి అక్కడి నుండి పంపించేశాడు.

టీచర్ తన చేతిలో పెట్టిన రూపాయి అందుకుని, "ఎంతవి తేవాలండీ?" అని టీచర్ కళ్లల్లోకి చూసి, ఆ కళ్లు ఎర్రగా కన్నీళ్లతో నిండి ఉండటం చూసి తెల్లబోయాడు.

"అర్ధరూపాయివి తీసుకురా, వెళ్లు," అని తోలాడు టీచరు.

బుల్లబ్బాయి అక్కడ నుండి వెళ్లిపోయాడు.

బుల్లబ్బాయి నిర్మలంగా, ఆరోగ్యంగా, నవ్వు ముఖంతో అందంగా ఉండేవాడు. అట్లాంటిది వాడి మీద ఈ బాధ్యతలు వచ్చిపడ్డాయి. తల దువ్వుకోలేదు. బట్టలు మాసి ఉన్నాయి. దిగులుగా ఉన్నాడు. కనీసం గొంతు కూడా ధైర్యంగా లేదు.

దూరాన దక్షిణ దిక్కు నుంచి లైట్లు వెలిగించుకుని ఏదో వాహనం వస్తున్నది. తీరా అది సమీపించేసరికి బస్సు కాదు లారీ. అక్కడ బస్సు కోసం ఎదురుచూస్తున్న వాళ్లందరికీ నిరాశగా తయారయింది.

పొలంగట్టు మీద కూర్చున్న టీచర్ల కాళ్లు నొప్పులు పుట్టి లేచి రోడ్డు మీదికి వచ్చారు. దక్షిణదిక్కు నుండి మరో వాహనం లైట్లు వెలిగించుకుని వస్తున్నది.

"బస్సేనా గురూ?" ఒకరితో ఒకరు సందేహం వెలిబుచ్చుకుంటున్నారు.

బస్సుస్టాండ్‌లో సందడీ, సద్దూ ఎక్కువయిపోయింది.

బుల్లబ్బాయితో పాటు టీకొట్టు దగ్గర టీచర్ కూడా వచ్చాడు. టీచర్లు అందరూ మళ్లీ ఒక్క దగ్గరికి చేరారు. నిమిషంలో వాళ్ల చలి పోయింది. విసుగు పోయింది. బద్ధకం పోయింది.

వచ్చేది బస్సే అని ఆశ.

ఆరోజు ఆ టీచర్లకు వేతనాలు అందాయి. దగ్గర్లో అర్ధగంట బస్సు ప్రయాణంలో చిన్న టౌనుంది. ఆ టౌనులో, ఆ టౌనుకి తగ్గట్టు ఒక సినిమాహాలు ఉంది. ఆ హాలుకు శతదినోత్సవం చేసుకున్న ఓ సినిమా వచ్చింది. వెళ్లి చూసి రావాలని ఇద్దరుముగ్గురు అనుకున్నారు. సినిమా చూసి రావాలని మరో ఇద్దరిని ఎగదోసి అంతా బయల్దేరారు. వాళ్లల్లో ముగ్గురు కుంపటి రాజేసుకుని వంట చేసుకునే బ్రహ్మచారులు. రాత్రి వంట తప్పుతుంది. హోటల్‌లో తినొచ్చు కదా అని సంబరపడ్డారు. దాంతో వాళ్లు లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా సాయంత్రం ఆరుగంటలకు వచ్చే బస్సు కోసం అయిదుగంటలకే వచ్చి ఎదురుతెన్నులు చూడసాగారు. ఎంతకీ బస్సు రావటంలేదు. చివరికి వచ్చింది వచ్చింది అనుకుని ఆశపడ్డది లారీ, పెట్రోల్ లారీ!

"గురూ, ఇంక సినిమా వద్దు పాడూ వద్దు- పదండి ఇంటికి చక్కా. ఇంత తిని హాయిగా నిద్రపోక- ఈ చలిలో ఎవరు పడమన్నారు ఈ బాధ," అన్నాడు ఒకాయన. ఆయనకు ఇంట్లో వంట చేసి పెట్టే భార్య ఉంది. ఆడుకోవటానికి ఒక పాప ఉంది. అంతేకాక ఆయనకి బస్సు మీద, సినిమా మీద కోపం వచ్చింది. దాంతో ఆయన ఉత్సాహం అంతా చల్లారిపోయింది. మరో టీచర్ బస్సు ఆలస్యానికి ప్రభుత్వాన్ని తిట్టాడు. మనుషులలో ఏ తప్పు కనిపించినా, తన కాలికి ముల్లు గుచ్చుకున్నా, చివరకు తనకు ఆకలయినా అతడు ప్రభుత్వాన్నే తిడతాడు. అన్నిటికీ సంజాయిషీ ప్రభుత్వమే ఇవ్వాలి అంటాడు. మరొక టీచర్ సందేహంలో పడ్డాడు. సినిమాకు వెళ్లినా, తిరిగి ఇంటికి వెళ్లినా ఒక్కటేలే అన్నట్టున్నాడాయన.

మఫ్లర్ చుట్టుకున్న ఆ పొడుగాటి టీచర్, 'తీసుకోండి,' అని బుల్లబ్బాయి తెచ్చిపెట్టిన వేరుశెనక్కాయలను అందరి మధ్యా పెట్టాడు. ఇష్టం లేనట్లుగా కొందరు, ఇష్టం ఉన్నట్లుగా మరికొందరు వేరుశనక్కాయలు అందుకున్నారు.

వాళ్లు టౌన్ వెళ్లి సినిమా చూసి తిరిగి రావటానికి రాత్రి పదిన్నర గంటలకి పాసింజర్ రైలు ఉంది. అది ఆ ఊళ్లో రెండు నిమిషాల సేపు ఆగుతుంది. ఇట్లాంటి వినోదాలకి ఆ రైలు వారికి ఎంతో సదుపాయం.

'బస్సు ఈరోజు వచ్చేట్టు లేదే,' అని విసిగిపోయి, బాధపడి, నీరసించిపోయి 'మూర్తి (బస్సు డ్రైవర్) మరీ నెమ్మది. ప్రతి ఊళ్లోనూ వాడికి బంధువులే. బస్సు ప్రయాణీకుడు ప్రతి ఒక్కడూ వాడికి స్నేహితుడే. తీరిగ్గా వాళ్లతో కబుర్లు చెప్పుకుని మరీ కదుల్తాడు,' అని వాళ్లల్లో వాళ్లు విసుక్కున్నారు.

నుంచునే కంటే వెళ్లి ఎక్కడన్నా కూర్చోవాలనిపించింది. ఆ టీ కొట్టులో కూర్చోవటానికి చోటున్నట్టు లేదు. పైగా ఆ లోపల చుట్ట, బీడి, సిగరెట్ల పొగ కంపు. వంతెన గట్టు మీద కూర్చుందామా అంటే అక్కడ గ్రామసేవికా, ఆమె స్నేహితురాలూ వచ్చి ఇప్పుడే కూర్చున్నట్టున్నారు. పోయి ఆ ప్రక్కనే కూర్చోవటానికి తగుమాత్రం జాగా ఉంది. ఆ అమ్మాయిలతో వాళ్లకు పరిచయం కూడా లేదు. అందుచేత సభ్యత కోసం ఇక్కడ ఈ రోడ్డు మీద నుంచోవడమే మంచిదనిపించింది.

"మీ అయ్య రాలేదురా బుల్లబ్బాయి?" అని ఓ టీచర్ అడిగాడు. ఆయన సంస్కారపరుడే కాని ఇది పల్లెటూరు. అక్కడకు వచ్చిన తర్వాత వాళ్ల భాష, వాళ్ల పద్ధతీ అలవరుచుకుంటున్నాడు. మీ నాయనగారు అనటానికి బదులు ఆయన 'మీ అయ్య' అని వాడేడు.

"లేదండి, రాలేదండి. వారం దినాలయింది వచ్చి. అంతకుముందు ఒకపూట వచ్చి మళ్లీ వెంటనే వెళ్లిపోయాడు," అన్నాడు బుల్లబ్బాయి.

మఫ్లర్ చుట్టుకున్న ఆ పొడుగాటి టీచర్‌కి బుల్లబ్బాయి తండ్రి, భార్యకు చేస్తున్న సేవ అపురూపంగా కనబడింది. ఆ తండ్రి ఇక్కడ ఇల్లు వదిలి, ఆస్తి వదిలి, వ్యాపారం వదిలి, కొడుకు చిన్నవాడే అయినా వాడిని వాడి గతికి వదిలి తన స్వంత అవసరాలన్నీ మరిచిపోయి, భార్య మీద మమతానురాగాలతో ఆమె జీవితంలో ఇచ్చిన అదృష్టాలకి కృతజ్ఞతలతో, ఆమె లేని వెలితి ఊహించలేక, తన సర్వస్వం ధారపోసి ఆమెను కాపాడుకోవాలన్న దీక్షతో, ఆమె కన్నీళ్ల వేదనా భారాన్ని పంచుకుంటూ, ఆమె సేవలు చూస్తూ-

"డాక్టర్ గట్టివాడే లెండి," అని వేరుశనగపప్పు నోట్లో వేసుకుని క్షణం మాట్లాడలేక, "మా రిలేటివ్ ఒకాయన- చచ్చిపోతాడనుకున్నాం- అది కాదండి- డాక్టరు మందు కాదు ముఖ్యం- ఆ చెయ్యి- ఆ చెయ్యి- అది పడితేచాలు- పట్టణంలో అంతమంది డాక్టర్లున్నా- ఇతడికున్న డిమాండు, ఇన్‌కమ్మూ- ఇతర్లకేదీ- అసలు రేడియం ట్రీట్‌మెంట్‌కి కావలసిన ఆధునిక పరికరాలని సైతం- ఈమధ్యనే జపాన్ నుండి తెప్పించాడండీ," అని డాక్టర్‌ని పొగిడాడు. ఆ మాటలు బుల్లబ్బాయికి ఎంతో ధైర్యాన్ని కలిగించాయి. వాడి గుండెల్లోని భయం సాలెగూళ్లను తుడిచిపెట్టి, వాడు గుండె నిండా ఆశని నింపుకునేట్టు చేశాడాయన.

మరో ఆయన, "స్వామీ, అంతా మన కర్మ. వాడు చేసిందేమిటి? మనకి ఎంత రాసి ఉంటే అంత. మన పూర్వజన్మ సుకృతం. మన కర్మ బాగా ఉంటే అంతా మన ప్రజ్ఞే," అని ఖండించి పారేశాడు. అదృష్టవశాత్తూ ఆ టీచర్ మాటలు బుల్లబ్బాయికి అర్థంకాలేదు. అంచేత బుల్లబ్బాయి ఆశతో, ధైర్యంతో ఉన్నాడు. ఊళ్లో ఒక అమ్మ తన తల్లి అనారోగ్యం గురించి మాట్లాడుతూ, 'బతికి బట్ట కట్టగలిగితే ఆ పిల్లల పుణ్యమే,' అని నిరాశ ప్రకటించింది. అప్పుడు బుల్లబ్బాయి గుండెల్లో సముద్రకల్లోలం చెలరేగింది. వాడు మూగవాడయిపోయాడు. వాడిలోని ఆశ అంతా మటుమాయమైపోయింది.

చలి హెచ్చుతూ ఉంది. కూర్చున్నవాళ్లు ముడుచుకుపోయి కూర్చుంటున్నారు. నుంచుని మాట్లాడుకుంటున్న వాళ్లు ఒకరి చాటున ఒకరు నుంచుంటున్నారు. సిగరెట్లు, బీడీలు, చుట్టలూ పొగలు కక్కుతున్నాయి. దూరాన ఒక ముసలమ్మ చుట్ట వెలిగించి కాలిన భాగం నోట్లో పెట్టుకుని అడ్డపొగ వదులుతూ కూర్చుంది. బయట నుంచోలేక కొందరు టీకొట్ల పాకల్లోకి పోతున్నారు. రోడ్డు ప్రక్క బండి దగ్గర రెండు ఎడ్లు నేలమీద పండుకుని నెమరు వేసుకుంటున్నాయి.

ఆ అయిదుగురు టీచర్ల మీదనే కాదు- అక్కడ బస్సు కోసం ఎదురుచూస్తున్న అందరి మీద చీకటినవ్వులాంటి వెన్నెల కురుస్తున్నది. అంతా మసకమసకగా ఉంది. అంతా దిక్కులేని దీనత్వం ఆవరించినట్టుగా ఉంది. ఆ మసకచీకట్లలోకి మఫ్లర్ చుట్టుకున్న ఆ పొడుగాటి టీచర్ కల్లోలిత హృదయం మూగవోయినట్టుగా ఉంది. బుల్లబ్బాయిలోని కోటి గోదావరుల మాతృప్రేమ వరదని ఆ రహస్యాంబరమే కప్పివేసింది.

మళ్లీ దక్షిణదిక్కు నుండి బస్సు వెలుగు.

అది కూడా దగ్గరకొచ్చి ఏ లారీయో అయి నిరాశపరుస్తుందని నిట్టూరుస్తున్నారు. అయినా సద్దు పెరిగింది. కూలీల గోల హెచ్చింది. చిన్నచిన్న వర్తకులు తమతమ మూటలనీ, బస్తాలనీ సర్దుకుంటున్నారు. బద్ధకం వదిలించుకుని అందరూ లేచి రోడ్డున ఓ ప్రక్కకి చేరుకుంటున్నారు.

ఇక్కడున్న ఇంతమందినీ ఈ బస్సు ఎక్కించుకోగలదా అన్న అనుమానంతో ఎవరికి వారే తొందరపడి బస్సులోకి దూసుకుపోవాలనుకుంటున్నారు.

"గురూ! ఇంతకీ సీటు దొరికేట్టుందా?" అంటున్నాడు ఒక ప్రయాణీకుడు.

"గురూ! మనకి సీటు?" అని తోటివాని ప్రశ్నతో జలుదుకుంటున్నాడు మరొక ప్రయాణీకుడు.

బస్సు దగ్గరకు వచ్చిన హడావిడి హెచ్చవుతూ ఉంది.

"బస్సే గురూ! లోపలి లైట్లు కనబడుతున్నాయి. అదుగో, బస్సే," అని నిర్ధారించాడు ఓ టీచరు.

బస్సు పెట్రోలు వాసనతో, ధూళితో, గోలతో వచ్చి ఆగింది. బస్సు వెలుగులు ముందుకు పరుచుకున్నాయి. ఎక్కే ప్రయాణీకులు, దిగే ప్రయాణీకులను సైతం దిగనివ్వకుండా అడ్డంపడి ఒకరినొకరు తొక్కుకుంటూ, తోసుకుంటూ నుంచున్నారు. ఆ ఇంజన్ మోతలో క్లీనర్, కండక్టర్, డ్రైవర్‌లు పెద్దపెద్ద అరుపులతో వాళ్ల భాషలో మాట్లాడుకుంటున్నారు. బస్సు అదృష్టవశాత్తూ చాలావరకు ఖాళీగానే ఉంది. కాని సంతరోజు రద్దీ మూలంగా అక్కడున్న ప్రయాణీకులదరికి చోటు దొరికేటట్టు లేదు.

బస్సు డ్రైవర్ మూర్తి తన పరిచయస్తులతో పలకరింపులూ, నమస్కారాలూ, నవ్వులూ ఆరంభమయ్యాయి.

"ఇంజనార్పమను," కండక్టర్ వెనక నుంచి కేకేశాడు.

ఇంజనార్పేశాడు. దాంతో సగం అలజడి చల్లారిపోయింది. ఇప్పుడు వినిపించేవన్నీ మనుషుల గొంతులే.

పాతకాలపు బస్సు అది.

ఫ్రంట్ సీట్ నుండి ఇద్దరు అక్కడే దిగుతున్నారు. సత్యంబాబు తమ్ముడూ, ఆయన స్నేహితుడు స్టేషన్‌మాస్టరూ దిగారు. ఆ రెండు సీట్లలోకి ఇద్దరు టీచర్లు వెళ్లారు. మఫ్లర్ టీచర్‌తో పాటు మరో ఇద్దరు టీచర్లు సెకండ్ సీట్లోకి వెళ్లి సదుపాయంగా కూర్చున్నారు.

బుల్లబ్బాయి డ్రైవర్ సీట్ దగ్గరికి వచ్చి బస్సెక్కి, "బావా కారియర్ ఇయ్యి," అని కేకేశాడు. డ్రైవర్ మూర్తి వరసకి బుల్లబ్బాయికి బావ అవుతాడు. ఆ ఊరే వాడిది. మొదట్లో క్లీనర్‌గా ఓ లారీలో పన్చేసి తర్వాత డ్రైవర్‌గా ఈ బస్సులోకి వచ్చాడు. వచ్చిన దగ్గర నుండి ఇదే బస్సులో ఉంటున్నాడు. వారం పదిదినాల్లో ఈ బస్సు తీసేసి కొత్త బస్సు వేస్తున్నారట. అది చాలా పెద్ద బస్సట.

డ్రైవర్ చూట్టానికి రౌడీవాడిలాగా కనబడతాడు. నల్లగా బలంగా పొట్టిగా పెద్ద గుండ్రని కళ్లతో పలచటి సన్నటి పెదాలతో, గిరజాల జుత్తుతో చూస్తే భయపడతారు. కాని నెమ్మదయిన వాడు.

బీడీ తీసి అగ్గిపెట్టె వెతికి బీడీ వెలిగించుకుంటున్న వాడల్లా, "బావా కారియర్," అని రెండో కేక వినిపించే సరికల్లా అటు తిరిగి, "ఒరేయ్ బుల్లీ," అన్నాడు బీడీ వెలిగించటం మానేసి.

"ఏం బావా?"

"కారియర్ ఇవ్వాళ ఇవ్వలేదురా," అన్నాడు.

"మరెలాగ?"

"రేపొచ్చేస్తారట రా. మీ నాన్న చెప్పమన్నాడు."

బుల్లబ్బాయికి అమ్మ ముద్దు పెట్టుకున్నంత సంతోషమయింది.

మఫ్లర్ చుట్టుకున్న పొడుగాటి టీచర్ బుల్లబ్బాయి మాటలు ఆసక్తితో వింటున్నాడు. వాడి ముఖాన వెలిగిన సంతోషం చూసి ఆనందించాడు.

"బావా, మరి నాన్నకి ఈ రాత్రికి తిండో?" అన్నాడు గతాన్ని పట్టుకుని డ్రైవర్ సీటు దగ్గర నుంచున్న బుల్లబ్బాయి.

"ఫరవాలేదులే. ఒక రాత్రికి హోటల్‌లో తింటాడ్లే," అన్నాడు మూర్తి స్పష్టంగా.

మూర్తి ప్రక్కనే ఫ్రంట్ సీట్‌లో కూర్చున్న ఓ టీచర్‌కి బస్సు ఆవేళ ఇంత ఆలస్యంగా ఎందుకొచ్చిందో కనుక్కోవాలని అనిపించింది.

"అయితే వెళ్లిపోతాను బావా," అని బుల్లబ్బాయి బస్సు దిగిపోయాడు.

మళ్లీ ఏమి అడగాలనుకున్నాడో మరోసారి వచ్చి గజం పట్టుకుని నుంచుని, "ఈ నైట్ బస్సుకి తిండి పట్టుకుని వెళ్తేనో?" అన్నాడు.

"వద్దంటే ఎందుకురా. వాళ్లు రేపొచ్చేస్తారు కదా. పైగా ఇంట్లో మీ అప్ప ఒక్కతే ఉంటున్నాది కదా? దానికి తోడు ఎవరుంటారు మరి?" అన్నాడు మూర్తి.

బావ కోప్పడుతున్నాడని దిగిపోబోయి ఇంట్లో అక్క ఒక్కతే ఉంటున్నదన్న కారణంతో వెళ్లవద్దంటున్నాడేమోనని, "ఫరవాలేదు బావా, పిన్ని వచ్చింది. పడుకుంటుంది తోడుగా," అన్నాడు.

"ఒరే నేను చెప్పిందిన్రా," అన్నాడు ఈసారి మూర్తి నచ్చచెప్తున్న గొంతుతో.

మూర్తి మరో కారణమేదీ చెప్పలేదు.

బుల్లబ్బాయి దిగిపోయారు.

అంతలో మరో ఇద్దరు వచ్చి డ్రైవర్ మూర్తితో అరటిగెలలు పైసలు లెక్క చెప్పి ఇస్తున్నారు. శ్రీకాకుళం నుండి ఆ రోడ్డులో ఉన్న కిల్లీ బడ్డీలు అన్నింటికి ఈ బస్సుల వాళ్లే అరటిగెలలు తెచ్చి ఇస్తుంటారు. ఆ పైకం వసూలు చేసుకోవడంలో మునిగిపోయాడు మూర్తి.

డ్రైవర్ ప్రక్కన కూర్చున్న టీచర్‌కి బస్సు ఆలస్యానికి కారణం తెలుసుకోవాలని ఉంది. మూర్తి బిజీగా ఉన్నాడు. అంచేత మెదలకుండా కూర్చున్నాడు. మూర్తి బీడీ తాగుతూ పొగ వదులు తున్నాడు.

"వచ్చిందా?" అనుకుంటూ మిల్లు డ్రైవర్ శాంతయ్య వచ్చాడు డ్రైవర్ దగ్గరకి. ఇంకా అరటిగెలల వ్యవహారం తేలనేలేదు.

"ఆఁ ఆఁ వచ్చింది. కండక్టరునడిగి తీసుకో."

ఆ భాష వాళ్లకే తెలుసు. అక్కడి నుండి మిల్లు డ్రైవర్ వెళ్లిపోయాడు.

ప్రయాణీకులని ఒక్కర్ని విడవకుండా అందర్నీ ఎక్కించుకున్నాడు కండక్టర్. బస్సు కిటకిట లాడుతున్నది. మంగళవారప్పూట సంత రద్దీ తప్పదు మరి. ఎవర్నీ విడిచిపెట్టేట్టు ఉండదు. అందరికీ వెళ్లాలనే ఉంటుంది. మరో బస్సు కోసం చూసేట్టు లేదు. అందరికీ వాళ్ల వాళ్ల పనులు ఉన్నాయి. నుంచునో, వేలాడో పోవాలనే ఉంటుంది. అదే చివరి బస్సు. ముప్పయి సీట్ల ఆ బస్సులో దాదాపు డెబ్బయిమందికి పైగా ఉన్నారు. క్లీనర్ బస్‌టాప్ మీద ఇంకా మూటలు సర్దుతూనే ఉన్నాడు. గోల కొంత తగ్గింది.

'ర్ర ర్ ర్ ర్ యిట్' అన్నాడు కండక్టర్ చివరికి. డ్రైవర్ చెవి దగ్గర బెల్ మోగింది దాంతో పాటు.

ఇంజన్ స్టార్ట్ అయింది. స్టీరింగ్ మీద చేతులు పడ్డాయి. దృష్టి రోడ్డు మీదికి పోయింది. బస్సు కదిలింది.

అంతలో హెడ్మాస్టరుగారికి వచ్చే ఇంగ్లీషు వారపత్రిక ఇవ్వడం మరచిపోయిన సంగతి గుర్తొచ్చింది డ్రైవర్‌కి. కిల్లీబడ్డీ వాడిని పిలిచాడు డ్రైవర్. వాడు పరుగున వచ్చి పత్రిక తీసుకు పోయాడు.

"సినిమాకు అందించగలరా?" అని ఎవరో అడిగారు.

"పావుగంటలో వెళ్లిపోమా బాబూ?" అన్నాడు ధైర్యంగా మూర్తి.

"ఆ రైలుగేటు దగ్గర గూడ్స్ బండి వస్తున్నదని అరగంటసేపు ఆగిపోయింది బాబూ. దానికితోడు రోడ్డునిండా ధాన్యం బళ్లు. ఎంత హారన్ కొట్టినా దారివ్వరు. జాగర్తగా రాకపోతే మన పీక మీదికొస్తుంది. ఆ తర్వాత ఆస్పత్రి దగ్గర అయిదు నిమిషాలు ఆపాల్సొచ్చింది బాబూ. మా అప్ప చచ్చిపోయింది. నిన్నటికి తెలివొచ్చింది ఫరవాలేదు అనుకున్నాము. కాని ఈవేళ సాయంత్రం నాలుగున్నరకి ఆ హంస ఎగిరిపోయింది," అన్నాడు దీనంగా.

మూర్తి ప్రక్కనే కూర్చున్న టీచర్‌కి గుండె ఆగినంత పనయింది. అంతవరకూ బుల్లబ్బాయి గురించిగాని, వాడి తల్లి గురించిగాని అసలు ఆలోచించనేలేదు. కాని సీట్‌లో కూర్చున్న తర్వాత డ్రైవర్ చెప్పిన మాటలు విన్నాడు. రేపు తిరిగి తల్లీతండ్రీ వచ్చేస్తున్నారన్నాడు. బాగానే ఉందన్నాడు. కారియర్ అందుకే తీసుకురాలేదన్నాడు. రేపు అమ్మని చూస్తానన్న ఆనందంతో బావ మాటలు నమ్మి వెళ్లిపోయాడు బుల్లబ్బాయి. ఈ రాత్రంతా తీయని కలలతో నిద్రపోతాడు. తెల్లారేసరికి తల్లి మంచుపల్లకిలో కన్పిస్తే-

"ఆ అబ్బాయితో మరి అట్లా చెప్పావెందుకు?"

"ఇంకేమని చెప్పగలం మేష్టారూ? చిన్నవాడు కదా!" గేరు మార్చాడు డ్రైవర్.

డ్రైవర్ ప్రక్కన కూర్చొన్న టీచర్ వెనక సీటువేపు తిరిగి, మఫ్లర్ చుట్టుకున్న పొడుగాటి టీచర్‌తోనూ, ఇతర టీచర్లతోనూ, "బుల్లబ్బాయి తల్లి పోయిందంటండీ," అన్నాడు.

బస్సు రోడ్డు మలుపు తిరిగింది. ఎడ్లబండి అడ్డమొచ్చి మూర్తి సడన్‌బ్రేక్ వేశాడు. కిటకిట లాడుతున్న ప్రయాణీకులంతా ఒకరినొకరు గుద్దుకుని, రుసరుస చూసుకున్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి విసుక్కున్నారు.

మళ్లీ బస్సు కదిలింది.

మీ అమ్మ నిన్ను చూడాలని రమ్మని కబురుపెట్టింది. ఇవ్వాళ స్లిప్ టెస్ట్ ఉంది. నువ్వు అమ్మని చూట్టానికి వెళ్లలేకపోయావు. రేపు వెళ్లాలనుకున్నావు. ఆ చూడాల్సినదేదో నువ్వు వెళ్లకుండానే చూస్తావు... అనుకున్నాడు ఆ పొడుగాటి టీచరు.

"ఇంక నీకీ ప్రపంచంలో ఎవ్వరు సత్యం చెప్పర్రా. నువ్వు సత్యానికి దూరమైపోతావు. నీ పట్ల జాలితో చెప్పరు. నీవు పిరికివాడవైపోతావు. నువ్వూ సత్యం చెప్పలేవు. నీకూ ఆ బలం పోతుంది," అని బాధపడి కన్నీళ్లు పెట్టుకున్నాడాయన.

"అందుకే నేను పిరికి వాడినైపోయాను," అని నిట్టూర్చాడా తలకి చెవుల మీదుగా మఫ్లర్ చుట్టుకున్న ఆ పొడుగాటి బ్రహ్మచారి టీచరు.

*

బుల్లబ్బాయి ఒంటరిగా చెరువుగట్టు మీంచిపోయి ఊరు సమీపించేసరికి ఎవరో గుండె కొట్టుకుని ఏడుస్తున్న ఏడుపు వినిపించింది. అది ఆ ఏడుస్తున్నది తన అక్కే. ఇంక నాలుగడుగులు ముందుకేసి ఇంటివాకిట అడుగుపెట్టేసరికి పిన్ని ఏడుపు వినిపించసాగింది. వాళ్లకు ఏమయిందో బుల్లబ్బాయికి అర్థంకాలేదు. అప్పటికే ఇరుగుపొరుగు జనం ఆ ఇంట్లో చేరారు.

అక్క గుండె పగిలే ఏడుపు నిజం చెప్పినప్పుడు- బావంటే కోపం వచ్చింది. డాక్టర్లంటే కోపం వచ్చింది. నాన్న అంటే కోపం వచ్చింది. స్లిప్ టెస్ట్‌లంటే కోపం వచ్చింది. చదువంటే కోపం వచ్చింది. తన మీద తనకే, తన నిస్సహాయత మీద తనకే కోపం వచ్చింది. ఆ కోపంతో, ఆ బాధతో, ఆ హింసతో, అక్కడ గుమిగూడిన జనాన్ని చూసి బావురుమని ఏడ్చాడు బుల్లబ్బాయి.

*'కవిత' సాహితీ మాసపత్రిక, 1965*

## నేపథ్యం

తల్లి కోసం పసిహృదయం తపన

# మంచుపల్లకి

***కథారచనకు ఆ విద్యార్థులు, ఆ పాఠశాల వాతావరణం, ఉపాధ్యాయులు నేపథ్యం సమకూర్చాయి. తల్లి అనారోగ్యం, తల్లిప్రేమ, బుల్లబ్బాయి ఇతివృత్తాన్నిచ్చాయి. తల్లి ప్రేమకు ఈ ప్రపంచంలో ఏదీ సాటిరాదు. తల్లిప్రేమను పొందటం కన్నా జీవితానికి అపురూపమైన అదృష్టం ఇంకేదీ ఉండదు.***

**మం**చుపల్లకి 1965లో గుంటూరు నుండి వెలువడే సాహితీ మాసపత్రిక కవితలో అచ్చయింది. నిండా 11 ఏళ్ళు కూడా నిండని విద్యార్థి బుల్లబ్బాయి తల్లి ప్రేమ ఇతి వృత్తం. తల్లికి జబ్బు చేసింది. ఊళ్ళో ఆయుర్వేద వైద్యం, అల్లోపతి వైద్యం చేయిం చినా ఫలితం లేకపోయేసరికి దగ్గర పట్నంలో ఉన్న ఎం.బి.బి.ఎస్. డాక్టరు దగ్గరకు తీసుకుపోయారు. ఆస్పత్రిలో చేర్చి తల్లిసేవ చేస్తున్నాడు తండ్రి. దాంతో బుల్లబ్బాయికి ఉదయం, సాయంత్రం తండ్రికి కేరియర్‌లో భోజనం పంపించే పని పడింది. ఒకటే కేరియర్. బస్సు డ్రైవర్ మూర్తి బుల్లబ్బాయి బంధువు. వరసకి బావ. బస్సు వేళకి వచ్చి కేరియర్ తీసుకొని బస్సు తిరిగి వచ్చే సమయానికి తెచ్చి డ్రైవర్‌కి ఇస్తే అర్ధగంట లోపే ఆస్పత్రిలో ఉన్న తండ్రికి అందిపోతుంది. మళ్ళీ అదే కేరియర్‌ని తిరుగు ప్రయాణంలో తెచ్చి బుల్లబ్బాయికి ఇస్తాడు.

తల్లి ఆస్పత్రిలో ఉండటం వల్ల బుల్లబ్బాయి బడికి రోజూ రెండుపూటలా వెళ్ళలేక పోతున్నాడు. తల్లికి జబ్బు చేసిన సంగతి తెలిసి కూతురు అత్తవారింటి నుంచి వచ్చింది. అక్క ఇంట్లో వాడికి తోడు. ఈ కారియర్ డ్యూటీ మూలంగా తల్లిని చూట్టానికి వెళ్ళాలని ఉన్నా వాడు వెళ్ళలేకపోతున్నాడు. దానికితోడు తండ్రికి ఊళ్ళో చిన్న బట్టలకొట్టుంది. అది తెరవాలి. అక్కడ కూర్చోవాలి.

ఈ కథ రాసిన రోజుల్లో శ్రీకాకుళం జిల్లాలో 'పూండి' అన్న గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేస్తున్నాను. ఊరు ప్రశాంతమైన

నిరాడంబరమైన అందం. ఉదార హృదయులైన డాక్టర్ కణితి విశ్వనాథంగారు ఎంతో శ్రద్ధ తీసుకొని, పట్టుదలతో ఆ చుట్టుప్రక్కల గ్రామాలలోని పిల్లల విద్య కోసం పాఠశాల నిర్మించాడు. టీచర్లు ఉండటానికి అన్ని సదుపాయాలతో ఒకే వరుసలో పది ఇళ్ళు నిర్మించాడు. నీళ్ళ కోసం ఒక బావి. ఆ పాఠశాల అన్ని సౌకర్యాలతో ఓ గురుకులాశ్రమంలాగా ఉండేది.

ఆరోజుల్లో కొత్తగా ప్రారంభించిన ఆ హైస్కూల్‌కి ఇంకో భాగ్యం ఏమిటంటే హెడ్మాస్టరు శ్రీ టి. గోదావరిరాజుగారు గాంధేయవాది. తోటి ఉపాధ్యాయులకు, చిన్నారి విద్యార్థులకు ఆయన స్ఫూర్తి- ఉత్తేజం కలిగించేది. ఆయన ప్రేమాభిమానాలు ఆదర్శప్రాయంగా ఉండేవి. చుట్టు ప్రక్కల అయిదారు కిలోమీటర్ల దూరం నుండి పిల్లలు నడిచి వచ్చి చదువుకొనేవాళ్ళు. ఉపాధ్యా యులు పిల్లల పట్ల పితృవాత్సల్యంతో ప్రవర్తించేవాళ్ళు.

పూండికి దగ్గర టౌన్ ఒకవేపు పలాస. బస్సులో 20 నిమిషాల దూరం. అక్కడ సినిమాహాల్ ఉంది. సాయంత్రం బస్సులో పోయి సినిమా చూసి, ఆ రాత్రి హోటల్‌లో భోజనం చేసి రావడం ఒక ఆటవిడుపు. తిరిగి రావటానికి రాత్రి పదిన్నర గంటలకి పాసింజర్ రైలు ఉంది.

కథారచనకు ఆ విద్యార్థులు, ఆ పాఠశాల వాతావరణం, ఉపాధ్యాయులు నేపథ్యం సమకూర్చాయి. తల్లి అనారోగ్యం, తల్లిప్రేమ, బుల్లబ్బాయి ఇతివృత్తాన్నిచ్చాయి. తల్లి ప్రేమకు ఈ ప్రపంచంలో ఏదీ సాటిరాదు. తల్లిప్రేమను పొందటం కన్నా జీవితానికి అపురూపమైన అదృష్టం ఇంకేదీ ఉండదు. ప్రపంచంలోని అన్ని మానవతా అనుబంధాలకీ మూలం తల్లిప్రేమే.

విద్యార్థుల్లో కొన్నిసార్లు తల్లి లేదా తండ్రి లేని పిల్లల గురించి తెలిసేది. ఆ పిల్లవాడిని లేదా ఆ అమ్మాయిని చూసినప్పుడు మనసు విలవిలలాడేది. హృదయం ద్రవించిపోయేది. అట్లాంటి ఓ విద్యార్థి ఈ కథలో బుల్లబ్బాయి.

కథారచనలో నాకు కథాస్థలం వాతావరణం పట్ల ప్రత్యేకమైన అభిమానం. దాంతో పూండి గ్రామం, ఆ చుట్టుప్రక్కల పంటపొలాలు, దూరంగా తూర్పున కొబ్బరితోటలు, చెరువులు, కాలవలు, అమ్మవారి మందిరం, దేవాలయం, సత్యంబాబుగారి మేడ (వరదా వారి మేడ)- ఆ రూపురేఖల దృశ్యమాలికతో, ఆ వాస్తవిక సౌందర్యం మనసుకు హత్తుకుని పాఠకుని రంజింప జేస్తుంది.

మంచుపల్లకి కథ ప్రధాన సన్నివేశం బస్టాండ్. అక్కడే ఆ రోడ్డు మీదే మంగళవారం సంత. సంత రోజున వర్తకులతో ప్రయాణీకుల రద్దీ కూడా ఎక్కువే. కథంతా అక్కడే బుల్లబ్బాయి కేంద్రంగా నడుస్తుంది. అక్కడకు బస్సు కోసం వచ్చిన ఉపాధ్యాయులకు బుల్లబ్బాయి తల్లి ఆస్పత్రిలో ఉందని తెలుసు. దాంతో ఆ పిల్లవాడి పట్ల ప్రత్యేకమైన అనుకంపన. ముఖ్యంగా డిసెంబరు నెల చలికి చెవులను కప్పుతూ తలకు మఫ్లర్ చుట్టు కున్న పొడుగాటి ఉపాధ్యాయునికి. తల్లిలేని జీవితంలో ఉన్న దుఃఖం, లోటు, ఆవేదన, నిత్య ఆక్రందనల సంక్షోభంతో జీవితం ఎంత భయంకరమో తెలిసిన ఆ పొడుగాటి టీచర్ కన్నీళ్లు పెట్టుకుంటాడు. తన కన్నీళ్ళు ఆ విద్యార్థి చూడకూడదని వేరుశనక్కాయలు కొనుక్కుని రమ్మని బస్టాండ్ దగ్గరి కిల్లీబడ్డీ (పాన్‌షాప్)కి పంపించాడు.

అక్కడ తాటాకుపాకల్లో నాలుగు టీకొట్లు. వాటి ప్రక్కనే అరటిపళ్ళు, సోడాలు, చుప్పులు, చేగోడీలు, సిగరెట్లు, బీడీలు, చుట్టలు అమ్ముకునే కిల్లీబడ్డీలు. రాత్రిపూట అక్కడ ఎవరూ కాపలా కూడా ఉండరు. ఆ బస్టాండ్‌కు పడమరగా రైల్వేస్టేషన్. రైల్వేస్టేషన్‌కు పడమరగా ఊరు. ఊరుకు పడమరగా గురుకులాశ్రయం వంటి హైస్కూల్.

ఇదీ మంచుపల్లకి గ్రామ వాతావరణం.

తల్లి జబ్బు, ఆస్పత్రిలో పెద్ద డాక్టరు వైద్యం, జబ్బు నయమై తల్లి ఇంటికి వస్తుందన్న నమ్మకం తప్పి చావు అన్న ఆలోచన ఊహకు కూడా తట్టని వయసున్న బుల్లబ్బాయి ఆ ఉపాధ్యాయులకు ప్రధానమైన ఆకర్షణ అయినాడు. వాడి బాధ వాళ్ళ బాధగా తయారయింది.

వాడి ఆందోళన వాళ్ళకు కన్పిస్తున్నది. తల్లి ఎంత త్వరగా ఇంటికి వచ్చేస్తుందా? బడికి తాను రోజూ ఎంత త్వరగా పోగలుగుతానా అన్నదే.

బస్సు వచ్చింది. ప్రయాణీకులు సందడి హెచ్చింది. పాతకాలపు బస్సు... ఇంజన్ మోత. డ్రైవర్ లావాదేవీలు. ఆ రూట్‌లో కిల్లీబడ్డీల వాళ్ళకి అరటిగెలలు సప్లయి, ఇంకా ఇతర కార్యకలాపాలు ప్రధానంగా డ్రైవర్‌దే. కండక్టరు, క్లీనరు- వాళ్ళవాళ్ళ పనుల్లో. టీచర్లకు ముందు సీట్లలో కూర్చునే సీట్లలో చోటు దొరికింది.

బుల్లబ్బాయి ఎదురుచూస్తున్న కేరియర్‌ని ఇవాళ బస్సు డ్రైవర్ మూర్తి తీసుకురాలేదు. 'కేరియర్ ఇవేళ ఇవ్వలేదు రా,' అన్నాడు.

'మరెలాగ?' అని అడిగితే-

'రేపొచ్చేస్తారటరా. మీ నాన్న చెప్పమన్నాడు,' అన్నాడు.

ఆ జవాబుతో బుల్లబ్బాయికి అమ్మ ముద్దు పెట్టుకున్నంత సంతోషమయింది.

'బావా, మరి నాన్నకి ఈ రాత్రికి తిండో?' అని డ్రైవర్ సీట్ దగ్గర నుంచున్న బుల్లబ్బాయి ప్రశ్నకి-

'ఫరవాలేదులే ఒక రాత్రికి హోటల్‌లో తింటాడ్లే,' అని డ్రైవర్ జవాబు.

అక్కడ నుండి బస్సు కదిలిపోయింది. బుల్లబ్బాయి వెళ్ళిపోయాడు.

సినిమాకు అందించగలరా అని ఒక ప్రయాణీకుని ప్రశ్న.

పావుగంటలో వెళ్ళిపోమా బాబూ అని డ్రైవరు ధైర్యం చెప్పి, బస్సు ఇవాళ ఆలస్యంగా రావటానికి కారణాలు చెప్పుకొచ్చాడు. రైలుగేటు పడి దాదాపు అరగంటసేపు ఆగిపోయింది. దానికితోడు రోడ్డు నిండా ధాన్యంబళ్ళు. ఆ తర్వాత ఆస్పత్రి దగ్గర అయిదు నిమిషాలు ఆపాల్సి వచ్చింది. 'మా అప్ప చచ్చిపోయింది. ఇవేళ సాయంత్రం నాలుగున్నరకి... ఆ హంస ఎగిరి పోయింది,' అన్నాడు దీనంగా.

మూర్తి ప్రక్కనే కూర్చున్న టీచర్‌కి గుండె ఆగినంత పనయింది.

'ఆ అబ్బాయితో మరి అట్లా చెప్పావెందుకు?'

నిజం చెప్పే సందర్భం కాదది. చిన్న పిల్లవాడు. ఆ సంగతి తెలిసిందే.

చెవులను కప్పుతూ తలకు మఫ్లర్ చుట్టుకున్న పొడుగాటి టీచర్ కళ్ళల్లో అశ్రువులు పొంగాయి. 'ఇంక నీకీ ప్రపంచంలో ఎవ్వరూ సత్యం చెప్పర్రా. నువ్వు సత్యానికి దూరమైపోతావు. నీపట్ల జాలితో చెప్పరు,' బాల్యంలోనే తల్లిని కోల్పోయిన దీనత్వంతో ఆవేదన చెందాడు.

కథ ముగింపు వాక్యాలు:

''బుల్లబ్బాయి ఒంటరిగా చెరువుగట్టు మీంచి పోయి ఊరు సమీపించేసరికి ఎవరో గుండె కొట్టుకుని ఏడుస్తున్న ఏడుపు వినిపించింది. అది ఆ ఏడుస్తున్నది తన అక్కే. ఇంక నాలుగడుగులు ముందుకేసి ఇంటి వాకిట అడుగుపెట్టేసరికి పిన్ని ఏడుపు వినిపించసాగింది. వాళ్ళకు ఏమయిందో బుల్లబ్బాయికి అర్థంకాలేదు. అప్పటికే ఇరుగు పొరుగు జనం ఆ ఇంట్లో చేరారు.

అక్క గుండె పగిలే ఏడుపు నిజం చెప్పినప్పుడు- బావంటే కోపం వచ్చింది. డాక్టర్లంటే కోపం వచ్చింది. నాన్నంటే కోపం వచ్చింది. స్లిప్‌టెస్ట్‌లంటే కోపం వచ్చింది. టీచర్లంటే కోపం వచ్చింది. చదువంటే కోపం వచ్చింది. తన మీద తనకే, తన నిస్సహాయత మీద తనకే కోపం వచ్చింది. ఆ కోపంతో, ఆ బాధతో, ఆ హింసతో, అక్కడ గుమిగూడిన జనాన్ని చూసి బావురుమని ఏడ్చాడు బుల్లబ్బాయి.''

కథకి పేరు పెట్టడం కూడా కథారచనలో ప్రధాన అంశమే. కథ పేరు కొన్ని సందర్భాలలో కథకి ఒక అలంకారంగా తయారవుతుంది. ఈ కథ విషయంలో కొంత ఇబ్బంది పడ్డమాట వాస్తవం. 'పాడె' అన్న పేరు స్ఫురించింది. నచ్చలేదు. ఆ మాటకి సమానార్థకంగా మంచుపల్లకిని కల్పించాను. ధ్వని ప్రధానంగా ఆ పేరు నాకు సంతృప్తి నిచ్చింది.

*మంచుపల్లకి - మరి తొమ్మిది* తొలిసారిగా జూన్ 1968లో ఎమెస్కో పాకెట్ బుక్స్ సిరీస్‌లో వచ్చింది. ఎమెస్కో అధినేత దివంగత శ్రీ ఎమ్.ఎన్. రావుగారు ప్రచురణరంగంలో కొత్తకొత్త ప్రయోగాలు చేస్తున్న రోజులు. కథల సంపుటి ప్రచురించమని వారికి నా కథలు ఓ ఇరవై ఇచ్చాను. ఇంటింటా స్వంత గ్రంథాలయం ఉద్యమంలో మారుమూల గ్రామాలలోని సాహిత్యాభిమానులకు పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారాయన. పుస్తకం వెల రూ. 2. నెలకి నాలుగు పుస్తకాలు వేసేవారు. అన్ని పుస్తకాలకి ప్రఖ్యాత చిత్రకారులు శ్రీ బాపుగారి ముఖచిత్రాలుగా వచ్చేవి. ఇన్నర్ టైటిల్‌లో ఒక రేఖాచిత్రం ఉండేది. అట్ట చివర రచయిత ఫోటో, ఆ రచన విలక్షణత గురించి కొద్ది వాక్యాలలో పరిచయం ఉండేవి.

నా కథల సంపుటికి అప్పట్లో ఎమెస్కో ప్రచురణలకు సలహాదారుగా సంపాదక బాధ్యతలు నిర్వహించిన స్వర్గీయ శ్రీ డి. రామనాథంగారు *మంచుపల్లకి - మరి తొమ్మిది* అని పేరు పెట్టారు. మొత్తం పది కథలు అని దాని అర్థం.


*కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

*23 ఆగస్ట్ 2011*

# 24

## ధనలక్ష్మి

### శ్రీరమణ



*శ్రీరమణ 21 సెప్టెంబర్ 1952న జన్మించారు. వీరి మొదటి కథ 'వెలుగు తగ్గని వజ్రం' 1970ల్లో ఆంధ్రపత్రికలో వెలువడినా, సుదీర్ఘ విరామం తర్వాత బంగారుమురుగు కథ వెలువడింది. మిథునం కథల సంపుటి ప్రచురించారు. అనేక హాస్యరచనలు, వందల కొద్దీ పేరడీలు రచించారు. కొంతకాలం వివిధ పత్రికల్లో కాలమిస్టుగాను, సినిమారంగంలోను పనిచేసి, ఆంధ్రప్రభ, నవ్య వారపత్రికలకు, పత్రిక మాస పత్రికలకు సంపాదకులుగా ఉండి ప్రస్తుతం మహాటివి న్యూస్ ఛానెల్‌లో పని చేస్తున్నారు. వీరి మిథునం కథ సినిమాగా వచ్చింది.*

**చిరునామా**
*27, ఓమ్ నగర్, న్యూ మహ్మదీ లైన్స్,*
*హైదరాబాద్-500008*
*Ph.: 90102 10201*

సీతారామాంజనేలు ఎనిమిదో తరగతిలో నా క్లాసు మేటు. ఒకే బెంచీలో కూచునేవాళ్ళం. సిల్కు చొక్కా, సిల్కు పైజామా, వాచీ, రెండు ఉంగరాలూ- బొద్దుగా, నల్లగా నిగనిగలాడుతుండేవాడు. ఫెళఫెళలాడే ఇస్త్రీ చొక్కా జేబులో ఎప్పుడూ డబ్బులు గలగలలాడుతూ వుండేవి. వీటికితోడు ఆకుపచ్చ హంబర్ సైకిలు వుండడం- సెంటునూనె గమగమలతో షంషేర్‌గా స్కూలుకి వచ్చే సీతారామాంజనేలంటే మా అందరికీ కొంచెం ఈర్ష్యగానే వుండేది. వీటన్నిటి వల్లా సంక్రమించిన దర్జా కాకుండా అసలు పెద్దరికం ఇంకోటి కూడా వుంది అతనికి. అదేంటంటే- ఈశ్వరయ్య అనే ఓ పెద్దాయనకి పిల్లలు లేకపోతే దగ్గర దాయాది పిల్లాడని సీతారామాంజనేయుల్ని దత్తు చేసుకున్నారు. ఆయన ఇప్పుడో కాసేపో అనే స్థితిలో వుండి ఇంటి దీపం పెళ్ళి కళ్ళారా చూడాలని తహతహలాడితే దత్తపుత్రుడి పెళ్లి ధనలక్ష్మితో జరిపించేశారు. అంచేత సీతారామాంజనేలు మా స్కూలు మొత్తం మీద పెళ్ళయిన విద్యార్థి. ధనలక్ష్మి మా బళ్ళోనే మూడోక్లాసు చదువుతుండేది.

ఈశ్వరయ్యగారొకటి తలిస్తే ఈశ్వరుడు వేరొకటి తలచాడు. ఇప్పుడో కాసేపో అనుకున్న ఈశ్వరయ్యగారు తిప్పుకుని తేరుకుని యథావిధిగా దుకాణంలో కూచుని

వ్యాపారం, వ్యవహారం చూసుకోవడం మొదలుపెట్టారు. 'గొడ్డొచ్చిన వేళ, బిడ్డొచ్చిన వేళ అంటారు- మా సీతారావుడు వచ్చి నాకు ఆయుష్షు పోశాడు,' అని పెద్దాయన మురిసిపోయాడు. ఆయన బతికిపోడం బానే వుంది కాని, అకాల వివాహం రామాంజనేలుకి కొంచెం ఇబ్బందినీ, బోలెడు పెద్దరికాన్నీ తెచ్చి పెట్టింది. అసలే అమిత మితభాషి. పైగా తనని విచిత్రంగా, కొంచెం హేళనగా అంతా చూస్తున్నారనే అనుమానం కొంత. ఎవరూ అతన్ని 'ఏరా' అని పిలిచేవారు కాదు. నాతో కొంచెం చనువుగానే వుండేవాడు. నేను మాత్రం 'ఏవోయ్' అని పిలిచేవాణ్ణి. అతనికి అప్పుడప్పుడు హోంవర్క్ దస్తూరి మార్చి నేను చేసిపెడుతూండేవాణ్ణి. దానికి బదులుగా గ్రౌండులో తన సైకిల్ మీద మూడునాలుగు రౌండ్లు కొట్టడానికి ఛాన్స్ ఇచ్చేవాడు. ఆకుపచ్చ హంబర్ సైకిలు- పైగా బ్రూక్స్ సీటు, డైనమో, తళతళలాడే నికెల్ స్పోక్స్‌తో కాసేపైనా దాని మీద సవారీ చెయ్యడమంటే నా ప్రాణానికి చిన్న విషయం కాదు.

ఒకరోజు సైన్స్ క్లాసులో కోడిగుడ్డులో భాగాలు చెప్పమని మాస్టారు అడిగితే, 'పై పెంకు మరియు కోడిపిల్ల,' అన్నాడు రామాంజనేలు. సైన్సాయన రెచ్చిపోయి అతని పెద్దరికాన్ని పక్కనపెట్టి రామాంజనేల్ని బెంచీ ఎక్కించారు. పాపం, తల వంచుకుని వేలి వుంగరాలు తిప్పు కుంటూ నిలబడ్డాడు. మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు సరిగ్గా అదే సమయానికి ధనలక్ష్మి గల్లుగల్లున గజ్జెల చప్పుడుతో పరుగున వచ్చి రొప్పుతూ రోస్తూ తరగతి గుమ్మంలో నిలబడి, "ఇదిగో రామాంజనేలూ, నాకు పెన్సిలు కావాలి..." అని బిగ్గరగా అక్కడి నించే అరిచింది. ఒక్కసారి క్లాసంతా గొల్లుమంది. అసలే బెంచీ మీద అవమానభారంతో కుంగిపోతున్న రామాంజనేలుకి నెత్తిన పిడుగుపడ్డట్టయింది. ఆకుపచ్చ పట్టులంగా, పట్టు జాకెట్, మెడలో ఎర్రరాళ్ళ నెక్లెసు, కంటినిండా కాటుక, గట్టిగా అల్లిన ఒంటిజడ, ఎనిమిదేళ్ళ ధనలక్ష్మి క్లాసు నవ్విన నవ్వుకి బిత్తర పోయి తత్తరపడి గల్లుగల్లున పారిపోయింది. పాపం! క్లాసు నిశ్శబ్దంగా వుంది. ధనలక్ష్మి గజ్జెల చప్పుడు క్రమంగా దూరమైంది. మాస్టారు కోడిగుడ్డు పాఠం మళ్ళీ అందుకోబోతుంటే- రామాం జనేలు ఆంజనేయుడిలా ఒక్కసారి డెస్క్ మీంచి కిందికి దూకాడు. రోషం కమ్మేసిన అతని ముఖం తుమ్మల్లో పొద్దుగూకినట్లుంది. చరచరా బయటకు నడిచి, వరండాలో సైకిల్ స్టాండు పెద్ద చప్పుడ యేలా తీసి అక్కడే సైకిలెక్కాడు. వెళ్తూ క్లాసు గుమ్మంలో ట్రింగ్‌ట్రింగ్‌మని బెల్ కూడా కొట్టాడు.

అంతటి వెర్రి ధైర్యం జరిగిన అవమానంలోంచి వచ్చిందేగాని పాపం అతను పెద్దమనిషే! జరిగిందానికి మాస్టారు ఖంగుతిన్నాడు. ఏమీ అనలేక, "ఒరే వీడి పుస్తకాలు యావత్తూ తెచ్చి స్టాఫ్‌రూంలో పెట్టు రాస్కెల్," అని క్లాస్ లీడర్‌కి పురమాయించి, తిరిగి కోడిగుడ్డు పాఠంలోకి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత మళ్ళీ సీతారాంజనేలు స్కూలు పక్కకి రాలేదు. ధనలక్ష్మి కూడా బడి ఆవరణలో మళ్ళీ కనిపించలేదు.

"ఎటూ కొట్టు మీద నాకూ సొంతమనిషి అవసరమే... కాస్త మంచీ చెడూ, లాభం నష్టం తెలుసుకుంటాడు," అని ఈశ్వరయ్యగారు సరిపెట్టుకున్నారు. ఎప్పుడేనా వాళ్ళ దుకాణానికి వెళితే రామాంజనేలు కనిపించేవాడు. మాటామంచీ వుండేదికాదు, ఏదో ముక్తసరిగా ఒక చిన్న నవ్వు తప్ప.

*

సీతారామాంజనేలు స్కూలు మానెయ్యడం వల్ల అప్పుడప్పుడు హంబర్ సైకిల్ తొక్కే అదృష్టం నాకు పోయింది. పదో తరగతి తర్వాత ఇంటర్‌కి పక్క ఊరు వెళ్ళాలి. అప్పుడు ఎటూ సైకిల్ యోగం పడుతుందని ఆనందపడుతున్న తరుణంలో మా స్కూలుని జూనియర్ కాలేజీ చేశారు. నా చదువుతోపాటు దరిమిలా డిగ్రీ కాలేజి కూడా అయింది. ఇహ జన్మకి సైకిల్ యోగం లేదని అర్థమైపోయింది. అత్తెసరు మార్కులతో ఏదో గట్టెక్కాం అనే లెక్కలో మెల్లిగా డిగ్రీలోకి వచ్చిపడ్డాను.

అసలు నాకు రామాంజనేలు స్ఫూర్తితో చదువు మానెయ్యాలని కోరిక ఉండేది. అయితే రామాంజనేలు వాళ్ళ నాన్న తీసుకున్నంత తేలిగ్గా మా నాన్న తీసుకోకపోగా, "వాళ్ళ కంటే వ్యాపారాలున్నాయ్... మనకేం ఉంది బూడిద... ఎన్టీఆర్ పుణ్యమా అని కరణీకాలు కూడా పోయాయి. అక్షరమ్ముక్క లేకపోతే అడుక్కు తినాల్సిందే," అని ఘాటుగా దీవించాడు. ఒకరోజు ఈశ్వరయ్యగారికి ఈశ్వరుడి ఆజ్ఞ అయింది. ఆయన పోయాక తెలిసిందేమంటే ఎటూ ఎవడో పరాయివాడికి పోయేదేకదా అని చేరదీసిన గుమాస్తాలు నలుగురూ కలిసి దుకాణం దోచేశారనీ, కరిమింగిన వెలగపండులా అయిందనీ, ఇవ్వాల్సిన బాకీలకీ రావల్సిన జమలకీ సరికి సరి, హళ్ళికి హళ్ళి, సున్నకి సున్న అయింది. దుకాణం మూతపడింది. ఇరవై ఏళ్ళ సీతారామాంజనేలు, పదిహేడేళ్ళ ధనలక్ష్మి మిగిలారు. దత్తపుత్రుడు అవడం వల్ల ఈశ్వరయ్యగారి వంశం మాత్రం మిగిలింది.

*

ఒకరోజు సెంటర్లో కనిపించి, "మీకోసమే చూస్తున్నా. ఒకసారి మా ఇంటికి వస్తారా," అన్నాడు రామాంజనేలు- వెళ్ళాను. అంగడి వీధిలో ఇంటి మీద ఇళ్ళు- అందులో ఒక చిన్న గది ముందు రేకుల వరండా.

ఇంట్లో అడుగుపెట్టగానే, "ఇదిగో ఆయనొచ్చాడు..." అన్నాడు రామాంజనేలు ముక్తసరిగా. అంతకుముందు నా గురించి ఏం చెప్పాడో తెలియదు.

"కూర్చో అన్నయ్యా. నీతో కొంచెం మాట్లాడాలి," లోపల్నించి రేకుల వరండాలోకి వస్తూ అంది ధనలక్ష్మి. ఆరోజు ఎప్పుడో బుట్టబొమ్మలా ఉన్న ధనలక్ష్మిని క్లాసురూం గుమ్మంలోంచి చూడడం తప్ప మళ్ళీ ఎప్పుడూ చూడలేదు. ఇదే మళ్ళీ చూడడం.

వయసుకి మించిన పెద్దరికం. మాటల్లో ఎంతో పొందిక స్ఫురించింది.

"మా పరిస్థితి మీకు తెలిసే ఉంటుంది. ఉన్నట్టుండి వీధినపడ్డాం... ఏం చెయ్యాలో పాలుపోవడంలేదు... మీ ఫ్రెండు సంగతి తెలుసుగా... అదేమన్నా అంటే ఏ కొట్లోనో పొట్లాలు కట్టే ఉద్యోగం చేస్తానంటాడు... నావల్ల చదువు చెట్టెక్కిందంటాడు. చీమలకి చక్కెర దొరగ్గా లేంది... మనుషులం... మనకి నాలుగు మెతుకులు దొరకవా అని ధైర్యం చెప్పబోతే ఉన్నదుండగా నాకో గుదిబండని నిన్ను తగిలించారు అని చిరాకుపడతాడు. ఎంత చెడ్డా ఈశ్వరయ్యగారి దత్తుడంటారు గందా."

"సర్లే, ఆ సోది ఆపి అసలు విషయం చెప్పు," అన్నాడు సూటిగా రామాంజనేలు.

"ఏం లేదన్నయ్యా! ఇక్కడే ఈ వసారాలో పిండిమర పెట్టాలని యోచన చేశాం. ఊళ్ళో ఎక్కడా లేవుకదా గిరాకీ వుంటుందని ఆశ. మిషను పదివేలు అవుతుందన్నారు. నగానట్రా అమ్మితే అంతవరకు వస్తుందిగానీ, కరెంటు సామానుకి మూడువేలు అవుతుందిట. అందుకని మరకి మూడువేలు తగ్గుతుంది. నువ్వు కాస్త మీ ఫ్రెండుతో బెజవాడ వెళ్ళి కంపెనీ వాళ్ళకి నచ్చజెప్పి తగ్గే మూడువేలూ వాయిదాల మీద తీసుకునేట్టు ఒప్పించాలి. మీ రామాంజనేలు రెండోముక్క మాట్లాడితే నాలిక అరిగిపోతుందనుకుంటాడు. కాస్త నువ్వు సాయం వెళ్ళి ఈ పని సానుకూలం చేసి పెట్టాలన్నయ్యా..." అడిగింది ధనలక్ష్మి.

"ఓ దానికేం భాగ్యం. కంపెనీవాళ్ళు అంతమాత్రం వాయిదాలు ఇస్తార్లే," అని భరోసా ఇచ్చాను.

వారం తిరక్కుండానే పిండిమర బిగించారు. ఊళ్ళో పదిమందికీ తెలియడానికి ఆట్టే రోజులు పట్టలేదు. ఎప్పుడూ ధనలక్ష్మి అక్కడే ఉండి మర నడపడం, ఆపడం, బెల్టులు మార్చడం, కోనులు సరిచెయ్యడం, చిన్నచిన్న మరమత్తులు చేయడంతో సహా అన్నీ నేర్చుకుంది. అప్పుడప్పుడే బస్తీ కళ వస్తున్న ఆ ఊళ్ళో ఏకైక పిండిమర అవడంవల్ల తొందర్లోనే అందుకుంది. 'ఆదివారము నాడు అరటి మొలిచింది... సోమవారమునాడు...' అన్న వారాల పాటలాగానే.

నెల తిరిగేసరికి పిండిమరకి రోజుకి పన్నెండు గంటలు తిరిగేటంత గిరాకీ వచ్చేసింది. బియ్యం, నూకలు, గోధుమలు, మినుములు, పెసలు పిండికోసం తెచ్చుకునేవాళ్ళు. తర్వాత నెలలో ఇవన్నీ తనే తలొక బస్తా తెప్పించి నిలవబెట్టింది. అక్కడే సరుకు కొనుక్కోవడం, అక్కడే మర ఆడించుకు వెళ్ళడం- జనం ఈ సౌకర్యమూ బాగానే వుందనుకున్నారు. బెజవాడ కంపెనీ వాళ్ళ వాయిదాలు తీరాయి. పసుపుకొమ్ములకి ఇంకో మెషిన్ వాళ్ళే బిగించి వెళ్ళారు. ఇపుడు సమస్త పిండిరకాలే కాక, పసుపు కూడా మరపట్టడం మొదలైంది. మర కట్టేసే వేళకి మానిక నిండా చిల్లర వచ్చేది- చిల్లర శ్రీమహాలక్ష్మి అని మురిసిపోయేది- చిల్లర పదేసి రూపాయల వంతు పొట్లాలు కట్టి హోటళ్ళ వాళ్ళకి, ఇతర షాపులవాళ్ళకి వందకి పది రూపాయల లాభానికి అమ్మేది. పొద్దుటే పిండిమర షెడ్డు ఊడిస్తే సమస్త పిండిరకాలు, పసుపు, రోడ్డు దుమ్ము దువ్వతో కలిసి ఒక సరికొత్త దినుసు చేరేది. అయిదేసి గుప్పిళ్ళు ఒక పొట్లంగా కట్టి, సున్నిపిండి పేరు మీద అమ్మడం ప్రారంభించింది ధనలక్ష్మి. రోజూ ఇరవై పొట్లాలదాకా అయ్యేవి. అమ్మకాలు బాగానే వుండడం చేత కవర్లు చేయించి, దానిమీద వాణిశ్రీ కలర్‌ఫోటోతోబాటు- 'సమస్త వనమూలికలతో తయారైంది. చర్మసౌందర్యానికి తప్పక వాడండి- ధనశ్రీ సున్నిపిండి. వెల ఒక్కరూపాయి మాత్రమే,' అని కూడా అచ్చు వేయించింది. ఊడ్చిన సరుకుని బట్టి సున్నిపిండి ఆదాయం ఉండేది. ధనలక్ష్మి మళ్ళీ నగానట్రా ఏర్పాటు చేసుకుంది. పెద్దరికం పెరిగింది. కొడుకు పుట్టాడు. ఈశ్వర్ అని పేరు పెట్టుకుంది, రామాంజనేలు అంతగా ఇష్టపడకపోయినా. ధనలక్ష్మిని అందరూ ధనమ్మ అని పిలవడం మొదలుపెట్టారు. పిండిమర ఊళ్ళో ఓ కొండగుర్తు అయింది. పిండిమర మెలకువ లన్నీ ఇప్పుడు ధనమ్మకి కొట్టిన పిండి.

"ఎట్లాగూ బియ్యాలూ, అపరాలూ అమ్ముతూనే వున్నాం గందా- కాస్తో కూస్తో పెట్టుబడికి డబ్బుంది- ఉప్పు, చింతపండూ కూడా తెచ్చుకుంటే మళ్ళీ మన కిరాణా వ్యాపారం మన గుమ్మం లోకి వస్తుంది గందా- పిండిమర పుణ్యమా అని మన ఇల్లు సెంటరైపోయింది. ఇంట్లోనే కొట్టు పెడితే వచ్చినంత బేరం వస్తుంది. నీకూ చేతినిండా పని వుంటుంది..." అని సలహా ఇచ్చింది.

వారం తిరక్కుండా సంచుల్లో, డబ్బాల్లో సరుకు దిగింది. సీతారామాంజనేలు మళ్ళీ ఓ కొట్టువాడయ్యాడు.

"మనం చిన్నవాళ్ళం- సెంటర్‌లో పెద్ద షాపులవాళ్ళతో పోటీపడాలంటే ఒకటే చిట్కా- మన దగ్గర సమస్తం దొరుకుతాయని పేరు పడాల. ధనియాలు, దాసించెక్క, గుగ్గిలం, గురి గింజలు, కరక్కాయలు, కచూరాలు అన్నీ మన కొట్లో ఉండాలి- వాటివల్ల మన కొట్టుకి పేరొ స్తుంది- పేరొస్తే బేరాలు వాటంతటవే వస్తాయ్..." వ్యాపారసూత్రం చెప్పింది ధనలక్ష్మి. రామాంజ నేలు మొదట కొంచెం రోషపడ్డా, సూత్రం అమలుపరచి ధనమ్మ చెప్పింది నిజమేనని నిరూపిం చాడు.

రాత్రి పొద్దుపోయాక కొట్టు సర్దుకోవడం, అక్కడే పడుకోవడం- మళ్ళీ పిండిమర చప్పుడుతో వీధి మేల్కొనేది.

సీతారామాంజనేలుకి భాగ్యమూ, దాంతోపాటు బట్టతల క్రమంగా రావడం ఊరంతా గమనించింది.

నేను బి.ఇడి పూర్తిచేసి శాయంగల విన్నపాలై వున్న ఊళ్ళో, చదివిన స్కూల్లో వెయ్యి రూపాయల కన్సాలిడేటెడ్ జీతంమీద ఉద్యోగంలో చేరాను. సొంత ఊరు, సొంత భార్య- కొంత నయం కదా! వద్దంటే వినకుండా ఫిబ్రవరి నెలలో నా పెళ్ళి ముహూర్తం పెట్టారు. అమ్మాయి బి.ఎ. ఫైనలియర్. పరీక్షలు అవనీండి అంటే- అదేం ఫర్వాలేదు పరీక్షలు పరీక్షలే, పెళ్ళి పెళ్ళే అన్నారు పెద్దలూ, సుముహూర్తం నిశ్చయించిన దైవజ్ఞులూ. ఇహనేం, ఏతత్ శుభముహూర్తానికి అందరూ తరలడం, పెళ్ళి అవడం జరిగింది. మూడు నెలల తర్వాత పెళ్ళికూతురు పరీక్ష తప్ప

డమూ, నెల తప్పడమున్నూ కూడా జరిగింది. శుభలేఖల్లో చి.సౌ. శకుంతల- బ్రాకెట్‌లో బి.ఎ. అని ఏ ముహూర్తాన అచ్చువేశారో, ఆ బ్రాకెట్లు విడకపోగా, '...మనమేం ఈ మహానగరంలో ఊళ్ళేలాలా ఉపన్యాసాలివ్వాలా,' అని సాగదీస్తూ శకుంతల ఇద్దరు పిల్లలతల్లిగా సెటిలైపోయింది. అద్దె నవలలు, సకుటుంబ వారపత్రికలు చదువుకోవడం, రేడియో వినడం, తిట్టుకుంటూనే టీవీలో సమస్త సీరియల్సు చూడడం శకుంతల వ్యాపకాలు. నా బడి, రాబడి కూడా శకుంతలని గొప్పగా ఆనందపరచలేకపోయాయి. అట్లాగని పెద్ద బాధాలేదు.

ఇంటిసరుకంతా నేను రామాంజనేలు షాపులోనే కొనేవాణ్ణి. ధనమ్మ చాలా ఆత్మీయంగా అంతవరకూ జరిగిన కొత్త సంగతులన్నీ అరమరికలు లేకుండా చెప్పేది. ఓరోజు నే వెళ్ళేసరికి భార్యాభర్తలిద్దరూ ఘర్షణ పడుతున్నారు.

"నువ్వేదో పెద్ద ఇందిరాగాంధీ అనుకుంటున్నావ్... నోరు కాస్త కట్టెయ్యకపోతే మర్యాద దక్కదు... తెలివి తేటలు మాకూ వున్నాయ్..." రామాంజనేలు అరుపులకి ధనమ్మ బిక్కమొహం వేసుకుంది. నావైపు చూసి,

"నువ్ చెప్పన్నయ్యా న్యాయం. ప్రతిదానికీ నేను అరుస్తానంట. రోజంతా పిండిమరలో వుంటే గొంతు పెంచి మాట్టాడ్డం అలవాటైంది. అది కూడా అపచారమేనా..." ధనమ్మ సంజాయిషీకి ఏం బదులు చెప్పాలో తెలియక తికమకపడుతుంటే, "మాట మార్చకు... నీకు మొగుడి లక్ష్యం వుంటే రాత్రి అట్టా చేస్తావా..." అని కసిరాడు మళ్ళీ.

"ఏంటి తప్పు... మంత్రసానితనం ఒప్పుకున్నాక ఏదొచ్చినా పట్టాల... అన్నయ్యా జరిగింది చెబుతా... ఎవరిది తప్పో నువ్ చెప్పు. నిన్న అర్ధరాత్రివేళ నాయుడుగారు సాయంగా వచ్చి తలుపు తట్టి వైద్యానికి శొంఠికొమ్ము కావాలంటే ఈ మగాడు కిటికీలోంచి లేదన్నాడు. నేను ఉంది అన్నాను. డబ్బాలన్నీ గాలించి నాయుడిగారికి శొంఠిపిక్క ఇచ్చాను. పదిపైసల బేరానికి కక్కుర్తిపడ్డానని తెల్లార్లూ నన్ను సాధించాడు. పైగా పెద్దాయన దగ్గర ఈయనగారి మాట పోయిందట... మీ ఫ్రెండు తెగోదారు. నేను కక్కుర్తిముండని..." అంటూ ఎక్కిళ్ళు పెట్టింది ధనమ్మ.

"అప్పుడేమో గుదిబండ గుదిబండ అన్నాడు... ఇప్పుడు చూస్తే ఈ తీరు..."

"ఇహ చాల్లే నోర్ముయ్," అన్నాడు మితభాషి.

నేను ఏ తీర్పు చెప్పలేదు. కానీ మూడోరోజున నాయుడుగారి పచారీ సరుకుల ఖాతా వేరే కొట్లోంచి రామాంజనేలు కొట్లోకి మారింది. రామాంజనేలు కాజా తిన్నాడు.

*

"సాయంత్రం స్కూలు తర్వాత మన కొట్లో కాస్త కాగితం గట్రా చూసిపెడితే మీకేమైనా ఇబ్బంది అవుతుందా? రోజూ ఓ గంటసేపు..." చాలా వినయంగా అడిగాడు రామాంజనేలు. నేను తటపటాయిస్తుంటే... "మీ పనికి వెల కట్టలేనుగానీ, నెలకి మూడొందలు- లేదంటే సరుకుగా పుచ్చుకున్నా సరే," అన్నాడు. వెంటనే ధనమ్మ అందుకుని, "అన్నయ్యా, రొక్కం వద్దు. సరుకే లాయకి. మీ ఇంటి పట్టి ఎంతైతే అంత... మేం ఇస్తున్నామని మీరు వృధాగా పట్టుకుపోరు కదా... పది రూపాయలు మీకు అదనంగా ముడితే మాకేం తరిగిపోదు. అయినా నువ్వెవరు? మేమెవరు?..." కాదనడానికి వీల్లేకుండా బిగించేసి పార్ట్‌టైం ఉద్యోగానికి ఒప్పించారు దంపతులు.

రోజూ సాయంత్రం స్కూలు నుంచి సరాసరి షాపుకి వెళ్ళి సరుక్కి సంబంధించి ఉత్తర ప్రత్యుత్తరాలు, ఇంకేమైనా చిల్లర రాత పనులుంటే చూసేవాణ్ణి. సరిగ్గా నెల ఒకటో తారీఖున ఇంటి సరుకు మొత్తం, సున్నిపిండి మినహా ఇంటికి చేరేవి.

అసలే బడిపంతులు ఉద్యోగంతో చిన్నబుచ్చుకున్న శకుంతలకి ఈ చిల్లరకొట్టు గుమాస్తా గిరి బొత్తిగా నచ్చలేదు. కానీ, నాకు మాత్రం డబ్బుల విషయంలో వెసులుబాటు కనిపించింది. ధనమ్మ అన్నట్టు లక్ష మాటలు గుప్పెడు కొర్రలకి సరికావు కదా!

ఒకరోజు పని ఒత్తిడివల్ల కొట్లో ఆలస్యం అయితే- ఒక మూర మల్లెపూలు, నాలుగు జిలేబి చుట్టలు పొట్లం కట్టించి, "ఇంటికి తీసుకెళ్ళు అన్నయ్యా... నీకు చిన్నచిన్న సరదాలు కూడా తెలియవు," అంటూ చిరునవ్వుతో పొట్లాలు నా చేతికి ఇచ్చింది.

"ఓవర్‌టైంకి ఓదార్పన్నమాట... తెలివంటే మీ చెల్లిదే. వ్యాపార మర్మాల మీద ఓ పుస్తకం రాయించండి. ఎమ్మే బిజినెస్ మేనేజ్‌మెంట్ వాళ్ళకి టెక్ట్స్ పుస్తకంగా పెట్టచ్చు," అన్నది శకుంతల, పొట్లాలు పరిశీలించి.

ఎప్పుడైనా స్కూలుకి వెళుతూ, 'ఇవ్వాళ కొంచెం లేటవుతుంది,' అని చెబితే, "పిల్లలూ! మీకు జిలేబీ చుట్టలు, నాకు మల్లెపూలు వస్తాయిరోయ్," అని బ్రాకెట్ బి.ఎ. చమత్కరించేది. మా ఆవిడ చమత్కారానికి నవ్వేసేవాణ్ణి. చమత్కారాలకి చింతకాయలు రాలవు కదా.

*

ధనమ్మ సంకల్పంతో భద్రాచలం యాత్రాస్పెషల్ బస్సు వేశాడు సీతారామాంజనేలు. నలభైమందిని కూడగట్టాడు. మూడోరోజు యాత్ర. భోజనాలతో సహా తలకి వంద రూపాయలు. ఇద్దరు వంటవాళ్ళతో కావాల్సిన సరుకు, సరంజామాతో బస్సు బయలుదేరింది. మా జంటకి ఫ్రీ టిక్కెట్లు మంజూరైనాయి. 'యాత్రాస్థలాల్లో కొబ్బరి కాయలు గిలక్కాయల్లా వుంటాయి,' అని చెప్పి రెండువందల టెంకాయలు, పసుపు, కుంకుమ పొట్లాలు, అగరు బత్తీలు, కర్పూరం అన్నీ బస్సు మీద వేయించింది ధనమ్మ. కృష్ణ స్నానం, కనకదుర్గమ్మ దర్శనం, గోదావరి స్నానం, రాములవారి దర్శనం పూర్తి చేయించి, మూడోరోజుకి బస్సు ఇంటికి చేరింది.

ఇక్కడ నుంచి తీసుకెళ్ళిన సరుకు సంబరాలు, టెంకాయలు అన్నీ ఖాళీ అవడం వల్ల ఆ బరువుకి సరిపడా భద్రాచలం అడవిలో కుంకుళ్ళు, సీకాయ, విస్తరాకులు, కొండ చీపుళ్ళు బస్సు మీద లోడ్ చేయించాడు రామాంజనేలు. స్వామికార్యం, స్వకార్యం కూడా పూర్తయింది.

ఇంటికి చేరాక ఏ లోపం లేకుండా చక్కగా యాత్ర జరిపించినందుకు అంతా సంతోషించారు. మా బి.ఎ., "ఈ ట్రిప్పులో చాలా మిగులు- భక్తి సంగతి అట్లా వుంచండి- టెంకాయల అమ్మకాలు, భోజనాలకి కొట్లో సరుకే- ప్లస్ అక్కడ అడవి పంటలన్నీ అణాకానీకి తెచ్చారు కదా... ఇక్కడ బేడా అర్ధణాకి అమ్ముతారు. ఈసారి తిరుపతి, శ్రీకాళహస్తి వేయించండి. అక్కడ చింత పండు కారుచౌక,' అంది. కాని అప్పటికే తిరుపతి యాత్ర ఖాయం అయినట్టు మా గుదిబండకి తెలియదు.

నిత్య వ్యాపార పారాయణలో తగినంత డబ్బు చేరింది. పెద్ద బజార్లో పెద్దషాపు అమ్మకానికి వస్తే కొన్నారు. కాని కలిసొచ్చిన చోటు గదా అని కిరాణా కొట్టు వున్నచోటే వుంచాడు. దండిగా చిల్లర కురిపిస్తున్న పిండిమర చప్పుడు వాళ్ళకి కమ్మని సంగీతంలా వీనుల విందు చేస్తోంది. ఆ ఇంటిమీదే గది, దానిమీద ఇంకో గది వేశారు. అది వాళ్ళకి ఒంటి స్తంభం మేడలాగానూ, చూసే వాళ్ళకి ఫ్యాక్టరీ పొగగొట్టంలాగానూ వుంది.

సెంటర్లో విశాలమైన షాపు వుండడంతో ఎరువుల ఏజెన్సీ యిస్తామని కంపెనీవాళ్ళు ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు.

"మనకెందుకు గొడవ- పైగా బోలెడు పెట్టుబడి," అన్నాడు రామాంజనేలు.

"మన దగ్గర రొక్కం వుంది కదా," అంది ధనమ్మ.

"డబ్బుంటే ఉండదా?"

"ఉంటది. డబ్బు కూడా పచ్చి సరుకులాంటిదే. ఇంట్లో వుంటే గుంట్రాయి, బయటి కెళితే కోడిపెట్ట. ఎరువుల అమ్మకం మీద కమీషన్ ఉంటది. తరుణంలో ఎరువులిచ్చి పంటల్లో రైతుల దగ్గర సరుకు తీసుకుంటాం- సరుకు టోకున వస్తే చిల్లరన అమ్ముతాం. కొట్టుకి అద్దె లేదు. డబ్బుకి వడ్డీ వస్తది..." ధనమ్మ ధోరణికి అడ్డుపడి, "ఇహ చాలు... అరటి పండు వొలవద్దు అర్థమైందిలే," అన్నాడు రామాంజనేలు.

పెద్దబజార్లో ఈశ్వర్ ఏజెన్సీస్ వెలిసింది. ఏజెన్సీ వ్యవహారాలు చూసుకోడానికి బెంచీ ఎక్కించిన సైన్స్ మాస్టారుని పెట్టుకున్నాడు. ఆయన రిటైరై బాధ్యతలు మిగిలి ఉండడంతో ఏదైనా ఉద్యోగం కోసం చూస్తున్నారని తెలిసి స్వయంగా పిలిచి పెట్టుకున్నాడు రామాంజనేలు.

ఎరువుల వ్యాపారం మూడు కాపులు ఆరు పంటలుగా సాగుతోంది. నేను మొత్తం అన్ని వ్యవహారాల్లోనూ ఆంతరంగిక సలహాదారుగా వుండిపోయాను. ఉన్నట్టుండి పెద్ద విపత్తు వచ్చి పడింది. జాతీయ విపత్తు! రాజీవ్‌గాంధీ హత్య! దేశం యావత్తూ బావురుమంది. అల్లకల్లోలం అయి ప్రజాజీవనం స్తంభించిపోయింది. రైళ్ళు, బళ్ళు ఎక్కడి వక్కడ నిలిచిపోయాయి. కొన్నిచోట్ల దారితప్పాయి. ఎక్కడా కదలిక లేదు. లూటీలు, దహనకాండలు జరిగాయి. జాతికే కాదు, రైళ్ళకీ బస్సులకీ గమ్యం అగమ్యగోచరమైంది. సరిగ్గా అదే సమయంలో ఈశ్వర్ ఏజెన్సీస్ వారికి చేరాల్సిన రెండు వ్యాగన్ల యూరియా బెజవాడ జంక్షన్‌లో దారితప్పాయి. ఆంధ్రా రావాల్సినవి బాంద్రా చేరాయి. ఇక్కడ ఎరువుల తరుణం వచ్చిపడింది. సరుకు లేదు. రైల్వేవాళ్ళకి ఫోన్ల మీద ఫోన్లు చేస్తే... పాపం వాళ్ళు మాత్రం ఏంచేస్తారు? రెండు వ్యాగన్లూ పొరబాటున వేరే గూడ్స్‌కి తగిలించేశారట! నేను కంగారుపడుతున్నానుగాని రామాంజనేలు నిమ్మకి నీరెత్తినట్టు వున్నాడు.

"ఎంత ప్రాప్తమో అంత- నువ్వు కంగారుపడొద్దన్నయ్యా," అని ధనమ్మ నాకు ధైర్యం చెప్పింది.

నెలరోజుల తర్వాత వ్యాగన్ల జాడ తెలిసింది. మరో పదిరోజులకి భద్రంగా అడంగు చేరాయి. అప్పటికి యూరియా ధర రూపాయికి అర్ధ పెరగడమూ, ఎక్కడా స్టాకులేక బ్లాకుమార్కెట్ అమ్మేస్థితి రావడం జరిగింది. సరుకు గొడౌన్ చేరకుండానే ఖర్చయిపోయింది.

లక్షన్నర నికరంగా మిగిలింది తెలుపూ, నలుపూ కలిపి. ఈశ్వర్ ఏజెన్సీస్ లాభాల ఊబిలో కూరుకుపోయింది.

"కలిసి రావడం మొదలైతే అంతా కలిసిరావడమే..." అన్నాను సంతోషంగా. సీతా రామాంజనేలు క్లుప్తంగా నవ్వి ఊరుకున్నాడు.

"తంతే గారెలబుట్టలో పడ్డట్టయింది..." అంది ధనమ్మ. బొడ్లోంచి బంగారునగ తీస్తూ, "ఇదిగో చూడన్నయ్యా! రొక్కంగా ఇస్తే ఏ పులుసులోనో పడిపోతుంది. మనకింత ఉపకారం చేశారు గందా వాళ్ళ రుణం ఎందుకు మనకి... ఆరుకాసులు పెట్టి చేయించా ఈ గొలుసు. ఇదిగో ఆయనగారి అడ్రసు. బెజవాడ రైల్వేస్టేషన్ దగ్గర్లోనే ఇల్లు. ఈ వారం ఆయనకి నైట్ డ్యూటీ. పగలు ఇంట్లోనే వుంటారు. గుట్టుచప్పుడుగా ఆయనకి చేర్చి రావాలి. రామాంజనేలు వెళితే లేనిపోని ఆరాలు... ఎందుకొచ్చిన తంటా..." అంటూ నగ నా చేతికి ఇచ్చింది ధనమ్మ. నాకు సంగతి పూర్తిగా అర్థం కాలేదు. ఆ ఊ అనకుండా నిలబడితే, "ఆ పెద్దాయన తల్చుకోబట్టే గారెల బుట్టలో పడ్డాం..." అంది ధనమ్మ.

నేను నివ్వెరపోయాను. కాస్త తేరుకుని, "ఇంకా నయం. తిరిగి తిరిగి వచ్చేసరికి యూరియా ధర పడిపోతే పుట్టి మునిగేది," అన్నాను.

"అట్టాంటిది జరిగితే రైలు వాళ్ళ దగ్గర నష్టపరిహారం లాగవచ్చని హామీ ఇచ్చాకనే..." తర్వాత మాటలేవీ నాకు వినిపించలేదు. నగ అందుకుని-

*ఏ వేదంబు పఠించె లూత... చెంచే మంత్ర మూహించె...*
*చదువులయ్యా కావు... శ్రీ కాళహస్తీశ్వరా!*
ఆ కవిగారికి మనస్సులోనే నమస్కరించాను.

*

ఊరి మొగలో వున్న అరెకరం స్థలం బేరానికి వచ్చింది. ధనమ్మ కొనాలని ప్రస్తావించింది. "వాళ్ళ పిల్ల పెళ్ళి కుదిరిందట... అవసరానికి అమ్ముతున్నారు... లక్ష చెబుతున్నారుగాని, నాలుగైదు వేలు తక్కువే ఖరారు చేసుకోవచ్చు... తీసుకుంటే బావుంటది గందా..." అంది.

రామాంజనేలు రెచ్చిపోయాడు. "... నీకేం పొయ్యేకాలం... అది తాడిలోతు గుంట... ఏం చేసుకుంటాం..."

"పల్లం కాబట్టే అంత మంచిచోట ఆ ధరకి ఇస్తామన్నారు... నే చెప్పేది సవిత్రంగా విను."

"నేను వినను, ఆ చెరువు పూడ్చాలంటే మన ఆస్తులన్నీ అమ్మాలి... నిన్ను నిలబెట్టి సమాధి చెయ్యడానికి పనికొస్తది..." అంటూ కొట్టిపారేశాడు.

మళ్ళీ మళ్ళీ నచ్చచెప్పింది. మా అందరిచేతా చెప్పించింది. రామాంజనేలు కాస్త మెత్తబడ్డాడు. అయినా డెబ్భైవేలకి మించి ధర పెట్టే ప్రసక్తి లేదన్నాడు. బేరసారాలు జరిగాయి. చివరికి డెబ్భై రెండువేల రెండొందల యాభైకి రామాంజనేలు సరే అన్నాడు. స్థలం ధనమ్మ పేర బదిలీ అయింది. మంచిచోటు చౌకగా కొన్నాడని ఊళ్ళో అంతా అనుకున్నారు. రామాంజనేలు చాలా ఆనందపడ్డాడు.

"మీ రామాంజనేలు నివురుకప్పిన నిప్పు... పైకి తేలడుగాని బుర్రంతా గుజ్జే... మా మగపురుషులు మంకుపట్టుతో కూచోబట్టి ఆ ధరకి నిక్షేపంలాంటి స్థలం వచ్చింది. ఆ నిదానం... నిబ్బరం నిమ్మకి నీరెత్తినట్టు కూచున్నాడు. దానివల్ల పాతికవేలు లాభించింది..." ధనమ్మ నాతో అంటున్న మాటలు గుగ్గిలం పొగలా హాయిగా రామాంజనేలుని ఆవరించాయి. ఆరోజు అమ్మకాల తాలూకు డబ్బు లెక్కెట్టుకుంటూనే ధనమ్మ మాటలు వోరకంట విని ఆనందపడ్డాడు. ముచ్చట పడ్డాడు. మురిసిపోయాడు. రామాంజనేలు బుగ్గలు ఉల్లిగడ్డలైనాయి.

చెరువు చెరువుగానే ఉంచి సిమెంట్ స్తంభాలు లేపి కప్పు వేశారు. అది విశాలమైన గోడౌన్ అయింది. ఎరువుల లారీలు సరాసరి గోడౌన్‌లోకి వెళ్ళిపోతాయి. తాడిలోతు గుంటని ఈవిధంగా సద్వినియోగం చేసుకున్న రామాంజనేలుని మెచ్చుకోనివాళ్ళు లేరు.

"ఊరోళ్ళంతా నీ గురించి చెప్పుకుంటున్నారు... దిష్టి తగుల్తుందో ఏం పాడో..." అని రామాంజనేలుకి నిమ్మకాయ దిగదుడిచింది ధనమ్మ.

*

రామాంజనేలు ఎరువుల కొట్టుకి వెళ్ళగా చూసి, "ఈమధ్యన మీ ఫ్రెండు మొహం మతాబులా వెలిగిపోతోంది చూశావా అన్నయ్యా," అంది ధనమ్మ.

"ఔను మరి, స్థలం చౌగ్గా కొన్నాడు. బ్రహ్మాండమైన ఐడియాతో గుంటని గోడౌన్ చేశాడు!" అని నేనంటే ధనమ్మ మొహం చిన్నబుచ్చుకుని-

"అన్నయ్యా, కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుద్ది. తోడబుట్టిన లాంటివాడివి కనుక చెబుతున్నా. అన్నిట్లో నామాటే నెగ్గుతోందని తెగ ఉక్రోస పడిపోతున్నాడు. పనికట్టుకు కుళ్ళు మాటలు అంటాడు. అన్నీ ఉండి సంసారంలో సుకం లేకపోతే ఏంటి లాబం? కాపరం అన్నాక తగ్గా మొగ్గా వుంటే సర్దుకుపోవాలి గందా... లక్క బంగారం అంటిపెట్టుకు వుంటేనే తాళిబొట్టు నిండుగా ఉండేది... ఎవరో ఒకరు తగ్గితే పోలా?" ధనమ్మ మాటలు పొడుపుకథ పొడుస్తున్నట్టుంది గానీ నాకేం అర్థంకాలేదు.

"మనసులో పెట్టుకో అన్నయ్యా- చిట్టీ పాడి పాతికవేలు స్థలం వాళ్ళకి ఇచ్చా, ఎంత అవసరానికి అమ్మితే మాత్రం సలీసుగా ఇస్తారా... ఇదంతా తన తెలివి అని మురిసిపోతున్నాడు... ఆ గంటలో నన్ను నిలబెట్టి సమాధి చేస్తానన్నాడు మీ ఫ్రెండు. గోడౌను ఆలోచన నాది. కాపరం కోసం ఆ కిరీటం ఆయనకే పెట్టా... తన తెలివిని గుర్తించానని తెగ సంబరపడిపోతున్నాడులే... పదేళ్ళు యెనక్కి వెళ్ళిపోయాడంటే నమ్ము..." అంది ధనమ్మ కొంచెం సిగ్గుపడుతూ.

ఇంతలో ఈశ్వరబాబు రావడంతో ప్రస్తావన దారి మళ్ళింది.

"ధనమ్మా, ఓ పది ఇవ్వవే..." అన్నాడు వస్తూనే.

"ఎందుకురా అస్తమానం పదులూ, పాతికలూ..." అంటూనే ధనమ్మ మానికలోంచి గుప్పెడు చిల్లరతీసి ఎంచబోతుంటే,

‘‘నోటు... నోటు,’’ అన్నాడు ఈశ్వరబాబు చిరాగ్గా.

కొరకొరా ఒకసారి వాడివంక చూసి నోటు ఇచ్చి పంపేసింది.

‘‘అన్నీ అబ్బ గుణాలే... అన్నయ్యా! వీడు ఎనిమిదో కళాసులోకి వచ్చాడు... మీ ఫ్రెండు పోలిక వస్తుందేమోనని దిగులుపడి చస్తున్నా.’’

‘‘మా ఫ్రెండు ఏం చేదు మేశాడు... మేమంతా చదివి ఏం సాధించాం.’’

‘‘అంతమాట అనకు అన్నయ్యా! మా ఈశ్వరబాబుని గట్టిగా చదివించాలి. ఆళ్ళ నాయన ఉప్పు, చింతపండు అమ్ముకుంటే ఈశ్వరయ్య హాయిగా ఎ,బి,సి,డిలు అమ్ముకుంటాడు. ఈరోజుల్లో చదువుని మించిన గొప్ప యాపారం ఏముందన్నయ్యా!’’ అంటూ పింఛం విప్పింది.

‘‘కాపోతే అతిగారాబంతో వాళ్ళ నాయన చెడగొడతాడని బయపడి చస్తున్నా. వాడు అయిదడిగితే పదిస్తాడు. పైగా ఉన్న యాపారాలు చూసుకుంటే చాలదా అంటాడు. కూస్త ముందుచూపు ఉండాలి గందా. మనకి ఊళ్ళో ఎరువుల గోడౌను వుండనే వుండె... కాపోతే పైన ఇంకో నాలుగు అంతస్తులు వేస్తాం గిరాకీని బట్టి. ఈశ్వరయ్య ఇక్కడుంటే చేతికి రాడు. ఎక్కడైనా మంచి ఇస్కూలు చూడు... మీ ఫ్రెండు ససేమిరా కాదంటాడనుకో- ఆడి సంగతి నే చూసుకుంటా గాని ఈడి సంగతి నువ్వు చూడన్నయ్యా...’’ చాలా గట్టిగా చెప్పింది ధనమ్మ. ఎరక్కపోయి చెప్పానని మనసులో లెంపలేసుకున్నాను.

*

ఆరోజు పొద్దుటపూట అందరం ఎరువుల షాపులో ఉండగా ఈశ్వరబాబు వచ్చి పాతిక రూపాయలు కావాలన్నాడు.

‘‘అడిగినంత ఇస్తాగాని ఓరయ్యా బాగా చదువుకో... పైగా ఎనిమిదిలోకి వచ్చావ్. దేవకమ్మ ఎనిమిదో కానుపు కంసుడికి ప్రాణగండం అయినట్టు మన వంశానికి ఎనిమిదో కళాసులో చదువు గండం ఉంది నాయనా... జాగరత...’’

రామాంజనేలు చుర్రున ఒక చూపు చూశాడు. ఈశ్వరయ్యకి వంద రూపాయల నోటు ఇచ్చాడు.

‘‘అసలెందుకురా డబ్బు?’’ ధనమ్మ నిలదీసింది.

‘‘పుస్తకాలు కొనుక్కోవాలి.’’

‘‘మీ నాన్న ఎనిమిదో తరగతి బుక్కులు ఇంకా మీ ఇస్కూల్లోనే వున్నాయిరా... పోనీ నీకు పనికొస్తాయేమో...’’ అంది ధనమ్మ కిలకిల నవ్వుతూ.

ఈశ్వరబాబు వందనోటు అందుకుని ఆకుపచ్చ హంబర్ సైకిల్ ఎక్కాడు.

ఎరువుల వ్యవహారం చూస్తున్న మాజీ సైన్స్ మాస్టారు ధనమ్మ మాటలకి వచ్చిన నవ్వు లౌక్యంగా ఆపుకున్నారు.

నేను ముఖం తిప్పుకుని దిక్కులు చూస్తూ నిలబడ్డా.

అంతా విని అందర్నీ గమనిస్తున్న రామాంజనేలు మీసాలు మిరపకాయలైనాయి. ముక్కుపుటా లెగిరిపడ్డాయి. ధనమ్మ వంక దెబ్బతిన్న పులిలా చూశాడు.

కాసేపటికి నిబ్బరించుకున్నాడు. నా దగ్గరికి వచ్చి,

‘‘ఈశ్వరయ్యని ఎక్కడైనా హాస్టల్‌లో వున్న మంచి స్కూల్లో వేయాలండీ... ఇక్కడ వుంటే ఆడాళ్ళ గారాబానికి గాడిదైపోతాడు... ఎక్కడ బావుంటుందో కాస్త వాకబు చెయ్యండి. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు,’’ అన్నాడు రామాంజనేలు రోషంగా ధాటిగా తిరుగులేని నిర్ణయం తీసుకున్న మగాడిలా.

ధనలక్ష్మి, ‘హమ్మయ్య,’ అనుకుంది తను నెగ్గినందుకు.

*ఇండియా టుడే వార్షిక సాహిత్యసంచిక, 1995*

## నేపథ్యం

తన చొరవతో వ్యాపారాన్ని, సంసారాన్ని నడిపించిన

# ధనలక్ష్మి

**ఒక పెద్ద పల్లెటూరు. క్రమంగా బస్తీగా రూపుదిద్దుకునే వైనాన్ని చూపే ప్రయత్నం యీ కథాక్రమంలో చేశాను. పిండిమర రావడం, అది లాభసాటిగా నడవడం- ధనలక్ష్మి ప్రయోజ కత్వానికి మాత్రమే కాదు మారుతున్న కాలానికి ప్రతీక. అలా అక్కడక్కడ మారుతున్న జీవనశైలిని సూచించాలని తాపత్రయపడ్డాను.**

రామాంజనేలు నిజంగానే నా క్లాస్‌మేటు. దనమ్మ నా కంటె జూనియర్. ధనలక్ష్మి కథలో చాలా ఘటనలు జరిగినవే. కాకపోతే సినిమాలో మాంటేజెస్‌లాగా గబగబా వాళ్ల విజయగాథను చెప్పేశాను. అప్పుడప్పుడు జారిపోవడం, మళ్లీ పైకి పాకడం యివన్నీ పరిపాటే. గ్రామీణ ఆర్థికవ్యవస్థను చిన్నతనం నుంచి నేను ఆసక్తిగా గమనిస్తూ వస్తున్నాను. గడచిన పదేళ్లలో రూరల్ ఎకానమి చెదిరిపోయింది. పొదుపు, రేపటి మీద భయం పూర్తిగా తగ్గిపోయాయి. రాజకీయ ప్రమేయం గ్రామాలపై ఎక్కువ ప్రభావం చూపడం ప్రారంభమైంది. వోటు అమ్ముకోతగిన వస్తువుగా మారింది. 'గ్రామ రాజకీయం' ఒక ప్రత్యేక లక్షణాన్ని సంతరించుకుంది. ధనలక్ష్మి దంపతులు అంచె లంచెలుగా ఎదగడాన్ని నేను నల్లేరు మీద నడకలా (కేక్ వాక్) చూపించాను. కాని అలా జరగదు, జరగలేదు. ఓర్వలేని వాళ్లు రకరకాల పితూరీలు ఆకాశరామన్న పేరుతో సంధించారు. వాటిని తట్టుకోడానికి నానా తంటాలు పడ్డారు. 'పండిన పంటంతా మనదేనా? అందులో తప్ప, తాలు, తరుగు, తారం ఎన్నో పోతాయ్. పోయింది పొల్లు అనుకుని సద్దుకోవాలి. దక్కని దానికోసం ఏడుస్తూ కూచుంటే వున్నది పోతుంది,' అనే సిద్ధాంతం ధనలక్ష్మిది. ఇవన్నీ వివరిస్తూ, కథని పెంచుకుంటూ నేను పోలేదు. సర్వజ్ఞులైన పాఠకులు యీమాత్రం నింపుకోగలరని నాకు తెలుసు. ధనలక్ష్మి కథలో సునిశితమైన పరిశీలన వుందని కొంతమంది మెచ్చుకున్నారు. మరీ ఫెయిరీటేల్‌లా వుందని చప్పరించినవాళ్లూ వున్నారు. నేను శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

కథలు చదివి పెరిగినవాడిని. ఆయన కలల బేహారి (చూ॥ మార్గదర్శి). ధనలక్ష్మి కథపై శ్రీపాద ప్రభావం వుంది. దానికి నా చేతకానితనం తోడైందేమో?

తన దగ్గర దూసుకువెళ్లే పదును లేదని రామాంజనేలుకి స్పష్టంగా తెలుసు. ధనలక్ష్మి ఆకురాయి అని కూడా తెలుసు. తనవి కాని ఆలోచనలను తనవి చేసి, శంఖంలో పోసి తీర్థం చేసేది దనమ్మ. మౌనంగా ఆ కీర్తిని భరించేవాడు నా మిత్రుడు. ఇవన్నీ వ్యాపారంలో భాగం అనుకున్నాడు. తనవికాని తన వ్యూహాలను సహించాడు. ఆత్మన్యూనతను ఆత్మవిశ్వాసంగా అనువదించుకున్నాడు. విజయాలలో భాగస్వామ్యాన్ని మౌనంగా స్వీకరించాడు. నిజానికి యీ విజయగాథలో నా మిత్రుడిదే ఎక్కువ గొప్ప పాత్ర అనిపించింది.

ఒక పెద్ద పల్లెటూరు. క్రమంగా బస్తీగా రూపుదిద్దుకునే వైనాన్ని చూపే ప్రయత్నం యీ కథాక్రమంలో చేశాను. పిండిమర రావడం, అది లాభసాటిగా నడవడం- ధనలక్ష్మి ప్రయోజకత్వానికి మాత్రమే కాదు మారుతున్న కాలానికి ప్రతీక. అలా అక్కడక్కడ మారుతున్న జీవనశైలిని సూచించాలని తాపత్రయపడ్డాను. నాకు రామాంజనేలంటే జాలి, ధనమ్మంటే గౌరవం. నేను కూడా కథలో ఒక భూమికని అవడం వల్ల కథని నడపడానికి నాకు చక్కని పట్టు దొరికింది. విజయగాథలు ఘటన తరువాత ఘటనతో కేటలాగులా తయారవడం మామూలే. ధనలక్ష్మి సక్సెస్ స్టోరీలో కూడా పాఠకులకు కేటలాగులా తగిలి వుంటే దానిని అంగీకరించడానికి నా సంస్కారం సహకరిస్తుందని భావిస్తున్నాను. ఇక్కడ ఒక్క విషయం చెప్పాలి. ధనలక్ష్మి ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ భర్తను భరిస్తూ బాధ్యతంతా తీసుకుంటుంది. దాంపత్యజీవితం అస్తవ్యస్తం కాకుండా రామాంజనేలుని వీసమెత్తు తగ్గకుండా కాటాని సరిచేస్తుంది. ఎన్ని సంపదలున్నా పునాది ప్రదర్శించుకోవాలనుకోలేదు. అప్పటికే రామాంజనేలు లోలోపల వుడికిపోతున్నాడని ఆమెకు తెలుసు. వ్యాపారంలోనే కాదు కాపరంలో కూడా లౌక్యం తెలిసిన మహిళ ధనలక్ష్మి. కొందరికి యిది నచ్చింది. ఈ సక్సెస్‌స్టోరీ పలుభాషల్లోకి వెళ్లింది. ఒక బిజినెస్ స్కూల్ వారు యీ కథ ఆంగ్లానువాదాన్ని తమ పాఠ్యాంశంలో చేర్చి మర్యాద చేశారు. 'రూరల్ ఎకానమి-అవగాహన' అనే అధ్యాయంలో యిది చేరింది. చూసింది చూసినట్టు కాకపోయినా, కొన్ని మేలుమలుపుల్ని యీ కథలో కూర్చాను. కొంచెం ఎక్కువమంది పాఠకులకే యీ కథ నచ్చింది. ధనలక్ష్మి నా సక్సెస్ స్టోరీ.

*ధనలక్ష్మి* కథ 1995లో *ఇండియా టుడే*లో మొదటిసారిగా అచ్చయింది. అంటే నేను రాసి పద్దెనిమిదేళ్లు కావస్తూంది. 1995 తరువాత చాలా వేగంగా మన దేశంలో, రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు ధనలక్ష్మి కథని తిరగరాస్తే మీరెలా పొడిగిస్తారని ఒక కార్పొరేట్ ఛైర్మన్ నవ్వుతూ అడిగినప్పుడు-

ధనలక్ష్మి ఒంటిస్తంభం మేడమీద ఒక సెల్‌ఫోన్ కంపెనీవారి టవర్ వస్తుంది. వాళ్లు దానికి నెలనెలా పదిహేను వేలు అద్దె చెల్లిస్తారు. ఈశ్వర్‌బాబుకి పాతికేళ్లు పైబడ్డాయి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయ్యాడు. పదో తరగతి నుంచి చదువంతా హాస్టల్‌లోనే చదివాడు. వెంటనే క్యాంపస్ సెలక్షన్ వల్ల వుద్యోగం వచ్చింది. అప్పటికే సెల్ రీఛార్జ్ ఏజెన్సీలు, ప్రీ పెయిడ్ కార్డుల అమ్మకాలు దనమ్మ చేతికి వచ్చాయి. స్వ కంప్యూటర్ సేవలతో ఒక సెంటర్ మొదలైంది. నాకు యీ కొత్త వ్యవహారాలు అయోమయంగా తయారయ్యాయి. దానికి తగినవాళ్లని నియమించి, పై పెత్తనం నాకు అప్పగించింది. నేను తెలిసినట్టు నటించి వాళ్ల మీద అజమాయిషీ చేసేవాణ్ణి. రామాంజనేలు మన పిలగాడికే అప్పగించవచ్చుగా అన్నాడు. "వద్దులే సామీ, వాడొక సమస్తరం బెంగుళూరులోనో,

చెన్నపట్నంలోనో వుద్యోగంలో వుండాలి. కాకపోతే యీ రోజుల్లో పిల్లని ఎవరూ యివ్వరు. కాదు... కాదు ఏ పిల్లా యీ మొహాన్ని చేసుకోదు,'' అన్నది దనమ్మ. వుద్యోగంలో చేరిన ఏడాది తిరక్కుండా ఈశ్వర్‌బాబు పెళ్లి అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మాయి సివిల్ ఇంజనీరింగ్‌లో బి.టెక్ చేసింది. కొద్దిరోజులకే అమెరికాలో ఈశ్వర్‌బాబుకి అవకాశం వచ్చింది. ధనలక్ష్మి ససేమిరా అంది. ''వద్దు నాయనా, ఇక్కడ ఫలానా అంటే ఒక యిది. అక్కడికెళితే ఏముంది?,'' అంటూ అరటి పండు వొలిచి అందించినట్టు, వుదాహరణలతో సహా చెప్పి కొడుకు అమెరికా వలసని ఆపింది.

ఊరు శివారులో గోడౌన్ దగ్గర్లో, రోడ్డువారగా అప్పట్లోనే రెండుసార్లు పదెకరాల పంట భూమి కొన్నది దనమ్మ. ఇప్పుడు ఆ భూమి ఊళ్లోకి వచ్చేసింది. రెండెకరాలు మెరక చేసి, సర్వ సౌకర్యాలతో రెండు కళ్యాణమండపాలు కట్టించింది. అలంకరణ సామగ్రి, కుర్చీలు, కార్పెట్లు, కలర్ లైట్లు, వీడియోవాళ్లు, కేటరింగ్ సెక్షన్ అన్నీ మనవే. అయితే ఆ లెఖ్ఖ వేరు. మొత్తం మీద వూరి జనం ఫంక్షన్ హాల్స్‌కి తొందరగానే అలవాటుపడ్డారు. ఒక అరెకరం ప్రత్యేకం కేటాయించి సాయిబాబా మందిరం కట్టించింది ధనలక్ష్మి. ''అంతా ఆయన దయే. రామాంజనేలుకి యిన్ని ఐడియాలు వస్తున్నాయంటే సాయి...'' అని గద్గదమైంది ఆవిడ. బాబా పాలరాతి విగ్రహంలో జీవకళ వుందన్నారు భక్తులు. ఆ హైవే మీద వచ్చే వెళ్లే చాలా కార్లు ఆగి, దర్శనం చేసుకు వెళు తున్నాయి. బాబా గుడికి మంచి పేరు ప్రతిష్ట వచ్చాయి. పెళ్లి చేసుకున్న నూతన దంపతులు బాబాకి మొక్కులు తీరుస్తున్నారు. ఆ పంటభూమి మండపాలతో, ఆలయంతో ఒక క్షేత్రంగా మారింది. నిత్యం మంగళవాద్యాలు, విందు భోజనాలు!

వ్యాపారాలు, వ్యాపకాలు పెరిగిపోయాయి. కొడుకు, కోడలు సొంత వూళ్లో వుంటూ అన్నీ చూసుకోవలసిన అవసరం అనివార్యమైంది. ఇంకో రెండేళ్లు గడిచాయి. మిగిలిన ఏడున్నర ఎకరాల పంటభూమి ఇళ్లస్థలాలు అయినాయి. ''అబ్బాయి వున్నాడు, కోడలు ప్లాన్లు వేస్తది. మనమే ఇళ్లు కట్టించి ఏకంగా అమ్మేస్తే పోలా,' అనే ఆలోచన వచ్చింది దనమ్మకి. బాబా వల్ల, ఆయన దయవల్ల అక్కడ స్థలాలకి మంచి రేటు వచ్చింది. నేను మట్టి లారీల్ని, ఇసక లారీల్ని లెక్కేస్తూ, సిమెంటు వృథా కాకుండా చూస్తూ సైట్ దగ్గరే వుండాల్సి వచ్చింది. నా కష్టం వుంచుకోలేదు. ఒక పక్కన రెండు పక్కా గదులు వేయించి యిచ్చి నన్నొక ఇంటివాడిని చేసింది- ఇలాగ కథ నడుస్తూనే వుంటుంది. ఇది అనంతం.

*'ధనలక్ష్మి' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

*1 డిసెంబర్ 2012*

# 25



*సింగమనేని నారాయణ 26 జూన్ 1943న అనంతపురం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ న్యాయమెక్కడ 1960లో కృష్ణాపత్రికలో అచ్చయింది. మూడు కథాసంపుటాలు- జూదం, సింగమనేని నారాయణ కథలు, అనంతం ప్రచురించారు. సీమ కథలు, 4 భాగాలుగా వెలువడిన తెలుగు కథకులు-కథన రీతులు, కథావిమర్శ గ్రంథాలకు సంపాదకులుగా వున్నారు. కొన్ని కథలు కన్నడంలోకి అనువాదమయ్యాయి. ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేశారు.*

**చిరునామా**
*13-2-507, రామచంద్రనగర్,*
*అనంతపురం-515 001.*
*Ph.: 9493423442*

## అడుసు

### సింగమనేని నారాయణ

"యాటికి మామా! యల్లబారినావు," గబగబా నడుస్తున్న నారాయణప్పను యథాలాపంగా అడిగాడు, సద్దిగంపతో ఎదురువస్తున్న వెంకటేసులు. "థూ! మంచి సగినం చూసుకొని యల్లబారితే యాటికని అడుగుతా ఉండావు. ఇంగ పనయినట్టే," కోపంతో వెంకటేశుల్ని దులిపేసి నిలబడకుండా ముందుకు నడిచాడు నారాయణప్ప.

"పొరపాటయింది మామా," మెల్లగా గొణిగాడు వెంకటేసులు.

నాలుగు బారల దూరం నడిచి, తోవ పక్కనే ఉన్న ఒక గుంటి మీద కూలబడ్డాడు నారాయణప్ప. కూచొని పక్క జేబులోంచి ఆకూ, వక్కా తీసి నెమ్మదిగా నోట్లో వేసుకొని నమిలాడు. ఐదు నిమిషాల తర్వాత బీడీ వెలిగించి నాలుగు దమ్ములు లాగాడు. వక్కాకు ఎంగిలి పక్కకు ఉమిసి, లేచి నిలబడి పెద్ద పెద్ద అడుగులు వేస్తూ ముందుకు నడిచాడు. వెంకటేశులు అడిగిన అపశకునపు కూతవల్ల రాబోయే దుష్ఫలితం అంటూ ఏమైనా ఉంటే, తాను కూచొని లేవడంతో తీరిపోయినట్లు లెక్క నారాయణప్పకు.

ఒక కిలోమీటరు నడిచేసరికి తారు రోడ్డు వచ్చింది. రోడ్డు ఆవైపు చుట్టూ బండలు పాతి, పైన తడకలు కప్పిన ఒక చిన్న హోటల్ పాక. ఆ పాకలో కూచున్న రామిరెడ్డి నారాయణప్పను గట్టిగా కేకేసి, చేయి ఊపుతూ పిలిచాడు. నారాయణప్ప తారురోడ్డు కంటికి ఆనినంత దూరమూ చూసి, బస్సేదీ రాలేదని నిర్ధారణ చేసుకొని, రోడ్డును దాటి హోటల్ పాకలోకి నడిచాడు.

"యాటికి నారాయణప్పా. ఎల్లబారినావు? ధర్మారమా? అనంతపురమా?" అడిగాడు రామిరెడ్డి. 'థూ' అని మనసులోనే గొణుక్కొని, "అనంతపురం పొయ్యొస్తా రామిరెడ్డి," అంటూ అతని పక్కనే కూచున్నాడు నారాయణప్ప. రామిరెడ్డి రెండు కాఫీలకు ఆర్డరిచ్చాడు. "నేను వక్కాకు వేసుకుండాను. నాకొద్దు రామిరెడ్డీ. నువ్వు తాగు," అన్నా వినకుండా, "పరవాలేదులే. నోరు కడుక్కో," అని ఒక గ్లాసు మంచినీళ్ళు తెప్పించాడు రామిరెడ్డి.

కాదనలేక నీళ్ళతో నోరు రెండు మూడుసార్లు పుక్కిలించి ఉమిసి. కాఫీ గ్లాసు తీసుకున్నాడు నారాయణప్ప.

"బిడ్డ పెండ్లి ఒప్పుకుండావంటనే," కాఫీ రెండు గుటకల్లో తాగి అడిగాడు రామిరెడ్డి.

ఔనన్నట్లు తలాడించాడు నారాయణప్ప. "యావూరు పిల్లోనిది?"

"యంగటంపల్లి," కాఫీ గ్లాసు కింద పెట్టి రోడ్డు వైపు చూస్తున్నాడు నారాయణప్ప. రామిరెడ్డి అడిగే వివరాలన్నీ నారాయణప్పకి చెప్పడం ఇష్టంలేదు. మర్యాద కోసం అతనితో కూర్చొని కాఫీ తాగాడు కానీ, వాళ్ళ మధ్య చెప్పుకోదగిన ఆత్మీయతలు లేవు. ఆ విషయం ఇద్దరికీ తెలుసు. మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రామిరెడ్డి కాంగ్రెస్ తరపునా, నారాయణప్ప తెలుగుదేశం తరపునా ప్రచారపు ఊబిలో అంతో ఇంతో దిగబడినారు. వాళ్ళ ఊళ్ళో ఉండే రెండు పెద్ద గ్రూపుల్లో వీళ్ళకుండే పాత్రలు చాలా చిన్నవే అయినా, ఒకప్పటి అనుబంధాలనూ, ఆత్మీయతలనూ అవి బాగా తగ్గించేశాయి.

"పిల్లోడు ఏం చేస్తాండాడు?" అని వరుని గురించి వివరాల కోసం అడిగాడు రామిరెడ్డి. ఇంతలో బస్సు వస్తున్న శబ్దం వినిపించి, 'వస్తా రామిరెడ్డి! బస్సొస్తా ఉంది,' అంటూ లేచి తొందర తొందరగా రోడ్డు పక్కకు వచ్చి నిలబడ్డాడు.

రెండు నిమిషాల్లో బస్సు వచ్చి ఆగింది. నారాయణప్పతో పాటు మరి ఇద్దరు బస్సెక్కారు. అరగంట ప్రయాణం తర్వాత అనంతపురం పాత ఊరు పవరాఫీసు దగ్గర బస్సు దిగాడు నారాయణప్ప. బజారంతా కుప్పబోసినట్లు జనం. వచ్చే పొయ్యే బస్సులూ, ఆటోలు, రిక్షాలూ- వీటన్నిటి మధ్యా సందు చేసుకొని, గబగబా అడుగులు వేస్తూ, గాంధీబజారులో మూడు ఫర్లాంగుల దూరం నడిచి, శ్రీ లక్ష్మీ ట్రేడర్సు బోర్డు ఉన్న అంగడి ముందు ఆగాడు నారాయణప్ప. అంగడిలో నుంచి చక్క వాసన- లోపల హాలు నిండా చక్క మూటలూ, ఎరువుల మూటలూ బజారులోకి కనిపిస్తున్నాయి. తలుపు దగ్గర టేబుల్ ముందు ఏవో లెక్కలు చూసుకుంటూ కుర్చీలో కూర్చున్న భారీ విగ్రహం.

నారాయణప్ప మెట్లెక్కి ఆ భారీ విగ్రహం ముందు నిలబడ్డాడు. నిలబడి సన్నగా దగ్గాడు. భారీ విగ్రహం తలెత్తి, నారయణప్ప ముఖంలోకి చూసి, మొగమంతా చిరునవ్వు పులుముకొని, "నువ్వా నారాయణప్పా. రా రా, కూచ్చో. శానారోజులయింది గదప్పా కనబడక," అంటూ కుర్చీ చూపించాడు. నారాయణప్ప తన భుజం మీద తువ్వాలతో కుర్చీ దులుపుకొని కూర్చున్నాడు.

"ఏమప్ప విశేషమూ?" అడిగింది భారీ విగ్రహం.

"మా దగ్గర విశేషాలేముంటాయి తిరుపాలయ్యా? ఏదో పల్లె కొంపలో బతికేవాళ్ళం," అన్నాడు నవ్వు మొగంతో నారాయణప్ప.

“అట్లే లేప్పా మీరనేది. మా సావు చూడు,” అని దూరంగా నిల్చున్న ఓ కుర్రాణ్ణి కేకేసి, ‘రెండు మంచి కాఫీలు తీస్కురా పోరా,” అంటూ పురమాయించాడు.

“ఎట్లుండాయి నారాయణప్పా పంటలు? చీనాకాయలు పీకే టైమ్ గదా. కాత బాగానే ఉందా?” అడిగాడు తిరుపాలయ్య.

“ఏం కాత కాయటంలే తిరుపాలయ్యా! చెప్పుకుంటే తీరేది కాదు. ఆ కాతా అట్లే ఉంది. రేటు అట్లే ఉంది,” అన్నాడు నిర్వేదంగా నారాయణప్ప.

ఇద్దరూ కాఫీలు చప్పరించారు. తిరుపాలయ్య సిగరెట్టు ఇస్తే వద్దని, బీడీ ముట్టించు కున్నాడు నారాయణప్ప. “చీనాకాయలు రెండు మూడు రోజుల్లో నాగపూరుకు తోలల్లప్పా? రవంత లెక్క ఇబ్బందైంది. పదివేలుంటే సర్దు. వారం దినాల్లో ఇస్తా,” వచ్చిన పని చెప్పాడు నారాయణప్ప.

“అంత అర్జెంటేమొచ్చింది నారాయణప్పా?”

“వచ్చే నెల పాపది పెండ్లి ఒప్పుకుండానప్పా. వియ్యపోళ్ళకి పదివేలు పంపియ్యల. మాట చెప్పినాను.”

“పెళ్ళి కాకుండానేనా?”

“ఏదో వాళ్ళకి ఖర్చుకుంటాయంట. మనిషిని పంపించినారు. లేదంటే ఏం మర్యాద?”

“యా మాత్రం ఇస్తా వుండావు కట్నం?”

“ముప్పై వేలు లెక్కా, పది తులాల బంగారూనప్పా.”

“ఏం చేస్తా వుండాడు పిల్లోడు?”

“సేద్యమేనప్పా. ఏదో మాకు తగ్గ సంబంధం.”

“సేద్దిగానికి అంత లెక్కా!” ఆశ్చర్యంగా అడిగాడు తిరుపాలయ్య.

“చదువుకొని ఉద్యోగం చేసేవాళ్ళకయితే, లకారం దాటితే కానీ మా కులంలో చిక్కరప్పా.”

“మీకేమప్పా రైతులకు! ఎంతయినా ఇస్తారు. దండి శనక్కాయ పంట, చీనాకాయలు ఉద్దర దుడ్లు మీకు,” అన్నాడు తిరుపాలయ్య పెదవులపై పరిహాసం చిందిస్తూ. ఆ మాట వినగానే బొడ్డులో నుండి బయలు దేరిన వేడి గుండెల్ని తన్నుకొని కళ్ళ కొనల్లోకి వచ్చింది నారాయణప్పకు. అడ్డమొచ్చిన ప్రతివాడు రైతును మీకేమప్పా అనేవాడే తిని తీరికూచ్చొని. ఇలాంటి మాట వినగానే మొత్తం తమ జాతినే అవమానించినట్టు చలించిపోతాడు నారాయణప్ప. తమ రైతాంగమంతా వీళ్ళ దృష్టిలో చాలా తేలిగ్గా డబ్బు సంపాదించే వాళ్ళ కింద లెక్క. సేద్దెమంటే వీళ్ళ మొగాలకేం తెలుస్తుంది? అట్ల విత్తనాలు చల్లితే ఇట్ల పంట చేతికి వచ్చేదానికి ఇదేమన్న వడ్డీ వ్యాపారమా? చీనాకాయలు పండించటమంటే అదేమన్న బజార్లో చేసే గారడీవిద్యా? చెట్లు పెట్టినాక ఐదా రేళ్ళు సంరక్షిస్తే కానీ మొదటి కాత చేతికిరాదే! దాండ్లకు ఎన్ని ఎరువులు పొయ్యాల? ఎన్నిసార్లు పాదలు చెయ్యల! రోగాలు రాకుండా ఎన్ని మందులు కొట్టల్ల! ఎంత పెట్టుబడి పెట్టల్ల! చంటి బిడ్డకు పాలు పట్టినట్టు నిరంతరమూ నీళ్ళు పారిస్తానే ఉండల్ల! ఇదంతా మాటలా? తేరగా కుర్చీలో కూర్చుంటే అయ్యే పనేనా ఇది? చెట్టుకు పిందె పట్టినప్పటి నుండి కాయగా మారెదాక రైతే గర్భం మోసినంత భారం ఉంటుందని ఈళ్ళకేం తెలుసు? పండిన కాయను పీకి, అమ్మి, చేతుల్లోకి లెక్క వచ్చేదానికి మళ్ళా ఎంత తతంగం! ఇన్ని కన్నవస్థలూ పడి నాలుగు రూపాయలు కళ్ళ చూస్తే ‘ఉద్దర దుడ్లు’ అంటారు. ‘థూ’ అని మనసులోనే చీత్కారం చేసుకున్నాడు నారాయణప్ప.

ఆరిపోయిన బీడీని చుర్రున వెలిగించి, గబగబా రెండు పీకి, తిరుపాలయ్య మొగంలోకి చూసి, ''నాకింక శానా పన్లుండాయి తిరుపాలయ్యా. బ్రోకరాఫీసుకు పొయ్యి లారీ మాట్లాదు కోవల్ల,'' అన్నాడు నారాయణప్ప.

''లెక్క ఇప్పుడే కావల్లంటే ఎట్ల నారాయణప్పా! నేనేమన్నా బ్యాంకునా?''

''బ్యాంకులంటే మీ యట్లటోళ్ళుకాగ ఇంకెవురప్పా! ఎట్లో ఒకట్ల సర్దు మరి.''

''సరే. నీ పనులు చూసుకొని రా. తెప్పించి పెడతాను. నువ్వు ఎరువుల లెక్క సుమారుగా ఇయ్యా లప్పా! కాయ అమ్మినంక అంతా ఒకేసారి తెచ్చియల్ల మడి. శానా నాళ్ళు నిలిపేకి లేదు.''

''యామాత్రముంది ఎరువుల్ది?''

తిరుపాలయ్య డ్రాయరు సొరుగులోంచి లావాటి నోటు బుక్కు తీసి, పేజీలు తిప్పి, ఒక పేజీ నారాయణప్ప ముందుపెట్టి, ''నాలుగువేల ఏడువందలుంది. వడ్డీ ఇంకా లెక్క కట్టలె,'' అన్నాడు.

''వడ్డీ చూసుకొని యెయ్యప్పా.''

''మామూలు వడ్డీనే రెండు రూపాయలు.''

''రూపాయిన్నరే కదా తిరుపాలయ్యా.''

''ఆ కాలం పోయిందప్పా.''

'రెండు రూపాయలేస్తే ఎట్ల తిరుపాలయ్యా! తీసుకున్న సరకు మీద కూడా వడ్డీలు కట్ట ల్లంటే మేమేం బతకల్లా, సావల్లా?''

''చూడు నారాయణప్పా మేము మూడు రూపాయల వడ్డీకి తెచ్చుకొని వ్యాపారం నడుపుతా వుంటాము. మీలాంటోళ్ళు మామూలు కష్టమర్లు కాబట్టి తగ్గించి యేస్తా ఉంటాను,'' నారా యణప్ప దిగాలుగా తిరుపాలయ్య మొగంలోకి చూసి, రెండూ నిమిషాల మౌనం తర్వాత, ''కానీప్పా! కానీ! కాలం మీదా, మాదా! సరే- పనులు చూసుకొని సాయంత్రం వస్తా. లెక్క చూసి పెట్టుండు,'' అని లేచి నిలబడి చేతులు ఊపుకుంటూ బయటకి వచ్చాడు. అయిదు నిమిషాల నడకతో వెంకటేశ్వర లారీ బ్రోకర్ ఆఫీసు దగ్గరకు చేరుకున్నాడు నారాయణప్ప. బ్రోకర్ ఆఫీసుతో తనకు పరిచయాలు లేవుకానీ, అక్కడి వ్యవహారమంతా తెలుసు. రెండుమూడుసార్లు తన బావమరిది రంగయ్య వెంట అక్కడికి వచ్చినాడు.

ఆఫీసు బయట బెంచీలమీద నలుగురైదుగురు కూర్చొని ఉన్నారు. కూర్చున్న వారిలో ఒకతను నారాయణప్పను చూసి, పళ్ళికిలించి, ''రాన్నా! రా,'' అంటూ పక్కకు జరిగి చోటిచ్చాడు. నారాయణప్ప కూడా అతణ్ణి గుర్తించాడు. అతడు పూలకుంట ఓబిరెడ్డి. కొద్దిపాటి పరిచయం లేకపోలేదు.

''బాగుండావా నారాయణప్పా,'' అంటూ పలకరించాడు పక్కన కూచోగానే.

''అందరిదీ బాగు ఒకటే గదప్పా,'' అన్నాడు నారాయణప్ప నవ్వుతూ.

ఆఫీసులో టేబుల్ ముందు కూర్చొని ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. బ్రోకరాఫీసు ఓనరు వెంకటస్వామి. రెండు నిమిషాల తర్వాత ఫోన్‌ను డయల్ మీద పెట్టి నారాయణప్పను పరిశీలనగా చూసి, ''హంసాపురం గదన్నా మీది,'' అని అడిగాడు.

ఔనన్నట్టు తలాడించాడు నారాయణప్ప.

''రంగయ్యకు బంధువు కదా,'' అని పరామర్శ చేశాడు వెంకటస్వామి. నారాయణప్ప తలాడించి, ''లారీ కావాలప్పా మర్నాటికి,'' అన్నాడు.

''చీనాకాయలకే గదన్నా! యాటికి? నాగపూరుకా? హైదరాబాదుకా?''

''నాగపూరుకేనప్పా.''

వెంకటస్వామి రెండు మూడు నిమిషాలు ఆలోచనలో పడినట్టుండి, ''మర్నాటికే గదా! సరేలేన్నా- కాయ ఏమాత్రం,'' అని అడిగాడు.

నారాయణప్ప రవంతసేపు గుణించుకొని, ''12,13 టన్నులు కావచ్చునప్పా,'' అన్నాడు. ఇంతలో ఒక కుర్రాడు ఇనుప చట్రాల స్టాండులో టీలు తెచ్చి, తలా ఒక గ్లాసు అందించాడు. నారాయణప్ప కూడా తీసుకోక తప్పలేదు.

''బాడుగ చెప్పప్పా,'' అన్నాడు వ్యవహారంలోకి దిగుతూ నారాయణప్ప.

''చెప్పేదేముందన్నా- మీ ఊళ్లో అందరికీ తెలిసిందే గదా. పదిన్నర టన్నులకైతే నాలుగు వేలా రెండు వందలు- ఆపైన వేసే ప్రతి టన్నుకూ నాలుగు వందలు.''

''పైన అ రెండు నూర్లూ యాలప్పా? చూసి ఏసుకో.''

''బాగా మాట్లాడతావన్నా. నాకేమన్నా సొంత లారీ ఉందా? ఏదో ఇంత కమీషను తీసుకొని బతికేవాళ్లం,'' అన్నాడు నవ్వుతూ.

ఎవ్వరూ మాటల్లో చిక్కరని అర్థం చేసుకొని నవ్వుకున్నాడు నారాయణప్ప.

''రేటు బాగానే ఉందిలేన్నా. నాలుగువేల దాకా పోతావుంది కాయ,'' అన్నాడు వెంకటస్వామి. నాలుగు వేలు అనగానే నారాయణప్ప మొగం వెలిగిపోయింది. ''మొన్న కక్కలపల్లి కిష్టయ్య రెండు లారీల లోడు తోలినాడు. నాలుగు వేలకు పైనే అమ్మినాడంట. పద్దన్నే నేను కూడా ఫోన్ చేసినా. రేటు స్టాండర్డుగా ఉంది.'' నారాయణప్ప పక్కన కూచున్న ఓబిరెడ్డి, ''మన చేతుల్లో ఉంటుందా రేపు వెంకటసామీ! కాయను బట్టి, టైమ్‌ను బట్టీ, మన అదృష్టంబట్టీ అంతా జరగల్ల అంతే,'' అన్నాడు. అక్కడున్న అందరూ నవ్వినారు. నారాయణప్పకు ఎక్కడో ముల్లు గుచ్చుకున్నట్లయింది.

లారీ మాట్లాడి ఊరికి రావాల్సిన టైమ్ చెప్పి, వెంకటస్వామికి కమీషన్ కింద రెండు వందలు ఇచ్చుకొని, ఒకటికి రెండుసార్లు హెచ్చరించి, లేచి నిలబడ్డాడు నారాయణప్ప.

నాలుగువేలు రేటు విన్నప్పటి నుండీ కొంత ఊరటగా ఉంది నారాయణప్పకు. ఆ రేటు ప్రకారం అయితే ఖర్చులు పోను తన చేతికి నలభై వేల రూపాయలపైనే రావచ్చు. అప్పు లేకుండా పాప పెండ్లి జరిగిపోతుంది. తాను చీనాచెట్లు పెట్టి ఎనిమిదేండ్లయింది. రెండెకరాలలో ఇన్నూటా యాభై చెట్లు పెట్టినాడు. ఇరవై ముప్పయి చెట్లు రోగాలొచ్చి ఎండిపోయినా, మిగిలిన చెట్లలో అంతో ఇంతో కాపు చేతికి వస్తున్నది ఈ పంటలోనే చెట్లు పెట్టినంక ఆరో ఏడు కాత నిల్పినాడు. మొదటికాత సరిగా రాలే. అంతో ఇంతో వస్తే అది ఆ ఏటి పెట్టుబడి కూడా ఎల్లలే. మొదటి కాతను చెట్ల మీదనే కట్టు ఒప్పందానికి అమ్మినాడు తను. ఎనిమిది వేలు చేతికి వచ్చింది. రెండో కాత టయ్యానికి సరిగ్గా నీళ్లు చాలక, కాయ సైజు రాక అనంతపురంలోనే మండీకి తోలి అమ్మితే, వాళ్లు నందిని పందిని చేసి తన్ను ముంచి పారేసిరి. చేతికి పదివేలు వస్తే ఎక్కడ బోయనో! ఎరువులకూ, మందులకూ చేసిన అప్పులు ఎల్లలే. ఇది మూడో కోత. ముందుకంటే కాత్త మెరుగే. లారీ లోడు అవుతుంది కాబట్టి ఈసారి నాగపూరుకు తోలల్లనుకుండాడు తను. తన బావమరిది రంగయ్య కూడా వెంట వస్తానన్నాడు. వాడికీ మున్నూరు చెట్లు ఉన్నాయి. రెండు సార్లు నాగపూరుకు తోలినాడు. ఈసారి తన్నూ తోలమనినాడు. రేటు చూస్తే నిరుడు కంటే తక్కువ. ఒకవైపు సంవత్సర సంవత్సరానికీ ఎరువుల ధరలు మండిపోతా ఉండాయి. కాయ ధర చూస్తే

ఏ పొద్దు ఏ రేటుంటుందో ఎవరికీ అంతుపట్టదు. నాలుగు వేలన్నా దాటితేనే రైతుకు గిట్టుబాటు. ఈ సంసత్సరం పెట్టిన పెట్టుబడి కూడా ఎక్కువే. చక్కకూ, పచ్చి ఎరువులకూ, రసాయనిక ఎరువులకూ, పురుగు మందులకూ, కూళ్లకూ పెట్టిన పెట్టుబడి ఈసారి పంౘ్రెండు వేలు దాటింది. పెట్టుబడి అంటే అప్పే! అప్పంటే వడ్డీనే!

ఆలోచనలు మనసును తొలుస్తుంటే గబగబా నడుస్తున్నాడు నారాయణప్ప.

*

సన్నగా తుంపర పడుతూ ఉంది. ఆకాశంలో మబ్బుల మాడాలు వయ్యారంగా కదిలి పోతున్నాయి. ఇది పనికొచ్చే వాన కాదు. పని చెడగొట్టే వాన. నారాయణప్పా, అతని ఇద్దరు కొడుకులూ, ఇద్దరు బిడ్డలూ, భార్యా, వీళ్లతో పాటు పదిమంది కూలోళ్లూ చెట్లమీది కాయలు పీకి కుప్పలు పోస్తున్నారు పొద్దుట నుండీ. నారాయణప్ప బావమరిది రంగయ్య సిగరెట్టు పీలుస్తూ కూలోళ్లకు హెచ్చరికలు చేస్తున్నాడు.

నాలుగెకరాల తోట. చుట్టూ కల్లకంపతో వేసిన ముళ్లకంచె. చీనాచెట్లు రెండెకరాలు ఆక్రమించుకోగా, మిగిలిన నేలలో నీళ్లు చాలితే మరిమడీ, శనక్కాయ పంటా వేస్తూ ఉంటారు. వర్షాలు బాగా వచ్చి నీళ్లు బావిలో పుష్కలంగా ఉంటే తప్ప తోటంతా పైరు పెట్టేకి లేదు. అయినా, నీళ్లన్నీ ఈ చెట్లకే సరిపోతూ ఉండె. చీనాచెట్లు పెట్టినప్పటి నుండీ నారాయణప్పకు పెద్ద దిగులయి పోయింది, ఇన్ని తిండిగింజలు సరిగా పండించుకోలేక పోతున్నానే అని. మధ్యాహ్నం కావస్తూండగా లారీ వచ్చింది.

వెంటనే కాయలు లారీలోకి లోడ్ చేయడం ప్రారంభించారు.

నారాయణప్ప రంగయ్యను కూడా ప్రయాణం కట్టించాడు నాగపూర్‌కు. తనకు కొత్త. రంగయ్యకు మంచి అనుభవముంది.

లారీ సిబ్బందితో సహా భోజనాలు ముగించి బయల్దేరేసరికి రాత్రి ఎనిమిది దాటింది. ఇంట్లో తగిన జాగ్రత్తలు చెప్పి, రంగయ్యతోపాటు లారీ కాబిన్‌లోకి ఎక్కి కూచున్నాడు నారాయణప్ప. శనివారం రాత్రి బయలుదేరిన లారీ సోమవారం పొద్దున ఏడుగంటలకు నాగపూరు చేరుకుంది. దారి ఖర్చులు మూడు వందలు యిడిగాయి నారాయణప్పకు. లారీ ఆగిన ప్రతిచోటా లారీ సిబ్బందికి ఖర్చులన్నీ తనవే. ఈ పద్ధతి బొత్తిగా సరిపోలేదు నారాయణప్పకు. 'ఇదింతే-మామూలే,' అని సర్దిచెప్పాడు రంగయ్య.

వీళ్లు నాగపూరు చేరుకొనేసరికి బాగా ముసురు పట్టుకుంది. బాగా లారీలు తిరిగే ప్రదేశం కావడం వల్ల మండీ రోడ్డంతా చిత్తడితో, చిన్నచిన్న గుంటలతో పరమ అసహ్యంగా తయారయింది.

వీళ్ల లారీ మండీ దగ్గరకు చేరుకొనేసరికి నలభై వరకూ లారీలు బారులు తీరి నిలబడి ఉన్నాయి. భీమ్‌సేన్‌లాల్ మండీ ముందు లారీ ఆపించినాడు రంగయ్య. వీళ్లు లారీ దిగగానే మండీ గుమాస్తా వీళ్లకు ఎంత గౌరవంగా స్వాగతాలు చెప్పి, మండీ పై అంతస్తులో బస ఏర్పాట్లన్నీ స్వయంగా ఉండి చేయించాడు. అందరూ స్నానాలు చేసి, బట్టలు మార్చుకొని, దగ్గరలో ఉన్న హోటల్‌కెళ్లి టిఫిన్లు తిని, కాఫీలు తాగి వచ్చారు. వీళ్లు వచ్చేసరికి లారీల నుండి అన్‌లోడ్ చేసిన కాయలు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. అన్ని గుట్టల్ని చూసేసరికి నారాయణప్ప ఆశ్చర్య పోయి, "ఇన్ని కాయల్ని ఈ ఊరివాళ్లే తింటారేమిరా?" అని అడిగాడు బావమరిదిని.

"ఈ కాయలన్నీ సాయంత్రానికి ఒక్కటి కూడా ఇక్కడ మిగలవు బావా! వీటిని వేలం పాడినవాళ్లు వెంటనే మళ్లీ లారీల్లో నింపించి ఏ ఢిల్లీకో, ఆగ్రాకో, కలకత్తాకో ఎక్స్‌పోర్ట్ చేస్తారు.

మనలాంటి రైతుల కాయల మీద వాళ్లు మళ్లీ వేలకు వేలు సంపాదించుకుంటారు,'' అన్నాడు రంగయ్య. 'మన కష్టార్జితాన్ని దేశంలో ఎంతమంది పంచుకు తినల్నో,' అనుకున్నాడు నారాయణప్ప.

అరగంట తర్వాత మండీవాళ్లు వీళ్ల లారీని 'కాటా' దగ్గరకు తోలించుకొనిపోయి, నిండు లారీని తూకం వేయించారు. పద్దెనిమిది టన్నుల తూకం తూగింది లారీ. ఒక అరగంటకల్లా లారీని అన్‌లోడ్ చేసేవారు మండీ కూలోళ్లు. మళ్లీ ఖాళీ లారీని కాటా ఎక్కించారు. లారీ ఏడు టన్నులు తూగింది. మొత్తం తూకం నుండి లారీ బరువును తీసేసి, కాయ పదకొండు టన్నులు అని చెప్పారు. ఈ తతంగాన్నంతా ఒక నాటకాన్ని చూస్తున్నట్టు నారాయణప్ప చూస్తుండిపోయాడు. కాయ పదకొండు టన్నులు అనగానే ఏదో అపనమ్మకం లాంటిది కలిగింది. రంగయ్యతో ఆమాట అంటే, "సామాన్యంగా తూకాల్లో మోసాలు జరగవంటారు బావా- మనమీడ ఏం మాట్లాడేకుంది?'' అన్నాడు.

మండీ గుమాస్తా వీళ్ల సరుకుకు వెంటనే రసీదు తెచ్చి ఇచ్చాడు. కాటా రసీదులో 9.9 టన్నుల సరుకును నమోదు చేశారు. టన్నులకు ఒక క్వింటాల్ చొప్పున 'సూట్' అనే పేరున మినహాయిస్తారక్కడ. పదకొండు టన్నులకూ పదకొండు క్వింటాళ్లు 'సూట్' కింద తీసేసి, తక్కినది రసీదులో కనబరచారు. అంటే, సరుకు పదకొండు టన్నులున్నా, రైతుకు 9.9 టన్నులకే ధర లభిస్తుంది. ఈ 'సూట్' విషయం నారాయణప్పకు తెలిసినా, ఇంత పబ్లిగ్గా తన సరుకును సూట్ పేరుతో దోచుకుంటున్నందుకు అక్కసు లాంటిది కలిగింది. తాను పదమూడు టన్నులవుతుందన్న సరకు కడాకు పది టన్నులు కూడా కాలే.

గుమాస్తా లారీ డ్రైవరును వెంటబెట్టుకొని వెళ్లి లారీ బాడుగా, డ్రైవర్ మామూలూ ఇచ్చి పంపించాడు.

మండీలో గుట్టలు గుట్టలుగా ఉన్న కాయల చుట్టూ ఆ కాయలు తెచ్చిన రైతులూ, వేలం పాట పాడేవాళ్లూ మూగి ఉన్నారు. కొన్ని గుట్టలకు వేలం జరుగుతూ ఉంది. నారాయణప్ప, రంగయ్య ఎంతో ఆసక్తిగా అక్కడికి వెళ్లారు.

"ఈ వేలం పాట అంతా ఇక్కడ పచ్చి మోసం బావా. ఇక్కడ పదిమంది దాకా మండీ ఓనర్లుండారు. ఎవళ్ల వ్యాపారం వాళ్లదే అయినా, వీళ్లంతా ఒకటే. ఇక్కడున్న మండీ ఓనర్లంతా కుమ్మక్కయి, ఒకరి సరుకును మరొకరు వేలంలో పాడతారు. ఎక్కువ రేటు రైతుకు గిట్టకుండా జాగ్రత్త పడతారు. ఇక్కడున్న వాళ్లంతా వాళ్ల మనుషులే బావా,'' అన్నాడు రంగయ్య.

ఒక పెద్ద రాశి కాయలన్నీ పరీక్షగా తీసి చూస్తున్నారు పాటగాళ్లు. కాయలను ఒలిచి చూస్తున్నారు కొందరు. కాయకు పాలిష్ తక్కువ అంటున్నారు కొందరు. చివరకు వేలంలో ఆ రాశిలోని సరుకు టన్ను మూడువందలకు అమ్ముడుపోయింది. "కాదురా రంగయ్యా, ఇదేమిరా, ఇట్లుంది రేటు,'' సన్నగా గొణిగాడు నారాయణప్ప. రంగయ్య మౌనంగా తలాడించాడు.

నారాయణప్ప కాయల రాశి దగ్గరకు కొంతమంది పాటగాళ్లు వచ్చారు. పాటగాళ్లు ఒకరితో ఒకరు ఏదో మతించుకున్నట్లుగా గుసగుసలాడారు. రాశి చుట్టూ తిరిగి, చేతులతో రాశినంతా గెలికి, కొన్ని కాయలు బయటికి తీశారు. కాయ నాణ్యాన్ని పరీక్షిస్తున్నట్లుగా చేతులతో తడిమి, ముక్కు దగ్గర పెట్టుకొని వాసన చూశారు. కాయల్ని అరచేతుల్తో రుద్ది, నిమిరి, వలిచి రుచి కూడా చూశారు. కొన్ని చిన్న సైజు కాయల్నీ, నల్ల మచ్చలున్న కాయల్నీ ఒకరికొకరు చూపించుకున్నారు. 'కాయంతా మచ్చలు మచ్చలుగా ఉన్నదే,' అని ఒకరూ, 'సైజు ఏమిటి ఇంత చిన్నగ ఉన్నదీ,' అని ఒకరూ, 'కాయ బొత్తిగా పాలిష్ లేదే,' అని ఇంకొకరూ వచ్చీరాని తెలుగులో నారా

యణప్ప వినేలా వ్యాఖ్యానాలు చేశారు. నారాయణప్ప వేలం పాటగాళ్ల చేష్టలన్నీ విస్మయంగా చూస్తుండిపోయాడు. వేలంపాట పద్దెనిమిది వందలతో ప్రారంభమయింది. ఒక పాటగాడు పైకీ కిందికీ ఎగరేసి చేతుల్లో పట్టుకొని, పంతొమ్మిది వందలు అన్నాడు. మరొక పాటగాడు కాయను చేతితో బాగా అదిమి, 'కాయలో జూస్ చాలా తక్కువగా ఉన్నదే' అంటూ పంతొమ్మిది వందలా యాభై అన్నాడు. ఇలా సాగింది వీళ్ల వేలంపాట. పది నిమిషాలసేపు పాట నడిచి నడిచి, రెండు వేలా నాలుగువందలదాకా వచ్చి ఠకీమని ఆగిపోయింది. ఆ పాట పాడిన వ్యాపారస్తుణ్ణి మిగతా వాళ్లు 'ఠీక్ భయ్' అంటూ ఇంకా హిందీలో ఏదో అన్నారు. ఇదంతా ఏదో దొంగలాటలా అనిపించి నారాయణప్ప నివ్వెరపోయాడు. రెండు వేలా నాలుగు వందలకు పాట ఖరారయినట్లు మండీ గుమాస్తా రంగయ్యతో చెప్పాడు. ఎవరూ కొత్తగా పాట పాడకపోయేసరికి నారాయణప్పకు అనుమానమొచ్చి, "ఒరే రంగయ్యా! ఇంతకూ మన సరుకు ఎంతకు పోయినట్టురా," అని అడిగాడు సన్నటి గొంతుతో.

"రెండువేల నాలుగు వందలు బావా! ఇంత అధ్వాన్నం అవుతుందని నేనూ అనుకోలేదు. మూడు రోజుల్నుండి జడి పట్టుకొని, రేటు శానా డౌన్ అయిందని చెప్పుకుంటా ఉండారు," అన్నాడు విచారంగా.

నారాయణప్పకు తల తిరిగినట్లై దగ్గరున్న బెంచీ మీద ధనామని కూలబడిపోయాడు. గుండెల్లో కెలికినట్లయింది. కడుపులో దేవినట్లయింది. నోట్లో ఉప్పగా నీరు ఊరి వెగటనిపించింది. కళ్ల ముందు తన కాయల రాశి మసక మసగ్గా, వింత వింత రంగులతో కనిపించి కొద్దిసేపు కళ్లు మూసుకుని అలాగే ఉండిపోయాడు.

రంగయ్య బావపక్కన కూచొని, భుజాన్ని ఊపి, "బావా," అని పిలిచాడు. నెమ్మదిగా నారాయణప్ప తేరుకుని రంగయ్య ముఖంలోకి వెర్రిగా చూస్తుండిపోయాడు. రంగయ్య నారాయణప్పను ఊరడిస్తున్నట్టుగా, "పై నిరుడు రామక్రిష్ణయ్య లారీలోడు ఈటికే ఏసకొచ్చి ఇంటికి ఆరువేలు తెచ్చినాడు... ఇట్లాంటి వాటికి నిమ్మళించుకొని ఉండల్ల- ఈడ మనమింక ఏమీ చేయలేం. మన చేతుల్లో ఏం లేదు," అన్నాడు.

నారాయణప్ప నెమ్మదిగా బీడీ తీసి వెలిగించి, నిస్సత్తువగా రెండు పీకి, "ఒరే రంగయ్యా! దేశంలో సరుకులు తయారుచేసే వాళ్లంతా వాళ్ల సరుకుకు వాళ్లే రేటు నిర్ణయం చేసుకుంటారు. సబ్బులు తయారు చేసేవాళ్లు మా సబ్బు రేటింతంటారు. బట్టలు తయారు చేసేవాళ్లు మా బట్ట రేటింతంటారు. ఎరువులు తయారు చేసేవాళ్లు మా ఎరువుల రేటింత అంటారు. కడాకు చెప్పులు తయారుచేసేవాళ్లు కూడా మా చెప్పుల ధర ఇంతా అంటారు. వానికి ఇష్టం వచ్చినట్లు వాడు అమ్ముకుంటాడు. కానీ, రంగయ్యా! మన రైతు దగ్గరకొచ్చేసరికి, మనం పండించే పంటకు రేటు మనం చెప్పుకొనేకి లేదు. ఏ వ్యాపారస్తుడో చెప్పల్ల! ఏ గవర్నమెంటో చెప్పల్ల! హైదరాబాదు గవర్నమెంటు చెప్పుతుందో, ఢిల్లీ గవర్నమెంటు చెప్పుతుందో, నాగపూరు మార్కెట్టు చెప్పుతుందో, మద్రాసు మార్కెట్టు చెప్పుతుందో- మనం మాత్రం చెప్పుకునేకి లేదు. మనం ఇష్టం వచ్చినట్టు అమ్ముకునేకి లేదు. వాళ్లకో న్యాయమూ- మనకో న్యాయమూ. ఇంతకంటే అన్యాయం ప్రపంచంలో ఎవ్వరికైనా జరుగుతుందా? మన రైతుకు తప్ప. ఇది మన కర్మ అందామా! వాళ్ల అదృష్టం అందామా?" అన్నాడు శూన్యంలోకి చూపులు చూస్తూ దిగులు దిగులుగా.

ఆ సాయంత్రానికల్లా వీళ్ల సరుకుకు లెక్క కట్టినారు మండీవాళ్లు- మొత్తం 9.9 టన్నులకు 23,760 రూపాయలు. అందులో మండీ వాళ్ల కమీషన్ ఎనిమిది శాతం పంతొమ్మిది వందలూ,

లారీ బాడుగ నాలుగువేలా నాలుగు వందలూ, డ్రైవర్ మామూలు నూటయాభై, అన్ లోడింగ్ ఛార్జీలు మూడు వందలూ, కాటాకు పద్దెదు, ఇవికాక మండీ అసోసియేషన్‌కు ధర్మం కింద నూట యాభై రూపాయలూ మినహాయించుకొని నారాయణప్ప చేతికి 16,850 రూపాయలిచ్చారు. తను అనుకున్నదానికి, చేతికి వచ్చిన మొత్తానికి బొత్తిగా సంబంధం లేకపోవడంతో, మొగం కళతప్పి బాగా పాలిపోయింది నారాయణప్పకు.

బుధవారం సాయంత్రం బాగా చీకటిపడిన తర్వాత ఊరికి చేరుకున్నారు నారాయణప్పా, రంగయ్యా. ఏదో బరువు నెత్తిన ఎత్తుకున్నవాడిలా నెమ్మదిగా అడుగులు వేస్తూ ఇంట్లోకి అడుగుపెట్టిన తండ్రి ముఖంలోకి చూసి వెంటనే పలకరించలేకపోయాడు పెద్దకొడుకు. చేతి సంచీని భార్యకు అందించి మంచం మీద వాలిపోయాడు నారాయణప్ప. భార్య ఇంట్లోకి వెళ్లి సంచీ తెరచి చూస్తే, అందులో విడిచి వేసిన పాతబట్టలు తప్ప ఇంకేవీ లేవు. పెద్దకొడుకు తెమ్మన్న టేప్ రికార్డర్ కానీ, పెళ్లి కాబోయే పిల్ల చెప్పిన చీరలు కానీ, చిన్నబిడ్డ కోరిన లంగా బట్టలు కానీ ఏవీ లేకపోవడంతో ఆమె దిగులుపడిపోయింది.

మంచం దగ్గరకు వచ్చి భర్తను ఏదో పలకరించబోయింది ఆమె. నారాయణప్ప లేచి కూచొని, బనియను జేబులో నుండి నోట్లకట్ట తీసి ఆమె చేతికిచ్చి, ''పెట్టెలో పెట్టు,'' అన్నాడు. స్నానం చేసి అన్నం తిన్న తర్వాత పెద్దకొడుకుకూ, భార్యకూ కాయలకు వచ్చిన డబ్బు వివరాలన్నీ ముక్తసరిగా చెప్పి, మంచం మీద నడుం వాల్చాడు నారాయణప్ప. రాత్రి బాగా పొద్దుపోయింది. ఊరంతా నిశ్శబ్దంగా ఉంది.

నారాయణప్ప మనసు మాత్రం అలజడిగా ఉంది. అతనికి ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. ఎనిమిది సంవత్సరాలుగా తను చీనాచెట్లకు పెట్టిన పెట్టుబడులన్నీ గుర్తు తెచ్చుకుంటూంటే, గుండెలు విలవిలలాడాయి. వచ్చే నెలలో జరగబోయే బిడ్డ పెళ్లి తలచుకుంటూంటే, శరీరం వింత ప్రకంపనలతో వణికిపోయింది. తిరుపాలయ్యకివ్వాల్సిన చేబదులూ, ఎరువుల లెక్కా రేపో మాపో ఇచ్చివేస్తే, తన దగ్గర ఇంకేం ఉంటుంది! తోటలోని చీనాచెట్లు అతని కంటి ముందు దయ్యాల్లా కదలుతూన్నట్టూ, రెక్కలు విప్పుకొని రాబందుల్లా ఎగురుతున్నట్టూ కనిపించి, గట్టిగా కళ్లు మూసుకున్నాడు. తెల్లవారబోతున్నట్లుగా కోళ్లు పదేపదే కూస్తున్నాయి. మసక తెరలు మెల్లమెల్లగా విడిపోతున్నాయి.

నారాయణప్ప మంచం మీద నుండి లేచి నిలబడినాడు. తువ్వాలును భుజం మీద వేసుకుని ఇంటి మెట్లు దిగి, బయట అరుగుమీద పడుకున్న పెద్దకొడుకును, 'రాముడూ' అంటూ చేతితో కదుపుతూ లేపాడు. కొడుకు లేచి ఎదురుగా నిలబడ్డ తండ్రిని ఆశ్చర్యంగా చూశాడు.

''తోటకాడికి పోదాం రారా,'' అన్నాడు నారాయణప్ప.

''ఇయ్యాలప్పుడేలా నాయనా,'' అడిగాడు కొడుకు.

''పనుంది రారా,'' అంటూ గబగబా అడుగులు వేశాడు నారాయణప్ప. పదినిమిషాల్లో వాళ్లిద్దరూ తోటలోకి చేరుకున్నారు. తూర్పు కొద్ది కొద్దిగా ఎర్రబడుతోంది. నారాయణప్ప మిషన్ రూము తలుపు తెరిచి, లోపలికి వెళ్లి రెండు గొడ్డళ్లు తీసుకుని బయటికి వచ్చి, కొడుకు చేతికి ఒకటి అందించి, తానొకటి భుజం మీద పెట్టుకుని, ''రా రా,'' అన్నాడు ముందుకు నడుస్తూ.

''ఏమయింది నాయనా,'' అన్నాడు అయోమయంగా!

''ఒరే రాముడూ! ఈ చెట్లను మనమింక సాకలేమురా! ఇవి మనల్ని సర్వనాశనం చేస్తాయిరా- వీటి పీడ వదిలించుకుంటేగానీ మనం బతకలేం,'' అంటూ గొడ్డలి పైకెత్తి ఒక చెట్టును

తన చేతుల సత్తువకొద్దీ బలంగా నాలుగు వేట్లు వేశాడు నారాయణప్ప. 'ఫెడిల్ ఫెడిల్'మన్న ఆ శబ్దాలకు చింత చెట్ల మీదున్న పక్షులు టపాటపా రెక్కలు జాడించాయి.

కొడుకు నిశ్చలంగా నిలబడి ఉండడం చూసి, ''నాయనా! రాముడూ! ఈ చెట్లను నరికేద్దాం రారా! నా మాట వినరా,'' అన్నాడు.

పల్చటి ఎరుపు వెలుగులో, దృఢ నిశ్చయంతో గంభీరంగా ఉన్న తన తండ్రి ముఖంలోకి చూస్తూ కొడుకు గొడ్డలి ఎత్తాడు.

వెంట వెంటనే వాళ్ల చేతుల్లోని గొడ్డళ్ళు తీవ్రంగా శబ్దం చేస్తూ చీనాచెట్ల మొదళ్లను ఉన్మత్తంగా తాకుతున్నాయి.

ఆ నిశ్శబ్ద ప్రశాంత సమయంలో, గొడ్డళ్ల దెబ్బల నుండి వెలువడే ఫెళఫెళ శబ్దాలు దేశాన్నీ, కాలాన్నీ, వాతావరణాన్నీ నగ్నంగా ప్రశ్నిస్తున్నట్లుగా, భయోద్విగ్నంగా ప్రతిధ్వనిస్తున్నాయి.

*ఇండియా టుడే, 21 అక్టోబర్ 1991*

దగాపడ్డ రైతు కథ

# అడుసు

**నీళ్ళు చాలకా, పెట్టుబడులు భరించలేకా, గిట్టుబాటు ధర లేకా, అనేక కారణాల వల్ల ఆ ఊళ్ళో చెట్లను నరికివేసిన రైతుల్ని నేను చూశాను. అనంతపురంలో ఏ టింబరు డిపోలో చూసినా చీనాచెట్ల శవాలు కుప్పలు తెప్పలుగా కనిపిస్తాయి. పండించిన పంటకు గిట్టుబాటు ధర ఉంటే ఇంత దారుణం జరగదు**

అనంతపురానికి పదిమైళ్ళ సమీపంలో ఉండే హంసాపురం జిల్లాపరిషత్ హైస్కూల్లో 1986 అక్టోబర్ నుంచి 1997 జూన్ వరకు నేను పనిచేశాను. ఐదు సంవత్సరాల పాటు ఆ పల్లెలోనే నేను కాపురం ఉన్నాను- ఆ పల్లెలో ఉన్న వాళ్ళంతా రైతులూ, రైతు కూలీలే! నేను ఆ ఊరికి వెళ్ళేటప్పటికి మూడు సంవత్సరాలుగా అక్కడ వర్షాలు లేవు. బావుల్లో నీళ్ళన్నీ ఇంకిపోయి పిచ్చిగడ్డి మొలిచింది. అక్కడ ప్రధాన వ్యవసాయం పంట వేరుశెనగ. మూడేళ్ళుగా ఏ రైతుకూ పెట్టుబడి గిట్టలేదు. అక్కడ బావుల కింద చాలామంది రైతులు చీనాచెట్లు పెంచుకున్నారు. బావుల్లో నీళ్ళు లేక చాలా వరకు చెట్లు ఎండిపోయాయి. అప్పోసప్పో చేసి బోరింగులు వేయించి కొందరు రైతులు చీనాచెట్ల ప్రాణాలను కాపాడుకొంటూ వస్తున్నారు. బావుల కింద వేసే వరి, రాగి, జొన్న పంటలు పూర్తిగా మాయమైపోయాయి. ఒకటి రెండు సంవత్సరాల తరువాత వరుసగా రెండు మూడేళ్ళు మంచి వర్షాలు పడడంతో రైతులు ప్రాణాలు నిలుపుకొన్నారు. వర్షాలు పడినప్పటికీ బావుల్లో నీళ్ళు మాత్రం ఊరలేదు. బోరింగులే గతి! వ్యవసాయం భారీ పెట్టుబడితో ముడిపడి పోయింది. చీనాచెట్లకు మళ్ళీ ప్రాణాలొచ్చాయి...

నేను ఊరికి కాస్త ఎడంగా రెండు గదుల చిన్న ఇంట్లో కాపురం ఉండేవాణ్ణి! నేనున్న ఇంటికి అతి దగ్గరగా పొలాలు ఉండేవి. నాకు బాగా పరిచయమైన ఒక రైతు ఆ సంవత్సరం తన తోటలో దానిమ్మ చెట్లు వేశాడు. నీటితడి మరీ ఎక్కువ

లేకపోయినా, ఆ చెట్లు బతికి బట్ట కడతాయని ఆ రైతుతో పాటు మరికొంతమంది రైతులు కూడా తమ తోటల్లో దానిమ్మచెట్లు వేశారు. వేసిన రెండు సంవత్సరాలకే చెట్లు బాగా కాపు కొచ్చాయి. ఎర్రగా దోసిలిపట్టేంత పెద్ద సైజులో దానిమ్మ పళ్ళు గుత్తులు గుత్తులుగా విరగకాశాయి ఆ తోటల్లో! ఆ చెట్లనూ ఆ పళ్ళనూ చూస్తుంటే ఏదో సుందర కావ్యాన్ని చదువుతున్నంత రమణీ యంగా ఉండేది నాకు. అయితే రెండేళ్ళ తరువాత నిర్దాక్షిణ్యంగా ఆ రైతు దానిమ్మచెట్లను నరికివేశాడు. ఆ రైతును విషయం విచారిస్తే, 'ఇంత కష్టపడీ చచ్చీచెడీ కాయలు పండిస్తే, కాయ నూరు నలభైకీ, యాభైకీ అమ్ముకో వలసి వస్తే ఎట్లా గిట్టుబాటవుతుంది సార్. దానికి బదులు ఏ జొన్నలో రాగులో  వేసుకొంటే తిండి గింజలన్నా పండుతాయి,'' అన్నాడు. టౌనులో చూస్తే అదే కాయ ఒక్కొక్కటీ మూడు, నాలుగు రూపాయలకు అమ్ముతూ ఉండడం నేను కళ్ళారా చూశాను. రైతు దగ్గరకొచ్చేసరికి కాయ యాభై పైసలే! రైతు ఎంత భరిస్తాడు? ఇప్పుడా ఊళ్ళో ఒక్క దానిమ్మ చెట్టూ లేదు. చాలా దుఃఖం కలిగింది నాకు.

దానిమ్మచెట్ల పరిస్థితి అలా ఉంటే చీనాచెట్ల పరిస్థితి మరీ అన్యాయం అనిపించింది. ఆ ఊళ్ళో చాలా ఏళ్ళుగా చాలామంది రైతులు చీనాచెట్లు వేశారు- చీనాచెట్లు కోతకు రావాలంటే, చెట్లు పెట్టిన తర్వాత కనీసం ఐదు సంవత్సరాలు పడుతుంది. ఆ ఐదు సంవత్సరాలూ పసి పిల్లవాడిలాగా వాటిని పెంచి పోషించాలి- ఎరువులూ, మందులూ, నీళ్ళూ, కూలీలు ఒకటేమిటి అన్నీ డబ్బుతో కూడుకొన్నవే! చీనాకాయల రేటు చాలా విచిత్రంగా ఉంటుంది.

ఒక్కోసారి టన్ను ఏడెనిమిదివేల దాకా ఉంటుంది. ఆ రేటులో అమ్మితే రైతుకు బాగా గిట్టుబాటు అవుతుంది. అయితే మంచి రేటు ఉన్నపుడు తగినంత కాపు ఉండదు. చీనాకాయల్ని రైతులంతా నాగపూరుకు లారీల్లో తోలుతారు. ఇక్కడ బయలుదేరి నప్పుడున్న రేటు అక్కడికి చేరేసరికి ఒక్కోసారి ఉండదు కూడా. లారీల బాడుగలూ, ప్రయాణ ఖర్చులూ తడిసి మోపెడవు తాయి. తీరా అక్కడ రేటు మూడువేలకు లోపుగా ఉంటే రైతుకు బొత్తిగా గిట్టుబాటు కాదు. అక్కడ తూకాలు వేసింతర్వాత 'సూటు' కింద కొంత తీసివేస్తారు. అక్కడ మండీ వ్యాపారస్తులంతా కుమ్మక్కయి రేటు ఎక్కువ పెరగకుండా జాగ్రత్తపడతారు. మరి గిట్టుబాటు కాకపోయినా, ఆరే డేళ్ళు సాకి సంరక్షించిన ఆ చెట్లను నరికెయ్యలేక అలాగే ఈడ్చుకు వస్తుంటారు రైతులు. మరీ భారమనిపించిన స్థితిలో చెట్లను నరికివేస్తారు. నీళ్ళు చాలకా, పెట్టుబడులు భరించలేకా, గిట్టుబాటు ధర లేకా, అనేక కారణాల వల్ల ఆ ఊళ్ళో చెట్లను నరికివేసిన రైతుల్ని నేను చూశాను. అనంతపురంలో ఏ టింబరు డిపోలో చూసినా చీనాచెట్ల శవాలు కుప్పలు తెప్పలుగా కనిపిస్తాయి. పండించిన పంటకు గిట్టుబాటు ధర ఉంటే ఇంత దారుణం జరగదు- ఇదంతా చాలా ఏళ్ళు గా గమనించాను నేను. ఈ నేపథ్యంలో ఒక కథ రాయాలని చాలాకాలం ఆలోచించాను- దాని ఫలితమే నేను రాసిన అడుసు కథ.

ఈ కథ ద్వారా, రైతు పండించిన పంటకు ధర గిట్టుబాటు కావడం లేదని చెప్పడం నా ఉద్దేశం. మధ్యలో ఎందరో దళారీలు ఎంతో నేర్పుగా రైతును దోచుకొంటున్నారు. తాను పండిం చిన పంటకు తానే ధర నిర్ణయించుకొనే స్థితిలో రైతు లేడు- దేశంలో, సరుకులు ఉత్పత్తి చేసే వాళ్ళంతా, వాళ్ళ సరుకుకు వాళ్ళే రేటు నిర్ణయం చేసుకొంటారు. రైతు దగ్గర కొచ్చేసరికి తాను పండించే పంటకు తాను ధరను నిర్ణయించే అధికారం లేదు- అన్న పాయింటును చెప్పడానికే నేను ఈ కథ రాశాను.

ఈ కథకు కేంద్రం నేను పనిచేసిన హంసాపురం గ్రామం. కథలో ఆ ఊరు పేరును అలాగే ఉంచాను. కథ నారాయణప్ప అనే రైతు చుట్టూ నడుస్తుంది. ఏ ఒక్క రైతునూ దృష్టిలో

ఉంచుకొని నేను ఈ కథ రాయలేదు. ఆ గ్రామంలోని ఎందరో రైతులకు ప్రతినిధి నారాయణప్ప. నారాయణప్ప రెండెకరాలలో చీనాచెట్లను పెంచుతాడు. ఐదేళ్ళ తర్వాత మొదటి కాపు నిలిస్తే స్థానికంగా అనంతపురం మండీ మర్చెంట్‌కు అమ్ముతాడు. బొత్తిగా గిట్టుబాటు కాదు. మొదటికోత కదా అని సమాధానపడతాడు. రెండవ కాపు బాగానే కాస్తుంది. 12 టన్నులు కావచ్చునను కొంటాడు. నాగపూరుకు తోలాలనుకుంటాడు. అదే సమయంలో తన కుమార్తె పెళ్ళి కూడా నిశ్చయమై ఉంటుంది. కట్నంగా ముప్పైవేలు నగదూ, పది తులాల బంగారం ఇవ్వాలి. వియ్యం కుల కోసం పదివేలు ముందుగా సర్దాల్సి వస్తుంది. అనంతపురం వెళ్ళి తనకు ఖాతా పెట్టే తిరుపా లయ్య దగ్గర పదివేలు అప్పు తీసుకొని, నాగపూరుకు లారీ మాట్లాడి వస్తాడు. నాగపూరులో టన్ను నాలుగువేలకు పైగానే ధర ఉందని తెలుసుకొంటాడు. తన సరుకుకు ఖర్చులు పోనూ నలభైవేలకు పైగానే లభించవచ్చునని ఆశిస్తాడతను. తన బావమరిది రంగయ్యను వెంటబెట్టుకొని చీనాకాయల లారీని నాగపూరుకు తీసుకెళ్తాడు. అక్కడ రేటు బాగా పడిపోయి ఉంటుంది. సూటు కింద కొంత తీసివేయగా, ఖర్చులు పోనూ 16,800 మాత్రమే చేతికొచ్చేసరికి హతాశుడౌతాడు. నారాయణప్ప ఇంటికి తిరిగివచ్చిన తర్వాత ఆ రాత్రి చాలా నిర్వేదంతో ఒక నిర్ణయానికొస్తాడు. తెల్లవారుతుండగా, తన కొడుకును వెంటబెట్టుకొని తోటకు వెళ్ళి చీనాచెట్లను గొడ్డళ్ళతో నరికి వేస్తాడు. "ఆ నిశ్శబ్ద ప్రశాంత సమయంలో గొడ్డళ్ళ దెబ్బల నుంచి వెలువడే ఫెళఫెళ శబ్దాలు దేశాన్నీ, కాలాన్నీ, వాతావరణాన్నీ నగ్నంగా ప్రశ్నిస్తున్నట్టుగా, భయోద్విగ్నంగా ప్రతిధ్వనిస్తున్నాయి," అన్న వాక్యంతో కత పూర్తవుతుంది.

నేను చాలా ఏళ్ళు హంసాపురంలో ఉన్న కారణంగా, అక్కడ రైతులు చీనాకాయలు పండించే క్రమాన్ని స్వయంగా గమనించాను. చీనాకాయలు పండించడమంటే అదేదో ఇంద్రజాల విద్య కాదు. దాని వెనుక ఏళ్ళ తరబడి శ్రమ, ఓర్పు, పెట్టుబడి, పంట మీద ప్రేమ ఉంటుంది.

ఇదంతా కథలో రావాలి- దీన్నంతా రచయిత ఒక వ్యాస ధోరణిలో చెప్పినట్టు ఉండ కూడదు. కథంతా నారాయణప్ప చుట్టూ నడుస్తుంది కాబట్టి ఆ పాత్ర ద్వారానే ఇది ఆవిష్కరింప బడాలి. కథలో తిరుపాలయ్య దగ్గరకు నారాయణప్ప పదివేల అప్పు కోసం వెళ్తాడు. తిరుపాలయ్య నారాయణప్పను, "మీకేమప్పా రైతులకు- చీనాకాయలు సులాగ్గా పండిస్తరు. ఉద్దర దుడ్లు మీకు," అని ఎద్దేవా చేస్తాడు. ఆ మాట వినగానే బొడ్డులో నుండి బయలుదేరిన వేడి గుండెల్ని తన్నుకొని కళ్ళ కొనల్లోకి వచ్చింది నారాయణప్పకు. ఈ సందర్భంలో నారాయణప్ప మనసులో చిమ్ముకొచ్చిన ఆరాటం ద్వారా రైతు చీనాకాయలు పండించడంలోని శ్రమనంతా పాఠకుడి ముందు పరచాను నేను. అలాగని రచయితగా నేను పాత్రలో పరకాయ ప్రవేశం చేయలేదు. తిరుపాలయ్య మాట వినగానే నారాయణ ఇలా అనుకుంటాడు మనసులో... 'అడ్డమొచ్చిన ప్రతివాడూ, తిని తీరిగ్గా కూచుని రైతును మీకేమప్పా అనేవాడే! తమ రైతాంగమంతా వీళ్ళ దృష్టిలో చాలా తేలిగ్గా డబ్బు సంపాదించే వాళ్ళ కింద లెక్క! సేద్దెమంటే వీళ్ళ మొగాలకేమి తెలుస్తుంది? అట్ల విత్తనాలు చల్లితే ఇట్ల పంట చేతికి వచ్చేకి ఇదేమన్నా వడ్డీ వ్యాపారమా? చీనాకాయలు పండించడమంటే అదేమన్న బజార్లో గారడీవాడు చేసే కనుకట్టు విద్యా? చెట్లు పెట్టినంక అయిదారేళ్ళు సాకి సంరక్షిస్తే కాని మొదటి కోత చేతికి రాదే! దాండ్లకు ఎన్ని ఎరువులు పొయ్యల్ల? ఎన్ని మందులు కొట్టల్ల? ఎంత పెట్టుబడి పెట్టల్ల? చంటిబిడ్డకు పాలు పట్టినట్టు నిరంతరమూ నీళ్ళు పారిస్తానే ఉండల్ల! చెట్టుకు పిందె పట్టినప్పటి నుంచీ కాయగా మారేదంకా రైతే గర్భం మోసినంత భారం ఉంటుందని ఈళ్ళకేం తెలుసు...?' ఇలా సాగిన నారాయణప్ప ఆత్మమథనం ద్వారా, రైతు శ్రమను ఈ కథలో నేను ఆవిష్కరించాను.

నేను నాగపూరును చూడలేదు, అక్కడి వ్యవహారమేమీ నాకు తెలీదు. అక్కడ లారీలోని సరుకును ఎట్లా తూకం వేస్తారో, 'సూట్' కింద ఎంత భాగం తీసివేస్తారో, అసలు సూట్ అంటే ఏమిటో, అక్కడ మండీలలో వేలం పాట ఎలా జరుగుతుందో అక్కడి మండీ వ్యాపారస్తులు ఎలా కుమ్మక్కు అవుతారో, ధర్మం పేరిట రైతును ఎలా పీక్కుతింటారో, సరుకుకు ఎలా లెక్కలు కడతారో- ఇలాంటి విషయాలన్నింటినీ చాలా మంది రైతుల్ని విచారించి, వివరాలు తెలుసుకొని, కథకు అవసరమైన మేరకు వాటిని ఉపయోగించుకొన్నాను.

కథను, అనంతపురానికి లారీ మాట్లాడడానికి నారాయణప్ప వెళ్ళడంతో ప్రారంభించి, నాగపూరుకు సరుకును తోలి, తిరిగివచ్చిన తర్వాత, తన తోటలోని చెట్లను నరికివేయడంతో ముగించాను. ఈ ఆద్యంతాల మధ్య రైతు జీవితాన్ని, అతని కష్టాన్ని, అతని మానసిక వేదననూ, నైరాశ్యాన్నీ, కసినీ, అతని ఆత్మవిధ్వంసాన్నీ ఆవిష్కరించాను. నేను చెప్పదలుచుకున్న పాయింట్‌ను నారాయణప్ప పాత్ర ద్వారానే, "ఒరే రంగయ్యా! దేశంలో సరుకును తయారుచేసేవాళ్ళంతా, వాళ్ళ సరుకుకు వాళ్ళే రేటు నిర్ణయం చేసుకొంటారు. సబ్బును తయారుచేసేవాళ్ళు మా సబ్బు రేటింత అంటారు, బట్ట తయారుచేసే వాళ్ళు బట్ట రేటింత అంటారు, ఎరువులు తయారుచేసే వాళ్ళు మా ఎరువుల రేటింతంటారు. కడాకు చెప్పులు తయారుచేసేవాళ్ళు కూడా మా చెప్పుల ధర ఇంత అంటారు. వానికి ఇష్టం వచ్చినట్టు వాడు అమ్ముకుంటాడు. కానీ రంగయ్య! మన రైతు దగ్గరకొచ్చే సరికి, మనం పండించే పంటకు మనం రేటు చెప్పుకొనేకి లేదు- ఏ వ్యాపారస్తుడో చెప్పల్ల! ఏ గవర్నమెంటో చెప్పల్ల! మనం మాత్రం చెప్పుకొనేకి లేదు- ఇంతకంటే అన్యాయం ప్రపంచంలో ఎవరికైనా జరుగుతుందా? మన రైతుకు తప్ప..." అని చెప్పించాను. కథలో రచయిత గా నేను ఎక్కడా ప్రవేశించలేదు. పాఠకుడు కథ ప్రారంభం నుండీ చివరి వరకు నారాయణప్ప పాత్ర వెనుకే నడుస్తాడు. నారాయణప్పతోనే తాదాత్మ్యం చెందుతాడు. నేను చెప్పదల్చుకున్న పాయింట్ కథతో ముడిపడి ఉండేలా చూశానే కాని, పాఠకుడికి జ్ఞానదానం చేయడం కథ ఉద్దేశం కాదు. ఉపన్యాసాలు, వాదాలులాంటివి పెట్టి ఎక్కడా శిల్పభంగం చేయలేదు.

నారాయణప్ప కుటుంబ జీవితాన్ని కూడా నేను ఎక్కడా వాచ్యంగా చెప్పలేదు. పాత్రల సంభాషణల ద్వారానే వ్యక్తం చేశాను. నారాయణప్పకు భార్యా, కుమారుడూ, కుమార్తె ఉన్నారు. అమ్మాయికి పెళ్ళి నిశ్చయమైంది. వియ్యంకులకు పదివేలు అడ్వాన్సుగా కూడా ఇచ్చారు. మరో ఇరవై వేలు ఇవ్వాలి. బంగారం కొంత కొనాలి. పెళ్ళి ఖర్చులూ ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రధాన కథతో ముడిపెట్టాను. ఈ ఖర్చులకూ, పంట అమ్మకం ద్వారా వచ్చే డబ్బుకూ ఒక చిన్న లంకె కలిపాను.

కథ చివరిలో నారాయణప్ప తన కుమారుని వెంటబెట్టుకొని తోటకు వెళ్ళి, తన కొడుకు చేతికి గొడ్డలి ఇచ్చి, తానూ ఒక గొడ్డలి చేతబట్టి, చెట్లను నరికివేయమంటాడు- నారాయణప్ప ఒకడే ఈ పని చేయవచ్చు కదా! కొడుకు తోడు ఎందుకు? ఉద్దేశపూర్వకంగానే నేను కొడుకును తోడు చేశాను. నారాయణప్ప తర్వాతి తరానికి కొడుకు ప్రతినిధి! తర్వాతి తరం పరిస్థితిని కూడా సూచించడానికి ఈ పని చేశాను. చెట్లను నరికివేయడాన్ని, కేవలం లిటరల్‌గా అర్థం చేసుకో కూడదు. రైతు వర్తమానంలో ఆత్మవిధ్వంస స్థితిలో ఉన్నాడన్న స్పృహను కలిగించడానికే, చెట్లను నరికించే ముగింపు నిచ్చాను ఆ కథకు!

కథలో ఎక్కడా వర్ణనలూ, అలంకారాలూ లేవు. వర్ణనలు, అలంకారాలు జీవితంలో పొసగని రైతు కథలో వీటికి స్థానం లేదు. నిరాడంబరమైన శైలిలో ఈ కథ రాశాను నేను.

ఒక మంచి కథ రాశానన్న తృప్తినిచ్చింది అడుసు కథ నాకు.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 2 నవంబర్ 1997*

# KATHA NEPATHYAM

## VOLUME - 1

అబ్బూరి ఛాయాదేవి
అల్లం శేషగిరిరావు
ఆడెపు లక్ష్మీపతి
ఆర్.యస్. సుదర్శనం
కాళీపట్నం రామారావు
కేతు విశ్వనాథ రెడ్డి
కొలకలూరి ఇనాక్
డి. వెంకట్రామయ్య
నవీన్
పి. సత్యవతి
పులికంటి కృష్ణారెడ్డి
పెద్దిభొట్ల సుబ్బరామయ్య
బలివాడ కాంతారావు
బి.యస్. రాములు
బీనాదేవి
బోయ జంగయ్య
మధురాంతకం రాజారాం
మునిపల్లె రాజు
వల్లంపాటి వెంకటసుబ్బయ్య
వి. రాజా రామమోహనరావు
విహినమూర్తి
శీలా వీర్రాజు
శ్రీపతి
శ్రీరమణ
సింగమనేని నారాయణ

₹195 $25

TANA PUBLICATION

